
మానవతా విలువలు

(సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం)



మనిషి - పుడుతూ భగవంతుడు
పెరుగుతూ మానవుడు
దిగజారుతూ రాక్షసుడు
సాధనతో మహాత్ముడు

రచన : భాస్కర పంతులు

M.A., B.ed., Paarangath

మానవతా విలువలు

(సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం)

HUMAN VALUES

(Complete Personality Development)

'మంచి పుస్తకం మంచి మనసుకు మరో పేరు
సొంత పుస్తకం మంచి మనిషికి మరో తోడు'

శ్రీసత్యనారాయణ పబ్లికేషన్స్
9/287, లింగాలవీధి, మన్నూరు (S.O.) -516 126,
రాజంపేట టౌన్, కడప జిల్లా.
సెల్ : 9440129320, 9705405915, 9247424318.

ముద్రణ : ఆగష్టు - 2008
డిశంబర్ - 2008

వెల : రూ. 150/-
: 3.2 $

ప్రతుల కొరకు : M.O. లు, D.D. లు, పంపవలసిన చిరునామా
భాస్కరపంతులు M.A., B.Ed., Paarangath.
లింగాల వీధి, మన్నూరు (S.O.) - 516 126.
రాజంపేట టౌన్, కడపజిల్లా.
సెల్ : 9440129320, 9705405915, 9247424318.

ముద్రణ :
స్వామి ఆఫెసెట్ ప్రింటర్స్,
స్వామి వీధి, గాంధీనగర్, విజయవాడ - 520 003.

ముఖచిత్రం : శుభమూర్తి ఆర్ట్స్, తిరుపతి, సెల్ :98499 84061

డి.టి.పి. :
శ్రీ షిర్డి సాయిబాబా గ్రాఫిక్స్,
తులసీ కాంప్లెక్స్, రైల్వే కోడూరు - 516 101.
కడప జిల్లా, సెల్ : 9966 143 848

నివేదన

ఏమివ్వగలను స్వామీ నీకు ?

అంతా నడిపే నీకు

అందరినీ రక్షించే నీకు

అడుగడుగునా తోడుపడే నీకు

అంతా నిండి, నేనున్నానంటూ, నన్ను నడిపించే నీకు

అందరిలోనూ ఉంటూ, అందరిలాగా ఆదరింపబడే నీకు

అణువులోనూ, పరమాణువులోనూ, బ్రహ్మాండంలోనూ ఉన్న నీకు

నాలో కదలి, నీవు నేనైన నీకు

భక్తితో తలవంచి, నమస్కరించి, సేవ చేయుటకన్నా

ఏమివ్వగలను స్వామీ నీకు?

విషయ సూచిక

- - - - -

ముందుమాట

వేగం.... వేగం..... వేగం....

తొందర... తొందర... తొందర

SPEED... SPEED... SPEED...

అందరికీ తొందరే! అన్నింటిలోనూ స్పీడే ! ఏదైనా సరే వేగంగా చేసేయాలి. వెంటనే పనైపోవాలి అంతే ! ఇలా మొదలెట్టేసేయాలి. అలా పనైపోవాలి! అదీ పనితనమంటే ! అలా చేసినోడే పనిమంతుడు. అందరికంటే ముందుండాలి. అన్నింటిలోనూ నేనే వుండాలి. ఇదీ ఈనాటి మనిషి తపన.

వేగంగా, స్పీడ్‌గా, తొందరగా.... తానుపరుగెడుతూ అందరినీ పరుగెత్తించే కాలమిది. నిదానం, నెమ్మదితనం, శాంతం, కాస్త వెనుకాముందు ఆలోచించడం, ఎవరిలోనైనా ఏ పనిలోనైనా కనిపిస్తుందా? ఊహూఁ, లాభం లేదు. నిరాశే!

ఏదో సాధించాలి ! మరేదో అనుభవించాలి !
దేన్ని సాధించాలి? దేన్ని అనుభవించాలి?
ధనం సంపాదించేసేయాలి !
స్థానం సంపాదించేసేయాలి !
మద్యం, మానం అనుభవించేసేయాలి
అందరూ తనను గౌరవించాలి
అందరిమీదా తాను పెత్తనం చెలాయించాలి.

ఇలాంటి ఆలోచనల ప్రవాహంలో కొట్టుకొని పోతున్నాడు. ఆశల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాడు. తనను తాను కోల్పోతున్నాడు. మానవ సంబంధాలను తెంచేస్తూ, అనుబంధాలను తప్పించుకుంటూ బ్రతికేస్తున్నాడు.

ఏమి సాధించానని? ఏమి అనుభవించానని ? వెనుదిరిగి చూచుకుంటే ! సాధించినదేమీ లేదనీ, అనుభవించినదేమీ లేదనీ, అదంతా వట్టి భ్రమేననీ, ఆ పరుగు పందెంలో తాను పోగొట్టుకున్న ఆరోగ్యం, జీవితానందం, మనశ్శాంతి ఎంతో విలువైనదనీ తెలుసుకొని కుప్పకూలి పోతున్నాడు.

సరిగ్గా ఈ సమయంలోనే తాను కోల్పోయిన, తాను తెంచేసుకున్న సంబంధాలు, తొక్కిన అడ్డదారులూ, చేసిన పాపాలు, నేరాలూ-ఘోరాలు జ్ఞప్తికి వచ్చి కంటనీరు కారుస్తున్నాడు. పరితపిస్తున్నాడు, పశ్చాత్తాప పడుతున్నాడు. తాను ఇంతకాలం పరుగులు పెట్టినది ఎండమావుల కొరకేనని తెలుసుకొని కుమిలిపోతున్నాడు. మనశ్శాంతి కోసం ఆరాట పడుతున్నాడు.

అతడిని లేపి, సేదతీర్చి, ఓదార్చి, శక్తినీ, ఉత్సాహాన్నీ కలిగించే నేస్తం కావాలనీ, ఆపన్న హస్తం అందివ్వాలనీ, ఆశపడుతున్నాడు. పరితపిస్తున్నాడు. ఒంటరి తనాన్ని పోగొట్టుకోవాలను కుంటున్నాడు. కానీ...!

ఓ నేస్తమా! నీవు ఆశపడి, ఎదురుచూచే ఆనేస్తం కూడా, నీలాగానే ఆశలతో, ఆరాటాలతో పరుగులు తీసేవాడే అయితే?........

నీ ఆశ... నీ ఆరాటం.... నీ ఆహ్వానం ఫలిస్తుందా? నీగతి ఏమవుతుంది? నాగరికత, అభివృద్ధి, సౌకర్యం, సుఖం అనే భ్రమలోపడి సంస్కృతిని మరచి, ప్రకృతినే కలుషిత వాతావరణంలోకి నిర్దాక్షిణ్యంగా నెట్టివేసి, తోటి మానవుల, సాటి జీవుల ఉనికికే ప్రమాదకారకుడైన మనిషికి.....

మరచిపోయిన జీవన ధర్మాలను తిరిగి జ్ఞప్తికి తెచ్చే ప్రయత్నమే ఈ **మానవతా విలువలు. (HUMAN VALUES)** గ్రంథ రచన.

తాత్కాలిక సుఖంకోసం శాశ్వత ప్రయోజనాలను, భావితరాల సుఖ-సంతోషాలను, ఆరోగ్యాన్ని, సహజమైన బంధాలను, అందాలను, ఆనందాలను శాశ్వతంగా కోల్పోకుండా... మనుషులంతా కలసి జీవించాలనీ, సాటి జీవులను జీవించనివ్వాలనీ, మహాత్ములు సూచించి, జీవించిన సహజ జీవన మార్గాలే **మానవతా విలువలు.**

సాధు స్వభావులు దుష్టులుగా మారకుండా ఉండడానికీ, క్రూరులూ, కఠినాత్ములు తమ స్వార్థాన్నీ, దురాశనూ తగ్గించుకుంటూ, తొలగించుకుంటూ మనుషులుగా మారి ప్రకృతికి కష్టం-నష్టం, కల్మషం కలగకుండా ఉండడానికీ, మానవులంతా మహనీయులుగా పరివర్తన చెందడానికీ **మానవతా విలువలు** అవసరం, అత్యవసరం. ఋషులూ, మహాత్ములూ, నీతికోవిదులూ బోధించిన ధర్మ మార్గాలు, అనుభవసారాలు, మానవతా విలువలు ఎన్నో ఉన్నాయి. అయినా..... నా అంతరంగంలో కలిగిన ప్రేరణ ఫలితంగా, చంద్రునికో నూలుపోగు' లాగా ప్రస్తుత సమాజానికి అనుగుణంగా, నా ప్రయత్నాన్ని పాఠకులముందుంచాను. అందుకు ఎన్నో దిన, వార పక్ష, మాస పత్రికలు, పుస్తకాలు, గ్రంథాలు ఉపయోగపడ్డాయి.

ఎంత మందితోనో జరిపిన సంభాషణలలో, నెరపిన స్నేహాలలో- ప్రత్యక్షంగానో, పరోక్షంగానో తమస్వభావాలను నా పరిశీలనా దృష్టికి అందించిన మహానుభావులందరికీ పాదాభివందనాలు.

ఒకమంచి మాట

ఒకమంచి పాట

ఒక మంచి కవిత

ఒక మంచి చిత్రం

ఒక మంచి కథ

ఒక మంచి రచన


ఒక మంచి వ్యక్తితోటి పరిచయం

ఒక మంచి సంఘటన


మనిషిలోని మాలిన్యాన్ని తొలగిస్తుంది. స్నేహం, సహనం, సేవ, సహకారం, సాహసం, సోదర భావం, సమానత్వం, ప్రేమ, పరోపకారం, త్యాగం, నీతి, నిజాయితీ, బాధ్యత లాంటి మానవీయ లక్షణాలను మదిలో చిగురింపజేస్తూ, పదిమంది కోసం పాటుపడేటట్లు చేస్తుంది.

రోజురోజుకూ స్వార్థం పెరుగుతూ మానవీయతను కోల్పోతున్న మనిషి ప్రవర్తనలో కాస్తంతైనా మానవీయ పరివర్తన కలుగుతుందన్న ఆశతో, జనులందరూ ఆయురారోగ్యాలతో, ఆధ్యాత్మిక ఆలోచనలతో జీవించాలని ఆకాంక్షిస్తూ ....

మీ



(భాస్కర పంతులు)



కృతజ్ఞతలు

గ్రంథ రచనలో, ప్రచురణలో తమ అమూల్యమైన సలహాల నిచ్చి తోడ్పాటునందించిన నా సహధర్మచారిణి శ్రీమతి వీరనాల శారదాదేవి యం.ఎ., బి.ఇడి., గారికి మరియు శ్రీశ్రీ సుబ్బాదాసు యోగీంద్రుల వారి మనుమడు అచలాశ్రమాధిపతి అయిన శ్రీ గురుప్రసాద్ స్వామి వారికి, శ్రీ గౌరీ శంకర్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్ - శ్రీ అనమలగుండం గణేశ్ - రాజంపేట గారికి హృదయ పూర్వక కృతజ్ఞతలను తెలియజేస్తున్నాను. అడిగిన వెంటనే తమ అమూల్యమైన అభిప్రాయములను వ్రాసి ఇచ్చిన స్వామి శ్రీ జ్ఞానదానంద, రామక్రిష్ణమఠ అధ్యక్షులు - హైదరాబాదు వారికి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ - హైదరాబాద్ - శ్రీ అరవిందరావు గారికి, ఎస్.వి. యూనివర్సిటీ - తిరుపతి, వైస్ చాన్సలర్ - శ్రీ చొప్పల రత్నం గారికి, 'మేము సైతం' ఉన్నామంటూ అడగకనే రూ॥ 20,000/- ఆర్థిక సహాయాన్నందించిన నా ప్రియమైన ఆదర్శ శిష్య దంపతులు శ్రీమతి అనురాధ-శ్రీ దేశెట్టి శివకుమార్ మేనేజింగ్ డైరెక్టర్ - అవదూత వెంచర్స్ & డెవలపర్స్ ప్రైయివేట్ లిమిటెడ్ - తిరుపతి గారికి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీమతి ఎ. మంజులత గారికి మరియు సాక్షి, వార్త, ఈనాడు దినపత్రికల యాజమాన్యానికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలుపుకుంటున్నాను.

పాఠకులు ఈ గ్రంథంలోని పొరపాట్లను సహృదయంతో మన్నించి, సూచించినచో సవరించుకోగలనని వినయంగా విన్నవించుకుంటున్నాను.

27633936
✆ 27633937
27635545

RAMAKRISHNA MATH
Ramakrishna Math Marg
Domalguda
Hyderabad - 500 029

08.07.08

అభినందన

భాస్కరపంతులుగారు తాము రచించిన 'మానవతా విలువలు' పుస్తకాన్ని మా ముందుంచి అభిప్రాయాన్ని తెలియజేయమన్నారు. సమయాభావం వల్ల పుస్తకాన్ని ఆసాంతం చూడలేకపోయినా వారి ప్రయత్నోద్దేశం, పుస్తకాన్ని సంగ్రహించటంలో వారు చూపిన శ్రద్ధ, పడిన పరిశ్రమ మాకు వెంటనే కన్పడినాయి. విలువలతో కూడిన జీవితమే నిజమైన జీవితమని, ధర్మ భ్రష్టమైన మానవ జీవితానికి అర్థం లేదని వివిధ సామెతలతో, కథలతో చక్కగా తెలియజేశారు. సరళమైన భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో వీరి రచన సాగింది. కనీస మానవ విలువలు కనుమరుగవుతున్న ప్రస్తుత కాలంలో వీరిలాంటి పుస్తకాన్ని వెలువరించటానికి సంకల్పించటం సంతోషించదగ్గ విషయం. మంచి నడవడి, గుణం పెంపొందించుకోవటానికి ఒక సంపూర్ణ వ్యక్తిత్వ వికాస పుస్తకంగా – ఈ గ్రంథం అందరికీ ఉపకరిస్తుందని మేము భావిస్తూ భాస్కరపంతులుగారికి మా అభినందనలు తెలియజేస్తున్నాము.

స్వామి జ్ఞానదానంద
అధ్యక్షులు

K. Aravinda Rao IPS
Addl. Dir. Genl. of Police.

Qtr. No.3, DGP Office Compound,
Saifabad, Hyderabad - 500 004.

Telephones : 23235132 (O)
23231235 (R)

తేది : 21.07.2008

అభిప్రాయం

శ్రీ భాస్కర పంతులుగారు వ్రాసిన 'మానవతా విలువలు' అనే గ్రంథాన్ని స్థాలీపులాక న్యాయంగా చదవడం జరిగింది. రచయిత ఉపాధ్యాయ వృత్తిలో వున్నవారు.

భారతీయ సంస్కృతిలోని విలువలు సనాతన ధర్మం, అనగా వైదిక ధర్మంపై ఆధారపడి వున్నవి. మారిన విద్యా విధానంలో మన సంస్కృతిని, విలువలను ఆధునిక విద్యార్థులకు అందించడానికి అవకాశమేలేని పరిస్థితులలో ప్రస్తుత గ్రంథం పాఠకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

సామాజిక శాస్త్ర, మానసిక శాస్త్ర దృక్పథాలను రచయిత తన గ్రంథంలో అనుసరించి క్లిష్టమైన విషయాలను అనేక ఉదాహరణల ద్వారానూ, కథల ద్వారానూ వివరించారు. ఆధ్యాత్మిక విషయాల గురించి కూడా తేటతెలుగులో సోదాహరణంగా వివరించారు.

ఈ గ్రంథం విద్యార్థులకే కాకుండా విద్యావంతులైన వయోజను లందరికీ ఎంతో ఉపయోకరంగా ఉంటుందని భావిస్తున్నాను.

(కె. అరవింద రావు, ఐ.పి.యస్)

SRI VENKATESWARA UNIVERSITY
TIRUPATI - 517 502, Andhra Pradesh, INDIA.
0877-2249727, 2289412 (O), 0877-2289555 (Fax)
0877-2289568, 2289421 (R)
E-mail : vesvu@yahoo.com, website : svuniversity.in

Prof. C. Ratnam
Vice-Chancellor

July 29, 2008

అభిప్రాయం

సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం కొరకు విలువల ఆవశ్యకతను ఆవిష్కరించేందుకు జీవితాన్ని అన్ని కోణాలనుంచి నిశితంగా పరిశీలించి, అనేక దృష్టాంతాలతో అత్యంత సరళమైన వ్యావహారిక భాషలో మాన్యులు శ్రీ బాస్కరపంతులుగారు రచించిన "మానవతా విలువలు" అన్న ఈ గ్రంథం మానవాళికి ఒక వరం. పదునైన తర్కం, మృదువైన నైతికత, పరిపూర్ణమైన ఆధ్యాత్మికతలతో నిండిన ఈ అమూల్యమైన గ్రంథం నేటి సమాజానికి అత్యవసరం.

రచయిత తనముందు మాటలో చెప్పినట్లుగా వేగం, ధనం, మద్యం, స్థానం, గౌరవం, పెత్తనం, రాజ్యమేలుతూ... అనుబంధం, ఆప్యాయత, ఆనందం, మనశ్శాంతి మృగ్యమైన ఈ రోజులలో, ఆశల సుడిగుండంలో చిక్కుకొని, ఏదో సాధించాలని పాపాలు, నేరాలు, ఘోరాలు చేస్తూ, తన్ను తాను కోల్పోతూ మానవ సంబంధాలను తెంచుకొని అయోమయంలో వున్న నేటి ప్రజలకు ఈ గ్రంథ పఠనం అనివార్యం.

నాకగరికత, అభివృద్ధి, సౌకర్యం అనే భ్రమలో పడి,.సంస్కృతిని మరచి, ప్రకృతిని కలుషితం చేస్తూ సాటి జీవుల ఉనికికే ప్రమాదకారకుడైన మనిషికి మరచిపోయిన జీవన ధర్మాలను గుర్తు చేస్తూ, మనుషులతో కలసి జీవించాలనీ, సమస్త జీవరాశులను జీవింపనివ్వాలనీ, ప్రకృతిని కాపాడుకోవాలనీ మానవజాతిని నిలబెట్టుకోవాలనీ ఆకాంక్షిస్తూ మహాత్ములు సూచించి, జీవించిన సహజ జీవన మార్గాలైన మానవతా విలువలను (HUMAN VALUES) మనముందుంచే ప్రయత్నమే. ఈ పవిత్ర గ్రంథ రచన ముఖ్యోద్దేశ్యం.

ఈ గొప్ప ప్రయోగంలో శ్రీ భాస్కర పంతులుగారు జీవితానికి సంబంధించిన అనేక విషయాలను విశ్లేషించారు. జీవితం, వ్యక్తిత్వం, ధర్మం, అర్ధం, కామం,-

మోక్షం, చదువు, గురువు, ప్రేమ, వివాహం, స్నేహం, మతం, మనస్సు, ఆరోగ్యం, సంస్కృతి, నాగరికతలను కూలంకషంగా వివరించారు.

చివరగా భారతదేశాన్ని "కర్మభూమి" అని ఎందుకంటారో రచయిత వివరించారు. భూమండలంపైనున్న మొత్తం ప్రాణికోటికే కాక విశ్వానికంతటికీ మేలు జరగాలన్న భావనలతో కర్మలను ఆచరించవలెననే సంస్కృతి ఒక్క భారతదేశంలో మాత్రమే ఉంది కాబట్టి ఈ దేశాన్ని "కర్మభూమి" అంటారనీ ఇదే భారతదేశ విశిష్ఠత అనీ చెప్పారు రచయిత.

ఇలాగా వ్యక్తిత్వ వికాసం కొరకు దోహదపడే ఎన్నో విలువలను ఈ గ్రంథంలో ప్రస్తావించారు రచయిత. ఇక్కడ నేను క్లుప్తంగా వివరించిన విషయాలే కాక స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సామాజిక స్పృహ, విశ్వచైతన్యం, కర్మ, పునర్జన్మ, మృత్యువిలాసం, కాలం విలువ, పని సంస్కృతి, బాధ్యత, సదుద్దేశ్యం, కార్యోత్సాహం, పట్టుదల, ముందు చూపు మొదలగు విషయాలను కూడా సమగ్రంగా విపులీకరించారు.

విజ్ఞానం, వికాసం, ఆధ్యాత్మికతలకు సాధనాలైన "మానవ విలువల ఖని" ఈ గ్రంథం. వ్యష్టి-సమిష్టి జీవితానికి ఉపకరించే "విలువల జలపాతం" ఈ గ్రంథం. పరిపూర్ణమైన జీవనయానానికి "విమానం" ఈ గ్రంథం. యాంత్రికమైన నవనాగరికత కులోనై సంస్కృతిని మరచిన నేటి ప్రజలను "విలువల సాగరంలో" ముంచెత్తారు రచయితగారు. ప్రస్తుత కాలంలో ఈ గ్రంథానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ప్రస్తుత సమాజాన్ని బాగా ప్రభావితం చేయగల శక్తి ఈ గ్రంథానికి ఉంది. ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి, ఎంతో పరిశోధన చేసి వెలకట్టలేని ఈ గ్రంథాన్ని సమాజానికి అందించిన భాస్కరపంతులుగారిని మనసారా అభినందిస్తున్నాను.

అమూల్యమైన ఈ ఉద్గ్రంథం మంచి గుర్తింపు పొందాలని రచయితకు గౌరవ ప్రతిష్టలు తేవాలని అభిలషిస్తూ... పరిచయ వాక్యాలు వ్రాయమని నన్ను కోరినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకొంటన్నాను.

(సి. రత్నం)

Grams : 'TELVERS'

Phone : Off : 040-23234815,
Tele fax : 040-23236911
E-mail : info@teluguuniversity.ac.in

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

Dr. A. MANJULATA
Vice-Chancellor

Lalitha Kala Kshetram
Public Gardens,
Hyderabad - 500 004. (A.P.)

తేది : 30-7-2008

అనుసరణీయమైన 'మానవతా విలువలు'

సమాజం ఆర్థికంగా ఎంత ప్రగతి సాధించినప్పటికి మానవ విలువలు నశించిపోతే అశాంతి రాజ్యమేలుతుంది. మానవ సంబంధాల స్థానంలో ఆర్థిక సంబంధాలు బలపడుతున్న ఈనాటి ఆధునిక సమాజంలో వస్తు సంస్కృతికి ఇస్తున్న విలువ మనిషికి ఇవ్వకపోవడం శోచనీయం. సులభంగా డబ్బు సంపాదించే మార్గాలు ఆధునిక జీవితాన్ని పెనుమార్పులకు లోను చేస్తుంది. అందులో మోసం కూడా ఒక అంశమే. మనిషి నైతిక విలువల గురించీ, సామాజిక బాధ్యత గురించి ఆలోచించే దిశగా భారతీయ విద్యావిధానంలో ఉన్న అంశాల్ని ఏనాడో మరుగున పడేశాము. నీతిలేని చదువు ఎందుకు పనికిరాదని తెలిసినా పాశ్చాత్య సంస్కృతి వెంట పరుగులు పడుతూ అనవసరమైన విద్యావిధానాన్ని మనలోకి ఆహ్వానిస్తున్నాం. కేవలం వస్తు సంస్కృతి ద్వారా మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలం అనుకోవడం నిజంగా శోచనీయం.

మానవ సమాజంలో పేరుకుంటున్న ఆర్థిక బలహీనతల వల్లే అశాంతి ప్రజ్వరిల్లుతోంది. మానవతా విలువల్ని పక్కనపెట్టి చేసే ఏ ప్రయోగమైనా, మానవ మనుగడకు ఉపకరించదు. అందుకే నైతిక విలువల పట్ల, మానవీయ కోణాల పట్ల మనిషి మనిషిగా మొదట స్పందించాల్సిన అవసరం ప్రతి ఒక్కరి మీదా ఉంది. మన సాహిత్యం, చరిత్ర, వాస్తవిక సమాజం మనకు ఎన్నో పాఠాల్ని, గుణపాఠాల్ని నేర్పుతున్నప్పటికీ మన నైతిక విలువల గురించి పట్టించుకోకపోవడం మన అజ్ఞానానికి నిదర్శనం. సులభంగా సంపాదించడం, సుఖంగా జీవించడం అనే రెండు పట్టాల మీద ప్రయాణిస్తే చాలు అనే నిర్జీవ విలువలతో సాగిపోతున్న మనందరికీ మరొకసారి సామాజిక బాధ్యతను గుర్తుచేస్తూ హెచ్చరిక చేస్తుందీ 'మానవతా విలువలు' గ్రంథం.

అధ్యాపకులుగా పిల్లలకు ఉత్తమ బోధన అందిస్తూ, జీవితం నేర్పిన పాఠాలు, గ్రంథాలు అందించిన జ్ఞానంతో ఈ గ్రంథాన్ని భాస్కరపంతులుగారు నేటి సమాజానికి అందిస్తున్నారు. కాలంతోపోటీ పడుతూ జీవితం సాగిస్తున్న ఆధునిక మానవుని అంతరంగాన్ని ఆవిష్కరింపజేసే ప్రయత్నం ఇది. నాగరికత ముసుగులో మన సంస్కృతి, సంప్రదాయాలను విస్మరిస్తున్న సమాజాన్ని తట్టి లేపే ప్రయత్నం ఈ గ్రంథంలో జరిగింది. అంతేగాకుండా మనిషిలోని మానవీయ ప్రయత్నాలను మేల్కొలిపే దిశగా గ్రంథ రచన సాగింది. 'కాలం విలువ తెలిసి జీవితాన్ని సరిదిద్దుకోవాలి. జన్మించినందుకు జీవితాన్ని సార్థకం చేసుకోవాలి' లాంటి ఎన్నో జీవనసత్యాలు ఈ గ్రంథం ద్వారా రచయిత అందించారు. సమాజానికి మంచి మార్గం చూపిస్తూ, 'మానవతా విలువలు' పేరుతో ఉత్తమ గ్రంథాన్ని పాఠకలోకానికి అందించిన భాస్కరపంతులు గారిని అభినందిస్తున్నాను.

Dr. A. MANJULATA

వేయి పూల వికాసం

ప్రకృతి ఎంత గొప్పదంటే రోజూ మనతో మాట్లాడటమే కాదు కొన్ని విలువలను మనకు తెలియకుండానే నేర్పిస్తుంది.



సూరీడు రోజూ గుడ్‌మార్నింగ్ అంటూ పలకరించడమే కాదు 'క్రమశిక్షణ ముఖ్యం' అని కాస్త గట్టిగానే చెబుతాడు.

'రోజు నవ్వితే చాలా మంచిది తెలుసా? అని వెన్నెల నవ్వుల చంద్రుడు రాత్రుల్లో రహస్యంగా చెబుతుంటాడు.

'జీవితం ఒక తీయటి పాటలా సాగాలి' అని కొమ్మమీద కోకిలమ్మ పిలిచి మరీ చెబుతుంది. 'గాలిలాగా మంచిని పంచు' అని చెట్లు చెవిలో చెప్పిపోతాయి. సెలయేళ్ల గలగలలు ఏటికి ఎదురీదమని ధైర్యం చెబుతాయి.

నేర్చుకోవాలేగానీ ప్రకృతి మాత్రమే కాదు ఒక పాట, ఒక మాట, ఒక కథ. తెలుసుకోవలసిన, తెలిసి ఉత్తేజితం కావాల్సిన, ఉత్తేజితమవుతూ ముందుకు సాగాల్సిన విషయాలను ఎన్నో చెబుతాయి. 'మానవతా విలువలు' పేరుతో భాస్కర పంతులు రాసిన 458 పేజీల పుస్తకం ఈ కోవకు చెందిందే.

గ్రామాల్లో ఒక మంచి మాట, మాటగా మాత్రమే పెద్దల నోటి నుంచి రాదు. అది తనతోపాటు ఒక కథను వెంటేసుకొని వస్తుంది. ఆ కథ వినడానికి బాగుండడమే కాదు మనం నేర్చుకోవాల్సిన నైతిక విలువలను సుతిమెత్తగా చెబుతుంది.

ఈ పుస్తకానికి ప్రధాన ఆకర్షణ 'కథలు' మంచి విలువలను కథలతో జోడించి చెప్పడమనే గొప్ప మౌఖిక సంప్రదాయాన్ని రచయిత పుస్తకరూపంలో తీసుకువచ్చారు. సందర్భానుసారంగా చెప్పే కథలు, విషయానికి బలం చేకూర్చడమే కాదు పాఠకుల్లో ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నాయి.

ప్రపంచీకరణ వెల్లువలో జీవితం చాలా వేగంగా పరుగులు తీస్తుంది. మనసు మాత్రం ఒకేచోట చిన్నబోయి ఆగిపోతుంది. అది అప్పుడప్పుడూ అసంతృప్తికి గురవుతుంటుంది. కల్లోలానికి గురవుతుంటుంది. అకారణ కోపంలో నమిధగా మారుతుంటుంది. ఏదో ఏదో అవుతుంటుంది.

ఇవేమిటి ఇంత భయాలు? అనే సందేహం వచ్చినప్పుడు, ఇంట్లో చీకటి భయపెట్టినప్పుడు తెగిన తీగ అపస్వరాలు వినిపిస్తున్నప్పుడు ధైర్యం చెప్పే గొంతుక ఒకటి గట్టిగా వినిపించాలి.

చీకటి సమయాల్లో కొన్ని అక్షరాలు వెలుగులను మోసుకురావాలి. అవి చిమ్మచీకట్లో వెలిగిపోతూ దారిని చూపాలి. 'మానవతా విలువలు' పుస్తకంలోని అక్షరాలకు ఆ శక్తి ఉందనిపిస్తుంది.

నీటిలో ఈదడం నేర్చుకున్న మనిషి ఆకాశంలో ఎగరడం నేర్చుకున్న మనిషి భూమిపై ఎలా జీవించాలో తెలుసుకోలేకపోతున్నాడు అని మనం బాధపడిపోతుంటాంగానీ, ఆ బాధ కొంతలో కొంతైనా తీరడానికి ఉన్నతమైన, ఆదర్శమైన కలలు కనడానికి మనకు తీరికనేదే ఉండదు.

కలలు కనేముందు ఒక ప్రయత్నమంటూ జరగాలి. ఆ ప్రయత్నం మనలోకి మనం తొంగిచూసుకునేలా ఉండాలి. చెడు ఏదో, మంచి ఏదో విశ్లేషించేలా ఉండాలి. ఈ పుస్తకం అనే అద్దంలో మన ప్రతిబింబాలు ఎక్కడో ఒకచోట కనిపిస్తూనే ఉంటాయి. అవి మనల్ని మనం విశ్లేషించుకునేలాచేస్తాయి. ఒక కొత్త దృష్టికి ఆసరా ఇస్తాయి.

చెప్పుడు మాటలు వినడం వల్ల వచ్చే నష్టం, అనుకోవడమే కాదు ఆచరించడం వలన వచ్చే లాభం, సాధనమున జరిగే పనులు, తృప్తి- సంతోషానికి మధ్య తేడా, ఆరోగ్యం విలువ, అతి ఉదారత వలన కలిగే అనర్థం.. ఇలా ఒకటి కాదు, రెండు కాదు అనేకానేక విషయాలను అరటిపండు ఒలిచిపెట్టినంత సులభంగా, ఆసక్తికరంగా చెప్పారు రచయిత.

'కాలమే జీవితం. కాలాన్ని వృథాచేసుకోవడమంటే జీవితాన్ని వృథా చేసుకోవడమే. జీవితం జీవించడానికేగానీ బాధపడడానికి కాదు. 'జీవితం ఒక అవకాశం' లాంటి కదలించే వాక్యాలతో పాటు కమ్మటి కథలు, సామెతలు ఈ పుస్తకంలో దండిగా ఉన్నాయి. ఆబాలగోపాలం చదవాల్సిన పుస్తకం ఇది.

మానవతా విలువలు : రచన : భాస్కర పంతులు
పేజీలు : 458, ధర : 150 రూ : దొరుకుచోటు :
రచయిత, లింగాలవీధి, మన్నూరు - 516 126,
రాజంపేట మండలం, కడప జిల్లా.

- యాకుబ్ పాషా యం.డి

సామాజిక విలువల విశ్లేషణ

దీర్ఘకాలం జ్ఞానబోధనలో తలమునకలై ఉన్న భాస్కర పంతులు గారు తమ అనువాలను రంగరించి 'మానవతా విలువలు' పేరుతో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని ఆకాంక్షిస్తూ 450కి పైగా పేజీలున్న ఈ పుస్తకాన్ని రచించారు. ప్రకృతి ప్రసాదించిన జీవితాన్ని మానవులు స్వయం కృషితో ఏవిధంగా తీర్చిదిద్దుకోవచ్చో, తప్పొప్పులను సరి చేసుకుంటూ ముందుకు సాగవచ్చో ఈ పుస్తకం వివరిస్తుంది. భారతీయ ఆలోచనా ధోరణిలోకి హేతుబద్ధతను, తాత్వికతను వివరిస్తూనే ఆధునికంగా ఆలోచించటం కూడా ఈ పుస్తకం అంతటా చూడవచ్చు. ధర్మార్థ కామమోక్షాలను వివరించినంత తేలిగ్గానే మానవ జీవితంలోని వివిధ దశలను వివరించారు. ప్రతి వ్యక్తి కుటుంబసభ్యులతో, సన్నిహితులతో, సమాజంలోని ఇతరులతో ఏ విధంగా మెలగాలో ఈ పుస్తకం వివరిస్తుంది. పుస్తకం అంతటా చిన్న చిన్న కథలు, అనుభవాలు వివరించటం వల్ల పుస్తకం చదివే వారిలో ఆసక్తి పేరుగుతుంది. అశేష జనాన్ని ఆకర్షించే సన్యాసులు పిట్ట కథలు చెబుతూ సంక్లిష్టమైన అభిప్రాయాన్ని పామర జనానికి సైతం ఎక్కించినట్లే రచయిత అనే క్లిష్టమైన ఆలోచనలను, భావజాలాన్ని ప్రభావవంతంగా పాఠకులకు అందించగలిగారు.



మానవతా విలువలు
రచన
భాస్కర పంతులు
రచయిత,
మన్నూరు, కడప జిల్లా
వెల : రూ. 150/-

ఇది భారతీయ సంప్రదాయంలో తరతరాలుగా వస్తున్న సంప్రదాయాన్ని రచయిత చాలా శక్తిమంతంగా ఉపయోగించుకోగలిగారు. సాంప్రదాయ పండితులు సమాజంలో వస్తున్న మార్పుల పట్ల అక్కసును వ్యక్తం చేయటం సర్వసాధారణం. అలాగే సాంప్రదాయ ప్రియులు కూడా తమ సామాజిక విలువలను భవిష్యత్తు తరాలపై రుద్దటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. అయితే భాస్కర్ పంతులు కాలం నిత్య నూతనమని, సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని, యుగ ధర్మం మారినప్పుడు మానవ విలువలు మారుతాయని, గుర్తించారు. అయితే సాధారణంగా అందరూ ప్రస్తావించే కోర్ వాల్యూస్ లేక కీలక విలువలు లేక నైతిక విలువలు మాత్రం మారవన్నది ఆయన దృఢ అభిప్రాయం. సత్యం, సేవ, స్నేహం, సహకారం, సమానత్వం, సోదరభావం, సాహసం, ప్రేమ, త్యాగం, కర్తవ్య నిష్ట, నెమ్మదితనం లాంటి భావనలను పౌరులందరూ అలవర్చుకుంటే కుటుంబ జీవితమే కాకుండా సామాజిక జీవితం కూడా పరిపుష్టం అవుతుందని, సామాజిక విలువల ద్వారా మానవతా విలువలను సాధించటం సాధ్యమేనని ఈ రచనలో వివరిస్తారు. మానవతా విలువలు సమాజంలో లుప్తమైతే అశాంతి, అనారోగ్యం, అభద్రత రాజ్యమేలుతాయని రచయిత అభిప్రాయం, నాగరికత, అభివృద్ధి పేరుతో సాటి జీవుల ఉనికిని ప్రశ్నార్థకం చేసిన మనుషులు తిరిగి తమ ఆలోచనాలోచనాలను తెరవాలన్నది ఆయన ఆకాంక్ష. ఆయన ఈ పుస్తకాన్ని మొత్తం 12 అధ్యాయాలుగా విభజించారు. జీవితం, ఆరోగ్యం, వ్యక్తిత్వం, ధర్మం, అర్థం, కామం, మోక్షం, విశ్వచైతన్యం, మృత్యువిలాసం, మనస్సు, సంస్కృతి- నాగరికత- సమాజం, కాలం-పని సంస్కృతి అనే అధ్యాయాలుగా తన గ్రంధాన్ని విభజించారు. పుస్తకం చదువుతుంటే అన్ని ఎక్కడో గతంలోనే చదివినట్టే అనిపించినప్పటికీ వీటన్నింటిని ఒకచోట చేర్చిన రచయిత కృషి అభినందనీయం. చక్కటి భాషతో చదివించే విధంగా ఆసక్తికరంగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. పుస్తకం చదవటం మొదలుపెట్టిన వారు చివరి వరకు వదలిపెట్టరు. మానవ జీవితంలోని అన్ని కోణాలను ఆయన స్పృశించటంవల్ల పుస్తకానికి మంచి సమగ్రత వచ్చింది. స్పీడ్ యుగానికి బానిసలై ఇంటర్నెట్‌కు అతుక్కుపోతున్న యువతరం ఈ పుస్తకం చదవటం ద్వారా తప్పక భారతీయ జీవన విలువలను అవగాహన చేసుకుంటారు. 'కంప్యూటర్ కూలీల' తల్లిదండ్రులు ఈ పుస్తకాన్ని కొని తమ పిల్లల గదుల్లో ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

■ సహజ

సమీక్ష

విలువలతో వికాసం

వేగంగా మారుతున్న సమాజంలో ప్రతి ఔత్సాహికుడు తన స్థానాన్ని ఉన్నతీకరించుకునే ప్రయత్నం చేస్తాడు. ఇదే భావన 'వ్యక్తిత్వ వికాసం' పేరుతో బహుముఖీనంగా విస్తరిస్తోంది.



ఈ గ్రంథానికి 'మానవతా విలువలు' అనేపేరు పెట్టి 'సంపూర్ణ వక్తిత్వ వికాసం' అనే విశేషణాన్ని చేర్చారు. మానవతా విలువలు వ్యక్తిత్వ వికాసంలో ఒక పార్శ్వాన్ని స్పృశించే మాట వాస్తవమే. కానీ అవే సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శకాలుకావు. జీవితం, ఆరోగ్యం, ధర్మార్థకామమోక్షాలు, మనసు, మరణం మొదలైన పన్నెండు అధ్యాయాలలో 'వ్యక్తిత్వం' ఒకటిగా గ్రంథ రచన సాగింది. సద్వర్తనకు ఎక్కువ ప్రాధాన్యమివ్వడం సబబుగానే ఉంది. తర్వాత స్థానం ఆధ్యాత్మిక చింతనకు లభించింది. కానీ వ్యక్తిత్వ వికాస సూచనలకు తగిన చోటు చేకూరలేదనే చెప్పాలి. ఒక హితోక్తిని ఉటంకించి, దానిని వివరించే కథలు చేర్చే విధానం ఎంచుకున్నారు. ఇది ఆసక్తిదాయకంగా ఉన్నా, కథలు ఎక్కువయ్యాయి.

మానవతా విలువలు : (సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం)

రచన : భాస్కర పంతులు

పేజీలు : 458, ధర : 150 /-

ప్రతులకు : రచయిత, లింగాలవీధి, మన్నూరు

రాజంపేట మండలం, కడప జిల్లా - 516 126,

– జి. రామకృష్ణారావు

మానవతా విలువలు

జీవితం - 1

శ్రీమంతులకైనా, పేదవారికైనా జీవితం ప్రకృతి ప్రసాదించిన వరం. చేజారిపోయిన జీవితం మరలా రాదు. ఎవరూ దానిని తిరిగి సాధించలేరు. దేని జీవితం దానికి విలువైనది, ప్రియమైనది. పుట్టినందుకు గిట్టేంతవరకూ జీవించాలి.

అన్నింటికంటే జీవించడం ముఖ్యం.
జీవించడానికి ఆరోగ్యం ముఖ్యం.
ఆరోగ్యవంతమైన జీవితానికి సంస్కారం ముఖ్యం.
సంస్కారవంతమైన జీవితానికి విద్య ముఖ్యం.
విద్యకంటే వివేకం ముఖ్యం.
వివేకం కంటే శాస్త్రజ్ఞానం ముఖ్యం.
శాస్త్రజ్ఞానంకంటే లోకజ్ఞానం ముఖ్యం.
అన్ని జ్ఞానాలకంటే ఆత్మజ్ఞానం ముఖ్యం.

కాలమే జీవితం. కాలాన్ని వృథా చేసుకోవడమంటే జీవితాన్ని వృథా చేసుకోవడమే. జీవితం జీవించడానికేగానీ, బాధపడడానికీ కాదు, అర్థాంతరంగా అంతం చేసుకోవడానికీ కాదు. జీవితం ఒక అవకాశం. వీలైనంత ప్రశాంతంగా జీవితాన్ని గడపాలి. అనవసరమైన ఆరాటాల కోసం పోరాటాలు చేస్తే పోయేది మనశ్శాంతే. ప్రణాళికాబద్ధమైన జీవితంలో కష్టాలుండవు. ఒకవేళ ఉన్నా ప్రతి కష్టమూ దైవానికి దగ్గర చేస్తుంది.

ప్రాణం ఉంటే శివం లేకుంటే శవం

ఎవరైనా ఏ గుడికో వెళ్ళబోతూ ఏ పక్కింటివాళ్ళకో లేదా ఏ కొబ్బరి కాయలంగడి వాళ్ళకో కాస్త చెప్పులు చూస్తూండండి అంటే పెద్దగా ఇష్టం లేకపోయినా కాదనలేరు. అదే.. శవాన్ని మోసుకెళుతున్నవారు "శ్మశానం చాలా దూరంగా వుంది, శవం కూడా చాలా బరువుంది, భుజాలు నొప్పి పెడుతున్నాయి, కొంతసేపు మీ పంచలో ఉంచుకుంటాం" అంటే ఎవరైనా ఒప్పుకుంటారా? ఒప్పుకోరు. అంటే శ్వాస ఆగిపోయిన శరీరం చెప్పులకన్నా హీనాతి హీనమైనదని కదా భావం. కాబట్టి శరీరంలో శ్వాస పరుగులు పెడుతున్న కాలంలోనే నీవు చేసేదేమైనా వుంటే చేసేయాలి. అందుకే " ప్రాణం వుంటే శివం లేకుంటే శవం.

జీవితానికి అర్థం మనం జీవిస్తేనే తెలుస్తుంది. అలాగే మరణానికి అర్థం మన ఆత్మీయులు మరణిస్తేనే తెలుస్తుంది.

భౌతిక సౌందర్యం రోజురోజుకూ తరిగిపోయేదైతే, భావసౌందర్యం రోజు రోజుకూ పెరుగుతూ వుంటుంది. కాబట్టి, తరిగిపోయే శరీర సౌందర్యంపై మోహం విడచి,

భావ సౌందర్యానికి ప్రాధాన్యత నిచ్చినట్లయితే కాలగమనంలో ఎదురయ్యే ఆటు-పోట్లను సమన్వయంతో సరి చేస్తూ జీవితాన్ని సవ్యంగా, హాయిగా సాగిస్తుంది.

కొన్ని అన్నదాన సత్రాలలో మూడు రోజులు ఉచితంగా భోజన సదుపాయాలను కలుగజేస్తారు. ఆపై ఉండనివ్వరు. సాగనంపుతారు. అది వారి నియమం. అలాగే ఈ ప్రపంచం భగవంతుడు జీవకోటికి ప్రసాదించిన అన్న సత్రం. సమస్త జీవకోటికి బాల్యం ఒకరోజు, యౌవనం ఒకరోజు, వృద్ధాప్యం ఒకరోజు. ఈ మూడు కాలాలు దాటితే మూడునాళ్ళ ముచ్చట ముగిసినట్లే. కాలపురుషుడైన యముడు వస్తాడు. అన్న సత్రం నుండి నిర్దాక్షిణ్యంగా గెంటివేస్తాడు.

అలాగే మానవ జీవితంలో చేసిన కర్మలకు ఫలితాలు మూడు రకాలుగా ఉంటాయి. అవి స్వర్గం, నరకం, మోక్షం. పరులకు ఉపకారం చేసే కర్మలను చేస్తే అందరిచేత కీర్తింపబడతారు. అదే 'స్వర్గం'. అందరికీ అపకారం చేస్తూ, అందరిచేత శాపాలు పొందుతూ జీవించడం 'నరకం'. పరోపకారం చేయడంలో పూర్తిగా మునిగిపోతే వచ్చేదే "మోక్షం". కాబట్టి మనిషి- మనిషి తనంతో పండిపోతే మోక్షం దానంతటదే ప్రాప్తిస్తుంది. దాని కొరకు ఈ అన్న సత్రంలో ఉండగనే సాధించుకోవడం ఉత్తముని లక్షణం. ఉన్నతమైన, ఆదర్శవంతమైన లక్ష్యసాధనకు సామాన్యమైన ఆకర్షణలనూ, ఆనందాలనూ, అల్పమైన కోరికలనూ వదులుకోవాలి.

* సత్యవంతంగా ఉండాలంటే అసత్యాన్ని వదులుకోవాలి.
* మంచిగా ఉండాలంటే చెడును వదులుకోవాలి.
* నిత్యమైన, నిశ్చలమైన, నిజమైన ఆనందం కావాలంటే నీటి బుడగలాంటి క్షణికానందా లను త్యజించాలి.
* వేలెత్తి చూపించుకోవడంకాదు, చెయ్యెత్తి నమస్కారాలు అందుకునేటట్లుగా జీవించాలి.
* ఆశలతోకాక ఆశయాలతో జీవించాలి.
* ఆశలు ఉంటాయి అందరికీ - ఆశయాలు ఉండేది కొందరికే.
* అందరిలో కొందరిలాగా ఆ కొందరిలో 'ఒక్కడు' లాగా జీవించాలి.
* దీన, హీన జీవితం కాదు కావలసింది దివ్యమైన జీవితం.

పది సంవత్సరాలలో ఆడుతూ పాడుతూ ఉండకుండా
ఇరవై సంవత్సరాలలో అందంగా లేకుండా
ముప్పై సంవత్సరాలలో స్థిరపడకుండా
నలభై సంవత్సరాలలో ధనికుడు కాకుండా

యాభై సంవత్సరాలలో సలహాలివ్వదగిన అనుభవజ్ఞులుగా
కాకుంటే వారు శాపగ్రస్తులే

* జీవితంలో సగభాగం అనుభవించే అర్హత ఉండీ అవకాశాలు లేకుండా గడచి పోతుంది. రెండవ సగభాగం అవకాశం ఉండీ అర్హత లేకుండా గడచిపోతుంది.

జీవితం	ఒక ఆట	అనుకుంటే	ఆటగాడివికమ్ము
	ఒక పోరాటం		యోధుడివికమ్ము
	ఒక ముళ్ళబాట		జాగ్రత్తగా అడుగు ముందుకు వెయ్
	ఒక చదరంగం		ఎత్తుకు పై ఎత్తు వెయ్
	ఒక పరమపద సోపానం		నిచ్చెనలు, పాములు ఉంటాయ్ జాగ్రత్త
	ఒక ఆనందమయ మజిలీ		ఆధ్యాత్మికవేత్తవికమ్ము

జీవితంలో ఏమి కావాలనుకున్నామో దానిని పొందడమే విజయం. అలాగే ఇతరులతో మనకున్న సంబంధాలే మన విజయంలో కీలకం.

అదృష్టం

అదృష్టం అంటే "కనిపించనిది" అని అర్థం. "మనిషి అదృష్టాన్ని, ఏనుగు బలాన్ని ఎవ్వరూ చెప్పలేరు". ఈ కనిపించని దానిని గురించి అనుకోనివారు ఎవ్వరూ ఉండరు. కాలం కలసిరావడమే "అదృష్టం".

"కొండంత ప్రయత్నం కంటే గోరంత అదృష్టముంటే చాలు". ఎన్ని విద్యలు నేర్చినా, ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత కృషి చేసినా, కాలం కలసిరాకపోతే, అదృష్టం వరించకపోతే పనులు సానుకూలం కావు. ఒడిదుడుకులు తప్పవు.

కొందరికి అర్హతలు లేకపోయినా! దక్కుతుంది. కొందరికి ఊహామాత్రంగా కూడా అనుకోక పోయినా, ఆశించకపోయినా ఫలితం దక్కుతుంది. దానినే "అదృష్టం" అంటారు. కొందరికి అన్ని అర్హతలున్నప్పటికీ, అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ తప్పక సాధిస్తామనీ, తప్పక ఫలితం దక్కుతుందనీ అనుకున్నప్పటికీ, చతికిల పడిపోవడాన్నే దురదృష్టం అనీ, కాలం కలిసిరాలేదనీ అంటారు.

సామాన్యంగా అర్హతలున్న వారి ప్రయత్నాలు ఫలించి, అదృష్టం కలిసొచ్చి అందలం ఎక్కితే అసూయపడినా బాధ మాత్రం పడరు. అర్హత లేనివాడికీ, ఏ ప్రయత్నం చేయనివాడికి అదృష్టం కలిసొచ్చి పై స్థాయికి పోతే వాడు చాలా అదృష్టవంతుడు అంటారు.

తమకూ అదృష్టం కలగాలనీ, కాలం కలసిరావాలనీ ప్రయత్నాలు ఫలించాలనీ కోరుకుంటారు. కానీ కాలం కలసి వచ్చేటంత వరకూ, అదృష్టం తలుపు తట్టేంత వరకూ వేచిచూస్తూ ఉండాల్సిందే, తప్పదు.

కొందరి జీవితాలలో కొంత కాలంవరకూ అనుకున్నవి అనుకున్నట్లుగా "పట్టిందల్లా బంగారు" అన్నట్లుగా ఏ పని చేసినా లాభం, శుభం జరుగుతూ ఉంటుంది. అలాంటి వారి స్థితిని చూచి, వారికి "శుక్రమహర్దశ" పట్టింది అంటారు.

కొందరికి ఏం చేసినా లాభం కానీ, శుభం కానీ కలుగదు. అలాంటి వారిని చూచి "బంగారం పట్టుకున్నా మట్టయిపోతూ ఉంటే ఏంచెయ్యాలి"? అని బాధపడిపోతూ ఉంటారు.

పాండవులు అరివీర భయంకరులు, మహాబలాఢ్యులు, శ్రీ కృష్ణపరమాత్ముని అనుగ్రహం ఉన్నవాళ్లే, ధర్మపరులే అయినా అనుభవించవలసిన వయసంతా అజ్ఞాతంగా అడవులలో గడిచిపోయింది.

కౌరవులు అధర్మపరులు, అసూయాహంకారులు, సకల అవలక్షణాలూ ఉన్న వారే అయినా, అదృష్టవంతులు. కాబట్టే అనుభవించవలసిన వయసులో సమస్త రాజభోగాలు అనిభవించారు.

ప్రతి ఒక్కరి జీవితంలోనూ అదృష్టం అనేది తప్పక ఒకసారి వస్తుంది. దానిని సద్వినియోగం చేసుకోవాలి. అంతవరకూ లోపంలేని ప్రయత్నాలు శక్తి కొద్ది ఉండాలి. అంతేకానీ ఇతరుల అదృష్టం మీద అసూయపడకూడదు.

అదృష్టం వరించినా అర్హతలు లేనివారు అందలాన్ని అందుకోలేరు

గోవిందయ్య పరమలోభి. ఐతే ఏం?, లాభం వస్తుందంటే మాత్రం ఎంత పెట్టుబడైనా పెట్టగలడు. ఎంత ఖర్చు అయినా వెనుకాడడు.

ఒక రోజు ఆ ఊరి పొలిమేరలోవున్న దేవాలయంలోకి ఒక సాధువు వచ్చాడు. ఎప్పుడూ దేవుడికి కనీసం దండం కూడా పెట్టని గోవిందయ్య, భార్యతోసహా సాధువు దగ్గరకు బయలుదేరాడు. ఆశ్చర్యంతో భార్య ఆ విషయాన్నే అడిగింది.

ఓసి పిచ్చిమొగమా! ఆ గుడిలో బస చేసిన సాధువుకు బోలెడన్ని మహిమలు ఉన్నాయట. అయన చెప్పినట్లుగా చేస్తే చాలు, మనల్ని మెచ్చి, కోరిన వరాలు ఇస్తాడట. ఎంత ఖర్చైనాసరే మనం ఆ సాధువును మెప్పించి వరాలు దండుకోవాలి అన్నాడు.

గుడిలో సాధువు 'ధర్మాచరణ' గురించి చెబుతూవుంటే గోవిందయ్య సాధువు దృష్టి తనమీద పడేటట్టు ముందు వరుసలో చక్కగా కూర్చొని, శ్రద్ధగా వింటున్నాడు. సాధువు చెప్పడం ముగించాక, సాధువు కాళ్ళపై పడిన గోవిందయ్యను ప్రేమగా లేవనెత్తుతూ నీ బోటి ధనవంతుల వల్లనే ఊరికి ఉపకారం జరగాలి అన్నాడు.

ఆ మాటకు గోవిందయ్య మనసు పులకించిపోయింది. "సెలవియ్యండి స్వామీ! మీరు ఏమి చెప్పినా నేను చేస్తాను" అన్నాడు. మంచిది నాయనా! ఈ ఊరివారు త్రాగునీటికి చాలా ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి నీవు నేను చెప్పినచోట బావి త్రవ్వి నీటి కొరతను తీర్చాలి అన్నాడు. గోవిందయ్య సరే అన్నాడు. పిల్లలకు చదువు కునేటందుకు వసతిగృహం, అందులో భోజన సదుపాయం ఉండేటట్లుగా కూడా ఒక పాఠశాలను నిర్మించాలి అన్నాడు. దానికికూడా గోవిందయ్య సరేనన్నాడు.

గోవిందయ్య సాధువు చెప్పినవి కొన్ని మాసాలలోనే పూర్తి చేశాడు. ఇక సాధువు వెళ్ళిపోతాడనగా సాధువు పాదాలపైబడి స్వామీ! మీ మహిమల గురించి విన్నాను. నాకు రెండు వరాలు దయచేయండి అని వేడుకున్నాడు. "నా వరాలు మంచి మనసున్న వారికి తప్పక ఫలిస్తాయి. నీకు ఒక మంత్రం చెబుతాను. దానిని మూడుసార్లు మనసులో స్మరణం చేసుకుని నీవు ఏమి కోరుకుంటావో కోరుకో అవి ఫలిస్తాయి" అని గోవిందయ్య చెవిలో మంత్రం చెప్పి సాధువు గ్రామం వదలి వెళ్ళిపోయాడు.

ఇంటికి తిరిగివచ్చిన గోవిందయ్య ఎంతో ఉబలాటంతో సాధువు చెప్పిన మంత్రాన్ని మనసులో జపించి 'నా ఇల్లంతా బంగారమైపోవాలి' అనుకున్నాడు. వెంటనే గోవిందయ్య ఇల్లు, వాకిళ్ళు, కిటికీలు అన్నీ బంగారమైపోయాయి. హఠాత్తుగా గోవిందయ్య ఇల్లంతా ధగధగ మెరిసిపోవడం చూచి ఊరు ఊరంతా పరుగు పరుగున వచ్చి ఇంట్లోకి దూరసాగారు. కొంతమంది గోకి చూచి అరె! బంగారు..! అని ఆశ్చర్యపోతూ ఎక్కడబడితే అక్కడ గోకను మొదలుబెట్టారు. ఈ తతంగమంతా చూచిన గోవిందయ్య భార్య "నీ మతి మండా... ఇలాంటి పనా చేసేది? ఊరి జనమంతా ఇల్లు పీకి దొరికిన బంగారమంతా పట్టుకుపోతారు. మనకు ఇల్లుకూడా దక్కకుండా పోతుంది. తొందరగా ఏదో ఒకటి చెయ్యండి" అని గగ్గోలు పెట్టింది.

వెంటనే గోవిందయ్యకు ఏమీ పాలుబోక మా కుటుంబానికి తప్ప మరెవరికీ ఈ బంగారు కనబడకూడదు. అని రెండవసారి మంత్రం చదివి మనసులో తలచుకున్నాడు. అంతే! ఊరి జనమంతా ఎక్కడివాళ్ళక్కడ వెళ్ళిపోయారు. గోవిందయ్యకు, ఆయన భార్యకు ఎటుచూసినా ఇంట్లో అంతా బంగారమే. ఆ రోజు దంపతులిద్దరూ మహదానందంగా బంగారు కుర్చీలలో కూర్చొని, బంగారు పళ్ళెములలో భోజనం చేసి, బంగారు చెంబులతో నీళ్ళు త్రాగారు. బంగారు మంచంమీద పడుకుని ఆనందంలో మునిగిపోయారు.

మరునాడు గోవిందయ్య ఇంటి పెరటి గోడ నుండి ఒక ఇటుకను తీసి సంచిలో పెట్టుకుని బజారుకెళ్ళి షరాబు దగ్గర అమ్మజూపాడు. షరాబు దానిని చూచి "గోవిందయ్యా నీకేమైనా పిచ్చి పట్టిందా? ఇటుకరాయిని తెచ్చి బంగారు ఇటుక అంటావా" అని నవ్వుతూ నలుగురికీ చెప్పాడు. అందరూ గోవిందయ్యను చూచి పగలబడి నవ్వారు. తర్వాత తెలిసింది గోవిందయ్యకు తానుచేసిన తప్పేంటో.

అనుభవించే అదృష్టమే ఉంటే జీవితమంత ఆనంద కరమైనది మరొకటి లేదు. అదృష్టమే లేకుంటే బ్రతుకంత నరకం లేదు. అలాగని జీవితం అదృష్టం మీదనే ఆధారపడి లేదు. సంకల్పం, అర్హతల మీద కూడా ఆధారపడివుంది.

"ఆశ ఉండొచ్చు. కానీ కూడనిది అత్యాశే. భంగం అయ్యేదాక మాత్రమే ఆశలో సుఖం ఉంటుంది".కోరుకున్నవి జరగక పోవడం, వద్దనుకున్నవి, జరగవనుకున్నవి మన ఒడిలో వచ్చి పడటం అందరి జీవితాల అనుభవమే. ఒక్కొక్కసారి కష్ట పడినా ఫలితం దక్కదు. నీవు ఆశించావు, బాగానే ఉంది, భగవంతుడు ఆశీర్వదించవద్దా? "ఆడబోయిన తీర్థం ఎదురైనట్లు" "వెదక బోయిన తీగ కాలికి తగిలినట్లు" అప్రయత్నంగా అయాచితంగా లభించే ఫలితాలను చూచి అన్న మాటలివి. అలా ఎందుకు జరుగుతాయి? ఎవరి జీవితాలు వారి చేతులలోనే ఉన్నాయి. అని వాదించేవారు, దీనికి సమాధానం చెప్పగలరా? "పూర్వజన్మ సుకృత, దుష్కృత్యాలే కారణం"

పనులను వాయిదా వేసేవారు, సాకులు చెప్పేవారు, తప్పులను ఎత్తి చూపించే వారు ప్రయోజనాలను ఆశించి మాత్రమే బ్రతికేవారు, తమ వైఫల్యాలకు ఇతరులను బాధ్యులుగా చేసే వారందరూ తమ ఆలోచనా విధానంలో మార్పు తెచ్చుకోనంత

వరకూ నిరుద్యోగులుగానో, చిరుద్యోగులుగానో, నిష్ప్రయోజకులుగానో, చెత్తప్రజలై వాతావరణ కలుషితులుగానో మిగిలిపోతారు.

జీవితంలో పొరపాట్లు, తప్పులు జరగడం, పడటం, లేవడం, జయం, పరాజయం అతిసహజం. ప్రతి మనిషీ జీవితంలో చివరి శ్వాసదాకా విద్యార్థే! తప్పులు సరిదిద్దుకుంటూ, తనను తాను ఉద్ధరించుకుంటూ జీవించాలి. అంతేగానీ ఇక మనకు జీవితం శూన్యమనుకుంటూ క్రుంగిపోవడం, మానసికంగా నలిగిపోవడం వివేకమనిపించు కోదు, వీరోచితమూ కాదు. "అపజయం విజయానికి నాంది"గా తీసుకోగలిగినప్పుడే నీవేదైనా సాధించగలవు.

* మరణం ఇక తప్పదు అనుకున్నప్పుడు వీరోచిత మరణమే మేలు. తాత్కాలికమైన ఈ జీవితంలో కేవలం ఆశలతో, మరో మూన్నాళ్ళు ఎక్కువగా బ్రతికినంత మాత్రాన సార్థకత ఏముంది? భూమికి భారం తప్ప.
* సుష్టుగా భోంచేసి పడుకోవడానికి జీవితం వడ్డించిన విస్తరీ కాదు, పరచిన పూల పాన్పూ కాదు.
* ఆశ ఎంత దూరమైనా నడిపిస్తుంది. ఆశయం అంతదూరమూ తోడుంటుంది.
* మూర్ఖంగా పోరాడి అవమానింపబడి, ఓటమిపాలుకావడంకంటే కాలం కలిసొచ్చేదాకా మౌనంగా ఉండడమే ఉత్తమం.
* ఎంత మంచి ఆలోచనకైనా కాలం కలసిరావాలి. కాలం కలిసొచ్చిన ఆలోచనలను అడ్డుకోవడం ఎవరితరమూకాదు.
* నూరు మంది శత్రువులేకమై నీకు వ్యతిరేకంగా పనిచేసినా భగవంతుడు తలచినది మాత్రమే జరుగుతుంది.
* జీవితం మూడు పువ్వులు ఆరు కాయలుగా
  ఒకే కాన్పులో ఇద్దరు కవలలుగా
  పండంటి కాపురంగా ఉండకపోవచ్చు
  చేతికొచ్చినది నోటిదాకా రాకనూపోవచ్చు
  జీవితం ఆసాంతం సజావుగా సాగకపోనూవచ్చు
  జీవించడమే దుర్భరమనిపించే విషాద క్షణాలు ఎదురు కావచ్చు

అయినా జీవించాలి. నిరాశ నిస్పృహలను లక్ష్య పెట్టనేకూడదు. కష్టాలకు భయపడి జీవితాలను చాలించి ఉంటే మనకు ఆదర్శంగా ఏ ఒక్కరూ మిగిలి ఉండే వారు కాదు.

* కష్టాలు మనికి గాక మానుకు వస్తాయా?

బ్రతుకు భయం

ఒక అడవిలో కొలను గట్టునవున్న గుబురు పొదలలో కుందేళ్ళు గుంపులుగా నివసిస్తూవుండేవి. అయితే నిత్యం అడవికి వేటగాళ్ళు వచ్చి, వలలు విసిరి వాటినిపట్టి అమ్ముకుని జీవనం సాగించేవారు.

కుందేళ్ళజీవితం దినదినగండంగా గడవసాగింది. ఇలా ప్రతి రోజూ భయపడుతూ బ్రతికేకంటే, ఒకేరోజు చస్తేనే నయం అనుకుని, నాయక కుందేలు ఒక రోజు కుందేళ్ళ నన్నింటినీ పిలిచి సమావేశ పరచి తన అభిప్రాయం చెప్పింది. మిగతా కుందేళ్ళుకూడా "నిజమే మనదీ ఒక బ్రతుకేనా"? ఏ మూల నుండి ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోననే భయంతో బ్రతుకు తెల్లారిపోతున్నదేగానీ స్వేచ్ఛగా, నిర్భయంగా ఒక క్షణంకూడా బ్రతకలేక పోతున్నాం అని అన్నాయి. అన్ని కుందేళ్ళు తమ తమ గోడును ఇలా వెళ్ళబోసుకున్నాయి.

కొందరు మాంసం వండుకుని తినేవాళ్ళు, రంగురంగుల మెత్తటి చర్మాలను అమ్మేసి సొమ్ము చేసుకునేవారు, ప్రయోగ శాలలకి అమ్మేవారు. అబ్బ! ఆ ప్రయోగశాలలో మన బ్రతుకు చూడాలి... నరకం. రకరకాల మందులు మన శరీరంలోకి ఎక్కించి, చిన్నచిన్న గాజు పెట్టెలలో ఇరికిస్తారు. గుండు సూదులు గుచ్చి కదలకుండా చేస్తారు. ఒకసారి నన్ను తీసుకెళ్ళి సూదులు గుచ్చి ఎందుకో వదిలివేశారు, అంది ఒక కుందేలు. కుందేలు మాంసం మహా రుచి అని చెప్పుకుంటారు ఆ దిక్కుమాలిన మనుషులు. మా అమ్మను ఎత్తుకెళ్ళారు అంది ఇంకో బుల్లి కుందేలు కన్నీరు కారుస్తూ. అవును మనల్ని చంపి తోలు వలుస్తారు. ఎంత నరకమో. "ఎద్దు పుండు కాకికి ముద్దా" "పిల్లి చెలగాటం ఎలుకకు ప్రాణ సంకటం" అన్నట్లు వాళ్ళకేం తెలుస్తుంది మన బాధ. వాళ్ళని కూడా బ్రతికుండగనే తోలు తీస్తే తెలుస్తుంది ఆ బాధేంటో! అంది మరో కుందేలు.

మనుష్యుల మాటే ఎందుకనుకోవాలి? మన సాటి జంతువులైన నక్కలు, తోడేళ్ళు, డేగలు అలాగే పెద్ద పెద్ద పాములు మనల్ని చూచాయంటే చంపి తినకుండా వదులుతున్నాయా? అంది ఇంకో కుందేలు. అందుకే మనబ్రతుక్కి సంతోషమే లేకుండా పోయింది. అనుక్షణం భయంతో చస్తూ బ్రతికేకంటే ఒకేసారి చస్తేనే బాగుంటుంది అని నాయక కుందేలు అన్నది.

మంచి ఆలోచన. ఎక్కడ చద్దాం? ఎలా చద్దాం? ఆఁ! కొండెక్కి దానిమీద నుండి దూకి చద్దామా? అని ఒక కుందేలు సూచించింది.ఎక్కడికో ఎందుకు? అదిగో మనకెదురుగా పెద్ద కొలను ఉందిగా...అందులోకి దూకితే సరి. అంతా చచ్చిపోతాం అన్నది నాయక కుందేలు.

సరే! ఒకేసారి అందరం కలసి ఆత్మహత్య చేసుకుందాం అని కుందేళ్ళన్నీ నిర్ణయించు కొని, ఒక గుంపుగా కొలను దగ్గరకు వచ్చాయి.

కొలను నిండా నీళ్ళు ఎప్పుడూ ఉండటం వలన కప్పలు తెప్పలు తెప్పలుగా ఉంటున్నాయి. నీళ్ళమీద ఈదుతున్న కప్పలన్నీ కుందేళ్ళ చప్పుడుకి భయపడి నీళ్ళ అడుగుకి చేరిపోయాయి.

అది గమనించిన నాయక కుందేలు నీళ్ళలోకి దూకబోతూన్న కుందేళ్ళను ఆపి 'నీళ్ళలోకి దూకకండి. ఆత్మహత్య చేసుకోవలసిన అవసరం మనకు లేదు' అంది తక్కిన కుందేళ్ళన్నీ ఆశ్చర్యపడ్డాయి. అదేంటి? ఇంతలోనే నిర్ణయం ఎలా మారింది? అన్నాయి.

అప్పుడు నాయక కుందేలు నవ్వి మనం మనుష్యుల్ని, తక్కిన జంతువుల్ని, పక్షులని చూసి భయపడి చచ్చికదా ఆత్మహత్య చేసుకుందామనుకున్నది. అవును. అన్నాయి కుందేళ్ళన్నీ. కానీ మనల్ని చూచికూడా భయపడే ప్రాణులున్నాయంటే ఆశ్చర్యంగా ఉంది. మనం ఆలోచించాల్సింది వుంది. కొలనులోని నీటిపై ఆనందంగా, స్వేచ్ఛగా, నిర్భయంగా ఆడుకుంటూన్న కప్పలన్నీ క్షణంలో అదుక్కి వెళ్ళిపోయాయి భయంతో. చూశారా? అవునవును అన్నాయి కుందేళ్ళు.

"మనకంటే అల్పప్రాణులుకూడా బ్రతుకుతున్నప్పుడు మనమెందుకు బ్రతకలేం? అనవసరంగా ప్రాణాలెందుకు పోగొట్టుకోవాలి. మనోనిబ్బరం తెచ్చుకుని ధైర్యంగా బ్రతుకుదాం" అంది నాయక కుందేలు.

నిజమే. ఎప్పుడో చస్తామనే భయంతో రాబోయే నష్టాల్ని ఊహించుకుని తొందరపాటుతో ముందే చావటం ఎందుకు? బ్రతికినన్నాళ్ళు బ్రతుకుదాం. బ్రతుకన్నాక సమస్యలు, కష్టాలు, ఆపదలు రాకుండా వుంటాయా? అనుకున్నాయి. చావనక్కర్లేదు అని అనుకున్నంతనే అన్నింటికీ సంతోషం కలిగింది. ఇక్కడ వేటగాళ్ళ బెడద ఎక్కువ కాబట్టి మన నివాసం వేరొక చోటికి మారుద్దాం అంది నాయక కుందేలు. సరే ననుకుంటూ అన్నీ ఆనందంగా వేరే సురక్షిత నివాసం కోసం వెదుకుతూ బయలుదేరాయి.

* చావు గురించి భయపడేవారికి బ్రతుకు విలువ తెలియదు. బ్రతుకు విలువ తెలియాలంటే బ్రతికి తీరాలి. ప్రతికూల సంఘటనలో సైతం మనకు అనుకూల అవకాశాలు దాగివుంటాయి. సమస్యలకు భయపడి వెనకడుగు వేశావా వాటినందుకోలేవు.
* అజ్ఞానం వలన కలిగే భయం ఆందోళనకూ, అయోమయానికీ గురి చేస్తే, జ్ఞానం వలన కలిగే భయం అప్రమత్తుణ్ణి చేస్తుంది.

ప్రతి జీవి మరొక జీవిపై ఆధారపడి జీవిస్తున్నది. తాను జీవిస్తూ, అన్నింటినీ జీవించనివ్వడం ప్రకృతి ధర్మం, సృష్టి నియమం. "ఆకలికి ఆహారం, అలసిన శరీరానికి నిద్ర, జీవించడానికి ఆత్మరక్షణ, జాతిని నిలుపుకోవడానికి మైథునం" అనేవి ప్రతి జీవికీ ప్రకృతి ప్రసాదించిన ప్రాథమిక అవసరాలు. వీటికి ఎవరివల్లా ఎటువంటి పరిస్థితుల్లోనూ భంగం కలుగకుండా, ఒకవేళ కలిగినా అతి తక్కువ కష్టం కలిగేటట్లుగా పరిమిత స్వార్థంతో జీవించడమే జీవన విధానం, ప్రకృతి ధర్మం.

ప్రకృతిలో మనిషి మనుగడకు అన్నీ ముఖ్యమే. అనవసరమైనదీ, అదనంగా ఉన్నది ఏదీలేదు. అన్నీ సవ్యంగానే ఉన్నాయి. అన్నీ సమానమైన ప్రాధాన్యతను కలిగివున్నాయి. ఒకటి ఎక్కువ మరొకటి తక్కువ అనేది ఏదీలేదు. దేని స్థానం దానిదే. దేని విలువ దానిదే. ఏది లేకపోయినా మనిషి జీవించలేడు.

* అనుకూలంగా జీవితం సాగితే, అసలది జీవితమే కాదు. కంటి నుండి నీరు రాకపోతే ఆ కళ్ళకు తేజస్సు రాదు, మనసూ నిర్మలం కాదు.
* వజ్రానికైనా సానపట్టనిదే మెరుపు రాదుగదా!.

* సుఖ-దుఃఖాల కలయికే మధురమైన జీవితం. జీవిత మాధుర్యం చవి చూడాలంటే అన్నింటినీ భరించాలి. అప్పుడే మనిషి పరిపక్వత చెంది, అన్ని విషయాలను సానుకూలంగా పరిష్కరించుకునే నైతిక బలం వస్తుంది.
* కళ్ళు లేనివారు, కాళ్ళులేనివారు, అశక్తులు, అల్ప ప్రాణులు సాగించే జీవన పోరాటాన్ని చూచి ప్రేరణ పొంది జీవించాలి. జీవితాన్ని ప్రేమించాలి.
* నడకలో తప్పటడుగులు వేయవచ్చు గానీ, నడతలో తప్పటడుగులు వేయకూడదు.
* అందరినీ నొప్పించడం, మెప్పించడం కష్టమే అయినా నొప్పించకుండా ఉండడం నీకు చేతనైన పనే.
* చీమ సిద్ధ జ్ఞాని, పంది పరమ జ్ఞాని, కోడి కాల జ్ఞాని, కుక్క సుజ్ఞాని, మనిషి అజ్ఞాని అని నానుడి. చదువు-సంధ్యలుండికూడా మనిషి మరొక జీవికి ప్రామాణికం కాలేకపోతున్నాడు. ఎందుకు? జీవన విధానంలో సహజత్వాన్ని విడచిపెడుతున్నాడు కనుక మరొక ప్రాణికి హానికరం కావడమేగాకుండా, యావత్ప్రకృతి కాలుష్యానికీ కారణమవుతున్నాడు. అందుకే మనిషి అజ్ఞాని. అయితే, ఈ అపవాదు నుండి తప్పించు కోవడానికి గట్టి ప్రయత్నమే చేయాలి. లేకుంటే మనుగడకే ప్రమాదం.

సృష్టిలో ఉన్నదంతా అందమే, ఆనందమే. ప్రతిరోజు ఆనందంగా జీవించాలి. జీవితమంటే గొప్ప త్యాగాలు, ఘనమైన కార్యాలు కాదు. చిన్న చిన్న ఆనందాలే. కాస్తంత ప్రేమ, దయ, అవసరాలు తీర్చగలగడం, సేవ చేయడం, సహకారమందించడం. ఓదార్చడం, కపటం లేకుండా మనసారా పలకరించుకోవడం, పరామర్శించు కోవడం, హాయిగా నవ్వుకోవడం, ఆరోగ్యంగా ఉండడం, చెదిరిపోని చిరునవ్వుతో తృప్తిగా జీవించడమే.

* ఇచ్చుటలో ఉన్న హాయి మరెచ్చటనూ లేదోయి.
* ఒక మనిషి తన ఆలోచనలను, అనుభవాలను మరో మనిషితో పంచుకోవాలనే తాపత్రయమే మానవ సంబంధాలకు పునాది.
* మన తప్పులే ఎదుటివాని విజయ సోపానాలు
* మనం చేసిన తప్పులే మనకు శత్రువులై బాధిస్తాయి.
* చదువు పాఠం నేర్పి పరీక్ష పెడుతుంది. జీవితం పరీక్ష పెట్టి గుణపాఠం నేర్పుతుంది
* ఏ ప్రయోజనం కోసం మనం జన్మించామో దానిని తెలుసుకుంటూ జీవితాన్ని కొనసాగించాలి.
* తనువు పోయినా, తాను ఉండేటట్లుగా జీవించాలి.
* మాన్యుడికి ముల్లు గుచ్చుకున్నా నగరమంతా తెలిసిపోతుంది. సామాన్యుడిని పాము కాటేసినా ఎవరికీ తెలియదు.

సరైన లక్ష్యం లేకుండా, లక్ష్యసాధనపై ఆకాంక్ష లేకుండా ఎవరూ గొప్పవారు కాలేరు. బ్రతికితే చాలదు. జీవించాలి. అలాగే మరణానికి మించిన దుఃఖం మనిషికి

మరొకటి లేదు. చిరంజీవిగా ఉండాలనుకుంటాడు. కాని మనిషి దానికి విరుద్ధంగానే జీవిస్తూంటాడు. జీవితం జీవనది. వెనక్కి మళ్ళదు. ముందుకు సాగిపోతూనే వుంటుంది. ఈ ప్రపంచమంతా అవకాశాలతో నిండివున్న విస్తృతమైన ప్రదేశం. ప్రకృతి ప్రతి ఒక్కరికీ ఆనందంగా జీవించడానికి అనేకమైన అవకాశాలను ఇచ్చింది. వాటిని సద్వినియోగ పరచుకోవలసిన బాధ్యత మనదే. ఎవరి ద్వారానో అవి నెరవేరవు. నీ వెంటే ఉంటూ, నీ కార్యక్రమాలను నీచేతనే జరిపించినా, కర్మఫలితం మాత్రం నీదే. తండ్రి చేసిన ఋణం కొడుకులు తీర్చవచ్చు. అన్న చేసిన ఋణం తమ్ముడు తీర్చవచ్చు. కానీ, ఎవరి జీవితం వారు మాత్రమే జీవించక తప్పదు. ఎవరి ఖర్మ వారే అనుభవించక తప్పదు.

కాలం విలువైనది. కానీ, జీవితం ఇంకా విలువైనది. జీవితకాలం అల్పమైనది, అపురూపమైనది. నిన్నటి దినం గతించిపోయినది. ఎలాగూ తీసుకురాలేం. మనమేమీ చేయలేం. రేపటి దినం ఎలా ఉంటుందో ఊహించలేం. వర్తమానం చేతిలోని పండులాంటిది. చక్కగా, ఆనందంగా జీవన మాధుర్యాన్ని చవిచూడాలి. మనిషి అందం కోసం ఆరాటపడతాడు. ఆనందం కోసం అన్వేషిస్తాడు. కానీ నిజమైన ఆనందం ఎక్కడుందో తెలియక సులభంగా దొరికే భౌతిక సుఖ, సౌకర్యాల కొరకు ఉపయోగపడే సాధనాలను సంపాదించడంలో మునిగి, తేలుతూ అనేక అనుభవాల తర్వాత ఆనందమనేది బయట ప్రపంచంలో లేదనీ, తన అంతరంగంలోనే ఉందని తెలుసుకుంటాడు.

* విజయ రహస్యం వర్తమానంలో జీవించడమే. వర్తమానంలో కార్యోన్ముఖుడైనపుడే సామాన్యుడు సమర్థుడూ కాగలడు, అసామాన్యుడూ కాగలడు.

బాల్యంలోనే సమస్త విద్యలు నేర్చుకోవాలి. యవ్వనంలో కష్టపడి పని చేయాలి. సుఖభోగాలననుభవించాలి. వార్ధక్యంలో ధ్యాన. మౌన, శాస్త్రచింతన, ఏకాంత ప్రియత్వం కలిగి వుండాలి. జీవితగమ్యం ఏమిటి? జీవనమార్గం ఎలాంటిది? అని ఎవరికి వారే ప్రశ్నించు కోవాలి. అప్పుడు జీవితంలో ఆశించిన ఉద్దేశ్యం స్పష్టమవుతుంది. లక్ష్యం లేని జీవితం, గమ్యం లేని ప్రయాణం రెండూ ఒకటే. కానీ చాలామంది నిర్దిష్టమైన లక్ష్యం గానీ, నియమితమైన కార్యంగానీ లేకుండా ఏదోలా బ్రతికేస్తూ వుంటారు. మంచికాలం ముందుందనీ, ఎవరో వచ్చి ఏదో ఒకటి చేయక పోతారా! కాలం కలసి రాకుండా పోతుందా! మన దశ తిరక్క పోతుందా! అని ఎదురుచూస్తూ బ్రతుకు తుంటారు.

ఫలానావాడు తప్పుకుంటేగానీ మనకు మంచి రోజులు రావనీ, అతని చావుని కోరుకుంటూ బ్రతికేవారు, రేపు, మరునాడు, వచ్చే నెల అని కాలయాపన చేస్తూ తాము చేయకుండా, ఇతరులను చెయ్యనివ్వకుండా బ్రతికేవారు, "సముద్రం వద్దకు వెళ్ళి అలలు నిలిచిపోతే స్నానం చేద్దాం" అనీ, ప్రస్తుతం గ్రహగతులు సరిగా లేవనీ, వచ్చే

యేదు గ్రహబలం బాగుందని ఎదురుచూస్తూ బ్రతికేవారు, "మెతుకుల కోసం ఆరాటపడుతూ బ్రతుకులను పోగొట్టుకునేవారు", "మబ్బుల్లో నీళ్ళు చూసి ముంత వొలకబోసుకునేవారు", మెరుపును చూచి దీపం అనుకుని అమాయకంగా బ్రతికేవారు.. ఎందరో ఉన్నారు.

నడిపే విధానం తెలియకుండా వాహనాన్ని నడపాలని ప్రయత్నిస్తే కొంతమంది మృతికి కారణమై, నీవూ కాలం చెల్లుతావ్. అలాగే జీవిత విధానం తెలియకుండా జీవిస్తే అందరినీ కష్టాలపాలు చేసి, నీవూ కష్టాలననుభవించి అనామకుడిగా, దుర్భరంగా జీవితం ముగిస్తావ్. అలా కాకూడదనుకుంటే నీకూ, నీతోటి వారికి, నీ చుట్టూవున్న వాతావరణానికి ఏ మాత్రం హాని కలగకుండా జీవించడం అలవరచుకుని ముందుకు సాగాలి.

తనకు తాను అశక్తుడననీ, పాపాత్ముడననీ భావించడం చాలా పెద్ద తప్పు మనం ప్రకృతిమాత బిడ్డలం. ప్రతి ఒక్కరూ ప్రకృతిలోని అణువుల సముదాయ, చైతన్య ఆనంద స్వరూపులే. భగవంతుడు అందరిలోనూ ఉన్నాడు. కానీ అందరూ భగవంతుడిలో లేరు. నీవు భగవంతుడి ప్రీతిపాత్రుడవు కావలెననిన, "భౌతికంగా ఎదుగుట తగ్గించి, నైతికంగా ఎదుగు. భౌతికంగా ఎదిగిన వ్యక్తి అసూయకు గురౌతాడు. నైతికంగా ఎదిగిన వ్యక్తి ఆదర్శవంతుడౌతాడు."

అణచుకోవడం అధమం, అనుభవించడం మధ్యమం, జయించడం ఉత్తమం జయించి వదిలివేయడం ఉత్తమోత్తమం. ఏమి తిన్నావన్నది కాదు ముఖ్యం. ఎలా వున్నావన్నది కూడా కాదు ముఖ్యం. నీద్వారా సమాజానికి ఏమి ఒరిగిందన్నదే ముఖ్యం. అందరూ చేసే పనే నీవూ చేస్తే ప్రత్యేకతేముంది. ఎవరూ చేయలేనిది నీవు చేయడమే చరిత్ర అవుతుంది.

* పుట్టినందుకు సమాజహితమైనది ఏదో ఒకటి చేయాలి.
* ఒడ్డున కూర్చుంటే ముత్యాలు దొరకవు సరికదా కనీసం చేపలుకూడా దొరకవు. సాహసం చేసి నీళ్ళలోకి దూకాలి. అప్పుడే చేపైనా, ముత్యమైనా దొరికేది.

సాధారణంగా నగటు జీవితం గడిపేవారికి ప్రతికూలంగా ఆలోచించే దురలవాటుంటుంది. ఎవరినీ అభినందించకపోవడం, లోపాలను ఎత్తిచూపడం, మార్పుని అంగీకరించక పోవడం, అందరితో శృతి కలిపి తానూ విమర్శించడం, తనకు గౌరవం ఇవ్వడంలేదని వాపోవడం, సందర్భానుసారం స్పందించకపోవడం, స్పందించిన వారికి ఏవేవో స్వార్థాలు అంటగట్టడం, లోలోన అసూయలతో క్రుంగిపోతూ పైకి గంభీరంగా ఉండటం నీచుల స్వభావం.

* ఆశయాల సాధనకు పాటుబడినవారెవరూ సాధారణ స్థాయిలోనే నిలబడిపోయిన వారు లేరు. అలాగే ఆశల కోసం జీవించిన వారెవరూ సాధారణ స్థాయిని మించి ఎదగలేదు.

ఆశయాల కోసం జీవించేవారి చుట్టూ 98 శాతం మంది ఆశల కోసం జీవించేవారే ఉంటారు. వారు ఆశయ సాధకులకు నిత్యం అవరోధంగా నిలుస్తుంటారు. విమర్శిస్తూ, క్రుంగదీస్తూ, ముందరికాళ్ళ బంధంగా నిలుస్తుంటారు. వీరినే చెత్త ప్రజలు అంటూంటారు. పైకి పెద్ద మనుషులుగా చెలామణి అవుతూవున్న సగటు మనుషులు. వీరిలో చదువుకున్న వారు, ఉద్యోగం వెలగబెడుతూ ఉండేవారు, సన్నిహితులుగా మెలిగేవారుకూడా ఉండడం ఆశ్చర్యం కలుగుతుంది. లోకంలో కోటికొక్కడు తప్ప తక్కిన వాళ్ళంతా గమ్యం లేని గమనం సాగిస్తూన్న ఇలాంటివాళ్ళే. చేయగలిగిందేమీ లేకపోయినా చిరకాలం జీవించాలన్న ఆశతో మృత్యువుతో సైతం పోరాటం సాగిస్తూవుంటారు.

ఆశయ సాధకులు ఎవరి మెప్పుకోసం గానీ, స్వార్థం కోసం గానీ జీవించరు. సత్యవంతంగా జీవిస్తారు. అది వారి సంస్కారం. వారు మరోలా జీవించలేరు. "సత్యవంతంగా జీవించే వ్యక్తులు ఏ సాధనా చేయనవసరం లేదు. సామాన్యులు వారిని అభినందించనూలేక, సహకరించనూలేక, మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ సగటు జీవుల్లా బ్రతుకు బండిని లాగించేస్తూంటారు. ఇలాంటివారు సమాజానికి చీడపురుగులు. వీలైతే వీరిలో మార్పు తేవడం కాకపోతే దూరంగా ఉంచడం చేయాలి. లేకపోతే ప్రమాదం.

కారణజన్ములు తమ లక్ష్యసాధనలో ఎటువంటి కష్టాలనైనా సహిస్తారు గానీ. వెనుకంజ వేయరు. నీవు గొప్పవాడివని ఏ ఒక్కరి నుండి ఆమోదం పొందవలసిన అవసరం లేదు. నీ చర్యల ద్వారా నిన్ను నీవే గొప్పవానిగా గుర్తించడానికి ఏ సాక్ష్యాలు అవసరం లేదు. నీకు నీవే సాక్షివి. "ముంజేతి కంకణానికి అద్దమేల? చంద్రుని చిరునామా అడగనేల?".

నైతిక విలువల ఆధారంగానే మనుషులు స్ఫూర్తిని పొందుతారు. ప్రక్కవారు సంతోషంగా ఉన్నారంటే వారిని కలుసుకోవడానికి, మాట్లాడటానికి అంతగా ఉత్సాహం చూపించరు కొందరు. కానీ ఇబ్బందులూ, బాధలు పడుతున్నారంటే మాత్రం "ఒకసారి పలకరించి, పరామర్శించి వద్దాం" అని ఉబలాట పడుతూంటారు. మంచిదే. కానీ సంతోషంలోకూడా వెళ్ళి అభినందనలు తెలియజేస్తే మరీమంచిది.

* టన్నుల కొద్దీ ఇచ్చే సలహాల కంటే ఒక చిన్న పని చాలా విలువైనది.
* పని చేస్తూపోవడం, పని చేయడంలో ఆనందించడమే జీవిత కళ.
* శ్రమించడమే జీవిత సూత్రం. రాత్రికి రాత్రే ఫలితాలు సాధించడం ఎవరి తరమూ కాదు. కాలం కరగాలి. అందులో నీ శ్రమ దాగుండాలి.
* ప్రారంభించిన పనులన్నీ సవ్యంగానూ, సజావుగానూ, సంపూర్ణంగానూ నెరవేరతాయనీ, సత్ఫలితాలనే ఇస్తాయనీ భావించడం అత్యాశ, మూర్ఖత్వం. ఏకపక్ష భావన.

బ్రతికిన బ్రతుకు చావులో తెలుస్తుంది

ఒక ఊరిలో జీవనోపాధి కొరకు వేశ్యావృత్తి చేసుకుంటూ చింతామణి అనే మహిళ ఉండేది. ఆ ఊరిలో ఎవరైనా చనిపోయి శవాన్ని తీసుకెళుతూంటే, ఆ వేశ్యావనిత తన నౌకరును పిలిచి, పోవుచున్న శవం స్వర్గానికి వెళుతుందా? నరకానికెళుతుందా? తెలుసుకుని రమ్మని పంపించేది ప్రతిసారీ.

ఒక రోజున ఒక శవాన్ని తీసుకెళుతున్నారు. పట్టణ ప్రముఖులందరూ ఆ శవయాత్రలో ఉన్నారు. ఎప్పటిలాగానే చింతామణి విషయం కనుక్కుని రమ్మని పంపించింది. నౌకరు శవం వెనుక కొంతదూరం వెళ్ళివచ్చి "అమ్మగారూ ఆ ఆత్మ స్వర్గానికి పోతోంది" అని చెప్పాడు.

ఎప్పటి నుండో ఈ తతంగమంతా గమనిస్తున్న పొరుగింటి శాస్త్రిగారు చింతామణి దగ్గరికెళ్ళి "తాను నిత్యం పూజలు, వేదాధ్యయనం చేస్తూన్నప్పటికీ ఆత్మ ఎక్కడికి వెళ్ళేది తెలుసుకోలేక పోతున్నాను. మీరెలా తెలుఘుకోగల్గుతున్నారో వివరంగా చెప్పండి" అని అడిగాడు.

శాస్త్రిగారు అడిగిన మాటకు చింతామణి "ఓహ్! ఇంత మాత్రానికే నా దగ్గరకు వచ్చారా? అంటూ రాగాలు తీసి ఇలా చెప్పింది. "బ్రతికిన బ్రతుకు చచ్చే చావుదలలో తెలుస్తుంది" అంటారు గదా! శవం వెనుక వెళ్ళే జనం కాటి వరకు వెళతారు. దారి పాదవునా పోయినవారి గురించే మాట్లాడుకుంటారు. స్వార్థంతో, పిసినారితనంతో, దుర్మార్గంతో జీవించివుంటే, అతడు చేసిన పాపాలను ఏకరువు పెట్టి పాపాత్ముడు 'చచ్చాడు' అంటారు. అలాకాకుండా దాన ధర్మాలు, సేవలు, సహాయాలు, పరోపకారం చేసివుంటే 'పుణ్యాత్ముడు' మరణించాడు అంటారు. అని చెప్పడం ముగించింది చింతామణి.

మనిషి యొక్క కీర్తి ఎంతకాలం ఈ భూమి మీద పొగడబడుతూ వుంటుందో అంతకాలం ఆ మనిషి స్వర్గంలో వుంటాడు. మనిషి యొక్క కీర్తి అతడు చేసే పనులను బట్టి ఉంటుంది. దానికి తగిన ఫలితం ఉంటుంది. కాబట్టి పుణ్యకార్యాలనే అందరూ చెయ్యాలి

HELP AS	→ FAR ←	AS YOU CAN
	→ LONG ←	
	→ MUCH ←	
	→ MANY ←	
	→ PROMPT ←	
	→ SOON ←	

రుద్రయ్య పెద్ద గజదొంగ. ఒకనాటి రాత్రి దొంగతనం చేస్తూండగా ఇంటి యజమాని కాపుకాసి పట్టుకుని "దొంగ దొంగ" అంటూ బిగ్గరగా కేకలు వేశాడు. రుద్రయ్య అతడిని ఒడుపుగా ప్రక్కకు నెట్టేసి పరుగందుకున్నాడు. ఆ ఇంటికి ప్రహరీ

గోడ చాలా ఎత్తుగావుంది. అయినా అది రుద్రయ్యకు ఒక లెక్కకాదు. కానీ ఆరోజు వాడిని దురదృష్టం వెన్నంటి వున్న కారణంగా గోడ దాటేటపుడు కాలు జారి అవలి వైపున వున్న బండపైన పడ్డాడు. తలకు బలమైన గాయమయింది. రక్తం బాగా కారసాగింది. పడినచోటు నుండి కదలలేక అలాగే వుండిపోయాడు.

ఇంటి యజమాని వేసిన కేకలకు మేల్కొన్న గ్రామ జనం కొద్ది సేపట్లోనే గుంపుగా చేరారు. చేతికందిన దానితో కొట్టబోయి వాడి పరిస్థితిని చూచి కొంచెం వెనక్కి తగ్గారు.

అయ్యా! "నా ప్రాణాలు పోయేటట్టున్నాయి. నన్ను వైద్యుని దగ్గరకు చేర్చి పుణ్యం కట్టుకోండి" అని దీనాతిదీనంగా వేడుకున్నాడు. గుంపులోని గోవిందయ్య ఒకడు "ఒరేయ్. నువ్వు చస్తే లోకానికేదో పెద్ద కొరత ఏర్పడబోతుందన్నట్లు అరుస్తావే. నీవల్ల అందరికీ కీడు తప్ప మేలెవరికైనా జరుగుతుందా? చీడపురుగులాంటి నీకు ఇటువంటి శాస్తి జరగాల్సిందే. నీవు చస్తే కళ్ళారా చూడాలి. పీడ విరగడైందని మేమంతా సంతోషించాలి" అన్నాడు.

అన్నలారా! నా భార్య అవిటిది. నా పిల్లలు పసికూనలు. నేను పోతే వాళ్ళు అనాధలై పోతారు అంటూ బ్రతిమలాడాడు. అబ్బో! సరే లేవోయ్. నీవు దొంగతనం చేసిన ఇంట్లోని వారంతా అనాధలైపోలేదా? దాచుకున్న సొత్తంతా దోచుకుపోబట్టి ఎంతమంది ఆడకూతుళ్ళకు పెండ్లికాక మోడులైపోలేదు. రేయనక పగలనక చెమటోడ్చి కష్టపడి దాచుకున్న కష్టార్జితాన్ని పోగొట్టుకుని ఎంత మంది పిల్లల చదువులు ఆగిపోలేదు? చికిత్స నిమిత్తం దాచిపెట్టుకున్న సొమ్మును కాజేసిన కారణంగా ఎంతమందికి వైద్యం అందక చచ్చిపోలేదు. ఎప్పుడొచ్చి పడతాడోనని రాత్రిళ్ళు కంటిమీద కునుకు లేకండా గడిపాము గదరా! ఇంత మంది ఉసురు పోసుకున్న నీపై దయ చూపవలెనా? అవసరం లేదు. ఇంతకాలానికి దేవుడే నీకు శిక్ష వేసి దొరికేలా చేశాడు. ఒకవేళ నీకు ఇలా జరిగి వుండకపోతే, ఎంచక్కా తప్పించుకొనిపోయి మరలా కసిగా మా ఇంటికే వచ్చి దొంగతనం చేయవా? ఇపుడు వదలివేసినా తగిలిన దెబ్బలు నయమైనాక నీవు మరలా ఒరగబెట్టేది దొంగతనమే గదా! ఇలా గుంపులోనివారంతా తలోమాట అంటూండగా గ్రామపెద్ద అక్కడికి వచ్చాడు. జరుగుతున్నది చూచి చాలా బాధపడ్డాడు.

"మీలో జాలి, దయ, కరుణ ఏమీ లేవా? ఒకమనిషి చావుబతుకుల్లో వుంటే అవకాశం దొరికింది కదా అని ఇలాగేనా మాట్లాడేది? చాలాతప్పు. ముందు వైద్యుని దగ్గరకు చేర్చుదాం. పోగొట్టుకున్న సొమ్మును ఏనాటికైనా సంపాదించు కోవచ్చు. ప్రాణాలు పోతే ఏమి చేసినా తిరిగి సంపాదించలేం. ప్రాణాపాయ స్థితిలోని వారినెవరినైనా రక్షించడం మానవత్వం"అని జనానికి నచ్చజెప్పాడు గ్రామపెద్ద. ఆయన మాటలు అందరికీ న్యాయ సమ్మతంగానే అనిపించాయి. అప్పటికే స్పృహ కోల్పోయాడు దొంగ. అందరూ కలసి వైద్యుని దగ్గరకు చేర్చారు.

కొద్ది రోజులకు దొంగ కోలుకున్నాడు. తనింకా బ్రతికుండడం చాలా ఆశ్చర్యం కలిగించింది. గ్రామ పెద్దలాంటి మంచివాళ్ళు ఉన్నందువలననే ఈ లోకంలో ధర్మం బ్రతికి బట్ట కట్టివుంది. లేకుంటే నాకు ఆనాడే నూకలు చెల్లివుండేవి. ఇలాగే అందరికీ మంచి జరగాలంటే తనుకూడా దొంగతనం చేయడం మానేసి కాయకష్టం చేసి బ్రతకాలి అనుకున్నాడు. రాక్షస బ్రతుకుకు ఇక స్వస్తి చెప్పాలని నిశ్చయించుకున్నాడు.

తగిలిన గాయాలన్నీ మానిపోయిన తర్వాత ఒకరోజు రక్షకభటుల దగ్గరకు వెళ్ళి లొంగిపోయి, చేసిన తప్పులన్నీ ఒప్పేసుకున్నాడు. శిక్ష పడింది. శిక్ష ముగిశాక కష్టం చేసుకుంటూ, కష్టాలలో వున్నవారికి తనకు చేతనైన సహాయం చేస్తూ జీవించ సాగాడు. తన పరివర్తన తనకెంతో తృప్తిని కలిగించింది. జీవితానికి ఒక పరమార్ధాన్ని తెచ్చిపెట్టింది.

రాక్షసుడు - మానవుడుగా, మానవుడు - మనిషిగా, మనిషి - మహా మనీషిగా, మహా మనీషి - మహనీయుడుగా పరివర్తన చెందినపుడే జీవితం సార్థకమైనట్లు. మనిషి తనను తాను నిర్వచించుకోవాలి. తన జీవితానికి తానే అర్థం చెప్పుకోవాలి. తన విలువలను తానే సృష్టించుకోవాలి. తనకుతానే వ్యక్తిగతంగా బాధ్యత వహించాలి. తన పనులకు తానే జవాబుదారి కావాలి. ఇంతకంటే బాగా చెయ్యలేమా? ఎలా చేస్తే బాగుంటుంది? అని ప్రశ్నించుకుంటూ వదిమందిని కలుపుకుని, స్నేహాన్ని పంచుకుంటూ, మంచితనాన్ని పెంచుకుంటూ, ఓర్పుతో, నేర్పుతో పనులు చేస్తూ పోతే... ఎవరు చేశారు? ఎలా చెయ్యగలిగారు? చేస్తే ఇలాగే చెయ్యాలి! జీవిస్తే ఇలాగే జీవించాలి! శహభాష్! వారు కాబట్టి చెయ్యగలిగారు. మరొకరు చెయ్యలేరు. అనిపించుకోవచ్చు. జీవించడం అంటే అదే. జీవితం కావాలి వ్యక్తి హితం, సమాజ హితం, దేశహితం.

* "కుటుంబం కోసం త్యాగం చేసేవాడు ఉన్నతుడైతే, దేశం కోసం త్యాగం చేసేవాడు మహాత్ముడౌతాడు."

ఈ మాయామయ జగత్తులో ఎలా జీవించాలి?

సత్యం ఉండాలి, సమర్ధత ఉండాలి. స్వేచ్ఛ ఉండాలి, బాధ్యతలు ఉండాలి. సన్యాసం ఉండాలి, సంసారం ఉండాలి. నాకేమీ తెలియదనుకోవాలి. నేనేమీ కాను అని ఒదిగి ఉండాలి. నేను జ్ఞానిని, నాకన్నీ ఉన్నాయి, నాకు అందరూ కావాలి. నేను ఫలానా అని ఎదుగుతూ ఉండాలి. ఇలా సమయా సందర్భాలనుబట్టి అహంకారం లేకుండా, క్రుంగకుండా, పొంగకుండా, దేనినీ వదలకుండా, ఎందులోనూ ఇరుక్కోకుండా "తామరాకుపై నీటి బొట్టులాగా", సూత్రధారిని గుర్తుంచుకొని, పాత్రధారిగా జీవించగలిగితే ప్రపంచంలో ఏవీ బాధించ జాలవు, తృప్తికరమైన మరణం పొందగలం.

* జీవితం ఒక నాటకం. ఎవరి పాత్రలో వారు జీవించాలి. చక్కగా పోషించాలి. రంగస్థలం నుండి వైదొలగాలి. ఉపకారం లేని జీవితం, మమకారం లేని స్నేహం, ఓంకారం లేని మంత్రం, ప్రాకారం లేని మందిరం, నమ్మకం లేని దాంపత్యం గౌరవింపబడవు. కాబట్టి ఈ సమాజం నిన్ను గౌరవించాలంటే ముందు నీమీద నీకు నమ్మకం కలిగేలా తీర్చి దిద్దుకోవాలి.

దేవుడిదేముంది? అంతా నాదేకదా!

ప్రతిసారీ దేవుడంటావే! ఏమిటి దేవుడు? నా చదువేదో నేనే చదివాను. నా ఇల్లు నేనే కట్టుకున్నాను. నా ఉద్యోగం నేనే సంపాదించుకున్నాను. నేనే ఒక పిల్లను ఇష్టపడ్డాను. పెండ్లి చేసుకున్నాను. పిల్లలూ నావల్లే పుట్టారు. నా బ్రతుకేదో నేనే బ్రతుకుతా, నా చావేదో నేనే చస్తా. ఇలా ప్రతిదానిలోనూ నా ప్రమేయమే ఉండగా దేవుడు, దైవం అంటారు అందరూ. ఏంటి భగవంతుడు? దేవుడి పేరెందుకనుకోవాలి? ఆయనమీద నేనెందుకాధారపడాలి? నా భారాన్నంతా ఆయనమీద ఎందుకు వెయ్యాలి? ఆయనెవరసలు? అని ఒక నాస్తికుడు ఒక సాధువుని నిలదీశాడు.

అంతా మౌనంగా విన్నాక సాధువు నిజమే నాయనా! అన్నింటికీ నీవే బాధ్యుడివి. ఈ దేహం నీదే, కానీ నీ ఇష్టప్రకారమే మలచుకున్నావా? అందులో ప్రాణాన్ని నీవే నింపుకున్నావా? నీ చావేదో నీవే చస్తావ్. అది ఎటూ తప్పనిసరే. కానీ నీవే చస్తావా? పది మంది చావుకు కారణమౌతావా? చంపబడతావా? చస్తావా? ఎలా చస్తావ్? ఎక్కడ చస్తావ్? ఆ తంతు ఎప్పుడు కానిస్తావో చెప్పగలవా? ఈ ప్రశ్నలు విన్నాక నాస్తికుడు సమాధానం చెప్పలేక నోరెళ్ళబెట్టాడు.

ఎందుకు నాయనా! విర్రవీగుతావు? ఏదో నీ జీవితం నజావుగా సాగుతున్నందులకే గదా ఈ మిడిసిపాటు. ఎంతోమంది దీనులు మన కళ్ళెదుటే ఎన్నో కష్టాలు పడటం కనిపించుట లేదా? వారికి లేని సౌకర్యాలు, సుఖ-సంతోషాలు నీకు భగవంతుడు ఇచ్చినందుకు కృతజ్ఞతతో వ్యవహరించక, ఇలా గర్వపడటం మంచిది కాదు నాయనా! 'నిన్ను చేసినవాడే, నీలో నింపినవాడే, నీ నుండి నిన్ను తీసిపారేసేవాడే దేవుడు. తెలిసిందా' అన్నాడు సాధువు. తల దించుకున్నాడు నాస్తికుడు నోటి మాట రాక.

తర్వాత సాధువు ఏదో రాసివున్న కాగితం చేతికిస్తూ చూడు నాయనా! మన జీవితం రెండు విధాలుగా సాగుతోంది. ఒకటి భౌతికవాద జీవితం. అంటే ఖరీదైన జీవితం. రెండవది ఆధ్యాత్మిక జీవితం. అంటే విలువలతో కూడిన విలువైన జీవితం. ఈ రెండూ ఇందులో సామాన్యగీతిలో రాసి వున్నాయి. నీవు దేనిని అనుసరిస్తావో నీ ఇష్టం. అయితే ఒక్కటి మాత్రం గుర్తుంచుకో. మొదటి దానిని అనుసరిస్తే ఎప్పుడో ఒకనాటికి రెండవ జీవిత విధానం కోసం తల్లడిల్లుతావు. ఎంతటివారికైనా ఈ స్థితి తప్పదు. అప్పటికి ఆ పరమాత్మ కరుణించి నీకు జీవితాన్నుంచగలిగితే మంచిదే. లేదంటే అసంపూర్ణంగానే నీ జీవితం ముగిస్తుంది' అన్నాడు.

ఆ నాస్తికుడు సరేనంటూ తల వూపి ఏకాంతంగా కాగితం మడత విప్పాడు.

మానవ జీవితం		
భౌతిక జీవితం (విలువైన జీవితం)		ఆధ్యాత్మిక జీవితం (విలువలతోకూడినజీవితం)
ధనం :	బంగారు, భవనాలు, స్థలాలు, పొలాలు, తోటలు, వస్తు, వాహనాలు, మందీ, మార్బలం ఇంకా ఇంకా సంపాదించాలి. ఎంతకైనా దిగజారి డబ్బు మాత్రమే సంపాదించాలి.	సహజ జీవితం
మద్యం :	బాగా తాగాలి, మత్తులో మునిగి పోవాలి,ఆనందపు టంచులను తాగాలి. ప్రతి రోజు వీలైనంత మత్తులో తూలి తేలియాడాలి, అన్నీ మరచిపోయి మహదానందంలో ఉండిపోవాలి.	సరళ జీవితం
మానం :	అందాలను అనుభవించాలి, ఆనందాలను జుర్రుకోవాలి. రేయి, పగలు మరచి పోవాలి. నిత్యయవ్వనంతో నవనవలాడుతూ ఆరోగ్యంగా, అందంగా ఉండాలి.	సహన జీవితం సహ జీవితం
స్థానం :	అర్థదారిగానీ, దోడ్డిదారిగానీ, దొంగదారిగానీ అందరికంటే ముందుండాలి. అందలాలనెక్కాలి, అందరికీ పెత్తందారుగా ఉంటూ, అందరిమీద పెత్తనం చెలాయించాలి. అందరూ పొగడాలి, పూలమాలలతో, బిరుదులతో ఘనసత్కారాలను పొందాలి.	సత్య జీవితం

ప్రపంచాన్ని మార్చడానికి నేనెవర్ని?

ఒక భక్తుడు ఈ లోకం తీరును బాగా చూచి, ఆలోచించి, విశ్లేషణ గావించి ఒక నిర్ధారణకు వచ్చాడు. ఈ ప్రపంచం ఏమీ బాగాలేదు! అని బాధపడుతూ భగవంతుడినిలా వేడుకున్నాడు. "ఎవ్వడూ నన్ను సరిగా అర్థం చేసుకోవడం లేదు, ఒకవేళ అర్థం చేసుకున్నా తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. నాకే గనక శక్తి వుంటే ఎక్కడిదక్కడ ఎలా ఉండాలో మార్చివేసి వుండేవాడిని. కానీ లేదు. ఓ భగవంతుడా ఈ ప్రపంచాన్ని మార్చే శక్తిని ప్రసాదించు".

చాల సంవత్సరాలు గడిచాయి. ఈ భక్తుని విన్నపాన్ని భగవంతుడు విననూలేదు, ఈయనగారు ప్రపంచాన్ని మార్చనూలేదు. భక్తుడు ముసలివాడైనాడు. "ఓ భగవంతుడా! నేనెవర్నీ మార్చలేకపోయాను. ఇప్పటికే ఎంతో కాలం గడచిపోయింది. కనీసం నా కుటుంబాన్నైనా మార్చే శక్తిని నాకివ్వు" అని భగవంతుడిని ప్రార్థించాడు.

చాల సంవత్సరాలు గడిచాయి. కుటుంబంలోనివారు కూడా పెద్దవారయ్యారు. భక్తుడు ఇంకా వృద్ధుడైనాడు. భక్తుడు తనలో తాను మరలా ఇలా ప్రార్థించాడు. "ఓ భగవంతుడా! నేనెవరినీ మార్చలేకపోయాను. నావల్లేమీ కాలేదు. కాదు. కాబోదనికూడా తెలుసుకున్నాను. కనీసం నన్నైనా మార్చి నాకు శాంతిని ప్రసాదించు" అని.

అప్పుడు భగవంతుడు ప్రత్యక్షమై ఈ కోరిక ముందే అడిగివుంటే, ఎపుడో ప్రసాదించి వుండేవాడినికదా! అని ఆశీర్వదించాడు.

* దృష్టి మారితే సృష్టి మారుతుంది.
* నీవు ఏ దృష్టితో చూస్తే సృష్టి అలాగే కనిపిస్తుంది.
* ఈ ప్రపంచంలో ఏది జరిగినా అది సవ్యంగానే ఉందని తెలుసుకో. నీవు కేవలం సాక్షివి మాత్రమే.

ఈత ఒక విద్య

ఈ ప్రపంచంలో ఎవరూకూడా పుట్టుకతో జ్ఞానవంతులుగా రాలేదు. ప్రయత్నంకొద్దీ, పరిసరాలు, పరిస్థితుల ప్రభావాన్ని బట్టి జ్ఞానవంతులుగా రాణించినవారే.

పూర్వం ఒక పండితుడు పాదచారుడై యాత్రలు చేస్తూపోతూవున్నాడు. దారిలో ఒక నదిని దాటవలసివచ్చింది. నది నిండుగా ప్రవహిస్తూ వుంది. ఒడ్డున ఒక బెస్తవాడు తెప్పనొక దానిని ఉంచుకొని వుండడం చూచి, అతనితో మాట్లాడి అవతలి ఒడ్డుకు పోవుటకు ఏర్పాటు చేసుకున్నాడు. ఇరువురూ తెప్పలోకి ఎక్కారు. బెస్తవాడు తెప్పను నడుపుతూవుండగా పండితుడు ఏదో ఆలోచిస్తూ ఏదో ఊహ వచ్చి బెస్తవానితో ఓయీ! నీవేమైనా తర్క విద్యను అభ్యసించితివా? అని అడిగాడు. బెస్తవాడు పడవను నడుపుతూ లేదని చెప్పాడు. తర్వాత కాలక్షేపం కొరకు పండితుడు బెస్తవానితో ఈ విధంగా సంభాషించడం మొదలుపెట్టాడు.

పండితుడు : నేర్చుకోలేదా! తర్కవిద్యను నేర్చుకోని జీవితం కూడా ఒక జీవితమేనా? అయ్యో! నీ జీవితంలోని పాతిక భాగం వ్యర్థమైపోయిందిగదరా అమాయకుడా.... సరే! ఎపుడైనా వీలు చూచుకొని నాబోటి పండితుల దగ్గర నేర్చుకొని బాగుపడు. సరేగానీ "మీమాంస" ఏమైనా చదివితివా?

బెస్తవాడు : అయ్యా స్వాములూ! మీమాంస అంటే ఏమిటో అస్సలు తెలియదు. కానీ "మాంసం" సంగతి మాత్రం బాగా తెలుసు.

పండితుడు : ఓరి వెర్రివాడా! 'మీమాంస' శాస్త్రం నేర్చుకొనని వాడెవడైనా ఉండునా? అయ్యో! నీ జీవితంలో మరొక పాతిక భాగం వృథా చేసుకున్నావు గదరా వెర్రివాడా. తర్క, మీమాంస శాస్త్రాలు చదవనోడివి ఇక జ్యోతిష శాస్త్రాల జోలికేం పోయివుంటావ్ నీ జీవితంలో ముప్పావు భాగం దండుగ చేసుకున్నావు గదరా అమాయకుడా!

ఈ ప్రకారంగా పండితుడు మాట్లాడుతూండగా పడవ సరిగ్గా మధ్యభాగాని కొచ్చింది. ఇంతలో ఉన్నట్టుండి పెద్ద గాలి-వాన మొదలైంది. ప్రవాహవేగానికి తోడు గాలి తాకిడి ఎక్కువైంది. వర్షపునీరు తెప్పలోకి మెల్లమెల్లగా రాసాగింది. దానితో బెస్తవాడికి తెప్ప నడపడం అసాధ్యమౌతోంది. ఈ విపత్కర పరిస్థితులలో బెస్తవాడికి ఏమీ తోచక

పండితునితో "అయ్యా మీకు ఈత విద్య వచ్చునా? అని అడిగాడు. రాదని జవాబు చెప్పాడు. ఐతే మహాప్రభో! మీరు తెలిపిన విద్యలు నేను చదవనందున నా జీవితంలో ముప్పాతిక మాత్రమే నాశనమయింది. 'ఈత విద్య' నేర్చుకోనందున మీ జీవితం మొత్తం నాశనమవబోతోంది పో! అని బెస్తవాడు నీటిలోకి దూకి ఈదుకుంటూ వెళ్లి పోయాడు. మరి కొంతసేపటికి పడవ మునిగిపోగా పండితుడు గంగార్పణమయ్యాడు.

సృష్టిలో ఒక్క మనిషికి మాత్రమే స్వతహాగా ఈత రాదు. అన్ని జీవులకు పుట్టుకతోనే ఈత విద్యను ప్రసాదించిన ప్రకృతి మనిషికెందుకు ప్రసాదించలేదు?

ప్రకృతి మనిషికికూడా ఈత విద్యను ప్రసాదించి ఉంది. ఇతర జీవుల వలనే తానుకూడా ప్రకృతి ననుసరించి జీవిస్తూ ఉండి ఉంటే ఈత విద్యను ప్రత్యేకంగా నేర్చుకోవలసిన అవసరం వచ్చివుండేది కాదు. ప్రకృతిని విస్మరించి, అతి తెలివి తేటలతో, కృత్రిమ జీవన విధానాన్ని అనుసరిస్తున్నందున ఈత విద్యకూడా మనిషికి దూరమైంది. అందువలననే మనిషి బుద్ధితో స్వయంగా, ప్రయత్నపూర్వకంగానే ఈత నేర్చుకోవాలి. అలాగే బ్రహ్మవిద్యను కూడా స్వశక్తితోనూ, శ్రద్ధతోనూ తెలుసుకుని, సంసారసాగరమును దాటి దేవుడిచ్చిన జన్మను తరింపజేసుకోవాలి.

అంతా వట్టి బూటకమే

ఒక గురువు దగ్గర శిష్యుడొకడు హఠయోగమును అభ్యసిస్తూవున్నాడు. గురువు నేర్పించిన విధంగా శిష్యుడు ప్రతిరోజు యోగాభ్యాసం చేస్తూ ఉండేవాడు.

ఒకనాడు హఠయోగి యోగాభ్యాసం చేయుచుండగా నిశ్చలుడై మెలికలు తిరిగి నిర్జీవుడై పడిఉన్నాడు. ఇంటిలోనివారు చూచి, అతడు మరణించెనని తలచి పెద్దగా ఏడవసాగారు. వారి ఏడుపులు విని ఇరుగు-పొరుగువారు పరిగెత్తుకొని వచ్చి అతడు పడివుండు రీతిని చూచి అతడు చనిపోయాడని భావించారు.

ఎంత ఏడ్చినా ఏమి లాభం? చచ్చినవారు మరలా వత్తురా ఏమి? పోయినవారి వెంట మనమూ పోలేముగదా! అని పరితపిస్తూ, ఏడుస్తూ, అతని భార్యను ఓదారుస్తూ వచ్చిన బంధువులు తక్కిన తంతును నిర్వహించే నేపథ్యంలో శవాన్ని బయటకు తెచ్చేటపుడు మెలికలు తిరిగివుండిన శరీరానికి ద్వారబంధం అడ్డు తగిలింది. అందుకని ఒకడు గొడ్డలిని తెచ్చి ఆ ధ్వారబంధాన్ని తెగగొట్టుటకు ప్రయత్నించాడు.

పాపం! ఎవరెంత చెప్పినా వినకుండా ఏడుస్తూవున్న ఆ హఠయోగి భార్య గొడ్డలి చప్పుడు వినగానే ఏడుపు ఏమైందో ఏమో పరుగు పరుగున వెళ్ళి ఇది ఏమి? మీరేం చేస్తున్నారు? ద్వారబంధాన్ని విరగ్గొడుతున్నారెందుకు? అని అడిగింది. విషయం చెప్పారు వారు.

"బాగు బాగు. మీరు ఆ పని చేయవద్దు. నేనిపుడసలే దిక్కులేని వితంతువు నైనాను. చంటి బిడ్డలను పోషించుకోవలసినదాన్ని నేను. మరలా ద్వారబంధాన్ని బాగు

చేయించుకోలేను.నా మగడు ఎటూ చచ్చినాడుగదా! అయిందేదో అయిపోయింది. ఆ పీనుగ ఎలా అయితేనేమి? ఆయన కాళ్ళు, చేతులు నరికి తీసుకొని పొండి" అని భార్య చెబుతూఉండగా హఠయోగి తాను వేసిన భంగిమ యొక్క ప్రభావం తగ్గిపోగా హఠాత్తుగా లేచి కూర్చున్నాడు. భార్య నోటి వెంట వచ్చిన మాటలు విని ఓసి రాక్షసీ! నా కాళ్ళు, చేతులు నరకమని చెప్పుచున్నావా! నిన్న మొన్నంతా ఒలకబోసిన ప్రేమంతా వట్టి బూటకమేనా? అని కేకలు పెట్టి, మనసు విరిగి, ఇల్లు విడిచిపెట్టి ఎటో వెళ్ళిపోయాడు.

సుఖ - దుఃఖాలు

వేసవి కాలంలో ఎండ బాధ. చలి కాలంలో చలి బాధ.

వర్షాకాలంలో బురద బాధ. గాలి కాలంలో దుమ్ము బాధ.

లేని వాడికి ఆకలి బాధ. ఉన్న వాడికి అజీర్తి బాధ.

ఈ లోకమంతా సుఖ-దుఃఖాలమయం. చీకటి-వెలుగు, రాగం-ద్వేషం, లాభం-నష్టం, ఎత్తు-పల్లం, నీరు-నిప్పు, పాపం-పుణ్యం, మంచి-చెడు, స్వర్గం-నరకం, తప్పు-ఒప్పు ఇలా ఏది చూచినా ఈ రెండూ లేకుండా కనిపించవు.

ఈ బాధలను, వ్యత్యాసాలను తప్పించుకునే వీలుందా? వీలు లేనేలేదు. కొంచెం ఓపిక వదితే అన్ని బాధలు తొలగిపోతాయి. కానీ మనిషి ఏకపక్షంగా ఊహించుకోవడంవల్ల, ఆశించడం వల్లనే ఎక్కువ బాధలకు లోనవుతున్నాడు. ప్రతి మనిషి లాభమే పొందాలనీ, నష్టమే రాకూడదనీ, సులభంగానే ఉండాలనీ, కష్టమే కలగకూడదని కోరుకోవడం వల్లనే బాధలకు గురవుతున్నాడు.

ఈనాటి జఠిలమైన సమస్య రేపటికి కాస్త తగ్గుతుంది. మరునాటికి ఇంకాస్త తగ్గుత్తుంది. ఇలా మాసం గడచిన తర్వాత సమస్యనే మరచిపోతాము. కొంచెం ఓపిక వదితే అన్ని బాధలూ తొలగిపోతాయి. సమస్యలకు పరిష్కారాలు, మనసుకు సుఖం, సౌఖ్యం ఇచ్చేవి ఏవి? ఒకవేళ వుంటే వాటిల్ని అంది పుచ్చుకోవడమెలా? అనే వాటిగురించి ఆలోచన వృధా. సమస్యలు లేని జీవితమే ఉండదు. కావలసిందల్లా మనోనిగ్రహమే.

బాధ్యతను వదలి పారిపోయినా సమస్య పరిష్కారం కాదు. ప్రారబ్దరీత్యా దాపురించే సుఖ-దుఃఖాలు నీ కోసం కాచుకునేవుంటాయి. అవి ముందుగా నిన్ను సంప్రదించి రావు. కనుక నీవు కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించు. కాలం కలసి వస్తే, నీ ప్రయత్నలోపం ఏమీ లేకుంటే, దేవుని అనుగ్రహం ఉంటే సఫలీకృతుడవవుతావు లేదా కర్తవ్య పరాయణుడవవుతావు.

సాధించగలనా? ఫలితం దక్కుతుందా? లేదా? ఏమవుతుందో ఏమో? అని ఆందోళన చెందినంతమాత్రాన పనులు సమకూరవు. ప్రయత్నంలో తడబాటుకు తావిస్తే కష్టం, నష్టం. ఓటమి తప్ప మరొకటి ఉండదు. కానున్నది కాకమానదు. అనుభవించవలసిన ఫలం నీ కోసం కాచుకునేవుంటుంది. అది ఎలాగూ తప్పదు. కాబట్టి గట్టి ప్రయత్నం చేస్తూ, ఫలితం భగవంతునికి వదలివేయాలి.

బాహ్య సౌకర్యాల ద్వారా ఒనగూడేది శారీరక సుఖం. నీతి, నియమాలతో, ధార్మిక విలువలతో జీవించడం ద్వారా పొందేది మానసిక ఆనందం. జీవితంలో గెలుపోటములు ముఖ్యం కాదు. ఎంచుకున్న జీవన మార్గం ముఖ్యం. ఆదర్శాల కోసం, ధర్మస్థాపన కోసం చేసే నిస్వార్థ ప్రయత్నంలోనే నిజమైన ఆనందం ఉంటుంది.

సమస్యలూ, శత్రువులు ఉండని జీవితమే లేదు. ఎంతటి ఐశ్వర్య వంతుడికైనా ఏదో ఒక సమస్య, మరేదో ఒక కష్టం ఉండనే ఉంటుంది. ఇది ప్రకృతి నియమం. జీవితంలో ఎలాంటి సంఘటనలైనా జరగవచ్చు. పరిస్థితులు ఏనాడూ ఒకే రీతిలో ఉండవు. అలాగని మన మనోప్రవృత్తి దానికనుగుణంగా మారకూడదు. మన ప్రవర్తన వలన అంతఃకరణ శుద్ధికి ఏమాత్రం భంగం కలగకూడదు. గాలివాటం బ్రతుకులు కాకూడదు. మంచిలో చెడు, చెడులో మంచి, కష్టంలో సుఖం, సుఖంలో కష్టం, తప్పులో ఒప్పు, ఒప్పులో తప్పులు జీవితంలో తప్పవు. వాటిని ఎప్పటికప్పుడు సమర్థవంతంగా పరిష్కరించుకోగలిగిననాడు తృప్తి చెందుతూ, పరిష్కరించలేనినాడు విరక్తి చెందకుండా ఆశాభావంతో అడుగు ముందుకేయాలి. "వెన్నెల కొన్నాళ్ళు చీకటి కొన్నాళ్ళు". "జీవితమే చీకటి వెలుగుల సయ్యాట".

* పండుగలో ఫలహారాలు, ఆ తర్వాత పచ్చడి మెతుకులే పరమ రుచులు.

పూలపాన్పులు, పరిమళ ద్రవ్యాలు, అంగ సౌష్టవాలు, అంద-చందాలు, భోగభాగ్యాలు, ఆస్థి-పాస్తులు, విలాస వస్తువులు ఇవేవీ మనిషికి ఆనందదాయకాలు కావు. అలాగని వీటిని విసర్జించమని కాదు. అవి కేవలం తాత్కాలికానంద ప్రేరకాలుగా గుర్తించి, వాటిపై అభిమానాన్ని వ్యామోహాన్ని పరిమితం చేసుకోవాలి.

* ఎటువంటి సుఖమైనా దుఃఖంతోనే అంతమౌతుంది. అందుకే అంటూ ఉంటారు "జీవితంలో బాగా అనుభవించాడు. ఇప్పుడు అనుభవిస్తూ జీవిస్తున్నాడు" అని.

ఆనందమయమైన జీవితం కావాలనుకున్నప్పుడు ఎవరైనా జ్ఞానేంద్రియాలను అదుపులో ఉంచుకోవాలి. తనకు తాను సంస్కరించుకోవాలి. జీవితం సుఖమయం కావాలంటే కొన్ని సమయా సందర్భాలలో తగిన నిర్ణయాలు వెంటనే తీసుకోగలగాలి. వివేకంతో మెలగాలి. అవకాశాన్ని చేజార్చుకుంటే ఆవేదనను మిగుల్చుతుంది. సుఖపడాలని ప్రయత్నించినంత వరకూ నీవు సుఖపడలేవు. నీవే సుఖం అని తెలుసుకున్నప్పుడు మాత్రమే సుఖపడగలవు.

* కష్టం తరువాత సుఖం - స్వర్గం. సుఖం తర్వాత కష్టం - నరకం.

సీతాఫలం నేర్పిన జీవిత రహస్యం

బాహుదా నదీ తీర ప్రాంతంలో ఆశ్రమం నిర్మించుకొని ఒక స్వామీజీ ఉండేవాడు. ఆశ్రమానికి సమీపంలోని గ్రామంలో ఉండే రామాలయంలో ప్రవచనం చెప్పేవాడు. ఆకర్షణీయమైన, ఆసక్తి కరమైన ఆధ్యాత్మిక విషయాలను వినేదానికి చాలా మంది వచ్చేవారు.

ఓసారి స్వామీజీ ఉపన్యసిస్తుండగా, శిష్యబృందం ఒక మనిషిని భుజాలపై మోసుకొని వచ్చారు. ఆ మనిషి బాగా తడిసిపోయి ఉన్నాడు. శిష్యులలోని ఒకడు "గురువర్యా! ఇతడు నదిలో కొట్టుకొని పోతూండగా రక్షించి తీసుకొని వచ్చాం" అన్నాడు. వెంటనే స్వామీజీ "అతనికి పొడిబట్టలను ధరింపజేసి, సపర్యలు చేసి, విశ్రాంతినివ్వండి" అని చెప్పాడు.

అతడు కాస్త ఉపశమనం పొందాక 'నదిలో ఎలా పడిపోయావు నాయనా?' అని అడిగాడు స్వామీజీ.

స్వామీజీ 'నేను పడిపోలేదు, చనిపోదామనే నదిలో దూకాను అన్నాడు వైరాగ్య భావంతో. ఎందుకలా చేశావు? అని వాత్సల్యంతో ప్రశ్నించాడు స్వామీజీ. నా జీవితంలో అన్నీ కష్టాలే స్వామీ! ఏ పనిచేసినా కలసిరావడం లేదు సరికదా ఏవేవో క్రొత్త సమస్యలు, ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. ఎంతకాలం ఈ వెతలు? ఇక భరించలేక బ్రతుకు మీద ఆశ వదులుకొని ఈ పనిచేశాను అని దీనంగా చెప్పాడు.

అతని బాధలన్నీ శాంతంగా చిరునవ్వుతో విన్నాడు స్వామీజీ. 'నాయనా నీవు చాలా నీరసంగా ఉన్నావు. ఇదిగో.... ముందు ఈ పండు తిను' అంటూ ఒక సీతాఫలాన్ని అతనికి ఇచ్చాడు. అతడు బాగా ఆకలి మీద ఉన్నాడు కాబోలు - ఆవురావురుమంటూ తింటూ గింజలను ఉమ్మేస్తూ తినడం పూర్తి చేసాడు.

స్వామీజీ ప్రసన్న వదనంతో అతనివైపు చూస్తూ "నాయనా! పండంతా తినేశావు. కానీ గింజలను మాత్రం ఉమ్మేశావు ఎందుకు?" అన్నాడు.

స్వామీజీ ప్రశ్న విని అక్కడి వారంతా ఆశ్చర్యపోయారు. ఆ వ్యక్తి నవ్వుకుంటూ "ఇదేం ప్రశ్న స్వామీ! గింజలనెవరైనా తింటారా? అవి తినడానికి పనికిరావు కదా స్వామీ!" అన్నాడు. అందుకు స్వామీజీ చిరునవ్వుతో "తినేటప్పుడు గింజలు అడ్డురాగానే పండుతినడం మానెయ్యలేకపోయావా?" అన్నాడు. "పండు తియ్యగా, మధురంగా ఉంటే ఎలా వదులుకుంటాను స్వామీజీ! గింజలను ఉమ్మేసి, పండును తింటాం కదా?" అన్నాడు ఆ వ్యక్తి.

స్వామీజీ నవ్వుతూ "చాలా బాగా చెప్పావు. జీవితం కూడా ఈ సీతాఫలం లాంటిదే. గింజలను తొలగించుకుంటూ పండును తింటూ రుచిని ఆస్వాదిస్తున్నట్లుగానే జీవితంలో వచ్చే కష్టాలను ఓర్చుకుంటూ జీవితాన్ని జీవిస్తూ, అనుభవించాలి? ఔనా? కాదా?" అన్నాడు.

ఈ సన్నివేశాన్ని ఆసక్తిగా చూస్తున్న వారంతా ఆనందాశ్చర్యాలతో చప్పట్లు కొట్టారు. ఆ వ్యక్తికూడా తన తప్పును తెలుసుకొన్నాడు.

సీతాఫలం ద్వారా జీవిత రహస్యాన్ని అద్భుతంగా భోధించారు. ఇకపై ఇలాంటి తెలివితక్కువ పని చెయ్యను అని స్వామీజీ పాదాలకు నమస్కరించి ఇంటి దారి పట్టాడు ఆవ్యక్తి.

ఏది సుఖం?

ఒక రాజు నిత్యమూ ఏదో పోగొట్టుకున్నవాడిలా దిగాలుగా ఉండేవాడు. మంత్రిగారు రాజు దీనావస్థను చూచి తరచి తరచి కారణం అడిగాడు. కానీ రాజుగారు కూడా ఫలానా అని కారణం చెప్పలేకపోయాడు. రాజుగారికి ఏం తక్కువైంది? అందమైన రాణులు, విశాలమైన సామ్రాజ్యం, అపారమైన సైన్యం. అన్నీ ఉన్నా ఏదో అసంతృప్తి. కారణం తెలుసుకోలేకపోయాడు మంత్రి.

ఒకరోజు గొప్ప సాధువు రాజ్యంలోకి వచ్చాడు. మంత్రి ఆ విషయం చెప్పి "మీరు ఒకసారి ఆ సాధువు దగ్గరకు వెళ్ళి పరిస్థితిని తెలియజేయండి, మార్గం దొరుకుతుందేమో" అని సలహా ఇచ్చాడు.

వెంటనే రాజు ఆ సాధువు దగ్గరకు వెళ్ళి, వినయంగా తన మానసిక స్థితిని తెలియజేసి, ఉపశమన మార్గం బోధించమని వేడుకున్నాడు. ఆ సాధువు రాజుగారిని చక్కగా పరిశీలించాడు. మౌనంగా కళ్ళు మూసుకుని కాసేపయ్యాక రాజుగారికి ఒక చిన్న చిట్కా ఇలా చెప్పాడు. మీ రాజ్యంలో ఎవరైతే ఎప్పుడూ ఆనందంగా, నిత్యసంతోషిలా ఉంటారో వారిని వెతికి పట్టుకుని, వారు ధరించిన వస్త్రాన్ని అడిగి తీసుకుని ధరించినట్లయితే మీ మనోవేదన వెంటనే ఉపశమిస్తుంది.

వెంటనే రాజు తన భటులను రాజ్యం నలుమూలలకు పంపాడు. నిత్యసంతోషిని ఎక్కడున్నా వెదకి పట్టుకుని రండని ఆజ్ఞాపించాడు. "రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా"? తక్షణం రాజభటులు సుడిగాలిలా రాజ్యంలోకి దూసుకెళ్ళారు. ప్రతి గ్రామంలోనూ వెదికారు. ప్రతి గడపా గాలించారు. కొందరు ఫలానావారు సుఖసంతోషాలతో ఉన్నారని చెప్పారు. వారందరి దగ్గరకూ రాజభటులు వెళ్ళి విచారించారు. వారంతా తాము సుఖంగానే ఉన్నాము. కానీ, అన్నీ ఉన్నా పుత్ర సంతానం లేదని కొందరు. ఉద్యోగం దొరకలేదని కొందరు. చేతికి అందివచ్చిన కొడుకు చనిపోయాడని కొందరు... ఇలా అందరూ ఏదో ఒక దుఃఖంతో, బాధతో ఉన్నట్లుగానే చెబుతూ వచ్చారు. చిట్టచివరగా ఒక మారుమూల ప్రాంతంలో ఒకడున్నాడని తెలుసుకుని అక్కడకు వెళ్ళారు. రాజభటులు వెళ్ళేసరికి వాడు చెట్టు కొమ్మలపై నుండి దుముకుతూ ఆనందంగా ఆడుకుంటున్నాడు. అక్కడున్నవారంతా "వాడెప్పుడూ ఆడుకుంటూ, పాడుకుంటూ, అందరితో తిరుగుతూ హాయిగా ఉంటాడు" అని చెప్పారు.

హమ్మయ్య! ఓ పనైపోయింది అని భటులు సంతోషపడి వాడిని పట్టుకెళ్ళి రాజుగారి దగ్గర హాజరుపరిచారు. రాజమహలు వాతావరణం అట్టహాసంగా ఉన్నా, రాజు ఎదురుగా ఉండినా వాడిలో అదురుగానీ, బెదురుగానీ లేదు. నిశ్చలంగా, అమాయకంగా, నిశ్చింతగా నవ్వుతూ నిలబడ్డాడు. వాడిని చూడగానే కోపం, అసూయ కలిగింది. సాధువు చెప్పినట్లు వాడి చొక్కాగా వాడే వస్త్రం అడుగుదామనుకుంటే వాడికి అసలు చొక్కాయే లేదు. విచారిస్తే ఇపుడేకాదు, వాడికి ఎపుడూ చొక్కాయే లేదట అని వాడే చెప్పాడు. వెంటనే రాజుకు జ్ఞానోదయమయింది. లేచి వెళ్ళి వాడిని ప్రేమతో కౌగిలించుకున్నాడు.

రాజుగారికి అన్నీ ఉన్నా, తాను చక్రవర్తినై ఉంటే బాగుండుకదా అని మనసు అంతరాళాలలో ఏదో వెలితి. ఉన్నదానితో తృప్తిపడక పోవడమే దానికి కారణం.

"తనకు లభించినదేదో దానిని ఆనందంగా అనుభవించడం, తనది కానిదానికోసం తపన పడకపోవడం" ఈ రెండే మనిషిని సుఖపెడతాయి. 'నాది' అనుకుంటే దుఃఖం. కాదను కుంటే సుఖం. "పుట్టేటపుడు వెంట ఏదీ తీసుకురాలేదు. వెళ్ళేటపుడు ఏదీ వెంటరాదు." మధ్యలో అనుభవించేదంతా ఇక్కడ ఎప్పటినుంచో ఉన్నదే. మనిషి దేనినీ సృష్టించలేడు. ఇక్కడున్న ఏ సంపదకూ మనిషి యజమాని కాదు. విశ్వానికి పరమాత్మ యజమాని. నీవు ఉన్నంతవరకే ఇంటికి యజమానివి. నీ మీద, నీ ఇంటిమీద భగవంతుడిదే అజమాయిషీ. కొంతకాలం ఉండి వెళ్ళేదానికి వచ్చిన అతిథివి మాత్రమే నీవు. అతిథిగా వచ్చినవాడు కొద్ది రోజులుండి, ఇంటిని, ఇంటిలోని సౌకర్యాలను వినియోగించుకుంటాడు, వెళ్లిపోతాడు. అంతే!

భూమి మీద మన ఉనికి కూడా అంతే. ఈ యథార్థాన్నిగనుక నీవు ఒంట బట్టించుకుంటే బ్రతుకంతా ఆనందమే. ఒంట్లో శక్తి, ఇంట్లో సంపదలు ఉన్నంత మాత్రాన మనిషి సుఖ- సంతోషాలను అనుభవించలేడు. అలా అనుభవించగలిగితే మరి బుద్ధుడు ఆనాడు తన రాజభోగాల్ని ఎందుకు వదులుకున్నాడు? నిన్ను నీవు ఎంతగా గుర్తిస్తావో, అంతగా సంతోషంతో, సంతృప్తితో, ప్రశాంతతతో జీవించగలుగుతావు.

ప్రతి అసౌకర్యం వెనుక ఒక సౌకర్యం, ప్రతి కష్టం వెనుక ఒక సుఖం దాగి ఉంటుంది.

ఒకనికి ప్రమాదంలో కాలు విరిగింది. ఆసుపత్రిలో చేర్చారు. ప్రక్కఊరికి వెళ్ళివున్న వాళ్ళనాన్న వచ్చాడు. కాలు విరిగిన బాధలో వాడుంటే, తండ్రి ధైర్యం చెప్పవలసిందిబోయి "చెబితే విన్నావట్రా మిడిమాలపు వెధవా! పడమటివైపు మీ అన్న ఇల్లు కట్టకముందే నీవు కట్టవద్దు, వాస్తు ఒప్పుకోదని నెత్తి, నోరూ మొత్తుకొని చెప్పాను. కానీ విన్నావా? ఇప్పుడు చూడు. కాలు విరిగి ఆసుపత్రిలో పడ్డావు. వాస్తుదోషం ఎంత

బలమైనదో చూశావా? ఇట్లా మొండి ఘట్టానివి కాబట్టే పెళ్ళై పదేండ్లయినా దేవుడు నీకు సంతానాన్ని ఇవ్వలేదు. అనుభవించు. అని చీవాట్లు పెట్టాడు. ఆసుపత్రిలో బెడ్‌పై పండుకొని, వాళ్ళ నాన్న అన్న మాటలు పదే పదేమదిలో మెదలాడగా, ఆలోచనలో పడ్డాడతను. నిజానికి అన్న ఇల్లు కట్టిన తర్వాతనే తమ్ముడు కట్టవలెనా? ముందుగా కట్టకూడదా? అయినా పెళ్ళై పదేళ్ళు గడిచాయి. ఇల్లు ఈ మధ్యనే ప్రారంభించాను. దానికి దీనికి ఏమిటి సంబంధం. ఎన్ని పరీక్షలు చేయించలేదు? ఎంతమంది డాక్టర్లు చూడలేదు. ఎన్ని మందులు వాడలేదు? అన్నీ బాగున్నాయి. దంపతులిద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారని అందరు డాక్టర్లు అంటున్నారు. మరి సంతానం ఎందుకు కలగలేదు?

ఫీల్డ్ సర్వేయర్‌గా ఉద్యోగం చేస్తున్న అతను రైతులు అడిగిన వెంటనే ఎండనకా, గాలనకా, వాననకా ఎంతో ఓర్పుతో పొలాలను కొలిచి సమస్యలు లేకుండా చేసేవాడు. ఒంట్లో నలతగా ఉన్నప్పటికీ 'డ్యూటీ ఫస్ట్ రెస్ట్ నెక్స్ట్' అనుకుంటూ పనులు చేసేవాడు. కాస్త మంచి పేరే సంపాదించాడు. కనుకనే చాలామంది మిత్రులు, బంధువులు, సహ ఉద్యోగులు, అధికార్లు వచ్చి 'తొందరగా కోలుకుంటావులే' అంటూ ధైర్యం చెప్పి వెళుతున్నారు. డాక్టర్లు మాత్రం మూడు నెలలకుగాని కాలు కుదుట పడదని తేల్చేశారు. ఆసుపత్రిలో మూడు నెలలుండాలి. ఎలా ఉండాలి? ఎంత హుషారుగా తిరిగేవాడిని? ఎన్ని పనులు చేసేవాడిని? అసలు కాలు బాగవుతుందో లేదో? ముందులాగా తిరగగలనో లేదో? అని దిగాలు పడిపోయాడు.

ఆలస్యంగా వార్త విన్న శ్రేయోభిలాషి అయిన ఒక మిత్రుడు వచ్చాడు. మిత్రమా భయపడకు, బాధపడకు. కానున్నది కాకమానదు. జరిగిందేదో జరిగిపోయింది. ధైర్యంగా ఉండు అన్నాడు.

నీకేంరా? ఎన్నైనా చెబుతావు. బాధ నాకుగదా వుంది. ఈ మూడు నెలలు పొద్దుపోయేది ఎలా? అని వగచాడు. ఏం పర్వాలేదు. మంచి వైద్యం అందుబాటులో వుంది. కాబట్టి నీ కాలు తొందరగా బాగౌతుంది. బాగా నడవగలవు. ఇపుడు చేయగలిగింది ఏమీలేదు కాబట్టి, కష్టంలోనూ సుఖం వెతుక్కోవడం విజ్ఞుల లక్షణం. కనుక ఈ మూడు నెలలూ నీవు ఒక జ్ఞానివైపో అన్నాడు మిత్రుడు. అదెలారా బాబు. కాలు కదపకూడదు, మెదపకూడదు. బాధ లేకుండా ఎలా ఉండాలి? అన్నాడు.

అంతా మన మంచి అనుకుని ధైర్యంగా ఉండాలి. చదవాలి అనుకుని చదవలేక పోయిన ఇష్టమైన పుస్తకాలను చదవవచ్చు. ఎపుడూ ఫీల్డ్‌మీద పోయే నీకు టి.వి.చూసే భాగ్యం ఎలాగూలేదు. ఇపుడు మంచి మంచి సీరియల్స్ చూడొచ్చు. నిన్ను చూడవచ్చేవాళ్ళతో ఎన్నో విషయాలు ముచ్చటించవచ్చు. నీకు ఏమి కావలెనో చెబితే అవన్నీ సమకూర్చేదానికి నేనున్నాను. ఇదికూడా 'ఒక రెస్ట్' అని భావించుకో.

సరేనా? అని చెప్పిన మిత్రవచనాలు అతనికి నిజంగా ఆనాడు అర్జునునికి గీతను బోధించిన కృష్ణుడు కనిపించాడు. కాలు విరిగిన బాధలోకూడా ఎంతోఉపశమనం, మరెంతో ధైర్యం, ఆత్మవిశ్వాసం, శాంతిని పొందగలిగాడు.

డాక్టర్లు చెప్పిన మూడు నెలల కాలం పూర్తయింది. మిత్రుని హితోపదేశ ప్రభావం బాగానే పని చేసినట్టుంది. మూడు నెలలు భారమనిపించలేదతనికి. డిశ్చార్జ్ చేశారు. ఇపుడు బాగా నడవగల్గుతున్నాడు. తర్వాత ఆరు నెలల కాలం గడిచింది. మరలా ఆ మిత్రుడు వచ్చాడు. పరామర్శలు అయిన తర్వాత ఏమైనా విశేషమున్నదా? అని అడుగగా ఇక ఆరు నెలలకు తండ్రిని కావచ్చు అని ఆనందాతిశయంతో చెప్పాడు. మిత్రుడు పరమానందభరితుడయ్యాడు.

ఇల్లు పూర్తయింది. గృహప్రవేశ కార్యం ఘనంగా జరిగింది. పండంటి పాపకు తండ్రి అయ్యాడు. కాలు విరిగితే విరిగింది. ఆసుపత్రిలో ఉంటే ఉన్నాడుగానీ చక్కటి పాపకు తండ్రి అయినందుకు పరమానందభరితులయ్యారు కుటుంబ సభ్యులంతా.

కాలు విరిగి ఆసుపత్రిలో ఉండడం వాస్తు దోషమా? పాపకు తండ్రి కావడం కాలు విరిగిన దోషమా? ఏది ఏమైనప్పటికీ పూర్తి విశ్రాంతి తీసుకున్న కారణంగా వీర్యం చిక్కబడి ఆరోగ్యవంతమైన కారణంగానే తండ్రి అయ్యాడన్న సంగతి ఎవరూ ఆలోచించలేదు.

* మనిషొకటి తలిస్తే దేవుడొకటి తలుస్తాడు.
* భగవంతుడాలస్యం చేయ్యవచ్చునేమో గానీ, అన్యాయం ఎన్నటికి చేయడు.
* ఎవరు ఎన్ని మాటలన్నా భగవంతుని నిర్ణయం ప్రకారమే జరిగి తీరుతుంది. ఈ క్షణంలో ఏమి జరుగుచున్నదో దానిని సమ్మతించి లీనమైపోవడమే మానసిక పరిపక్వత

కాసేపు కరెంటు పోతే గిలగిలా కొట్టుకుంటారు. "ఎంత ఉడక! ఎంత చెమట! ఎంత చీకటి! పాడు దోమల సంగీత మొకటి" అని విసిగివేసారిపోతారు. ఈ విధంగా అయిష్టం, ఆయాసం, అసహనంగా ఉంటే మన మనసే అదోలా అయిపోతుంది. శరీరంలోకి కీడు కలిగించే ద్రవాలు ఊరి అనారోగ్యాన్ని కలిగిస్తాయి. అలా ఆలోచనలో కొట్టుకునిపోరాదు. మనం బాధపడినంతమాత్రాన అది వస్తుందా? మనం తేగలమా? మన చేతిలోని పని కాదుగదా! పోయిన కరెంటు మరలా రాదా? వస్తుంది. కానీ శ్రమకు గురి కాకుండా ఉండిన శరీరానికి హఠాత్తుగా శ్రమ కలిగితే ఆ క్షణంలో, ఏమి చేయాలో తోచని అయోమయంలో ఉంటాముగనుక విసుగు సర్వసాధారణం.

కానీ కరెంటు వచ్చేదాకా డాబా మీదికి వెళ్లి, వెన్నెల్లో పచార్లు చేస్తూ, ఆకాశాన్నీ, నక్షత్రాలనూ, చందమామనూ చూస్తే ఎంత హాయి? ఎంత ఆనందం? ఎన్నాళ్ళకు ఇలా ఆకాశాన్ని చూస్తున్నాం? కరెంటు పోయిన పుణ్యమా అని ఈ అవకాశం దొరికింది అని అనుకోకుండా ఉండగలమా? ఈ ఆనందానికి వెలకట్టగలమా?

ప్రతి అసౌకర్యం వెనుక ఏదో ఒక సౌకర్యం, ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉండనే వుంటుంది. కనుగొని ఆనందించాలి. ఓపిక, ఆలోచన ఉంటే అన్నీ సవ్యంగా జరుగుతాయి.

నిన్నటి దుఃఖమిప్పటికి నిర్మల సౌఖ్యము, రేపు సౌఖ్యమో
విన్నదనంబో చెప్పగల వీరులు లేరిల జీవితంబునన్
నిన్నకు నిన్నయే యగున్, నేటికి నేడగున్, రేపు రేపగున్
ఉన్నది ఉన్నటుల్ గొనుము, ఊహలు మానుకొమ్మికన్. అన్నాడొక కవి.

క్రుంగిపోతే ఆపదలు తొలగిపోతాయా? ధైర్యంగా నిలచి ఒకటొకటిగా ముడిని విప్పుకుంటూ గట్టునపడాలి.

కొంతమంది జీవితాలు అంతే. వారు మారనే మారరు.

వృద్ధుడైన ఒక జ్యోతిష్య పండితుడు తనలో తాను ఆలోచించాడు. "పునరపి జననం పునరపి మరణం" మనిషి మరలా మరలా పుట్టి జన్మ పరిపక్వం చెందాక మోక్షాన్ని పొందుతాడు అని.

జన్మరాహిత్య దశకు చేరేముందు మనిషిలో కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అవి ఏవంటే ఏమాత్రం ఫలాపేక్ష లేకుండా సేవ చేయడం, ఎదుటివారి కృతజ్ఞత కొరకు గానీ, ఇచ్చే గౌరవానికిగాని ఎదురు చూడకుండా, ప్రత్యుపకారాన్ని ఆశించకుండా, అత్యంత కరుణకు పరాకాష్ఠగా, అత్యంత నిరాడంబరంగా, అత్యంత ఉన్నతమైన భావనలతో "మానవ సేవయే మాధవ సేవ"గా జీవించడం, మనో వాక్కాయ కర్మలతో పరమ పవిత్రంగా జీవించడం.

ఈ లక్షణాలు నాలోకూడా కొద్దో గొప్పో ఉన్నాయి. ఇంకా ఎన్ని జన్మలకు దైవసామ్రాజ్యాన్ని చేరుకోగలుగుతాను? ఎంత కాలం పడుతుంది? అని ప్రశ్నించుకుని, తన జ్యోతిష్యపాండిత్యానికి పదును పెట్టాడు. చివరకు తను మోక్షప్రాప్తికి ఇంకో రెండు జన్మల దూరంలో ఉన్నాడని నిగ్గు తేలింది. ఆహా! ఏమి నా భాగ్యము. మరో రెండు జన్మలేగదా! అయితే స్వర్గప్రాప్తికి చాల దగ్గరలోనే ఉన్నాను' అని సంతోషించాడు. వెంటనే ఈ జన్మకు చివరి జన్మకు మధ్యలో ఏ జన్మ వస్తుందో చూసుకోవాలన్న తలంపు కలిగింది. వెంటనే మరలా శాస్త్రాలను తిరగేసి, చింతాక్రాంతుడైనాడు. తేలిందేమిటంటే గత జన్మలో చేసిన ఒకానొక దుష్కర్మ ఫలితంగా పంది జన్మ ఎత్తడం. పాపపరిహారం కాగానే రెండవ జన్మలో ఉన్నత వంశంలో పుట్టి అవధూతగా మారి భగవత్ సామ్రాజ్యంలో లీనం కావడం.

ఆగామి జన్మల వృత్తాంతం తెలుసుకున్న వృద్ధ పండితుడు ఒకింత విచార వదనుడై చివరకు మనసును దిటవు పరచుకుని, తన నలుగురు కుమారులను దగ్గరకు

పిలిపించుకుని భవిష్యత్తు గురించి చెప్పాడు. కుమారులుకూడా తండ్రిగారు పందిగా జన్మించడాన్ని జీర్ణించుకోలేక పోయారు. "విధిని మార్చడం ఎవరి తరము" అనుభవించక తప్పదు అని సరిపెట్టుకున్నారు. కుమారులను బుజ్జగిస్తూ తరుణోపాయం ఉన్నది. దిగులు చెందవద్దని ఇలా చెప్పాడు తండ్రి. "నాయనలారా శాస్త్రప్రకారం ఫలానా గుర్తులతో, ఫలానా కుగ్రామంలో, ఫలానా రోజున నేను పందిగా పుడతాను. పంది జన్మ చాల నికృష్ట జన్మ. ఇంత శుభ్రంగా జీవించిన నేను పందిగా మురికి జీవితాన్ని తలచుకుంటేనే పరమ అసహ్యంగా వుంది. కాబట్టి, ఫలానా రోజున వచ్చి పంది జన్మలోని నన్ను సంహరించండి. పంది జన్మ పూర్తయిన వెంటనే నాకు ఉత్తమ జన్మ ప్రాప్తిస్తుంది. నా మాటను జవదాటరుకదా!" అని నలుగురు కుమారుల చేత వాగ్దానం చేయించుకున్నాడు. చెప్పిన ప్రకారం తండ్రి తనువును వదలివెళ్ళాడు.

తండ్రి పార్థివ శరీరానికి చెయ్యవలసిన క్రియాకర్మలనన్నింటినీ కుమారులు అత్యంత శ్రద్ధగా, పవిత్రంగా పూర్తి చేశారు. తండ్రి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

తండ్రి మరణానంతరం వాగ్దానబద్ధులైన కుమారులు పంది అవతారంలో ఉన్న తమ తండ్రిని సంహరించి, పితృఋణం తీర్చుకోవాలనుకున్నారు. ఎంత పంది జన్మ అయినా తమ తండ్రేగదా! మరణయాతన కలుగకూడదని ఒకే వేటుకు తల ఎగిరి పడేటట్టుగా కత్తులను బాగా సానబట్టించారు. ఆ పవిత్ర ఘడియల కోసం ఎదురుచూడసాగారు.

కాలం గడిచింది. పంది కుత్తుకను కత్తిరించే సమయం రానే వచ్చింది. కుమారులు తండ్రి వివరించిన చిరునామా ప్రకారం వెళ్ళారు. గ్రామం చివరలో ఉన్న మురికి కుంటలో ఆనందంగా పొర్లాడుతున్న పందిని చూచారు. గుర్తులను సరిచూచుకుని తమ "తండ్రి పందిని" సరిగ్గా గుర్తు పట్టారు. నల్గురూ నాల్గు వైపులు మోహరించి, తమ పదునైన కత్తులను బాగా ఎత్తి పట్టుకుని పంది పారిపోకుండా చక్కని వ్యూహంతో నెమ్మది నెమ్మదిగా ముందుకు కదులుతున్నారు.

తళతళ మెరిసే కత్తుల పదునైన మెరుపు, పంది కళ్ళలో పడగా పందికి గత జన్మ గుర్తుకు వచ్చింది. తన నలుగురు కుమారులను గుర్తు పట్టింది. వెంటనే ఇలా సెలవిచ్చింది. నాయనలారా! నాకు ఇచ్చిన మాట ప్రకారం మీరు వచ్చారు. మీ కృషి అభినందనీయం. కానీ ఈ పంది జన్మ పరిస్థితిని అర్థం చేసుకోవాలి మీరు. విసుగు అనుకోకుండా నేను చెప్పేది వింటే మంచిది అన్నాడు. సరే చెప్పు. మీ కోరిక తీర్చుటయేగదా మా కర్తవ్యం అని వినయంగా చేతులు కట్టుకున్నారు.

నాయనలారా! నేను మనిషి జన్మలో అందులోనూ శ్రేష్ఠమైన పండిత జన్మలో ఉన్నప్పుడు పంది జన్మ చాలా నీచంగా కనబడింది. అందుకని మీ దగ్గర వాగ్దానం

చేయించుకున్నాను. మీరు కూడా వాగ్దానబద్ధులై వచ్చినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. కానీ ఈ మురికిలో, మూత్రంలో పొర్లాడడం, ఈ మలాన్ని ఆరగించడం నాకు చాలా ఆనందంగానూ. తృప్తిగానూ వుంది. ఈ జన్మలో ఇప్పటి నా ఈ పరిస్థితి ఆనందదాయకంగానే ఉంది. కాబట్టి ఈ జన్మను తృప్తిగా అనుభవించి తరించాలనుకుంటున్నాను. అమూల్యమైన మీ కాలాన్ని వృథా చేసుకోవద్దు. మీరిక దయచేయండి అని చెప్పింది.

ఈ మాటలకు అవాక్కయిన నలుగురు కుమారుల చేతుల నుండి కత్తులు క్రింద పడిపోయాయి. పంది తప్పించుకుని పారిపోయింది.

కొంతమంది జీవితాలు అంతే మరి. వారు మారనే మారరు. మనం మారాల్సిందే. "ఎవడి కంపు వాడికి ఇంపు" "రాజు మెచ్చిందే రంభ, తాను మునిగిందే గంగ" అనే సామెతలు ఇలాంటి వారిని చూసే పుట్టాయి.

ఎవరి జన్మ శ్రేష్ఠం?

మానవ జన్మ శ్రేష్ఠమైనదని అందరూ అంటారు. శ్రేష్ఠమైనదని దేనినైనా దాని ప్రయోజనాన్ని బట్టి చెప్పబడుతుంది. ప్రయోజనం అంటే ఎవరికి? తనకూ, తన చుట్టూ వున్నవారికీ, తనను పుట్టించిన ప్రకృతికే.

నారికేళాన్ని శ్రేష్ఠమైనదంటారు. ఎందువలనంటే! దానిలోని నీరు అమృతంలా పని చేస్తుంది గనుక. అదేకాక దాని పుట్టుక చాలా పవిత్రమైంది. ఎందుకంటే, అది అత్యంత సహజంగా ఎవరిచేత ఎంగిలిగానీ, విచ్ఛిన్నంగానీ చెయ్యబడకుండా భూమిలో పడి మొలకెత్తుతుంది. దివ్యమైన ఔషధంగానూ, దివ్యమైన ఆహారంగానూ, ఇంధనంగానూ, నీడనిచ్చే పందిరిగానూ, శుభాశుభ కార్యాలకున్నూ అమోఘంగా, సాటిలేనిదిగా ఉపయోగపడుతుంది. ఎంతో ఎత్తుకు పెరుగుతుంది. శ్రేష్ఠత్వమంటే అది.

ఇక మనిషి జన్మను పరిశీలిస్తే ఏముంది? స్వార్థం కోసం ఉపయోగించుకోవడం, చెడిపోయి, చెడగొట్టి ఆనందించడం, కలుషితం చేయడంలాంటి రాక్షసత్వం తప్ప, బ్రతుకునిచ్చిన ప్రకృతిమాత వినాశనానికే తప్ప దేనికైనా ఉపయోగపడుతుందా? ఎవరి జన్మ శ్రేష్ఠం? దేని జన్మ మహోన్నతం? మనిషిదా? మనిషేతర జీవులదా?

ఇక విచక్షణ విషయానికి వస్తే మనుషులకు ఉంది, జంతువులకు లేదు అంటారు. సరే! వీరికి ఉండి ఏం జరిగింది? జంతువులకు లేక ఏం తరిగింది? ఏది ఉన్నతం? ఏది నీచం?

"సర్వ ప్రాణుల యెడల దయ కలిగి ఉండడమే ఉన్నతం". ఎందుకంటే ఈ ప్రకృతిలో ప్రతి ప్రాణి ఆ పరమాత్మ సృష్టే. పరమాత్మ దృష్టిలో అంతా సమానమే.

ఒకరు తక్కువ మరొకరెక్కువ అని లేదు. సేవకుడు తన సత్ప్రవర్తనతో యజమాని హృదయాన్ని దోచుకున్నప్పుడే ఆ సేవకునికి ఉన్నత స్థానం దక్కేది. అలాగే, నీవు పరమాత్మ సృష్టికి కష్టం కలిగించకుండా ఎప్పుడైతే నడచుకోగలవో అప్పుడే ఆ పరమాత్మ కృపాకిరణాలు నీపై ప్రసరించేది. ఇక భగవత్ కృపాకటాక్షాన్ని పొందినవారి స్థానం ఎప్పుడూ ఉన్నతమే.

కనుక భగవత్ సృష్టిని ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూ, భూతదయతో, సుబుద్ధితో, సహజ స్వభావాలతో నీ జీవితాన్ని అంకితమొనర్చు. కొండంత వివేకం, రవ్వంత లౌక్యం, రవ్వంత సుఖం, కొండంత తర్కం కలిగివుంటూ పరిమితమైన ఆశలతో, పరిమిత సుఖాలతో నిరాడంబర జీవితం ఉన్నతమైన ఆశయంతో జీవితాన్ని పరిపూర్ణం గావించు. అప్పుడే నీ జన్మకు సార్థకం.

మనిషి - చేపలా నీటిలో ఈదడం తెలుసుకున్నాడు.
పక్షిలా నింగిలో ఎగరడం తెలుసుకున్నాడు.
కానీ! భూమిపై ఎలా జీవించాలో తెలుసుకోలేకపోతున్నాడు.

- - - - -



పొరపాట్లు- తప్పులు

పొరపాట్లు

అన్నం తినేటపుడుకానీ, నీళ్ళుత్రాగేటపుడుకానీ, మాట్లాడేటపుడుకానీ, తొందరపాటు వలన గానీ, పరధ్యానంవలనగానీ గొంతులోని పొరపాటు తప్పడం వలన కొంత ఇబ్బందికి గురి కావలసివస్తుంది. ఎవరో తలచుకుంటున్నారని ఉపశమనంగా తలమీద అరచేత్తో ఒకటి రెండుసార్లు తడతారు. నీళ్ళుతాగమంటారు. అలాగే! పరధ్యానంలో చేసిన పని సరిగా జరగకపోతే దానిని పొరపాటు అంటారు. ఉద్దేశ్యపూర్వకంగా కాక, అనుకోకుండా జరిగే దురదృష్టకర సంఘటన లేక తప్పిదాన్ని, అవగాహనారాహిత్యంవలన, మంచి అనుకొని చేసిన పని, ప్రతికూలం కావడాన్ని పొరపాటు అంటారు.

పొరపాటు జరిగినపుడు సామాన్యంగా నష్టం, కష్టం తక్కువ మోతాదులోనే ఉంటుంది. మరీ కాలం కలిసి రానపుడు “ పై పంచే పామై కరిచినట్లు” కష్టం, నష్టం, భారీగా జరిగినపుడు దానికి ఎవరూ ఏమీ చెయ్యలేరు. దురదృష్టం అనుకుని సర్దుకుపోవాలి. జరిగిన తప్పిదము వెనుక ఏ దురుద్దేశ్యమూ ఉండదు కాబట్టి, బాధ్యులు బాధితులకు మనఃపూర్వకంగా క్షమాపణలు చెప్పాలి. బాధితులుకూడా తేలికగా తీసుకుని జరిగిన దుస్సంఘటనలను మరచిపోయి పూర్వంలా కలిసిమెలసి నిజాయితీగా స్నేహంగా ఉండాలి.

తప్పును కప్పి పుచ్చడమంటే మరొక తప్పు చేస్తున్నట్లే

తప్పులు, పొరపాట్లు మనిషి జీవితంలో సహజం. తప్పొప్పుకుని సరిదిద్దుకోవడం గొప్పతనం. మరలా తప్పు చేయకుండా జాగ్రత్తపడడం చాలా గొప్పతనం. అదే మనిషితనం కానీ చాలామంది చిన్న చిన్న విషయాలకుకూడా నేను చేయలేదు, నేనలా అనలేదు అని బుకాయించేస్తుంటారు. మారుమాట్లాడితే దబాయించేస్తుంటారు. మరలా మరలా తప్పులు చేస్తూనే ఉంటారు.

ముల్లానజీరుద్దీన్.... ఓ సారి తన పెరటిగోడలను పడగొట్టాడు. అందువలన రాళ్లూ, మట్టి వీధిలోపడి, దారికి అడ్డంగా ఉంది, వచ్చేపోయే వారికి కష్టంగా ఉంది. జనం తిట్టుకుంటూ పోతున్నారు. మరునాడు ఉదయమే ముల్లానజీరుద్దీన్ నడివీధిలో గుంత త్రవ్వడం మొదలు పెట్టాడు. జనం గుమిగూడారు.

నజీరుద్దీన్?... ఏమిటిది? ఏంచేస్తున్నావ్? నిన్న రాళ్లు, మట్టి దారికి అడ్డంగా వేశావ్. ఈ రోజేమో గుంత కూడా తవ్వుతున్నావ్ ఏమిటి నీ ఉద్దేశ్యం? ఈ దారేమైనా నీ సొంతమా? ఇదేం బాగా లేదు! అని తమ కోపమంతా వెళ్లగక్కారు. నిజమే బాగాలేదు. నా పెరటిగోడను పడగొట్టి మీకు చాలా ఇబ్బంది కలిగించాను కదా? ఆ ఇబ్బందిని

తొలగించాలనే ఈ పనిచేస్తున్నా! అన్నాడు.

ఆ మాటకు జనమంతా "ముక్కుమీద వేలువేసుకున్నారు" ఆహా ఏమి చెప్పావయ్యా? ముందుగానే రాళ్లు, మట్టితో దారినిండిపోయి ఉంటే ఆపైన మరొక గుంత తవ్వుచున్నావా? నీకేమైనా మతి చెలించిందా? అని గద్దించారు అక్కడ గుమికూడిన జనం. "అలా కాదండి దారికి అడ్డుపడిన రాళ్లను, మట్టినీ దారిలో తవ్విన గుంతలోవేసి మీ ఇబ్బందిని తొలగించాలనుకుంటున్నాను".అన్నాడు నజరుద్దీన్. మరలా ఆశ్చర్యపోయారు గుమిగూడిన జనం.

మానవ సంబంధాలు చెడిపోకుండా ఉండాలంటే తప్పులు చేయకూడదు. ఒక వేళ జరిగినా, తప్పును సరిదిద్దుకోవాలి. మరలా జరగకుండా జాగ్రత్తపడాలి. అప్పుడే మానవ సంబంధాలు చెడిపోకుండా ఉంటాయి. వాతావరణంకూడా కలుషితం కాకుండా ఉంటుంది.

మంచి ప్రవర్తన కలిగి ఉండాలంటే, చెడు ప్రవర్తనకు దూరంగా ఉండాలి. మానుకోవాలనుకుంటున్న దురలవాట్లను, వాటి వల్ల జరిగే అనర్థాలను కాగితంపై వ్రాసుకోవాలి. దురలవాట్లు దూరంకాగానే కలిగే ఫలితాలనుకూడా కాగితంపై వ్రాసుకోవాలి. ప్రతిరోజు తప్పులు జరగకుండా ఉంటేటట్లుగా భగవంతుడి దయ కొరకు ప్రార్థించాలి.

* అలాగే తెలిసో తెలియకో పొరపాట్లు, తప్పులను క్షమించమని రాత్రి పడుకోబోయే ముందు భగవంతుడిని ప్రార్థించాలి.

చెప్పుడు మాటలు వినడం కూడా తప్పే

ఒక పట్టణంలో కొండయ్య, బుల్లయ్య అని ఇద్దరు మిత్రులుండేవారు. ఇరువురూ పేదవారే. పేరుకు తగ్గట్టు చాలా ఎత్తుగా ఉండేవాడు కొండయ్య. ఇద్దరూ గుణంలో చాలా మంచివారే, పట్టణంలోని వారికి ఈ జంటను చూచి ఎగతాళిగా, తమాషాగా లంబూ, జంబూ, "జండా కట్టెకు, జిల్లా కోడుకు మంచి జోడి కుదిరిందిరా!" అని అనుకుని నవ్వుకునేవాళ్ళు. అయినా వారు అవేమీ పట్టించుకునేవారు కారు.

ఒకరోజు వారు తమ బ్రతుకుదెరువును గూర్చి చర్చించుకుంటూ ఏంచేస్తే మనం సంపాదించగలం? ఊరకనే ఇలా బలాదూరుగా తిరుగుతూ ఎంతకాలమని జీవిస్తాం? మనమూ వివాహాలు చేసుకొని ఒక ఇంటివారము కావాలికదా? ఇలా ఒంటరి జీవితం ఎంతకాలమని గడుపుదాం? అని బాగా ఆలోచించి, ఇరువురూ కలిసి వీధిలో ఒక చిల్లరకొట్టును తెరవాలని నిర్ణయానికి వచ్చారు. చెరీ రెండువేలు వెరసి నాలుగువేల రూపాయలు పెట్టుబడితో ఒక శుభ ముహూర్తాన చిల్లర దుకాణం తెరిచారు.

ఉమ్మడిగా మొదలు పెట్టినవారి దుకాణంలో, బేరం బాగా జరుగుతూ ఉండేది. కొత్తకొట్టు, అదీకాక వాళ్ళకొట్లో ఒక వింత ఉండేది. అదేమిటంటే ఒకడు గడకర్రలాగా పొడుగు, మరొకడు లక్కన కర్రలాగా పొట్టి, పొట్టివాడు గల్లాపెట్టె దగ్గర

కూర్చొని వస్తువులు తూచి, పొట్లాలు కట్టి డబ్బులు పుచ్చుకునేవాడు, పొడుగువాడు సామాన్లు అందిస్తూ ఉండేవాడు! అలమారాలలో పైన ఉన్న సరుకులను నిచ్చెన అవసరం లేకుండానే అవలీలగా ఇచ్చేవాడు. అందుచేత అందరికీ అదొక వింతగా చూడ ముచ్చటగా ఉండేది.

ఇలా అనతి కాలంలోనే ఆ ప్రాంతంలో వారి వ్యాపారం బాగా ప్రసిద్ధికెక్కింది. ఇద్దరూ తెచ్చిన అప్పులు తీర్చేసుకున్నారు. ఇలా ఇబ్బడి ముబ్బడిగా వ్యాపారం జరుగుతూ రోజులు దొర్లిపోతున్నాయి. ఇద్దరూ వివాహం చేసుకున్నారు. పొట్టి బుల్లయ్య గల్లాపెట్టె దగ్గర కూర్చొని వినాయకుడిలాగా పెద్ద బొజ్జకూడా పెంచాడు. ఆ బొజ్జనిండా రూపాయలే రూపాయలు అని ఆ దారిన పోయేవారు గమ్మత్తుకి అనేవారుకూడా.

ఇలా ఉండగా వీరి ఉమ్మడి వ్యాపారం జోరుగా సాగుతూ స్నేహితులిద్దరూ ఆనందంగా ఉండటం కొందరికి అసూయ కలిగింది. ఒక సెలవురోజున కొండయ్య గాలి షికారుకి వెళ్తూ ఉంటే పాత మిత్రుడైన రుద్రయ్య అనేవాడు కలిశాడు. కొండయ్య వ్యాపారంలో బాగుపడటం బొత్తిగా ఇష్టంలేదు రుద్రయ్యకు, అంచేత మెల్లగా భేదోపాయాన్ని ప్రయోగించాడు.

రుద్రయ్య :- ఏమోయ్ కొండయ్యా! మీ వ్యాపారం బాగానే సాగుతూ ఉందా?

కొండయ్య :- ఓ!

రుద్రయ్య :- ఎందుకు సాగదూ! కష్టం అంతా నీదేనటగా!

అందరూ అనుకుంటున్నారు. బుల్లెయ్య ఏమోగల్లాపెట్టె దగ్గర ఏ కష్టమూ లేకుండా కూర్చుంటున్నాడట! నిజమేనా? కష్టం అంతా కొండయ్యది, ఫలం అంతా బుల్లెయ్యది అని అందరూ అనుకుంటున్నారు.

కొండయ్య :- అదేమిటోయ్? అలా అంటావు. బుల్లెయ్య అలాంటివాడు కాదు.

రుద్రయ్య :- అదికాదోయ్ ! బుల్లెయ్య అస్తమానము కూర్చొని బొజ్జపెంచుకుంటుంటే, నీవేమో పొద్దస్తమానం నిలబడి కూలీ లాగా చాకిరీ చేయడమేగా? డబ్బు ఎవరికి కావాలి? ఆత్మాభిమానం ఉండొద్దూ? అందరూ ఏమంటున్నారో తెలుసా? ఆ కొట్టు బుల్లెయ్యదేనని, నువ్వు జీతం రాళ్ళకి కూలి పని చేస్తున్నావనీ అంటున్నారు. అయినా మీ సంగతి నాకెందుకులే. అని మెల్లగా అక్కడినుండి జారుకున్నాడు. ఊదవలసిందేదో చిన్నగా చెవిలో ఊదేశాను. అనుమాన బీజం పడనేకూడదు. పడిందా ఇక మహావృక్షమై మనసుకు శాంతిని దూరం చేస్తుంది అనుకుంటూ వెళ్లాడు రుద్రయ్య.

మనసును ఎంత కుదుటపెట్టుకున్నా ఏదో వెలితి, కొండయ్యలో మెదలసాగింది. అవును తాను మాత్రమే ఎందుకునిలబడి పనిచేయాలి? బుల్లయ్య మాత్రం కాలుమీదకాలు వేసుకొని ఎందుకు కూచోవాలి? రేపటి నుండి నేనే గల్లా పెట్టె దగ్గర కూచుంటాను. వాడే సామాన్లు అందిస్తాడు. అనుకుంటూ ఇంటికి వెళ్లాడు కొండయ్య.

మరునాడు కొట్టు తెరచీ తెరవగానే కొండయ్య గల్లా పెట్టె దగ్గర కూచున్నాడు. ఇది చూచి బుల్లెయ్య ఆశ్చర్యంతో ఏమోయ్! ఈ రోజు స్థానం మారింది? నేను కూచోవలసిన జాగాలో కూచున్నావ్! అని అడిగాడు. అందుకు కొండయ్య " ఇది నీ జాగా అని రాసి ఉందా? ఈ స్థానంపై నీకెంత హక్కుందో నాకూ అంతే హక్కు ఉంది తెలుసా! ఇక ముందు నీ పప్పులు నాదగ్గర ఉడకవ్. నేనిక్కడే కూర్చుంటాను. నువ్వు సామాన్లు అందియ్యి" అన్నాడు.

కొండయ్యలో వచ్చిన మార్పును చూచి బుల్లెయ్యకు చాలా ఆశ్చర్యం వేసింది. చేసేదిలేక బుల్లెయ్య సామాన్లు అందిస్తాలే అన్నాడు. కానీ బుల్లెయ్యకు ఆపని సాధ్యపడడంలేదు. ఇంతలో ఒకావిడ కొట్టుకు వచ్చి అగ్గి పెట్టెల కట్ట ఒకటి ఇవ్వండి అని అడిగింది. కానీ అగ్గిపెట్టెలు అలమారాపైన ఉన్నాయి. బుల్లెయ్యకు అందవు. ఇంతలో మరొకడు వచ్చి శొంటి ఒక పావలాకు ఇవ్వు అన్నాడు. బుల్లెయ్యకు శొంటి ఎక్కడుందో అసలు తెలియదు. పైనున్న వస్తువులు అందవు. మరొకొన్ని ఎక్కడున్నాయో తెలియదు. ఇలా సరుకు ఇచ్చేదానికి వీలు పడక తటపటాయిస్తూ ఉంటే వచ్చినవారు చికాకుపడుతూ పక్క కొట్టుకు వెళ్లిపోయారు. పొద్దున్నే వచ్చిన బేరం పోయినందుకు కొండయ్యకు కోపం వచ్చింది. "శనిగాడిలాగా నీవు గల్లా పెట్టెదగ్గర కూచున్నందుకే పొద్దన్నే వచ్చిన బోణి బేరం కాస్తపోయింది" అన్నాడు బుల్లెయ్య. ఈ మాటతో కోపగించుకున్నాడు కొండయ్య. వాదోపవాదాలు చేసుకొని కోపంతో కొట్టును మూసేసి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు.

ఇలా కొన్ని రోజులు గడిచాక కొండయ్యకుగానీ, బుల్లెయ్యకుగానీ ఇంటి వద్ద ఏ వ్యాపకమూ లేకుండా ఊరకనే కూచోబుద్ధికావడంలేదు. ఇరువురూ పెళ్లి చేసుకొని సంసారాలు సాఫీగా జరిగిపోతూ మంచి ఆదాయం సంపాదిస్తున్న రోజులలో, ఇలాంటి దురదృష్టకరమైన సంఘటన జరగడం ఇరువురికీ మనస్తాపాన్ని కలిగించింది.

ఒకరోజు కొండయ్య భార్య, భర్తతో ఇలా అంది "ఏమండీ బుల్లెయ్యతో మీరు ఎంతో కాలంనుండి స్నేహంగా ఉంటున్నారు. కలిసి వ్యాపారంకూడా పెట్టుకున్నారు కదా? ఎలాంటి ఒడుదుడుకులూ లేకుండా సజావుగా వ్యాపారం జరుగుతుండగా, ఏ మాత్రం బుల్లెయ్యతో మాటమాత్రం కూడా అనకుండా, అతను బాధ్యతగా చూచుకుంటున్న గల్లాపెట్టె వ్యవహారంలో మీరు ఎందుకు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది? ఏదైనా తేడాలు పొడచూపి ఉంటే, అతనితో చర్చించి ఉండవలసింది. హఠాత్తుగా మీరు ఆపని చేశారు కాబట్టి అతనికి అలవాటులేని సరుకులు అందించేపని అతను సవ్యంగా చేయలేక, వచ్చిన గిరాకీలకు సరిగా సరుకులు ఇవ్వలేక, చేతగాక, నీ మీద కోపంతో కాస్త కఠినంగా మాట్లాడాడేకానీ, అతనికి ఉద్దేశ్యపూర్వకంగా మిమ్ములను బాధపెట్టాలని లేదండీ. మీరు ప్రశాంతంగా ఆలోచించండి". అని భార్య అన్న మాటలను కాస్త తీరుబడిగా ఆలోచించాడు కొండయ్య.

భార్య చెప్పిన మాటలలో అర్థముంది అనుకున్నాడు. వెంటనే బుల్లెయ్యతో ఒక సారి కలిసి మాట్లాడితే బాగుంటుందండీ అని భార్య సలహా చెప్పింది. సరేనని కొండయ్య బుల్లెయ్య దగ్గరికి బయలుదేరాడు.

ఇక్కడ బుల్లెయ్య పరిస్థితీ అగమ్యగోచరంగానే ఉంది. ఏదో భగవంతుని దయవల్ల స్నేహితుడితో కలసి కొట్టుపెట్టి ఖాపీగా సంసారం నెట్టుకొస్తున్న తరుణంలో ఇలాంటి అవాంతరం ఎందుకు జరిగిందో బుల్లెయ్యకు అంతుబట్టలేదు. కొండయ్య అలా ఎందుకు వ్యవహరించాడోకూడా అర్థంకాలేదు.

బుల్లెయ్య భార్య, భర్తతో ఏమండీ మీరిరువురూ చిన్ననాటి నుండి స్నేహితులే కదా? మరి ఏనాడు లేని విధంగా కొండయ్య హఠాత్తుగా ఎందుకలా ప్రవర్తించవలసి వచ్చిందని ఆలోచించారా? గల్లా పెట్టె దగ్గర కూర్చుంటున్న మీరు ఏనాడూ నీతి దప్పి ప్రవర్తించలేదు. అలాంటప్పుడు అతనికి అనుమానం ఎందుకు వచ్చింది? ఒక వేళ వచ్చినా, ఏ మాత్రం మాట వరసకైనా బైట పెట్టకుండా, నిరసన వ్యక్తపరచకుండా, హెచ్చరించకుండా, ఉన్నట్లుండి గల్లాపెట్టె దగ్గరకూర్చొని, ఏమాత్రం వీలుపడని సరుకులందించే పని నిన్ను చూచుకోమన్నాడంటే? అది అతనికి పుట్టిన బుద్ధికాదండీ. దీని వెనుక ఎవరి కుతంత్రమో ఉండి ఉంటుందండీ. ఒకసారి మీరు కోపం తగ్గించుకొని కొండయ్య దగ్గరకి వెళ్ళి, నీమీద ఎందుకు అనుమానం కలిగిందో కనుక్కోండి. విషయం తేలిపోతుంది. ఇలా అనవసరపు అనుమానాలతో, అపోహలతో ఎందుకు బంగారంలాంటి వ్యాపారాన్ని కాలదన్నుకుంటారు''? అని సలహా ఇచ్చింది.

బుల్లెయ్యకు భార్య ఇచ్చిన సలహా ఎంతో సబబుగా తోచింది. సరేనని బుల్లెయ్య కొండయ్య దగ్గరికి బయలుదేరాడు.

బుల్లెయ్య, కొండయ్య ఇద్దరూ దారి మధ్యలో తారసపడ్డారు. కొండయ్య ఏరా బుల్లెయ్యా బాగున్నావా? అని పలకరించాడు. ఏరా కొండయ్యా నీవెలా ఉన్నావు? అని పలకరించాడు బుల్లెయ్య! ఇలా ఇరువురూ కలుసుకొని ఆమాట ఈ మాటా మాట్లాడుకుంటూ వెళ్ళి ఊరి చివరి చెట్టుక్రింద కూర్చున్నారు.

మొదట బుల్లెయ్యే ప్రస్తావించాడు. ఏరా కొండయ్యా! ఆరోజు హఠాత్తుగా నీవు గల్లా పెట్టె దగ్గర ఎందుకు కూర్చోవలసివచ్చింది? నీవు గల్లాపెట్టె దగ్గర కూర్చున్నందుకు నాకు నీమీద కోపం రాలేదురా! ఏ సరుకు ఎక్కడుందో తెలీక, పైనున్న వస్తువులను అందుకోలేక వచ్చిన వారికి వెంటనే సరుకు ఇవ్వలేక, బోణి చేసేదానికి వచ్చిన బేరం ఎక్కడ జారిపోతుందో నన్న బాధ, విసుగుతో అలా అన్నాను. నీ మీద నాకు కోపం ఎందుకుంటుందిరా? చెప్పు. చిన్ననాటి స్నేహితులమైపోతిమి. నీవు ఏం చేశావని కోపగించుకుంటాను? ఒకరిమీద ఒకరికి నమ్మకం ఉండబట్టేకదా

వ్యాపారం చేయదలచుకున్నాము. ఏదో జరిగిపోయింది. మనసులో ఏమీ పెట్టుకోకు. అసలు ఎందుకు గల్లా పెట్టె దగ్గర కూర్చోవలసి వచ్చింది? నా మీద అనుమానం వచ్చి ఉంటే, అనుమానానికి దారితీసిన సంఘటన ఏం జరిగింది? నేనెప్పుడూ గల్లాపెట్టెదగ్గర నీతి తప్పలేదు. అలాచేస్తే స్నేహితుడినైన నీకు ద్రోహం చేసినట్లేకదా? ఆరోజు నీవెందుకు అలా ప్రవర్తించాల్సి వచ్చింది? తెలియచెప్పితే నా తప్పు సవరించుకుంటాను. కొట్టు మూసినరోజు నుండి నాకు ఏంచేయాలో తోచలేదు. పైసా ఆదాయం లేదు. నిన్ను చూడలేక, నీదగ్గరికి రాలేక, ఏపనీ చేయ్యలేక ఇన్ని రోజులూ నరకమనుభవించాననుకో'' అన్నాడు.

మిత్రమా నాదీ అదే పరిస్థితి. వాస్తవానికి ఆరోజు నేనలా ప్రవర్తించి ఉండవలసిందికాదు. ఆముందురోజు ఆదివారం కొట్టుకు సెలివిచ్చి, ఏదోపనిమీద వెళుతున్న నాకు మిత్రుడు దుర్గయ్య కనిపించాడు. వాడు చెప్పిన మాటలు విని నేనలా ప్రవర్తించాను. నిజంగా నేను చేసిన తప్పు నిన్ను అనుమానించడం. ఇన్నాళ్ళు మన సహవాసానికి కళంకం తెచ్చాను. నన్ను క్షమించరా బుల్లెయ్యా! అన్నాడు కొండయ్య.

మిత్రరూప శత్రువులుంటారు. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి అని అనుకుంటూ, మంచి సలహాలను ఇచ్చిన వారి భార్యలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ, వెళ్ళి కొట్టు తెరిచారు. బాధ్యతగా, సుఖజీవనం సాగించారు.

* అరచి చెప్పిన నిజానికంటే చిన్నగా చెవిలో చెప్పిన అసత్యాన్నే నమ్ముతారు.

* చెప్పుడు మాటలను నమ్మితే ఎంతటివారైనా విచక్షణకోల్పోయి తప్పులు చేస్తారు.

తప్పులు

తప్పులు తెలిసిన స్థితిలోనే జరుగుతున్నాయి అంటే ఆశ్చర్యం కలుగుతుంది. కానీ ఇది వాస్తవం.

వేలకు వేలు జీతభత్యాలు తీసుకుంటున్న విద్యాధికులైన అధికారులకు లంచాలు మెక్కడం తప్పని తెలీదా?

నేరస్తులకు అభయహస్త మిచ్చి, ఆశ్రయం కల్పించి వెనుకేసుకొచ్చే రాజకీయ నాయకులకు తాము నేరాలను ప్రోత్సహిస్తున్నట్లు, అమాయకులను బలిచేస్తున్నట్లు తెలీదా?

పాపభీతి లేకపోవడం, మానవత్వం లేకపోవడం జన, ధన, భుజ బలంతో ఏమైనా చెయ్యగలమనే ధీమా, అహంకారం, చట్టమంటే భయంలేకపోవడం, అన్నీ తనకే కావాలనీ, అందరూ తనమాటే వినాలనే మూర్ఖత్వం, ఎంతనీచానికైనా దిగజారడం, చెప్పుడుమాటలను నమ్మడం, సాటిమనుషులలో సహనం, నేరం చేసిన వారికి శిక్షలు సరిపడినంత లేకపోవడమే తప్పులు పునరావృతమవడానికి కారణాలు.

* తప్పులను సవరించుకొనువాడు ఉత్తముడు. ఏ తప్పు చేయనివాడు ఉత్తమోత్తముడు.
* రంధ్రాలు చిన్నవైనా నావను ముంచును. దోషాలు చిన్నవైనా మనిషిని చంపును.
* బారెడు దూరమైనా రాచబాటే మంచిది.

మనుషులు తాము చేసిన తప్పులను సరిదిద్దుకోవాలి. పునరావృతం కాకుండా జాగ్రత్తపడాలి. ప్రభుత్వం అసలు తప్పులే చేయకూడదు. ప్రభుత్వం, పాలకులు చేసే తప్పుల ప్రభావం ఏ ఒక్క వ్యక్తిపైనో పడదు. ఎన్నో వర్గాల ప్రజలకు తీవ్రమైన క్షోభను కలిగించి కర్తవ్యాన్ని నెరవేర్చనివ్వకుండా, నిరాశ, నిస్పృహలకు లోనుచేస్తుంది.

చెడు కర్మల ఫలితం

రామాపురంలో సోమయ్య అనే ఆసామి ఉండేవాడు. అతనికి ఒక్కగానొక్క కొడుకు. వాడిపేరు గుణవర్మ. అల్లారుముద్దుగా పెంచుకున్నాడు కానీ గుణవర్మకు చదువు సంధ్యలు అబ్బలేదు. జులాయిగా తిరుగుతూ చిల్లర దొంగతనాలు చేస్తుండేవాడు. ఎన్నిసార్లు హితబోధచేసినా, ఎన్నిమార్లు దండించినా ఫలితం కనిపించలేదు. అందుకని కుమారుడు చేసే ప్రతి చెడ్డ పనికీ, తండ్రి తనయింట్లోవున్న తలుపుకు ఒక మేకు కొట్టేవాడు. కొన్నాళ్ళకు ఆ తలుపు పూర్తిగా మేకులతో నిండిపోయింది.

ఒక రోజు గుణవర్మ తన యింట్లో తలుపును గమనించాడు. యింట్లో వారందరినీ ప్రశ్నించాడు. అందుకు తండ్రి "నాయనా! నీవు చేస్తున్న ప్రతి చెడ్డపనికీ సూచనగా ఒక మేకు కొడుతూ వచ్చాను. నీతప్పులతో తలుపు నిండిపోయింది." అని చెప్పాడు.

గుణవర్మ ఆలోచనలో పడ్డాడు. " నేను చేస్తున్న తప్పులు ఇన్ని వున్నాయా?" అని అనుకున్నాడు. తండ్రితో "నేను చేసిన ప్రతి తప్పుకు ఒక మేకు కొట్టినావు సరే! వాటినుంచి తప్పించుకోవాలంటే ఎలా? అని అడిగాడు. అందుకు తండ్రి మనసులో సంతోషిస్తూ " నీవు మంచి పనులు చెయ్యి, ప్రతి ఒక్క మంచి పనికి, ఆ కొట్టిన మేకుల్లో ఒక్కొక్క దానిని తొలగిస్తాను" అని చెప్పాడు. గుణవర్మ సరేనన్నాడు.

అప్పటి నుంచి గుణవర్మ మంచి పనులు చేయడం మొదలుపెట్టాడు. ఒక్కొక్క పనికి ఒక్కొక్క మేకు తొలిగించడం మొదలుపెట్టాడు తండ్రి. కొంతకాలానికి మేకులన్నీ వూడదీయబడి తలుపు మాత్రం రంధ్రాలతో మిగిలిపోయింది. గుణవర్మ దానిని గమనించి నాన్నా! నేను మంచి పనులు చేస్తే ఆ మేకులు వూడదీసినావు కదా! ఆగుర్తులు ఇంకా మిగిలి వున్నాయే మరి? అని అడగ్గా, అపుడు తండ్రి మనము మంచిపనులు చేసినప్పటికీ చెడ్డపనులు చేసినందువలన కలిగిన ఫలితము అలాగే వుంటుంది. కాబట్టి చెడ్డపనులు చేయనేకూడదు అని చెప్పాడు. గుణవర్మ సిగ్గుతో తలవంచుకున్నాడు.
* చెడు కర్మల ఫలితాన్ని మార్చలేము. కానీ, మంచి కర్మల ద్వారా పుణ్యఫలాన్ని పెంచుకోగలం.

కపటవేషం ఎన్నోరోజులు దాగదు

చాకలివాడొకడు అవసరానికి ఒక గాడిదనుకొని తెచ్చుకున్నాడు. అయితే ఆగాడిదకు ఏమాత్రం ఆహారం పెట్టేవాడుకాదు. "వీధిలో మెయ్యాలి, ఇంటిలో చాకిరీ చెయ్యాలి" అనే మనస్తత్వం చాకలివానిది. కొద్దిరోజులు గడిచాక గాడిదకు సరిఅయిన ఆహారం లేనికారణంగా బరువులు మోయలేని స్థితికి వచ్చింది. అందుకు చాకలివాడు ఒక ఉపాయం ఆలోచించాడు. వెదకివెదకి ఎలాగో ఒక పులితోలునుదెచ్చి గాడిదకు కప్పి ఊరిప్రక్కనున్న పంట పొలాల పైకి తోలుతూ ఉండేవాడు.

పంట నాశనమౌతూ ఉంటే రైతులు చాలా బాధపడుతూ ఉండేవారు. పులి సంచరిస్తూ ఉన్న కారణంగా రైతులు కాపలా కాయుటకు కూడా సాహసించలేకపోయారు. కొన్నిరోజులకు పంటబాగా నష్టపోయిన ఒక రైతు ధైర్యంచేసి పొలాన్ని నాశనం చేస్తున్నదేమిటో తెలుసుకోవాలని పొలాన్ని పులి మేయదుకదా? ఇందులో ఏదో మతలబు ఉందని ఊహించాడు. ఒకరోజు రాత్రి పెందలకడనే తన పొలం దగ్గరే ఉన్న చెట్టు క్రింద ఒక పొదలో గొంగళిని కప్పుకొని మంచి దుడ్డుకర్రనొక దానిని చేతబట్టి, కాచుకొని కూర్చున్నాడు. కొంచెం చీకటి పడగానే పులితోలుతో గాడిద పొలంలోకి జొరబడింది. రైతు మొదట పులితోలును చూచి కాస్త భయపడినా దాని నడక, దాని తోక త్రిప్పుడు, దాని వాలకం చూచి పులిమాత్రంకాదు అని నిర్ధారణకు వచ్చాడు. గాడిద నెమ్మదిగా పొలంలోమేస్తూ, రైతు ప్రక్కగా వెళుతుండగా ఆశ్చర్యపడి పులితోలు మహిమా ఇది! అని పంటనాశనానికి కారణమైన గాడిదను కసిగా బాది యమపురికి పంపించాడు.

మరునాడు రైతులు అసలు విషయం తెలుసుకొని ఆచాకలివాడికికూడా దేహశుద్ధిచేసి గ్రామం నుండి తరిమేశారు.

* "మోసం ఎన్నోరోజులు దాగదు, సాగదు".

ఎవడు తీసిన గోతిలో వాడే పడతాడు

మహాభారత కాలంలో వృద్ధక్షత్రుడనే రాజు సింధుదేశాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. అతని కుమారుడే సైంధవుడు. బాల్యంలో సైంధవుడు ఆడుకుంటున్న సమయంలో ఏమరుపాటుగా నున్నపుడు అతడు ప్రాణాలు కోల్పోతాడు అని శరీరవాణి చెప్పింది.

ఈ విషాద సమాచారం తెలుసుకున్న తండ్రి చాలా దుఃఖానికి లోనయ్యాడు. పుత్రవాత్సల్యంతో విధివిలాసాన్ని విస్మరించి, "తనకుమారుని తలను నేలరాల్చినవారి శిరస్సు వెయ్యిముక్కలవుగాక" అని శపిస్తాడు వృద్ధక్షత్రుడు.

మహాభారత యుద్ధంలో కౌరవుల కుతంత్రంలో భాగస్తుడై అర్జునుని కుమారుడైన అభిమన్యుని మరణానికి కారకుడైన సైంధవుడిని "మరుసటిరోజు సూర్యుడు అస్తమించేలోగా సంహరిస్తాను" అని భీషణ ప్రతిజ్ఞ చేస్తాడు అర్జునుడు.

అర్జునుని ప్రతిజ్ఞ ఎలాగైనా భంగపరచి సైంధవుడిని రక్షించుకోవాలని కౌరవులు అతడిని రహస్యంగా దాచి ఉంచారు. అందువలన అర్జునుడు సైంధవుడిని చూడలేక పోయాడు.

కౌరవుల పన్నాగమును పసిగట్టిన శ్రీకృష్ణుడు తన మాయతో సూర్యడస్తమించాడా అన్నట్లు చీకటిని సృష్టించాడు. సూర్యుడస్తమించాడనే భ్రమతో సైంధవుడు కౌరవుల అండతో గర్వంగా బైటకు వచ్చాడు. ఆ వెంటనే చీకటి తొలగి సూర్యుని వెలుగు ప్రకటితమైంది. తక్షణమే అర్జునుడు బాణంతో సైంధవుని తలను ఛేదించివేశాడు. ఆ శిరస్సును క్రింద పడకుండా వృద్ధక్షత్రుని ఒడిలో పడునట్లుగా చేయమని శ్రీకృష్ణుడు ఆజ్ఞాపించాడు. శ్రీకృష్ణుని ఆజ్ఞమేరకు సైంధవుడితల తండ్రి ఒడిలో పడేటట్లు చేశాడు అర్జునుడు. తపస్సులో ఉన్న తండ్రి ఒడిలో తటాలున పడిన కుమారుని తలను క్రిందికి నెట్టివేశాడు. అతని శాపాన్ని అనుసరించి తండ్రి తలే వెయ్యిముక్కలైపోయింది.

మరణమనునది విధి సంకల్పం. దానిని మార్చడం ఎవరితరమూకాదు. ఎవరి కర్మకు ఎవరు బాధ్యులు? అని వృద్ధక్షత్రుడు ఆలోచించకుండా క్రోధావేశంలో, అకారణంగా, అనవసరంగా, ప్రతీకారబుద్ధితో ఇంకొకరికి హానితలపెట్టాలనే ఆలోచన అతడినే బలితీసుకున్నది.

* అందుకే అంటారు " ఎవరు తీసిన గోతిలో వారే పడతారు" అని.

మంచి చెయ్యబోతే ఒక్కోసారి చెడు ఎదురౌతుంది

తప్పుచేశాడన్న కారణంగా నడిబజారులో ఒక పేదవాడిని పట్టుకొని ఒక ధనికుడు నిర్దాక్షిణ్యంగా చావగొడుతూ ఉంటే, అది చూచి సహించలేక, ఒక బాటసారి జాలితో "అయ్యా అతడిని ఎందుకలా కొడుతున్నారు"? అతడేంచేశాడు?" అని అడ్డుపడ్డాడు.

అపుడు ధనికుడు ఆవేశంతో నిప్పులు క్రక్కుతూ "నీకెందుకోయ్?" దారిన వెళ్ళేవాడివి వెళ్లక నాకు అడ్డుతగులుతున్నావ్? అని బాటసారిని ప్రక్కకు నెట్టేశాడు. ఆ పేదవాడు అయ్యా నీవైనా నన్నుకాపాడు అని పదేపదే బాటసారిని ప్రాధేయపడసాగాడు. కానీ ధనికుడు కసితీరా పేదవాడిని చితకబాది తనదారిన తాను వెళ్లిపోయాడు.

దయగల బాటసారి స్పృహదప్పిపడిపోయిన పేదవాడిని చెట్టుక్రిందికి చేర్చి, నీళ్లు తెప్పించి, ముఖంపై చిలకరించి సపర్యలు చేయగా, వాడు కళ్ళు తెరిచి వెర్రి చూపులు చూచాడు. అది గమనించిన బాటసారి ఇతనికి మతి దప్పెనా ఏమి? అని తలచి, ఏమయ్యా ఎలా ఉంది? నేనెవరో గుర్తుపట్టావా? అని అడిగాడు. కానీ వాడు అదోలా చూస్తూ ఆఁ ఎందుకు గుర్తుపట్టలేదూ? నీవేకదా నన్ను చావచితకబాదింది అన్నాడు. అపుడే వచ్చిన మరికొందరు దారినపోయేవారు ఈ తతంగమంతా చూచి

బాటసారిని ఏమయ్యా చేసినదంతా చేసి ఏమీ తెలియనట్లు మాట్లాడుతున్నావే అని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి, వారి దారినవారు వెళ్ళారు. బాటసారి అప్పుడనుకున్నాడు ఔరా " మంచి చేయబోతే చెడు ఎదురైనట్లు" అంటే ఇదే కదా! అనుకుంటూ బాధతో వెళ్లాడు.

దురదృష్టం వెంటాడితే ఒక్కోసారి అంతే మరి. అలాంటి సందర్భాలలో ఇంకేమీ ఆలోచించకుండా మన తలరాత అని మనకు మనమే సర్దిచెప్పుకొని చేసిన మంచి పనికి తృప్తిపడతూ జీవించాలి. అంతే!

దేవుడుగా మారిన దొంగ

ఒక జమీందారు తోటలోని కొలనులో చేపలు పుష్కలంగా ఉండటాన్ని గమనించిన ఒక బెస్తవాడు ఎలాగైనా చేపలను పట్టుకోవలెనని అనుకున్నాడు. ఒకరోజు రాత్రి ఆ బెస్తవాడు వలను భుజాన వేసుకొని జమీందారు తోటలోకి ప్రవేశించినాడు. కానీ ఎవరో ఒకడు "ఉప్పందించగా" జమీందారు తన సేవకులను కాపుకాసి పట్టుకొని రండని ఆజ్ఞాపించాడు. సేవకులు దివిటీలు తీసుకొని తోటలోకి ప్రవేశించారు.

బెస్తవాడు చీకటిలో దివ్వెల వెలగును చూచి ముచ్చెమటలు పట్టగా తప్పించుకొనుటకు ప్రయత్నించాడు. కానీ ఏమార్గమూ కనిపించక వలను అవతల పారవేసి అటు ప్రక్కనే పడి ఉన్న బూడిదను శరీరమంతా గబగబా పూసుకొని ఒక చెట్టుక్రింద ధ్యానముద్రలో కూర్చున్నాడు.

తోటలోకి ప్రవేశించిన సేవకులు దివిటీల సహాయంతో తోటంతా కలియజూచారు. కానీ చేపల దొంగ వారికి కనిపించలేదు. చెట్టుక్రింద ధ్యానము చేయుచూ కూర్చొని ఉన్న సాధువును చూచి అతనిని పలుకరించినచో ధ్యానభంగమై ఎక్కడ శపించునోయని భయపడి అందరూ అతని పాదములకు నమస్కరించుకొని వెళ్లారు.

మరునాటి ఉదయమే ఆనోటా ఈనోటాపడి, జమీందారు తోటలో సాధువు వచ్చిచేరినాడు అన్నవార్త నగరమంతా తెలిసింది. జనులంతా ఫలములను, పుష్పములను తీసుకొని సాధువు దర్శనానికి ఎగబడి వచ్చారు. సాష్టాంగ దండ ప్రణామాలుచేసి కానుకలు సమర్పించారు.

ఆహా! ఏమి ఈ విచిత్రము? కపట వేషధారి అయిన నాకు ఎంతమంది పూజలు చేస్తున్నారు? వీరంతా నన్ను సాధువుననుకొన్న కారణంగానే ఇలా చేస్తున్నారు. నిజంగానే సాధువుగా మారినచో భగవంతుడే నాకు ప్రత్యక్షం కాగలడు కదా? అని బెస్తవాడు తీర్మానించుకున్నాడు. తను చేసిన తప్పులకు మనసులోనే తీవ్రంగా పశ్చాత్తాపపడ్డాడు. తన జీవితాన్ని అలాగే కొనసాగించి చివరకు ముక్తుడయ్యాడు.

అనుకోవడం కాదు ఆచరించాలి

ఒకనాడు అడవిలోని జింకలన్నీ ఒక చోటచేరి, తన జాతియొక్క శక్తి సామర్థ్యములను గురించి చర్చించుకొనుచుండినవి. కుశాగ్ర బుద్ధిగల ఒక జింక మిగతా జింకలనుద్దేశించి ఈ ప్రకారంగా, గంభీరంగా ఉపన్యసించసాగింది. సాటి జింకలారా చాలా కాలము నుండి మన జాతిని ఒక బలహీనత పట్టి పీడించుచున్నది. అదేమనగా కుక్కను చూచి చూడగానే మనజాతి వెనుకా ముందు ఆలోచించకుండా పలాయన మంత్రము పఠిస్తున్నది. ఈ విధంగా చేయుట సిగ్గుమాలినతనము. బలిష్టమైన, పొడవైన, వాడిగా నున్న కొమ్ములుగల మనం-పిక్కబలం చూపడం చాలా హాస్యాస్పదంగా ఉంది. మనమే గనుక తలచుకొని ఎదరు తిరిగితే, మనకొమ్ములతో కుక్కలను చీల్చి చెండాడవచ్చు. కానీ అలాగ చేయలేకున్నాము. దౌర్భాగ్యమునకు మూలకారణం మన శక్తిపై మనకు విశ్వాసము లేకపోవడమే. ఇదివరకు చేసిన తప్పులను ఇకముందెన్నడూ చేయకూడదు. కావున మనమందరం కలుసుకున్న ఈ సందర్భంగా, ఒక ప్రతిజ్ఞ బూనుదాం. ఈ క్షణం నుండి ఏ కుక్కైనా మనలను సమీపించినచో భయపడి పిరికి పందలమై పారిపోకుండా, వాటిని ధైర్యంగా ఎదుర్కొని, మన కొమ్ములతో వాటి అంతు చూడకుండా వదలనేకూడదు. చీల్చి చెండాడవలసిందే. అని నా అభిప్రాయం. మీరేమంటారు? "నా ఈ తీర్మానమును మీరందరూ ఏకీభవించి ఆమోదించెదరని విశ్వసిస్తున్నాను" అని తన ప్రసంగాన్ని ముగించింది.

సోదర జింక యొక్క గంభీర ఉపన్యాసమును విన్న జింకలన్నీ శహభాష్, అని మెచ్చుకుంటూ, మీరు పలికిన పలుకులు అక్షర సత్యాలు. కావున మీరు ప్రతి పాదించిన తీర్మానాన్ని మనస్ఫూర్తిగా మేమందరమూ ఆమోదిస్తున్నాం. అని ముక్త కంఠంతో పలికాయి. అదే సమయంలో దూరం నుండి ఒక కుక్క పరుగెత్తుకొని రావడాన్ని చూచిన జింకలన్నీ సామూహికంగా, ఒక్క పెట్టున లేచి ప్రాణములను అరచేతిలో పెట్టుకొని చెట్టుకొకటి పుట్టకొకటి శక్తికొలది పరారైపోయాయి.

ప్రతి మనిషి ఏదో ఒక సమయంలో తనలో ఉన్నలోపాలు, బలహీనతలు తనకే నచ్చక సరిదిద్దుకోవాలనుకుంటాడు. పట్టుదలతో, శ్రమించినచో బలహీనతలను పోగొట్టుకోగలడు. కానీ అలసత్వంతో, అశ్రద్ధచేసినచో జింకల మాదిరిగానే అనారోగ్య కరమైన, అవమానకరమైన జీవితమునే గడపవలసివస్తుంది.

* గతంలో చేసిన తప్పుల ఫలితాలే గుణపాఠాలు. పెద్దల అనుభవాలు, అనుభవసారాలు జీవితానికి రాచబాటలు, రాచబాటలను విడచిపెట్టి అడ్డదారులలో వెళ్ళేవారు మూర్ఖులు, సమాజానికి చీడపురుగులు. అభివృద్ధి నిరోధకులు.

చేసుకున్నవాడికి చేసుకున్నంత

పుణ్యకార్యంలోకానీ, పాపకార్యంలోకానీ చేసినవాడు, చేయించినవాడు, ఆమోదించినవాడు,ప్రోత్సహించినవాడు నలుగురు కూడా సమానంగా ఫలితాలను పొందుతారు.

పూర్వం ఒక పట్టణంలో గజదొంగ ఒకడు ఉండేవాడు. దారిదోపిడీలు, మానభంగాలు, హత్యలు చేసినందున ఎన్నోమారులు జైలు శిక్షకూడా అనుభవించాడు. అయినా తన చోరవృత్తిని మానుకొనలేదు.

ఒకరోజు పట్టణంలోకి దొంగతనం చేయుటకు వెళ్లాడు. కానీ అక్కడి వాతావరణం అనుకూలించక వెనుదిరగవలసి వచ్చింది. సరే! ఈ రోజుకు దొంగతనం చేసి సంపాదించే ప్రాప్తం లేదనుకున్నాడు. కానీ ఈ రోజు రాత్రికి కాలక్షేపం ఎలాగబ్బా!? అనుకుంటుండగా ఒక వీధిలో హరికథ జరుగుచున్నట్లు రాగాలాపన, తాళ, మృదంగముల మధుర ధ్వనులు వినబడ్డాయి. ఈ రాత్రికి హరికథ వింటూ కాలక్షేపం చేసి తెల్లవారి ఇల్లు చేరితే సరి అనుకున్నాడు.

భక్త జనుల మధ్య ఒక అనువైనచోటుకు వెళ్లికూర్చొని ఈ గజదొంగ హరికథను వినసాగాడు. అపుడు హరిదాసు ధర్మమును గురించి చక్కగా వివరిస్తున్నాడు. అరుదుగా లభించు మానవ జీవితమును పాపకార్యములను చేయుచూ వ్యర్థం చేసుకున్నచో జీవుడు భయంకరమైన యమయాతనల ననుభవించవలసి వస్తుంది అని వినసొంపుగా చెప్పాడు. ఆ మాటలను విగానే ఈ గజదొంగకు ఒకింత హృదయ పరివర్తన కలిగింది. తానుచేసిన ఘోర ఘాతుక చర్యలను ఒక్కసారిగా మనసును ముసురుకొనగా " ఈ పాపపు జీవితం ఎందుకు? జానెడు పొట్టకు ఇంతటి ఘోర అపచారములు చేయవలెనా? కాయకష్టము చేసి ఎంతమంది బ్రతకడంలేదు? అందరూ నాలాగే దొంగతనాలు చేసి జీవిస్తున్నారా? లేదు లేదు, ఇంకెంత మాత్రమూ దొంగతనం చేయకూడదు" అని మనసులో తీర్మానించుకున్నాడు.

హరి కథాశ్రవణం వలన దొంగలో కొంత మార్పు వచ్చినమాట వాస్తవమే అయినా దొంగబుద్ధి సమూలంగా నాశనం కాలేదు. అందువలన అతడు తనమనసులో ఈ విధంగా ధృడనిశ్చయం కావించుకున్నాడు. ఇంతవరకు నాజీవితంలో కొన్ని వందలమార్లు దొంగతనం చేశాను. ఇకపై ఇలాంటి పాపకార్యాల జోలికి అస్సలు వెళ్లకూడదు. ఏదో పొరపాటో, గ్రహపాటో, దొంగతనమే బ్రతుకుదెరువైపోయింది. ఒక్కసారిగా ఉన్నట్లుండి ఈ దుర్వ్యసనాన్ని వదలుకోవడం కష్టం. అందుకని ఇపుడొకసారి బ్రహ్మాండమైన ఒక పెద్దదొంగతనం చేసి ఇకపైన దానిని పూర్తిగా మానేస్తే సరిపోతుంది. అందరికంటే గొప్ప శ్రీమంతుడు రాజు. కాబట్టి ఈరోజు రాత్రి రాజుగారి అంతఃపురంలో దొంగతనం చేసి, ఆపైన దొంగతనం శాశ్వతంగా మానేస్తే సరిపోతుందని

మనసులో దృఢనిశ్చయం చేసుకుని ఈదొంగ ఒక జ్యోతిష్యుని వద్దకెళ్లి "మహానుభావా! నేనొక గజదొంగను, నాజీవితానికి ఇదే చివరి ప్రయత్నం. మరొకసారి దొంగతనం చేసే ప్రసక్తేరాకుండా పుష్కలంగా ధన, కనక రాశులు దొరికేటట్లుగా ఒక మంచి ముహూర్తమును నిర్ణయించి చెప్పవలసిందని వేడుకొన్నాడు. అందుకు సరిపడు సొమ్ముకూడా చెల్లిస్తాను అన్నాడు.

గజదొంగ మాటలు విని జ్యోతిష్యుడు కోపగించుకొని "ఇదెక్కడి బేరమయ్యా! నా జీవితంలో ఇంతవరకూ ఇలాంటి బేరం రాలేదు. ఇదే మొదటి అనుభవం. నేను పెళ్లిళ్లకు, గృహప్రవేశాలకు, శంకుస్థాపనలకు ముహూర్తాలు పెట్టగలనేకానీ దొంగతనాలకు పెట్టను''. అని తెగేసి చెప్పాడు.

కానీ దొంగ అంతసులభంగా వదలుతాడా? దొంగకు ఇదే కదా చివరి అవకాశం. కాబట్టి జ్యోతిష్యుని చెవిలో ఏదో రహస్యంగా చెప్పాడు. ఆమాట వినగానే జ్యోతిష్యుడు ఆనందంతో భుజాలెగరేసుకుంటూ వెళ్లి, తన దగ్గరున్న జ్యోతిష్య గ్రంథాలను ముందేసుకొని అటూ ఇటు త్రిప్పి ఒక బలవత్తరమైన ముహూర్తమును నిర్ణయించి దొంగకు చెప్పాడు.

ఈరోజు రాత్రి సరిగ్గా 12 గం॥ 30 ని॥ నీవు రాజుగారి అంతఃపుర ప్రవేశం చేయగలిగితివా నీపంట పండినట్లే, నాజోలి నిండినట్లే. ఈ ముహూర్తానికి అంత బలముంది అన్నాడు జ్యోతిష్యుడు. ముహూర్తబలమేమోకానీ అదేరోజు రాత్రి గజదొంగ నిరాటంకంగా అంతఃపుర ప్రవేశం చేయగలిగాడు. భటులు రాజ పరివారం అంతా గాఢనిద్రలో ఉండిరి. కాబట్టి గజదొంగ పని చాలా సునాయాసంగా జరిగిపోతూఉంది. వెంట తెచ్చుకున్న సంచులనిండా విలువైన ఆభరణాలు, బంగారుపాత్రలు మూటగట్టుకున్నాడు. ఇకపై దొంగతనాలు చేయకూడదని తీర్మానించుకొని ఉన్నాడు కాబట్టి, ఆశగా ఇంకా ఏమైనా దొరుకుతాయేమోనని వెదుకుతూ కాలాన్ని గమనించకుండా తనపాటికితాను దొంగతనాన్ని కొనసాగిస్తున్నాడు. ఇంతలో కొందరు తెల్లవారుజామున లేచారు. అలికిడివిని దొంగను బంధించి రాజుగారి దగ్గర హాజరు పరిచారు. రాజు విచారణ జరిపి దొంగకు నూరు కొరడాదెబ్బలు శిక్షగా విధించాడు.

రాజాజ్ఞననుసరించి భటులు దొంగ శరీరంపైనున్న వస్త్రములను తొలగించి కొరడా ఎత్తగనే "అయ్యలారా! నాభాగస్తుడు ఒకడున్నాడు. ఈ పట్టణమునందే ఉన్నజ్యోతిష్యుడే అతడు. దొంగతనంలో "చెరిసగం స్వాహా" అన్న తర్వాతనే ముహూర్తం నిర్ణయించాడు". కాబట్టి శిక్షలో అతనికి కూడా న్యాయంగా సగం వాటా ఉన్నది కదా? అని అన్నాడు దొంగ.

దొంగ మాటలు విన్న భటులు ఆశ్చర్యపడి, వెళ్లి రాజుగారికి జరిగిన అసలు విషయం చెప్పారు, రాజాజ్ఞప్రకారం జ్యోతిష్యుడిని ఆస్థానానికి పిలిపించి, విచారించి వారిద్దరి ఒప్పందం ప్రకారం శిక్షలో చెరిసగం అమలుపరచారు.

తాహతుకు మించిన పనులుజోలికి పోరాదు

హాయిగా ఆకాశంలో విహరించే పక్షులను చూచి ఒక పిల్లబాతు-తానుకూడా మిగతా పక్షుల మాదిరిగా ఆకాశంలో ఎగరాలనుకుంది. " లేడికి లేచిందే పరుగన్నట్లు" ఆ బాతుపిల్ల ఒక ఎత్తైన ప్రదేశానికి చేరుకొని అక్కడినుండి ఆకాశానికి ఎగరాలని రెక్కలాడించి ఎగిరింది. కానీ బాణంలా క్రిందికి దూసుకొని వచ్చి నేలమీద కూలబడింది. ఒళ్ళంతా గాయాలయ్యాయి. కాలుకూడా బెణికింది. ఈ తతంగమంతా చూచిన తల్లిబాతు " మనం మిగతా పక్షుల్లాగా ఆకాశానికి ఎగరలేం. నీటిలో ఈదగలమేకానీ పైకి ఎగరలేం". ఇలాంటి కానిపనులు ఎప్పుడూ చేయకు" అని అనునయించి చెప్పింది. కానీ పిల్లబాతుకు తల్లిమాటలు రుచించలేదు. ఆఁనీదంతా చాదస్తం. మీలాంటి ముసలోల్లమాటలు వింటే ఎదగలేం. మనకూరెక్కలున్నాయి గదా? ప్రయత్నిస్తే ఒకరోజు కాకపోతే ఇంకోరోజైనా ఎగరలేకపోతామా? అంటూ తల్లిమాటలను కొట్టిపడేసింది. అప్పటినుండీ ప్రతిరోజు ఎగరడానికి ప్రయత్నించడం, క్రిందకుపడి ఒళ్ళుహూనం కావడం తగిలిన గాయాలు మానినంతవరకూ గమ్మునే ఉండడం మామూలై పోయింది. కొన్నాళ్లకు తల్లి బాతు విసుగెత్తిపోయి నీ చావేదో నీవే చావు అని ఇక చెప్పడం మానేసింది.

ఒక రోజు ప్రొద్దున్నే కొలను వద్దకు వెళుతున్న పిల్లబాతుకు బిగ్గరగా ఏడుస్తున్న కాకిపిల్ల, దానిని సముదాయిస్తున్న తల్లికాకి కనిపించాయి. ఏం జరిగింది? అని ఆసక్తిగా అడిగింది పిల్లబాతు.

చూడు నాయనా! మీ బాతులన్నీ నీళ్లలో ఈదడం చూచి, తనుకూడా మీలాగా చక్కగా, హాయిగా నీళ్లలో చక్కర్లు కొట్టాలనీ, రోజంతా చల్లగా నీళ్ళలో ఈదాలనీ ఉబలాటపడుతున్నది అని చెప్పింది తల్లికాకి. నీళ్లలో బాతుల్లాగా ఈదడం మావల్లకాదు. ఎగరడం తప్ప మనం ఈదలేం అని ఎంత చెప్పినా వినిపించుకోవడంలేదు. మొండికేసి నీళ్లలోకి దూకింది. " చావుదప్పి కన్ను లొట్టపోయినట్లు" ఎలాగో కష్టపడి నేనే ఒడ్డున పడేశాను. లేకుంటే ఈపాటికి చచ్చిఊరుకునేది." అని జరిగినదంతా చెప్పింది తల్లికాకి. ఏమే పిల్లకాకీ, నీపిచ్చిపాడుకానూ, కాకులు ఎక్కడైనా ఈదగలవా? అని ఓదార్చుతూ చెప్పింది. ఇంతలో తాను ఇంతకాలం చేస్తూ వచ్చిన నిర్వాకం ఏమిటో గుర్తొచ్చింది పిల్లబాతుకు. నిజమే పిల్లకాకిలాగే నేనూ ఎంత తెలివి తక్కువగా ప్రవర్తించాను? అమ్మను ఎంత బాధపెట్టాను" నా వొళ్లూ ఎంత గాయపడింది? అని పశ్చాత్తాపపడింది.

* అన్ని తప్పులూ మనమే చేసి నేర్చుకోవడానికీ, అనుభవం సంపాదించడానికీ, జీవితకాలం సరిపోదు. కాబట్టి ఇతరులు చేసిన తప్పులనుండి సాధించిన విజయాలనుండి, పొందిన అనుభవాలనుండి నేర్చుకోవాలి. "పెద్దల మాట పెరుగన్నం మూట".

తోటకూరనాడే మందలించి ఉంటే ఈనాడు జైలు కూడు తప్పేది కదా!

ఒక గజదొంగకు కఠిన కారాగారశిక్ష పడింది. కారాగారంలో పడిన కొడుకును చూడడానికని అతని తల్లి వెళ్లింది.

జైలు అధికారి నీకొరకు ఎవరోవచ్చారు వెళ్లి మాట్లాడిరమ్మని అనుమతినిచ్చారు. గజదొంగ వెళ్లి చూడగా వచ్చింది తన తల్లి. వెంటనే కొడుకు ముఖం తిప్పుకున్నాడు. "ఏం నాయనా నీకోసం అంతదూరం నుంచి వస్తే ముఖం చాటేస్తావు" అని చాలా బాధగా అన్నది తల్లి.

కొడుకు తల్లి దగ్గరికి వచ్చి - చిన్నప్పుడు పక్కింటి పెరట్లో తోటకూర దొంగిలించి తెచ్చినప్పుడే వద్దని చీవాట్లు పెట్టకుండా మరీమరీ తెమ్మని ప్రోత్సహించావు. దాని ఫలితంగా గజదొంగగా మారాను. ఇలా శిక్ష అనుభవిస్తూ జైలు కూడు తింటున్నాను.

నన్ను మంచి మార్గంలో నడిపించకుండా దొంగను చేసిన నీముఖం చూడను. ఇకపై నన్ను చూచేదానికి రావద్దు...పో.. అని చీదరించుకున్నాడు కొడుకు.

సాధనమున పనులు సమకూరు ధరలోన

ఏదైనా అలవాటు చేస్తే కానిదంటూ ఉండదు. "అభ్యాసమేకూసు విద్య". "తినగతినగ వేము తియ్యనుండు". నిరంతర ప్రయత్నంతో సాధించలేనిదంటూ ఉండదు. చిలుక పలుకులు నేర్వగాలేనిది! పశువులు అద్భుతంగా పనులు చెయ్యగా లేనిది! అన్నీ ఉన్న మనిషి అనుకున్నది సాధించలేడా? "సాధనమున పనులు సమకూరు ధరలోన". చీమలు బారులు తీరి, నడచిన రాయిపైన పడిన జాడలను చూస్తున్నాం. కపిలకు కట్టిన తాడు రాపిడి వలన, రాయిపైన గాట్లు పడిన విధమును చూస్తున్నాం. అలాగే మహర్షులు, మహానుభావులు మనకు ప్రసాదించిన జ్ఞానమార్గాలలో నడచి సాధనచేసి "మనిషి-మంచి మనిషిగా" మంచి మనిషి-మహాత్ముడుగా" "నరుడే నారాయణుడుగా" ఎదగవచ్చు, జన్మను తరింపచేసుకోవచ్చు. అలా తరించిన వారు లెక్కలేనంతమంది.

సాధన అనేది అనుకరణ, స్వంతశైలి అని రెండు విధాలుగా సాగుతుంది. ఇతరుల గుణగణములను, నడవడికను, అలవాట్లను గమనించి అలాగే చేయడం అనుకరణ. తనలోలేని మంచి గుణాలను ఇతరుల నుండి గ్రహింపవచ్చును. కానీ వారిలాగే జీవిత నడతను నడవరాదు. అనుకరణ బలహీనుల లక్షణం. అనర్థదాయకం. కోతి మనిషి చేసినట్లుగానే చేస్తుంది. మలారి కోతిని పట్టుకొని ఆడించి జీవిస్తూఉంటాడు.

ఇంగ్లీషువారు చలి ప్రదేశంలో నివసిస్తున్నారు. కాబట్టి కేజీలు కేజీలు బరువుగల ఉలను కోటులను ధరిస్తారు. చలిగాలి లోపలికి పోకుండా మెడకు గట్టిగా ఉచ్చు బిగించుకున్నట్లుగా "టై" బిగిస్తారు. పాదాలకు బూట్లు తొడుగుతారు. శరీరంవేడిగా ఉండటానికి మద్యాన్ని సేవిస్తారు. ఆడతారు పాడతారు. ఆవిధంగా లేకపోతే వారు బ్రతకలేరు.

ఉష్టమండలంలోని ప్రజలకు అవి అవసరమా? లేనేలేదు. అయినా అన్నింటినీ అనుసరించి, అనుకరించి వీడువాడైపోయాడు. "పులిని చూచి నక్క వాత పెట్టుకున్నట్లు" "ఇరుగమ్మను చూచి పొరుగమ్మ పోటీపడినట్లు". చివరికి వీడేమైపోతాడో తెలియని స్థితికి వచ్చేశాడు.

ప్రతిదినము సూర్యోదయానికి పూర్వమే నదీతీరాన సంధ్యవార్చుకోవడం బ్రాహ్మణులకు అలవాటు. అందుకు వారు రాగిచెంబును పట్టుకెళ్ళేవారు. వారిలో ఒక బాపనికి ప్రతిరోజూ తన రాగిచెంబు మారటమో లేక పోవటమో జరిగేది. ఈ బాధనుండి బయటపడటానికి అతనికొక ఉపాయం తట్టింది. దాని ప్రకారంగా అందరికంటే ముందువెళ్ళి, ఇసుకతో కోసుగా చిన్న దిబ్బచేసి, ఆదిబ్బలో తన రాగిచెంబును కూర్చి, హమ్మయ్య, పరవాలేదు ఇక తను తాపీగా స్నానమూ చెయ్యవచ్చు, తర్వాత సంధ్య వార్చనూవచ్చు అనుకొని తృప్తిగా నిదానంగా స్నానం చేసి బైటికి వచ్చాడు.

ఇంతలో తరువాత వచ్చిన బ్రాహ్మణులు తమకంటే ముందున్న ఇసుక దిబ్బను చూచి " ఓహో ఈనాడు ఇలాగచెయ్యాలి. కాబోలు" అనుకొని, అందరూ ఇసుక దిబ్బ చెయ్యడం అందులో రాగిచెంబును దూర్చడం, స్నానానికి వెళ్లడం. ఇదే వరస. ఈ బ్రాహ్మణుడు ఒడ్డుకు వచ్చి తన చెంబు కొరకు చూడబోతే అన్నీ ఇసుక దిబ్బలో కూర్చిన రాగి చెంబులే. అదేదో రాగి చెంబుల మేళా జరుగుతున్నదా ఏమీ? అన్నట్లుగా ఉంది పరిస్థితి. వాటిలో తన చెంబేదో తెలుసుకోలేక దిగాలుపడి ఇలా అనుకున్నాడు. ఆహా! " గొర్రెదాటు" అంటే ఇదే కాబోలు. " ఇంగ్లండు వాడిని చూచి ఇండియావాడు బిగించుకున్నట్లు" ఉంది అనుకుంటూ తన చెంబేదో కనుక్కోలేక, ఇతరుల చెంబును తీసుకోలేక, వట్టిచేతులతో వచ్చేశాడు. అనుసరించడం మంచిదే. కానీ ఎందుకు? కారణమేమి? మనము అలా ఎందుకు చెయ్యాలి అని ఆలోచించి చేస్తే అనర్థాలు జరగవు. చాలామంది గుడ్డిగా " మఖ్కికిమఖ్కి"గా చేస్తారు. నష్టపోతారు. అన్నీ పనులూ అనుకరణకు పనికిరావు.

క్షమించమని అడగటానికి ఎంతో ధైర్యం కావాలి

నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ తెలిసి కొందరిని, తెలియక ఎందరినో బాధిస్తూనే ఉంటారు. ఎవరికి వారు ఇకమీదట బాధలూ పడకూడదు, బాధలు పెట్టనూ కూడదు. జాగ్రత్తగా మసలు కోవాలని అనుకుంటూనే ఉంటారు. అయినా క్రొత్తక్రొత్త పోకడలతో నిత్య నూతనంగా బాధలను కొని తెచ్చుకుంటూనే ఉంటారు.

జీవితం విలువైనది. మనం ఎందరితోనో కలిసి జీవించవలసివున్నది. అందరినీ అర్థం చేసుకుంటూ, సర్దుకుపోతూనో, లొంగిపోతూనో, పోరాడుతూనో, గెలుస్తూనో, ఓడిపోతూనో, అవమానింపబడుతూనో అవమానిస్తూనో, మింగలేక కక్కలేక, ఏమీ చెయ్యలేక అసమర్థతతోనో, ఏమైనా చెయ్యగల శక్తి-యుక్తులు ఉండీ ఏమి చెయ్యలేకనో బ్రతికేస్తూ ఉంటారు.వారు ఇంట్లోనివారూ కావచ్చు, లేక బైటి వ్యక్తులూ కావచ్చు.

ఒకరివల్ల మనం బాధలకు గురైతే మనగుండె చెరువవుతుంది. అలాగే మన వలన బాధపడిన వారి పరిస్థితి కూడా అంతే.

మనుషులు కొందరు కలసి ఒకచోట ఉండవచ్చు. కానీ మనసులు మాత్రం కలసి ఉంటాయన్న భరోసా ఎవ్వరూ ఇవ్వలేరు. కారణం? అందరికీ ఉన్నది. ఒకే మనసు. కానీ భావాలు వేరు. ప్రయత్నాలు వేరు. మార్గాలు వేరు. రుచులు వేరు. అభిరుచులువేరు. ఆలోచనా తీరు వేరు. వృత్తులు వేరు. ప్రవృత్తులు వేరు. సర్వసాధారణంగా అందరిలోనూ ఉండే గుణం ఏమిటంటే ఇతరుల తప్పులను ఎత్తిచూపడం, తమలోని తప్పులను సమర్థించుకోవడం. ఇతరుల తప్పులను ఎత్తి చూపిస్తే తమ విలువ పెరుగుతుందని, త్వరగా గుర్తింపు వస్తుందనే అపోహలో ఉంటారు. ప్రతి ఒక్కరూ ఇలా ఉండాలి, అలా ఉండాలి, ఇలా చేస్తే బాగుంటుంది అని తమకు అనుకూలమైన శైలిలో ఆలోచిస్తూ ఉంటారు. ఆశిస్తూ ఉంటారు. కానీ వారి ప్రవర్తన మరోలా ఉంటే విలవిలలాడిపోతూ ఉంటారు.

మనుషుల విచిత్ర స్వభావం ఏమిటంటే? తమ వల్ల ముక్కూమొహం తెలియని వారికి ఏ చిన్న కష్టం, నష్టం కలిగినా ఎంతో విశాల హృదయంతో సులభంగా, వెనుకాముందు ఆలోచించకుండా ఏమాత్రం తడుముకోకుండా 'సారీ' అనో 'క్షమించండి' అనో "పొరపాటు జరిగింది ఏమనుకోకండి ప్లీజ్" అనో "లెంపలు వేసుకునో" పాపపరిహారం చేసేసుకుంటారు. కానీ అయిన వారి దగ్గర మాత్రం అలా చెప్పడానికి తెగ ఇబ్బంది పడిపోతూ ఉంటారు. ఎందుకనో వారికి ఎక్కడలేని "ఆత్మాభిమానం", అహం, అడ్డొస్తుంది. గొంతులో నుండి మాట పెగిలి బైటికి రాదు. పైపెచ్చు, తామేదో తక్కువైపోయినట్లుగా తెగ బాధపడిపోతూ ఉంటారు.

క్షమించమనే మాట చెప్పడానికి చాలా ధైర్యమే కావాలి. హృదయం చాలా విశాలంగా ఉండాలి. ఇతరులను నొప్పించకుండా ఉండడం మర్యాదస్తుల లక్షణం. స్నేహితులకు, బంధువులకు, ఇరుగు పొరుగువారికి, తోటి ప్రయాణికులకు ఎవరికైనా సరే మనవలన జరిగిన తప్పులు, పొరపాట్ల వలన కష్టం, నష్టం, బాధ, అసౌకర్యం, ఇబ్బంది కలిగినపుడు, ధైర్యంగా చొరవ తీసుకుని, మంచి మనసుతో క్షమించమని అడగాలి.

క్షమించమని అడగగానే తప్పు చేశామన్న భావన తొలగిపోతుంది. మనసు తేలిక పడుతుంది.స్నేహాలు, బంధాలు తెగిపోకుండా, కలసి మెలసి ఉండగలుగుతారు.

ఇలాగా మంచిని పెంచుకుంటూ, బాధలను పంచుకుంటూ, సేవ, సహాయ, సహకారాల నందించుకుంటూ తప్పులను, పొరపాట్లను ఎప్పటికప్పుడు సరిదిద్దుకుంటూ క్షమాపణలు చెప్పుకుంటూ జీవిస్తే మనసు నిర్మలంగా ఉంటుంది. అసూయ పూర్తిగా తొలగిపోతుంది. మనసంతా ప్రేమతోనూ, స్నేహభావంతోనూ నిండిపోతుంది. జీవితం ఆనందమయమై పోతుంది.

తప్పుల సంచులు

బ్రహ్మదేవుడు ఓసారి మానవుణ్ణి తన వద్దకు పిలిచి, నీకేమి కావాలి? అని అడిగాడు. మానవుడు ఇలా బదులిచ్చాడు-నేను బాగా ఎదగాలి, అందరూ నన్ను పొగడాలి, నేను చెప్పింది వినాలి, చెయ్యాలి, నన్నెవరూ ఎదిరించకూడదు. నేను సుఖశాంతులతో ఉండాలి.

మానవుని కోరికలు విన్న బ్రహ్మదేవుడు వాడికి రెండు సంచులను ఇచ్చి, ఇలా అన్నాడు. ఈ రెండు సంచులలో ఒకదానిని నీ వీపుకు వేలాడదీసుకో, రెండవ సంచిని నీముందుకు వేలాడదీసుకో. వీపుమీదున్న సంచిలో ఇతరుల తప్పులున్నాయి. దానిని ఎప్పుడూ విప్పకూడదు, చూడకూడదు. ఇతరులకు కూడా చూపించకూడదు. నీముందుకు వేలాడదీసుకునే సంచిలో నీ తప్పులున్నాయి. దానిని మాత్రం పదేపదే తెరచి చూచుకుంటూ వుండు.

మనిషి రెండు సంచులనూ తీసుకున్నాడు. కానీ అతడు ఓ పొరపాటు చేశాడు. అదేమిటంటే తన తప్పులున్న సంచిమూతిని బాగా బిగించేసి వీపుకు ఎత్తుకున్నాడు. ఇతరుల తప్పులున్న సంచినీ ఎదురుగా వేలాడదీసుకొని అప్పుడప్పుడు దాని మూతిని తెరచి చూస్తూ, ఇతరులకు కూడా చూపించను మొదలుపెట్టాడు. దానివల్ల జరిగిందేమిటంటే బ్రహ్మదేవుడిచ్చిన వరం తలక్రిందులైంది. మనిషి తాను కోరుకున్నట్లుగా సుఖశాంతులుగానీ, ప్రశంసలుగానీ, పొందలేక పోయాడు. అతి సామాన్య మానవుడిగా ఉండిపోయాడు.

* ప్రతి మనిషీ తన తప్పులను దిద్దుకోవాలి. ఇతరులలో తనకు ఎలాంటి తప్పులు కనపడతాయో వాటిని తనలో లేకుండా చూచుకోవాలి. ఇతరుల తప్పులను సహృదయంతో అర్థం చేసుకోవాలి. అప్పుడే ఎవరైనా ప్రశంసింపబడతారు, సుఖశాంతులతో ఉండగలుగుతారు.

తప్పును తుడిచెయ్యాలి
నిప్పును ఆర్పివేయాలి
శత్రువును సంహరించాలి
అవినీతిని నిర్మూలించాలి
దుష్టుడిని శిక్షించాలి.

ఏ తప్పూచేయనివాడే శిక్షించాలి

అది సాయం సమయం దయామయుడైన క్రీస్తు ప్రభువు జెరూసలెం పట్టణ వీధుల్లో సంచరిస్తున్నాడు. ప్రశాంతంగా, గంభీరంగా, అనురాగపూర్ణంగా ఉన్న ఆయన వదనం ప్రజలందరినీ పరవశింపజేస్తున్నది. ఆ కన్నులలో కరుణ, ఆ పలుకులలో అమృతం, ఆ కరస్పర్శలో ఓదార్పు వెల్లివిరుస్తున్నాయి.

ఆయన ఎక్కడ అడుగుపెడితే అక్కడ ఆబాలగోపాలం పాదాభివందనాలు చేస్తున్నారు. కొంతమంది స్త్రీలు పాత్రలతో నీళ్ళు పట్టుకు వచ్చి ఆయన పాదాలు కడుగుతున్నారు. కొందరు ఆయన చేతులను కళ్లకద్దుకుంటున్నారు. మరికొంతమంది చేతులు జోడించి కష్టాలనుంచి కాపాడమని ఆయన్ను వేడుకొంటున్నారు. కొందరు పిల్లలు ఆయన అంగీని పట్టుకొని వూపుతూ ఆనందిస్తున్నారు. మరి కొందరు పిల్లలు నడుస్తున్న ఆయన కాళ్లకు అడ్డుపడుతున్నారు. క్రీస్తు ప్రభువు చిరునవ్వుతో ముందుకు సాగిపోతుంటే అశేష ప్రజానీకం ఆయనను అనుసరిస్తున్నది.

ఇంతలో ఒక మూలనుంచి ఒక ఆర్తనాదం వినిపించింది. అటువైపు చూడగా ఒక భయంకర దృశ్యం ఆయనకు కన్పించింది. కొంతమంది జనం ఒక యువతిని వెంటబడి తరుముకొని వస్తున్నారు. అసహాయురాలైన ఆమె పైన రాళ్ల రువ్వుతూ- ఇది దుర్మార్గురాలు. వంచకురాలు, దీన్ని మన పట్టణంలో ఉండనీయకూడదు అని పెద్దపెద్దగా కేకలు పెడుతున్నారు. దిక్కులేని ఆ దీనురాలి ముఖం వాడిపోయి ఉన్నది. వెంట్రుకలన్నీ చెల్లాచెదరై పోయాయి. కట్టుబట్టలన్నీ చీలికలైనాయి. పాపం! ఆ యువతి రెండు చేతులతో ముఖం కప్పుకొని పెద్దగా వెక్కి వెక్కి ఏడుస్తూ ఉంది. క్రూరమృగాల మధ్య చిక్కిన లేడిపిల్లలాగా ఆ జనం మధ్య చిక్కుకుపోయిన యువతిని చూచి క్రీస్తు ప్రభువు గుండె కరిగిపోయింది. ఆ యువతి ప్రభూ! నన్ను రక్షించు. వీళ్ళు నన్ను హింసిస్తున్నారు అని ఆయన పాదాలపైన వ్రాలింది.

క్రీస్తు ప్రభువు జనం దగ్గరకు వెళ్ళి చేతులెత్తి వారిని వారిస్తూ అయ్యలారా ! ఆగండి. కర్రలు క్రిందకు దించండి. రాళ్ళను పారవేయండి. మీరందరూ ఎందుకు ఈమెను ఇలా బాధిస్తున్నారు? ఈమె చేసిన అపరాధం ఏమిటి? అని అడిగాడు. వాళ్ళు ఆవేశంగా ప్రభూ ఇది కులట. పతితురాలు. దుష్టురాలు. మోసగత్తె. ఇది ఒక్క మంచిపని కూడా చేయలేదు. చెప్పరాని తప్పులు చేసింది. ఈ చీడ పురుగును ఇక బ్రతకనీయకూడదు. దీనిని ముక్కలు ముక్కలుగా నరికినా పాపంలేదు", అని పెద్దగా అరిచారు.

క్రీస్తు ప్రభువు క్షణకాలం ఆలోచించాడు. ఆయన తలెత్తి అందరివైపూ చూసి ప్రశాంతమైన కంఠ స్వరంతో ఇలా అన్నాడు. ఔనే! ఈమె చాలా తప్పులు చేసింది. అందువల్ల ఈమె శిక్ష పొందవలసిందే, ఈమె ఎంతో దుర్మార్గురాలు. అందుకని దండించవలసిందే. ఈమె అపరాధిని, కనుకనే ఈమెను క్షమించకూడదు. ఐతే మీలో ఎన్నడూ ఏ తప్పు చేయనివాడు ముందుకు వచ్చి ఈమెపై రాయి విసరాలి, అలాంటి పవిత్రుడు, అటువంటి బుద్ధిమంతుడెవరో ముందుకు రండి! రండి! మీలో పాపం చేయనివాడెవరో ముందుకు వచ్చి ఈమెని శిక్షించండి.

క్రీస్తు ప్రభువు పలుకులు విని అందరూ నిశ్చేష్టులైనారు. జనం అంతా ఒకరి ముఖాలు ఒకరు చూచుకొన్నారు. జీవితంలో ఏ తప్పూ చేయనివాడు ఎవరుంటారు? అందరూ ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక తప్పు చేసినవారే. అందువల్ల, ఆ యువతిని శిక్షించటానికి ఒక్కరు కూడా ముందుకు రాలేకపోయారు. అందరూ అలాగే ప్రతిమల్లాగా నిలబడిపోయారు.

అప్పుడు క్రీస్తు ప్రభువు వారిని చూచి ఇలా ప్రబోధించాడు. "నాయనలారా! మానవులలో తప్పు చేయనివారు ఎవరున్నారు? తప్పులు చేయటం మానవ సహజం, తప్పు తెలుసుకొని దుఃఖపడే వారిని దేవుడు తప్పక క్షమిస్తాడు. తోటి మానవులను ప్రేమించటమే మానవులమైన మన కర్తవ్యం. ప్రేమయే దైవం, దైవమే ప్రేమ.

ప్రశాంత గంభీరములైన ఆయన పలుకులు వినగానే వారంతా అవమానంతో, సిగ్గుతో తలలు దించుకొన్నారు. వెనుకకు తగ్గారు. మెల్లమెల్లగా వెళ్లిపోయారు. దీనురాలు కన్నీరు కారుస్తూ తనకు ప్రాణదానం చేసిన ప్రభువు పాదాలమీద వాలిపోయింది.

ఆయన ఆమెను ఓదారుస్తూ - సోదరీ! ఇకనుంచి నీవు మనస్సు మార్చుకో ! చెడునడతలు విసర్జించు. నీ పాపాలకు పశ్చాత్తాపపడు, నిన్ను భగవంతుడు రక్షిస్తాడు, వెళ్లు అని అభయహస్తంతో ఆమె శిరస్సును స్పృశించాడు. ప్రేమమూర్తి అయిన క్రీస్తు ప్రభువు పాదాలను కన్నీళ్లతో అభిషేకించి కన్నులకద్దుకొని ఆ యువతి మెల్లమెల్లగా కదలిపోయింది. కరుణామయుడైన క్రీస్తు ప్రభువు శిష్య బృందంతో కలిసి ముందుకు సాగిపోయాడు.

* నాలో చాలా తప్పులున్నాయి. అందులో తప్పులు సరిదిద్దుకోలేక పోవడం అనే తప్పు మాత్రం లేదు.
* మంచిని మైక్‌లో చెప్పాలి, చెడును చెవిలో చెప్పాలి.
* ప్రతి వ్యక్తిలోనూ బలహీనతలుంటాయి. వారి వారి స్థాయినిబట్టి తప్పొప్పులుంటాయి. చేసిన తప్పు ఆధారంగానే మనిషి ఇలాంటి వాడని ప్రచారం చేస్తారు. తప్పు చేయడం వెనుక అతని పరిస్థితుల గురించి, అప్పటి మానసిక స్థితిని గురించి, ఎవ్వరూ ఆలోచించరు. బురద చల్లడానికి మాత్రం అందరూ ముందుంటారు. సహాయ పడడానికి ఎవరూ రారు. మన తప్పుల్ని క్షమించాలని ఎలా కోరుకుంటామో అదే విధంగా ఇతరుల తప్పుల్ని క్షమించాలి. ఇతరుల చేత మనం ఎలా గౌరవింప బడాలనుకుంటామో అలాగే ఇతరులను కూడా మనం గౌరవించాలి.
* మనం తప్పు చేయనపుడు, మన పట్ల ఇతరుల ఉద్దేశ్యం ఎలా ఉన్నా మనకనవసరం.
* సరిదిద్దుకోకుండా వదిలేసిన తప్పులే నిజమైన ఆపదలు.

తృప్తి - సంతోషం

నా దగ్గరున్నది తృప్తి నివ్వడంలేదు. నాకు ఇంకా కావాలి. నాదగ్గరున్నది పోయింది. దానిని పూడ్చుకోవాలి. ఎలా? ఎలా? తనకున్నది ముఖ్యంకాదు. పొరుగువాడికి లేకుండడమే ప్రధానం. తను సంతోషంగా ఉండడం కాదు, ప్రక్కవాడు బాధపడుతూ ఉండడమే తనకు సంతోషం. "నాకు లేనిది వేరొకరికి ఉన్నది" "కొందరికి ఉన్నది నా దగ్గరలేదు". "నాకు లేకపోయినా పరవాలేదు, ఎదుటివాడికి ఉన్నందుకే నాబాధంతా". ఇలా పోల్చుకుని మనసులో కుమిలిపోవడమే 'అసంతృప్తి', నిరాశ, నిస్పృహ, ఆవేదన, దిగులుకు ప్రధాన కారణం.

* తనకంటే మెరుగైన పరిస్థితులలో ఉన్న వారిని చూచి ఈర్ష్యాసూయలకు లోనుకావడం మనసు నైజం.

ఈ లోకంలో నాకంటే లేని వారు ఎందరో ఉంటారు. వారికంటే నేను ఎంతో మెరుగు కదా? అనుకోవాలి. తృప్తి పడాలి. జ్ఞానంలో తనకంటే ఉన్నతుడితో పోల్చుకోవాలి. కష్టపడి శ్రద్ధాసక్తులతో సాధించాలి. ధనంలో తనకంటే క్రింది వారితో పోల్చుకుని, ఉన్నదానితో తృప్తి పొందుతూ జీవించాలి.

విద్యార్థులు తమకు మార్కులు రాకపోయినా పరవాలేదు. ప్రక్కవాడికి వచ్చాయని బాధ పడతారు. పోల్చుకుని ద్వేషం పెంచుకుంటారు. ఇది పద్ధతికాదు. విద్యార్థుల లక్ష్యం జ్ఞానం మీద ఉండాలి. పుస్తకంలోని జ్ఞానం ఎంతవరకు బుర్రలోకి ఎక్కించాము? ప్రశ్న పత్రంలోనికి వంద మార్కులకు గాను ఎన్ని సాధించగలుగుతాం? అనే ధ్యాస ఉండాలి. కానీ తమకంటే ఎక్కువ మార్కులు తెచ్చుకున్న వారిపై ద్వేషం కాదు.

'తృప్తి' అనే భావన అవధులు లేని ఆశలకు కళ్ళెం వేయడం లాంటిది. తృప్తి లేనివాడు ఇతరుల జీవితాలతో పోల్చుకుని, అసంతృప్తితో ఈర్ష్య-అసూయ, ద్వేషం, పగ, కుట్రలకు, కుతంత్రాలకు లోనై మరింత దిగజారుతూ, ప్రతీకార భావనలతో దాడులకు, దురాక్రమణలకు, నేరాలకు, ఘోరాలకు పాల్పడే అవకాశాలను సృష్టించుకుంటాడు.

తృప్తి, సంతోషం ఉన్నవాడే సంపన్నుడు. మరి కొందరు 'తృప్తి' అనేది ఎదుగుదలకూ, పురోభివృద్ధికీ అవరోధం అంటారు. సాధించిన ఏ కొద్దిపాటి ఫలితంతోనో తృప్తి పడితే ముందుకు పోవడమెలా? ప్రగతి సాధించడమెలా? పొందాలనుకున్నవి పొందడమెలా? అనికూడా వాదిస్తారు. పురోభివృద్ధి చెందడానికి అసంతృప్తే కారణం కానక్కర్లేదు. ధర్మనిష్ఠ, కర్తవ్యపరాయణత అనే భావనలుకూడా ఉన్నాయని జ్ఞప్తియందుంచుకోవాలి. తనవంతు కృషి ప్రయత్నం తప్పక చెయ్యాలి. ఫలి[illegible]దు

తనకెంత ప్రాప్తమో దానితోనే తృప్తి చెందటానికి అలవాటు పడాలి. ఏది? ఎంత అవసరమో తెలుసుకుని కర్తవ్య నిష్ఠకు పూనుకుని, ధర్మాచరణతో పరిమితిని, హద్దును నియంత్రించుకుని పురోగమనం చెందితే, వ్యక్తికీ, కుటుంబానికీ, సమాజానికీ, దేశానికీ క్షేమమే.

కొన్ని సందర్భాలలో దొరికిన దానితో తృప్తిపడి అల్పసంతోషులుగానూ ఉండాలి. మరొకొన్ని సందర్భాలలో ఆకాశమే హద్దుగా కర్తవ్యనిష్ఠతో ముందుకు దూసుకొని పోవాలి. అదే జీవితం.

* మనం దేనికి అర్హులమో అదే మనకు లభిస్తుంది
* మనం కోరుకున్నవన్నీ జరగవు! జరగవలసినవే జరిగి తీరుతాయి
* లేదు అన్నచోట లేమి ఉంటుంది! చాలు అన్న చోట కలిమి కులుకుతుంది.
* ప్రాప్తమున్నచోట ఫలమేలదప్పురా? అన్నారు పెద్దలు
* తృప్తిపడడమే సంతోషం.

తృప్తిలేని జీవితం అల్లకల్లోలం

ఒక వేటగాడు పెద్ద జింకను వేటాడి భుజాన వేసుకుని వస్తుండగా, ఓ ముళ్ళ పంది ఎదురైంది. దొరికిన వేటతో తృప్తి పడక, ఆ పందిని సైతం ఎందుకు వదలాలి? ఎలాగూ ఎదురొచ్చింది కదా అని భుజాన ఉన్న జింకను క్రిందికి దించి, ముళ్ళపందిని బాణంతో కొట్టాడు. దెబ్బతిన్న ఆ పంది పట్టరాని కోపంతో వేటగాడి మీదికి దాడిచేసి విపరీతంగా గాయపరచింది. ఆ దెబ్బకు వేటగాడు మరణించాడు. ఈ కుమ్ములాటలో పందికాళ్ళ క్రిందపడి ఒక పాము చచ్చింది. మరికొంత సేపటికి బాణపుదెబ్బకు ఆముళ్ళపంది కూడా చచ్చింది. జరుగుతున్న తంతునంతా సమీపంలోనే ఉన్న నక్క చూచింది. చచ్చిన వేటగాడినీ, జింకనూ, ముళ్ళపందినీ, పామును చూచి సంతోషించింది. దక్కిన ఆహారాన్ని చూచి తెగ సంబరపడి పోయింది. కొన్ని రోజులపాటు ఏమాత్రం కష్టపడకుండా మాంసాన్ని ఆరగించవచ్చునని సంతోషపడింది. చివరగా వేటగాడి ధనస్సుకు ఉన్న నరాన్ని చూచి, ప్రస్తుతానికి ఈ నరాన్ని తిని ఆకలి తీర్చుకోవచ్చు అనుకొని నరాన్ని కొరికింది. బిగుతుగా ఉన్న నరం ఒక్క ఉదుటున తెగి, ధనస్సు బద్ద అతి వేగంగా నక్క రొమ్మును తాకింది. అంతే నక్క ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.

దొరికిన దానితో తృప్తి పడక బోయవాడు చచ్చాడు. అంతులేని కోరికలతో తుచ్ఛమైన వింటినారికోసం నక్క ప్రాణాలనే వదులుకున్నది.

* ఉన్నంతలో తృప్తిగా జీవించాలి. లేనిపోని ఆశలతో, ఆలోచనలతో బ్రతుకు దుర్భరం చేసుకోకూడదు.

అసంతృప్తి ఒక మానసిక బలహీనత

ఓరోజు పరాంకుశం దిగులుగా ఉన్నాడు. కారణం ఏమిటని మిత్రుడు పరామర్శించాడు. మా పెద్దనాన్న చనిపోయాడు. చనిపోయేముందు నాపేర రెండు లక్షలు ఆస్తి వ్రాయించాడు అన్నాడు పరాంకుశం.

నిండు నూరేళ్లు జీవించాడు. వృద్ధాప్యం కారణంగా మీ పెద్దనాన్న చనిపోయాడు. అది సహజం. వారసులు లేని కారణంగా ఆస్తి నీకు దక్కింది కదా?, దిగులుపడకు అని మిత్రుడు ఓదార్చాడు.

దిగులు పడకుండా ఎలాగుండేదీ? మా చిన్నాన్న కూడా మరణిస్తేనూ!?... అలాగా? అయ్యో! ఆయన కూడా పోయారా? అవును ఆయనకూడా నాపేర నాలుగు లక్షలు ఆస్తి వ్రాయించాడు. పాపం! పరాంకుశం ఏడుపు కొనసాగిస్తూ చెప్పాడు.

"ఆయన కూడా వయస్సు పై బడ్డవాడేకదా?, కాలం చెల్లింది, పరలోక యాత్ర చేశాడు. దిగులు పడకు. ఇద్దరు దాయాదుల ఆస్తి వచ్చి పడింది కదా? హాయిగా తిని కూర్చోక"! అని ఓదార్చాడు మిత్రుడు.

అది కాదురా! పది లక్షల ఆస్తి ఉన్న మరొక దాయాది లేకపోయాడే అనే రా.. నా బాధంతా అని ఏడ్చాడు పరాంకుశం.

- - - - -

ఓబయ్య పదిహేను ఎకరాల ఆసామి పొలమంతటిలోనూ సజ్జపంట వేశాడు. ఆ సంవత్సరం ఎలాంటి చీడ పీడలూ పట్టకుండా చాలా మంచి పంట పండింది. దిగుబడి బాగా వచ్చింది.

గ్రామస్తులు, తోటి రైతులు చాలా సంతోషించారు. చాలా అదృష్టవంతుడివి ఓబయ్యా! అంటూ పొగిడారు. కానీ ఓబయ్య మాత్రం దిగులుగా ఏదో పోగొట్టుకున్న వాడిలాగా విచారంగా డీలాపడి ఉన్నాడు. తోటి రైతులంతా నీ దిగులుకు కారణం ఏమిటి? అని ఓబయ్యను పదే పదే ప్రశ్నించారు.

దానికి సమాధానంగా ఓబయ్య ఏడుపు ముఖం పెట్టుకుని, దిగులుగా, సజ్జచేను బాగా పండింది. ఒక్క సల్లుగింజ కూడా లేకుండా పండింది. బాగుంది. కానీ పండిందంతా గట్టిగింజే అయితే, నా పశువులకు సల్లుగింజలమేత ఎక్కడినుండి తీసుకురావాలి? వాటికోసం మరలా కొనాలి కదా? తల బాదుకుంటూ చెప్పాడు.

ఎంత ఉన్నా ఇంకా అదిలేదు, ఇదిలేదు అని యేడ్చే అసంతృప్తులను ఎవరూ ఓదార్చలేరు.

ఆరోగ్యం - 2

అంతిమలక్ష్యమైన "మోక్ష" సాధనకే ఈ మానవ ప్రాణికి ప్రకృతి మాత బుద్ధిజీవిగా ఎదుగుదలనిచ్చింది. సవ్యంగా ఉన్న వాహనమే సుఖ ప్రయాణానికీ, సురక్షితంగా సకాలంలో గమ్యం చేర్చడానికీ ఉపయోగపడుతుంది. సవ్యంగా లేని వాహనం ప్రయాణానికి పనికిరాదు. అలాగే ఆరోగ్యంగాలేని శరీరం మోక్షమనే గమ్యాన్ని చేర్చలేదు. సృష్టి ధర్మాన్ని, సృష్టినియమాన్ని పాటిస్తూ జీవిత లక్ష్యాన్ని చేరుకోవాలంటే పరిపూర్ణ జీవనయాత్ర చేయాలి. అందుకే "శతమానం భవతు" దీర్ఘాయుష్మాన్‌భవ" నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో, జ్ఞానంతో వర్ధిల్లండి" అని పెద్దలు దీవెనల రూపంలో గుర్తు చేస్తుంటారు.

ఆరోగ్యం అంటే మానసికంగా, బౌద్ధికంగా, సామాజికంగా, ఆధ్యాత్మికంగా నిలకడగా ఉండే స్థితి.

ఆరోగ్యమే బలం
బలహీనతే మరణం

ఎవరు ఏ పని చేయాలన్నా శారీరక బలం, ఆత్మబలం ఉండాలి. నీరసం. నిరాశ, నిస్పత్తువ, నిరుత్సాహం, నిస్పృహ, సోమరితనం మనిషిని అన్ని విధాలా కృంగదీస్తాయి.

దేహమెంతో విలువైనది

ఒక నిరాశాపరుడు ప్రతిరోజూ ఇలా బాధపడేవాడు. " తన పొరుగువారు భగవంతుని దయవలన చాలా బాగా ఉన్నారనీ,తాను మాత్రమే నిరుపేదగా, ఎలాంటి సంతోషాలకూ నోచుకోక దీనస్థితిలో ఉన్నాననీ, భగవంతుని కృప తనపై ఏమాత్రం లేదనిన్నీ"

ఒకరోజు ఆ గ్రామానికి వచ్చిన సాధువుతో తన ఆవేదనను ఏకరువుపెట్టాడు. భగవంతుని నిర్దయను పదే పదే ప్రస్తావించి బాధపడ్డాడు. సాధువు ఆ వ్యక్తిని సముదాయిస్తూ భగవంతుడు నీయెడల కూడా అపారమైన కరుణనే చూపించాడు. అమూల్యమైన సంపదనే ఇచ్చాడు. కానీ, నీవే గుర్తించలేకున్నావు అన్నాడు.

అందులకా పేదవాడు తన దగ్గర అలాంటివేవీ లేవే? అన్నాడు. ఆశ్చర్యపోతూ అపుడా సాధువు నాయనా! భగవంతుడు కరుణతో నీకిచ్చినది ఆరోగ్యభాగ్యము. అమూల్యమైన సంపద నీ అవయవాలు, నీ కన్ను ఒక దానిని ఇవ్వగలిగితే పాతిక వేలిస్తారు. మూత్రపిండం ఒకదానిని ఇవ్వగలిగితే లక్షరూపాయలిస్తారు. ఇలా నీ శరీరంలోని ఏ భాగాన్నైనా ఇవ్వగలిగితే లక్షల రూపాయలు ఇచ్చేదానికి ఎంతోమంది సిద్ధంగా ఉన్నారు.

అది విన్న ఆవ్యక్తి తన అవయవాలను ఇచ్చేదానికి నిరాకరించాడు. సాధువు ఆ వ్యక్తి వీపు తట్టి " చూశావా! లక్షల రూపాయల విలువజేసే శరీరాన్ని, వెలకట్టలేని ఆరోగ్యాన్ని భగవంతుడు నీకు ప్రసాదించాడు ఇంకేమి కావాలి నాయనా నీకు? ఈ శరీరంతో కష్టపడి పనిచేసి తృప్తిగా, ఆదర్శంగా, జీవించు నాయనా!" అని దీవించి వెళ్ళాడు.

దేహమే దేవాలయం

ప్రకృతి మాత ప్రసాదించిన ఈ శరీరాన్ని, "నవ రంధ్రముల తోలు బొమ్మ" అనీ చీము-నెత్తురుతో నిండిన తోలుతిత్తి అనీ, "చిటికెలో చితికిపోవు నీటి బుడగలా అశాశ్వతమైనదని కొందరు వేదాంతులు నిర్లక్ష్యపుభావనతో, ఏవగింపుతో నిందిస్తుంటారు. కానీ ఈ విధమైన నిందలు సనాతన ధర్మానికి అంగీకార యోగ్యమైనవి కావు.

మనిషి శరీరం ఒకటే శాశ్వతమైనదనికాదు. సృష్టిలోని ప్రతిప్రాణి ఏదో ఒకనాడు తనువు చాలించాల్సిందే. అసలు "జగత్" అంటేనే (జ=పుట్టు; గత్= గతించు) చావుపుట్టుకలమయం. ఆకులు, పూలు, కాయలు, పండ్లు మనకు ఉపయోగ పడతాయని కొనుక్కుంటాం. రేపటికి వాడిపోతాయని, పండుమాగుతాయని, ఆలస్యం చేస్తే క్రుళ్లిపోతాయని పారవేయం. వీలైనంతమట్టుకు ఉపయోగిస్తాం. ఆ తర్వాతనే ప్రక్కన పడవేస్తాం.

శరీరం అశాశ్వతమంటే శరీరాన్ని నిర్లక్ష్యం చేయమని, అసహ్యించుకొమ్మనికాదు." ఈ దేహం ఎపుడు నిర్జీవమైపోతుందో చెప్పలేం. అందుకనే " దీపం ఉండగనే ఇల్లు చక్కబెట్టుకోవాలి." ఈ దేహం మనతో ఉన్నపుడే మనం ఎలా జీవించాలి? జీవధర్మమేమిటి? ఆనందంగా జీవించాలంటే ఏం చేయాలి? అని తెలుసుకొని జాగ్రత్తగా జీవించాలనే దృష్టితోనే మన పెద్దలు శరీరాలు అశాశ్వతాలని అన్నారు.

దేహం మీద మమకారంతో అంద-చందాలకోసం భోగవిలాసాలకోసం లేనిపోని వ్యామోహాలు, తపనలు పెంచుకోవడం తప్పని జ్ఞానుల హితబోధ. అంతేగానీ శరీరం పనికిరాని పదార్థంగా మనపెద్దలు చెప్పలేదని గ్రహించాలి. "శరీర మాధ్యం ఖలు ధర్మసాధనమ్" ధర్మార్థకామ, మోక్షముల సాధనకు దేహమే మూలాధారమని గురువుల ఉపదేశం.

శుష్కవేదాంతం వల్లించి, నిష్క్రియాపరులై ఉండటం కంటే పరోపకారంలో పరమేశ్వరుని చింతనలో ఈ దేహమును ఉపయోగించడమన్నది చాలా గొప్ప భావన. అందులోనే అనిర్వచనీయమైన ఆనందానుభూతి ఉంది.

దేవాలయాలపై స్త్రీ పురుషుల శిల్పాలను పరిశీలిస్తే అంగసౌష్టవం ఎలా ఉండాలో అర్థమవుతుంది. చేతిజబ్బలు, రొమ్ము, కడుపు, నడుము, తొడలు ఎక్కడివక్కడ కుదురుగా అమరివుంటాయి.

దేవాలయానికి అందరూ వెళతారు. అక్కడున్న శిల్పాల అంగాంగాల అందాలను, భంగిమలను చూచి సంతోషించి వస్తారేకానీ, ప్రేరణపొంది, మనమూ అలా శరీరాన్ని తీర్చిదిద్దుకోవాలి అనే విషయాన్ని మరచిపోయి, తిండికి ప్రాధాన్యమిచ్చి బొరుగుల బస్తాలాగా శరీరాన్ని పెంచేనకుంటే ఆరోగ్యం వస్తుందా? ఆనందముంటుందా? నీరసం, ఆయాసం మాత్రమే ఉంటుంది.

బొజ్జలతో ఉన్న శిల్పాలకు మీసాలు, కోరలు ఉండటాన్ని దేవాలయాలపై చూస్తుంటాము. వారి స్థానం కాపలాకాస్తూ, భారీ బరువును మోస్తూ ఒక మూల ఉంటారు. అలాగనే బొజ్జలు పెంచుకున్నవారు చాలా విషయాలలో ప్రాధాన్యాన్ని పోగొట్టుకుని నిరుపయోగమైన స్థానంలో ఉండిపోతారు.

తనను తాను రక్షించుకుంటూ జీవించుటకు శరీరారోగ్యం ఉపయోగపడుతుంది. మానవుల విషయంలో మోక్షమే లక్ష్యం. కాబట్టి సంపూర్ణ ఆరోగ్యం అవసరం. అనగా బుద్ధిని, మనసును కూడా ఆరోగ్యంగా ఉంచుకుంటూ, తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని ఆరోగ్యంగా, అందంగా,ఆనందంగా, ఆహ్లాదకరంగా ఉంచడం.

సంపూర్ణ ఆరోగ్యవంతుడు తనను తాను రక్షించుకోవడమే కాక, అవసరం వచ్చినప్పుడు తనతోటివారిని, తనచుట్టూ ఉన్న వాతావరణాన్ని సురక్షితంగా ఉంచగలుగుతాడు. కావున మనిషికి పరిపూర్ణ ఆరోగ్యమే వాంఛనీయం.

ఈత నేర్చుకున్నవాడిని ఈతగాడు అంటారు. అతడు అవతలి గట్టును చేతనైన రీతిలో చేరగలుగుతాడు. వరదలు వచ్చినపుడు ఉపయోగపడే ఈతగాళ్లను గజఈతగాళ్లు అంటారు. వారు తమనుకాపాడు కుంటూనే, ఆపదలోనున్నవారిని కూడా సురక్షితంగా దరికి చేర్చగలుగుతారు. ఈతగాడుగాకంటే గజ ఈతగాడుగా జీవించడమే సార్థకం. ఆరోగ్యవంతుడిగా జీవించడం మధ్యమం, సంపూర్ణారోగ్యవంతుడిగా జీవించడం ఉత్తమం. పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ, మోక్షాలను సాధించాలంటే, శరీరం సంపూర్ణారోగ్యంగా ఉండాలి. కుటుంబంలో ఆరోగ్యం సరిగాలేని సభ్యుడొకరున్నా ఆ యింటిల్లిపాదీ సుఖ-సంతోషాలకు దూరమౌతుంది. అలాంటిది సమాజం మొత్తం రోగులమయం అయితే ఆ సమాజం రోగులతో నిండిన ఆసుపత్రే కదా. ఇక సుఖ, శాంతులెక్కడినుండి వస్తాయి? సమాజమంతా అలజడులమయమే కదా? " ఈసురోమని మనుషులుంటే దేశమేరీతి బాగుపడునోయ్"? 'ఆరోగ్యమే మహాభాగ్యం' ఎన్ని భోగభాగ్యాలున్నా ఆరోగ్యభాగ్యం లేకుంటే దరిద్రమే అన్నారు పెద్దలు.

ఆహారం :- దేహారోగ్యానికి ఆహారం మూలం. ఆహారం రుచికరమైనదిగానూ, పరిశుభ్రమైనది గానూ, శక్తిని కలిగించునదిగానూ ఉండాలి. శ్రేష్ఠమైన ఆహారం శాకాహారమే.

మాంసాహారం రాక్షసాహారం. మాంసాహారం కొవ్వును వృద్ధి చేస్తుంది. ఫలితంగా శరీరం, బుద్ధి మందగిస్తుంది. చురుకుదనం తగ్గిస్తుంది. కాబట్టి చురుకుదనానికి. శక్తికి కొవ్వులేని "సీ ఫుడ్ - సముద్రాహారం" తినండని వైద్యులు సూచిస్తుంటారు. బ్రతికినా, చచ్చినా కంపుకొట్టే చేపలు కడుపులో కెళ్లాక ఇంపైనదిగా ఎలా మారుతుందో? "ఎవడి కంపు వాడికింపు".

* ఆకులు తిన్న మేకలు కొండలెక్కును - ఆ మేకలను తిన్న మనిషి మంచమెక్కును
* మాంసాహారాన్ని త్యజించినచో అహింసావ్రతాన్ని సగం పాటించినట్లే.
* కోరలున్న వాటికే మాంసాహారం - దంతములున్న మనిషికి శాకాహారం.
* జైసాఅన్న్ వైసామన్.

శరీరారోగ్యాన్ని పరిశుభ్రత, ఆహారం, అలవాట్లు ప్రభావితం చేస్తాయి. కాబట్టి తీసుకునే ఆహారంలోనూ, వ్యవహారంలోనూ, పరిశుభ్రతను పాటించడంలోనూ మొహమాటం పనికిరాదు.

* ఆకలైనపుడు మాత్రమే భుజించాలి కానీ మంచినీరు మాత్రం దప్పిక అయినపుడే కాక అపుడపుడూ త్రాగుతూనే ఉండాలి.

ఆకలై తినేది,
తోడు కోసం తినేది,
ఉంది కదా అని తినేది,
వేళ తప్పి తినేది,
పారెయ్యలేక తినేది,
మిగిలింది కదా అని తినేది,
కొసరి కొసరివడ్డిస్తున్నారు కదా అని తినేది,
ఈ కొంచెం మిగిల్చడమెందుకు అని తినేది,
రుచిగా ఉందికదా అని తినేది,
ఊరకనే వచ్చింది కదా అని ఆబగా తినేది,
వాడొచ్చి తినేస్తాడేమో అని ముందుగానే లాగించేది.
టి.వి. సీరియల్ చూస్తూ ఎంత తిన్నామో తెలియకుండా తినేది,
అయిపోతుందేమోనని గబగబా లాగించేది.

నాగరికుడనబడే ఈమనిషి తప్ప భూమిపైనున్న ఏ ప్రాణైనా ఇన్ని రకాలుగా తింటుందా? ఇక రోగాలు రాగాలు తియ్యకుండా ఉంటాయా?

* అతి తిండి ఆయుక్షీణం.
* ఏక భుక్తం మహాయోగి, ద్విభుక్తం మహాభోగి, త్రిభుక్తం మహారోగి.
* మితంగా తింటే అమృతం. అమితంగా తింటే విషం.

తల్లిదండ్రులు తమబిడ్డలను మొదట ఎలా చదువుచున్నావు? నీ ర్యాంక్ ఎంత? ఎన్ని గంటలకు నిద్రలేస్తున్నావు? ఇంకా బాగా కష్టపడాలి? అని అడుగుతారేకానీ. నాయనా నీ ఆరోగ్యం ఎలా ఉంది? వేళకు తింటున్నావా? నిద్రబాగా వస్తున్నదా? ఆకలి బాగా అవుతున్నదా? విరేచనం సాఫీగా అవుచున్నదా? అని అడగడంలేదు. ఒక వేళ అడిగినా ఆలస్యంగానే.

పోటీ తత్వంతో ఆరోగ్యాన్ని విస్మరించి, చదువుపై అతి శ్రద్ధ చూపించి, శారీరక-మానసిక బలహీనులుగా ఈనాటి యువతరం తయారవుతున్నది.పెద్దలు తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి. ఆరోగ్యానికి ఆకలి, విరేచనంతో చాలా దగ్గరి సంబంధముంది. కాబట్టి మలబద్దకం లేకుండా చూచుకోవాలి. మలబద్ధకం ఆరోగ్యంపైన, ఆలోచనలపైన చాలా ప్రభావం చూపుతుంది. కాబట్టి తగినన్ని నీళ్లు త్రాగడం మరచిపోకూడదు. 'సాఫీగా విరేచనం హుషారు జీవితం' మలబద్ధకం సోమరితనానికి, దరిద్రానికి గుర్తు. మనిషికి సుఖం ఎప్పుడుంటుందయ్యా? అని అడిగితే సాఫీగా విరేచనం అయ్యేటపుడు అన్నాడట ఒకడు. నిజమే కదూ!

ఆరోగ్యం విలువ అనారోగ్యంలోనే తెలుస్తుంది

కళింగపట్నంలో శంకరశ్రేష్టి అనే శ్రీమంతుడుండేవాడు. అతను నిత్యం ఎందరికో అన్న-వస్త్రదానాలు చేస్తుండేవాడు. అన్నార్తులు తృప్తిగా తిని, అతని దాతృత్వాన్ని మనసారా కొనియాడుతూ వెళ్లేవారు.

ఒకనాడు ఒక ప్రసిద్ధ వైద్యుడు శంకరశ్రేష్ఠి ఉన్న గ్రామంలో బస చేశాడు. విషయం తెలుసుకున్న శంకరశ్రేష్టి వైద్యుని దగ్గరికెళ్లి తనను చాలా కాలంగా వేదిస్తున్న బాధను ఇలా నివేదించుకున్నాడు. "అయ్యా! వైద్యులుగారూ గత కొన్ని సంవత్సరాలుగా నేను తృప్తిగా భోజనం చేయలేకపోతున్నానంటే నమ్మండి! ఎన్ని భోగ భాగ్యాలున్నా ఏం ప్రయోజనం చెప్పండి! కడుపారా తినలేని జీవితం. ఒక జీవితమేనా? మా గృహ వైద్యులు కూడా ఎన్నో మందులిచ్చారు. అయినా ఫలితం మాత్రం లేదు. చివరికి ఒక సాధువు చెప్పిన ప్రకారం నిత్యాన్నదానం చేస్తూ తృప్తి పడుతున్నాను. తమరు ప్రసిద్ధి చెందిన వైద్యులని విన్నాను. దయచేసి నా జబ్బును నయం చేయండి. మీరు కోరిన పైకం ఇచ్చుకుంటాను." అని.

వైద్యుడు శంకరశ్రేష్టిని బాగా పరిశీలించి "శ్రేష్ఠిగారూ నేను కొంతమంది ఆహ్వానం మేరకు పలు ప్రదేశాలకు వెళ్లవలసివుంది. మీరు నాతోకూడా వచ్చి, నేనెలా ఉండగలుగుతానో అలాగే ఉండగలిగితే నీజబ్బు సంపూర్ణంగా నయం చేయగల్గుతాను. సమ్మతమేనా? అన్నాడు. అంతకంటే భాగ్యమా! అని వెంటనే తన బాధ్యతలను కొడుకులకు అప్పజెప్పి, వైద్యుని వెంట ప్రయాణమై వెళ్లాడు శ్రేష్ఠి.

దాదాపు పది మాసాల పాటు వైద్యుడు శ్రేష్టిని తనవెంట తిప్పుకున్నాడు. వైద్యునితోబాటు శ్రేష్ఠికూడా ఆహారనియమాలు పాటించినందువలన సుఖాలకు, సౌకర్యాలకు లోను కాకుండా కాలి నడకన ప్రయాణించి, కటిక నేలపై పడుకొన్న కారణంగా శ్రేష్టి శరీరంలోని అనవసరపు అదనపు క్రొవ్వు బాగా తగ్గిపోయింది. ఏనుగులాగా ఉండిన శ్రేష్ఠి పీనుగలాగా తయారయ్యాడు. పెద్దసైజు నీళ్లకడవలాగా ఉన్న పొట్ట బాగా తగ్గిపోయింది. మందగించిన జఠరాగ్ని రగులుకొని మధ్యాహ్న సూర్యుడిలా మండిపోసాగింది. ఉండ్రాళ్లు తిన్నా హరాయించు కునే స్థితి వచ్చింది.

వైద్యుడు శ్రేష్టి పరిస్థితిని గమనించి, ఇంటికి వెళదాంపదమన్నాడు. గుర్తుపట్ట లేనంతగా మారిపోయిన శ్రేష్ఠిని చూచి భార్యాబిడ్డలు ఆనందాశ్చర్యాలకు లోనయ్యారు.

"రెక్కాడితే కానీ డొక్కాడకూడదు" అన్నారు పెద్దలు. అంటే "రెక్కల కష్టం చేస్తేకానీ తినకూడదు" అని. చెమటోడ్చి పనిచెయ్యనివాడికి తినే అర్హతలేదు "దున్నలా కష్టపడాలి దొరలా తినాలి" అన్నారు. కష్టపడకుండా కూర్చొని తింటున్నారు గనుకనే ఇన్నిరోగాలు. మనిషికి వ్యాయామం తప్పనిసరి.

షుగరు, బి.పి. రోగాలు వచ్చాకగానీ చెమట విలువ తెలియలేదు చాలా మందికి. అందుకే రోడ్లన్నీ Morning and Evening Walkers తో నిండిపోతున్నాయి.

ఓరోజు ఉదయాన ఒక భారీ కాయమ్మ తన శరీరాన్ని ఈడ్చుకుంటూ, ఈదుకుంటూ నడవడం చూచి ఒక ఆకతాయి " నీబట్టలు నీవే ఉతుక్కొని, నీ ఇల్లు నీవే ఊడ్చుకుని, నీవంట నీవే వండుకుని తింటే ప్రొద్దున్నే ఈ ఈదులాట తప్పేది కదా! అన్నాడు. అది విన్న ఆ భారీ కాయమ్మ - నిజమేనాయనా! నాగతి నీకు, నీ భార్యకు రాకుండా చూచుకో" అంది.

* A SOUND MIND IN A SOUND BODY.
* దృఢమైన శరీరమునందే దృఢమైన మనసుంటుంది.
* ఘన పదార్థాలను నీళ్లలా త్రాగాలి, ద్రవపదార్థాలను నమిలి మ్రింగాలి.
* లంఖణం పరమౌషధమ్ "వేరు తపములేదు ఉపవాస వ్రతము కంటే".
* తక్కువ ఆహారం ఎక్కువ ఆయుర్దాయం.

అలవాట్లు :- ఈనాటి స్పీడ్ లైఫ్‌లో నిర్ణీత సమయానికి తప్పనిసరిగా చెయ్యవలసిన పనులను వీలుదొరికినపుడు చెయ్యడం, నేను చాలా బిజీగా ఉన్నానని గర్వంగా చెప్పుకోవడం చాలా మామూలైపోయింది.

సమస్త శారీరక-మానసిక రోగాలకు, దౌర్బల్యాలకు మూలం పాశ్చాత్య పోకడలను గ్రుడ్డిగా అనుకరించడమే. వ్యసనాలకు బానిసై యుక్తాహార-విహారాలను లెక్కచేయక ప్రకృతికి విరుద్ధంగా, మన స్వంత దేశవాళీ జీవనశైలికి వ్యతిరేకంగా జీవిస్తూ, రోగాలను పెంచి పోషించుకుంటున్నారు.

గ్రామీణ జీవితం ప్రకృతికి దగ్గరగా ఉంటుంది. గాలి, నీరు, సూర్యరశ్మి భూమి, ఆకాశం కల్మషరహితంగా, ఆరోగ్యప్రదాయినులుగా ఉంటాయి. అందుకే గ్రామీణులు దృఢశరీరులుగా ఉంటారు. రోగ నిరోధక శక్తి కలిగిఉండి కష్టాలకు తట్టుకోగలుగుతారు.

ఆరోగ్యానికి తప్పనిసరిగా మంచి అలవాట్లుండాలి. మనిషి చిరంజీవిగా ఉండాలని కోరుకుంటాడు కానీ, తన అలవాట్లు మాత్రం దానికి వ్యతిరేకంగా ఉంటాయి. పొగపీల్చడం, మద్యం సేవించ్చడం, మసాలా పదార్థాలు తినడం, వేళకు తినకపోవడం, వేళకు నిద్రపోకపోవడం, ప్రొద్దుపోయేంతవరకు టి.వి. చూడడం. అనవసర విషయాలలో తల దూర్చడం,ఆవేశాలకు లోనుకావడం, ఇంటిపనులు, స్వంతపనులను చెయ్యకపోవడం, చెడుసహవాసాలు మొదలైనవన్నీ ఆరోగ్యాన్నీ, ఆయుష్షును క్షీణింపచేసేవే.

* A Fruit after food is a complete food.
* Daily an apple keeps the doctor away.
* After Dinner Sit a While, After Supper walk a mile.
* మధ్యాహ్నం భోంచేశాక కాసేపు విశ్రాంతిగా కూర్చోవాలి. రాత్రి భోంచేశాక ఒక మైలు దూరం నడవాలి.
* రేపటి పని ఈరోజేచెయ్, ఈరోజుపని ఇపుడే చెయ్..
* మందుకు పథ్యం మాటకు సత్యం బలం.
* మూలుగులూ ఎప్పటిలాగే, భోజనాలు ఎప్పటిలాగే.
* ఆకలి రుచి ఎరుగదు నిద్ర సుఖమెరగదు.
* నిర్భాగ్యునకు నిద్ర ఎక్కువ, అభాగ్యునకు ఆకలెక్కువ.
* తింటే ఆయాసం తినకుంటే నీరసం.
* ఇంటినిండా డబ్బులు వంటినిండా జబ్బులు.
* పోగాలం దాపురించినోడు పొగ త్రాగుతాడు.
* అధిక బరువు అనారోగ్యానికి మూలం. సన్నని నడుము ఆరోగ్యానికి, అందానికి ప్రతిరూపం.
* రోగం నిన్ను పట్టుకోలేదు. నీవే రోగాన్ని పట్టుకుంటున్నావు.
* అనప చేను అరమైలుండగనే బర్రుపిత్తులు బారడేసి.
* పొరిగింటి పుల్లగూర మహారుచి.
* నోటి తీపి ముడ్డికి చేటు.
* నోటికి అయిష్టమైనదే ఆరోగ్యానికి ప్రీతికరమైనది.

* బ్రతకడానికి తినాలి. కానీ తినేదానికే బ్రతకరాదు.
* ఉన్నదేమనిషికి పుష్టి. తిన్నదే పసరానికి పుష్టి.
* అరఘుడియ భోగం ఆరునెలల రోగం.
* భోగే రోగభయం.
* తినగా తినగా రోగం. అనగా అనగా రాగం.
* కడుపే కైలాసం, కాముడే పరదేవత.
* చేసేవి తప్పులు, చెపితే కోపాలు.
* రోగికి రోషం జాస్తి, భోగికి అహంకారం జాస్తి, ఆరిపోయేదీపానికి ఆర్భాటం జాస్తి"
* అరమనిషి బలం-ఆరుమంది కోపం.
* పగలు కాంచన వాంఛ, రాత్రి కామినీ వాంఛ.
* నిరాడంబర జీవితం, ఉన్నతమైన ఆశయం గొప్పవారి ఆభరణం.
* మనసు పీకుతున్నా తినకూడనివి తినకుండా, పోకూడని మార్గాలలో పోకుండా. చెయ్యకూడనివి పనులు చెయ్యకుండా నిగ్రహంగా ఉండగలితే నిస్సందేహంగా దేహం ఆరోగ్యంగా ఉంటుంది.
* పదడుగులు వేస్తే పడిపోయే వాళ్లను పడితే లేవలేనివాళ్లను ఎవరూ ఇష్టపడరు

ఆరోగ్యానికి పరిశుభ్రత పునాది. CLEANLINESS IS NEXT TO GODLINE'SS. "నిర్మలత్వమే దైవత్వం."

తీసుకునే ఆహారం, ధరించేబట్టలు, చేసేపనిలో పరిశుభ్రతను పాటించాలి. ప్రతిరోజూ ఉదయం, సాయంకాలం తప్పనిసరిగా స్నానం చెయ్యాలి.

ఆరోగ్యానికి సమయపాలన 'క్రమశిక్షణ' అత్యవసరం.

పది పనులున్నా సమయానికి మలమూత్రాలను విసర్జించాలి.

నూరు పనులున్నా సమయానికి వ్యాయామం, స్నానం చెయ్యాలి.

వేయి పనులున్నా సమయానికి భోంచేయాలి.

లక్ష పనులున్నా సమయానికి ప్రార్థించాలి.

కోటి పనులున్నా సమయానికి నిద్రపోవాలి.

* ఆరోగ్యంగా ఉన్న వ్యక్తి సుఖంగా ఉండవచ్చు. ధనవంతుడూ కావచ్చు కానీ ధనవంతుడు మాత్రం ఆరోగ్యంగా, సుఖంగా ఉంటాడని అనుకోలేం.
* ఆరోగ్యంగా ఉన్న వాడే నిత్య యవ్వనుడు.
* ఆరోగ్య సిద్ధి ఉన్నవాడికే ఆధ్యాత్మిక సిద్ధి లభిస్తుంది.

వ్యక్తిత్వం -3

వ్యక్తి యొక్క తత్వమే (గుణం, స్వభావం) వ్యక్తిత్వం.

తన యొక్క, ఇతరుల యొక్క స్వేచ్ఛకు, అభివృద్ధికి, భద్రతకు, సుఖశాంతులకు, వికాసానికి, బంధాలకు,.అనుబంధాలకు, ఆత్మీయతానురాగాలకు, దోహదపడే స్వభావాలైన శాంతం, సహనం, సహకారం, సేవ, సత్యం, కృతజ్ఞతాభావం, పరోపకారం, క్షమాగుణం, శ్రమించే గుణం, నిదానం, మౌనంగా ఉండడం, సమయస్ఫూర్తి, ధర్మంగా నడచుకోవడం, నిరాడంబరం మొదలగు సాత్వికమైన గుణాలను కలిగి ఉండడమే మంచి వ్యక్తిత్వం అంటారు.

వ్యక్తి వికాసానికి అవరోధంగా నిలిచే స్వభావాలను, మానవ సంబంధాలను తెంచివేసే అహంకారం, అవకాశవాదం, అత్యాశ, అసూయ, అవినీతి, అనారోగ్యం, ఆగ్రహం, మూర్ఖత్వం, తొందరపాటుతనం, ఓర్వలేనితనం, మోసం, ద్రోహం, కోపం, ఆవేశం, చేసిన మేలు మరచిపోవడం, దురలవాట్లు, అబద్ధాలు చెప్పడం, సోమరి తనం, పనులను వాయిదా వేయడం, బాధ్యతలను విస్మరించడం, పరపీడనం, పరాన్న జీవనం, పరనింద, పరస్త్రీ వ్యామోహం లాంటి గుణాలను కలిగి ఉండటమే చెడు తత్వం అంటారు.

* వ్యక్తియొక్క సమస్త ఆలోచనల, ఆచరణల, హావభావాల సమగ్ర స్వరూపమే వ్యక్తిత్వం.
* వ్యక్తి ఎలాంటివాడో ఏకాంతం చెబుతుంది. ఎలా ఉంటున్నాడో సమాజం చెబుతుంది.
* నా ఆలోచనల, ఆచరణల స్వభావ స్వరూపమే నేను.

మూర్తిమత్వం అంటే ?

* దృఢమైన శరీరాన్ని, నిశ్చలమైన మనసును కలిగి ఉండడం.
* జీవితం పట్ల, కుటుంబం పట్ల, సామాజిక, ఆర్థిక, నైతిక,ప్రకృతి సౌందర్యంపట్ల మంచి దృక్పథాన్ని కలిగి ఉండడం.
* లక్ష్యంపై దృష్టి ఉండడం, తొందరపాటుతనం లేకుండడం.
* సమయస్ఫూర్తితో స్పందించడం, బాధ్యతలను స్వీకరించడం. హక్కులను కాపాడు కోవడం. తప్పులను ఒప్పుకోవడం. త్యాగానికి, సాహసానికి సిద్ధపడడం.
* అందరికీ సేవ, సహకారములనందివ్వడం. కృతజ్ఞతను ఆశించకపోవడం. చెడ్డవారిలో కూడా మంచిని చూడడం, వారికికూడా మేలు జరగాలని కోరుకోవడం, స్నేహభావంతో ఉండడం.
* పనులయొక్క ప్రాధాన్యతలను గుర్తించడం, తన పని తాను చేసుకుంటూపోవడం శ్రమించడంలోనే ఆనందించడం.

* మృదు స్వభావం, మధుర భాషణం, వినయ వర్తనం, తరగని చిరునవ్వు, దయ, ఉత్సాహం, ప్రసన్న వదనాన్ని కలిగివుండడం.
* హృదయపూర్వకంగా ప్రశంసించడం,విమర్శ సహేతుకంగా, ప్రోత్సాహకరంగా ఉండేటట్లుగా చూచుకోవడం. సందర్భానుసారం మంచి శ్రోతగానూ, మంచి వక్తగానూ, మౌనంగానూ ఉండడం. వాదనలకు దూరంగా ఉండడం.
* సమయపాలన, నమ్రత, ఇతరులను అర్థం చేసుకోవడం, గౌరవించడం,నిష్పక్ష పాతంగా వ్యవహరించడం. ముందస్తు ప్రణాళికతో కార్యాచరణకు పూనుకోవడం, ఒప్పించడం, మెప్పించడం, వ్యతిరేకులను, శత్రువులను చేసుకోకుండా ఉండడం.
* పరిస్థితులను చక్కగా బేరీజు వేసుకుంటూ అదుపు తప్పకుండా, అదను తప్పకుండా, పదును తగ్గకుండా చూచుకోవడం. మంచి సమన్వయ కర్తగానూ, మంచి పరిష్కార కర్తగానూ ఉండడం. బుజ్జగించడంలోనూ, గద్దించడంలోనూ, ప్రేమగా దగ్గరికి తీసుకోవడంలోనూ, హుందాగా వ్యవహరించడం

హుందాతనం అంటే ?

శుభ్రంగా ఉండడం. ఆకారానికి తగ్గ వేషంతో నిరాడంబరంగా ఉండడం. అనవసరంగా మాట్లాడక పోవడం. మౌనంగా, చిరునవ్వుతో ఉండడం. దయాదృష్టి కలిగి ఉండడం. చెప్పిందే చెయ్యడం. చేసిందే చెప్పడం. బేషరతుగా తప్పులను సరిదిద్దు కోవడం. చేసిన తప్పులకు పశ్చాత్తాప పడడం. క్షమించమని అడగడం. మంచిని మెచ్చుకోవడం, ప్రోత్సహించడం. తప్పు చేస్తే దండించడం. అలవాట్లూ, హావభావాలూ గౌరవ ప్రదమైనవిగా ఉండడం. వ్యక్తులకు కాక నియమాలకు విలువనిస్తూ జీవించడం.

ఎవరిదగ్గరికెళితే మన సమస్య పరిష్కరింపబడుతుందో, మనసు శాంతిని, ధైర్యాన్ని పొందుతుందో, ఎవరి దగ్గర అనవసరంగా మాట్లాడకూడదు అనిపిస్తుందో, ఎవరి దగ్గరికెళితే సలహా, సహాయం, సహకారం, సేవ లభిస్తుందని విశ్వాసం కలుగుతుందో, తప్పు చేస్తే దండిస్తాడని ఎవరిని చూస్తే భయం కలుగుతుందో, మంచి చేస్తే నిర్భయంగా, ప్రేమగా దగ్గరికెళ్ళవచ్చో, ప్రోత్సాహం ఎవరి దగ్గర లభిస్తుందో, ఎవరి మాటను విశ్వసించవచ్చో వారే ధీర, గంభీర స్వభావులు. ఎవరి నడకలో ఠీవి, నడతలో ఊవి కనిపిస్తుందో వారిలోనే హుందాతనం ఉట్టిపడుతూ ఉంటుంది. వారిని చూస్తే భయము, భక్తి, శ్రద్ధ, గౌరవం కలుగుతుంది.

హుందాగా జీవించేవారు అరుదుగా ఉంటారు. సమాజంలో ఉన్నప్పటికీ వారిని దగ్గరగా చూచేటందుకు అవకాశం లేకపోవచ్చు. కాని వారి వ్యక్తిత్వ పరిమళం Magnatic Power వారిని గురించి చర్చించుకునేలా చేస్తుంది. వారిని చూడాలని ప్రేరణ కలుగుతుంది. చూచాక స్ఫూర్తి కలుగుతుంది.

కొంతమంది గురువులలోనూ, దేశ నాయకులలోనూ, సమాజ సేవకులలోనూ, కుటుంబ యజమానులలోనూ స్ఫూర్తినిచ్చేవారు చెదురు-ముదురుగా కనిపిస్తుంటారు. వీరికి ప్రజాదరణ ఎక్కువగా ఉంటుంది.

* మనిషితత్వం ఎలాంటిదో అవసరం, అవకాశం, అధికారం, కష్టం, సుఖం, హావభావాలు ఈ ఆరు అంశాలలో బయటపడుతుంది.

అవసరం

కార్యం నెరవేరడానికి కావలసిన వస్తువులను కానీ, పదార్థాలనుకానీ, డబ్బును కానీ, ధర్మమార్గంలోనే, కష్టార్జితంతోనే సంపాదించాలి. అలా కాకుండా మాయోపాయంతో, కుటిల నీతితో, అవసరాలను తీర్చుకోవడం కోసం, పనులను సానుకూలం చేసుకోవడం కోసం అబద్ధాలాడడం, ఆరోపణలు చెయ్యడం, దొంగతనం చెయ్యడం, మాట తప్పడం, వదంతులను, పుకార్లను పుట్టించడం మోసం చెయ్యడంలాంటి పనులు శిక్షార్హమైనవి. చెయ్యకూడనివి.

అవసరాలను తీర్చకోవడం కోసం అడ్డదారులను త్రొక్కి, దిగజారుడు తనం కలిగినవారు 'ఏరు దాటాక తెప్పను తగలేసేవారుగా' ఉంటారు. అలాంటివారిని నమ్మరాదు.

అవసరాలను తీర్చుకోవడం కోసం అపమార్గాలను అనుసరించే దానికంటే, ఆ అవసరాలను అణచివేయడమే శ్రేయస్కరం. లేదా కాలం కలసొచ్చి, సానుకూల మయ్యేట..శవరకు అవసరాలను వాయిదా వేసుకుంటూ పోవడం ఉత్తమం. ఎలాంటి అవసరం వచ్చినా ధర్మమార్గాన్ని మాత్రమే అనుసరించాలి. అవసరాలను తీర్చుకునే తొందరలో మనిషి తప్పటడుగు వేస్తాడు. ఏది అవసరం, ఏది అత్యవసరం, అవసరాన్ని వాయిదా వేసుకునే అవకాశం ఉందా? వాయిదా వేసుకుంటే వచ్చే నష్టం ఎంత? అనే విచక్షణా జ్ఞానాన్ని, తార్కిక జ్ఞానాన్ని తప్పక కలిగి ఉండాలి. అలా లేనప్పుడు అవసరాలే ఆపదలకు అవకాశాలవుతాయి. అందుకే పెద్దలు 'కీడెంచి మేలెంచాలి' అంటారు.

అవసరంలో ఒకలాగా అవసరం తీరాక ఒకలాగా

కృష్ణపట్నం రేవునుండి పడవ బయలుదేరింది. దాదాపు యాభై మంది ప్రయాణికులు ఉన్నారు. నది మధ్యకు పడవ చేరింది. అంతలో పడవకు చిల్లు పడిన కారణంగా పడవలోకి నీరు రాసాగింది. దురదృష్టం కొద్దీ పడవ చెడిపోయింది. ముందుకు సాగదు. పడవ నడిపే వాడు ప్రయాణీకులనుద్దేశించి హెచ్చరిక చేశాడు. "ఎవరి ఉపాయం కొద్దీ వారు తప్పించుకొండి కాసేపట్లో పడవ నీటితో నిండిపోయి మునిగిపోతుంది" అని.

ఎవరిపాటికి వారు నదిలోకి దూకి తప్పించుకోసాగారు. వారిలో ఒక వ్యాపారస్తుడు ఈత రాని కారణంగా పడవలోనే ఉండి చావుకేకలు వేయసాగాడు. "నన్ను రక్షించండి! నన్ను కాపాడండి నేను గొప్ప శ్రీమంతుడిని నన్ను రక్షిస్తే నా ఆస్తంతా ఇచ్చేస్తాను. నా ప్రాణాలు కాపాడండి" అని.

పడవ నీటితో నిండిపోతున్నది. వ్యాపారస్తుడు గట్టిగా అరుస్తూనే ఉన్నాడు. ఇక కొద్దిసేపటికి పడవ మునిగిపోతుందనగా వ్యాపారస్తునికి ఒక పడవ తనవైపు వస్తూ వుండడం కనిపించింది. వ్యాపారస్తుడు ఇంకా గట్టిగా "నన్ను కాపాడండి, నన్ను రక్షిస్తే నా ఆస్తంతా ఇచ్చేస్తా, నేను చాలా గొప్ప ధనికుడిని" అని అరుస్తున్నాడు. కొంతసేపటికి వ్యాపారస్తుడిని కాపాడేటందుకు ఒక పడవ రానేవచ్చింది. బాగా దగ్గరకు రానిచ్చి పడవలోకి ఎగిరి దూకాడు వ్యాపారస్తుడు. పడవవాడు వ్యాపారస్తునికి బాగా ధైర్యం చెప్పాడు. మంచినీళ్ళు ఇచ్చి దాహం తీర్చి, నిమ్మళంగా కూర్చోమని చెప్పాడు. నన్ను కాపాడినందుకు నీకు ఏమిచ్చినా ఋణం తీరదు. భగవంతుడు పంపిన దేవదూతలా సమయానికి వచ్చి నన్ను రక్షించావు, చాలా కృతజ్ఞతలు. నా ఆస్తంతా నీకిచ్చినా నీ ఋణం తీరదు. కాబట్టి ఇచ్చిన మాట ప్రకారం నీకు నా ఆస్తంతా ఇచ్చేస్తాను" అన్నాడు వ్యాపారస్తుడు.

పడవ నడిపేవాడు వ్యాపారస్తుని మాటలు ఏవీ పట్టించుకోకుండా తనపాటికి తాను పడవ నడుపుతున్నాడు. వ్యాపారస్తుడు నెమ్మదిగా కూర్చున్నాడు. మనసు కాస్తంత కుదుటపడగానే వ్యాపారస్తుడు తనలోతాను ఇలా తర్కించుకోసాగాడు. నిజంగా అతనికి నా ఆస్తినంతటినీ ఇవ్వవలయునా? ఆపదలో ఏదేదో గొప్పగా వాగేస్తాము, అంతమాత్రాన ఆస్తినంతటినీ ఇవ్వవలసిందేనా? ఆస్తంతా నా ఒక్కడిదే కాదు కదా? అందులో నా భార్య పేరుమీద కూడా సగం ఆస్తి ఉంది కదా! దానిని నేనెలా ఇవ్వగలను? పైగా ఆమె అనుమతి లేకుండా నేనెలా ఇవ్వగలను? అన్న మాట ప్రకారం పడవ వాడికి ఆస్తినంతటినీ ఇచ్చేస్తే, నేనెలా బ్రతకాలి? నా భార్యా బిడ్డలను ఎలా పోషించాలి. ఇలా ఎన్నో సమస్యలున్నాయి. ఆపదలో ఎవరైనా అలాగే చేస్తారు. కాబట్టి ప్రాణాలను కాపాడినందుకుగాను కొంత ఆస్తిని ఇస్తే సరిపోతుంది అనుకున్నాడు. తీరం సమీపిస్తున్నది. మరికొంత సేపటికి తీరం చేరుతుందనగా, అవతలి గట్టునుండి ఇవతలిగట్టుకు చేరవేసినందుకు వందరూపాయలు వసూలు చేస్తారు. ఇతగాడు నన్ను నది మధ్య నుండిగదా తీసుకొచ్చాడు? కాబట్టి యాభై రూపాయలిస్తే సరిపోతుంది అని, వ్యాపారస్తుడు తనలో తాను తర్కవితర్కాలు చేసుకొని యాభై రూపాయలు ఇస్తే సరిపోతుందని నిశ్చింతగా కూర్చున్నాడు.

తీరం రానే వచ్చింది. పడవ దిగిన వ్యాపారి, పడవవానితో తన మనసులో తర్కించుకున్న విషయాలను చెప్పాడు. కానీ పడవవాడు అయ్యా రక్షించు అనే కేకలు తప్ప, నీవన్న మాటలు నాకు ఏవీ వినిపించలేదు. తృప్తిగా ఇంటికివెళ్ళి భార్యాబిడ్డలతో సుఖంగా ఉండు వెళ్ళు అన్నాడు. "నా ప్రాణాలను కాపాడినావు ఊరకనే పోతే ఏం బాగుంటుంది. ఇదిగో పూర్తి ప్రయాణానికైతే వందరూపాయలు తీసుకుంటారు కదా?

మనది నది మధ్యనుండి కదా ప్రయాణం . కాబట్టి యాభై రూపాయలు ఇదిగో తీసుకో" అన్నాడు వ్యాపారస్తుడు. ఆ మాటలు విన్న పడవ వాడు "సమయానికి చేతనైన సేవ చేశాను. ఆ తృప్తి చాలునాకు. నాకు మీరివ్వదలచుకున్న యాభై రూపాయలతో భార్యాబిడ్డలకు తినడానికేమైనా పండ్లు, మిఠాయిలు పట్టుకెళ్ళండి" అన్నాడు.

వాని మాటలు విన్న వ్యాపారస్తునికి సంతోషంతో మాటలు రాక, ఇవ్వబోయిన యాభై రూపాయలను కూడా తటాలున జేబులో దోపుకొని భగవంతుడు నిన్ను చల్లగా చూడాలి. నీబోటి వారుండబట్టే ఈలోకంలో ఇంకా ఈ విధంగా ధర్మం బట్ట కట్టి ఉంది చావకుండా అంటూ వెళ్ళాడు. నిర్లిప్తంగా చూస్తూ ఉండిపోయాడు పడవవాడు.

అవసరంలో ఒక లాగా అవసరం తీరాక ఒకలాగా వ్యవహరించడం మహాపాపం. వ్యాపారస్తులు ఎల్లవేళలా తాము ఎంత లాభం పొందాము, ఎంత మిగలబెట్టాము అని మాత్రమే ఆలోచిస్తారు.

అతి ఉదారత అనర్థం

అదో అపురూపమైన అడవి. ఎన్నో రకాల ఔషధ మొక్కలు, పండ్ల చెట్లు, పూలమొక్కలు, తీగ మొక్కలతో ఆ అడవి శోభాయమానంగా ఉంది. ఆ అడవికి దూరంగా ఒక కుగ్రామం ఉంది. ఓబయ్య అనే కట్టెలు, కలప అమ్ముకుని జీవించేవాడొకడు ఆ గ్రామంలో ఉన్నాడు. ఒకరోజు ఈ అడవికి వచ్చాడు. ఏపుగా పెరిగిన చెట్లను చూచాడు. వాడికి చాలా సంతోషం కలిగింది. అబ్బ ఎన్ని చెట్లున్నాయి? వీటిని నరికి అమ్ముకుంటే డబ్బే డబ్బు అని ఎంతోమురిసిపోయాడు. కట్టెలకు ఉపయోగపడేవి, కర్రసామానుకు ఉపయోగపడేవి ఈ అడవిలో పుష్కలంగా ఉన్నాయి. వీటిని నరికితే·నా పంట పండినట్లే ! అనుకుంటూ సంతోషంగా అడవంతా కలియ తిరిగాడు. కాసేపయ్యాక అలసిపోయి ఒక దట్టమైన చెట్టునీడన కూర్చున్నాడు.

ఎదురుగా ఇన్ని చెట్లున్నా ఏం లాభం? పిడిలేని గొడ్డలిని చూస్తూ బాధపడ్డాడు ఆ కట్టెల వ్యాపారి. దిగులుతో నిరాశగా ఉన్న అతడిని చూచి, ఏమయ్యా ! ఎందుకలా విచారంగా కూర్చొని ఉన్నావు అని ప్రశ్నించింది ఆ దట్టమైన పెద్ద చెట్టు. నిర్మానుష్యమైన ఈ అడవిలో నేనుగాక ఇంకొకరెవరున్నారబ్బా? అని ఆశ్చర్యంతో ఎవరు?.... ఎవరు ఆ మాట్లాడేది? అని కంగారు పడ్డాడు. ఆ కట్టెల వ్యాపారి. నేనే ... నీకు నీడినిస్తున్న చెట్టుని, చెప్పు మిత్రమా నీకేం కష్టం వచ్చింది? అడిగింది ఆ చెట్టు స్నేహపూర్వకంగా. నీవు సహాయం చేస్తానంటే చెబుతా అన్నాడు కట్టెల వ్యాపారి. తప్పకుండా చేస్తా అంది చెట్టు. ఈ అడవిలో లెక్కలేనన్ని చెట్లున్నాయి. వీటిని నరికి పట్టణంలో అమ్ముకుందామనుకున్నాను. కానీ వచ్చేటపుడు దారిలో గొడ్డలి క్రిందపడి పిడి విరిగిపోయింది. ఇప్పుడు చెట్లను నరికేదెలా? అని విచారిస్తున్నాను అన్నాడు.

ఓస్ ఇంతేనా ?... నా కొమ్మల్లోంచి ఒక మంచి కర్రను ఇస్తాను, దానిని పిడిగా చేసుకో అంది చెట్టు. ఆ మాట వినగానే చుట్టూ ఉన్న మిగతా చెట్లన్నీ ఆందోళనపడుతూ ఆ చెట్టువైపు చూశాయి. మిత్రమా అలా చేయవద్దు అని వారించాయి. కానీ అవేమీ పట్టించుకోకుండా ఓ కొమ్మను విరిచి ఓబయ్యకు ఇచ్చింది ఆ చెట్టు. ఆ కట్టెల వ్యాపారి ఆ కొమ్మను చక్కగా మలచుకొని గొడ్డలికి పిడిగా అమర్చుకున్నాడు. తనకు నీడనిచ్చి, కర్రనిచ్చి సహాయపడిన చెట్టునే నరకడం మొదలుపెట్టాడు. వాడు అలా చేస్తాడని ఊహించని ఆ చెట్టు ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఏం చేస్తున్నావయ్యా? నీకు సహాయపడిన నన్నే తెగనరుకుతున్నావా... ఇది చాలా అన్యాయం అంటూ అరవ సాగింది. చెట్టు మాటల్ని ఓబయ్య పట్టించుకోకుండా తన పని పూర్తి చేశాడు. కొద్దిసేపటికి ఆ చెట్టు నేలకొరిగింది. ఈ తతంగమంతా గమనించిన మిగతా చెట్లన్నీ కొన ఊపిరితో ఉన్న ఆ చెట్టుతో. అడవిలోకి వచ్చినవాడు చెడ్డవాడనీ, వాడికి కర్రను ఇవ్వొద్దని చెప్పినా వినకుండా అతి ఉదారతను చూపించావు, చూడు ఇపుడేమైందో నీతోపాటు మా అందరి ప్రాణాలకు ముప్పొచ్చింది అన్నాయి. తెలిసితెలిసి చెడ్డవాడికి సాయపడినందుకు ప్రాణాలు పోగొట్టుకొంది చెట్టు.

చేసిన మేలు మరచిపోతే అధోగతే

ఓ అరణ్యంలో ఎంతో దయామయుడైన ఒక ముని తపస్సే జీవితంగా గడుపుతూ ఉండేవాడు. ఆ తపోవనంలో ఉన్న జంతువులన్నీ ఆ ముని వర్యుని ఆశ్రయించుకుని ఉండేవి. అన్ని జంతువులలోకి ఓ శునకం ఆ ముని అంటే ఎంతో ప్రేమగా ఉంటూ అక్కడక్కడే తిరుగుతూ ఉండేది. ఆ మునికికూడా ఆ శునకమంటే వాత్సల్యం ఏర్పడింది.

ఓ రోజున ఆ తపోవనంలోకి ఒక చిరుతపులి వచ్చి కుక్కను చంపబోయింది. అప్పుడా కుక్క పరిగెత్తుకుంటూ వెళ్ళి, భయంతో ముని వెనుక దాక్కున్నది. దీనిని గమనించిన ముని కరుణించి తన తపోశక్తితో శునకమును కూడా చిరుతపులిగా మార్చి, ఇక నిశ్చింతగా ఉండు అని ఆశీర్వదించాడు. చిరుతపులి నిర్భయంగా తపోవనమంతా బాగా కలియదిరగ సాగింది.

మరికొన్నాళ్ళకు ఒక పెద్దపులి ఆ చిరుత వెంటబడింది. దానిని ఎదుర్కొనే శక్తిలేక భయపడి మరలా మునీశ్వరుడిని ఆశ్రయించింది. ఈసారి మునీశ్వరుడు చిరుతను కాస్తా పెద్దపులిగా మార్చివేశాడు.

కొంత కాలమయ్యాక ఓ మదపుటేనుగు ఆ తపోవనానికి వచ్చి భీకరంగా ఘీంకరించింది. ఆ శబ్దానికి మాయా వ్యాఘ్రం భయంతో వణికిపోయింది. దాని భయం పోగొట్టేందుకు ముని ఆ వ్యాఘ్రాన్ని కూడా మదపుటేనుగుగా మార్చాడు.

ఇక భయం లేదనుకొని స్వేచ్ఛగా అడవంతా తిరుగుతుండగా ఒకరోజు, ఒక

సింహం దాని వెంటపడింది. ఎలాగో తప్పించుకొని వచ్చి ఆ మునీశ్వరుని దగ్గరకు వచ్చింది. విషయాన్ని గ్రహించిన మునీశ్వరుడు ఆ మదపుటేనుగును కూడా సింహంగా మార్చి వేసి ఇక నీకేం భయంలేదు. ధర్మబద్ధంగా జీవించు అని హెచ్చరించాడు.

అప్పటినుండి ఆ సింహం అడవిలోకి వెళ్ళి జంతువులన్నింటినీ హడలుగొట్టి జీవించసాగింది. చివరకు తపోవనంలో ఆశ్రయం పొందుతున్న జంతువులమీద కూడా విరుచుకపడసాగింది. దాంతో భయపడి జంతువులన్నీ తలోదిక్కుకు పారిపోసాగాయి. ఒకనాడు జంతువులను వేటాడుతూ ఏదీ కనబడక, చివరకు తపోవనానికి వచ్చింది ఆ సింహం. అక్కడకూడా తనకు ఏ జంతువూ కనిపించలేదు. చివరికి చెట్టు క్రింద ధ్యానముద్రలో నున్న మునీశ్వరుడినే భక్షించబోయింది.

అయితే దాని మనసులోని దురాలోచన ముందుగానే తెలుసుకున్న ఆ మునీశ్వరుడు ఆ జంతువును మళ్లీ కుక్కగా మారిపొమ్మని శపించాడు. తక్షణమే ఆ మాయాసింహం కాస్తా శునకంగా మారిపోయింది.

చేసిన మేలును మరచి నీచానికి దిగిన ఆ కుక్కను ఆశ్రమం నుండి తరిమి వేశాడు ఆ మునీశ్వరుడు.

* తిన్న యింటి వాసాలు లెక్కపెట్టడం, అన్నంపెట్టిన చేతిని నరకడం నీచుల స్వభావం.
* నీతిమాలిన పనులు చేసేటపుడు నీచునికి అవన్నీ మంచి పనులుగానే తోస్తాయి.

మన పరిస్థితులు ఎలా ఉండినవి? మనమెక్కడ నుండి వచ్చాము? ఎవరి వల్ల పైకి ఎదిగాము? మేలు చేసిన వారిపట్ల మనమెలా ఉండాలి? అని ఆలోచించకుండా "అక్కర గడిచిందని తక్కెడ పొయ్యిలో పెట్టినట్లు," "ఏరుదాటాక తెప్పను తగలేసినట్లు" కృతఘ్నతా భావంతో కీడు తలపెట్టడం మహాపాపం.

అవసరం ఒక ఆపద

ఒక నక్కకు విపరీతమైన దాహం వేస్తూ ఉండినది. అది వేసవి కాలం కాబట్టి దగ్గరలో ఎక్కడా కుంటలలోకానీ, చెరువులలోకానీ నీళ్ళు లేవు. నక్కకు మాత్రం నాలుక తడి ఆరి పోతోంది దాహంతో. వెతుకగా వెతుకగా నీళ్లున్న బావి కనిపించింది. కానీ ఆ బావికి పడికెట్లు లేవు. దిగడానికి మాత్రం కాస్త అనువుగా ఉన్నప్పటికీ, పైకి ఎక్కి వచ్చేందుకు వీలులేని విధంగా ఉంది.

దిగితే బావి నుండి బైటపడటానికి వీలు పడదని నక్కకు తెలుసు. కానీ నీళ్ళు తాగకపోతే ప్రాణం పోయే పరిస్థితి నక్కది. అందుకని వెనుకా ముందు ఆలోచించకుండా బావిలోకి దూకింది. తనివితీరా నీళ్ళు తాగి, దాహం బాగా తీర్చుకున్నది. దప్పిక తీరిన తర్వాత బైటపడలేక నానాతంటాలు పడుతూఉంది.

ఇంతలో ఒక పోతుమేక బావి ప్రక్కగా పోతూ ఉండడం నక్క గమనించింది. ఇదే అదనుగా, నక్క-పోతుమేకతో, ఏమి మేక బావా ఇలా వచ్చావు? అని పలకరించింది. పోతుమేక ఏదో సమాధానం చెప్పి, ఏంటి ? నీవు బావిలో ఏమి చేస్తున్నావు? అంది. వెంటనే జిత్తులమారి నక్క పోతుమేకతో " పోతుబావా ఏమని చెప్పేది! దాహంవేసి నీళ్లకోసం బావిలోకి దిగాను. నీళ్లు అమృతంలాగా మధురంగా ఉన్నాయి. ఎంత తాగినా తనివి తీరడంలేదు. పైకిరాను బుద్ధిపుట్టడం లేదు. ఈ అవకాశం వదులుకోకుండా దబ్బున బావిలోకి దూకి నీవు కూడా దప్పిక తీర్చుకుందువురా" అని తియ్యగా నమ్మబలికింది.

పోతుమేకకు అప్పటి వరకు కలగని దప్పిక అప్పుడు కలిగింది. ఎటూ బావి దగ్గరికి వచ్చాను. దప్పిక తీర్చుకుంటే సరి. అనుకుని, ఇక వేరే ఆలోచన లేకుండా దబ్బున బావిలోకి దూకింది. అదనుకోసం కాచుకుని ఉన్న నక్క వెంటనే పోతుమేక వీపుపైన తనకాళ్ళను మోపి ఒక్క ఎగురు ఎగిరి గట్టుపైకి చేరింది. "అదృష్టంఉండి మేకపోతు ఇటువైపు వచ్చింది. లేకుంటే నా ప్రాణాలు ఏమైపోయి ఉండేవి?" అనుకుంటూ తన తెలివితేటలకు తానే మురిసిపోతూ, పోతుమేక అమాయకత్వంపై జాలితో నవ్వుకుంటూ, తిరిగి చూడకుండా వెళ్ళిపోయింది.

అవసరాలే కోరికలు.

అవసరాలే ఆపదలకు మూలం.

అవసరాలే సంబంధాలకు మూలం.

అవసరాలు తీర్చుకుంటూ పోవడమే అభివృద్ధి.

అవకాశం

కొందరి అవసరాలు మరికొందరికి అవకాశాలు. "అవసరాలే అన్వేషణలకు అవకాశాలు", అవకాశం దొరికింది కదా అని ఎదుటివాడి అవసరాన్ని తెలుసుకుని "ముప్పుతిప్పలు పెట్టి, మూడు చెరువులు నీళ్లు తాగిస్తుంటారు" కొందరు. ఇలాంటి కఠినాత్ములలో వడ్డీ వ్యాపారస్తులు అగ్రభాగాన నిలుస్తుంటారు.

అప్పు అడిగినవారిని రేపురా, మరునాడురా, ఇపుడువస్తే ఎలా ? రావలసిన పైకం రాలేదు, ఇస్తానన్నవాడు సమయానికి ఇవ్వలేదని ఇంటిచుట్టూ తిప్పుకుంటారు. పదేపదే అడుగుతున్న వాడి అవసరాన్ని బాగా తెలుసుకున్న తరువాత! ఇక తమ కోరికల చిట్టాను విప్పుతారు. వారానికో, పదిరోజులకో ఒకసారి మూడౌన్సుల మందు, పలావు, బిర్యానీల విందు షరతుపెడతారు. మరికొందరు ఇంటిపనులు, పొలం పనులు చేయించుకుంటారు. ఇలా డబ్బు అప్పుగాఇచ్చి కట్టుబానిసల్లాగా వారితో సేవలు చేయించుకుంటారు, నీచమైన కోరికలు నెరవేర్చుకుంటూ ఉంటారు.

మరికొందరు అవకాశం దొరికింది కదాని ఇతరుల ప్రయోజనాలకు అడ్డుతగలడం వస్తువులను పట్టుకెళ్ళడం, ఇతరులకు దక్కవలసిన స్థానాన్ని ఆక్రమించడం, ఇతరులకు దక్కవలసిన అవకాశాలను ఎగరేసుకుపోవడం, బెదిరించడం, ఎత్తిపొడుపు మాటలతొ హింసించి ఆనందించడం, లాభం కలిగే అవకాశాలపై మొగ్గడం, అటువైపు మాట్లాడటం, పచ్చి అవకాశవాదం, అవకాశవాదులను విశ్వసించరాదు.

ఎవరి జీవితాలు వారు జీవిస్తూ ఉంటారు. కష్టాలలో, అవసరాలలో ఆదుకోవడం, బాధలలో ఓదార్చడం, నష్టాలలో సహాయం చేయడం, దుఃఖాలలో సానుభూతితో ఓదార్చడం లాంటి సందర్భాలు చాలా అరుదుగా వస్తూ ఉంటాయి. అలాంటపుడు కూడా కేవలం ఒక చిరునవ్వుతో పలకరించి, నాలుగు మాటలతో ఓదార్చి, లౌక్యంగా తప్పించుకోవడం అమానుషం. నిజాయితీని, స్నేహాన్ని, బంధుత్వాన్ని, ప్రేమను వ్యక్తపరచవలసిన సందర్భాలలో తప్పించుకునేవారిని, అయినవారే అయినా, అధికారంలో ఉన్నవారే అయినా సరే విసర్జించాల్సిందే.

ఆదుకునేదానికీ, తప్పించుకునేదానికీ, తానూ ఒక రాయి వేసి బాధపెట్టేదానికీ "అవకాశం" బాగా ఉపయోగ పడుతుంది. అవకాశం వచ్చినప్పుడు తప్పించుకోకుండా నిజాయితీని నిరూపించుకోవడమే మంచితనం, మానవత్వం.

* చేసిందీ, ఇచ్చిందీ మర్చిపో, పుచ్చుకున్నది మరవకుండా ఇచ్చుకో.
* "చేసిన సేవకు, సహాయానికీ కృతజ్ఞతను ఆశించవద్దు".
* "ఆశించినవాడు శాసించలేడు"
* అవకాశం దొరక్క చాలామంది చెడ్డవాళ్ళు, మంచివాళ్ళులాగా కనపడతారట.
* అవసరం వచ్చినపుడొకలాగా, అవసరంతీరాక ఒకలాగా, ఎవరైనా గమనిస్తుంటే ఒకలాగా, ఎవరూ చూడడం లేదంటే ఒకలాగా, అవకాశం దొరికినపుడొకలాగా మనిషి ప్రవర్తిస్తూ ఉంటాడు.

బ్యాంకులో పైకం జమ చేయడం కోసమో, తీసుకోవడం కోసమో వరుసలో నిలబడ్డ వ్యక్తి అర్జంటు పనిమీద ప్రక్కకు తొలగిన వెంటనే, వెనుకవాడు ముందున్న వాడి స్థానాన్ని అవకాశం దొరికింది కదా అని ఆక్రమిస్తాడు. ఆ వెళ్ళినవాడు మరలా వచ్చి తన పరిస్థితిని వివరించినా వినకపోవడం పాపం, అమానుషం. ఒక వేళ తనకే అలా జరిగితే బాధపడకుండా ఉండగలడా? అతని స్థానం అతినికిస్తే వచ్చే నష్టం ఏంటి? కాదంటే ఒకటి, రెండు, నిమిషాలు ముందుగా పనైపోతుంది. అవకాశం వచ్చినప్పుడు ఓర్పును, మంచితనాన్ని చూపించాలి. అవకాశం ఒక బాధ్యత. ఆచరిస్తే అదృష్టం. పోగొట్టుకోవడం దురదృష్టం. అడగక ముందే అవకాశం వచ్చినప్పుడు శక్తి వంచన లేకుండా సేవ, సహాయం చేయడం, సహకరించడం, ఔదార్యం చూపించడం ఒక మహత్తర సుగుణం.

* మోసపోవద్దు, మోసగించవద్దు, అవసరం ఉందనీ, అవకాశం దొరకిందనీ అడ్డదారులు త్రొక్కవద్దు, జీవితాలను బలి తీసుకోవద్దు.
* ఆకలిగొన్నవాడికి అన్నం, ఆపదలో ఉన్నవాడికి ఆపన్న హస్తం అందించిన వారు దైవసమానులే.

అవకాశం దొరగ్గానే స్వభావం బైటపడుతుంది

ఒక రాజు కొలువులో పనిచేస్తున్న అధికారి ఒకడు లంచాలు మరిగాడు. లంచం తీసుకోనిదే ఏ పని చేసేవాడు కాదు. అతనిపై ఫిర్యాదులు ఎక్కువైపోయాయి. రాజుగారు అతడిని పిలిపించి చివరి హెచ్చరికగా మందలించి పంపాడు.

ఫిర్యాదులు వచ్చిన కారణంగా మరలా ఉద్యోగిని పిలిపించి, విచారించి ఉద్యోగం నుండి తీసేశాడు. ఉద్యోగి భార్యాబిడ్డలు వచ్చి కాళ్లా-వెళ్ళా పడి ప్రాధేయ పడగా కనికరించాడు రాజు. లంచాలు అడిగే అవకాశమే లేని ఏదైనా ఒక ఉద్యోగం ఇవ్వండి అని మంత్రిగారిని ఆదేశించాడు రాజు. అతనికి సముద్రపు వొడ్డున కూర్చొని ఉదయం 6 గం॥ల నుండి సాయంకాలం 6 గం॥ల వరకు ఎన్ని అలలు వస్తాయి? వాటిని చూచేదానికి సముద్రం వొడ్డుకు ఎంతమంది వస్తున్నారో లెక్కలు వ్రాసేపని ఇచ్చాడు మంత్రి.

ఎంతో ఉదారంతో మరలా ఉద్యోగం ఇచ్చినందుకు కుటుంబమంతా రాజుగారికి కృతజ్ఞతలు తెలియజేశారు. బుద్ధిగా మనలుకొమ్మని రాజుగారు హెచ్చరించారు.

రోజులు గడుస్తున్నాయి. ఉద్యోగి చాలా బుద్ధిగా తన బాధ్యతలను నెరవేరుస్తున్నాడు. సముద్రపు ఒడ్డున కూర్చొని ఇతగాడేం వ్రాస్తున్నాడు? అని చూచేవారందరికీ కుతూహలం కలుగుతూ ఉండేది. కొంతమంది అతడిని అడిగేవారు కూడా! అందుకు అతగాడు ఏదో అతి ముఖ్యమైన పని చేస్తున్నట్లు ఎవరితోనూ చెప్పకూడదన్నట్లుగా ఫోజులు పెట్టి చెప్పేవాడుకాదు. ఎవరైనా ఆసక్తిగా పదేపదే అడిగితే, పదోపరకో ఇస్తే చెప్తాననేవాడు. కొంతమంది అమాయకులు తాము ఇవ్వగలిగినంత ఇచ్చుకొని విషయం తెలుసుకుని ఓస్ ఇంతేనా?! అని పెదవులు విరచి వెళ్ళేవారు. ఇలాంటివారి సంఖ్య రోజురోజుకూ ఎక్కువైపోయి, చివరకు రాజుగారి చెవిన పడనేపడింది.

ఉద్యోగిని రాజు పిలిపించి విచారించగా నిజమని తేలింది. ఎందుకు చేశావీపని? అని ప్రశ్నించగా, 'అవకాశం ఉంటే చాలు తెలివిగా సంపాదించడం నా కక్కుర్తితనం' అని ఉద్యోగి చెప్పలేక మౌనంగా తలదించుకుని ఉండిపోయాడు. ప్రజల

సమక్షంలో సముద్రం నుండి బైటికి రాకుండా నడి సముద్రంలోకి లంచగొండిని తోసెయ్యండి అని రాజు ఆజ్ఞాపించాడు.

అవినీతికి, నేరాలకు పాల్పడ్డవారికి శిక్ష ఇలాగే ఉండాలని చూచిన ప్రజలంతా అనుకుంటూ తృప్తిగా వెళ్ళారు.

వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకో కూడదు.

దొంగతనాలు, దోపిడీలు, హత్యలు చేసిన కారణంగా ఒక హంతకుడికి యావజ్జీవ కారాగారశిక్ష విధించ బడింది. ఫలితంగా ఒక గాఢాంధకారమైన చీకటి గదిలో ఉంచబడ్డాడు.

ఒకరోజు ఆ దేశపు మహారాజు స్వర్గస్తులైనారు. క్రియా కర్మల అనంతరం ఒక శుభముహూర్తాన, మహరాజు పెద్ద కుమారునికి పట్టాభిషేకం చేయతలపెట్టారు. ఆ ఆనందోత్సవంలో, అందరూ సంతోషంగా పాల్గొనవలెననెడి తలంపుతో, కొన్ని మాసాలలో విడుదల చేయబడే ఖైదీలందరినీ ముందుగానే విడుదల చేశారు. ఆ శుభతరుణంలో ఈ హంతకునికికూడా విముక్తి లభించింది. అందరితోపాటు ఈ హంతకుడికికూడా చీకటి గది నుండి బైటికి తీసుకొచ్చారు. ఎన్నో ఏళ్ళుగా చీకటిలో ఉన్న కారణంగా, హంతకుడు బైటి వెలుగును ఒక్కసారిగా చూడలేకపోయాడు. నెమ్మదిగా బయటి వాతావరణానికి అతను అలవాటుపడి వుండవచ్చు. అదేమీ అంత కఠినమైన పని కాదు. కానీ, ఆ ఖైదీ 'అయ్యా నేనీ వెలుగును భరించలేకున్నాను. దయచేసి ఆ చీకటి గదిలోనే ఉంచండి అని వేడుకున్నాడు. జైలు అధికారులు అతని మూర్ఖత్వానికి జాలిపడి, నచ్చచెప్పారు. కానీ అతను ససేమిరా అన్నాడు. ఇక చేసేదిలేక జైలు అధికారులు నీచావు నీవు చావు, అని ఆ చీకటి గదిలోకే పంపించివేశారు. అలా అతను వచ్చిన అవకాశాన్ని మూర్ఖంగా వదలుకున్నాడు. ఆ చీకటిలోనే మ్రగ్గిపోయాడు.

చీకటిలోనే చాలాకాలం ఉన్నకారణంగా, బయటి వెలుగును ఒక్కసారిగా చూచేటప్పటికి అతడి కళ్ళు తట్టుకోలేకపోయాయి. కానీ కాస్తంత విచక్షణతో కళ్ళు మూస్తూ తెరుస్తూ కొంతసేపయ్యాక పూర్తిగా కళ్ళు తెరిచి ఉండవచ్చు. బయటి వాతావరణానికి అలవాటు పడి ఉండవచ్చు.. కానీ విచక్షణ లేక, సహనం లేక, వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకున్నాడు.

* మోడువారిన ప్రతి జీవితానికి ఒక వసంతం తప్పక వస్తుంది. దానిని ఒక అవకాశంగా తీసుకుని జీవితంలో వెలుగును నింపుకోవాలి. అంతేకానీ అవకాశం జారవిడుచుకోరాదు.

మోసం చెయ్యకురా! మోసపోతావు

మర్యాదరామన్న ఎలాంటి తగాదానైనా చాలా తెలివిగా పరిష్కరిస్తాడని ప్రసిద్ధి.

ఒకసారి ఓ రైతు ఆయన దగ్గరికి వచ్చి, "అయ్యా నేను వ్యాపారికి ఐదు వందల వరహాలు దాచమని ఇచ్చాను. కొద్దిరోజుల తర్వాత అవసరం వచ్చి నాసొమ్మును ఇవ్వమని అడిగాను. కానీ, తనకు నేనేమీ ఇవ్వలేదు అని ఖచ్చితంగా చెప్పేస్తున్నాడు. మీరు ఎలాగైనా నా సొమ్మును నాకు తిరిగి ఇప్పించండి అని ప్రాధేయపడ్డాడు.

నువ్వు ఆ సొమ్మును అతనికి ఇచ్చినట్లు పత్రమేమైనా ఉందా? అని అడిగాడు మర్యాదరామన్న. లేదండి నేను హఠాత్తుగా, ఉన్నఫళంగా జరూరు పనిమీద పొరుగూరికి వెళ్ళవలసివచ్చింది. దొంగల భయం వలన నా వద్ద గల ఐదు వందల వరహాలను అతని మీద ఉన్న విశ్వాసంతో అతని దగ్గర ఉంచివెళ్ళాను. తిరిగి వచ్చాక అడిగితే, ఏమీ తెలియనట్లు నటిస్తున్నాడని వివరించాడు రైతు.

కనీసం నీవు అతనికి సొమ్ము ఇస్తున్నప్పుడు ప్రక్కన ఎవరైనా ఉండినారా? ఎవరైనా చూచారా? ఉంటే సాక్షులుగా ఉపయోగపడతారు. కాబట్టి ఎవరైనా అలాంటి వారున్నారా? అని మర్యాదరామన్న అడిగాడు. అదేకదా నా ఖర్మ, నేను అతనింటికి వెళ్ళి పైకం ఇచ్చింది రాత్రి సమయంలో. అప్పుడు ఎవరూలేరు. ఇంటిలోనున్న అతడిని పిలిచి నా ప్రయాణం గురించి, దొంగల భయం గురించి చెప్పి హడావుడిగా వెళ్ళిపోయాను.

రైతు అమాయకుడనీ, అతను చెప్పేది వాస్తవమనీ, మర్యాద రామన్న తెలుసుకున్నాడు. మర్యాదరామన్న విషయాన్ని దర్యాప్తుచేయగా, వ్యాపారి మోసకారి అని తెలిసిపోయింది. కానీ ఏం చేస్తాం! సాక్షులు అసలు లేరే! సాక్ష్యాలు లేకుండా మోసగాళ్ళను పట్టుకోవడం చాలా కష్టం. వ్యాపారిని పిలిచి అడిగినా, సాక్ష్యాలు లేని కారణంగా తప్పును ఒప్పుకోడు. పైగా తానెంతో నిజాయితీ పరుడనని కూడా వాదిస్తాడు. ఏమీ చెయ్యలేము.

బాగా ఆలోచించి పదిరోజులు గడిచాక, మర్యాదరామన్న రైతును పిలిపించి తన దగ్గరున్న వెయ్యి వరహాలను రైతుకు ఇచ్చి ఊరిలో ఉన్న పూజారి రామశాస్త్రిని వెంట తీసుకుని ఆ వ్యాపారి దగ్గరకు మరలా వెళ్ళి "అయ్యా! అతి జరూరు పనిమీద ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఈ సొమ్మును జాగ్రత్తగా దాచండి, తిరిగి వచ్చి తీసుకుంటాను అని ఇంతకు మునుపు ఇచ్చినట్లుగానే ఇచ్చిరా. అని చెప్పాడు.

రైతు మర్యాదరామన్న చెప్పినట్లు చేశాడు. ఆ .వ్యాపారి కూడా వెయ్యి వరహాలను లెక్క పెట్టుకుని తీసుకుని అలాగే వెళ్ళిరా అన్నాడు. తర్వాత రైతు మర్యాదరామన్న దగ్గరికెళ్ళి తాను చేసినదంతా వివరంగా చెప్పాడు.

చాలా మంచి పని చేశావు " ఇప్పుడు నీవు ఒక్కడివే మరలా వ్యాపారి దగ్గరికెళ్ళి.

అయ్యా! నా ప్రయాణం అనుకోకుండా ఆగిపోయింది. కావున దయచేసి నా వెయ్యి వరహాలు తిరిగి ఇవ్వు అని అడిగి తీసుకోపో" అని మర్యాదరామన్న చెప్పాడు. సరేనని రైతు వ్యాపారి దగ్గరికి ఒంటరిగా వెళ్ళి మర్యాదరామన్న చెప్పినట్లుగానే చేసి, తన వెయ్యి వరహాలను అడిగాడు. అందుకు తగిన సాక్ష్యం గుడి పూజారి ఉండినాడు కాబట్టి రైతు సొమ్ము వాపసు చేశాడు. వెయ్యి వరహాలు తీసుకుని రైతు మర్యాదరామన్న దగ్గరికి వచ్చి అయ్యా! రామన్నగారూ నాకు ఏమీ అర్థంకావడంలేదండీ అన్నాడు. మర్యాదరామన్న తన వెయ్యి వరహాలను తీసుకుంటూ, తొందరపడవద్దు, అంతా సవ్యంగా, న్యాయం జరిపిస్తాను అని అంటూ.. సరే ఇపుడు గుడి పూజారి రామశాస్త్రిని కూడా వెంట తీసుకుని మళ్ళీవెళ్ళి "నా ప్రయాణం అనుకోకుండా ఆగిపోయిందండీ, దయచేసి నా వెయ్యి వరహాలు ఇవ్వండి," అని అడుగు అన్నాడు.

మర్యాదరామన్న చెప్పినట్లుగా రైతు మళ్ళీ వ్యాపారి దగ్గరికి పూజారి రామశాస్త్రిని వెంటబెట్టుకుని వెళ్ళి, విషయం చెప్పి వెయ్యివరహాలు తిరిగి ఇవ్వమని అడిగాడు. వ్యాపారి తెల్లమొహం వేసుకున్నాడు. ఇంతకమునుపె కదా నీవు ప్రయాణం ఆగిపోయిందని సొమ్మునంతా పట్టుకెళ్ళావు? అని అందామనుకున్నాడు. కానీ గొంతులోనే ఉండిపోయింది. ఇంతకు మునుపు రామశాస్త్రిలేడు కదా! తప్పించుకునే మార్గంలేక వెయ్యి వరహాలను రైతుకు ఇచ్చేశాడు. తను మోసం చేసినందుకు మరో ఐదు వందల వరహాలు పరిహారం చెల్లించుకున్నట్లయింది వ్యాపారికి.

రైతు సంతోషంతో గుడిపూజారికి, మర్యాదరామన్నకు మనసారా కృతజ్ఞతలు తెలియజేసుకున్నాడు.

ద్రోహం

ఒక రాజు క్రూరమృగాల బారినుండి ప్రజలను రక్షించేదానికి అడవికి వెళ్ళాడు. వేటాడు సమయంలో హఠాత్తుగా మాటున ఉన్న పెద్దపులి ముందుకు దూకింది. ఊహించని ఈ సంఘటనకు బెంబేలెత్తిన రాజు బెదిరిపోయి, అందుబాటులో ఉన్న చెట్టెక్కి చిటారుకొమ్మకు ప్రాకినాడు. కానీ అక్కడ ఒక ఎలుగుబంటు కూర్చొని ఉన్నది. దానిని చూడగానే అహా "ముందు నుయ్యి వెనుక గొయ్యి" అంటే ఇదే కదా! తనకు ఇక మరణం తప్పదు అనుకున్నాడు. ప్రాణం బితుకు బితుకు మంటూండగా అక్కడే కొమ్మపై కూర్చొన్నాడు ఇక చేసేదేమీ లేక.

రాజు దుస్థితిని గమనించిన ఎలుగుబంటు సాదరంగా దగ్గరికి పిలిచి "మిత్రమా! భయపడకు. నీవు అనుకోకుండా వచ్చిన అతిథివి. నిన్ను గౌరవించుట నా ధర్మం. నీకొచ్చిన భయమేమీ లేదు. ధైర్యంగా ఉండు", అని స్నేహహస్తం చాచింది. ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. సుఖంగా నిద్రపోవుటకు తగిన చోటు చూపింది. రాజుకూడా భయం వదలి ధైర్యంగా, నింపాదిగా నిద్రపోయాడు.

ప్రొద్దుపోయాక చెట్టు క్రిందనే నరభక్షణ కొరకు ఎదురుచూస్తున్న పులి, ఎలుగుబంటితో ఇట్లన్నది. "ఓసీ తెలివి తక్కువదానా! వేటాడేదానికి వచ్చిన క్రూరాధముని, అందునా మానవుని నమ్మవచ్చునా? నన్నుజూచి అటులున్నాడు గానీ, లేకున్న నిన్ను చంపక వదలునా? కావున నమ్మరాని ఈ మానవుని క్రిందికి నెట్టుము. ఆరగించి వెళతాను అన్నది.

ధైర్యముచెప్పి, స్నేహహస్తమును జాపి, దగ్గరకు తీసుకున్న మనిషికి హాని తలపెట్టుట ద్రోహం కదా? అలా చేయ తగునా? నేను చెయ్యలేను, అని ఎలుగుబంటు పులితో చెప్పింది. పులి తన ప్రయత్నము వ్యర్థము కాగా, నిరాశచెంది వెనుదిరిగి వెళ్ళబోతూ, ఆశ చావక మరొక అవకాశం కొరకు ఎదురు చూడసాగింది. అర్ధరాత్రి రాజుకు మెలకువ వచ్చింది. క్రిందికి చూచాడు. పులి ఉన్నదా? వెళ్ళినదా? అని, అదును కొరకు చెట్టుక్రిందనే కాచుకొని కూర్చొని ఉన్న పులిని చూచాడు రాజు. పులికూడా రాజును చూచి, మరలా భేదోపాయమును ప్రయోగించి ఇట్లన్నది.

"ఓయీ తెలివి తక్కువ మానవుడా! క్రూరమృగముల నమ్మవచ్చునా? ఎలుగుబంటు నిన్ను వదలుననుకొంటివా ఏమీ? నేనావలికేగగనే తప్పక నిన్ను తినివేయును. కావున ఎలుగును క్రింద పడద్రోసినచో, దాని మాంసమును తిని, నేవెళ్ళిపోయెదను. సూర్యోదయం కాగానే నీదారిన నీవు వెళ్ళవచ్చును అన్నది.

పులి మాటలు రాజుకు అర్థవంతముగా తోచినవి. వెంటనే శివమెత్తినవానివలె వాటంచూచుకొని, ఒంటినిండా బలం తెచ్చుకొని, అటు ప్రక్కన నిద్రపోతూ ఉండిన ఎలుగబంటిని ఒక్కతన్ను తన్నినాడు. పాపం ఎలుగుబంటు చెట్టునుండి క్రింద పడబోతూ, కొమ్మను పట్టుకొని పైకి ఎగబ్రాకి వచ్చింది. రాజుకు ఇపుడు నిజంగా పంచప్రాణాలు పైకి పోయినట్లయింది. కానీ ఎలుగుబంటు " ఓ రాజా! నీవు చేసిన పనికి నేనైనా నిన్ను భక్షించాలి, లేదా క్రింద పడద్రోసి పులికైనా ఆహారంగా వెయ్యాలి. కాని స్నేహం చూపి, ఆదరించి, దగ్గరకు తీసుకున్న నేను, నిన్ను చంపుట ధర్మం కాదు. నీలాంటి నీచుని మాంసంకూడా రుచించదు. వెళ్ళు! పులి వెళ్లిపోయింది. నిన్ను క్షమించాను" అన్నది. నగరానికి తిరిగి వచ్చిన రాజుకు తను చేసిన మిత్ర ద్రోహం పదేపదే జ్ఞప్తికి వచ్చి, మతిచెడి రాజ్యభ్రష్టుడై అంతమయ్యాడు.

అవకాశం రావడం అదృష్టం - పోగొట్టుకోవడం దురదృష్టం

ఒకసారి ఇద్దరు క్రైస్తవ బాటసారులు నిర్జన మార్గాన ప్రయాణిస్తున్నారు. బాగా కబుర్లు చెప్పుకుంటూ, హాయిగా నవ్వుకుంటూ వెళుతున్నారు. మధ్యాహ్నం కావడంతో, ఒక చెట్టు క్రింద విశ్రమించడానికి ఆగారు. ఆకలైనపుడు తినవచ్చుకదా అని వారిలో ఒకడు చద్దన్నం మూట కట్టుకొని వచ్చాడు. తోటి బాటసారిని కనీస మర్యాద కొరకైనా పిలవకుండా (పిలిస్తే ఎక్కడ వచ్చేస్తాడోనని) వాడొక్కడే తినడానికి సన్నద్ధమవు

తుండటంతో మిత్రమా! "నిన్ను నీవు ప్రేమించునట్లుగా నీ పొరుగువారిని కూడా ప్రేమించు". అనునటువంటి బైబిల్ సూక్తిని నీవు వినలేదా? అన్నాడు.

దానికి మొదటివాడు "నీ పొరుగు వానిదగు దేనినైనా ఆశింపకు" అనే బైబిల్ సూక్తిని నీవూ వినలేదా"? అని గడుసుగా సమాధానం చెప్పాడు. చాలా తెలివిగా సమాధానం చెప్పి తప్పించుకున్నందుకు, తనకుతానే లోలోన మెచ్చుకొనుచూ, అదో రకమైనా విజయగర్వపు చూపులుచూస్తూ, తెచ్చుకున్న అన్నం తనొక్కడే తింటూ ఉండగా, చెట్టుమీదున్న గండుకోతి తటాలున అన్నం మూటను లాక్కొని దౌడు తీసింది.

జరిగిన హఠాత్సంఘటనకు నోరు వెళ్ళబెట్టుకుని చూస్తూ ఉండిపోయాడు అన్నం తెచ్చుకున్న బాటసారి. నీతి మాటను సందర్భం మార్చి తన వాదానికి బలం ఇచ్చేదిగా ఉపయోగించుకున్నాడు. అయినా ఫలితం దక్కక పోయేసరికి "అయ్యో! ప్రక్కవాడికీ ఇంత అన్నం పెట్టి ఉంటే బాగుండేది కదా!" అనుకున్నాడు. కానీ ఏం లాభం? ఆకలిగొన్న వాడికింత అన్నం పెట్టే అపురూపమైన అవకాశ భాగ్యాన్ని చేతులారా పోగొట్టుకున్నాడు.

అతి తెలివితేటలున్న వారితో వచ్చిన చిక్కే ఇది. ప్రతి అవకాశంలోనూ ఎంత ఉపయోగించుకున్నాం? ఉపయోగపడకుండా తప్పించుకున్నామా లేదా? ఎంత సంపాదించాం? అని ఆలోచించి, మనుషుల సంబంధాలపైనే అసహ్యం కలిగే రీతిలో ప్రవర్తిస్తుంటారు. వాతావరణాన్ని అతలాకుతలం చేస్తుంటారు.

అధికారం

తన, పర భేదం లేకుండా సమదృష్టితో అర్హులందరికీ న్యాయం జరిగేలా చూచేదానికి లభించే ఒక అవకాశం, ఒక అదృష్టమే అధికారం.

పక్షపాతంతో, బంధుప్రీతితో అయినవారికీ, అనర్హులకూ అధికారాన్ని దుర్వినియోగ పరచకూడదు. అధికారం అనేది అనాధలకూ, అభాగ్యులకూ, అర్హులకూ, బలహీనులైన వారందరికీ సేవలు అందించే ఒక అపురూపమైన అవకాశం. దుర్వినియోగపరచడం అవినీతి. అధికారాన్ని అలంకారంగా భావించి, అహంకరించి, దర్పం, డాంబికం చూపించి,అయినవారిని మరచి, చిన్నచూపుచూచేవారిని ఎంతటి దగ్గరివారైనా సరే దూరంగా ఉంచి తీరాల్సిందే. అధికారాన్ని భగవదనుగ్రహంగా భావించి, ఒక సేవకునిగా సేవా ధర్మాన్ని నిర్వర్తించేవారెవరైనా సరే-కుల, మత, జాతి, లింగ, భాష, ప్రాంతమనే తేడా లేకుండా ఆదరించాలి, ఆత్మీయుడుగా భావించాలి.

ధర్మం ఆచరించడానికి అధికారం ఒక చక్కని అవకాశం. "నేనింత పెద్ద హోదాలో, అధికారంలో ఉన్నాను. నేను గీతగీస్తే దాటే దమ్మెవరికుంది"? అనుకోవడం. స్థానబలిమితో, అధికారబలిమితో, ఉచితానుచితాలు యోచించకుండా సిఫారసు చేయడం, అయోగ్యులకు ఆశ్రయం ఇవ్వడం, యోగ్యులే అయినా తనకు కానివారు కాబట్టి

తృణీకరించడం, హింసించడం, చెయ్యవలసిన సేవలను విస్మరించడం, చేసిన పనులకు అదనంగా సొమ్ము దండుకోవడం, నాకు సలహాలనిచ్చే స్థాయి, తాహతు ఎవరికుంది? అనుకోవడం. ఇష్టమున్నప్పుడు వీలైనప్పుడు మాత్రమే రావడం, పోవడం. తన హయాంలో తను అనుకున్నది అన్నకున్నట్లుగా చెప్పడం, తనకు అయినవారికి అడిగినదేదైనా చేసిపెట్టడం, జీతం తీసుకుంటున్న ఉద్యోగానికి నామం పెట్టి బైట పనులలో తీరిక లేకుండా మునిగిపోవడాన్ని 'రాజ్యమేలడం' అంటారు. ఉద్యోగం చిన్నదీ కావచ్చు. పెద్దదీ కావచ్చు, రాజకీయనాయకుడూ కావచ్చు లేదా పలుకుబడి గల వి.ఐ.పి కావచ్చు, తన పేరు చెబితేచాలు, తను కనుసైగ చేస్తే చాలు అట్టేపనులు జరిగిపోవాలి. అదీ తడాఖా అంటే! అదీ రాజ్యమేలడమంటే! ఇక సంపాదన అంటారా! తన బిడ్డల బిడ్డలు, అలా ఏడు తరాల వారికి కూడబెట్టితే అదీ తృప్తి. అధికారం సంపాదించినందుకు అదీ సార్థకత. సంపాదన ఎలా వచ్చింది అని ప్రశ్నించే అవకాశాలు తక్కువ. ఒక వేళ వచ్చినా కూడా తప్పించుకునేదానికి ఎన్నో మార్గాలు. భయపడవలసిన పనేలేదు.

అధికారులకు ఎంత ఆడంబరంగా ఉంటే అంతగొప్ప అనుకుంటున్నారు. ఎవ్వరికీ లేనంత, ఎవ్వరి దగ్గరాలేనంత ధన,కనక, వస్తు,వాహనాలు, భవనాలు, భూములు ఉండాలన్న తపనపడుతున్నారు. ఈ విధంగా చిన్న ఉద్యోగి స్థాయిలో అయినా పెద్ద ఉద్యోగి స్థాయిలో అయినా పెంచుకున్న పరపతితో, దక్కిన అవకాశాలతో, ఎవరికి చేతనైనంతమేర వారు వెనకేసుకుంటున్నారు.

అవకాశాలు లేనివారు, దిగజారే ధైర్యం చేయలేనివారు, నిజాయితీగా ఉండేవారే అవినీతికి వ్యతిరేకంగా కంఠశోషపెడుతూ, పోరాడుతూ చివరకి సాధించిందేమిటి? అని ప్రశ్నించుకుంటే ఆయాసంతో, నీరసంతో 'తృప్తి' అనే సమాధానం మాత్రమే.

సామాన్య ప్రజలంతా ఆశతో, ఆకలితో జీవిస్తూ ఉంటారు "కోటి విద్యలూ కూటికొరకే" అన్నట్లు సంసారాల జరుగుబాటు కోసం ఏవేవో పనులు చేసుకుంటూ ఉంటారు. తప్పులు చేస్తున్నామని తెలిసికూడా, రాజీధోరణిలో సర్దుబాటు చేసుకొని జీవిస్తూ ఉంటారు. ప్రతిఘటనలు ఎదురైనప్పుడు బ్రతుకు కోసం తిరుగుబాటు చేస్తారు. అలాంటి పరిస్థితులలోనే, ఫలానావారు తప్పులు చేయ్యలేదా? వారికొక న్యాయం, మాకొక న్యాయమూనా? అని నేరాలు చేసి తప్పించుకున్న గొప్పోళ్ళ బాగోతాల చిట్టా విప్పి వాపోతారు. పెద్దవారి అడుగు జాడలలో నడిస్తే తప్పేంటి అంటారు. అందుకే పరిపాలకులు, అధికారులు, పెద్దవారు ఆదర్శంగా జీవించాలి. " యధారాజా తథాప్రజ" " పాలకులెలా ఉంటారో పాలితులూ అలాగే ఉంటారు. దుష్టులను శిక్షించి, ధర్మాన్ని రక్షించే విధంగా పాలకులు, అధికారులు ఉండాలని ప్రజలు కోరుకుంటారు. భయ రహిత సమాజంలో నిర్భయంగా జీవించాలని కోరుకుంటారు.

పరిపాలకులు, ప్రభుత్వాధికారులందరూ తాము ప్రజా సేవకులమని బాగా గుర్తించుకోవాలి.

పనివాడే కదా అని చులకన చేయవద్దు

అరవీడు సంస్థానాధీశుడు మరణించాక, ఆయన ఒక్కగానొక్క కుమారుడైన నీలకంఠ వర్మ సంస్థానాధీశుడయ్యాడు. పరిపాలనానుభవంలేని కారణంగానూ, యవ్వనపు అహంకారంతోనూ సంస్థానంలోని ఉద్యోగులందరినీ అయిన దానికీ, కాని దానికీ అధికార దర్పంతో వేదిస్తూ ఉండేవాడు. ఆ ఆస్థానంలో దాదాపు అరవై సంవత్సరాల నుంచీ ఎంతో విశ్వసనీయంగా పని చేస్తున్న భూషయ్యనుకూడా పెద్దా-చిన్నా లేకుండా దండించడం మొదలుపెట్టాడు.

దురదృష్టవశాత్తు, ఒకరోజు భూషయ్య జామతోట దగ్గరికి వెళ్ళిరావడం మరచి పోయాడు. చెప్పిన పని చేయలేదని పిల్ల సంస్థానాధీశుడైన నీలకంఠవర్మ, కోపగించుకొని చాలాదురుసుగా ప్రవర్తించి, మతిమరుపు ముసలోడివి, నీకెందుకూ ఉద్యోగం అని వెనకాముందూ ఆలోచించకుండా తొలగించేశాడు.

అవమానభారంతో భూషయ్య క్రుంగిపోయాడు. సంస్థానంలో చేరి అరవై సంవత్సరాలైనప్పటికీ, ఏనాడూ ఒక్కమాటకూడా అనిపించుకోలేదు. అటువంటిది ఈ పిల్లకుంకగాడు ఎంతేసి మాటలన్నాడు. వీడిని ఇలాగే వదిలేస్తే ఇంకా క్రూరంగా ప్రవర్తిస్తాడు. కాబట్టి తగిన శాస్తి చేయవలసిందేనని తీర్మానించుకున్నాడు.

వయోభారంతో నున్న భూషయ్యను, అవమాన భారం మరింత కృంగదీసింది, మంచాన పడ్డాడు. ఇక చనిపోతాడనగా-భూషయ్య తనకుమారుడిని పిలిపించి, రహస్యంగా ఒకమాట చెప్పి కన్నుమూశాడు. కుమారుడు వెంటనే పిల్ల జమీందారు దగ్గరికి పరుగు పరుగున వెళ్ళి, మా తండ్రి ఇక ఎన్నో రోజులు బ్రతకడు, తాతలనాటి నిధిని మీ భవనంలోని ఒక గోడలో భద్రపరిచారట. ఆ విషయం మీతో స్వయంగా చెబుతాడట, కాబట్టి వెంటనే రావాలట అని చెప్పాడు.

'నిధి' అనే మాట వినబడగానే పిల్ల జమిందారుకు వళ్ళు పులకరించింది. హుటాహుటిన భూషయ్య ఇంటికి బయల్దేరి వెళ్లాడు. భూషయ్య కొడుకు గదిలోకి వెళ్ళి పరుగునవచ్చి మా తండ్రి గారు ఇక లేరు. ఇపుడే కన్ను మూశాడు. భోరున విలపిస్తూ చెప్పాడు. నీలకంఠవర్మ ఆశ నిరాశ అయ్యింది. ఇంటికి వచ్చిన పిల్ల జమీందారుకు నిద్రపట్టలేదు. బాగా ఆలోచించి చివరకు గోడలను పగలగొట్టి నిధిని వశం చేసుకోదలచాడు. ఒక్కొక్క గోడను పగలగొడుతూ చూడసాగాడు. తాతలనాటి అద్భుతమైన భవనాన్ని మొత్తం కూలదోశాడు. నిధి మాత్రం కనిపించలేదు.

కుప్పకూలి పోయిన జమీందారు భవనాన్ని చూచి, మా తండ్రి చనిపోతూ కూడా పగ సాధించి ప్రతీకారం తీర్చుకున్నాడు అని తృప్తి పడ్డాడు. చచ్చి సాధించడం అంటే ఇదేనేమో అని అనుకుంటూ ఇంటి దారిపడ్డాడు భూషయ్య కుమారుడు తృప్తిగా.

పరిపాలకులు, ప్రజా ప్రతినిధులు, పెద్దచదువులు చదివిన ప్రభుత్వాధికారులు, వారి క్రింది అధికారులు, వారిని అంటి పెట్టుకుని ఉండే వందిమాగధులు, ఇలా

అన్ని వర్గాలవారు, అధికారం, అవకాశాలున్న ప్రతి ఒక్కరూ అవినీతి ఊబిలో కూరుకొనిపోయి ఉన్నారు.

అవినీతి కేసులలో చిక్కుకుని భోరున ఏడుస్తూ టి.వి.లలో, వార్తా పత్రికలలో కనిపించేనవారంతా చదువు,కులం,వర్గం,హోదా,ధనం కలిగినవారే. అవినీతికి పాల్పడేటప్పుడు ఇవేవీ గుర్తుకురావా? ఎందుకు అవమానాలపాలు కావాలి? ఇతరుల కష్టాలకు, నష్టాలకు ఎందుకు కారణమవ్వాలి. అంటే?

ఐశ్వర్యాలేవో, అవసరాలేవో తెలుసుకోకుండా అన్నీ కావాలి. అంతాకావాలి తనకు మాత్రమే దక్కాలి అనే తపన.
అర్హతలు లేకున్నా అందలాలను అందుకోవాలన్న తపన.
అవసరం లేకున్నా అసూయతో ముందున్నవాడిస్థాయిని అందుకోవాలన్న తపన.
ఆశలున్నాయి కాబట్టి తీర్చుకోవాలన్న తపన.
తాహతుకుమించి బ్రతకాలన్న తపన.
అవకాశం దొరికితేచాలు దోచుకోవాలన్న తపన.
అడ్డదారులు తొక్కే నీచ మనస్తత్వం ఉంది కాబట్టి, దిగజారి ప్రయోజనాలు పొందవచ్చన్న తెంపరితనం.
తనలాగా దిగజారే వాడెవ్వరు? అడిగేదమ్మెవరికి ఉంది? అడ్డుకునే మొనగాడెవ్వడు? ఎవరికి తీరుబాటుంది? కాబట్టి అడ్డగోలుగా పరిగెత్తి, అందిన కాడికి దొరక పుచ్చుకోవాలన్న తపన.

నేరం ఋజువయ్యేనాటికి ముసలితనం వచ్చేస్తుంది. అప్పుడు బ్రతికితేనేం? చస్తేనేం? ఈ లోగా అనుభవించాల్సిందంతా అనుభవించేసి ఉంటాం. ఒక వేళ శిక్షపడినా మహా అయితే మన సంపాదనలో, మన అనుభవంలో గోరంత! పోతేపోనీ అనే నికృష్టపు తెలివి తేటలు.

'శిక్ష' అంటే చేసిన తప్పులకు బాధపడడమూ, బాధింపబడడమూ. ఇకపై ఎన్నడూ తప్పు చెయ్యరాదు. అనే పశ్చాత్తాపమే శిక్షలకు ఫలితం. శిక్షలను చూచినవారికి, శిక్షలను గురించి విన్నవారికి తప్పులు చెయ్యాలన్న ఆలోచనే కలగకూడదు. ఎవరైనా తప్పులు చేసేదానికి ప్రయత్నిస్తున్నారని తెలిసిన వెంటనే పెద్దవాళ్ళు "ఇలా చెయ్యకూడదు. ఇలాంటి ఆలోచనలు మనసులో రానీయకూడదు" అని వారించాలి.

చట్టాలను చేసే పాలకులు, అమలు పరచవలసిన అధికారులే చట్టాలను, కోర్టు తీర్పులను నిర్లక్ష్యం చేసిన దాఖలాలు కోకొల్లలు. తప్పు చేసిన అధికారులకు శిక్షపడినా మహా అయితే సస్పెన్షన్. తర్వాత పూర్తి జీతంతో ట్రాన్స్‌ఫర్.వీలైతే ప్రమోషన్‌విత్ ట్రాన్స్‌ఫర్. పరపతి ఉన్న శ్రీమంతులకు చట్టాలు చుట్టాలే!.

నీతికి, నిజాయితీకి ఏమాత్రం గుర్తింపు లేక పోగా, అవినీతికి ఎంత ప్రోత్సాహముందో ఎన్నో ఉదాహరణలు మనకు తెలియజేస్తాయి.

స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో చెడు ఆలోచించాలన్నా, తప్పుచేయాలన్నా, తప్పు మాట్లాడాలన్నా వందసార్లు ఆలోచించి నైతిక విలువల్ని, చట్టాన్ని గుర్తుకు తెచ్చుకుని విరమించుకునేవాళ్లు. మరి ఇపుడో...దేశభక్తులనబడే ఈ ప్రజానాయకుల పుణ్యమా అని మంచి చెప్పాలన్నా, చెయ్యాలన్నా వందసార్లు ఆలోచించవలసివస్తున్నది.

కొందరంటారు లంచం ఇచ్చేవాడిది కూడా నేరమే కదా! అని, డబ్బులు అదనంగా దండుకోవాలన్న మనస్తత్వమే లేకపోతే, ఇచ్చేవారెవరుంటారు?, ఎందుకు ఇస్తారు? డబ్బులు అనవసరంగా దారబోసుకోవాలని ఎవరు మాత్రం అనుకుంటారు? లంచం తీసుకోవాలన్న మనస్తత్వం ఉంటే, లేనిపోని అవరోధాలు సృష్టించి, చిన్నచిన్న లోపాలను వెతికి వెతికి భూతద్దంలో కొండంతగా చూపించి, ఇబ్బంది పెట్టి, "మూడు చెరువులనీళ్లు తాగించి, ముక్కుపిండి వసూలు చెయ్యరా?!

దేశభక్తుల త్యాగఫలితాన్ని, పరిపాలనా ఫలితాలను ప్రజలకు అందివ్వాలనే బాధ్యతలను మరచి, అధికార దర్పంతో తామేదో అన్నింటికీ అతీతులైనట్లు తమ దగ్గరికి వచ్చిన వారికి సేవలందించకుండా, సతాయించి - సతాయించి, విసుగుపుట్టించి, ఇక తిరగలేక, గత్యంతరం లేక వారు ఇచ్చుకోగలిగినంతా పుచ్చుకొని 'ఈ బుద్ధి ముందే ఉండి ఉంటే పని ఎప్పుడో అయిపోయి ఉండేదిగదా అని ఒక మందలింపుతో ఆ తంతుకాస్తా పూర్తి చేస్తున్నారు.

* "దొంగల రాజ్యంలో దోచుకున్నోడే మొనగాడు". "నేరస్తులకు శిక్షలు తక్కువ, ప్రజలకు సహనమెక్కువ"

కష్టం - సుఖం

ఏ మాత్రం ఇబ్బంది, కష్టం కలిగినా కొందరు ఓర్చుకోలేక అయినవారినీ, కాని వారిని, బతిమాలి, వాపోయి, ఆదుకొమ్మని అందరికాళ్ళా-వేళ్ళాపడి ప్రాధేయ పడతారు. ఎక్కడెక్కడి వారినో, ఎవరెవరినో జ్ఞప్తికి తెచ్చుకుని ఎలా ఉపయోగించుకోవాలో పదేపదే తీక్షణంగా ఆలోచించి, ఉరుకులు పరుగులతో, ఆఘమేఘాలమీద వెళ్ళి బ్రతిమలాడతారు. ఏ మాత్రం నిలకడగా ఉండలేరు,ఉండరు, ఉండనివ్వరు. ఏది ఏమైనా, ఎవరు ఏమైపోయినా పర్వాలేదు.వారికొచ్చిన ఇబ్బందిని తొలగించాలి, సానుభూతిని చూపించాలి, ఓదార్చాలి, అండగానిలవాలి. అంతే! పనైపోయాక ఉలుకుపలుకూ, ఐపూ-అజా ఉండరు. కొందరు సుఖంగా ఉన్నప్పుడు ఎవ్వరినీ లెక్కచెయ్యరు. తమ సుఖం తప్ప ఇతరుల పరిస్థితులతో నిమిత్తం ఉండదు. "చిన్నినా కడుపుకు శ్రీరామరక్ష". "నన్నంటనాకు నామాలకాకి". అన్నట్లుగా ఉంటారు. ఎక్కడ తమను డబ్బు అడుగుతారో అనీ, ఎక్కడ తమను ఉపయోగించుకుంటారోనని దూరంగా ఉంటారు. అవసరం వచ్చినప్పుడు, ముఖంపై నవ్వును తెచ్చిపెట్టుకుని, తేనె పూసిన మాటల పలకరింపులతో, తమ శుభ అశుభకార్యాలను, అవసరాలను నెరవేర్చుకుంటూ ఉంటారు.

* ఆపదలో, కష్టంలో ఉన్నవారిని ఆదుకోవాలి, పరామర్శించాలి. ఆ సమయంలో తప్పుకున్నవారి మానసికమైన మాలిన్యం ఏ స్నానం చేసినా శుభ్రపడదు.
* సుఖ సమయంలో బంధు, మిత్రాదులను మరువనివారు, కష్టాలలో, సుఖాలలో చలించకుండా నిబ్బరంగా, ఎవరికీ భారం కాకుండా ధైర్యంగా నిలిచేవారే ఆదర్శవంతులు.
* కష్టం-సుఖం, లాభం-నష్టం, మంచి-చెడు జీవితంలో అనివార్యాలు. గొప్పవారి జీవితం ఏనాడూ సాఫీగా, సజావుగా, సరళరేఖల్లాగా సాగలేదని తెలుసుకోవాలి.
* నమ్మిన ఆదర్శాలకోసం, సిద్ధాంతాలకోసం అహర్నిశలు అవిశ్రాంతంగా పోరాడినవారే గొప్పవారు.
* అంతవారికే తప్పనప్పుడు మనమెంత? మనబ్రతుకెంత, అనేభావం ఒక్కోసారి కలుగుతుంది. పరమ పవిత్రులకే కష్టాలు తప్పనప్పుడు, గౌరవం దక్కనపుడు, మనం మాత్రం ఎందుకు ఆదర్శాలకోసం వెంపర్లాడాలి. ఎందుకు లేనిపోని బాధలు కొని తెచ్చుకోవాలి? "ఊరక ఉన్న ప్రాణానికి ఉరి ఎందుకు తగిలించుకోవాలి"? అని అనుకుని ఉంటే మనమీనాడు ఇలా ఉండి ఉండే అవకాశమేలేదు. "అందరికోసం మనం, మనకోసం అందరూ" అనుకుంటూ జీవించాలి.
* అవసరం ఉందని కొందరు. అవకాశం దొరికిందని కొందరు, అధికారం ఉందని కొందరు, కష్టాలు,నష్టాలు వచ్చాయని కొందరు, దేహాన్ని, బుద్ధినీ, హృదయాన్నీ అమ్మేసుకుంటున్నారు. కొనేవాడుంటే దేనినైనా, ఎంతకైనా అమ్మజూపే వ్యాపార సంస్కృతి గల జాతి ద్రోహులు అన్ని రంగాలలో పాతుకుని పోవడమే మన దేశానికి పట్టిన దౌర్భాగ్యం.

కష్టాలను ఓర్చుకున్నవారే ఉన్నత స్థానాన్ని పొందగలరు

ఉత్సవంలో ఊరేగింపుగా విగ్రహాన్ని బయటికి తెస్తున్నారు. అపుడు పడికెట్లకు ఉపయోగించిన రాయి ఒకటి విగ్రహాన్ని అడిగింది. నీవూ రాయివే, నేను రాయినే మరి నీకెందుకు పూజలు? నాకెందుకు తన్నులు? అని, ఉలిదెబ్బలకు, సుత్తి పోట్లకు తట్టుకొని, నిలబడినందుకే నాకీ పూజలు, అలా నిలబడనందుకే నీకీతిప్పలు. అయినా! పనికిరాకుండా వీధిలో పడి ఉండటం కంటే, కనీసం పడికెట్లుగానైనా ఉపయోగపడినందుకు నీ జీవితం ధన్యమైందని తృప్తిపడు అని పడికెట్లరాయిని ఓదార్చింది విగ్రహం.

* కష్టాలకు తట్టుకొని నిలబడగలిగినవారే గౌరవింపబడతారు.
* పనికిరాకుండా తుప్పుపట్టి నాశనమైపోయే దానికంటే ఉపయోగపడి అరిగిపోవడమే మంచిది.
* ఉన్నత స్థితిలోని వారిని చూచి అసూయ, అసంతృప్తి, ఆందోళన చెందడంకంటే ఉన్న దానితో తృప్తిచెందడం ఉత్తమం.

ఆపదలో మ్రొక్కులు సంపదలలో మరుపులు

ఒక బాటసారి అడవి మార్గంగుండా ప్రయాణిస్తూ దారి తప్పి అడవి మధ్యలో నిలిచిపోయాడు. ఎంత ప్రయత్నించినా దారి దొరకలేదు. సూర్యుడస్తమించే సమయం దగ్గర పడుతున్నది. మనసులో భయం, ఆందోళన అంతకంతకూ అధికమైపోతున్నది. "రాయి తగిలినప్పుడే రామా-క్రిష్ణా" అనుకున్నట్లుగా బాటసారికి భగవంతుడు జ్ఞాపకం వచ్చాడు. భగవంతుడా నన్ను కాపాడు లేదంటే ఏ పులి నోట్లోనో పడక తప్పదు, ఏ పాము కాటుకో గురికాక తప్పదు. హే భగవాన్ నన్ను రక్షించు, ప్రాణాలతో ఇల్లు చేరగానే నాకున్న ఏకైక ఎకరం పొలం అమ్మి, నీ హుండీలో వేస్తాను. అని మ్రొక్కుకున్నాడు. వెంటనే నిశాచర భయంకరుడైన శ్రీ ఆంజనేయస్వామి ఇలా చెప్పాడు. భక్తా తీవ్రమైన నీ హృదయ నివేదన నాకు వినపడింది. భయపడకు నీ ప్రాణాలకు వచ్చిన ముప్పేమిలేదు. నేను ఆంజనేయస్వామిని ఇదిగో నాతోక గట్టిగా పట్టుకో మరోక్షణంలో నీ యింటిలో ఉంటావు అన్నాడు.

బాటసారి కళ్లు తెరిచేటప్పటికి తన ఇంట్లో సురక్షితంగా ఉన్నాడు. ఆనందం పట్టలేక. ఇంకెప్పుడూ ఒంటరిగా ప్రయాణించకూడదు అని గట్టిగా నిర్ణయించుకొని హాయిగా నిద్రపోయాడు. తెల్లవారింది. అతనికి తన మ్రొక్కుబడి జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఇప్పటికిప్పుడు పొలం అమ్మాలంటే ఎలా సాధ్యపడుతుంది? చాల తక్కువ ధరకు అమ్మవలసివస్తుంది. కాబట్టి మంచి ధర వచ్చినప్పుడు అమ్ముదాంలే అని వాయిదా వేస్తూ వచ్చాడు. అలాగే మరచిపోయాడు. మ్రొక్కుబడి జ్ఞాపకం వచ్చినప్పుడు మాత్రం, భగవంతుడు దయామయుడు అంతటి గొప్పవాడికి నా పొలం అమ్మిన డబ్బేకావాలా? ఇవ్వకపోయినా పర్వాలేదు అనుకున్నాడు మనసులో. కొంత కాలానికి బాటసారికి జబ్బు చేసింది. ఎంతమంది వైద్యులకు చూపించినా నయం కాలేదు. డబ్బేమో ఖర్చు అవుతున్నది కానీ, జబ్బు మాత్రం నయం కాలేదు. ఇల్లు, పొలం కూడా అమ్మకానికి పెట్టాడు. మధ్యవర్తి ఇప్పుడు చెప్పావు కదా? మంచి ధర వచ్చినప్పుడు నేనే నీ వద్దకు గిరాకీని పట్టుకొస్తాను. అంతవరకు అగు. తొందరపడితే తక్కువ ధరకు అమ్మవలసివస్తుంది అన్నాడు. అయ్యో ధర వచ్చేలోగా నేను చచ్చేటట్లున్నా నన్న వెంటనే తాను భగవంతునికి చేసిన మోసం జ్ఞాపకం వచ్చి చాలా తీవ్రంగా బాధపడ్డాడు. అయినా లాభంలేకపోయింది. తనువు చాలించాడు.

హావభావాలు

హావభావాలు మనిషి తత్వాన్ని బహిర్గతం చేస్తాయి. చూపులు, మాటతీరు, చేతులు తిప్పడాలు, నడక, కూర్చునే విధానం, నిలబడే పద్ధతిని గమనించినట్లయితే వ్యక్తిత్వం బయటపడుతుంది.

మాట్లాడేటపుడు చేతులను నలుపుకుంటూ ఉండడం, చేతి వ్రేళ్లను మెటికలించడం, ఆవులించడం, అనవసరంగా గొంతు పెంచి మాట్లాడటం, పెద్దగా నవ్వడం, ప్రక్కవాడి భుజంమీదనో, వీపు మీదనో చేతితో తడుతూ, పొడుస్తూ మాట్లాడటం, ప్రక్కవారిని తెలివి తక్కువగా చూపిస్తూ ఎగతాళి చెయ్యడం, మంచివారి లక్షణాలు కావు. కళ్లలోకి సూటిగా చూడకుండా ఎటువైపో చూస్తూ మాట్లాడేవారి నిజాయితీని శంకించవలసిందే.

విశాలహృదయులు, కపటమెరగనివారు-చూచి చూడగనే ముందుగా పలుకరిస్తారు. చూస్తూనే నమస్కరించడం, శ్రద్ధగావినడం, చక్కగా మాట్లాడటం, యోగక్షేమాలు తెలుసుకోవడం. పరిచయంలేనివారెవరైనా మాట్లాడేటందుకు వస్తే చిరునవ్వుతో మాట్లాడటం, స్నేహపూర్వకంగా కరచాలనం చెయ్యడం, ఆప్యాయంగా కౌగిలించుకోవడం, సందర్భానుసారం ప్రశంసించడం, హాయిగా నవ్వడం, నిదానంగా మాట్లాడటం, సూటిగా, వినయంగా చూడటం ఇలాంటి హావభావాలు మనుషుల సంబంధాల్ని పటిష్టపరిచేవే, గౌరవాన్నిపెంచేవే.

నిజం చెప్పడమే మంచిది

ఒక మోతుబరి రైతుకు తానెంతో తెలివైన వాడిననే విశ్వాసం ఎక్కువగా ఉండేది. కూలి వాళ్ళదగ్గర, నౌకర్లదగ్గర, మిత్రుల దగ్గరకూడా తన తెలివి తేటలను, సమయస్ఫూర్తిని ప్రదర్శించి, వాళ్ళను ఆట పట్టించేవాడు, "ఇంత తెలివి తక్కువైతే ఎలా బ్రతుకుతారయ్యా"?! అని ఎగతాళికూడా చేస్తూ ఉండేవాడు.

ఒక రోజు రైతు పొలం దగ్గర ఉన్న చెట్టునీడన కూర్చొని పొలం పనులను గురించి చర్చిస్తూ ఉండగా పొరుగు పల్లెనుండి ఒక మిత్రుడు ఒక బుట్టలో కంజు పిట్టల కూర, ద్రాక్షరసం పట్టుకొచ్చి ఇచ్చివెళ్ళాడు.

పొలంలో పనులు చేస్తూ ఉండిన ఒక కుర్రాడిని రైతు పిలిచి "ఓరే అమాయక చక్రవర్తీ! ఇలారా. ఈ బుట్ట పట్టుకెళ్ళి ఇంట్లో ఇచ్చిరా. జాగ్రత్త రోయ్ దారి మధ్యలో బుట్ట మూత తెరవకు, అందులో ఒక పిట్ట ఉంది. ఒక సీసాడు విషం కూడా ఉంది. పిట్ట ఎగిరిపోతుంది. విషం సీసా పగిలిపోతుంది". అన్నాడు.

ఆ కుర్రవాడు బుట్ట నెత్తిన పెట్టుకుని వెళ్ళగానే మిగితావాళ్ళతో " ఇలా చెబితే మధ్యలో మూత తీసి చూడడు ఎలా ఉంది నా ఆలోచన" అంటూ తన తెలివికి తానే మురిసిపోతూ పగలబడి నవ్వాడు రైతు.

బుట్టతో వెళ్ళిన కుర్రాడు అంతకంటే తెలివైనవాడు. రైతు అలా చెప్పాడంటే బుట్టలో ఇంకేదో ఉందన్నమాట అనుకున్నాడు. ఒక చెట్టుక్రింద ఆగి, ఆత్రుతతో, బుట్టమూత తీశాడు. మూత తెరవగానే మసాలా వాసన గుప్పుమని ముక్కు పుటాలను సోకింది. నోట్లో నీళ్ళు జలాజలా ఊరాయి. ఓహో ఇదా పిట్ట అంటే అని కాస్త రుచి

చూచాడు. అబ్బ భలే ఉందే, లొట్టలు వేసుకుంటూ, సీసాలో ఏముందో తెలుసుకోవాలని మూత తీసి, ముక్కుదగ్గర పెట్టుకుని వాసన చూచాడు. ఏదో ఒకలాగా ఉందది. విషం మాత్రం కాదు. విషమైతే కూర ప్రక్కన ఎందుకు పెడతారు? అనుకుంటూ నాలుక మీద ఒక చుక్క వేసుకుని రుచి చూచాడు. అదోలా అనినించింది. నోరుకూడా ఊరింది.

రెండో ఆలోచన లేకుండా కూర తినేసి, ద్రాక్షరసం తాగేసి, ఆ చెట్టునీడలోనే బాగా నిద్రపోయాడు.

భోజనం వేళకి ఇల్లు చేరుకున్న రైతుకు మిత్రుడు పంపిన బుట్టచేరలేదన్న విషయం తెలిసింది. వెంటనే కోపంగా దగ్గరి దారిగుండా పొలంవైపుకు వెళ్ళాడు రైతు. దారిలో చెట్టునీడలో బాగా గుర్రుపెట్టి నిద్రపోతూ కనిపించాడు కుర్రాడు. వెంటనే "నిద్రలేవరా" అని గద్దించాడు రైతు. చుట్టూ పని చేసుకుంటున్నవారంతా వచ్చి గుమికూడారు. "బుట్ట ఏదిరా?" అన్నాడు రైతు కోపంగా.

కుర్రాడు దిగ్గున లేచి "తప్పయిపోయింది దొరా! బుట్టలో పిట్ట ఎగిరి పోతుందేమోనని చాలా జాగ్రత్తగా, భయంగా నడుస్తూ వసున్నానండయ్య, కాలికి రాయి తగిలితే తూలి పడిపోయినానయ్య, బుట్ట క్రింద పడింది. మూత తెరుచుకుందయ్యా, పిట్ట ఎగిరి పోయిందయ్యా. చీఛీ అమాయక చక్రవర్తిని, యజమాని చెప్పిన ఈ చిన్నపనిని కూడా జాగ్రత్తగా చేయలేని బ్రతుకెందుకు, చచ్చిపోదామనుకుని సీసాలోని విషం త్రాగేశానండయ్యా. అయినా నేను చచ్చిపోలేదెందుకయ్యా?" అని చేతులు కట్టుకుని వినయంగా నిలబడ్డాడు. ఇదంతా చూస్తున్న కూలి జనానికి నవ్వాగలేదు. అయినా తమాయించుకుని మూతికి చేతులడ్డం పెట్టుకుని, రైతు వైపు చూస్తూ నిలబడ్డారు. తన అతి తెలివితేటలు తనకే బెడిసికొట్టేసరికి ఖంగుతిని "నిజం చెప్పిఉంటేనే మంచిది" అనుకున్నాడు.

స్పందించడమంటే బాధ్యతగా వ్యవహరించడమే

ఒకప్పుడు హరినారాయణ అనే గొప్ప పండితుడుండేవాడు. ఆయన పాండిత్యానికి అందరూ ముగ్ధులయ్యేవారు. ఒకసారి సభలో అందరినీ ఉద్దేశించి పండితుడు చక్కగా ఉపన్యసిస్తున్నాడు. సందర్భానుసారంగా జీవహింసను గురించి వివరిస్తున్నాడు. జీవహింస పాపము. జంతువులు మనకు ఉపకారమే చేస్తున్నప్పటికీ మనం నిర్దాక్షిణ్యంగా వాటిని హింసిస్తున్నాం. "అహింసో పరమోధర్మః" అని చెబుతున్న సమయంలో ఒక వ్యక్తి లేచి ఉపన్యాసకుడి దగ్గరకు వచ్చాడు.

హరినారాయణ పండితుడు ఉపన్యాసాన్ని నిలిపివేసి, ఆ వ్యక్తి వైపు చూస్తూ "ఏమయ్యా! నా ఉపన్యాసంలో నీకేమైనా లోపం కనిపించిందా? అని వినయంగా ప్రశ్నించాడు.

అందుకు ఆ వ్యక్తి "మీరు మరోలా భావించకుంటే నాదొక చిన్న ప్రశ్న. జీవహింస మహాపాపమని కదా మీరు చెపుతున్నారు! మరి జంతు చర్మంతో చేసిన చెప్పులను మీరు ఉపయోగించవచ్చా? " చేప్పేవి శ్రీరంగనీతులు చేసేవి పాడుపనులు" అంటే ఇదేకదా? అని అన్నాడు.

వెంటనే హరినారాయణ పండితుడు " నాలో ఉన్న ఈ పెద్ద పొరబాటును తెలియజేసిన మీకు నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. మీరు చూపించిన చొరవకు మిమ్ములను అభినందిస్తున్నాను. తక్షణమే నా తప్పును సరిదిద్దుకుంటాను అని చెప్పి, ఉపన్యాసం పూర్తయ్యాక తన పాదరక్షలను అక్కడే వదలి వెళ్లాడు. ఆ తర్వాత హరినారాయణ పండితులు పాదరక్షలను వాడనేలేదు.

* "తప్పును ఒప్పుకుని వెంటనే సరిదిద్దుకునేవాడు గొప్పవాడు".
* సరి అయిన సమయంలో సరి అయినరీతిలో స్పందిచడమే చైతన్యం.

శీలవంతులు ప్రతిఫలాన్ని ఆశించరు.

ఒక నదిపై నిర్మించిన వంతెన అకస్మాత్తుగా కూలిపోయింది. నదికి పైభాగాన కురిసిన భారీవర్షం కారణంగా నీటి ప్రవాహ ఉధృతికి వంతెన ఆ చివర, ఈ చివర కూలిపోయింది. మధ్యభాగం మాత్రం అలాగే ఉండిపోయింది. దురదృష్టవశాత్తు వంతెనపై నడుస్తూ వస్తున్న ఒక కుటుంబం మాత్రం వంతెన మధ్యభాగంలో నిలిచి పోయింది. భయభ్రాంతులతో హాహాకారాలు చేస్తున్నారు. వాళ్ళ ఆర్తనాదాలు చూపరులకు హృదయవిదారకంగా ఉంది.

ఇంతలోనే మిగిలి ఉన్న ఆ వంతెనకూడా ఏనిమిషమైనా కూలిపోవచ్చుననే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ దృశ్యాన్ని చూచి హృదయం ద్రవించిపోగా, ఆ ప్రాంత జమీందారు ఆపదలోనున్న ఆ కుటుంబాన్ని రక్షించినవారికి లక్ష రూపాయలు ఇస్తాను. అని గట్టిగా అరచి ప్రకటించాడు.

అంతలోనే అటుగా వచ్చిన కర్షక యువకుడొకడు ఈ దృశ్యాన్ని చూచాడు. వెంటనే ఒక చిన్న పడవను నీళ్ళలోకి తోసి అందులోతాను కుప్పించి దూకి సాహసం చేసి, అతికష్టంతో ఆ వంతెన సమీపానికి వెళ్ళి ఎలాగో వారినందరినీ రక్షించి గట్టెక్కించాడు.

మహాసాహసికుడా! నేను ప్రకటించినట్లుగా ఇదిగో లక్షరూపాయిలు తీసుకో అన్నాడు జమీందారు వెంటనే ఆ యువకుడు " నా జీవితాన్ని నేను అమ్ముకోను. ఈ పేదకుటుంబానికి ఆ పైకం అవసరం. వారికిచ్చి ఆదుకోండి". అని చెప్పి కృతజ్ఞతలను కూడా ఆశించకుండా తన దారిన తాను వెళ్ళిపోయాడు.

నికరమైన శీలవంతులు ఇలాగే ఉంటారు. మర్యాద, ధర్మవర్తనము, పూర్వాపర సందర్భశుద్ధి, త్యాగము ఇవన్నీ శీలవంతులు లక్షణాలే.

ప్రపంచం శక్తిని పూజిస్తుంది. బలహీనతను కాదు. ఫుట్‌బాల్ మైదానంలో బంతిని ఎవరు బలంగా తంతారో, ఎవరు నైపుణ్యాన్ని చూపిస్తారో వారికే చప్పట్లు చరుస్తారు. ఈలలు వేస్తారు. మ్యాన్ ఆప్ ద మ్యాచ్ వాడే. విలన్‌ను చితకబాదిన వాడే హీరో, హీరోకే అభిమానులూ, సంఘాలు, అవార్డులూ, పూలదండలూ.

* శీలవంతులు తనను గురించి గానీ, ఎదుటివారి గురించి కానీ కఠిన సత్యమునైనా చెప్పేదానికి వెనుకాడడు.

దండి సత్యాగ్రహం రోజులలో, సబర్మతి ఆశ్రమం నుండి గాంధీ మహాత్ముడు బయలుదేరాడు, ఒక రోజు మారుమూల పల్లె ప్రాంతంలో బసచేయవలసి వచ్చింది. మహాత్ముడక్కడికి వచ్చెనోలేదో ఆపల్లెవాసులు మేళతాళాలతో, పూలహారాలతో మహాత్మునికి ఎదురువెళ్ళి స్వాగతం పలికారు.

ఈ రభసంతా ఏమిటి? ఎవరికోసం అని వారిని మహాత్ముడు అడిగాడు. ఆ గుంపులోని ఒకడు "మహాత్మా! తమరు దేవదూతలని మాకు .ఇపుడు స్పష్టంగా బోధపడింది. మాఊరి మధ్యలో అగాధమైన ఒక బావి ఉన్నది. ఎంతో కాలంగా అందులో నీళ్ళులేవు. తమరు వచ్చీరాగానే ఆ బావి నీళ్ళతో నిండిపోయింది. ఆ నీళ్ళు టెంకాయ నీళ్ళవలె ఉన్నాయి. మీరు నిజంగా " దేవదూత" అని చెప్పేదానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావలి? అని చెప్పాడు వారిలో ఒకడు.

విషయం విన్న వెంటనే మహాత్మునికి వచ్చిన కోపం అంతా ఇంతా కాదు. శాంత స్వభావానికి ప్రసిద్ధిచెందిన ఆయన, కోపంతో "మీకు బుద్ధి కొంచెమైనా లేదా? ఏదో కాకతాళీయంగా అలా జరిగి ఉంటుంది. దానికి నారాకతో ముడిపెట్టి ఇంత మూర్ఖత్వాన్ని ప్రదర్శిస్తారా? బావిలోకి నీళ్ళు రావడానికి ప్రకృతి సిద్ధమైన కారణమేదో ఉండీ ఉంటుంది. అంతేగానీ, మాయలు, మ్యాజిక్‌లు నాకు తెలియవు. నేను దేవుడనూకాను, దేవదూతనూకాను. ఎన్నో తప్పులు చేస్తూ, సరిదిద్దుకుంటూ ఉన్న సామాన్యమైన మీలాంటి మనిషినే. మీరు ఈ రాద్ధాంతాన్నంతా కట్టి పెట్టితిరా సరే! లేకుంటే ఇక్కడినుండి మకాం ఎత్తి వేస్తాను అన్నాడు.

ఆకతాయితనం

ఒక యోగి ప్రతి దినం నదిలో స్నానం చేసి, ఒడ్డున చేరి సంధ్యా కార్యక్రమాలు చేస్తూవుండేవాడు. చుట్టు ప్రక్కల ప్రాంతాలవారు ఆ యోగిపట్ల భక్తి ప్రపత్తులతో ఉండేవారు.

ఒకరోజు ఓ గడుగ్గాయి ఆకతాయితనంగా నదిలోని నీటిని దోసిలితో, నోటిలో పోసుకొని ఆ యోగి వద్దకు వెళ్ళి, తుపుక్కున యోగిపై ఉమ్మినాడు. ధ్యాన ముద్రలో నున్న యోగి కళ్ళుతెరిచి చూచాడు. చిరునవ్వుతో మళ్ళీ కండ్లు మూసుకొని శాంతంగా, మౌనంగా ఉండిపోయాడు.

ఆకతాయి మధ్యాహ్నం వరకు అలాగే చేసి, చివరికి అలసిపోయి ఆగిపోయాడు. యోగి కళ్ళు తెరచి "నాయనా? నీ ముచ్చట తీరిందా? ఆగిపోయావే?" అన్నాడు యోగి. కరుణను కురిపించే స్థిర, ప్రశాంత, గంభీరమైన ఆ చూపులకు, చిరునవ్వులకు ఆకతాయి చలించిపోయాడు. క్షమించండి మహాత్మా! తప్పుచేశాను. అని యోగి పాదాలపై పడ్డాడు.

"ఇందులో క్షమించవలసింది ఏముంది నాయనా? నా మీద నదినీళ్లను ఉమ్మి నూట ఎనిమిదిమార్లు గంగాస్నానం చేయించావు. ఆ పుణ్యం నీకే దక్కుతుంది. అని ఆశీర్వదించాడు యోగి.

* శాంతం, సహనం, సత్యం, పరోపకారం గొప్పవారి స్వభావాలు. అవే వారి ఆభరణాలు.

తెచ్చిపెట్టుకున్న గుణం అనర్థమే

రావులపాళెంలో ఉండే కోటయ్య, కొండమ్మలది పేద కుటుంబమే, కానీ జాలిగుండె గల దంపతులు. వారి ఇంటి ఎదురుగా ఉండే సుబ్బయ్య లక్ష్మమ్మ దంపతులు ధనికులే అయినా పిసినిగొట్టులు.

ఒకరోజు రాత్రి సుబ్బయ్య దంపతులు భోజనం చేస్తుండగా తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. ప్రశాంతంగా అన్నంకూడా తిననివ్వకుండా ఎవరా తలుపుతట్టేది? అని విసుగుతో తలుపు తీసాడు సుబ్బయ్య, ఎదురుగా ఒక ముసలివాడు అయ్యా, దూరం నుండి నడచుకుంటూ వస్తున్నాను. చాలా ఆకలిగా ఉంది, కాస్త అన్నం పెడితే తిని, అరుగుమీద పడుకొని, పొద్దున్నే లేచి వెళ్ళిపోతాను అన్నాడు.

చిరాకుతో ఏమయ్యా! మేము. వండుకునేది నీకోసమే అనుకున్నావా? అడిగిన బిచ్చగాడికల్లా పెట్టుకుంటూపోతే, బతగ్గలమా? వెళ్ళవయ్యా, ఏదో దగ్గరి బంధువైనట్లు తలుపు తట్టావే! అంటూ సుబ్బయ్య ఈసడించుకొని భళ్లున తలుపువేశాడు.

ముసలివాడు ఇక చేసేదిలేక ఎదురుగా ఉన్న కోటయ్య ఇంటి తలుపు తట్టాడు. చప్పుడు విన్న కోటయ్య తలుపుతీశాడు. సుబ్బయ్యను అడిగినట్లుగానే ముసలివాడు కోటయ్యను అడిగాడు.

సహజంగా జాలిగుండె గల కోటయ్య వెంటనే, అయ్యా! ఎంతదూరం నుండి వస్తున్నావో ఏమో! రా లోపలికి వచ్చి కాళ్ళు కడుక్కో, ఉన్నదే పాలికింత తిందాము అన్నాడు. వారు వండుకున్నదాన్నే ముగ్గురూ వడ్డించుకుని తిన్నారు. అరుగుమీద నడుంవాలుస్తూ ముసలివాడు "దయగల దంపతులు నా ఆకలి తీర్చారు. రేపు సూర్యోదయానికి మీరు ఏ పని చేస్తుంటారో అదే పనిని సూర్యుడస్తమించేవరకు చేద్దురుగానీలే! అన్నాడు. ముసలివాడు అన్నమాటలు కోటయ్య విన్నాడు, కానీ అర్థంకాలేదు. ఏదో గొణుక్కుంటున్నాడులే అనుకున్నాడు.

మరునాడు ఉదయం కోటయ్య, కొండమ్మ ఇద్దరూ సంతకు వెళ్ళాల్సిఉంది.

భార్యా భర్తలిద్దరూ తెల్లవారుజామునే లేచారు. రాత్రి వచ్చిన ముసలివాడికోసం అరుగుమీద చూచారు. కానీ అప్పటికే ముసలివాడు వెళ్ళిపోయాడు. దారి మధ్యలో తినడానికని కొండమ్మ జొన్నరొట్టెలు చేయసాగింది. కోటయ్య సంత ఖర్చులకోసం పెట్టెలోంచి వెండి రూకలు తీసి లెక్కపెట్టసాగాడు. సరిగ్గా అదే సమయానికి సూర్యోదయం కాసాగింది. అంతే! కొండమ్మ జొన్నరొట్టెలు చేస్తూనే ఉంది. కానీ పిండి తరగడం లేదు. కోటయ్య వెండిరూకలను లెక్కపెడుతూనే ఉన్నాడు. కానీ పెట్టెలోని వెండి రూకలు తరగడమేలేదు.

అంతే! ఆరోజు సాయంకాలం వరకూ కోటమ్మ ఒకటే రొట్టెలు చెయ్యడం! కోటయ్య ఒకటే వెండిరూకలు ఎంచడం, ఇదే తంతు. వంట ఇల్లాంతా జొన్నరొట్టెలతో నిండిపోయింది. మధ్యగది అంతా వెండిరూకలతో నిండిపోయింది. ఇదేమిటి? ఇలా అవుతున్నదని కొండమ్మ కోటయ్యలు ఆశ్చర్యపోయారు. సూర్యుడు అస్తమించేవేళకు అంతా సద్దుమణిగింది. పిండి అయిపోయింది. పెట్టెఖాళీ అయింది. హమ్మయ్య అనుకున్నారు దంపతులు.

కోటయ్య ఇంటిలోని హడావిడంతా ఊరంతా తెలిసిపోయింది. ఊర్లోని వారందరినీ పిలిచి జొన్నరొట్టెలు పంచేశారు. వెండిరూకల రాశిని మాత్రం గ్రామానికి ఉపయోగపడే పనికి వాడదామని తీర్మానించుకున్నారు.

కోటయ్య ఇంటిలోని సంబరాన్ని చూచి, సుబ్బయ్య దంపతులు కుతకుతలాడి పోయారు. దీనికి కారణమైన ముసలివాడిని లోలోన తిట్టుకున్నా, పైకి మాత్రం ఆ ముసలోడు మళ్ళీవస్తే బాగుండుననుకున్నారు. ఈసారి వస్తే మాత్రం వదలనే కూడదనుకున్నారు. కొంత కాలనికి నిజంగానే ఆ ముసలివాడు ఆ ఊరికి మరలా వచ్చాడు. సుబ్బయ్య ముసలివాడిని చూస్తూనే, అత్యాశతో ఎదురెళ్ళి "స్వామీ! మా ఇంటికి రండి అని ఆహ్వానించాడు. ఈసారి ఎవరింటికీ రావడంలేదు నాయనా? ఏదో అవసర నిమిత్తం పొరుగూరికి వెళుతున్నానన్నాడు ముసలివాడు. అయినా సుబ్బయ్య ఒప్పుకోలేదు. ఎంతో కాలంగా మీకోసం కాచుకొని ఉంటే, మీరు రానంటే ఎలా? అంటూ బలవంతంగా చేయిపట్టుకొని లాక్కెళ్ళాడు. లక్ష్మమ్మ వెంటనే రాగిసంగటి వడ్డించింది. అదితిన్నాక రేపు సూర్యోదయానికి ఏంచేస్తుంటారో, సాయంత్రం వరకూ అదే చేద్దురుగానీలే! అంటూ వెళ్ళిపోయాడు ముసలివాడు.

ముసలివాడి మాటలు విన్న సుబ్బయ్య, లక్ష్మమ్మల ఆనందానికి అంతులేదు. సరిగ్గా సూర్యోదయానికల్లా బంగారు నాణేలను లెక్కిస్తూ ఉండాలని సుబ్బయ్య, పట్టుచీరలు వెండిపాత్రలు, బంగారు నగలు లెక్కపెడుతూఉండాలని లక్ష్మమ్మ తీర్మానించుకున్నారు. ఇద్దరూ తెల్లవారుజామునే లేచారు హుషారుగా. అనుకున్నట్లుగా

చెయ్యాలని సుబ్బయ్య బంగారు నాణాలు దాచిన పెట్టెదగ్గరికి వెళుతూ మధ్యలో ఉన్న కుండను పొరపాటుగా తన్నేశాడు. కుండపెంకులన్నీ గదినిండా చిందరవందరగా పడినాయి. అయ్యయ్యో! అంటూ, ఆ దంపతులిద్దరూ గదినిండా చెల్లాచెదురుగా పడిన పెంకులను అసహనంగా ఏరుతూ జరిగినదానికి భర్తను శాపాలు పెడుతూ ఉండగా, తిట్టడం ఆపి త్వరగా పెంకులు ఏరవే అని సుబ్బయ్యచీవాట్లు పెడుతూ ఉండగా సూర్యోదయం అయింది.

ఇక అంతే! ఏరుతున్న కొద్దీ కుండ పెంకులు కుప్పగా పడసాగాయి. తిడుతూ ఉన్న నోరు మూత పడకుండా తిడుతూనే ఉంది. జరుగుతున్న వింతను చూడ్డానికి చుట్టు ప్రక్కలవారు చూచి ఇలా అనుకుంటూ వెళ్ళారు. "ఈర్ష్య, అసూయలతో.. ఒకరిలా ఉండాలనీ, ఇతరులకు కలిగిన ప్రయోజనములను తాముకూడా పొందాలని చేసే ప్రయత్నాలన్నీ అనర్థాలకు దారితీస్తాయి" అని.

మోసాన్ని మోసంతోనే జయించాలి.

గురవయ్య వల్ల మోసపోనివారు ఆ చుట్టుప్రక్కల గ్రామాలలో ఎవరూలేరు. ఒక్క వెంకటరత్నం తప్ప. వడ్డీ వ్యాపారం చేసుకునే వెంకటరత్నాన్ని కూడా ఏదో ఒక రోజున బురిడీ కొట్టించాలనేది గురవయ్య చిరకాల వాంఛ. ఆ ఉద్ధేశ్యంతోనే పట్నంలో ఒక గిల్టు నగను కూడా కొని దగ్గర ఉంచుకున్నాడు.

ఒకరోజు పొరుగూరికిపోతూ గురవయ్యకు ఎదురుపడ్డాడు వెంకటరత్నం. "వడ్డీవ్యాపారికి నమస్కారం" అని వెటకారంగానూ, కాస్తంత పొగరుబోతు తనంతోనూ అన్నాడు గురవయ్య. గురవయ్యనుచూడ్డంతోటే ముఖం చిట్లించుకుని, అసహ్యంతో ప్రక్కకు తొలగి పోయాడు వెంకటరత్నం. ఎన్నాళ్లనుంచో ఎదురుచూస్తున్న గురవయ్యకు వెంకటరత్నం పొరుగూరికి పోవడం ఒక అవకాశంగా తోచింది. వెంటనే తన ఇంటికెళ్ళి గిల్టు నగను తీసుకుని వెంకటరత్నం ఇంటికి వెళ్ళి గాభరాపడుతూ, వెంకటరత్నంగారూ అని పిలిచాడు. ఇంట్లోంచి ఆయన భార్య సుశీలమ్మ వచ్చి గురవయ్యను చూచి, ఆయన ఇంట్లో లేడు, పొరుగూరు వెళ్లాడు అని చెప్పింది. ఇప్పుడెలా అమ్మగారూ? ఉన్నట్లుండి హఠాత్తుగా నాభార్య క్రింద పడిపోయింది. ఉలుకూలేదు, పలుకూలేదు. అందరూ పట్నం తీసుకెళితేగానీ బతకదు అంటున్నారు. కానీ, నాదగ్గర అంత పైకం లేదు. నా దగ్గర ఉన్న బంగారు నగను. మీ దగ్గర తాకట్టుగా ఉంచుకుని, ఒక పదిహేను వందలు ఇచ్చారంటే, వారం రోజులలో మీరడిగినంత వడ్డీ ఇచ్చుకుని నగను తీసుకెళతాను.... అని బ్రతిమలాడాడు.

గురవయ్య సంగతి తెలియని ఆ ఇల్లాలు గురవయ్యకు వచ్చిన కష్టం వినగానే జాలిపడి బంగారు నగను తాకట్టుగా పెడుతున్నాడు కాబట్టి ధైర్యంగా అడిగిన పైకం ఇవ్వవచ్చు అనుకుని, పది రూపాయల వడ్డీతో అయితే ఇవ్వగలను, అది కూడా

ఆయనకు తెలియకుండా ఇస్తున్నాను. మాట తప్పకుండా డబ్బుకట్టి మాసంలోగా మీ నగను తీసుకెళ్ళండి అని చెప్పింది. ఇదే అదనుగా గురవయ్య తన దగ్గరున్న గిల్టు నగను ఆమె చేతిలో పెట్టి పదహైదు వందల రూపాయలు పట్టుకెళ్ళాడు.

పొరుగూరికి వెళ్ళిన వెంకటరత్నం ఇంటికి వచ్చీరాగానే ఎంతో సంతోషంగా, దర్పంగా అటు కష్టకాలంలో ఆదుకున్నందుకు తృప్తి, ఒక మంచిపేరు, అధిక వడ్డీ "ఒక దెబ్బకు రెండు పిట్టలన్నట్లుగా" సంబరపడిపోతూ భర్తతో జరిగినదంతా చెప్పింది. గురవయ్య ఇచ్చిన నగను బాగా పరిశీలించి తన భార్యను మోసగించాడని తెలుసు కున్నాడు. కానీ ఏమీచేసేదానికి వీలులేక మౌనంగా ఉండిపోయాడు బాధను దిగ్రమింగుకుంటూ. గురవయ్యకు మాత్రం చాలా సంతోషంగా ఉంది. వెంకటరత్నం ఎపుడు కనిపించినా "వడ్డీ వ్యాపారస్తులకు నమస్కారం" అని ఎగతాళిగా అనడం మాత్రం మానుకోలేదు గురవయ్య.

ఈ సంఘటన జరిగిన కొన్ని రోజులకు గురవయ్య చెరువు గట్టుమీద నడుచుకొని వస్తుండుగా, ఒక క్రొత్త వ్యక్తి ఎదురుపడి "అయ్యా నేను పట్నం నుంచి వస్తున్నాను. నాకు ఒక సహాయం చెయ్యగలిగారంటే వందరూపాయలిచ్చుకుంటాను" అన్నాడు.

గురవయ్య వందరూపాయలకు ఆశపడి, ఏ సమాచారం కావాలి? అన్నాడు. "నేను పట్నంలో బంగారు నగల వ్యాపారం చేస్తుంటాను. పది, పదిహేనురోజుల క్రిందట మీ గ్రామస్తుడు ఒకరు మా అంగడిలో గిల్టు నగ నొకదానిని కొనుగోలు చేశాడు. ఆ సమయంలో నేనులేను. నా కుమారుడు దుకాణంలో కూర్చుని ఉండినాడు. నిజానికి అది అసలు సిసలైన బంగారునగే. ఆదాయం పన్ను ఎగగొట్టడానికి కొన్ని బంగారు నగలకు గిల్టుపూత పూసి ఉంచుతాము. నా కుమారుడికి తెలియక దానిని గిల్టునగ వెలకే అమ్మేశాడు. దానిని ఎవరు కొన్నారో తెలుసుకుని చెప్పగలిగారంటే, వాని వద్దకు వెళ్ళి, కాళ్లావేళ్ళాపడి వాపసు తెచ్చుకుంటాను. మాట ప్రకారం మీకు వంద రూపాయలిచ్చుకుంటాను" అన్నాడు.

నగ గుర్తులు వివరంగా అడిగి తెలుసుకున్న మీదట, గురవయ్యకు అర్థమైపోయింది. తాను కొన్నది గిల్టునగ మాత్రంకాదు, అని. లోలోన తన పంటలు పండినందుకు సంబరపడి పోతూ పైకి ఏమీ తెలియనట్టు గంభీరంగా "ఒక్క ఐదు రోజులు ఓపిక పట్టారంటే ఆచూకీ కనుక్కొని మీకు చెబుతాను, మీరు నిశ్చింతగా వెళ్ళండి, అని ధైర్యం చెప్పి పంపించేశాడు.

తెచ్చిన సొమ్మును గురవయ్య ఎప్పుడో జల్సాచేసేశాడు. కానీ ఎలాగోలాగా తంటాలు పడి, పదిహేను వందలూ దానికి వడ్డీ వందా యాభైరూపాయలు వెరశి పదహారువందలా యాభై వెంకటరత్నం భార్యకు ఇచ్చి, తన నగను వాపసు తెచ్చుకున్నాడు.

వెంటనే ఒక నగల దుకాణానికివెళ్లి దీనిని ఎంతకు కొంటావో చెప్పు? అని ఆశగా అడిగాడు నగను ఇస్తూ. దుకాణాదారుడు దానికి ఒరుపు పెట్టి చూచి ఇది అసలు బంగారమేకాదు అన్నాడు.

గురవయ్య ఎంతో నిరాశతో కంసలి దుకాణం నుంచి బైటికి వస్తుండగా వెంకటరత్నం ఇంకొకరితో మాట్లాడుతూ ఉండడం కనిపించింది. ఆవ్యక్తి ఎవరోకాదు చెరువు గట్టుమీద వస్తుండగా నగల దుకాణదారుడనని చెప్పినవాడే!

ఔరా! ఎంత మోసం?! అని చూస్తూ ఉండిపోయాడు గురవయ్య. "నమస్కారమండీ గురవయ్యగారూ! నీ నగ నకిలీదైనా, నా తెలివి మాత్రం బంగారంలే" అంటూ వెళ్ళాడు వెంకటరత్నం. అవమానంతో తలదించుకున్నాడు గురవయ్య.

★ కొన్ని సందర్భాలలో ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్లుగా, మోసాన్ని మోసంతోనే జయించాలి.

ఎవరు గొప్ప

బహుదానదీ తీరంలోని ఒక మర్రిచెట్టు మీద, రకరకాల పక్షులు గుంపులు గుంపులుగా నివాసముండేవి. అవి ఆ చుట్టు ప్రక్కల తిరిగి ఆహారం తిని, సాయంకాలానికి గూళ్లకు చేరేవి. వాటిలో చిలుక, గ్రద్ద,కోకిల, నెమలి, పావురం, కాకి ఎంతో కాలంగా ఏ అరమరికలు లేకుండా సఖ్యతగా నివసిస్తూ ఉండేవి. ప్రతిరోజూ సాయంత్రం, చెట్టుమీద చేరిన పక్షులన్నీ చెట్లకొమ్మలపై కూర్చొని తాము చూచిన వింతలు-విశేషాలు చెప్పుకునేవి.

ఒకరోజు మాటల సందర్భంలో వాటి మధ్య ఒక వివాదం తలెత్తింది. "తమలో ఎవరు గొప్ప?" అనేది చర్చకొచ్చింది. దేనికదే తాను గొప్ప అని, డంబాలు పలికి చివరికి "ఉరుము వురిమి మంగళం మీద పడ్డట్టు" అన్నీ కలసి చిరకాల మిత్రుడైన కాకిని అతి అల్పమైనదిగానూ, అంటరానిదిగానూ నిర్ణయించి తమ జట్టునుండి తరిమికొట్టాయి. అదేమని కాకి అడిగితే "పొరపాటున ఎవరింటిలోనైనా దూరితే, మనుషులు ఆ యింటిని ఆరు మాసాల వరకు మూసేసి, శుద్ధి చేసిన తర్వాతనే ఆయింటిలోకి మరలా ప్రవేశిస్తారు. అలాంటిది ఇంతకాలంగా నిన్ను మా గుంపులో ఉంచుకోవడమే గొప్ప. ఇంతవరకూ నీరంగు, నీస్వరం, నీఉనికి ఇంత అపవిత్రమని మాకు తెలియక నిన్ను మా దగ్గర ఉండనిచ్చాం. ఇపుడు తెలిసింది. నీవు ఇక ఎంతమాత్రమూ మా దగ్గర ఉండవద్దు, వెళ్ళిపో, అని తరిమివేశాయి.

కానీ ఎంతోకాలంగా సఖ్యతగా మెలిగిన కారణంగా కాకి దూరంగా వెళ్ళనూలేక, వాటి జట్టులో ఉండనూలేక, అదే చెట్టుపై కాస్తంత దూరంలో ఒదిగి ఒదిగి ఉంటూ ఉంది. కానీ ప్రతిదినం నేనుగొప్ప, నేనుగొప్ప అని మాత్రం తగవులాడుకోవడం మానలేదు మిగతా పక్షులు.

చివరికి ఆ పక్షులన్నీ కలసి తమ తగవులతో తామే విసిగిపోయి, అదే ప్రాంతంలో కాస్తంత దూరంలో ఎంతో కాలంగా తపస్సు చేసుకుంటూ ఉన్న ఋషి దగ్గరకు వెళ్ళి, తమలో ఎవరు గొప్పో తేల్చుకోవాలని, నిశ్చయించుకున్నాయి. అనుకున్నదే తడవుగా ఒకరోజు సాయంకాలం పక్షులన్నీ కలసి ఋషి ఎదుట వాలాయి.

ఆ ఋషి పక్షుల రాకను గుర్తించి, కనులు తెరిచి చూచి ఆకాశంలో విహరిస్తూ, చెట్టుమీద విశ్రాంతి తీసుకోవలసిన పక్షులన్నీ కలసి కట్టుగా నా ఎదుటికి వచ్చివాలాయి?! ఏమిటి విశేషం?! అని అడిగాడు ఆశ్చర్యంగా.

పక్షులన్నీ ముక్తకంఠంతో "మేము ప్రతిరోజు మాలో ఎవరు గొప్ప"? అనే విషయం మీద తగవులాడుకుంటూ, ఎటూతేలక, సమస్యతో సతమతమవుతూ, మనశ్శాంతి లేకుండా ఉన్నాము. వికారస్వరూపం, కఠోరమైన కంఠస్వరం ఉన్న కాకిని కూడా తరిమివేశాం. అయినా మా సమస్యకు పరిష్కారం లభించలేదు. మాగోడు కాస్త విని, పరిష్కారం చూపించి పుణ్యం కట్టుకొండి". అని ప్రార్థించాయి.

"నేను గొప్ప" అనేది మనుష్యులకున్న అహంకారజబ్బు. అది మీకుకూడా అంటుకున్నట్లు ఉన్నదే?! అంటూ... ఋషి, చూడండి నాయనలారా! "సృష్టిలో ప్రతి ప్రాణి దేనికదే గొప్ప". కాబట్టి మీ గొప్పగుణాలు మీవద్దనే ఉంచుకొని, అనవసరంగా తగవులాడుకోకుండా సఖ్యతగా, ప్రశాంతంగా జీవించండి. వెళ్ళండి". అని ఋషి పుంగవుడు వాత్సల్యంతో చెప్పాడు.

స్వామీ! అదేం కుదరదు. మీరు మహానుభావులు. ప్రతిరోజు తగవులాడు కోవడం మాకిష్టంలేదు. ఈరోజు ఎలాగైనా మాలో "ఎవరు గొప్పో" తేల్చి చెప్పాల్సిందే!. మా సమస్యను పరిష్కరించాల్సిందే. అని పక్షులన్నీ పట్టుబట్టాయి.

అయితే నాయనలారా! నేను మీ వాదనలను విన్న తర్వాత తీసుకున్న నిర్ణయం, చెప్పిన తీర్పును మీరు ఆమోదించి, అమలుపరుస్తామనీ, తదుపరి ఎన్నడూ తగవులాడుకోమనీ, సఖ్యతగాఉంటామనీ వాగ్దానం చేసినట్లయితే పరిష్కారం చెబుతానన్నాడు ఋషి పుంగవుడు.

సరే స్వామీ! అలాగే, మీ తీర్పును మేము శిరసావహిస్తామని, భవిష్యత్తులో ఏనాడూ తగవులాడుకోకుండా, సఖ్యతగా జీవిస్తామనీ వాగ్దానం చేస్తున్నాం. అని పక్షులన్నీ తమ అంగీకారాన్ని తెలియచేశాయి.

సరే! మీరందరూ ఎవరికివారు గొప్పవారుగా చెప్పుకుంటున్నారు కదా! అవేమిటో ఒక్కొక్కరుగా చెప్పిండి. అందరూ శ్రద్ధగా వినండి. ఎదుటివారి గొప్పగుణాలను సహృదయంతో స్వీకరించండి. మీలోని అవగుణాలను పరిశీలించుకొని తొలగించుకునే ప్రయత్నం చెయ్యండి, నిశ్శబ్దంగా వినండి అన్నాడు ఋషిపుంగవుడు.

మొదట చిలుక తన గొప్పదనాన్ని ఇలా చెప్పింది. స్వామీ! నా ఒళ్ళంతా పచ్చన. పంట పొలాలన్నీ పచ్చన. నా రంగు సస్యశ్యామలానికి గుర్తు. నాముక్కు ఎర్రగా, అందంగా ఉంటుంది. అందానికి నేను మారుపేరు కాబట్టి అందమైన యువతులను చిలుకలా ఉంది అంటారు. నా పలుకులు చాలా ముచ్చట గొలుపుతాయి. అందుకే చిన్నారి పలుకులను చిలుక పలుకులు అంటుంటారు. కాబట్టి నేను గొప్పదాన్నే.

ఆహా! చిలుక నిజంగా అందమైనదే, చిలకపలుకులూ ముచ్చట గొలుపుతాయి. చాలా మంచిది నాయనా! పక్షులన్నింటి వైపు చూస్తూ మీరంతా విన్నారా? చిలుకలోని గొప్పగుణాలను అన్నాడు ఋషి పుంగవుడు. విన్నాం స్వామీ! అన్నాయి మిగతా పక్షులు.

స్వామీ! నేను గ్రద్దను. ఆకాశంలో ఎంతో ఎత్తునుండి భూమిపైనున్న ఏ చిన్న ప్రాణినైనా ఇట్టే చూడగలను. నా దృష్టి సునిశితమైనది. నేను చాలా వేగంగా ప్రయాణించగలను. కాబట్టి నేను గొప్పదాన్ని. కాదా? మంచిది గ్రద్దా. నీవూ గొప్పదానివే సుమా. అన్నాడు ఋషి.

స్వామీ! నేను పావురమును. శాంతికి చిహ్నాన్ని! అందమైన పక్షిని. రాళ్ళను కూడా తిని జీర్ణించుకోగలను. వార్తలను చక్కగా చేరవేయగలను. కాబట్టి నేనూ గొప్పదాన్నే.

అంతా విన్నారా? నిజంగా పావురం శాంతికి చిహ్నం. పావురంకూడా గొప్పదే అన్నాడు ఋషి.

స్వామీ! నేను కోయిలను! నేను చాలా శ్రావ్యంగా పాడగలను. నేను పాడితే అందరూ ఆనందిస్తారు. అందుకే బాగా పాడగల వారి గొంతును "కోయిలకంఠం" తో పోలుస్తారు. వసంత ఋతువులో మాత్రమే కనిపించే అరుదైన పక్షిని. నా గ్రుడ్లను ఎంతో తెలివిగా కాకి గూటిలో పెట్టి, పొదిగే శ్రమలేకుండా తప్పించుకుంటూ జీవిస్తాను. చాలా తెలివైనదానను. నేనూ గొప్పదాన్నే.

చూశారా! కోయిల నిజంగా బాగా పాడగలదు. తెలివిగా కాకిని మోసగించ గలదు. నిజంగా కోయిల గొప్పగుణవంతురాలే! అన్నాడు ఋషి.

స్వామీ! నేను నెమలిని. నేను చాలా అందమైన పక్షినికూడా. నేను చాలా బాగా నాట్యం చేస్తాను. కాబట్టి బాగా నాట్యం చేసే స్త్రీలు "నాట్యమయూరి" అని నా పేరునే బిరుదుగా తగిలించుకుని గర్వంగా చెప్పుకుంటారు. నేను సుబ్రహ్మణ్యం స్వామికి వాహనాన్నికూడా కాబట్టి నేను గొప్పదాన్ని.

ఆహా! "నెమలీ! నీలోనూ చాలా గొప్పగుణాలే ఉన్నాయి" అన్నాడు ఋషి.

ఒదిగి, ఒదిగి దూరంగా ఉన్న కాకిని చూచి, ఓ కాకమ్మా ఎందుకలా భయపడతావు, ధైర్యంగా ఇటురా. నేనుండగా నీవు భయపడనక్కర్లేదు. ధైర్యంగా

నీవూ చెప్పదలచుకున్నదేదో చెప్పు. అందరూ శ్రద్ధగా వినండర్రా. మీరు తరిమివేసిన కాకమ్మ ఏం చెబుతుందో!

అలాగేస్వామీ! భగవంతుడు ప్రసాదించిన నా కర్తవ్యాన్ని నిర్వహించుటకు త్వరగా నిద్రలేచే మొట్టమొదటి ప్రాణిని నేనే. ఆ విధంగా కాలాన్నీ, కర్తవ్యాన్ని తెలియజేస్తాను. దొరికిన ఆహారాన్ని నేనొక్కదానినే తినకుండా తోటి కాకులను పిలిచి, పంచుకొని తింటాను. అంతేకాకుండా మాలో ఏ ఒక్కదానికైనా కష్టం వస్తే, మేమందరము ఉమ్మడిగా దాన్ని రక్షించే ప్రయత్నం చేస్తాం. ఆ విధంగా ఐకమత్యానికి చిహ్నాన్ని నేను. తినగా మిగిలిన ఆహారాన్ని అలాగే విడిచి పెట్టకుండా దాచిపెట్టి, మరుసటి రోజు ఆరగిస్తాను. ఆ విధంగా పొదుపును పాటిస్తాను. చనిపోయిన జంతు అవశేషాలను, క్రుళ్ళిపోయిన వ్యర్థపదార్థాలను తిని పరిశుభ్రతను చేకూరుస్తాను. వాతావరణ కాలుష్యాన్ని నివారించుటలో నాకు నేనే సాటి. సోమరి అయిన కోయిల గ్రుడ్డును కూడా పొదిగి పిల్లను పోషిస్తాను. ఇంటి పై కప్పు మీద కూర్చొని కా-కా అని అరచి ఇంటికి రాబోయే అతిథుల రాకను తెలియజేస్తాను. గతించినవారి పిండాలను తినడానికి మనుషులు నన్ను కా-కా అని అరచి ఆహ్వానిస్తారు. నేను పిండాలను తింటేనే గాని గతించినవారి ఆత్మలకు శాంతి లభించదని విశ్వసిస్తారు. నేను శనీశ్వరుడి వాహనమును, ఇన్ని సుగుణాలున్న నేను నల్లగా ఉంటానని, నా స్వరం కఠోరంగా ఉంటుందని, నన్ను వెలివేయడం ధర్మమేనా స్వామీ! మీరే చెప్పండి అని వినయంగా చెప్పింది కాకి. అన్ని పక్షులూ చెప్పడం అయిపోయాక, ఋషి పుంగవుడు చెప్పే తీర్పును వినాలని నిశ్శబ్దంగా, శ్రద్ధగా, ఆత్రుతతో ఎదురు చూస్తున్నాయి పక్షులన్నీ.

నాయనలారా! అందరూ చెప్పిన గొప్పగుణాలను మీరు శ్రద్ధగా విన్నారుకదా? ఎవరిలో గొప్పగుణాలు అధికంగా ఉంటాయో, వారే గొప్పవారని, అనుభవజ్ఞులు చెబుతారు. రంగును బట్టిగానీ, స్వరమును బట్టిగానీ, రూపును బట్టిగానీ ఎవరూ గొప్పవారు కాలేరు. అలాగే అధములుకూడా కారు. అందరి గుణాలనూ ఆలకించారు కదా? మీరే చెప్పండి ఎవరిలో మంచి గుణాలు అధికంగా ఉన్నాయో? ఐకమత్యానికీ, పరోపకారానికీ, పొదుపు పాటించడంలోనూ, కాలుష్య నివారణలోనూ, బాధ్యతను నిర్వర్తించడంలోనూ, కాలాన్ని తెలియజేయడం లాంటి ఎన్నో మంచి గుణాలున్న కాకమ్మే ఉత్తమ పక్షిగా నిర్ణయిస్తున్నాను. అన్నాడు ఋషి.

అలాగే స్వామీ! " మీ తీర్పును మేమంతా ఆమోదిస్తున్నాం. ఈనాటినుండి కాకిని గొప్పపక్షిగా పరిగణిస్తాం. మేమంతా కలహించుకోకుండా ఐకమత్యంగా జీవిస్తాం" అని అన్ని పక్షులూ అన్నాయి.

స్వామీ! మరి మనుషులెందుకు తమ ఇంటిలోకి కాకి వస్తే అపవిత్రంగా భావిస్తారు? "కాకిలా వంద సంవత్సరాలు బ్రతికేకంటే? హంసలా ఒక్క రోజు బ్రతికినా చాలు అంటారు". ఎందుకు? అని ప్రశ్నించాయి పక్షులు.

పక్షులారా! మానవులలో చాలామందికి ఎదుటివారి గొప్పగుణాలను మెచ్చుకునే ఉదార స్వభావం ఉండదు.

సృష్టిలోని ప్రతి ప్రాణీ దేనికదే గొప్పది. ఇంటిలోకి కుక్క, ఆవు, ఎద్దు, మేక, కోడి, పావురాయి మొదలైన ప్రాణులు వచ్చినా ఏ విధమైన దోషం లేదో, అపవిత్రం కాదో, అలాగే కాకి ఇంట్లోకి వస్తే అపవిత్రమూకాదు. ఎలాంటి దోషమూలేదు. హంసలా బ్రతకాలి అంటారు. కానీ హంసను ఎవరూ చూడలేదు. పాలను నీళ్ళను వేరు చేసినట్లుగానే మంచినీ చెడును వేరుచేస్తూ విచక్షణతో బ్రతకాలని అలా అంటారు. కానీ కాకులు వివేకంతోనే, పది మందికి ఉపయోగపడుతూనే, ప్రకృతిని కల్మష రహితం చేస్తూనే జీవిస్తున్నాయి. కాబట్టి కాకిలా వంద సంవత్సరాలు జీవిస్తేనే ఆ జన్మకు సార్థకం. మనుషులు చేసే తప్పు మీరు చేయకండి. కాకితో స్నేహంగా ఉండండి. మీ జతలోకి రానివ్వండి, కలసి మెలసి జీవించండి అని ఆశీర్వదించాడు. పక్షులన్నీ ఋషీశ్వరునికి ధన్యవాదాలు సమర్పించుకొని తృప్తిగా వెళ్ళాయి.

* స్వార్థంతో జీవించే అందమైన శరీరం కంటే, అంతరంగ శుద్ధితో, పరోపకార బుద్ధితో, ఆదర్శంగా జీవించే అందవిహీనమైన ప్రాణి జీవితమే గొప్పది.
* నీతులు చెప్పే పెదవులకన్నా చేయూతనిచ్చే చేతులే మిన్న.

కోపం

తన మాటే నెగ్గాలనీ, తనను గౌరవించాలని ఆశించినపుడు, తనను కనీసం గుర్తించలేదనుకున్నపుడు, తన స్వభావానికి వ్యతిరేకంగా నడచుకున్నపుడు, తన ఆశ నిరాశ అయినపుడు, వంచనకు గురైనపుడు, అహంకారం వదలుకోలేనపుడు కోపానికి లోను కావడం జరుగుతూ ఉంటుంది.

కోప స్వభావం పుట్టుకతో వచ్చేదే అయినా, మద్యం సేవించడం, మత్స్య, మాంసాదులు, మసాలాలు, ధూమపానం, వాతావరణం మనిషిని, శారీరకంగా, మానసికంగా బలహీనపరచి ఉద్రేకానికి లోనుచేస్తాయి.

కోపం కట్టలు తెంచుకుంటే క్రోధంగానూ, ఆవేశంగానూ మారుతుంది. కోపం పలచబడితే నిరసన, అలకగా పరిణమిస్తుంది.

ముక్కు మీద కోపం, చేతులలో కోపం, చూపులలో కోపం, మాటలలో కోపం, పెదవులపై చిరుకోపం, పళ్ళను పటపటా కొరికి చూపించే క్రోధం, అన్నం మీద అలక, మంచం మీద అలక ఇలా కోపంలోని పలురకాలు.

అగ్గిపుల్ల దీపాన్నీ, పొయ్యినీ వెలిగించుకునేటందుకు ఉపయోగపడుతుంది. కొంప తగలబెట్టడానికీ ఉపయోగపడుతుంది. కత్తికూడా పండు కోసు ని తినేటందుకూ,

గుండు గీసుకునేటందుకూ, గుండెలో పొడిచేందుకూ, పీక కోసేటందుకూ పనికొస్తోంది.

అలాగే కోపంకూడా అన్నింటివలెనే మంచినీ, చెడును కూడా కలిగిస్తుంది. కోపంలో విచక్షణ కోల్పోయి ప్రవర్తిస్తే వాతావరణాన్ని కలుషితం చేసే ఒక మురికి స్వభావంగానూ, ప్రాణాంతకంగానూ, నైతిక విలువల పతనానికి కారణంగానూ, ఒక మనోవికారంగానూ, ఒక అసహ్య స్వభావంగానూ, అభివృద్ధి నిరోధకంగానూ అనర్థహేతువుగానూ పరిగణింప బడుతుంది.

విచక్షణ కలిగి ఉపయోగించుకుంటే కోపం ఒక ఆయుధంగానూ, ఒక శక్తిగానూ, ఒక పరిష్కారంగానూ జీవితాన్ని మలుపు తిప్పగల దిక్సూచిగానూ, ఒక అందంగానూ, ఉన్నత శిఖరాల నధిరోహించుటకు ఒక సోపానంలాగానూ, ఉపయోగపడుతుంది. కోపాన్ని వివేకంతో అణచి వేసి, ఒక అస్త్రంలా భావించి, ఆలోచించి సమయానుకూలంగా సంధించి వదిలితే, లక్ష్యాన్ని ఇట్టే సాధించగలం, విజయాలను సొంతం చేసుకోగలం. జీవితంలో ఎదురయ్యే ప్రగతి నిరోధక శక్తులను అధిగమించాలంటే కోపాన్ని ఒక శక్తిగా, సంకల్పశక్తిగా మార్చుకుని శరీరాన్ని, బుద్ధినీ, మనసునూ ఒక కేంద్రానికి తెచ్చి ప్రయోగిస్తే అది "కోప సంహారశక్తి" కిల్లింగ్ ఇన్‌స్టింక్ట్ గా మారి జీవితమనే ఆటలో-పోటీదారులను చిత్తుగా ఓడిస్తుంది.

ఇలాంటి "కిల్లింగ్ ఇన్‌స్టింక్ట్" "కోప సంహారశక్తి" లేకనే మన దేశ క్రీడాకారులు జనాభాకు తగిన సంఖ్యలో గుర్తింపు పొందలేకున్నారని మేధావుల ఆరోపణ.

త్వరితగతిన స్పందించేగుణం ఉన్నవారినే "ముక్కోపిష్టి" "దుడుకు మనిషి" "ఆత్రగాడు" అనే ముద్రవేసి, కొంతమంది శాంత స్వభావులు, ఉదారవాదులు, టక్కరులు, వంచకులు ప్రచారంచేస్తూ ఉంటారు.

చెప్పాలంటే ఒకరకంగా ముక్కోపులు నమ్మదగిన వ్యక్తులుగా ఉంటారు. ఇతరులపై కోప్పడుతూ ఉంటారు. కాబట్టి, సాధ్యమైనంత వరకు, కోపం తెప్పించే పనులు చెయ్యకుండా జాగ్రత్త పడతూ ఉంటారు. ఇదీ ఒక సుగుణమే కదా?!

"ముక్కోపికి ముఖస్తుతేమందు" అని తెలిసిన వారు కొందరు ఉపాయంగా, శాంతి వచనాలతో వీరిని బుట్టలో వేసుకుని, స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటూ ఉంటారు. ముక్కోపులు చిన్నతప్పులకు కూడా విచక్షణకోల్పోయి, పెద్ద శిక్షలేవేసి బాధపెట్టి, వారుకూడా బాధలకు గురై మానసిక శాంతిని కోల్పోతూ ఉంటారు.

త్వరగా స్పందించే వారి మనసు చాలా పెలుసు. కాబట్టి తాటాకులా త్వరగా రగులుతుంది. చప్పున చల్లారిపోతుంది. వీరు ఆనందాన్నీ పట్టలేరు. బాధనూ భరించలేరు. అందుకే వీరిని "ఓపన్‌హార్ట్" మనుషులంటారు. మనసుకు ఏ మాత్రం నచ్చని పరిస్థితులు తారసపడినా, నేనున్నానంటూ బయటికివచ్చి బుసకొడుతుంది కోపం.

అటువంటి వారిని ఉద్దేశించే అతనికి బి.పి. పెరిగింది అనడం పరిపాటి అయింది. కోపం ఆహ్లాదంగా ఉన్న వాతావరణాన్ని స్వల్పకారణాలతో, అపోహలతో, తొందరపాటు తనంతో చెడగొట్టి కలుషితం చేస్తుంది.

కోపిష్టులు తన నైజాన్ని తప్పక మార్చుకోవలసిందే. లేకుంటే స్నేహితులంటూ ఎవరూ మిగలరు. చివరకు ఏకాకులై దుర్భరజీవితాన్ని అనుభవించాల్సి ఉంటుంది.

'ముక్కుమీద కోపం నీ ముఖానికే అందం' అని మగువలను మగవారు కొన్ని సందర్భాలలో పొగుడుతూ ఉంటారు. "ముక్కుమీద ఈగ వాలితే ఈతపులిని పట్టు కొస్తారు" కొందరు.

కోపం వయసుతో నిమిత్తం లేకుండా ఎవరిలోనైనా కనిపించవచ్చు. యవ్వనంలో ఉన్నవారికి ఆవేశం ఎక్కువ. పిలిస్తే పలుకుతూ ఉంటుంది. ముసలివారికి కూడా శరీరం సహకరించకపోయినా అసహనం ఎక్కువ. కోపంతో బుసకొడుతారు. వారిని చూచే "అరమనిషి బలం ఆరుమంది కోపం" "పేదవాడి కోపం పెదవికి చేటు" అని కూడా అంటుంటారు.

కొంతమంది వస్తువులను పగలగొట్టి, పుస్తకాలను చించితే, కొంతమంది చెట్లను పీకి, నరికి, పూలను నలిపి, కాయలను తుంచి, తమదైన శైలిలో కోపాన్ని చూపిస్తుంటారు. కొన్ని అరాచక శక్తులు మరీ అడ్వాన్సయిపోయి బస్సులను, భవనాలను, దుకాణాలను తగులబెట్టి ధ్వంస రచన చేస్తుంటారు.

ఇళ్ళలో కొంతమంది భార్యాభర్తలు, పిల్లలు, పోటాపోటీగా చెంబులు, తప్పేలాలు, తట్టలు ఏది దొరికితే దానిని ధఢాల్,ధభేల్ మని విసరికొట్టి, వండిన వంటకాలను చిందర వందరగా పారవేసి, నిరసన, కోపం, పగ, ప్రతీకారం తీర్చుకుంటూ ఉంటారు. తాత్కాలికమైన ఆవేశాన్ని నిగ్రహించుకోలేక, చేసిన నిర్వాకానికి సంపాదించినదీ, సాధించిన ప్రగతి అంతా నాశనమై, కొన్ని సంవత్సరాలు వెనుకబడిపోతారు. కోపం కాస్త తగ్గాక చేసిన ఘనకార్యానికి తలదించుకోవలసి వస్తుంది. "పశ్చాత్తాపం నిదానంగా వస్తుంది" " చేతులుకాలిన తర్వాత ఆకులు పట్టుకుని ఏంలాభం"? "కోపం అజ్ఞానంతో మొదలై పశ్చాత్తాపంతో ముగుస్తుంది."

సాధారణంగా విద్యార్థులు చదవు పూర్తయ్యేదాకా హాస్టళ్లలో, ప్రైవేటు గదులలో, క్లాసు రూములలో, కొన్ని సంవత్సరాలు కలసిమెలసి ఉండవలసి వస్తుంది. చదువై పోయాక ఎవరి స్వగ్రామాలకు వారు వెళతారు. కానీ వారేదో శాశ్వతంగా ఒకే చోట ఉండబోతున్నట్లు పగ, ప్రతీకారాలకు దగ్గరై, తల్లిదండ్రుల ఆశలపై నిప్పులుపోసి జీవితాలనే నాశనం చేసుకుంటున్నారు.

విద్యార్థులెలా నడచుకోవాలి?

అందరూ చదువైపోయాక వారివారి స్వగ్రామాలకువెళతారు. ఎక్కడెక్కడో స్థిరపడి పోతారు. జీవితంలో ఎవరికి ఎప్పుడు ఎలాంటి పనులు, అవసరాలు పడతాయో చెప్పలేము. ఏ ఊరిలో మనకు బ్రతుకుదెరువు రాసిపెట్టిఉందో కూడా చెప్పలేము. కాబట్టి ఫలానా ఊరిలో మా ఫ్రెండున్నాడు. నాపనులు పూర్తి చేసుకోవచ్చు. నాకేం పరవాలేదు. అని ధీమాగా ఉండే పరిస్థితిని కలుగజేసుకోవాలి. కానీ, తగాదాలతో వైషమ్యాలతో వైరం తెచ్చుకుని విడిపోతే మిత్ర లాభం ఎలా పొందగలుగుతారు? "పోరునష్టం పొందులాభం". "పరిచయం పిడికెడన్నం" అన్నారు. పరిచయాలతో సహకారాలను, సహాయాలను, సేవలను విరివిగా పొందవచ్చునని ప్రతి ఒక్కరూ గుర్తించుకొని నడచుకోవాలి.

అభివృద్ధి కోరుకునేవారు ముందుగా తమ క్రోధావేశమును తొలగించుకోవాలి. ఆ తరువాత పురుష ప్రయత్నం ప్రారంభించాలి. సూర్యుడు కూడా ముందుగా చీకటిని పారద్రోలిన తర్వాతనే ప్రకాశిస్తున్నాడు.

చచ్చేటంతవరకూ ఒకే వీధిలో, ఒకే ఇంటిల్లో, ఒకే సంస్థలో, ఒకే ఊరిలో ఉంటున్నట్లయితే అన్యాయాన్నీ, ఆకతాయితనాన్నీ ఎదుర్కోవాల్సిందే. ప్రశాంత వాతావరణం నెలకొనాలంటే సామ, దాన, భేద, దండోపాయాలను ప్రయోగించాల్సిందే. వెనకడుగు వేయరాదు. నీవు చూపించే శాంతగుణం, ఓర్పు, సహనం, మంచితనం ఎదుటివాడిలో మంచి మార్పును తేవాలి. అలాకాకుండా మంచితనాన్ని అలుసుగానూ, చేతగానితనంగానూ, భావించి తెంపరితనానికీ, దుర్మార్గానికీ, దురాక్రమణకూ, దురాగతాలకూ పాల్పడితే శాంతం, సహనం ఏ మాత్రం చూపించనవసరం లేదు. "దుర్మార్గాలను శిక్షించడంలో ఎలాంటి నియమాలనూ పాటించనవసరం లేదని" నీతి శాస్త్రం చెబుతుంది.

* భయపడేకొలది తరిమేది ఎక్కువ. భయపడవద్దు.
* న్యాయం, ధర్మం కొరకు పోరాడే సందర్భంలో ప్రాణాలు పోయినా పరవాలేదు. చింతించవలదు. వెనుకడుగు వేయవద్దు.
* పిరికివారు రోజూ చస్తారు. సాహసికులు ఒకసారే మరణిస్తారు.
* భయమే దయ్యం, పిరికితనమే మరణం, ధైర్యమే బ్రతుకు, సాహసమే జీవితం.
* ధైర్యే, సాహసే లక్ష్మీ.

నిజానికి అన్ని సినిమాలలో కథానాయకులనబడే హీరోల వీరోచిత, సాహస కార్యాలకు మూలం కోపమే. తప్పుడు వెధవలకు, నేరస్థులకు, వంచకులకు, ద్రోహులకు హీరో శిక్షలు వేస్తాడు. ఒక్కోసారి చిన్న తప్పులకుకూడా పెద్ద శిక్షలే మోతాదుకు మించివేస్తాడు. కారణం తప్పులు చేసినవారే కాకుండా, చూచినవారు కూడా మరలా తప్పులు చేయకుండా జాగ్రత్త పడతారని.

మొదట హీరో ఆగ్రహంతో ఊగిపోయి వెంటనే బుద్ధి చెప్పాలనీ, ప్రతీకారం చెయ్యాలని ఉరకలు వేసి, తప్పటడుగులు వేసి, అవమానానికి గురై చతికిలబడతాడు. ఓడిపోతాడు "తన శాంతమే తనకు రక్ష" అని చివరకు తెలుసుకుని, నెమ్మదిగా ఆలోచించి, విచక్షణతో దుష్టుల, దురాగతాలను, దుర్మార్గుల దాష్టికాన్నీ, వంచననూ, ద్రోహాన్నీ నిర్మూలిస్తాడు. అందరిచేత శహభాష్! అనిపించుకుంటాడు.

క్షమ అయినా క్రోధమైనా ఎల్లవేళలా పనికిరాదు. సమయానికి తగినట్లుగా ఉండడమే ఉత్తమం. బుద్ధిపూర్వకంగా చేసిన నేరాలను క్షమించినా, ఉపేక్షించినా వాతావరణం దుర్భరమైపోతుంది. పొరపాట్లను క్షమించవచ్చు. కానీ నేరాలను శిక్షించాల్సిందే.

ఆత్మాభిమానానికి విఘాతం కలిగినపుడు దానికి కారకులైన వారిపైన, కారణాలపైన కోపం తెచ్చుకుని తన మానసిక శక్తిని పెంచుకుని చాణక్యుడు నందులను నిర్మూలించి చివరకు చరిత్రలో చాణక్యశపథం, చాణక్యనీతి అనే మాటలను ఈ నాటికీ జ్ఞాపకం ఉంచుకునేలా చేశాడు. అంటే ఆనాడతనిలో గల "కోపసంహారశక్తే కదా మూలకారణం. ఇలా ఎందరో మహానుభావులు తమ, కోపావేశాన్ని, సంకల్ప శక్తిగా, పట్టుదలగా మార్చుకుని ప్రఖ్యాతిచెందిన వారేనని మరువరాదు.

అన్నింటినీ మౌనంగా భరిస్తూ ఎప్పుడూ బాధితుల జాబితాలో మొదటి వ్యక్తిగా నిలబడడం మనిషితనమూకాదు, మగతనమూకాదు, మంచితనం అస్సలేకాదు. ఆత్మాభిమానం ప్రకాశించాలంటే, జీవితంలో ఉన్నత శిఖరాలనందుకోవాలంటే, కోపసంహారశక్తిని విచక్షణతో ప్రయోగించగలిగే విజ్ఞతనలవరచుకోవాలి. బంగారులో రాగి కలవనిదే ఆభరణానికి పనికిరాదన్నట్లుగా మనిషికి తగిన మోతాదులో కోపం, శాంతం ఉండి తీరాల్సిందే.

విచక్షణలేనివారు విమర్శలకు క్రుంగిపోతుంటారు. విజ్ఞత కలిగినవారు విమర్శలనే విటమిన్లుగా స్వీకరిస్తారు. "విమర్శ నిజమైతే ఉలుకెందుకు? సరిదిద్దుకో, అబద్ధమైతే కోపమెందుకు నవ్వి ఊరుకో".

నిజానికి సానుకూల పరిస్థితుల్లో నేర్చుకునేదానికంటే, ప్రతికూల పరిస్థితుల్లో, నేర్చుకునే జీవిత పాఠాలే అధికంగా ఉంటాయి. అవే మనల్ని తీర్చి దిద్ది ఉన్నత శిఖరాలలో నిలబెడతాయి. ఈనాడు గొప్పవారై మనకు ఆదర్శంగా నిలబడ్డవారంతా "నీకు ఇది చేతకాదు" అనో, నీవు పనికిమాలినవాడివి అనో, నీవు పరీక్ష గట్టెక్కినట్లే! అనో విమర్శలకు గురైనవారే. కాదంటే వీరు ఆ విమర్శలకు సానుకూలంగా స్పందించి వుంటారు.

నాకు తెలిసిన బంధువులబ్బాయి పల్లెటూరువాసి. బి.యస్‌సి., పాసయ్యాడు. ఆ పల్లె వాతావరణానికి, ఆ అబ్బాయి బి.యస్‌సి పాసవడమే చాలాగొప్ప. బి.యస్.సి పాసైనాడని తల్లిదండ్రులతోపాటు తానుకూడా గర్వంగా ఫీలయ్యేవాడు. ఉద్యోగం రాలేదుకదా అని, ఊరకనే ఉండకుండా పొలం పనులనే సక్రమంగా చేసుకునేవాడు.

ఇక ఉద్యోగం రాదు అనుకొని నిశ్చయించుకున్నాడు. తల్లిదండ్రులు వివాహ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎక్కడికి పోయినా మావాడు బి.యస్.సి.పాసయ్యాడు. అని గర్వంగా చెప్పుకునేవారు. ఒకసారి ఒక అమ్మాయి బి.యస్‌సి.నే కదా చదివింది. ఈ కాలంలో అదేమంత పెద్ద చదువుకాదు. ఆ చదువుకు పెద్ద ఉద్యోగం ఎలా వస్తుంది?" అని కామెంట్ చేసింది. అంతే! ఆ అబ్బాయిలోని అహం మేల్కొంది. తను గర్వంగా చెప్పుకునే డిగ్రీ గురించి ఒకసారి ఆలోచించాడు. అందులో ఎంతో సత్యముందని గ్రహించాడు. పెళ్ళిప్రయత్నాలను మానుకొని పట్టుదలగా యమ్.సి.ఎ. చేసి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. ఒక మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. అదే కంపెనీలోనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నమ్మాయినే వివాహం చేసుకున్నాడు. తన చదువును గురించి కామెంట్ చేసిన అమ్మాయికి మనసులోనే కాదు ఎంతో మందికి చెప్పి కృతజ్ఞతలను తెలియజేస్తుంటాడు.

ఇలాంటి విమర్శలు ఇంటి వాతావరణంలోనే ముఖ్యంగా తల్లిదండ్రుల నుండి అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ముల నుండి ఎదుర్కొనవలసివస్తుంది. ఒకవేళ ఏదో ఒక విజయం సాధించినా "అదైతే ఇంకా బాగుండును" అలా చేసి ఉంటే ఇలా ఉండేదికాదు, "నేనైతే ఇలా చేసి ఉండేవాడిని" ఇలా ఎన్నో ఊహించని విధంగా విమర్శలు వస్తూనే ఉంటాయి. ముఖ్యంగా పరీక్షలు తప్పినప్పుడూ, మార్కులు తక్కువగా వచ్చినప్పుడు విద్యార్థులు విమర్శలకు గురవుతుంటారు. అలాంటపుడు తల్లిదండ్రులను, అన్నను, అక్కను సైతం ఎదిరిస్తారు. ఇంటినుండి పారిపోవడమో, ఆత్మహత్య చేసుకోవడమో చేస్తారు. కానీ తనను విమర్శించిన వారి మనోవేదనను అర్థం చేసుకొని, సానుకూలంగా స్పందించి, దానికనుగుణంగా కృషి చేస్తే మెరుగైన స్థానాన్ని సంపాదించవచ్చు.

చాలామంది విమర్శలకు తట్టుకోలేక వ్యతిరేక భావాలతో విమర్శించిన వారిమీద కసి పెంచుకొని పగ తీర్చుకోవడంలోనే కాలం గడిపేస్తారు. తను నాశనం అయ్యేదే కాకుండా అందరికీ బాధలను కలిగించి, దుఃఖాలపాలు చేస్తారు. ఇటువంటి వారు జీవితంలో ఏదో ఒకనాడు తమ తప్పులకు పశ్చాత్తాపపడక తప్పదు. అప్పటికి పుణ్యకాలం కాస్త కరిగిపోయి వుంటుంది. యిక వారి జీవితాలు తెగిన గాలిపటాలే.

కోపంకారణంగా వచ్చే జబ్బులు

కోపానికి లోనైనపుడు రక్త ప్రసరణవేగం పెరిగి, గుండె లయ తప్పుతుంది. శరీరంలో 'అడ్రినలిన్' అనే ద్రవం విడుదలవుతుంది. అపుడు మనసును పూర్తిగా వ్యతిరేక భావనలు ఆక్రమిస్తాయి. పగ, ప్రతీకార భావనలు పెల్లుబుకుతాయి. బీడీ, సిగరెట్ పీల్చాలనీ, మద్యం సేవించాలనే భావనలు కలుగుతాయి. ఏదో ఒక రకంగా మానసిక ఉద్రేకాన్ని తగ్గించుకునేదానికి మనిషి ఏ స్థాయికైనా దిగజారుతాడు.

అలాంటపుడు రక్తప్రవాహపు వేగానికి గుండె తట్టుకోలేక ఆగిపోవడమో లేక పక్షవాతం సంభవించి కాలు, చేయి, నోరు పడిపోవడమో జరుగుతుంది. దానినే హై.బి.పి. అంటుంటారు.

కోపావేశానికి లోనైనపుడు చక్కెర శాతంకూడా పడిపోయి, నోటిలో తడి ఆరిపోతుంది. అకస్మాత్తుగా క్రింద పడిపోవడం కూడా జరుగుతుంది. ఈ మధ్య కాలంలో ప్రయాణంలో ముఖ్యంగా వాహన్నాలు నడిపేటపుడు అనవసరమైన ఆలోచనలతో ఆవేశాలకులోనై శరీరంలో చక్కెర శాతం తగ్గి, కళ్ళుతిరిగి యాక్సిడెంట్లకు గురైన సందర్భాలు లెక్కలేనన్ని.

కోప కారణంగా నిరోధక శక్తి తగ్గిపోతుంది. ఉష్ణోగ్రత పెరిగి ఆలోచనా ప్రక్రియ క్షీణిస్తుంది. విచక్షణ, లౌక్యం కోల్పోయి మిత్రులకు బదులు శత్రువులను సంపాదించు కుంటారు. ప్రాణాల మీదికి తెచ్చుకుంటారు.

కోపం తగ్గించుకునే మార్గాలు

1. కోపం వచ్చినపుడు వంద అంకెలను లెక్కపెట్టాలి.
2. ఒకసారి గట్టిగా ఊపిరి పీల్చుకుని వదలాలి. అవసరమైతే మరో నాలుగుసార్లు చేసినా మంచిదే.
3. మనసంతా కోపంతో నిండిపోయినపుడు ఆ చోటును వదలి ప్రక్కకు వచ్చేయాలి. అటూ-ఇటూ పచార్లు కూడా చేయవచ్చు. దూరంగా వెళ్ళి ఒక పేపరు మీద కోపానికి కారణం, దానికి నీ బాధ్యత ఎంత? ఎదుటివారి బాధ్యత ఎంత? పరిష్కార సూచనలు సమగ్రంగా వ్రాయాలి. కొన్నిరోజులు మౌనంగా ఆ వూసే ఎత్తకుండా ఉండిపోవాలి.
4. అసూయ, అహంకారం, పట్టుదల, ద్వేషం అసలువద్దు. ఇవన్నీ కోపాన్ని తెప్పించే గుణాలు కాబట్టి వెంటనే వాటిని తొలగించుకోవాలి.
5. వాగ్వివాదాలకు చోటు ఇవ్వకూడదు. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం తప్పక ఉంటుంది. సామరస్యంగా, చర్చలతో ఎన్నో సమస్యలను పరిష్కరించుకోవచ్చు .
6. చాడీలు చెప్పవద్దు, వినవద్దు.
7. క్షణికమైన కోపానికి తర తరాల బంధాలు తెగిపోతాయని గుర్తించుకోవాలి.

కోపం ఆత్మరక్షణకు ఉపయోగపడే ఒక అస్త్రం

ఒక పల్లెటూరికి దగ్గరలో ఉన్న పొదల్లో ఒక నాగుపాము ఉండేది. ఆ పామును చూచిన గ్రామస్తులు, తమకు తెలిసినవారందరకీ చెప్పారు. ముఖ్యంగా పిల్లలకు అటువైపు వెళ్ళవద్దని గట్టిగా హెచ్చరించారు, అయినా హెచ్చరికను ఖాతరు చేయకుండా అజాగ్రత్తగా వెళ్ళిన కొంతమందిని అది కాటువేసి మట్టుబెట్టింది.

ఒక సాధువు ఆ మార్గాన వెళుతుండగా చూచిన గ్రామస్తులు, పాము సంగతి

చెప్పి హెచ్చరించారు. అయినా సాధువు ముందుకు సాగాడు పాము గురించి ఆలోచిస్తూ, సాధువుకు ఎదురుగా రానేవచ్చింది ఆ భయంకర విషనాగు. ఎప్పటిలాగేకాటు వేసేదానికి తన పడగను ఎత్తింది. సాధువు ఆ విషనాగువైపు తన కరుణామయ దృష్టిని సారించాడు. అంతే, అంతటి విషనాగు పడగను దించి వానపాములా అయ్యింది.

అపుడు సాధువు "నేస్తమా నిన్ను చూచిన ఆ గ్రామస్తులు ఎంతగా భయపడుతున్నారో చూచావా? నీకు భయపడి ఈ మార్గాన రాకపోకలే లేవుకదా? ఇది సమంజసమేనా? పల్లెవాసులు నిత్య కష్టజీవులు. వారు ఈ మార్గాన నడవకపోతే ఎంత కష్టమో నీవు గమనింపకున్నావు. ఇకపై వారిని కాటు వేయవలదు. అని హితవచనాలను పాముకు వినిపించాడు. సాధువు మాటలకు వశీకరణం చెందిన పాము ఆనాటి నుండి బాటసారుల నెవ్వరినీ కాటు వేయకూడదని నిర్ణయించుకొని, తనమానాన తాను జీవిస్తూ ఉండినది.

అటుగావెళ్లే బాటసారులు, గ్రామస్తులు, పిల్లలు ఆ పామునుచూచి విషం కోల్పోయినదనీ, ప్రమాదం ఏమీలేదని, దానిని సమీపించి, రాళ్లతో కొట్టడం, అనవసరంగా దానిని వెంబడించి తరమడం చేసేవారు. మరీ ఆకతాయి పిల్లలు అనేక రకాలుగా హింసించినా పాము తన సహనాన్ని కోల్పోకుండా, ఎలాగో బ్రతుకీడుస్తూ వస్తున్నది. ఆకతాయి పిల్లలకు భయపడి అసలు ఒక్కోసారి ఆహారం కోసం కూడా బయటికి వచ్చేది కాదు ఆ పాము. అలా బాగా క్షీణించిపోయింది.

కాలం ఇలా గడచిపోతూ ఉండగా సాధువు అదేమార్గాన వస్తూ పాము దురవస్థను చూచి, ఆశ్చర్యపడి జాలి కలుగగా "ఏమైంది మిత్రమా? ఎలా ఉంటివి? ఇలాగా అయిపోయావేమి"? అని ప్రశ్నించాడు. దానికి పాము "మీరు చెప్పినట్లే నేను ఎవరినీ కాటువేయకుండా ఉన్నందుకే నాకీ శిక్ష" అని జరిగినదంతా పూస గ్రుచ్చినట్లు విన్నవించుకున్నది ఆ పాము సాధువుతో.

అంతా విన్న సాధువు-మిత్రమా "ఎంత పొరబాటు జరిగింది" అయినా నిన్ను కాటు వేయవద్దు అన్నానేకానీ,బుసకొట్టి భయపెట్టవద్దన్నానా?! చెప్పు, బుసకొట్టి భయపెడుతూ ఉంటే ఇంత అనర్థం జరిగి ఉండేది కాదుకదా?

* ఎవరినీ హింసించకూడదు -ఎవరిచేత హింసింపబడకూడదు.
* కోపం ఒక నటనగానైనా ఉండాలి - విచక్షణను ఏ క్షణంలోనూ కోల్పోకూడదు.
* ఆవేశం తగ్గాలి, ఆలోచన పెరగాలి.

కోపాన్ని తగ్గించిన అద్దం

ఒక వ్యక్తి ఓ సాధువు దగ్గరికి వచ్చి "స్వామీ! నాకు చీటికీ, మాటికీ కోపం వస్తూ ఉంటుంది. ఇది మంచిది కాదని నాపై నాకే కోపం వస్తూ ఉంటుంది. ఎలాగైనా దాన్ని కంట్రోల్ చేసుకోవాలనుకుంటాను. కానీ నా వల్లకావడం లేదు. అందుకే మీరే ఏదైనా మార్గం చూపించండి" అని ప్రార్థించాడు.

అంతా విన్న ఆ సాధువు, తన శిష్యుడిని పిలిచి ఏదో చెప్పాడు. వెంటనే శిష్యుడు కుటీరంలోకి వెళ్ళి ఒక చిన్నవస్తువును ఇచ్చివెళ్ళాడు. సాధువు "నాయనా ఇది నీ దగ్గర ఎల్లవేళలా ఉంచుకో, నీకు కోపం వచ్చినపుడల్లా దీనిని బైటికి తీసి ఇందులోకి చూడు" అని చెప్పి ఆశీర్వదించి పంపాడు.

అతను మూడు మాసాల తర్వాత ఆ సాధువు దగ్గరికి వచ్చి భక్తి శ్రద్ధలతో సాష్టాంగ దండప్రణామంచేసి "స్వామీ! మీరిచ్చిన ఈ చిన్న అద్దం అద్భుతంగా పని చేసింది. కోపం వచ్చినపుడల్లా దీనిలో చూచాను. నా ముఖం ఎంత వికారంగా మారిపోతుందో గమనించాను. నాముఖం నాకే అసహ్యం కలిగించింది. ఈ మూడు మాసాలలోనూ బాగా "కోపం తగ్గించుకోగలిగాను. కోపం-సద్గుణాలనన్నింటినీ కప్పివేసి, మనిషిని పతనం చేస్తుందనీ, శాంతగుణం దోషములనన్నింటినీ కప్పివేసి గొప్పవాడిని చేస్తుందని" తెలుసుకున్నాను అని వినయంగా చెప్పాడు.

కోపం ఒక అస్త్రం నాయనా! చెడిపోతున్న పరిస్థితులను చక్కదిద్దేదానికి ఉపయోగించవలసిన ఆయుధం. విచక్షణగా ఉపయోగించుకో.... అని ఆశీర్వదించి పంపాడు సాధువు.

కర్తవ్యబోధ

ఒక సారి గోపబాలురకు బాగా ఆకలివేసింది. తినడానికి ఏమైనా ఉంటే బాగుండును అని కృష్ణుణ్ణి అడిగారు. సమీపంలో కొంతమంది విప్రులు యజ్ఞం చేస్తున్నారు. వారి దగ్గరికెళ్ళి మనకోసం ఏదైనా ఆహారం అడిగి తెమ్మని కృష్ణుడు గోపాల బాలకులను పంపాడు.

ఆ బ్రాహ్మణులు గోపబాలురు చెప్పింది విని ఊరకే ఉండిపోయారు. నిరాశతో తిరిగివచ్చిన గోపాలురను ఓదార్చి, ఈసారి విప్రపత్నులను అడగండి అని పంపించాడు కృష్ణుడు. విషయాన్ని తెలుసుకున్న ఆ స్త్రీలు, వెంటనే రకరకాల పిండివంటలతో కృష్ణుని వద్దకెళ్ళారు. భక్తి భావంతో వారు తీసుకెళ్ళిన ఫలహారాలను కృష్ణునికి సమర్పించి, తన్మయులయ్యారు. వారు తిరిగి తమ భర్తల వద్దకు వెళ్ళము అని భీష్మించుకున్నారు.

" నన్ను దర్శించడంచేతా, నిరంతరం కీర్తించడంచేతా, ధ్యానించడంచేతా ఏ భావం మీకు కలుగుతుందో, ఆ భావం నాదగ్గర ఉన్నప్పుడు కలగదు. ప్రస్తుతం మీ భర్తలతో కలసి యజ్ఞాన్ని పూర్తి చేయండి, మీ ఇళ్ళకు మీరు తిరిగి వెళ్ళి, మీ కర్తవ్యాన్ని మీరు నిష్ఠగా చెయ్యండి" అని చెప్పి వారిని ఇళ్ళకు పంపించాడు.

* గుడికానీ, బడికానీ, దూరంగా ఉన్నప్పుడే గురుత్వం అధికంగా ఉంటుంది.

పాజిటివ్ థింకింగ్ అంటే సానుకూల వైఖరే!

ఒకసారి బుద్ధుని దగ్గర శిష్యరికం చేసినవారు, శిక్షణపూర్తయిన తర్వాత వెళ్ళిపోతూఉన్నారు. అపుడొక శిష్యుడు మీ బోధలను ప్రజలకు తెలియజేయటానికి ఎక్కడికి వెళ్ళమంటారు? అని అడిగాడు.

బుద్ధుడు :- నీ ఇష్టం వచ్చిన ప్రదేశానికి వెళ్ళు.

శిష్యుడు :- సభా అనే మారుమూల ప్రదేశానికి వెళతాను.

బుద్ధుడు :- ఆ ప్రాంతానికి ఇదివరకెవ్వరూ వెళ్ళలేదు. కావున ఆ ప్రాంత ప్రజలకు జ్ఞానం అంటే ఏమిటో తెలియదు. పరమ రాక్షసులు, నీపట్ల క్రూరంగా వ్యవహరించవచ్చు. కావున అక్కడికి కాకుండా మరెక్కడికైనా వెళ్ళు.

శిష్యుడు :- లేదు లేదు, నేనక్కడికే వెళ్తాను.

బుద్ధుడు :- సరే. నేను నీకు మూడు ప్రశ్నలు వేస్తాను. సరియైన సమాధానాలిస్తే వెళ్లనిస్తాను లేదా నీవు వెళ్లకూడదు.

శిష్యుడు :- సరే గురువుగారూ.

బుద్ధుడు :- ఒకవేళ వారు నిన్ను నిందిస్తే?

శిష్యుడు :- నన్ను కొట్టలేదు కదా అని సంతోషిస్తాను.

బుద్ధుడు :- ఒకవేళ వారు నిన్ను కొట్టి బాధిస్తే?

శిష్యుడు :- చంపలేదు కదా అని సంతోషిస్తాను.

బుద్ధుడు :- ఒకవేళ నిన్ను వారు చంపివేస్తే.

శిష్యుడు :- మీ యొక్క బోధనలను, తత్వాన్ని వ్యాప్తి చేయడంలో ప్రాణాలు పోగొట్టు కుంటున్నందుకు ధన్యుడనైనానని సంతోషంగా మరణిస్తాను.

బుద్ధుడు :- సరే! ఇక నీవు వెళ్ళవచ్చు.

* గ్లాసులోని నీళ్లు సగం అయిపోయాయని నిరాశ పడవద్దు. నీళ్లు సగం వరకు ఉన్నాయని తృప్తిపడు.
* నిప్పురవ్వేకదా? అనుకోకు దానితో పెద్ద మంటనే రగిలించవచ్చు.

అహంకారం

గర్వం అన్నా, అహంకారం అన్నా ఒకటే. సందర్భాన్ని బట్టి పలుచబడిన అహంకారమే గర్వం. హద్దులేని గర్వమే అహంకారం.

చీకటి పడగానే మిణుగురు పురుగులు బయటికివచ్చి, ఆహా ప్రపంచానికి మనమే కదా వెలుతురును ప్రసాదిస్తున్నది అనుకున్నాయి. కాసేపటకి నక్షత్రాలు ప్రకాశించడం మొదలెట్టగానే, మిణుగురు పురుగులు కాంతి ఆనవాలు లేకుండా పోయింది. ఆ విధంగా వాటి గర్వం అణిగిపోయింది.

నక్షత్రాలు తామే ప్రపంచానికి ప్రకాశాన్ని ఇస్తున్నామని భావించి గర్వపడ్డాయి. అంతలో చంద్రోదయ మయ్యింది. చంద్రుని వెన్నెల ముందు నక్షత్రాల వెలుగు కనుమరుగయ్యింది. ఆ విధంగా నక్షత్రాల గర్వం అణిగిపోయింది.

భూమిపై ఉన్న చల్లని కాంతివంతమైన వెన్నెలకు కారణం నేనేకదా? అనుకొని చంద్రుడు మురిసిపోతూ ఉండగనే, సూర్యోదయమైంది. అంతే! సూర్యుని తేజోప్రకాశం ముందు చంద్రుని వెన్నెల వెలవెలా పోయింది.

* గొప్పతనానికి ముందు వినయం ఉంటుంది పతనానికి వెనుక గర్వముంటుంది.
గర్వం ఐదు విధాలు:- 1) బలగర్వం 2) ధనగర్వం 3) స్థాన గర్వం 4)రూప గర్వం 5) విద్యా గర్వం.

<u>బలగర్వం :</u> నాకింత శక్తి ఉంది. నా కులస్థులు ఇంతమంది ఉన్నారు. మిత్రులింతమంది ఉన్నారు. నాకేమీ పర్వాలేదు-నన్నెవరూ ఏమీ చెయ్యలేరు. నా జోలికెవ్వరూ రాలేర్లు "నేను చెప్పిందే వేదం, నేను చేసిందే న్యాయం, నా కత్తికి ఎదురు లేదు, నామాటకు అడ్డమేలేదు, నా బలం ముందు, నా బలగం ముందు వాడెంత? వాడి జనమెంత? మేమంతా కలిసి ఉమ్మినా, ఉచ్చపోసినా అందులో కొట్టుకొని పోవాల్సిందే! అని గర్వపడడం.

రావణుడు, భస్మాసురుడు, హిరణ్యాకశ్యపుడు వీరంతా విశేష బలం సంపాదించిన కారణంగానే అహంకరించి అంతమయ్యారు. కౌరవులు " మేము నూరు మందిమి! మాకేమి? అని గర్వించి కేవలం ఐదుమంది పాండవులచేత హతమయ్యారు.

ఒక అడవిలో ఓ పొగరుబోతు ఏనుగు ఉండేది. అది వెళ్తున్న దారిలో ఏ జంతువు కనిపించినా 'నువ్వు నాకంటే బలమైనదానివా? అయితే నాతో పోటీకి రా' అంటూ కయ్యానికి కాలుదువ్వేది. 'దీంతో గొడవ ఎందుకులే' అనుకునే జంతువులు ఏనుగు ఎదురవగానే తలవంచుకుని తప్పుకునేవి. ఒకరోజు ఈ పొగరుబోతు ఓ మర్రిచెట్టు కింద నిలబడింది. ఆ చెట్టుకింద ఓ చీమల పుట్ట ఉంది. అందులోంచి బయటకి వచ్చిన ఒక చీమ ఏనుగును చూసింది. 'మిత్రమా... నువ్వు నాకంటే ఎంత పెద్దగా ఉన్నావో! మనిద్దరం స్నేహం చేస్తే భలేగా ఉంటుంది. కొత్తకొత్త ఆటలు ఆడుకోవచ్చు' అంది చీమ, ఆ మాటలు విన్న ఏనుగుకి కోపం వచ్చింది. 'అడవిలో జంతువులన్నీ నన్ను చూసి భయపడి పారిపోతున్నాయి. అలాంటిది నన్నే ఆడుకుందాం రా అని పిలుస్తావా?! ఎంత ధైర్యం? కోపంగా అంది ఏనుగు.

ఏం.... మనిద్దరం ఆడుకోవడం తప్పా? భయపడకుండా అడిగింది చీమ. 'నా బలమెంతో నీకు తెలుసా? నేను ఆడే ఆటలన్నీ నువ్వూ ఆడగలవా? ఒకవేళ ఆడినా ఓడిపోయేది నువ్వే. నా ముందు నువ్వెంత? నీ బలమెంత?' పొగరుగా చెప్పింది ఏనుగు. 'నిజంగా నీకు అంత బలముందా' అని చీమ అనేసరికి ఏనుగుకు కోపం ఎక్కువైంది. చుట్టూ ఉన్న చెట్ల కొమ్మల్ని విరిచేసింది. రాళ్ళను దొర్లించింది, అంతా చిందరవందర చేసింది. చూశావుగా నా ప్రతాపం. నాలా చెట్ల కొమ్మల్ని విరిచేయడం. రాళ్లు కదపడం నీకు సాధ్యమేనా? అని గర్వంగా అంది ఏనుగు. వెంటనే ఓ పుట్టని తవ్వి మట్టిలోకి వెళ్లిపోయింది చీమ. 'హహ్హహ్హ... పాపం, భయపడిందేమో' అనుకుంది ఏనుగు.

కాసేపటికి పుట్టలోంచి నెమ్మదిగా చీమ బయటకి వచ్చింది. 'నాలా ఓ పుట్టని తవ్వి నువ్వూ మట్టిలో దాక్కోగలవా?' ఏనుగును అడిగింది చీమ. ఏనుగు ఆలోచనలో

పడింది. మిత్రమా!... నువ్వు నాకంటే బలమైన దానివీ, పెద్ద దానివీ కావొచ్చు. కానీ ఎదుటివారి నైపుణ్యాన్ని తక్కువగా అంచనా వేసి హేళన చెయ్యకూడదు. ఎవరిబలం వారికి ఉంటుంది. ఎవరి నైపుణ్యాలు వారికి ఉంటాయి' అని చెప్పి పుట్టలోకి వెళ్లిపోయింది చీమ.

నిజమే.... 'నేనే గొప్ప' అనుకుని ఇన్నాళ్లూ మూర్ఖంగా ప్రవర్తించాను. ఎవరి గొప్ప వారిదే-అని తన తప్పు తెలుసుకుంది ఏనుగు.

ధన గర్వం : నాకంటే ధనవంతుడు లేడు. ధనముంటేచాలు. ఇంకేమీ అక్కర్లేదు. "నందిని పంది, పందిని నందిగా చెయ్యవచ్చు" "డబ్బుకు లోకం దాసోహం" డబ్బు సంపాదించడం కోసం "ఏమైనా చెయ్యవచ్చు, ఏ గడ్డైనా కొరకవచ్చు". డబ్బుకోసం ఎవడైనా నా ముందు చేయిచాపి దేహీ అంటూ అడుక్కోవాల్సిందే! అనుకోవడం.

పూర్వం ఒక రాజు నగర శివారు ప్రాంత ప్రజలను క్రూరమృగాల నుంచి రక్షించుట కొరకు సైన్యంతో అడవికి వెళ్లాడు. అడవిలో ఒక పెద్ద చెట్టు క్రింద విడిదిని ఏర్పాటు చేయించాడు.

పగలంతా వేటాడి, చీకటి పడగానే తన విడిదిని చేరుకునే వాడు. ఇలా రెండు రోజులు గడిచాయి. మూడవ రోజు నాటి రాత్రి రాజు విడిది చేరగానే ఆ చెట్టు మీదున్న ఒక పక్షి "ఎవరక్కడ? ఇక్కడికెందుకు వచ్చారు? ఈ చెట్టు నాది. ఈ ప్రాంత మంతా నా ఆధీనంలో ఉంది. ఇతరు లెవ్వరూ నా రాజ్యంలోకి రాకూడదు. వెళ్ళిపొండి, అని గద్దించి చెప్పింది.

పక్షి మాటలు విన్న రాజుకు ఆశ్చర్యం కలిగింది. నిన్నా-మొన్నా లేనిది, ఈ రోజెందుకు పక్షి-ఇలా గర్వంతో మాట్లాడుతున్నది? అనుకుంటూ... పక్షితో రాజు ఇలా అన్నాడు. ఓ పక్షి మిత్రమా! ఈచెట్టు నీదనీ, ఈ ప్రాంతమంతా నీ ఆధీనంలో ఉన్నదని నాకు తెలియదు. తెలిసిఉంటే తప్పక నీ అనుమతి తీసుకొని ఉండేవాడిని. నన్ను క్షమించు. ఈ చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు క్రూరమృగాల బాధ లేకుండా చేద్దామని వేటకు వచ్చాను. వేట పూర్తి కాగానే వెళ్ళి పోతాను అని వినయంగా చెప్పాడు. సరే అలాగే వేట తర్వగా ముగించుకొని, ఈ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్ళి పొండి అని చెప్పింది పక్షి.

వింత గొలిపే పక్షి మాటలకు ఆ రోజు రాత్రి నిద్ర పట్టలేదు రాజుకు. ఒక పక్షి ఇలా మాట్లాడ్డానికి కారణం ఏమై ఉంటుంది? విడిది చేసిన నాటి రాత్రే ఈ పక్షి ఎందుకు మాట్లాడలేదు. ఈ రోజే ఎందుకు ఇలా మాట్లాడింది? ఈ దేశ రాజునైన నాతోనే ఇలా మాట్లాడింది అంటే! దీని వెనుక ఏదో బలమైన కారణం ఉండే ఉంటుంది, అనుకున్నాడు.

మరుసటి రోజు నగరం నుండి మహా మంత్రిని పిలిపించి, ఈ విచిత్ర సంఘటన గురించి చెప్పాడు. మహామంత్రి కూడా చాలా ఆశ్చర్యపోయాడు. మహారాజా! ఇందులోని రహస్యం ఛేదించాలంటే దాని గూటిని పరిశీలించాలి అని చెప్పి, తానే స్వయంగా చెట్టెక్కి పక్షి గూటిని వెదికాడు. అందులో ఒక రాగి దమ్మిడీ కనిపించింది. పక్షి అహంకరించడానికి ఈ దమ్మిడీనే కారణం అని తెలుసుకొని, దానిని తీసుకొని చెట్టు దిగి రాజుకు ఆ దమ్మిడీని చూపిస్తూ-మహారాజా! పక్షి అహంకారానికి ఈ దమ్మిడీయే కారణం అన్నాడు.

రెండు రోజుల క్రితం ఈ దమ్మిడీ పక్షి గూటిలో లేదు. అందువలన పక్షి ఏమీ అనలేదు. తర్వాత ఎలాగో ఇది ఈ పక్షి గూటిలోకి వచ్చింది. అందువలననే పక్షి అలా మాట్లాడింది. ఈ దమ్మిడీని తీసేశాను కదా! ఈ రోజు రాత్రి చూడండి, ఆ పక్షి ఏమీ మాట్లాడదు అని వివరించాడు మంత్రి.

రాజు - అలాగే ఈ దమ్మిడీ మహత్యం ఏపాటిదో చూద్దాం అన్నాడు. ఆ రోజు సాయంకాలం పక్షి గూడు చేరింది కానీ, మౌనంగానే ఉండిపోయింది. ఔరా! అల్పమైన ఈ దమ్మిడీ ఎంత పని చేసిందీ! అని ఆశ్చర్యపోయాడు. ఇలాంటి దమ్మిడీ బాపతుగాళ్ళను చూచే నీతి కోవిదులు ఇలా సెలవిచ్చారు.

ధనము హెచ్చిన మదము హెచ్చును
మదము హెచ్చిన దుర్గుణములు హెచ్చును
ధనముడిగిన మదముడుగును
మద ముడిగిన దుర్గుణములు నశించును.

స్థానగర్వం : ఒక గొప్ప శిల్పి ఉండేవాడు. సహజమైనదేదో, కృత్రిమైనదేదో తెలుసు కోలేనంత గొప్పగా శిల్పాలను సృష్టించేవాడు. ఆయన జ్యోతిష్యుడు కూడా అయినందున తన మరణకాలం కూడా తెలుసుకోగలిగాడు. భూమి పైనున్న సమస్త శిల్పకళా కారులందరిలోకి 'ప్రథమ స్థానంలో' ఉండాలి. అన్న ఆకాంక్ష అతనిలో చాలా బలంగా నాటుకొని ఉండేది. అందుకని అతడు మృత్యువును జయించాలనుకున్నాడు.

అనుకున్నదే తడవుగా " శిల్పి అనుకుంటే విగ్రహాలకు కొదవా? రాజు తలచుకుంటే దెబ్బలకు కరువా?" అన్నట్లు అచ్చు తనలాగే ఉండే కొన్ని శిల్ప కళాఖండాలను సృష్టించాడు. మృత్యు సమయానికి వాటి మధ్యనే పడుకున్నాడు.

మృత్యు దేవతకు అసలు శరీరమేదో నకిలీ శరీరమేదో తెలియలేదు. మృత్యుదేవత ఆశ్చర్యపడింది. ఆలోచించి ఇలా అంది! " ఆహా! ఎంత అద్భుతం! ఏమా శిల్పకళా చాతుర్యం? ఎవరో ఆ మహాశిల్పి? ఏమి ఈ అపూర్వ సృష్టి?!" అని ప్రశంసించింది.

వెంటనే శిల్పి ఆనందంతో లేచి "నేనే" అన్నాడు. మృత్యు హస్తాలకు చిక్కిపోయాడు.

* "నేనూ చెయ్యగలను, నేనూగొప్పే" అనుకుంటే అది ఆత్మవిశ్వాసం. మంచిదే

పెంచుకో.

* "నేనే చెయ్యగలను. నేనే గొప్ప". అనుకుంటే అది అహంకారం. తప్పు, తుంచుకో.

* "నీవే చెయ్యగలవ్" అంటే అది ప్రశంస. మంచిది, ప్రశంసించు.

* "నీవూ చెయ్యగలవ్" అంటే అది ప్రోత్సాహం. మంచిది, ప్రోత్సహించు.

నాకోడి, కుంపటి లేకపోతే! తెల్లారుతుందా? పొయ్యి మండుతుందా?

గడియారాలు, కరెంటు దీపాలు లేని రోజులలోని మాట. ఒక కుగ్రామంలో ఒక ముసలమ్మ ఉండేది. ఆమెకున్నదల్లా ఒక కోడిపుంజు. చిన్న కుంపటి మాత్రమే. ఆ గ్రామంలో మిగతావారికి ఆమాత్రంకూడా లేవు. అందుచేత తెల్లవారుఝామున ముసలమ్మ కోడిపుంజు "కొక్కొరోకో" అని కూయగానే పల్లె వాసులంతా లేచి ఎవరి పని మీద వాళ్ళు వెళ్లేవారు.

కోడి కూతకు లేచిన పల్లె పడచులు ముసలమ్మ దగ్గరి కొచ్చి ఆమె కుంపటిలోని నిప్పును తలాఇంత పట్టుకొని పోయి తమ పొయ్యిలు వెలిగించుకునేవారు.

ఇలా ఉండగా ఒకరోజు ముసలమ్మకి ఆ వూరి జనం మీద చాల కోపం వచ్చింది. వాళ్ళ తిక్క కుదిరించాలి! తన విలువేమిటో తెలియచెప్పాలి! అనుకుంది. చెప్పా పెట్టకుండా, ఉన్నపళంగా తన యావదాస్తి అయిన కోడిని, కుంపటినీ చంకన పెట్టుకొని ఊరికి ఆమడదూరం వెళ్ళి చెట్టుక్రింద కూర్చుండిపోయింది.

పాపం అమాయకపు ముసలమ్మ ఉద్దేశ్యం ఏమిటంటే! తనకోడి కొక్కరొకో అని కూయకపోతే ఆ ఊళ్ళో తెల్లవారదనీ, తన కుంపటి లేకపోతే మిగతావారికి పొయ్యి వెలిగించుకోవడానికి నిప్పులు లేక అందరూ అన్నం తినడం మానేస్తారని అనుకున్నది. ఇంతలో తెల్లవారింది. బారెడు పొద్దెక్కింది ఆ త్రోవన ఎవరో వస్తుంటే నిలబెట్టి ఆరా తీసింది. ఆ ఊళ్ళో తెల్లవారిందా అని. దారిన పోయే దానయ్య ఏం? ఎందుకు తెల్లవారదేంటి? ఏమిటీ విషయం? అని అడిగి, తెలుసుకొని ముసలమ్మ అమాయకత్వానికి నవ్వుకుని "నీ కోడి కూయకపోతే తెల్లారదా?! కుంపటి లేకపోతే మాత్రం వండుకొని తినక పస్తుంటారా?" తిక్కదానా! అంటూ వెళ్ళాడు.

చాలామంది తాను లేకపోతే, తన సహాయం లేకపోతే పనులు జరగవు అని అనుకుంటూ ఉంటారు అహంకారంతో. మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డా! తర్వాత ఎవరి పనులు వారు చేసుకుంటూ పోతారు. ఈ ప్రపంచంలో ఏదీ, ఎవరివలనా ఆగదు. అలా సాగిపోతూనే ఉంటుంది.

రూప గర్వం : నాకంటే అందమైన వారు లేరు! " నా అందచందాలతో ఎవరినైనా ఇట్టే చిత్తుచేయగలను, ఎవరినైనా శాసించగలను". అనుకోవడం.

మధ్య భారతదేశ ప్రాంతంలో ముసలివాడైన రాజు చనిపోగా, పెద్ద కుమారుడిని రాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశారు. ఆ యువరాజు చాలా అందగాడు. పైగా యువకుడు. అతనకి తన అందచందాలమీద అమితమైన గర్వం ఉండేది.

అతను ఎల్లవేళలా అద్దంముందు నిలబడి తన అందమైన ముఖాన్నీ, ఆకృతినీ చూచుకొని మురిసిపోతూ ఉండేవాడు. చివరికి అతను ఇతరుల కళ్ళలోనూ, నీటిలోనూ కూడా తన ప్రతిబింబాన్ని చూచుకొని మురిసిపోతూ ఉండేవాడు.

సభలోకూడా తనంతటి అందగాడు లేడని చెబుతుండేవాడు. ఆ యువరాజు పరిపాలనా వ్యవహారాలను చక్కబెట్టేదానికంటేకూడా, తన అందచందాలను చూచుకోవడంలోనే ఎక్కువ సమయాన్ని వెచ్చించేవాడు. ఆ కారణంగా పరిపాలన అస్తవ్యస్తమై, సాధారణ ప్రజలు కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. అధికారులు పేదలను పీడించసాగారు. లంచాలను తీసుకోవడం మొదలు పెట్టారు. ప్రజలు రాజసభలో తమ కష్టాలను విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది.

కాలం గడిచేకొద్దీ యువరాజు తన అందంమీద అంతులేని అహంకారాన్ని పెంచుకున్నాడు. చివరకు తాను గంధర్వుల కంటే అందగాడినని అందరితో చెప్పసాగాడు.

ఇలా ఉండగా ఒకరోజు ఆకాశమార్గాన ప్రయాణిస్తున్న యక్షుడొకడు ఈ యువరాజు అహంకారంతో అనేమాటలను విని యువరాజు అహంకారాన్ని అణచివేయాలని సంకల్పించి, తన చేతులను గాలిలో అలా కదిలించాడు. వెంటనే యువరాజు తలమీద వేలెడంత చిన్న కొమ్ములు మొలిచాయి. యువరాజు మరునాడు ఉదయం నిద్రలేచీ లేవగానే, అలవాటు ప్రకారం అద్దంముందు నిలుచుకొని, తన అందమైన రూపాన్ని చూచుకొన్నాడు. వెంటనే పెద్దగా పిచ్చికేకలు వేయసాగాడు. బయట కాపాలా భటులు యువరాజువారి కేకలు విని, పడక గదిలోకి వచ్చారు. భటులను చూచి యువరాజు తన తలమీద ఒక పెద్ద దిండును పెట్టుకొని కూర్చున్నాడు. ఎవ్వరినీ తన ఆజ్ఞలేనిదే లోనికి అనుమతించవద్దనీ, వెంటనే ఆస్థాన మంగలిని రప్పించమనీ ఆజ్ఞాపించాడు.

ఆస్థాన మంగలి వట్టి వదరుబోతు. పడకగదిలోకి మంగలి రాగానే, ఎవరూ లోనికి రాకుండా తలుపుకు గొళ్ళెం పెట్టేయమన్నాడు యువరాజు. మంగలిని తన దగ్గరికి పిలిచి ఇపుడు నీవు చూడబోయే విషయం బయటికి పొక్కిందో, నీ మెడమీద తల ఉండదు జాగ్రత్త, అని హెచ్చరించి, తన తల మీద దిండును తీసేసి, మొలచిన కొమ్ములను చూపించాడు. ఇవి కనపడకుండా ఏదో ఒకటి చెయ్యమని అన్నాడు. బాగా ఆలోచించి తలమీద వెంట్రుకలనే కాస్త అటూ ఇటూ సవరించి, కొంత వరకు ఆ కొమ్ములను కనపడకుండా కప్పగలిగాడు. నిన్నటివరకూ గంధర్వులకంటే అందగాడినని ప్రగల్భాలు పలికిన తాను, ఇపుడు వికారంగా కనిపించే కొమ్ములతో రాజ దర్బారుకు ఎలా వెళ్లగలడు? కాబట్టి, "తాను అనారోగ్యంతో ఉన్నాననీ, అందువలన ఎవరినీ చూడబోననీ," చెప్పమన్నాడు. సరేనని, ఆస్థాన మంగలి అంతఃపురంలోని ప్రముఖులైన అధికారులకు అదే విషయం చెప్పాడు.

అంతఃపురం నుండి బైట పడ్డ ఆస్థానమంగలికి, ఈ రహస్యాన్ని తనలోనే ఉంచుకోవడం సాధ్యపడలేదు. సహజమైన తన వదరబోతుతనాన్ని అణచుకోలేక పోతున్నాడు. తనలోని ఈ రహస్యం బైట పెట్టకపోతే కడుపుబ్బి చచ్చేటట్టున్నాడు. కానీ యువరాజా వారి మరణదండన జ్ఞాపకంవచ్చి భయపడుతున్నాడు. రహస్యాన్ని బైటికి కక్కనూలేడు, లోపల ఉంచుకోనూలేడు ఎలా చచ్చేది? చివరికి అంతఃపుర ప్రాంగణంలోనే ఉన్న చింతచెట్టువద్దకు వచ్చి మెల్లగా "యువరాజావారి తలపై రెండు కొమ్ములు మొలిచాయి" అని చెప్పేసి అమ్మయ్య! మనసులోది కక్కేశాను అని తృప్తిపడ్డాడు.

అదేరోజు రాత్రి వచ్చిన పెద్ద తుఫానుకు చింతచెట్టు మొదలంటా కూలిపోయింది. ఆ విషయాన్ని భటులు రాజుగారికి తెలియజేశారు. యువరాజావారు దాని మొదలుతో ఒక పెద్ద మద్దెలను తయారు చేయించి ఆస్థాన సంగీత విద్వాంసుడిని తన గదిబయట వాయించమని అజ్ఞాపించాడు. సభికులందరూ యువరాజావారి పడకగది ముందర గుమిగూడారు. సంగీత విద్వాంసుడు. మద్దెలను వాయించగానే అదెంతో శ్రావ్యంగా " అందమైన యువరాజు వారి తలపైన కొమ్ములు మొలిచాయి" అంటూ మ్రోగింది. సభికులందరూ ఆశ్చర్యంతో నవ్వుతూ అక్కడినుండి నిష్క్రమించారు.

యువరాజావారు అవమానాన్ని భరించలేక, కోపావేశంతో ఆ మద్దెలను ఈడ్చుకుంటూ అడవిలోకి వెళ్ళిపోయాడు. అలా వెళ్ళిన యువరాజు, అడవిలోని ప్రకృతి సౌందర్యాన్ని గురించి తెలుసుకున్నాడు. ఇప్పుడు యువరాజులో గర్వంలేదు. మద్దెలను చక్కగా వాయించడం నేర్చుకున్నాడుకూడా.

యువరాజులో వచ్చిన మార్పునకు ప్రకృతిమాత చాలా సంతోషించింది. యువరాజుకు కొమ్ములు మొలిపించిన యక్షుని వద్దకు వెళ్ళి, ప్రకృతిమాత యువరాజులో వచ్చిన మార్పును గురించి చెప్పి, అతడిని క్షమించి శాపాన్ని ఉపసంహరించి మునుపటి అందమైన రూపాన్ని ప్రసాదించవలెనని కోరింది. యక్షుడు ప్రకృతిమాత విన్నపాన్ని మన్నించి, గాలిలో తన చేతులను ఊపాడు. వెంటనే యువరాజు తలపైన మొలిచిన కొమ్ములు అదృశ్యమైపోయాయి. తలపై కొమ్ములు లేకపోవటం గమనించిన రాజు ఆనందాశ్చర్యాలకులోనై భగవంతునికి కృతజ్ఞతలను తెలుపుకున్నాడు. ఇంతలో తన ఆస్థాన సభ్యులంతా వచ్చి యువరాజు యోగక్షేమాలు విచారించి, రాజ్యానికి రావలసిందిగా వేడుకున్నారు. యువరాజు తన రాజ్యానికి చేరుకున్నాడు. ఒక చక్కని యువతిని వివాహం చేసుకుని, రాజ్యపాలనపై శ్రద్ధ వహించాడు. మంగలివాని తల తీయించకుండా ఉద్యోగంనుండి తొలగించాడు.

* బాహ్యసౌందర్యం అహంకారాన్ని పెంచుతుంది. భావ సౌందర్యం అణకువను పెంచుతుంది.

విద్యాగర్వం "నాకంటే పండితుడు లేడు. పాండిత్యంలో ఎవరినైనా ఓడించగలను. పాండిత్యంలో నాకు సరి, సాటి ఎవరు"? అని విర్రవీగడం.

ఒక పండితుడు బంధుమిత్ర, సపరివార సమేతంగా వ్యాహ్యాళి నిమిత్తమై ఒక నది మధ్యన ఉన్న 'దీవి'కి వెళ్ళాడు. ఆ దీవిలోని ప్రకృతి అందాలను తిలకిస్తూ పులకించిపోతూ ఆనందిస్తూ, తిరుగుతూ ఉండగా, ముగ్గురు వ్యక్తులు ఒక చెట్టు క్రింద కూర్చొని " ఓ భగవంతుడా మాకెవరూ లేరు, మాకేమి తెలియదు, మాకేమి వద్దు, మీదయ ఉంటే చాలు" అని ప్రార్థిస్తున్నారు.

ఈ తతంగ మంతా చూచిన పండితుడు, బంధుమిత్రులు ఆశ్చర్యపడి, వారు చేసే ప్రార్థన విని ఎంతటి మూర్ఖులు వీరు? ఇల్లు విడిచి ఇంతదూరం వచ్చి, భగవంతుడిని ఇలాగేనా ప్రార్థించేది? వీరికి శాస్త్ర పరిచయం లేదు కాబోలు. అందుకే పూజా విధానాలు తెలియక మొరటుగా, అలా ప్రార్థిస్తున్నారు అని అనుకుంటూ, వారి దగ్గరికి పండితుడు వెళ్ళి " అయ్యా మీరెవరోకానీ చాలా అమాయకుల్లాగా కనిపిస్తున్నారు. భగవంతుడిని ఇలాకాదు ప్రార్థించవలసింది అన్నాడు.

ఆ మాటలు విన్న ఆ ముగ్గురూ లేచి నిలబడి, పండితుని దగ్గరికి వచ్చి, వినయంగా నమస్కరించి, చేతులు జోడించి, మోకాళ్ళమీద నిలబడి, మిక్కిలి విధేయతతో "అయ్యా! క్షమించండి! ఏదో మాకు తెలిసిన రీతిలో భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. ఈ మూర్ఖులను మన్నించి, మీకు తెలిసిన శాస్త్రరహస్యాలను, భగవంతుడిని కీర్తించే శ్లోకాలను బోధించండి" అని వినయం ఉట్టిపడేటట్లుగా ప్రార్థించారు.

పండితుడు వారి వినయానికి ముగ్ధుడై, తనకు తెలిసిన స్తోత్రాలను, పూజావిధానాలను చక్కగా వివరించి చెప్పాడు. ఆ ముగ్గురూ శ్రద్ధగా విన్నారు. " విసుగు చెందకుండా మీరు చాలా బాగా చెప్పారు, అందుకు మీకు మా హృదయ పూర్వక ధన్యవాదాలు" అని, ఆ ముగ్గురూ కృతజ్ఞతలను తెలియజేశారు.

మంచిది మేం వెళ్ళొస్తాం. అని చెప్పి పడవలో కూర్చొని పండిత పరివారం ప్రయాణమయ్యారు. దీవిని విడిచి కొంత దూరం వచ్చాక, వెనుక నుంచి ఏవో అరుపులు వినవచ్చాయి. వెనుకకు తిరిగి చూడగా, మూడు కాంతి పుంజాలు తమవైపుకు రావడం గమనించారు. తమ ఊహకు కూడా అందని ఆ దృశ్యాన్ని చూచేటప్పటికి ఒక్కసారిగా పండిత పరివారానికి ఒకింత భయం, ఒకింత ఆశ్చర్యం కలుగగా నిశ్చేష్టులై అలాగే చూస్తూ ఉండగానే, దీవిలోని ఆ ముగ్గురూ వారి ముందు మోకరిల్లి వినయ విధేయతలతో చేతులు కట్టుకుని "అయ్యా పండితులవారు! మమ్మల్ని క్షమించండి! మీరు మాకు చెప్పినవన్నీ మరచిపోయాం. మామీద దయదలచి కోపగించుకోకుండా, విసుగు చెందకుండా మరొక్కసారి చెప్పండి" అని వేడుకున్నారు.

నోట మాటరాక, నిశ్చేష్టుడైన పండితుడు, చివరకి ఏమీ మాట్లాడలేక ఆ ముగ్గురి ముందు తానుకూడా మోకరిల్లి, కళ్ళనీళ్ళు నిండిన కళ్ళతో ఇలా ప్రార్థించాడు. "ఓ భగవంతుడా నాకేమీ తెలియదు, నాకెవరూలేరు, నాకేమీ వద్దు. నీదయ ఉంటేచాలు". అని ప్రార్థించి అందరినీ వదలి వారితో కూడా కలసి దీవికి వెళ్ళిపోయాడు.

లోకులు పలుగాకులు

1. తనమానాన తాను మౌనంగా తనపనేదో తాను చేసుకుంటూ పోయేవాడిని "మూగోడు" అంటారు.
2. "నోరు మంచిదైతే ఊరు మంచిదని" చక్కగా మాట్లాడేవారిని "వదరుబోతు" అంటారు.
3. అందరికీ అందుబాటులో ఉంటూ, కల్లాకపటమెరుగని అమాయకుడిని చక్కగా ఉపయోగించుకుంటూ 'పనికిమాలినవాడు', 'అమాయక చక్రవర్తి', 'చేతకానివాడు' అంటారు.
4. అన్నింటినీ సహించి "ఊరక ఉండేవాడిని ఊరంతా ఏకమైనా ఏమీచేసుకోలేరు". అన్నట్లుగా తన పనితాను చేసుకుంటూ పోయేవాడిని. " పిరికి సన్నాసి" అంటారు.
5. ఎప్పటిపని అపుడే చేసేవాడిని 'ఆత్రగాడు' అంటారు.
6. ఇతరులను గురించి ఆలోచిస్తూ, చేతనైన సేవ, సహాయం చేస్తూ, నిజాయితీగా ఉండేవాడిని బ్రతకడం చేతకాని వాడంటారు.
7. అందరిలో ఉంటూ, అందరికీ పలుకుతూ, అందరినీ ఉపయోగించుకుంటూ బ్రతికేవాడిని 'బ్రతకనేర్చిన వాడంటారు.
8. ఎవరికీ తలవంచకుండా, ఎవరినీ అనవసరంగా విమర్శించకుండా విమర్శలకు తావివ్వకుండా, హుందాగా జీవించే వాడిని "అహంకారి అంటారు' లోకానికెవ్వరూ మూకటి ముయ్యలేరు. ఇదే లోకం తీరు.

సేవా పరాయణులు, ధర్మనిరతులు, కార్యదక్షులు, వ్యక్తిత్వం కలవారు, కార్యశూరులు విమర్శలను, ప్రశంసలను ఖాతరు చేయకుండా తమ కర్తవ్యం తాము నిర్వర్తించుకుంటూ పోవాలే తప్ప వారేమనుకుంటారో! వీరేమనుకుంటారో! అని తటపటాయించనవసరం లేదు "ముంజేతి కంకణానికి అద్దమెందుకు?"

ఏం చేస్తున్నారో, ఎలా చేస్తున్నారో, ఎందుకు చేస్తున్నారో, ఎవరికోసం చేస్తున్నారో చేసేవాళ్ళకు తెలుస్తూనే ఉంటుంది.

ఏం చేస్తున్నారో దానిని గురించే చర్చించుకుంటారు, అని ధీమాగా ఉండాలి. చేసిన పనిని మెచ్చుకుంటే అదోరకమైన తృప్తి, ప్రోత్సాహం. ఇంకా మెరుగైన సేవలందించవచ్చు నిజమే. అయితే, సమకాలీనులెవరూ నీలోని గొప్పతనాన్ని మెచ్చుకోరు,

సరికదా పైపెచ్చు, నీలోని అల్పమైన పొరపాట్లను భూతద్దంలో ఘనమైనవిగా చూపించి, దానికి మరలా చిలవలూ పలవలూ చేర్చి, ఏవేవో మాట్లాడి శాయశక్తులా చెడగొట్టి, పైశాచికానందం పొందుతూ ఉంటారు. ఇలాంటివి చెవిన పడినా చాల తేలికగా తీసుకోవాలి.

విమర్శ నిజమైతే మనస్ఫూర్తిగా ఒప్పుకొని తప్పును సవరించుకోవాలి. అసత్యమైతే నవ్వి ఊరుకోవాలి. అంతేకాని, స్పందించి ఎదురుదాడికి దిగి కాలాన్ని వృధాచేసుకోరాదు.

తులువలతో పోటీపడరాదు

ఒక ఏనుగు అడవిలో తనపాటికి తాను దొరికిన కొమ్మలను వంచుకుంటూ ఆకులను తింటూ ఉండినది. చెట్టుపై ఉండిన ఒక కోతి ఊరక ఉండలేక, ఏనుగుపైకి దూకింది. పోనిలే అని ఏనుగు ఒకసారికి ఊరకనే ఉండినది.

ఏనుగు ఊరకనే ఉందికదా అని, కోతి మాటి మాటికీ చెట్టుపైకి ఎక్కడం, ఏనుగుపైకి దూకడం చేస్తూ ఉండినది. ఇక ఏనుగు సహించలేక, తొండంతో పట్టుకోబోయింది. కోతి తప్పించుకొని చెట్టుపైకి ఎక్కింది. ఏనుగు తొండంతో చెట్టును బలంగా ఊపింది. దానితో కోతి చెట్టుపై నిలబడలేక మరొక చెట్టుపైకి పారిపోయింది. ఏనుగు కోపంతో వెంటబడి తరుముతూ ఉంది. కోతి అతి సునాయాసంగా ఒక చెట్టుపై నుండి మరొక చెట్టుపైకి పారిపోతూ ఉంది. చివరకు ఏనుగు అలసిపోయి ఒక చోట నిలబడి పోయింది. కోతి చిటారు కొమ్మమీద నుంచి చూశావా? నన్నేమీ చేసుకోలేక పోయావు? అని వెకిలి చూపులతో కిచకిచా అని అరచి ఆనందించింది.

"కయ్యానికైనా వియ్యానికైనా సమ ఉజ్జీ ఉండాలని అంటారు". ఈ తుంటరి కోతితో తలపడి ఎంత సమయాన్ని వృధాచేసుకున్నాను, అనుకుంటూ వెళ్ళింది ఏనుగు.

సమయస్ఫూర్తి

కొన్ని సందర్భాలలో మనిషి సందిగ్ధావస్థలో పడిపోతూ ఉంటాడు. పలానా పని చేయడమా? మానడమా? మాట్లాడడమా? లేక మౌనంగా ఉండడమా? ఎలా స్పందించాలి? మౌనంగా ఉంటే చేతగానివాడిగా ముద్రింపబడి అవమానానికి గురి కావలసివస్తుంది. ఒకవేళ మాట్లాడాలంటే సరి అయిన జవాబు కాకపోవచ్చు. స్పందిస్తామనుకుంటే శక్తి, యుక్తులు సరిపోక పోవచ్చు. ఇలాంటి సందర్భాలలోనే తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ, తన అహం దెబ్బతినకుండా, ఎదుటివారికి మరీమోతాదు మించకుండా, పరిస్థితి చెడిపోకుండా సమాధానం చెప్పడమో లేక దెబ్బతీయడమో చేయాలి. దానినే సమయస్ఫూర్తి అంటారు.

ఒక బ్రిటిష్ అధికారికి భారతీయులను తిట్టడం, హేళనగా తక్కువచేసి మాట్లాడ్డం, కించ పరచడం సరదాగా ఉండేది. గాంధీగారు ఈ బ్రిటిష్ అధికారి గురించి విని ఉన్నారు.

ఒకసారి గాంధీ గారికి ఆ అధికారి తటస్థపడ్డాడు. యధాప్రకారం అతను భారతీయులను కించపరస్తూ, మాట్లాడి ఆనందించాలనుకున్నాడు. వెంటనే గాంధీజీతో "మీ భారతీయులంతా అనేక రంగులలో ఉంటారు. కానీ, మా ఆంగ్లేయులు మాత్రం ఒకే రంగులో ఉంటారు" అంటూ నవ్వాడు.

అందుకు గాంధీగారు "అవునండీ మీరన్నది నిజం. "గాడిదలన్నీ ఒకే రంగులో ఉంటాయి. కానీ, గుర్రాలు అనేక రంగులలో ఉంటాయి. గాడిదల విలువ వేరు, గుర్రాల విలువ వేరు". ఇపుడు చెప్పండి ఈ రెండు జాతులలో ఏది గొప్పదో?

గాంధీగారి సమాధానం విని, ఆ అధికారి చప్పున నోరుమూసుకొని వెళ్ళిపోయాడు.

లౌక్యం

ఒక్కోసారి జీవితంలో మన ప్రమేయం ఏమాత్రమూ లేకుండానే, మన ఇష్టాలతో పని లేకుండానే ప్రతికూల వాతావరణంలో చిక్కుకునిపోయే ప్రమాదాలు సంభవిస్తుంటాయి. ఎంతటి ధీరులైనా, ఎన్ని శక్తి యుక్తులుండినా అవేమీ అక్కరకు రావు. అలాంటి సందర్భాలలో బయటపడటానికి 'లౌక్యం' అవసరం.

* అనువుగాని చోట అధికులమనరాదు.
* కొండ అద్దమందు కొంచెమై ఉండదా?.

"వితండవాదుల వద్ద మౌనమే ఆయుధం". అని పెద్దల మాట. అది తెలియని వారు కొన్ని సందర్భాలలో చిక్కుకునిపోయి బయటపడలేక "గోటితో పోయేదానికి గొడ్డలిదాకా తెచ్చుకుని" విలవిలలాడుతూ ఉంటారు. అటువంటి వారిని అమాయకులనీ, ఇంగిత జ్ఞానంలేని వారనీ, లోకం పోకడ తెలియని వారనీ అంటుంటారు.

ఆలోచనాతీరు, మాట్లాడేవిధం తెలియకపోవడం వలన, ముందు వెనుకలు ఆలోచించకపోవడంవలన 'మంచి చేయబోతే చెడు ఎదురైనట్లు', "యజ్ఞం చేయబోయి చెయ్యి కాల్చుకున్నట్లు"గా అయిపోతుంది. వంచనకు, అపాయానికి గురికాకుండా తప్పించుకోవడానికి 'లౌక్యం' అనే ఆయుధాన్ని ఉపయోగించాలి.

* హోరుగాలికి నిటారుగా నిలిచిన చెట్టు విరిగి పడుతుంది. తలవంచిన గడ్డిమొక్క తర్వాత నిటారుగా నిలుస్తుంది.

మాట్లాడవలసిన సందర్భాలలో, మాట్లాడగలిగే శక్తి ఉండి కూడా, మనమెందుకు మాట్లాడాలి? ఎవరికైనా మనమెందుకు చెడ్డకావాలి? మనకోసమే... మనం మాట్లాడం.... అటువంటిది ఎవరికోసమో ఎందుకు మాట్లాడాలి? మనకేంటి లాభం? ఎందుకైనా మంచిది మౌనంగా ఉంటే పోలా?! అని చాలామంది అనుకుంటారు. అలాగే చేస్తూ ఉంటారు. ధైర్యం, త్యాగం చూపించవలసిన సందర్భాలలో తగిన శక్తి ఉండికూడా లౌక్యంగా వ్యవహరించడం పలాయన వాదం, పిరికితనం అవుతుంది. ఒక్కో సందర్భంలో అమానుషం కూడా.

ఒక మాటతోనూ, ఒక మందలింపుతోనూ, ఒక చిన్న ప్రయత్నంతోనూ, ఒక చూపుతోనూ పరిష్కారమయ్యే సమస్యలు, సందర్భాలు ఎన్నో మన ఎదురుగానే జరుగుతూ ఉంటాయి. మనకెందుకులే అని చూచినా చూడనట్లు, వినబడినా, వినబడనట్లు, ఏమీపట్టనట్లు "తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతీ" అనే సూక్తి బాగా వంటబట్టించుకుని ఎవరిదారినవారు వెళ్ళిపోయి, పరిస్థితిని "సూదితో పోవాల్సిందాన్ని గునపందాకా వచ్చేటట్లుగా" అవకాశం కల్పిస్తుంటారు.

* కర్ర విరగనూ కూడదు, పాము చావనూ కూడదు.
* సత్యమే అయినా నొప్పించే మాట చెప్పరాదు.
* ఇరుక్కోని ఇగ్గులాడడం కాదు బైటపడి వెక్కిరించాలి.
* ఎవడిగోల వాడిది, ఎవరిబాధ వారిది, ఎవరిదారి వాళ్ళది.మధ్యలో మనకెందుకొచ్చిన గొడవ? అనుకుంటూ లౌక్యమే జీవితంగా బ్రతికేస్తుంటారు కొందరు.

జీవితంలో గెలుపే ముఖ్యమనుకొని, ఉన్నత స్థానం చేరుకోవడమే లక్ష్యమనుకుని లౌక్యమే మార్గంగా అడ్డదారులు తొక్కుతూ పైరవీలు చేస్తూ బ్రతకడం నీచాతి నీచం.

ఆత్మాభిమానాన్నీ, చైతన్యాన్ని, పోరాట పటిమనూ, ప్రతిఘటనా సామర్థ్యాన్నీ, తెగువను, త్యాగాన్నీ గాలికి వదలివేసి , హృదయం నిండా స్వార్థం, అతి తెలివి, అసూయ, అసహనం, నిర్లక్ష్యం, అసత్యంలాంటి మురికిని నింపుకొని, మంచిని చెయ్యలేక, మంచి తనాన్ని ప్రోత్సహించలేక అసూయతో, ఆత్మవంచకులుగా, నిర్వీర్యులుగా బ్రతుకులీడుస్తుంటారు కొందరు.

ఈ మధ్య సెల్‌ఫోన్‌లు వచ్చాక మాట్లాడదలచినవారు నేరుగా మాట్లాడటం లేదు. మిస్‌డ్‌కాల్స్ ఇస్తారు. సెల్‌లో డబ్బులు లేకుంటే జేబులోని డబ్బులుపెట్టి యస్.టి.డి. బూత్ నుంచి ఫోన్ చెయ్యాలి. అంతేకానీ పదేపదే మిస్‌డ్‌కాల్సివ్వడం పరిపాటి అయ్యింది. అరుదుగా, అత్యవసరంలో వాస్తవంగా సెల్‌లో మాట్లాడే వీలులేనపుడు మాత్రమే మిస్‌డ్‌కాల్ పద్ధతిని పాటించాలి. అంతేకానీ మిస్‌డ్‌కాల్సివ్వడం, ఎక్కడి నుండి మాట్లాడుతున్నారో, ఏ ప్రదేశంలో ఉన్నారో చెప్పకుండా అన్నీ అసత్యాలే చెప్పడం, ఒకవేళ ఫోన్ ఎత్తినా, మరొకరి చేతికి ఇచ్చి మీకు కావలసిన వ్యక్తి లేడనీ, వేరేవాళ్లతో మాట్లాడుతున్నాడు, తర్వాత ఫోన్ చెయ్యండి అని తప్పించుకుంటూ, దొంగచేష్టలు ఎన్నిరకాలుగా చెయ్యాలో అన్ని రకాలుగా చేస్తున్నారు. తమ తెలివి తేటలకు తామే మురిసిపోతున్నారు. ఇలా చెయ్యడం మోసంకాక మరేమిటి? టెక్నాలజీ సంస్కారం అంటే ఇదేనా? మనిషి టాలెంట్ అంటే ఇదేనా?

మంచి ఆలోచనలనూ, మంచి అభిప్రాయాలనూ, మంచి పనులనూ తప్పక ఆమోదించాలి. బలపరచాలి, ప్రోత్సహించాలి, ప్రశంసించాలి హృదయపూర్వకంగా సేవ, సహాయ, సహకారాలనందించడమే మానవత్వం.

మనిషి వ్యక్తిత్వానికి ఆత్మాభిమానం, సత్ప్రవర్తన, ఓర్పు,నేర్పు మాత్రమే శోభనిస్తాయి. మంచి వాతావరణాన్ని నిలుపుతాయి.

జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా సఫలం కావటానికి మరొక అవకాశం ఉంటుంది. కానీ లౌక్యాన్ని ఆశ్రయించి ఆత్మాభిమానాన్ని వదలుకుంటే "తలను తాకట్టు పెట్టడమే"

* ఆత్మాభిమానాన్ని లౌక్యం అనే పేరు మీద అమ్ముకుంటే తలదించుకొని బ్రతకాల్సివస్తుంది.

మౌనంగా ఉండడంకూడా లౌక్యమే

పూర్వం ఒక బాటసారి తన గుర్రంపై ఏదో పనిమీద పట్టణానికి ప్రయాణమై పోతూ, దారి మధ్యలో కాసేపు విశ్రాంతి తీసుకొని బయలుదేరదామనుకున్నాడు. గుర్రమును దిగి ఒక చెట్టుకు కట్టేశాడు.

అంతలోనే మరొక ధనికుడు గుర్రంపై అక్కడికి వచ్చాడు. మొదటి గుర్రాన్ని కట్టివేసిన చెట్టుకే తన గుర్రాన్నికూడా కట్టివేయసాగాడు. ఇంతలో మొదటి బాటసారి-అయ్యా! నా గుర్రము చెడ్డది. దాని ప్రక్కన కొత్త గుర్రం ఉండడం సహించదు. గిట్టలతో తంతుంది, కరుస్తుంది. అది దాని స్వభావం. కావున దయచేసి మీరు మీ గుర్రాన్ని ప్రక్కనున్న మరొక చెట్టుకు కట్టేయండి అని వినయంగా చెప్పుకున్నాడు. కానీ ధనికుడు అహంకారంతో బాటసారి మాటలను లెక్కచేయక నీవు నాకు చెప్పేటంత వాడివా? నా గుర్రం నాయిష్టం. నేనీ చెట్టుకే నా గుర్రాన్ని కట్టేస్తాను. నీవు, నీ గుర్రం ఏంచేస్తారో చూద్దాం, అని మొండిగా తన గుర్రాన్ని అదే చెట్టుకు కట్టేశాడు.

ధనికుడు తన వెంట తెచ్చుకున్న ఆహారాన్ని తినేటందుకు ఇలా కూర్చున్నాడో లేదో అంతలోనే ఆ రెండు గుర్రాలు పోరాడటం మొదలు పెట్టాయి. ఒకదానికొకటి భీకరంగా తన్నుకుంటూ ఉండటంచేత వాటిదగ్గరికి ఎవరూ పోవడానికి సాహసించలేక పోయారు. చివరకు ధనికుని గుర్రము బాగా గాయపడి, లేవలేని పరిస్థితికి వచ్చి, చివరికి చచ్చింది. ధనికుడికి పట్టరాని కోపం వచ్చింది. ధనికుడనన్న అహంకారంతో బీదవాడిని నాలుగుతన్ని, బలవంతంగా లాక్కొని ప్రక్క గ్రామంలో నున్న న్యాయాధికారి ఎదుట నిలబెట్టి - అయ్యా! ఈతని గుర్రం నా గుర్రాన్ని చంపింది. తమరు విచారించి దాని ధరను నాకిప్పించండి అని మనవి చేసుకున్నాడు.

అంతా విన్న న్యాయాధికారి ఆ పేదవానివైపు చూచి "ఏమయ్యా! ఇతడు చెప్పింది నిజమేనా?" అని అడిగాడు. కానీ అతడు భయపడుతూ జవాబు చెప్పకుండా మౌనంగా ఒక స్థంభంలాగా నిలబడ్డాడు. ఎన్నిమార్లు ప్రశ్నించినా మౌనంగా ఉండి పోయాడు. బీదవాడి వాలకం చూచి, న్యాయాధికారి కూడా అతడు చెవిటివాడే మో అనుకున్నాడు, పదేపదే ప్రశ్నించాడు. బీదవాడు చక్కగా, శ్రద్ధగా, వినయంగా వింటున్నాడేకానీ బదులు చెప్పకుండా అలాగే నిలుచుండిపోయాడు. అందుకు న్యాయాధికారి " ఇతడు చెవిటివాడే కాదు, మూగవాడుకూడానేమో" అన్నాడు.

అది విన్న ధనికుడు - అయ్యా! ఇతడు చక్కగా మాట్లాడగలడు. ఇదంతా వట్టి నటన అని అన్నాడు. అయితే ఇతడు నీతో ఏమైనా మాట్లాడాడా? అని న్యాయాధికారి అడగగా అవును "నాగుఱ్ఱము చెడ్డది. నీ గుఱ్ఱాన్ని వేరొక చెట్టుకు కట్టేసుకో అన్నాడు" అని ధనికుడు చెప్పాడు.

అయితే జరిగిన విషయంలో అతడి దోషం ఏమీలేదన్నమాట. అంతా నీ తప్పేనన్న మాట అని అధికారి చెప్పిన తర్వాత, అప్పుడు బీద బాటసారి నోరు తెరిచి, నిజమే ప్రభూ! నా తప్పేంలేదు అని అన్నాడు. అయితే - నీవెందుకు నోరు తెరచి ఒక్కమాట కూడా మాట్లాడకుండా మూగవాడుగా ఉండిపోయావు? అని న్యాయాధికారి ప్రశ్నించాడు.

"అయ్యా నేను పేదవాడిని, ఒక వేళ మొదటనే నేను మాటలాడినచో ధనికుడు తన దర్పంతో నేను చెప్పేదంతా అవాస్తవమని గట్టిగా వాదిస్తాడు. అందులోని వాస్తవమును గ్రహించుటకు మీకు అలవికాదని నేను ఊహించి, అలా చేశాను. "పేదవాడి కోపం పెదవికి చేటుగదా?" అని వినయంగా చెప్పాడు.

న్యాయాధికారి పేదవాని సమయస్ఫూర్తికి, లౌక్యానికి మెచ్చుకున్నాడు. "పేద సాదలపట్ల దయగలిగి ఉండాలని" ధనికుడికి గట్టిగా బుద్ధిచెప్పి, మందలించి పంపించాడు.

* బలవంతునితో తలపడి అన్యాయాన్ని ఎదుర్కోలేని దురదృష్టకరమైన సందర్భాలలో తాత్కాలికంగా బలహీనుడుపయోగించే ఆలోచనపరమైన ఆయుధమే లౌక్యం.

వీరిని ఎలాంటివారనాలి?

మా వూరిలో ప్రతి బుధవారం సంత జరుగుతుంది. దగ్గర్లోని ఒక పల్లెనుండి ఒకావిడ బజారులోపని, బ్యాంకులోపనీ చూచుకోవచ్చునని సంతరోజు వచ్చింది. బ్యాంక్‌లో నగలు తాకట్టుపెట్టి కొంత సొమ్మును తీసుకోవాలనుకున్నది. కానీ ఆరోజు నగలను పరీక్షించే ఆచారి బ్యాంకుకి రానందున, ఆవిడ పని జరగలేదు. అందుకని బజారులో పని చూచుకుని వెళ్లాలనుకున్నది.

బ్యాంకు నుండి రావడం గమనించిన ఒక దొంగ ఆమెను వెంబడిస్తూవచ్చి, సంతలోకి రాగానే ఆమెచేతిలోని సంచిని లాక్కొని పరిగెత్తాడు. వెంటనే ఆవిడ దొంగ... పట్టుకోండి! అని అరుస్తూ వెంటపడింది. అరుపులు విన్నవారంతా ఆ దృశ్యాన్ని చూచి పగలబడి నవ్వనివారుంటే... ఒట్టు. కారణం ఆవిడది భారీ శరీరం. దొంగ వారివైపే పరిగెడుతున్నా పట్టుకునే ప్రయత్నం చేయకుండా నవ్వుతున్న వారివైపు చూచి ఆమె-ఆక్రోషంగా "ఏమయ్యా! మీరు మగాళ్లేనా? అంత చేవ చచ్చిపోయిందా? ఆడదాన్ని నేనే పరిగెడుతుంటే మగాళ్లై ఉండీ, కనీసం ఇంగితజ్ఞానమైనా లేకుండా, దొంగను పట్టుకునే ప్రయత్నం చేయకుండా, నావైపు చూచి నవ్వుతారా? అసలు మీరు మనుషులా?,

రాక్షసులా? అని ఏడుస్తున్న ఆవిడను చూచి ఒకడు "ఎందుకు తల్లీ అంతగా ఒళ్ళుపెంచావు? అని పళ్ళికిలిస్తూ అన్న డైలాగుకు మరొకసారి అక్కడున్న వారంతా పగలబడి నవ్వారు.

కొన్ని వందలమంది ఉన్న ఆ సంతలో దొంగ వెంటబడే దమ్ము, ధైర్యం, తెగువ ఒక్కడిలోనూ లేవా? ఒక వేళ ఉండినా మనకెందుకొచ్చిన గొడవ? అనే నిర్లక్ష్యమా? అలాంటి పరిస్థితిలోనూ ఆమెవైపు చూచి, నవ్వడాన్ని ఏమంటారు? పైశాచికానందమా? "ఎందుకు తల్లీ శరీరాన్ని అంతలా పెంచేశావు? అని దెప్పిపొడవడాన్ని ఏమనాలి?

ఆత్మాభిమానం అంటే?

పదిమందికీ ఉపయోగపడే పనిచేయడంలో, ఎదురయ్యే అవరోధాలకు లోను కాకుండా, రాజీపడకుండా, ప్రలోభాలకు లోనుకాకుండా విలువలతో కూడిన జీవితాన్ని గడపడం. తొందరపడి అడ్డదారులలో ప్రయోజనాన్ని ఆశించకపోవడం. పైరవీలు చెయ్యకపోవడం. చెంచాగిరి చెయ్యకపోవడం, గొప్పలు చెప్పుకోక పోవడం, తన పని తాను చేసుకుంటూ పోవడం. తను నమ్మిన సిద్ధాంతాలను, భావాలను వ్యతిరేకించే వారికి లొంగకపోవడం, అవిశ్రాంతంగా పోరాడటం ఆత్మాభిమానుల లక్షణం.

ఆత్మ అనేది అందరిలోనూ ఉండే ఒక శక్తి. అది నిరంతరమూ మంచిని మాత్రమే ప్రబోధిస్తూ ఉంటుంది. దానిని అభిమానిస్తూ, గౌరవిస్తూ, అది వినిపించిన సందేశం ప్రకారం నడచుకోవడమే 'ఆత్మాభిమానం'. శరీరంలో శిరస్సు ప్రధానమైనది. జ్ఞానేంద్రియాలన్నీ శిరస్సులోనే ఉన్నాయి. అందుకే శిరస్సు వంచితే పూర్తిగా లొంగిపోయినట్లే అని అంటారు.

* తలదించుకుంటే చూపు నేలను తాకి ఆగిపోతుంది. తలెత్తుకుంటే చూపు అంతరిక్షం వరకూ పోతుంది.

తర్కం అంటే?

శిష్యులు గురువును అపుడపుడూ అడుగుతూ ఉండేవారు-గురువుగారూ "తర్కం" అంటే ఏమిటని?

ఒక నాడు శిష్యులతోపాటు గురువుగారు భోజనం చేస్తూ ఉన్నారు. భోజనం చెయ్యడం ఇక ముగుస్తుందనగా, గురువుగారు ఉన్నట్లుండి శిష్యులారా! గచ్చకాయంత విషం భోజనంలో కనిపించింది. ఏదోలే అని పరధ్యానంగా తినేశాను" అని చెప్పి తనకలాడుతూ ఉన్నాడు. ఆమాట విన్న వెంటనే శిష్యులందరూ భోజనం వదిలివేసి గురువునెత్తుకొని ప్రక్కన పడుకోబెట్టి సపర్యలు ఎవరికి తోచిన విధంగా వారు చెయ్యసాగారు.

ఒక శిష్యుడు మాత్రం ఏమీ ఎరగనట్లు తాపీగా భోజనం చేస్తూ ఉన్నాడు. అది చూచి మిగిలినవారంతా ఆశిష్యుణ్ణి చెడామడా తిడుతున్నారు. అయినా ఆవేవి పట్టించుకోకుండా గురువుగారిని ప్రక్కన పడుకోబెట్టారు కదా, ఆయనకు వచ్చిన కష్టమేమిలేదు. మీరుకూడా ఆందోళన పడకుండా వచ్చి కూర్చొని ముందు భోజనం చెయ్యండి. తరువాత చూద్దాం! అన్నాడు. అయినా వినకుండా తిట్ల పారాయణం కొనసాగిస్తూనే ఉన్నారు. ఇంతలో గురువుగారు లేచి కూర్చొని, శిష్యులారా నాకేమి కాలేదు. మీరంతా ఇటువచ్చి కూర్చోండి అన్నాడు.

నేను గచ్చక్కాయంత విషం తిన్నాను అనగానే అందరూ భోజనం తినడం మానేసి, ఆత్రుతతో, ఆందోళనతో వచ్చి సపర్యలు చేస్తుంటే, నీవు మాత్రమే ఎలా భోజనం చేయ్యగలిగావ్? చెప్పు అని ప్రశ్నించాడు గురువు. శిష్యుడిలా సమాధానం చెప్పాడు " మీరు మా గురువులు. మీ ప్రజ్ఞ మీద నాకు చక్కని గురుత్వం ఉంది. గచ్చక్కాయంత విషం తిన్నాను అని అన్నారు మీరు. అంటే గచ్చక్కాయంత విషం భోజనంలో ఉన్నదని తెలిసీ తినుటకు మీరేమైనా వెర్రివారా? అందుకే ఇది నటన అని నాకు తెలసి, ఆ కారణంగా అన్నాన్ని వదలి వెళ్లడం మంచిది కాదని నిబ్బరంగా భోంచేశాను.

అపుడు గురువుగారు మిగిలిన శిష్యులతో చెప్పాడు. " తర్కం" అంటే అదీ అని. ఏది? ఎప్పుడు? ఎందుకు? ఎలా? ఎవరు? ఎక్కడ? అనే ప్రశ్నలు వేసుకుంటే ఎవరికైనా వాస్తవమేదో, అవాస్తవమేదో? తెలిసిపోతుంది. ప్రశ్నించడం అనుమానించడం, తర్కానికి పునాది.

ఒక బ్రాహ్మణ ఇల్లాలు నువ్వులు నానబెట్టి కడిగి, దంచి, చక్కగా చెరిగి, ఎండలో ఆరబోసింది. వీధిలోనుండి ఒక కోడి వచ్చి, నువ్వులను తిని, కాళ్లతో తొక్కింది. భర్త చూచి ఈ నువ్వులు అంటుపడినవి వంటకు పనికిరావు అన్నాడు. నువ్వులను పారబోయుటకు మనసొప్పక ప్రక్కింటామె వద్దకు వెళ్లి, నువ్వుల పప్పు తీసుకొని నువ్వులిస్తావా? అవసరముందని అడిగింది. ప్రక్కింటామె సంతోషంతో చేటలో నువ్వులు తీసుకొని వచ్చి మాటలాడుతుండగా, ఆమె భర్త వచ్చి, ఏంటి బేరమాడుతున్నావు? అనగా.... నువ్వుల పప్పు తీసుకొని, నువ్వులిస్తున్నానని చెప్పింది. బ్రాహ్మణుడు భార్యను లోనికి పిలిచి, ఓసి వెర్రిదానా! ఎవరైనా పప్పు ఇచ్చి, దంచని నువ్వులు తీసుకుంటారటే? ఆలోచించాల్సిన పనిలేదా? కావాలంటే బదులివ్వుగానీ, పప్పు తీసుకోవద్దు అని చెప్పాడు.

* ఏ కారణమూ లేకుండా తెలిసి, తెలిసి, నష్టానికి ఏ పనీ చెయ్యరు.
* అనాలోచితంగాగానీ, ఆశతోగానీ, త్వరపడి ఏపనైనా చేస్తే, ఆ పని ఎందుకు చేశామని బాధపడవలసి వస్తుంది.

దృఢసంకల్పం బలహీనతలను జయిస్తుంది.

మనిషి జీవితం ఆటు-పోట్లకు లోనౌతూ, సాగిపోతూ ఉంటుంది. మానవ సంబంధాలతో కలిగే మానావమానాల కారణంగా మనిషి బలహీనతలకు లోనౌతూ ఉంటాడు.

బలహీనతలు బలపడి శృతిమించితే దుర్వ్యసనాలకు దారితీస్తాయి. దీనికి ఆడ-మగ అని కానీ, పెద్ద-చిన్న అని కానీ, ఎవరూ అతీతులుకారు.

కొన్ని దురలవాట్లు, వ్యసనాలు వ్యక్తిగత కారణాలవల్ల, బాధలవల్ల, స్నేహాల వల్ల ఏర్పడతాయి. "మంచి-అలవాట్లు కానీ, చెడు అలవాట్లు కానీ పుట్టుకతో వచ్చి, స్నేహితుల ప్రభావంతో పెరుగుతాయి." ధూమపానం, మద్యపానం, జూదం, వ్యభిచారం, దొంగతనం ఇవి స్నేహ వాతావరణంలో పుష్కలంగా ఎదిగి, మనిషి మదిలో పదిలంగా నాటుకొనిపోతాయి. వాటి ప్రభావం నుండి బైట పడగలగడమే వివేకం.

ప్రతి వారి జీవితంలో పడటం-లేవటం, గౌరవింపబడడం, నిందింపబడడం లాంటి సంఘటనలు సహజం: ఆనందంలో పొంగిపోకు, ఆవేదనలో కృంగిపోకు అనేది అందుకే. కష్టాలు-సుఖాలు చీకటి-వెలుగుల్లాగా ఒకదాని వెనుక మరొకటి వస్తూ పోతూ ఉంటాయి. ఏదీ ఎల్లకాలము ఉండదు. ఈ రోజు సమస్య యొక్క తీవ్రత రేపటికి ఉండదు, మరునాటికి మరికొంత, అలా కొద్దిరోజులకు అసలు సమస్యనే మరిచిపోతాము.

"మంచి అలవాట్లు సామాన్యంగా రావు! దురలవాట్లు వస్తే పోవు". అన్నట్లుగా దురలవాట్లకు-వ్యసనాలకు ఉన్నబలం అటువంటిది. ప్రతివారిలోనూ మంచి-చెడులను, లాభనష్టాలను బేరీజు వేసుకునే శక్తి ఉంటుంది. మరి ఈ విచక్షణాశక్తి, విశ్లేషణా శక్తి ఉండి కూడా మంచి మార్గాన్ని ఎన్నుకొని, మంచి అలవాట్లతో ఎందుకు జీవించలేకపోతున్నారు? మోడువారిన జీవితంలో వసంతమనే మంచిమార్పును ఎందుకు తీసుకొని రాలేక పోతున్నారు?, దీనికి ఎవరు బాధ్యులు? ఎవరివల్లసాధ్యం?, ఏదైనా మంత్రంకానీ తంత్రంకానీ ఉందా? అన్నింటికీ సమాధానం ఉంది-నీవే బాధ్యుడివి! నీవల్లే సాధ్యమౌతుంది! నీలోని శ్రద్ధే మంత్రం! నీలోని కార్యశూరత్వమే తంత్రం.

* పడిలేచిన దానినే కెరటం అంటారు. కష్టసుఖాలననుభవించిన దానినే జీవితమంటారు.

ప్రతి ఒక్కరిలోనూ ఆత్మశక్తి అనేది సూక్ష్మరూపంలో ఉంటుంది. అదే ఏమిటంటే

మాట అంటే పడని తత్వం
చిన్నచూపు చూస్తే తట్టుకోలేని తత్వం
నిర్లక్ష్యం చేస్తేసహించని తత్వం
నీవు పనికిరావు అంటే ఒప్పుకోలేని తత్వం
మర్యాద-మన్నన గుర్తింపులేని చోటికి వెళ్లుటకు మనస్కరించకపోవడం.

అసూయతో మనసును క్రుంగదీసే విమర్శలు చేస్తే (దీనినే అహం మీద దెబ్బతీయడం, మానసిక హింస అంటారు). సహించలేక పోవడం.

ఈ లక్షణాలు అన్నీకానీ, కొన్నికానీ ప్రతి మనిషిలోనూ ఉంటాయి. ఇవన్నీ "అహంశక్తి" యొక్క సూక్ష్మ రూపాలే. అహం ఎక్కువైతే కారం లాగా భరించ లేనిదవుతుంది. అహంకారాన్ని ఎవరూ దరిచేరనివ్వరాదు. కానీ అహం శక్తిని మాత్రం విడువకూడదు. సాహసవంతులకు అహంశక్తి అధికంగా ఉంటుంది. దానినే "విల్‌పవర్" అనికూడా అంటారు. విల్‌పవర్‌తో దేనినైనా సాధించవచ్చు. దానికి కొంత శ్రద్ధ, పట్టుదల అవసరం.

విల్ పవర్

ఒక బాలుడు చదువుకునేటందుకు ఒక గురువుగారి వద్ద చేరాడు. అతడు మంద బుద్ధి వాడవడంతో విషయాలేవీ అర్థమయ్యేవి కావు. విసిగి పోయిన గురువు, బాలుడిని పిలిచి ప్రేమగా "నాయనా! నీకు చదువు అబ్బదు, ఇంటికి వెళ్ళి ఏదైనా చేతనైన పని చేసుకుంటూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండు" అని సలహా ఇచ్చి పంపాడు.

బాలుడు ఇక చేసేది లేక ఇంటి దారి పట్టాడు. దారిలో దాహమై ఒక నూతి దగ్గరికెళ్ళి దాహం తీర్చుకొని, బావి ప్రక్కనే ఉన్న చెట్టు క్రింద విశ్రమించి ఇలా ఆలోచించాడు. "ఏమిటీ నా గతి ఇలా అయిందే! చదువుకు పనికిరానని ఇల్లు చేరితే, తల్లిదండ్రులెంత బాధపడతారు. స్నేహితులుకూడా ఎగతాళి చేస్తారు కదా? అని లోలోన బాధపడుతూ, బిందెలు, కడవలు పెట్టిన రాయిమీద గుంతలు పడి ఉండటం గమనించాడు. అప్పుడు ఆ బాలుడు కఠినమైన రాళ్లే అరిగిపోగాలేనిది. నా మెదడుపై చదువు ముద్ర పడదా? నా బుర్ర అంతకంటే తీసిపోయిందా? లేదు. అలా అయ్యేదానికి వీల్లేదు అని, తనకు తానే ప్రశ్నించుకుని, తర్కించుకొని, విశ్లేషించుకొని దృఢచిత్తంతో వెనుదిరిగి గురువుగారి దగ్గరికెళ్ళి తాను చూచినది, తాను ఆలోచించిన విధము, తీసుకున్న నిర్ణయమును గురించి విశదీకరించాడు.

గురువుగారు ఆనందాశ్చర్యాలకులోనై అక్కున చేర్చుకున్నాడు. పట్టుదలతో నిరంతర సాధనతో విద్యాభ్యాసం చేసి, మహాపండితుడైనాడు. తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తెచ్చాడు. కావున ప్రతివ్యక్తీ వివేకం, విశ్లేషణ, తార్కిక జ్ఞానంతో బలహీనతలను బలంగా త్రొక్కిపట్టి, చైతన్యవంతుడై అభివృద్ధి చెందాలి, ఆదర్శ ప్రాయుడు కావాలి.

* వైఫల్యాలనే విజయాలకు సోపానాలుగా మార్చుకోవాలి. ఏదైనా సాధించాలంటే ఒడిదుడుకులను అధిగమించవలసిందే.

ఆశలేకాదు అర్హతలూ ఉండాలి

ఒక గురువు తన శిష్యులందరిలోకి ఒకడికి మాత్రమే ముఖ్యమైన పనులను పురమాయించేవాడు. అందుకని ఆ శిష్యుడంటే అందరికి అసూయ. వారికి గురువుగారిమీద కూడా కాస్తంత అలక. అందరమూ శిష్యులమే కదా? ప్రత్యేకించి ఆ ఒక్క శిష్యుడిమీదే అంత విశ్వాసమెందుకు? అని మిగతా శిష్యులంతా వీలుదొరికినపుడల్లా తమ అక్కసును వెళ్ళగక్కుతూఉండేవారు. ఒక్కో సారి ఆ శిష్యుడి మీద లేనిపోని పితూరీలు కూడా చెపుతూ ఉండేవారు.

ఒకరోజు విశ్రాంతి సమయంలో శిష్యులందరూ గుస గుస లాడుకొని, ఒక నిర్ణయానికి వచ్చారు. సందర్భం చూసుకొని గురువుగారిని ఇలా అడిగారు."గురువుగారూ! మీరు ప్రత్యేకించి ఆ ఒక్క శిష్యుడిమీదే ఎందుకు అభిమానం? మేమంటే ఎందుకు అంత చులకన? అందరినీ సమానంగా చూడాలికదా? అని. అందుకు గురువుగారు

"రాబోవు గురుపౌర్ణమికి ఆశ్రమమంతా అలంకరించాలి. కాబట్టి మీరందరూ ఎవరి కుటీరాన్ని వారు పది నిమిషాలలో శుభ్రపరచి నావద్దకు రండి. తరువాత మీ ప్రశ్నకు సమాధానం చెబుతాను" అని చెప్పాడు.

కాసేపటికి పని పూర్తిచేసి శిష్యులంతా వచ్చి గురువుగారి ఎదురుగా నిలబడ్డారు. గురువుగారు శిష్యులనుద్ధేశించి ఎన్ని నిమిషాలు పట్టింది కుటీరాన్ని శుభ్ర పరిచేదానికి మీకు? అని అందరినీ ప్రశ్నించాడు. అందరూ మాకు ఇరవై నిమిషాలు పట్టింది అని అన్నారు. ఒక్కడు తప్ప. అప్పుడు గురువుగారు మిగిలిన వారినుద్ధేశించి మీకు మాత్రమే ఇరవై నిమిషాలు పట్టింది. ఆలస్యమయినదానికి కారణం ఏమి? కుటీరాన్ని ఎలా శుభ్రపరిచారో తెలపండి అని ప్రశ్నించాడు గురువుగారు.

అందరూ ఇలా సమాధానం చెప్పారు. కుటీరాన్ని త్వరగా శుభ్రపరిచి మీ ప్రశంసలందుకోవాలన్న తొందరలో కుటీరంలోకి ప్రవేశించగానే చీపురుతో మొదట నేలనంతా శుభ్రపరిచాము. తర్వాత పరిశీలిస్తే గోడలు, పై కప్పుకు బూజు,దుమ్ము ఉండినది. అందుకని పైకప్పు, గోడలు శుభ్రపరిచాము. మరలా నేలంతా దుమ్ముతో నిండిపోయింది కాబట్టి మరొక మారు నేలనంతా శుభ్రపరిచాము.

చెప్పిన సమయానికి వచ్చిన శిష్యుడిని నీవెలా వారికంటే ముందుగా రాగలిగావు? పని ఏమైనా మిగిల్చి వచ్చావా ఏమి? అని ప్రశ్నించాడు గురువు. ఆ శిష్యుడు లేదండీ గురువుగారూ! ఏమాత్రం కొరవ లేకుండా కుటీరాన్నంతటినీ దుమ్ములేకుండా తుడిచి, నీళ్ళతో కడిగి, శుభ్రపరచి మరీ వచ్చాను. వీలైతే పరిశీలించగలరు అన్నాడు. అందుకు గురువుగారు నిర్ణీత సమయానికే ఇన్ని పనులెలా సాధ్యమైనాయి? అని ప్రశ్నించాడు. సమాధానంగా శిష్యుడు ఏ పనినైనా ఏది ముందు? ఏది తర్వాత? ఎలా చేస్తే సజావుగా, శుభ్రంగా, సకాలంలో పూర్తవుతుంది? అని ఆలోచించి, నిదానంగా, క్రమశిక్షణగా, ఒక ప్రణాళిక ప్రకారంచేస్తే సాధ్యమవుతుంది గురువుగారూ.... అని వినయంగా చెప్పాడు.

గురువుగారు అందరి వైపు చూచి మీకూ, అతడికీ ఉన్న వ్యత్యాసం అది. ఎవరైనా గౌరవింపబడాలంటే అందుకు అర్హతలను సంపాదించుకోవాలి. తెలిసిందా? మీరందరూ నాకు ప్రియమైనవారే, కానీ కొన్ని పనులు ఆలస్యం లేకుండా, సక్రమంగా, సకాలంలో కావాలి కాబట్టి అతనికి చెబుతూ ఉంటాను అన్నాడు.

ఆశలేకాదు అర్హతలూ ఉండాలి మరి. అసూయలుకాదు ఉండవలసింది. ఆలోచనలూ, ఆచరణలూ. మీరు కూడా అలాంటి యోగ్యతలను సంపాదించుకుంటారు కదూ? అన్నారు గురువుగారు అలాగేనండీ అని ఎవరి పనులలో వారు నిమగ్నమైపోయారు శిష్యులు.

* "పెద్దవెలుగునిచ్చే సూర్య-చంద్రులను కూడా చిన్న కంతలలోనుంచి చూడవచ్చు. అలాగే చిన్న పనులను చేసే విధమును బట్టి మనిషి యొక్క స్వభావాన్ని తెలుసుకోవచ్చు.

గౌరవంగా జీవించడమెలా?

* గౌరవం అనేది ఇతరులు మీ గురించి అనుకునేది. శీలం, CHARACTER అనేది మీరేమిటో, ఎలాంటివారో తెలియజేసేది.
* సమాజంలో ఎంతోమంది గౌరవంగా జీవిస్తూ ఉంటారు. చాలామంది ఏ మాత్రం గౌరవం లేకుండా బ్రతికేస్తూ ఉంటారు.

గౌరవంగా జీవించాలని ప్రతిఒక్కరూ అనుకుంటూ ఉంటారు, అంటూ ఉంటారు. అయితే గౌరవంగా జీవించడం ఎలా? మరి మనిషికి గౌరవం తెచ్చి పెట్టేవి ఏవి? వస్త్రం, వర్చస్సు, వాక్కు, వ్యక్తిత్వం, విద్య, ఓరిమి, వాతావరణం, వినయం, వర్తనం, మౌనం లాంటివే కాకుండా పుస్తక పఠనం, పొదుపును పాటించడం లాంటి మంచి అలవాట్లు కూడా మనుషుల విలువను పెంచుతాయి.

వస్త్రం :- చూస్తూనే కొట్టొచ్చినట్లు కనపడేది వస్త్రధారణే. మనిషి యొక్క వ్యక్తిత్వాన్ని బహిర్గతం చేసే మొట్టమొదటి అంశం ఇదే.

కొందరిని చూస్తే చెయ్యెత్తి నమస్కరించాలనీ, ఎదురుపడితే ప్రక్కకు తొలగాలనీ, లేచి నిలబడాలనీ, ముందుగా వారిని కూర్చోనివ్వాలనీ, పలుకరించి సాదరంగా ఆహ్వానించాలనీ, ఇలా ఎన్నో భావాలు కలుగుతాయి. సంఘజీవి అయిన మనిషికి సమాజంలో వస్త్రధారణ అతి ముఖ్యమైనది. మాన సంరక్షణ, వాతావరణ బాధల నుండి రక్షణకు ఉద్దేశింపబడినదే అయినా ధరించిన వస్త్రాలు మనిషి రూపానికి చక్కగా అతికి, ఆకర్షణీయంగా, శుభ్రంగా ఉండటం వలన హుందాతనం వస్తుంది. ఇతరులచేత గౌరవించబడేటట్లుగా దోహదపడుతుంది. ఎంతటి ధనికుడైనా, విద్వత్తు కలవాడైనా కనీస గౌరవ మర్యాదలు పొందాలంటే తగిన దుస్తులు ధరించడం తప్పనిసరి.

బాల్యమిత్రుడైన శ్రీ కృష్ణుని దర్శనార్థం కుచేలుడు వెళితే జీర్ణ వస్త్రాధారి అయినందున ద్వారపాలకులు అతడిని లోనికి వెళ్ళనివ్వలేదు. శ్రీకృష్ణుడు తన బాల్య మిత్రుడే అని ఎంత మొరపెట్టుకున్నా ద్వారపాలకులు వినలేదు. చివరకు శ్రీకృష్ణుడే వచ్చి ద్వారపాలకులను వారించి, లోనికి పిలుచుకొనిపోవలసివచ్చింది. ఇలాంటి సన్నివేశాలు చాలామందికి అనుభవమే.

కాబట్టి ప్రతి ఒక్కరూ తమ తాహతుకు తగిన విధంగా, ఉన్నంతలో శుభ్రమైనవి, శరీరానికి తగ్గట్టు అందమైన వస్త్రాలను ధరించాలి. అంతే కాకుండా మన వృత్తికీ, ప్రవృత్తికీ తగిన విధంగా, కుటుంబ గౌరవానికీ, సంప్రదాయానికీ, తగినవిధంగా సమయా సందర్భాలకు సరిపోవునట్లుగా ఉండడం ఉత్తమం. డాంబిక వస్త్రధారణ, బడాయి ప్రదర్శన లేకుండా చూచుకోవడం, వాతావరణానుకూలంగా ఉండేట్లు చూచుకోవడంకూడా ముఖ్యమే.

వర్చస్సు: శరీర కాంతి వర్చస్సు అంటే నలుపు, తెలుపు, ఎరుపు, చామన చాయ రంగుకాదు. ఎలాంటి రంగు కలవారైనా శారీరిక సౌందర్యం అనేది ముఖ తేజస్సులోనే కనిపిస్తుంది. దీనికి చక్కని ఆరోగ్యం, అంగ సౌష్టవం, పరిశుభ్రత కొంతవరకు దోహదపడుతుంది. ఏదో ఒకరంగుతో అందరికీ అవే అవయవాలుంటాయి. కానీ, ముఖవర్చస్సు కళ్ళలో ప్రస్ఫుటంగా ప్రత్యేకంగా కనిపిస్తుంది.

* "కొందరిని చూస్తే మొట్ట బుద్ధవుతుందనీ, కొందరిని చూస్తే పెట్ట బుద్ధవుతుందనీ" అనడానికి కారణం ఈ ముఖ వర్చస్సే.
* ఏడుస్తున్నావ్ ఎందుకురా అబ్బాయ్? అంటే.
  - నేనెప్పుడైనా నవ్వి చచ్చింది చూచావా బాబాయ్? అన్నాడట ఏడుస్తూ!
* మొగం తీరే అంతనా? లేక మొగుడు కొట్టాడనా?!

"ముఖాన వడ్లగింజ వేస్తే పేలగింజై పడుతుంది" అన్నట్లుగా కొంతమంది కోపంగా ఏదో పోగొట్టుకున్న వారిలాగా, లోకంలో ఉన్న కష్టాలన్నీ వారి నెత్తిమీదే ఉన్నట్లుగా, బాధగా, దిగులుగా ఉంటారు. సంతోషంగా, శుభ్రంగా, ఆరోగ్యంగా ఉండేదానికి అవకాశాలు ఎక్కువే అయినా, ఆ దిశలో ఆలోచించకుండా అసహనం, ఈర్ష్య, అసూయ, కోపం, బద్ధకం లాంటి వ్యతిరేక భావాలతో సతమతమవుతూ ఉంటారు. "నవ్వు నాలుగందాలచేటు" అని ఎవరు, ఎందుకన్నారోగానీ, మనుషులు నవ్వడమే మానుకొన్నారు. అదేంటో మరచి పోయారన్నట్లుగా ఇప్పుడు "లాఫింగ్ క్లబ్బులు" ఏర్పాటు చేసుకుని అదేపనిగా నవ్వడం అలవాటు చేసుకొంటున్నారు. నవ్వు నలభై విధాల మంచిదని తెలుసుకున్నారు.

పుడమి తల్లికి చెట్టందం
చెట్టుకు పువ్వులందం
పువ్వులు ప్రకృతి నవ్వులు
నవ్వులే మనిషికి సిరిమువ్వలు

"ముఖం మనోభావ దర్పణం" మనస్సులో దిగులు, బాధ, కోపం, ఈర్ష్య, అసూయ, సంతోషం, ఉత్సాహం, శాంతం, ఇలా ఏభావమున్నా ఎదుటివారు ఇట్టే పసిగట్టేస్తారు. "మూడ్" బాగలేనివారి దగ్గరికి ఎవరూరారు. ఆనందంగా, ప్రసన్నంగా, చిరునవ్వుతో ఉన్నవారి ముఖం చూస్తే స్నేహం చెయ్యాలనీ, ఆత్మీయతలను పంచుకోవాలనీ చూస్తారు.

కళ్ళలో జాలి, దయ, కరుణ, హృదయంలో సేవ, స్నేహం, సహకార భావం పెదవులపై చిరునవ్వు ఉంటే ఎవరి ముఖమైనా వర్చస్సుతో వెలిగిపోతుంది.

హాస్యం గౌరవించ దగ్గ అంశం

తేనె స్వయంగా ఒక బలవర్ధక ఔషధం. దానిని మరే ఔషధంలో అయినా అనుపానంగా కూడా ఉపయోగించవచ్చు. అలాగే హాస్యం కూడా మనో నిర్మలానికి బలవర్ధకమైన ఒక టానిక్. తేనెలాగానే హాస్యరసాన్ని సందర్భానుసారం జీవితంలోని ప్రతి ఘట్టంలోనూ, దాదాపు అన్ని సన్నివేశాలలోనూ మిళితం చేయవచ్చు.

జీవితం నవరసాల సమాహారం. అన్ని రంగాలలో వేగం పెరిగిన నేపథ్యంలో ఇపుడు అందరి జీవితాలలో స్వార్థం, ఆరాటం, ఆందోళన, ఉద్రిక్తత పెరిగి మనసు విపరీతమైన ఒత్తిడికిలోనై జీవితం అతి భారమైపోయింది. ఇలాంటి పరిస్థితులలో హాస్యం అనే టానిక్ మానసిక వత్తిడిని తగ్గించి, ఉపశమనాన్ని కలిగించి, ఢీలాపడిన మనసును మరలా సమరోత్సాహంతో పరుగులు తీయిస్తుంది.

హాస్యవిషయంగా చాలామందికి అపోహలున్నాయి. అన్నీ ఉన్నవాళ్ళకే హాస్యం గానీ, ఒకటుంటే ఒకటిలేని దరిద్రులకూ, రోగాలతో, బాధలతో సతమతమయ్యేవారికి హాస్యం హాస్యాస్పదం అని యమ సీరియస్‌గా ఉంటారు. జీవితాలలో హాస్యాన్ని ఆహ్వానించే అవకాశం, తీరిక ఎక్కడిదీ? అనేవారుకూడా లేకపోలేదు.

* హాస్యానికి పండితుడూ-పామరుడూ, ధనిక-పేద, పెద్ద-చిన్న, ఆడ-మగ అనే తేడాలు లేవు.
* హాస్యానికి ఫలితం హాయిగా నవ్వడం. నవ్వు మోముపై వికసించే ఒక అందమైన పువ్వు. ఎవరి మోముపై నవ్వుల పువ్వులు విరబూయునో వారి జన్మ ధన్యమే కదా?!
* హాస్యాన్ని ఆస్వాదించడం కూడా ఒక కళే.
* నవ్వడం భోగం, నవ్వకపోవడం రోగం, నవ్వించడం యోగం.
* ఎదుటివారి మనసు గాయపడనంతవరకూ వాతావరణం వికటించనంతవరకూ హాస్యం ఒక బలవర్ధక లేహ్యామే.
* నవ్వుతూ, నవ్విస్తూ జీవించడమే ఆనందమయమైన జీవితం.
* నవ్వినా, ఏడ్చినా కన్నీళ్లు వస్తాయి. దుఃఖంలో వచ్చే కన్నీళ్ళకంటే, నవ్వించడం ద్వారా కన్నీళ్ళు తెప్పించడమే కష్టసాధ్యమైన పని.
* నగమోము భగవంతుడిచ్చిన వరం.
* మనసారా నిండు హృదయంతో నవ్వగలిగితే మనోమాలిన్యం లేనట్లే.
* మనోమాలిన్యాన్ని కడిగివేసేటందుకు కన్నీటికి మించినదిలేదు. అది హాస్యంతో కావచ్చు. దుఃఖంతో కావచ్చు.

వాక్కు : మాట్లాడే తీరు తెలియకపోతే నాలుగు విధాలైన దోషాలు జరుగుతాయి. 1. కఠినంగా మాట్లాడటం, 2. అసత్యం చెప్పడం, 3. చాడీలు చెప్పడం, పుకార్లను, వదంతులను పుట్టించడం, 4.అనవసరంగా అధిక ప్రసంగం చెయ్యడం.

ఎదుటివారు మనల్ని ఎలా సంబోధిస్తే సంతోషిస్తామో, ఏవిధంగా మాట్లాడితే సంతోషిస్తామో, మనమూ అలాగే మాట్లాడితే చాలు గౌరవం దానంతటదే వస్తుంది. "అందుకే నోరు మంచిదైతే ఊరు మంచిది." అన్నారు.

పరిస్థితులు చక్కబడాలన్నా, బంధాలు, అనుబంధాలు, స్నేహాలు కలగాలన్నా మాటతీరే ముఖ్యం. సంభాషణ మృదువుగా ఉండాలి.

కలిమి, చెలిమి, బలిమి, ప్రియ భాషణంతోనే సాధ్యం."పెద్దలమాట చద్దన్నం మూట".

నాలుక వల్ల సంపదలు కలుగుతాయి. బంధు, మిత్రాదులు దగ్గరౌతారు. నాలుక వల్లే కష్టాలూ, తిప్పలూ ఒక్కోసారి మరణం కూడా సంభవిస్తుందని నీతి శాస్త్రం చెబుతుంది.

నాలుక వల్ల సంపదలు, ఆపదలు సంభవిస్తాయి

హస్తసాముద్రికంలో ఉద్దండుడైన ప్రభాకరశాస్త్రి అనే పండితుండేవాడు. మంచి హస్తసాముద్రికా ప్రవీణుడే అయినా, అతనిమాట చాలా పరుషంగా ఉండేది.

అతని ప్రశస్తిని విన్న ఆ దేశపు మహారాజు ఆ పండితుడిని పిలిపించి, చేయిచూసి చెప్పమన్నాడు. హస్తం చూచి ఎన్నో విషయాలు చెప్పిన పిమ్మట "రాజా! మీ బంధువర్గం అంతా మీకంటే ముందే మరణిస్తుంది. అని చెప్పాడు".

రాజు కోపోద్రిక్తుడై పండితుడికి ఒక మాసం కారాగార శిక్షను విధించాడు. వెంటనే పండితుని శిష్యుడు సమయస్ఫూర్తిగా రాజు అనుమతితో రాజుగారి హస్తరేఖలను మరలా బాగా పరీక్షించి "మహాప్రభూ! మీ సమస్త బంధుగణములలోని వారందరి కంటే మీరే దీర్ఘాయుష్కులు" అని వినయంగా వివరించాడు. రాజు సంతోషించాడు. సంభావనలనెన్నింటినో ఇచ్చి గౌరవించాడు. అన్నీ అయిన తర్వాత మహాప్రభువులు "పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం" లాగా మీరు మా గురువుగారికి శిక్ష వేశారు. ఘనకీర్తి గలమీకు మా గురువు వల్ల కలిగిన మనస్తాపానికి మన్నించి, శిక్షను రద్దుచేసి మా గురువును నాతో పంపండి అని ప్రార్థించగా, రాజుగారు ప్రసన్నుడై గురువును విడుదల చేశాడు.

వాస్తవానికి గురుశిష్యులిద్దరూ చెప్పింది ఒకటే అయినా శిష్యుడిమాట తీరు వరాలనందుకున్నది. గురువుమాట తీరు శిక్షను పొందింది.

* సద్బుద్ధితో, సహృదయంతో, సమయస్ఫూర్తిగా, సందర్భోచితంగా, సమయోచితంగా, స్పష్టంగా, స్వచ్ఛంగా, స్వేచ్ఛగా, సమగ్రంగా సంక్షిప్తంగా మాట్లాడగలిగే వారే ముందుంటారు. మర్యాద, మన్ననలను పొందుతారు.
* మాటలో మహత్తు, గమ్మత్తు, విపత్తు ఉన్నాయి.
* ఉన్నమాటంటే ఉలుకెందుకు? లేనిమాటంటే కోపమెందుకు?

సత్యమునే చెప్పాలి. ఆ చెప్పేదేదో సమయా సందర్భాలను బట్టి ఉచితాను చితాలను అంచనా వేసుకుని చెప్పాలి. గ్రుడ్డివారిని గ్రుడ్డివారనీ, చెవిటివారిని- చెవిటి వారనీ అంటే అది సత్యమే అయినా అందులో కరుకుదనం ఉంది కాబట్టి ఆక్షేపణీయమే.

* మాట తూటాలాగా ఉండకూడదు. పువ్వులాగా మృదువుగా ఉండాలి

రామ్ నామ్ సత్య హై!

రామ్ నామ్ నిత్య హై!

ఈ మాటను కాదనే వారెవ్వరూ ఉండరు. శవయాత్రలో ఈ మాటలు అంటూ శవాన్ని మోసుకెళుతూ ఉంటారు. కానీ ఈ సత్యమైన మాటలను పెళ్ళి జరిగే చోట అనవచ్చా?! అనగలమా? ఆ మాటలు వినబడగానే అక్కడినుండి తరిమేస్తారు.

అందుకే "మాటకు సందర్భశుద్ధి అవసరం" కొంతమంది అతి మాత్రలనబడే దేశముదురులు ఉంటారు. వారికి ఎదురు చెప్పే వారుండరని కాస్తంత శృతి తప్పి ప్రవర్తిస్తుంటారు. అలాంటి వారికి "మనిషికి ఒక మాట గొడ్డుకు ఒక దెబ్బ" అని ఘాటుగా ఒక్క "మాట తూటాలాగా" పేల్చాలి.

మాట తీరు మనిషి వ్యక్తిత్వాన్ని వెల్లడిస్తుంది. 64 కళల్లో వాక్చాతుర్యం కూడా ఒకటి. హోదా, ధనం, చదువు, కులం, అన్నీ ఉన్నా "అతని మాటకు విలువ లేదు" అని అంటూ ఉంటారు. దానికి కారణం ఆకర్షణీయమైన వ్యక్తిత్వం, దానికి తగ్గ వాక్చాతుర్యం లేకపోవడమే. "మనిషి ఎలాంటి వాడో తెలుసుకోవాలంటే అతనితో కాసేపు మాట్లాడితే చాలు" అంటారు. మంచి మాట, ప్రియమైన మాట ఎంతటివారనైనా ఆత్మీయులుగా మారుస్తుంది." ముక్కోపికి ముఖస్తుతే మందు".

* కఠినమైన మాట క్రోధమును కలిగించును. మృదువైనమాట కోపమును చల్లార్చును. అప్రియమైన మాటలతో పిల్లలతో పాలుకూడా త్రాగించలేం. అనునయమైన మాటలతో పిల్లలతోనైనా, పెద్దలతోనైనా చేదుమందును త్రాగించగలం, విషపు గుళికలనైనా తినపించగలం. మధురమైన, చల్లని, పలకరింపులు, చూపులు, చేతలతోనే వైద్యులు, ఆరోగ్య సేవికలు జబ్బు పడ్డవారిని నయం చేస్తుంటారు. గాయపడిన మనసుకు, దెబ్బతిన్న శరీరానికి ఉపశమనం కలిగించేలా, చల్లని లేపనంలా ఉండాలి మాటలు. అలాంటి మాటలతోనే మరి కొద్దిరోజులలో మరణించబోయే రోగికి వైద్యుడు ఆత్మవిశ్వాసాన్ని కలిగించి మరణాన్ని కూడా వాయిదా వేయించగలడు. మనశ్శాంతిని ప్రసాదించగలడు.

మాట బ్రతుకునిస్తుంది.

ఒక రైతు ఉబ్బసం వ్యాధితో భాదపడుతూ ఉండేవాడు. వ్యాధి ముదరడంతో నగరంలోని ఒక ప్రసిద్ధ వైద్యుని దగ్గరికి వెళ్ళాడు. వైద్యుడు రోగిని పరీక్షించి, మందులు వ్రాసిస్తాను అవి వాడితే తగ్గిపోతుంది అని ధైర్యం చెప్పాడు.

వైద్యుడు తన పేరు, విద్యార్హతలు మొదలగు వివరాలతో అచ్చు వేయబడిన కాగితంపై మందు పేరు వ్రాసి "దీనిని పద్నాలుగు భాగాలుగా చేసి ఉదయం, సాయంకాలం ఆహారం తీసుకొన్న తర్వాత వేసుకొని ఒక వారం తర్వాత కనపడు" అని చెప్పాడు.

రోగి వైద్యుని సూచనలను తు.చ తప్పకుండా పాటించాడు. వారం తర్వాత వైద్యుని దగ్గరికి వచ్చి, నమస్కరించి మీరిచ్చిన మందు రామబాణంలా పనిచేసింది. ఉబ్బసం ఏమాత్రం కనిపించలేదు. నన్ను కాపాడారు. అని సంతోషంగా చెప్పాడు.

వైద్యుడు సంతోషించి "ఏదీ ఆ మందు చీటి ఇలా ఇవ్వు" అని అడిగాడు. మీరిచ్చిన మందు చీటీనీ పద్నాలుగు సమాన ముక్కలుగా చేసి ప్రతి దినం ఉదయం, సాయంకాలం తినేశాను అన్నాడు రైతు.

వైద్యుడు ఆశ్చర్యచకితుడై, కాసేపటికి తేరుకొని, నవ్వుతూ సరే! మంచిపని చేశావ్ అంటూ అతని నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పరీక్షించి, రోగ విముక్తుడైనట్లుగా నిర్ధారణ చేసి, అతడిని ఊరికి పంపించాడు.

ఈ సంఘటనకు మూలకారణం ఏమిటి? సందేహానికి ఏమాత్రం తావులేని దృఢమైన విశ్వాసమే అయినా, దాన్ని గమనించి, ప్రోత్సాహకంగా చెప్పిన మాటలే అమృత గుళికలుగా పని చేశాయి.

అనవసరంగా మాట్లాడేవారికి కాలం విలువ, మాట విలువ తెలియదు

మా పక్కింటావిడ సుభాషిణి ఫోన్ చేతికి తీసుకుందంటే, కనీసం అరగంటైనా మాట్లాడందే ఆవిడకు తృప్తి కలుగదు పాపం. నిమిషాలు మాట్లాడితే చాలా అసంతృప్తిగా ఉంటుందట ఆమెకు.

అలాంటావిడ ఓసారి ఎవరితోనో ఓ ఇరవై నిమిషాలు మాత్రమే మాట్లాడి ఫోను పెట్టేసింది. కాకతాళీయంగా అది గమనించిన నేను పిచ్చిగా ఆశ్చర్యపోయి, తల్లీ అదేంటి? ఇవాళ ఇంత తొందరగా ఫోను పెట్టేశావు? మామూలుగా కనీసం అరగంట కదా నీవు మాట్లాడేది? ఈ రోజేంటి ఇలా పెట్టేశావు? అన్నాను.

అందుకావిడ రాంగ్ నెంబర్లే బాబాయ్ ! అంటూ విసురుగా, ఏదో అర్జంటు పని ఉన్నట్లుగా వంటింట్లోకి దూసుకెళ్ళిపోయింది.

* మాటలు కోటలు దాటును. కాలు మాత్రం గడపకూడా దాటదు.
* ముఖానికి చిరునవ్వు అందమిస్తుంది. మాట మనిషికి విలువను పెంచుతుంది.
* అనవసరంగా మాట్లాడేవారు అబద్ధాలాడకుండా, చాడీలు చెప్పకుండా, పుకార్లను పుట్టించకుండా, వదంతులను రేపకుండా ఉండలేరు. సప్తవ్యసనాలలో అనవసరంగా మాట్లాడటం అనేది ఒకటి.
* పెదవి దాటిన చెడుమాట మిరపకాయల ఘాటువలె చాలా వేగంగా వ్యాపిస్తుంది. మంచి మాట నేతి వాసనలాగా నెమ్మదిగా వ్యాపిస్తుంది.

* జొల్లుకూతలు, సొల్లు కబుర్లతో కాలక్షేపం చేసేవారు ఒక్కోసారి స్వంత విషయాలు, ఇంటి విషయాలు దాచుకోలేక వాగేస్తుంటారు. అందువలన ఎన్నో అనర్థాలు జరిగి పోతాయి.
* నోరు తెరవడం కంటే చెవులు తెరవడం మేలు.
* మాట్లాడే తీరు తెలిస్తే కాట్లాడే పరిస్థితి రాదు. "ఎంత తక్కువగా మాట్లాడితే అంత ఎక్కువగా ఇతరులు నీమాట వింటారు." కొంతమంది చాలా పెద్ద మనుషులుగా కనిపిస్తారు. కానీ నోరు తెరిస్తే ఊహకందని రీతిలో కారుకూతలు, బండబూతులు వినవలసివస్తుంది. అలాంటి వారిని చూచే "నొసటనామాలు నోట బండ బూతులు" అన్నారు.

మాట ఒకటే అయినా అర్థాలు వేరుగా ఉంటాయి

ఒక వ్యాపారస్తుడు తన వద్ద గుమస్తాగా చేరిన కుర్రాడికి డబ్బిచ్చి నాలుగు కవర్లు తెమ్మన్నాడు. కుర్రాడు తెచ్చాడు. ముందుగా వ్రాసి ఉంచిన నాలుగు చీటీలనూ వాడికిచ్చి, వీటిని కవర్లలో పెట్టి 'అంటించు' అన్నాడు. యజమాని చెప్పినట్లు చేశాడు గుమాస్తా.

కాసేపయ్యాక ఎరా అబ్బాయ్! అంటించిన కవర్లు ఇలాతే, అడ్రసులు వ్రాసి ఇస్తాను. పోస్ట్‌బాక్స్‌లో వేసొద్దువుగానీ, అన్నాడు. వాడికప్పుడు అర్థమైంది.'అంటించడం' అంటే అగ్గిపుల్లతో కాదనీ జిగురుతో అనీ.

విషయం తెలుసుకున్న వ్యాపారి ఊరుకుంటాడా 'నాలుగంటించి' పనిలోంచి ఊడబెరికాడు.

మాట విన్నవాడి విజ్ఞతను బట్టి, సందర్భానుసారం స్వీకరించి ఆచరించడం జరుగుతూ ఉంటుంది.

తల విలువ నోరు చెబుతుంది

ఓ ఆదివారం నాడు ఓ రైతు ఇంటిలోనుండి బైటకు బయల్దేరి పోతుండగా, అతడిని చూద్దామని వచ్చిన అతని బాల్య మిత్రుడు గేటు దగ్గర ఎదురయ్యాడు.

రావోయ్‌రా! ఎన్నాళ్ళకెన్నాళ్ళకు? అంటూ ఆప్యాయంగా కౌగిలించుకొని ఇంట్లోకి గౌరవంగా పిలుచుకొని వెళ్ళాడు. కాలకృత్యాలు తీర్చుకొని, స్నానం చేసి, విశ్రాంతి తీసుకుంటూ ఉండు. నేను ఈరోజు కొంతమంది మిత్రులను తప్పనిసరిగా కలవవలసిన పనుంది. తప్పక వెళ్లాలి లేకుంటే నిన్ను వదలి వెళ్లేవాడిని కాను. అందువలన నీవు ఇక్కడే ఉండి విశ్రాంతి తీసుకుంటూ ఉండు. నేనలా వెళ్ళి, ఇలా వచ్చేస్తాను. ఆ తర్వాత మనం తీరుబాటుగా మాట్లాడుకోవచ్చు అన్నాడు. అందుకు ఆ స్నేహితుడు అబ్బే ఎందుకు లేరా? నీవు లేకుండా? ఒంటరిగా ఉండలేను. నేను కూడా నీతోబాటు వస్తాను మాట్లాడుకుంటూ వెళదాం అన్నాడు.

అయితే వెంటనే స్నానం చెయ్. అలాగే వెళదాము అన్నాడు రైతు. నా బట్టలు మాసిపోయి ఉన్నాయి. నీ బట్టలు ఇస్తే అలాగే స్నానం చేస్తాను అన్నాడు మిత్రుడు సరేనని రైతు తనకున్న బట్టలలో విలువైన బట్టలను తన మిత్రునికిచ్చాడు. మిత్రుడు చక్కగా స్నానం చేసి, రైతు ఇచ్చిన మంచి దుస్తులను ధరించి హుందాగా బయల్దేరాడు రైతు వెంట.

విలువైన దుస్తులు ధరించిన కారణంగా ఆ స్నేహితుడు రైతుకు ఒక శ్రీమంతుడులాగా కన్పించాడు. మిత్రుని హుందాతనాన్ని చూచి రైతుకు కాస్తంత అసూయ కూడా కలిగింది. మిత్రుని పక్కన తానో సేవకుడిలాగా, అతి సామాన్యంగా కన్పించ సాగాడు. తన విలువైన వస్త్రాలను ఇచ్చి తను తప్పు చేసినట్లుగా మనసులో మథన పడసాగాడు. ఇద్దరూ ప్రక్క ప్రక్కన నడుస్తూ ఉంటే ప్రతి ఒక్కరూ తనను ఒక సేవకుడిగా ఊహించుకుంటారని రైతుకు దిగులు పట్టుకుంది. కానీ, ఎలాగో తమాయించుకుంటూ నడవసాగాడు.

తను వెళ్లాలనుకున్న మొదటి స్నేహితుడి ఇంటికి ఇద్దరూ చేరుకున్నారు. ఆ ఇంటివాళ్ళకి రైతు తన బాల్య స్నేహితుణ్ణి పరిచయం చేస్తూ, వీడు నా బాల్య స్నేహితుడు, చాలా మంచి వ్యక్తిత్వమున్నవాడు అని అంటూ అతను ధరించిన వస్త్రాలు ఎవరివనుకున్నారు? అవి నావే ! అనేశాడు.

రైతు అలా అనేసరికి స్నేహితుడు అవాక్కైపోయాడు. ఆ యింట్లో వారందరికీ కూడా ఎంతో ఆశ్చర్యం కలిగింది. తను అలా చెప్పి ఉండకూడదు అని రైతుకు కూడా అనిపించింది. కానీ నోరు జారాక ఇక చేసేదేముంది? తన తప్పుకు రైతు ఎంతగానో నొచ్చుకున్నాడు. క్షమించమని మిత్రుడిని అడిగాడు. అక్కడినుండి బయల్దేరిన తర్వాత, దారిలో నువ్వలా మాట్లాడేసరికి నా దిమ్మ దిరిగిపోయిందిరా, అలా ఎలా అనగలిగావురా నువ్వు? అన్నాడు మిత్రుడు బాధగా. అలా నోరు జారకూడదు. అందుకు నేనెంతో బాధపడుతున్నారా. ఏమనుకోకు, నేనలా అనడం తప్పే అన్నాడు రైతు.

ఇద్దరూ కలసి రెండో స్నేహితుడి ఇంటివైపు నడక సాగించారు. రైతు ఇక తన స్నేహితుడు వేసుకున్న బట్టలు తనవేనన్న మాటను మరచిపోవాలి. ఎక్కడా బయటకు చెప్పకూడదు అని గట్టిగా నిశ్చయించుకున్నాడు. ఇద్దరూ కలసి రెండో స్నేహితుడి ఇంట్లోకి వెళ్ళారు. ఈసారి జాగ్రత్తగా మాట్లాడసాగాడు. కానీ తన మాటలను ఆ ఇంటివారు ఎవరూ పట్టించుకోకుండా హుందాతనం ఉట్టిపడుతున్న తన స్నేహితుడివైపే తదేకంగా మెచ్చుకోలుగా చూస్తూ ఉంటే, ఆ దుస్తులు నావే అనే మాట నోటి చివరిదాకా వచ్చాయి. కానీ, ఎలాగో తమాయించుకున్నాడు.

రైతు పరిచయ వాక్యాల్ని మళ్లీ కొనసాగిస్తూ ఈయన నా బాల్య మిత్రుడు, చిన్నప్పటి నుండి కలసి మెలసి తిరిగాం, ఇతడు చాలా మంచివ్యక్తి. ఆయన ధరించిన విలువైన దుస్తులు మాత్రం ఆయనవే! నావి కానే కావు అనేశాడు. రైతు మాటలు ఆ యింట్లో ఉన్నవారందరికీ ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఇలాంటి పరిచయ వాక్యాలను ఇంతవరకూ వాళ్లెవ్వరూ విని ఉండలేదు మరి.

ఆ యింటిలోంచి బయటకు వచ్చేసిన తర్వాత రైతు మరలా క్షమాపణలు కోరాడు. చాలా తప్పు చేశానని ఒప్పుకున్నాడు. కానీ బాల్య స్నేహితుడికి మాత్రం పట్టరానంత కోపం వచ్చేసింది. ఇక నీతో కలసి ఎక్కడికీరాను అని తెగేసి చెప్పాడు. రైతు దీనంగా మిత్రుడి చేతులు పట్టుకొని బ్రతిమలాడాడు. అంతమాటనకు, నన్నొదిలి పెట్టి వెళ్ళవద్దు. నీవు అర్థాంతరంగా వెళ్ళిపోతే నేను జీవితాంతం ఓ స్నేహితుడి పట్ల అమర్యాదగా ప్రవర్తించిన విషయం జ్ఞాపకం వచ్చి బాధపడవలసి వస్తుంది. ఇకపై నీవు ధరించిన బట్టలగురించి ఒక్క మాటకూడా మాట్లాడనని ఒట్టు పెట్టుకుంటున్నాను. అన్నాడు. సరేనన్నాడు మిత్రుడు.

మళ్లీ ఇద్దరూ కలసి మూడో స్నేహితుడి ఇంటికి చేరారు. రైతు తనను తాను నిగ్రహించుకొని, మనసును చిక్కబట్టుకుంటూ మాట్లాడాలనుకున్నాడు. ఆ యింటి వాళ్ళకు తన స్నేహితుడిని పరిచయం చేస్తూ. ఇదిగో నా స్నేహితుడిని కలవండి. ఎంతో కాలంనుంచి ఇతడు నా స్నేహితుడు. మంచి వ్యక్తి, ఇక వీడు వేసుకున్న దుస్తుల సంగతి అంటారా! వాటి గురించి చెప్పకూడదని ఒట్టు పెట్టుకున్నాను అనేశాడు.

ఏ విషయాన్నైతే ఇతరులకు చెప్పకూడదు అని అంటామో, అ విషయాన్నే ఏదో ఒక విధంగా బైట పెట్టేస్తారు కొందరు. ఏదైనా ఒక విషయాన్ని చెప్పి, ఈ విషయాన్ని ఎక్కడా బైట పొక్కనీయకండి. ముఖ్యంగా ఫలానా మనిషికి అస్సలు తెలియకూడదు అని చెపితే, సరే, అలాగే అంటారు. కానీ ఎవరికైతే విషయం తెలియకూడదు అని చెప్పామో,ఆ ఫలాన వారు కనబడగానే చెప్పకూడదు అని తనలో అనుకుంటూనే చక్కగా చెప్పేస్తారు. ఇలా నోరుకట్టేసుకోలేని వారు ఎవరి వెంట ఉన్నా చాలా అనర్థాలు, అపార్థాలు చోటు చేసుకొని, అనవసరమైన అశాంతికి లోను కావలసివస్తుంది. మిగతా విషయాలలో మంచివారే అయినప్పటికీ ఇలాంటి వారిని ఎంతదూరంగా ఉంచితే అంతమంచిది.

* మూర్ఖుడి హృదయం నోటిలో ఉంటుంది. బుద్ధి మంతుడి నోరు హృదయంలో ఉంటుంది.

అతి చమత్కారంగా మాట్లాడినా అనర్థమే

ఇద్దరు బాలురు మాంసము కొనుటకు ఒక కొట్టుకు వెళ్లారు. ఒక కిలో మాంసము కావలెనని అడిగారు. కసాయివాడు వెనుకకు తిరిగినప్పుడు ఒక బాలుడు మాంసపు ముక్క నొకదానిని దొంగలించి రెండవవాని జేబులో పెట్టాడు. కసాయివాడు మాంసపుముక్క ఒకటి మాయమైపోయిన విషయాన్ని గమనించాడు.

తక్షణమే వాళ్ళతో ఏరా అబ్బాయిలూ! ఇక్కడున్న మాంసపు ముక్క ఎటుబోయరా? మీరు తీయకపోతే ఇంకెవ్వరు తీస్తారు? మీరిరువురూ, నేనూ, తప్ప ఇంకొకరు లేరు కదా? నిజం చెప్పండి అని గద్దించి అడిగాడు కసాయివాడు.

అప్పుడు మాంసపు ముక్క దొంగలించినవాడు "నీ మాంసపు ముక్క నావద్ద లేదని దేవునిపై ప్రమాణము చేసి చెప్పుచున్నాను" అన్నాడు. తర్వాత రెండవ వాడు "నీ మాంసపు ముక్కను నేను దొంగలించలేదని దేవునిపై ప్రమాణం చేసి చెబుతున్నాను" అన్నాడు.

కసాయివాడు బాలుర మాటల చాతుర్యంలోని అర్థాన్ని చక్కగా గ్రహించి, వారితో మీరు చమత్కారంగా దేవునిపై ప్రమాణంచేసి నా దగ్గర అబద్ధం చెప్పారు. నన్ను మోసం చేశారు. కానీ సర్వమూ తెలిసిన భగవంతుడిని మాత్రం మోసం చేయలేరు. చేసిన తప్పుకు శిక్ష అనుభవించక తప్పదు. బాగా జ్ఞాపకం పెట్టుకొండి, వెళ్ళండి అని పిల్లలను క్షమించి పంపించి వేశాడు.

మాటల గారడె

ఒక బ్రాహ్మణుడు తనకు దానంగా వచ్చిన మేకనొక దానిని తీసుకొని ఒంటరిగా పోతూ ఉండడం ముగ్గురు దొంగలు గమనించారు. ఆ బ్రాహ్మణుడి మేకను ఎలాగైనా తస్కరించాలనుకున్నారు.

"ఏయ్ చూడరా... ఒంటరిగా వున్నాడు, ఈ అడవిలో అరచినా కాపాడే దిక్కులేదు. అతని మేకను లాక్కుని పారిపోదామా?" అన్నాడు ఒకడు. ఆ పని మనం చేయడం ఎందుకురా? నాలుగు తగిలిస్తే వాడే మేకను వదిలి పారిపోతాడు". అన్నాడు రెండో వాడు.. బెదిరించో... లేదా రహస్యంగానో దొంగ తనాలు చేసి చేసి విసుగ్గా వుందిరా. ఈ సారి మాత్రం మన బుర్రలు ఉపయోగించి మాటలతోనే అతన్ని బురిడీ కొట్టిద్దాం. అంటూ తన ఆలోచన చెప్పాడు మూడోవాడు. సరేనన్నారు మిగాతా యిద్దరూ.

అయ్యా! నమస్కారం మీ కుక్క భలే అందంగా వుంది ఏ జాతిది? అంటూ... అడిగాడు. పరాచికాలు ఆడడానికి నీకు నేనే దొరికానా? మేకను పట్టుకుని కుక్కంటావా? వెళ్ళవయ్యా వెళ్ళు! అన్నాడు బ్రాహ్మడు కోపంగా, ఏమిటి? ఇది మేకా? అహ్హా..హ్హా...! గట్టిగా నవ్వి అక్కడి నుండి వెళ్ళిపోయాడా దొంగ. కొంత దూరంగా వెళ్ళాక మరొక దొంగ బాటసారిగా కలిసాడు.

ఇది విచిత్రంగా వుందే! గుర్రం వుండగా ఎందుకు మీరు నడుస్తూ వెళుతున్నారు? దీనిపై స్వారీ చేయచ్చుకదా! అన్నాడు రెండో దొంగ. ఏమిటీ నా మేక నీకు గుర్రంలా కనిపిస్తోందా? అన్నాడు బ్రాహ్మణుడు కోపంగా.

అయ్యా మీరు గొప్ప పండితుడిలా వున్నారు. గుర్రానికి, మేకకు తేడా తెలీదంటే నేను నమ్మను, అని చెప్పి ముందుకు వెళ్లిపోయాడు. ఆ మాటలతో కొంత అయోమయంలో పడి పోయాడు బ్రాహ్మడు. మరి కొంత దూరం వెళ్ళాక ఈసారి

మూడో దొంగ ఎదురుపడ్డాడు. పండితులకు నమస్కారం. గాడిదను మీరు తాకటం ఏమిటి? పైగా దాన్ని మీ వెంట తోలు కెళుతున్నారు. ఎందుకో నేను తెలుసుకోవచ్చా? అన్నాడా దొంగ వినయంగా. ఇది గాడిదా? భయంగా మేక వైపు చూస్తూ నెమ్మదిగా అన్నాడు బ్రాహ్మడు.

అవును! ఇందులో సందేహం ఏముంది? అమాయకంగా చెప్పాడు మూడో దొంగ. ఆ మాటలకు విపరీతంగా భయపడ్డాడు బ్రాహ్మడు. బహుశా ఇది దెయ్యమేమో? ఒక్కొక్కరికి ఒక్కోలా కనబడుతోంది. బాబోయ్ దీన్ని నా వెంట తీసుకుపోయి నా ప్రాణాలకే ముప్పు తెచ్చుకుంటానా? ఇలా ఆలోచించిన ఆ బ్రాహ్మడు మేకను అక్కడే వదలి పారిపోయాడు. ఆ బ్రాహ్మడి తెలివి తక్కువతనానికి పెద్ద పెట్టున నవ్వుకుంటూ మేకను తీసుకొని వెళ్ళిపోయారు ముగ్గురు దొంగలు.

మాటకు అహంకారం అవరోధం

ఎదుటివాడు మాట్లాడందే, పలుకరించందే నేనెందుకు మాట్లాడాలి? నేనే ఎందుకు పలకరించాలి? వాడికంటే నేనెందులో తక్కువ? వయసులోనా? హోదాలోనా? డబ్బులోనా? చదువులోనా? అటువైపు నుండి రానిది నావైపు నుండి ఎలా వస్తుంది? అబ్బే వయసులో పెద్ద అని బడాయి! హోదాలో తనకంటే ఎక్కువ ఎవరూ లేనట్లు అహంకారం. ధనికుడనని దర్పం, తనే ఎక్కువ చదివినట్లు గర్వం! ఏం లాభం? తనకంటే తక్కువ వారిని అలా చూడకపోతే ఏం? ముందుగా పలుకరిస్తే వాడి గొప్పతనం బైటపడుతుంది కదా? అని ఎవరి ఆలోచనలను వారు సమర్థించుకుంటూ, ఊహించుకుంటూ ఉంటారు. మనసునిండా కల్మషం నింపుకొని ఉంటారు. రోజులు, నెలలు గడిచిపోయి. అది ముదిరిపాకానపడి "జీవితాంతాని వైరాణి" అన్నట్లు జీవితమంతా శత్రువులుగానే మిగిలిపోతారు. చివరకు మనసుల కలయిక వల్ల కలిగే ఆనందాన్ని పొందలేక అశాంతితోనే జీవితం గడిపేస్తారు.

"కత్తి కంటే కూడా మాటకు పదునెక్కువ". గొడ్డలితో నరకబడిన చెట్టైనా చిగురిస్తుందేమో గానీ, మాటలతో గాయపడిన మనసు, చెడిపోయిన కార్యం చక్కబడటం కష్టం. అందుకే మాటలలో స్పష్టత, భావంలో స్వచ్ఛత ఉండాలి.

"పలుకే బంగారమాయరా" అన్నట్లు ఈ మధ్య చదువుకున్న వారిలో అహం, ఆత్మన్యూనతాభావం ఎక్కువగా కనిపిస్తుంది. ఎందుకంటే "ఒకటి మాట్లాడితే ఎక్కువ, మాట్లాడకపోతే తక్కువ" అనుకుంటారనీ, తక్కువగా అంచనావేస్తారనే అపోహ. అదోరకమైన మానసిక వెనుకబాటుతనంతో ఊరకనే ఉండిపోతారు. ఒక వేళ మాట్లాడినా ఒకటి రెండు మాటలు ముక్తసరిగా మాట్లాడతారు. లేదా ఒక చిరునవ్వును పారేసుకునో, లేదా హాయ్! అని రెండక్షరాలు పలికి మౌనంగా ఉండిపోతున్నారు. చదువరులకు ఇలా వ్యవహరించడం సభ్యతకాదు.

సమాజంలో ఉంటున్నాము కాబట్టి మాట్లాడటం అనేది ఒక అవసరం. ప్రతి ఒక్కరూ చక్కని భాషను సంస్కారవంతంగా ఉపయోగించాలనే సదుద్దేశ్యంతోనే నామకరణం రోజున పసిపిల్లలకు నాలుక పై తేనె పూస్తారు. మాటలు తేనె చుక్కల్లాగా మధురంగా ఉండాలని.

ఇద్దరు పల్లెటూరు వాళ్ళు కలిస్తే ముక్కూమొహం ఎరగక పోయినా పొలాలు, వానలు, ధరలు, పిల్లాపాపల గురించి ఎలాంటి అరమరికలు లేకుండా గలగలా మాట్లాడేసుకుంటారు చదువరులు కాకపోయినా.

స్త్రీలు కూడా అరమరికలు లేకుండా మాట్లాడేస్తుంటారు. కొత్త-పాత అనేది లేకుండా గలగలా మాట్లాడేసుకుంటారు. మాటల్లో మగవారికంటే ఆడాళ్ళే నయం. ఆ విధంగా వారు మనసులో ఉండే భారాన్ని దించుకుని టెన్షన్ ఫ్రీ అయిపోతుంటారు.

మనుషుల సమస్త వ్యవహారాలు మాట పైనే, మాటతీరు పైనే చక్కబడటం, లేదా చెడిపోవడం జరుగుతూ ఉంటుంది. చదువనేది లేకపోయినా దళారులు మాటమీదనే లక్షలు, కోట్లరూపాయల లావాదేవీలు నెరపుతూ ఉంటారంటే మాటకు ఎంత విలువ ఉంటుందో ఊహించవచ్చు. పలుకులనే బంగారుగా మార్చుకుంటారు కొందరు. మాట తీరును తీర్చిదిద్దుకునే అవకాశం మన చేతిలోనే ఉంది.

* మాటకు ప్రాణం సత్యం, నోటుకు ప్రాణం వ్రాలు.
* ప్రాణం పోవచ్చుకానీ మాట పోకూడదు.

మాట నిలబెట్టుకోవడం కోసం తమ సర్వస్వాన్నీ త్యాగం చేసిన బలి చక్రవర్తి, సత్య హరిశ్చంద్ర మహారాజులు, ఈనాటికీ కీర్తింపబడుచున్నారు కదా?

గయుడిని రక్షిస్తానని మాట ఇచ్చినందుకు అర్జునుడు శ్రీకృష్ణుడితోనే పోరాడటానికి సిద్ధమయ్యాడు. అలాగే యయాతిని రక్షిస్తానని మాట ఇచ్చినందుకు హనుమంతుడు శ్రీరామచంద్రునితోనే యుద్ధానికి దిగాడు. మాట విలువ అలాంటిది. మాట తప్పినవారు హీనులుగా ముద్రపడిపోతూ ఉండడం మనం చూస్తూనే ఉన్నాం.

"మాటే మంత్రం" మాటలతో మంత్ర ముగ్ధులను చేయగల వాక్శుద్ధి కొంతమంది తత్వవేత్తలకు, స్వామీజీలకు, బాబాలకు ఉంటుంది. కాబట్టేవారికి కొన్ని వేలమంది భక్తులుంటారు. మాటలే రాగాలు, సరాగాలు, శబ్ద ప్రకంపనలు. చెరువు నీటిలో రాయి పడితే కంపన తరంగాలు చెరువంతటినీ ఎలాగైతే వ్యాపిస్తాయో అలాగే మన ముఖం నుండి వెలువడిన ప్రతిశబ్దం ఆకాశ పరమాణువుల్లో కంపనలను సృష్టిస్తాయి. సంగీత శబ్దతరంగాలు గాలిలో కలిసి దూరాన ఉన్న వారి చెవులకు సోకి మనసును ఆహ్లాదపరుస్తాయి. దుఃఖభరిత, కఠినమైన మాటలు, బూతుమాటలు హృదయాలను కలవరపరుస్తాయి, కల్మష పరుస్తాయి. ఆక్రందనలు, ఆర్తనాదాలు హృదయంలో వేదన, కరుణ భావాలను కలుగజేస్తాయి.

శబ్ద ప్రకంపనలు ప్రజానీకంలో అదృశ్య ప్రేరణలను జాగృతం చేస్తాయి. శబ్దం అత్యంత శక్తివంతమైనది. అందువలన కటు, పటు, శబ్దాలను ఉచ్చరించకూడదు.

కొంతమంది వాక్చాతుర్యం ఉందికదాని అయిన దానికీ, కాని దానికీ "గోరంతలు కొండంతలు" చేసి మాట్లాడేస్తుంటారు. అనవసరంగా అధికారులను, పైవారినీ ప్రశంసలతో ముంచేసి తమ అవసరాలను తీర్చుకుంటూ ఉంటారు. అటువంటి వారి బారిన పడకుండా ఎవరికి వారు తమను కాపాడుకోవాలి. "పొగడ్త అనేది పొగిడే వాడినీ, పొగిడించుకునే వాడినీ ఇద్దరినీ కలుషితం చేస్తుంది."

రాజ్యాంగం ద్వారా మనకు లభించిన హక్కులలో ముఖ్యమైనది వాక్ స్వాతంత్ర్యపు హక్కు అనే ధీమాతో కొందరు బస్సుల్లోనూ, బస్టాండుల్లోనూ, రైళ్ళలోనూ, రైల్వే స్టేషన్‌లలోనూ, పబ్లిక్ ప్లేసులలోనూ -పరుషమైన, అభ్యంతరకరమైన పదాలను ఉపయోగిస్తుంటారు. ముఖ్యంగా ఈనాడు కాలేజీ స్టూడెంట్లు సిగ్గు, సభ్యత ఏమాత్రం లేకుండా లవ్‌ను గురించి మాట్లాడు కుంటున్నారు. కనీస సంస్కారం లేకుండా-పెద్దవారున్నారు అనే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా మాట్లాడుకుంటున్నారు. కొందరు రాజకీయాలనుండి, ఇంటి విషయాలదాకా ఏదో ఒక విషయం మీద మాట్లాడుతూనే ఉంటారు. మధ్య మధ్యలో అమ్మలు, అక్కలు అనే బూతు మాటలుకూడా ఉపయోగించి చుట్టు ప్రక్కల ఉండే వారికి అసౌకర్యం, అసహ్యం కలిగేలా మాట్లాడుతూ ఉంటారు. బయట ఎక్కడైనా అయితే ప్రక్కకు తొలగి మాటలు వినబడనంత దూరం వెళ్ళవచ్చు. కానీ, ప్రయాణంలో అయితే ఎటూ వెళ్ళడానికి వీలుండదు.

పిల్లలు, పెద్దలు, చదువుకున్నవారు, ఉద్యోగస్తులు, చాలా కాలం తర్వాత కలుసుకున్న మిత్రులు అందరూ ఈ బూతు పదాల పరంపరను అనుసరించేవాళ్ళే. కొంతమందికి బూతు పదాలు దొర్లనిదే అసలు మాటే రాదుకదా?!.

పబ్లిక్ ప్లేసుల్లో పొగత్రాగరాదనీ, మలమూత్ర విసర్జన చేయరాదని బోర్డులు పెట్టినట్లే ఇష్టమొచ్చినట్లు మాట్లాడి మనసులు నొచ్చుకునేటట్లు చేయకూడదని బోర్డులు పెట్టి, సున్నితమైన మనసులకు, వాతావరణానికి కాలుష్యం అంటకుండా ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలు తీసుకోవడం ఎంతైనా అవసరం.

మౌనం

మాట్లాడటం ఒక కళే అయినా ఆ కళలో ఆరితేరిన వారికంటే మిత భాషులకు, మౌనధారులకే ఎక్కువ గౌరవం.

"స్పీచ్ ఈజ్ సిల్వర్ సైలెన్స్ ఈజ్ గోల్డ్ "

"మాట మట్టి, మౌనం బంగారం"

" మౌనం భగవంతుని భాష"

" మౌనం మహోన్నతమైన తత్వం"

వాగాడంబరులు, వాచాలురు తారసపడినప్పుడు మౌనం ఒక కవచంలా ఉపయోగ పడుతుంది. చిరు ధరహాస యుక్తమౌనం ఒక అలంకారం. ఒక ఆయుధం.

మౌనం ముందుచూపునిస్తుంది. భవిష్యత్తును ఊహించగలుగుతుంది. కారణాకారణాలను చక్కగా విశ్లేషిస్తుంది. మనోఫలకంపై దృశ్యాలను చక్కగా చిత్రీకరిస్తుంది. అందుకే యోగులు, మునులు, సాధువులు మౌనధారులు.

మౌనంగా, శ్రద్ధగా వినే అలవాటు స్నేహానికి తొలి సోపానం. "మౌనం కలహనాశనం". ఆమోద యోగ్యమైన ఆలోచనలకు, పరిష్కారాలకు మౌనమే పుట్టినిల్లు.

అనవసరంగా మాట్లాడకపోవడం, ధర్మహానికలిగే సందర్భాలలో మాత్రమే హితవచనాలు పలకడం మౌనంలోని భాగమే. మితభాషణం హుందాతనాన్ని కలిగిస్తుందనడంలో సందేహమే లేదు. అది గొప్పవారి ఆభరణం.

* అవిచ్ఛిన్న మౌనమే సమస్త అపవాదులకు సమాధానం. వాదములకు దిగినచో మనము కూడా వారిస్థితికి దిగజారెదము. గాడిద, గుర్రం ఒకటయిపోతుంది.

మౌనం అర్ధాంగీకారం. అబ్బాయి నచ్చాడా?......అంటే పెళ్ళికూతురు మౌనంగా ఉంటుంది. మౌనం అర్ధాంగీకారం. అని అర్థం.

భోంచేశారా? అని ఇంటికొచ్చిన అతిథిని అడిగినప్పుడు మౌనంగా ఉండిపోతే! ఆ మౌనానికి చేయ్యలేదు. అనే అర్థాన్నే తీసుకుంటారు. మౌనానికి ఇలాగా అవునూ, కాదూ, అని రెండే అర్థాలు కాదు. వెయ్యిన్నొక్క అర్థాలున్నాయి.

మౌనం : కనిపించని శక్తి
విధించని శిక్ష
అందించని సందేశం
పట్టని ఆయుధం
ధరించని ఆభరణం
లిపిలేని భాష
ఒప్పని అంగీకారం
చెప్పని సమాధానం
భాషకందని భావం
తిట్టని తిట్టు
ఆడని మాట
కొట్టని దెబ్బ
చెయ్యని అవమానం

* మాటలను మాటలతో అడ్డుకోలేం. మౌనంతోనే అది సాధ్యం

ఆధ్యాత్మిక ప్రగతికి తొలి సోపానం. నిశ్చలత్వానికీ, ఏకాగ్రతకూ మౌనం ఒక రాజమార్గం. ఆత్మశక్తినీ వాక్సుద్ధినీ పెంచే ఏకైక శక్తివర్ధిని. పెదవులపై చిరునవ్వు, హృదయంలో కరుణ, చూపులో జాలి, దయ, మనసులో మౌనం ముఖవర్చస్సుకు మూలం.

చాలామంది యువకుల అనుభవం

చాటు మాటుగా సిగరెట్లు కాలుస్తున్న కొడుకునొకసారి వాళ్ళ నాన్న చూసేశాడు. అది తెలుసుకున్న కొడుకు భయం, అవమానం, సిగ్గు, ఇలా నవరసాలు ఒక్కసారి పెల్లుబకగా వణికి చచ్చాడు. ఇంటికెళ్ళాక వాళ్ళనాన్న మొదట అమ్మతో చెబుతాడనీ. కుడిఎడమలుగా అమ్మనాన్నలు వాయించుకుంటారనీ.. ఇంటి నుంచి వెళ్ళగొడతారనీ...

ఇలా ఏవేవో ఊహించుకొని భయాందోళనలో మునిగి పోయాడు. కానీ, విచిత్రం వాళ్ళమ్మకూడా ఏమి తెలియనట్లే, మునుపటిలాగే ఉంది! నాన్న ఏమీ అనలేదు సరికదా ఏమీ తెలియనట్లు అసలు సిగరెట్లు తాను కాల్చడం చూడనేలేదు అన్నట్లుగా యధాలాపంగా ఉండిపోయాడు.

అదే వాడికి అర్థం కాలేదు. భయం, దుఃఖం, సిగ్గు, అవమానం ఇలా అనేక భావాలతో చితికిపోతున్నాడు. చడామడా తిట్టి ఉంటే ఆ ఒక్కరోజుతోనే పీడ పోయేది. కానీ వాళ్ళ నాన్న మౌనంగా ఉండేతీరు వాడిని రకరకాల అర్థాలతో చిత్రహింసలకు గురిచేస్తోంది. వాడు పెద్దవాడైపోయాడు, ఇక మన మాటేం వింటాడు. చదివి బాగుపడతాడనుకొన్నాం గానీ, ఇలా చెడలవాట్లతో చెడిపోతాడనుకున్నామా? ఇలా మా అమ్మానాన్నలు నాగురించి చెడుగా అనుకుంటూ ఉంటారు. ఛ.. ఛ.. అలాంటి పని నేను చేసి ఉండకూడదు.

ఏమైనా అంటే ఆ క్షణము లేదా కొన్ని గంటలు బాధ. ఆపై అంతా షరా మాములే. ఏమి అనకుండా మౌనంగా ఉంటే ఆరోజంతా బాధే, మౌనంగా ఉన్నన్నిరోజులూ బాధే. సందర్భానుసారం మౌనం ఒక శక్తివంతమైన విధించని శిక్ష.

* శత్రువుల ఈటెల్లాంటి మాటల కంటే, ఆప్తుల మౌనమే తూట్లు పొడుస్తుంది.

మౌనమే ఒక సందేశం

కాశీ నగరంలో విశ్వనాధుడనే గురువు తన శిష్యులకు అన్ని విద్యలూ బోధిస్తూ వుండేవాడు. శిష్యులలో నిత్యానందుడు అనేవాడు విద్యలో అందరికంటే ముందుండే వాడు. పదహారు సంవత్సరాల ప్రాయం వచ్చేసరికి గురువుగారితో సమానంగా విద్య నేర్చాడు. ఇకతాను ఆ గురుకులంలో నేర్చుకోవాల్సిందేమీ లేదని గ్రహించి, అంతకంటే ఉన్నతమైన విద్య నేర్పించగల గురువెవరైనా ఉంటే చెప్పండని గురువును వినయంగా ప్రార్థించాడు.

విశ్వనాథ గురువు హిమాలయాలలోని తన గురువు మౌన బాబా వద్దకు వెళ్ళమని చెప్పాడు. నిత్యానందుడు ఎంతో శ్రమపడి మౌనబాబా ఆశ్రమానికి వెళ్ళాడు. మౌన బాబాగారు దివ్య సమాధిలోనున్న కారణంగా నిత్యానందుడు ఆయనతో తాను వచ్చిన కారణాన్ని చెప్పలేకపోయాడు. కొన్ని రోజుల తర్వాత మౌనబాబాగారు కళ్ళు తెరచి నిత్యానందుడిని చూచి చిరునవ్వుతో మౌనంగానే పలుకరించాడు. నిత్యానందుడు ఆ తేజోమూర్తిని చూచి ఆనంద పారవశ్యంలో తన్మయుడైపోయాడు. మౌన బాబాగారు కూడా అవిచ్ఛిన్నమౌనంతో, ప్రశాంత వదనంతో నిత్యానందుడివైపు చూస్తూ తన భావ సంకల్ప శక్తిని నిత్యానందునిలోకి యోగ ప్రసారం చేశాడు. ఆ భావ సంకల్ప శక్తే జ్ఞానోపదేశంగా నిత్యానందుడు అందుకున్నాడు. ఇలాంటి మౌన యోగ సిద్ధి మహాయోగులకు మాత్రమే సాధ్యం. అందుకే మౌనం ఒక శక్తివంతమైన సందేశం.

* గాఢమైన నిశ్శబ్దంలోనే భగవద్వాణి వినిపిస్తుంది. గాఢమైన మౌనంతోనే అగాథమైన నిశ్శబ్దంలోకి వెళ్ళగలం. మౌనంతోనే అది సాధ్యం. ఏకాగ్రతకూ, జ్ఞాపకశక్తికీ మౌన మననమే ఉత్తమోత్తమ సాధనం.

విద్య

చదవడం, వ్రాయడం, తెలుసుకుని సంతకంతో సరిపెట్టుకుంటే దానిని "అక్షరజ్ఞానం" అని మాత్రమే అంటారు. విద్య నేర్చుకున్నందుకు అజ్ఞానం తొలగిపోవాలి. తనపట్ల, కుటుంబంపట్ల, సమాజంపట్ల, దేశంపట్ల అవగాహన కలిగి ఉండాలి. కర్తవ్యనిష్ఠ పెరగాలి.

ప్రవర్తనలోనూ, వృత్తిలోనూ, చేసేవనులలోనూ నైపుణ్యాన్ని విద్య పెంపొందించాలి. సకాలంలో, సజావుగా పనులను చక్కబరచేవారే గౌరవింప బడతారు.

"నేర్చిన కొద్దీ విద్య, సాధనకొద్దీ ప్రావీణ్యత" కష్టాలలో, బాధలలో ఉన్నవారికి సేవ, సహకారాలనందివ్వగల లక్షణాలను విద్యావంతులలో చూడగలగాలి. విలువలు లేని నియమాలను, చెడు సంప్రదాయాలను, మూఢనమ్మకాలను విద్యావంతులు ఖాతరు చెయ్యరు. కానీ, ఈనాడు దురదృష్టవశాత్తు విద్యావంతులైన వారంతా చదువును కొన్నవారైనందున, సేవలను అమ్ముకుంటున్నారు. నిరక్షరాస్యులకంటే విద్యావంతులలో నిజాయితీని చూడలేకున్నాము.

* విద్యాధికుడయ్యే కొలది జీవన సరళి నిరాడంబరంగా ఉండాలి. సేవ చేయుటకు ముందు, చేయించు కొనుటకు వెనుక ఉండాలి.
* నిరాడంబర జీవితం - ఉన్నత ఆశయం విద్యాధికుల లక్షణం.
* ముందు ఎలా మాట్లాడాలో నేర్పించి తర్వాత మౌనంగా ఎలా ఉండాలో నేర్పుతుంది విద్య.
* ముందు ఏది, ఎలా చెయ్యాలో నేర్పించి, తర్వాత ఏమీ చెయ్యకుండా ఎలా ఉండాలో నేర్పుతుంది విద్య.
* ముందు కొంత తెలియజేసి, చివరికి ఏమీ తెలియదని తెలియజేస్తుంది విద్య.

ఓరిమి

సహనం ఒక విశిష్టమైన గుణం. బాధలను, కష్టాలను, ప్రతికూలతలను, అవమానాలను, విమర్శలను, నిందలను సహించేగుణం. లక్ష్యాన్ని ఛేదించాలన్నా, గమ్యాన్ని చేరాలన్నా సడలని పట్టుదలతో కడదాకా సహనంతో శ్రమించాలి. అదే ఓరిమి. చిన్నచిన్న ఆటంకాలకు బెదరి, మనస్సు చెదరి పనులను మధ్యలో మానేయడం అసహనాన్ని తెలియజేస్తుంది. అవసరమైన పనిని, అనుకూలమైన పనిని కూడా కష్టంగా చేసేవాడికి ఓర్పులేదని చెప్పాలి. కష్టమైన పనిని కూడా ఇష్టంగా, నిష్ఠగా చేసేవాడే సహనశీలి.

* సహనం మొదట చేదుగా భరించలేనిదిగా ఉంటుంది. కానీ, చివర తియ్యని ఫలితాన్నిస్తుంది.

* ఇతరుల భావాలను, మంచి అలవాట్లను గౌరవించడం, ఇతరులు చెప్పేది శాంతంగా, శ్రద్ధగా, పూర్తిగా వినడం, నిదానంగా, నిలకడగా పనులు చేయడం, సహనశీలానికి నిదర్శనం.
* సహనం మనిషిని ముందుకు నడిపే ఇంధనం. అసహనం అడ్డగించే అవరోధం.

మామూలు పరిస్థితులలో ఎవరైనా బీరాలు పలుకుతారు. గంభీరంగా ఉంటారు. కొండలను పిండి చేయగలమంటారు. ప్రతికూల పరిస్థితులలోనే "ఊకమూట ఎవరో ఉక్కుమనిషి" ఎవరో బయటపడుతుంది. తప్పులను, పొరపాట్లను ఎత్తి చూపినపుడు ఓర్చుకోవాలి. తప్పులు, పొరపాట్లు నిజంగా జరిగి ఉంటే సరిదిద్దుకోవాలి. తెలియజేసినవారికి కృతజ్ఞతలు తెలియజేయాలి. ఇతరుల తప్పులను క్షమించాలి. అవసరమైతే సహృదయంతో వినయంగా సూచనలివ్వాలి. సరి చేసుకొమ్మని తెలియజేయాలి. లోపాలను ఎత్తిచూపే ప్రవృత్తిని, ఎగతాళి చేసే తత్వాన్ని మానుకోవాలి.

* అలలు కాళ్ళదగ్గరికి వచ్చాయని సముద్రాన్ని చులకనగా చూడడం ఎంత అవివేకమో, సహనం చూపిస్తున్నారుకదాని ఉత్తములను తక్కువగా అంచనావేయడమూ అంతే. సహనం చూపిస్తున్నారు కదాని కౌరవులు పాండవులను చిన్నచూపు చూచారు. ఎన్నో కష్టాలను కలుగచేశారు. అయినా పాండవులు సహనంతో ఓర్చుకుని చివరిదాకా పోరాటం చేశారు. చివరకు అధర్మ వర్తనులైన కౌరవులను హతమార్చారు. పాండవులు చక్రవర్తులైనారు. ధర్మవర్తనులుగా వాసికెక్కారు.

వాతావరణం

"నీ స్నేహితులెవరో చెబితే, నీవెలాంటి వాడివో చెబుతాను" అంటారు అనుభవజ్ఞులు. కుటుంబ వాతావరణం, స్నేహవాతావరణంకూడా మనిషి విలువను పెంచుతుంది. మంచి ఆలోచనలు, అలవాట్లు ఉన్నవారితో కలిసి ఉంటే, మంచివాడు అంటారు. సేవా సంఘాల సభ్యులతో స్నేహంగా ఉంటే సమాజసేవకుడు అంటారు. ధార్మిక, సత్సంగ సభ్యులతో ఉంటే సత్ప్రవర్తనుడు అంటారు. విప్లవ భావాలు ఉన్నవారితో ఉంటే విప్లవకారుడు అంటారు. దౌర్జన్యకారులతో ఉంటే రౌడీ అంటారు. అనవసరంగా, అధికంగా ఖర్చుపెట్టేవారితో ఉంటే తిరుగుబోతు, దుబారాగాడు, జల్సారాయుడు అంటారు. పేకాటరాయుళ్లతో ఉంటే పేకాటగాడు అంటారు. త్రాగుబోతులతో ఉంటే త్రాగుబోతు అంటారు. ఎవరైనా చెడు నడతను కలిగి ఉన్నాడు అంటే దానికి సహవాస దోషం ప్రముఖంగా ఉంటుంది.

* తాటి చెట్టు క్రింద కూర్చొని పాలు త్రాగినా కల్లే.
* దుష్టసహవాసం పది రూపాయలిచ్చి వదలించుకోవాలి, మంచి సహవాసం వందిచ్చి సంపాదించుకోవాలి.
* పాకీ దాని శృంగారం కంటే అత్తరు సాయబు కలహం మేలు
* నరకంలో రాజుగా ఉండడం కంటే స్వర్గంలో దాసుడుగా ఉండడం మేలు.

వినయం-వర్తనం

నీ మాట వినక పోయినా, నిన్ను నిర్లక్ష్యం చేసినా, ధిక్కరించినా కోపం వస్తుంది. కాబట్టి నీవు కూడా ఇతరులను నిర్లక్ష్యం చేయవద్దు, ధిక్కరించవద్దు.

ఎదుటివాళ్లను తక్కువగా అంచనావేసి, అహంకారంతో, ఆధిక్యతతో విర్రవీగితే భంగపాటు తప్పదు. ఎదుటివారు చెప్పేది వినయంగా వినాలి. తల్లిదండ్రులు, గురువులు, పెద్దలు, ఇరుగు పొరుగువారు, మిత్రులు అందరూ మన శ్రేయోభిలాషులే. వారితో వినయంగా వ్యవహరించాలి.

మనమూ గొప్పవాళ్ళమే అనుకోవడంలో తప్పులేదు. గొప్ప లక్షణాలను కలిగి ఉన్నామా? లేదా అని పరిశీలించుకోవడం చాలా ముఖ్యం.

అహంకారం, అసూయ, అసహనం, ఆధిక్యత, ఆత్మన్యూనత, అభివృద్ధికి ఆటంకాలు. అవిధేయులను, అహంకారులను ఎవరూ దగ్గరికి రానివ్వరు. వినయం, విధేయత గలవారినే ఎవరైనా ఇష్టపడతారు.

నా కంటే కొన్ని సంవత్సరాలే కదా పెద్ద! అంతమాత్రాన వాడి పెద్దరికం ఏంటి?, నేనూ ముందు పుట్టి ఉంటే పెద్ద వాడినే కదా? వెనక పుట్టడం నేను చేసిన నేరమా? వాడికంటే నేనూ పదాకులు ఎక్కువ చదివినవాడినే! నేనేంది వాడికి గౌరవమిచ్చేది?, మేం పనికిమాలినవాళ్ళమా? అని భావిస్తూ ఉంటారు. ముఖ్యంగా ఈ నాటి యువతలో అవిధేయత, ధిక్కార ధోరణి పెచ్చుమీరిపోయింది.

పెద్దంతరం, చిన్నంతరం లేకుండా పోటీ పడటం, అడ్డు తగలడం, అడ్డదారిలో వెళ్ళడం, అధిక ప్రసంగం చేయడం సర్వ సాధారణమైపోయింది. తమకంటే చిన్నవారు, తమ తర్వాతవారు ఇలాంటి ప్రవర్తనే చూపిస్తే సమ్మతించగలరా?, తట్టుకోగలరా? ఊహూ - తట్టుకోలేరు.

అ, ఆ లు రాకపోయినా అర్హతలు లేకపోయినా అగ్రతాంబూలాలకు ఆరాటపడటం, పోరాడడం నేటి యువతరం లక్షణమైపోయింది. గౌరవాలు, అవకాశాలు-పెద్దరికం, గుర్తింపు, అర్హతలను బట్టి దానంతట అవే మన దగ్గరికి వస్తాయి. సహనంతో, వినయంతో, వివేకంతో, విచక్షణతో మెలిగితే అవకాశాలు తప్పక వస్తాయి.

* వయసు పెరిగితే ముసలితనం వస్తుంది. మనసు పెరిగితే పెద్దరికం వస్తుంది.
* వినయంగా ఉండడం అంటే అణిగి మణిగి ఉండే బానిసతనం కాదు. వినయం, విధేయత అనేది తిరిగి ఇతరులు మన వద్ద చూపించాలని కోరుకునే సభ్యత సంస్కారమే తప్ప మరొకటి కాదు.
* ఉన్నచోటు నుండి ఉన్నత స్థితికి" ఎదగాలంటే వినయమనే నిచ్చెన ఉండాలి. సద్బుద్ధిని, సహృదయతను, ఆత్మవిశ్వాసాన్ని కలిగి వున్న వినయమే - సవినయం.
* ఆత్మన్యూనతాభావం, దుర్బుద్ధితో కూడిన వినయం దాస్యభావనను కలిగిస్తుంది. "అతివినయం ధూర్త లక్షణం" అంటారు.

కార్యసాధకులకు ఉండవలసిన లక్షణాలలో వినయం అతి ప్రధానమైనది. వినయం అహంకారాన్ని అణచివేస్తుంది. బంధు మిత్రులను సమకూరుస్తుంది. మనో నిగ్రహాన్ని కలిగిస్తుంది.

* సహనం తియ్యని ఫలితాన్నిస్తుంది.

పెద్దలు, అతిథులు కనపడినప్పుడు వినయంతో వందనం చెయ్యడం, ఆచార్యులు, గురువులకు పాదాభివందనం చేయడం, పెద్దలు నిలబడిఉండగా పిన్నలు కూర్చోకపోవడం శిష్టాచారం.

వినయమే విలువలకు మూలం

ఒక రాజు తన జన్మదిన సందర్భంగా ఒక యోగీశ్వరుని దర్శనం చేసుకుని నిస్సంతు అయిన తనకు సంతాన భాగ్యం కలుగచేయమని ప్రార్థించుటకు బయలు దేరాడు. రాజు వెంట పెద్దరాణి, చిన్నరాణి, మందీ మార్బలం కూడా బయలుదేరింది.

దర్శనం కొరకు వచ్చిన వారిని ఆ యోగి చిరునవ్వుతో, ఆప్యాయంగా పలుకరించేవాడు. ఎందుకో ఆ వేళ మౌనంగా ధ్యానంలో ఉండిపోయాడు.

ఆశ్రమ వాతావరణమంతా రాజుగారి తాలూకు ఏనుగులు, గుర్రాలు, భటులు, సైన్యంతో కోలాహలంగా మారిపోయింది. రాజుకూడా సర్వాలంకార భూషితుడై దర్పంగా, ఠీవిగా నిలబడి ఉన్నాడు. అత్తరు, పన్నీరు, సుగంధ పరిమళాలు గాలిలో వ్యాపించాయి.

సర్వసంగ పరిత్యాగుల దగ్గర ఆడంబర ప్రదర్శన కూడదని గ్రహించలేని రాజు అనాలోచితంగా యోగిపాదాలను స్పృశించాడు. యోగికి ధ్యాన భంగమై కళ్లు తెరిచి రాజు చెంపపై ఛెళ్లుమనిపించాడు. కిరీటం వెళ్ళి అంత దూరాన పడింది. రాజు దిగ్భ్రమతో నిలబడిపోయాడు.

రాచరిక దర్పం చూపించాల్సింది దర్బారులో. సైన్యాన్ని తీసుకెళ్లాల్సింది యుద్ధ భూమికి. మీ వైభవాలు, వినోదాలు, అట్టహాసాలు గురువుల దగ్గర, యోగుల దగ్గర, ఆశ్రమాల దగ్గర చూపించకూడదు. ఆశీస్సులకోసం వచ్చేటప్పుడు అణుకువతో రావాలి మందలింపుతోకూడిన హెచ్చరికలు చేస్తూ "సంతానం లేదనేగా నీ బాధ?. ఏడాది తిరిగే సరికి పుత్ర సంతానం కలుగుతుంది," ఇక వెళ్లు అన్నాడు యోగీశ్వరుడు. ఆ తియ్యటి వరం మహారాజును ఆనందపరవశుడిని చేసింది.

యోగీశ్వరుని దీవెనల ప్రకారం ఇద్దరు రాణులూ గర్భం ధరించారు. పండంటి కొడుకులను కన్నారు. ఈసారి మహారాజు అత్యంత నిరాడంబరంగా కాలినడకన భార్యా బిడ్డలతో ఆశ్రమానికి వెళ్లారు. ఆశీర్వాదాలతో తిరిగి వచ్చారు.

* వినయంతో విలువ వెయ్యిరెట్లు పెరుగుతుంది.
* వినయం పేరిట దాస్య భావనకు లోనుకాకు. ఆత్మ విశ్వాసం పేరిట అహంకారానికి లోను కాకు.

పోల్చి చూచుకోవడం పోటీ పడటం ఈ రెండూ అసూయ, ఈర్ష్యల వలన కలిగేవే. మనమేమిటో మనం గ్రహించి, మంచి ఆలోచనలతో మన ప్రత్యేకతను పరిరక్షించుకుంటూ అభివృద్ధి చెందడం సరైన మార్గం. అంతేకానీ, ఈర్ష్యాసూయలు మనసులో నింపుకొని, ధిక్కారధోరణితో ప్రక్కనున్నవారి గొప్పదనాన్ని సహించలేక, ఆమోదించలేక వారిని అధిగమించాలని, వారి ప్రయోజనాలకు మోకాలొడ్డి, అభాండాలు వేసి, అణగ ద్రొక్కి, అడ్డదారులలో ఎదిగిపోవాలనుకునే వారికి తాత్కాలిక ప్రయోజనాలు కలిగినా, దీర్ఘకాలిక పతనం తప్పదు.

మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండడం, అభివృద్ధి చెందే ప్రయత్నం చేయడం అభిలషణీయమే. కానీ, అన్నింటిలోనూ మనమే ఉండాలి, అంతా మనకే దక్కాలి అనే అహం, స్వార్థం పనికిరాదు. మన ప్రవర్తన ఇతరులకు కష్టం, నష్టం, జుగుప్స, ఏవగింపు కలిగించేదిగా ఉండకూడదు.

కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం, ఈ భావాలనుండి దూరంగా ఉంటూ, శాంతం, సహనం, దయ, పరోపకారం, సేవ, సహకారం, సత్యం, అహింస, ప్రేమ నీతి, నిజాయితీ భావాలతో జీవించే మార్గమే సన్మార్గం.

తల్లిదండ్రులు, ఆచార్యులు, పండితులు, పాలకులు వీరంతా మానవ సమాజం అనే రథాన్ని నడిపించే సారధులు. తల్లిదండ్రులు తమ బిడ్డలకు సంస్కారాలను నేర్పించి భవిష్యత్తులో ఎలాంటి కష్టమొచ్చినా, మనో నిబ్బరంతో జయించాలే కానీ, చలించకూడదని చెప్పాలి. పిల్లల ప్రవర్తన ఎలా ఉండాలని ఆశిస్తారో దానికి అనుగుణంగా పెద్దల ప్రవర్తనకూడా ఉండాలి. చెప్పేదొకటి చేసేదొకటిగా ఉండకూడదు.

పుస్తక పఠనం

మనిషికి గౌరవాన్ని తెచ్చిపెట్టే అలవాట్లలో పుస్తక పఠనం కూడా ఒకటి. శారీరక, మానసిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక పరమైన అన్ని సమస్యలకు పుస్తక జ్ఞానంతో పరిష్కారం కనుగొనవచ్చు. ఎన్నోరకాల వత్తిడులకు లోనైన మనిషి ఈనాడు నిద్రలేమితో ఎన్నో రాత్రులు గడుపుతున్నాడు. అలాంటివారు పడుకోబోయేముందు పుస్తకాన్ని చదవను మొదలుపెడితే, కాసేపుటికి తప్పక నిద్రవస్తుంది. ఆ విధంగా నిద్ర సుఖాన్ని పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఇది వంద శాతం నిజమని అందరి అనుభవం. ఇంతకంటే చీప్ అండ్ బెస్ట్ టానిక్ ఉండదంటే అతిశయోక్తికాదు.

" పది మంది స్నేహితులవల్ల కలిగే లాభం ఒక మంచి పుస్తకం ద్వారా పొందవచ్చు" అని అనుభవజ్ఞులు అంటారు. పుస్తకం ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటుంది. కాబట్టి ఇతరులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మౌనంగా చదువుకోవచ్చు. మౌనం అనే విశిష్టమైన లక్షణం పుస్తక పఠనం వలన అబ్బుతుంది.

కాలక్షేపం చేసే పరిచయస్తులు కొందరుంటారు. అలాంటివారు వచ్చినపుడు పుస్తకం చదువుతున్నట్లయితే వారు మనలను కాలక్షేపం కబుర్లలోకి దింపకుండా వెళ్ళిపోతారు. అలాగ వారికి దూరంగా ఉండనూవచ్చు, కాలాన్ని సద్వినియోగం చేసుకోనూవచ్చు.

ప్రయాణాలలోనూ, ఏకాంతంలోనూ పుస్తకం చదువుతూ ఉన్నవారిపై ప్రత్యేక గౌరవం చూపిస్తారన్నది చాలామంది అనుభవం. " అందుకే పుస్తకం హస్తభూషణం", " మంచి పుస్తకం మంచి మనసుకు మరోపేరు, సొంత పుస్తకం మంచి మనిషికి మరోతోడు". అంటారు. "మంచి లేఖకుడుగా రాణించాలన్నా, మంచి వక్తగా గౌరవింపబడాలన్నా, మంచి పాఠకుడుగా ఉండాలి" అందుకు పుస్తకమే ఏకైక సాధనం.

పుస్తక పఠనం వల్ల దేశ, విదేశాల సంస్కృతులను ఆకళింపు చేసుకోవచ్చు. సమస్యలకు పరిష్కారాలూ కనుగొనవచ్చు. ప్రాచీన సాహిత్యం, జానపద, పురాణ, విజ్ఞాన, వినోద, సామాజిక పరమైన అన్ని రకాల పుస్తకాలు చదివినందువలన ఎన్నో రంగాల జ్ఞానాన్ని సంపాదించి, మంచి మేధావిగా గౌరవింపబడవచ్చు.

దైనందిన జీవితంలో ఎదురయ్యే సమస్యలు, కుటుంబంలో తలెత్తే సమస్యలు ఇలా ఎన్నింటినైనా పుస్తక పఠనం ద్వారా సంపాదించిన జ్ఞానంతో చక్కగా పరిష్కరించు కోవచ్చు. తద్వారా ప్రశాంత జీవితం గడపవచ్చు. అడిగిన వారికి మంచి సలహాలనిచ్చి

ఏ వృత్తిలోనున్నవారైనా ఆ రంగానికి సంబంధిచిన పుస్తకాలను చదివి, మంచి వృత్తి నైపుణ్యాలను సంపాదించి, సమాజానికి మంచి సేవలు అందించవచ్చు. అందుకే "పుస్తకం మానవ మస్తిష్కం". అంటారు.

" వెలుగుతున్న దీపమే మరొక దీపాన్ని వెలిగించగలదు" కాబట్టి నిరంతరం పుస్తక పఠనం చేస్తున్నవారే తమ జ్ఞానాన్ని నిత్యనూతనంగా ఉండేటట్లు మెరుగు పరచుకోగలరు, ఇతరులకు అందించనూగలరు. అందుకే "ఇష్టపడి చదవాలి కానీ, కష్టపడి చదవరాదు" అంటారు.

పుస్తకాల సేకరణ వ్యక్తి యొక్క ఉత్తమమైన అభిరుచిని తెలియజేస్తుంది. సంస్కారాలను పెంపొందింపచేసే ఈ అభిరుచి వలన ఎంతోమంది పరిచయమవుతారు. పరిచయస్తులు స్నేహితులౌతారు. " పరిచయం పిడికెడన్నం" అన్నారు. ఎంతమంది మనకు స్నేహితులుంటే మన పరిధి అంత విస్తరిస్తుంది. ఆ విధంగా ఏ ఊరికి వెళ్ళినా పనులు సులభంగా చేసుకోవచ్చు. పుస్తకం వలన ఇన్ని ఉపయోగాలున్నందవల్లనే "పుస్తకం మంచి నేస్తం" అన్నారు. " పుస్తక పఠనం సత్సాంగత్యం" అంటారు. రామాయణం చదివితే వాల్మీకితోనూ, భారతం చదివితే వ్యాస భగవానుడితోనూ సత్సంగం చేసినట్లే. పుస్తకాల వలన ఎన్నో లాభాలుండబట్టే "పుస్తకం పరహస్తం గతం గతః" అన్నారు. అంటే పుస్తకం యొక్క విలువను దృష్టిలో పెట్టుకునే ఒకవేళ ఎవరికైనా

ఇస్తే అది తిరిగిరాదు అని అనుభవజ్ఞులమాట. ఈనాడు టి.వి. వచ్చాక "లుక్ కల్చర్ వచ్చింది, బుక్ కల్చర్ పోయింది". వెస్టర్న్ కల్చర్ అందరికీ అలవాటయింది." ఫలితంగా పని సంస్కృతిని, పఠన సంస్కృతిని మరిచిపోయి, సోమరితనం, అవిధేయత. మొదలగు అవలక్షణాలను అలవరచుకున్నాము. బి.పి. షుగర్, కనుచూపు తగ్గడం లాంటి రోగాలను తెచ్చుకుంటున్నాము.

విజ్ఞానం కోసం, వినోదం కోసం, కాలక్షేపం కోసం, పుస్తకాలను చదివే రోజులలో సభ్యత, సంస్కారం, క్రమశిక్షణ, జ్ఞాపక శక్తి, ఆరోగ్యం, ఆనందం, అటు పిల్లల్లోనూ, ఇటు పెద్దలలోనూ బాగా కనిపించేది. అది ఈనాడు కనుమరుగైపోయింది. కాబట్టి కనుమరుగైపోయిన విలువలు మరలా మనుషుల జీవితాలలోకి రావాలంటే పఠన సంస్కృతిని ఎవరికి వారు పునరుద్ధరించుకోవాలి.

ప్రభుత్వంకూడా రచయితలకు మంచి ప్రోత్సాహకాలను ప్రకటించాలి. ముద్రణా వ్యయాన్ని తగ్గించాలి. నాణ్యమైన కాగితాన్ని సరసమైన ధరకు అందుబాటులోకి తేవాలి.

రచయితలు, కవులుకూడా పాఠకులను ఆకర్షించడానికి తగిన రచనలను చేయాలి. ప్రజలందరిలో 'పఠన సంస్కృతిని' తిరిగి ప్రతిష్ఠించాలి. తల్లిదండ్రులు కూడా మంచి పుస్తకాలను కొని, చదువుతూ ఉంటే సంతానం కూడా పఠనాసక్తిని పెంచుకునే అవకాశముంది.

* భూమిలో విత్తనం మొలకెత్తినట్లు మేథస్సులో పుస్తకం మొలకెత్తుతుంది
* పుస్తకం మస్తకంలో దాచిపెట్టే విత్తనం.

పొదుపు

మంచి అలవాట్లలో పొదుపును పాటించడం కూడా ఒకటి. కొండలైనా తరిగిపోవును కూర్చొని తింటే అన్నారు పెద్దలు. అదుపులో ఉంచడమే పొదుపు. పొదుపు అంటే పోగొట్టు దుబారాను పూర్తిగా అనేదే ఆ మూడక్షరాల లోని అర్థం. దుబారాను తగ్గిస్తే సగం పొదుపు చేసినట్లే. ఉన్ననాడు విలువ తెలియక విపరీతంగా ఖర్చు పెట్టి, అవసరానికి దొరకక బాధలు పడేకంటే, తెలివిగలిగి పొదుపు చేసి ఉండినట్లయితే ఈరోజు ఈ పరిస్థితి దాపురించి ఉండేది కాదు కదా?! అని ప్రతివారి జీవితంలోనూ బాధపడిన రోజు ఉండే ఉంటుంది. కాబట్టి ఉన్ననాడు పొదుపు చేస్తే 'లేదు' అనే పరిస్థితి రాదుకదా?!

డబ్బు విషయంలో పొదుపును పాటిస్తే తక్కిన అన్ని విషయాలలో-అంటే సమయాన్ని, వస్తువులను, ఆహార పదార్థాలను, నీటిని, శక్తిని పొదుపుగా వాడుకునే అలవాటు అలవడుతుంది.

చాలామంది చేతినిండా డబ్బుంటే ఎంత బాగుంటుంది అనుకుంటూ ఉంటారు. అవసరాలకు ఏమాత్రం తడుముకోకుండా జేబులోంచి డబ్బు తీసి

ఇవ్వగలిగే స్థాయి ఎంత బాగుంటుంది? ఎంత హుందాగా ఉంటుంది ? అనుకుంటాం. ధనవంతుడుగా మారాలనుకుంటే, నిరంతర పరిశ్రమ సాదాసీదా జీవన శైలి, చక్కని ప్రణాళిక, కార్యదీక్ష, ఓర్పు ఎంతో అవసరం.

" సంపాదించడం కష్టం, ఖర్చుచేయడం సులభం" సంపాదించిన దానిని అవసరానికి తగ్గట్టు ఉపయోగించుకోవడమే విచక్షణ. డబ్బుమీద మనం నియంత్రణ సాధించాలే తప్ప, మన మీద డబ్బు పెత్తనం చలాయించే పరిస్థితి తెచ్చుకోకూడదు. డబ్బుంది కదా అని ఎంత బడితే అంత, ఎలా పడితే అలా ఖర్చు చేయకూడదు. డబ్బుమీద నియంత్రణ సాధించినవారు జీవితంలో అన్నింటా విజయవంతం అవుతారు. ఖర్చులు పోను మిగతా ధనాన్ని పొదుపుచేయాలి, లేదా కొంత ప్రక్కన పెట్టి మిగతాది పొదుపు చేయాలి. ఎలాగైతేనేం పొదుపు మాత్రం చేయాలి.

అవసరాలు ఏవో, ఐశ్వర్యాలేవో గుర్తెరిగి ఆదాయానికి తగ్గట్టు, ప్రాధాన్యతల ననుసరించి డబ్బును ఉపయోగించుకోవాలి. ఆర్భాటాలకు, ఆడంబరాలకు పోయి, ఇరుగు పొరుగు వారితో పోటి పడటం, ప్రలోభాలకు గురవడం లాంటివి జీవితాన్నే మార్చివేస్తాయి. ఖర్చుపెట్టాక బాధపడే బదులు, ఖర్చుపెట్టేముందు బాగా ఆలోచించి మితంగా ఖర్చుపెట్టడం ఎప్పటికైనా ప్రతి ఒక్కరికీ అవసరం.

* మంచం ఉన్నంతవరకే కాళ్లు చాపుకోవాలి.
* మింగను మెతుకు లేకపోయినా మీసాలకు సంపంగినూనె.
* కోరికలు గుర్రాలైతే కాంచనం కర్పూరంలా కరిగిపోతుంది.
* **CUT YOUR COAT ACCORDING TO YOUR POCKET.**
* చిన్న చిన్న ఆదాయాల నుండి చేసే పొదుపు చిన్న చిన్న అవసరాలకు, కష్టాలకు ఉపయోగపడుతుంది.
* అమ్మకానికి వచ్చిందని అవసరంలేని వస్తువును కొంటే, తర్వాత అవసరమున్న వస్తువును అమ్ముకోవలసి వస్తుంది."చిన్న పొదుపు పెద్ద గెలుపు".
* దేనినైనా తొందరపడి ఇస్తే, రెండవ సారి కూడా ఇవ్వవలసివస్తుంది.

పదార్థాలు, వస్తువుల విషయంలో కూడా జాగ్రత్త వహించాలి. దేని విలువ దానికి ఉండనే ఉంటుంది. ప్రస్తుతానికి పనికిరాదని పారవేసి, మరలా దానికోసమే, దానితోనే పని పడి వెదికిన అనుభవం ప్రతి ఒక్కరికీ ఉంటుంది.

* వస్తువుల విలువ అవిలేని రోజున తెలిసివస్తుంది.
* దేనినీ చులకనగా చూడకు, పనికిరాదని అసహ్యించుకోకు, ఉపయోగించుకొనుటకు పనికిరానంతవరకు వస్తువులను ఉపయోగించాలి.
* దేనినైనా అదుపులో ఉంచుకో, పొదుపుగా వాడుకో. తాత్కాలిక ప్రయోజనంకంటే దీర్ఘకాలిక ప్రయోజనాన్ని గుర్తించాలి.


* ఆదాయంలో పొదుపు దరిద్రాన్ని పోగొడుతుంది. ఆహారంలో పొదుపు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.

సంపాదించడం మన ఆనందం కోసమే. తిండి, బట్ట, ఇల్లు, పిల్లలు, ఆరోగ్యం, విద్య, విజ్ఞానం, వినోదం అన్నింటినీ సమకూర్చుకోవాలి. పిసినారితనం లేకుండా, దుబారా చేయకుండా విచక్షణగా ఖర్చుపెట్టాలి.

* నేను నిజంగా ఐశ్వర్యవంతుడినే! ఎందుకంటే నా ఆదాయం కంటే ఖర్చు తక్కువ.
* దుబారాకు దూరంగా ఉంటే ధనవంతుడే.
* లోపరహిత ప్రయత్నమునుసరించి ఫలితం ఉంటుంది. అంతేకానీ తొందరపాటు తనంతో ఆశించినంత మాత్రాన ఫలితాలు దక్కవు. ఓర్పు, సహనం అవసరం.
* మంచి నడవడికను ఋజువర్తనం అనీ, సభ్యతా సంస్కారమనీ అంటారు.
* దున్నని నేల, సంస్కారం లేని మనసు మంచి ఫలితాలనివ్వవు.

తెల్లవారుజాముననే నిద్ర లేవడం, కాలకృత్యాలు తీర్చుకోవడం, వ్యాయామం, ఇంటి పనులు చేయడం, చదువుకోవడం, పరిశుభ్రతను పాటించడం, దైవప్రార్థన, మంచి అలవాట్లు. సత్ప్రవర్తన కలిగిన వారికి ఎంతో గౌరవం వుంటుంది. అలాంటి వారినే అందరూ ఇష్టపడతారు. స్నేహం చెయ్యాలనుకుంటారు.

* అలవాట్లు మొదట సాలెగూడులోని దారాల వలె సున్నితంగా ఉంటాయి. కానీ, రానురాను ఉక్కు తీగలవలె బలంగా పట్టుకుంటాయి.



స్నేహం

* స్నేహం ఒక విశిష్టమైన, విలక్షణమైన భావన. జీవితంలోని సమస్త కాలాలలో ప్రతి మనిషి వ్యక్తిత్వంలో ఉండవలసిన అత్యంత అవసరమైన ఆత్మీయ లక్షణం. నిజమైన మిత్రుల మధ్య కృతజ్ఞత, త్యాగం వంటి మహోత్కృష్ట లక్షణాలు ఎప్పుడూ పరిమళిస్తూనే ఉంటాయి.
* స్నేహం ఒక సహజాతం. పుట్టుకతో వచ్చే ఒక గుణం. ప్రాణాలిచ్చైనా మేలు చేయడం స్నేహ స్వభావం.
* 'స్నేహం' నిస్వార్థమైన ఒక మధుర భావనతో కూడిన కర్తవ్యం మాత్రమే. అంతేకానీ ఉపయోగించుకునే అవకాశం కాదు.
* ఇద్దరిలో ఒకరికి జగడమంటే ఇష్టం లేకుంటే తగవు రానేరాదు. స్నేహమూ చెడిపోదు.
* స్నేహం చెయ్యడానికైనా, వదలడానికైనా నిదానం కావాలి.
* పాపపు ఆలోచనల నుండి, దురలవాట్లనుండి మరల్చువాడే నిజమైన స్నేహితుడు.
* దోషాలు లేని స్నేహితులను వెదికేవారు, స్నేహితులు లేకుండానే మిగిలిపోతారు.
* ఉత్తమ గ్రంథం (భగవద్గీత, బైబిల్, ఖురాన్) మోసం చెయ్యని జీవితాంతపు స్నేహితులు.
* తెలివి తక్కువ మిత్రుని కంటే తెలివైన శత్రువు మేలు.
* చెడు సహవాసం కంటే ఒంటరిగా ఉండడం మేలు. ఒంటరిగా ఉండడం కంటే మంచి మిత్రునితో ఉండడం మేలు. చెడు మాట్లాడ్డం కంటే మౌనంగా ఉండడమే మేలు.
* స్వార్థపరుడు, నీచుడు ఎల్లప్పుడూ తనకనుకూలంగా అందరూ జీవించాలని అనుకుంటాడే కానీ, తాను గొప్పవాడిగా ఎదగాలనీ, జీవించాలనీ ఎన్నడూ అనుకోడు.
* నిజమైన స్నేహితుడు నిజాన్ని నిశ్శబ్దంగా తనలోనే దాచుకుంటాడు.
* తాను తప్పు చేశానని ఒక మూర్ఖునిచేత అంగీకరింప చేసేటందుకు ఉత్తమమైన మార్గం - అతడి దారిన అతడిని పోనివ్వడమే.
* నాలుకమీది తేనెను కాదు చూడవలసింది. మనసులోని విషాన్ని.
* మాటలలోని కటువును కాదు చూడవలసినది. మనసులోని మృదుత్వాన్ని.
* స్నేహితుడి అవసరం, స్నేహం విలువ కోల్పోయాకే తెలుస్తుంది.
* కత్తితో వచ్చిన శత్రువు నుండి తప్పించుకోవడమో, ఓడిపోవడమో, గెలవడమో జరుగుతుంది. కానీ ఆ కత్తిని పట్టుకోవడానికి ప్రోత్సహించిన మిత్రుడిని లేదా ప్రేక్షకపాత్ర వహిస్తున్న మిత్రుడిని కనుగొనడమే కష్టం.
* ప్రేమ, మైత్రి ఉన్న సమయంలో తప్పులు కనబడవు. అవి చెడిపోయినపుడు, పువ్వు మీదపడినా, చెప్పు మీ మీద పడినంత అసహ్యం కలుగుతుంది.

* అసూయతో కొంత మంది ఒకరిని ఇంకొకరిపైకి పురిగొల్పుతూ ఉంటారు. వారు మంచి ఆలోచనలను దరిచేరనివ్వరు. చెడును మాత్రం ప్రోత్సహిస్తూ ఉంటారు. ఇటువంటివారు దురదృష్టవశాత్తూ మనకు మిత్రులుగా ఉన్నట్లయితే మన పట్ల చెడును కానీ ద్వేషాన్ని కానీ, పగను కానీ వ్యక్తం కానివ్వరు. మన ప్రక్కనే ఉంటూ అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉంటారు. మూడో వ్యక్తికి మనపట్ల ద్వేషం కలిగేదాకా పురిగొల్పి మనమీద పగతీర్చుకుంటూ లోలోన ఆనందిస్తూ మనతోటే ఉంటారు. ఇలాంటి నయవంచకులతో జాగ్రత్తగా ఉండాలి.
* నిజమైన స్నేహితుని ఇల్లు ఎక్కడున్నా దూరం కాదు. అబ్బా ! "నీదగ్గరికి రావాలంటే....... నీఇల్లు చాలా దూరంరా - నీవే ఎలాగూ వస్తావు కదా అని నేను రాలేదు" అనేవారి స్నేహం ఎంతో కాలం నిలవదు.
* ప్రయోజన స్నేహం - ప్రయోజనం తీరిన తర్వాత ఆగిపోతుంది.
* తనవలన పొరబాటు, లేక తప్పు జరిగిపోయిందనిపించినపుడు వెంటనే క్షమాపణ చెబితే....తప్పు చేశామన్న భావన కొంచెం తగ్గుతుంది.
* స్నేహంలో క్షమాపణ చెప్పే అవకాశాన్ని రానివ్వకూడదు.
* దారిచూపేవాడు హితుడు. కలసి నడిచేవాడు స్నేహితుడు.
* అశ్రద్ధ, నిర్లక్ష్యం, కోపం, తొందరపాటుతనం స్నేహానికి శత్రువులు.
* మిత్రులు జ్ఞానవంతులైతే భవిష్యత్తు కార్యాచరణ గురించి ఆలోచనలు జరుగుతాయి. సామాన్యులైతే చుట్టూ జరుగుతున్న సంఘటనల గురించి మాట్లాడు కుంటారు. అజ్ఞానులైతే ఇతరుల గురించి సొల్లు కబుర్లు మాట్లాడుకుంటారు.
* స్నేహితులేకదా, ఎలా అయినా వ్యవహరించవచ్చు అన్న అభిప్రాయం మాత్రం ఉండకూడదు. ఎవరి హద్దుల్లో వాళ్ళుండాలి. సహృదయం, సద్బుద్ధితో మెలుగుతూ ఉండాలి. స్నేహితులు సాయపడతారన్నది నిజమే అయినా, మీ సమస్యల భారాన్ని వారి మీద వేయడం మంచిది కాదు. పరిమితులను, పరిస్థితులను గుర్తుంచుకుంటూ మెలిగితే, స్నేహం కలకాలం నిలుస్తుంది.
* అందరిలోనూ ఉండవలసినది
  మానవతలో మొదటిది
  పువ్వులాగా అందమైనది
  మంచులాగా స్వచ్ఛమైనది
  కోకిల గానమంత తీయనైనది
  నెమలి నాట్యమంత మనోహరమైనది
  తేనెలా మధురమైనది
  గంగాజలంలా పవిత్రమైనది
  ఇప్పటికీ ఎప్పటికీ చెరిగిపోనిది ఈ లోకంలో స్నేహమొక్కటే

* కొత్త స్నేహితులను పొందడానికి ఓ చిట్కా - పరిచయమైన వాళ్ళతో మాట్లాడుతున్నపుడు నీ గురించి ఎక్కువగా చెప్పొద్దు. తమ గురించి వారు చెప్పకున్నదంతా జాగ్రత్తగా, శ్రద్ధగా విను. వారి పేర్లను బాగా జ్ఞాపకం పెట్టుకుంటేచాలు. అందరూ నీకు మిత్రులే.
* నీకు మంచి మిత్రులు కావాలనుకుంటే - నీవొక మంచి మిత్రుడిగా ఉండాలి.
* ప్రతి వారినీ ప్రాణ స్నేహితులుగా అంగీకరించలేం. చూడగానే హృదయంలో ఒక అవ్యక్త అనుభూతి కలగాలి. నమ్మకం, ప్రేమ, ఔదార్యం, హుందాతనం, వారి వ్యక్తిత్వంలో మనకు గోచరించాలి.
* స్నేహం చేయాలన్న ఆకాంక్ష ఇరువురిలోనూ ఉండాలి. ఒకరిలో మాత్రమే ఉంటే సరిపోదు.
* యధార్థ మిత్రులు నీలోని సుగుణాలను ప్రోత్సహిస్తారు, అదే సమయంలో చెడుగుణాలను అణచివేస్తారు. మనలోని అనారోగ్య భావనలను ఎత్తి చూపినపుడు, విసుక్కోకుండా, ఓపికతో వినాలి. తప్పులను ఎత్తిచూపడం మిత్రుల బాధ్యత.
* చేయి ఊపడం, హలో! అని పలుకరించడం, ఉన్నఫళంగా వచ్చి కలుసుకోవడం, ఆప్యాయంగా కౌగిలించుకోవడం, భుజంమీద చేయివేసి నడవడం, అరమరికలు లేకుండా మాట్లాడటం, కళ్ళలోకి సూటిగా చూస్తూ మాట్లాడటం లాంటివి బలమైన స్నేహానికి సూచనలు.
* కొందరిని చూడగానే మనకు బాగా నచ్చుతారు. ఏదో తెలియని ఆత్మీయత లోలోన కలుగుతుంది. అటువంటి వారితో ప్రత్యేకమైన ప్రయత్నం లేకుండానే స్నేహం చేసేస్తాం.
* ప్రేమ బంధంలో లాగానే, స్నేహబంధంలోనూ నిరాశలు, నిస్పృహలు, అపార్థాలు, ఎడమొహం, పెడమొహం లాంటి పరిస్థితులు మనల్ని వెంటాడుతూనే ఉంటాయి. విచక్షణతో, ఓర్పుతో, నేర్పుతో, స్నేహబంధాన్ని కాపాడుకోవాలి.
* సమయానికి పనికిరాని మిత్రులను, అనారోగ్య వాతావరణాన్ని, హితవు కోరని వారిని, మంచిని చేస్తున్న నిన్ను నిరుత్సాహపరిచే వారిని దూరంగా ఉంచాలి. పాత స్నేహితులనో, మొహమాటం వలననో, పదిమందీ ఏమనుకుంటారో అనో, అననుకూల, అనారోగ్య వాతావరణాన్ని పట్టుకొని వేలాడటం తక్షణం ఆపేయాలి. లేకుంటే కోలుకునేలోపు కొంప మునుగుతుంది.

స్నేహం పదిలంగా పదికాలాలపాటుండాలంటే ఇలా చేయాలి

* స్నేహితులంటే ఇష్టం, గౌరవం ఉండాలి. సామరస్య భావన ఉండాలి.
* పాత స్నేహితులను విస్మరించనక్కర్లేదు. వారికివ్వవలసిన స్థానం వారికిస్తూనే క్రొత్త వ్యక్తులలోకూడా మీకు ఆత్మీయులు కాదగ్గవారూ ఉంటారు. వారిని మీ స్నేహితుల

జాబితాలో చేర్చుకొనుటకు స్నేహహస్తం చాచండి. అందుకు కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి.

* మీ స్నేహితులకు మీరు చేసిపెట్టలేని పనులను వారు మీకు చేసిపెట్టాలని ఆశించవద్దు.
* మీ ప్రాధాన్యాలు, మీ స్నేహితుల ప్రాధాన్యతలు బిన్నంగా ఉండొచ్చు అయినా పరస్పర గౌరవాభిమానాలలో ఏలోటూ రానివ్వకుండా స్నేహాన్ని కాపాడుకోవాలి.
* అపార్థాలూ, మాట పట్టింపులూ, ఎడమొహం పెడమొహంలాంటి అపశృతులు అపుడపుడూ రావడం సహజం. అలాంటపుడు తప్పొప్పుల జోలికి పోకుండా బేషరుతుగా రాజీపడడానికి ఏలాంటి సంకోచమూ పెట్టుకోకుండా ముందడుగు వేయాలి.
* సంతోషకరమైన సందర్భాలు కానీ విషాదకరమైన సందర్భాలు కానీ ఎదురైనపుడు వాటిని మనసారా పాలుపంచుకోవాలి.
* ఇవ్వవలసిన బాకీ, తీసుకున్న అప్పు లేకుండా ఉన్న స్నేహమే కలకాలం నిలుస్తుంది.

ఇలాంటివారు స్నేహానికి పనికిరారు

* మిమ్ములను అస్తమానమూ విమర్శిస్తూ ఆత్మన్యూనతకు లోను చేసే వారు.
* మీరంటే గౌరవం, ఇష్టం, విశ్వాసం లేనివారు.
* మీ విజయాలను, సంతోషాలను చూచి ఓర్వలేనివారు.
* కళ్ళలోకి సూటిగా చూస్తూ మాట్లాడలేనివారు.
* మాట్లాడేటపుడు అసహనం, అనాసక్తి కనబరచేవారు.
* మీరు మాట్లాడుతున్నంత సేపూ కాలుమీద కాలు వేసుకునో, చేతులు కట్టుకునో ఉంటే మీ మాటలు వింటున్నారు తప్ప, ఆమోదించడం లేదని అర్థం.
* మీరు ఏమి చెప్పినా చప్పున ఒప్పేసుకుంటూ, మీరెలా చెబితే అలాగే అనేవారు.
* కలుసుకున్నపుడు సంతోషంతో చేయి చేయి కలిపినపుడు ఎవరి స్పర్శ చప్పగా, సచ్చుగా, మెత్తగా, మెల్లగా, బలహీనంగా ఉంటుందో అలాంటివారు.
* కష్టసుఖాలు, బాధలు, ఇబ్బందులు, మానాలు, అవమానాలు, అభిప్రాయాలు తనతో పంచుకుంటున్నప్పటికీ, విని మౌనంగా ఉండటం తప్ప తమ సంగతులేవీ మీదగ్గర ప్రస్తావించనివారు
* హామీలను నిలబెట్టుకోలేనివారు, ముఖం చాటేసేవారు, మాటిమాటికీ 'సారీ ' చెప్పేవారు, లోపాలను కప్పిపుచ్చుకునేదానికి ఏదో ఒక కారణం, మరేదో ఒక కుంటిసాకు చెప్పి సమర్థించుకునేవారు.
* మిస్‌డ్‌కాల్ చేసే అలవాటున్నవారిని.
* అందరికీ స్నేహితుడనని అనుకునేవాడు - ఎవరికీ స్నేహితుడు కాలేడు.

* మరికొందరు ఎదుటివారి లోపాలను, ఎపుడో చేసిన పొరపాట్లను బాగా గుర్తుపెట్టుకొని సందర్భం రాకపోయినా మెలికలు తిప్పి, అనుకూలంగా మలచుకొని, నలుగురిముందు చాకచక్యంగా బైట పెడుతుంటారు. అప్పటికి అవి ఏమాత్రం అవసరం లేక పోయినా, అవేవో ఇటీవలే, నిన్నామొన్నా జరిగినట్టుగా, తాజా వార్తల లాగా బైటపెట్టేస్తుంటారు. వీరు ఎపుడు ఏం మాట్లాడతారోనని స్నేహితులు భయపడి చస్తుంటారు. అలాంటివారు.
* మాటసాయం కోసమనీ, మనుషుల సాయం కోసమనీ, డబ్బు సాయం కోసమనీ, తోడు కోసమనీ అడిగేదానికి వెళ్ళినపుడు, మన బాధనంతా ఆసాంతం విని "అబ్బా! నీవు ఎందుకు అలా మాట్లాడినావు? ఎందుకు అలాంటివారి జోలికి వెళ్ళినావు? నీవు ఎప్పుడడిగినా డబ్బులేని సమయం చూచుకునే అడుగుతావే? ఇంటికి ఫలానావారు వచ్చారు, వారి కోసం వెళ్ళాలి, మీతో ఇపుడు రావడానికి కుదర్దు, అని చాకచక్యంగా మాట్లాడి తప్పంతా మనదే అయినట్లుగా చిత్రీకరించి తాము ప్రస్తుతం ఏమీ చెయ్యలేము" అని మనలను బాధపెట్టకుండా చిరునవ్వుతో తప్పించుకొని పోయేవారు.
* మన భావాలు, అభిప్రాయాలు, అనుభవాలు, తల్లిదండ్రులకు నచ్చకపోతే మనలను మందలిస్తారు, ఆంక్షలు విధిస్తారు, ఫలానా విధంగా నడచుకోవాలని శాసిస్తారు. ఇంటిలోని సోదరి, సోదరులతో కంటే స్నేహితులతోనే స్వేచ్ఛగా, హాయిగా ఉండగలుగుతాం.
* స్నేహం చేసేటపుడు ఒకింత జాగ్రత్తగా ఉండడం అవసరం. ఫలానా వ్యక్తితో స్నేహం ఎందుకు చేస్తున్నావంటే వివరించగలిగే కారణాలుండాలి.
* స్నేహం ఎంతటి సున్నితమో, అంత దృఢమైనది కూడా. పక్వంగా ఉన్నపుడు ఎంతటి అమృతమో ..... చెడితే అంతటి విషతుల్యం.
* దివ్యగాథలు వినటం, చదవటం ద్వారా, సమాజంలో మనకు కనిపించే ఆదర్శ వ్యక్తులను పరిశీలించడం ద్వారా, మనం ఏమైనా నేర్చుకున్నామా ? ఆచరణలో మన స్నేహ ధర్మాన్ని సరిగా పాటిస్తున్నామా ? అని ఎవరికి వారు వేసుకోవలసిన ప్రశ్నలు.
* స్నేహం అనేది నీడనిచ్చే మహావృక్షం. శాఖోపశాఖలుగా విస్తరించిన విధంగానే మిత్రులుకూడా చాలా వెరైటీలుగా, చాలా రకాలుగా ఉంటారు.

బాల్యమిత్రులు, ఇరుగు-పొరుగు మిత్రులు, వీధి బడి మిత్రులు, కళాశాల మిత్రులు, కలం స్నేహితులు, పానశాల మిత్రులు, ఉద్యోగ మిత్రులు, రచ్చబండ (చెట్టుక్రింద) మిత్రులు, ఆటలోని జట్టు మిత్రులు, ప్రయోజన మిత్రులు (అవసరాల మిత్రులు), రహస్య మిత్రులు, విపరీత మిత్రులు, ప్రయాణ మిత్రులు.

ప్రయోజన మిత్రులు : స్నేహాన్ని పురస్కరించుకొని, నీ తలమీద నా కాళ్ళను మోపనివ్వవా? ప్లీజ్ అంటారు. అవసరమున్నపుడు మాత్రమే కలుస్తూ అవసరం గడిచాక మరలా అవసరం వచ్చేవరకూ కనిపించని వాళ్ళనే అవసరాల మిత్రులంటారు. అలాంటి వారికి ఎదుటి వారి కష్టసుఖాలతో నిమిత్తం లేదు. కేవలం వాళ్ళ అవసరాలు మాత్రమే ముఖ్యం. ఇలాంటి వారు తమ వెంట ఉన్నవారిని ఏ క్షణములోనైనా దారి మధ్యలో వదలి వెళ్ళిపోతారు.

ప్రమాద మిత్రులు : వీరు ఎదుటివారి అంతరంగిక విషయాల్ని, బలహీనతల్ని సొంతలాభం కోసం నిర్ధాక్షిణ్యంగా ఉపయోగించుకుంటారు. ఎంతటి ప్రమాదానికి లోను చేసైనా వారి ప్రయోజనం చూచుకుంటారు.

విపరీత మిత్రులు : వీరు పక్కా శత్రువులులాగా కనిపిస్తూ ఉంటారు. పాతబడ్డ భార్యాభర్తలు లాగా అనునిత్యమూ ఒకరిపై ఒకరు నిప్పులు చెరుగుతూ ఉంటారు. విమర్శలూ - ప్రతి విమర్శలూ తారా స్థాయిలో ఉంటాయి. కత్తి దూస్తానని ఒకడంటే, తల నరికేస్తానని ఒకడంటాడు. పచ్చి బూతు మాటలతో తిట్టుకుంటారు. కానీ వారెంతటి ప్రాణమిత్రులో మరుసటి రోజు ఒకరి భుజాలమీద ఒకరు చేతులేసుకొని నడుస్తూవుంటే తెలుస్తుంది.

* ఏవో బలహీనతలవల్ల, చేతకానితనం వల్ల, అవగాహన, అనుభవం లేనితనం వల్ల కొందరు కొన్ని పనులను చేయలేరు. సకాలంలో స్పందించలేరు, సహాయం చేయలేరు, సలహాలనివ్వలేరు. అంతమాత్రాన ఎడమొగం-పెడమొగం అయిపోకూడదు. ఆంతరంగిక ఉద్దేశ్యమే ముఖ్యం. చెడు ఉద్దేశ్యము, ద్రోహచింతన, కపట బుద్ధి, తప్పించుకునే తత్త్వం లేనంతవరకు మిత్రులను నమ్మవచ్చు. తెలిసీ-తెలియక చేసిన పొరపాట్లను క్షమించుకుంటూ ఒక అవగాహనతో స్నేహాన్ని పరిరక్షించుకుంటూ జీవించాలి.
* అవసరాలలో ఆదుకునేవాడే ఆప్తుడు, మిత్రుడు.
* స్నేహం అవసరాలకు ఆదుకునేదే, కానీ అంతకుమించి ఒక ఓదార్పు, ఒక ధైర్యం, ఒక విశ్వాసం అని తెలుసుకోవాలి.
* డబ్బుతో స్నేహితులను సంపాదించవచ్చు. కానీ డబ్బులేకుండా స్నేహితులను సంపాదించడమే గొప్ప.
* ఆర్థిక లావాదేవీలలో స్నేహం నిలబడాలంటే కొన్ని ధర్మాలను పాటించి తీరాలి.
* ఆప్త మిత్రుల దగ్గర అప్పు చేయరాదు. విధిలేని పరిస్థితులలో అప్పు తీసుకున్నపుడు చూపించిన స్నేహ భావం, కృతజ్ఞత తిరిగి ఇచ్చేటపుడుకూడా ఉండాలి. స్నేహానికి పునాది విశ్వాసం. పునాది ఏమాత్రం బీటలు వారినా స్నేహమనే సుందర మందిరం కూలిపోతుంది. కాబట్టి విశ్వాసాన్ని ఎట్టి పరిస్థితులలోనూ సడలనివ్వరాదు.

* అవసరాలు లేనివాడు, అవసరాలు రానివాడంటూ లోకంలో ఎవరూ ఉండరు. అలాగని ప్రతి సందర్భంలోనూ మిత్రులు ఆదుకోవాలని ఆశించరాదు. ముఖ్యంగా డబ్బు అవసరం అందరికీ, అన్ని వేళలా ఉండేదే. ఒకసారి డబ్బిచ్చి ఆదుకున్నాడు కదా ? అని ప్రతి అవసరంలోనూ డబ్బు ఇచ్చి అవసరాలను తీర్చాలని ఆశించడం స్నేహ ధర్మం కాదు. స్నేహానికి ఆర్థికావసరాలతో ముడిపెట్టనే కూడదు. ముడిపెడితే మాత్రం ఆ స్నేహం ఎంతోకాలం నిలువదు.
* ఒక్కో సందర్భంలో మిత్రులు అవసరానికి డబ్బులు సర్దుబాటు చెయ్యలేక పోవచ్చు. దానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. అంతమాత్రాన అపార్థం చేసుకొని, అపోహలు పెంచుకుంటే మైత్రి దెబ్బతింటుంది. అందుకని తొందరపాటు నిర్ణయాలు, వెంటనే అపార్థాలు చేసుకోవడం, నోరుపారేసుకొని, నాలుక్కరచుకోవడం లాంటివి చేయకూడదు.
* మిత్రులంతా కలసి సినిమాలకు, షికార్లకు, తీర్థయాత్రలకు వెళ్ళునపుడు ఒక పద్ధతి ప్రకారం అవగాహనతో నడచుకోవాలి. సాధారణంగా ఫలానావాడు షావుకారి, వాడే ఖర్చుపెట్టగలడు, కాబట్టి వాడే చూచుకుంటాడులే అనీ. ఫలానావాడికి ఆదాయమార్గాలు అనేకం ఉన్నాయి కాబట్టి మనం ఏమీ భయపడనవసరం లేదు, అన్నీవాడే చూచుకుంటాడు, మనం నిశ్చితంగా ఉండొచ్చు. మన వెంట వాడుండగా మనకెందుకురా భయం, అన్ని ఖర్చులూ వాడే చూచుకుంటాడు. అనే ధీమాతో ఎన్నో సందర్భాలలో వాడి దగ్గర ఉంటుందిలే అని వీడు, వీడి దగ్గరుంటుందిలే అని వాడు ముసుగు విశ్వాసాలతో, మూగ భావాలతో, ఏ దుకాణానికో, ఏ హోటలుకో, ఏ బారుకో వెళ్ళి, భంగపడిన సందర్భాలు అందరి జీవితాలలో ఎప్పుడో ఒకప్పుడు జరిగేవే. ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడానికి కారణం మూగనమ్మకాలు. డబ్బులున్నాయా? లేవా ? అని చర్చించుకునే మానసిక పరిపక్వత లేకపోవడం, నిర్లక్ష్యం.

షావుకారే అయినా, ఖర్చుపెట్టగలిగే భోళాతనం ఉండినా, ఒకనాటికి మాత్రం పశ్చాత్తాపపడక తప్పదు. మిత్రులలో ఎవరు బాధపడినా అది అందరికీ వర్తిస్తుంది. కాబట్టి ఒక ఆలోచన, ఒక అవగాహన ఉండాలి.

కొంతమంది కలసి ఎక్కడికైనా వెళితే ఇలా చేస్తారు

ఖర్చులకయ్యే మొత్తాన్ని ముందుగానే ఉజ్జాయింపుగా లెక్కకట్టి, అందరూ సమానంగా, తమ వంతు పైకాన్ని తమకంటే బాధ్యతగా మెలిగేవానికి ఇచ్చి ఖర్చు పెట్టమని చెబుతారు. కార్యక్రమం పూర్తయ్యాక లెక్కచూచుకొని, ఇచ్చి-పుచ్చుకోవాడాలు సరి చూచుకుంటారు. ఇలా చేస్తే ఎవరికీ ఇబ్బందుండదు. అందరికీ తృప్తి, సంతోషమూ, మధురానుభూతి మిగులుతుంది.

అలా కాకుండా ఎవరికి తోచినట్లు వారు అస్తవ్యస్తంగా ఖర్చుపెడుతూ వస్తే కార్యక్రమం చివరలో ఫలానావాడు తక్కువ ఖర్చుపెట్టాడు, ఫలానావాడు జేబులోంచి అసలు పైసలే తియ్యలేదు, పిసినిగొట్టు. ఫలానావాడు తినేదానికి ముందు, ఖర్చు పెట్టేదానికి వెనుక అనే ఫిర్యాదులు వస్తాయి. మనస్తాపానికి లోనౌతారు. కాబట్టి స్నేహంలో పారదర్శకత ఉండాలి.

పెద్ద మొత్తాలలో పైకం తీసుకున్న సందర్భాలలో అనుకున్న వడ్డీ ప్రకారం లేదా ధర్మవడ్డీ ప్రకారం చెల్లించి విశ్వాసాన్ని, నిజాయితీని నిలుపుకోవాలి. వస్తు, వాహనాలను "పుచ్చుకున్నపుడు అనుకున్న విధంగా తిరిగి ఇచ్చివేయాలి".అనే నియమానికి కట్టుబడి ఉండాలి. కొంతమంది తిరిగి చెల్లించే స్థోమత లేనివాళ్ళు" అవసరం గడిస్తే చాలు తర్వాత చూద్దాంలే" అని చేబదుళ్ళు, అప్పులు చేసుకుంటూ పోతుంటారు. అలాంటి వారి విషయంలో మాత్రం "అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరమే మేలు" అనే సూక్తిని పాటించాలి. లేకుంటే డబ్బూ పోతుంది. స్నేహము పోతుంది.

కొన్ని సందర్భాలలో మొహమాటానికి పోకూడదు. లేదు, కాదు, వసతి లేదు, తర్వాత చూద్దాం అని కూడా అనగలగాలి. లేకుంటే "ములాజాకు పోయి ముండ గర్భం తెచ్చుకున్నట్లు" కష్టాలు తప్పవు.

కొంతమంది మిత్రులు, ఇరుగు-పొరుగువారు - సంపాదన ఎంత? ఖర్చు ఎంత? మిగులువాసి ఎంత? అప్పులు ఏమైనా ఉన్నాయా? ఉంటే ఎంత మాత్రముంటుంది? అనే విషయాలను తరచి తరచి ఆరాతీస్తుంటారు. ఇలాంటి వారే అపుడపుడూ "డబ్బుతో చాలా ఇబ్బందిగా ఉంది" అనే మాటను కూడా ఉపయోగిస్తుంటారు. ఇలా అంటున్నందుకు వారికి మూడందాలా ప్రయోజనం ఉంటుంది. ఒకటి-తమ మాదిరిగా ఎదుటివారు ఆర్థిక పరిస్థితులను ఆరా తీసేటందుకు అవకాశం లేకపోవడం. రెండవది ముందుగానే ఆర్థిక ఇబ్బందులున్నాయంటున్న తమను అప్పు అడిగే అవకాశం ఉండకపోవడం. మూడవది " అంతగా ఇబ్బంది ఉంటే మమ్ములను అడక పోయావా? సర్దుబాటు చేసేవాళ్ళంకదా?" అనేవారూ దొరకవచ్చు.

* కొంతమంది పరిచయస్తులు స్నేహమనే ముసుగులో విందులకు, వినోదాలకు, సరదాలకు పిలిచి నెమ్మదిగా ముగ్గులోనికి దించి అవసరాన్ని బైటపెట్టి, చేబదులో లేక అప్పో అడుగుతారు. ఇచ్చే స్థోమత ఉన్నా తొందరపడి ఇవ్వరాదు. ఇలాంటి విందు దౌత్యం నమ్మదగినది కాదు. కాబట్టి-చూద్దాం, ప్రస్తుతానికి లేదు, ఓ పక్షం రోజుల తర్వాత రావలసిన పైకం అందితే ఇవ్వగలను" అని విషయాన్ని తేల్చిచెప్పకుండా, తడిమిపెట్టి తప్పించుకోవాలి. తర్వాత అప్పు అడిగినవాడి అవసరం ఎలాంటిది? కావలసిన మొత్తం ఎంత ? తిరిగి చెల్లించే సామర్థ్యం ఉందా?

ఆదాయవనరులు ఎలాంటివి? ఇంతకుముందు ఎవరి దగ్గర ఆర్థిక సంబంధాలు ఉండినవి. వారి దగ్గర ఇతని లావాదేవీలు ఎలా ఉండినాయి అనే విషయాలను చక్కగా ఆరా తీసి, మదింపు చేసుకొనిగానీ ఇవ్వడమా? మానడమా! అనే విషయాలను నిర్ణయించుకోవాలి.

* ఇద్దరు సమ వయస్కుల మధ్య స్నేహం పదిలంగా ఉండేదానికి అవకాశం ఎక్కువ.
* ఎపుడూ ఏకపక్షంగా మిత్ర లాభాలను పదే పదే పొందుతూ ఉంటే స్నేహానుబంధ బలం క్షీణిస్తుంది. స్నేహం వలన ఇరువురూ సమానస్థాయిలో స్నేహానుభూతిని పొందుతూ ఉంటే స్నేహం కలకాలం మనగలుగుతుంది.
* తామస గుణం కలవారికి ప్రేరణ, రాజస గుణం కలవారికి ప్రోత్సాహం, సాత్విక గుణం కలవారికి ఉత్సాహం మంచి స్నేహితుడి వలన లభిస్తుంది.

కొందరు కష్టకాలంలో మాత్రమే స్నేహితులను గుర్తుకు తెచ్చుకొని లావాదేవీలు మొదలు పెడతారు. అలాంటపుడు చెయ్యదగిన తాత్కాలిక సహాయం, ఇవ్వదగిన సలహా ఇచ్చి పంపివేయాలి. భావావేశానికిలోనై, పాత ప్రేమలో మునిగి తనకు మించిన భారాన్ని పైన వేసుకొని కష్టాలు కొని తెచ్చుకోకూడదు. ఎందుకంటే వచ్చినవాడు నిన్ను మరచిపోయిన పాత స్నేహితుడు. అందులోనూ కష్టంలో ఉన్నవాడు. ఇటువంటి వారు తమ కష్టం గట్టెక్కిన పిదప సహాయం చేసినవారిని కనీసం జ్ఞాపకంకూడా ఉంచుకోరు.

* సుఖంలో స్నేహితులను మరువని వారి స్నేహం అభిలషణీయం
* కొందరు చాలా కాలం తర్వాత కలుసుకుంటారు. కానీ, కాలం తెచ్చిన మార్పు, అవసరాల వల్ల ఇతరులతో కలిగిన బంధాలు, వాతావరణం ఈ సరిక్రొత్త స్నేహాన్ని అనుకున్నంతగా ప్రభావితం చెయ్యలేవు.

* స్నేహం పచ్చిదారంలాగా చాలా సున్నితమైనది. ఏమాత్రం అజాగ్రత్తగా ఉండినా తెగిపోతుంది. ముడివేస్తే పనికొస్తుంది. కానీ దాని ఇబ్బంది ఉండనే ఉంటుంది. అలాగే స్నేహం ముడిపడి పునరుద్ధరించుకున్నా, మునుపటి ఆత్మీయతానురాగాలలో శృతి తప్పుతూ వుంటుంది.
* ఎంతటి ప్రాణ స్నేహితులైనా మధ్య మధ్యలో విభేదాలు, ఎడమొహం-పెడమొహం తప్పదు. కేవలం ఓర్పు, అవగాహనతో స్నేహాన్ని కాపాడుకోవాలి. తొందర పాటు తనంతో నిబ్బరం కోల్పోయి ఇతరుల దగ్గర వాపోవడం లాంటి వైఖరులు స్నేహానికి శత్రువులు.
* సమస్యలు మనలను చుట్టుముట్టినపుడు మిత్రులు సానుభూతితో తమ పనులను సైతం పక్కనబెట్టి మనకు రక్షణగా నిలుస్తారు. కష్టంలో ఆనందాన్ని మరచిన మనకు ఆహ్లాదాన్ని కలిగించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు.

* నీగురించి నీకంటే నీ మిత్రులకే నీవేంటో తెలుస్తుంది.
* ఎందరో స్నేహితులుండొచ్చు కానీ అందరినీ ప్రాణ స్నేహితులుగా అంగీకరించలేం. గుండెలు రెండైనా చప్పుడు మాత్రం ఒక్కటిగా, కన్నులు నాలుగైనా చూపు ఒక్కటిగా ఉండగలవారే ప్రాణ స్నేహితులు. -"ప్రాణ స్నేహితులు" ఉండరు. " ప్రాణ స్నేహితుడు" మాత్రమే ఉంటాడు.
* విశ్వాసం, ప్రేమ, ఔదార్యం, సహనం, త్యాగం గల వ్యక్తిత్వమే స్నేహాన్ని పంచుతుంది, పెంచుతుంది. ఆదర్శంగా నిలుస్తుంది.
* మంచి స్నేహితులను పొందాలంటే నీవు స్నేహశీలిగా ఉండడమే అర్హత. ఏ షరతులూ లేని నిష్కపట భావాలు, ఆలోచనలు స్నేహాన్ని పెంపొందిస్తాయి.
* దేనిలోనైనా సరే, తనకంటే తక్కువగా అందరూ ఉండాలనుకునే స్వభావం కలవాడు ఎల్లప్పుడూ ప్రమాదకారే.

ఊర్లోకి క్రొత్తగా వచ్చినవారు కొందరు ఏదో ఒక బ్రతుకు తెరువు దొరగ్గానే తృప్తిపడి తమ బ్రతుకేదో బ్రతికేస్తుంటారు. మరికొంతమందికి బ్రతుకుదెరువుతోపాటు, సంఘంలో స్థానం, సంపాదన, పలుకుబడి కావాలి. అటువంటి వారికి తాము సంఘంలో నిలద్రొక్కుకున్నంత వరకు ఎవరో ఒకరి అండదండలు అవసరం. కాబట్టి తమకు అక్కరకువచ్చేవారిని తమకు హాని కలిగించని వారిని, బాగా ఆలోచించి జాగ్రత్తగా ఎన్నుకుంటారు. మెల్లమెల్లగా నమస్కారాలతో, తియ్యని మాటలతో అవసరానికి మించి గౌరవాన్నిస్తారు. పలకరింపులతో, రాకపోకలతో పరిచయాన్ని స్నేహంగా మలచుకుంటారు, అతి సన్నిహితులౌతారు. ముందుగా వారే గౌరవిస్తారు. అవసరాలను గుర్తించి ఆదుకుంటారు ఏమాత్రం గౌరవభంగం కలుగకుండా ఓర్పుగా - నేర్పుగా వ్యవహరిస్తారు. శుభాశుభ కార్యాలకు వీలైనంతవరకూ గుంపును తయారు చేసుకునే వెళతారు. పరిచయాలను పంచుకుంటారు, పెంచుకుంటారు. ఎందుకంటే అతనికి ఇంత మందితో సాన్నిహిత్యం ఉంది, అని అందరూ అనుకోవాలి. సమాజంలో తాము ఏ స్థాయికి ఎదిగాము, ఎంత సంపాదించాము, ఎంతమందితో పరిచయాలు కలిగి ఉన్నాయి? అని నిత్యమూ లోలోన తమస్థాన విలువను గమనించుకుంటూ బేరీజు వేసుకుంటూ ఉంటారు. ప్రతి ఒక్కరూ తమను గురించి ఘనంగా, మంచిగా చెప్పుకునే స్థాయికి ఎదుగుతారు. ఇదివరలో మనమెవరు? ఇపుడు మనమెవరు? మనస్థాయి ఏపాటిదో తేల్చుకోవాలి, నిర్ధారణకు రావాలి కనుక, అవసరం లేకపోయినా ఏదో ఒక సందర్భాన్ని సృష్టించి ఆహ్వానిస్తారు. తృప్తిగా విందు ఏర్పాటు చేస్తారు. ఎంతమంది వచ్చారు? ఎలాంటి వారొచ్చారు అని పరిశీలించుకుంటూ ఉంటారు. తర్వాత కొద్దిరోజులు గడిచాక మనం ఎంతవరకు ఎదిగాము? సమాజంలో మనస్థానం ఎక్కడుంది? అని నిర్ధారించుకునేటందుకు ఇలా చేస్తారు.

ప్రతిరోజూ తాను నియమం తప్పకుండా, ఎవరికైతే నమస్కరించి, గౌరవిస్తుంటారో వారికి నమస్కారం పెట్టకుండా ఏదో తాము చాలా బిజీగా ఉన్నట్లుగా చూచి, చూడనట్లు అదోరకమైన చాకచక్యాన్ని చూపిస్తారు. లోలోపల తనకు ఎదుటివాడు నమస్కార గౌరవాన్నిస్తాడా లేదా ? (కొన్ని వందల, వేలసార్లు నమస్కారాలు పెట్టి ఉంటాము. ఎపుడూ మనమేనా? నేను కూడా సమాజంలో ఎదిగాను కదా అపుడపుడైనా నాకు నమస్కార గౌరవాన్నివ్వాలి కదా? అని మనసులోని ఆలోచన) చూద్దాం అని పరీక్షిస్తుంటారు.

ఏదో ఒక రోజు వారి ఉద్దేశ్యం నెరవేరుతుంది. అంతే! ఇక ఆ లెవెల్‌ని వదలి పెట్టకుండా కొనసాగిస్తారు. ఎవరినైతే ముందుగా గౌరవిస్తూ వచ్చారో, ఎవరి మాటకైతే అత్యంత విలువను ఇస్తూ వచ్చారో వారి మాటలనే నెమ్మదిగా చిరునవ్వుతో త్రోసి పుచ్చుతారు. పరవాలేదు మేము కూడా నమస్కారాలు పెట్టించుకుంటున్నాము. లేదు, కాదు, వీలులేదు అని కూడా అనగలుగుతున్నామని తృప్తిపడతారు. ఈ పరిస్థితినే క్రొత్తగా వచ్చినవారు ఆశించేది. తమ ఆశయం నెరవేరాక మొదటి స్నేహితులు, తమకంటికి చాలా అల్పులుగా, పాత ఒక రోతగా భావిస్తారు. కాబట్టి వదులుకొని ఇంకా గొప్పవారితో తిరగాలనీ, లావాదేవీలను నడపాలనీ చూస్తారు. పూర్వపు స్నేహితులు తమ మిత్రులలో వచ్చిన మార్పును గమనించి చాలా హైరానా పడిపోతుంటారు. మనమేం తప్పుచేశాము? ఏదైనా పొరపాట్లు జరిగాయా? ఎందుకు మనకు దూరంగా ఉంటున్నారు? అని. కానీ తను ఎదగటానికి, నిచ్చెనలాగా ఉపయోగించుకొన్నాడన్న విషయం నిదానంగా తెలుసుకొని బాధపడతారు. ఆశయం నెరవేరాక వారు పాత స్నేహాన్ని కొనసాగించాలంటే ఏదో స్వేచ్ఛలేనట్లుగా భావిస్తారు. ఎల్లప్పుడూ కృతజ్ఞతా భావంతో మెలగాలన్న భావనను ఈ బాపతు వారు భరించలేరు.

పరిచయాల, స్నేహాల పునాదులు వేసుకుంటూ తామూ చెయ్యగలం, చేయించగలం, ఇవ్వగలం, ఇప్పించనూ గలం, పరిస్థితులను చెడగొట్టనూగలం, సరిదిద్దనూగలం అనే స్థాయికి వచ్చాకగాని వారికి నిదురపట్టదు, తృప్తిపడరు. ఈ గమనంలో ఎందరి తలలను పడికెట్లుగా ఉపయోగించుకుంటారో! తల వెంట్రుకలు, తెల్లబడిన వారికి, తలలు బోడులైన వారికే ఎరుక.

* చాలా సందర్భాలలో, అనుకోకుండా ఎదురయ్యే దుస్సంఘటనలలో మనవారనబడే వారెవ్వరూ మన చెంత ఉండరు. అటువంటి సందర్భాలల్లో అయస్కాంత తరంగాలుగా వ్యాపించిన మన స్నేహ భావ పరిమళమే సమస్యలను దూదిపింజలాగా ఎగిరిపోయేటట్లు చేస్తుంది. నిర్మలమైన స్నేహ ప్రభావం అలాంటిది.
* స్నేహం చాలా పవిత్రమైనది. మిత్రులనబడేవారు స్నేహమంత పవిత్రులుగా ఉండలేరు.
* స్నేహభావం మాత్రమే ఉండాలి కానీ స్నేహితులుండాలని కోరుకోవడం ఒక దోషం. హృదయంలో మైత్రీ భావన ఉంటే జగత్తులోని వారంతా మిత్రులే.

* ప్రకృతిలో ఉన్నవన్నీ మనిషికి ఉపయోగపడేవే. మనిషి యొక్క ఉపయోగం మాత్రం వేటికీ అక్కర్లేదు. కాబట్టి ప్రకృతంతా మనిషికి స్నేహమే. మనిషి మాత్రమే స్నేహితుడు కాలేదు.
* 'గివ్ అండ్ టేక్' 'ఇచ్చి-పుచ్చుకో' అన్నారే కానీ, పుచ్చుకో-ఇచ్చుకో అనలేదు.
* పరాన్నజీవి అయిన బదనిక ఆశ్రయమిచ్చిన చెట్టు సారాన్ని చాలా నెమ్మదిగా సంగ్రహిస్తూ జీవిస్తూ ఉంటుంది. చెదపురుగుకూడా నెమ్మదిగా చెట్టును సమూలంగా నాశనం చేస్తుంది. అలాగే వంచకులు కూడా స్నేహమనే ముసుగులో సమస్తమూ దోచేసుకుంటూ ఉంటారు. వీరికి దయా, దాక్షిణ్యమూ లాంటి మానవీయ గుణాలు ఉండవు. స్వార్థం తప్ప.
* ప్రాపంచిక విషయాలన్నీ చర్చించి, లేనిపోని ఆశలు రగిలించి, అడ్డదారులను ప్రోత్సహించే వారినే స్నేహితులుగా భ్రమపడుతున్నారు ఈరోజులలో.
* స్నేహానికి పునాది పరిచయమే. లావాదేవీలు, వ్యాపకాలు, స్నేహాన్ని కొనసాగిస్తాయి.
* ఏదిఏమైనా పరిచయాలు, స్నేహాలు జనబలాన్ని పెంచి,. సందర్భానుసారం తాత్కాలికంగా మంచి చేసినా, ఎక్కువ శాతం ఉద్రేకాలు, ఆవేశాలు, పెరిగి అనర్థాలకు దారితీసి చేదు అనుభవాలను మిగిల్చినవిగానే చెప్పుకోవలసివస్తుంది.
* అల్పుడికి అధికారం వస్తే అర్థరాత్రి గొడుగు పట్టమన్నాడట.
* దయదలచి దుష్టునికి అన్నం పెడితే తొడవిందు కుదరదా ? అన్నాడట.

నీచం, నీచాతినీచం, మధ్యమం, ఉత్తమం, ఉత్తమోత్తమం

నీచం : తన లాభం కొరకు ఇతరుల అవకాశాలకు, ప్రయోజనాలకు అడ్డుతగిలి తాను లబ్ది పొందడం.

నీచాతినీచం: తన స్వలాభం ఏమీ లేకున్నా, ఇతరులను నష్టాలకు గురిచెయ్యడం, కష్టపెట్టడం. బాధలలో ఉన్నవారిని చూచి తనకు చేతనయినంత వరకూ నాలుగు మాటలు "పుండు మీద కారం చల్లినట్లుగా" మాట్లాడి, నాలుగు రాళ్ళు వేసి, పైశాచికానందాన్ని పొందడం.

మధ్యమం : ఇతరులను కష్టపెట్టకుండా, నష్టపరచకుండా తన స్వలాభాన్ని చూచుకోవడం.

ఉత్తమోత్తమం : ఇతరుల కొరకు తనేమైనా చెయ్యగలనా, అని తపన పడటం, తనద్వారా ఏదైనా మేలు జరిగితే చాలు అందుకు తనకు కాస్త నష్టం, కష్టం కలిగినా పరవాలేదు అనుకోవడం. మనోవాక్కాయకర్మల ద్వారా ఎవ్వరికీ కష్టం, నష్టం, అసౌకర్యం కలుగని రీతిలో ప్రవర్తించడం.

* డబ్బున్నప్పుడు స్నేహితులు నీగురించి తెలుసుకుంటారు. లేనపుడు నువ్వు స్నేహితులెవరో తెలుసుకుంటావు.
* స్నేహం చేయడం సులభమే కానీ దాన్ని నిలుపుకోవడమే కష్టం.

* పాపకార్యాల నుంచి తప్పించడం, లేమితో బాధపడుతుంటే ధన సహాయం చేయడం, ఆపదల్లో ఆదుకోవడం మంచి మిత్రుల లక్షణాలు.
* స్త్రీల కారణంగా, ఇల్లు, ఆస్తి తగాదాల వలన మాట పట్టింపు వలన కష్టం-నష్టం, కలిగి దుఃఖాలలో ఉన్నప్పుడు మిత్రుల మధ్య కలహాలూ, అభిప్రాయ భేదాలు కలుగుతాయి.
* చెడిన స్నేహం, పగిలిన అద్దం అతకవు.
* తల్లిదండ్రులు, గురువులే మొట్టమొదటి నిజమైన స్నేహితులు.
* మంచి భార్యాభర్తలు ఒకరికొకరు మంచి స్నేహితులు.

జీవితంలో మనకెందరో తారసపడుతూ ఉంటారు. వారిలో కొందరు చివరి వరకూ ఉంటారు. మరికొందరు పరిచయస్తులుగా మిగిలిపోతారు. మరికొందరు మరీ దూరమూ కాకుండా, మరీ దగ్గరా కాకుండా, మంచీచెడు, పిచ్చాపాటి మాట్లాడుకోవటానికి పనికొస్తారు. మరికాస్త దగ్గరైనవారు చిన్న చిన్న అవసరాలకు పనికొస్తూ, సినిమాలకు, షాపింగ్‌లకు తోడుంటారు. ఇలాంటివారిలో కొందరు కాలక్రమేణా ఆప్తులుగా మారిపోవడంకూడా తరచుగా జరుగుతూ ఉంటుంది.

"మిత్రులందు ఆప్తమిత్రులు వేరయా" అన్నట్లు వీరు ఎక్కడ ఎలాంటి పరిస్థితులలో ఉన్నా! మన యోగక్షేమాలు కోరుతూ ఉంటాను. వీరి దగ్గర దాపరికాలు ఏ మాత్రమూ వుండవు. ఎలాంటి అరమరికలు లేకుండా హృదయపూర్వకంగా ప్రతి చిన్న విషయమూ వీరి మధ్య చర్చకు వస్తూ ఉంటుంది. కుటుంబ సభ్యులతో చెప్పుకోలేని విషయాలనుకూడా నిస్సంకోచంగా మనస్ఫూర్తిగా వెల్లడించి హృదయ భారాన్ని పంచుకుంటూ ఉంటారు.

ఆప్త మిత్రులలోకూడా అత్యంత ప్రధానమైనవారు ప్రాణమిత్రులు. శరీరాలు రెండైనా ప్రాణమొక్కటిగా ఉంటారు. వీరు అన్ని సమయాలలో అందుబాటులో లేకపోవచ్చు. ఎందుకంటే వివాహం తర్వాత వేరే ఊర్లలో ఉండవచ్చు. లేదా వృత్తి రీత్యా దూరంగా ఉండవచ్చు. ఇలా కొన్ని కారణాలవల్ల సలహాలు, సంప్రదింపులు, ఇచ్చి పుచ్చుకునే స్థిలో ఉండకపోవచ్చు. అలాంటప్పుడు అందుబాటులో ఉండి, లోటును భర్తీ చేసేవారే బెస్ట్ ఫ్రెండ్స్. ఇలాంటి బెస్ట్ ఫ్రెండ్స్ అందరికీ అవసరం.

* ఈనాడు అబ్బాయిలూ - అమ్మాయిలూ బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఉంటూ ఉన్నారు. కొందరు ఇలాంటి స్నేహాలను ఆక్షేపించినా, అవహేళన చేసినా, అది వారి అజ్ఞానమే. చదువులలోగానీ, ఉద్యోగాలలోగానీ, స్త్రీలు తమ ప్రతిభను అద్వితీయంగా ప్రదర్శిస్తున్నారు.
* ఈరోజులలో అవసరాల రీత్యాకూడా బైటికి వెళ్లవలసిన సందర్భాలు అనేకం. అలాంటపుడు అబ్బాయి వెంటవుంటే కాస్త ధైర్యంగా ఉండనూవచ్చు. పనులు కాస్తంత సులువుగానూ అవడానికీ అవకాశం ఉంటుంది. అత్యవసర సమయాలలో అండగా ఉండటానికికూడా అబ్బాయిల స్నేహమూ ఆదరణీయమే, అభిలషణీయమే.

* మంచి స్నేహితులు ఎంత ఎక్కువగా ఉంటే అంత మంచిదని అనుభవజ్ఞుల అభిప్రాయం.
* నిజాయితీ, నిర్మొహమాటం, ఎదుటివారి అభిప్రాయాలను గౌరవించగలగడం, సహనం, సంయమనం ఉన్నప్పుడే స్నేహం సాధ్యమవుతుంది. ఎదుటివాళ్ళు కూడా మనలాగానే ఉండాలనుకోవడం స్నేహానికి విరుద్ధం. వైవిధ్యం, వైరుధ్యం ఉన్నప్పటికీ మనసు విప్పి మాట్లాడుకోగలిగే వాళ్ళు మంచి స్నేహితుల్ని సంపాదించుకోగలుగుతారు.
* స్నేహాలు కూడా ఆర్థిక విలువలతో ముడిపడి లాభాపేక్షే ప్రధానంగా మనుషుల మధ్య సంబంధాలు నెలకొంటున్నాయన్నది వాస్తవమే అయినా, అసలు సిసలు స్నేహాలు లేవని దిగులు పడనక్కర్లేదు. మన స్వభావం, మనమాట తీరు స్నేహాల్ని సంపాదించి పెడుతుంది.
* శత్రువును క్షమించడం సులభం. కానీ స్నేహితుడిని క్షమించలేం.
* స్నేహితుడిని ఏకాంతంలో మందలించు. పదిమందిలో ప్రశంసించు.
* ప్రయాణంలో మంచి స్నేహితులుంటే మనకు మార్గాయాసమే కనిపించదు. జీవితం కూడా ఒక ప్రయాణమే.
* అవివేకితో చెలిమికంటే, వివేకితో విరోధం మేలు.
* నిద్ర చెడునని నల్లికుట్టకుండునా? సహవాసం చెడునని నీచుడు స్వార్థం మానునా?
* ఎంతటి అహంకారి అయినా స్నేహితుని సూచనలను, సలహాలను పాటిస్తాడు.
* మనసు బాగా లేనపుడు స్నేహితుని సాహచర్యంలో వర్ణించలేని ఓదార్పు లభిస్తుంది. నిరుత్సాహం, నిస్పృహ, భయం కలిగినపుడు మంచి మిత్రుని అండ కొండంత ఆసరాగా నిలుస్తుంది.
* కృత్రిమ ప్రవర్తనతో స్నేహం ఎంత సులభంగా, ఎంత తొందరగా ఏర్పడుతుందో అంతే తేలికగా మాయమైపోతుంది.
* వేరు బలంగా, ఆరోగ్యంగా ఉన్నపుడే చెట్టు మహావృక్షంగా ఎదుగుతుంది. వేర్లకు చెదలు పట్టినపుడు ఎన్నీ ఎరువులు వేసినా కుప్పకూలుతుంది. అలాగే నీతి, నిజాయితీ, విశ్వసనీయత లాంటి విలువలు పునాదులుగా ఉన్నపుడే స్నేహం నిలబడుతుంది.

ప్రాథమిక స్థాయి విలువలు : సద్బుద్ధితో, సహృదయంతో, నీతి, నిజాయితీతో విశ్వసనీయంగా ఉండడం.

ద్వితీయస్థాయి విలువలు : ఎదుటివారి పేరును పదేపదే ఉచ్చరించడం, నవ్వుతూ మాట్లాడటం, అభినందించడం, అభిప్రాయాలను గౌరవించడం, అమాయకంగా కనిపించడం, అవసరాలను గుర్తించి పట్టించుకోవడం, చూస్తూనే నిలబడి, ముందుగానే నమస్కరించి పలుకరించడం, మర్యాదలు చేయడం.

* మంచి లక్షణాలు కానీ చెడు లక్షణాలు కానీ, దురభ్యాసాలు కానీ, సదభ్యాసాలు కానీ పుట్టుకతో వచ్చి స్నేహంతో పెరుగుతాయి. అందుకే మంచి స్నేహితులను సంపాదించుకోవాలి.

* అసహనం మనిషి ప్రగతికీ, స్నేహా'నికీ అవరోధం.
* నీటి బిందువు కాలుతున్న పెనం మీద పడితే రూపురేఖలు లేకుండా ఆవిరై పోతుంది. తామరాకు మీదపడితే అంటీ అంటకుండా ఉంటుంది. ముత్యపు చిప్పలో పడితే ముత్యమైపోతుంది. అలాగే మనిషి నీచుడి సాంగత్యంలో పడితే నీచాతి నీచుడవుతాడు. మధ్యముడి వెంట ఉంటే ఆ మాత్రపు ప్రతిష్ఠనే పొందుతాడు. ఉత్తముడి సాంగత్యం చేస్తే ఉజ్వలంగా వెలుగుతాడు.
* మంచివాడు మంచిగా ఉండాలని, ఇతరులను నొప్పించకూడదనీ అపుడపుడూ అసత్యములాడవచ్చు. కానీ ఖచ్చితమైన వ్యక్తి అనగా ఉన్నదున్నట్లుగా మాట్లాడే వ్యక్తి అసత్యములాడడు, ద్వంద్వవైఖరిని చూపించడు. అలాంటివాడు స్నేహితుడుగా దొరకడం అదృష్టం.
* స్నేహపు మధురిమలు జీవితాంతం నీడలా వెంటాడుతూనే ఉంటాయి. ఒంటరిగా ఉన్నపుడు పాత మధుర భావాలను బాల్యమిత్రులను గుర్తు చేసుకుంటాము. స్నేహితులతో కలసి చేసిన చిలిపి చేష్టలు, తుంటరి పనులను గుర్తుచేసుకొని మురిసిపోతాం, మైమరచిపోతాం. బాల్యమిత్రులెపుడైనా కనిపిస్తే పులకరించిపోతాం. వారి రాకతో పండుగ వాతావరణమే నెలకొంటుంది. ఒకటే సందడి. తిరిగి వెళ్ళిపోయినపుడు ఏదో కోల్పోయినట్లు మనసులో వెలితిగా ఉన్నట్లు ముభావంగా అయిపోతాం. అందుకే సృష్టిలో స్నేహానికి అంత విలువ, ఆదరణ.
* పురుషునితో పోల్చుకుంటే స్త్రీలు మగవారిలా తమ చిన్ననాటి సఖుల పాత చెలిమిని కొనసాగించలేని విధంగా సాంఘిక పరమైన కట్టుబాట్లు, సాంసారిక బాధ్యతలు నెలకొని ఉన్నాయి.
* ఆడ-మగ ఎవరైనా సరే తన అభిప్రాయాలను, ఆలోచనలను కొంత పరిమితి వరకే తమ తల్లి-దండ్రుల వద్ద బహిర్గతం చేయగలరు. అయితే తనకు సంబంధించిన అన్ని విషయాలను అరమరికలు లేకుండా, స్వేచ్ఛగా, మనసారా వ్యక్తీకరించగలిగే ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన, ఆనందకరమైన వాతావరణం మాత్రం ఒక్క స్నేహితుల వద్ద మాత్రమే దొరుకుతుంది.
* మితిమీరిన పోటీతత్వం, అవసరానికి మించిన స్వార్థంతో సున్నితమైన మానవ సంబంధాలను, అనుభూతులను మరచిపోయి, స్నేహం కేవలం కాలుమోపుకునే ఒక పడికెట్టులాగా, అవసరమే పునాదిగా, లాభమే లక్ష్యంగా మారిన పరిస్థితులలో ఏది స్నేహమో, ఏది మోసమో, ఏది మోహమో, తెలుసుకోవడం కష్టమై పోతున్న ఈ రోజులలో స్నేహం చేసేముందు జాగ్రత్త పడడం చాలా అవసరం. ఫలానా వ్యక్తితో స్నేహం ఎందుకు చేస్తున్నావంటే కారణాలు, లక్షణాలు స్పష్టంగా వివరించగలిగే విచక్షణ కలిగి ఉండాలి.

* మంచివనుకున్న పాత స్నేహాలు కూడా, మధ్య మధ్యలో దారి తప్పుతూ ఉంటాయి. వ్యక్తిగత చేదు అనుభవాలు, సరిక్రొత్త ఆకర్షణలు, అవసరాలు, పరిస్థితులు, కొత్త పరిచయాలు మొదలగునవి అందుకు కారణాలుగా ఉంటాయి.
* జీవితంలో స్నేహితులుండరు. స్నేహితుడు మాత్రమే ఉంటాడు. అంటే దానర్థం జీవితాంతం ఒక్క స్నేహితుడు మాత్రమే ఉంటాడని కాదు. మనసుకు నచ్చే ఆత్మీయ మిత్రుడొకడే ఉంటాడని.
* బాల్యంలో అమ్మానాన్నల సాన్నిహిత్యమే లోకం. కానీ కౌమారదశ వచ్చేసరికి స్నేహితులే సర్వస్వమనే స్థాయికి వచ్చేస్తారు. స్నేహితులకే ప్రాధాన్యం ఇస్తారు. ఇంట్లో గడిపే సమయం కంటే బైట స్నేహితులతో గడిపే సమయమే ఎక్కువ. పిల్లలపై దోస్తుల ప్రభావమే చాలా అధికంగా ఉంటుంది. కాబట్టి తల్లిదండ్రులు ఆ-దోస్తులు ఎలాంటివారో గమనిస్తూ ఉండాలి. తగు సూచనలు పిల్లలకిస్తూ వుండాలి.
* మనిషి సంఘజీవి. కనుక ఇరుగు పొరుగు వారితో సఖ్యతగా, స్నేహంగా, మైత్రి భావంతో మెలిగి తీరాలి. అంతేకాని ఇందుకు విరుద్ధంగా జీవించే వారి బ్రతుకు చాలా అసహ్యంగా, బాధామయంగా ఉంటుంది. ఇతరులకూ అసౌకర్యంగా ఉంటుంది.
* తినకుండా రుచులు, దిగకుండా లోతులు, స్నేహించకుండా స్వభావాలు తెలియవు.
* స్నేహం ఎల్లవేళలా హితాన్ని, సహకారాన్ని, సహానుభూతిని మాత్రమే ఇస్తుంది.
* సమస్యలు మనల్ని చుట్టుముట్టినపుడు తమ పనులన్నింటినీ మానుకుని రేయింబవళ్లు మనకు అండగా నిలుస్తారు. తాము అలసిపోయినా మనలను ఉత్సాహపరుస్తారు. ఓదార్చుతారు. మనలను సంతోషంగా ఉంచడానికి శాయశక్తులా ప్రయత్నిస్తూనే ఉంటారు. ప్రేమను, ధైర్యాన్నీ, ఓదార్పును, ఉత్సాహాన్ని నింపే దేవదూతలు ఈ మిత్రులు.
* ఎప్పుడూ అవతలివారే మనకు సాయపడుతూ ఉంటే మిత్రలాభాలను ఒకళ్లే మళ్ళీ మళ్ళీ పొందుతూ ఉంటే స్నేహానుబంధ సాంద్రత తగ్గిపోతుంది. స్నేహం వలన ఇరువురికీ దాదాపు ఒకే స్థాయిలో ఫలితాలు లభిస్తే అనుబంధం కలకాలం సాగుతుంది. లేదంటే స్నేహం క్రమంగా క్షీణిస్తుంది.
* సుఖాలలో మరచిపోయి కష్టాలలో గుర్తుకు తెచ్చుకునే వారిని ప్రయోజన స్నేహితులుగా గుర్తించాలి.
* స్నేహితుడు ప్రక్కనున్నాడంటే భద్రతా భావం, సురక్షిత భావం, ధైర్యం హృదయం నిండుగా ఉండాలి. అలాకాక జాగ్రత్తగా ఉండాలి అనుకుంటే అది స్నేహం కాదు, నటన.
* ఉత్తమమైన మిత్రుడుంటే దివ్యౌషధాలతో పనిలేదు.

* తను కూర్చున్న ఆసనాన్ని కానీ, ఆసన సగభాగాన్ని కానీ, సమానమైన ఆసనాన్ని కానీ, ఉన్నతమైన ఆసనాన్ని కాని ఇచ్చి గౌరవించడం ఉత్తమమైన స్నేహానికి చిహ్నం.
* స్నేహం విలువ తెలిసినవాడు కనుకనే శ్రీకృష్ణుడు. తానెంత భోగభాగ్యాలలో ఓలలాడుతున్నా, తన ఇంటికి వచ్చిన నిరుపేద బాల్యమిత్రుడైన కుచేలునికి ఉచితాసనం ఇచ్చి గౌరవించాడు. మిత్రుడు తెచ్చిన అల్పమైన అటుకులనే ఆప్యాయంగా ఆరగించి, ఆదరించి ఆనందపరచాడు.

కృష్ణుడు - కుచేలుడు

శ్రీకృష్ణుని సహచరులలో సుదాముడు ఒకడు. అతనినే కుచేలుడు అంటారు. కుచేలుడు కృష్ణుని చిన్ననాటి స్నేహితుడు. వారిద్దరూ చిన్నపుడు కలసి సాందీప మహర్షి దగ్గర చదువుకున్నారు. అప్పటి శిష్యవర్గమంతటిలోకి సుదాముడు బాగా గుణవంతుడు.

సుదాముడు విద్య పూర్తిచేసి వివాహం చేసుకున్నాడు. "దరిద్రుడికి సంతతి ఎక్కువ" అన్నట్లుగా సుదాముడికి సంతానంకూడా అధికమే. ఇంట్లో తాను పోషించవలసిన వారి సంఖ్య పెరిగిన కొద్దీ దారిద్ర్యం కూడా పెరిగింది. అయినా ఎవరినీ యాచించలేదు. తన దరిద్రాన్ని గురించికూడా ఎన్నడూ దుఃఖించలేదు. ఉన్నదానితోనే తృప్తి పొందుతూ జీవిస్తున్నాడు. అతనిని అందరూ కుచేలుడు అని పిలుస్తున్నా బాధపడలేదు. కుచేలుడు' అంటే పాతవి, చినిగిన వస్త్రాలను ధరించేవాడని అర్థం.

కుచేలుని భార్యపేరు వామాక్షి. ఆమె అతనికి అన్నివిధాలా తగిన భార్య. అతని దారిద్ర్య బాధను కూడా సంతోషంతోనే పంచుకునేది. ఒక్కోసారి రోజుల తరబడి అన్నం లేక అకలి బాధతో అలమటించేవారు. ఒకరోజు బిడ్డల ఆకలి బాధను చూడలేక తన భర్తతో "కుటుంబాన్ని కనీసం ఆకలి బాధనుండైనా గట్టెక్కించే ఉపాయం ఆలోచించండి. అని ప్రాధేయపడింది.

ఆ మాటలు విని సుదాముడు ఆలోచనలో పడ్డాడు. పరిష్కార మార్గం ఏమీ మనసుకు తట్టలేదు. ఆమె మరలా కలగజేసుకుని "శ్రీకృష్ణుడు మీకు బాల్య స్నేహితుడే కదా? అతడు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే కదా? ఒకమారు అతని దర్శనం చేసిరారాదా! ఆయన తప్పక మన దారిద్ర్యాన్ని తొలగించగలడు" అని చెప్పింది. ఆ పలుకులు వినేసరికి అతనికి సమంజసమే అనిపించింది. వెళ్ళటానికి నిర్ణయించుకున్నాడు. కానీ వట్టిచేతులతో ఎలా వెళ్ళటం? బాల్య మిత్రుడు, పైగా శ్రీమంతుడు అయిన శ్రీకృష్ణుని వద్దకు వెళ్లేటపుడు ఏదైనా కానుకలను తీసుకొని పోవటానికి మనదగ్గర ఏదైనా ఉండొద్దా? అన్నాడు. ఆ మాటలు విని ఆమె, ఏదో ఉన్నదే సమర్పణ చేసుకుందామని భావించి, ఇంట్లో ఉన్న కాసిన్ని అటుకులు తెచ్చి తన భర్త కట్టుకున్న చిరిగిన వస్త్రానికి వోటుచూచి కొంగున పోసి ముడేసింది. సుదాముడు వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

"దారిద్ర్యంలో ఉన్నవాడికి ధైర్యం ఉండదు" అన్నట్లుగా దారిపొడవునా సుదాముడికి ఎన్నో సందేహాలు-దరిద్రుడనైన నేను అంతదూరం ఉన్న ద్వారకా నగరానికి ఎలాగో చేరినా నగరంలోకి ప్రవేశించగలనా? నడచి వెళ్ళగలనా? ఒకవేళ ప్రవేశించినా శ్రీకృష్ణుడు ఎక్కడో అంతఃపురంలో ఉంటాడు. ఆయనను దర్శించటం నా తరమా? ద్వారపాలకులు నన్ను లోనికి పోనిత్తురా? వారే కనుక నన్ను లోనికి వెళ్ళటానికి అనుమతించకపోతే ఏం చేయగలను? అని పరిపరి విధాలా ఆలోచిస్తూ ద్వారకా నగరానికి చేరుకున్నాడు.

రాచబాట వెంట చాలాదూరం నడిచాడు. అనేక ప్రాకారాలు దాటి పోయాడు. కొంత దూరం వెళ్ళాక ఎదురుగా ఒక సుందర భవనం కనిపించింది. ఆ భవనం గోపురాలూ, పిట్టగోడలూ ఎంతో సుందరంగా అలంకరింపబడి ఉన్నాయి. బహుశా అది శ్రీకృష్ణుని నివాసమే అయ్యుండొచ్చు ననుకుంటూ లోనికి వెళ్ళాడు. మనసుకు బ్రహ్మానందం కలిగింది. భవనం లోపలి నుండి ఎందరో స్త్రీలు, పరిచారకులు వస్తూఉన్నారు. సుదాముడు సూటిగా భవనంలోకి ప్రవేశించాడు.

ఎదురుగా హంసతూలికా తల్పం మీద ఆసీనుడై భార్యతో ఏదో సంభాషిస్తున్న కృష్ణుడు బాల్యమిత్రుడైన సుదాముడిని చూచాడు. చిరిగిన వస్త్రాలతో, దీనవదనంతో, భయాందోళనలతో, బిక్కు బిక్కుమంటూ నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ వస్తున్నవాడు బాల్యమిత్రుడైన సుదాముడేనని నిర్ధారించుకుని, ఉన్నఫళంగా తన తల్పందిగి, ఎంతో ఆప్యాయతతో ఎదురుగా వచ్చి కౌగిలించుకున్నాడు. ఎంత బాంధవ్యం! ఎంత ప్రేమ! తన బాల్యసఖుడిని నేరుగా తోడుకొని వచ్చి తన తల్పం మీదనే కూర్చుండబెట్టాడు. ఎంతో చనువుతో, గౌరవంతో బంగారు చెంబుతో నీళ్ళను తెప్పించి చిన్ననాటి చెలికాడి పాదాలను కడిగాడు. వింజామరతో విసురుతూ కుశల ప్రశ్నలు వేశాడు. కృష్ణుడు చూపిస్తున్న స్నేహమనే వర్షంలో సుదాముడు తడిసి ముద్దై పోతున్నాడు. తనను తానే మరచిపోయాడు. రుక్మిణీ దేవి కూడా తన భర్తతో పాటు సపర్యలు చేసింది. ఈ దృశ్యాన్ని చూచిన అంతఃపుర స్త్రీలు, నౌకర్లు, అధికారులు అందరూ నిర్ఘాంతపోయారు. "ఈ పేద బాపడు పూర్వ జన్మలో ఎంతటి తపస్సు చేసి ఉండెనోకదా"? అనుకున్నారు.

అందరూ చూస్తూ ఉండగనే సఖుని ప్రక్కన కూర్చొని చిన్న తనంలో గురువుల ఇంట గడిపిన రోజులూ, జరిగిన సంఘటనలూ అన్నీ గుర్తుకు తెచ్చుకున్నారు. హాయిగా నవ్వుకున్నారు. అంతాసరే గానీ, నా దగ్గరికి వచ్చేటపుడు ఏమైనా తెచ్చిఉంటావు కదా? ఏదీ అని అడిగాడు కృష్ణుడు. తెచ్చిన అటుకులను ఇద్దామనుకున్నాడు కానీ ఇంతటి శ్రీమంతునకు, ఇలాంటి స్నేహితుడికి ఇంత చిన్న కానుక తెచ్చినందుకు సిగ్గు కలిగింది. తన దారిద్ర్యం జ్ఞప్తికి వచ్చి తలదించుకుని ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉండి

పోయాడు. సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడు సుదాముని ఉత్తరీయపు కొంగున ముడిపెట్టబడి ఉన్న చిన్న మూటవైపు చూచాడు. అదేమిటీ?

అని ప్రశ్నిస్తూ తానే ఆమూటను చేతికి తీసుకుని ముడి విప్పి ఒక గుప్పెడు అటుకులు తీసి నోటిలో వేసుకుని ఆరగించాడు. మరొక పిడికెడు అటుకులు నోటిలో వేసుకొనబోతుండగా - "రుక్మిణీ దేవి భర్త చేయిని పట్టుకొని ఆపి మీ మిత్రునికి సంపదలను ప్రసాదించటానికి ఈ తిన్న అటుకులు చాలు" అని సున్నితంగా వారించింది. కృష్ణుడు ఇక తినలేదు.

సుదాముడు ఆ రోజు రాత్రి కృష్ణుని మందిరంలోనే గడిపాడు. సూర్యోదయం కాగా నిద్రలేచి, స్నాన సంధ్యానుష్ఠానాలు పూర్తిచేసుకున్నాడు. సుదాముడు ఇంటికి బయల్దేరాడు. కృష్ణుడు కూడా సతీసమేతంగా, ఆదరంతో భవన ప్రవేశ ద్వారం వరకూ వచ్చి సాగనంపాడు.

ఇంటికి వస్తూ దారి మధ్యలో సుదాముడు తాను వచ్చిన పని మరిచి పోయినట్లుగా గుర్తుకు వచ్చింది. ఆహా! వచ్చిన పని గుర్తులేదు. మరపురావటం కూడా ఆ దైవ సంకల్పమే కదా? ఇంతకూ అంతటి మహానుభావుని దర్శనం కలగటం, తన తల్పం పైన కూర్చోబెట్టుకోవడం, తన మందిరంలో, తన శయ్యపైనే విశ్రమింప చేయడం ఇదంతా అల్పమైన విషయమా? నన్ను ఎన్ని విధాల సత్కరించాడు? అన్నీ చేశాడు సరే! ఏం తెచ్చావు? అని కూడా అడిగి, అటుకుల మూటను తనే విప్పుకొని ఆరగించాడు కదా? మరి నాకేమి ఇవ్వకుండానే వట్టి చేతులతోనే సాదరంగా పంపించాడే? దరిద్రుడికి సంపదలు ఇస్తే కన్ను కనిపించదనీ, తనను మరచిపోతాడనీ ఇలా చేసి ఉంటాడు కాబోలు! లేకపోతే సర్వవస్తు సంపదలతో నన్ను పరిపూర్ణుణ్ణి చేసి ఉండేవాడు కదా? అతనికి దయ కలిగితే అదొక పెద్ద విషయమా?

ఈవిధంగా అనుకుంటూ కుచేలుడు తన గ్రామం చేరుకున్నాడు. తన ఇల్లున్న వీధిలోకి వచ్చాడు. తన కళ్ళను తానే నమ్మలేకపోతున్నాడు. సూర్యకాంతులను వెదజల్లే భవనాలు ఎదురుగా కనిపించాయి. భవనాల చుట్టూ సుందరమైన పూలచెట్లు వాటినడుమ నెమళ్లు అందంగా తిరుగుతూ ఉన్నాయి. భవనం నిండా దాస దాసీ జనాలు వస్తూ పోతూవున్నారు. ఇదంతా చూచిన కుచేలునికి "నేనేమైనా దారితప్పి ఇటు వచ్చానా ఏమి?" ఇదివరకు ఇక్కడ ఇలాంటి భవనాలు లేవుకదా? అని ఆశ్చర్యంతో నోరు వెళ్ళబెట్టుకుని ఆలోచనలతో నిలబడి పోయాడు. అలా అవాక్కై నిలబడి పోయిన కుచేలునికి ఎదురుగా కొందరు దాసీలు వచ్చి లోపలికి దయచేయండి అని ఆహ్వానించారు. లోపలికి వెళ్లిన కుచేలునికి అతని భార్య పట్టు చీర కట్టుకుని, బంగారు ఆభరణాలు ధరించి దర్శనమిచ్చింది. ఎదురుగా ఆశ్చర్యంతో నోట మాటరాక నిలుచుండిన కుచేలునికి భార్య వామాక్షి ఆనంద బాష్పాలు కనులవెంట రాలుచుండగా

భర్త పాదాలకు నమస్కరించి "ఏమండీ ఈ భాగ్యమంతా మీ మిత్రుడైన శ్రీకృష్ణుని దయేనండీ" అని కృతజ్ఞతా భావంతో అంది. ఇంతకాలం భరించరాని దారిద్ర్య దుఃఖంలో మునిగిపోయాము. ఇపుడు ఇలా వచ్చిన భోగభాగ్యాల కారణంగా అహంకరించకుండా, పొంగిపోకుండా ధర్మబద్ధమైన జీవితాన్నే మనం చివరి వరకూ కొనసాగించాలని సుదాముడు, వామాక్షీ నిర్ణయించుకున్నారు.

స్నేహం అంటే ఇలా ఉండాలని చాటి చెప్పే ఈ సంఘటన యుగ యుగాలకూ ఆదర్శం.

* మిత్రుని స్వభావం ఆపదల్లో తెలుస్తుంది.
* స్నేహం పవిత్రమైనదే కానీ స్నేహమంత పవిత్రులు కారు స్నేహితులు.
* అవసరాల్లో ఆదుకుంటూ, సంతోషాలను సహృదయంతో పంచుకునేవాడే సన్మిత్రుడు.
* మైత్రీ బంధం ముందు, రాజ్యం, ఐశ్వర్యం, ఔన్నత్యం, జాతి, మతం, కులం, స్త్రీ పురుషభేదం, ఎల్లలు అడ్డుగా నిలబడలేవు.
* అవసరాన్నీ, మనసును తెలుసుకొని సహాయపడేవాడే స్నేహితుడు.
* సంపదలు వచ్చినపుడు, అధికారం ప్రాప్తించినపుడు సురాపానంతో వచ్చినంత మత్తు వస్తుంది. ఎవడు ఆ మైకంలో పడకుండా జ్ఞానంతో, విచక్షణతో ప్రవర్తిస్తూ, పెద్దలను గౌరవిస్తాడో వాడి జీవితమే సుఖవంతమవుతుంది. లేకుంటే అవమానింపబడి పతనమైపోతాడు.

ద్రుపదుడు - ద్రోణాచార్యుడు

పాంచాల రాజు ద్రుపదుడు, పాండవుల అస్త్రశాస్త్ర గురువైన ద్రోణాచార్యుడు ఇరువురూ మహర్షి భరద్వాజాశ్రమంలో పెరిగి పెద్దవారైన బాల్యమిత్రులు. విద్యాభ్యాసానంతరం మహర్షి భరద్వాజుని వద్ద అనుమతిపొంది ద్రుపదుడు పాంచాల దేశాధినేతగా పట్టాభిషిక్తుడై, అజేయ పరాక్రమంతో రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉండినాడు.

ద్రోణాచార్యుడు భక్తి-శ్రద్ధలతో చతుర్వేదాలు నేర్చుకున్నాడు. శిష్యుని గురుశుశ్రూషకు మెచ్చి భరద్వాజ మహర్షి ఆగ్నేయాస్త్రాన్ని ప్రసాదించాడు. అయినా తృప్తిచెందక పట్టుదలతో అనేక శస్త్రాస్త్రాల ప్రయోగ, ఉపసంహార రహస్యముల నన్నింటినీ నేర్చుకున్నాడు. విద్యాభ్యాసానంతరం కృపి అనే కాంతామణిని వివాహం చేసుకొని గృహస్థుడైనాడు.

గృహస్థుడైన ద్రోణాచార్యుడు కుటుంబాన్ని కూడా పోషించలేనంతటి దుర్భర దారిద్ర్యంలో ఉండిపోయాడు. ఒకరోజు అతనికి బాల్యమిత్రుడైన ద్రుపదరాజు జ్ఞప్తికి రాగా పాంచాల రాజధానికి వెళ్ళి ద్రుపదరాజును దర్శించుకున్నాడు. కానీ ద్రుపదుడు కనీసం పరిచయం కూడా లేనట్లుగా చూచి చూడనట్లు ఉండిపోయాడు. ద్రోణాచార్యుడు

సహనంతో కొంత సమయం వరకు వేచిచూచాడు. కానీ ఎంత సేపటికి ద్రోణాచార్యుడిని పలకరించనేలేదు. అందుకు ఆచార్యుని హృదయం అవమానంతో దహించుక పోయింది. అయినా తమాయించుకొని "మహారాజా" నేను ద్రోణుడను, సహాధ్యాయులమైన మనమిద్దరం కొన్ని సంవత్సరాలు కలసిమెలసి ధనుర్వేదం అభ్యసించాము. ఇంతవరకూ జ్ఞాపకానికేరాలేదా? అని అన్నాడు వినయంగా.

ఆ మాటలను వినీ వినగానే రాజుననే అహంకారంతో వెకిలి నవ్వు నవ్వి శ్రీమంతుడనైన నేనెక్కడ? దరిద్రుడవైన నీవెక్కడ? మనకు స్నేహం ఎట్లా పొసగుతుంది? ఇలాంటి స్వల్ప విషయంకూడా నీకు తెలియకపోవడం నేర్చిన విద్యకే అవమానం. ఓరీ మందబుద్ధీ తత్వవేత్తకు, విద్యా విహీనుడికీ, శూరునికి, భీరునికీ మధ్య మైత్రి ఎలా కుదురుతుందనుకున్నావు? శీలంలోగానీ, కులంలో గానీ, ఐశ్వర్యంలో గానీ, సమానులైన వారికే స్నేహ, వివాహ సంబంధ, బాంధవ్యాలు ఏర్పడుతున్నాయి కానీ, మహీశ్వరులకు సామాన్యులతో గాని, రధికులకు పాదచారులతోగాని మైత్రి పెంపొందగలదా? అలాగే నీకు నాకు మధ్య స్నేహం ఉందంటే విన్నవారంతా గొల్లున నవ్వరా? మారుమాటాడకుండా వెంటనే వెనుదిరిగి చూడకుండా వచ్చిన దారినే వెళ్లిపో" అని ఇష్టం వచ్చినట్లు అవమానించాడు.

శస్త్ర శాస్త్రవేత్త అయిన ద్రోణాచార్యుడు తీవ్రమైన అవమానంతో ఎగిసిపడుతున్న ఆగ్రహావేశాన్ని లోలోపలే అణచుకుంటూ తన ఆశ్రమానికి మరలి వచ్చేశాడు. ద్రుపదరాజు అహంకారానికీ, బాల్య స్నేహాన్ని మరచిన విశ్వాస ఘాతకుడికీ తగిన బుద్ధి చెప్పి తీరాలని నిశ్చయించుకున్నాడు. తర్వాత కుటుంబ సమేతంగా హస్తినాపురానికి తరలి వెళ్ళాడు. ఒకరోజు కరినగర ఉద్యానవనంలో ఆటలాడుకుంటున్న పాండవ, ధృతరాష్ట్ర కుమారుల బంతి ఒక లోతైన బావిలో పడింది. రాజకుమారులందరూ బావి చుట్టూ చేరి బంతిని చూస్తున్నారేగానీ, దానిని పైకి తీసుకు వచ్చే మార్గంగానీ, ఉపాయం గానీ వారికి తట్టలేదు. ఆ సమయంలో అటువైపుగా వచ్చిన ద్రోణాచార్యుడు రాజకుమారుల కలకలం విని అక్కడికి చేరుకున్నాడు. జరిగిన సంగతి తెలుసుకుని రాకుమారులతో కాసేపు మాట్లాడి, ధైర్యం చెప్పి తన అస్త్ర విద్యా నైపుణ్యంతో నూతిలోని బంతిని బైటికి తీసి ఇచ్చాడు. ఆ అద్భుత శస్త్ర విద్యా నైపుణ్యానికి రాకుమారులంతా సంతోషించి ద్రోణాచార్యుని వెంట పెట్టుకొని భీష్మాచార్యుని వద్దకు తీసుకెళ్ళి విషయాన్నంతా పూస గ్రుచ్చినట్లు చెప్పారు.

విషయాన్ని తెలుసుకున్న భీష్మాచార్యుడు ద్రోణున్ని రాకుమారులకు ఆచార్యుడుగా ఉండవలసిందిగా ప్రార్థించాడు. అందుకు సమ్మతించిన ద్రోణాచార్యుడు రాకుమారులకు ఆచార్యుడుగా ఉంటూ యుద్ధ విద్యలన్నింటినీ చక్కగా బోధించాడు. విద్యాభ్యాసం పూర్తికాగానే ద్రోణాచార్యునికి ముఖ్య శిష్యుడైన అర్జునుడు గురుదక్షిణగా ఏం చెల్లించమంటారో సెలవివ్వండి అని ప్రార్థించగా, పాంచాల రాజైన ద్రుపదుడిని

యుద్ధంలో జయించి బందీగా తీసుకు రమ్మంటాడు ద్రోణాచార్యుడు.

గురువు ఆజ్ఞను శిరసావహించి అర్జునుడు ద్రుపదరాజును యుద్ధంలో ఓడించి, బంధించి గురువు గారి ఎదుట నిలబెట్టాడు. అవమానంతో తలదించుకొని ఉండిన ద్రుపదుడు తలెత్తుకొని చూడగా తాను అవమానపరచిన ద్రోణాచార్యుని ఎదుట ఉన్నానని గ్రహించాడు. గతం గుర్తుకు వచ్చి అవమానంతో క్రుంగిపోయాడు.

అపుడు ద్రోణాచార్యుడు "ఎవరయ్యా ఇతను ద్రుపద రాజేనా? రాజునన్న అహంకారం, శ్రీమంతుడనన్న అహంకారం ఇప్పటికి తగ్గినట్లుంది! అని పరిహాసమాడి స్నేహమంటే ఏమిటో తెలియజెప్పి అపకారం ఏమీ చేయకుండా బంధ విముక్తుణ్ణి చేసి పంపాడు.

* మిత్రుని దుఃఖాన్ని బాధను కష్టనష్టాలను చూచి స్పందించనివాడు శత్రువే.
* స్నేహంతో మనదగ్గరికి వచ్చిన వాడిని తృణీకరించడం పతనానికి కారణమవుతుంది.
* విపత్కర పరిస్థితులలో విడిచి వెళ్ళక, వెన్నంటి ఉంటూ ఆదుకునేవాడే నిజమైన మిత్రుడు.
* వ్యక్తికీ వ్యక్తికీ మధ్య రక్త సంబంధం కంటే వేరైన అవినాభావ సంబంధమే స్నేహం.
* మిత్రుని విమర్శ సద్బుద్ధితో ఉంటుంది. ప్రశంస సహృదయంతో ఉంటుంది.
* మంచి మిత్రుడు లేనివాడు, మంచి మిత్రుడిగా ఉండలేనివాడు బ్రతికినా చచ్చినట్టే.
* కొందరు మిత్రులనబడే వారికి అవతలి వాళ్ళ సమస్యల తీవ్రతతో పనిలేదు. అవతల వారి భావోద్వేగాలను పట్టించుకోరు. ఏమైనా పనులు చేసి పెట్టినందుకు లాభాపేక్షను వదలుకోరు. అయినా తాము మిత్రులమేనని అంటూంటారు.
* స్నేహానుబంధంలో లాభనష్టాలు బేరీజు వేసుకునే ప్రసక్తే లేదు. ఒకవేళ వస్తే అది వ్యాపారం అనిపించుకుంటుంది.
* నిజమైన స్నేహితుడు కేవలం సానుభూతి చూపించి ఊరుకోడు. 'సహానుభూతి' అనుభవిస్తాడు.
* చెలికాడి హితం కోరి - చేదు మాటలనైనా, నిర్మొహమాటంగా చెప్పడానికి సిద్ధపడేవాడే స్నేహితుడు.
* ఈ విశాల ప్రపంచంలో మనం దేన్ని గురించైనా మనసు విప్పి మాట్లాడగలిగేది మిత్రుని దగ్గరే. సమస్యల చిక్కుముడులు విప్పుకునేది మిత్రుని దగ్గరే.
* చెడిన స్నేహాన్ని, చెడ్డపల్లెనూ వదలి దూరంగా వెళ్ళడమే మంచిది.
* బలవంతునితో పగ ఎన్నటికీ మంచిదికాదు.
* కలతలు లేని స్నేహం ఉండాలంటే కపటం లేని హృదయాలై ఉండాలి.
* సజ్జన సాంగత్యం వలన, సత్యాన్ని పలకడం అలవడుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పాపపు ఆలోచనలు క్రమంగా నశిస్తాయి. వారి కారణంగా మనకు కూడా మంచిపేరు వస్తుంది.

* తమతో సమానం కానివారితో కూడా ప్రియంగా మాట్లాడటం, ప్రాణాపాయ పరిస్థితులలోకూడా పాపానికి ఒడిగట్టకపోవడం, ఎలాంటి అవసరం వచ్చినా అధములను యాచించకుండా ఉండడం, అధికంగా సంపదలను కోరుకోకపోవడం, కష్టాలలోకూడా ధైర్యాన్ని వదలకపోవడం, దానం చేసి కూడా రహస్యంగా ఉంచడం, మంచి చేసికూడా మౌనంగా ఉండడం, పరహితమే లక్షణంగా ఉండడం, ఉన్నదున్నట్లుగా చెప్పడం. సజ్జనుల లక్షణాలు.

తెలివి తక్కువ వాడితోడు - సహవాసం తప్పక చేటు తెస్తుంది

ఒక వ్యాపారి పొరుగూరికి పోతూ ఉండగా దారిలో ఒకడు తోడు దొరికాడు. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ ప్రయాణించసాగారు. వ్యాపారికి దారిలో కలిసిన నేస్తగాడు కాస్తంత మూర్ఖుడుగా అర్థమైపోయాడు. అయినా, ఊరు చేరేటంతవరకే కదా, వాడితోడు, ఆ తర్వాత వాడిదారి వాడిది. నా దారినాది, ఒంటరిగా వెళ్లేదానికంటే ఎవరో ఒకడు తోడుండడం మంచిదే కదా? అని తనకు తాను సర్దిచెప్పుకున్నాడు వ్యాపారి. దారి మధ్యలో చీకటి పడింది. వ్యాపారి తాను తెచ్చుకున్న అన్నంలో కొంత నేస్తగాడికి కూడా పెట్టి, తాను కొంత తిని, ఒక చెట్టు మరుగున పడుకున్నాడు. నేస్తగాడు మాత్రం దారిలోనే ఒక ప్రక్కగా పడుకున్నాడు. అర్ధరాత్రి కొందరు దొంగలు ఆ దారిలో పోతూ ఉండగా దారి ప్రక్కనే నిద్దురపోతూ ఉండిన వాడి కాళ్ళు దొంగలకు తగిలాయి. ఇదేమి మొద్దులాగా ఉందే అన్నాడు దొంగ. అది విని పడుకున్నావాడల్లా లేచి కోపంతో మొద్దు దగ్గర రూపాయలు ఉంటాయా ఎక్కడైనా? అన్నాడు. అది విన్న దొంగలు వాడిని పట్టుకొని వాడిదగ్గరున్న వంద రూపాయలు లాక్కున్నారు. పోతూ పోతూ వాడి తెలివి తక్కువ తనానికి నవ్వుకుంటూ, అసలు వాడి దగ్గరున్న రూపాయలు చెల్లుతాయో లేదో అనుకున్నారు. ఆమాటలు విని, కోపంతో నా రూపాయలు అటువంటివి కాదు మంచివే! అవునోకాదో అదిగో అక్కడ చెట్టుక్రింద నిద్రపోతున్న వ్యాపారిని అడగండి అన్నాడు. ఆ దొంగలు అలాగే అడుగుతాము అని వెనక్కి వచ్చి నిద్రపోతున్న వ్యాపారిని లేపి వాడి దగ్గరున్న ధనాన్ని కూడా దోచుకొని సంతోషంతో వెళ్ళిపోయారు.

ఎంతటి ప్రయోజనకారి అయినా దుర్జనుని ఆశ్రయించరాదు

ఒక ముసలి పులి దర్భలు ఒకచేత, బంగారు కంకణమును ఒక చేత పట్టుకొని కొలను గట్టున నిబ్బరంగా కూర్చొని దారి కాచి ఉండినది. వెళ్లుతున్న ఒక బాటసారిని చూచి ఈ బంగారు కంకణమును చూడు ఇది నీ కొరకే; వచ్చి తీసుకో అన్నది. బాటసారి ఆశతో ఏదీ కంకణమును చూపించు అన్నాడు. పులి ముందరి పంజాతో పట్టుకొని ఉన్న బంగారు కడియమును చూపించింది. నీవు క్రూర మృగానివి నిన్నెలా నమ్మాలి? అని బాటసారి ప్రశ్నించాడు. ఆ మాటవిని పులి ఓ బాటసారీ..., నేను యవ్వనంలో మిక్కిలి దుష్టుడనై అనేక గోవులను, బాటసారులను దారుణంగా చంపి, తిన్నాను.

ఎన్నో పాపాలను చేశాను. ఒక సాధువు నామీద జాలిపడి దయతో ఇకమీదట గోవులను, మనుషులను చంపవద్దు చేసిన పాపాలు చాలు. మంచి కార్యములను చేయుచూ బ్రతుకు. అని హితబోధ చేసాడు. ఆనాటి నుండి సత్కార్యములనే చేస్తూ ఉన్నాను. ముదుసలి దానను, బోసినోటిదానను, గోళ్లు కూడా అరిగిపోయినవి. లేవసత్తువలేని దానను. నన్ను నమ్మలేవా? అంత అనుమానంగానున్న పోయిరమ్ము. నీవు పేదవాడివి కాబట్టి నీకు ఈ బంగారు కడియమునిచ్చి తృప్తిపడదామను కున్నాను. నీవేమో నన్ను నమ్మకపోతివి అన్నది. అందుకు బాటసారి తేరగా వచ్చు బంగారు కంకణమునకాశపడి సరే లెమ్మన్నాడు. అంత పులి ఏ మాత్రమూ సంశయింపక యీ కొలనులో దిగి స్నానం చేసి, శుచివై ఈ బంగారు కంకణమును పుచ్చుకొనుము అనగానే బాటసారి ఆశకుపోయి కొలనులో స్నానం చేసేదానికి దిగగానే మొలలోతు బురదలో దిగబడిపోయాడు. పులి అయ్యయ్యో! రొంపిలో దిగబడితివా? లేవనెత్తెదను అంటూ దగ్గరకు బోయి శ్రమలేకుండా ఆరగించింది. చావబోతూ క్రూరజంతువని తెలిసికూడా ఆశకు పోయి బుద్ధి మందగించి ఈ గతి తెచ్చుకుంటిని అని వగచాడు బాటసారి.

* పాము పడగమీద విలువైన మణి ఉన్నా సర్పము వద్దకు పోవువాడు మూర్ఖుడే కదా!

క్రొత్తగా వచ్చిన వారిని నమ్మరాదు

గొప్ప మర్రిచెట్టు తొర్రలో ఒక ముసలి గ్రద్ద నివసిస్తూ ఉండేది. ఆ వృక్షమును ఆశ్రయించి నివసించు పక్షులన్నీ ఆ ముసలి గ్రద్దకు తాము తెచ్చుకున్న ఆహారంలో కాస్తంత ఇచ్చి తమ పిల్లలకు, గ్రుడ్లకు కాపలాగా ఉంచుకున్నాయి. ఆ విధంగా ముసలి గ్రద్ద తన శేషజీవితాన్ని నెట్టుకొస్తూ ఉండేది. ఒకనాడొక జంగుబిల్లి పక్షిపిల్లలను, గ్రుడ్లను తినుటకు సద్దు చేయకుండా చెట్టు మీదికి వచ్చింది. పిల్లిని జూచి భయపడి పక్షి పిల్లలు అరవ సాగాయి. శబ్దమును విన్న ముసలి గ్రద్ద "ఎవరడక్కడ? అని గద్దించింది". అపుడు పిల్లి హా! చచ్చితి గదా! తప్పించుకొను మార్గము లేదు. "కానున్నది కాకమానదు", "రోటిలో తలదూర్చి రోకటి పోటుకు భయపడరాదు". ఎలాగోలాగ అపాయము నుండి బయటపడవలె. ఇపుడు మంచితనముగ తప్పించుకోవలెనని ఈ విధంగా పలికింది. అయ్యా! నమస్కారము, నేనొక పిల్లిని అనెను. విన్న వెంటనే నీవు వెళ్లిపొమ్ము లేదా నీ ప్రాణాలు తీసెదను అనగా, పిల్లి శాంతంగా, తియ్యగా అనుభవజ్ఞులు, వృద్ధులైన మీరు తొందరపడి అలా మాట్లాడవలదు. ముందు నేజెప్పునది విని తర్వాత మీకు తోచినట్లు చేయండి ఇది నా ప్రార్థన అన్నది. సరే నీవు వచ్చిన పనియేమి? అని ముసలి గ్రద్ధ అడిగింది. అయ్యా నేను ఇక్కడి నదిలో నిత్యము స్నానము చేయుచూ, మాంసాహారమును వదలి, బ్రహ్మచారినై పుణ్యకార్యములజేయుచున్నదానను మీరు ధర్మజ్ఞులనీ, మంచివారనీ, వయోవృద్ధులనీ, ఇక్కడి పక్షులు మీ గురించి గొప్పగా చెప్పుకొనుట విని మిమ్ములను దర్శించు కొనవలెనని ఎన్నాళ్లనుంచో అనుకొనుచున్నాను.

ఇదిగో ఈనాటికి నా కోరిక ఈ విధంగా నెరవేరింది. మీ నుండి జీవిత ధర్మ సూక్ష్మములను వినాలని ఎంతగానో పరితపించుచున్నాను. ధర్మజ్ఞులైన మీరే, గడప ద్రొక్కుకొని వచ్చిన వానిని నన్నే దూషించు ప్రయత్నం చేసితిరికదా? గృహస్థ ధర్మమా ఇది? శత్రువునైననూ ఇంటికి వచ్చిన వానిని గౌరవించి పంపవలెను కదా? ధనము లేకున్నా, మంచి మాటలతోనైనా సత్కరించి పంపవలెను గదా? ఇంటికి వచ్చిన అతిథి ఉసూరని పోరాదు. అది మిక్కిలి పాపము కదా? అనగా - ముసలి గ్రద్ధ, పిల్లులకు మాంసమనిన మిక్కిలి ఇష్టముకదా? ఇక్కడ మా పక్షిపిల్లలూ, గుడ్లూ ఉన్న కారణంగా నేనట్లు చెప్పితిననగానే, పిల్లి రెండు చెవులూ మూసికొని శివశివా ఎంత పాపము చేసి ఈ పిల్లి జన్మమెత్తితినో కదా! ఇది చాలక ఈ పాపముకూడా మూట కట్టుకొనవలెనా? ఎంతమాట వినవలసి వచ్చెను. ఇప్పుడు ధర్మ శాస్త్రములను వినుచూ ఎలాంటి కోరికలూలేకుండా జీవిస్తున్నాను. నేనిట్టి పాపమును చేయజాలననగా, గ్రద్ధ విని కోపగించుకోకు నాయనా! క్రొత్తగా వచ్చిన వారి స్వభావములెలా తెలుస్తాయి? నీవెవరో తెలియక అన్న మాటలను తప్పుగా భావించవద్దు. పరిచయమాయెను కదా? నీవు ఇకమీదట ఎపుడైననూ రావచ్చు పోవచ్చు. అనెను. తర్వాత పిల్లి ముసలి గ్రద్దతో ఎంతో స్నేహంగా చెట్టు తొఱ్ఱలోనే ఉంటూ ఉండినది. కొన్ని దినములు గడిచాక, చడీచప్పుడు లేకుండా చెట్టెక్కి పక్షిపిల్లల గొంతు కొరికి తెచ్చుకొని తొఱ్ఱలో బెట్టుకొని తినసాగింది. అక్కడ పక్షులు తమ పిల్లల సంఖ్య రోజు రోజుకూ తరిగిపోవుట చూచి, బాధతో అక్కడక్కడ వెదికాయి. అది తెలిసి పిల్లి తొఱ్ఱను వదలి పారిపోయింది. ఆ పక్షులు చివరకు తొఱ్ఱలోని ఎముకలు, ఈకలు చూచి ముసలి గ్రద్దే ఈ ఘాతుకానికి పాల్పడినదని, గోళ్ళతో రక్కి, ముక్కుతో పొడిచి చంపివేసాయి.

* కస్తూరి వాసనను గుప్పిటలో దాచలేనట్లు, మంచివారి సంస్కార వాసనలు దాచినా దాగవు. వారి వ్యక్తిత్వం చక్కగా వారి చిరునామాను తెలియజేస్తుంది.
* స్నేహానికి తప్ప స్వార్థానికి తావివ్వని వారిని, పరిపరి విధాల పరీక్షించి ఎంచుకోవడం మంచిది.
* మంచి స్నేహం పొందాలంటే ముందు మనం మంచి స్నేహభావాలు కలిగి ఉండాలి.
* స్నేహంలో చెప్పు మీద పడినా పువ్వుపడినట్లుగానూ, ఎంగిలితుంపరపడినా పన్నీటి జల్లు పడినట్లుగానూ భావిస్తారు. వైరంలో పువ్వుమీద పడినా చెప్పు పడినంత ద్వేషం, పన్నీరు పడినా విషపు చుక్కలు పడినట్లుగా భావిస్తారు.
* సూర్యునికి 'మిత్ర' అని పేరుంది. సూర్యుడు వెలుగును, వేడిని ప్రసాదిస్తాడు, అన్నమును ప్రసాదిస్తాడు. కావున మిత్రుడు మనకు దారి చూపేవాడు, చేతనైన సహాయం చేసేవాడే మిత్రుడు. కీడు తలపెట్టేవాడు, విమర్శించి మనలను క్రుంగదీసేవాడు శత్రువు.

* వాస్తవానికి భార్యాభర్తల కంటే, బంధుబాంధవులకంటే, పరమ మిత్రులకంటే మనకత్యంత సన్నిహితుడు పరమాత్ముడే. మన శరీరం మనకు చాలా దగ్గర. మన శరీరానికంటే మన మనసు ఇంకా దగ్గర. అన్నింటికంటే, అందరి కంటే పరమాత్ముడు అత్యంత దగ్గర. కానీ ఆ విషయం మనకు తెలియదు అనడం కంటే మనం తెలుసుకోవడం లేదు అనడం సబబు. కాటుక పెట్టుకున్న కళ్ళు కాటుకను చూడలేవు. ఎందుకంటే అతి దగ్గరగా ఉన్న వస్తువును, అతి దూరంగా ఉన్న వస్తువును కండ్లు చూడలేవు. అలాగే పరమాత్మకూడా మనకు అత్యంత సమీపంలోనే ఉన్నాడు. మనోమాలిన్యం కారణంగా ఆ పరమాత్మను చూడలేకపోతున్నాం. సమస్త ప్రాణులకు, హితవు చేసే పరమాత్ముడినే సన్నిహితుడు అంటారు. పరమాత్మునికి మించిన సన్నిహితుడు,స్నేహితుడు మనకు లేడు.

పరమాత్ముడు మిత్రునిలాగా మన హృదయంలోనే ఉంటూ, మంచి పనులకు ప్రేరణ కలిగిస్తూ ఉంటాడు. చెడ్డపని చేసే వారి హృదయంలో హెచ్చరిక చేస్తూ ఉంటాడు.

* ప్రపంచమంతా నిన్ను వదలి వేసినా భార్యాబిడ్డలు, కుటుంబమంతా నిన్ను చూచి ముఖం తిప్పుకున్నా, నీవు నిరాశ్రయుడవైనా, సంపూర్ణ విశ్వాసంతో భగవంతుడిని ఆశ్రయిస్తే శీఘ్రగతిన మధురమైన ఆశ్రయం నీకు లభించి తీరుతుంది.

ఇరుగు పొరుగుతో సఖ్యతగా ఉరడాలి

శాంతినగర్ కాలనీలోని ఒక ఖాళీ ఇంటి ముందు ఒక లారీ, సామానుతో సహా వచ్చి ఆగింది. ఎవరో వచ్చి ఇంట్లో చేరుతున్నారు అని చుట్టు ప్రక్కలవాళ్ళు చాలా సంతోషించారు. రెడు రోజుల తర్వాత ఆ క్రొత్తగా వచ్చి చేరిన ఇంటి పని మనిషి ద్వారా తెలిసింది వచ్చిన వారు కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ అని.

ఆనవాయితీ ప్రకారం ఆ కాలనీ వాసులంతా వెళ్ళి ఒకరికొకరు పరిచయం చేసుకున్నారు. అంతా పెద్ద ఆఫీసర్లు కాకపోయినా, వ్యాపారాలతోనూ, ఒక మోస్తరు ఉద్యోగాలతోనూ అందరూ బాగా ఉన్నవాళ్ళే. చిన్నచిన్న అవసరాలకు ఒకరికొకరు ఆదుకుంటూ, ఒకరింటికి మరొకరు వస్తూ పోతూ చాలా సఖ్యతగా ఉంటూ ఉంటారు. అలాగే క్రొత్తగా వచ్చి చేరిన కుటుంబాన్ని కూడా అందరూ పేరంటానికి, గృహ ప్రవేశానికి పిలిచేవారు. క్రొత్తగా వచ్చారు కదా ఏదైనా అవసరానికి మమ్ములను పిలవండీ మేం వస్తాం అని కూడా చెప్పారు. స్నేహ హస్తం అందించారు. వారు కూడా అలాగే లెండి అని మర్యాదపూర్వకంగానే అన్నారు. కానీ, ఆ యింట్లో ఉన్న పెద్దావిడ ఆఫీసర్ భార్యగారు తన చేతికున్న వజ్రాల గాజులను మెడలోని ఆభరణాలను చూపించీ చూపించనట్లుగా చూపించి. డాబు, దర్పం అలవోకగా చూపిస్తూ మాట్లాడేది. కానీ ఏ కార్యక్రమానికీ వచ్చిందీ లేదు, ఇరుగు పొరుగు కదా అని ఎవరితోనూ మాట్లాడిందీ లేదు. అవసరానికి ఎవర్నీ పిలిచిందీ లేదు. అసలు ఇంటి నుంచి బైట అడుగు పెడితే కారులోనే.

కొద్దిరోజులకు ఇరుగు పొరుగు వారికి తెలిసిందేమిటంటే ఆఫీసర్ గారి భార్యా చాలా గొప్ప వంశానికి చెందినదనీ, శ్రీమంతుల కుటుంబాల నుండి వచ్చిందనీ, అందుకని ఎవరితోనూ కలువదనీ.

రోజులు అలా దొర్లిపోతున్నాయి. ఇక తెల్లవారుతుందనగా ఆఫీసర్ ఇంటిముందు ఒకరోజు ఒక ఖాళీ లారీ వచ్చి ఆగింది. దబదబా అరడజనుమంది దిగారు. ఇంటి తాళాలు తీసి, తలుపులు తెరచారు. ఒక క్రమపద్ధతి ప్రకారం వస్తువులు ఏమాత్రం డ్యామేజీ కాకుండా లారీలో సర్దుతున్నారు. చాలా జాగ్రత్తగా పెట్టండిరా, లేకుంటే సార్ చాలా కోప్పడతారు, ముఖ్యంగా మేడమ్‌గారికి కోపం తెప్పించకూడదు అని గట్టిగానూ, సరదాగానూ మాట్లాడుకుంటూ సామాన్లను లారీలో సర్ది తలుపులకు తాళాలు వేసి హుందాగా వెళ్ళిపోయారు. కాలనీలోని వారంతా అనుకున్నారు ఆ ఆఫీసర్‌కు ట్రాన్స్‌ఫర్ వచ్చిన కారణంగా ముందుగా కుటుంబమంతా వెళ్లారు. తర్వాత లారీలో సామానులు తీసుకెళ్లారు అని. కానీ ఆ మరుసటి రోజే కారు నుండి కుటుంబ సభ్యులంతా దిగారు. ఇరుగుపొరుగువారు మాత్రం ఆశ్చర్యంతో వీరేంటి మరలా వచ్చేశారు. సామానంతా తీసికెళ్ళి మరలా రావడమేమిటి? అని అనుకున్నారు. ఇంటిలోకి వెళ్లినవారు వెళ్లినంత వేగంగానే బైటికి వచ్చి మన ఇల్లే అని, ఒకటికి పదిమార్లు గుర్తులు సరిచూచుకొని, ఇరుగు పొరుగువారు కూడ వాళ్లేనే అని నిర్ధారించుకొన్న తర్వాత అడిగారు ఏమండీ మా ఇంటిలో సామాను ఒక్కటి కూడా లేదే? ఏమైంది? అని.

ఇరుగు పొరుగు వారు ఏమండీ మీరు ట్రాన్స్‌ఫర్ వచ్చి వెళ్లలేదా? అని జరిగిందంతా ఆశ్చర్యంగా చెప్పారు. అప్పుడు తెలిసింది. ఇరుగు పొరుగువారితో సఖ్యతగా ఉండాలి, ఎచ్చటికైనా వెళ్లేటప్పుడు ఇరుగు పొరుగువారితో చెప్పాలి. కష్టసుఖాలు పంచుకోవాలి అని.

నిజాయితీ ఎవరికుంది?

మన్నూరు గ్రామంలో రమణయ్య, ఓబయ్య అనే ఇద్దరు స్నేహితులుండేవారు. ఇద్దరూ పేదవారే. రోజూ ఏదో ఒక పని చేస్తూ తమ తమ కుటుంబాలను పోషించుకుంటూ ఉండేవారు. ఎంతపని చేసినా డబ్బును కూడబెట్టుకోలేక పోయేవారు. ఏదైనా వ్యాపారం చేసుకుంటూ సుఖంగా ఉండాలనుకున్నారు. కానీ వ్యాపారానికి పెట్టుబడి పెట్టుకోవడానికి పైసాకూడా లేని కారణంగా అలాగే కాలం నెట్టుకొస్తున్నారు. ఒకసారి మాటల సందర్భంలో నిజాయితీ విషయంగా ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగింది. నేను ఎందులోనైనా నీకంటే నిజాయితీ గలవాడను అన్నాడు రమణయ్య. అందుకు ఓబయ్యకూడా నీకంటే నేనే ఆ విషయంలో గొప్పవాణ్ణి అన్నాడు. అలాగే ఆ విషయాన్ని అప్పుడప్పుడు అనుకోసాగారు.

ఆ సమయంలోనే రత్నగిరి, రవ్వలకొండ, రాళ్ళపల్లి, రంగురాళ్ళకనుమ అనే కొండ ప్రాంతాలలో రంగురాళ్ళు, వజ్రాలు, రత్నాలు దొరుకుతున్నాయని, వాటికోసం

చాలామంది జనం వెదకడానికి పోతున్నారని తెలిసింది. మనం కూడా వాటికోసం వెదకడానికి పోదామా? అన్నాడు ఓబయ్య. అందుకు రమణయ్య అలాగే పోదాం అదృష్టమున్నవాడికే దొరుకుతాయట. మనం కూడా మన అదృష్టాన్ని చూచుకుందాం. అయితే మనలో ఒకరికి దొరికి ఒకరికి దొరక్కపోయినా పోట్లాడుకోకుండా దొరికినదాన్ని సమానంగా పంచుకుందాం అన్నాడు. సరేనన్నాడు ఓబయ్య.

మరునాడుదయమే రమణయ్య, ఓబయ్య ఇద్దరూ చద్దిమూట కట్టుకొని వజ్రాలకోసం కొండప్రాంతాలకు వెళ్ళారు. కానీ ఎక్కడా ఏమీ దొరకలేదు. చివరకు రంగురాళ్ళ కనుమకు వెళ్ళారు. అక్కడ ఉన్న శివాలయంలో కాసేపు విశ్రాంతి తీసుకుని దగ్గరున్న చద్దన్నం తిన్నారు. శివాలయానికి దగ్గర్లోనే ఒక కాలువ పారుతోంది. అక్కడ చాలామంది వీళ్ళలాగే వజ్రాలకోసం వచ్చిన వారంతా చాలా ఏకాగ్రతగా వెతుకుతున్నారు. రమణయ్య, ఓబయ్యలు కూడా ఉత్సాహంగా వెదకసాగారు. ఒకచోట, రమణయ్య ఒక గుండురాయిని ప్రక్కకు తొలగించాడోలేదో ధగధగా మెరుస్తూ పిడికిడంత వజ్రం దొరికింది. కళ్లు మిరుమిట్లు గొలిపే ఆ రాయిని చూచి ఓబయ్య ఆనందంతో మనకు అదృష్టం ఉంది కనుక ఇది దొరికింది. మనం అనుకున్న ప్రకారం దీన్ని అమ్మగా వచ్చిన డబ్బును సమానంగా పంచుకుందాం అన్నాడు. రమణయ్య సంబరపడుతూ సరే నన్నాడు. కానీ అప్పటికే బాగా పొద్దు పోయింది. అందరూ అప్పటికే ఇంటి దారిపట్టారు. ఓబయ్య ఏదో ఆలోచించి ఈ చీకట్లో వెళ్ళాలంటే కష్టం. పైగా మన గ్రామం చాలా దూరం కాబట్టి ఇక్కడే శివాలయంలో పడుకుని ఉదయమే లేచి వెళదాం అన్నాడు.

రమణయ్య మిత్రుని మాటకు సరేనని తలూపాడు. గుడిలోనే పడుకున్నారు. అయితే ఓబయ్యకు ఆ రాత్రి బుద్ధిని చీకటి కమ్మేసింది. ఓబయ్యకు నిద్రపట్టలేదు. నెమ్మదిగా లేచి నిద్రపోతున్న రమణయ్య దగ్గరున్న వజ్రాన్ని తీసుకుని ఒకచోట రహస్యంగా దాచాడు. మరొకమారు వచ్చి తీసుకెళ్ళవచ్చు అనుకున్నాడు. అలా చేశాక ఓబయ్యకు బాగా నిద్రపట్టింది.

తెల్లవారింది ఇద్దరూ తమ స్వగ్రామమైన మన్నూరు దారిపట్టారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా మనం అనుకున్నట్లుగా వజ్రాన్ని అమ్మి వచ్చిన డబ్బును సమంగా పంచుకుందాం అన్నాడు రమణయ్య నడక సాగిస్తూ ఓబయ్యతో.

తమ గ్రామానికి ప్రక్కనే ఉన్న రాజంపేట పట్టణంలో ఉన్న సేఠ్ చమన్‌లాల్ వద్దకు వెళ్ళారు. తన వద్దనున్న వజ్రాన్ని జేబిలోంచి తీసి సేఠ్‌కు ఇచ్చాడు రమణయ్య. సేఠ్ బాగా పరీక్షించి జాతి వజ్రం దొరికింది మీకు ఇదిగో నాలుగు లక్షలు అని రమణయ్య కిచ్చాడు. ఓబయ్యకు నోటమాట రాలేదు. ఏం మాట్లాడాలో తెలియక బిక్కమొగం వేసుకున్నాడు. రమణయ్యకు తను చేసిన ద్రోహం తెలిసిపోయిందన్న సంగతి తెలుసుకోడానికి ఎంతోసేపు పట్టలేదు. తనకు వాటా ఇస్తాడో లేదోనన్న బాధ ముఖమంతా కమ్మేసింది ఓబయ్యకు.

అందుకు రమణయ్య ఓబయ్యతో మిత్రమా ఏమీ బాధపడకు. మనం పడుకున్న సమయంలో నీవు నా వద్దకు వచ్చి వజ్రాన్ని దొంగలించి, ఒక చోట దాచి వచ్చి బాగా నిద్రపోయావు. నేను నిద్ర నటించానేకానీ నిజంగా నిద్రపోలేదు. పరాయిచోట, అందులోనూ విలువైన వజ్రం దగ్గరుంటే నిద్రపడుతుందా? నీవు దాచిన వజ్రాన్ని నేను తీసుకున్నాను. మనం స్నేహితులం. నీవు నాకు ద్రోహం తలపెట్టావు. ఇది న్యాయమేనా? మనిద్దరిలో నేనే నిజాయితీపరుడిని అని అప్పుడప్పుడు అనే వాడిని గుర్తుందా? ఇప్పుడేమంటావ్ ఓబయ్యా అన్నాడు రమణయ్య.

అంతవరకూ బిక్క చచ్చిన మొగంతో ఉండిన ఓబయ్య నోరువిప్పి బుద్ధి గడ్డితిని పాడుపని చేశాను. నన్ను క్షమించు. ఇకపై నీలాగే నేను కూడా నిజాయితీగా ఉంటాను అన్నాడు. అనుకున్న ప్రకారం రమణయ్య ఓబయ్యకు రెండు లక్షలు ఇచ్చాడు. ఆ డబ్బుతో ఇద్దరూ వ్యాపారాలు చేసుకుంటూ హాయిగా బ్రతుకసాగారు. రంగురాళ్ళ కనుమవద్దనున్న శివదేవుడినే తమ ఇలవేల్పుగా కొలుస్తూ ప్రతి సంవత్సరం అక్కడ అన్న సంతర్పణ చేస్తూ తమ భక్తిని చాటుకుంటూ జీవించసాగారు.

* ఎదుటివారు మనలను అర్థం చేసుకోలేకపోవటం మనకు అంతగా సంబంధం లేని విషయం. మనం ఎదుటివారిని అర్థం చేసుకోలేకపోవడం పూర్తిగా మనకు సంబంధించిన విషయం.

రెండు ముత్యాల రహస్యం

గుణవర్మ చాలా డబ్బు కూడబెట్టాడు. అతను సంపాదించిన ప్రతి రూపాయి ధర్మ మార్గాన సంపాదించినదే. అతడికి ఏ దుర్వ్యసనాలూ లేవు. కాబట్టే అనవసర ఖర్చంటూ ఏమీ ఉండేది కాదు.

ఒకరోజు గుణవర్మకు తీర్థయాత్రలు చేసిరావాలనే సంకల్పం పుట్టింది. ఆరోజుల్లో బందిపోటు దొంగల ముఠాల బెడద ఎక్కువగా ఉండేది. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. తన దగ్గరున్న ఐదు వేల రూపాయలను అలాగే దాచేకంటే, విలువగల ఒకటో రెండో ముత్యాలు కొని దాచుకోవడం తేలిక కదా అని. వెంటనే ఐదు వేల రూపాయలకు రెండు ముత్యాలను కొనుగోలు చేసి 'బ్రతుకు జీవుడా' అనుకున్నాడు.

ప్రయాణానికి ముందురోజు రాత్రి తన బాల్య మిత్రుడైన విశ్వనాథాచారి దగ్గరికెళ్ళి, తన ప్రయాణం సంగతంతా వివరించాడు. తన వద్దనున్న రెండు ముత్యాల సంగతి చెప్పి తనవెంట తీసుకెళ్ళడం అంతమంచిది కాదు, కావున తీర్థయాత్రల నుంచి తిరిగి వచ్చేవరకు జాగ్రత్త పరచమన్నాడు. దానికేం భాగ్యం మిత్రమా, నీవు ఇంతలా ప్రాథేయపడవలెనా, ఆ మాత్రం జాగ్రత్త పరచలేనా! నా స్వంత సొత్తులాగా చూచుకుంటాను, నీవు ఏ చింతా, దిగులు పెట్టుకోకుండా నిబ్బరంగా ప్రయాణం చేసిరా! అన్నాడు విశ్వనాథాచారి. మిత్రుని మీద విశ్వాసంతో నిశ్చింతగా కాశీ, రామేశ్వరం

లాంటి పుణ్యక్షేత్రాలను దర్శించి ఒక సంవత్సరం తర్వాత తిరిగి వచ్చాడు గుణవర్మ. వచ్చీరాగానే కృతజ్ఞతగా గంగాజలం, ప్రసాదాలు తీసుకుని విశ్వనాథాచారి ఇంటికి వెళ్ళాడు.

ఓ హోహో! గుణవర్మలాగా ఉందే అంటూ చిరునవ్వుతో ఆహ్వానించాడు, విశ్వనాథాచారి. అవునోయ్ నేనే అంటూ లోనికి వెళ్ళి తీర్థ ప్రసాదాలు ఇచ్చి కూర్చున్నాడు గుణవర్మ. తీర్థాలన్నీ చుట్టి వచ్చి ఎంతో పుణ్యం మూటకట్టుకొని వచ్చావ్! ఇక డబ్బు మూటకట్టవలసిన అవసరం లేదు అంటూ వచ్చి కూర్చున్నాడు విశ్వనాథాచారి.

కుశల ప్రశ్నలు అయ్యాక గుణవర్మ తన తీర్థయాత్రల వింతలూ, విశేషాలూ చెప్పాడు. చివరగా దాచిన ఆ రెండు ముత్యాలు ఇస్తే తీసుకెళతాను అన్నాడు గుణవర్మ. ముత్యాలా? ఏం ముత్యాలు అంటూ ఆశ్చర్యం నటించాడు విశ్వనాథాచారి. గుణవర్మ నెత్తిన పిడుగు పడినట్లయింది. అరెరె! ఎంతమోసం! అనుకున్నాడు కోపావేశాన్ని దిగమింగుకుంటూ, నెమ్మదిగా, శాంతంగా ఏం మిత్రమా అలా అంటావ్! తీర్థయాత్రలకు వెళ్లేముందు రోజు రాత్రి నీ దగ్గర దాచిన ఆ రెండు ముత్యాల సంగతి ఎలా మర్చిపోతావ్ అన్నాడు. పుణ్యతీర్థాలు తిరిగి వచ్చిన తర్వాత బుద్ధి వికసించడంపోయి, మందగించినట్లయింది వెళ్లు, వెళ్ళు అని కసురుకున్నాడు విశ్వనాథాచారి.

గుణవర్మ కుప్పలా కూలిపోయాడు. ఏమీ చేయలేక, మారుమాటాడక విశ్వనాథాచారి ఇంటినుండి బైటికి వచ్చి సరాసరి న్యాయాధికారి దగ్గరికెళ్ళి ఫిర్యాదు చేశాడు. న్యాయాధికారి గుణవర్మ చెప్పినదంతా విన్నాడు. ఇందుకు సాక్షులెవరైనా ఉన్నారా? అని అడిగాడు న్యాయాధికారి. సాక్ష్యాలెవరూ లేరు. బాల్య స్నేహితుడు కదా అని నమ్మి అలా చేశాను అన్నాడు గుణవర్మ. సరే ముత్యాల పరిమాణం ఎంత? ఎలా ఉండివాయి? లాంటి వివరాలన్నీ అడిగి తెలుసుకున్నాడు న్యాయాధికారి.

న్యాయాధికారి మరునటి రోజు విశ్వనాథాచారిని పిలిపించి ప్రశ్నించాడు. తనకేమీ తెలియదంటే తెలియదు అని ఖచ్చితంగా చెప్పేశాడు విశ్వనాథాచారి. పైగా గుణవర్మే మోసకారి, అవద్ధాలకోరు అని నిందారోపణ చేశాడు కూడా.

న్యాయాధికారి మహా మేధావి. ముఖం చూస్తూనే మనుషుల అంతర్యాన్ని పసిగట్ట గలడు. అయినా గుణవర్మ ముత్యాలను ఇస్తుండగా చూచిన సాక్ష్యం లేదు. ఏం చేయాలి? తీవ్రంగా ఆలోచించాడు న్యాయాధికారి.

గుణవర్మా! విశ్వనాథాచారి నిజం చెబుతున్నాడు. నీవే అతని మీద అసత్యారోపణ చేస్తున్నట్లుగా ఉంది. ఈసారికి క్షమించి వదులుతున్నాను. నోరు మూసుకుని వెళ్ళు అని కోపంగా అన్నాడు న్యాయాధికారి. గుణవర్మ అవమానంతో బాధపడుతూ వెళ్ళాడు. విశ్వనాథాచారి పట్టరాని సంతోషంతో న్యాయాధికారికి నమస్కరించి వెళ్ళాడు.

పది రోజులు గడిచాయి. ఒకనాటి ఉదయం విశ్వనాథాచారి ఇంటికి న్యాయాధిపతి పంపిన జవాను వచ్చాడు. అతడిని న్యాయాధిపతి పిలుచుకు రమ్మన్నాడని చెప్పి పిలుచుకుని పోయాడు. న్యాయాధికారి విశ్వనాథాచారిని నవ్వుతూ సాదరంగా ఆహ్వానించి, కూర్చోమన్నాడు. నీవు చాలా నమ్మకస్తుడవని గ్రహించాను. నీవు ఒక చిన్న పని చేసి పెట్టాలి అన్నాడు. సెలవివ్వండి, అంటూ లోలోపల మురిసిపోయాడు విశ్వనాథాచారి. న్యాయాధికారి పట్టుగుడ్డతో చుట్టివున్న ఒక చిన్న మూటను చూపిస్తూ, ఇవి మా వంశంలో తరతరాలనుండి వుంటున్న ముత్యాలు. ఒక పాతిక నా తండ్రి నుండి నాకు సంక్రమించాయి. వీటిని తీసుకుని బంగారు తీగతో అల్లించి తీసుకుని రావాలి. ఖర్చులూ, నీ శ్రమకు ప్రతిఫలం కూడా ఇస్తాను అన్నాడు.

విశ్వనాథాచారి ఆ ముత్యాల మూటను అందుకుని, న్యాయాధికారికి నమస్కరించి ఇంటికి వెళ్ళాడు. అతడికి మహా సంతోషంగా ఉంది. తన మోసం దాగడమే కాక న్యాయాధికారంతటివాడికి నమ్మకస్తుడిని అయ్యాను కదా అని. ఇంటికి వెళ్ళి ముత్యాల మూటను పెట్టెలో పెట్టి, భోజనం చేసి వచ్చి తీరుబాటుగా విప్పిచూశాడు. ఆశ్చర్యం! అందులో ఇరవై మూడు ముత్యాలు మాత్రమే ఉన్నాయి. పదే పదే లెక్కపెట్టాడు. ఎన్నిమార్లు ఎంచినా ఇరవై మూడే ఉన్నాయి.

విశ్వనాథాచారికి బాగా దిగులు పట్టుకుంది. ఇంట్లోవాళ్ళనందరినీ అడిగాడు. ఫలితం లేకపోయింది. ఐతే ఆ రెండు ముత్యాలు ఏమైనట్లు? తను న్యాయాధికారివద్దే మూట విప్పి చూచుకుని ఉండవలసింది. ఆయనేమో పాతిక ముత్యాలు అని స్పష్టంగా అన్నాడు. నేనూ విన్నాను. ఎలా చెయ్యాలి? అని ఆ రోజంతా "కాలుగాలిన పిల్లిలా" అటూ ఇటూ తిరిగాడు. చివరికి తను గుణవర్మ నుంచి కాజేసిన రెండు ముత్యాలనూ వాటితో కలిపి బంగారు తీగతో అల్లించాడు.

మోసం చేసి సంపాదించిన ఆ రెండు ముత్యాలూ తనకు దక్కకుండా పోయాయే అని బావురుమంటూ ఏడ్చాడు. ఇక వేరే మార్గంలేక, ఆవేదనతో న్యాయాధికారి దగ్గరికెళ్ళి, ఆ ముత్యాలహారాన్ని సమర్పించుకున్నాడు విశ్వనాథాచారి.

అరే పాతిక ముత్యాలు ఉన్నాయే ! నేను ఇచ్చింది ఇరవై మూడే కదా? అన్నాడు న్యాయాధికారి.

అయ్యా! తమరు పాతిక అని చెప్పారు గదా? అన్నాడు విశ్వనాథాచారి భయపడుతూ. అవునయ్యా! మా తండ్రి నుంచి నాకు సంక్రమించినవి పాతిక ముత్యాలే. అంతేకానీ నీకు ఇస్తున్నవి పాతక అనలేదు కదా?!

నీవు సంచిని విప్పి లెక్కపెట్టుకుని ఉండి ఉంటే ఈ పొరపాటు జరిగి ఉండేది కాదు కదా విశ్వనాథాచారీ! బహుశా ఈ రెండు గుణవర్మవి అనుకుంటాను? అంటు

న్యాయాధికారి విశ్వనాథాచారికేసి కోపంగా చూచాడు.

విశ్వనాథాచారి భయంతో వణికిపోయాడు. తన మోసం బయటపడిందని గ్రహించటానికి ఎంతోసేపు పట్టలేదు. వెంటనే క్షమించండి అంటూ న్యాయాధికారి పాదాలపైన పడ్డాడు.

న్యాయాధికారి గుణవర్మను పిలిపించి రెండు ముత్యాలనూ అతనికి ఇచ్చి, నమ్మక ద్రోహం చేసినందుకు విశ్వనాథాచారికి కఠిన శిక్ష విధించాడు. తన సమస్యను పరిష్కరించినందుకు గుణవర్మ న్యాయాధికారికి కృతజ్ఞతలను తెలియజేసి సంతోషంగా ఇంటిదారిపట్టాడు.

దుష్టులకు దూరంగా ఉండాలి

నిజమే మరి. దుష్టులతో సహవాసం చేసిన వారికి కష్టనష్టాలు, ఆపదలు తప్పవు. సమాజంలో మంచివారూ, చెడ్డవారూ ఉంటారు. అలాగని ఎవరి ముఖం మీద వ్రాయబడి ఉండదు. "ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు" అన్నారు వేమనగారు. రుచిచూచి ఉప్పేదో, కర్పూరం ఏదో తెలుసుకున్నట్లుగానే, ప్రవర్తనను బట్టి మనుషుల స్వభావాన్ని తెలుసుకోవాలి. ఉప్పు, కర్పూరం మనిషిలాగా మారవు. కాబట్టి అట్టే తెలిసిపోతుంది. కానీ ఈ మనిషి ఉన్నాడే! అతడికి చావు తెలివి తేటలుంటాయి. చచ్చేటంతవరకు ఎలాగైనా బ్రతకాలి కాబట్టి దుర్జనులు "ఉదర పోషణార్థం బహుకృత వేషం" "కోటి విద్యలూ కూటి కొరకే" అన్నట్లు దర్జాగా మన మధ్యనే అలా బ్రతికేస్తూ ఉంటారు. ఉప్పు, కర్పూరంలాగా చప్పున చప్పరించి, ఏది ఏమిటో? సులభంగా తేల్చగలిగేటట్లుగా మనుషులు ఉంటారా? వారికి మనసంటూ ఒకటుంది. కోరికలుంటాయి. కాబట్టి వీలయినంతవరకు పబ్బం గడుపుకుంటూ, జీవిస్తూ ఉంటారు. ఏది ఏమయినా ఎవరికి వారు తమ తెలివి తేటలతో, వివేకంతో, విచక్షణాజ్ఞానంతో దుష్టుల బారినపడకుండా, ఇక్కట్లపాలు కాకుండా తమను తాము కాపాడుకుంటూ జీవించాలి. అందుకు పెద్దలు అనుభవ పూర్వకంగా చెప్పిన మాటలను కూడా మనలను రక్షించగలవు ఆచరిస్తే. కొంతమంది మంచితనం చేతనో, అమాయకత్వం చేతనో దుర్జనుణ్ణి మార్చాలని దయతలుస్తారు. ఇతరులు చెప్పినా పెడచెవిని పెట్టి ప్రయత్నిస్తారు. అటువంటి వారి అనుభవం చేదుగానే ఉంటుంది.

ఎవడిలోకం వాడిది

ఒకరోగి డాక్టరు వద్దకెళ్లి అనారోగ్యంగా ఉంది పరీక్షించమని అడిగాడు. పరీక్షించిన డాక్టర్ నరాల బలహీనతగా గుర్తించి నీవేమైనా సారాయి, బ్రాందీ, గుట్కా లాంటి మత్తు పదార్థాలను వాడుతున్నావా? అని ప్రశ్నించాడు. రోగి అవునని

సమాధానమిచ్చాడు. అందుకు డాక్టరు మత్తు పానీయాలు సేవించకూడదనీ, సేవిస్తే వచ్చే నష్టాలను విడమరచి చక్కగా బోధించి, అలవాటును మానుకొమ్మని చెప్పాడు. అందుకు ఉదాహరణగా రెండు గాజు గ్లాసులు తెప్పించి ఒక దానిలో బ్రాందీ, మరొక దానిలో నీళ్ల పోశాడు. రెండు వానపాములను తెప్పించి బ్రాందీలో ఒకదానిని, నీళ్లలో ఒక దానిని వేసి, ఇప్పుడు జాగ్రత్తగా గమనించు అన్నాడు. కొంచెం సేపటికి బ్రాందీలోని వానపాము చచ్చింది. నీటిలోని వానపాము బాగా ఈతాడుతూ ఉంది.

తర్వాత రోగిని ఏమి గమనించావు? ఏమి తెలుసుకున్నావో? చెప్పమని అడిగాడు. బదులుగా రోగి నీళ్ళు త్రాగితే కడుపులోని పురుగులు బ్రతుకుతాయనీ, బ్రాందీ త్రాగితే కడుపులోని పురుగులు చస్తాయని తెలుసుకున్నాను అన్నాడు. సమాధానం విన్న డాక్టరు దిక్కుతెలియక దిమ్మతిరిగి వెంటనే గ్లాసులోని బ్రాందీ నోట్లో పోసుకున్నాడు.

* ఆరు నెలలు సహవాసం చేస్తే వారు వీరై పోయినట్లు కొన్ని సందర్భాలలో చెడ్డవారిని, మార్చబోయి, చెడు అలవాట్లను మాన్పించబోయి, మంచివారు కూడా చెడ్డవారుగా మారి, చెడు అలవాట్లకు లోనైన వారు చాలామందే ఉన్నారు జాగ్రత్త!
* తింటేగానీ రుచి తెలియదు. స్నేహిస్తేగానీ స్వభావం తెలియదు.
* తెలివైనవారు చేసే మొదటిపనిని తెలివి తక్కువవారు చివరలోచేస్తారు.
* అడుసు త్రొక్కనేల కాలు కడగనేల?
* రాత్రివేళ గుంతలో పడితే అర్థముంది. కానీ పగటిపూటకూడా పడితే ఎలా?
* దుర్జనుని సహవాసం వంద రూపాయలిచ్చి వదులుకోమన్నారు. సజ్జనుని సహవాసం వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టయినా సంపాదించుకోమన్నారు.

దుర్జనులకు మంచి మాటలు రుచించవు

చెట్టుమీద ఉన్న కోతులు ఒకనాడు చలికి తట్టుకోలేక నిప్పురవ్వలు అనుకుని మిణుగురు పురుగులను పట్టి తెచ్చి చలి కాచుకుంటూ ఉండినవి. కోతుల మతిలేని పని చూచి ఒక పక్షి మిత్రులారా ఇవి నిప్పుకణములు కావు, మిణుగురు పురుగులు. మీ చలి బాధలు తీరాలంటే దగ్గరలోనే అగ్గి ఉన్నది అచ్చటికెళ్ళినచో మీ కోరిక నెరవేరగలదు అని హితవు చెప్పింది. అది విన్న కోతులకు ఎక్కడలేని కోపం వచ్చింది. మాకు చెప్పదగినంతటిదానవా నీవు? మాకు తెలియదా, ఏది ఎలా చేయాలో అని వెక్కిరించి, హఠాత్తుగా ఎగిరి దూకి, ఆ పక్షిని పట్టి నేలకేసి కొట్టి చంపివేశాయి. చెడ్డవారి ప్రవర్తన ఇలాగే ఉంటుంది.

* హితవచనాలు చెప్పేవారుంటారు, కానీ వినేవారే ఉండరు.
* అవసరమూ, అర్హతలున్న వారికే మంచి సలహాలనివ్వాలి.
* అవసరమే అయినా అయోగ్యులకు సలహాలివ్వరాదు.
* నీచులకు బూతులు నీతులుగానూ, నీతులు బూతులుగానూ వినబడతాయి.

ఆషాఢభూతులు (మిత్రరూప శత్రువులు)

పూర్వం ఆషాఢభూతి అను వాడొకడు, ఒక సాధువు దగ్గర విశ్వసనీయుడైన శిష్యుడుగా ఉంటూ, కొంతకాలం తర్వాత సాధువుకు మోసం చేసి, సాధువు దగ్గరున్న ముల్లెను తస్కరిస్తాడు. సాధువంతటి జ్ఞాని కూడా తెలుసుకోలేని విధంగా ప్రవర్తించినందున ఆ లక్షణాలున్న వ్యక్తులను ఆషాఢభూతులు అనడం పరపాటి అయ్యింది. వీరినే అనుభవజ్ఞులు మహామాయగాళ్లు, వంచనా శిల్పులు, తలలు మార్చేవారు, మెత్తని మోసగాళ్లు, శకునిలాంటివారు, అనుకూల శత్రువులు, తడిగుడ్డతో గొంతులు కోసేవారు, దేవతలకు పంచాంగం చెప్పేవారు, తేనెపూసిన కత్తులు, మేకవన్నె పులులు, విశ్వాసఘాతకులు, స్మైలింగ్ విలన్స్ అని అంటూ ఉంటారు.

వీరికి లౌక్యం అపారంగా ఉంటుంది. కాకాపట్టడం, మోసగించడం తెలుసు. అతివినయం ప్రదర్శిస్తారు. ధర్మసూత్రాలు చక్కగా వల్లిస్తారు. తమను నమ్మినవారికి ఏ మాత్రం బాధ తెలియకుండా వీలున్నంత వరకు వలిచేసుకుంటారు. ఎవరైనా సరే, ఎంతటివారైనా సరే వీరిని దగ్గరకు చేర్చుకునేటంత శుభ్రంగా, హుందాగా, చక్కని వాక్చాతుర్యం కలిగి ఉంటారు.

వీరు చాలా మంచి సలహాలను ఇచ్చినట్లే ఉంటుంది. కానీ, అంతు చిక్కనంత అంతర్లీనంగా వారి స్వార్థం ఉండనే ఉంటుంది. వీరికి మించిన శ్రేయోభిలాషులు మరొకరు దొరకడం దుర్లభం అనే అభిప్రాయాన్ని కలుగుజేస్తారు. వీరి సలహాలను తీసుకొనకపోతే, వీరే కనుక దగ్గర లేకపోతే పనులు సులభంగా, సవ్యంగా, సానుకూలంగా జరగవు అనే అభిప్రాయాన్ని కలుగజేస్తారు. వీరి స్థానంలోకి మరొకరు ప్రవేశించకుండా నిత్యమూ జాగ్రత్త పడుతూనే ఉంటారు. ఒక వేళ వచ్చినా ఆదిలోనే భేదోపాయము (ఫిటింగ్) ను సృష్టించి తమ స్థానాన్ని పదిలపరచుకుంటారు. వీరికి అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉంటుంది. మరచిపోయిన విషయాలను, సందర్భానుసారం సమయానుకూలంగా, సమయస్ఫూర్తిగా అందిస్తూ, హితవులు చెబుతూ, ఆత్మబంధువులుగా, ఆపద్బాంధవులుగా ఉంటూ, ఇంతటివారు నా ప్రక్కన ఉండగా, నాకు అండగా ఉండగా నాకెందుకూ భయం? నాకేమీ పర్వాలేదు అనే భ్రమలో చక్కగా ఉంచగల్గుతారు.

అనవసరమే అయినా అనర్గళంగా మాట్లాడుతూ ఉంటారు. ప్రతి మాటా విలువైనదిగా భావింపజేస్తారు. తమ చుట్టూ ఉన్నవారితో అనుక్షణం ఏదో తక్షణ సమస్యపై చర్చించు కుంటున్నారు కాబోలు, అన్నట్లుగా వాతావరణాన్ని సృష్టిస్తారు. వీరుంటే వాతావరణం గలగలా మని ఉంటుంది. లేకుంటే పేలవంగా, నిస్సారంగా ఉంటుంది అనుకునేటట్లుగా వాతావరణాన్ని కలుగజేస్తారు.

వీరికి ఇతరులు పెట్టే భోజనంపై ఎంతో మక్కువ. కానీ అణు మాత్రమైనా తమ ఆశను, ఆరాటాన్ని పైకి కనబడనీయకుండా అతి జాగ్రత్తగా ఆకలిని అడిగి మరీ తీర్చుకుంటారు. వానికి ఆకలైతే ఇతరుల ఖర్చుతో పలావు, బిర్యానీలు, విందు భోజనాలు

తెప్పించుకొని ఆరగిస్తారు. తమకు దాహంవేస్తే చల్లని శీతల పానీయాలను పరులసొమ్ముతోనే తెప్పించుకొని లాగించేస్తారు. ఇతరుల జేబులకు చిల్లులు పడవలసిందేకానీ, తమ జేబులను మాత్రం పదిలంగా ఉంచుకుంటారు. ఒక వేళ కాస్తో కూస్తో ఖర్చు పెట్టవలసివస్తే ఆర్భాటంగా అందరికి తెలిసేటట్లుగా ఎంతో కాలంగా, ఎంతో ధారాళంగా తాము ఖర్చుపెట్టే స్వభావులుగా ఫోజులు పెడతారు.

బాబాలకు, సాధు, సన్యాసులకు, పీఠాధిపతులకు సహితం ఉత్తమ శిష్యులుగా, సలహాదారులుగా, కుడిభుజాలుగా వ్యవహరిస్తారు. వారినికూడా తమ చెప్పు చేతలలో ఉంచుకొని వారిశక్తి, సామర్థ్యాలను సహితం చాకచక్యంగా సొమ్ముచేసుకుంటారు. వీరు "నీళ్లలో నిప్పులు పుట్టించనూగలరు. ఎడారిలో నీళ్లను తెప్పించనూగలరు".

తమ స్వభావాన్ని పసిగట్టుచున్నారని ఏమాత్రం తెలిసినా ఆశ్రయమిచ్చిన వారు ఇబ్బందులలో పడబోతున్నారని తెలిసినా, తమ సంపాదన ఖర్చుకాగల పరిస్థితులు దాపురిస్తున్నాయని ఊహకు అందినా, మరుక్షణమే ఏదో బలమైన కారణంగానే వెళ్లినట్లు కనుమరుగైపోతారు. కొంత కాలవ్యవధి తర్వాత, వాతావరణం చక్కబడిందని సంపూర్ణంగా తెలుసుకొని తృప్తి చెందాక, మరలా పాత పరిచయాన్ని, స్నేహాన్ని, బంధుత్వాన్ని సరిక్రొత్తగా పునరుద్ధరించుకొని యథావిధిగా కొనసాగించుటకు, ముఖం నిండా చిరునవ్వును పులుముకొని వస్తారు.

పూర్తిగా తామెవరో తెలిసేటప్పటికి నిట్టనిలువునా ముంచేసి ఏమీ తెలియనట్లు "ఎండిన చెరువును వీడిన కొంగల్లాగా" మెల్లగా జారుకొని ఉంటారు. బాధితులు ప్రతీకారం తీర్చుకుందామనుకున్నా వీలుకాక, మ్రింగలేక, కక్కలేక, కోలుకోలేక పశ్చాత్తాపపడడం తప్ప మరేమీ చెయ్యలేని పరిస్థితులలో మిన్నకుండిపోతారు.

ధనార్జనే లక్ష్యంగా, తమ స్వార్థమే పరమావధిగా, వంచనే బ్రతుకెదురువుగా, "టేక్ ఇట్ ఈజీ", "యూజ్ అండ్ త్రో" పాలసీలుగా, తమ "మెతుకుల కోసం బ్రతుకులను నాశనం చేయుటకుకూడా వెనుదీయని వారు"ఇలాంటి ఆషాడభూతులు మనచుట్టూ ఎందరో ఉన్నారు.

ప్రతి వ్యక్తీ తన జీవిత కాలంలో ఏదో ఒక రోజున ఇలాంటి వారి బారిన పడకుండా ఉండరు. కానీ, సర్దుకొని పోయే మనస్తత్వం, సహనం, ఇతరులపై ఆధారపడే స్వభావం, జరిగిన మోసాలను మరిచిపోవడం, అమాయకత్వం, అతి మంచి తనం, క్షమాగుణం, చదువురానితనం, తర్వగా నమ్మడం, వంచకులకు తక్షణం శిక్షలు కఠినంగా విధించకపోవడం మొదలగు పరిస్థితులు వీరికి చాలా అనుకూలం.

మరి ఇంతటి వంచనా శిల్పం గలవారిని తెలుసుకోవడం ఎలా? వారి బారిన పడవలసిందేనా? తరుణోపాయం ఉందా? సామాన్యులకు సాధ్యమా...? సాధ్యమే! ఇతరుల అనుభవాలను, మన అనుభవాలను బాగా గుర్తు పెట్టుకోవడం, మానవ

మనస్తత్వాలను తెలుసుకొనుటకు ప్రయత్నించడం, జీవితంలో తారసపడిన వంచకులకు శక్తి వంచన లేకుండా తగిన బుద్ధి చెప్పడం, అలాంటివారితో స్నేహం కూడదని మన సన్నిహితులకు తెలియజెప్పడం, "వంచన తెలుసుకొని వంచించకుండా, వంచింప బడకుండా జీవించడం".

మానవుల మనసు ఎపుడు, ఎలా మారుతుందో చెప్పుట కష్టం. చిక్కిన, దక్కిన అవకాశాన్ని తనకనుకూలంగా మలచుకొని ప్రయోజనాన్ని పొందాలనుకుంటుంది మనసు. కావున మనిషిని నమ్మినట్లు నటించాలి కానీ పూర్తిగా నమ్మరాదని చాణక్యుడంటాడు.

స్నేహ మాధుర్యం నీచులకు తెలియదు

భిక్షుక వృత్తిగల మిత్రులు ముగ్గురు ఉండేవారు. ఒకనిపేరు విభూతి, రెండవవాని పేరు భవభూతి, మూడవవాని పేరు ఆషాఢభూతి. ముగ్గురు కూడా ఐకమత్యంగా ఉంటూ ఎక్కడికి వెళ్ళినా కలిసి వెళ్లేవారు. ఒకసారి ఆ ముగ్గురిలో ఒక డైన ఆషాఢభూతి మిగిలిన ఇద్దరితో ఇలా అన్నాడు. "తనకు చాలా రోజులుగా ఒక కోరిక ఉందని ఎలాగైనా దానిని తీర్చుకోవాలని. అదేమిటో చెబితే వీలైతే నెరవేర్చుకుందాం అన్నారు మిగిలిన ఇద్దరు మిత్రులు. వెంటనే తనకు సజ్జకుడుములు తినాలని ఉంది అన్నాడు. ఓస్ అంతేనా! అదెంతపని, రేపే ఆ ముచ్చట తీర్చుకుందాం, సజ్జకుడుములు అంటే మాకూ ఇష్టమే అన్నారు మిగిలిన ఇద్దరు మిత్రులు. మరుక్షణమే వారు ముగ్గురూ తమ దగ్గరున్న డబ్బుతో సజ్జలు మంచివి కొనుక్కొని వచ్చి ఒక ముసలవ్వకు ఇచ్చి కుడుములు చేసిమ్మని చెప్పారు. చెప్పినట్టుగా చేసిన ముసలవ్వకు కొంత పైకం కూడా ఇచ్చారు.

కుడుములు తీసుకుని ముగ్గురు మిత్రులు నీటివసతి ఉన్న సత్రం వద్దకు చేరుకున్నారు. కాళ్లు, చేతులు, ముఖం శుభ్రంగా కడుక్కొని ఇష్టంగా చేయించుకున్న కుడుములను తనవి తీరా ఆరగించేందుకు ఉపక్రమించారు. ఇంతలో కుడుములు తినాలని ప్రతిపాదించిన ఆషాఢభూతి మిగిలిన ఇద్దరితో ఒక విషయాన్ని ప్రస్తావించాడు. అదేమంటే భోజన సమయం ఇంకా రెండు గంటలుంది. ఎంత ఇష్టమైన పదార్థమైనా ఇంత తొందరగా తినడం ఏం బాగుంటుంది? కాబట్టి ఇపుడు విశ్రమిద్దాం. తర్వాత కుడుములను లాగిద్దాం. కానీ ఇందులో ఒక షరతు! ఏమిటంటే కుడుములను తినేముందు మీకు నిద్రలో వచ్చిన కలను గురించి చెప్పాలి. ఎవరికి మంచి కల వచ్చిందో వారికి అందరికంటే అరడజను కుడుములు ఎక్కువ అన్నాడు. ఈ షరతు అందరికీ నచ్చింది.

ఎవరిపాటికి వారు విశ్రమించారు. అనుకున్న ప్రకారం ముగ్గురూ నిద్రలేచారు. వారికొచ్చిన కలను గురించి ప్రతిభావంతంగా ఇలా చెప్పసాగారు.

"మిత్రులారా! నేను ఇలా పడుకున్నానో లేదో అలా నాకలలోకి శివుడు వచ్చాడు. నాయనా విభూతీ, ప్రియమైన భక్తుడా! ఈనాటికి నిన్ను నాతోపాటు నందీశ్వరుని మీద కూర్చుండ బెట్టుకొని కైలాసమంతా చూపించే సమయం దొరికింది. ఇలా వచ్చి నందిమీద ఆలస్యంచేయకుండా కూర్చోనాయనా! అన్నాడు. కైలాసమంతా త్రిప్పి బాగా ఆనందించి అలసిపోయాక ఇక చాలు మహాప్రభో! అన్న తర్వాత ఈశ్వరుడు దయతలచి సురక్షితంగా ఈ సత్రంలో దించి వెళ్లాడు". అన్నాడు విభూతి.

"మిత్రులారా! నేను నేలమీద ఇలా వాలి అలా కన్ను మూశానో లేదో వెంటనే శ్రీ మహా విష్ణువు తన గరుడవాహనం మీద నాదగ్గర వ్రాలాడు. నాయనా భక్తా భవభూతీ! ఎన్నాళ్లకు నా కంటికి కనిపించావురా! రారా నాతండ్రీ! వెంటనే నా గరుడ వాహనాన్ని అధిరోహించు, వైకుంఠ వైభవాన్నంతా చూపిస్తాను. అని అన్నాడు. నేను వెంటనే గరుడవాహనంపై ఇలా కూర్చున్నానో లేదో అలా రివ్వున ఎగిరింది గరుడవాహనం. వైకుంఠ దర్శనం తృప్తిగా అయ్యింది. తిరిగి ఈ సత్రంలో ఇదిగో ఇలావ్రాలానో లేదో మీ ఇద్దరూ నాముందున్నారు". అంటూ ముగించాడు. భవభూతి.

ఇక మిగిలిన మిత్రుడు ఆషాఢభూతి ఇలా చెప్పుకొచ్చాడు. "మిత్రులారా! మన ముగ్గురం అలా నిద్రకు ఉపక్రమించామో లేదో నాకు తీవ్రమైన ఆకలి బాధ కలిగింది. ఆ బాధతో కనురెప్ప మూతపడిందంటే ఒట్టు. అయినా బలవంతంగా కళ్లు మూసుకున్నాను. వెంటనే యముడు తన ప్రియమైన వాహనం దున్నపోతు మీద వచ్చి నాముందు ప్రత్యక్షమయ్యాడు. "ఓరీ భక్తా! ఆషాఢభూతీ! ఆకలితో మలమలా మాడుతూ ఉంటే నిద్ర ఎలా వస్తుందిరా? నిద్రకు బదులుగా చావువస్తుంది. కాబట్టి ఇపుడు కుడుములు తిని ఆకలి బాధను తీర్చుకుంటావా? లేక చచ్చి నాతో వస్తావా"! అని అన్నాడు. చావుదాకా ఎందుకులే స్వామీ అని వెంటనే లేచి కూర్చున్నాను. కళ్లు తెరచి మీ ఇద్దరికోసం అటు ఇటు చూశాను. కానీ ఏం లాభం! మీరెవరూ కనిపించలేదు. ఒకరినేమో శివదేవుడు, మరొకరినేమో విష్ణుదేవుడు తీసుకెళ్ళారు. ఎప్పుడు తిరిగి వస్తారో తెలీదు కాబట్టి కుడుములను తిని ఆకలి బాధను మాత్రమే తీర్చుకుందామనుకున్నాను. అదేమో కానీ కుడుములు మహారుచిగా ఉండినాయి. మీకోసం కనీసం ఒకటో రెండో ఉంచుదామనుకున్నాను, కానీ నావల్ల కాలేదు. అలాగా మీకోసం ఏమి మిగల్చలేక పోయాను. ఏంచేస్తాం? అంతా యమలీల అన్నాడు.

అంతా విన్న భవభూతి, విభూతి, ఇద్దరూ నిరాశతో ఆపూటకు ఆకలి బాధతో పస్తుండి, చివరికి "మంచోడి బుద్ధి మాంసం కాడ తెలుస్తుంది. మనోడి బుద్ధి కుడుములు కాడ తెలిసింది." ఇక వీడిని నమ్మరాదని కూడబలుక్కొని ఆషాఢభూతిని వదిలి వెళ్లిపోయారు.

* కనికరాళ్లు కట్టడానికి పనికిరావు నీచులు స్నేహానికి పనికిరారు.

ఒకసారి మోసం చేస్తే చేసినవాడిదే తప్పు రెండవసారి మోసపోతే మోసపోయిన వాడిదే తప్పు

ఒక ముసలి సింహం వేటాడే శక్తి లేక గుహలోనే ఉంటున్నది. తన అనుచరుడైన నక్క కూడా కొన్ని రోజులుగా గుహవైపు రావడం లేదు. ఈ మధ్య బాగా బలిసిన జింక ఒకటి గుహకు ఎదురుగా ఉన్న పొదలలో పచ్చిక, మేస్తూ కనిపిస్తున్నది. దానిని చూస్తూ ఉంటే సింహానికి నోరూరుతున్నది. కానీ వేటాడే శక్తి లేదు. కోరిక చావక ఆశ తీరక, ఆకలి బాధతో తనకలాడుతుండగా నక్క అటు రావడం చూచి సింహానికి పట్టరానంత సంతోషం కలిగింది. వెంటనే నక్కను ఒకసారి దగ్గరికి పిలిచి, ఎలాగైనా ఆ బలిసిన జింకను తన గుహ దగ్గరికి ఒక్కసారి పిలుచుకొని రమ్మని బ్రతిమాలింది.

నక్క వినయం ఉట్టి పడుతుండగా జింకను మెల్లగా సమీపించి, సహజమైన తన తెలివితేటలతో జింకకు మాయ మాటలు చెప్పి, నమ్మించి, ఒప్పించి సింహం దగ్గరికి వచ్చి నిలబడేటట్లు చేసింది. ఆతురతను ఆపులేక సింహం ఒక పంజాదెబ్బవేసింది. దైవ కృపవల్ల దెబ్బజారిపోవటంతో జింక తప్పించుకొని "చావు దప్పికన్ను లొట్టపోయినట్లు" బ్రతుకు జీవుడా! అనుకొంటూ పారిపోయింది. సింహం పంజాకు జింక చెవ్వు తప్ప ఏమీ దొరకలేదు.

సింహం తన దురదృష్టానికి చాల చింతించింది. మరలా నక్కను చాలా బ్రతిమలాడింది. నీ చాకచక్యం మీద నాకు నమ్మకముంది. మరొక్కసారి ఎలాగైనా ప్రయత్నించి తన గుహ దగ్గరకు వచ్చేటట్లు చెయ్యమని ప్రాధేయపడింది. ఆ బలిసిన జింకను తినకపోతే నా జన్మ సార్థకం కాదు. అని దీనంగా అడిగింది. నక్క మరొకసారి తన నైపుణ్యాన్ని పరీక్షించదలచింది. జిత్తుల మారి నక్క జింక జాడను పట్టి వెదకుతూ పోయింది. చివరకు ఒక వాగు ప్రక్కన చెట్టు నీడలో సేద తీర్చుకుంటూ ఉండినది. మెల్లగా జింకను సమీపించి మాటలాడదామనుకుంటుండగా "నమ్మించి మోసం చేసిన నీవు నా దగ్గరికి రావద్దు. వచ్చితివా నా కొమ్ముల పదును రుచి చూపిస్తా, వెళ్ళు అని గద్దించింది. కానీ మాయలాడి నక్క భయపడకుండా తన నేర్పునంతా ఉపయోగించి "ఓ బలిష్టమైన శరీరం కల జీవమా, నీవే ఇలా మతిలేని మాటలు మాట్లాడితే ఎలా? అవసాన స్థితిలో ఉన్న శక్తిలేని ముసలి సింహం నిన్నేమి చేయగలదని భయపడితివి? అది నిన్నేమీ చేయజాలదు. నీవంటే ఆ ముసలి సింహానికి మక్కువ. బలిష్టమైన నిన్నే తన తరువాత "వనరాజు"గా ప్రకటించాలని నిశ్చయించుకొన్నది. అందువలననే రాజనీతి. ధర్మసూక్ష్మాలను కొన్నింటిని నీకు తెలియచేసేటందుకు, నిన్ను దగ్గరికి తీసుకొనేదానికి నీ చెవిని పట్టుకొన్నది. మరో దురాలోచనలేదు. వచ్చిన అవకాశం ఎలా జారవిడచుకొంటావు?.

నీకొచ్చిన అవకాశము మరొకరికి వచ్చి ఉంటే కాలదన్నుకొందురా!?. వనరాజు పదవి సామాన్యులకబ్బునా? కాబట్టి నన్ను నమ్ము, అని బాగా నూరిపోసి, నమ్మించి, భయమును పోగొట్టి, సింహం దగ్గరికి పిలుచుకొని వచ్చింది.

ఈ సారి సింహం-రాజనీతి రహస్యమును వినుటకు కాస్త దగ్గరగా రా!, భయపడవద్దు అని తియ్యని మాటలు చెబుతూ మునుపటివలె కాక జింక అతి సమీపానికి వచ్చేటంతవరకు వేచిఉండి, బహు జాగ్రత్తగా సూటిగా బలమంతా కూడగట్టుకొని, ఒక్కటే దెబ్బ వేసింది. జింక నేల కూలింది. సంతోషంతో సింహం జింక మాంసాన్ని తినసాగింది. పంజా దెబ్బ తలకు బలంగా తగలడంతో తల పగిలింది మెదడు కాస్తంత దూరంలో ఎగిరి పడింది. ప్రక్కనే కాచుకొని ఉన్న నక్క "దొరికిన కాడికి మహదేవ" అని శుభ్రంగా ఆరగించి, ఏమీ తెలియని దానివలె సింహం తినగా, ఏమైనా మిగిలితే తిందామని ప్రక్కన కూర్చొని ఉండినది. జింకను పూర్తిగా తిన్న తర్వాత సింహం చుట్టు ప్రక్కలా వెదికింది. కానీ మెదడు ముద్ద కనిపించలేదు. ప్రక్కనే ఉన్న నక్కను చూచి ఓయీ! మెదడు కనిపించలేదే,? మెదడు కదా మెత్తని రుచికరమైన భాగం, అదిలేని మాంస భోజనము తృప్తినిచ్చునా? కాస్త వెదుకు అన్నది.

అందుకు నక్క వినయంగా "ఓ రాజా! ఏమి మీ అమాయకత్వము? దానికి మెదడు ఉండటమేమిటి రాజా? మెదడే కనుక దానికి ఉండి ఉంటే, నా మాట విని మరలా వచ్చునా? ఒక వేళ వచ్చినదనుకో దెబ్బతిని, ఒక చెవ్వు పోగొట్టుకున్న తర్వాత కూడా నీ దగ్గరకి వచ్చి కూర్చొనునా? దానికి మెదడు లేనేలేదు. వెదకి ప్రయోజనం లేదు. కాబట్టి కోరిక ప్రకారం బలిసిన జింకను తృప్తిగా తిన్నారు. విశ్రాంతి తీసుకోండి అని వినయంగా చెప్పి తన కృషికి తగిన ఫలితం దక్కినందుకు సంతోషంతో నక్క వెళ్లిపోయింది.

* యజమాని వంచించిన వాడు, అవసరమొచ్చినపుడు తన యజమానినే మోసగించుటకు వెనకాడడు.
* స్వకార్య దురంధరులు, స్వామి కార్య వంచకులు.
* A fried in need is a friend in deed
* Sudden friendship sure repentance

మొదలగు సూక్తులు పెద్దలు, అనుభవజ్ఞులు మనకొరకే బోధించారు. విని వదిలివేయకుండా మనసులో పదిలపరచుకొని ఆచరించాలి. మనిషి తత్వం అవకాశం, అవసరం, అధికారం, కష్ట-సుఖములందు తప్పక బైటపడితీరుతుంది. గమనించగల పరిశీలనా తత్వాన్ని బాగా అలవరచుకోవాలి. అన్ని తప్పులూ మనమే చేసి నేర్చుకోవాలంటే జీవితంలో సుఖపడలేము. పెద్దలు చెప్పిన సుద్దులను అర్థంచేసుకొని జీవించాలి.

బలవంతుడైన రాజొకరు భగవంతుడినిలా ప్రతిరోజు ప్రార్థించేవాడట. "నా శత్రువుల నుండి నేను రక్షించుకోగలను. కానీ నా అనుకూల శత్రువుల నుండి నీవే కాపాడాలి" స్వామీ అని. మనమూ అంతే!

* నటనలో జీవించవచ్చుకానీ జీవితంలో నటించడమంటే నీకు నీవే ద్రోహం చేసుకున్నట్లే.
* జిత్తులమారితనం ఒక పొట్టి దుప్పటి లాంటిది. ముఖానికి కప్పుకుంటే కాళ్లుబైట పడతాయి. కాళ్లకు కప్పుకుంటే ముఖం బైటపడుతుంది.

మాయా గుడారం

అన్నవరం గ్రామములో ఉండే దుర్గయ్య, శ్రీపతి చిన్ననాటి స్నేహితులు. ఇద్దరూ సిరి సంపదల్లో, భోగభాగ్యాలల్లో సమానులే. కానీ ఇద్దరూ అహంకారంతో, మాట పట్టింపులకు పోయి, ప్రస్తుతం శత్రువులుగా మారారు. ఒకరి అభివృద్ధి మరొకరికి కంటగింపుగా తయారయ్యింది. దుర్గయ్య పంటల్ని, తోటల్ని శ్రీపతి మనుషులు తగులబెట్టారు. శ్రీపతి చెట్లను దుర్గయ్య మనుషులు నాశనం చేశారు. ఈ విధంగా ఒకరి నాశనం మరొకరు కోరుకుంటూ ఒకరి నొకరు చంపుకోవాలనుకునేంత స్థాయికి చేరింది వాళ్ళపగ.

అన్నవరం గ్రామానికి పొరుగున ఉన్న కృష్ణపట్నంలో ప్రతి ఏటా ఘనంగా గంగమ్మ జాతర జరుగుతుంది. దానికి దుర్గయ్య, శ్రీపతి ఇద్దరూ అట్టహాసంగా, మందీమార్బలంతో వెళ్ళడం రివాజు.

గంగమ్మ జాతర నుంచి వచ్చేదారిలోని చెరుకు తోటలో దుర్గయ్య తన మనుషులను కాపు ఉంచి శ్రీపతి అంతు చూడాలనుకున్నాడు. శ్రీపతికూడా ఒక మంచి పథకం వేసి మనుషులను సిద్ధం చేసుకుని దుర్గయ్యను లేపెయ్యాలనుకున్నాడు. ఇలాగా ఒకరిని లేపెయ్యాలని మరొకరు ప్రణాళికలు పకడ్బందీగా తయారు చేసుకున్నారు.

జాతర రోజు రానే వచ్చింది. ఇద్దరూ యథావిధిగా తమ తాహతుకు తగ్గట్టుగా బండ్లు కట్టించుకుని జాతరకు తరలి వెళ్లారు. జాతరలో ఎన్నో వింతలు-విశేషాలున్నాయి. అన్నింటికన్నా విపరీతంగా అందరినీ ఆకర్షించిన వింత "మాయాగుడారంలో పిల్లల ముచ్చట్లు" పేరుకు పిల్లల ముచ్చట్లే అయినా పెద్దలకు మాత్రమే 'మాయాగుడారం' లోకి ప్రవేశం.. ఆ డేరా ప్రవేశ ద్వారం దగ్గర విచిత్ర వేషదారి అయిన ఒక ముసలి తాత నిలబడి ఉన్నాడు. కనీ-వినీ ఎరుగని విచిత్రం బాబూ, ఇందులోకి వెళ్ళిన పెద్దవారంతా చిన్నపిల్లలైపోతారు. కాసేపు పిల్లల్లాగే, హాయిగా ఆదుకొండి - పాడుకొండి, రండి బాబూ, రండి అని అరుస్తూ, పిలుస్తున్నాడు.

మాయాగుడారంలోకి వెళ్ళిన పెద్దవారంతా చిన్న పిల్లల్లాగా పగలబడి నవ్వుకుంటూ బయటికి వస్తున్నారు. ఇదంతా చూచిన దుర్గయ్యకు కూడా మాయా గుడారంలోకి వెళ్ళాలన్న కుతుహలం కలిగింది. అదేమిటో చూస్తేసరి, అనుకొని లోపలికి వెళ్ళాడు. మరికొంత సేపటికి అటుగా వచ్చిన శ్రీపతి కూడా ఈ వింత వ్యవహారాన్ని చూచి, లోపలికి వెళ్ళాడు.

మాయాగుడారం లోపల అంతా చిన్న పిల్లలే. జారుడు బండ, ఉయ్యాల, రంగుల రాట్నం, ఈతకొలను లాంటివి అనేకం పిల్లలు ఆనందించడానికే ఏర్పాటై ఉన్నాయి. దుర్గయ్య, శ్రీపతి కూడా పదేళ్ళపిల్లల్లాగా మారిపోయారు. ఇద్దరూ ఒకరినొకరు గుర్తుపట్టుకున్నారు. వీధి బడిలో చదువుకునే రోజుల్లోలాగే ఇద్దరూ కలసి మెలసి హాయిగా ఆడుకున్నారు. కొలనులో ఈత కొట్టారు. ఇద్దరికీ బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు గుర్తుకు వచ్చాయి. అప్పట్లో ఇరువురూ జీవితాంతం ప్రాణ స్నేహితుల్లాగా ఉండాలని ఒట్టు పెట్టుకున్నారు. ఓసారి మడుగులోకి ఈతకెళ్లగా దుర్గయ్య మునిగిపోబోయాడు. కానీ శ్రీపతి రక్షించాడు. మరోసారి పరిగెత్తుతూ బోర్లపడి కాలు బెణికి, నడవలేక పోయిన శ్రీపతిని దుర్గయ్య తన భుజాల మీదికెత్తుకొని వైద్యుని దగ్గరకు తీసుకెళ్లాడు. శ్రీపతి-దుర్గయ్య ఇద్దరూ జరిగిపోయిన ఆ పాతరోజుల జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. ఇప్పుడు వాళ్ళ మనసుల్లో ఏవిధమైన ఈర్ష్య, అసూయ, అహంకారం, కపటం లేదు. 'మాయాగుడారం' లోపలి నుంచి బైటికి వస్తుండగా వాళ్ళు మళ్లీ పెద్దవారైపోయారు. మరలా వాళ్ళిద్దరికీ తమ శత్రుత్వాలు జ్ఞప్తికి వచ్చి సిగ్గు పడిపోయారు. చేరోదారి బయల్దేరారు. కానీ దారి పొడవునా ఇరువురిలోనూ చిన్ననాటి జ్ఞాపకాలే.

దుర్గయ్య నా బాల్య మిత్రుడు. అవసర సమయాల్లో నన్ను ఆదుకున్నవాడు. వాడినా నేను చంపాలనుకున్నది. ఛఛ అనుకున్నాడు శ్రీపతి.

శ్రీపతి, నేనూ ఎంత మంచి మిత్రులుగా ఉండినాము. అసూయ, అహంకారాలతో, మాట పట్టింపులకు పోయి, చివరికి శ్రీపతినే చంపాలనుకున్నాను. అసలు వాడు చేసిన తప్పేమి? కేవలం అసూయతో, మనసంతా కుళ్ళు నింపుకొని, నేనే వాడిని తప్పుగా అర్థం చేసుకుని, చివరికి చంపాలనుకున్నాను. ఛఛ ఎంత నీచానికి ఒడిగట్టాను అని పశ్చాత్తాపపడ్డాడు దుర్గయ్య.

దుర్గయ్య పరిగెత్తుకుంటూ వెళ్ళి-తను దాచిన మనుషులను వెనక్కు పిలిపించు కున్నాడు. అలాగే శ్రీపతి కూడా గబగబా వెళ్ళి తను దాచి ఉంచిన మనుషులను వెనక్కు పిలిపించుకున్నాడు. ఆ తర్వాత ఇళ్ళకు వెళ్ళుతూ గ్రామంలోని రచ్చబండ దగ్గర అనుకోకుండా తారసపడ్డారు. ఒకరినొకరు చూచుకొని ఆప్యాయంగా పలకరించుకున్నారు. తప్పులను క్షమించమని మనసారా చెప్పుకున్నారు.

ఎంత వయసొచ్చినా పసిపిల్లల్లాగా నిర్మలంగా ఉంటే తగవులు, పగలు-ద్వేషాలు, ప్రతీకారాలు ఉండవని పెద్దవారు గ్రహించాలి.

ధర్మం - 4

జీవితాన్ని సార్థకం చేసుకునే దిశలో ప్రయాణించే మనిషి, సాధించవలసిన మొట్టమొదటి పురుషార్థం - 'ధర్మం'. సందర్భాన్ని బట్టి ధర్మానికి పలు అర్థాలున్నాయి. ఇది నీకు ధర్మమేనా అంటే? నీవుచేస్తున్న పని సరి అయినది కాదు అని అర్థం, బాబూ.... ధర్మం చేయండి అని ఎవరైనా అడిగితే... ధనం కానీ, ధాన్యంకానీ, వస్త్రంకానీ ఇవ్వమని అర్థం. దానం ఇవ్వండి అని అడగడానికి బదులుగా కొంత మంది ధర్మం చెయ్యండి అంటారు. ధర్మం ఎంతటి ప్రశస్తమైందో శాస్త్రాలు ఇలా చెబుతున్నాయి. ధర్మాన్ని ఎవరు నాశనం చేస్తారో అది వారిని శిక్షిస్తుంది. ఎవరు ఆచరిస్తారో వారిని రక్షిస్తుంది. ఈ మాట వినగానే చాలా మందికి ఒక సందేహం కలుగుతుంది. కంటికి కనబడని ధర్మం మనిషిని ఏవిధంగా రక్షిస్తుంది? అని.

అరణ్యవాసంలో ఉన్న సమయంలో పర్ణశాలలో ద్రౌపదిని ఒంటరిగా వదలి, ఆహారాన్వేషణలో తలా ఒక దిక్కుకు వెళతారు పాండవ కుమారులు. ఆ సమయంలో సైంధవుడు ఆ దారిన పోతూ - ద్రౌపదిని చూస్తాడు. ఏకాంతంగా ఉందని గ్రహించగానే దుర్బుద్ధితో, బలాత్కారం చేయడానికి పూనుకుంటాడు. అప్పుడు ద్రౌపది మంచి మాటలతో వారిస్తుంది. "నేను పతివ్రతను నా పాతివ్రత్య ధర్మం నన్ను ఎల్లవేళలా రక్షిస్తూ ఉంటుంది. నా జోలికి రావద్దు. బరి తెగించావనుకో పాండవుల చేతిలో నీకు పరాభవం తప్పదు", అని హెచ్చరిస్తుంది. కామాంధుడైన సైంధవుడు ఆమె మాటలను వినిపించుకోకుండా బలవంతంగా ఆమెను రథంపై ఎక్కించుకుని వేగంగా తీసుకుని పోతుంటాడు. అపుడామె అశక్తురాలై రోదిస్తూ ధర్మదేవతను కాపాడమని ప్రార్థిస్తుంది.

అదే సమయంలో వేట ముగించుకుని పాండవులందరూ ఒకచోట చేరి పర్ణశాల వైపుగా వస్తుంటారు. దారిలో ధర్మరాజు తమ్ముళ్లనుద్దేశించి "నా మనసెందుకో కీడుశంకిస్తూ ఉంది. అంటే పర్ణశాల దగ్గర ద్రౌపదికి ఏదో ఆపద జరిగినట్లుగా అనిపిస్తోంది. మనం వేగంగా ఆశ్రమానికి వెళ్ళాలి. పదండి", అని తొందరపెట్టాడు. పర్ణశాలకు వచ్చిచూడగా వారనుమానించినట్లుగానే జరిగింది. విషయం తెలుసుకున్న పాండవులు సైంధవుడిని వెంబడించి పట్టుకుని వాడికి తగిన శాస్తి చేసి ద్రౌపదిని భద్రంగా తెచ్చుకుంటారు.

ద్రౌపదికి కష్టం కలుగుతూనే, ఆమె పతివ్రతా ధర్మానికి ఆపద కలుగగానే ఎక్కడో దూరంగా అడవిలో ఉన్న ధర్మరాజుకు మనసులో అదోరకమైన ఆందోళన కలిగించి. ఆ రూపంలో ధర్మరాజుకు సమాచారం వెంటనే ప్రకృతి అందించింది. ఆమె రక్షణ కోసం పాండవులను వేగిరపరచి ఆమె రక్షణకు దోహదం చేయించింది.

మన జీవితంలోకూడా మగవాళ్ళకైతే కుడికన్ను, ఆడవాళ్ళకైతే, ఎడమకన్ను అదిరి మన ఆత్మీయులకో, మనకో కీడు జరగబోతోందని సూచనలు కలుగజేస్తాయి.

కొన్ని సందర్భాలలో మనకు ఏదైనా కష్టం కలిగితే, ఎవరో ఒకరు మూక్కూమొగం తెలియని వారు వచ్చి ఆదుకోవడం, ఆ విధంగా ఆదుకున్న వారిని "మీరు దేవునిలాగా సమయానికి వచ్చి ఆదుకున్నారు. మీరు చేసిన మేలు ఈ జన్మలో మరచిపోలేను, ఏమిచ్చి మీ ఋణం తీర్చుకోగలను" అని కృతజ్ఞతలను తెలియజేయడం జరుగుతూ ఉంటుంది. ఇలాంటి సన్నివేశాలు జరగడానికి కారణం, మునుపు మనమెన్నడో తెలిసికానీ, తెలియక కానీ చేసిన ధర్మమే. "ఎపుడో మీరు చేసిన పుణ్యమే మిమ్ములను రక్షించింది. ఇందులో మా గొప్పతనం ఏమీ లేదు" అని నిగర్వంగా చెప్పుకుంటూ ఉంటారు ధర్మాన్ని ఆచరించిన వారు.

సమాజంలో ఈనాడు ఏ ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు కలిసినా సమాజం చెడిపోయింది. అంతా అవినీతి మయం. అని ఎన్నో ఉదాహరణలను ఇరుగు-పొరుగు వారి నుండి మొదలు పెట్టి అంతర్జాతీయ స్థాయిలో జర్రిగే అవినీతి వరకు సాగదీసి, కాసేపు కాలక్షేపం చేసి ఎవరకి వారు నిష్క్రమిస్తున్నారు.

ఇలా ప్రతి ఒక్కరూ ఆలోచిస్తూ, చర్చిస్తూ మంచి నీటి నదులన్నీ కలిసి సముద్రంలో కలసి ఉప్పునీరై పోయినట్లు, తానుకూడా కుళ్ళిపోయిన సమాజంలో ఒక చెడిపోయిన పదార్థంలాగా ఉండిపోతున్నాడు. "మంచినీటి నదిలాగా వ్యక్తి మంచివాడే, కానీ వ్యక్తుల సమూహమే ఉప్పునీటి సముద్రం."

వీధిలైట్లు వెలగకపోయినా, మురుగుకాలువ నీరు సాఫీగా పోకపోయినా, కరెంటు ఆగిపోయినా, రోడ్డు దెబ్బతిన్నా, వీధిని ఆక్రమించినా, స్థలాలను కబ్జాచేసినా! మనం మాత్రం ఎవరినీ ఏమి అనకూడదు. ఎవరకీ చెడ్డకాకూడదు. సమస్యలు మాత్రం రాకూడదు, వచ్చినా ఇట్టే పరిష్కారమై పోవాలి. ఎవరో ఒకరు నడుం బిగించాలి, ఏం. వాళ్ళింట్లో మగాళ్ళు లేరా? వాళ్ళనోరు పడిపోయిందా? ఇంత అన్యాయం జరిగిపోతూంటే ఎవరికీ పట్టదా? అని ఆక్రోశించడం తప్ప, మనమెందుకు పరిష్కార దిశగా ఆలోచించకూడదు? అడుగు ముందుకు మనమే ఎందుకు వెయ్యకూడదు? అని మాత్రం ఆలోచించరు. "మనకోసం ఎవరో రావాలి, ఏదో చెయ్యాలి." "మన కడుపులో చల్ల కదలకూడదు మన కాలు గడప దాటకూడదు" ఎవరో ఒకరు వీర శివాజీ అవతారమెత్తాలి. మనందరికోసం, అన్నీత్యాగం చేసి పోరాడాలి. మనం మాత్రం ఆ పోరాటాన్ని ఒక సినిమాలాగా చూడాలి. అందులోని ప్రయత్న లోపాలను అలా చేసి ఉంటే బాగుండు, అలా మాట్లాడితే బాగుండు, అని అతి తెలివిగా ఎత్తి పొడుస్తూ అతనిలో ఉండే ఆత్మస్థైరాన్ని క్రుంగదీస్తూ, సమస్య ఇంకా పరిష్కారం కాలేదే అని అతురతగా ఎదురు చూస్తూ ఉండాలి. అందరికీ ప్రవర్తనా నియమావళి ఉండాలి అందరూ నీతి, నిజాయితీలతో, ఉదారస్వభావంతో ఉండాలి. తమకు మాత్రం అవేమీ లేకున్నా ఎవరూ ఏమి అనకూడదు.

పై అధికారి నుండి క్రింది ఉద్యోగస్తులు ధర్మాన్ని ఆశిస్తున్నారు. కానీ ఆచరించకుండా తమను మినహాయించుకుంటున్నారు. అధికారులు క్రింది ఉద్యోగస్తుల నుండి సమయపాలన, పని సంస్కృతిని ఆశిస్తున్నారు. కానీ అధికారిగా తమ బాధ్యతలను నిర్వర్తించడం లేదు. కోడలు సుగుణాల రాశిగా ఉండాలని, అడుగులకు మడుగులొత్తాలని అత్త ఆశిస్తుంది. కానీ "అత్తా ఒకనాటి కోడలే" నని గుర్తుంచుకోవడం లేదు. గురువులు శిష్యునిలో సేవలు, సంభావనలు, క్రమశిక్షణలను ఆశిస్తున్నారేకానీ తమలోని గురుత్వమెంతో ఆలోచించడం లేదు. ఇలా ఎవరికి వారు ఎదుటి వారిలో ధర్మాన్ని ఆశిస్తున్నారే కానీ, తాము ఎంత మాత్రం ఆచరిస్తున్నాం? అని ఆలోచించడంలేదు. "ధర్మాన్ని ఆచరించవలసిందే కానీ ఆశించేదీకాదు, ఆజ్ఞాపింపబడేదీ కాదు" అటువంటి పరిస్థితే దాపురిస్తే అది భ్రష్ట సమాజమే.

ఎవరికివారు ధర్మాన్నాచరించాలి

పూర్వం శంబలుడు, చంద్రహాసుడనే ఇద్దరు సోదరులు చిత్రావతీ నదీ తీరంలో ఆశ్రమాలను నిర్మించుకుని తపస్సు చేసుకుంటూ ఉండేవారు. ఆశ్రమాలు రెండూ ఫల, పుష్ప, తీగ, వృక్షజాతులతో పుష్కలంగా, మనోహరంగా ఉన్నాయి.

ఒక రోజు శంబలుడు ఏదో పనిమీద ఆశ్రమం విడిచి వెళ్లాడు. చంద్రహాసుడు ఆశ్రమంలోకి వెళ్ళాడు. కానీ అన్న కనిపించలేదు. వెనుదిరిగి వచ్చేటపుడు విరగకాసిన ఒక పండ్ల చెట్టు చంద్రహాసుడి దృష్టిని ఆకర్షించింది. చంద్రహాసుడు చెట్టు దగ్గరికెళ్ళి రెండు పండ్లను కోసి తృప్తిగా తిన్నాడు. అదే సమయంలో అన్న అక్కడికి వచ్చి "నా అనుమతి లేకుండా నా ఆశ్రమంలోకి రావడమే కాకుండా, పళ్ళను కూడా కోసి తినడం అధర్మం" అన్నాడు.

ఆ మాటలకు తమ్ముడు ఆశ్చర్యపోయి, మన ఇద్దరిమధ్య ఉన్న ఆత్మీయానుబంధ కారణంగా అనుమతి తీసుకోవల్సిన అవసరం లేదని, అసలు ఆ ఆలోచనే రాలేదని చెప్పాడు. అయినా అది అధర్మం. రెండు ఆశ్రమాలూ విడివిడిగా ఉంటున్నప్పుడు, తామెంత అన్యోన్యంగా ఉంటున్నప్పటికీ, అనుమతి లేకుండా, ఏ వస్తువునైనా తీసుకోవడం దోషమే అవుతుంది. కాబట్టి ఆ దోషాన్ని పోగొట్టుకోవడానికి వెంటనే ఆ ప్రాంతానికి సంబంధించిన రాజును ఆశ్రయించి, చేసిన తప్పును వివరించి, శిక్ష అనుభవించి రమ్మని చెప్పాడు అన్న.

అన్న చెప్పినట్లుగానే తమ్ముడు రాజు దగ్గరికెళ్ళి జరిగినదంతా చెప్పి తనకు తగిన శిక్షను విధించి, దోషనివారణ చెయ్యమని ప్రార్థించాడు. కానీ అంతటి నియమాలను పాటిస్తున్న తపస్వికి, అందులోనూ అన్నతోటలోని రెండు పండ్లను తిన్నదానికి శిక్ష ఏమిటని ఊరకనే ఉండిపోయాడు రాజు. అయినా చంద్రహాసుడు రాజును ఒప్పించి, ఆ రోజుల్లో దొంగతనానికి చేతులు నరికివేయడమనే శిక్షను పొందాడు. అలా రెండు చేతులూ లేని తమ్ముడిగా అన్నదగ్గరికెళ్ళి తలవంచి నిలబడ్డాడు.

అప్పుడు శంబలుడు తన తమ్మునికి ధైర్యం చెబుతూ ఎంత తెలిసిన వారైనా, యజమాని అనుమతి లేకుండా ఏమి తీసుకున్నా దొంగతనమే అవుతుంది, అని వివరించి, అందుకు తగిన శిక్షను అనుభవించడం ద్వారా పాపపరిహారం అవుతుందీ. దోషి అలా తనకు తాను ధర్మానికీ, న్యాయానికి లొంగిపోయి, శిక్ష అనుభవించాలనీ దానివల్ల శిక్ష విధించిన రాజు లేక అధికారి, శిక్షార్హుడూ ఇద్దరూ ధర్మం, కర్తవ్యం, నిర్వర్తించినట్లవుతుందని చెప్పాడు.

అన్న అలా ధర్మాచరణను గురించి వివరిస్తూ, ఓదారుస్తూ ఉండగానే, తమ్ముడి చేతులు యధాప్రకారం వచ్చేశాయి. శంబులుడు ఎంతో ఆశ్చర్యానికి లోనౌతూ ఎలా వచ్చాయి? అని అడిగాడు. తన తపశ్శక్తితో అలా చేశానని చెప్పాడు అన్న.

ఎవరి పని వారు సక్రమంగా చేయాలని, దోషి తనకు తానుగా చట్టానికి లొంగాలే తప్ప, తప్పించుకునే ప్రయత్నాలు చేయకూడదని, శిక్షవిధించాల్సిన వారు కూడా ఉదాసీన వైఖరి కానీ, పక్షపాతంకానీ చూపించరాదనీ, ప్రలోభాలకు లొంగరాదని తెలుసుకోవాలి. ధర్మకార్యాలు చేసేదానికి ముందుగా వ్యక్తిగత సంస్కరణ అవసరం. పొరపాటున, ఎప్పుడైనా, ఎక్కడైనా తన వల్ల దోషం జరిగితే ఆ దోషానికి తగిన శిక్షను ముందుగా తనకు తాను విధించుకోవాలి. అంతేకానీ దోషి అయికూడా నిర్దోషినని వాదించడం, అతి తెలివితో సాక్ష్యాలను సృష్టించి తప్పించుకోవడంలాంటివి చేస్తే, దోషాలమీద దోషాలు జరిగి పాపాల పుట్ట పెరుగుతుంది. శిక్షల మోతాదుకూడా పెరుగుతుంది. ధర్మాన్ని ఆచరించకుండా ఆశిస్తూపోతే వెనుకటికి "పాలకు బదులు పాలనీళ్ళు" మిగిలినట్లుగా అయిపోతుంది.

యుగ ధర్మం

ఒకసారి కృష్ణదేవరాయలు యుగ ధర్మం అంటే ఏమిటో తెలుసుకోవాలని ఉబలాటపడ్డాడు. తెనాలి రామలింగం ఇలా చెప్పాడు. " జనులందరి ఆలోచనా తీరే యుగ ధర్మం. ప్రభూ! అని. అదేదో పరీక్షించి తెలుసుకోవాలనుకున్నాడు రాజు. అందుకు రాజు, రామలింగం ఇద్దరూ ఒక ఉపాయం ఆలోచించారు కూడా. "రాజు తలచుకుంటే దెబ్బలకు కొదవా?" నగరమంతా చాటింపు వేయించాడు. నాలుగురోడ్ల కూడలిలో ఉంచబడ్డ పెద్ద హండాలలో వచ్చే శనివారం సాయంకాలం ఇంటికొకరు చొప్పున తలా ఒక చెంబు చిక్కటి పాలు పొయ్యాలి. ఆదివారం ఉదయం రాయలవారు వచ్చి తనిఖీ చేస్తారు: అని.

పరీక్షించదలచిన ఆరోజు రానే వచ్చింది. తన ఆజ్ఞను ప్రజలందరూ తు.చ. తప్పకుండా పాటించి ఉంటారని ఎంతో ధీమాగా, మందీ మార్బలంతో తరలివచ్చాడు రాజు. హండామూత తొలగించమని హుకుం జారీ చేశాడు. భటుడు మూత తీసాడు. రాయలవారు తొంగిచూచిన వెంటనే దిగ్భ్రమచెందాడు. ఇదెలా సాధ్యం? ఎందుకిలా

జరిగింది? గద్దించి అడిగాడు రాజు. ఎవరూ సాహసించలేదు సమాధానం చెప్పడానికి. కాసేపయ్యాక చల్లగా, మెల్లగా రామలింగం ఇలా చెప్పాడు... మహాప్రభూ "అందరూ పాలే పోస్తారు రాజాజ్ఞప్రకారం. నేనొక్కడినీ పోసే చెంబుడు నీళ్ళు అందులో కలిసిపోతాయి, ఎవరు చూడొచ్చారు? తానే నీళ్ళుపోసినట్లు ఎలా తెలుసుకుంటారు? అని అందరూ అనుకున్న కారణంగానే హండాలో పాలనీళ్ళు కనిపించాయి. నూటికి 10శాతం మంది మాత్రమే పాలు పోశారు. కలియుగం ప్రభూ ఇది కలియుగం. జనులందరి ఆలోచనా తీరే లోకం తీరు. యుగ ధర్మం అంటే ఇదే, అని వినయంగా వివరించాడు రామలింగం. ఆశ్చర్యంతో మిన్నకుండి పోయాడు రాజు. ఎవరికని? ఎందరికని శిక్షవేస్తాడు?

కృతయుగం అయితే పాలు పాలుగానే ఉండేవి.

త్రేతాయుగం అయితే 85% పాలుండేవి.

ద్వాపరయుగం అయితే సగం పాలుండేవి.

కలియుగం కాబట్టి పదిశాతమే పాలున్నాయి ప్రభూ! విశదపరిచాడు రామలింగం.

విలువలు

కాలానుగుణంగా శారీరకంగా, మానసికంగా బౌద్ధికంగా పరిణితి చెందుతూ, నూతనత్వం వైపు పరిగెడుతూ... ఏదో సాధించాలనే తపనతో, ఏదో అనుభవించాలనే ఆరాటంతో వ్యక్తుల కర్మ, కృషి కొనసాగుతూనే ఉంటుంది. ఆ వరవడిలో అత్యధిక శాతం ప్రజలచేత అంగీకరింపబడి, గౌరవింపబడి, చెలామణి అయ్యే భావాలను, వేష-భాషలను, విశ్వాసాలను, ఆచార వ్యవహారాలను, జీవన పద్ధతులను సామాజిక విలువలు అంటారు.

ఇలా విలువనిచ్చి, గౌరవింపబడిన ఆలోచనలను, ఆచరణలను ప్రజలు ఎంతకాలం ఆమోదిస్తారో, వాటి ప్రభావం ఎంతకాలం ఉంటుందో ఆ సుదీర్ఘ కాలాన్ని "యుగధర్మం" అంటారు. యుగానికి తగినట్లు సామాజిక విలువలు పెరగడం కానీ, తరగడం కానీ జరుగుతూ ఉంటుంది.

నాడు - నేడు

* ఒకనాడు భాషా సంస్కారం, సంప్రదాయం ముఖ్యం
  నేడు భావం, వేషం మాత్రమే ముఖ్యం
* ఒకనాడు లక్ష్యం ముఖ్యం. జీవన మార్గం ముఖ్యం.
  ఈనాడు బ్రతుకు ముఖ్యం. ఎలా బ్రతుకుతున్నాం అన్నది అనవసరం.
* ఒకనాడు ఎంతమంది పిల్లలు? ఏం చదివారన్నది ముఖ్యం.
  ఈనాడు పిల్లలు ఏం చేస్తున్నారు? ఎంత సంపాదిస్తున్నారన్నది ముఖ్యం.
* ఒకనాడు పోటీ ముఖ్యం, పాల్గొనడం ముఖ్యం.
  ఈనాడు గెలుపే ముఖ్యం, పదవే గమ్యం, లాభమే ధ్యేయం.

* ఒకనాడు ఉమ్మడి కుటుంబం గౌరవం.
  ఈనాడు వ్యష్టి కుటుంబమే సమ్మతం.
* ఒకనాడు మేనరికాలు సమ్మతం.
  నేటికవి యమపాశా సదృశం.
* ఒకనాడు కుటుంబంలో ఎంతమంది ఉంటే అంత కళ.
  ఈనాడు అలా ఉంటే విలవిల.
* ఒకనాడు మద్యం ఒక చోద్యం.
  ఈనాడది సర్వసాధారణం.
* ఒకనాడు బారులో పెద్దవారుంటారేమోనని పిల్లలు భయపడేవారు.
  ఈనాడు బారులో పిల్లలుంటారేమోనని పెద్దల భయపడుతున్నారు.
* ఒకనాడు గర్భస్రావం (భ్రూణహత్య) మహాపాపం.
  ఈనాడు అది చట్ట సమ్మతం.
* ఒకనాడు సంస్కృతం దేవభాష, ఆంగ్లభాష మ్లేచ్ఛభాష.
  ఈనాడు సంస్కృత భాష అనాగరిక భాష మ్లేచ్ఛ భాషకు పట్టపగ్గాలు లేవు.

ఈరోజులలో ఎవరు నీతిమంతులు? తప్పులు చేయనివారెవరు? లోపాలు లేని వారెవరు? అందరూ అలాంటి వారే! మనం మాత్రమే మంచిగా ఉంటే సరిపోతుందా? అందరూ మంచిగా ఉంటే? మనమూ ఉంటాం. అంటూ అదేదో సమర్థనీయమైన గొప్ప మాటను అద్భుతంగా, అతి తెలివి తేటలతో చెప్పినట్లు మురిసిపోతున్నారు. ఇలాంటి ఆలోచనలు తప్పు. ఎందుకంటే సమాజం మహాత్ములూ, సమాజ సేవకులూ, దేశభక్తులూ, దేశ నాయకులూ లేకుండా ఏనాడైనా గొడ్డు బోయిందా? ఉన్నవారు గౌరవింపబడుతూనే ఉన్నారు కదా? వారిని ఎందుకు ఆదర్శంగా తీసుకోరు. వారిలాగా ఉండాలని ఎందుకు అనుకోరు? ప్రతి ఒక్కరూ అర్థ, కామాలకే అధికమైన విలువను, గౌరవాన్ని ఇస్తూ, తమ మనసులను స్వార్థం, అవినీతి, అహంకారం, అధికారదాహం, పరస్త్రీ వ్యామోహం, పరపీడనం లాంటి కల్మషమైన భావాలతో నింపుకుంటున్నారు. ప్రకృతిలో మనకు ఆహారంగా గోధుమలు, వరిధాన్యం, పప్పులు, బఠాణీలు, బెల్లం, జీడిపప్పు, పండ్లు, కాయలు లభిస్తున్నాయి. వాటితోపాటుగా మనకు గురిగింజలు, గచ్చకాయలు, ఉమ్మెత్తకాయలు, గన్నేరు కాయలు, ముష్టికాయలు కూడా అందుబాటులోనే ఉన్నాయి. అయినా మనకు ఆహారంగా ఉపయోగపడే వాటిని మాత్రమే స్వీకరిస్తున్నాం. ఉపయోగపడని వాటిని వదలి వేస్తున్నాం. అలాగే సమాజంలో మనకు కనిపించే పుణ్య పురుషులను, మహాత్ములను మాత్రమే ఆదర్శంగా తీసుకొని వారి అడుగుజాడల్లో నడవాలి. చెడ్డవారినీ, వారిలోని చెడుతనాన్నీ మనం వదలివేయాలి. చెడ్డవారిని శిక్షలకు వదలి వేయాలి. అంతేకానీ ఎవరికి వారు ఎక్కడికక్కడ తప్పులను

సమర్థించుకుంటూ తనకంటే ఘనమైన నేరాలు, ఘోరాలు చేసిన వారితో పోల్చుకుంటూ, మనమే ఎంతో నయం అని సమర్థించుకుంటూ స్వార్థంతో లేనిపోని తెలివితేటలను ప్రదర్శించడం ఎంత మాత్రమూ సమంజసం కాదు.

ధర్మం అనేది భూత, భవిష్యత్, వర్తమాన కాలాలలోనూ ఒకే రీతిగా ఉంటుంది. ధర్మం సహజమైనదీ, మార్పు చెందనదీ, శాశ్వతమైనదీ, విశ్వశ్రేయస్సు కలిగినది. ఏది? ఎప్పుడు? ఎలా? ఎందుకు? జరగాలో అది అలా అలా జరుగుతూ, సాగిపోతూనే ఉంటుంది. ఎవరికోసమూ, దేనికోసమూ ఆగదు. రాజీపడడం, వాయిదా వేయడం, ఆగిపోవడం అనే ప్రసక్తేలేదు. అదే ప్రకృతి ధర్మం, సృష్టి నియమం.

* మనిషికి సంబంధించినంత వరకూ ధర్మం అనేది హృదయానికి సంబంధించినది. మనిషి యొక్క, శారీరక, మానసిక, బౌద్ధిక స్థితిని ధార్మిక పరిధిలో నియంత్రించడం వలన శాంతియుతమైన జీవితాన్ని సాధించే విధానం ఏర్పడుతుంది.
* ఆరోగ్యకరమైన, శక్తివంతమైన శరీరంతో, దృఢమైన మనస్సుతో, నీతివంతమైన సమాజ నిర్మాణానికి చేసే ప్రయత్నమే ధార్మిక జీవనం.
* సామాన్యుడు వ్యక్తులకు విలువనిస్తాడు. వారిద్వారా ప్రయోజనం పొందాలని ఆశిస్తాడు. చివరికి భంగపడతాడు. గొప్పవాడు నియమాలకు, విలువలకు కట్టబడి ఉంటాడు. ఖచ్చితంగా ఆచరిస్తాడు. ఆదర్శప్రాయుడవుతాడు. "భయపడే పనిని చెయ్యకు, చేసినపనికి భయపడకు". ధర్మం నెరవేర్చడానికి భయపడనవసరం లేదు. ధర్మాన్ని ఆచరించడం, సత్యాన్ని పలకడం దైవామోదయోగ్యంగా జీవించడం మనిషి చేసి తీరవలసిన పనులు. సమయం సరిపోదు, ఈ జీవితం చాలదు, నా ఒక్కడివల్ల అవుతుందా? అనుకోవడం అసమర్థుల లక్షణం. సమర్థుడైనవాడు ఎంతటి కష్టమైన పనినైనా ప్రాణాలకు తెగించి చేస్తాడు. ప్రతి ఒక్కరూ పనులు చెయ్యడంలోనూ, ఆ చేసేదేదో నైపుణ్యంతో మెచ్చుకునేటట్లు చెయ్యడం లోనూ తృప్తిని పొందాలి.
* సత్యం, ధర్మం తనకు తానే, నిత్యం జయస్తూ ఉంటుంది. అసత్యం, అధర్మంతోడు కోరుకుంటుంది. తాత్కాలికంగా జయించినట్లు కనబడుతుంది. కానీ చివరకు ఓడితీరుతుంది.

పూర్వకాలంలో ధర్మపాలకులైన ప్రభువులకు, సమాజసేవకులకు అనుచరులు, సహచరులు తప్ప రక్షకులుండేవారు కారు. మారువేషాలతో ప్రజల బాగోగులు తెలుసుకోవాలని రాజు, మంత్రి ఇరువురే అర్థరాత్రి, అపరాత్రి సమయాలలో సంచరించేవారని బోలెడు కథలు తెలుపుతున్నాయి. శ్రీరామచంద్రుడు సతీసమేతంగా వనవాసం వెళ్ళినా లక్ష్మణుడొక్కడే సహచరుడు, అనుచరుడు. రాముడికి లక్ష్మణుడు, లక్ష్మణుడికి రాముడు వీరిరువురూ సీతమ్మకు రక్షకులు.

కైకేయి భార్యగా, తల్లిగా, తన ధర్మాన్ని ఆచరించిందా? దశరధుడు ఒక మంచి తండ్రిగా ఉండగలిగాడా? అని రాముడు ప్రశ్నించలేదు. ఒక ఉత్తముడైన కుమారుడిగా ప్రవర్తించాడే తప్ప రాజభోగాలకు ఆశపడలేదు. అందుకే ఆదర్శ చక్రవర్తి అయ్యాడు. తన తండ్రి శంతన మహారాజు మత్స్యగంధిని ఎందుకు వివాహమాడవలసి వచ్చింది? అని గాంగేయుడు ప్రశ్నించలేదు. అందుకే ఆదర్శ బ్రహ్మచారిగా, ప్రతిజ్ఞాబద్ధుడుగా ప్రసిద్ధిచెందాడు. భీష్మప్రతిజ్ఞ అని భీష్ముడిని కలియుగంలోకూడా జ్ఞప్తియందుంచుకున్నాము. ఎవరికివారు నైతికతనీ, ధార్మికతనీ ఆచరణలో చూపించాలి. కానీ ఇతరులలో ఆశించరాదు. అదే విధ్యుక్తధర్మం.

ప్రపంచాన్నంతటినీ విమర్శిస్తాం, విశ్లేషిస్తాం కానీ మన అంతరంగాన్నీ, ఆచరణలను పరిశీలించుకోం. మన ముఖం ఎలా ఉందోనని అద్దంలో చూచుకొంటాం. అవసరమైన సవరణలు, అలంకరణలు చేసుకుంటాం. అలాగే ఆత్మపరిశీలన చేసుకుని. ఆచరించి చూపాలి. ఆదర్శవంతులుగా మెలగాలి. ఆదర్శవంతులే అమరులు.

జీవించే కళ అంటే ధర్మంగా జీవించడమే

మనిషిని అపుడపుడు వేదించే సందేహం" ఏది ధర్మం"? ఏది అధర్మం?, ఏది సత్యం?, ఏది అసత్యం?" గుర్తించి ఆచరించేదెలా? "సత్యం వద, ధర్మం చర" **సత్యాన్నే పలుకు, ధర్మాన్నే ఆచరించు** అని అన్ని శాస్త్రాలూ బోధిస్తున్నాయి. కదా! ధర్మాచరణకు పూనుకున్నవారు ఒక్కో సందర్భంలో ఉక్కిరిబిక్కిరి అవుతూ ఉంటారు.

అడవి సమీపంలోని గిరిజన తాండాలోని ఒక స్త్రీ ఎండు పుల్లల కోసం ఊరి చివరలోని చెట్ల మధ్యకు వచ్చింది. ఆమె అందచందాలకు మురిసిపోయి ఒక కిరాతుడు ఆమెను వెంబడించాడు. ఆమె దిక్కుతోచక వాడి బారినుండి తప్పించుకుంటూ పరిగెత్త సాగింది. అదృష్టవశాత్తూ ఆమెకు ఒక ముని ఆశ్రమం కనిపించింది. వెనుకాముందు ఆలోచించకుండా లోపలికి వెళ్ళి, ఒక మూల నక్కింది. ఇదంతా ఆ ముని గమనించాడు. పరిస్థితి చక్కగా అర్థమైపోయింది. అయినా ఏమీ ఎరగనట్లు తన పాటికి తాను కళ్ళుమూసుకుని మౌనంగా ఉండిపోయాడు.

కొంతసేపయ్యాక వగర్చుకుంటూ ఆ కిరాతుడుకూడా ఆశ్రమం వద్దకు వచ్చాడు. ధ్యానంలో ఉన్న మునివర్యుని పలకరించాడు. ఆ స్త్రీ గురించి అడిగాడు. అందుకు బదులుగా ముని సమాధానమిస్తూ 'నాయనా! చూసింది కళ్లు. కానీ అవి చెప్పలేవు. చెప్పగలిగేది నోరు, కానీ అది చూడలేదు, అంటూ స్త్రీ సంగతిని తెలియనివ్వకుండా దాటవేశాడు.

పై సన్నివేశాన్ని జాగ్రత్తగా విశ్లేషించుకుంటే ఏది ధర్మం? ఏది అధర్మం? ఏది సత్యం? ఏది అసత్యం. అనేది బోధపడుతుంది. వాస్తవానికి ఆ మునిసత్తముడు సత్యసంధుడే, కానీ సత్యమే చెప్పాలి. అనే కారణంగా ఆ స్త్రీ గురించిన యధార్థాన్ని

బహిరంగపరచితే, ఆ కిరాతుడు ఆ స్త్రీని చెరచడమో లేదా ఆ ప్రయత్నంలో చంపడమో జరిగి తీరుతుంది. తన ఎదుటనే జరుగుతున్న అరాచకాన్ని అడ్డుకొని నిరోధించక పోయినట్లయితే తాను ధర్మం తప్పిన వాడవుతాడు. వారి మధ్య జోక్యం చేసుకుంటే వాడితో తలపడి మరణించడమో లేక వాడిని శపించడమో జరుగుతుంది.

ఆ కిరాతుడు మూర్ఖుడు. ఆపై కామంతో కళ్ళు మూసుకుని పోయినవాడు. వానితో ధర్మాధర్మాలు, సత్యాసత్య వాదనకు దిగితే ప్రాణహాని, మానహాని, ధర్మగ్లాని, ఏదైనా సంభవించవచ్చు. అందుకని మునివర్యుడు పట్టూ విడుపు, లౌక్యం అపద్ధర్మం ఏది ప్రదర్శించినా విచక్షణ, సమయస్ఫూర్తిగా మాత్రం వ్యవహరించాడు. ఆపద సమయంలో మాన రక్షణ, ప్రాణ రక్షణ కోసం తాను బలి కాకుండా, పరిస్థితి చెడిపోకుండా, శాంతియుతంగా పరిష్కారం చెయ్యడమే ఆపద్ధర్మం. అంతేగానీ, అయినదానికీ, కానిదానికీ, అవసరానికో అబద్ధం, అదే ఆపద్ధర్మం అంటూ కుంటి సాకులు చెప్పడం, అదే పనిగ కుయుక్తులు పన్నడం అధర్మమే అవుతుంది.

తనదాకా వస్తేకానీ ఏదీ అర్థంకాదు

ఒకడు వాహనాల క్రింద పడినట్లు నటించి ఉపాయంగా, అతి తెలివి తేటలతో వాహన యజమానుల దగ్గరి నుండి డబ్బులు వసూలు చేసుకుని బ్రతుకును నెట్టుకొస్తుంటాడు. "తాడిని తన్నే వాడుంటే వాడి తలదన్నేవాడుంటాడన్నట్లు" వాడికంటే ఘనుడు మరొకడు వీడిని బాగా గమనిస్తూ అవకాశం కోసం కాచుకుని ఉన్నాడు.

ఒకరోజు యథా ప్రకారం ఒక కారు క్రింద అతి నైపుణ్యంగా పడ్డాడు. కారు డ్రైవర్ బ్రేకువేసి నిలిపి, క్రిందకి దిగాడు. వెంటనే పొంచుకుని ఉన్నవాడు. ఆదరా బాదరాగావచ్చి "అయ్యో! మా వాడిని అన్యాయంగా పొట్టన పెట్టుకున్నావే"?! వాడు లేకుండా నేనెట్టా బ్రతికేది? వాడే మాకు దిక్కు, బ్రతికేదారి లేకుండా చేశావు కదరా? అసలు వీడు బ్రతికాడో, చచ్చాడో కదా? అని గుండెలవిసేలా లబోదిబోమన్నాడు. వాడు చేసేరాద్ధాంతానికి కారు డ్రైవర్ అదిరిపోయి "బాబ్బాబు ఏదో జరిగిపోయింది. స్టేషను, పోలీసులు, కోర్టు ఎందుకుగానీ! ఈ డబ్బు తీసుకుని నన్నొదిలేయ్ అని కొంత సొమ్మును వాడి చేతిలో పెట్టి మెల్లగా కారు డ్రైవర్ అక్కడనుండి జారుకున్నాడు. డబ్బు దక్కించుకున్న వాడుకూడా తాపీగా తన దారి చూసుకొన్నాడు.

క్రింద పడ్డవాడు లేచి ఔరా! ఎంత మోసం? ప్రాణాలకు తెగించి పడ్డది నేనూ?, పైకం పట్టుకెళ్లేది వాడూనా? అని పరుగెత్తికెళ్ళి ఏరా? ఎవడు నువ్వు? ఇది న్యాయమా? అని నిలదీశాడు. డబ్బుదండుకున్నవాడు తాపీగా నువ్వెవడవురా? నన్నడిగేదానికి? ఏది న్యాయం? నీవు చేసేది న్యాయమా? అదేనేను చేస్తే అన్యాయమూనా? అసలు నన్ను నువ్వు అడగడం న్యాయమా? ధర్మమేనా? అంటూ తిరిగి చూడకుండా వెళ్ళి పోయాడు.

పద్దవాడు - ఔరా! ఎంత అన్యాయం? ఏమిటీ లోకం ఇలా దిగజారిపోయిందీ? అనుకుంటూ వెళ్ళాడు దిగులుగా తేలుకుట్టిన దొంగలాగా?

"తమదాకా వస్తేగానీ ఏదీ తెలియదు" అంటే ఇదే.

ధర్మం రెండు విధాలు. ఒకటి వర్ణ ధర్మం. రెండవది ఆశ్రమ ధర్మం.

వర్ణ ధర్మం : పుట్టుకను బట్టి కాకుండా వ్యక్తుల యొక్క గుణములను బట్టి వారు చేసే పనులనుబట్టి మాత్రమే ఈ వర్ణ విభాగం చేయడమైనది.

సామాన్య ధర్మాలు : (ఋజు మార్గంలో అర్థకామాల సాధన) ఏ వయసు వారు ఆ వయస్సు పనులు చేయాలనీ, పెద్దలు, గురువులు, తల్లి-దండ్రులు పిల్లలకు ఆదర్శంగా ఉండాలనీ, పిల్లలు పెద్దలను గౌరవించాలనీ, పెద్దలకు అండ,దండల నివ్వాలనీ, వారికి చేదోడు- వాదోడుగా ఉండాలనీ, వృత్తి, ఉద్యోగ, వ్యాపారస్తులకు పై అధికారులూ, ఆపై అధికారులకు పరిపాలకులు ఆదర్శంగా ఉండాలనీ ధర్మం చెబుతుంది.

బ్రాహ్మణ	క్షత్రియ	వైశ్య	శూద్ర
ఇంద్రియ నిగ్రహం	పరాక్రమం	వ్యాపారం	కఠినమైన పరిశ్రమ,
పరిశుభ్రత	సాహసం, దానం	వ్యవసాయం	సేవలు, ఆజ్ఞాపాలన,
ఓర్పు,	త్యాగం, అధికారం	పశుపాలన,	మధు, మాంసభక్షణ
ఋజు మార్గం,	పరిపాలన,	లాభాపేక్ష	
జ్ఞాన సముపార్జన,	రక్షణ, సంక్షేమం,	శాకాహారం	
శాకాహారం.	దండన		

రాక్షస : స్వప్రయోజనం ఏమీ లేక పోయిననూ ఇతరులను మాటలతో, చేతలతో, చూపులతో భాధిస్తూ ఆనందించడం.

ఆశ్రమ ధర్మాలు (విశిష్ట ధర్మాలు)

ఇంద్రియ నిగ్రహం, సత్యం, శాంతం, సహనం, త్యాగం, అహింస, ప్రేమ, కరుణ, యజ్ఞం, తపస్సు మొదలగు విశిష్ఠ ధర్మాలతో మోక్ష ప్రాప్తి కొరకు ఆచరించే విధులు, ఇవి చాలా కఠినమైన ధర్మాలు. వీటిని ఆచరించేవారే శిష్టులు, ధర్మాచరణలలో ఎదురయ్యే సందేహాలు, సందర్భాలు ఒక్కోసారి సందిగ్దంలో పడవేసి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. అలాంటపుడు ముందు తరాలలోని శిష్టులు, ఆయా సందర్భాలలో ఎలా వ్యవహరించారో తెలుసుకుని ఆచరించాలి. దానికి శాస్త్రాధ్యయనం, శిష్టులను ఆశ్రయించడమే మార్గం.

1. బ్రహ్మచర్యం :- వేదాధ్యయనం, సంధ్యావందనం, గురుసేవ, నియమ, నిష్టలు, శాకాహారం, మితభాషణమ్.
2. గృహస్థాశ్రమం :- పెద్దల సమ్మతితో వివాహం, కుటుంబ పోషణ, భార్యాభర్తల ధర్మజీవనం. గృహస్థాశ్రమంలో గృహస్తుడు చేయవలసిన యజ్ఞాలు ఐదు.

1. బ్రహ్మ యజ్ఞం :- వేదాధ్యయనం, యజ్ఞయాగాలు చేయడం.
2.పితృయజ్ఞం:- తల్లిదండ్రులకు, తాత, ముత్తాలకు, అమ్మమ్మలకు, వృద్ధబంధువులకు శ్రద్ధగా సేవలు చేయడం.
3. దైవ యజ్ఞం:- దేవతార్చన (వ్రతాలు, నోములు, పూజలు, క్రతువులు)
4. భూతయజ్ఞం :- అహింస, పశుపక్ష్యాదులకు, తరులతాదులకు, చీమలకు ఆహారం, నీరు అందించుట, ప్రకృతిని రక్షించడం.
5. మనుష్య యజ్ఞం :- అతిథులకు, బ్రాహ్మచారులకు, సాధు, సన్యాసులకు, శక్తిమేరకు సేవ చేయడం.

3.వానప్రస్థం :- వార్ధక్యంలో కుటుంబ భారాన్ని కుమారునికి అప్పగించి, అడవులకెళ్ళి తపోజీవితమును సాగించడం, భార్యా భర్త లిరువురూ చేదోడు వాదోడుగా ఉంటూ మనో నిగ్రహంతో ఆత్మదర్శనమునకై ప్రయత్నించుట.

4. సన్యాసాశ్రమం :-తీవ్రవైరాగ్యం కలిగినవారెవరైనా సర్వసంగ పరిత్యాగం చేసి, భిక్షాన్నంతో జీవించడం. కష్ట - సుఖం, మంచి - చెడులకు, మానావమానాలకు అతీతంగా జీవించడం.

భూతదయను విస్మరించకూడదు-మనిషిని పశువుతో పోల్చకూడదు.

పూర్వం ఒక నక్కకు హఠాత్తుగా ఒక ఆలోచన తట్టింది. సృష్టిలోని సకల చరా-చర జీవరాశులలో ఒక్క మానవుడే గొప్పవాడుగా ఎందుకు చలామణి అవుతున్నాడు? ఒక్క మానవ జన్మే శ్రేష్ఠమైనదని అందరూ ఎందుకు చెబుతున్నారు? బలంలో కానీ, ఆకారంలో గానీ, అంద-చందాలలో గానీ, పసందైన కంఠ శ్రావ్యతలోగానీ, వేటాడటంలో గానీ మనిషికి మించిన శక్తి సామర్థ్యాలు మెండుగా ఉండడమే కాదు - జీవించు, జీవించనివ్వు అనే సృష్టి నియమాన్ని సృష్ట్యాది నుండి పాటిస్తూ, ఆహార-నిద్రా-భయ-మైధునాలనే జీవ లక్షణాలను ఏ మాత్రం అతిక్రమించకుండా ప్రకృతి మాతను గౌరవిస్తూ, జీవిస్తున్న పవిత్రాత్మలమైన మమ్ములను అగౌరవిస్తూ మనిషి తానే ఘనుడని భావించడం తప్పు కదా? అంతేకాకుండా మనుషులను మనతో పోల్చి, అవకాశం దొరికినపుడల్లా అవమానపరుస్తున్నాడు. మానవులు వ్రాసిన సకల శాస్త్రాలు కూడా ఆ ప్రకారంగానే సమర్థించడం చాలా ఘోరం. ఇది ఆక్షేపణీయమైన పక్షపాతం కాదా? సమస్త భూమండలంపైనున్న మానవకోటి ఆధిక్యతను నేనిపుడు ఆక్షేపిస్తూ 'సవాలు' విసురుతున్నాను. ఈ సంగతి అటో-ఇటో తేలిపోవాలి. ఇంతకాలం జరిగిందేదో జరిగిపోయింది. ఇక నిర్లక్ష్యం చేయడం, అలసత్వం చూపడం, ఎంత మాత్రమూ సమర్థనీయం కాదు, అని దృఢ నిశ్చయం చేసుకొని అదే పనిగ "కాలికి బలపం కట్టుకొని" అరణ్యమంతా తిరిగి తిరిగి కనబడిన ప్రతి చిన్నా-పెద్ద జంతువులను, పక్షులను నిలబెట్టి తనకు తట్టిన ఆలోచన, తనకు కలిగిన అభిప్రాయాన్ని చక్కగా తెలియజేసింది.

నక్క తెలియజేసిన విషయంలోగానీ, చెప్పిన విధానంలోగానీ ఏదీ త్రోసిపుచ్చేదిగా లేనందున, అరణ్యంలోని పశు-పక్ష్యాదులన్నీ అంగీకరించాయి. వెంటనే నక్క అరణ్యంలోని సమస్త జంతుజాలమునంతటినీ ఒక్కచోట సమావేశపరచింది. ఆ జంతు, పక్షి సమావేశాన్ని ఉద్దేశించి ఈ విధంగా తన అభిప్రాయమును విశదపరచింది.

సోదర పశు-పక్ష్యాదులారా! మన జాతి చరిత్రలో ఈ రోజు సువర్ణాక్షరాలతో లిఖింపదగిన శుభదినం. ఈనాడు ఎన్నడూలేని విధంగా ఒక ఘనమైన తీర్మానాన్ని ఆమోదించబోతున్నాం. స్థిరమైన నిర్ణయం తీసుకోబోతున్నాం. ఈ భూమండలం పైన కోట్లకొలది ప్రాణులుండగా! మనతోపాటు ఉన్న ఒక ప్రాణి అయిన మనిషి మాత్రమే స్వార్థంతో, అహంకారంతో తనను తాను అత్యున్నత స్థానంలో నిలబెట్టుకుంటున్నాడు. అతని అభిప్రాయానికి శాస్త్రాలు కూడా "తాన అంటే తందాన" అని తాళం కొట్టుచున్నవి. ఇది సహించరాని విషయం. దీనిని ఇంతకాలం ఒక అనవసరమైన విషయంగా తేలికగా తీసుకొని వదలి వేయడం వలననే మనకు అవమానం, జాతికి తీరని కళంకం ఏర్పడింది. ఇంతకు ముందే తెలియజేసినట్లుగా, అన్నింటిలోనూ, మనమే ఘనులం. కనుక మనందరం స్వజాతి అభిమానాన్ని కలిగి వుండాలి. మన జాతిలోని శక్తి-యుక్తులను, ప్రకృతి మాత యెడల మనకున్న భక్తిని ఢంకా భజాయించి పది మందికి తెలియజేయాలి. సృష్టిలో మనతోపాటు మానవుడు కూడా ఒక ప్రాణి మాత్రమే. ఇంకా పోల్చుకుంటే ప్రకృతి నియమం తప్పి జీవించే మనిషి అధముడు. మనం ప్రకృతి మాత ప్రియమైన బిడ్డలమైనప్పటికీ అహంకరించకుండా సమభావంతో ఉన్నాం. ఈ నా అభిప్రాయం మీకు సబబుగా తోచినచో మీమీ సహజమైన అరుపులతోనూ, చప్పట్లతోనూ ఆమోదమును తెలియజేసినట్లయితే, తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఆమోదించుకుందాం సరేనా?! అన్నది. అందుకు సభకు హాజరైన అశేష పశు-పక్షి సమూహం ఆనందంతో తమ ఆమోదాన్ని తెలియజేశాయి.సరే! ఇప్పుడు ఈ ఏకాభిప్రాయమును భూమండలంపై శాసన రూపంలో తెచ్చుటకు మనందరం కలిసి అదిగో అక్కడ ఉన్న మహర్షి వద్దకు వెళ్ళి విషయమంతటినీ సమగ్రంగా విశదపరచి అతని ఆమోదమునుకూడా పొందినట్లయితే, మనం కార్యం సాధించినట్లే. కాబట్టి మీరందరూ మీమీ శక్తియుక్తులను, స్వభావములను అతని సమక్షంలో చక్కగా వివరించండి, అని పలికి అన్నింటినీ మహర్షి వద్దకు పిలుచుకొని వెళ్ళుటకు సిద్ధపడింది నక్క.

వెంటనే సింహం - మనకు మనమే గొప్పవాళ్ళమని ఋషికి విన్నవించి, నిర్ణయించమని చెప్పేదానికంటే, మహర్షి ద్వారా మానవ జాతికి మనం జరపబోయే "సమస్త భూమండల పశు-పక్షి ప్రాణకోటి మహాసభ"కు హాజరు కావలయునని

వర్తమానం పంపి. ఆ సభలో మహర్షి అధ్యక్షతన ఆమోదించిన తీర్మానములనే చట్టం చేస్తే బాగుంటుందని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చింది.

సింహం యొక్క అభిప్రాయం చక్కగా ఉన్నదని అన్నీ సమ్మతించి ఋషి వద్దకు వెళ్ళాయి. ఋషి వాటి కలకలమును విని కళ్ళు తెరచి, చూచి ఆశ్చర్యంతో విషయం అడిగి తెలుసుకున్నాడు. నేను కూడా మనిషినే కదా? అన్నాడు. అందుకు అన్నీ ముక్తకంఠంతో మీరు మానవాతీతులు. మహాత్ములు కాబట్టి, మీ వద్దకు వచ్చాం మీరు నిష్పక్షపాతంగా తీర్పు చెబుతారని విశ్వసించి వచ్చాం. "మీరెలా చెబితే అలా వింటాం" అన్నాయి. అందుకు మహర్షి మానవ జాతికి కూడా కబురంపి రాబోవు పౌర్ణమినాడు సమస్త భూమండల పశు-పక్షి ప్రాణికోటి మహాసభ" జరిపిస్తామని చెప్పి ఆశీర్వదించి పంపాడు.

పౌర్ణమిరానే వచ్చింది. మహర్షి కబురందుకొని మనుష్య ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ఒక వైపు జంతువులు మరోవైపు పక్షులు బారులు తీరి శ్రద్ధగా ఆలకిస్తున్నాయి. మహర్షి అధ్యక్షస్థానం అలంకరించాడు. వరుసగా అందరినీ వారి వారి గొప్ప గుణాలను ప్రస్తావించమని ఆజ్ఞాపించాడు.

సింహం : మనిషి ఏ దుష్ట, దుర్మార్గపు పని చేసినా "వాడు క్రూరమృగం రా" అని మాంసాహారులమైన మాతో పోలుస్తుంటారు. ఆకలి వేసినపుడు మాత్రమే మాంసాహారులమైన మేము కానీ, పులులు కానీ, మా ఆకలిని తీర్చుకుంటాం. ఆకలి తీరిన తర్వాత జింకలు కానీ, జిరాఫీలుకానీ, మరే జంతువులను కానీ కన్నెత్తి కూడా చూడం. అది కూడా ప్రకృతి మాకు ప్రసాదించిన స్వభావాన్ని బట్టి మాంసాహారాన్ని తింటున్నాము కానీ, లేకుంటే మేమూ శాకాహారులమే కదా? అడవులలోని కొండ గుహలలో తపస్సు చేసుకుంటున్న మీ బోటి తాపసులు జోలికి ఎన్నడైనా వచ్చామా? మాకు మానవజాతి అంటున్నట్లుగా విచక్షణా జ్ఞానం లేనట్లయితే, ఋషులూ, సన్యాసులూ, మునులూ అడవులలో తపస్సు చేసుకునే వారేనా? జ్ఞానాన్ని బోధించుటకు వారు జీవించగలిగి ఉండేవారా? ఆ హుందాతనాన్ని చూచేకదా? మనుషులు 'సింహబలుడు', 'కొదమసింగము', 'లేడీలయన్', 'పులిబిడ్డ' అనే బిరుదులు తగిలించుకొని గర్వపడుతుంటారు. మరి ఘోరాలు - నేరాలు చేసిన వారినేమో నీవు క్రూరమృగానివిరా! అని మాతో పోలుస్తుంటారు. ఇది న్యాయమేనా? మా మానాన మేము బ్రతుకుతుంటే మమ్ములను బంధించి, సర్కస్ పేరుతో ఆడించి పొట్టపోసుకుంటూ కూడా మమ్ములను నిందించడం తగునా? చివరికి మా చర్మాలను కూడా ఉపయోగించుకుంటూ కూడా మమ్ములను దూషించడం తగునా?

కుక్క : ఓ ఋషి సత్తమా! మా జాతికికూడా మానవుల మాటలు చాలా బాధ కలిగించుచున్నవి. "అన్నం పరంబ్రహ్మం" అని మనుషులు వేసిన నాలుగు ఎంగిలి మెతుకులు తింటూ, అందుకు ప్రతిఫలంగా కృతజ్ఞతతో వారు నివసించే ప్రాంతాన్నంతటినీ మా జాతే కదా దొంగల బారిన పడకుండా కాపలా కాసి రక్షిస్తున్నది. విశ్వాసానికి మారు పేరుగా మా ప్రాణాలను ఫణంగా పెట్టి యజమానిని రక్షిస్తున్నాము. దొంగలను పట్టుకోవడంలో మా జాతిమీదనే కదా ఆధారపడి రక్షకభటులు వారి వృత్తిలో రాణిస్తున్నారు. అటువంటి మా జాతిని "నీవు కుక్కవురా" "నీదీ ఒక బ్రతుకేనా? కుక్క కూడా బ్రతుకుతుంది" ఎందుకూ? అని నీచులతో పోల్చుతూ ఉంటారు. కావున మా విశిష్టతను మీరు గుర్తించాలి. కేవలం ఋతువు ననుసరించి మాత్రమే మేము జతకట్టి సంతానాన్ని వృద్ధి చేసుకుంటాము. కానీ మానవులకే ఒక ఋతువు కానీ, ఒక కారణం కానీ లేకుండా విచ్చలవిడిగా జతకట్టి సృష్టికార్యాన్ని అర్థం లేకుండా చేస్తూ రాక్షసులై పోతున్నారు.

"కుక్క అరుపు ఊర్లోకి, నక్క అరుపు శ్మశానానికి దారి తీస్తుంది" అని మమ్ములను చూచే కదా తెలుసుకుంటున్నారు. మా జాతిని ప్రేమతో దగ్గరికి తీసుకుంటే పవిత్రమైన స్నేహ భావంతో, నిష్కళంకమైన విశ్వాసంతో సేవలందిస్తాము. "అన్నం పెట్టిన చేయినే నరకడం", "తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం", నమ్మితేనే కదా మోసం, ద్రోహం చెయ్యగలిగేది, అనే భావనతో ఉండే మానవజాతి ఎక్కడ? విశ్వాసానికి మారుపేరైన మా జాతి ఎక్కడ? స్వామీ!

కోతి : మహర్షి పుంగవా! మేము సృష్టి ధర్మం ప్రకారం మా బ్రతుకేదో బ్రతుకుతూ ఉన్నాం. కానీ కొందరు మమ్ములను చేరదీసి బ్రతుకు తెరువు లేనివారు మా చేష్టలతో వినోదపరచి, జీవనోపాధిని పొందుతున్నారు. రామ-రావణ యుద్ధంలో యథాశక్తి ధర్మం వైపు నిలబడి పోరాడిన హనుమంతుని వారసులం. శ్రీరామచంద్రుని ఆశీర్వాద ప్రకారం 'చిరంజీవి' అని దీవెనలను పొందిన ఘనులం. అలాంటి మాతో తప్పులు - తుంటరి పనులు చేసిన వారిని 'వాడు కోతి' వాడిది "కోతి బుద్ధి", వాడు "తోకలేని కోతి" అని మాతో పోల్చుట న్యాయమా? ఇది తప్పు కదా? మా సంతతిని పెంచు విధము "మర్కట కిశోర న్యాయం" గా ప్రసిద్ధికెక్కినది కదా? అటువంటి చరిత్ర కలిగిన మమ్ములను తుంటరి మనుషులతో పోల్చడం మమ్ములను అవమానించినట్లేకదా? రామాయణ కాలంలో సీతమ్మ జాడను కనిపెట్టింది, వారధి కట్టింది, శ్రీరామచంద్రునికి సైన్యంగా పని చేసింది మా జాతేకదా? మహా భారత కాలంలో అర్జునుడి రథం మీద "జండాపై కనిపించు కపిరాజు" మా నాయకుడేకదా? "చెడు వినకు - చెడు కనకు - చెడు

తినకు, మాటాడకు" అంటూ హితబోధ చేసే గాంధీ గారి బొమ్మలం మేమే కదా? అలా యుగ యుగాలుగా మానవ జాతికి తోడూ-నీడగా నిలచిన మమ్ములను హీన దృష్టితో చూడ్డం న్యాయమా? ధర్మమా? చెప్పండి స్వామీ!

గాడిద : మహాత్మా! యజమాని ఏనాడు నాలుగు గడ్డి పరకలు కూడా మా ముందు వేయడు. పైగా ముంగాళ్ళకు బంధం వేసి వదలినా, ఏ మాత్రం సహనం కోల్పోకుండా వీధిలోని వ్యర్థ పదార్థాలను తిని, పరిసరాలను శుభ్రం చేయడమే కాక, శక్తి వంచన లేకుండా బరువుల నెన్నింటినో మోసి నిస్వార్థంగా సేవ చేస్తున్నాం. అంతే కాదు, ఔషధ రూపంలో మా పాలను పసిబిడ్డలకు ఉపయోగిస్తారు. అయినా "ఓరి గాడిదా" "అడ్డ గాడిదలా పెరిగావు" కదరా అని మా జాతితో పోల్చుతూ ఉన్నారు. ఇది మా జాతికి అవమానం స్వామీ! మీరే ఈ దూషణ పర్వం నుండి మమ్ములను విముక్తులను గావించి, మా ఆత్మాభిమానాన్ని కాపాడండి అని విన్నవించుకున్నది.

ఏనుగు : మహానుభావా! నాకు గల బలంలో నూరవ వంతు కూడా మనిషికి లేదు. ఆకారంలో నా మోకాలంత కూడా లేడు. అయినా మనిషికి అహంకారం ఎందుకు?

నక్క : చూచారా మహర్షిగారూ! విన్నారా మహాత్మా! మా పశు-పక్షి జాతిలోని మంచి స్వభావాలు. మాలో ఇంకొక గొప్ప విశేషం కూడా ఉంది. ఏమంటే? సమస్త దేవీ-దేవతలకు మా జాతి ఏదో ఒక వాహనంగా ఉంటున్నది. కాళీమాతకు సింహం, శ్రీరాజరాజేశ్వరీ మాతకు పులి, సుబ్రహ్మణ్యస్వామికి నెమలి, పరమేశ్వరునికి నంది. విఘ్నేశ్వరునికి ఎలుక... ఇలా చెప్పుకుంటూ పోతే మేము వాహనంగా లేని దేవీ-దేవతలు లేరనే చెప్పాలి. ఇలాంటి మహోన్నతమైన అర్హతలున్న మేమెక్కడ? మాపై ఆధారపడి జీవిస్తూ మా పేర్లను తగిలించుకొని గర్వపడుతూ, గౌరవింప బడుతున్న మానవ మాత్రులెక్కడ? ఆకాశానికి భూమికి ఉన్నంత తేడా. మానవులు "జంతునాం నరజన్మ దుర్లభం" అంటారు. కానీ నేను "మానవానాం పశు జన్మ దుర్లభం" అంటాను. అన్నీ విన్నమీరు ఇక తీర్పు చెప్పండి మహాత్మా మీరిచ్చే తీర్పే, చివరిది కావాలి. ఈ భూమండలంలో మనిషిని పశువుతో పోల్చకుండా చూడండి స్వామీ! అని ప్రాధేయ పడింది.

పశు-పక్ష్యాదులన్నీ చెప్పిన మాటలు ప్రశాంతగా విన్న మహర్షి మనుష్య ప్రతి నిధులతో మీరు కూడా మీ వాదనలు వినిపించి, ఫలానా కారణంగా పశువులు నీచమైనవని, నిరూపించగలరేమో చూడండి! అని ప్రశ్నించారు.

మహర్షి ప్రశ్నకు సమాధానం చెప్పేటందుకు ఏ చిన్న కారణం కూడా చూపలేక, తమ యొక్క రాక్షస గుణాలకు తామే సిగ్గుపడుతూ, జంతువుల యొక్క గొప్పదనాన్ని ఆమోదించలేక, అవమానంతో, తలదించుకొని, మూగవారిలాగా మౌనంగా

ఉండిపోయారు. (మాకంటే జంతువులేనయం అని మనసులో అనుకుంటూ) అపుడు నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ, మానవ ప్రతినిధులలోని ఒకడు లేచి, మహర్షీ! స్వార్థపరులను, తప్పు చేసిన వారిని ఏమని సంబోధించాలి? అని వినయంగా అడిగాడు. అందుకు మహర్షి నాయనా! సమస్త జీవరాశులలో మానవులమైన మనం కూడా సమాన జీవులం మాత్రమే! అంతేగానీ, ప్రత్యేకమైన జీవులు మాత్రం కాదు. ఆహార-నిద్రా-భయ-మైథునాలతో మాత్రమే జీవించడం సహజమనీ, అదే సృష్టి ధర్మమనీ అలా జీవించే వారినే మానవులుగానూ, ప్రకృతి ధర్మాలకు విరుద్ధంగా వినాశ కారకులుగా జీవించే వారిని రాక్షసులుగానూ, ధర్మం, అహింస, ఆత్మజ్ఞానం మొదలగు విశిష్ట లక్షణాలతో జీవించే వారిని దేవతలుగానూ, భగవత్ స్వరూపులుగానూ పరిగణించారు.

ఈ విధంగా మానవ జన్మ-రాక్షసత్వానికి, దైవత్వానికి మధ్య జీవితంగా ఉంది. కొందరు జ్ఞానహీనులైన మానవులు కోపంతో, హాస్యంతో, కుక్క, నక్క, కోతి, గాడిద, దున్నపోతు, క్రూర మృగం, కాకి, గూబ మొదలగు వాటితో పోల్చి నీచంగా దూషిస్తూ, ఎగతాళి కూడా చేస్తూ వుంటారు. ఇది చాలా తప్పు. చూచారుగా పశు-పక్ష్యాదులు ఎలా ప్రకృతిననుసరించి జీవిస్తున్నాయో. మానవులమైన మనం నీతి-రీతి తప్పి రాక్షసులుగా ప్రవర్తిస్తూ "మానవులు' లేకుంటేనే ప్రకృతి ప్రశాంతంగా ఉంటుంది" అనే పరిస్థితికి తెచ్చాము. అలాంటి వారిని పశు-పక్ష్యాదులతో పోల్చకుండా నీచ-నికృష్ట-దుష్ట-దుర్మార్గ-, చండాల - పరమ చండాల, రాక్షస అని మాత్రమే అనవలెను. అని మహర్షి విశదీకరించాడు.

సింహ స్నేహం

పూర్వం పాశ్చాత్యదేశాలలో బానిస వ్యాపారం ఎక్కువగా వుండేది. బలవంతులు, బలహీనులైన స్త్రీ, పురుషులను ఎత్తుకుని పోయి ధనికులకు పశువుల మాదిరిగా అమ్మివేసేవారు. ఆ విధంగా అమ్మబడిన వారినే బానిసలని అనేవారు. బానిసలను చాలా హీనంగా చూచేవారు.

రోమ్ నగరంలో ఒక గొప్ప షావుకారి దగ్గర ఉండే అనేక మంది బానిసలలో అంద్రోక్లిస్ ఒకడు. యజమాని అతడిని చాలా క్రూరంగా చూచేవాడు. ఆంద్రోక్లిస్ చాలాకాలం యజమాని పెట్టే కష్టాలు ఎన్నో సహించాడు. ఇక సహించలేని దశకు చేరుకున్నాడు. ఆంద్రోక్లిస్ ఒకనాటి రాత్రి పారిపోయాడు. ఎక్కడ దాక్కున్నా షావుకారికి దొరికిపోతాను అని, అడవిలోకి పారిపోయాడు. రెండు మూడు రోజులు నిద్రాహారాలు లేక అడవిలో తిరిగి తిరిగి అలసి చివరికి ఒక గుహలో తలదాచుకున్నాడు. ఒళ్ళు తెలియని నిద్రలో పడిపోయాడు. కొంచెం సేపయ్యాక ఏదో భయంకరమైన శబ్దం వినబడగా

తటాలున లేచాడు. ఎదురుగా ఒక పెద్ద సింహం గుహ ద్వారంలో అడ్డంగా కూర్చొని ఉంది. దానిని చూడగానే ఆండ్రోక్లిస్‌కు పై ప్రాణాలు పైనే పోతాయేమో అనిపించింది.

కాని ఆండ్రోక్లిస్ అనుకున్నట్లుగా సింహం తనమీదికి దూకలేదు. యేదో బాధతో మూల్గుతున్నట్లుగా అనిపించింది. అది మాటి మాటికీ తన కుడి పంజాను నాలుకతో నాక్కుంటూ బాధతో మూలుగుతూ ఉంది. దానికేదో అయ్యిందనీ, అందుకే అది బాధతో మూలుగుతున్నదని ఊహించాడు. సాహసించి దాని దగ్గరకి వెళ్ళి దాని పాదాన్ని తన చేతపట్టుకుని పరిశీలనగా చూచాడు. అది బాగా వాచిపోయి ఉంది. ఒక చోట ముల్లు గుచ్చుకుని ఉండటాన్ని చూచాడు. అతడు మృదువుగా నొక్కుతుండగా సింహానికి ఏదో హాయి ఉన్నట్లుగా నెమ్మదిగా అతని వద్ద తలవాల్చి పడుకున్నది. ఆండ్రోక్లిస్ కొంత సేపటికి ముల్లును బైటికి లాగేశాడు. మృదువుగా వొత్తి చీము, రక్తమును మెల్లగా తీసేశాడు. అంతటితో సింహం బాధ తీరిపోయింది. అందుకు కృతజ్ఞతగా తన నాలుకతో ఆండ్రోక్లిస్ కాళ్ళను, చేతులను నాకుతూ తన సంతోషాన్ని తెలియజేసింది. అప్పటి నుండి సింహము, ఆండ్రోక్లిస్ మంచి స్నేహితులయ్యారు.

ప్రతి దినం సింహం సంపాదించిన వేటను ఇద్దరూ తింటూ కాలం గడుపుతూ ఉన్నారు. ఇలా మూడు సంవత్సరాలు గడిచాయి. ఒక రోజు వేటగాళ్ళు వలపన్ని సింహాన్ని పట్టుకుని పోయారు. సింహం ఏమైందో తెలియక తన తిండిని తానే వెదుక్కోవలసి వచ్చింది ఆండ్రోక్లిస్‌కు. కొన్నాళ్ళ తర్వాత యజమానిచే పంపబడిన భటులు ఆండ్రోక్లిస్‌ను గుర్తు పట్టి, వాడిని పట్టుకొని పోయి షావుకారికి అప్పగించారు.

ఆండ్రోక్లిస్ భయంకరమైన సింహం బారి నుండి తప్పించుకొనగలిగాడు కానీ, మానవ రాక్షసుడైన తన యజమాని కోరల నుండి తప్పించుకోలేకపోయాడు. ఆ షావుకారు వెంటనే తన బానిసను ఆ దేశపు రాజు దగ్గరికి ఈడ్చుకొని పోయి కఠినంగా శిక్షించాలని ప్రార్థించాడు. ఆ రోజులలో తప్పించుకుని పారిపోయిన బానిసలకు మరణ దండన విధించేవారు. ఆండ్రోక్లిస్ మీద ఆరోపింపబడిన అపరాధమును బట్టి వానిని క్రొత్తగా పట్టి తీసుకురాబడిన సింహానికి ఆహారంగా వేసేటట్లు రాజు భటులను ఆజ్ఞాపించాడు. దానిని ఒక వేడుకగా చూచుటకు ప్రజలందరూ వచ్చే విధంగా ఏర్పాట్లు చేయబడినాయి.

ఆ దినం సాయంకాలం రోమ్ నగరంలోని చిన్నా పెద్దా అందరూ ఆ వేడుకను చూచేదానికి అక్కడికి వచ్చారు. రాజు కూడా కుటుంబ సమేతంగా ఆ క్రూర హింసను వేడుకగా చూచేదానికి వచ్చాడు. చుట్టూ ఇనప కమ్మీలు ఏర్పాటు చేశారు. చూచిన వెంటనే మీదపడి చీల్చి చెండాడే విధంగా సింహానికి ఆ ముందు రోజు రాత్రి ఆహారం

పెట్టలేదు. ఆకలి మీద ఉన్న సింహం ఆంద్రోక్లిస్ మీదపడి తన పదునైన కోరలతో, బలమైన పంజాలతో చీల్చి తినడం తనివి తీరా చూడాలని ప్రజలంతా కుతూహలంతో ఉన్నారు. ఆంద్రోక్లిస్ ప్రాణాలను అరచేతిలో పట్టుకుని మరి కొద్ది సేపట్లో మీద పడబోవు సింహానికి ఆహారమయ్యేటందుకు సిద్ధంగా ఉన్నాడు.

ఒక పెద్ద బోనులో సింహాన్ని అక్కడికి తెచ్చారు. ఇక జరగబోవు నరభక్షణమును చూడవలెనన్న కుతూహలంతో చూడవచ్చిన వారంతా ఒక్కసారిగా పెద్ద పెట్టున ఈలలు. కేకలు వేస్తున్నారు. బోను తెరచీ, తెరవగానే సింహం ఒక్క దూకులోనే ఎదురుగా ఉన్న ఆంద్రోక్లిస్ దగ్గరికి వచ్చింది.

అదేమి వింతనో కానీ, ఆంద్రోక్లిస్‌ను అది చంపలేదు సరికదా పిల్లివలె అతడి పాదాల దగ్గర కూర్చొని స్నేహపూర్వకంగా నాలుకతో నాకడం మొదలు పెట్టింది. ఆంద్రోక్లిస్ కూడా దానిని గుర్తించి చేతితో దాని జూలును దువ్వుతూ దానిప్రక్కనే కూర్చున్నాడు.

ప్రజలంతా ఈ వింత దృశ్యాన్ని చూచి ఆశ్చర్యపడ్డారు. రాజు కూడా ఆశ్చర్యపడి ఆంద్రోక్లిస్‌ను దగ్గరికి పిలిపించుకుని "ఇది ఏవిధంగా సంభవించింది"? అని అడిగాడు ఆ బానిస తన కథనంతా రాజు గారికి విన్నవించుకున్నాడు.

మనిషికీ, సింహానికీ మధ్య కలిగిన స్నేహ చరిత్ర కనుల ముందు జరగడాన్ని ఒక అద్భుతంగా భావించి ఆంద్రోక్లిస్‌కు ప్రాణదానం చేయడమే కాకుండా, అతనికి సింహాన్ని బహుమతిగా ఇచ్చి స్వతంత్రంగా ఎక్కడికైనా వెళ్ళి బ్రతకండని అనుమతి నిచ్చాడు.

రాజుకు ధన్యవాదాలను తెలియజేసుకుని తాము ఈ రాక్షస సమాజంలో కంటే అడవిలోని జంతువులతోనే స్వేచ్ఛగా, సుఖంగా బ్రతుకుతామని చెప్పి ఆంద్రోక్లిస్, సింహంతో కలసి అడవికే వెళ్ళిపోయాడు.

కొంతమంది పశువులకు, పక్షులకు వివేకం, విచక్షణా జ్ఞానం ఉండదని అంటూ వుంటారు. మరి వాటికి విచక్షణా జ్ఞానం లేకపోతే!.... చిలుక-పలుకులు పలుకగలదా? పులులు-సింహాలు, ఏనుగులు సర్కస్‌లో విన్యాసాలు చేయగలవా? ఆడమన్నట్లు ఆడగలవా? అన్నం పెట్టిన యజమాని చనిపోతే కుక్క తాను కూడా ఆహారం మానివేసి, దిగులుపడి ప్రాణ త్యాగం చేసిన ఉదాహరణలు కోకొల్లలుగా లేవా?

అనాధగా పడివున్న కుక్కపిల్లకు పాలిచ్చి, అక్కున చేర్చుకున్న సూకరము (పంది)ను గురించి, అనాధపిల్లి కూనకు తన స్తన్యమునిచ్చిన కోతిని గురించి, కోతి పిల్లకు పాలిచ్చిన కుక్కను గురించి, కుక్క-బాతు స్నేహాన్ని గురించి ఫోటోలతో సహా

ప్రచురింపబడిన కథనాలను చూచిన తర్వాతకూడా జంతువులకు - పక్షులకు విచక్షణ లేదనగలమా? చదువుకున్న నేటి నాగరికులలో ఆపాటి విచక్షణనైనా ఎంత శాతం చూడగలుగుతున్నాం?!

నా అనుభవం

గ్రాడ్యుయేషన్ చదివే రోజులలో నేను, మా అన్న ఒకే గదిలో ఉండేవాళ్ళం. ఆ గదిలోకి రెండు పెద్ద ఎలుకలు వస్తూ వుండేవి. కానీ వాటివల్ల మాకు ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. ఒకరోజు మధ్యాహ్నం గాలి కిటికీ నుండి గదిలోకి అవి దిగుతూ ఉండడం మా అన్న గమనించాడు. కూర్చొని ఏదో వ్రాసుకుంటూ ఉన్న నాకు మెల్లగా చెప్పాడు. నేను కూడా ఎలుకలు క్రిందికి దిగిరావడం గమనించాను.

ఈ రోజు వీటి పని పట్టాల్సిందే-వెళ్ళి తలుపులు మూసిరా అన్నాడు మా అన్న. అందుకు నేను పోనీరాదా, వాటివల్ల మనకు ఇబ్బందేమీ కలుగడం లేదు కదా? వస్తాయి - పోతాయి వాటి జోలి మనకెందుకులే - చదువుకో, వాటికోసం టైం ఎందుకు వేస్ట్ చేస్తావన్నాను. దానికి మా అన్న సమ్మతించకుండా మెల్లగా తానే వెళ్ళి తలుపులు మూసి అందుబాటులోనున్న పప్పుగుత్తి తీసుకొని వాటి వెంటపడ్డాడు. అవి అటూ-ఇటూ పరిగెడుతూ మా అన్న వేసే దెబ్బలను తప్పించుకుంటూ, ఆయనను బాగానే ఆయాస పెట్టాయి. చివరికి ఒక ఎలుక మాత్రం మూలన ఆనించి ఉంచిన రోకలిబండను ఆసరా చేసుకొని ఎక్కి గాలి కిటికీ ద్వారా దూరి తప్పించుకొని పోయింది. ఇంకొక ఎలుక మాత్రం తప్పించుకోలేక దెబ్బతిని చచ్చింది. ఆ రోజు సాయంకాలం మా ఇద్దరినీ చూచి పోదామని మా నాన్న ఊరి నుండి వచ్చాడు. కుశల ప్రశ్నలయ్యాక ఎలుకల సంగతి చెప్పగా విని, వాటి జోలికి ఎందుకు వెళ్ళారురా! ఒకటి తప్పించుకుంది అంటే దానివల్ల మీకు ఇబ్బంది కలుగుతుంది. ఇల్లంతా గందరగోళం చేస్తుంది. బట్టలను కూడా కొరికి నాశనం చేస్తుంది అని చెప్పి, ఒక గంట విశ్రాంతి తీసుకొని ఊరికి బయల్దేరాడు. ఆయనను బస్సెక్కించి, మేము సినిమా చూచుకొని రూముకు వచ్చి తలుపులు తెరచి చూడగా సినిమా చూచిన ఆనందం కాస్తా చప్పున చల్లారి పోయింది. ఇల్లంతా గందరగోళంగా తయారయ్యింది. వంట పాత్రలన్నీ క్రిందపడి ఉన్నాయి. మా అన్న బట్టలన్నీ కొరికి పారేశాయి. ఇందులో ఆశ్చర్యపడవలసిన విషయమేమంటే? మా అన్నవీ, నావీ ప్రక్కప్రక్కనే ఉండినప్పటికీ, కేవలం మా అన్న బట్టలను మాత్రమే పనికి రాని విధంగా కొరికివేయడం.

తనను తానే మరచిన మనిషి

బ్రహ్మదేవుడొకసారి తాను సృష్టించిన జీవులను పరిశీలిద్దామనుకున్నాడు. ఆ

సమయంలో ఆయన దృష్టి అతి చిన్న ప్రాణి అయిన చీమపై పడింది. అది తనకంటే పదిరెట్లు బరువుగుల ఆహారాన్ని తీసుకొని పుట్టలోకెళ్తోంది. వర్షాకాలంలో ఆహారం సంపాదించడం కష్టం. కనుక మిగతా కాలాల్లో ఆహారాన్ని సంపాదించుకుంటాయి. అలా పుట్టలోకి వెళ్తున్న చీమ తన మనసులో ఇలా అనుకుంటూ వుంది. "నేనే కనుక మనిషిగా పుట్టి ఉంటే! ఎంతో కష్టపడి పని చేసి, పది మందికీ ఉపయోగపడేదాన్ని. ఈ చిన్ని శరీరంతో ఎవరికీ ఉపయోగపడలేకపోతున్నాను. నా ఆహారాన్ని నేను సంపాదించుకోవడానికే సరిపోతోంది జీవితమంతా.

చీమ మనసులోని భావాన్ని గ్రహించిన బ్రహ్మ ఆ చీమకు ఒక తేనెటీగ జన్మను ప్రసాదించాడు. అది రోజంతా కష్టపడి పూల నుంచి తేనెను సేకరించి, దాచుకుంటూ... తనలో ఇలా అనుకుంది. "నేనే కనుక మనిషిగా పుట్టి ఉంటే! ఎందరికో ఆహారాన్ని సంపాదించి పెట్టేదాన్ని" అని అనుకోవడం గమనించాడు బ్రహ్మ.

ఆ తేనెటీగకు కుక్క జన్మను ప్రసాదించాడు బ్రహ్మ. ఒక సంపన్న గృహంలో పెరుగుతున్న ఆ కుక్క ఎంతో విశ్వాసంతో ఆ కుటుంబాన్ని, ఇంటినీ కాపలా కాస్తూ ఇలా అనుకుంది "నేనే కనుక మనిషిగా పుట్టి ఉంటే ఎందరికో భద్రత కల్పించే దాన్ని, దేశాన్ని శత్రువుల నుండి కాపాడేదాన్ని" అని.

కుక్కలోని భావాన్ని గమనించిన బ్రహ్మ ఆ కుక్కకు ఆవు జన్మను ప్రసాదించాడు. ఆవు ఎంతో మందికి, ఎన్నో విధాల ఉపయోగపడుతున్నప్పటికీ, తనలో ఇలా అనుకున్నది. "నేనే కనుక మనిషిగా పుట్టి ఉంటేనా? ఎన్నో పంటలను పండించి, ప్రజలకు ఆహారం కొరత రాకుండా చూచేదాన్ని, ఇంకా మరెన్నో సేవలను అందించి, జన్మను సార్థకం చేసుకునేదాన్ని".

ఆ గోవుకు ఒక చెట్టు జన్మను ప్రసాదించాడు బ్రహ్మ. అది పెద్ద వృక్షమై ఎన్నో పక్షులకు ఆశ్రయం ఇచ్చింది. పండ్లు, కాయలు, ఆకులు, కలప అందించింది. దాని ప్రతి రెమ్మ, కొమ్మ, నీడ - మనిషికి ఉపయోగపడింది. "నేనొక మనిషిగా పుట్టి ఉంటేనా? అందరికీ ఇంకా ఎన్నో సేవలు చేసి ఉండేదాన్ని" అనుకోవడం బ్రహ్మ గమనించాడు. చీమ నుండి చెట్టు జన్మ వరకు మనిషిగా పుట్టి లోకానికి ఎన్నో సేవలు అందించాలని అనుకున్నది. ఈ సారి చెట్టుకు మానవ జన్మను ప్రసాదించాడు బ్రహ్మ.

మానవుడుగా జన్మించాక అపరిమిత స్వార్థంతో, విచ్చలవిడి తనంతో, దురాశతో జీవించసాగాడు. అనవసర లౌక్యాన్ని చూపిస్తూ, అతి తెలివి తేటలతో "తానే చాలా తెలివైన వాడినని" విర్రవీగసాగాడు. సోమరితనం, అసూయ, ఈర్ష్య, ద్వేషం, అహంకారం, కుట్ర, కుతంత్రం, వంచన, మోసం, ద్రోహం మొదలగు మురికి భావాలతో ఏ ఒక్కరికీ ఉపయోగపడకుండా, అందరినీ ఉపయోగించుకుంటూ, తాను మాత్రం కొవ్వించుకుంటూ జీవిస్తున్నాడు.

ఇది గమనించిన బ్రహ్మ అతనికి గత జన్మలు అన్నీ గుర్తుకు వచ్చేలా చేశాడు. ఎంతో కాలంగా ఎదురు చూచి, ఎన్నో సేవలు చేయాలని తపన పడి సంపాదించుకున్న మానవ జన్మను సార్థకం చేసుకోవడం లేదని గ్రహించి మనిషి.... "హే ప్రభూ! దయామయా, ఆపద్బాంధవా, నా తప్పులను మన్నించు తండ్రీ, దయచేసి నాలోని స్వార్థాన్నీ, అతి తెలివి తేటల్ని, అసూయను, వంచనను, రాక్షసత్వాన్ని సమూలంగా నాశనం చేసి, నిర్మలమైన మనస్సును ప్రసాదించు తండ్రి, లేదా మానవ జన్మను తొలగించి పూర్వంలాగా మరేదైనా ఒక జన్మను ప్రసాదించు స్వామీ! అని ప్రార్థించాడు.

న్యాయం

సంపూర్ణంగా కాకుండా పాక్షికంగా, పలుచగా, స్వల్పంగా, అల్పంగా ఆచరించే ధర్మాన్నే న్యాయం అంటారు. న్యాయం ఒక కృత్రిమమైనటువంటిది. మనకై మనం రూపొందించు కున్న ఒక సర్దుబాటు. న్యాయం సామాజిక పరిస్థితులకను గుణంగా వ్యక్తులయొక్క సామూహిక ప్రయోజనాలకనుకూలంగా తనరూపాన్ని మార్చుకుంటూ ఉంటుంది. న్యాయంలో తప్పించుకునేదానికీ, స్వార్థానికీ, సమర్థించుకునే దానికీ అవకాశం ఉంటుంది. అదుపు, హద్దులులేని మితిమీరిన స్వార్థమే రాక్షసత్వం, కిరాతకం. దేనినైనా అవసరానికి తీసుకున్నప్పుడు అనుకున్న ప్రకారం తిరిగి ఇవ్వడం ధర్మం. పత్రంకానీ, సాక్షులుగానీ లేని కారణంగా తీసుకున్నదానిని ఇవ్వకపోయినా,కాలదోషం పట్టినా తప్పు పట్టలేనిది న్యాయం.

భవిష్యత్తులో ఇరుగు పొరుగువారికీ, పరిసరాలకు, సమాజానికి, కష్టం-నష్టం కలిగించేదే అయినా ప్రస్తుతం ఏ ఇబ్బందీ కలుగదుకదా అని చేసే ప్రయత్నాన్ని న్యాయం అని సమర్థిస్తారు. భవిష్యత్తులో కూడా ఎవరికీ, ఎటువంటి చిన్న ఇబ్బందికూడా కలుగని రీతిలో తీసుకున్న ప్రస్తుత నిర్ణయాన్ని ధర్మం అంటారు. ధర్మాన్ని రక్షించిన వారిని ధర్మమే కాపాడుతుంది. ధర్మాన్ని ఎవరు రక్షించాలి? ఎవరికివారు తమ ధర్మాన్ని ఆచరించాలి.

" అధిష్ఠితో బలే ధర్మోద్రుమే వల్లీన సంశ్రితా" బలమైన చెట్టు ఆధారంగా మాత్రమే తీగ పైకి ఎగబాకుతుంది. అలాగే బలం ఆధారంగా మాత్రమే ధర్మంగానీ, న్యాయంకానీ పరిఢవిల్లుతూ ఉంటుంది. అందుకే పెద్దలంటారు "కర్రలేని వాడిని గొర్రె కరిచె" అని.

శక్తిని ఆశ్రయించే ధర్మం జీవిస్తుంది

ఒక ఊళ్లో నరసయ్య అనే రైతు ఉన్నాడు. చాలా ఉత్తముడు. కష్టపడి వ్యవసాయం చేయడంతప్ప మరో లోకం తెలియని అమాయకుడు. అదే గ్రామంలో నరసయ్య ఇంటికెదురుగా ఒక ధనవంతుడైన జల్సారాయుడుండేవాడు. విలాసాలకు విపరీతంగా ఖర్చుచేస్తూ ఉండేవాడు. అవసరమైతే దౌర్జన్యాలకుకూడా పాల్పడుతూ ఉండేవాడు.

ఒక సందర్భంలో ఆ జల్సారాయుడు నరసయ్య దగ్గరకూడా రెండువేల రూపాయలు అప్పుగా తీసుకొన్నాడు. ఎన్నిరోజులు గడిచినా, ఎన్ని పర్యాయాలు అడిగినా అప్పు తీర్చటంలేదు. నరసయ్య చేయగలిగినది లేక మోసాన్ని మింగలేక, దౌర్జన్యాన్ని ఎదిరించలేక కొన్ని రోజులు మౌనంగా ఉండిపోయాడు.

ఒక రోజు నరసయ్య భార్య భర్తతో "మనవైపు ధర్మం, న్యాయం, ఉన్నప్పటికీ జనబలం, కండబలం లేని కారణంగా మనం బలహీనులం. "దుర్బలస్యబలం రాజా" బలహీనుడికి బలంరాజే! కాబట్టి ఒక రోజు నీవురాజ దర్శనానికి వెళ్ళి, ఆయనకు జరిగిందంతా వివరంగా చెప్పి న్యాయం చేయమని ప్రార్థించి రారాదా?" ధర్మానికి అండ-దండలు రాజేకదా ఇవ్వాలి? అని భార్య చెప్పిన సలహా నరసయ్యకు బాగా నచ్చింది. వెంటనే నరసయ్య రాజు దగ్గరికి వెళ్ళాడు. తనకు జరిగిన అన్యాయాన్ని గురించి వివరంగా తెలియజేసుకున్నాడు. రాజుకూడా చాలా శాంతంగారైతు చెప్పినదంతా విన్నాడు. రేపు ఉదయం నగర పర్యవేక్షణ నిమిత్తం మీ వీధికి వస్తాను "ఒక్కసారి ఆ ధనవంతుడు చూస్తూ ఉండగా అతడి వైపు నీ చేతి వేలును చూపించు! అన్నాడు రాజు. రైతు సరే అన్నాడు.

చెప్పినట్లుగానే మరుసటి దినం రాజు పట్టపుటేనుగుపై ఊరేగుతూ నరసయ్య ఉండే వీధికి వచ్చాడు. రైతు రాజువద్దకు వెళ్ళగా, రాజు అతడిని సగౌరవంగా పట్టపుటేనుగు పైకి ఎక్కించుకొని, తన ప్రక్కనే కూర్చుండబెట్టుకున్నాడు. ఈ దృశ్యాన్ని చూచిన గ్రామస్థులందరూ ఆనందాశ్చర్యాలకు లోనయ్యారు. ఈలోగా రైతు వద్ద అప్పుగా తీసుకున్న ధనికుడుకూడా వింతను చూచేదానికి ఇంటిబైటికి వచ్చాడు. వెంటనే రైతు ధనికుని వైపు వేలెత్తి చూపించాడు. రాజుకూడా చూచాను అన్నట్లుగా తల ఊపాడు. ఈ తతంగమంతా చూస్తున్న ధనవంతుడికి గుండె ఆగినంతపనైంది. ఆరోజు మధ్యాహ్నమే ధనవంతుడు స్వయంగా రైతు ఇంటికి వచ్చి, ఇవ్వవలసిన పైకం మొత్తం వడ్డీతోసహా లెక్కగట్టి ఇచ్చివేశాడు. తన దుర్మార్గాన్ని క్షమించమని ప్రార్థిస్తూ రైతు పాదాలమీద పడ్డాడు.

వ్యామోహాన్ని విడిచిపెట్టిన ఆదర్శరాణి

ఒకానొకప్పుడు ఆనందభూపాలుడను చక్రవర్తి ఉండేవాడు. అతడు సద్గుణ సంపన్నుడు, భక్తుడు, తేజోవంతుడు. అతడు రాజ్యసంబంధమైన ద్రవ్యాన్ని తనకోసం కానీ, తన కుటుంబంకోసం కానీ వినియోగించుకోవడం దోషంగా భావించేవాడు. పన్నుల రూపంలో ప్రజలనుండి వచ్చిన ధనాన్ని ప్రజల సంక్షేమం కొరకు మాత్రమే వినియోగించేవాడు. ప్రజలపై అతని ప్రభావం ప్రబలంగా ఉండేది. అతని రాజ్యం రామరాజ్యాన్ని తలపించేదిగా ఉండినది.

ఆ చక్రవర్తి తన జీవన నిర్వహణకోసం ప్రత్యేకంగా వ్యవసాయం చేయించేవాడు. అతని భార్యకు ఆభరణాలు, పట్టువస్త్రాలు లాంటి ఆడంబరాలు ఉండేవి కావు. వారి కుటుంబం నిరాడంబరతకు పరాకాష్టగా ఉండేది.

ఇలా ఉండగా ఒకనాడు ఆ రాజ్యంలో ఒక గొప్ప ఉత్సవం జరిగింది. దూర ప్రాంతాల ప్రజలందరూ అందులో పాల్గొన్నారు. సాధారణంగానే మహారాజును, రాణిని దర్శించడంకోసం జనులు తరచుగా వస్తూ ఉండేవారు. ఆనాటి ఉత్సవ కారణంగా మహారాజావారి దూరపు బంధువులూ, దగ్గరి బంధువులంతా విశేషంగా వచ్చారు.

వారిలో ధనికులైన స్త్రీలు పట్టు వస్త్రాలను, సువర్ణాభరణాలను ధరించి తమ తమ పరిచారికలను వెంటబెట్టుకొని రాణిని దర్శించుటకు వచ్చారు. ఆ సమయంలో అతి సామాన్యమైన వస్త్రధారణతో ఉండిన రాణిని చూచి, ఆమెతో ఇలా అన్నారు. రాణిగారూ! మీరు ధరించిన వస్త్రాలను మా పరిచారికలు కూడా ధరించరు. ఇదిగో ఇలా చూడండి అని వారి దాసీలను చూపించారు. వాస్తవానికి మా వస్త్రాభరణాలకంటే మీ వస్త్రాభరణాలు ఎంతో విలువైనవిగా ఉండాలి. వీరు మాకు పరిచారికలు,మేము మీకు పరిచారికలము. మీ భర్త మాకు మహారాజు. మీరు ఆయనకు ఏ కొంచెం సూచన చేసినా ఆయన ఎంతో విలువైన వస్త్రాభరణాలను సమకూర్చగలరు. మీరు సమ్రాజ్ఞులు. మిమ్మల్లను ఇలాంటి సాదాసీదా వేషంలో చూడలేకున్నాము. ఒక సామ్రాట్టుకు సామ్రాజ్ఞిగా ప్రత్యేకతను వెల్లడించే విధంగా వేషభూషణా లుండాలి. ఆ రూపంలోనే మేము మిమ్ముల్లను చూడాలని ఆశపడతాము, అని తమ మాటలతో రాణిని ప్రభావితురాలిని చేసి వెళ్ళిపోయారు. వారి మాటల ప్రభావం రాణీగారిపైన బాగా పడింది. ఆడంబరమైన వస్త్రాభరణాలపై వ్యామోహం కలిగింది.

ఆరోజు రాత్రి మహారాజు అంతఃపురానికి వచ్చినపుడు ధనిక స్త్రీలు తనతో అన్న మాటలన్నీ రాజుకు వివరించి, తనకోసం విలువైన వస్త్రాభరణాలను సమకూర్చమని కోరింది. కానీ మహారాజు అది ఎలా కుదురుతుంది? ప్రజాధనాన్ని స్వంతానికి ఉపయోగించడం అపరాధంకాదా? అధర్మంకాదా? అన్నాడు. ఆ మాటలతో రాణి ఏకీభవించక పట్టపు రాణి ధరించదగ్గ విలువైన వస్త్రాభరణాలను తప్పక సమకూర్చవలసిందేనని పట్టుబట్టింది.

రాజు ఇక చేసేది లేక బాగా ఆలోచించి, నిరంకుశ రాజులనుండి పన్ను వసూలు చేయవచ్చును అని తీర్మానించుకున్నాడు. తర్వాత మహారాజు మంత్రిని పిలిపించి మంత్రివర్యా "మీరు వెంటనే నిరంకుశ రాజైన వీరబాహుని వద్దకు వెళ్ళి పన్నురూపంలో ఒక మణుగు బరువుగల బంగారాన్ని వసూలు చేసి తీసుకొని రండి అని ఆదేశించాడు.

సామ్రాట్టు యొక్క ఆదేశానుసారం మంత్రి కొందరు వ్యక్తులను వెంటదీసుకొని వీరబాహుని వద్దకు వెళ్ళి, ఎంతో వినయంతో తాను తెచ్చిన సందేశాన్ని విన్నవించాడు. సందేశాన్ని విన్న వీరబాహుడు ఫక్కున నవ్వి, సభలోనున్నవారితో విన్నారా! సభాసదులారా! ఇంకా ఇలాంటి మూర్ఖపు రాజులుకూడా లోకంలో ఉన్నారన్నమాట. అందరితోనూ నిరంకుశంగా పన్నులు వసూలు చేసే మహాబలవంతుడనైన నావంటి రాజునుండి ఈ మూర్ఖ మహారాజు పన్నును అడుగుతున్నాడు అని ఎగతాలి చేసి, ఆ మంత్రిని బంధించాలని చూచాడు. కానీ సభలోని వారు వారింపగా, అతడిని బంధింపక విడిచిపెట్టాడు. అప్పుడు ఆ మంత్రి నగరం నుండి బైటికి వచ్చి దగ్గరలోనే ఉన్న ఒక నదీ తీరానికి చేరాడు.

ఆనాటి రాత్రి వీరబాహుడు తన రాణితో నవ్వుతూ, వినోదంగా ఆరోజు జరిగిన సంఘటనను వివరంగా చెప్పాడు. ఆ మాటవిన్న రాణి రాజుతో స్వామీ మీరు పొరపాటు పని చేశారు. నేను ఆ ఆనందభూపాల మహారాజు గురించి చాలా విన్నాను. ఆయన సత్యవచనుడు, ధర్మాత్ముడు. అతని ఆజ్ఞను పాలింపని వానికి అనర్థం జరిగి తీరుతుంది. ఆ దూతకు అడిగినంత బంగారాన్నిచ్చి పంపి ఉండవలసింది. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. అతడు ఎక్కడున్నాడో పిలిపించి అడిగిన బంగారాన్ని ఇచ్చి పంపండి. లేకుంటే మనకు ఎంత అనర్థం జరుగుతుందో చెప్పలేను అన్నది.

ఆ మాటలు విని వీరబాహుడు దేవీ! నీవు వట్టి పిరికిదానివి, కాబట్టే ఆ విధంగా భయపడుతున్నావన్నాడు. రాణి రాజుతో మీకు నేను రేపు ఆనంద భూపాలుని ప్రభావం ఎటువంటిదో చూపిస్తాను చూడండి అని చెప్పింది. తెల్లవారాక రాణి భర్తను వెంటబెట్టుకొని మేడపైభాగానికి చేరింది. అక్కడ ఆమె ప్రతిదినమూ పావురాలకు బియ్యపు గింజలు చల్లి పెడుతూ ఉంటుంది. ఆ గింజలను తినడం కోసం అక్కడకు ఎన్నో పావురాలు వస్తూ వుంటాయి. గింజలను ఏరుకొని తింటున్న పావురాలతో ఇక గింజలను ముట్టకండి, ముట్టుకున్నారంటే వీరబాహు మహారాజుమీద ఆన, జాగ్రత్త అని పలికింది. ఆ మాటలు విన్న తర్వాతకూడా ఆ పక్షులు గింజలను తినడం మానలేదు. అప్పుడు రాణి రాజుతో, చూచారా? మీరు ఎదుటనే ఉన్నా, మీ మీద ఆన పెట్టినా కూడా ఆ పక్షులు తినడం మానలేదు అన్నది.

అప్పుడు భార్యతో మూర్ఖురాలా! ఆ పక్షులకు ఏమి జ్ఞానముందని నీమాటలు వింటాయి? అవి తెలివిలేని జీవులు కదా? అని ఎద్దేవా చేశాడు. అపుడు రాణి అలాగే! అయితే ఇప్పుడు ఆనందభూపాలుని ప్రతాపాన్ని చూడండని అంటూ... పక్షులారా గింజలను ముట్టకండి! ముట్టుకున్నారంటే ఆనందభూపాలుని మీద ఆన. జాగ్రత్త అని పక్షులను హెచ్చరించింది. ఆ మాట విన్న వెంటనే పక్షులన్నీ ఒక్కసారిగా గింజలను తినడం మానేశాయి. కానీ వాటిలో ఒక చెవిటి పావురం రాణి చేసిన హెచ్చరికను

వినలేక గింజలను తినింది. వెంటనే ఆనందభూపాలుని మహిమచేత నేలరాలింది. కాసేపయ్యాక మరలా ఆమె పక్షులనుద్దేశించి-పక్షులారా ఆనంద భూపాలుని ఆనను ఉపసంహరిస్తున్నాను . ఇక మీరు యధావిధిగా గింజలను తినవచ్చు అని పలికింది. వెంటనే అవి గింజలను తినసాగాయి. చూచితిరికదా మహారాజా! ఈ పక్షులపై మీ ప్రభావం ఏమాత్రమూ లేదు. కానీ ఆనందభూపాలుడు ఇక్కడ లేకపోయినా అతని ప్రభావం ఈ పక్షులమీద ఎంతగానో ఉంది అన్నది. అందుకు రాజు కాదుకాదు, నీవు ఏదో మాయ చేస్తున్నావు. లేకుంటే పాపం ఆ పక్షులకు ఏం తెలుస్తుంది? అని రాణి మాటలను త్రోసిపుచ్చి, అక్కడనుండి వెళ్ళిపోయాడు.

సభనుండి బయటికి వెళ్ళి నదీతీరం చేరిన ఆనందభూపాలుని మంత్రి, వీరబాహుని యొక్క నగర నమూనాను ఒకదానిని ఇసుకలో గీచాడు. మెత్తని మట్టిని తీసుకొని, తడిపి ఆ మట్టితో కొంత ప్రదేశాన్ని చతురస్రాకారంగా తీర్చిదిద్ది అక్కడ పిల్లలు ఆడుకునే బొమ్మల్లాగా నగర ప్రాకారాలు, ద్వారాలు, బురుజులు మొదలైన వాటిని చేశాడు. ప్రాకారానికి నాలుగు దిక్కులా స్తూపాలను, శిఖరాలను చక్కగా చేశాడు. రచనా కార్యక్రమం అంతా పూర్తి చేసి, మరలా వీరబాహుని కొలువులోకి నెమ్మదిగా ప్రవేశించాడు. అతనిని చూచి ఉలికిపాటుతో రాజు - ఏమయ్యా! మరలా ఎందుకు వచ్చావు? అని ప్రశ్నించాడు. నేను మీకు ఒక అద్భుతమైన వినోదాన్ని ప్రదర్శింపదలచి వచ్చాను. మీరు నావెంట నదీతీరానికి రండి అన్నాడు. ఆ వినోదమేదో చూడాలనుకొని, సభా సదులను వెంటబెట్టుకొని దూత వెంట నదీతీరానికి చేరాడు.

అప్పుడు మంత్రి చూడండి! ఇది మీ నగరపు నమూనా, అవునా కాదా? అని తను గీచిన నమూనా చూపించి రాజును ప్రశ్నించాడు. రాజు అతని అద్భుతమైన పనితనాన్ని చూచి బాగుంది! బాగుంది! దీనిని చూపడానికా నన్ను ఇక్కడికి రమ్మన్నావు? అన్నాడు . కాదు, కాదు, దీనితో మీకు ఒక వినోదాన్ని ప్రదర్శిస్తాను. ఇదిగో ఇక్కడ చూడండి, తూర్పుగా ఉన్న ఈ ప్రాకారం, ద్వారం, బురుజు , శిఖరం ఇవన్నీ మీ కోటకు తూర్పు దిశగా ఉన్న వానితో పోలియున్నవా? లేవా? అని ప్రశ్నించాడు. ఉన్నాయి. అయితే ఏమిటట? అన్నాడు వీరబాహుడు. ఏమీలేదు మహారాజా నేను మా చక్రవర్తి అయిన ఆనందభూపాలుని మీద ఆన పెట్టి మీ నగర తూర్పు దిశనున్న సమస్త కట్టడాలను కూలగొడుతున్నాను చూడు, అని చేతితో ఇసుక మీద చిత్రించిన కట్టడములను కూలదోసాడు. అంతే! నిజంగానే వీరబాహు నగర తూర్పుదిక్కున ఉన్న స్తూపాలు, బురుజులు అన్నీ పెద్ద శబ్దంతో కూలిపోవడం వీరబాహు మహారాజు చూచాడు. అతనికి ఎంతో ఆశ్చర్యం కలిగింది.

మహారాజా ఇప్పుడు మీ నగరపు పడమటి దిశలోనున్న ప్రాకారాలు, బురుజులు, భవనాలు, మొదలగు వాటినన్నింటినీ కూలదోస్తున్నాను చూడండని తను గీచిన నమూనా బొమ్మలోని పడమటి భాగాన్ని కూలదోసాడు. అంతే! నగరపు పడమటి భాగం కూడా క్షణాలలో కూలిపోయింది. అపుడు వీరబాహునికి తన భార్య ఉదయం చెప్పిన పావురాల విషయం జ్ఞప్తికి వచ్చింది.

వీరబాహునితో మంత్రి ఇలా అన్నాడు-మా మహారాజు శాసించినట్లుగా మీరు ఒక మణుగు బంగారాన్ని పన్నుగా సమర్పించకపోయినా, ఆయన ఇక్కడికి వచ్చి, మీతో యుద్ధం చేయవలసిన పనిలేదు. నేను ఒక్కడినే, ఇక్కడే కూర్చొని మీ రాజ్యాన్ని మొత్తం నేలమట్టం చేయగలను. ఇప్పుడే మా మహారాజు మీద ఆన అని ఒక్క త్రోపుతో మీ నగరాన్నంతటినీ మట్టిలో కలిపి వేస్తున్నాను. కాపాడుకోగలిగితే కాపాడుకోవచ్చు లేదా మా మహారాజు ఆజ్ఞానుసారం పన్ను రూపంలో ఒక మణుగు బంగారాన్ని ఇవ్వవచ్చు. కాదంటే ఇక మీ నగరం నిలువదు అన్నాడు.

ఈ మాటలను విన్న వీరబాహు అయ్యయ్యో నేను చూస్తుండగానే నగర తూర్పు, పశ్చిమ భాగాలు నేలకూలాయి. వీనిని చూడగా నిజంగానే క్షణాలలో నగరాన్నంతటినీ సర్వనాశనం చేసేటట్లున్నాడు. అని తర్కించుకొని ఇక చేసేది లేక ఒక మణుగు బంగారాన్ని పన్నుగా చెల్లించడానికి అంగీకరించాడు. మంత్రిని తన వెంట పిలుచుకొని వెళ్ళి అతని కోరిక మేరకు బంగారాన్ని సమర్పించి పంపించాడు.

మంత్రి తన పనిని పూర్తి చేసుకొని ఆనందంగా చక్రవర్తి వద్దకు వచ్చాడు. ఆ బంగారాన్ని మహారాజు ముందుంచి, ఇదిగో మీ ఆజ్ఞానుసారం వీరబాహుని నుండి పన్నురూపంలో ఒక మణుగు బంగారాన్ని తెచ్చాను అని వినయంగా చెప్పాడు. ఈ బంగారాన్ని అంత సులువుగా ఆ నిరంకుశ రాజునుండి ఎలా తీసుకొని రాగలిగావు అని మంత్రిని ప్రశ్నించాడు మహారాజు. అప్పుడు జరిగిన కథనంతా వివరించాడు మంత్రి.

జరిగిన సంఘటనంతా విన్నరాణి ఆశ్చర్యంతో ఎంతగానో ప్రభావితమైంది. ఇలా జరగడానికి కారణం ఏమిటని మహారాజును అడిగింది. అప్పుడు మహారాజు ఇలా అన్నాడు. దేవీ నిష్కామభావంతో ప్రజా ధనాన్ని ప్రజాసేవకే వినియోగిస్తున్నాము. స్వప్రయోజనాల కోసం రాజ్యద్రవ్యం నుండి ఒక్క పైసాకూడా గ్రహించకుండా, ఉన్నతాశయంతో అత్యంత నిరాడంబరంగా జీవిస్తున్న కారణంగానే ఇంతటి ప్రభావం వచ్చింది.

ఈ మాటలతో రాణి మనసు మారిపోయింది. అపుడు ఆమె భర్తతో ఇలా చెప్పింది. నేను ఇకపై ఆడంబరమైన వస్త్రాభరణాలను కోరను. ఇంతకాలం ఎలా సంయమనంతో ఉండినానో ఇక మీదటకూడా అలాగే ఉండటానికి నిశ్చయించుకున్నాను. ధనిక స్త్రీల సాంగత్యంతో వచ్చిన మార్పునకు చింతిస్తున్నాను. ఇప్పుడు దుస్సాంగత్య ప్రభావం నాలో లేదు. ఆడంబర జీవితంపై గల వ్యామోహం అంతరించి

పోయింది. నేను మూఢురాలనై బంగారం కోసం పంతగించి మీకు ఇబ్బంది కలిగించాను. అందుకు నన్ను క్షమించండి, ఈ బంగారాన్ని వెనుకకు పంపివేయండి.

రాణి మాటలను ఆలకించిన మహారాజు మంత్రితో-మంత్రివర్యా! ఈమె మనసులో ప్రవేశించిన కుసాంగత్య మలినం భగవంతుని దయవలన శీఘ్రమే తొలగిపోయింది.ఇక మనకు ఈ బంగారంతో పనిలేదు. దీనిని ఎక్కడినుండి తెచ్చావో అక్కడికే చేర్చండని ఆజ్ఞాపించాడు. మంత్రి ఆ బంగారాన్ని తీసుకొని మరలా వీరబాహుని రాజ్యానికి వెళ్ళి కొలువులో ప్రవేశించి, రాజా ఈ బంగారాన్ని మీకు అప్పగించమని మా మహారాజు ఆజ్ఞ. కారణమేమంటే, మా మహారాణికి బహుమూల్య వస్త్రాభరణాలమీద వ్యామోహం ఉండినది. కానీ భగవానుని దయవలన అది సమసిపోయింది. ఈ బంగారంతో పని లేదు. కాబట్టి మీ బంగారాన్ని మీరు గ్రహించండి, అని అతనితో చెప్పాడు.

ఈ సంఘటనతో ఆనందభూపాలుని త్యాగనిరతి, సత్యసంధత పై అపారమైన భక్తిభావం ఏర్పడి అతని మనోఫలకంపై కూడా చెరగని ముద్ర వేసింది. వీరబాహుడు తన బంగారాన్ని తీసుకొని, మంత్రిని ఆదరించి వీడ్కోలు చెప్పాడు. తర్వాత తాను కూడా ఆనంద భూపాల మహారాజును ఆదర్శంగా తీసుకొని పరిపాలించసాగాడు.

మానవ ధర్మం

సాధారణ పరిస్థితులలో ఎదుటివాడు ఎంత బాధపడుతున్నదీ మనిషి తెలుసుకోలేడు. ఏదీ తనదాకా వస్తే కానీ తెలియదు. బాధలు తనకు వచ్చినపుడు మాత్రమే వాటివల్ల కలిగే కష్ట-నష్టాలు, వేదనల ప్రభావం తెలుసుకోగలుగుతాడు.

కాబట్టి సుఖంలోకానీ దుఃఖంలోకానీ తన మాదిరిగానే ఇతరులనుకూడా అర్థం చేసుకోవడం మనిషి లక్షణం.

తానను భవించిన కష్టాలు-నష్టాలు, బాధలు ఇంకెవ్వరికీ రాకూడదనీ, తనకు దక్కిన సుఖ-సంతోషాలు అందరికీ దక్కాలనీ కోరుకోవడమే మనిషితనం.

'భిక్షాందేహి' ఈ దేహానికి ఆహారం కావాలి అని మన ఇంటిముందుకు వచ్చినపుడు తన ఆకలి బాధలాంటిదే, వచ్చిన వాడి ఆకలి బాధ కూడా అని గుర్తించి తన దగ్గరున్న ఆహారం ఏదైనా సరే అది అన్నం కానీ, అంబలి కానీ, కాస్తంత, వానికి కూడా పెట్టి వాని ఆకలి బాధను సాధ్యమైనంత వరకు ఉపశమింపచేయాలి.

అలాగే తనకు చలివేసిన ఎంత బాధ కలుగునో గుర్తుంచుకొని ఎదుటివాని చలి బాధను తీర్చేదానికి శక్తి మేరకు వస్త్రమును దానం చేయాలి.

మనుషులు ఎన్నోరకాలుగా, ఎన్నో విధాలుగా సమస్యలతో సతమతమవుతూ. విలవిలలాడుతూ ఉంటారు. మన దృష్టికి వచ్చినపుడు శక్తి మేరకు ఆహార రూపంలో కానీ, వస్త్రరూపంలోకానీ, వస్తు రూపంలోకానీ సేవల రూపంలో కానీ, సలహాల రూపంలోకానీ ఇచ్చి ఆదుకోవాలి.

కొన్ని సమయాలలో ఎదుటివాని బాధలను గుర్తించగలిగినా, ఏ విధంగానూ, ఆదుకోలేని సంకట పరిస్థితులు దాపురించవచ్చు. అలాంటపుడు అయ్యో! అతనికి ఇన్ని బాధలు వచ్చాయే! అతని బాధలను తొలగించడానికి నేనేమీ చెయ్యలేకపోతున్నానే! అని హృదయ పూర్వకమైన ఆవేదన మనసులో కలిగితేచాలు. అదే మానవత్వం, ఆ హృదయ స్పందనకు ఒక కన్నీటి బొట్టురాలితే చాలు అదే మనిషితనం.

అష్టాదశ పురాణాల సారాంశమంతా వ్యాసభగవానుడు రెండు మాటలలో చెప్పాడు. పరోపకారం పుణ్యం, పరపీడనం పాపం.. అని.

పరులకు ఉపకారం చేయడం, తనవలన ఇతరులకు ఎలాంటి ఇబ్బందులు-మనసు చేత కానీ, మాటల చేతకానీ, చూపుల చేతకానీ, చేతలతో కానీ కష్టం-నష్టం, బాధ, అసౌకర్యం కలగని రీతిలో తన దైనందిన జీవితాన్ని గడపడమే శ్రేష్ఠమైన, విలువైన జీవితం.

ప్రకృతి వలనగానీ, సాటి మనుషుల వంచన, కుట్ర-కుతంత్రముల వలన గానీ, స్వయంకృతాపరాధాల వలనగానీ, పీడింపబడు సమస్త జీవరాశులయందు దయగలిగి, శక్తివంచన లేకుండా దాన-ధర్మాలతోనూ, సేవలతోనూ ఆదుకొని బాధలను నివారించడమే మానవ ధర్మం.

ప్రియమైన భక్తుడెవరు?

పూర్వం ఉత్తర భారతదేశంలోని ఒక ప్రసిద్ధ శివాలయంలో కార్తీక పున్నమిరోజున సూర్యోదయ సమయంలో ఆలయ ప్రాంగణం మధ్యలో ఆకాశం నుండి హఠాత్తుగా ఒక పెద్ద బంగారు పళ్లెరం వచ్చి పడింది. ఆ పళ్లెరంపై ప్రియమైన నా భక్తునకు అని లిఖించబడి ఉంది.

మిలమిలా మెరిసిపోతూ ఉన్న ఆ బంగారు పళ్లెరాన్ని చూచిన వెంటనే ఆ గుడి పూజారి చేస్తున్న పూజను వదలి పరిగెత్తుకొని వచ్చి ఆశతో, ఆతురతతో దానిని చేజిక్కించుకోవాలనుకొని దానిని పట్టుకున్నాడు. కానీ పూజారి ముట్టుకున్న మరుక్షణమే అది ఒక పెద్ద మూకుడుగా మారిపోయింది. ఆ మట్టి మూకుడును చూచి ఛీ-ఛీ వట్టి మట్టి మూకుడేనా?! ఏదో బంగారు పళ్లెరమనుకొని భ్రమపడి అనవసరంగా వచ్చానే అని విచారవదనంతో క్రిందికి జారవిడిచాడు. అదేమి వింతో కానీ, పూజారి జారవిడిచినంతనే అది మరలా బంగారు పళ్లెరంగా మారిపోయింది. పూజారి జారవిడిచిన బంగారు పళ్లెరాన్ని మరలా ఆశతో పట్టుకున్నాడు. కానీ అది మరలా మట్టిమూకుడుగా మారిపోయింది. ఇలా పలుమార్లు ప్రయత్నించి, విఫలుడై, విసిగి వేసారి ఆమట్టి మూకుడును చివరిసారిగా నేలకేసి కొట్టి, నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయాడు.కానీ అది మరలా బంగారు పళ్లెరంగా మారి యధాస్థానంలో కూర్చున్నది.

ఆ పూజారి ఔరా! ఇన్నేళ్ళ తరబడి పూజాదికాలు శ్రద్ధగా నిర్వహిస్తూ వస్తున్న నేను కాక ఈ దేవుడికి ప్రియమైన భక్తుడు మరొకడు ఎవడున్నాడు? ! అని అనుకుంటూ పళ్లెరం దక్కనందుకూ, తాను ప్రియమైన భక్తుడు కానందుకూ దిగులుపడిపోయాడు.

ఈ వింత వార్త చుట్టుప్రక్కల ప్రాంతాలకు ప్రాకడంతో, రాజులు, విద్వాంసులు, పండితులు, కవులు, వస్తాదులు, గొప్పగొప్ప ఉపన్యాసకులు, సంఘ సేవకులు ఇలా ఎందరెందరో వచ్చి దానిని పట్టుకున్నారు. కానీ అది తక్షణమే మట్టిమూకుడుగా మారిపోతూ ఉండినది. వారు వదలిన వెంటనే మరలా బంగారు పళ్లెరంగా మారిపోతూ ఉండినది.

సుదూర ప్రాంతాలనుండి ఈ వింతను చూచేటందుకు వచ్చిన ప్రజలతో దేవాలయ ప్రాంగణమంతా నిండిపోయింది. ఆ జనులను చూచి బిచ్చగాండ్రు, కుంటివారు, గ్రుడ్డివారు, వృద్ధులు డబ్బులను యాచించుటకు బారులు తీరి కూర్చున్నారు.

ఈ జనసందోహాన్ని చూచి, వింత వార్తను విని ఆశ్చర్యపడి, ఒక వ్యక్తి అసలు విషయమేమిటో తెలుసుకోవాలని కుతూహలంతో నెమ్మదిగా దేవాలయంవైపు నడక సాగించాడు. దారికి ఇరువైపులా కూర్చొని ఉన్న కుంటి, గ్రుడ్డి, ముసలి వారిని చూచి మనసు ద్రవించి పోగా చాలా బాధపడ్డాడు. కానీ వారికి ఏమైనా ఇద్దామనుకుంటే అతనివద్ద ఒక పైసాకూడా లేదు. దయతో బాధపడే హృదయం తప్ప.

ఈ దీనులకు తానేమీ చేయలేకపోయినందుకు తన అశక్తతకు బాధపడుతూ, దారిలో అడ్డంగా పడివున్న రాళ్ళను, కంపపుల్లలను ఏరివేస్తూ నెమ్మదిగా దేవాలయ ప్రాంగణానికి చేరుకున్నాడు. అందరితోపాటు తానుకూడా వెళ్ళి ఆ బంగారు పళ్లెరాన్ని పట్టుకున్నాడు. ఆశ్చర్యం! ఆ పళ్లెరం అలాగే ఉండిపోయింది. మట్టి మూకుడుగా మారుతుందేమోనని అందరూ తదేకంగా చూస్తున్నారు. కానీ అలా జరగలేదు. బంగారు పళ్లెరంగానే ఉండిపోయింది.

అక్కడున్నవారంతా ఈ అద్భుతాన్ని చూచి హర్షధ్వానాలు చేశారు. ఆనందంతో చప్పట్లు మారుమ్రోగించారు. "భగవంతునికి నచ్చిన ప్రియమైన భక్తుడితడే" అని అందరు బిగ్గరగా ఆనందంతో అరిచారు. ఈ ఆశ్చర్యకర ఘటనను చూచి అందరూ అతనిని పరిపరివిధాలా ప్రశ్నించారు. అతని యోగ్యతలను అడిగి తెలుసుకున్నారు. అతనికి విద్యలేదు, ధనం అంతకంటే లేదు. కులం అసలే లేదు. అతనికున్నదంతా ఇతరుల కష్టాలను చూచి హృదయపూర్వకంగా అయ్యో! అని బాధపడే గుణం, చేతనైన సేవ, పరోపకారం చేయడమే అతని స్వభావం. నిష్కల్మషమైన అతని హృదయమే అతని యోగ్యత, అని అందరూ తెలుసుకుని ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు.

* ఇతరుల కష్టాలను చూచి కరుణతో అయ్యో! అని స్పందించే గుణం ఉండాలి. దాపరికం ఏమాత్రం లేకుండా తన చేతనైన సేవ చేయువాడే భగవంతునికి ప్రియమైన వాడు. అంతేకానీ, చదువు, కులం, ధనం, పదవి ఇవేవీ మానవత్వం ముందు సరిరావు.

మనుషుల మధ్య బంధాలను, బాంధవ్యాలను, ప్రేమను, గౌరవాన్ని, భక్తిని, భయాన్ని, శ్రద్ధను పెంపొందింపజేసే భావనలను నైతిక విలువలు అంటారు.

వ్యక్తియొక్క నడవడికలో ఉండే నైతికతను బట్టి విలువలను పాటిస్తున్నాడో లేదో చెప్పవచ్చు. మాటల కంటే చేతలను బట్టి మాత్రమే విలువలను పరిగణలోనికి తీసుకోవాలి. గొప్పగొప్ప ధర్మపన్నాలను వల్లించేవారు, నైతిక విలువలను ప్రబోధించేవారు నీతిమంతులుగా, మహాత్ములుగా కనబడతారు. కానీ ఆంతరంగిక జీవితాలలో అందుకు భిన్నంగా ఉంటున్నారు.

నీతిరెండు రకాలుగా మనకు దర్శనమిస్తుంది. మొదటిది ఆచరించకుండా ఇతరులకు చెప్పేది. దీనినే **హరిదాసు నీతి** అని కూడా అంటుంటారు. భక్తులందరికీ ఉల్లిపాయలను తినకూడదు అని ప్రబోధిస్తాడు. ఇంట్లో మాత్రం ఉల్లిపాయ లేకుండా మెతుకుకూడా ముట్టడు. అదేమని భార్య అడిగితే అది అంతేలే! అంటాడు. "ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి". అంటే ఇదే. ఆచరిస్తూ ఇతరులకు ఆదర్శంగా ఉంటూ చెప్పిందే చెయ్యడం, చేసిందే చెప్పడం రెండవ నీతి.

గొప్పవారు ఆచరించి చూపుతారు

ఒకసారి రామకృష్ణ పరమహంస దగ్గరికి ఒక తల్లి తన ఐదు సంవత్సరాల కుమారుడిని తీసుకొచ్చి, స్వామీ! నా కుమారుడు అస్తమానమూ బెల్లంతింటూ ఉంటాడు. ఇవ్వకుండా అలవాటును మాన్పిస్తామనుకుంటే ఇచ్చేంతవరకూ ఏడుస్తూ సతాయిస్తాడు. వేరేది ఏమిచ్చినా తినడు. దయచేసి మీరు ఏదైనా చేసి ఈ దురలవాటును మాన్పించండి స్వామీ అని వినయపూర్వకంగా వేడుకున్నది.

పరమహంస ఆ తల్లిగోడు విన్నాక ఓ పదిరోజుల తర్వాత రమ్మన్నాడు. ఆమె సరిగ్గా పదిరోజులకు మరలా కుమారుడితో సహా స్వామి సన్నిధికి వచ్చింది. పరమహంస ఆమెను చూచి అమ్మా మరో పదిరోజుల తర్వాత రండి అన్నాడు.

ఆ తల్లి బిడ్డను తీసుకొని సరిగ్గా పదిరోజులకు స్వామి దగ్గరికి వచ్చింది. అప్పుడు ఆ బిడ్డను ఆప్యాయంగా దగ్గరికి తీసుకొని, బుజ్జగిస్తూ బెల్లం అతిగా తింటే వచ్చే అనర్థాలను వివరిస్తూ, ఇకమీదట బెల్లం అతిగా తినొద్దు. ఎప్పుడైనా ఒక చిన్నముక్కను తింటే పరవాలేదు. కానీ అదే పనిగా, అదే ఆహారంగా తినవద్దు అని లాలించి చెప్పగా, ఆ పిల్లవాడు సరేనని తలూపాడు. పిల్లవాడిని ఆశీర్వదించి తల్లికి ఇచ్చాడు స్వామి.

ఆ తల్లి-స్వామితో... స్వామీ ఈ నాలుగు మాటలూ చెప్పడానికి నన్ను రెండు సార్లు తిప్పుకున్నారే అనవసరంగా, నన్ను చాలా ఇబ్బంది పెట్టారు కదా స్వామీ" అన్నది.

అందుకు పరమహంస తల్లీ నాకుకూడా బెల్లం తినే అలవాటు ఉండినది. కాబట్టి మొదట నేను ఆ దురలవాటును దూరం చేసుకుంటే, ఆ తర్వాత నేను ఇతరులకు చెప్పగలను. నేను బెల్లం తినే అలవాటును మానుకునేదానికి ఇన్ని రోజులు

పట్టిందమ్మా! అందుకే ఈ ఆలస్యం. తప్పుగా భావించొద్దు తల్లీ. అని ఆప్యాయంగా చెప్పగా, ఆ తల్లి! స్వామి మాటలకు ముగ్ధురాలై తొందరపడి స్వామిని విమర్శించానే అని పశ్చాత్తాపపడింది.

మహనీయులంతా ముందు తమను తాము సంస్కరించుకున్న తర్వాతనే ప్రవచనాలు ఇస్తారు. మహాత్ముల జీవితాలే అందరికీ ఆదర్శం. వారిని చూచి ప్రేరణ పొంది, వారి అడుగు జాడలలో నడవవలసిందే. ఎదుటివారు గుర్తించాలన్న తపన, నీతి నిజాయితీలను చాటుకోవాలన్న కోరిక నీతిమంతులకు ఉండదు.

ప్రబోధాలవలన కొందరు, సజ్జనమైత్రితో కొందరు, కఠినమైన శిక్షల భయంతో కొందరు తమ జీవితాలను మంచి మార్గాల వైపునకు మళ్లిస్తారు. కేవలం ప్రవచనాల ద్వారా మాత్రమే విలువలను ఆశించలేము.

దైవప్రీతి, పాపభీతి మరచిపోయి, తాత్కాలిక సుఖ భోగాలకోసం, మంచి - చెడులను, ఉచ్చ - నీచాలను, సత్యా - సత్యాలను, ధర్మా - ధర్మాలను పూర్తిగా విస్మరించాడు మనిషి. దాని ఫలితంగా సమాజంలో నేరాలు-ఘోరాలు, దోపిడీలు, హత్యలు-ఆత్మహత్యలు ప్రబలిపోయాయి.

తల్లిదండ్రులపట్ల సంతానానికి, సంతానంపట్ల తల్లిదండ్రులకు, భార్యపై భర్తకు, భర్తపై భార్యకు, గురువులపై శిష్యులకు, శిష్యులపై గురువులకు, ప్రజలపై అధికారులకు, అధికారులపై ప్రజలకు ఉండవలసిన రీతిలో ఉండవలసిన స్థాయిలో గౌరవం, మర్యాద, వినయం, విధేయత, భయం, భక్తి, ప్రేమ, అనురాగం, నమ్మకం ఏమాత్రమూ లేకుండాపోయింది. రోజురోజుకూ మనుషుల మధ్య అఖాతం అధికమై, అధమస్థాయికి చేరుకుంది. మనుషుల మధ్య మానవత్వ సంబంధాలు రంగులు మార్చుకుంటూ, పతన దశకు చేరుకున్నాయి. హృదయ సంబంధాలన్నీ డబ్బు సంబంధాలయ్యాయి.

నష్టం రానంతవరకూ, కష్టం కలగనంతవరకూ, తన సుఖానికి అడ్డు తగలనంత వరకూ, తన మాటకు ఎదురు చెప్పనంతవరకూ, తన ఆలోచనలను ఆమోదించినంత వరకూ మాత్రమే మామూలుగా ప్రవర్తిస్తున్నారు. అంత వరకూ బాగానే వుంది. కానీ దైనందిన జీవితంలో ఏ చిన్న ఇబ్బంది కలిగినా, తమ ఆలోచనలకు అవరోధం కలిగినా, తట్టుకొనలేక పోతున్నారు. విలవిలలాడిపోతున్నారు.

మరీ ఈనాటి యువతరం ఎవరికోసమైనా మేమెందుకు సర్దుకొనిపోవాలి? మేమెందుకు సేవ చెయ్యాలి? త్యాగానికి ఎందుకు సిద్ధపడాలి? అని ప్రశ్నిస్తున్నారు. క్రమశిక్షణను, నైతిక బాధ్యతను ఒక శిక్షలాగా భావిస్తున్నారు.

వారు ఆశిస్తున్న హక్కులు, సౌకర్యాలు, లభించకుంటే, ఏమాత్రమూ భరించలేకున్నారు. ఆశించిన లబ్ధి పొందడంలో ఏమాత్రం, తేడాలొచ్చినా? కుటుంబ సభ్యులతోనైనా సరే, పరాయి వారితోనైనా సరే తీవ్రస్థాయిలో ప్రతిఘటనకు, ఘర్షణకు దిగుతున్నారు. ఎంతటి పర్యవసాన్నాన్నైనా అనుభవించేదానికి వెనుకాడ్డంలేదు.

అందుకే ఆస్తికోసం తల్లిదండ్రులను నరుకుతున్న కొడుకులు, దాచుకున్న పైకం కోసం అమ్మమ్మలను చంపుతున్న మనవళ్ళను, జానెడు జాగాకోసం తలలను తెగనరుక్కుంటున్న అన్నదమ్ములను, భర్త సంపాదనను ప్రియునికి ధారాదత్తం చేస్తున్న భార్యలను, భార్య సంపాదనను ప్రియురాళ్ళకోసం యథేచ్ఛగా సమర్పించుకుంటున్న భర్తలను, తమ కామకేళీ విలాసాలకు అవరోధంగా ఉంటున్నారని భర్తను భార్య, భార్యను భర్త, తల్లి-కొడుకులను కుట్రలతో కుతంత్రాలతో పైశాచికంగా హతమార్చు కుంటున్న వారిని సమాజంలో ఎందరినో చూస్తున్నాం. చెడ్డ సంతానం ఉండవచ్చు కానీ, చెడ్డ తల్లి ఉండదని ఒకప్పటి ఘనమైన మాట. కానీ అది ఈనాడు గాలి మూట.

మనీ కంటే మెటీరియల్ గొప్పది
మెటీరియల్ కంటే హ్యూమానిటీ గొప్పది
హ్యూమానిటీ కంటే మొరాలిటీ గొప్పది
మొరాలిటీ కంటే రియాలిటీ గొప్పది
రియాలిటీ కంటే స్పిరిచువాలిటీ గొప్పది

* పరిమళమే పువ్వుకు విలువనిస్తుంది. వర్షించినపుడే మేఘానికి విలువ వస్తుంది. మానవత్వమే మనిషికి విలువనిస్తుంది.

మాతాపుత్ర విరోధాయ హిరణ్యాయ నమోనమః

ఒక తల్లి తన ఇరువురు కుమారులతో కలిసి పొరుగూరికి వెళుతూ ఉన్నారు. దారి మధ్యలో వచ్చే ఒక అడవిని దాటిపోతూ ఉండగా కొందరు సాధువులు కాలుడు కాలుడు (మృత్యువు) అని అరచుకుంటూ పరిగెత్తిపోతూ ఉన్నారు. వారిని ఉద్దేశించి మీరెందుకు అలా భయపడి పారిపోతున్నారు? అని ఆ తల్లీ-కొడుకులు ప్రశ్నించారు. కానీ, ఆ సాధువులు వారి మాటలను పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అదేమిటో తెలుసుకుందామని ఉత్సుకతతో ఆ తల్లీ కొడుకులు సాధువులు వచ్చిన దారిలోనే కొంతదూరం వెళ్ళారు. ఆ దారి ప్రక్కనే ధగధగా మెరుస్తూ ధనరాశి కనపడింది. వెంటనే ఆ తల్లీకొడుకులు ఓరి మూర్ఖులారా! ఈ ధనరాశిని చూచేనా మీరు భయపడి పారిపోతున్నారు సరే ఎవరికైనా అనుభవించే అదృష్టముండాలి! ఎవరికి దక్కాలో వారికే దక్కుతుంది, అనుకుంటూ, సంబరపడిపోతూ, ఆ ధనరాశి ప్రక్కనే కూర్చొని, దానిని ఎలా తీసుకెళ్లాలో ఆలోచించసాగారు. వారివద్ద ఆ ధనరాశిని నింపుకొనేటందుకు సంచులు లేవాయె!

తల్లీకొడుకులు బాగా తర్కించుకొని అమ్మా! "నీవు, తమ్ముడు ఈ ధనరాశి దగ్గర ఉంటే రక్షించడం కష్టం. కాబట్టి నీవు గ్రామానికి వెళ్ళి కొన్ని సంచులు తీసుకొనిరా. అలాగే మన ముగ్గురుకీ సరిపడే ఏదైనా ఆహారం తీసుకొనిరా. అంతవరకూ నేను, తమ్ముడు ఇద్దరం ఈ ధనరాశిని రక్షిస్తూ ఉంటాము అని ఉపాయం చెప్పాడు. పెద్ద కొడుకు. ఆ తల్లి కూడా సరే నీ ఆలోచన బాగానే ఉందని సమ్మతించి వెళ్లింది.

గ్రామానికి వెళ్ళిన ఆ తల్లి కొన్ని సంచులను, ఆహారాన్ని, ఒక పాత్రలో మంచినీళ్ళు తీసుకొని వస్తూ ఉండగా, ఆ తల్లి మనసు దురాశతో నిండిపోయింది. ఇద్దరు కొడుకులూ అడ్డుతొలగిపోతే, ఆ ధనరాశిని వశం చేసుకొని తానొక్కతే విలాసవంతమైన ఒక సరికొత్త జీవితాన్ని ప్రారంభించవచ్చుకదా, అని ఆలోచించింది. వెంటనే మరో ఆలోచన లేకుండా ఆహారంలో విషం కలిపింది.

అడవిలో ధనరాశి దగ్గర కాపలాగా ఉన్న అన్నదమ్ములిద్దరూ తల్లిలాగానే దురాశకు లోనై తల్లిని అడ్డుతొలగించుకుంటే వారిద్దరు మాత్రమే ఆ ధనరాశిని అనుభవించవచ్చునని ఆలోచించారు.

కొంతసేపటికి వాళ్ళమ్మ వచ్చింది. తల్లికి అన్న ఎదురువెళ్ళి అమ్మ చేతిలోని వాటిని తీసుకున్నాడు. తమ్ముడు అమ్మవెనుకగా వెళ్ళి ఒక దుడ్డుకర్రతో అమ్మ తలమీద ఒక్కవేటు వేశాడు. అంతే అమ్మ అడ్డు తొలగిపోయింది. ఇద్దరన్నదమ్ములు ఇక మనమిద్దరమే దీనిని సమానంగా పంచుకొని వెళ్ళిపోతాము అనుకున్నారు. అమ్మతెచ్చిన సంచులలో ఆ ధనరాశిని నింపుకున్నారు. తర్వాత నింపాదిగా అమ్మతెచ్చిన విషాహారాన్ని తిని చచ్చిపోయారు. వెళ్ళిపోయిన సాధువులు తిరిగొచ్చి "మాతా పుత్ర విరోధాయ హిరణ్యాయనమః (తల్లీ బిడ్డల మధ్యకూడా విరోధాన్ని సృష్టించగల సంపదకు నమస్కారము) అని ఆ ధనరాశికి తలవంచి నమస్కరించి వెళ్ళిపోయారు.

పాలకులు, ప్రతినిధులు, అధికారులు పలు సందర్భాలలో సమాజంలో విలువలు వడిపోయాయి, అని మొనలి కన్నీరు కారుస్తూ ఉంటారు. "క్షీరమార్జాలన్యాయం" తీరుగా కళ్ళు మూసుకొని పాలు తాగుతూ పిల్లి తన నెవరూ చూడ్డంలేదు అనుకున్నట్లు. ఒకవైపు మద్యం, జూదం, వ్యభిచారం, అవినీతికి పాల్పడుతూ, ప్రోత్సహిస్తూ... సమాజంలో విలువలు పతనమయ్యాయి. కనుమరుగైపోయాయని వాపోవడంలో అర్థం, ప్రయోజనం ఉంటుందా? ఒకవైపు నేరాలను అరికట్టాలనీ, నేరస్తులకు కఠిన శిక్షలు విధించాలనీ, అలాంటివి మరలా పునరావృతం కాకూడదనీ ఘోషిస్తూ.... మరోవైపు ఉదారవాదులనే వారు విశాల హృదయంతో మానవత్వమే తమ మతంగా, నేరస్తులను క్షమించాలని చేసే విన్నపాలనే దృష్టిలో ఉంచుకొని బాధితుల బాధలనూ, ప్రాణాలను త్యాగం చేసిన వారి గోడునూ

విస్మరించి ఉదాసీన వైఖరులతో, శిక్షలను వాయిదాలమీద వాయిదాలు వేస్తూ పోతే, నేరప్రవృత్తిగల వారికీ, సామాన్య జనులకూ పాపభీతి, శిక్షాస్మృతి పట్ల భయం ఉంటుందా? నేరస్తులు పుట్టుకొని రాకుండా ఉంటారా?

పాచి పట్టిన నీటి తొట్టిలో మరలా పాచి పట్టకుండా చేయాలంటే, మొదట తొట్టిలోని మురికి నీటిని తీసేసి, తొట్టిలోని పాచిని సమూలంగా తొలగించి, శుభ్రం చేసి, మరలా పాచిపట్టకుండా, సూర్యరశ్మి పడకుండా జాగ్రత్తలు తీసుకొని తొట్టిమీద మూత చక్కగా పెట్టినట్లయితే మరలా పాచిపట్టకుండా శుభ్రంగా ఉంటుంది. అలాగే పాలకులు, ప్రతినిధులు, అధికారులు మొదట చట్టాన్ని గౌరవిస్తూ, చట్టపరిధిలో ప్రణాళికలను అమలుపరుస్తూ, పరిపాలనలో పారదర్శకతను కలిగి ఉంటూ, ఆశ్రిత పక్షపాతానికీ, బంధుప్రీతికీ, అవినీతికీ, అవకాశమివ్వకుండా బాధ్యతలను నిర్వర్తిస్తే, పరిపాలకులపై విశ్వాసం, భక్తి, గౌరవభావాలు పెరుగుతాయి. సమాజంలో విలువలపట్ల ఆదరణ పెరుగుతుంది. ఆచరణ సాధ్యపడుతుంది.

* సమాజంలో శ్రమకు తగ్గ ఫలితం, మేధస్సుకు తగిన గుర్తింపు, మంచికి ప్రోత్సాహం, నేరాలకు తగిన శిక్ష ఉంటుందని సామాన్య జనం ఎప్పుడు విశ్వసిస్తారో, అపుడు మాత్రమే సామాజిక విలువలు, నైతిక విలువలు , వెరశి మానవతా విలువలు భూమ్మీద జీవించి ఉంటాయి.
* విలువలు పైస్థాయిలో... అనగా, పాలకులు, ప్రతినిధులు, అధికారులు, పెద్దలలో కనిపించాలి. ఫలితాలు క్రిందిస్థాయి అనగా సామాన్య జనులలో కనిపించాలి.
* ఉన్నతమైన ఆశయాలతో జీవించేవారే, జీవితంలో ఎదురయ్యే అవాంతరాలను ఎదుర్కొని, అధిగమించి జీవన విలువలను ప్రతిబింబించగలరు.

ప్రార్థించే పెదవులకంటే సేవలుచేసే చేతులేమిన్న

ఒక పరోపకారి అలుపూ-సొలుపూ లేకుండా అందరికీ సేవలు చేస్తూ, సహాయ-సహకారాలందిస్తూ ఉండేవాడు. ఒకసారి ఆ పరోపకారి నడచి వెళుతూ ఉండగా ఊరి చివర నిర్జన ప్రదేశంలో చెట్టు క్రింద ఒక దేవదూత కూర్చొని పుస్తకంలో ఏదో వ్రాసుకుంటూ ఉండడం కనిపించింది. విషయం ఏమిటో తెలుసుకోవాలనే ఆసక్తితో దేవదూత దగ్గరికి వెళ్ళి ఏం చేస్తున్నారు? అని అడిగాడు.

"భగవంతుడి మీద అపారమైన భక్తి, ప్రేమ గల వారిపేర్లను వరుసగా ఇందులో వ్రాస్తూ ఉంటాను. అన్నాడు దేవదూత. అలాగా ! అని ఆశ్చర్యంతో అలాగే నిలబడ్డాడు ఆ పరోపకారి.

ఏదీ నీ పేరు చెప్పు. ఇందులో ఉందేమో చూస్తాను" అడిగాడు దేవదూత. నా పేరు ఉండకపోవచ్చు. ఎందుకంటే నేను ఏ దేవుడినీ భక్తితో మ్రొక్కను, పూజలూ, భజనలూ చేయను. ఉపవాసాలూ ఉండను. దేవాలయాలకుకూడా వెళ్ళను. అలాంటపుడు నా పేరెలా ఉంటుంది అందులో? అన్నాడు పరోపకారి. అయితే అవేవీ చేయకుండా, మరేం చేస్తుంటావు? అడిగాడు దేవదూత. "అవకాశం దొరికినంతవరకూ, అవసరం ఉన్నవారికి చేతనైనంత సేవ చేయడంతోనే సరిపోతుంది అన్నాడు పరోపకారి. అలాగా! అయినా సరే! నీ పేరు చెప్పు, ఉందేమో చూస్తాను అడిగాడు దేవదూత మరోసారి.

అతడు తన పేరు చెప్పాడు. దేవదూత తన పుస్తకంలోని పేర్లన్నింటినీ ఒకటి బట్టి రెండుసార్లు పరిశీలించాడు. అతని పేరు లేకపోయేసరికి పెదవివిరిచి, నీవు చెప్పింది నిజమే! ఈ పుస్తకంలో నీ పేరు ఎక్కడా లేదు. అనగానే అతను అక్కడినుండి వెళ్ళబోయాడు.

వెళుతున్న అతనివైపు చూచి దేవదూత ఆగవయ్యా ! నా దగ్గర ఇంకో పుస్తకం ఉంది. నీ పేరందులో ఉందేమో చూస్తాను అని, మరొక పుస్తకం తిరగేశాడు. అందులోని మొదటి పేజీలో అన్నిటికన్నా పైనే ఉన్న అతని పేరును చూపించాడు.


నా పేరు అందులో ఎందుకుంటుంది? ఈ పుస్తకం ఏమిటి అని పరోపకారి ప్రశ్నించాడు. భగవంతుడు తాను ప్రేమించే వారి పేర్లు గల పుస్తకం ఇది. చెప్పాడు దేవదూత.

ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయిన పరోపకారికి అతడు ఇలా వివరించాడు.

* సత్యవంతమైనవాడు ఏ సాధనా కానీ, తపస్సుకానీ చేయవలసిన అవసరంలేదు.
* మానవసేవయే మాధవసేవ.
* ఆకలిగొన్నవాడికి అన్నం, ఆపదలోనున్న వాడికి ఆపన్నహస్తం అందించినవాడే దేవుడు.
* నీవు గొప్పవాడివని ఏ ఒక్కరి నుండి ఆమోదం పొందవలసిన అవసరం లేదు. నీ చర్యలద్వారా అది ప్రకటితమవుతూనే ఉంటుంది. నిన్ను గొప్పవానిగా గుర్తించడానికీ, కీర్తించడానికీ ఏ సాక్ష్యాలూ అవసరం లేదు. నీకు నీవే సాక్షివి.
* లక్ష్యం ఉన్నతంగా ఉండాలి. జీవనం నిరాడంబరంగా ఉండాలి. ప్రయత్నం నిస్వార్థంగా ఉండాలి, ఫలితం భగవంతునికి వదలివేయాలి.



బాంధవ్య చక్రం



కుటుంబమే సమాజంలో కీలకమైనది. ప్రప్రథమ సమూహం పరివారమే. వ్యక్తి కుటుంబానికి చెంది ఉంటాడు. తల్లిదండ్రులు, అవివాహితులైన ఆడ-మగ బిడ్డలు, వివాహితులైన కుమారులు, వారి భార్యా బిడ్డలు కలిసి ఒకే ఇంటిలో ఉంటూ, ఒకే వంటను భుజిస్తూ, ఒక్కటిగా జీవించడమే అవిభక్త కుటుంబం, ఉమ్మడి కుటుంబం.

కుటుంబ సభ్యుల మధ్య ఉండే అనుబంధాలు ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలంటే "తండ్రిది బైటి పెత్తనం, తల్లిది ఇంటి పెత్తనం" ఉండాలి. ఒకనాడు చదువు లేకున్నా సంస్కారవంతంగా ఉమ్మడి సంసారాలు ఉండేవి. ఈనాడు చదువరులు ఎక్కువైపోయి ఉమ్మడి సంసారాలు ఎక్కడా కనిపించకుండా పోయాయి.

హైందవ జీవన విధానంలో తల్లి-తండ్రి, గురువు ప్రత్యక్ష దైవాలు. తల్లి-దండ్రుల సేవే, దైవ సేవ. వృద్ధాప్యంలోని తల్లిదండ్రులను దగ్గరకు తీయని పుత్రుడు చచ్చినవాడితో సమానం.

* సూరన్న సుఖవాసి పేరన్న పెద్దోడు, అయ్యకే ఎత్తరా అరిటాకుల కట్ట అన్నాడట తండ్రిని ఏడిపించే కొడుకు.
* ఒకటే కూతురని వరన్నంబెడితే, మిద్దెక్కి మిండగాళ్లను పిలిచిందట.
* పుడుతూ సోదరులు, పెరుగుతూ దాయాదులు.
* అందరి కాళ్లకు మొక్కినా, అత్తగారింటికెళ్లక తప్పదు.
* తమ్ముడు తనవాడైనా ధర్మం సరిగ్గా చెప్పవలె.
* ఇరుపోటీలతో ఇల్లు చెడె. వాయునొప్పులతో ఒళ్ళు చెడె.
* పెద్దల ఉసురు పెనుబామై కరచును.
* పక్కింటి పోరు పండుగంత వేడుక.
* మోసినవాడికి మోచేత్తో మొట్టి, అరచినవాడికి అరచేత్తో అన్నీ వడ్డించినట్లు.
* ఏకాదశినాడు తలంటుకున్నావేమీ? అంటే అది నిత్యవ్రతము నేడే ఆరంభించాను. అన్నదట. మర్నాడు తలంటుకోలేదేమీ? అంటే నిన్నటితో వ్రత సమాప్తి అయినది అన్నదట.
* మంచి కూతురుంటే మంచం మీదే కూడు.

వివాహం - భార్యాభర్తలు

ఆహారం, నిద్ర, మైధునం అనే ప్రాథమిక అవసరాలను నిర్భయంగా, ఆరోగ్యంగా నెరవేర్చుకోవడానికి మానవ సమాజం ఏర్పరచుకున్న వ్యవస్థే వివాహం. గృహస్థ జీవితం వివాహంతో ప్రారంభమవుతుంది. స్త్రీకానీ పురుషుడు కానీ వివాహంతో భార్యాభర్తలవుతున్నారు, గృహస్థులవుతున్నారు.

వివాహంతో నిమిత్తం లేకుండా స్త్రీ పురుషులు సృష్టి ధర్మమైన కామవాంఛను తీర్చుకోవచ్చు. కానీ, మానవ జాతి పశు-పక్ష్యాదులలాగా (ఒక సీజన్, ఒక రీజన్) ఒక రీతికిగానీ, ఒకనీతికిగానీ కట్టుబడి ఉండే దశను ఎప్పుడో దాటిపోయింది. కాబట్టి వారి కామవాంఛ విచ్చలవిడితనానికి, విశృంఖలత్వానికి దారి తీయకుండా, అనారోగ్యంపాలు కాకుండా ఉండడానికే విజ్ఞులైన వేద విదులు వివాహ వ్యవస్థను రూపొందించారు. వివాహం అనేది ఒక కట్టుబాటు. ఎవరికి వారు తమ హద్దులలో ఉంటూ నియమాలను ఉల్లంఘించకుండా, బాధ్యతగా జీవించేదానికే గృహస్థ జీవితం ఏర్పాటు చేయబడింది.

భార్యభర్తల మధ్య ఉండేది ఒక్క బాధ్యత, ఇష్టం మాత్రమే. బాధ్యతనే ప్రేమ అని అనుకుంటూ ఉంటారు. ఎవరికైనా ప్రేమ అనేది ఉంటే అది ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ భగవంతుని మీద మాత్రమే.

భర్త భార్యను ప్రేమిస్తున్నాడంటే, భార్య కోర్కెలు తీర్చడానికి కాదు. తద్వారా తన కోర్కెలను తీర్చుకోవడానికి, సేవలు చేయించుకోవడానికీ, సౌకర్యంగా ఉండడానికే! "భర్త ఉంటేనే తను బ్రతకగలదు, భద్రంగా ఉండగలదు, సౌభాగ్యవతిగా ఉండగలదు, ముత్తయిదువుగా గౌరవింపబడగలదు, అనే ఆశతో, అపేక్షతో భార్య భర్తను ఇష్టపడుతూ ఉంటుంది.

ఈ విధంగా వారనుకునే ప్రేమలో స్వార్థం ఉంది. ఒకరి నుండి మరొకరు శారీరక అవసరాలను, సౌకర్యాలను, సుఖాలను, సేవలను ఆశిస్తూ ఉంటారు. అందువలననే ఒకరికి ఒకరు ప్రీతిపాత్రులవుతూ ఉంటారు. ఇరువురిలో ఎవరైనా అసౌకర్యాన్ని కలిగిస్తూ ఉంటే, అవసరాలను తీర్చకుంటే, సేవలనందివ్వకపోతే, ఆధిక్యతను, అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని చూపిస్తూ ఉంటే ఘర్షణ మొదలై, అశాంతికి లోనై, సుఖశాంతులకోసం విడిపోతూ ఉన్నారు, మరెక్కడో ఉంటాయని వెదుకుతూ పరుగులు పెడుతున్నారు.

ప్రపంచంలో మనిషికి ఎవరిమీదా ప్రేమ ఉండదు. స్వార్థపు 'ఇష్టం', 'ప్రీతి' తప్ప. ఎవరికైనా చిత్తశాంతి లభించిందంటే ఏకాంతంలోనే, నిస్వార్థ సేవలోనే, అందరి సుఖం కోరుకోవడంలోనే, స్వార్థ త్యాగంలోనే, అని అనేకమంది అనుభవంతో చెప్పారు, చెపుతున్నారు.

* అవివాహ మనుష్యుల జీవితాలు దాదాపు ఒక్కటిగానే ఉంటాయి. కానీ వైవాహికుల జీవితాలే రకరకాలుగా, చిత్ర విచిత్రంగా ఉంటాయి.
* 'పెళ్ళి' తంతుతో సినిమా లేక నవలలోని జీవితం 'శుభం'గా ముగిస్తారు. కానీ నిజజీవితంలో అసలు సిసలైన జీవితం వివాహంతోనే ప్రారంభమవుతుంది.
* ఆలుమగల కలహం అన్నం తినేదాకానే.
* భార్యా భర్తలలో ఇద్దరూ ఒకే సారికోపం తెచ్చుకోకూడదు. ఒకరికి వస్తే మరొకరు మౌనంగా ఉంటూ సర్దుకుపోవాలి.

<u>భార్య ఇలా వుండాలి</u>		<u>భర్త ఇలా వుండాలి</u>
1. పనిలో దాసిలాగా	-	కష్టించే బల భీముడిలాగా
2. ఆకలి తీర్చే అమ్మలాగా	-	ఏ వ్యసనమూ లేని సంపాదన పరుడుగా
3. పడకటింటిలో రంభలాగా	-	పడకటింటిలో నిగ్రహావేశం గల ఇంద్రునిగా, శృంగార పురుషుడుగా
4. రూపంలో లక్ష్మీదేవిలాగా	-	చెక్కిన శిల్పంలా, దృఢకాయుడిగా
5. దయలో భూమాతలాగా	-	శూర, వీర విక్రమార్కుడిలాగా

* ఇంటిని చూసి ఇల్లాలిని చూడమన్నారు. గృహిణి లేని గృహం సూర్యుడు లేని ప్రపంచమే
* ఆనందాన్ని కానీ, ఆపదను కానీ, వైరాగ్యాన్ని కానీ పురుషునికిచ్చేది స్త్రీయే.
* ఆడది లేకుంటే అడవి. మగవాడు లేకుంటే మఠం
* పడుగు పేక కలిస్తే గుడ్డ. ఆలు మగలు కలిస్తే ఇల్లు.

మీ వెంటే వస్తాం

ఒక ఋషి సన్యాసం తీసుకోదలచుకున్నాడు. గృహస్థ జీవితం నుండి ముక్తి కావాలనుకున్నాడు. తన ఇరువురు భార్యలను పిలిచి తనకోరికను ఇలా వెలిబుచ్చాడు.

నేను సన్యాసం తీసుకోబోతున్నాను, నా సంపాదనంతటినీ మీ ఇరువురికీ సమానంగా పంచుతాను. దానివలన మీ మధ్య వివాదాలు తలెత్తకుండా ఉంటాయి. అన్నాడు.

అపుడు వారిరువురూ భర్తనిలా అడిగారు. మీరిచ్చే ధనంతో మోక్షం లభిస్తుందా? అని. ధనంతోకానీ ఏ ఇతర సంపదలతోకానీ ఇంత వరకూ ఎవరికీ మోక్షం సిద్ధించలేదు. ధనంతో కేవలం కొన్ని సౌకర్యాలను కలుగజేసుకొని సుఖాన్ని పొందవచ్చు. అంతే అన్నాడు ఋషి.

సమాధానం విన్న భార్యలు భర్తతో మోక్షం అంత విలువైనదా? అయితే సంపదనంతా ఎవరికైనా ఇచ్చేయండి, లేదా మీకిష్టమొచ్చినట్లు చేయండి, విలువలేని దాన్ని మాకిచ్చి, విలువైన దాన్నీ, అపురూపమైనదాన్నీ మీరు పొందాలనుకోవడం, చాలా అన్యాయం. మేమూ మీతోపాటే, మీ వెంటే వస్తామన్నారు ఆ సాధ్వీమణులు.

భర్తను మించిన భార్య

పరమభక్తుడైన నామదేవుడి కాలంలో శంకరయ్య, జానకమ్మ అనే భక్త దంపతులుండేవారు. వారు కటిక దరిద్రం అనుభవిస్తూ ఉండేవారు. నామదేవుడికి వారిమీద అమితమైన జాలి కలిగింది. వారి దారిద్ర్యాన్ని తొలగించి, కష్టాలనుండి గట్టెక్కించమని భగవంతుడిని ప్రార్థించాడు. భగవంతుడు ప్రత్యక్షమై నాకూ వారి పేదరికాన్ని తొలగించాలనే ఉంది. కానీ వారు ఏ రూపంలోనూ ఎవరి నుంచీ ధనాన్ని ఆశించరే! నన్నేం చేయమంటావు? అన్నాడు.

అందుకు నామదేవుడు భగవంతునితో స్వామీ! మరొకసారి ఏదో ఒక అవకాశాన్ని వారికి ఇచ్చి చూడండి, అని వేడుకున్నాడు. అందుకు భగవంతుడు సరేనన్నాడు.

ఒకరోజు ఆ దంపతులిరువురూ భజనలో పాల్గొనడానికి వెళుతున్నారు. దారిలో బంగారు నాణాలున్న ఒక సంచి భర్త శంకరయ్య పాదాలకు తగిలింది. అది అతణ్ణి ఏమాత్రం ఆకర్షించలేదు. సరికదా! తన వెనుకనే వస్తున్న భార్య కంటబడితే ఆమె దానివైపు చూచి ఆకర్షితురాలై ఆశకు లోనౌతుందేమోనని, ఆమె చూడక ముందే వీలైనంత జాగ్రత్త పడుతూ ఆ బంగారు నాణేల సంచిని మట్టితో కప్పేయసాగాడు. భార్య జానకమ్మ చూడనే చూసింది. అదేం పని? మట్టిని మట్టితో కప్పెదతావెందుకు? అంది.

* భార్య బాధిస్తుంది - ప్రియురాలు పీడిస్తుంది, సహధర్మచారిణి సహకరిస్తూ, సలహాలనిస్తుంది.
* అహాన్ని పక్కనబెట్టి ఆలోచిస్తే - భార్య అందించే స్నేహం, సుఖం, సహానుభూతిని అంగీకరించగలిగితే భార్యకు మించిన శ్రేయోభిలాషి దొరకడం దుర్లభం, అని అంగీకరించక తప్పదు.
* స్త్రీ కన్నీళ్ళు - కండలు తిరిగిన వస్తాదులైనా కుక్కలా తోకాడింపజేసే రస గుళికలు.

* పాతిక జీవితం తర్వాత, అధికారికంగా స్నేహాన్ని పంచుతూ సందర్భాన్ని బట్టి సలహాలనిస్తూ, ఓదార్చుతూ, సహానుభూతిని పొందుతూ, విమర్శతో సరిదిద్దుతూ జీవితాంతం తోడుగా నిలుస్తూ, తన అస్తిత్వాన్ని భర్త ఆశలలో, ఆశయాలలో చూచుకునేదే సహధర్మచారిణి.
* చేయూతనివ్వడమే కాదు తానూ ఒక సోపానంగా ఉండడంలో తృప్తినీ ఆనందాన్నీ పొందుతుంది భార్య.
* బయటి స్నేహితులకు కొన్ని పరిమితులు, హద్దులూ ఉంటాయి. తల్లి-దండ్రుల బాధ్యత, భార్యా-పిల్లల బాధ్యత, వ్యక్తిగతమైన పరిమితి అనేవి ఉంటాయి. కానీ అర్ధాంగి మాత్రం అంతకుమించిన శ్రేయోతత్వం భర్త ఎడల కలిగి ఉంటుంది. శారీరకంగా, మానసికంగా, బౌద్ధికంగా తనకంటూ ఓ జీవితం ఉంది అంటే అది తన భర్త ఆశల, ఆశయాలను సాకారం చేసేటందుకు ఉపయోగపడటంలోనే ఉంది. అని నమ్ముతుంది భార్య. ఇంతకంటే త్యాగశీలి అయిన స్నేహితురాలు ఎవరికైనా లభించడం దుర్లభమే కదా ?
* జీవిత భాగస్వామిని ఎంచుకునే కొలమానాలే, ఆ తర్వాత జరిగే వక్రపరిణామాలకు కారణాలవుతున్నాయి.
* ఎంతో నిదానంగా, ఎన్నో రకాలుగా ఆలోచించి, జాగ్రత్తగా భాగస్వామిని ఎంచుకోవాలి. కానీ అదేమి విచిత్రమోకానీ ఆ విషయంలో కూడా అతి వేగమే. సన్నిహితులకు చెప్పేదానికి కూడా టైం ఉండదు. పిలువవలసిన వారిని పిలిచేదానికి కూడా టైం ఉండదు. ఇలా చూచాం - అలా వచ్చేశాం - ఏదోలే అయిపోయింది అంటూ ఉన్నారు అందరూ ఈనాడు.
* గుణమెరిగి చుట్టరికం - స్థలమెరగి నివాసం చేయాలి.
* ఎంత సున్నితమో అంత దృఢమైనది. పండితే ఎంత మధురమో, అమృతతుల్యమో... చెడితే అంత విషతుల్యం. అదే ! దాంపత్య జీవితం.
* మనుషులు ఇద్దరైనా-మనసులు రెండైనా జీవితం మాత్రం ఒకటిగా సాగింపచేసేదే బెటర్ హాఫ్.
* ఇంటిని చూచి ఇల్లాలిని-తల్లిని చూచి పిల్లను చూడాలి.
* దూరంగా ఉన్న భర్తనూ, దగ్గరగానున్న బ్రహ్మచారినీ నమ్మరాదు.
* అన్నింటికీ పరిష్కారం దొరికింది. ఎలా జీవించాలన్న దానికి తప్ప.
* పుణ్యంకొద్దీ పురుషుడు, దానంకొద్దీ సంతానం.
* ఆడది కోరుకునే వరాలు రెండే రెండు - చల్లని సంసారం, చక్కని సంతానం.
* తండ్రి తప్పులెరుగు, ఓర్వలేని వాడు ఒప్పులెరుగు.
* ఇప్పటి యువతరం కామాన్ని, ఆకర్షణను ప్రేమ అనుకుంటున్నారు. జాలీగా గడపడానికే ఉపయోగించుకుంటున్నారు.

భార్యాభర్తల ఛోలోక్తులు

* స్వాతంత్ర్యం కోసం ఎంతో పోరాడాను

  ప్చ్... ఏం లాభం? మా ఆవిడ ఇవ్వలేదు.

* మీరు ఎన్ని ఉద్యోగాలైనా మారండి. ఇంట్లో మాత్రం అదే బాస్ కిందనే పని చేయాల్సి ఉంటుంది.

* ప్రమోషన్ రాలేదని ఫీలవుతుంటే... బాధపడకండి ప్లీజ్ - 'మీరొక్కరేనా ఏంటి, తెలివితక్కువవాళ్ళు ఈ ప్రపంచంలో ఇంకా చాలామందే ఉన్నారు. అంది మా ఆవిడ ఓదార్పులాంటి వెక్కిరింతతో.

* ఈ మధ్య కాశీకి వెళ్ళినపుడు ఏదైనా వదిలెయ్యాలని చెప్పారు. మా ఆవిణ్ణి వదిలేద్దామనుకున్నా... కానీ బాగా ఇష్టమైనదాన్నే వదిలెయ్యాలట! అందుకని ఊరుకున్నా.

భార్య: నేను న్యూస్ పేపర్‌ను అయితే ఎంత బాగుణ్ణు... రోజూ మీరు నన్ను చేతుల్లోకి తీసుకునే వాళ్ళు కదా!

భర్త :- చాలా బాగుండేది. అపుడు రోజూ కొత్త పేపర్ చేతికొచ్చేది.

వీధి అరుగుమీద కూర్చొని భార్యాభర్తలు మాట్లాడుకుంటున్నారు. అంతలో అక్కడికి ఓ గాడిద వచ్చింది. భార్యను ఆటపట్టించాలని ఏమోయ్ మీ చుట్టం వచ్చింది చూడు అన్నాడు భర్త. భార్య ఓ క్షణం తేరిపారచూచి రండి రండి అత్తగారూ! చాలా రోజులకొచ్చారు. మా మామగారు రాలేదా? అంది గాడిద దగ్గరగా వెళ్ళి.

* భార్యతో గొడవ పడ్డాక భర్త పూజగదిలోకి వెళ్ళి దేవుడా! నేనీ బాధలు భరించలేను. నన్ను త్వరగా నీ దగ్గరకు తీసుకో అని మొరపెట్టుకున్నాడు. అంతలో భార్యకూడా అక్కడికి వచ్చి, స్వామీ! నన్నూ తీసుకుపో అంది. భర్త ఓ క్షణం ఆలోచించి మళ్లీ అన్నాడు. పోనీలే స్వామీ, నన్నొదిలేసి, నా భార్యను తీసుకుపో చాలు.

* వందరూపాయలు కావాలని భర్తను అడిగింది సుజాత. కాసేపు గొణిగి, చివరకు డబ్బు తీసి ఇస్తూ "డబ్బు విలువ బొత్తిగా తెలియదు నీకు. అసలు నీక్కావాల్సింది డబ్బుకాదు. కాసిన్ని తెలివితేటలు" అన్నాడు.

నిజమేననుకోండీ. కానీ మీ దగ్గర ఏది ఉంటే అదే అడగాలి కానీ, లేనివి అడిగితే మీరు మాత్రం ఏం చేస్తారు? ఎక్కడినుండి తెస్తారు పాపం. సానుభూతిగా అంది భార్య.

తండ్రి:- పిల్లలూ! ఎవరు అమ్మమాట చక్కగా, బుద్ధిగా విని నడచుకుంటారో వారికే ఈ బహుమతులన్నీ అన్నాడు.

పిల్లలు :- అయితే ఆ బహుమతులన్నీ నీకే నాన్నగారూ అన్నారు.

* మన పెళ్ళై పదేళ్లు దాటినా పిల్లలు లేరు ఇంకో పెళ్ళి చేసుకోవడం, మంచిదనిపిస్తోంది. భార్యతో చెప్పాడు కామేశం.

- మీ మాట కాదంటానా! మంచి కుర్రాణ్ణి చూడండి సిగ్గుపడుతూ చెప్పింది.

* పెళ్ళికిముందు అమ్మాయి చాలా పొదుపు అని చెబితే మంచిదే కదా ! అనుకుని పెళ్ళి చేసుకున్నాను. ఇపుడేమైంది ? పొదుపరి కాదా? దుబారా మనిషా?

- అదేంకాదు. కానీ - గడ్డం చేసుకోవడానికి రేజరూ-బ్లేడు ఎందుకూ? దండగ కత్తిపీట ఉండగా అంటోంది.

రాజు: నీ భార్యకు ఆ కొత్త నర్సింగ్ హోంలో ఆపరేషన్ చేయిస్తున్నావటగా! ఆ డాక్టరుకు ఇదే మొదటి కేసట!

రఘు: తెలుసు. ఆయన అదృష్టవంతుడైతే ఆపరేషన్ సక్సస్ అవుతుంది. నేనే గనుక అదృష్టవంతుడనైతే ఆపరేషన్ ఫెయిల్ అవుతుంది.

నాలుగేళ్ళప్పుడు	-	మానాన్న గొప్పవాడు
ఆరేళ్ళప్పుడు	-	మా నాన్నకు అన్నీ తెలుసు
పదేళ్లప్పుడు	-	నాన్న మంచివాడే కానీ కోపమెక్కువ
పన్నెండేళ్ళప్పుడు	-	నా చిన్నప్పుడు నాన్న నాతో బాగా ఉండేవాడు.
పద్నాలుగేళ్లప్పుడు	-	నాన్న ప్రతిదీ గుచ్చి గుచ్చి అడుగుతాడు
పదహారేళ్ళప్పుడు	-	ఏదడిగినా వద్దంటాడు. నాన్నకు బయటి ప్రపంచం గురించి ఏమీ తెలీదు.
ఇరవై ఏళ్ళపుడు	-	నావల్లకావట్లేదు. నాన్నతో అమ్మ ఎలా వేగుతోందో!
ముప్పై ఏళ్ళపుడు	-	నా కొడుకు అల్లరి ఎక్కువై పోతోంది. భరించలేకున్నా, చిన్నపుడు నేను మా నాన్నకు చాలా భయపడేవాడిని.
నలభై ఏళ్లపుడు	-	నాన్న నన్ను చాలా క్రమశిక్షణతో పెంచాడు. నేనూ నా పిల్లల్ని అలాగే పెంచాలి.
యాభై ఏళ్లపుడు	-	ఒక్కోసారి ఆశ్చర్యం వేస్తుంది. మమ్మల్ని పెంచడంకోసం నాన్న ఎంత కష్టపడ్డాడోనని
అరవై ఏళ్లపుడు	-	మా నాన్న గొప్పవాడు.

నీతి - తండ్రిని అర్థం చేసుకోవడానికి 56 ఏళ్ళు పడుతుందన్నమాట.

కూరగాయలు తెమ్మని పొద్దున్నే భర్త మూర్తిని మార్కెట్‌కు పంపింది కోమలి. అక్కడో సుందరాంగి కనిపిస్తే ఆమెతో మాట కలిపాడు. పరిచయం కాస్తా ముదిరి మ్యాట్నీకి వెళ్లేవరకూ వచ్చింది వ్యవహారం. కూరగాయలు తేవాల్సిన విషయం సాయంత్రం గుర్తొచ్చింది. వెంటనే ఇంటికెళ్లాడు.

పొద్దుట్నించీ ఎక్కడ బలాదూర్లు తిరుగుతున్నారు? కోపంగా అడిగింది కోమలి. ఓ అందమైన అమ్మాయి పరిచయమైంది. రమ్మంటే అలా సినిమాకు వెళ్ళా... నసిగాడు మూర్తి. అంతా అబద్ధం. మీ పేకాట బ్యాచీ మళ్లీ కలసింది. విషయం నాకు తెలిసి పోయిందని అబద్ధాలు చెబుతున్నారు కదూ?

* చనిపోయి పై లోకానికి వెళ్లాడు రామయ్య. అక్కడ తనకు ఆధ్యాత్మిక మార్గం బోధించిన గురువు కనిపించాడు. ఆయన సంపూర్ణంగా వందేళ్ళు బతికి, కొద్దిరోజుల క్రితమే మరణించాడు. అయితే ఆశ్చర్యంగా గురువు ఒడిలో అతిలోక సుందరి అయిన ఒక యువతి కూర్చొని ఉంది. స్వామీ! భూలోకంలో మాకు ఎన్నో నీతి బోధలు చేసి, ఇక్కడ మీరు చేస్తున్నది. ఈపనా? కోపంగా అడిగాడు రామయ్య. శాంతించు-రామయ్యా అన్నాడు స్వామి. మాకు నీతి సూత్రాలు చెప్పినందుకా ఈ భోగం? అన్నాడు రామయ్య. ఇది నాకు లభించిన భోగం కాదు నాయనా! ఆ అమ్మాయికి విధించిన శిక్ష.

* లింగమూర్తి :- భార్యను అదుపులో పెట్టుకునేదెలాగో సెలవిస్తారా స్వామీ ?
  సాధువు :- అదే తెలిస్తే నేను సన్యాసం ఎందుకు పుచ్చుకుంటానురా మూర్ఖా.

* టీచర్ :- ఈజిప్టు మమ్మీలకు ఇండియా మమ్మీలకు తేడా ఏంటో చెప్పండి?
  స్టూడెంట్ :- ఈజిప్టు మమ్మీలను చూసి పిల్లలు భయపడతారు
  ఇండియా మమ్మీలను చూసి డాడీలు భయపడతారు.

* భర్త (కోపంగా) :- నువ్వు నాలోని జంతువును లేపుతున్నావ్
  భార్య :- లేవనీయండి. పిల్లికి ఎవరు భయపడతారు.

* కొడుకు :- అర్థరాత్రి అందరూ మంచి నిద్రలో ఉండగా "నాన్నా! దాహంగా ఉంది నాకో గ్లాసు మంచినీళ్ళు తెచ్చి పెట్టవా"
  తండ్రి :- నీవే లేచి వెళ్లితాగు
  కొడుకు :- మరికొద్దిసేపటికి మరలా - నాన్నా! నీళ్ళు తెచ్చి పెట్టవా ప్లీజ్
  తండ్రి :- మాటిమాటికి నీళ్లడిగితే వచ్చి రెండు తంతా.
  కొడుకు :- నన్ను తన్నడానికి వచ్చేటపుడైనా - ఓ గ్లాసు మంచినీళ్ళు తీసుకురా నాన్నా!

అమ్మానాన్నలకెందుకు వందనం చెయ్యాలి?

* అమ్మలేనిదే జగత్తే లేదు.
* నాన్న లేకుంటే బిడ్డలకు అడ్రస్సే లేదు.
* తినడానికి రెండు రొట్టెలే ఉన్నాయి. తినేవారు ముగ్గురున్నారు.

 'నాకు ఆకలిగా లేదు', మీరు తినండని, ఆ యిద్దరికీ ఆ రెండు రొట్టెలనూ ఇచ్చి, వారి తృప్తీ, సంతోషంలోనే తన తృప్తినీ, ఆనందాన్నీ పొందే అమృత మూర్తే అమ్మ.

* తల్లి నిజం. తండ్రి నమ్మకం.
* అమ్మకంటే రుచిగా, శుచిగా ఎవరూ చేసి పెట్టలేరు.
* అమ్మ ఏకకాలంలో ఎన్నో పనులను చేయగల బహుముఖ ప్రజ్ఞాశాలి.
* చదువు లేకపోయినా, ఎంతో నేర్పుతో, ఓర్పుతో అందరినీ సముదాయించి, సమాధానపరిచే ప్రతిభాశాలి - అమ్మ.
* ఎన్నో విషయాలను ఎంతో బాగా జ్ఞాపకం పెట్టుకొని ఏది ఎవరికి, ఎప్పుడు ఇవ్వాలో, ఎవరికి ఏది చేసి పెట్టాలో, అన్నింటినీ సమకూరుస్తూ, అన్నీ తానే అయి, అంతా తానే అయి, అందరినీ పోషిస్తూ, తాను కొవ్వొత్తిలా కరిగిపోతూ, ఎవ్వరికీ ఏ కొరతా రానివ్వకుండా, అందరి జీవితాలలో ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ, సుఖ-సంతోషాలనూ నింపుతుంది అమ్మ.
* ప్రపంచంలో అమ్మకు మించిన పొదుపరి మరెవ్వరూ ఉండరు.
* భార్యపోతే మరొక భార్యను తెచ్చుకోవచ్చు. కానీ అమ్మపోతే మరొక అమ్మను తెచ్చుకోలేం.
* అమ్మకు ముద్దొస్తే చేతులలోకి తీసుకుంటుంది. ఆడిస్తుంది, లాలిస్తుంది, కోపమొస్తే తిడుతుంది. తప్పుచేస్తే దండిస్తుంది. ఎందుకు చేయకూడదోకూడా చెబుతుంది. ఏమి చేయాలి? ఎలా చేయాలి? ఎలా మాట్లాడాలి? అనే సంస్కారాలను నేర్పుతుంది. అందుకే అమ్మ ఆదిగురువు, ఆమె ఒడే మొదటి బడి.
* బ్రతుకు పుస్తకంలో తొలి పేజీ తల్లి పొత్తిళ్ళలో మొదలవుతుంది. అర్ధరాత్రి, అపరాత్రి, గాఢ నిద్రలో ఉలికిపాటో, కలవరింతో కలిగితే, మృదువైన చేతి స్పర్శ-నేనున్నాగా! అని లాలిస్తుంది. ధైర్యం చెబుతుంది. ఆ చేయే 'అమ్మ'.
* బాధలలో ఉపశమనం కలిగించేది 'అమ్మా' అనే మాటే !
* కనీ, పెంచి, పోషించే అమ్మ, కనిపించే 'బ్రహ్మ'
* రాయితగిలి పడబోయినప్పుడు 'అమ్మా' అనే పిలుపు తప్ప, ఏ దేవుని పేరూ నోటరాదు.

* పదిమంది ఉపాధ్యాయులకంటే ఒక ఆచార్యుడు, నూరుగురు ఆచార్యులకంటే తండ్రి, తండ్రికంటే తల్లి వేయిరెట్లు పూజ్యురాలు.
* ఏనుగంత తండ్రికంటే, ఏకంత తల్లి ఉండుటే మేలు
* అమ్మకు మించిన త్యాగమూర్తి మరెవ్వరూ ఉండరు. అందుకే అమ్మ అందరికీ 'బాస్'. అందుకే అమ్మకు వందనం - పాదాభివందనం.

అమ్మ ఒడి మొదటి బడి - అమ్మే మొదటి గురువు

గర్భంలో ఉన్న బిడ్డకు తల్లి ఆలోచనలు, భావాలే వస్తాయి. ఆమెలో భయం, పిరికితనం, ఆవేశం లాంటి ఆలోచనలు ఉంటే సంతానానికికూడా అవే వస్తాయి. ఆమెలో ధైర్యం, భక్తి భావనలు ఉంటే ఆ గుణాలే బిడ్డలకు వస్తాయి. ఇందుకు పురాణ కథలే ఆధారాలు.

రాణీ మదాలస మహారాజు రుషభధ్వజుని భార్య. ఆమెకు ముగ్గురు సంతానం. తన బిడ్డలకు బాల్యం నుండే ఉగ్గుపాలతో ఆత్మజ్ఞానం బోధించింది. అందువలన ముగ్గురు పుత్రులుకూడా రాజరికపు లక్షణాలను వదలి యుక్తవయసులోనే అడవులకు వెళ్ళి తాపసులైపోయారు. రాజుకు తన వంశం నిలబడదేమోనన్న చింత పట్టుకుంది. రాణీతో "మన ముగ్గురు కుమారులనూ యోగీశ్వరులను చేశావు. మరి మనవంశం నిలబడేదెలాగ? ఈ రాజ్యానికి వారసులే లేకుండా చేస్తావా? అని భార్యను అడిగాడు. రాణి మహారాజు ఆవేదనను అర్థం చేసుకొని నాలుగవ సంతానం గర్భంలో ఉండగానే తన మనసును ఆధ్యాత్మిక చింతననుండి మార్చుకొని సకల సద్గుణసంపన్నుడైన క్షత్రియ పుత్రుడికి జన్మనిచ్చింది. ఆవిధంగా మహారాజుకు సంతోషాన్ని కలిగించడమేకాక కుమారుడికి వీరోచిత లక్షణాలను ఉపదేశించింది.

"నాయనా శత్రురహితుడవై, ఈ రాజ్యాన్ని పరిపాలించు. మిత్రులను ఆదరించు. ప్రజలను బాధ్యత తెలిసిన పౌరులుగా తయారయ్యే విధంగా పరిపాలించు. సాధువులను, శ్రేష్ఠులను గౌరవించు, గోవులను కాపాడు. అవసరమైతే మాతృ భూమికోసం, నీ ప్రజలకోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధపడు" అని బోధించింది.

ఈ విధమైన ఉదాహరణలెన్నో మనకు ఇతిహాసాల్లో దర్శనమిస్తాయి. గర్భంలో ఉన్న శిశువుమీద తల్లుల మనస్తత్వం, ఆలోచనా తీరు, వారి సంస్కారాల ప్రభావం తప్పక పడుతుందని మహర్షులు ఏనాడో సెలవిచ్చారు. సంతానాన్ని తీర్చిదిద్దగలిగే శక్తిని తల్లికి వరంగా ప్రసాదించింది ప్రకృతి. తల్లినుండి సంతానానికి లభించే జ్ఞానం, స్వభావం మరెవరివలనా లభించదు. తల్లి చూపించే ప్రేమ, త్యాగం, వాత్సల్యం, మరెవరూ చూపించలేరు.

తల్లి హితవచన ప్రభావం

నలంద, తక్షశిల పట్టణాలు చదువుల కేంద్రాలుగా ఉన్న రోజులలో సుదర్శనవర్మ అనే బాలునికి కూడా అక్కడకి వెళ్ళి పెద్దచదువులు చదవాలని కోరిక కలిగింది. కానీ తల్లికి మాత్రం తన కుమారుడు పెద్ద చదువులు చదవాలని కోరిక ఉండినప్పటికీ అంతదూరం పంపడం ఇష్టం లేదు. సుదర్శనవర్మ చాలా నిరాశకు లోనై దిగులుపడ్డాడు. కుమారుడు దిగులుగా ఉండడం చూడలేక చివరికి కుమారుడు పట్టణానికి వెళ్ళి చదువుకోవడానికి ఒప్పుకుంది తల్లి.

ఆ రోజులలో ఎంతదూరమైనా కాలినడకనే ప్రయాణించాలి. దారిలో దోపిడీ దొంగల భయంకూడా ఎక్కువే. అందుకని ప్రయాణికులు ఒంటరిగా కాక, గుంపులుగా వెళ్ళేవారు. సుదర్శనవర్మకూడా ఒక గుంపుతో వెళ్ళడానికి నిశ్చయమైంది.

కుమారునితో నాయనా! మీ తండ్రిగారు మరణించేనాటికి సంపాదించినది ఇదే అని వందనాణాలను చేతిలో పెట్టింది. చివరగా తన కొడుకుతో నాయనా! సొమ్మును జాగ్రత్తగా ఖర్చు పెట్టు. ఎప్పుడూ ఎక్కడా అసత్యం చెప్పవద్దు. ప్రాణాల మీదకు వచ్చినా సరే ఎప్పుడూ నిజమే చెప్పు. నీకు మంచి జరుగుతుంది. అని చెప్పి సాగనంపింది.

తల్లిమాటలను బాగా గుర్తుంచుకొని సుదర్శనవర్మ తక్షశిలకు బయల్దేరాడు. ఒక అర్థరాత్రి బందిపోటు దొంగల ముఠా వచ్చి పడ్డారు. అందరిని తాళ్ళతో కట్టిపడేశారు. తెల్లవారిన తర్వాత ఒక్కొక్కరినే బెదిరించి, సోదా చేసి ఉన్న సొమ్మునంతా దోచేసుకున్నారు. మాసిన బట్టలతో ఉన్న సుదర్శనవర్మను మొదట ఎవరూ పట్టించుకోలేదు. కానీ చివర్లో ఒక దొంగ ఏరా నీ దగ్గర ఏముంది? అని అడిగాడు. నా దగ్గర వంద నాణాలున్నాయి అని నిబ్బరంగా చెప్పాడు సుదర్శనవర్మ. ఊరకనే చెపుతున్నాడేమో కుర్రవెధవ అనుకొని నిజంచెప్పవోయ్ అని గద్దించాడు ఆ దొంగ. నిర్భయంగా తన చొక్కాజేబీలో నుంచి నాణేల సంచిని తీసి ఇదిగో అని చూపించాడు. ఆ దొంగ ఆశ్చర్యపడి ముఠా నాయకుడి దగ్గరికి తీసుకెళ్ళి జరిగింది చెప్పాడు.

ముఠానాయకుడు ఆశ్చర్యంతో ఏరా చంటోడా! మేం దొంగలమని తెలుసుకున్నావు కదా? అయినా నీ దగ్గర డబ్బుందని ఎందుకు చెప్పావు? అని అడిగాడు.

మా అమ్మ నాకు "ప్రాణం మీదకు వచ్చినా సరే, అబద్ధం మాత్రం చెప్పవద్దు" అని చెప్పి పంపించింది. అందుకే నిజం చెప్పాను అన్నాడు సుదర్శనవర్మ. ఆ మాట విన్న దొంగల ముఠా నాయకుడికి హృదయం చలించిపోయింది. కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి. సుదర్శనవర్మ దగ్గరికి వచ్చి తన గుండెలకు హత్తుకుని, చిన్నవాడివైనా నువ్వు చాలా గొప్పవాడివి. నేనెంతో దుర్మార్గుడిని. జీవితమంతా దోపిడీలు, దొంగతనాలు, హత్యలు చేస్తూ ఎన్నో పాపాలు చేశాను. ధైర్యసాహసాలున్నా, ఎన్నోసార్లు

అబద్ధాలాడుతూ బ్రతికాను. అంటూ పశ్చాత్తాపంతో కన్నీరు పెట్టుకున్నాడు. అతని మనసు మారిపోయింది. దోచుకున్న సొమ్మునంతా తిరిగి ఇచ్చేశాడు. సుదర్శనవర్మను తానే స్వయంగా తక్షశిలానగరానికి తీసుకెళ్ళాడు. తన సంపాదనంతా పేదవాళ్ళకు పంచిపెట్టాడు. కష్టపడి పనిచేసుకుంటూ నిజాయితీగా జీవించసాగాడు.

తల్లి హితవచనాలు బిడ్డల హృదయంలో పదిలంగా నిలిచిపోతాయి. అలాగే తండ్రి తన వ్యక్తిత్వంతో కర్తవ్య నిర్వహణ, వచనపాలన, సత్ప్రవర్తన, సుఖదుఃఖాలలో సమభావంతో ఉండడం, జీవితంలో ఎదురయ్యే సంఘటనలను మనోధైర్యంతో ఎదుర్కోవడం అనే ధీరత్వాన్ని సంతానానికి కలిగించాలి.

* పిల్లల ప్రవర్తన ఎలా ఉంటే బాగుంటుంగని ఆశిస్తారో, దానికి అనుగుణంగా పెద్దల ప్రవర్తన ఉండాలి.
* ఆవు చేలోమేస్తే దూడ గట్టున మేస్తుందా?
* ముష్టిగింజలు నాటి మామిడికాయలను ఆశించలేముకదా?

బాల్యంలోనే నైతికవిలువల పునాది పడాలి

మహాత్మాగాంధీ ప్రాథమిక పాఠశాలలో చదివేటపుడు ఒక పర్యవేక్షణాధికారి వచ్చాడు. కొన్ని ఆంగ్లపదాలు చెప్పి వాటిని పలకమీద వ్రాయమని విద్యార్థులకు చెప్పాడు. గాంధీకి 'కెటిల్' అనే పదానికి స్పెల్లింగ్ తెలియక దానిని వ్రాయకుండా వదలిపెట్టాడు. అది గమనించిన తరగతి ఉపాధ్యాయుడు ప్రక్క విద్యార్థిని చూసి వ్రాయమని గాంధీకి సైగ చేశాడు. కానీ గాంధీ అలా వ్రాయడం తప్పని భావించి వ్రాయలేదు.

బాల్యం నుండే సత్యహరిశ్చంద్రుడు, రామాయణ, భారత, భాగవతాది కథలను విన్న ప్రభావంతో గాంధీ అలా చూచి వ్రాయడం తప్పనీ, ఉపాధ్యాయుడు సైగచేసి, అనుమతిచ్చినా వ్రాయకూడదని నిశ్చయించుకున్నాడు. చిన్నతనం నుండే అలవడిన నైతిక ప్రవర్తన ప్రభావం అలా ఉంటుంది.

ఇంట గెలిచి రచ్చగెలవాలి

చాలామంది పెద్దలు, పిల్లలు కూడా ఇంట్లో పనులు చెయ్యకుండా బలాదూరుగా తిరుగుతూ ఉంటారు. ఇంట్లో వున్న కుటుంబ సభ్యులందరికీ బాధ్యతలూ-హక్కులూ ఉంటాయి. కొందరు బాధ్యతలు మరచి హక్కుల కోసమే పోరాటం చేస్తూ ఉంటారు. చెయ్యవలసిన పనిని చెయ్యకుండా తప్పించుకుంటూ ఉంటారు. వీడు చేస్తాడని వాడు, వాడు చేస్తాడని వీడు ఒకరిమీద ఒకరు నెట్టివేసుకుంటూ, చివరికి ఎవరూ ఏపనీ చేయకుండా తప్పించుకుంటూ ఉంటారు.

కొందరు పరాయివారి కోసమే తామున్నట్లుగా, పరోపెత్తనం మీద వేసుకొని "వెయ్యిళ్ల పూజారి"లా తిరుగుతూ, పెద్దవారిపై తిరగబడుతూ, తల్లిదండ్రుల సహనాన్ని

చేతగాని తనంగా భావిస్తూ, తమ అసమర్థతను, పనికిరాని పనులను సమర్థించుకుంటూ, దండగ తిండితింటూ తమ బ్రతుకులను సాగించేస్తూ ఉంటారు.

తప్పులను ఎత్తిచూపినపుడు, ఫలానావాడు అలా చేస్తున్నాడు. ఫలానావాడు ఇంత ఖర్చు పెడుతున్నాడు, నేనే చాలా మేలు! మేమేమైనా బానిసలమా? మాకు స్వేచ్ఛలేదా? మీ సంతోషానికేకదా మమ్ములను కన్నారు. మేమేమన్నా మమ్ములను కనమన్నామా? కన్నపాపానికి మీరే బాధ్యులు, అని వింత, విపరీత మాటలతో మనసును కుళ్ళబొడిచే నీచ సంతానంగా, ఈనాడు తయారవుతున్నారు. తల్లిదండ్రులుకూడా సంపాదనపైనే దృష్టిపెట్టి, లేనిపోని ప్రయాసలు పడుతూ, సరి అయిన రీతిలో పిల్లలను పెంచకుండా విస్మరించి, చివరికి కుటుంబానికీ, సమాజానికీ కంటకులుగా తయారు చేస్తున్నారు.

ఈనాడు తల్లిదండ్రులకు పిల్లలు పెద్ద తలనొప్పిగా తయారువుతున్నారు. దీనికి ఈనాటి సమాజం, చదువులు, సినిమాలు, టి.వి. సీరియళ్ళు ఇలా ఎన్నో కారణాలున్నా, ముఖ్యమైనది తల్లి-దండ్రుల,పెంపకమే. పెద్దవారు నిజంగా పెద్దమనసుతో, మంచి అలవాట్లతో, పెద్దరికాన్ని కలిగివున్నారా? చూపెడుతున్నారా? "అందరూ పెద్ద మనుషులుగా చెలామణి అవుతున్న సగటు మనుషులే" అన్నట్లుగా పెద్దలు పెద్దవారుగా నటిస్తున్నారేగానీ, జీవించడం లేదు. సంపాదించడంలో ఎన్నెన్ని చెడు ఆదాయ మార్గాలను ఎంచుకుంటున్నారు? ఏ రోజైనా పవిత్రంగా గడుపుతున్నారా? ఒక్కసారి దినచర్యను తిరగేసి చూచుకుంటే? ఏముందీ! అంతా పాపాల చిట్టాయే. మరి పిల్లలకు ఏం చెబుతాం? పిల్లలు తల్లిదండ్రుల ప్రతిబింబాలు. కాబట్టి తల్లి-దండ్రులు సక్రమమైన మార్గంలో జీవిస్తూ, ఆదర్శవంతులుగా ఉంటూ, పిల్లలను సక్రమమైన మార్గంలో పెంచాలి.

వంశానికి వారసులమనీ, తల్లిదండ్రులే తమకు చిరునామా అనీ, వారు లేకుంటే తమ నామరూపాలు లేవని పిల్లలు గుర్తించడం లేదు. బాధ్యతలను చక్కగా నెరవేర్చేవాళ్ళు, వంశ గౌరవానికి, పుట్టిన వూరికి మంచిపేరు తెచ్చిన వారెందరో ఉన్నప్పటికీ వారిని ఆదర్శంగా తీసుకోవడం లేదు.

కష్టపడడం ఇష్టం లేక, చేతకాక "కష్టేఫలి" అనే సూక్తిని విన్నాకూడా విననట్లు, జీవితంలో నటిస్తూ ఇంటివాతావరణాన్ని వీలున్నంతవరకూ కలుషితం చేస్తూ "నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు" "నా చిన్న పొట్టే నాకు శ్రీరామరక్ష" "తప్పించుకొని తిరుగువాడు ధన్యుడు" "ఇరుక్కున్నవాడు ఇంగితం లేనోడు" అని చెబుతూ మరికొంత మందిని పోగేసుకొని, "తాచెడ్డ కోతి వనమెల్ల చెరచున్" అని యథాశక్తి తమ చుట్టూ ఉన్న వారిని తమలో కలుపుకుంటూ చెత్త మనుషుల సంఖ్యను మరింత పెంచుతున్నారు.

పెద్దవారుకూడా తమ బాధ్యతల నెరిగి ప్రవర్తిస్తూ ఉండాలి. పిల్లలు పెద్దవాళ్లై మీరు మాకేం చేశారు? మాపట్ల మీరు సరైన వైఖరిని చూపెట్టలేదు అని ప్రశ్నించకుండా జాగ్రత్తపడాలి. పిల్లల అవసరాలను గుర్తించి తీర్చాలి. పిల్లలకు తల్లి-దండ్రులు వారసత్వంగా ఇవ్వవలసింది మొదట ఆరోగ్యం, తర్వాత సంస్కారాలు, తర్వాత చదువు-జ్ఞానం.

మా తల్లిదండ్రులు చాలా మంచోళ్ళు తెలుసా? అని ఇతరులకు మన పిల్లలు చెప్పుకునేటట్లుగా పెద్దవారు అర్హతలను సంపాదించుకోవాలి. మంచి చేస్తే ప్రోత్సహిస్తారనే ధీమా, తప్పుచేస్తే దండిస్తారనే భయం, మంచిస్థాయికి ఎదగాలనే శ్రద్ధ పిల్లల్లో కలిగించాలి.

పిల్లలు ఈనాడు బౌద్ధికంగా చాలా వేగంగా ఎదుగుతున్నారు. మానసికంగా, బలహీనతలకు లొంగిపోతున్నారు. మానసిక దృఢత్వాన్ని, ఇంద్రియ నిగ్రహాన్ని ఏనాడో గాలికి వదలివేశారు.

పాత రోజులలో బాల-బాలికలకు పేర్లు పెట్టేటపుడు పేరు చివరన అమ్మ, అయ్య అని తగిలిస్తూ ఉండేవారు. (లక్ష్మమ్మ, సరస్వతమ్మ, నారాణమ్మ అనీ, బాలయ్య, నారయ్య, బ్రహ్మయ్య, గోవిందయ్య) కానీ ఈ రోజులలో పిల్లల పేర్లలో అమ్మ అయ్య అనేవి నామోషీగా, మొరటుగా భావిస్తున్నారు. ఈవిధంగా అమ్మాయిలలో అమ్మతనాన్ని అబ్బాయిలలో అయ్యతనాన్ని తీసేస్తున్నారు. ఇక పెద్దమనసున్నవారుగా కానీ, పెద్ద మనిషిగాకానీ ఎలా అవుతారు?

ఏ తల్లిదండ్రులూ తమ పిల్లలను దీన-హీన స్థితిలో చూడాలని కోరుకోరు. తల్లిదండ్రులు తమ ప్రవర్తనపై, తమ జీవన మార్గాలపై జాగ్రత్త వహించకపోయినా, తమ సంతానాన్ని మాత్రం, మంచి స్థితిలోనే చూడాలని కోరుకుంటూ ఉంటారు. తాము తిన్నా తినకపోయినా ఉన్నంతలో తమ సంతానానికి అన్నీ సమకూరుస్తారు. కానీ పిల్లలు మాత్రం ఈరోజులలో తల్లి-దండ్రులనే శత్రువులుగా చూస్తున్నారు. పిల్లలకు ఈనాడు జీవిత లక్ష్యం లేదు. సులభంగా బతికెయ్యాలి. ఏమాత్రం కష్టపడకూడదు. వారి జల్సాలకు, వారి తిరుగుళ్ళకు అడిగినంత అందివ్వాలి. బాగా చేసి పెట్టాలి. ఏ చిన్నకష్టం వచ్చినా, సహించలేక తప్పంతా తల్లి-దండ్రులదే అన్నట్లు వితండవాదం చేస్తున్నారు.

పిల్లలంతా బాధ్యతలను మరచి, హక్కుల కోసమే జీవిస్తే అందరి జీవితాలూ, ఇంటి వాతావరణం కలుషితమైపోతుంది. కాబట్టి సమస్త సద్గుణ, దుర్గుణాలకూ ఇల్లే ప్రథమ వాతావరణం. ఇంట్లో ఎవరైతే తల్లి-దండ్రులకు సహకరిస్తూ మంచి వాతావరణం ఉండేటట్లుగా దోహదపడతారో, వారే తరువాత గొప్ప నాయకులుగా, కార్యదక్షులుగా మంచి యజమానులుగా, ప్రసిద్ధికెక్కుతారు. అందుకే "ఇంటగెలిచి రచ్చ గెలవాలి". అంటూ ఉంటారు.

* తల్లిదండ్రులు భోగలంపటులై, పుత్రులు యోగులు కావాలనుకోవడం "జిల్లేడు చెట్లకు మల్లెలు పూయాలని ఆశించినట్లే".
* స్త్రీ పాతివ్రత్యాన్ని నిలుపుకుంటే సత్ప్రజకు జన్మనివ్వగలదు. అలాగే పురుషులు ఎవరికివారు బ్రహ్మచర్యం పాటిస్తే దృఢమైన సంతానాన్ని సమాజానికి అందివ్వగలరు.

తన కన్నవాళ్లు తనను అశ్రద్ధ చేసినపుడే తనను కన్నవాళ్ళమీద తనకు శ్రద్ధపుడుతుంది

ఒక ఊరిలో సుమన్ అనే బాలుడు ఉండేవాడు. అతనికి తన ముసలి తాతయ్య అంటే చాలా ప్రేమ. సంవత్సరం క్రితం సుమన్ నాయనమ్మ చనిపోయింది. అందుకని ఆయన తన కొడుకు వద్దకే వచ్చి ఉంటున్నాడు. సుమన్ తల్లికి తాతయ్య అంటే సరిపడేది కాదు. తాతయ్య ఒంటరితనాన్ని ఆమె గ్రహించలేకపోయింది. ఏ చిన్న పొరపాటు జరిగినా ఆమె తాతయ్యపై అసహనంతో విరుచుకుపడేది.

ఒకనాడు తాతయ్య పాలు తాగుతుండగా చేతులు వణికి గ్లాసు కిందపడి పగిలి పోయింది. అది చూచిన సుమన్ తల్లి, తాతయ్యపై కోపాన్నంతా వెళ్ళగక్కింది. తాతయ్య దీనావస్థను చూచి సుమన్ చాలా నొచ్చుకున్నాడు. తాతయ్య ఎంత ఓర్పుగా ఉన్నా, కళ్ళలో మాత్రం విచారం కనిపించేది. తను మాత్రం తాతయ్యతో ప్రేమగా, స్నేహంగా ఉంటూ చక్కగా కబుర్లు చెబుతూ, తాతయ్య చెప్పే కథలు వింటూ, సఖ్యతగా ఉండేవాడు. తాతయ్య మరింత ముసలివాడయ్యాడు. ఒకనాడు తను తినే ప్లేటు పొరపాటున క్రిందపడి, అన్నం క్రింద పడిపోయింది. పాత్రకు నొక్కుకూడా పడింది. సుమన్ తల్లిదండ్రులు ఇద్దరూ అది చూచారు. ఆయనను అనరాని మాటలు అన్నారు. ఇక మీదట క్రిందపడినా పగలని కొయ్య పాత్రలో అన్నంపెడితే సరిపోతుంది. అన్నది సుమన్ అమ్మ.

తర్వాత సుమన్ ఒక కొయ్యను తెచ్చి దానిని తొలిచి ఒక గిన్నెగా చేశాడు. ఇంతలో సుమన్ తల్లి-దండ్రులు వచ్చి ఏం చేస్తున్నావురా? అని అడిగారు. అమ్మా మీరు కూడా ముసలి వాళ్ళయినప్పుడు, పగలకొట్టకుండా మీకు పనికొస్తుందని ఈ కొయ్యగిన్నెను తయారు చేశాను అన్నాడు. కుమారుడి సమాధానంతో ఆమె "తనకు కూడా చిప్పకూడు గతే పడుతుంది" అని తెలుసుకొని, తన తప్పును గుర్తించి పశ్చాత్తాప పడింది. ఆనాటినుండి ఆమె తాతయ్యకు అందరితో పాటు సమానంగా భోజనం పెట్టేది. ప్రేమగా చూచేది. సుమన్‌కు కూడా తన తల్లిదండ్రులపై గౌరవం పెరిగింది.

బంధాలు తెగిపోతున్నబంధుత్వాలు

మనిషి ఒంటరివాడు కాదు. పుట్టుకతోనే మనిషికి కుటుంబంతో బంధం, రక్తసంబంధీకులతో అనుబంధం ఏర్పడుతుంది. అమ్మతరపు వారితోనూ, నాన్న తరపు

వారితోనూ మరెందరితోనో బంధాలు ఏర్పడతాయి. నిత్యం, రాకపోకలతో, కష్టసుఖాలలో తోడూ నీడగా ఉంటూ ఏ కష్టం వచ్చినా వెంటనే వచ్చి సమయానుకూలంగా స్పందించి ధైర్యం చెప్పి, ఓదార్చి, వెన్నుతట్టి మేమున్నాం పరవాలేదు, భయపడవద్దు అని చెప్పేవారే ఆత్మీయులు. వారితో సన్నిహిత సంబంధమే అనుబంధం, శుభ-అశుభకార్యాలకు వచ్చి ఆసాంతం కార్యాలన్నీ సజావుగా అయిపోయిన తర్వాత వెళ్లేవారే బంధువులు, ఆత్మీయులు. సాధారణంగా వస్తూ పోతూ ఉంటేనే, ఇచ్చి పుచ్చుకోవడాలు ఉంటేనే బంధాలు బంధుత్వాలు కొనసాగుతుంటాయి.

పెళ్లి అనే బంధంతో క్రొత్త కుటుంబాలతో సంబంధ - బాంధవ్యాలు ముడిపడతాయి. రాకపోకలతో పరామర్శలతో బంధం ఏర్పడుతుంది. నిజాయితీ, పరస్పర విశ్వాసం ఆత్మీయతాను రాగాలను బలపరుస్తాయి.

ఆత్మీయత అనేది మనిషికి ఎంతో అవసరం. కష్ట-సుఖాలలో ఎవరు ఆత్మీయులో ఎవరు కాదో తెలిసి పోతుంది. ఆత్మీయత అనేది ఒక ఓదార్పు, ఒకధైర్యం, దప్పికను తీర్చే చల్లని మంచినీరు వంటిది. ఆత్మీయతను పంచే బంధువులున్నవారు చాలా అదృష్టవంతులు.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలలో ఇలాంటి ఆత్మీయతలు బాగా కనిపించేవి. అక్కలు-బావలు, వారి పిల్లలు వస్తే ఇల్లంతా సందడి సందడిగా పండుగ వాతావరణాన్నే తలపించేది.

వ్యవసాయం ముఖ్యవృత్తిగా ఉన్న రోజులలో బంధువులకూ, బంధుత్వాలకూ ఎక్కువ ప్రాముఖ్యం ఉండేది. వ్యవసాయం పదిమంది కలసి చేస్తేనే అవుతుంది. పది చేతులు కలిస్తేనే పంట ఇంటికి చేరుతుంది. ఈనాడు చదువులు ఎక్కువైనందున వ్యవసాయ కుటుంబాలు బాగా తగ్గిపోయాయి.

వేసవి సెలవులు వస్తున్నాయంటే ఒకప్పుడు పిల్లలకు నిద్రపట్టేదికాదు. ఎప్పుడెప్పుడు సెలవులిస్తారా! అమ్మమ్మ ఊరికో, అక్కాబావల ఊరికో వెళ్ళవచ్చునని లేదా మనింటికి చుట్టాలు, వారి పిల్లలు వస్తారని వాళ్ళతో బాగా ఆడుకోవచ్చునని చాలా ఇష్టంగా ఎదురు చూచేవారు. ఇలా వేసవి సెలవులు బంధువుల రాకపోకలకు ఒక వారధిగా ఉండేవి. ఈనాడు పిల్లల చదువుల పేరుతో, ఉద్యోగాల నెపంతో రాకపోకలు చాలా వరకు లేకుండా పోయాయి. ఆ రాకపోకలూ, ఆ ఆత్మీయతలు ఈనాటి తరంవారికి తెలియకుండా పోయాయి.

"పరాయి చేతుల్లో కిరాయి పెంపకాలు" అన్నట్లు హాస్టల్ జీవితమయిపోయింది అందరి పిల్లలకు. దీనివల్ల "ఎవరికివారే యమునాతీరే" అన్నట్లుగా-ఎవరికి వారైపోయారు. ఫలానా వారెవర్రా అంటే "ఆంటీ" "అంకుల్" అని సరిపెట్టుకుంటున్నారు. తిండి, నిద్ర, చదువు, సంపాదన ఇదే అందరి రోజువారీ జీవితం. మనిషి ఒక యంత్రంగా మారిపోయి బ్రతుకుతున్నాడు.

ప్రేమ, ఆప్యాయత, ఆత్మీయత, అనురాగం అనేవి హృదయానికి శాంతిని, ఓదార్పును కలిగిస్తాయి. జీవితానికి తప్పనిసరిగా ఉండవలసినవి. ఇవి కేవలం కుటుంబ సభ్యులతోనూ, బంధు మిత్రాదులతోనూ, ఇరుగు పొరుగుతో మాత్రమే సాధ్యం. కానీ దురదృష్టవశాత్తు ఈ సంబంధాలు "యూజ్ అండ్ త్రో", "టేకిట్ ఈజీ పాలసీ"లుగా మారిపోయాయి. ఒకనాడు ఏ వస్తువైనా ఎన్ని రోజులు మన్నితే అంత గొప్ప. "ఓల్డ్ ఈజ్ గోల్డ్". కానీ ఈనాడు ఉపయోగించి పారేస్తే గొప్ప. అదే రోగం మనిషి సంబంధాలకు కూడా అంటుకుంది. ఉపయోగించుకో, వదలి వెళ్ళిపో. తల్లిదండ్రులు కానీ, మరెవ్వరైనా కానీ అంతే. ఇలా చేయవచ్చా? ఇదేంపని? అంటే ఒక వెకిలినవ్వుతో-టేకిట్ ఈజీ, ఏం? అంత సీరియస్ దేనికీ? అని మరో అర్థగోలు ప్రశ్న వేస్తారు. కాన్వెంట్ చదువుల పుణ్యమా అని అమ్మను మమ్మీ, నాన్నను డాడ్ అంటూ ఎవరిని ఎలా పిలవాలో కూడా తెలియక అందర్నీ ఆంటీ, అంకుల్ అంటే సరిపోతుందనే ఇంగ్లీషు సంస్కృతి దాపురించింది.

అతిథి దేవోభవ

నిద్రలేచినప్పటినుండి ఉరుకులు-పరుగులతో పనులు చేసుకోవడం, పిల్లలను స్కూళ్లకు పంపించడం, ఉద్యోగాలకు పోవడం చాలామంది జీవితాలలో కన్పించే సాధారణ దృశ్యమే. వేగవంతమైన జీవన శైలిలో బంధు-మిత్రులు వచ్చినా సమస్యగా భావించే రోజులివి.

"అతిథిదేవోభవ" అనే భావన కుటుంబ సంస్కృతిగా కలిగిన సమాజం మనది. ఇల్లాలు హౌస్ వైఫ్‌గా ఉంటే వచ్చిన బంధువులకు అతిథి మర్యాదలు చేయడంలో కొంతవరకు తృప్తి చెందవచ్చు. కానీ దంపతులిరువురూ ఉద్యోగస్తులైతే...పడుకునే పక్కలు సర్దుకోవడం, దుప్పట్లు మడతపెట్టడం, వంట పనులలో పాత్రలు కడగడం, కూరగాయలు కడగడం, తరగడం, టిఫెన్లు అందించడం, కాలకృత్యాలను తొందరగా కానివ్వడం లాంటి చిన్న చిన్న పనులలో అతిథులుగా వచ్చినవారు చేదోడు వాదోడుగా ఉండాలి. వచ్చిందెందుకు పనులు చేసే దానికా? చాకిరీ చేసేదానికా? అనే భావనతో ఉండకూడదు.

అతిథులుగా వచ్చిన వారితో పనులు చేయించడం, సభ్యతా-సంస్కారం కానప్పటికీ, సర్దుబాటు తనంతో కబుర్లు చెప్పుకుంటూనే పనులు చేసుకుంటూ పోతే ఆత్మీయత -స్నేహం పంచుకున్నట్లు అవుతుంది. సమయమూ కలసొస్తుంది. ఆతిథ్యమిచ్చేవారికీ మానసిక వత్తిడీ ఉండదు.

కొంతమంది బంధువులకు ఇతర విషయాలపై ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ఇంట్లోని వస్తువులపై, ఆస్తులపై అనవసరమైన కూపీ లాగుతుంటారు. అలాంటివారు బంధువులే అయినా జాగ్రత్తగా ఉండాలి. కొంతమంది అలమారాల్లోని కాగితాలను, జాబులను, ఫైళ్ళను, వస్తువులను కలియబెడుతూ, చిందరవందర చేస్తూ వుంటారు.

ఇలాంటి చవుక బారు పనులు చేసేవారు అందరికీ తలనొప్పి తెస్తుంటారు. చూచీ చూడనట్లుంటే ఒక బాధ, హెచ్చరిస్తే ఒక బాధ. అయినప్పటికీ ఇలాంటి పనులుచేస్తూ కంటపడినప్పుడు కఠినంగా, దురుసుగా హెచ్చరించకుండా దేనికోసం వెతుకుతున్నారు? ఏమైనా కావాలంటే నేనిస్తాను అని సంస్కారవంతంగానే వారి తప్పును తెలుసుకునేలా వ్యవహరించాలి. అలా జాగ్రత్తగా వ్యవహరించేదే కాకుండా ముఖ్యమైన వస్తువులను బంధువులకు అందుబాటులో లేకుండా ముందస్తు జాగ్రత్తగా ఉంచుకోవాలి.

కొంత మంది భార్యా-భర్తల మధ్య విభేదాలు సృష్టిస్తుంటారు. మరికొంతమంది భార్యా భర్తల మధ్య ఉండే చిన్న చిన్న మనస్పర్థలను పెద్దవి చేస్తూ, ఎవరో ఒకరికి సానుభూతి మాటలు చెబుతూ, వారి అవసరాలను తీర్చుకుంటూ ఉంటారు. కొందరు తెలివి తక్కువ ఆడాళ్ళు పొగడ్తలకు లొంగిపోయి, ఇంట్లో తీరుబాటుగా కొర్చోబెట్టుకొని, భోజనం కూడా పెట్టి భర్త ఇలాంటివాడు, పిల్లలిలాంటివాళ్ళు అని ఇంటిగుట్టును రట్టు చేసుకుంటూ ఉంటారు.

వచ్చిన చుట్టాలతోపాటి వారివెంట ఒక్కోసారి చిన్న పిల్లలు కూడా వస్తుంటారు. వారిలో ఇల్లు పీకి పందిరి వేసే చిచ్చర పిడుగులు ఉంటారు. వారి దూకుడు భరించలేనిదిగా ఉంటుంది. అలాంటపుడు కోపాన్ని, చిరాకును అదుపులో ఉంచుకొని నిగ్రహంతో, శాంతంగా అనునయిస్తూ, సున్నితంగా అదుపు చెయ్యాలి. ఏమాత్రం నిగ్రహం కోల్పోయినా ఆ పిల్లల తల్లిదండ్రులు నొచ్చుకుంటారు. ఆనందంగా, సంతోషంగా నాలుగు రోజులు గడపాలనుకున్న క్షణాలు కాస్తా బాధగా, విషాదంగా మారిపోతాయి.

కాబట్టి సున్నితమైన ఈ బంధాలు, బంధుత్వాలు "నొప్పింపక తానొవ్వక" "అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలు" లాంటి సూక్తుల ప్రకారం నడచుకుంటే బంధువుల మధ్య అభిప్రాయ భేదాలూ, మొహం తిప్పుకోవడాలూ ఉండవు.

అతి తెలివైన అతిథి

ఒక ఊళ్లో సామాన్య వ్యాపారి ఒకడుండేవాడు. ఇంటికి వచ్చిన అతిథులకు తృప్తిగా భోజనం పెట్టి పంపే అలవాటుండేది. అందుకు అతని సహధర్మచారిణికూడా పూర్తి సహకారాన్నందించేది. "అతిథి దేవోభవ" అనే ఆర్యోక్తిని చక్కగా పాటిస్తున్నారని తెలుసుకున్న దూరపు బంధువు ఒకడు, ప్రతిరోజూ ఠంచనుగా వేళకు వచ్చి సుష్టుగా భోంచేసి వెళుతూ ఉండేవాడు.

ఒకేవ్యక్తి ప్రతిరోజూ ఇలా భోం చేసి వెళ్ళడం ఆ దంపతులకు కాస్త విసుగు కలిగించింది. తమ మంచితనాన్ని తెలివిగా ఉపయోగించుకుంటున్నాడని తెలుసుకున్నారు. సూటిగా ముఖం మీదే చెప్పగలిగే గట్టిదనం లేక, కొద్దిరోజులు సతమతమయ్యారు. చివరికి ఒక పథకం వేశారు.

అతిథి వచ్చే సమయానికి భార్య భర్తలు ఇద్దరూ పోట్లాడుకుంటే అది చూచి అతను వెళ్ళిపోతాడనుకున్నారు. ఆ ప్రకారంగానే భార్య ఏదో వదరుతూ, గొణుగుతూ ఉంది. భర్త కొడుతూ ఉన్నాడు. ఇది గమనించిన అతిథి పుంగవుడు చల్లగా జారుకున్నాడు. తమ పథకం బాగా పారినందుకు వారెంతో సంతోషించారు. ఏమండీ! నేనునిజంగానే తిట్టినట్టే తిట్టాను కదండీ? అని భార్య, నేను నిజంగా కొట్టినట్లే కొట్టాను కదే? అని భర్త మురిసిపోతూ ఉండగా, ఆ అతిథి వెంటనే వచ్చి, నేను నిజంగా పోయినట్లే పోయి మరలా వచ్చేశానండీ అంటూ ఇంట్లోకి వచ్చాడు. ఆ దంపతులు అవాక్కైపోయారు.

పాపం ఆ దంపతుల పాట్లు గమనించిన పొరిగింటి పెద్దాయన వారి దగ్గరికి వచ్చి ఒక ఉపాయం చెప్పాడు. దాని ప్రకారం ఆ దంపతులు ఇంటికి తాళం వేసి వెళ్ళి ఆ బలవంతపు అతిథి పీడను వదిలించుకున్నారు.

మా ఇంటికి వస్తే ఏం తెస్తావ్? - మీ ఇంటికి వస్తే ఏం ఇస్తావ్?

క్రొత్తగా పెళ్ళి చేసుకున్న యువకుడు అత్తగారింటికి వెళ్ళాడు. అత్తగారు ఎంతో ప్రేమగా విందు భోజనాలతో అల్లుడుగారికి అల్లెం బాగా పెడతారని, బాగా చూచుకుంటారని, అందరిలాగా ఆశపడ్డాడు.

ఈ రోజు ఆదివారం కాబట్టి మధ్యాహ్న భోజనంలో మాంసాహారం వడ్డిస్తారనుకొని ఆశగా ఉన్నాడు. కానీ ఆశ నెరవేరలేదు. మామూలు సాధాసీదా భోజనమే. రాత్రి పడకగదిలో భార్యను అడిగాడు "ఆదివారం కదా? మాంసం ఎందుకు వండలేదు" అని?

ఆదివారం సూర్యదేవునికి ప్రీతికరమైన రోజని మా అమ్మ మాంసం వండదట, భార్య చెప్పింది. సరే సోమవారం వండుతుందేమోలే అని మనసులో అనుకున్నాడు. కానీ సోమవారం కూడా ఆ కొత్త పెళ్ళికొడుకు ఆశ నెరవేరలేదు. అదేమని భార్యను అడిగాడు భర్త. సోమవారం ఈశ్వరునికి ప్రీతికరమైనదని మా అమ్మ వండలేదు అని జవాబిచ్చింది భార్య. ఇలాగే మంగళవారం ఆంజనేయస్వామికి, బుధవారం వినాయకుడికి, గురువారం సాయిబాబావారికి, శుక్రవారం శ్రీమహాలక్ష్మికి, శనివారం శ్రీమహావిష్ణువుకు ప్రీతికరమైన రోజులుగా చెప్పింది భార్య.

శనివారం రాత్రి మగడికి ఏదో అనుమానం వచ్చింది. వెంటనే ఒక ఆలోచన కూడా తట్టింది. రేపు ఆదివారం నేను బజారుకెళ్ళి రెండు కిలోలు మాంసం తెస్తాను వండుతావా అత్తా? అని ఏకంగా అత్తనే అడిగాడు అల్లుడు. వెంటనే అత్తగారు ఆహా! రేపు ఆదివారం- నాతోపాటు, మీ మామకు, కొడుకులకూ, కూతుళ్ళకు, ఆపై నీకు కూడా ఇష్టమైన రోజు కాబట్టి తప్పక వండి వడ్డిస్తాను అంది. అలాగైతే మా వూరెళ్ళి హాయిగా వండుకొని తింటాంలే అత్తా అన్నాడు గడసరి అల్లుడు.

* పెంట తినేవాడింటికి వెళితే! ఏరిగిందాకా బాదాడట.
* ఊరంతా మావాళ్లేగానీ, అన్నానికి రమ్మనే వాళ్ళులేరు.
* మాటచుట్టమేకానీ, పూట చుట్టం కాదు.
* పెళ్లికే పిలవనివాడు, పండక్కు పిలుచునా?
* కాని రోజుల్లో అయినవారింటికి వెళ్ళరాదు.
* ధనికుల ఇంటికి పిలిస్తేనే వెళ్ళాలి - పేదల ఇంటికి పిలవకనే వెళ్ళాలి.
* ఓటికుండైనా ఒరగబెట్టుకొని గుట్టుగా సంసారం చెయ్యాలి.
* చెరువుకు చేరువగానూ, చుట్టాలకు దూరంగానూ ఉండాలి.
* పోనీలే అని కూచోవడానికి చోటిస్తే - పండుకోవడానికి పట్ట తెమ్మన్నాడట.

పలుచబడిన కోడి పులుసు

నజీరుద్దీన్, ఆయన భార్య ఇరువురూ చాలా ఉదారస్వభావంగల దంపతులు. తమ ఇంటికి వచ్చిన అతిథులను, మిత్రులను, పరిచయస్తులను బాగా ఆదరించేవారు. వారికున్న దానిలోనే తృప్తిగా భోజనం పెట్టి పంపించేవారు. వారి ఉదార స్వభావాన్ని బలహీనతగానూ, చేతగాని తనంగానూ భావించి, కొందరు అతిగా ఉపయోగించు కొనేవారు.

ప్రతిరోజూ ఎవరో ఒకరు రావడం, దగ్గరి చుట్టాన్ననీ, దూరపు బంధువుననో చెప్పుకొని నజీరుద్దీన్ ఇంట్లో భోంచేసి, విశ్రాంతి తీసుకొని, పట్టణంలో తమ పనులను ముగించుకొని వెళుతూ ఉండేవారు. పట్టణంలో ఉండడంకూడా వారికి ఒక తలనొప్పి వ్యవహారంగా మారింది.

ఒకసారి నజీరుద్దీన్‌కు ఇంటి తలుపు తట్టిన శబ్దం వినపడింది. నజీరుద్దీన్ తలుపు తెరిచాడు. ఎదురుగా ఒకడు తన చంకలో కోడి పుంజును ఉంచుకొని ఉన్నాడు. నజీరుద్దీన్ అతడిని అడిగాడు ఎవరండీ మీరు అని. మీ దూరపు బంధువునండీ నేను అని, అతని చుట్టరికాన్ని బాగా వివరించాడు. నజీరుద్దీన్ అతడిని సాదరంగా లోనికి ఆహ్వానించి కూర్చోమన్నాడు. బంధువులలో ఫలానా వారెలా ఉన్నారని ముచ్చటించు కుంటుండగా భోజనం తయారైంది. భోజనానికి బంధువు తెచ్చిన పుంజును, రుచిగా వండి వడ్డించింది నజీరుద్దీన్ భార్య.

అలా నజీరుద్దీన్ ప్రక్కనే అతిథి కూర్చొని భోంచేస్తూ ఉండగా, తలుపు తట్టిన శబ్దం వినపడింది. నజీరుద్దీన్ భార్య వెళ్ళి తలుపు తీసింది. ఎవరండీ మీరు, ఎవరు కావాలి? అని అడిగింది. ఒక గంట ముందు మీ ఇంటికి కోడి పుంజుతో వచ్చినవాడు నా దూరపు బంధువే అన్నాడు. అలాగా?! అని ఆమె అతిథిని లోనికి రమ్మని పిలిచింది. నజీరుద్దీన్ అయ్యా, మీరు కూడా రండీ కలిసే భోంచేస్తాం అన్నాడు. వెంటనే అతడు కూడా వారితో కలిసి భోంచేశాడు.

ఆనాటి నుండి ప్రతి రోజూ ఎవరో ఒకరు ముక్కూ, మొగం తెలియనివారు రావడం, నజీరుద్దీన్ ఇంటి తలుపు తట్టడం మీరెవరని అడిగితే మీ ఇంటికి ఒక కోడి పుంజును తెచ్చాడు చూడు, వాడి దగ్గరి బంధువుననో, సన్నిహితుడిననో చెప్పి నజీరుద్దీన్ ఇంట్లో భోంచేసి వెళ్తుండేవారు.

కొన్నాళ్ళకు నజీరుద్దీన్ దంపతులకు కోడిపుంజు బంధువుల తాకిడి ఎక్కువైపోయింది. దీనికి అడ్డుకట్ట వెయ్యకపోతే కొంపకొల్లేరవుతుందని ఒక ఉపాయం ఆలోచించారు. మరుసటిరోజు వారనుమానించినట్లుగానే కోడిపుంజు ఇచ్చిన వాడి బంధువునని ఒకడు, వాడి మిత్రుడనని ఒకడు నజీరుద్దీన్ ఇంటికి వచ్చారు. అలాగా! అయితే రండి భోంచేసి వెళ్లుదురుగానీ ! అని గౌరవంగా ఇంట్లోకి పిలిచి అన్నం వడ్డించారు. ఒక గిన్నెలో ఇది కోడిపులుసు అని పోశారు. ఆ పులుసును చూచి, ఇదేంటి కోడిపులుసులాగా లేదే? ఒట్టి నీళ్ళలాగా ఉంది. దీనితో ఎలా తినగలం? అన్నారు. అందుకు నజీరుద్దీన్ భార్య అయ్యా, ఇది కొన్నాళ్ళ క్రితం మీ దూరపు బంధువు తెచ్చి ఇచ్చిన కోడిపులుసు యొక్క పులుసు యొక్క పులుసు యొక్క పులుసు, అందుకే అలా ఉంది అని సమాధానం ఇచ్చింది. ఇక వారి పాచిక పారనందుకు లేచి వెళ్ళిపోయారు. ఆనాటి నుండి కోడిపుంజు బంధువుల తాకిడి తొలగిపోయింది.

ప్రేమ ఒక భ్రమ

వయసు వచ్చీరాగానే బాల బాలికలు ప్రేమ అనే వ్యామోహానికిలోనై పోతున్నారు. నిజానికి వారిలో ఉన్నది ప్రేమకాదు, తొలకరి కామం, కారుకొవ్వు మాత్రమే. కామవాంఛ తీర్చుకోవాలనెడి ప్రబలమైన కోరికతో బాలబాలికలు పరస్పరాకర్షణలకు లోనై పొందుకోసం పడే తపన, ఆరాటాన్నే ప్రేమ అనుకొంటున్నారు. అది కేవలం ఆకర్షణ మాత్రమేనని తెలుసుకోలేకున్నారు.

ఆకర్షణలకు లోనై 'ఐ లవ్‌యూ' 'వన్‌ఫోర్‌త్రీ' అనో, నేను నిన్ను ప్రేమిస్తున్నాను అనో, ఎంతో స్పష్టంగా, మరెంతో ఇష్టంగా చెప్పేస్తే, అదే ప్రేమ అయిపోయినట్లుగా భావిస్తున్నారు. లేకపోతే ఏదో ఒక విధంగా చంపుతాం, లేదా మేమూ చస్తాం అంటున్నారు - అనడమే కాదు చేస్తూ ఉన్నారు, చస్తూ ఉన్నారు. ఏదో ఒక కోణం (యాంగిల్) లో కనిపించిన (Beauty spots) శారీరక వంపు సొంపులపై ఇష్టం కలగడం, ఆ ఇష్టాన్ని అనుభవించాలనుకోవడం ప్రేమ కానేకాదు. అదొక సహజ శారీరక అవసరం. ఆకలిలాంటి ప్రాథమిక శారీరక అవసరం. ప్రేమ ఒక దివ్యమైనగుణం. ప్రేమంటే త్యాగం, ఈనాటి బాల బాలికలలో యవ్వనపు పొంగులో కామం అనే ఆకలిని తీర్చుకునేటందుకు పడే తపననే ప్రేమనుకుంటున్నారు.

ఈ విధమైన మనోవికారం కలగడానికి ఎన్నో కారణాలున్నాయి. పాపం పిల్లలు సహజంగా ప్రకృతి ప్రకోపింపచేసే దానికి లోనుకాకుండా ఎలా నిగ్రహించుకోగలరు?

పిల్లల్లో భయంకానీ, భక్తిగానీ శ్రద్ధగానీ లేని వాతావరణాన్ని పరిపాలకులు, పెద్దలు సృష్టించి, వారిని నిగ్రహ సంపన్నులుగా ఉండాలని కోరుకోవడం సమంజసమా?

చదువులో నీతిని తీసివేశాము, నైతికత లేని సాంకేతిక శాస్త్రాన్ని బోధిస్తున్నాము. చదువైపోయాక, వయసొచ్చాక ఎన్నడో తెలియాల్సిన కామశాస్త్రాన్ని "ఎయిడ్స్‌పై అవగాహన" పేరుతో శరీర అంగాలను బహిరంగ పరిస్తే, ఉద్రేకానికి లోనుగాకుండా వుండగలరా? మన సామాజిక వ్యవస్థను బట్టి స్త్రీకి పద్దెనిమిదేండ్లు, పురుషునికి ఇరవై ఒక్క సంవత్సరాలు వివాహ వయస్సుగానూ నిర్ణయించారు. స్త్రీకి వయస్సు వస్తే చాలు ఆమెలో వయసు తెచ్చే మార్పులు, శారీరకంగానూ, మానసికంగానూ, బౌద్ధికంగానూ, సహజంగా సంతానోత్పత్తికి, అనగా జతకట్టడానికి యోగ్యురాలవుతుంది. కానీ పురుషుని విషయంలో అలాకాదు. వయసు ఇరవై ఒక్క సంవత్సరాలుగా నిర్ధారించుకున్నప్పటికీ, అతనిలో శారీరక దారుఢ్యం, మానసిక ఎదుగుదల, బుద్ధికుశలత, సంసారాన్ని నెట్టుకురాగలిగిన నైపుణ్యం, సంపాదన, భార్యను అర్థం చేసుకునే యోగ్యతలు తప్పనిసరిగా ఉండాలి. ఈ అంశాలలో ఏది లోపించినా ఆ సంసారంలో సంతోషం ఉండదు. స్త్రీతో పోల్చి చూస్తే స్త్రీ కంటే పురుషునికే అధిక అర్హతలుండాలి. అందుకే పెళ్ళిలో పురోహితుడు మంత్రాలను వరునిచేతనే పలికిస్తాడు. అర్థ, కామాలను ధర్మమార్గంలోనే సాధించాలని బోధిస్తారు. జీవితంలో తప్పటడుగు వేయకుండా, బాధ్యతగా జీవితాంతం కలిసుండాలని ప్రమాణం చేయిస్తారు. సత్సంతానాన్ని సమాజానికి ప్రసాదించండని దీవిస్తారు.

ఈనాడు సామాజిక వాతావరణం, వెస్ట్రనైజేషన్ (వలన నాగరికత) అయిపోయినందున ప్రేమ రెండు రకాలుగా వుంది.

ఇంగ్లీష్ లవ్ : బాహ్యాకర్షణకులోనై, నిగ్రహాన్ని కోల్పోయి, కామోద్రేక భారాన్ని దించుకొని, ఎవరిదోవన వారు వెళ్ళిపోవడం. ఇది తాత్కాలిక సుఖం కోసం వెంపర్లాడటం మాత్రమే.

ఇండియా లవ్ : ఏవిధమైన ఆకర్షణలకు లోనైనా, నిగ్రహాన్ని కోల్పోయినా జీవితాంతం కలసి ఉండాలనుకోవడం, బాధ్యతగా జీవించడం.

ఏదైనా సరే! తను ఇష్టపడినది తనకే దక్కాలి, అనుకోవడం, మరొకరి జోక్యం, మరొకరి భాగస్వామ్యం సహించలేకపోవడం, ఆశ, అసూయ, ఆగ్రహం, ఆవేశం, పగ ప్రతీకార వాంఛతో రగిలిపోవడం అనేది ప్రేమ స్వభావంకాదు. ఇలాంటి దుష్ట భావాలుండేది కేవలం స్వార్థంలోనే. దీనినే కామోన్మాదం అంటారు. కొన్ని సందర్భాలలో 'మద పిచ్చి' అని కూడా అంటారు.

* ప్రేమ-త్యాగానికి ప్రతిరూపం. జాలి, దయ, బాధ్యత, సేవ అనేవి ప్రేమలో నిండుగా, దండిగా ఉంటాయి.
* ప్రేమ రెండు మనసుల కలయిక. పెళ్ళి రెండు కుటుంబాల కలయిక.
* ప్రేమ ఎన్నడూ ద్వేషించలేదు - ద్వేషం ఎన్నడూ ప్రేమించలేదు.
* నువ్వు వలచినది నిన్ను తొలుచును. నిన్ను వలచినది నిన్ను కొలుచును.
* ప్రేమవివాహాలు సుఖాంతమూ అవుతున్నాయి. దుఃఖాంతమూ అవుతున్నాయి. ఇప్పటి యువతరంలో మాత్రం జాలీగా గడపడానికీ, టైంపాస్ కోసం గర్ల్‌కు బాయ్‌ఫ్రెండ్, బాయ్‌కి గర్ల్‌ఫ్రెండ్‌ను వెదుక్కుంటున్నారు.
* వివాహానికి ముందే స్త్రీ-పురుషుల కలయికలోని మాధుర్యాన్ని చవిచూస్తే వివాహానంతరం అనుభవించే అనుభూతి ఏముంటుంది? ఆ కారణంగానే ప్రేమ వివాహాలు కొన్ని ఆటుపోటులకు తట్టుకోలేక చిన్నాభిన్నమవుతున్నాయి.
* పెద్దలు నిర్ణయించిన వారితో వివాహం జరిగితే అదొక అనుభూతి కలిగిస్తుంది. జీవితంలో ఎదురయ్యే సుఖ - దుఃఖాలలో పాలుపంచుకునే టందుకు ఒక ఆసరా, భరోసా పెద్దల నుండి, కుటుంబ సభ్యులనుండి లభిస్తుంది.
* ఇంటి మొగుడు చెమట వాసన. పొరిగింటి మొగుడు పూలవాసన.
* ఈత చెట్టు ఇల్లూకాదు, తగులుకున్నోడు మొగుడూ కాదు.
* చేసుకున్న దానికి మూసుకోను లేదు. కానీ ఉంచుకున్న దానికి ఉభయరాగాల చీర కావాలన్నాడట.
* ఆలు అరటిపండు, తల్లి తలపుండు, చెల్లి చేదుకాయ, లంజ లవంగమొగ్గ.
* కలిమి ఉన్నంతసేపు బలగము, కండ ఉన్నంతసేపూ మిండడు.
* మీద మెరుగులు - లోన పురుగులు.
* ఒకసారి మనని ఇష్టపడిన వ్యక్తి మనల్ని మరచిపోవడానికి కారణం మనలోని లోపమే.
* అయ్యకు వణుకు ప్రాయం, అమ్మకు కులుకు ప్రాయం.
* పగలు కన్నుగీటితే రానిది. రాత్రి చెయ్యి ఊపితే వస్తుందా ?
* స్త్రీ చిత్తం పురుషుని భాగ్యం.
* రతిలో సిగ్గు - రణంలో భీతి పనికిరావు.
* వైశ్యుడు కరువును కోరు- వేశ్య విటులను కోరు.
* చక్రవర్తి చేస్తే శృంగారం, చాకలి చేస్తే వ్యభిచారం.
* మనిషి - మనిషిని మనిషిగా ఎప్పుడూ ప్రేమించలేదు. మనిషి మనీషిగా, మహనీయుడుగా ఎదిగినపుడు మాత్రమే సకల జీవరాశిపట్ల, విశ్వ ప్రేమ భావన చూపించగలడు. అంతేకానీ సంసారిగా, ఒక మానవమాత్రునిగా స్వార్థంతో మాత్రమే బ్రతుకుతాడు.

* తనకు లోబడిన స్త్రీని... ఆమెకెంతటి ఘనత ఉన్నా పురుషుడు గౌరవించడు.
* అందమైనది ఆదర్శం కాకపోవచ్చు. కానీ ఆదర్శవంతమైనది సదా అందంగానే ఉంటుంది.
* శృంగార సాహిత్యానికి సంబంధించిన పుస్తకానికి ఎప్పుడూ దుమ్ము పట్టి ఉండదు.
* గారాబం గారెలకేడిస్తే - వీపు దెబ్బలకేడ్చిందట.
* సాయంత్రం ఆ అమ్మాయితో మళ్లా షికారుకెళ్లావా ? ప్రశ్నించాడు తండ్రి.

  వెళ్ళాను చెప్పాడు మదన్.

  మొత్తం ఎంత ఖర్చయింది?

  రెండువేలే!

  రెండువేలా! ఆశ్చర్యపోయాడు తండ్రి.

  'ఆ అమ్మాయి దగ్గర అంతకంటే ఎక్కువ లేదుమరి. బదులిచ్చాడు మదన్.

అమ్మాయిలు తృప్తి పడరు

ఓ సంస్థ వినూత్నంగా స్వయం వరం ఏర్పాటు చేసింది. అయిదంతస్తుల భవనంలో ఐదు రకాలుగా పురుషులను విభజించి, అంతస్తుకు కొందరి చొప్పున ఉంచారు. అమ్మాయిలు వచ్చి, వాళ్ళకు నచ్చిన వరుడిని ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే ఒకసారి ఓ అంతస్తు దాటి వెళ్లాక, మళ్లీ కిందికి దిగడానికి వీల్లేదు. అదీ షరతు.

ఆ కార్యక్రమానికి సుచరిత కూడ వెళ్ళింది. మొదటి అంతస్తులో-వీళ్ళందరూ అందగాళ్ళు. బోర్డు కనిపించింది. అక్కడ చూస్తే ఒకరిని మించి ఒకరు అందంగా ఉన్నారు.

సరే, రెండో అంతస్తులో ఎవరున్నారో చూద్దామన్న కుతూహలంతో-పైకి వెళ్ళింది వీళ్ళందరూ అందగాళ్ళు, మంచి ఉద్యోగాలు చేస్తున్న వాళ్ళు. బోర్డు కనిపించింది.

మూడో అంతస్తుకు చేరుకుంది. వీళ్ళందరికీ ఉద్యోగాలున్నాయి. మంచి అందగాళ్ళు. ఇంటి పనిలో కూడా సాయం చేస్తారు. అన్న బోర్డు కనిపించింది. అన్నీ బాగానే ఉన్నాయి. కానీ నాలుగో అంతస్తులో ఇంకా మంచి వాళ్ళుంటారేమోనని అక్కడికి చేరుకుంది. అక్కడ వీళ్ళు అందగాళ్లు, మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఇంటిపనుల్లో సాయం చేస్తారు. భార్యను ప్రేమగా చూసుకుంటారు రాసుంది బోర్డుమీద. అయినా సుచరితకు ఐదో అంతస్తులో ఎలాంటి వారున్నారో చూడాలనిపించి ఎక్కింది.

గమనిక:- ఇక్కడికి వచ్చిన వారిలో మీరు తొమ్మిది వేల నూటా ఎనిమిదవ వారు. ఇక్కడ అబ్బాయిలు ఎవరూ లేరు. "ఆడవాళ్ళను సంతృప్తిపరచడం కష్టం". బోర్డు వ్రాసుందక్కడ.

*****

గురుదేవోభవ

తల్లి - బిడ్డకు తండ్రిని చూపిస్తుంది
తండ్రి - బిడ్డకు గురువును చూపిస్తాడు
గురువు - శిష్యునికి దైవాన్ని చూపిస్తాడు

స్థూలంగా గురువులను బాధ గురువు, బోధ గురువు, సద్గురువు అని మూడు రకాలుగా చెబుతారు.

బాధ గురువు:- చదువు చెప్పినా, చెప్పకపోయినా, తనలో ఉపాధ్యాయుని లక్షణాలు లేకపోయినా, నా జీతం నాకు వస్తుంది అనే ఉపాధ్యాయుడే పొట్టకూటి మాస్టరు. ఇలాంటి వారివల్ల కొన్ని వేలమంది విద్యార్థులు నష్టపోతారు.

బోధగురువు:- తనకు తెలిసినంతవరకు జ్ఞానాన్ని బోధించి, తాను జీవిస్తూ, శిష్యులకు బోధిస్తూ వృత్తి ధర్మం నెరవేర్చేవాడు.

సద్గురువు:- శిష్యులలో చైతన్య స్ఫూర్తిని నింపి, అర్హతలను బట్టి, ఆశలు, ఆశయాలననుసరించి ఉత్తమమైన సంసారులుగాను, బ్రహ్మచారులుగాను, సన్యాసులుగాను, యోగులుగాను, తీర్చిదిద్ది, సమాజానికి, సంసారానికి, దేశానికి, జాతికి, ఆధ్యాత్మిక జగత్తుకు ఉపయోగపడేటట్లుగా చేసేవాడు.

ఉత్తమ ఉపాధ్యాయుని లక్షణాలు

* ఉపాధ్యాయుడు విద్యార్థులకు, సమాజానికి ఆదర్శప్రాయుడు. విద్యార్థులు ఉపాధ్యాయుడిని నిత్యం అనుసరిస్తూ, అనుకరిస్తూ ఉంటారు. కాబట్టి ఉపాధ్యాయుడు తనను తాను సంస్కరించుకుంటూ ఆదర్శప్రాయంగానే వుండాలి.
* తల్లిదండ్రుల తర్వాత ఆప్యాయంగా, గురువు దగ్గరికి వచ్చి మనసులోని భావాలను వ్యక్తపరచగలిగే చనువును విద్యార్థులకు ఇవ్వాలి.
* తప్పు చేస్తే దండిస్తాడనే భయం, మంచి ప్రవర్తనతో ఉంటే దగ్గరికి తీసుకొని ప్రోత్సహిస్తాడనే గౌరవం, ఉండేటట్లుగా ఉపాధ్యాయుడు వ్యవహరించాలి.
* పాఠ్యాంశ బోధనే కాకుండా, సందర్భాన్ని బట్టి నైతిక విలువలను బోధించాలి. నెల జీతపు నౌకరీకోసం మాత్రమే కాకుండా, కష్టపడి ఏ రంగంలోనైనా బ్రతుకుదెరువును చూచుకోగలను, నన్ను నేను పోషించుకోగలను, నా కుటుంబాన్ని పోషించుకోగలను. అనే మానసిక స్థైర్యాన్ని, శారీరక, బౌద్ధిక దారుఢ్యాన్ని విద్యార్థులలో కలిగించాలి.
* పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలచుకొని తదనుగుణంగా నిలబడగలిగేటట్లుగా విద్యార్థులను తయారు చేయాలి.
* స్నేహశీలత, ఓర్పు, నైపుణ్యం, ఆత్మాభిమానం, సామాజిక స్పృహ, దేశభక్తి మొదలగు నైతిక విలువలను విద్యార్థులలో పెంపొందించాలి.

* చేసే ఏ పనిపట్ల అయినా అంకిత భావాన్ని కలిగి ఉండాలి. విద్యార్థుల పట్ల సమదృష్టి కలిగివుండాలి. ఒక ఉపాధ్యాయుడు నిర్లక్ష్యంగా ఉంటే అనేక వేల మంది వక్రమార్గంలో పడి సమాజానికి భారంగా తయారవుతారు.

విద్యార్థులు అమాయకత్వంతోను, పిల్లతనపు పొగరుతోను తప్పులు-పొరపాట్లు చేస్తూ ఉంటారు. ఉపాధ్యాయుల కంటపడినప్పుడు మరలా వారు అటువంటి తప్పులు చెయ్యని విధంగా సామ, దాన, భేద, దండోపాయాలను సమయస్ఫూర్తిగా ప్రయోగించి సన్మార్గంలో పెట్టాలి. అంతేకానీ ఓపిక లేదనో, మరేదో కారణం చేతనో చూసి చూడనట్లు వెళ్ళిపోతే, తాము చేసింది సబబే అని సమర్థించుకొని మరుసటి రోజు అదే పనిని నిర్భయంగా మరలా చేస్తారు. తదనంతరం 'గోటితో పోయేదానికి గొడ్డలి ప్రయోగించవలసివస్తుంది'. కాబట్టి పిల్లలు తప్పు చేస్తున్నప్పుడు చూచీచూడనట్లు పోతే ఆ క్షణంలోనే పిల్లల జీవితంలో విషపు చుక్క వేసినట్లే.

* టీచర్ ట్యాంక్ అయితే విద్యార్థి ట్యాప్. ట్యాంకిలో ఎలాంటి నీరుంటే అలాంటి నీరే ట్యాప్‌లోనుండి వస్తాయి.

తానెవరో తెలుసుకోవడమే జ్ఞానం

ఒక అడవిలో గాలీ-వాన జోరుగా వచ్చింది. ఒక రోజంతా పెనుగాలి విపరీతంగా వీచింది. అప్పుడు రెండు పులి పిల్లలు తల్లి నుండి వేరై దారి తప్పాయి. ఆ పులి పిల్లలలో ఒకటి అడవి దాటి వచ్చేసింది. అడవికి దగ్గరగా నున్న శివారు గ్రామంలోని వాడొకడు తన మేకల మందను అడవి దగ్గర మేపుకుంటూ ఉండినాడు. దారి తప్పిన పులి పిల్ల ఆ మేకల మందలోకి వచ్చి చేరుకుంది. సాయంకాలం మేకల మందను తోలుకొని ఇంటికి వచ్చేటపుడు మందలోని పులి పిల్లను చూచాడు. మరలా దానిని అడవిలోనే వదలి రావడానికి సమయం చాలక దానిని మందతో పాటు ఇంటికి తెచ్చాడు.

మరుసటిరోజు ఉదయం మరలా మేకల మందను అడవికి తోలుకొని వచ్చాడు. మందతో పాటు తెచ్చాడు. అది మేకలతో పాటు ఆకులు అలుములు మేస్తూ మేకలతో బాగా కలసిపోయింది. అది మరలా అడవిలోకి వెళుతుందనుకున్నాడు మేకలవాడు. కానీ అది మరలా మేకల వాని దగ్గరకే వచ్చింది. పసిపిల్లగా ఉన్నప్పుడు ఏ జంతువు పిల్లైనా చాలా అమాయకంగా, మృదువుగా, ముద్దొచ్చేటట్టుగానే ఉంటుంది. కాబట్టి ఈ అమాయకపు పులి పిల్లను కూడా మేకలవాడు ప్రేమతో దగ్గరికి తీసుకొని ప్రతిరోజూ ఉదయాన్నే అడవికి రావడం, సాయంకాలం ఇల్లు చేరుకోవడం చేస్తూ ఉండినాడు.

మేకలతో పాటూ, ఈ పులి పిల్లకూడా మేక పాలను తాగుతూ, ఆకులను తింటూ, మేకలతో బాగా కలసిపోయింది. మేకలవాడు కూడా భయపడకుండా ప్రేమగా

దాన్ని మేకలతో పాటు సాకుతూ ఉండినాడు. ఇలా కొన్ని మాసాలు గడిచాయి. పులి పిల్లకూడా ఒక మోస్తరు పులిగా వొళ్ళు చేసింది. ఒకరోజు అడవిలో మేత మేస్తుండగా, గతంలో తప్పిపోయిన దాని జతలోని పులి చూచింది. దానికి మేకల మందలో ఆకులు అలుములూ తింటూ హాయిగా తిరుగుతూ ఉండిన పులిని చూచి ఆశ్చర్యం కలిగింది. ఇదేమిటి? ఇలాగా అయిపోయిందీ? నామాదిరిగానే ఉండినా ఆకులను మేయడం ఏమిటీ? అని ఆశ్చర్యంతో చూచి, దాని సంగతేమిటో తేల్చాలి అనుకున్నది.

మరుసటిరోజు అడవిలోని పులి అదే పనిగా మాటువేసి ఈ మందలోని పులిని అర్థగించుకొని ఏమిటే? నీవు నాలాగా పులివే! అయినా మాంసాహారిగా లేకుండా నీవు కూడా మేకలాగే అయిపోయావు? అని ప్రశ్నించింది.

దానికి ఆ పులి ఏమో తెలీదు. నేను చిన్నప్పటినుండి ఇలాగే మేకలలోనే ఉంటున్నాను అన్నది. కానీ, అడవి పులి మాత్రం తన జాతి సాధుజాతిగా మారడం ఇష్టంలేక దానికి ఇలా నచ్చ చెప్పింది. మనం మాంసాహారులం, మనల్ని చూచి మేకలూ, గొర్రెలూ భయపడి పారిపోవాలి గానీ, ఇలా నీవే మేకలాగా మారిపోవడం మన జాతికే అవమానం, మనం అడవిలో ఉండాలి. అంతేకానీ బైట ఉండకూడదు అన్నది. కానీ ఆ సాధు పులి మాత్రం ఎంత చెప్పినా వినలేదు. అందుకని దానిని అడవిలోనే ఉన్న ఒక పెద్ద బావి దగ్గరికి తీసుకెళ్ళింది. నీళ్ళలో తమ ప్రతిబింబాలను చూడమని చెప్పింది. ఆ సాధు పులి కూడా తన ప్రతిబింబం చూచికూడా నేను నీతోపాటురాను, అని మారాం చేసింది. అందుకు అడవి పులి కోపంతో మన జాతికి అవమానం కలిగే రీతిలో నీవు మరలా మేకల మందలోకి వెళ్ళాలనుకుంటే మాత్రం నిన్ను ఈ బావిలోకే తోసి చంపేస్తా అంతే. అని భయపెట్టింది.

అపుడు సాధు పులి భయపడి ఇది ఎలాగూ నన్ను వదలిపెట్టకుండా చంపేసేటట్లుంది అని, నిశ్చయించుకొని సరే! నన్నిపుడు ఏం చేయమంటావు అని ప్రశ్నించింది. ఏమీ లేదు. మొదట నీవు ఎవరో తెలుసుకోవాలి, ఆపై నీ జీవన విధానం ఏమిటో తెలుసుకోవాలి, అని చెప్పింది అడవి పులి.

సాధు పులి తన ప్రతిబింబాన్ని నీళ్ళలో బాగా చూచింది. తన ప్రక్కనే ఉన్న అడవి పులిని కూడా చూచింది. తనకు, దాని శరీరం మీద ఉండే చారలను సరిచూచుకుంది. మూతి మీదున్న మీసాలను కూడా చూచుకుంది. నోరు తెరచి తనకున్న కోరలను చూచింది. కాళ్లకున్న గోర్లను బాగా చూచుకొని నేను కూడా అడవి పులినే, మేకను మాత్రం కాను. అని తనను తాను సంపూర్ణంగా తెలుసుకొని, అడవి పులిలాగా మెల్లగా గర్జించను మొదలుపెట్టింది. ఆ విధంగా అడవి పులిలాగానే సాధు పులికూడా తయారైపోగా, అపుడు రెండు పులులూ కలసి స్నేహంగా అడవిలోకి వెళ్ళిపోయాయి.

* గురువు జ్ఞానాన్ని అందించేటపుడు బ్రహ్మ. తన అడుగు జాడలలో నడిపించేటపుడు విష్ణువు. దండించేటపుడు మహేశ్వరుడు.

గమ్యం తెలియని విద్యార్థులు

బాల నేరుస్థుల పాఠశాలలో పిల్లలకు సెలవు ఇవ్వాలని నిర్ణయించాడు అధికారి. క్రైస్తవ విద్యార్థులను మీకు ఏ రోజు సెలవు కావాలి? అని అడిగాడు.

"మాకు- ఆదివారం సెలవు కావాలి, ఎందుకంటే చర్చికి వెళ్లడానికి అనువుగా ఉంటుంది అన్నారు.

ముస్లిం విద్యార్థులను అడిగాడు మీకు ఏరోజు కావాలి? అని.

మాకు శుక్రవారం అయితే బాగుంటుంది, మసీదుకు పోవచ్చు అన్నారు.

చివరలో హిందూ బాలురను అడిగాడు అధికారి వారికి ఏరోజైతే బాగుండునో తెలియక, మాకు కూడా ఆదివారమే సెలవు ఇవ్వండని అడిగారు. వారు సినిమాకు వెళ్ళారు.

గురుభక్తి

ఒకసారి నదికి ఒకవైపున గురువు. ఆవలివైపున శిష్యులందరూ ఉన్నారు. ఎందుకనో గురువు ఆత్రుతతో శిష్యులను వెంటనే రమ్మని గట్టిగా కేకవేశారు.

నది వేగంగా ప్రవహిస్తూ ఉన్నది. నదిని ఎలా దాటాలి? అని శిష్యులందరూ తర్జన-భర్జనలు పడుతున్నారు. ఎవరూ నదివైపు అడుగెయ్యను సాహసించడం లేదు. ఒక్క సనందుడనే శిష్యుడు నదివైపు అడుగులు వేశాడు. గురువుగారి పిలుపు మాత్రమే సనందుడి చెవులలో మారుమ్రోగుతున్నది. వెంటనే వడివడిగా వెళ్ళి నీళ్ళలో అడుగు పెట్టాడు. అద్భుతం. సనందుడు అడుగు పెట్టిన చోటల్లా ఒక పద్మం వికసించి అతని పాదానికి ఆధారమైంది. సులువుగా నదిని దాటి గురువు దగ్గర వాలాడు.

గురువు మాటపై గల అతడి అచంచలమైన విశ్వాసమే అతడిని అలా నడిపించింది. ఆనాటినుండి సనందుడు పద్మపాదుడనే నామం మీదనే ప్రసిద్ధుడయ్యాడు. తర్వాత ఆ శిష్యుడినే ద్వారకా మఠాధిపతిగా శ్రీ శంకరులవారు నియమించారు.

సంపూర్ణ శరణాగతి

ఒక బాల సన్యాసి బిక్షాటనకు వెళ్లాడు. తిరిగి వచ్చి గురువును ఇలా ప్రశ్నించాడు. గురువుగారూ! ఒక అమ్మాయి నాకు బిక్ష వేసింది. కానీ ఆ అమ్మాయికి ఎదపై రెండు గడ్డలు ఉండినవి. మరి నాకు లేవే? ఎందుకని?

నాయనా! ఆ అమ్మాయి భవిష్యత్తులో తల్లి అయి నీలాంటి పిల్లలను పోషించుటకు భగవంతుడు సృష్టించిన పాలిండ్లు అవి. అని గురువు సమాధానం చెప్పాడు.

అయితే గురువుగారూ, ఎన్నడో పుట్టబోయే వారి పోషణ కోసం ఆహారం ఏర్పాటు చేసిన భగవంతుడు, ఎపుడో పుట్టిన నాకు ఆహారం ఇవ్వలేడా? తప్పక

ఇస్తాడు. కాబట్టి ఈనాటి నుండి భిక్షాటన చెయ్యను. కేవలం తపస్సు తప్ప భిక్షాటన చెయ్యను అని తన నిర్ణయం చెప్పి వెళ్లిపోయాడు.

కొన్ని రోజుల తర్వాత గురువు శిష్యులతో కూడా అడవిలో వెదకి, చివరికి ఒక గుహలో తపస్సు మీదున్న శిష్యుణ్ణి కనుగొన్నారు. శిష్యుని ముఖ వర్చస్సు తేజోమయంగా వెలిగిపోతున్నది. గురువు, శిష్యులు అందరూ ఆనందాశ్చర్యాలకు లోనయ్యారు. వాత్సల్యంతో శిష్యుణ్ణి పలుకరించి, నాయనా! ఇన్ని రోజులు ఆహారం లేకుండా ఎలా ఉన్నావని అడిగాడు.

ఆహారం లేకుండానా! ఎంతమాట!! నాకు ఆకలి వేసినపుడల్లా అమ్మ నాకుఅన్నం తినిపిస్తూనే ఉందిగా! అని చెప్పగా గురుశిష్యులు నిశ్చేష్టులయ్యారు. సంపూర్ణ శరణాగతి అంటే అదే.

మనం మంచివారిగా ఉండడమే కాదు చెడ్డవాళ్లకి దూరంగా కూడా ఉండాలి

వేణు... చాలా మంచివాడు, శాంత స్వభావుడు, నిదానస్తుడు. చాలా శ్రద్ధగా చదువుకుంటాడు. పెద్దలంటే భక్తి, గౌరవంకూడా. ఆ గ్రామంలోనే అతని ఈడువాళ్లు కొంతమంది ఆకతాయిలు ఉన్నారు. ఏదో ఒకటి కానిపని చేయడం, తిట్లు తినడం వాళ్లకి అలవాటు. వేణు అంటే వాళ్ళకి పడేది కాదు. కానీ వేణు మాత్రం వారిని ఏనాడూ చులకనగా చూచేవాడు కాదు. వీలు దొరికినపుడు, సందర్భం వచ్చినపు వాళ్ళకు మంచి మాట చెబుతూ ఉండేవాడు. కానీ వాళ్ళు వేణు మాటలను ఖాతరు చేసేవాళ్లు కాదు.

ఒకరోజు ఆ గ్రామ జనమంతా కలసి వన భోజనం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న వనంలో పెద్దలంతా వంటలు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారు. పిల్లలంతా అక్కడున్న మడుగులో బాగా ఈత కొట్టి, అక్కడే దగ్గరలో ఉన్న మామిడి తోటపై విరుచుకపడ్డారు. వారిలో వేణు కూడా ఉన్నప్పటికీ తాను తోటలోకి వెళ్లకుండా, తనతోటి వాళ్ళను కూడా వద్దని చెప్పాడు. తోట యజమాని చూస్తే మనల్ని మన పెద్దవారినికూడా అవమానంగా మాట్లాడతాడు. మామిడికాయలు కోయవద్దు అని ఎంత చెప్పినా వాళ్లు వినకుండా కాయలు కోయసాగారు. అంతేకాకుండా వాళ్ళు "ఓరేయ్ వేణూ నీవు తోటలోకి రానూవద్దు, మేము కోసిన కాయలను నీవు అడగనూ వద్దు" అని అంటూ వారు కాయలు కోయసాగారు.

ఇంతలో అటుగా యజమాని రానేవచ్చాడు. వీరంగం చేస్తున్న అల్లరి మూకను చూచాడు, ఆయనకు వళ్లుమండింది. అక్కడ దగ్గరలో పని చేస్తున్న కూలి జనాన్ని పిలిచి అందర్నీ పట్టుకోమన్నాడు. వాళ్లు అందర్నీ పట్టుకొని చితక బాదడం మొదలు పెట్టారు. తోట బయట నిలబడి ఉన్న వేణునుకూడా తిడుతూ కొట్టబోయారు. కానీ

వేణు వాళ్ళతో క్షమించండి నేను దొంగతనానికి రాలేదు. దొంగతనం చేయవద్దని చెపుతున్నాను. నన్ను కొట్టకండి అని ప్రాధేయపడ్డాడు. కానీ వాళ్ళు ఆకతాయిలతో చేరిన నిన్ను మంచివాడని ఎట్లానమ్మమంటావురా? వెధవా అంటూ నాలుగు తగిలించారు. అప్పుడుగానీ తెలిసిరాలేదు వేణూకు. మనం మంచిగా ఉండడమే కాదు, చెడ్డవాళ్ళకి దూరంగాకూడా ఉండాలి అని.

అందరూ చదువు కోవాలి. అందరూ ఎదగాలి

ఒక పల్లెలో నివసించే పేద రైతు దంపతులు తమ అవసరాలను, ఆనందాలను లెక్కపెట్టకుండా ఎన్నో కష్టాలు పడి తమ ఏకైక పుత్రుడిని చదివించారు. అదృష్టవశాత్తు కుమారుడు మంచి చదువు చదివి పెద్ద ఆఫీసరయ్యాడు. ఒక పెద్ద నగరంలో అతడికి ఉద్యోగం వచ్చింది. పెళ్ళికూడా అయింది. అతడు తన భార్యతో కలసి ఆ నగరంలోనే ఒక పెద్ద భవంతిలో నివసించసాగాడు.

కొంతకాలం తర్వాత ఆ రైతు దంపతులకు తుమ కుమారుడికి పుత్ర సంతానం కలిగినట్లు వర్తమానం అందింది. ఎంతో ఆనందంతో తమ మనవడిని చూచుకునేందుకు పట్నం బయల్దేరి వెళ్లారు.

దంపతులు కుమారుని ఇల్లు చేరుకునే సరికి అతగాడు తన మిత్రులతో కలసి కబుర్లు చెప్పుకుంటున్నాడు. తన తల్లిదండ్రులు రావడాన్ని గమనించిన అతడు చాలా కంగారు పడ్డాడు. పల్లెటూరి బైతుల్లా ఉన్న తన తల్లిదండ్రులను తన మిత్రులు చూచి ఎగతాళి చేస్తారని తలచి, నౌకరును పంపి వాళ్ళను దొడ్డి గుమ్మం నుండి లోపలికి రప్పించాడు. ఇంటిలోకి వెళ్ళిన రైతు దంపతులు కోడలిని పలకరించి, మనవడిని ముద్దాడి వరండాలో కూర్చొని ఉన్న తమ కుమారుడిని పలుకరిద్దామని వస్తూ ఉండగా - వచ్చినది ఎవరని ఒక మిత్రుడు అడిగాడు. 'మా ఇంటి పాత పని మనుషులు. గ్రామం నుంచి వచ్చారని జవాబు చెప్పాడు. తల్లిదండ్రులు కొడుకు మాటలు విన్నారు. వెంటనే వారు అందరి మధ్యకు దూసుకు వచ్చి "ఈ పల్లెటూరి బైతులే వీడి తల్లిదండ్రులు. వీడు తల పొగరుతో అన్నట్లుగా మేము నౌకర్లము కాము. అని ఆ దంపతులు తిరుగు ప్రయాణమయ్యారు.

* పిల్లలు కొద్దిపాటి చదువుతో ఇంటి పనికి దూరమవుతున్నారు. మరికొద్దిపాటి చదువుతో ఇంటికి దూరమౌతున్నారు. మరికాస్త చదువుతో ఊరికి దూరమవుతున్నారు. ఆపై చదువుతో దేశానికీ, తల్లిదండ్రులకు దూరమవుతున్నారు.
* వ్యక్తులను ధర్మం నుంచి, సంస్కృతి నుంచి, కుటుంబం నుంచి దూరం చేసే ఉన్నత విద్యవల్ల వచ్చే లాభమేమి?
* ఉత్తమ సంస్కారాలనుపెంపొందించేదే విద్య.

విద్యకు పరమార్థం వినయ వర్తనం, సేవాభావమే.

ఒక గురువుగారి దగ్గర ముగ్గురు విద్యార్థులు చదువుకునేవారు. ఆ ముగ్గురూ చాలా రోజుల నుండి విద్యను అభ్యసిస్తూ వస్తున్నారు. వారిలో ఇద్దరు చాలా తెలివైన వారు. ఎన్నో పుస్తకాలు చదివారు. పుస్తక జ్ఞానం బాగా అబ్బింది. కానీ మూడవ వాడు మాత్రం కాస్త మందబుద్ధి. వాడికి కొంత మాత్రమే విద్య అబ్బింది. అది కూడా గురువుగారి కృపవల్లనే తనకు వచ్చింది అనుకునేవాడు.

చదువులు పూర్తయిన తరువాత ఇంటికి వెళ్లేందుకు గురువుగారి అనుమతి అడిగారు. దానికి గురువుగారు సరే! నేను మీకు త్వరలోనే చెబుతాను అన్నాడు.

ఒకరోజు శిష్యులను పరీక్షించేటందుకు ఆశ్రమ ప్రవేశ ద్వారం వద్ద ముళ్లను పరిచి ఉంచి ముగ్గురునీ పిలిచాడు. వర్షం వచ్చేటట్లుంది బయట ఉన్న కట్టెలను తెచ్చి లోపల పెట్టండి. పరిగెత్తండి ఆలస్యమైతే కట్టెలు తడిసిపోతాయి అన్నాడు.

ద్వారంవద్దకు వెళ్లేసరికి ఆ ముగ్గురికి ముండ్లు గుచ్చుకున్నాయి. మొదటి శిష్యుడు ముళ్ళను లెక్కచేయక, గుచ్చుకున్న ముళ్ళను తీసుకుని కట్టెలను పోగు చేయసాగాడు.

రెండవ శిష్యుడు ముళ్ళు గుచ్చుకునే సరికి అబ్బా అంటూ ప్రక్కన నిలబడిపోయాడు.

మూడవ వాడైన మందబుద్ధి అక్కడి నుండి వెనుకకు వచ్చి చీపురు కట్టను తీసుకుని మెల్లమెల్లగా ముళ్ళను ఒక వైపుకు తోసి, తర్వాత ప్రక్కన నిలబడి ఉన్న రెండవ వాడి పాదాలను పట్టుకుని గుచ్చుకున్న ముండ్లను మెత్తగా తీసి పారేసి, ఇక పద కట్టెలను లోపలికి తెద్దాం అన్నాడు.

గురువుగారు దూరంగా నిలబడి ముగ్గురు శిష్యులు పని చేసే విధానాన్ని గమనించాడు. మరుసటి రోజు ముగ్గురు శిష్యులను పిలిచి, మందబుద్ధి అయిన శిష్యునితో నాయనా నీవు మాత్రమే ఇంటికి వెళ్లు. వీరిద్దరూ మరి కొన్ని రోజులు విద్య అభ్యసించి వెళతారు అన్నాడు.

గురువుగారి మాటలు విని ఆ ఇద్దరూ కలవరపడి గురుదేవా! వాడు మంధబుద్ధి అని మీరే అంటుండేవారు. బాగా చదువుతున్నామని మా ఇద్దరినీ అనేవారు. కానీ వాడికి మాత్రమే ఇంటికి వెళ్లేదానికి అనుమతినిచ్చారు ఎందుకని? అడిగారు.

గురువుగారు ఆ ఇద్దరితో ప్రేమపూర్వకంగా, వాత్సల్యంతో, నాయనలారా! మీరన్నది నిజమే. మీరే వాడికంటే బాగా చదివారు. కానీ చదివిన చదువును ఆచరణలో పెట్టడం మీకు అబ్బలేదు. నేర్చిన విద్యను ఆచరణలో పెట్టడం రానపుడు ఆ విద్య ఎందుకు ఉపయోగపడుతుంది? మంద బుద్ధి చదివింది కొంచమే అయినా దానిని ఆచరణలో పెట్టాడు. మీతో పోల్చినపుడు అతడు మీకంటే తెలివైనవాడని నిరూపించు కున్నాడు. అందుకే వాడికి అనుమతినిచ్చాను అన్నాడు. అది విన్న మందబుద్ధి గురుదేవా నేనొక్కడినే ఇంటికి వెళ్ళను. నేనూ మరి కొంత కాలం వారితోపాటు ఉంటాను. ముగ్గురికీ అనుమతి లభించినపుడే కలసి సంతోషంగా వెళతాము అని వినయంగా చెప్పాడు. ఎదగడం అంటే అదే.

ఇంద్రియ నిగ్రహం

పూర్వం అష్టావక్రుడు అనే బ్రహ్మచారి గురువు వద్ద విద్యలన్నీ నేర్చుకొని గృహ స్థాశ్రమం పొందేటందుకు సిద్ధమయ్యాడు. అతడలా కన్య కోసం అన్వేషణ జరుపుతుండగా వదాన్యుడు అనే ఒక తాపసోత్తముని కుమార్తె సుప్రభ అతనికి ఎదురుపడింది. అష్టావక్రుడు తొలిచూపులోనే ఆమెను ఇష్టపడి తన అర్ధాంగిగా స్వీకరించేందుకు నిశ్చయించుకున్నాడు. వదాన్యుడి వద్దకు వెళ్ళి వినయంగా విషయం చెప్పాడు.

తన కుమార్తెను వివాహమాడటానికి అష్టావక్రుడు ఎంత వరకు యోగ్యుడో తెలుసు కోవాలనుకున్నాడు. అందుకు వదాన్యుడు ఒక పరీక్ష పెట్టాలనుకుని అష్టావక్రునితో ఇలా అన్నాడు. తన కుమార్తెనిచ్చి వివాహం చేయటానికి తనకు అభ్యంతరమేమీ లేదనీ, అయితే అందుకు ఒకసారి ఉత్తరదిశగా వెళ్ళి రావలసి ఉంటుంది అన్నాడు.

అష్టావక్రుడు ఆ దిక్కుగా వెళ్ళి తాను ఏం చేయాలో సెలవివ్వవలసిందిగా కోరాడు. మొదట కుబేరుని రాజధానికి వెళ్లమనీ, ఆ తర్వాత హిమాలయాలలో పార్వతీదేవి తపమాచరించిన ప్రదేశానికి వెళ్లిరమ్మని వదాన్యుడు చెప్పాడు. అష్టావక్రుడు అందుకంగీకరించి ఉత్తర దిశగా వెళ్ళి మొదట కుబేరుని రాజధాని హిమగిరిని చేరుకున్నాడు. పార్వతీ పరమేశ్వరుల క్రీడాస్థలిని దర్శించి భక్తితో నమస్కరించాడు. అక్కడి నుండి ముందుకు సాగగా ఒక అరణ్యం చేరుకున్నాడు. అక్కడ ఒక గొప్ప భవనం కనిపించింది. ఆ భవనం వద్ద ఉన్న అందమైన యువతులు అతడిని లోపలికి ఆహ్వానించి సాదరంగా తీసుకెళ్లారు. అక్కడొక స్త్రీ అందాలొలికిస్తూ ఠీవిగా ఆసీనురాలై ఉంది. ఆమె అక్కడున్న వారందరిని పంపించివేసి, ఏకాంతంలో అష్టావక్రుడి సరసన చేరి, అతడిని సరసానికి ప్రేరేపించింది. అవకావశం దొరికినా ఏ మాత్రం చలించక నిబ్బరంగా ఉండిపోయాడు. చలించని అతడిని చూచి పట్టుదలతో మరింతగా రెచ్చగొట్టే ప్రయత్నం చేసేసరికి అష్టావక్రుడు ఇక లాభం లేదని "అమ్మా నీవెవరివో కానీ నన్ను నీ అందచందాలతో, హావ భావాలతో రెచ్చగొట్టి చలించేటట్టు చేస్తున్నావు. కానీ నేను ఇపుడే బ్రహ్మ చర్య దీక్షను పూర్తి చేసి గృహస్థాశ్రమంలోకి అడుగిడబోతున్న వాడిని. సుప్రభ అనే యువతిని వివాహమాడాలని, తన జీవిత భాగస్వామినిగా చేసుకోవాలని మానసికంగా నిశ్చయించుకున్నాను. కావున నీవు ఎంతగా ప్రయత్నించి, ప్రేరేపించినా నాలో చలనం కలగలేదు. కలగదు కూడా" అని వినయంగా చెప్పాడు.

అష్టావక్రుడి బ్రహ్మచర్యదీక్షకు ఆ స్త్రీ ఆశ్చర్యపోయింది. ఆ తర్వాత ఆమె తాను దేవతలు నిన్ను పరీక్షించుటకు పంపగా వచ్చిన మాయా కన్యకను. కఠినమైన ఈ పరీక్షలో అద్వితీయమైన బ్రహ్మచర్యవ్రత నిష్టను పాటించి నెగ్గావు. నిష్టాగరిష్టుడవైన నీకు ఇవే నా నమస్సులు అని చెప్పి వెళ్ళిపోయింది.

* ఎప్పుడైనా ఏ కాలానికైనా గృహస్థాశ్రమానికి ఇంద్రియ నిగ్రహం ఉన్న యువతీ యువకులే అర్హులు.

ఈనాడు యువతీ యువకులు చాలా సులభంగా ఇంద్రియ లోలత్వానికి గురైపోతున్నారు. దానికి కారణం 'శీలం' అనే మాటను పూర్తిగా మరచిపోవడమే. ఆరోగ్యాన్ని, పరువు ప్రతిష్టలను, తల్లిదండ్రుల ఆశలను, తమ జీవిత ఆశయాలను పూర్తిగా విస్మరించడమే.

* తమకున్న రూపలావణ్యాలు, వంపు సొంపులు మగవారికి చూపించడానికి, వారిని ఆకర్షించడానికే కదా ఉండేది అని, యువతులు బరితెగించిపోతున్నారు.
* సహజంగా స్త్రీలు, తమ అందచందాలను ప్రశంసించే వారికీ, మెత్తగా, సున్నితంగా, నెమ్మదిగా బ్రతిమాలుతూ-వెంటపడే వారికీ ఒక వైపు తిరస్కరిస్తూనే, నిదానంగా లొంగిపోతున్నారు. స్త్రీల స్వభావాన్ని గుర్తెరిగి ఆ మాత్రం సహనం, ఓర్పు-నేర్పును చూపిస్తే చాలు తమ వాంఛ తీరిపోతుంది అనే విశ్వాసంతో ప్రయత్నించి యువకులు సఫలమవుతున్నారు.
* పురుషుడు కేవలం స్త్రీ అంద-చందాలకు దాసుడైపోతాడు. స్త్రీ పురుషుని లోని వ్యక్తిత్వాన్ని మాత్రమే చూచేది. మగవాడు స్త్రీ యొక్క అందాన్ని మాత్రమే ప్రేమిస్తాడు, వాంఛిస్తాడు. కానీ స్త్రీ మగవారిలో వ్యక్తిత్వాన్ని, శారీరక, మానసిక దృఢత్వాన్ని, తమ యొక్క భద్రతకు ప్రాధాన్యతను చూస్తారు. ఇదంతా ఒకప్పుడు. ఇప్పుడు కామం - ఆకలిని తీర్చుకోవడంలాంటిదేనన్న తేలిక భావం స్త్రీ పురుషులలో బాగా నాటుకొనిపోయింది.

నిజం చెప్పడానికి ధైర్యం ఉండాలి

ఒక రాజుగారి సభకు వేరే రాజ్యం నుండి ఒక నేతగాడు వచ్చాడు. అతడు చాలా నాజూకైన వస్త్రాన్ని చూపించాడు. రాజు దానిని అధిక మూల్యం చెల్లించి కొన్నాడు.

అదే రాజ్యంలోని నేతగాడికి ఈ విషయం తెలిసింది. చాలా నొచ్చుకున్నాడు. అతడు వెంటనే రాజుగారి దగ్గరికెళ్ళి తనకు లక్ష రూపాయలు ఇస్తే ఆరు మాసాలలో ఇంతకంటే నాజూకైన చీరను ఇంతవరకూ ఎవ్వరూ, ఎన్నడూ చూడనంత అతి సన్నని వస్త్రాన్ని నేసి చూపిస్తానని అన్నాడు. రాజు దానికి అంగీకరించాడు. నేతగాడు ఒక గదిలో అన్నీ తలుపులూ మూసి పని మొదలుపెట్టాడు. అటువైపు వెళ్ళిన వారికి మగ్గం చప్పుడు మాత్రం వినిపించేది. ఆరు మాసాల తరువాత అతడు ఇవిగో నేను నేసిన వస్త్రాలు అని సభకు తెచ్చి చూపించాడు. తాను నేసిన వస్త్రాలు పతివ్రతల భర్తలకు. నిజమైన రాజ భక్తులకు మాత్రమే కనిపిస్తాయని ప్రకటించాడు.

రాజు కళ్లకు ఏ వస్త్రాలు కనిపించడం లేదు. అయినా రాజుగారు ఆహా! ఓహో! ఏమి నాజూకు వస్త్రాలు! శహభాష్ భలేగా నేశారు. అని మెచ్చుకున్నాడు. సభికులకు

కూడా ఎలాంటి వస్త్రాలు కనిపించలేదు. ఆ మాటే పైకి అంటే తమకు రాజభక్తి లేనట్లు అనుకుంటారు, రాజు గారికి కోపం వస్తుందని భయపడి వారు కూడా బాగున్నాయి. చాలా బాగున్నాయి! అని మెచ్చుకున్నారు. ఒక వారం రోజుల తర్వాత జరగబోయే ఉత్సవంలో ఈ వస్త్రాలే ధరించబోతున్నానని రాజు ప్రకటించాడు.

దర్జీని పిలిపించారు. వాడు కూడా నేతగాడి నాటకంలో భాగస్తుడే! బాగా సన్నని దారంతో రాజుగారి దుస్తులు కుట్టబడి సిద్ధమయ్యాయి. వాటిని ధరించి రాజుగారు అంబారీపై కూర్చొని ఉత్సవంలో ఊరేగింపుకు బయలుదేరాడు.

వస్త్ర హీనుడైన రాజును చూచి ప్రజలు ఆశ్చర్యపోయారు. కానీ నోరు విప్పే ధైర్యం ఎవరికుంది? ఊరేగింపు సాగిపోతూనే వుంది. ఒక అమాయకుడైన కుర్రవాడు మాత్రం చూడండి! చూడండి! రాజుగారికి బట్టలు లేవు! అని అరిచాడు. కుర్రవాడి తల్లి వాడి నోరు నొక్కే ప్రయత్నం చేసింది. కానీ వాడు ఊరుకోక కేకలు వేశాడు.

అపుడు ప్రజలలో కాస్త ధైర్యం వచ్చింది. వాళ్ళు కూడా అవును రాజుగారు నగ్నంగానే ఉన్నారు. అనడం మొదలు పెట్టారు. దానితో రాజ సభకు చెందిన వారికి కూడా తెగింపు వచ్చింది. అవునవును రాజుగారు బట్టలు లేకుండానే ఊరేగుతున్నారు అని గొంతెత్తి అనడం మొదలుపెట్టారు. ఇలాగా అన్నీ వైపుల నుండి ఒకే మాట వినబడేసరికి రాజుగారు సిగ్గుతో చితికిపోయి ఊరేగింపును అర్ధాంతరంగా ముగించుకుని రాజ భవనానికి వెళ్లాడు.

* స్వార్థంవల్ల, మొహమాటంవల్ల, చాలామంది నిజం చెప్పేదానికి వెనుకాడుతూ ఉంటారు.
* జంతువులను వేటాడినవారు మనుషులను చంపినవారు ధైర్యవంతులు కారు. మనసులోని మాట ధైర్యంగా చెప్పగలిగినవారే అసలైన ధైర్యవంతులు.

పాఠశాల వాతావరణం, చదువు-చదువుతో పాటు చదువవలసినవి

చదువు బ్రతుకు దెరువు కోసమే కాదు. సంస్కారవంతంగా జీవించడానికి పనిలో నైపుణ్యం పెరగడానికి, లోకజ్ఞానం పెంపొందించుకోవడానికి దోహద పడుతుందన్న భావనతోనే తల్లిదండ్రులు తమ సంతానాన్ని బడికి పంపుతారు. కానీ పిల్లలు ఎప్పుడూ ఆట పాటలతోనే ఆనందంగా ఉండాలనీ, ఇంట్లోనే తల్లి దగ్గర ఉండాలనీ, స్వేచ్ఛగా ఉండాలనీ కోరుకుంటారు. బడికి వెళ్లడమనేది వారి స్వేచ్ఛకు గుదిబండగా అనుకుంటూ తల్లి-దండ్రులపై కోపంతో తిరగబడడం, బడికి పోకుండా మొండిగా ఏడుస్తూ క్రిందపడి పొర్లాడుతూ ఉంటారు.

"బడిఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి." "పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి" "పిల్లలు పనిపిల్లలూ కాదు. బానిసలు అసలె కాదు". బడిలో చదువుకోవాల్సిన వారు "అందరూ చదవాలి-అందరూ ఎదగాలి", అని చెప్పడమే కాదు. బడి వాతావరణం పిల్లల మనసులను ఆకట్టుకునేలా ఉండాలి. తోటి పిల్లలతో ఆడుతూ - పాడుతూ

తెలియకుండానే కాలం కరిగిపోయేటట్లుగా ఉండాలి. ఎపుడు తెల్లవారుతుందా, బడికి ఎప్పుడెపుడు వెల్దామా అనే ఆలోచన పిల్లలో కలగాలి. అలాంటి వాతావరణంలోనే పిల్లలు స్వేచ్ఛగా, ఆనందంగా చదువుకుంటున్నాము అనే బలవంతపు భావన లేకుండా శ్రద్ధగా వినడం, చక్కగా మాట్లాడటం, శుభ్రంగా, సుందరంగా వ్రాయడం, స్పష్టంగా చదవడంలాంటి నైపుణ్యాలను నేర్చుకోగలుగుతారు. మాతృభాషను నేర్చుకోవడం అంటే తల్లి చూపించే ప్రేమ, వాత్సల్యంలాంటి కోమలమైన భావాలను పెంపొందించు కోవడమే. భవిష్యత్తును గురించి మంచి కలలు కంటూ, మంచి ఊహలనూ, ఆలోచనలనూ కలిగి అందుకు తగ్గట్టుగా శ్రమిస్తూ గట్టి పునాదులు వేసుకోవడమే. జాతీయ భాషను నేర్చుకోవడమంటే జాతీయతా భావనను పెంపొందించుకోవడమే. దేశంలో ఏ మారుమూల ప్రాంతానికైనా వెళ్ళి రావచ్చునన్న ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవడమే. లెక్కలు నేర్చుకోవడం అంటే, ఏ విషయంలోనైనా గురి తప్పని విధంగా లెక్కాచారంగా ఆలోచించడమే. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ముఖ్యంగా ఆర్థిక సమస్యలను పరిష్కరించుకోవడానికి లెక్కాచారం 'మ్యాథమాటికల్ అనాలసిస్' అవసరం. అది గణిత విద్య ద్వారా మాత్రమే సాధ్యం.

జీవితంలో ఊహించని సంఘటనలను ఎదుర్కోవలసివస్తుంది. అలాంటప్పుడు ఏ విధంగా ఆలోచించాలి? ఏ విధంగా నడచుకోవాలి అనే జాగరూకతను పెంపొందించు కోవడానికీ, జీవితాన్ని సార్థకం చేసుకోవడానికీ తరగతి పుస్తకాలతో పాటు చదవవలసినవి కూడా ఉన్నాయని తల్లిదండ్రులు, పిల్లలు తప్పనిసరిగా తెలుసుకోవాలి. అందుకు తగ్గ ప్రోత్సాహాన్ని ఇస్తూ, అందుకు తగ్గ అలవాటును పిల్లల్లో పెంపొందింపచేయాలి. తల్లిదండ్రులు తాముకూడా ఏదో ఒక పుస్తకం చదువుతూ పిల్లలకు ఆదర్శంగా ఉండాలి.

"అట్లాస్" ఇది మనోల్లాసాన్ని కలిగించే పుస్తకం. మనదేశం ఎక్కడుంది? మన రాష్ట్రం ఎక్కడుంది? మన జిల్లా, మన ఊరు ఎక్కడుంది? అనే ప్రశ్నలతో మొదలై ప్రపంచ దేశాలనూ, సప్త సముద్రాలనూ చూపించే ఏకైక రంగుల చిత్రపటాల పుస్తకం. సరదాగా అపుడపుడు చూడడం వలన దిశలు, దూరాలు, ఎల్లలు తెలుస్తాయి. భూగోళ-ఖగోళ శాస్త్ర ప్రాథమిక పరిజ్ఞానం చక్కగా అలవడుతుంది. ఎక్కడికైనా వెళ్ళి రావచ్చునన్న ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

దిన, వార పత్రికలు చదవడం వలన దేశ-విదేశ వార్తలు, వింతలూ, విశేషాలు బాగా తెలుస్తాయి. జరుగుతున్న సంఘటనలను గురించి మిత్రులతో చర్చించటం జరుగుతుంది. మంచి-చెడుల విశ్లేషణాపరిజ్ఞానం చక్కగా అలవడుతుంది.

కాబట్టి ప్రతి విద్యార్థి తరగతి పుస్తకాలే కాకుండా పైన తెలిపిన పుస్తకాలు కూడా చదివితేనే జీవితంలో సఫలుడవుతాడు. కేవలం ఉద్యోగంతోనే కాకుండా

స్వంతంగా ఏ పనినైనా చేసి స్వయంకృషితో జీవించ గలుగుతాం. అనే ధీమా మనసులో కలుగుతుంది. ఇతరులకూ ఆదర్శవంతుడవుతాడు.

ఇన్ని రకాల పుస్తకాలను చదవాలి అంటారు. బాగానే ఉంది. కానీ ఒక సామాన్యుడికి సాధ్యమా? అవును సాధ్యమే. మనసుంటే మార్గముంటుంది. దగ్గరిలోని గ్రంథాలయానికి వెళ్ళినట్లయితే ఆసక్తికి తగ్గట్లు పుస్తకాలను ఎన్నుకొని చదవవచ్చు. జ్ఞానాన్ని సంపాదించుకొనవచ్చు.

తరగతి పుస్తకాలు తప్పనిసరిగా చదవవలసి వుంటుంది. ప్రతిరోజూ చదివి చదివి, వ్రాసి వ్రాసి ఒక్కోసారి విసుగు కలుగుంది. అలాంటపుడు విసుగును తొలగించుకొనేదానికి మనోల్లాసం కలగడానికీ 1) నీతి శతకాలు 2) గొప్పవారి జీవిత చరిత్రలు 3) మతగ్రంథాలు 4) డిక్షనరీ 5) అట్లాస్ 6) దిన, వారపత్రికలు. మొదలగువాటిని చదివే అలవాటు చేసుకోవాలి. అందువలన అందరికంటే అదనపు జ్ఞానం లభిస్తుంది. వక్తృత్వం, వ్యాసరచన లాంటి పోటీలలో పాల్గొనవచ్చు. ఉద్యోగాల కొరకు పరీక్షలు వ్రాయవచ్చు, అంతేకాక ఈ అలవాటు మిమ్ములను, మీ సహచరులలో ఒక ఉన్నత స్థానంలో నిలబెడతాయన్న సత్యాన్ని గ్రహించాలి.

నీతి శతకాలను చదవడం వల్ల మానవుల స్వభావాలు తెలుస్తాయి. నీతిగా ఎలా జీవించాలో తెలియజేస్తాయి. నైతికతే మనిషి జీవితానికి పునాది అనే విషయం బోధపడుతుంది.

గొప్పవారి జీవిత చరిత్రలు చదివినందు వలన, జీవితం వడ్డించిన విస్తరి కాదు అని తెలుస్తుంది. ఎన్నోకష్టాలను అనుభవించి ఆ స్థాయికి వచ్చారని తెలుస్తుంది. జీవితంలో ఎదురయ్యే సమస్యలను ప్రలోభాలకు లోను కాకుండా ఎలా పరిష్కరించాలో తెలుస్తుంది. ఆదర్శభావాలు పెంపొందుతాయి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.

మత గ్రంథాలు చదవడం వలన మనిషి ఎలా జీవిస్తే మహాత్ముడవుతాడు అనే విషయం బోధపడుతుంది. మనిషి జీవితానికి అర్థం మహాత్ముడైనపుడేనని అర్థమవుతుంది.

సరదాగానూ, ఒక్కోసారి అవసర నిమిత్తం తిరగవేయవలసిన పుస్తకం డిక్షనరీని పరిశీలించినందువలన ఎన్నో అర్థాలు తెలుస్తాయి. ఒక పదానికి అర్థం వెదుకు తున్నప్పుడు ఎన్నో పదాలకు అర్థాలు తెలుస్తాయి. ఆ విధంగా పేజీలు తిరగేసేటప్పుడు కాలాన్నికూడా ఒక్కోసారి మరచిపోతాం. అంతటి ఆసక్తిని ఆ గ్రంథం కలిగిస్తుందంటే ఆశ్చర్యం వేస్తుంది. దాని ప్రత్యేకతే అదే.

అయోమయం శిష్యులు

పూర్వం ఒక గురువుండేవాడు. ఆయనకు సుశ్రూషలు చేస్తూ ఒక శిష్యుడు ఉండేవాడు. ఇలా ఉండగా కొంత కాలానికి మరొక శిష్యుడు గురువు దగ్గర చేరాడు. ఇద్దరు శిష్యులూ భక్తితో గురువుకు సేవలు చేస్తూ విద్యను అభ్యసిస్తూ ఉన్నారు.

ఒకనాడు గురువు మధ్యాహ్న సమయంలో గ్రామాంతరం వెళ్లి, తిరిగి వచ్చి బడలిక చేత చాపపై పండుకొని విశ్రాంతి తీసుకోబోతూ తన మొదటి శిష్యుణ్ణి పిలిచి నాయనా కాళ్ళు నొప్పిగా ఉన్నాయి కొంచెము సేపు వొత్తరా! అని చెప్పాడు.

శిష్యుడలాగే గురువుగారూ! అని సేవించుటకు ఉపక్రమిస్తూ ఉండగా, రెండవ శిష్యుడుకూడా గురువు పాదాలను వొత్తుటకు హాజరై, గురువుగారితో ఒక విన్నపము చేసుకున్నాడు. మహాత్మా! ఇతడు పాతవాడు, చాలా కాలము నుండి తమరి సేవ చేసుకొనుచున్నాడు. ఆ విధంగా ఇప్పటికే ఎంతో పుణ్యాన్ని సంపాదించుకున్నాడు. నేనింత వరకూ గురుసేవా భాగ్యమునకు నోచుకోలేదు. అందుకని అవకాశమంతా పాత శిష్యునికే దక్కడం న్యాయ సమ్మతం కాదుకదా! కాబట్టి ఈరోజుకు అతడిని నిలిపివేసి ఈ అవకాశమును నాకే ఇప్పించవలెనని వేడుకొనుచున్నాను.

మొదటి శిష్యుడేమీ తక్కువ తినలేదు. వెంటనే ఉగ్రరూపం దాల్చి, గురువర్యా! అతని మొర ఆలకించవద్దు. క్రొత్తవాడికి కాళ్లు వత్తే అనుభవం బొత్తిగా లేదు. అనవసరంగా తమరు బాధకు గురౌతారు. ఏ ఉద్యోగమునకైననూ అనుభవమునకే ఎక్కువ ప్రాధాన్యాన్నిచ్చెదరు. అదే న్యాయ సమ్మతం, లోకధర్మం. తమకు తెలియనిదేమున్నది? అని మౌనం వహించాడు. ఈ ప్రకారంగా ఆ ఇద్దరూ శిష్యులు లేనిపోని సమస్యను తెచ్చి గురువు నెత్తిన బెట్టారు.

ఏమి చేయుటకు దిక్కుతోచక, చివరకు మధ్యే మార్గమును కనుగొని ఇద్దరినీ దగ్గరికి పిలిచి! ఒరే నాయనలారా! మీలో మీరు జగడములాడకుండా భగవంతుడిచ్చిన రెండు కాళ్లను చెరొకటి పంచుకొని భక్తిగా సేవించుకొండి, ఈనాటి ఈ పీడకు ఇదియే విరుగుడు అని చెప్పాడు.

శిష్యులిద్దరూన్నూ భేష్‌భేష్ అని సంతోషించి చెరొక కాలును పంచుకొని సేవించను మొదలుపెట్టారు. ఇలా సేవ కొనసాగుతుండగా కొద్ది సేపటికి పొరపాటున ఒకరు ఒత్తుచున్న కాలు మరొక దానికి కొద్దిగా తగిలింది. అవతలివాడు కోపగించుకొని ఏమిరా? ఒళ్ళు దగ్గర పెట్టుకొని చెయ్యవలెనని తెలియదా ఏమి? అని మందలించి ప్రతి చర్యగా తాను వొత్తుచుండిన గురువు కాలును ఎత్తి అవతలి దాని మీదికి విసిరికొట్టాడు. వాడున్నూ రౌద్రాకారంతో ఒరే! నా కాలును కొట్టావు కదా? నీ కాలు పనికూడా పడతాను చూడు అని దగ్గరలోనున్న గురువుగారి చేతి కర్ర అంది పుచ్చుకొని అవతి కాలి మీద బలంగా ఒక్కటిచ్చాడు. రెండవ వాడు కూడా ప్రళయరుద్రుడై, గురువుగారు కూర్చొనే పీటను అందిపుచ్చుకొని ఇవతలి కాలును చావమోదాడు. ఈ గలాటాకు గురువుకు నిద్రాభంగమై లేచి కూర్చొని, ఓరి అమాయకులారా నా కాళ్ళకు-లేని బాధలు తెచ్చి పెట్టారు కదరా! అని వాపోతూ, ఎందుకురా మీకు ఈ తగవులాట అని అరవగా ఆ శిష్యులిరువురూ మహాత్మా! తమరు నిశ్చింతగా విశ్రాంతి తీసుకోండి. ఇది మా అంతరంగిక వ్యవహారం. ఇదేదో ఈనాడే తేలిపోవాలి. వాడి కాలు గొప్పదో, నా కాలు గొప్పదో అని ముక్త కంఠంతో పలికారు.

అంతట గురువు ఒరే నీ కాలు, వాడికాలు ఏమిట్రా ఆ రెండున్నూ నా కాళ్లే కదరా! ఎంత తెలివి తక్కువ దద్దమ్మలురా మీరు అని తిట్టి ఇరువురిని దూరంగా పంపించి వేశాడు.

గురువును మించిన శిష్యుడు

పూర్వం ద్రవిడ రాజ్యంలో శ్రీ భాషాచార్యుల వద్ద యమునాచారి అనే పన్నెండు సంవత్సరాల బాలకుడు శిష్యుడుగా ఉంటూ విద్యనభ్యసిస్తూ ఉండేవాడు. శ్రీ బాషాచార్యులు చాలా గొప్ప పండితులు. ఐనా ఏమి తెలియని వానివలె నిరాడంబరంగా, ప్రచారాలకు దూరంగా, నివురు గప్పిన నిప్పులాగా జీవిస్తూ ఉండేవారు.

ఆ కాలంలోనే పాండ్య దేశంలో విద్వజ్జన కోలాహల పండితుడనే ఒక ఉద్దండ పండితుడుండేవాడు. ఆయన తన వాక్పటిమతో, పాండిత్యంతో దేశ దేశాలలోని పండితులను షరతులు పెట్టి ఓడించి, తన విజయానికి గుర్తుగా, పాండిత్య శుల్కంగా కొంత మొత్తమును సంవత్సరానికి ఇంత అని వసూలు చేసుకొని సుఖ భోగాలు అనుభవిస్తూ ఉండేవాడు.

ఇలా ఉండగా ఒకరోజు శ్రీ బాషాచార్యులవారి వంతు వచ్చింది. పాండిత్య పోటీకి రమ్మని ఆ విద్వజ్జన కోలాహల పండితుడు కబురంపగా-మృదుస్వభావులైన శ్రీ భాషాచార్యుల వారు ఎందుకొచ్చిన గొడవని తలచి కప్పం చెల్లించడానికి సిద్ధపడి, కొంతకాలం చెల్లించాడు. తర్వాత రెండు సంవత్సరాలుగా శ్రీ భాషాచార్యుల వారి పరిస్థితి బాగోలేక ఆ కోలాహల పండితునికి కప్పం పంపలేకపోయాడు.

బాకీ రాబట్టుకోవడానికి కొలాహల పండితుడు ఒక సేవకుడుని పంపాడు. ఆ సేవకుడు వచ్చిన సమయానికి శ్రీ భాషాచార్యుల వారు కార్యార్థమై పొరుగూరికి వెళ్ళి ఉండినాడు. ఇంటి వద్ద యమునాచారి వేదాలను వల్లె వేస్తూ ఉండినాడు. ఆ కారణంగా కోలాహల పండితుడు పంపగా వచ్చిన వాడి రాకను గమనించలేదు.

అందుకు సేవకుడు అహంకారంతో "నేనెవర్కైంది తెలీదా? ఇంత కండకావరమా అని పరుష వాక్యాలను పలకి పండిత శుల్కం ఎందుకివ్వలేదు? ఇవ్వనందున పాండిత్య వాదమునకు సిద్ధపడుతున్నారని అర్థం చేసుకొనవలసివస్తుంది. అపుడు మా గురువుగారి చేత ఓడింపబడి, అవమానాలపాలు కావలసివస్తుంది. కాబట్టి పండిత సుంకమును వెంటనే కట్టండి" అని బిగ్గరగా దుయ్యబట్టినాడు.

అపుడు యమునాచారి గురునిందను సహించలేక ఓరీ దుష్టుడా! నీ వెటువంటి వాడివో నీదుష్ట స్వభావము చెప్పుచున్నది. నీ స్వభావము మీ గురువు ఎట్టివాడో తెలియజేస్తున్నది. నీ గురువు నిజంగా మంచి పండితుడైతే నీలో వినయం కనిపించాలి. అది నీలో కనిపించలేదు. కాబట్టి నీ గురువు ఎలాంటివాడో స్పష్టమవుతూ వుంది. మీ గురువును ఓడించే దానికి మా గురువంతటివాడు కావలెనా? నేను చాలు. నా గురుదేవులు

నిజమైన విద్య మాకు నేర్పించారు. కావున నేను వినయంగా నీ దుష్ట స్వభావమునకు కోపగించుకొనక వినయంగా చెప్పుచున్నాను. మీ గురువు గారికి చెప్పు "పాండిత్య వాదమునకు నన్ను రమ్మంటాడో లేక వారే వస్తారో-వెళ్లు" అని సవాలు విసిరాడు. శిష్యుడు వెళ్లి గురువుతో మరికొన్ని ఉన్నవీ- లేనివీ జోడించి, సవాలును గురించి చెప్పాడు.

శ్రీ భాషాచార్యులవారు పొరుగూరునుండి తిరిగి రాగానే యమునాచారి జరిగిన సంగతి వివరించగా అలా జరిగినందుకు చాలా నొచ్చుకున్నాడు.

కొన్నాళ్ళకు పిలుపురానే వచ్చింది. గురుశిష్యులు పరస్పరము తర్కించుకొని, చివరకు గురువు ఆశీస్సులు పొంది యమునాచార్యులు పోటీ కొరకు పాండ్య దేశానికి వెళ్లాడు.

బాగా ప్రచారమైన ఈ సంఘటన ప్రజలలోనూ, పండితులలోనూ ఆసక్తిని రేకెత్తించింది. పోటీకి పాండ్య దేశ రాజు-రాణి అధ్యక్షులుగా, న్యాయ నిర్ణేతలుగా నిలిచారు. తన దేశ పండితుడు చాలా ఉద్దండుడు, ఎవరూ ఓడించలేరనే ధీమాతో - ఓడించినవాడికి అర్థ రాజ్యమిస్తానని ప్రకటించాడు.

కోలాహల పండితుడు అర్భక యమునాచారిని చూచి వీడేనా! నన్నెదుర్కొనేది అని ఆశ్చర్యచకితుడైనాడు. యమునాచారి మొదట రాజుకు, తర్వాత రాణికి, తదితర పెద్దలకు కోలాహల పండితవర్యులకు సాదర నమస్కారములనందించి, తన సంస్కారమును ప్రకాశింపజేసి, సభ అనుమతితో వాదమునకు సిద్ధపడినాడు.

బాలకుడే కదా అని అమరకోశం, వ్యాకరణం మొదలగు గురుకుల పిల్లలు చదువుకునే పాఠముల నుండి చిల్లర ప్రశ్నలడిగాడు కోలాహల పండితుడు.

కానీ యమునాచారి ఏమండీ కోలాహల పండితులవారూ! పిల్లవాడనని జాలితో చిల్లర ప్రశ్నలు వేస్తారేమో అలా వేయకండి. పాండిత్యానికీ వయసుతో పనిలేదు. కాబట్టి వాదమునకు సిద్ధపడి సరిగ్గా తలపడండి లేదా? నేనే ప్రశ్నలు వేస్తాను ఖండించండి అని హెచ్చరికగా చెప్పాడు. సరే నీవే ప్రశ్నలు వేయ్ చూద్దాం అన్నాడు. చూద్దాం కాదు! కాసుకోమరి! అని యమునాచారి మూడు సిద్ధాంతాలను ప్రతిపాదించి, షరుతులు కూడా విధించాడు. మూడు ప్రతిపాదనలలో ఏ ఒక్క దానినిగానీ, మూడింటినిగానీ, ఖండించినా, అసత్యమని ఋజువు చేయగలిగినా, నేను ఓడినట్లే. అలా కానిచో తమరే ఓడినట్లు అన్నాడు. కోలాహల పండితుడు మరియు సభంతా అందులకు సమ్మతించారు. అయితే వినండి ! నా మొదటి ప్రతిపాదన:- మీ తల్లిగారు గొడ్రాలు కాదు - దీనిని ఖండించండి లేదా ప్రతివాదం చెయ్యండి. కోలాహల పండితుడు దిమ్మెర పోయాడు. ఆయన తల్లిగారు సభలో సలక్షణంగా కూర్చొని ఉన్నది.

ఈ సభాధ్యక్షులూ, న్యాయ నిర్ణేతలూ అయిన ఈ దేశపురాజు పాండ్యరాజు మహాధర్మాత్ముడు ఇది నా రెండవ ప్రతిపాదన ఖండించండి? లేదా వాదించండి?

కోలాహల పండితుడు నివ్వెరపోయి తలపట్టుకున్నాడు. నా దేశరాజు ధర్మాత్ముడు కాదని అనగలడా? ఒక వేళఅంటే తన తల మెడమీద నిలుచునా? ఖండించినా, ఖండించకపోయినా పరాభవమే నని తలదించుకున్నాడు.

సరే ఇక నా మూడవ ప్రతిపాదన చేతనైతే దీనినైనా ఖండించండి లేదా వాదించండి ఈ పాండ్యదేశ రాణిగారు సావిత్రిదేవి వంటి పతివ్రత. ఖండించండి, లేదా వాదించండి. వాదించడమంటే యమునాచారి ప్రతిపాదన సరియైనది కాదని వాదించాలి. దీనితో కోలాహల పండితుని మదిలో నిజంగానే కలకలం మొదలైంది. సభంతా ఒకటే కరతాళధ్వనులు. కోలాహలునికి రోషం ముంచుకొచ్చి, నీవు కుర్ర కుంకవు. నీకేం తెలీదు! శాస్త్రాలలోని విషయాలనే అడగాలి కానీ ఇలా కుట్రలు పన్నకూడదు అని, అవాకులు - చెవాకులు వాగాడు. సభంతా వాహ్! వాహ్! భళిరా భళీ! అని ఒకటే గోల. కోలాహల పండితునికి నోటమాట రాలేదు.

యమునాచారి ఇక మౌనం విడచి నేను ప్రతిపాదించిన ప్రమాణాలను నేనే ఖండిస్తాను ఆలకించండి అన్నాడు. నీ తల్లి గొడ్రాలు కాదు అన్న నామొదటి ప్రతి పాదన తప్పు అని నేనే ఖండిస్తున్నాను. ఎలాగంటే?.... మను ధర్మశాస్త్రంలో "ఏక పుత్రస్య పుత్రః లోకవాదాత్" నీ తల్లికి నీవొక్కడివే కుమారుడవు కనుక ఒకే కుమారుడు కలవారు పుత్ర హీనులతో సమానం. అన్న ధర్మశాస్త్రం ప్రకారం నీ తల్లి అపుత్రకురాలు. (సంతానము లేనిది.) ఈ విధంగా నేనే నా మొదటి ప్రతిపాదనను ఖండిస్తున్నాను. అనగానే సభలో హర్షధ్వనులు మారుమ్రోగాయి.

ఈ రాజు ధర్మాత్ముడు అన్న నా వాదనను ఖండిస్తున్నాను. ఎలాగంటే-ప్రస్తుతం కలియుగంలో ధర్మదేవత ఒక పాదంపై మాత్రమే నడుస్తున్నది. అధర్మం మూడు పాదాలపైన ఉన్నది. ప్రజలను పాలించే రాజుకు ప్రజల యొక్క పాప పుణ్యాలలో ఆరవ భాగం లభిస్తుంది. భాగవతాది ప్రమాణాల ప్రకారం రాజు తానెంత ధర్మవ్రతుడైనప్పటికీ ప్రజలందరూ చేసిన పాపం చాలా ఎక్కువగానే ఉంటుంది. కనుక ఈ రాజు పూర్తిగా ధర్మ ప్రభువు కాదు.

"ఈ దేశరాణి మహా పతివ్రత" కాదు అని నేను ఖండిస్తున్నాను. ఎందుకనగా మనుస్మృతి ప్రకారం 'రాజు' వరుణ, కుబేర, యమ మొదలైన వారి సామూహిక మూర్తిగా ఉన్నందున రాజును పరిణయమాడిన మహారాణి పతివ్రత కాదు.

ఈ విధంగా గెలిచిన యమునాచారిని మహారాజు సకల విధముల సత్కరించి అర్ధ రాజ్యమివ్వబోగా-మహారాజా! నేనెంతవాడను మీ సత్కారములను స్వీకరించేదానికి? నా ఈ ప్రతిభ అంతా నా గురువులదే! నాదేమీలేదు! కావున సమస్త సత్కారాలు నా గురుదేవులకు చెయ్యండి అని వినయంగా తెలిపాడు.

అర్థం - 5

మనిషి సాధించ వలసిన పురుషార్థాలలో అర్థ సాధన రెండవది. గృహస్థ జీవితం సజావుగా సాగాలంటే అవసరాలకు తగ్గట్టు ఆర్థిక పుష్టి ఉండాలి. అందుకోసం మనిషి ధర్మబద్ధంగా ధనాన్ని సంపాదిస్తూ కోరికలు, (కామము) అవసరాలు తీర్చుకోవాలి.

ప్రతి మనిషి సుఖ-సంతోషాలతో జీవించాలని కోరుకుంటాడు. అందుకోసం ధనం సంపాదించాలి. చీమల్లాగా, తేనెటీగల్లాగా నలుసులన్నీ పోగు చేసుకున్నట్లు ఆనందాలను, అనుభవిస్తూనే, సౌకర్యాలను వృద్ధి చేసుకుంటూనే, మరోవైపు ఆరోగ్యరీత్యా అవసరాలకు గాను కాస్తోకూస్తో వెనకేసుకుంటాడు. అంతవరకు సమ్మతమే కానీ, వీటినన్నింటినీ ఎలా సంపాదిస్తున్నాడు? అనేదే ప్రశ్న?

మనిషి ఏ ప్రయత్నంలో ధనం సంపాదించినా అది ధర్మబద్ధంగానే ఉండాలి. కష్టార్జితమై ఉండాలని శాస్త్రం చెబుతుంది. ధర్మ బద్ధమైన, కష్టార్జితమైన సంపాదనతో అవసరాలు తీర్చుకోవాలి. ఇల్లు కట్టుకోవాలి. ఇల్లాలిని తెచ్చుకోవాలి. సౌకర్యాలను కలుగజేసుకోవాలి. సంతానాన్ని ఆరోగ్యవంతులుగా, సంస్కారవంతులుగా సమాజానికి ఉపయోగపడే వారుగా తయారు చెయ్యాలి. అత్యవసరాలకూ కొంత దాచుకోవాలి.

* "ధనం మూలం మిదం జగత్" డబ్బే ప్రపంచాన్ని శాసిస్తోంది. భూమి సూర్యుని చుట్టూ తిరగడం ఎంత నిజమో డబ్బు చుట్టూ ప్రపంచం తిరగడం అంతే నిజం.

ఆశలేకాదు అర్హతలూ ఉండాలి. అవకాశాలూ రావాలి!

ధనికుల పిల్లలు, సూటు, బూటు, టై కట్టుకొని కాన్వెంట్లకు వెళుతుంటే తమ పిల్లలుకూడా అలా చదువుకోవాలని ఇళ్లలో పాచి పనిచేసుకొని బ్రతుకులీడ్చే పనివారి మనసు కూడా ఆరాటపడుతుంది. కానీ, అర్హతలూ, అవకాశాలూ ఉన్నాయా? లేవు! మరి ఆరాటపడవచ్చా? అందని పండ్లకు అర్రులు చాచవచ్చా?

ఇదిగో ఇలాంటి సందర్భాలలోనే మనసును సముదాయించుకోవాలి. అదుపులో పెట్టుకోవాలి. ఏ పనీ దొరకక ఆకలితో అలమటించే రోజులలో పనిదొరికి ఇంత తినగలిగితే చాలు దేవుడా! అని వాపోతారు. తీరా పనిదొరికి, తినేదానికి ఇంత తిండి దొరికి, తలదాచుకునే దానికి ఇంత చోటు దొరికితే తృప్తిపడాలి. ఈపాటి వసతి, అవకాశంకూడా లేనివాళ్ళు ఎంతోమంది మనకళ్లెదుటే ఉంటారు. వారిని చూచి జాలి చూపించాలి. వారి కంటే మన బ్రతుకులే నయంకదా? అని తృప్తిపడాలి. తృప్తి అనేది లేక కలిగిన ఆశలకు, చెలరేగిన కోరికలకు రెక్కలువస్తే నేరాలు-ఘోరాలు జరుగుతాయి.

కష్టానికి తగ్గ ప్రతిఫలం లేదని, నిజాయితికి తగిన గుర్తింపు లేదని, ఇప్పటికిప్పుడే ఎంతో ఎత్తులకు ఎదిగిపోవాలనీ, అడ్డదారుల తొక్కి అడ్డగోలుగా బ్రతికి అందరినీ ఇబ్బందిపెట్టి, తానూ కష్టపడి చివరకు ఉన్నదంతా ఊడ్చి పెట్టుకుపోయి, అవమానాల పాలైన వారిని చూచి అలాంటి బ్రతుకులు, మనకొద్దు అని నిశ్చయించుకోవాలి.

నిజాయితీతో కష్టపడి పనిచేస్తే ఏనాటికైనా గుర్తింపు వస్తుంది. నిలకడ కలిగిన బ్రతుకు కుదురుతుంది. కష్టార్జితంతోనే మన అవసరాలు, కోరికలు తీర్చుకోవడానికి తగిన అవకాశాలు కూడా అందుబాటులో ఉంటాయి. అంతేకానీ అత్యాశలకుపోయి, ఆకాశానికి నిచ్చెనలు వేస్తే అధఃపాతాళానికి దిగజారడం ఖాయం.

అడ్డదారులలో విజయం సాధించడం ఇష్టంలేక, నిజాయితీగా ప్రయత్నించేవారు గమ్యానికి చేరుకునే సరికి పుణ్యకాలం కాస్తా ముగిసిపోయి శరీరం, మనసు అలసి, సొమ్మసిల్లి పడిపోయి, దయనీయస్థితి దాపురిస్తున్నది. ఈలోగా అడ్డగోలుగా పరిగెత్తినవారే అగ్రభాగాన నిలుస్తున్నారు. తమదైన శైలిలో తనివి తీరా చేయగలిగినదంతా చేసేసి, దండు కోగలిగినంతా దండుకొని, ఆపై ఎవరు వస్తే ఏం? ఏమి చేస్తే ఏం జరుగుతుంది? అనుభవించవలసినదంతా అనుభవించాను, దోచుకున్నదంతా దోచుకున్నాను ఇక ఏమైతే నేం? అని ధీమాగా ఉంటున్నారు.

ప్రస్తుత కాలంలో పురుషార్థాలలో మొదటిది, చివరిది, కనుమరుగైపోయింది. అర్థ-కామాల సాధనే పరమావధిగా మారిపోయింది. జీవితంలో ఏదైనా సాధించడం అంటే అది కేవలం ధనాన్ని సంపాదించడమే అనుకుంటున్నారు.

ధన, కనక, వస్తు వాహనాలను, భవనాలు,పొలాలు, తోటలను, అధికారాలను ఇంకా ఇంకా సంపాదించాలనే యావ తప్ప ఈనాడు ధర్మం అనే మాట ఏనాడో గాలిలో కలిసిపోయింది. వాళ్ళు ఎన్ని ప్లాట్లు కొన్నారు? ఎంత బంగారం కొన్నారు? ఆర్థికంగా ఎంత ఎదిగిపోయారు? మన పరిస్థితి మాత్రం "ఎక్కడ వేసిన గొంగళి అక్కడేనన్నట్లుంది". అనే దిగులు, ఆరాటం, తప్ప మనసులో మరో భావన ఉండటం లేదు.

మనిషి బ్రతకడానికి డబ్బు అవసరమే కానీ, డబ్బు సంపాదించడమే మనిషి జీవితం కాకూడదు. డబ్బు సంపాదనలోనే సౌఖ్యం ఉందనుకొని రేయనక-పగలనక నిద్రాహారాలు మాని అలుపనేది లేకుండా సంపాదించి, ప్రతి పైసా కూడబెట్టి అవసరాలకు అరకొర ఖర్చుచేసి, పిసినారితనంతో కుటుంబ సభ్యులను, మిత్రులను బాధపెట్టి డబ్బులు మూటలు కడితే ఎవరికి లాభం? తానునుభవించక, తనవాళ్లనూ సంతోషపెట్టలేక, సమాజహితాన్ని కోరనూలేక, దాన ధర్మాలు చెయ్యనూలేక కూడబెట్టిన ధనానికి సార్థకత ఏముంటుంది? జీవితానికి పరమార్థం ఏముంటుంది?

శుక్రవారం పట్టింపు ప్రాణానికి ముప్పు

ఒక ఆవిడకు శుక్రవారం పట్టింపు ఉండేది. శుక్రవారం నాడు ఇంటినుండి ఒక్క పైసా కూడా బైటకి తీసేదికాదు. ఎంత అవసరం వచ్చినా సరే! ఇంటి సభ్యులకెవ్వరికీ ఒక పైసాకూడా ఇచ్చేదికాదు. ఎవరైనా తనకు ఇస్తే మాత్రం లక్షణంగా తీసుకుంటుంది.

ఒకసారి ఆమె భర్తకు గుండెపోటు వచ్చింది. ఆయన దురదృష్టం కొద్దీ ఆ రోజు శుక్రవారం. గ్రామంలోని డాక్టరు పరీక్షించి ఈయనను వెంటనే ఏదైనా పెద్దాసుపత్రికి తీసుకెళ్ళి చూపించండి. ఆలస్యం చేస్తే పెద్ద ప్రాణానికే ముప్పు అని హెచ్చరించాడు. కానీ ఆ ఇల్లాలు తన కుమారులతో ఈరోజు శుక్రవారం నేనొక్క పైసాకూడా ఇవ్వను. పైగా వేల రూపాయలతో పని; ఇంకేమైనాఉందా? అని భీష్మించుకుంది. పాపం బిడ్డలు తండ్రిని బ్రతికించుకోవాలని ఊర్లోవాళ్ళ నందరినీ డబ్బులు అప్పుగా ఇవ్వండని ఎంతగా బ్రతిమలాడినా! మీ దగ్గరే పుష్కలంగా ఉంచుకొని, మమ్ములనడగడం విడ్డూరంగా ఉంది. మీకేనా శుక్రవారం పట్టింపు మాకు లేదనుకుంటే ఎలా? వీలుపడదు పొమ్మన్నారు. ఇక చేసేదేమీ లేక పాపం ఆ బిడ్డలు తండ్రిని ఎలాగైనా బ్రతికించుకోవాలని, ఆ డాక్టర్‌నే బ్రతిమలాడుకొని ఎలాగైనా ఈరోజు జాగ్రత్తగా చూడండి. రేపు మా తండ్రిని పట్టణానికి తీసుకెళతాము అన్నారు.

కానీ మృత్యుదేవతకు ఆ పట్టింపులేమీ ఉండవు కదా! శనివారం ఉదయమే తండ్రి గుండె ఆగిపోయింది. ఆ మూర్ఖపు తల్లిని, బిడ్డలు, బంధువులు, గ్రామంలోని వారంతా బాగా తిట్టిపోశారు. ఇంటి యజమాని పోయాక ఆమె చేసిన నిర్వాకానికి అయినవారంతా అసహ్యించుకున్న కారణంగా, దిగులుపడి, మరికొద్ది రోజులకే ఆమె కూడా కాలం చేసింది.

* ఒక అందమైన భవంతిని డబ్బుతో కట్టుకోగలం. మమతల కోవెలను నిర్మించుకోలేం.
* ఒక అందమైన మంచాన్ని కొనగలం. కానీ ప్రశాంతమైన నిద్రను కొనలేం.
* రూపాయలు పోసి మందులను కొనగలం. కానీ ఆరోగ్యాన్ని కొనలేం.
* సౌందర్య సాధనాలతో పైపై మెరుగులు దిద్దుకోగలం కానీ అంతః సౌందర్యాన్ని కొనలేం.
* సౌకర్యాలను సమకూర్చుకోగలం కానీ, సంతోషాన్ని పొందలేం.
* ఇంటి నిండా డబ్బులు వంటి నిండా జబ్బులు.

పది తరాలు కూర్చొని తిన్నా తరగనంత ధనం సంపాదించి, దాచటం వలన ప్రయోజనం కంటే అనర్థాలే అధికం. తమ సంతానాన్ని సోమరులుగా, కర్తవ్యహీనులుగా తయారు చేయడమే కాకుండా, దాచబడిన ఆ సంపదను అనుభవించాలనే తాపత్రయంలో, దుష్ట సహవాసాలు, దుర్మార్గపు పనులు చేసి సమాజపీడకులుగా, వంశానికి తలవంపులు తెచ్చేవారుగా నిలబడిపోతారు. కాబట్టి కష్టపడి ధనమును సముపార్జించాల్సిందే. కుటుంబ హితం కొరకు ఒక స్థాయి వరకు దాచుకోవలసిందే. కానీ, సమాజహితం కూడా తప్పనిసరిగా చూడాలి.

ధన సముపార్జన అనే లంపటలో మునిగి, మనిషికి మించిన విలువను డబ్బుకు ఇస్తే, జీవితంలో చాలానే కోల్పోవలసివస్తుందనే సత్యాన్ని గుర్తు పెట్టుకోవాలి. అవసరాలకు పోను మిగులు సంపదలో కొంత ధనాన్ని సమాజ హితానికి వెచ్చిస్తే

తమ సంతానానికి ఆదర్శమూర్తులుగా నిలిచిపోతారు. పుణ్యం - పురుషార్థం కలిసి వస్తుంది. కష్టపడి శక్తి యుక్తులను ప్రదర్శించి తామేమిటో నిరూపించుకునేటందుకు అవకాశం తమ సంతానానికి కల్పించిన వారవుతారు.

నదీ ప్రవాహానికి అటు, ఇటు కరకట్టలు బలంగా ఉంటే ఆ రెంటి నడుమ ప్రవాహం సాఫీగా సాగిపోతుంది. అందువలన ఎవరకీ హాని కలగదు. అలా కాకుండా కరకట్టలు బలహీనంగా ఉంటే వర్షాలు వచ్చినప్పుడు పొంగి ప్రవహించి జనవాసాలను ముంచి, జన, ధన, పంట పొలాలను నాశనం చేస్తుంది. అలాగే ధర్మము-మోక్షము అనే రెండు బలమైన భావాల మధ్య అర్థ-కామాలను సాధించినట్లయితే జీవన స్రవంతి అల్లకల్లోలానికి గురికాకుండా సజావుగా సాగుతుందన్న ఆర్యవాణిని సదా గుర్తించుకోవాలి.

* తన ఆహారాన్ని తాను మాత్రమే తినడం ప్రకృతి. మరొకరి ఆహారాన్ని లాక్కొని తినడం వికృతి. తన ఆహారాన్ని మరొకరి ఆకలి తీర్చడానికివ్వడం సంస్కృతి.

ధన సంపాదనలో దుఃఖం
దాని రక్షణలో దుఃఖం
దానిని కోల్పోతే దుఃఖం
దానిని ఖర్చు పెట్టాలంటే దుఃఖం

ధన సంపాదన వల్ల దుఃఖమే తప్ప సుఖం శూన్యం. ఒకవేళ అంతో ఇంతో సుఖం దక్కినా అది కేవలం భ్రాంతి మాత్రమే." పేరాశ పెక్కు ఇక్కట్లకు ఆలవాలం". దీనిని గ్రహించడం అందరికీ శ్రేయోదాయకం.

అత్యాశాపరులే అవకాశవాదులు. వీరికి ఆత్మగౌరవం అనేది అర్థంపర్థం లేని వేస్ట్ మాటగా వినిపిస్తుంది. స్వాభిమానం, పనికిరాని పిడకలాగా కనిపిస్తుంది. ఎవరెటుబోతేనేం. నా ఆనందం నాది, అని బతకడమొక్కటే వాళ్ళ జీవితాశయం. చీవాట్లు పెడితే ఏంటి? ఛీఛీ అంటే ఏమిటి? ఎంగిలి ఉమ్మేసినా తుడిచేసుకుని ఎవరూ చూడలేదు కదా అని చుట్టుప్రక్కల చూస్తారు. ఒకవేళ నలుగురూ చూచినా ఓస్ ఇంతేకదా చూడనివాళ్లు సవాలక్షమంది ఉన్నారని లోలోన తృప్తిపడతారు. చీము, నెత్తురు, సిగ్గు, శరం, మానం, హీనం, లేని బ్రతుకు రా నీది అంటే చాలా లేటుగా తెలుసుకున్నావు కదరా! అది నీ ఖర్మ అని చిరునవ్వుతో నిష్క్రమిస్తారు.

సమాజంలో ఒకస్థాయి సంపాదించాలి, బాగా గౌరవింప బడాలంటే యమస్పీడుగా ఇప్పటికిప్పుడే ఎదిగిపోవాలి. వయస్సు మీదపడితే ఎవరైనా ఎదుగుతారు. ఛాఛా అలాకాదు! డబ్బుతో ఎదగాలి, హోదాతో ఎదగాలి ఎలా? ఎలా?

నిస్సంతుగాడెవడో బకెట్ తన్నేయాలి, వాడి ఆస్తి అప్పనంగా దక్కాలి, లేదా ఒక లాటరీ అయినా తగలాలి. లంకెబిందె దొరకాలి. అదీ ఛాన్సంటే! ఏదారీ దొరక్కపోతే ఎవరికైనా, ఎప్పుడైనా రడీగా ఉండనే ఉంది. ప్రజాసేవ, రాజకీయం, ఈ రెండు

రంగాలూ నిత్యయవ్వనంతో అందరినీ సదా ఆహ్వానిస్తూనే ఉంటాయి. ఎంత మందికైనా, ఎటువంటి వారికైనా అవకాశాలుంటాయి అందుకోగలిగితే. సుమారైన వాడిని చూచుకొని అప్పుడప్పుడూ చితక తన్నినా, వాటంతప్పి తన్నించుకున్నా గప్పున ఊరంతా పైసా ఖర్చు లేకుండా ప్రచారం జరిగిపోతుంది. పేరు మారుమ్రోగిపోతుంది. కెపాసిటీ తెలిసిపోతుంది. రాజకీయ నాయకులకు అవసరమూ వస్తుంది. అదే అదను. ఇక ఉండనే ఉండాయి. ప్రజాసొమ్మును బొక్కడానికి కాంట్రాక్టులు, రాజకీయ పార్టీలో హోదాలు, భూ కబ్జాలు, బ్యాంకుల్లో బినామి పేర్లతో అప్పులూ ఒకటేంటి సమాజమే వాళ్ళ గుప్పిట్లోకి వచ్చేస్తుంది.

ధనార్జన ధర్మమార్గంలోనే ఉండాలి

భవనాలు, బ్రిడ్జీలు నిర్మించే వ్యాపారమే వృత్తిగాగలవాడు ఒకడుండేవాడు. తన వృత్తిలో సహాయకారిగా ఉండేదాని కోసం నెల జీతంపైన ఒకడిని నౌకరుగా కుదుర్చుకున్నాడు. దాదాపు ముప్పై సంవత్సరాలుగా ఆ నౌకరు ఒక సేవకుడుగా, సలహాదారుడుగా, సహాయకుడుగా ఎంతో విశ్వాసంతో పని చేస్తూ ఉండినాడు.

ఒకరోజు భవన నిర్మాత తన సహాయకుని పిలిచి నేను, ఒక అతి సుందరమైన భవంతిని కట్టించాలనుకుంటున్నాను. అది సాక్షాత్తూ ఇంద్ర భవనంలాగా ఉండాలి. దానిని ఒకరికి బహుమానంగా, నా జ్ఞాపకార్థంగా ఇవ్వాలనుకుంటున్నాను. కాబట్టి ఎంత డబ్బైనా గుమ్మరించే దానికి సిద్ధంగా ఉన్నాను. వస్తునాణ్యతలోగానీ, భవన పటిష్ఠతలో గానీ రాజీపడకుండా అద్భుతంగా కట్టించాలి అన్నాడు. సరేనన్నాడు ఆ సహాయకుడు.

కానీ, తన మనసులో మాత్రం-నేను ముప్పై సంవత్సరాలుగా ఎంతో నమ్మకంగా పని చేస్తూ వస్తున్నాను కదా? ఎన్నెన్ని కోట్ల రూపాయల వ్యాపారాన్ని చేయించి పెట్టాను. నా గురించిగానీ, నా కుటుంబాన్ని గురించిగానీ ఏమైనా ఆలోచించాడా? ఇదిగో ఈ లక్ష రూపాయలు ఉంచుకో! నెలజీతం తప్ప నీకు ఏమీ ఇవ్వలేదు. పిల్లల చదువుల కోసం ఇదిగో ఈ పదివేలూ ఉంచుకో, సొంత ఇల్లు కట్టుకో అని అన్నాడా? ఎప్పుడూ తన వ్యాపార చింత తప్ప, విశ్వాసంగా పని చేస్తున్న నేనొకడిని ఉన్నానని ఆలోచించాడా? ఎన్నో భవనాలను కట్టించిన నాకు మాత్రం ఒక చిన్న ఇల్లు కూడా లేదు. ఇంతకాలంగా విశ్వాసంతో ఉన్న నాకు ఏం మిగిలింది? ఇక లాభంలేదు. నాకుకూడా వయసు పైబడింది. కాబట్టి ఈ భవన నిర్మాణానికి ఖర్చు పెట్టే మొత్తంలోనైనా బాగా మిగలబెట్టుకోవాలి అని తీర్మానించుకున్నాడు. తన మనసులో అనుకున్న విధంగా చౌకగా దొరికే సిమెంటును, ఇటుకలను, చెక్క సామగ్రిని కొనుగోలు చేసి కట్టించాడు. పైకి మాత్రం అతి సుందరంగా, అద్భుతంగా కనిపిస్తుంది. లోపల మాత్రం చాలా బలహీనంగా తయారైన ఆ సుందర భవనాన్ని తన యజమానికి చూపించాడు.

అనతి కాలంలోనే అత్యద్భుతంగా తయారైన ఆ భవనాన్ని చక్కగా పరిశీలించి, కొన్ని సూచనలిచ్చి ఆ విధంగా పూర్తి చేయమన్నాడు. యజమాని సూచించిన విధంగా సవరణలు చేశాడు. చివరగా యజమాని సంతృప్తి చెంది, ఎంతగానో ఆనందించాడు. సహాయకుడిని అభినందించాడు. 'మిత్రమా నా అంచనాలకు తగ్గట్టు చాలా శ్రద్ధగా పని చేశావు. ముప్పై సంవత్సరాలుగా నావద్ద విశ్వాసంగా పని చేశావు. నన్నే నమ్ముకొని ఉన్నావు. నీ సలహాల వల్ల, నీ సహకారంవల్ల నేనూ బాగా పేరు ప్రఖ్యాతులను, ధనాన్ని సంపాదించగలిగాను. నేను నీకు నెల జీతం తప్ప ఇంకేమీ ఇవ్వలేదు, అయినా విశ్వాసంతో రేయింబవళ్ళు కష్టపడ్డావు. నీ కుటుంబంపట్ల కూడా అంత శ్రద్ధ చూపలేక పోయావు. కనీసం స్వంత ఇల్లుకూడా కట్టుకోలేక పోయావు. ఏమిచ్చినా నీ ఋణం తీర్చుకోలేను, నీకంటే నాకు శ్రేయోభిలాషులూ, స్నేహితులెవరుంటారు?

భవనం ప్రారంభించకముందే నీకు చెప్పాను గుర్తుందా? కట్టించబోయే భవనం ఒకరికి ఇవ్వాలని ఆ ఒకరు ఎవరోకాదు. నీవే "చంద్రునికో నూలుపోగు"లాగా ఈ భవంతిని నీ కొరకే కట్టించాను. ఇకపై ఈ భవనానికి యజమానివి నీవే! అందుకు తగ్గట్టుగా, పత్రాలనుకూడా సిద్ధం చేశాను. ఇదిగో ఈ పైకం కూడా నీవు ఉంచుకో అని సంతకం చేసిన చెక్కును చేతిలో పెట్టి, ఇకపై నా వ్యాపారాన్ని నీవే చక్కగా చేసుకో. నా వ్యాపారాన్ని నేను చాలించుకొని నా కుటుంబంతో సహా ఆస్ట్రేలియాకు వెళ్ళి, అక్కడే ఉద్యోగాలు చేస్తున్న నా కొడుకుల దగ్గరే ఉండబోతున్నాం అని ఆప్యాయంగా, స్నేహ పూర్వకంగా కౌగిలించుకొని, వెళ్లొస్తాను అని చెప్పి వెళ్ళిపోయాడు.

యజమాని వెళ్ళిన మరుక్షణమే తాను చేసిన నిర్వాకాన్ని తలచుకొని అయ్యో! హతవిధీ, ఎంత పని చేసుకున్నాను అని తలబాదుకుంటూ కృంగిపోయాడు. త్వరలో కూలిపోబోయే తాను నిర్మించిన భవనంలాగా!

తుది శ్వాస వరకూ ధర్మాచరణను మనిషి వదలిపెట్టనేకూడదు. నీతి నిజాయితీలను వదలి అక్రమంగా, అధర్మంగా ధనాన్ని సంపాదిస్తే అనర్థానికే దారి తీస్తుంది.

అక్రమంగా సంపాదించిన ధనం కొంత కాలం మాత్రమే దగ్గరుంటుంది. దాన్ని చూచుకుంటూ, మురిసిపోతూ నా దగ్గర ఇంత ఉంది, అని తృప్తి పొందుతూ ఉన్న సమయంలోనే ఏదో ఒక అనర్థం జరుగుతుంది. మానసిక వేదనలో. అంతకుముందున్నదీ, ఇపుడు సంపాదించినదీ మొత్తం అంతా పోగొట్టుకోవలసి వస్తుంది. ఇది ముమ్మాటికీ నిజం.

ఉన్నదానితో తృప్తి పడక, పరుల ధనం కోసం, అవినీతి, అక్రమ మార్గాలకు పాలుపడితే అటువంటి వారి వంశం నిలబడదు. నాశనం అయిపోతుంది.

కష్టార్జిత మహిమ

బాల్యంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకున్న శ్రీదత్తుడు తాతయ్య దగ్గర పెరిగి పెద్దవాడయ్యాడు. ఒకరోజు తాత తుది శ్వాస వదులుతూ "నాయనా! శ్రీ దత్తా కష్టపడి సంపాదించిన సొమ్ము అన్ని విధాలా మంచిది. అనాయాసంగా సంపాదించిన సొమ్ము అనర్థాలకు దారి తీస్తుంది. ఇది నా అనుభం. కాబట్టి ఇది 'తాతయ్య మాట' గా గుర్తు పెట్టుకో అని హితబోధ చేశాడు.

శ్రీ దత్తుడు తాతయ్య పోయాక ఒంటరి వాడైపోయాడు. పొట్టకూటి కోసం ఏరోజు కారోజు కాయకష్టం చేసుకుంటూ వచ్చే కూలి డబ్బుతో రోజులు గడపసాగాడు.

ఒకరోజు శ్రీదత్తుడు కూలిపని చేసి ఇంటికి తిరిగి వస్తూండగా దారిలో వాడికి ఒక చిన్న సంచి దొరికింది. దానిని తన చేతికి తీసుకొనగా కాస్తంత బరువుగా తోచింది. ఆత్రుతగా, ఆశగా అందులో ఏదో ఉందని తీసి చూచే సరికి సంచినిండా బంగారు కాసులు కనబడ్డాయి. దాంతో శ్రీదత్తుడికి అంతులేని ఆనందం కలిగింది.

హమ్మయ్య! ఈరోజుతో నా దరిద్రం తీరినట్లేనని సంబరపడిపోతూ నడక సాగించాడు. అదే దారిలో ఒక బిచ్చగాడు రావడం చూచాడు శ్రీదత్తుడు. తనకు దొరికిన బంగారు కాసుల ముందు ఆ రోజు సంపాదించిన కూలి డబ్బులు చెల్లని గవ్వలుగా తోచాయి. వెంటనే ఆ కూలీ డబ్బులు మొత్తం బిచ్చగాడికి ఇచ్చి ఇంటి దారి పట్టాడు ఆనందంగా. ధనవంతుడైన శ్రీదత్తుడు తన స్వగ్రామంలో ఉండడానికి ఇష్టపడక పట్నం వెళ్ళి ఏదైనా వ్యాపారం చేసి హాయగా జీవిద్దామనుకుని నిర్ణయించుకున్నాడు.

శ్రీదత్తుడు తీసుకున్న నిర్ణయం ప్రకారం పట్టణానికి తన మకాం మార్చాడు. అక్కడ ఏర్పడిన కొత్త మిత్రుల సహకారంతో వ్యాపారాన్ని ప్రారంభించాడు. ప్రారంభంలో వ్యాపారం బాగానే సాగింది. వివాహంకూడా చేసుకున్నాడు.

కొత్త ఊరిలో కొత్త మిత్రులు ఎటువంటి వారో సరిగా తెలియని కారణంగా మోసపోయాడు. పుర్వానుభవం ఏమాత్రమూ లేని కారణంగా వ్యాపారం సరిగ్గా నడుపుకోవడం చేతగాక తీవ్రంగా నష్టపోయాడు. "బెల్లం ఉన్నంత వరకే ఈగలు" అన్నట్లుగా ధనం లేనివాడిని అయిన వాళ్ళు కూడా హీనంగా చూస్తారు. ఇక అక్కడ ఉండలేక తన స్వగ్రామానికి తిరిగి వచ్చేశాడు.

శ్రీ దత్తుడు స్వగ్రామం చేరాక తిరిగి తన పాత జీవితం మొదలు పెట్టాలని బయలుదేరాడు. దారిలో ఒక వ్యక్తి ఎదురు పడ్డాడు. కాసేపు ఎగాదిగా చూచి శ్రీదత్తుడిని పలకరించి అయ్యా! తమరు నన్ను గుర్తుపట్టారా! అన్నాడు.

"ఒకప్పుడు నాలో కష్టపడే శక్తి ఉండినా, సోమరితనంతో భిక్షమెత్తుకునే వాడిని అప్పుడు ఒక రోజు మీరు నాకు దానం చేశారు. మీరు దానం చేసిన డబ్బుకి ఏ

మహిమ ఉండినదో కానీ నాలో ఏదో మార్పు వచ్చింది. ఆ డబ్బును తిండికి ఖర్చు పెట్టబుద్ధి కాలేదు. ఆ డబ్బుతో ఒక కోడి పెట్టను కొన్నాను. సోమరి తనాన్ని పూర్తిగా వదలించుకున్నాను. బాగా కష్టపడుతూ వచ్చిన కూలిడబ్బుతో కొంత పొదుపు చేసుకుంటూ మరికొన్ని కోళ్ళను కొని వ్యాపారం ప్రారంభించాను. మీ చేతి చలువతో వ్యాపారం బాగా అభివృద్ధి చెందింది. ఈ రోజు నేను నాలుగైదు రకాల వ్యాపారాలు లాభసాటిగా చేస్తున్నాను. ఇదంతా మీ దయవల్ల జరిగింది". అని కృతజ్ఞతలను వినయంగా చూపాడు.

ఈ మాటలు విన్న శ్రీదత్తుడు ఆశ్చర్యపోయాడు. తన కష్టార్జితమైన కూలి డబ్బులు ఒక బిచ్చగాడిలో ఇంత మార్పు తెచ్చిందంటే నమ్మశక్యం కాలేదు. శ్రీదత్తుడికి అప్పుడు తాతయ్య చెప్పిన మాట జ్ఞాపకం వచ్చింది. అనుభవపూర్వకంగా ఆ మాటలోని సత్యాన్ని తెలుసుకున్నాడు. తన తెలివి తక్కువతనానికి చింతిస్తూ, కదలబోయాడు. అప్పుడావ్యక్తి శ్రీదత్తుడి పరిస్థితిని అడిగి వివరంగా తెలుసుకొని తనవద్దే పనిలో పెట్టుకున్నాడు కృతజ్ఞతగా.

* తన బాధలకు ఇతరులు కారణమని చెప్పడానికి జ్ఞానం అవసరం లేదు. కానీ తన బాధలకు తానే కారణమని తెలుసునునేటందుకు జ్ఞానం అవసరం.
* పశ్చాత్తాపం ఆలస్యంగానే వస్తుంది.

చెమట విలువ

గురునానక్ గారు తన శిష్యుల కోరిక మేరకు ఒక గ్రామానికి వెళ్ళాడు. ఆ గ్రామంలో ధనవంతులే ఎక్కువ. పేదవాళ్ళు తక్కువ. నానక్‌గారు ఆ గ్రామంలోకి అడుగుపెట్టగానే అందరూ తమ ఇంటికి దయచేయమని ప్రాధేయపడ్డారు. ఊరంతా తిరిగి చివరికి ఒక నిరుపేద ఇంట్లో భోజనం చేశారు. ఆ గ్రామంలోని శ్రీమంతుడు ఇదేమి విడ్డూరం స్వామీ ! మేమెవ్వరం పిలిచినా రాకుండా ఒక నిరుపేద ఇంట్లో, అందులోనూ ఒక పూరిగుడిసెలో భోజనం చేస్తారా? అని ప్రశ్నించాడు.

సరే! మీ ఇంటికి వస్తున్నాను అని ఆ శ్రీమంతుడి ఇంటికి నానక్‌గారు వెళ్ళి, ఆ ఇంటిలోని కొద్దిపాటి మట్టిని తీసుకొని పిండగా అందులో నుండి రక్తపు చుక్కలు రాలాయి. చూశావా? నీ సంపాదన అక్రమమైనది. పేదల కష్టాన్ని దోచుకున్నది. అంటూ నీవు నాతోపాటు ఆ బీదవానింటికిరా అని పిలుచుకొని పోయి అక్కడున్న మట్టిని పిండగా చెమట చుక్కలు రాలాయి. ఈ దృశ్యాన్ని చూచి శ్రీమంతుడు సిగ్గుతో తలదించు కున్నాడు.

నాది అనుకున్నది ఏదీ నీది కాదు.

చాలాకాలానికి, దూర ప్రాంతం నుండి వచ్చిన తన మిత్రుడిని తనకు వారసత్వంగా సంక్రమించిన వ్యవసాయ క్షేత్రం వద్దకు తీసుకెళ్ళి దానిని చూపిస్తూ - మనం నిలబడిన ఈచోటు నుండి ఆ కొండ వరకు ఈ మధ్యలోని రెండువేల ఎకరాల సాగుభూమి నాదే అని గర్వంగా, హుందాగా చెప్పాడు.

వెంటనే వాళ్లకో పెద్ద నవ్వు వినిపించింది. అక్కడ ఎవ్వరూ కనబడకపోవడంతో అడిగాడు ఆ భూకామందు ఎవరా నవ్వింది? "భూదేవిని" జవాబు వినిపించింది. ఎందుకలా నవ్వావు? నీ మాటలకు నవ్వొచ్చి నవ్వాను. వగలబడి పెద్దగా నవ్వవలసినంతగా నా మాటల్లో ఏముంది? అడిగాడు భూకామందు మళ్లీ. నీ ముత్తాత కూడా నీలాగే ఒకనాడు ఈ కనిపించేదంతా నాదే అన్నాడు. కొన్నాళ్ళకు నాలో కలిసిపోయాడు.

తర్వాత నీతాత కూడా "మానాన్న తదనంతరం ఏకైక కుమారుడనైన నాకు ఈ ఆస్థి దక్కింది. అన్నాడు. ఆయన కూడా నాలో కలిసిపోయాడు. ఇపుడు నీవూ అదేమాట అంటూ ఉంటేనూ నాకు నవ్వొచ్చింది. వివరించింది భూదేవి.

ధనం సంపాదించడమేకాదు దయాగుణం, ధర్మబుద్ధి కూడా ఉండాలి.

రామన్న ఒక వడ్డీ వ్యాపారి. వడ్డీ వ్యాపారస్తులు సామాన్యంగా కఠినమైన హృదయం కలిగి ఉంటారు. కానీ రామన్న మాత్రం దయాగుణం గలవాడు. ఎవరైనా ఆపదలో ఉంటే వడ్డీ లేకుండా కూడా అప్పులిచ్చేవాడు. పేదవారి దగ్గర తక్కువ వడ్డీ తీసుకునేవాడు. అందుకని ఊర్లో వారందరూ రామన్నను గౌరవించేవాళ్ళు. ఏ ఆపదవచ్చినా అందరూ అతని దగ్గరికే వచ్చేవారు. తక్కువ వడ్డీ కావడంతో తీసుకున్నవారు కూడా అప్పు వెంటనే చెల్లించేవారు. రామన్న ప్రవర్తన దయాగుణం మిగిలిన వ్యాపారస్తులకు నచ్చేది కాదు.

ఒకసారి పొరుగూరులో ఉండే సోమయ్య తన కుమారుడి వివాహానికి మిత్రులందరినీ ఆహ్వానించాడు. రామన్నతోపాటు వ్యాపారులంతా కలిసి తలో గుర్రమును తీసుకొని ప్రయాణమయ్యారు. పెద్ద అడవిని దాటుకొని సోమయ్య ఊరు చేరుకోవాలి. అడవిలో జంతువుల బారిన పడకుండా చూడమని భగవంతుడిని వేడుకుంటూ ప్రయాణం సాగించారు. ఎలాగైతేనేం అందరూ క్షేమంగా సోమయ్య ఊరికి చేరుకున్నారు. మిత్రులంతా వచ్చినందుకు సోమయ్య చాలా ఆనందించాడు. ఘనంగా విందు భోజనాలు ఏర్పాటు చేసి పెళ్ళయిన రెండు రోజుల తరువాత గానీ మిత్రులను కదలనివ్వలేదు.

తిరుగు ప్రయాణంలో అడవిదాటి వస్తుండగా, వ్యాపారులకు ఏనుగుల గుంపు ఎదురైంది. అది వారి మీదికి రావడంతో గుర్రాలు బెదిరి, వేగంగా పరిగెత్తి అవన్నీ క్రొత్త ప్రదేశానికి చేరుకున్నాయి. ఆ ప్రాంతమంతా బంగారు రంగుతో ప్రకాశిస్తున్నది. తీరా పరిశీలించి చూస్తే అక్కడ ఉన్న రాళ్ళన్నీ బంగారువే. ఆనందంతో ఆశ్చర్యంతో కలా నిజమా? అని బాగా పరిశీలించి చూచారు. నిజమే! ఏనుగులు తరిమితే తరిమాయిగానీ "తంతే గారెల బుట్టలో పడినట్లు" బంగారు లోకంలోకి వచ్చి పడ్డాం. అనుకుంటూ, ఇక అలస్యం చెయ్యకుండా దొరికిన కాడికి దగ్గరున్న సంచులలో నింపుకోవడం మొదలుపెట్టారు. రామన్న మాత్రం అందరినీ కాదని, అడవిలో దొరికిన పండ్లను మాత్రమే తన సంచులలో నింపుకున్నాడు.

రామన్నను చూచి మిగతా వారంతా ఎగతాళి చేస్తూ నవ్వుకున్నారు. అక్కడ నుండి ఊరికి చేరడానికి ఎటు వెళ్ళాలో దిక్కు తోచలేదు వారికి. ఎలాగోలాగా అతి కష్టం మీద దారి కనుక్కొని ప్రయాణం సాగించారు. ఆ దారిలో చాల చెట్లు ఉండినా వాటికి పండ్లు కాయలు లాంటివి ఏమీలేవు. వారికి ఆకలి మొదలయ్యింది. కానీ తినడానికి తమ వద్దకూడా ఏమీలేదు. అందరూ ఆకలితో అలమటిస్తూ ప్రయాణిస్తున్నారు. రామన్న మాత్రం తాను సంచిలో నింపుకున్న పళ్ళను తినడం మొదలు పెట్టాడు. ఆకలి ఎక్కువ కావటంతో రామన్నను పళ్ళు ఇవ్వమని అడిగారు. అపుడు రామన్న "మీ దగ్గరున్న బంగారు రాళ్ళను పది ఇస్తే తాను ఒక పండు ఇస్తాను". అన్నాడు.

చేసేదేమీ లేక తమ దగ్గరున్న బంగారాన్ని ఇస్తూ, పండ్లను తీసుకుని తింటూ, ఆకలిని తీర్చుకుంటూ, దారివెతుక్కుంటూ ప్రయాణం సాగించారు. అడవి దాటి సొంత ఊరు చేరుకునేటప్పటికి మూడు రోజులు పట్టింది. అలా ఊరు చేరేసరికి మిగిలిన వ్యాపారుల సంచుల్లోని బంగారం తరిగిపోయింది. రామన్న సంచులు మాత్రం బంగారంతో నిండిపోయాయి. ఖాళీ సంచులను చూచుకుని ఏడవలేక బిక్కమొగంతో రామన్నవైపు చూచారు. కానీ రామన్న మాత్రం దయాగుణంతో మనమంతా కలిసి వచ్చాం, కలిసే సంతోషంగా వెళదాం అని తలాయింత బంగారు ఇవ్వగా, అందరూ కలసి సంతోషంగా తమ ఇళ్ళకు వెళ్ళారు.

ఇంటికి వెళ్ళిన వ్యాపారస్తులు తమ భార్యా బిడ్డలతో పెళ్ళి విశేషాలను, ప్రయాణంలో జరిగిన వింత అనుభవాలను చెప్పారు. మరుసటి రోజు వ్యాపారస్తులందరూ సమావేశమై "మాములుగా అయితే ఎవడి సంపాదన వాడిది. అని మనమూ వ్యాపారస్తుల్లాగా ఆలోచించి ఎవడి దారినవారు వెళ్ళిపోయి ఉండే వాళ్లం. కానీ రామన్న మాత్రం వ్యాపార బుద్ధితోపాటు ముందుచూపు, ధర్మబుద్ధి, దయాగుణం చూపించి తన గొప్పగుణాన్ని చాటుకున్నాడు. ముందు చూపుతో, ఆశను దరిచేర నివ్వకుండా బంగారుకు బదులుగా ఆహారాన్ని పదిలపరిచాడు. అందరికీ ఇచ్చి ప్రాణాలు కాపాడాడు.

సంపాదించిన బంగారాన్ని అందరికి ఇచ్చి ధర్మగుణాన్ని చూపించాడు. కాబట్టి అతన్ని ఘనంగా సన్మానించాలి. అని చర్చించి తీర్మానించుకున్నారు.

అనుకున్న ప్రకారం రామన్న ఇంటికి వెళ్ళి కృతజ్ఞతలను తెలియజేశారు. గ్రామంలో ఒక సభను ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు, అదే సభలో మిగిలిన వ్యాపారస్తులంతా రామన్నలాగా ధర్మంగా వ్యాపారం చేస్తామని శపథం చేశారు.

తాను సంపాదించిన ధనమే ఉత్తమం.

తండ్రి నుంచి సంక్రమించిన ధనం మధ్యమం.

సోదరుని నుండి వచ్చిన ధనం అధమం

స్త్రీ సొమ్ము అధ మాధమం.

నడమంత్రపు సిరి పరమ బాధాకరం.

స్త్రీ-పురుషులిరువురూ సమానమేనన్న వాదనతో, స్త్రీల సేవలను సొమ్ము చేసుకోని, స్త్రీల అంగాంగ ప్రదర్శనలతో వచ్చిన ధనమే ప్రముఖంగా ఈనాటి సమాజంలో ప్రవహిస్తున్నది. అలాంటి ఆలోచనలతో సంపాదించిన పాపపు ధనమే చెలామణిలో ఉన్నది. ఈ విధమైన భావనలు సమాజానికి మంచిదికాదు.

- - - - -

పెళ్ళయిన కొంత కాలానికి ఓ దంపతుల మధ్య పొరపొచ్చాలొచ్చాయి. భర్త విడాకుల కోసం కోర్టుకెక్కాడు. అవి దాదాపు మంజూరయ్యాయి. అతని భార్య బాగా ఆస్తి పాస్తులు కలది. అందుకని ఆ భర్త తన లాయరుతో "మా ఆవిడ దగ్గర బాగా డబ్బుంది. నాకు ఉద్యోగం కూడా లేదు. కాబట్టి నాకు సాధ్యమైనంత భారీగా భరణం ముట్టేలా చూడండి" అని చెప్పాడు.

మీ భార్య తరపు లాయర్‌తో ముందుగానే ఆ విషయం మాట్లాడాను. మీకు పది లక్షల రూపాయలు భరణంగా ఇవ్వడానికి మీ ఆవిడ ఒప్పుకుంది. చెప్పాడా లాయర్.

మిమ్మల్ని పెట్టుకోకుండానే ఆ మొత్తం నాకు ఎలాగూ వస్తుంది. ఇంకా ఎక్కువ రాబట్టడానికే కదా మిమల్ని పెట్టుకుంది అన్నాడు భర్త.

మనిషి మనిషిగా బ్రతకాలంటే ధర్మంగా ధనాన్నీ,ఆహారాన్నీ, పదార్థాలనూ, వస్తువులనూ సంపాదించాలి. ధర్మాన్ని అతిక్రమించచడమంటే ప్రకృతి నియమాలను ధిక్కరించడమే.

మహాభారత సంగ్రామంలో కురు పితామహుడు అంపశయ్యపై ఉన్నాడు. పాండవులు అంతిమ దర్శనంకోసం వెళ్ళారు. ధర్మనిరతి, రాజనీతిని గురించి అంతిమ ఉపదేశం ఇవ్వమని చేతులు జోడించి ప్రార్థించాడు ధర్మరాజు. భీష్ముడు ధర్మ సూక్ష్మాలను వివరిస్తుండగా ద్రౌపది ఫక్కున నవ్వింది. భీష్ముడు ద్రౌపది వైపు చూచి నవ్వుకు కారణమేమిటి తల్లీ? అని ప్రశ్నించాడు. ద్రౌపది చేతులు జోడించి మహాత్మా

నిండు సభలో దుర్యోధన, దుశ్శాసనులు నన్ను అవమానపరుస్తున్నపుడు మీకు ఈ ధర్మ సూత్రాలు జ్ఞప్తికి రాలేదా? సభలోని సమస్త ఆచార్యులను న్యాయాన్ని అమలు పరచండని వేడుకున్నాను. కానీ మీరంతా నాకు జరిగే అవమానాన్ని, అన్యాయాన్ని చూచి సహించారేకానీ రక్షించలేదు. ఈరోజే నాకు తెలిసింది ఆ సంఘటన తరువాతనే మీరు ధర్మసూక్ష్మాలను తెలుసుకున్నారని, ముందుగానే తెలిసిఉంటే నన్ను రక్షించి ఉండేవారు కదా అని. అందుకే నాకు నవ్వొచ్చింది. క్షమించండి పితామహా అని వేడుకున్నది.

ద్రౌపది పలుకులు విన్న భీష్ముడు కలత చెంది. తల్లీ నీవుకాదు క్షమాపణ కోరవలసింది. నేనే ఆ పని చెయ్యాలి. ఆనాడు నాకు ధర్మ సూక్ష్మాలు తెలియక కాదు. తెలుసు, కానీ ధుర్యోధనుని కొలువులో ఉండి వారి ఉప్పుతిన్నందుకు నా బుద్ధి మందగించింది. వివేకశూన్యుడనైనాను, అలాగే మిగతా ఆచార్యులు కూడా మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు అంపశయ్యపైనున్న నాకు ఆ పాప పంకిలమంతా తొలగిపోయింది. పాపం చేసి సంపాదించిన వారి ధనంతోకానీ, వారి చేతి అన్నంకానీ తిన్న వారకి పాపమే అంటుకుంటుంది. ధర్మాచరణ శూన్యులవుతారు, అని సెలవిచ్చాడు కురుపితామహుడు.

ధార్మిక జీవనం గడిపే సంసారులు ఓ భగవంతుడా "మా కుటుంబ సభ్యులు ఉపవాసాల బారిన పడకుండా, ఇంటికి వచ్చిన అతిథుల ఆకలి తీర్చగలిగినంత ద్రవ్యమును మాత్రమే ప్రసాదించు చాలు" అని ప్రార్థిస్తారు. మనిషి సంపాదనంతా సమాజము నుండే వస్తుంది. మితిమీరిన స్వార్థంతో ఇంకా సంపాదించాలి అనే యావతో చేసే ప్రయత్నమంతా సమాజాన్ని దోచుకోవడమే. సమాజమనే గోమాత పాలను రక్తం వచ్చేటంత వరకు పిండవచ్చునా? కావలసినన్ని పాలను పిండుకోవాలి. మరలా గోమాతను పుష్టిగా తయారు చేయుటకు కొంత ధనాన్ని వెచ్చించాలి. రక్తమే పిండుకోవాలన్న కాంక్ష రాక్షసత్వమే?

ఓ మనిషీ నీకెందుకింత దురాశ?

పూర్వం ఒక పెద్ద భూస్వామి ఉండేవాడు. అతనికి వందలకొలది ఎకరాల భూసంపద ఉన్నది. అయినా అతనికి తృప్తిలేదు. ఇంకా ఎక్కడైనా అమ్ముటకు భూమి ఉన్నదని తెలియగానే అక్కడికి వెళ్ళి, బేరమాడి కొనేసేవాడు. కొన్న తర్వాత ఇంకా ఎవరైనా భూమి అమ్మేవారుంటే చెప్పండి కొంటాను అని చెప్పి మరీ వెళ్ళేవాడు. ఇలా ఉండగా కాశ్మీర రాజ్యంలో సువిశాల భూమి వృధాగాపడి ఉన్నదని ఎవరో చెప్పగా విని, ఆశగా ఆత్రుతతో కాశ్మీర రాజ్యానికి వెళ్ళాడు. విచారించగా తెలిసినదేమంటే ఆ విశాలభూమి అంతా కోయదొర వంశస్థులకు చెందినది అని.

వెంటనే ధనికుడు సమీప పట్టణానికి వెళ్ళి, ఆటవికులకు అందుబాటులో లేని చాల రకాల వస్తువులుకొని, కోయదొరల ఇళ్లకు వెళ్లి వారి బిడ్డలకు, స్త్రీలకు ఉదారంగా పంచిపెట్టాడు. కోయదొరలుకూడా భూస్వామి స్నేహానికీ, ఉదార స్వభావానికీ మహదానందపడి, బహుదూరము నుండి ఎన్నో కష్టాలకోర్చి ఈ అడవి ప్రాంతానికి వచ్చిన కారణమేమి? మీకోరిక ఎలాంటిదైనప్పటికీ తప్పక నేరవేర్చెదము సంకోచించక అడగండి అని మాట ఇచ్చారు.

తన కోరిక నెరవేరే అనుకూల పరిస్థితికి భూస్వామి లోలోపల, మురిసిపోతూ తన పాచిక పారినందుకు సంతోషిస్తూ"నాకు కొంత నేల అవసరమై ఇంతదూరం వచ్చాను" అన్నాడు.

అందుకు కోయదొర ఆ భూస్వామి మనసులోని మర్మాన్ని మొత్తం ఆకళింపు చేసుకొని "అయ్యా! అలాగే ఇచ్చెదను. కానీ దానికి బదులుగా మీరు మాకేమి చెల్లించనవసరం లేదు. మీ బోటివారు ఈ భూమిని స్వాధీనం చేసుకొని సస్యశ్యామలం చేస్తే అదేచాలు. మీ వద్దనుండి మరేమీ కోరము. ఈ వేళ మీరు చక్కగా విశ్రాంతి తీసుకోండి. రేపు ఉదయం సూర్యోదయ సమయానికి ఇక్కడి నుండి బయలుదేరి మీ ఇష్టమొచ్చినంత దూరం కాలి నడకన వెళ్లండి, తిరిగి సాయంకాలం సూర్యాస్తమయం వేళకు ఈ ప్రదేశానికే చేరుకోవాలి. మీరు నడిచి నంత దూరపునేలనంతా మైలు దూరం వెడల్పుతో మీకు ఇచ్చేస్తాను. ఆ నేలంతా మీ స్వంతమైపోతుంది. ఆ భూమికి మీరే యజమానులు అని చెప్పాడు.

ఆ మాటలు భూస్వామి చెవిన పడగానే మహదానందంతో మనసు ఓలలాడింది. తన జీవితం ధన్యమైందని పొంగిపోయాడు. ఆనాటి రాత్రి భూస్వామికి నిద్రపట్టనేలేదు. ఎప్పుడు తెల్లవారునా! సూర్యుడెప్పుడు ఉదయించునా. తాను తనవితీరా నడక సాగించేదెప్పుడాయని ఉవ్విళ్ళూరుతూ కాచుకొని కూర్చున్నాడు.

భూస్వామి స్థూలకాయుడు. అందులోనూ కాస్త పొట్టి. నడక ప్రారంభించాడు. కొద్దిదూరం వెళ్లగానే నడిస్తే ఏదోకొంత మేరకే నేలను పొందగలను, కానీ తనకేమో యకరాలెకరాలు అవసరమాయె. అందువలన పరిగెత్తినచో తాననుకున్న యకరాలెకరాల భూమిని పొందవచ్చు ననుకున్నాడు. వెంటనే పరిగెత్తనారంభించాడు. దారిలో ఎత్తు పల్లములు కనిపించినపుడల్లా చేతనైనంతమేరకు దాటుకుంటూ వేగంగానే పరుగెత్తుతున్నాడు. కానీ ఒకచోట ఒక చిన్న కాలువ అడ్డు వచ్చింది. ఎలాగబ్బా? దిగి నింపాదిగా నడచినచో వృధాగా కాలయాపన కాగలదని, బలమంతా కూడగట్టుకొని ఒక్క దూకు దూకినాడు, పొట్టివాడు, పైగా స్థూలకాయుడు. సరిపడినంత ఎగరలేకపోయినందున, కాలువ మధ్యలో కూలబడ్డాడు. కాలువలోని గుండ్లమీద పడ్డకారణంగా కాళ్లకు గాయాలు అవ్వడమే కాక, ఒక కాలు బెణికింది కూడా. ఎలాగో

అవస్థలు పడుతూ మనసులో తేరగా వచ్చు యకరముల నేలను తలచుకుంటూ బాధలను మరిచిపోయి మరలా పరుగులగించుకున్నాడు.

మధ్యాహ్న సమయాన ఎండలో చెమటలు కార్చుకుంటూ, నాలుక దప్పికతో పిడచకట్టుకొనిపోతూ ఉన్నా లెక్కచేయక, దీక్షతో భూస్వామి పరుగెత్తుచున్నాడు. అతని అవస్థ చూచి జాలిపడి అక్కడున్న ఒక రైతు- అయ్యా! మీ పరిస్థితి చాలా దీనంగా ఉంది, కొంచెం సేపు విశ్రమించి మంచినీళ్ళు త్రాగండి, అని చెప్పాడు. అందుకు భూస్వామి ఈ సమయంలో నన్నేమీ మాట్లాడించవద్దు. నీళ్ళు త్రాగే లోపల ఇంకా కొంత నేలను ఆక్రమించుకోవచ్చును. అపురూపంగా దొరికిన ఈ అవకాశాన్ని వదులుకునే మూర్ఖుడెవడైనా ఉంటాడా పిచ్చివాడా! అనుకుంటూ తన పరుగును కొనసాగించాడు.

ఈ విధంగా నీళ్ళు, ఆహారం లేకుండా మండుటెండలో తల తిరిగి పోతుంటే గాయాలతో కాళ్ళు నడచుటకు సహకరించని పరిస్థితిలో భూస్వామి దురాశతో దేహపరిస్థితిని పూర్తిగా విస్మరించి, తిరుగు దారిపట్టి, పరిగెత్తి పరిగెత్తి చివరకు ప్రారంభించిన చోటుకు పదడుగుల దూరంలోనే శోష వచ్చి క్రింద పడిపోయాడు. కోయదొర, స్థానిక పెద్దలు వచ్చి చూడగా భూస్వామి స్పృహతప్పి పడి ఉన్నాడు. పట్టి చూడగా నాడి క్షణ క్షణానికి సన్నగిల్లుతున్నది. అందరూ చూస్తూ ఉండగానే కొన్ని క్షణములలోనే భూస్వామి ప్రాణాలు పంచభూతాలలో కలిసిపోయాయి. ఎంతో దూరం నుంచి వచ్చాడు. ఎంతో నేలను సంపాదించాలని వచ్చాడు. ఎంతో ఆశతో వచ్చాడు. అక్కడెక్కడా చోటు లేదన్నట్లు ఇక్కడికి వచ్చి చచ్చాడు. చివరకు అతన్ని పూడ్చడానికి నాలుగు మూరలా జానెడు నేల మాత్రమే కావలసివచ్చింది అనుకుంటూ వెళ్లారు.

ఏదీ నీవెంటరానపుడు నీకెందుకింత ఆశ?

గురునానక్ దగ్గరికి ఒక శ్రీమంతుడు వచ్చి స్వామీ! నాకు అపారమైన సిరి సంపదలున్నాయి. కానీ, మనశ్శాంతి మాత్రం లేదు. అందుచేత నిద్ర అనేది లేకుండా పోయింది. ఆరోగ్యంకూడా క్షీణిస్తూ ఉంది. ఏదైనా మార్గం చెప్పండి అని మొరపెట్టుకున్నాడు.

అంతా విన్న నానక్‌గారు శిష్యునితో ఒక సూది తెప్పించాడు. దానిని శ్రీమంతుని చేతిలో పెట్టి, "నీవు మరణించాక దీనిని నీవు ఎక్కడికి వెళతే అక్కడికి తీసుకునిరా! నీవెక్కడుంటే నేనక్కిడికి వచ్చి అడిగి ఈ చిన్న సూదిని తీసుకుంటాను." సరేనా! అన్నాడు.

శ్రీమంతుడు ఆశ్చర్యానికి లోనవుతూ-స్వామి మరణానంతరం దీనిని నా వెంట తీసుకుని ఎలా రాగలను? పోయేటపుడు ఏమీ వెంట తీసుకుని వెళ్ళలేం కదా? అన్నాడు.

సరే నాయనా! ఇంత చిన్న సూది కూడా నీ వెంట రానపుడు, ఇన్నిన్ని బంగళాలు, పొలాలు, వాహనాలు, ఆభరణాలు, ఎందుకు సంపాదించినట్లు? ఒక

వేళ నీ భార్యా-బిడ్డల సంతోషానికి కానీ, నీతృప్తి కోసమే కానీ సంపాదించి నట్లయితే మరి మనశ్శాంతి ఎందుకులేదు, నిద్ర ఎందుకు రాలేదు? ఆరోగ్యం ఎందుకు బాగలేదు? శ్రీమంతుడు సమాధానం చెప్పలేక మౌనంగా ఉండిపోయాడు. నాయనా! "భోగాలన్నీ రోగాలే, భోగం వదిలితే యోగమే" అన్నాడు.

మనిషికి పరిమితమైన కష్టార్జితమే నిజమైన సంపాదన. "పులిని జూచి నక్క వాత పెట్టుకున్నట్లు" ఇరుగు-పొరుగు వారిని చూచి నాకు ఇదిలేదు, అదిలేదు అని పోల్చి చూచుకుని, అసూయతో ఆశలు పెంచుకుని, వాటిని తీర్చుకోవడానికి అడ్డమైన గడ్డితింటూ, అనవసరమైన ప్రయాసలు పడుతూ, ఇతరులను కష్టాలలోకి నెడుతూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చుట్టూఉన్న వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు.

మనిషికి తృప్తి అనేది తప్పక ఉండాలి. ఏది అవసరమో, ఏది అత్యవసరమో తెలుసుకుని జీవించాలి, తమ తాహతుకు తగిన ఆశలను సాకారం చేసుకునేటందుకు ధర్మ మార్గంలోనే కృషిచేస్తూ ఉండాలి.

* వందల కోట్లకు అధిపతివైనా ఒక్క నిమిషం ఆయుష్షును కొనలేవు.
* కోట్లకు వారసుడివైనా ఊపిరిపోగానే ఊరిబైటనే పారవేస్తారు.
* లక్షాధికారైనా, భిక్షాధికారైనా శ్మశానంలో ఇద్దరూ ఒకటే.
* వంద మంది వైద్యులు అందుబాటులో ఉన్నా నీ పరలోక యాత్రను అడ్డుకోలేరు.
* ప్రపంచాన్ని జయించినా, మృత్యువును మాత్రం జయించలేవు.
* భోగలాలసులే సమాజ పీడకులు.
* ఎంత సంపాదించినా కూటి కొరకే, ఎలా బ్రతికినా కాటి వరకే.
* పరిమితంగా సంపాదించేది మన కోసం. అపరిమితంగా సంపాదించేది పరులకోసం.
* ఉన్న దాని కంటే తక్కువగా కనిపించు - తెలిసిన దానికంటే తక్కువగా మాట్లాడు.

మనసు మారిపోకముందే తలచిన మంచిపనులను చేసెయ్యాలి.

ఒకనాడు కర్ణుడు తన గృహమునందు అభ్యంగన స్నానము చేస్తూ ఉండినాడు. నవరత్న ఖచితమగు పాత్రలలో నూనె, సున్నిపిండి ప్రక్కనుంచుకొని ఒకచోట కూర్చొని నూనెతో స్వయంగా తలంటుకొనుచుండెను. సరిగ్గా అదే సమయంలో శ్రీకృష్ణుడు కర్ణుని దగ్గరికి వచ్చాడు.

కర్ణుడు తలంటుకొనుచుండుటను, ప్రక్కనే మరకత, మాణిక్యములు పొదగబడిన విలువైన పాత్రలు ఉండుటను చూచి, ఆ నటన సూత్రధారి కర్ణునితో తనకు అందులోని ఒక సుందరమైన పాత్ర కావలయునని అడిగాడు.

అడిగినదే తడువుగా తన కవచకుండలములను ఇంద్రునికి దాన మొసగి దాన కర్ణుడని విఖ్యాతినొందిన - ఆ మహనీయుడు సాక్షాత్ పరమాత్మయే వచ్చి అడిగినప్పుడు ఇక వెనుకకు తగ్గునా?

వెంటనే అతడు కుడిచేతిలో తలంటుకొను నూనె ఉండెను కనుక, తన ఎడమ చేతితోనే కృష్ణుడు కోరిన పాత్రను అందుకొని కృష్ణునికి ఇచ్చాడు. కానీ, శ్రీకృష్ణుడు దానిని స్వీకరించక కర్ణా ఎడమ చేతితో ఎవరికైనా ఇవ్వతగునా? అది శిష్టాచారమేనా? అంత మాత్రమైనా తెలియనివాడవా? అని అడుగగా - కర్ణుడు ఓ కృష్ణా! ఇపుడున్న ధనము మరుక్షణమున మాయమైపోవచ్చును. ఇపుడున్న జీవితం ఉత్తర క్షణమున అంతమైపోవచ్చును. యమధర్మరాజు ఎవరిపైనను విచక్షణ చూపడు. మానవుల బుద్ధి త్వరితగతిని మార్పునొందుచుండును. కాబట్టి తలంటుకొనుచున్న కుడిచేతిని శుభ్రపరచుకొని దానితో నీకు ఆ పాత్రను ఇచ్చేలోపల నా బుద్ధి ఎలా మారిపోవునో! అంత వరకు నా జీవితముండునో లేదో, అందుకని తక్షణమే ఎడమ చేతితో నీకు ఇవ్వ సాహసించాను. అంతేగానీ తెలియకా కాదు. నిర్లక్ష్యంతోనూ కాదు. అని సమాధానమిచ్చాడు.

లోభత్వము మహా ప్రమాదకర గుణము, ఎంతటి చదువరులనైనా లోభగుణం వశం చేసుకుంటుందని ఎన్నో సందర్భాలలో మనం గమనించవచ్చు.

ఒక్కోసారి మనకు డబ్బుగానీ, వస్తువుగానీ ఏదైనా దొరికినపుడు తక్షణమే ఎవరిదో? పోగొట్టుకున్నవారు ఎంత ఇబ్బంది పడుతుంటారో! అని అనుకుంటాం. కానీ క్షణాలు గడిచేకొద్దీ లోభగుణం ఆవరించగా, అటు నిటు చూచి ఎవరూ చూడలేదు కదా? అని దాచేసుకుంటూ వుంటాం.

అలాగే దీనులను హీనస్థితిలో చూచినపుడు తన దగ్గర వున్న డబ్బునో, వస్తువునో ఇవ్వాలని మనసు కలుగుతుంది. అటువంటపుడు తక్షణమే అనుకున్నదానిని అమలు పరచాలి. లేకుంటే క్షణాలు గడిచేకొద్దీ మనసు తర్కవితర్కాలకులోనై, స్వార్థం, లోభం మనసును కమ్మివేయగా మెల్లగా అక్కడి నుండి జారుకుంటాం, అలాగే కష్టంలోనున్నవారికి చేతనైన సహాయం చెద్దామనుకుంటూనే చేయలేక, చేయకుండా అలాగే వెళ్ళిపోతూవుంటాం.

* సేవ - సహకారాలను, దాన-ధర్మాలను అనుకున్న తక్షణమే చేసేయాలి.

రాత్రి సుఖంగా నిద్రించేటందుకు అవసరమైనవన్నీ పగలే సేకరించి ఉంచుకుంటాం. వర్షాకాలంలో అవసరమయ్యే వంట చెరకును ఎండాకాలంలోనే సేకరించి ఉంచుకుంటాం. వృద్ధాప్యంలో రాబోయే కష్ట-నష్టాలను ఎదుర్కొనడానికి అవసరమయ్యే ధనాన్ని ముందుగానే సేకరించుకొని జాగ్రత్త పడతాం. ఇలా ప్రతి

మనిషి రాబోవు కాలానికి ఏది అవసరమొస్తుందో దానిని జాగ్రత్తగా ముందుగానే సమకూర్చుకుంటాడు. కానీ, వచ్చే జన్మలో ఇప్పటి జన్మకంటే మంచి జన్మ రావాలని కోరుకుంటున్నాడే కానీ, ఏదీ సంపాదిస్తే ఆ మంచి జన్మ వస్తుందో దాని కొరకు జాగ్రత్త పడతామని మాత్రం ఎవరూ అనుకోవడం లేదు.

ఏది నీది?

ఒక మహారాజు వద్దకు ఒక సాధువు వచ్చాడు. ధర్మ సూక్ష్మాలు చక్కగా బోధించాడు. రాజుకూడా శ్రద్ధగా విన్నాడు. ఇక సెలవు అని చెప్పి వెళ్ళబోతుండగా - సాధువునుద్దేశించి రాజు మహాత్మా మీకేమి కావాలో దయచేసి సెలవివ్వండి. ఒట్టి చేతులతో పంపడం నాకిష్టం లేదు అన్నాడు.

అందుకు సాధువు చాలా మంచిది. కానీ ఇవ్వడానికి మీవద్ద ఏముంది? అన్నీ వదలి వేసిన నాకు కావలసింది ఏముంటుంది? అని చల్లగా ప్రశాంతంగా చిరునవ్వుతో అన్నాడు. మహారాజుకు చాలా అవమానమైంది. లోలోన అగ్గిగుగ్గిలమైనాడు. మహారాజునైన నా వద్దకు వచ్చి ఈయనగారు నన్నేధిక్కరిస్తాడా? కానీ ఏం చేయగలడు? సాధువుగారి తేజస్సుముందు మహారాజు చప్పగా ఉండిపోక తప్పలేదు.

మహారాజుగారి అంతరంగంలోని కోపావేశాన్ని గ్రహించిన సాధువు మహారాజా నేనన్న మాటలకు మీకు కోపం వచ్చినట్లుంది. పైకి కనిపించనివ్వకుండా దాచుకున్నప్పటికీ మీ హావభావాలు అలా సూచిస్తున్నాయి. కానీ నేను నిజమే చెబుతున్నాను, శాంతంగా ఆలకించండి.

మీ స్ఫురద్రూపం నీది కాదు. మీ తల్లిదండ్రుల నుండి వచ్చింది. మీ రాజ్యం మీది కాదు. ప్రజలిచ్చినది. మీ దగ్గరున్న ధన-ధాన్యాలు మీరు పండించినవి కావు. నీ ప్రాణంకూడా నీ హక్కులో లేదు. ఎపుడు బైటికి పోతుందో తెలియదు. నీ వెంట ఏది తీసుకెళతావో అది మాత్రమే నీది.

* చేసిన ధర్మం చెడని పదార్థం, వచ్చును నీవెంట.

* నీది-నాది అనునది ఏదీ మనది కాదురా !

అందరికీ ఇచ్చేది ఆ భగవంతుడే

ఢిల్లీకి వెళ్లే రైలు మార్గంలో హజరత్ నిజాముద్దీన్ అనే ఒక స్టేషన్ వస్తుంది. అక్బరు కాలంలోని ఒక గొప్ప సిద్ధ పురుషుడు ఆయన. హజరత్ అంటే చాలా గొప్పవాడు అని అర్థం. నిజాముద్దీన్ అనేది ఆయన పేరు. ఆయన స్వతహాగా మంచివ్యక్తి. ఆ ప్రాంతంలో ఆయనకు మంచివాడుగా పేరుంది. ఆయన నివాసం ఉంటున్న ప్రాంతంలోని పిల్లలకు పాఠశాల లేదు. కాబట్టి ఆ ప్రాంతవాసులు నిజాముద్దీన్ దగ్గరికెళ్లి మా తరపున మీరు అక్బర్ దగ్గరికెళ్లి మన ప్రాంతానికి పాఠశాల మంజూరు చేయించమని విన్నవించండి అన్నారు. అలాగేనని కొందరిని వెంటబెట్టుకొని అక్బర్ చక్రవర్తి దగ్గరికెళ్లాడు

నిజాముద్దీన్. ఆ సమయంలో అక్బర్ నమాజు చేసుకుంటూ ఉన్నాడు. నమాజు చేసేటపుడు చేతులు పైకెత్తి అల్లాను ఏదో అడుగుతున్నాడు. అది చూచిన నిజాముద్దీన్ మౌనంగా వెనుదిరిగి వెంట వచ్చిన వారితో తిరుగు ప్రయాణమయ్యాడు.

నమాజు పూర్తి చేసుకున్న అక్బర్ వెనుదిరిగిపోతున్న నిజాముద్దీన్‌ను అడిగాడు. ఏమండీ అపుడే వెళిపోతున్నారు? మీరొచ్చిన పనేంటి అని. అపుడు నిజాముద్దీన్ ఇలా అన్నాడు. మేము మిమ్ములను ఏదో అడగాలని వచ్చాము. కానీ, మీరే ఇంకొకరిని అడుగుచున్నారు. ఆ అల్లాను నేనే అడిగితే సరిపోతుంది కదా? అని నేను వెళ్ళిపోతున్నాను. ఏమనుకోకండి హుజూర్ అని వినయంగా చెప్పి వచ్చేశాడు. తిరిగి వచ్చి తీవ్రంగా ధ్యానించి ఆయనే ఒక హజరత్ అయ్యాడు. ఎన్నో పాఠశాలలు కట్టించాడు.

* పేదరికం నుండి బయటపడటానికి ధనం సంపాదించడాన్ని ఒక లక్ష్యంగా ఎంచుకోవచ్చు. కానీ పేదరికం నుండి పూర్తిగా బయట పడిన తర్వాతకూడా ధన సంపాదనే లక్ష్యంగా ఉన్నవారు మానసికంగా పేదరికపు ఆలోచనలనుండి బయటపడలేదని గ్రహించాలి. మానసిక పేదరికమే దరిద్రం. ఇటువంటి వారికి ధన సంపాదనే క్రమక్రమంగా మానసికమైన ఒక అవసరంగా మారుతుంది. వ్యసనమై కూర్చుంటుంది.

* పనికిరాని బంజరు భూమికూడా ఏదో ఒకనాడు అత్యంత విలువైనదిగా గుర్తింపబడడం జరుగుతున్నది. చెట్లు, తీగలు, కొండలు, గుట్టలు, నదులు, సముద్రాలు మొదలగునవి ఏవి కూడా భూమికి భారం కానేకావు. కానీ ఎదుటివాని అవసరాలు తీర్చగలిగిన శక్తి-యుక్తులు ఉండికూడా తప్పించుకొనువాడు మాత్రం ముమ్మాటికీ భూమికి భారమే.

దాతలు-మహాదాతలు

"డబ్బులే జబ్బులు" అన్నారు. డబ్బు సంపాదించాలన్న యావతో వేళకు ఆహారం తీసుకోకుండా, నిద్రను చంపుకొని, ఉచ్చనీచాలకు తిలోదకాలిచ్చి, అత్యాశతో పరుగులు తీస్తారు. ఆలోచిస్తే నిజంగా వారు డబ్బులతో పాటు అన్ని రోగాలకు మూలమైన బి.పి. షుగర్ జబ్బులుకూడా సంపాదించుకుంటారు. ఏమీ తినలేరు, త్రాగలేరు. పడుకున్నా నిద్రరాదు. మనశ్శాంతి కరువై, శరీరం అనారోగ్యం పాలవుతుంది.

పోస్టాఫీసు, బ్యాంకు లాకర్లలో, విదేశీ బ్యాంకుల్లో డబ్బు నిల్వలు పెరిగిపోతూ ఉంటాయి. కానీ ఇలా డబ్బులు దాచుకున్నవారు నిత్యమూ దొంగల భయంతో సతమతమవుతూ నిద్రకు దూరమవుతూ ఉంటారు. ఈ విధంగా వారి ఆనందం బ్యాంకుల్లోనూ, అనారోగ్యం శరీరంలోనూ ఉండిపోతుంది. ఇదేవారి జీవితానందం.

కొంత మంది ధనికులు మనసున్న వారు తెలివిగా జీవితానందాన్ని పొందుతుంటారు. అలాంటి వారంటారు "ధనికులకు ఆనందం దానం చేస్తేనే వస్తుందని" అలా దానం చేసేవారు రెండు రకాలుగా ఉంటారు. ఒకరు మహాదాతలు, మరొకరు నిత్యదాతలు.

అవసరాలకు పనికొస్తుంది కదాని తమ కోరికలను చంపుకునో, వాయిదా వేసుకొనో డబ్బులను జమ చేసుకుంటూ ఉంటారు. చావు తెలివితేటలతో అదనంగా సంపాదించిన డబ్బులను పోగు చేసుకుంటూపోతారు. ఎవరు ఎంత దాచుకున్నా అవసరాలకు, ఆనందాలకు మాత్రమే కదా?

ఆనందం కోసం దాచుకునేవారు నిజంగా ఆనందించేది శుష్కానందమే. ఎందుకంటే దాచుకున్న డబ్బును బైటికి తీయరు. తాను ఖర్చు పెట్టకుండా ఆనందించడమనేది ఎలా కుదురుతుంది? దాచుకున్నదంతా వారసులనబడే భార్యా,బిడ్డలు, బంధువుల కోసమే కదా? వారంతా ఏదో ఒక రోజు యజమాని ఎప్పుడు చస్తాడా? మూలుగుతున్న డబ్బు తమకెప్పుడు దక్కుతుందా అని రక్తసంబంధాన్ని, నైతిక బాధ్యతలను ప్రక్కనపెట్టి ఎదురు చూస్తుంటారు. యజమానికూడా అడిగివారికి ఇవ్వకుండా, దానధర్మాలు చెయ్యకుండా పరమలోభితనంతో దాచిపెట్టి తాను చచ్చిన తర్వాత గుండు మొత్తంగా, ఒక్కసారిగా వారసులకిచ్చిపోతారు. ఇలా ఏక మొత్తంగా ఇచ్చివెళ్లేవారినే మహాదాతలు అంటారు.

ఒక వేళ ఈ మహాదాతలనబడేవారు తొందరగా చచ్చిపోకపోతే వారసులు నిత్యం. "దేవుడా ఈ లోభి ముండాకొడుకును ఎంత తొందరగా మాకు అడ్డం లేకుండా తీసుకుపోతే అంత ఎక్కువగా టెంకాయలు కొడతాం, తలవెంట్రుకలు ఇచ్చుకుంటాం, నీ వాటాగా కొంత ధనం హుండీలోకూడా వేస్తాం అని మొక్కుకుంటూ ఉంటారు.

మరికొందరు ఇంకాస్త అడ్వాన్సయిపోయి యజమాని తొందరగా చచ్చేదానికి తగిన ప్రయత్నాలు (అంటే కుట్రలూ, కుతంత్రాలూ అన్నమాట) కూడా చేస్తూ ఉంటారు. వారసులనబడేవారుకూడా అప్పనంగా అందివచ్చిన డబ్బును అడ్డదిడ్డంగా అనుభవించాలని ఉబలాటపడతారు. అనుభవించడమంటే బాగా చెడిపోవడమే. దుష్టసహవాసం, మద్యపానం, వ్యభిచారం, జూదం లాంటి సుఖాలకు అలవాటైపోతారు. తమ చుట్టూ ఉన్నవారినీ చెడగొట్టి, సమాజంలో చీడపురుగుల్లాగా ఉండిపోతారు.

జ్ఞానం కలిగిన ధనికులు, దాన-ధర్మాలు చేస్తూ, నిజమైన ఆనందాన్ని అనుభవిస్తూ ఉంటారు. దానం తీసుకున్నవారు, అవసరాలు తీర్చుకుంటారు. "దాతసుఖీభవ". "ఇలాగ దాన ధర్మాలు చేస్తూ నూరు సంవత్సరాలు జీవించాలి, మా బోటి పేదలకు నిత్యం దానం చేస్తూవుండాలి". అని దీవెనలు అందజేస్తూ ఉంటారు.

* మహాదాతలు శాపాలకు అర్హులు, నిత్యదాతలు దీవెనలకు అర్హులు.

చిన్నదానానికి పెద్ద బహుమతి

ఒకరోజు మహాకవి కాళిదాసు గారు పని మీద చక్రవర్తి వద్దకు బయలు దేరాడు. అది వేసవికాలం. ఎండ చాలా తీవ్రంగా ఉంది. ఒక వ్యక్తి చెప్పులు లేకుండా నడుస్తున్నాడు. కాళ్లు కాలుతూ ఉంటే నడవలేక నడుస్తున్నాడు. అతని అవస్థను చూచి కాళిదాసు గారికి జాలి కలిగి,తన చెప్పులను ఆ వ్యక్తికి ఇచ్చి తన నడకను కొనసాగించాడు. కాళ్లకు చెప్పులు లేకుండా నడవడం తనకూ చాలా కష్టంగానే ఉంది. కాళ్ళు మండి పోతున్నాయి. అయినా బాధలో ఉన్న వ్యక్తికి తను చెయ్యగలిగిన సేవ చేసినందుకు తృప్తితో, బాధను భరిస్తూ నడుస్తున్నాడు.

ఇంతలో రాజుగారి ఏనుగును మావటివాడు అటుగా తోలుకొనిపోతూ, కాళిదాసు గారు పాదరక్షలు లేకుండా నడవడం చూచి, అయ్యో! ఎంత అపచారం! మీరు పాదరక్షలు లేకుండా కాళ్ళు కాలుకుంటూ నడవడం ఏమిటి? అని ఏనుగును నిలిపి కాళిదాసు గారిని ఏనుగుపై ఎక్కించుకొని అంతఃపురంలోకి ప్రవేశించాడు.

చక్రవర్తి అయిన భోజరాజు-కాళిదాసు ఏనుగుమీద రావడం చూచి, కవిగారూ ఇవాళ ఏనుగు మీద రావడం ఎలా కుదిరింది? అని అడిగాడు.

అందుకు సమాధానంగా... మహారాజా! నా పాదరక్షలను దానం చేశాను. భగవంతుడు నన్ను ఏనుగుపైకి ఎక్కించాడు అని చెప్పాడు.

* చిన్న దానం కూడా గొప్ప అర్హతనే కలిగిస్తుంది.

గాలికి పోయిన పేలపిండి కృష్ణార్పణం అన్నా ఫలితం ఉండదు.

శ్యామలమ్మ అంగడికెళ్ళి పేల పిండిని కొనుక్కున్నది. పేలపిండి పాత్రనిండా వచ్చింది. ఇంటకి వచ్చేటపుడు పెద్దగాలి వచ్చింది. పిండి గాలికి కొట్టుకొని పోకుండా, ఆమె తన చెయ్యిని అడ్డుపెట్టి నడుస్తున్నది. అయినా పేలపిండి ఎగిరిపోతూనే ఉంది. వెంటనే శ్యామలమ్మకు ఒక ఆలోచన మెరుపులా తట్టింది. ఎలాగూ ఇల్లు చేరేలోగా ఎంతో కొంత పిండి గాలికి కొట్టుకొనిపోవడం ఖాయం, కాబట్టి పిండి గాలికి పోయేటపుడల్లా భగవంతునికి అర్పిస్తే పుణ్యమైనా దక్కుతుందిగదా అని "కృష్ణార్పణం" అనుకుంటూ పోతున్నది. ఎదురుగా వస్తున్న స్నేహితురాలు చూచి, ఏమిటే శ్యామలా అలా గొణుక్కుంటూ వెళుతున్నావు? అన్నది. విషయం చెప్పింది శ్యామలమ్మ. సరేలే! ఒక దేవుడి పేరే స్మరిస్తే ఎంత వస్తుందీ పుణ్యం. నేనైతే ఎంత మంది దేవుళ్ళకో అర్పించేదాన్ని అన్నది. అరే! ఈ ఆలోచన బాగుందే, నారాయణార్పణం, బ్రహ్మార్పణం. ఈశ్వరార్పణం అనుకుంటూ ఇంటిదారి పట్టింది. దారిలో ఒకచోటరాయిని తన్నుకొని పడబోతూ నిలదొక్కున్నది. కానీ చెతిలోని పిండి గిన్నె క్రిందపడి మొత్తం ఒలికి పోయింది దీనిని చూచిన ఇంకొకావిడ "మొత్తం భూదేవార్పణం" అయింది. ఇక నింపాదిగా ఇంటికిపో తల్లీ!! అన్నంది. ఖాళీ గిన్నెతో తిరిగి వచ్చిన కూతిరిని చూచి. విషయం

తెలుసుకొని "నీ తెలివి మండిపోనూ!" భక్తి లేకుండా అతి తెలివితో గాలికి పోయే పేలపిండే కదా అని కృష్ణార్పణం అంటే పిండి పోవడమే కానీ ఫలితం ఉండదే 'పిచ్చిముండా!' అని చీవాట్లు పెట్టింది తల్లి. మనకు అవసరం లేని వాటిని దానంగా భావించి ఇవ్వడం మంచి పద్ధతికాదు. మనకు అవసరమైనవాటిని, మనమెంతో ఇష్టపడే వాటిని ఇవ్వగలగడమే నిజమైన దాన గుణం. మనకున్నంతలో అవసరమున్నవారికిచ్చి పాలు పంచుకోవడమే త్యాగబుద్ధి.

- - - - -

బస్సు దిగిన ముసలవ్వలు ముగ్గురు ఆటో రిక్షాను మాట్లాడుకున్నారు. కొంత సేపయ్యాక వెనుక నుంచి ఒక ముసలావిడ డ్రైవర్ భుజం తట్టి చేతిలో కొన్ని బాదం-పిస్తాలు పెట్టింది. ఆటో డ్రైవర్ వాటిని అందుకొని కృతజ్ఞతతో కళ్ళకద్దుకొని ప్రసాదంగా భావించి తిన్నాడు.

మరి కొంత దూరం ప్రయాణించాక మరలా కొన్ని పిస్తా, బాదం పప్పులు చేతిలో పెట్టింది. వాటినికూడా తిన్నాడు ఆటో డ్రైవర్. మరొక పావుగంట తర్వాత డ్రైవర్ చేతిలో మిగిలినవన్నీ పెట్టేసింది. అదేంటి? మీరెవ్వరూ తినకుండా నాకే ఇస్తున్నారు? నోటిలో వేసుకొని సమాధానం కోసం ఎదురుచూస్తున్నాడు ఆటోడ్రైవర్.

ముసలమ్మ కాస్త నిదానంగా ఇలా చెప్పింది. మరేం లేదు నాయనా! వాటిని నమలి తినడానికి మాకెవరికీ పండ్లులేవు, అంచేత వాటి చుట్టూ ఉన్న చాక్లెట్‌నూ, ఐస్‌క్రీంనూ చప్పరించి తిన్నాక, పారెయ్యకుండా దాచి పెట్టి, నీకిచ్చాం అన్నది. ఆటో డ్రైవర్‌కు ఆ మాట విన్నాక కడుపులో దేవినట్లయింది. పాపం!.

* ఒక్కొక్కసారి ఏమి ఇవ్వని లోభివానికంటే తనకవసరంలేనివాటినైనా ఇవ్వడం కూడా ఒక మంచి లక్షణమే.
* ధనవంతుడైన లోభికన్నా దానగుణం ఉన్న పేదవాడు మేలు. దానం చెయ్యడానికి పేదవాడు, ధనవంతుడన్నతేడా లేదు.

చిన్నదానమే గొప్ప ఆపదలో ఆదుకుంటుంది

ఒక పర్వదినాన ద్రౌపదీదేవి సముద్ర స్నానానికి వెళ్లింది. ఎందరో భక్తులు, సాధువులు, ప్రజలుకూడా పవిత్ర స్నానం చేస్తున్నారు. అందులో ఒక సాధువు కౌపీనం (గోచీ) అలల వేగానికి కొట్టుకొనిపోయింది. ఆ కారణంగా సాధువు నీళ్ళలో నుండి బైటికి రాలేక, నీళ్లలోనే ఉండలేక అవస్థలు పడుతూ ఉండినాడు. ఇదంతా దూరం నుండి ద్రౌపది గమనించింది. వెంటనే తన చీరలోని కొంత భాగాన్ని చించి సాధువు దగ్గరకు విసిరివేసింది. అతడు దానిని కట్టుకొని ఎంతో సంతోషించాడు. ఆమెకు ధన్యవాదాలు తన మనసులో చెప్పుకుంటూ వెళ్లాడు.

ఈ స్వల్ప వస్త్ర దానమే, నిండు సభలో దుశ్శాసనుడు ద్రౌపదీ దేవిని అవమానించినపుడు కాపాడింది. ఏనాడో చేసిన స్వల్ప పుణ్యకార్యమే ద్రౌపదీదేవికి మహోపకారం చేసింది.

* వంద మందిలో శూరుడొక్కడుంటాడు. వేయి మందిలో పండితుడొక్కడుంటాడు. పది వేల మందిలో వక్త ఒక్కడుంటాడు. లక్ష మందిలో దాత ఒకడుంటే ఉండవచ్చు. లేదా ఉండకనూ పోవచ్చు. దాన గుణ వైశిష్ట్యమది. అది అంతటి అరుదైన గుణం.

దానమెప్పుడైనా అవసరమైన వారికి, యోగ్యులకు మాత్రమే చెయ్యాలి. అయోగ్యులకు దానం చేస్తే వారు దానిని పాపకార్యాలకు వినియోగిస్తారు. పాపానికి కారణ భూతులలో ఈ దాతకూడా ఒకడవుతాడు. "పుణ్యానికి పోతే పాపం ఎదురవుతుంది". అందుకే "పాత్ర యెరిగి దానం చెయ్యాలి. క్షేత్రమెరిగి ధాన్యం వెయ్యాలి" అంటారు.

దానాలలో ఫలానా దానం గొప్పది. శ్రేష్ఠమైనది అని చెప్పలేము. అవసరమున్న వారికి సమయానికి అందితే అదే శ్రేష్ఠమైనది. కొందరికి రక్తం అవసరమవుతుంది. కొందరికి కళ్లు, గుండె, కిడ్నీలు అవసరమవుతాయి. కొందరికి వస్తువులు, పాత్రలు. ధాన్యం, పశువులు, భూములు అవసరమవుతాయి. మరికొందరికి విద్య, వైద్యం అవసరమవుతుంది. కొందరికి సేవలు, సహకారాలు అవసరమవుతాయి.

ప్రతి మనిషి తనకున్న దానిలోనే ఇతరులకు ఇవ్వాలి. తనకు చేతనైన, సేవ. సహకారం అందివ్వాలి.

ఎవరికి ఎపుడు ఎలాంటి బాధలు దాపురిస్తాయో చెప్పలేము. కాబట్టి శక్తి వంచన లేకుండా తనకు తోచిన విధంగా సద్బుద్ధితో, నిరాడంబరంగా భగవంతుని సేవగా భావించి చేసిన దానం ఏదైనా అత్యంత శ్రేష్ఠమైనదే.

సాధారణంగా దానం ఇలా చేస్తుంటారు

1. విధిలేని పరిస్థితులలో తిట్టుకుంటూ దానం చేయడం.
2. ఇపుడు మనం దానం ఇస్తే మరలా, మన సిఫారసుతో ఇప్పించవచ్చు లేదా మనమే వసూలు చేయవచ్చని దానం చేయడం.
3. గోరంత ఇచ్చి, కొండంత ఆర్భాటంతో దానం చేయడం.
4. దానం చేసినా సరిపడినంత దానం చెయ్యకపోవడం.
5. తమ దగ్గరికి పదే పదే రావడంకూడా గొప్పగా భావించి, పదిమార్లు తిప్పించుకొని దానం ఇవ్వడం.
6. ఎవరికి చెందుతున్నది? ఎలా ఉపయోగపడుతున్నది? అని తెలుసుకోకుండా దానం చెయ్యడం.

7. ఎవరు దానం చేస్తున్నారో తెలియకుండా గుప్తదానం చెయ్యడం.
8. అడగకుండా అవసరమైనంత దానం చెయ్యడం.
9. ఇవ్వలేకపోయినా, ఇవ్వగలిగేవారిని చూపించి దానం ఇప్పించడం.

దానం ఇలా ఉండకూడదు

ఒకాయనకు ఏదో ఒకటి దానం చేసి పుణ్యం సంపాదించాలని కోరిక పుట్టింది. అది తెలుసుకున్న అతని కుమారుడు "నాన్నా మనకు ఆవులు దండిగా ఉన్నాయి కదా? అందులోంచి ఒక మంచి ఆవును చూచి దానం ఇవ్వండి". అని సలహా ఇచ్చాడు.

భేష్! బాగా చెప్పావు. అని కుమారుడిని మెచ్చుకొని, తన ఆవులలోని ఒక మంచి దాన్ని చూచి ఓ బ్రాహ్మణుడికి దానమిచ్చాడు.

మరుసటి రోజు తెల్లవారక ముందే బ్రాహ్మణుడి ఇంటి గుమ్మం ముందు కూర్చున్నాడు. ప్రొద్దున్నే తలుపులు తీసీ తీయగానే దానమిచ్చిన పెద్ద మనిషి గుమ్మంలో అలా దర్శనమిచ్చేసరికి ఆశ్చర్యంతో, ఇలా ప్రొద్దున్నే వచ్చారేంటి? ఏమైనా నాతో పనా? అనడిగాడు బ్రాహ్మణుడు "ఆఁ ఏంలేదు, ఆవుకి పరగడుపుననే నీళ్ళు త్రాగించడం అలవాటు అందుకని త్రాగించిపోదామని వచ్చాను". అన్నాడు. అందుకు బ్రాహ్మణుడు అయ్యో! మీకు ఆవంటే ఎంత ప్రేమో! దానమిచ్చేసినాకూడా నీళ్ళు పెట్టాలనే విషయం గుర్తొచ్చి తెల్లవారకముందే వచ్చారు. ఎంతటి సహృదయులు మీరు! అని పొగిడాడు. దానికాయన మురిసిపోతూ ఆవుకు నీళ్ళు పెట్టి వెళ్ళిపోయాడు.

మళ్ళీ మధ్యాహ్నం వచ్చాడు. మధ్యాహ్నం సంధ్యావందనం చేసుకుంటున్న బ్రాహ్మణుడు ఇతన్ని చూడగానే ఆశ్చర్యపోతూ మళ్ళాఏంటి? ఇలా వచ్చారు? ఉదయం వచ్చినప్పుడు ఏమైనా మరిచిపోయారా? అనడిగాడు. అందుకాయన ఆదోలా నవ్వేస్తూ ఆఁ ఏంలేదు ఆవుకు ఎండుమేత పడదు. ఆ విషయం ఓసారి గుర్తుచేద్దామని వచ్చానన్నాడు.

అందుకా బ్రాహ్మణుడు నిజంగా మీరు ఆవును కన్నబిడ్డకన్నా ఎక్కువగా చూసుకున్నారనిపిస్తుంది. అంటూ పొగిడాడు. దానికి గోదానం చేసినాయన మురిపెంగా నవ్వుకుంటూ వెళ్ళిపోయాడు.

సాయంత్రం మరలా బ్రాహ్మణుడికి వాళ్ళింటి గుమ్మంలో దర్శనమిచ్చాడు గోదానం చేసినాయన. "మీరు చెప్పినట్లు ఎండుమేత పెట్టడం లేదులెండి! అలవాటు లేదన్నారుగదా?'' అన్నాడు బ్రాహ్మణుడు. అందుకా గోదానం చేసినాయన "అందుక్కాదులెండి! పాలు తీసే వేళయింది గదా? పాలు తీసే ముందు తవుడు, సజ్జలు లాంటి దాణా ఏదో ఒకటి తినే అలవాటుంది దానికి, అంటూ తనతో తెచ్చిన తవుడు ఆప్యాయంగా ఆవుకు తినిపించసాగాడు. ఈ విధంగా ప్రతి రోజు మూడు పూటలా ఏదో ఒక వంకతో వచ్చిపోతూ ఉంటే, అతనిని మూడు నాలుగు రోజులు చూశాక ఆ బ్రాహ్మణుడు ఓ పని చేయండి! మీ ఆవుని మీరు పట్టుకెళ్ళండన్నాడు.

ఇచ్చేదానాలు అలా ఉండకూడదు. ఒకసారి దాన మిచ్చేశాక ఇక దానిమీద మనకెలాంటి హక్కు ఉండదని తెలుసుకోవాలి.

అవసరానికి ఆదుకునే చేతులే చేతులు

ఒక రాజు పరమ శివభక్తుడు. కార్తీక మాసంలో శివ దేవుడికి పెద్ద ఎత్తున క్షీరాభిషేకం చేయించాలనుకున్నాడు. అందుకోసం నగరంలోని పశువుల యజమానులకు తమ పాలన్నీ ఆరోజు ఆలయానికి తరలించాలని ఆజ్ఞాపించాడు రాజు.

రాజాజ్ఞననుసరించి ప్రజలంతా ఆలయంలోని పెద్ద పాత్రలో తాము తీసుకొచ్చిన పాలను పోయను మొదలుపెట్టారు. ఎన్ని పాలు పోసినా పాత్ర సగం వరకు మాత్రమే నిండుతోంది. రాజుతో పాటు ప్రజలంతా ఆశ్చర్యపోతున్నారు. ఆ సమయంలో ఒక పదేళ్ళ అమ్మాయి అందరికంటే చివరిగా వచ్చి శివుడికి మనసారా మొక్కింది. ఆ అమ్మాయి తెచ్చిన పాత్రలో కూడా కొన్ని పాలు మాత్రమే ఉన్నాయి. ఆ కొద్దిపాటి పాలనే ఆలయంలోని పెద్ద పాత్రలో పోసింది. అంతే! అంతవరకూ సగం పాలతో మాత్రమే ఉండిన పాత్ర ఒక్కసారిగా అంచులుదాక పాలతో నిండిపోయినది. ఆశ్చర్యంతో ఆ అమ్మాయిని రాజుగారు విచారించారు. అప్పుడా అమ్మాయి నెమ్మదిగా, వినయంతో క్షమించండి మహారాజా అందరిలాగానే నేనుకూడా చెంబునిండా పాలు తెచ్చాను కానీ ఆకలితో ఏడ్చుతున్న ఒక పసిపాప దారిలో కనిపించింది. ఆ చిన్నారి పాప ఆకలిని తీర్చి, మిగిలిన పాలను శివుని కోసం తెచ్చాను అంది. అప్పుడు అర్థమైంది మహారాజుకు శివానుగ్రహం కోసం ఏమిచెయ్యాలో.

ప్రకృతిలోని సమస్త జీవ-నిర్జీవ పదార్థాలన్నీ భగవంతుని ప్రసాదమే. అటువంటి వాటిని మరలా భగవంతునికి ఇవ్వడమేమిటి? ఆ ఆలోచనే అర్థరహితం. భగవంతుడు మనకు ప్రసాదించినందుకు సదా కృతజ్ఞతాభావంతో వుండాలి.

ఎవరికైనా ఏదైనా ఇవ్వగలిగే శక్తి మనిషికి లేదుగాక లేదు. సేవ, సహకారం. తప్ప మరేమీ సాటి మనిషికి ఇవ్వలేడని మనిషన్న ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

ప్రతి ధాన్యపు గింజపై తినేవాడిపేరు వ్రాయబడి ఉంటుంది

ప్రతి ఒక్కరి జీవితంలో అయాచితంగా అవసరాలు తీరిన రోజులు, అనుకోకుండా దక్కిన గౌరవాలు, మన ప్రమేయం ఏమాత్రం లేకపోయినా నిందలు వచ్చిన సందర్భాలు అనుభవమే.

పదవ తరగతి పరీక్షల డ్యూటీకి నేను, నా శ్రీమతి ఇరువురం వెళ్ళవలసి వచ్చింది. పరీక్షలు ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతూ ఉండేవి.

ఒకరోజు ఉదయం టిఫిన్ తినలేదు. మధ్యాహ్నానికి భోజనం కూడా తయారు చేసుకోలేదు. కారణం ఉదయం నుండి ఎవరో ఒకరు రావడం మాట్లాడ్డం, మధ్యలో ఫోన్లు రావడం లాంటి అంతరాయాలతో ఖాళీ కడుపుతోనే ఎగ్జామినేషన్ డ్యూటీకి

వెళ్ళవలసి వచ్చింది. పరీక్ష పేపర్లు ఇచ్చేసి బైటపడి టైం చూసుకుంటే మధ్యాహ్నం 2.30 గంటలవుతున్నది. మోటర్ బైక్‌లో ఇద్దర౦ వస్తూ, టౌన్‌కెళ్ళి ఏదైనా హోటల్లో భోంచేసి వెళదాం అనుకున్నాం. మొదట సరేనని తర్వాత ఎందుకో, వద్దులే ఇలా మాములు దారిలో వెళ్ళితే తొందరగా ఇల్లు చేరవచ్చు. ఏదో ఒకటి చేస్తాను, ఈ పూటకు సరిపెట్టుకుందాం అన్నది శ్రీమతి. నేనూ సరేలే అన్నాను. అదే దారిలోనే మాకు పాలుపోసే ఆమె ఇల్లు ఉంది. తీరా ఆమె ఇంటి ముందుకు వచ్చేటప్పటికి దారికి అడ్డంగా వచ్చి చేతులూపుతూ నిలబడింది. నేను బ్రేక్ వేసి ఆపి ఏమి? అని అడిగాను. మేము మొక్కుబడి ఉండి పొట్టేలును కోశాము. ఉదయం పాలు పోయడానికి వచ్చినప్పుడు మీకు చెప్పడం మరిచాను. ఈ మధ్య పరీక్షలకని ఈ దారిలోనే కదా పోతున్నారు. మీ కోసమే ఇంటి ముందు ఇంకా రాలేదే అని ఎదురుచూస్తున్నాను. రండి భోజనం చేసి వెళ్ళుదురు అని బలవంతం చేసింది. పాలు పోయించుకుంటూ ఆ కుటుంబంతో యాభై ఏళ్ళ అనుబంధం మాది. తృప్తిగా విందు ఆరగించి, తాంబూలం నములుతూ "ప్రతి బియ్యపు గింజమీద తినే వాడి పేరు రాసి పెట్టి ఉంటుందంటారు" అంటే ఇదే కాబోలు అనుకుంటూ ఇంటి దారి పట్టాము.

ప్రతి వారి జీవితంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ముఖ్యంగా ప్రయాణాలు చేసేటపుడు ఏ పరిచయం లేకపోయినా ఎవరో ఒకరు తమ ప్రక్కన కూర్చొమ్మని సీటు ఇవ్వడం, ఒక్కొక్కసారి తాము కూర్చోవాలనుకున్న సీటు నుండి లేచి మనకు సీటు ఇవ్వడం, ఒక్కోసారి మనము కూర్చోవాలనుకున్న సీటులో వేరొకరు వచ్చి దౌర్జన్యంగా కూర్చున్న సంఘటనలుకూడా ఉంటాయి. ఇలాంటివి ఎందుకు జరుగుతాయి.

తెలిసో, తెలియకో చేసిన మంచి పనులకు దక్కే గౌరవాలు, చేసిన తప్పులకు పడే శిక్షలు అని మనం తెలుసుకోవాలి.

1985 వ సంవత్సరంలో ఒకసారి స్వచ్ఛంద సంస్థ సభ్యులమంతా కలిసి డొనేషన్లు వసూలు చేసేపని మీద నందలూరు వెళ్ళాము. డొనేషన్లు బాగానే ఇచ్చారు, మధ్యాహ్నం ఒంటి గంట అవుతుంది. బస్సెక్కేందుకు రోడ్డుమీదికి వచ్చాము. ఎంత సేపు చూచినా ఒక్క బస్సుకూడా రాలేదు. నిదానంగా తెలిసింది. ఎవరో రాజకీయ నాయకుడు హత్య చేయబడ్డాడని, అతని అనుచరగణం రెచ్చిపోయి "రాస్తారోకో" చేస్తున్న కారణంగా బస్సులు ఎక్కడివక్కడ నిలిచిపోయాయని.

నందలూరు నుండి రాజంపేటకు తొమ్మిది కిలోమీటర్లు. మధ్యలో చెయ్యేరు వంతెన. మధ్యాహ్నపు ఎండ, భోజనం టైము. నడిచి వెళ్ళడంకూడా సరదాయే కదా! ఎప్పుడోకానీ అంతదూరం నడిచే భాగ్యం దొరకదు. అంతేకాక తప్పనిసరి కాబట్టి నడకసాగించాలి. దారి మధ్యలో గుండ్లూరు గ్రామం. ఆ గ్రామంలో మా సహోద్యోగి డ్రిల్లు మాస్టరున్నాడు. పేరు జయరామిరెడ్డి. రోడ్డు ప్రక్కనే ఇల్లు. అతని గురించి

మాట్లాడుకుంటూ నడక సాగించాం. మా కోసమే ఎదురు చూస్తున్నట్లుగా ఇంటి ముందు మంచం మీద కూర్చొని ఉన్నాడు జయరామిరెడ్డి.

మమ్ములను చూచి ఎంతో సంబరపడిపోయాడు. పలకరింపులు, మంచినీళ్ళు త్రాగడం అయిపోయింది. కాసేపు కూర్చొని ఇక వెళ్లొస్తాం. అని బయలు దేరాం. మాతో కూడా నాలుగడుగులు నడచివచ్చి, నా చేతులు పట్టుకొని "మిత్రమా నాదొక రిక్వస్టు" అన్నాడు. ఏమిటి అన్నాను. ఏమీలేదు పులివెందుల నుంచి నా బాల్య మిత్రులు నలుగురు వస్తామన్నారు. శనివారమే అయినా మిత్రులకోసం ఇంటికోళ్ళను రెండింటిని కోసి భోజనం రెడీ చేశాను. శనివారం నాడు కోళ్ళను కోయడం ఏమిటి? మాంసం వండడం ఏమిటి? అని నా భార్య ఎంత మొత్తుకున్నా వినకుండా మొండిగా పని మనిషి చేత వంట చేయించాను. వారికోసం ఎదురు చూస్తున్నాను. ఇక వారు ఈ రోజు రాలేరు. నా భార్య వేసే చీవాట్లకు ఏమీ చేయలేక, ఎదురు చెప్పలేక, నేనూ భోజనం చెయ్యక, స్నేహితులు ఎప్పుడు వస్తారా, వండిన వంట ఎప్పుడు ఖర్చయి పోతుందా అని ఇదిగో మధ్యాహ్నం నుండి ఇలా ఇంటి బైట మంచం మీద కూర్చొని పడిగాపులు కాస్తున్నాను. ఎలాగూ మీరు వచ్చారు కదా? మీ అయిదుగురు దయతలిస్తే నా మర్యాద నిలబడుతుంది, వండిన వంట వేస్ట్ కాకుండా ఉంటుంది. నా భార్య పెట్టే చీవాట్ల నుండి నన్ను తప్పించినట్లూ అవుతుంది. శనివారం అని అనుకోకుండా మీరు దయతలచాలి అన్నాడు.

మేమంతా దాదాపు ముప్పై సంవత్సరాల సమవయస్కులమే. మా అందరిదీ ఒకే సిద్ధాంతం. అదేమిటంటే శనివారం నాడు ఇంట్లో మాంసాహారం నిషేధం. హోం డిపార్ట్‌మెంట్ అనుమతించదు కాబట్టి. బైట మాత్రం ఓకే. ఆ సిద్ధాంతం ప్రకారం మేమంతా ఏకస్తులమై, మిత్రుని మొర ఆలకించి వంట వల్ల వచ్చిన కష్టాన్ని తొలగించదలచాము.

మిత్రుని భార్యకూడా చాలా సంతోషించింది. నడిచి వెళ్లేపనికదా అని కొసరి. కొసరి వడ్డించింది. బాగా ఆకలి మీద ఉన్నాం కాబట్టి తృప్తిగా లాగించాం. మిత్రుడు కూడా అపద్బాంధవులుగా మమ్ములను పొగిడి "నూట పదహార్లు" డోనేషన్ ఇచ్చి మమ్ములను సాగనంపాడు

నిజానికి బస్సులు కనుక నడిచి ఉంటే మేము గుండ్లూరుకు వెళ్ళి ఉండేవారమే కాదు. ఆ యింట్లో విందు ఆరగించాలని, ఆయన ఇచ్చే నూట పదహార్లు మేము చేసే సామాజిక సేవలో ఉపయోగపడాలని వ్రాసి ఉంటే తప్పుతుందా మరి!

* ఏ నిమిషానికి ఏమి జరుగునో ఎవరు ఊహించెదరు?

కామం - 6

కామం మూడవ పురుషార్థం. కామం అనగా కోరికే అయినప్పటికీ, స్త్రీ పురుషుల కలయిక కోసం పడే ఆరాటాన్నే కామం అని ప్రముఖంగా పరిగణిస్తూ ఉంటారు. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల సుఖానందానుభవం కొరకే మనసు నిరంతరం తహతహ లాడుతూ ఉంటుంది. దానికి ఇచ్చినంత ప్రాముఖ్యం సృష్టిలోని ఏ పదార్థానికిగానీ, ఏ ఆనందానికిగానీ మనసు ఇవ్వదు. అలాంటి ప్రాముఖ్యాన్ని దానికి మాత్రమే ఇవ్వడంలో సరి అయిన కారణం లేకపోలేదు.

శ్రవణానందం చెవులకు మాత్రమే,
స్పర్శ సుఖానందం చర్మానికి మాత్రమే,
రూపానందం కళ్ళకు మాత్రమే,
రసానందం జిహ్వకు మాత్రమే
గంధానందం నాసికకు మాత్రమే.

ఇలా విడివిడిగా ఒక్కో జ్ఞానేంద్రియం ద్వారా ఒక్కొక్క ఆనందాన్ని మాత్రమే మనసు ఆస్వాదిస్తుంది. కానీ సమస్త అనుభవాలనూ, అనుభూతుల అమితానందాన్ని స్త్రీ-పురుషుల కలయిక ద్వారా మాత్రమే మనసు పొందుతుంది. కాబట్టే కామం అనేదానికి అంతటి ప్రబలమైన ప్రాధాన్యత లభించింది. మనసు దానికోసం ప్రాణాలివ్వడానికైనా, ప్రాణాలు తియ్యడానికైనా ఒడిగడుతుంది.. దిగజారుతుంది. అంతటి శక్తివంతమైనది కాబట్టే దానిని కామాగ్ని అంటారు. సమాజంలో జరుగుతున్న హత్యలూ, ఆత్మహత్యలూ, త్యాగాలూ, పెద్దల నెదిరించడాలూ, అక్రమ సంబంధాలు, లేచి పోవడాలు లాంటి నేరాలూ - ఘోరాల నేపథ్యమంతా విచక్షణలేని కామ సుఖానుభవం కోసమేనన్నది అందరూ అంగీకరించవలసిన సత్యం.

* సముద్రంలో పుట్టే అగ్ని (బడబాగ్ని) పరిమితమైన నీటినే కాల్చగలదు.
  అడవిలో పుట్టే అగ్ని (దావానలం) కొంతమేర అడవిని మాత్రమే భస్మం చేయగలదు.
  పర్వతంలో పుట్టే అగ్ని పర్వతాన్ని మాత్రమే బ్రద్దలు చేయగలదు.
  జఠరాగ్ని ప్రేవులను మాత్రమే దహించగలదు. కానీ.... కామాగ్ని మాత్రం అన్నింటినీ దహించి, నాశనం చేయగలదు.
* స్త్రీ సాహచర్యం కోసం, పొందు కోసం యుద్ధాలు చేసి, రాజ్యాలకు రాజ్యాలనే మట్టు బెట్టిన వారు కొందరైతే, రాజ్యాలనే త్యాగం చేసిన వారు మరికొందరు. సన్యాసులు కూడా సంసారులైన వారు, సంసారులు కూడా సన్యాసులైనవారెందరో.
* పరస్త్రీ వ్యామోహం ఎంతటి వినాశకారో రావణుని చరిత్ర చెపుతుంది.
* ఎంతావారలైనా కాంతాదాసులే.
* అందమైన అతివనుగాంచిన బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులు.

జీవితాలనే దుఃఖదాయకంగానూ, సుఖదాయకంగానూ మార్చివేయగల శక్తివంతమైన కామ వ్యామోహాన్ని ఎలా జయించాలి? అన్నదే గృహస్థుల ముందున్న ప్రశ్న.

జయించడమంటే?!

ఆకర్షణలపట్ల ఆపేక్ష కానీ ఉపేక్ష కానీ లేకపోవడమే. గృహస్థులు కామాన్ని జయించాలి అంటే విచక్షణతో ధానిని సంపూర్ణంగా గృహస్థ ధర్మం ద్వారా అనుభవించి, అది ఒక ఎండమావిలాంటిదనే జ్ఞానాన్ని సంపాదించుకోవాలి. అందుకోసం స్త్రీ-పురుషులిరువురూ తమ తమ శారీరక, మానసిక తత్వాలను తెలుసుకోవాలి. జీవిత పరమార్థం ఏమిటో ఆలోచించుకోవాలి. అది ఎలాగో తెలుసుకుందాం.

స్త్రీ-పురుషులిరువురూ కామ సుఖ ప్రేరేపితులే అయినా స్త్రీ తన సహజమైన సాత్విక గుణంతో (శాంతం, సహనం) సంయమనం (మెంటల్ బ్యాలెన్స్) కోల్పోకుండా ఉండగలుగుతుంది. స్త్రీలోని ఏ భావాలైనా మనసు యొక్క లోపలి పొరలలో నిక్షిప్తమై ఉంటాయి. అందుకే స్త్రీ ఏ విషయంలోనైనా నిదానం, నెమ్మదితనం చూపిస్తుంది. అందుకనే స్పర్శ, వాతావరణ పరిస్థితుల ప్రభావంపడితేగానీ, కామ విషయంగా అంత త్వరిత గతిలో స్త్రీ స్పందించదు. అంతేకాకుండా అదే పనిగా స్పర్శతో ప్రేరేపిస్తే తప్ప, స్పందించనంత లోప్రదేశంలో స్త్రీ మర్మాంగం ఉండడం కూడా ఒక కారణం.

కానీ పురుషుల విషయంలో అలాకాదు. పూర్తిగా భిన్నం. పురుషుడు స్వభావరీత్యా రజోగుణ (తొందరపాటు, కోపం, ఆవేశం) సంపన్నుడు. పురుషుని కామభావన మనసు యొక్క ఉపరితలం పైనే ఉంటూ, ఎల్లప్పుడూ జాగృతావస్థలోనే ఉంటుంది. కాబట్టి శబ్ద, స్పర్శ, రూప, రస గంధాదులలో ఏ అంశం యొక్క ప్రభావం పడినా, త్వరితగతిన స్పందిస్తాడు. ఆ సుఖాన్ని అందుకోవాలని ఆరాటపడతాడు. పోరాటంకూడా సాగించడానికి వెనుకాడడు. ఎంతటి త్యాగానికైనా సిద్ధపడతాడు. దానికి తోడు పురుషుని జననేంద్రియాలుకూడా స్పర్శ మాత్రం చేతనే స్పందించే టట్లుగా బాహ్యంగానే ఉంటాయి. ఆ కారణం చేత కూడా పురుషుడు కామ భావన పట్ల త్వరగా స్పందిస్తాడు. ఆకర్షింపబడతాడు.

భోగం అంటే సుఖం, స్త్రీ పురుషులిరువురూ కామసుఖాన్ని సమానంగా పొందడమే సంభోగం (సమభోగం). ఈ విషయంలో పురుషుడు దేహదారుఢ్యంతోపాటు మానసిక సంయమనాన్ని కూడా పెంపొందించుకోవాలి. ఎందుచేతనంటే తన సహజమైన రజోగుణ ప్రభావంతో ఉద్రేకానికి లోనై, తొందరపాటుతనంతో వీర్యాన్ని స్ఖలింపచేసుకొని తాను మాత్రమే కామ ప్రకోపాన్ని తగ్గించుకొని, కామ క్రీడ సుఖాన్ని పొంది తృప్తి పడుతుంటాడు. సంభోగానికి అర్థం అదికాదు.

పురుషుడు తన కామవాంఛను ప్రయత్నపూర్వకంగా తన వశంలో ఉంచుకుంటూ, ఉద్రేకాన్నీ, తొందరపాటునూ తగ్గించుకొని, ఆవేశానికి లోను కాకుండా నెమ్మదిగా, స్త్రీ శారీరక, మానసిక తత్వాన్ని అర్థం చేసుకుంటూ, తనతో పాటు సమానంగా

రతి క్రీడలో పాల్గొనేటట్లుగా ప్రేరేపిస్తూ, ప్రేరణ పొందుతూ, సంభోగానందాన్ని సమానంగా పొందాలి. అలాకాకుండా ఏకపక్షంగా తాను మాత్రమే కామోద్రేక భారాన్ని దించుకొని, తప్తిపడితే స్త్రీ తాను పొందాల్సిన సంభోగానందాన్ని పొందలేక, అసంతృప్తికి లోనవుతుంది. స్త్రీ యొక్క అసంతృప్తినీ, అసహనాన్నీ పురుషుడు భరించలేడు. సంభోగానందాన్ని స్త్రీ పురుషులిరువురూ సమానంగా పొందగలిగితేనే- వారి మనసు అలజడులకూ, అసంతృప్తికీ లోనుకాకుండా తమ దైనందిన జీవితాన్ని ఉత్సాహంగా, తృప్తిగా, అర్థవంతంగా కొనసాగించగలరు. సంసార సాగరాన్ని సమర్థవంతంగా దాటగలరు.

జీవితానికి అందం, ఆనందం, అర్థం, పరమార్థం చేకూర్చే, అపూర్వమైన సంభోగ ఘట్టాన్ని అర్థవంతంగా, సమర్థవంతంగా, సంపూర్ణంగా, శోభాయమానంగా రక్తి కట్టించాలి. సృష్టికార్యాన్ని పరిపుష్టిగా నెరవేర్చాలి. అందులో స్త్రీ-పురుషులు ఇరువురూ తమతమ పాత్రలను సహజంగా, ప్రతిభావంతంగా పోషించి తరించాలి. ప్రకృతి-పురుషులు ఏకాత్ములై అర్ధనారీశ్వర తత్వాన్ని సాధించాలి. అదే మోక్షం.

స్త్రీ		పురుషుడు
శరీరం, మనసు (కోమలం)	:	శరీరం, మనసు, (కఠినం)
నైపుణ్యం ఎక్కువ	:	నైపుణ్యం తక్కువ
స్థిరం	:	చంచలం
పవిత్రం	:	కల్మషం
రక్తి (మాయ)	:	విరక్తి (జ్ఞానం)
అభద్రతాభావం, ముందుచూపు (ఎక్కువ)	:	ధైర్యం ఎక్కువ, ముందుచూపు తక్కువ
ఆకలి తక్కువ	:	ఆకలి ఎక్కువ
ఆయుష్షు ఎక్కువ (విధవలు ఎక్కువ)	:	ఆయుష్షు తక్కువ (విధురులు తక్కువ)
వినయం ఎక్కువ	:	గర్వం, అహంకారం ఎక్కువ
మేధస్సు ఎక్కువ	:	మేధస్సు తక్కువ
ఆంతరిక, బాహ్య సౌందర్యం	:	బలమే ప్రధానం
సేవ, సమర్పణ ఎక్కువ	:	స్వార్థం ఎక్కువ
బాధ్యత ఎక్కువ	:	బాధ్యత తక్కువ
కలయిక ద్వారా శక్తిని పొందును	:	కలయిక ద్వారా శక్తినికోల్పోవును
(అదనపుశక్తికోసం ప్రయత్నించదు)	:	(అదనపు శక్తికోసం బలవర్ధక ఔషధాలను, ఆహారాన్ని, ఆశ్రయించును)
ప్రతి కాన్పు మరణోన్ముఖం	:	సమస్య లేదు
పురుషునికి బహుమానం	:	స్త్రీకి వరం
కామాసక్తి ఉన్నా పైకి కనిపించనీయదు	:	కామాతురత ఎక్కువ ఎంతకైనా తెగిస్తాడు
సంయమనంతో ఉండగలదు	:	దిగజారతాడు
రహస్యం	:	బహిరంగం

* సృష్టికి మూలం సంభోగమే.
* ప్రేమకు పునాది కామమే.
* నపుంసకుడు స్త్రీని ప్రేమించలేడు, ఆధ్యాత్మిక మార్గానికి పనికిరాడు.
* ప్రతి జీవికి సంభోగం ఒక శారీరక అవసరం.
* కామం లావాలాంటిది. కామాగ్నిచల్లారితేకానీ మనసూ, శరీరం శాంతించదు.
* కామశక్తిని పరిమితంగా ఉపయోగించుకుంటే వరం, లేకుంటే శాపం.
* రతి క్రీడలో గెలుపొందువాడే, జీవితమనే ఆటలో గెలుపొందుతాడు.
* స్త్రీ ప్రేమకూ, పొందుకూ దూరమైన వారే శాడిస్టులూ, టెర్రరిస్టులూ.
* కామతృష్ణను ఆరోగ్యవంతంగా తీర్చుకొనుటకే గృహస్థజీవితం, వివాహ వ్యవస్థ ఏర్పడింది.
* విరహం కూడా తియ్యని బాధే.
* కవులందరూ విరహ బాధితులే.
* విరహానంతర, కలహానంతర సమాగమం కడు మనోహరం.
* పురుషుడు జయించవలసిన మొదటిదీ, చివరిదీ స్త్రీని మాత్రమే.
* స్త్రీ అందానికీ, స్త్రీ పొందుతో వచ్చే ఆనందానికీ పురుషుడు బానిస. మగతనానికీ, వ్యక్తిత్వానికి స్త్రీ బానిస.
* కామాన్ని అణచుకోవడం అధమం, అనుభవించడం మధ్యమం, జయించడం ఉత్తమం.

  పురుషునికి స్త్రీ పరీక్ష
  స్త్రీకి బంగారు పరీక్ష
  బంగారుకు అగ్ని పరీక్ష
  అగ్నికి నీరు పరీక్ష

* కాముకునికి లజ్జ, బిడియం, భయం, ఉచ్చనీచాలూ, వావివరుసలూ ఉండవు.
* కామ ప్రకోపాన్ని, మంచి ఆలోచనలతోనూ, మంచి అలవాట్లతోనూ, మంచిస్నేహాలతోనూ, మంచి వాతావరణంలో ఉండడంవలననూ తగ్గించుకోవాలి. లేకుంటే కామజ్వరం ముదిరి విపరీత పరిణామాలకు దారితీసే ప్రమాదమూ ఉంది.
* స్త్రీ పురుషులిరువురు దేహదారుఢ్యం ఉన్నంతవరకే రతి క్రీడానందం పొందగలరు. కాబట్టి అది తాత్కాలికమైనది. శాశ్వతానందాన్ని పొందగలిగే మార్గాన్ని ఆరోగ్యం బాగా ఉన్నపుడే తెలుసుకోవాలి.
* ఇంద్రియాల సుఖం కోసం తృప్తి కోసం పదేపదే స్త్రీ పొందుకొరకు పరితపించడం వ్యభిచారం తప్ప మరొకటికాదు.
* సంతానం కోసం, సంగమించడం,శారీరకారోగ్యం కోసం, మానసికారోగ్యం కోసం దంపతు లిరువురూ ఏకం కావడం గృహస్థ-ధర్మకామం, భోగేచ్ఛతో విచ్చలవిడిగా జరిపే శృంగారం వ్యభిచారం.

* పరస్త్రీ గమనమొక్కటే వ్యభిచారం కాదు. మానసిక వ్యభిచారం అనేది కూడా ఉంది. పర స్త్రీ రూపలావణ్యాలను పదేపదే మెచ్చుకోవడం వారి సౌందర్యాన్ని కీర్తించడం, వారితో కలసి మాట్లాడినట్లు, కలసి తిరిగినట్లు, సరససల్లాపాలాడినట్లు కలలు గనడం, దొంగచాటుగా చూడటం, రహస్యంగా కలుసుకోవడం, మర్మగర్భంగా, ద్వంద్వార్థాలతో మాట్లాడటం ఇదంతా మానసిక వ్యభిచారం క్రిందే లెక్క.
* భోగాసక్తుల సంతానం - నీచ సుఖలాలసులుగా, వ్యభిచారులుగా, జూదరులుగా, తాగుబోతులుగా, రోగులుగా ఉంటారు.
* దూరంగా ఉండే భర్తనూ, దగ్గరగానున్న బ్రహ్మచారినీ నమ్మరాదు.
* ధైర్యం లేకుంటే ప్రేమించకు. ప్రేమను మాత్రం ద్వేషించకు.

L	-	LOSS	LOVE
O	-	OF	
V	-	VALUABLE	
E	-	EDUCATION	

* ఆడదాని మొదటి ప్రేమికుడు కావాలనుకుంటాడు మగాడు. మగాడికి ఆఖరి ప్రేమికురాలుగా ఉండాలనుకుంటుంది ఆడది.
* స్త్రీకి-తనకు తెలియకుండా ఏదో జరుగుతుందనే భయం, తనకు తెలిసి ఏదైనా జరిగితే బాగుంటుందనే కుతూహలం ఉంటుంది.

ఒక అమాయకురాలు చీకటిలో నడచి వెళుతూ ఉంది. ఆమె వెనకాలే ఒక యువకుడు వస్తున్నాడు. ఆమె భయపడి "నేను ఒంటరి దానిననే ధైర్యంతో మీరు నన్నేమీ చేయరు కదా?" నెమ్మదిగా అడిగింది.

"ఛ...ఛ... నా కలాంటి దురుద్దేశ్యమేమీ లేదు. నువ్వు ధైర్యంగా నడు", అని అతడు భరోసా ఇచ్చాడు.

"ఆహ్!... అసలే చీకటి కదా?! పైగా ఒంటరిని, అందుకని... యువతి గొణిగింది.

"నా తలమీద కట్టెల మోపు ఉంది, దానికి తోడు చేతిలో గొర్రె పిల్ల ఒకటీ... ఇక నేనేమనుకున్నా ఏం చెయ్యగలను చెప్పు?" అన్నాడతడు.

అమ్మో! "ఆ మోపును క్రింద పెట్టి, గొర్రె పిల్లను చెట్టుకు కట్టేస్తే మాత్రం నేను ఇబ్బందిలో పడతాను కదా? అంది అమాయకంగా.

సమభోగం ద్వారా పరమాత్మ సంయోగం

జ్ఞాన, కర్మేంద్రియాల ద్వారా తన కార్యకలాపాలను నిర్వహిస్తూ నిరంతరం శారీరక సుఖంకోసం, మానసికానందం కోసం, ఇంద్రియాల తృప్తికోసం వెంపర్లాడుతూ శాశ్వతమైన ఆనందం దేనిలోనూ, ఎందులోనూ లభించక తృప్తి చెందనూలేక, స్థిరంగాఉండనూలేక తహతహలాడుతూ నిరంతరాన్వేషణలోనే ఉంటుంది మనసు.

రతి క్రీడలో కామకేళీ విలాసాల ద్వారా తృప్తినీ, ఆనందాన్ని పొందుతూ వీర్యస్ఖలన సమయంలో ఒక్కసారిగా సమస్త ఇంద్రియాలూ చేష్టలుడిగి మనసుతో

తాదాత్మ్యం చెందుతాయి. మనసూ, శరీరం కూడా ఏకమై కొన్ని క్షణాలు తన్మయత్వంలో నిశ్చల, శూన్య స్థితిలో ఉండిపోతుంది. ఆ తన్మయత్వమే తన చివరి మజిలీ అని భ్రమపడి; సులభంగా అందుబాటులో ఉండే ఆ సుఖం కోసమే మనసు ఆరాటపడుతూ ఉంటుంది.

ఎన్నో అనుభవాల తర్వాత శరీరం వడలిపోతుంది. శరీరాన్నాశ్రయించుకొని ఉన్న మనసుకూడా శక్తిహీనమవుతుంది. రతిమీద రోతపుడుతుంది. పూర్వంలాగా పరుగులు పెట్టలేక తాననుభవించినది నిజమైన, శాశ్వతమైన ఆనందం కాదనీ, అది ఒక తాత్కాలికమైన తృప్తి మాత్రమేననీ, మరలా తన సహజమైన అన్వేషణలో ఉండిపోతుంది మనసు.

ఆ అన్వేషణ ఫలితమే దేవమానవులు దయతో సూచించిన ఆధ్యాత్మిక మార్గం (జ్ఞానమార్గం), ఆ మార్గంలో చూపించిన సాధనల ద్వారా మనసు ఆత్మతో సంయోగం చెంది పరమాత్మను దర్శించడమే మోక్షం. దానిని పొందడమే దంపతుల జీవితలక్ష్యం. అదే చివరిగమ్యం.

ఇంటినుండి బయటపడిన మనిషికి ఎక్కడికెళ్ళినా, ఏమి చేసినా, ఎంతనుభవించినా దక్కని సౌకర్యం, సుఖం, ఆనందం-తన ఇల్లు చేరుకున్నాక అనుభవిస్తాడు. ఎందుకని? అక్కడున్నది ఎవరో కాదు. నీకోసం కాచుకొని ఉన్న నీ అర్ధాంగే (ప్రకృతి) అక్కడున్నది ఎవరో కాదు నీ ఆత్మే (నీ ఇల్లే నీ ఆత్మ). ఆ విధంగా పరమాత్మ నుండి బయటపడిన మనసు తిరిగి తన స్వస్థానమైన ఆ పరమాత్మను చేరుకున్నాక తన పరుగులను, ఆరాటాన్ని పూర్తిగా కోల్పోతుంది. అదే శాశ్వతమైన ఆనందం.

పురుషునికి అత్యంతానందం స్త్రీ పొందులోనే విరక్తి అందులోనే

ఒకసారి దీనబంధు పాఠక్ అను వ్యాపారి పట్టణానికి వచ్చి పనిమీద తిరుగుతూ ఉండగా, అతని దృష్టి ఒక యువకునిపై పడింది. ఎందుకో ఆ యువకుని చూచిన వెంటనే తన మనసులో "పెళ్ళీడుకు వచ్చిన తనకుమార్తె రత్నావళికి ఈ యువకుడైతే సరిపోతాడు. ఈడు-జోడు బాగుంటుంది" అనుకున్నాడు.

ఆ ఆలోచన కలగగానే ఇక ఆ యువకుని వివరాలు తెలుసుకోకుండా ఉండలేకపోయాడు. చివరకు తేలిందేమిటంటే ఆ యువకుడు పట్టణానికి దగ్గరలోనున్న బాబా నరహరిదాసుగారి ఆశ్రమంలో ఉంటున్నాడనీ, మంచి కవితలు కూడా వ్రాస్తూ ఉంటాడని, ఆశ్చర్యం ఏమిటంటే తనుకూడా ఆ యువకుడు వ్రాసిన కవితలను చదివి బాగా వ్రాసాడని మెచ్చుకొని ఉండటం. ఇంకేముంది, ఇతడే తనకుమార్తెకు తగిన వరుడు అని నిశ్చయించుకొని, బాబా నరహరి దాసుగారి ఆశ్రమానికి వెళ్ళాడు. బాబాగారిని దర్శించుకొని తన మనసులోని మాటను బైట పెట్టాడు దీనబంధు పాఠక్.

బాబాగారు కూడా యుక్తవయసు వచ్చిన వారికి వివాహం చేయడం ధర్మం కదా అని ఆ యువకుని గురించిన వివరాలు ఇలా చెప్పాడు. "అతడు తల్లిదండ్రులు లేని వాడు. కాబట్టే నా ఆశ్రమంలో ఉంటున్నాడు కానీ అతని మామగారు మాత్రం ఇక్కడికి దగ్గర్లోని రాజాపూర్ గ్రామంలో ఉన్నారు. వారికి విషయం చెప్పి, వారి అనుమతి

కూడా తీసుకోండి ఎంతైనా దగ్గర బంధువు కదా? వాడు నా ఆశ్రమంలో పెరిగి పెద్దవాడైనప్పటికీ సన్యాసినైన నాకు వివాహ విషయాలు తెలియవు. మీ కుమార్తెను కూడా ఒకసారి ఆశ్రమానికి వచ్చినపుడు చూచాను. ఇద్దరికీ ఈడు-జోడు బాగుంటుంది. అన్నారు. పాఠక్‌గారు వెళ్ళాక బాబాగారు తన శిష్యుడిని పిలిచి వివాహ విషయాన్ని చెప్పాడు. శిష్యుడు వినయంగా అంతా మీ ఆశీర్వాదం అన్నాడు.

పాఠక్‌గారు ఒక మంచిరోజు చూచుకొని రాజాపూర్‌కు వెళ్ళి, యువకుడి మామగారిని కలుసుకొని అంతవరకూ జరిగిన విషయాన్ని వివరించాడు. వారుకూడా అభ్యంతరం చెప్పకుండా చాలా సంతోషించారు. పైగా వివాహానంతరం వారికి ఉండేదానికి ఒక ఇల్లు,జీవనానికి కొంత ధనాన్నికూడా ఏర్పాటు చేస్తామని చాలా ఉదారంగా చెప్పారు. పరిస్థితులుకూడా చక్కగా కలిసి వచ్చినందుకు పాఠక్‌గారు చాలా ఆనందించారు. ఇంకేముందీ? కాలం కలిసొస్తే అంతేమరి! అన్నీ చకచకా జరిగిపోయాయి.

వివాహానంతరం బాబాగారి ఆశీస్సులు పొంది, వారి అనుమతితో వాళ్ళ మామగారుండే రాజాపూర్‌లోనే తమకోసం ఇచ్చిన ఇంట్లో ఉండసాగారు. భార్య రత్నావళి పేరుకు తగ్గట్లు అందచందాలలో రతనాలరాశే. తనకు ఇంత అందమైన భార్య, ఉండేదానికి ఇల్లు, జీవనానికి కొంత ధనం సమకూరడం, కలలో కూడా ఊహించలేదు అనుకుంటూనే-అదే విషయాన్ని తన భార్యతో చెప్పాడు. భార్య రత్నావళి తన భర్త నోటివెంట ఆ మాట విని ఎంతో సంబరపడిపోయింది.

మామగారి సలహాలను తీసుకుంటూ, ఇంటి పనులు చూచుకుంటూ దాంపత్య సరదాలను తీర్చుకుంటూ ఆనందంగా ఉండగా, ఒకనాడు తన భార్య అన్న చెల్లెలిని చూచిపోదామని వచ్చాడు. రెండు రోజులు గడిచాక చెల్లెల్ని, బావమరిదినీ దగ్గర కూర్చుండబెట్టుకొని మెల్లగా బావమరిదితో "నాచెల్లెల్ని నీవు పంపిస్తే కొద్దిరోజులు మా ఇంటిలో ఉంచుకొని పంపిస్తాము. వివాహమై కొన్నినెలలు గడిచాయికదా? ఒక్కసారైనా అమ్మగారింటికి రాకపోతే బాగుండదు. నీవు అనుమతిస్తే పిలుచుకొని పోతాను. ఆ తర్వాత నీవుకూడా జరూరు పనులు ఏవైనా ఉంటే చూచుకొని వచ్చేసేయ్-కొన్ని రోజులు సరదాగా గడిపి వద్దురు అన్నాడు.

భార్యను విడిచి ఒక్కక్షణం కూడా ఉండలేను. నేను పంపించలేను. ఇంకా కొన్ని రోజులు గడిచాక చూద్దాంలే, దయచేసి ప్రస్తుతం ఆ ప్రస్తావనను వదలి వేసి మీరు మరికొన్ని రోజులు మాదగ్గరే ఉండి వెళ్ళండి. అంతే కానీ, పుట్టింటికి తీసుకెళతాను అని మాత్రం అడగవద్దన్నాడు. మొదట వారంరోజులుండి వస్తుంది అంటారు. తర్వాత మరికొన్ని రోజులుండి వస్తుందిలే అంటారు. ఆ తర్వాత వారం బాగాలేదు, తిథిబాగాలేదు అని ఏవేవో చెప్పి కొన్ని నెలలు పంపించరు. ఈ విషయం నాకు బాగా తెలుసు అని కఠినంగా తిరస్కరించాడు.

రత్నావళికూడా "అలా ఎన్నోరోజులు ఉండనులెండి త్వరగానే వచ్చేస్తాను. పెళ్ళైనప్పటి నుండీ ఒకసారైనా వెళ్ళలేదు. పెళ్ళైనాక అమ్మగారింటినే మరచిపోయిందను కుంటారండీ" అని బ్రతిమలాడింది. అయినా భర్త 'ససేమిరా' అన్నాడు. అన్నా చెల్లెలు ఇరువురూవాళ్ళ మామగారితో కూడా చెప్పించారు. కానీ 'తాను పట్టిన కుందేటికి మూడేకాళ్ళు' అన్నట్లు వ్యవహరించాడు. "బావతోనూ, భార్యతోనూ అలా కఠినంగా వ్యవహరించకూడదని భార్యావ్యామోహ పీడితుడైన అతనికి ఏమాత్రం స్ఫురించలేదు.

మరికొన్ని నెలలు గడిచాక ఒకరోజు సాయంకాలం ఇంటికి వచ్చి చూడగా, భార్య రత్నావళి కనిపించలేదు. ఇరుగు పొరుగు వారిని విచారించగా "రత్నావళిని ఆమె అన్న వచ్చి పుట్టింటికి పిలుచుకొని వెళ్ళాడు" అని చెప్పారు. అంతే! భార్య మీదా, బావమీదా "అగ్గిమీద గుగ్గిలమే" అయ్యాడు. ఉన్నఫళంగా 'లేడికి లేచిందే పరుగు' అన్నట్లుగా రత్నావళి కోసం అత్తగారింటికి పరుగుపెట్టాడు. చీకటి పడుతున్నది. దారిలో యమునానదిని కూడా దాటవలసివస్తుంది. దాదాపు పదిమైళ్ళ దూరం నడవాలి. కానీ తన భార్యను ఎలాగైనా కలవాలనే బలమైన కోరిక తప్ప, మరే ఆలోచనా లేదు. "కామాతురాణాం, నలజ్జా, నభయం" అంటే ఇదేకాబోలు. యమునా నది దగ్గరికి వెళ్లేటప్పటికి బాగా రాత్రి అయింది. నదిలో దిగడం అటుంచి, చూస్తేనేభయం గొల్పేటట్లుగా ఉంది నదీ ప్రవాహం. కానీ తన భార్యను కలుసుకొని తీరాలన్న వాంఛ ముందు ఇవేవీ అవరోధాలుగా అనిపించలేదు. కనీసం తెల్లవారాక వెళ్ళవచ్చు అని కూడా ఆలోచించలేదు.

చదువుకోసం కాశీలో ఉన్నప్పుడు గంగానదిని ఎన్నిసార్లు దాటలేదు ? ఈ యమునానది ఏపాటిది?అని తన అనుభవాన్ని గుర్తుచేసుకొని, నదిలోకి ఒక్కదూకు దూకాడు. ఈదుకుంటూ వెళుతున్నాడు. ప్రవాహ వేగం చాలా ఎక్కువగానే ఉంది. తన బలం సరిపోవడం లేదు. అయినా శక్తిని కూడగట్టుకొని ఈదుతున్నాడు.ఈలోగా అతనికి ప్రవాహంలో కొట్టుకొని పోతున్నదేదో అడ్డుతగిలింది. ఏదైతేనేం తేలియాడుతూ వస్తున్నది. మునిగి పోతున్నవాడికి గడ్డిపోచకూడా ఒక పెద్ద ఆసరాయేకదా?! కొంత ఆసరాగా ఉంటుందని పట్టుకున్నాడు. కానీ వెంటనే తన చేయి వెనక్కు తీసుకున్నాడు. వెంటనే తన భార్య రత్నావళిని కలుసుకోవాలంటే నదిని దాటాలి. దానికి ఏదో ఒక ఆసరా ఇపుడు అవసరం, అది శవం అయితేనేం? చెక్కబల్ల అయితేనేం? లేకుంటే ఈశవంలాగానే నేను కూడా కొట్టుకొని పోవాల్సి వస్తుంది! అని వెంటనే కొట్టుకొని పోతున్న శవాన్ని మరలా అందిపుచ్చుకొని, దాని సహాయంతో ఎట్టకేలకు అవతలిగట్టుకు చేరుకున్నాడు. అప్పటికి మధ్యరాత్రి అయ్యింది. ఒడ్డుకు చేరుకున్నాక కొంచెం సేపు సేదతీరి శక్తి పుంజుకొని తన అత్త-మామగారు ఉండే గ్రామం వైపుకు దారి తీశాడు.

మామ ఇంకా మేల్కొనే ఉన్నాడేమో తలుపు తట్టగానే వెంటనే వచ్చి తలుపు తెరిచాడు. తమ అల్లుడిని ఆ సమయంలో తన ఇంటిదగ్గర అదీ ఒళ్ళంతా బాగా తడిసి ముద్దయిపోయిన స్థితిలో చూచి, ఆశ్చర్యంతో అవాక్కైపోయాడు. తన మామను చూచీ చూడగానే ఏమాత్రం సంస్కారం లేకుండా, వెనకాముందూ ఆలోచించకుండా వెంటనే 'నా భార్య ఇక్కడికి వచ్చిందా?'' అని ప్రశ్నించాడు.

"ఆ... వచ్చింది. ముందు నీవు లోపలికిరా" అంటూ అల్లుడిని ఇంట్లోకి పిలుచుకొనిపోయాడు మామ. క్షణంలో ఇంటిల్లిపాదీ లేచి కూర్చున్నారు. స్నానానికి వేన్నీళ్ళు పెట్టారు. తినేటందుకు పండ్లు, తీపు పదార్థాలు పెట్టారు. వాటిని తింటూ అందరి ముఖాలవైపూ కోపంగా చూస్తూ, ఆ పనికాస్తా ముగించాడు అల్లుడు. అల్లుని రాకలోని ఆంతర్యాన్నీ, చూపులోని ఆతురతను గమనించి అత్తమామలు వెంటనే రత్నావళి దగ్గరికి పంపించారు.

తనను తీసుకెళ్ళడానికే అదేపనిగ ఈ అర్ధరాత్రి వచ్చాడని మూతిముడుచుకొని గదిలో కూర్చొని ఉన్నది రత్నావళి. అంతకుముందే ఆమె వదినగారు "నిన్నొదలి పెట్టలేక నీ మొగుడు నిన్ను తనవెంట తీసుకెళ్లడానికి అర్ధరాత్రి అపరాత్రి అని తలచక ఎలా పరిగెత్తాడో చూడు ! అని ఎగతాళిచేసి వెళ్ళారు. ముందుగానే తన మొగుడి నిర్వాకం వల్ల సిగ్గుతో చితికిపోయి ఉంటే! వారి మాటలు పుండుమీద కారం చల్లినట్లయింది రత్నావళికి. భర్తగదిలోకి వచ్చి తన భార్య ప్రక్కన కూర్చున్నాడో లేదో, రత్నావళి తన కోపావేశాన్ని తమాయించుకోలేకపోయింది. భర్త ఏదో మాట్లాడబోతూ ఉండగా తానే ముందుగా విరుచుకుపడింది.

"ఏమండీ! ఇలా వేళాపాలా లేకుండా అత్తగారింటికి రావడానికి సిగ్గు వేయలేదా? భార్యవెనకాలే పరిగెత్తుకొని రాకపోతే ఏం? నన్నెవరైనా ఎత్తుకొనిపోతారని భయమా? లేక నా మీద అనుమానమా? ఇదీ ఒక ప్రేమేనా? ఛీ ఛీ ! నీది ప్రేమకాదు. ప్రేమోన్మాదం. నీవు నరహరిదాసు గారి శిష్యుడిగా ఆయన ఆశ్రమంలో ఉండి, అక్కడ నేర్చుకున్నది ఇదేనా? తెలివి ఏమైనా ఉందా? రక్తమాంసాలతో కూడిన ఈ శరీరంపై చూపించే ఈ వ్యామోహంలో ఏ కాస్తంతయినా శ్రీరామచంద్రునిపై ఉంటే ఎంతో మోక్షం వచ్చి ఉండేది కదా?! అని చడామడా తిట్టేసింది. భార్య అలా తన మాటను వినకుండా, తన శ్రమను గుర్తించకుండా, తిరస్కార భావంతో అన్న ప్రతిమాటా అతని హృదయాన్ని కలచివేసాయి. అతని మనసుపై తీవ్ర ప్రభావం చూపెట్టాయి. ఎంతోప్రేమతో, ఎంతో సాహసం చేసి, ప్రాణాలను ఫణంగా పెట్టి తన సాహచర్యంకోసం వస్తే ? ఏమండీ ! నన్ను వదలి ఉండలేక నాకోసం ఎంత సాహసానికి వడిగట్టారండీ?! ఎంత ప్రేమండీ నేనంటే?! అని అమాంతం హత్తుకొని. ప్రేమలో ముంచెత్తవలసింది పోయి! నన్ను నోరెత్తనీయకుండా ఎంతేసి మాటలంది? చివరికి నేను చూపించిన

ప్రేమ, చేసిన సాహసం దేనికీ కొరగాకుండా పోయాయికదా? నా బ్రతుకెందుకు? నన్నర్థం చేసుకోలేని ఇల్లాలు ఉంటే ఏం? లేకపోతే ఏం? అని తీవ్రంగా ఆవేదన చెందాడు. వెంటనే భార్యతోఇంకేమి మాట్లాడకుండా నెమ్మదిగా మంచంమీదనుండి లేచాడు. అడుగులో అడుగు వేసుకొంటూ తీవ్రమైన ఆలోచనతో బయటికి నడిచాడు.

రత్నావళి వెక్కిళ్లు పెట్టి ఏడుస్తూ, ఉండండి ఎక్కడికెళుతున్నారు? బయట అంతా చీకటిగా ఉందండీ, అని వారించింది. అందుకు భర్త చీకటే అయినా నాకు చక్కని వెలుగుతో నిండినదారి కనిపిస్తున్నది. అంటూ తన భార్య వైపు చూచాడు. మునిపటిలాగా తన భార్య అందాలరాశిగా కనిపించలేదు. ఆభరణాలను ధరించి, అందచందాలతో వ్యామోహంలో ముంచివేసిన ఆ అందం వెనుక ఉండే రక్త మాంసాలతో నిండి ఉన్న ఎముకలగూడును ఇపుడు చక్కగా చూడగలుగు తున్నాను. రత్నావళీ! నీవన్నట్లుగానే ఇకపై ఆ శ్రీరామచంద్రునిపైనే నా ప్రేమను చూపిస్తాను, అంటూ ముందుకు కదిలాడు.

రత్నావళి భర్తచేయి పట్టుకొని నిలబెట్టపోయింది. కానీ భార్య చేయిని సున్నితంగా తొలగిస్తూ "ఇక నా గృహస్థ జీవితం ముగిసినట్లే రత్నావళీ, నీవు నాకు మంచి ఉపదేశమే చేశావు. నాకు కనువిప్పు కలిగింది అంటూ దీర్ఘమైన ఆలోచనలతో, వైరాగ్యంతో, అడుగులో అడుగు వేసుకుంటూ, నెమ్మదిగా ముఖద్వారాన్ని తెరచుకొని ఇంటిబైటికి వచ్చేశాడు. అందరూ గాఢ నిద్రలో ఉన్నారు. రత్నావళి మాత్రం తన భర్త ఏదో కోపంలో అలా మొండిగా వెళ్లాడు. తెల్ల వారాక రాకుండా పోతాడా? అసలు నేను లేకుండా ఉండగలడా? అనుకుంటూ తలుపులు వేసి వచ్చి పడుకున్నది. అంతే వెళ్ళినవాడు మరలా తిరిగిరాలేదు. ఆ వెళ్ళినవాడు ఎవరోకాదు ప్రఖ్యాతి చెందిన "రామచరితమానస్" గ్రంథకర్త శ్రీశ్రీ తులసీదాసుగారే!.

* భోగి కాని వాడు యోగి కాలేడు.
* ప్రేమ మొండిది, కామం గ్రుడ్డిది.
* స్త్రీ యొక్క అందం పురుషునిలోని పురుషత్వాన్ని మేల్కొలిపితే, ఆమెలోని కురూపం అతనిలోని గౌతమబుద్ధుణ్ణి మేల్కొలుపుతుంది.
* కాముడిని జయించినవాడు రాముడినీ జయించును.

*****

మోక్షం - 7

పురుషార్థాలలో నాల్గవది మోక్షం. మోక్షం అనగా విడుదల, బైటపడటం. బంధంలో ఉన్నవాడు, బంధ విముక్తి కావాలనుకుంటాడు. బంధవిముక్త కలిగాక మోక్షం లభించింది అంటాడు. స్వేచ్ఛ అనుభవిస్తాడు. ఆనందిస్తాడు.

బంధాలు అంటే సమస్యలు, నచ్చని వాతావరణ పరిస్థితిలు, పురోభివృద్ధికి అవరోధాలుగా నిలిచేటువంటివే. దీర్ఘరోగంనుండి బైటపడ్డ రోగి - రోగం నుండి విముక్తి లభించిందంటాడు. స్వేచ్ఛ, ఆనందం అనుభవిస్తాడు. అలాగే ఎన్నో ఏళ్ళుగా కోర్టుల చుట్టూ తిరిగి-తిరిగి, చెప్పులు అరిగిపోయి, ఇల్లూ ఒళ్ళూ గుల్లై పోయాక గానీ తీర్పురాదు. తీర్పు వచ్చాక, కోర్టు మోక్షమిచ్చింది అంటారు.

శిక్ష పూర్తయి బయటికి వచ్చాక జైలు నుండి ముక్తి లభించింది అంటారు. ఎన్నో ప్రయత్నాల తర్వాత పరీక్ష గట్టెక్కిన వాడు ఇన్నాళ్ళకు నాకు మోక్షం లభించింది అంటాడు. విముక్తి అన్నాకూడా బయటపడడమే. మనిషి జీవితం నుండి బయటపడాలి. జీవితం ప్రతి ఒక్కరికీ అంతులేని పోరాటం. సమస్యల సుడిగుండం. ఎంత ఉన్నా, ఎందరున్నా ఏ లోటూ లేకపోయినా "చెట్టుకు తగ్గగాలి" అన్నట్లుగా ఎవరి సమస్యలు వారికి ఉండనే ఉంటాయి. తృప్తి - సంతోషం లేని జీవితం జైలు కాక మరేమిటి?

ఆశా - మోహాలే జీవిత బంధాలు

ఆశల ఆరాటం

అధికారాల పోరాటం

అందకపోతే ఆవేశం, ఆవేదన, ఆక్రందన

అహంకారం అణచుకోలేక - ఏడవడం, ఏడిపించడం

ప్రతి ఒక్కరిలోనూ శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ తత్వాలలో ఏదో ఒకటి ప్రముఖంగా ఉంటూ, మిగిలిన మూడు తత్వాలు అల్పంగానో, స్వల్పంగానో ఉంటాయి. ప్రస్తుతం తానున్న స్థితినుండి ఉన్నత స్థితికి ఎదుగుతూ, తాను ఎక్కడినుండి వచ్చాడో అక్కడికి చేరుకోవడమే మోక్షం. ప్రతి ఒక్కరి మనసు ప్రాప్తించిన దానితో తృప్తిపడక ఇంకా కావాలి, మరొకటి కావాలి అని ఆరాటపడుతూనే ఉంటుంది. ఆ మరొకటే పరమాత్మ. ఇంకా కావాలి అని తహతహలాడే. ఆ స్థితే బ్రహ్మానందం. పరమాత్మలో చేరుకొని బ్రహ్మానందాన్ని అనుభవించేదానికే ప్రతి ఒక్కరి మనసూ పరుగులు తీస్తున్నప్పటికీ మాయ-మోహం, స్వార్థం, లోభం, మదం, మాత్సర్యం అనే ఆరు బంధాలు ప్రతిబంధకాలై అడ్డుపడుతూ ఉంటాయి. ఆ ప్రతి బంధకాలను అధిగమిస్తూ శాశ్వత శాంతి ధామాన్ని చేరుకునే దానికి దయామయులైన దేవ మానవులు కొన్ని సులభమైన మార్గాలను సూచించారు.

మార్గం :- బ్రహ్మచర్యం - గృహస్థాశ్రమం - వానప్రస్థం - సన్యాసం
శూద్ర → వైశ్య → క్షత్రియ → బ్రాహ్మణ
గమ్యం :- మోక్షం

దాని ప్రకారంగా గృహస్థాశ్రమ ధర్మం ద్వారా స్త్రీ-పురుషులిరువురూ ఇంద్రియ సుఖాలను అనుభవిస్తూ, అధిగమిస్తూ, అర్థ కామాలను సాధించి శూద్రత్వం నుండి వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ తత్వానికి ఎదిగి మోక్షాన్ని పొందాలి

సత్యనిష్ట, తీవ్రమైన సంకల్పమే మోక్షానికి పునాది

ఒక గృహస్తునికి మోక్షాన్ని పొందాలన్న జిజ్ఞాస కలిగి, తనకు అందుబాటులో నున్న ఆధ్యాత్మికవాదులను సంప్రదించాడు. వారు తమకు తెలిసింది చెప్పి, కొన్ని గ్రంథాలను ఇచ్చి, ఇవి చదివితే కొంతవరకు ఉపయోగపడతాయని చెప్పారు.

గ్రంథ పఠనం ద్వారా తాను తెలుసుకున్నదేమిటంటే పంచ కర్మేంద్రియాలనూ, పంచజ్ఞానేంద్రియాలను, పంచప్రాణాలను, మనసును, బుద్ధిని, అహంకారాన్ని సంపూర్ణంగా పరమాత్మకు సమర్పించి పవిత్రుడు కావాలి. తదనంతరం తీవ్రమైన తపనతో బ్రహ్మసాక్షాత్కారం కొరకు పరితపించాలి, సాధన చేయాలి అని తెలుసుకున్నాడు.

పవిత్రతను సాధించాలంటే, చూపు, మాట, ఆలోచన, కర్మలను కల్మష రహితంగా ఉంచుకోవాలి. వీటిని తనకు తానుగా కొంతవరకు సాధించాననుకుంటున్న తరుణంలో, మోక్షకాంక్షను గ్రహించిన అతని శ్రేయోభిలాషులు నీవు హిమాలయాలకు వెళ్ళావంటే అక్కడ గుహలలో చాలామంది గొప్ప యోగులు ఉంటారట. వారిని కలుసు కున్నావంటే నీకు మంచి ఉపదేశం చేసి సరైన మార్గం చూపిస్తారు అని సలహా ఇచ్చారు.

స్నేహితుల సలహా ఆ జిజ్ఞాసాపరుడికి చాలా బాగా నచ్చింది: ఇంకేముంది. ఒక మంచిరోజు చూచుకొని బయల్దేరాడు. అనేక వ్యయ-ప్రయాసల కోర్చి, ఎట్టకేలకు హిమాలయాలను చేరుకున్నాడు. వెదకగా వెదకగా ఒక మంచు గుహలో ఒక యోగి ధ్యానముద్రలో ఉండడం చూచాడు. నెమ్మదిగా యోగి సమీపంలోకి వెళ్ళి, సాష్టాంగ దండ ప్రణామం చేసి, వినమ్రంగా ఒక ప్రక్క కూర్చున్నాడు. కొన్ని గంటల తర్వాత యోగి ధ్యానముద్రను విడిచి కళ్ళు తెరిచాడు. ఎంతోసేపటి నుండి కూర్చొని ఉన్న ఈ జిజ్ఞాసి వైపు ప్రసన్న వదనంతో చూచాడు. ఈ జిజ్ఞాసి లేచి నిలబడి వినమ్రంగా చేతులు జోడించి, తనను శిష్యుడిగా చేర్చుకొని మోక్షాన్ని సాధించే మార్గాన్ని ఉపదేశించ వలసిందిగా ప్రార్థించాడు. యోగి అతనితో, ముందుగా గుహబైట ఉన్న నీటి కొలనులో స్నానం చేసి రమ్మన్నాడు. ఈ జిజ్ఞాసి ఎంతో కష్టంగా ఆ చన్నీటిలో స్నానం చేసి వచ్చాడు. ఆ గుహలోనే ఉన్న మరొక అంతస్తు గుహలోకి తీసుకెళ్ళి అక్కడ ఒక పెద్ద ఆకులో ఉన్న పండ్లు, దుంపలు, కాయలు, ఆకులను చూపించి, ఈ ఆహారాన్ని ఏమాత్రం విడిచిపెట్టకుండా సంపూర్ణంగా భుజించి నా వద్దకు రా, అని తన స్థానానికి వెళ్ళాడు యోగి.

ఆ ఆహారం ఎంతో రుచికరంగా ఉంది. అయితే ఎంత తిన్నా ఆ ఆహారం తరిగిపోలేదు ఓపిగ్గా మరికొంత తిన్నాడు. అయినా ఆ ఆకులోని పళ్ళు, కాయలు, దుంపలు తరగనేలేదు. ఇక ఓపిక నశించి, ఆహారంతో సహా ఆకును మొత్తం మడిచి, ప్రక్కనే ఉన్న చెట్లలోకి విసిరేసి, నెమ్మదిగా యోగి దగ్గరికి వెళ్ళాడు.

ఏం నాయనా ఆహారం ఎలాఉంది? అని ప్రశాంతంగా చిరునవ్వుతో అడిగాడు యోగి. అతడు బాగానే ఉంది స్వామీ. అని సమాధానం ఇచ్చాడు. అయితే ఆహారం ఆసాంతం తినేశావా? అని అడిగాడు యోగి. ఆ-తినేశాను స్వామీ అన్నాడు. స్వామి చిరునవ్వుతో అతని వైపు చూచాడు. అలాగా...! అయితే అక్కడ కూర్చొని కళ్ళు మూసుకొని ఓంకారాన్ని జపించు అన్నాడు.

జిజ్ఞాసి సరేనని గుహలోనే ఒకపక్కగా కూర్చొని, కళ్ళు మూసుకొని ఓంకారాన్ని జపించసాగాడు. కొద్దిసేపటి తర్వాత కళ్ళు తెరిచి చూడగా, తాను తన ఇంట్లోనే ఉన్నట్లు తెలుసుకున్నాడు. ఇది ఎలా జరిగింది? దీనికి కారణమేమని ఆశ్చర్యపడుతూ ఒక సాధువును అడిగాడు. ఆ సాధువు నవ్వుతూ పరమ పద సోపానం ఎక్కుతూ పాము నోటికి చిక్కావు నాయనా! అంత శ్రమపడి యోగి దగ్గరికి వెళ్ళికూడా అసత్యమనే పాము నోటికి చిక్కిపోయావు కదా? అన్నాడు.

మోక్ష ప్రాప్తి కొరకు, రాజయోగం, హఠయోగం, మంత్ర యోగం, లయయోగం, భక్తి యోగం లాంటి మార్గాలు ఎన్నో ఉన్నాయి.

ఏ మార్గాన్ని ఎంచుకున్నా శారీరక, మానసిక ఆరోగ్యంతోపాటు, ధృడమైన సంకల్పం, సత్యనిష్ట అనే అర్హతలు కలిగి ఉండాలి. అప్పుడే మోక్షంగానీ, బ్రహ్మజ్ఞానాన్ని గానీ పొందేటందుకు అర్హులవుతారు. ఎవరైనా తమ తమ సంకల్ప తీవ్రతనుబట్టి మోక్షాన్ని పొందుతూ ఉంటారు. కొందరు తమ ప్రాణశక్తిని బ్రహ్మరంధ్రం ద్వారా ప్రకృతిలోకి పంపిస్తారు. కొంతమంది జీవసమాధి చెందుతారు. కొంతమంది తమ శరీరాన్ని పంచభూతాలలో కలిపేస్తారు.

సంకల్ప తీవ్రతనుబట్టి ఫలితముంటుంది. అది ఎలాగంటే? బిడ్డ ఏడుపును బట్టి పరిగెత్తుకొని వస్తుంది తల్లి. బిడ్డ ఎవరి దగ్గరైనా ఉండి ఏడుస్తూ ఉంటే కాస్త ఆలస్యంగా వస్తుంది. కానీ బిడ్డఒంటరిగా ఉండి ఉగ్గపట్టి ఏకబిగిన ఏడిస్తే చేసే పనిని కూడా వదలి వేసి ఉన్న ఫళంగా పరుగున వచ్చి బిడ్డను ఎత్తుకుంటుంది. హత్తుకుంటుంది. ఆ విధంగానే సాధకుడు కూడా సంకల్పాన్ని తీవ్రతరం చేస్తే ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. ఆత్మ సాక్షాత్కారమంటే బ్రహ్మతేజస్సును, బ్రహ్మజ్ఞానాన్ని, బ్రహ్మానందాన్ని, బ్రహ్మచైతన్యాన్ని పొందడమే.

లక్షలాది నక్షత్రాలు ఇవ్వలేనంత వెలుగును ఒక్క సూర్యుడు మాత్రమే ఇవ్వగలడు. అలాంటి లక్షలాది సూర్యులు కూడా ఇవ్వలేనంత వెలుగును ఆత్మసాక్షాత్కారంతో పొందవచ్చు. అలాగే కోటాను కోట్ల గ్రంథాలు ఇవ్వలేని బ్రహ్మజ్ఞానాన్ని ఆత్మసాక్షాత్కారంలో పొందవచ్చు. అలాగే వర్ణించనలవికాని బ్రహ్మానందాన్ని, దివ్యమైన చైతన్యాన్ని పొందవచ్చు.

విడిచిపెట్టని చెట్లు

ఒక గొప్ప సాధువు తన శిష్య బృందంతో సహా దేశ సంచారం చేస్తూ ఒకరాజుగారిని దర్శించాడు. రాజు అతనికి, అతని శిష్య బృందానికీ సకల సత్కారాలూ చేసి ఆతిథ్యమిచ్చాడు. విశ్రాంతి సమయంలో రాజుగారు సాధువును సమీపించి, వినయంగా తనకు యోగం నేర్పించమని వేడుకున్నాడు. వానప్రస్థాశ్రమానికి సిద్ధంగానున్న రాజుగారి విన్నపమును మన్నించి, సమగ్రంగా వివరించి, చక్కగా అభ్యాసం చేసి ఆరు మాసాల తరువాత తన ఆశ్రమం దగ్గరికి రమ్మన్నాడు సాధువు.

నెలలు గడచినా రాజు సాధువు దగ్గరకు రాలేదు. అందుకని శిష్యులతో రాజును రమ్మని కబురు పంపినాడు. ఎన్నిమార్లు పంపినా, యుద్ధ వాతావరణమున్నదని, రాణికి బాగా లేదని, యువరాజా వారికి బాగా లేదని, రాచకార్యాలని-సాకులు చెప్పుతూ... రావటానికి వీలు కుదరటం లేదని చెప్పుతూ వచ్చాడు. సాధువు కూడా వదిలేశాడు.

కొన్ని సంవత్సరాలకు రాజే సాధువును రమ్మని భటులతో కబురు పంపాడు. చాలాసార్లు సాధువు వెళ్ళలేదు. మరలా కొన్ని నెలలకు రాజు కబురంపగా సాధువు ఒక చెట్టును కౌగిలించు కొని, అయ్యా! ఈ చెట్టు సాధువును వదలడంలేదని రాజుగారికి చెప్పు అని పంపించేశాడు.

ఆ మాట విని రాజు పరుగు పరుగున సాధువు వద్దకు వచ్చి సాష్టాంగపడి క్షమించమని వేడుకున్నాడు. విషయాలను తానే వదలలేక సాకులు చెప్పాను. అని పశ్చాత్తాపపడ్డాడు.

గృహస్థులందరూ ప్రశాంత జీవనం కావాలనుకుంటారు. అందుకు ఆధ్యాత్మిక మార్గం తప్ప వేరేదేదీ లేదనీ తెలుసుకుంటారు. కానీ ఆ మార్గంలోకి రావటానికి ఇంకా సమయం రాలేదనీ, వాతావరణం అనుకూలించలేదనీ, అతి తెలివిగా సవాలక్ష కారణాలను ఏకధాటిగా ఏకరువు పెడతారు. సముద్రంలో అలలూ, జీవితంలో అలజడులు తప్పవని తెలిసీ, తప్పులోనే కాలేస్తూ, వాయిదాలు వేసుకుంటూ బ్రతికేస్తుంటారు. అలాంటివారు మానసిక బలహీనులు, మాయా మోహాలకు చిక్కిన మూర్ఖులు.

ఆకలి వేసినపుడే అన్నంకావాలి, దాహం వేసినపుడే నీళ్ళు కావాలి సమస్యలున్నపుడే పరిష్కారాలు కావాలి. సమస్యలు లేకుండా వాతావరణం అనుకూలంగా ఉంటే ఆధ్యాత్మిక మార్గమెందుకు?

* జీవించే కళను నేర్పించేదే ఆధ్యాత్మిక విద్య. సమస్యలకు పరిష్కారం చూపించేదే ఆధ్యాత్మిక మార్గం. ఆరోగ్యకరమైన దృష్టిని కలిగించి, సుందరమైన సృష్టిని దర్శింపచేసేదే ఆధ్యాత్మిక మార్గం.

మనిషి యవ్వనంలో సమస్యలలోకి తనకు తానే దూకుతాడు. వృద్ధాప్యంలో సమస్యలే మనిషిని చుట్టుముట్టి ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. కాబట్టి మనుషులందరూ దేహంలో దారుఢ్యం ఉన్నపుడే జీవించే కళను జీర్ణం చేసుకోవాలి. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటూ, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలి. అందుకు ఆధ్యాత్మిక మార్గంలోనే నడవాలి. వాయిదాలు వేయడమంటే తనకు తానే వాతలు పెట్టుకోవడమే.

మతం - సామాజిక అవసరం

అతివృష్టి, అనావృష్టి, తుఫానులు, ఉప్పెనలు, ఉరుములు, మెరుపులు, పిడుగులు, అగ్ని పర్వతాలు బ్రద్దలు కావడం లాంటి ప్రకృతి సంబంధమైన ఉపద్రవాలను చూచి భయభ్రాంతుడైన మనిషి-ఆలోచనలోపడ్డాడు. దాని ఫలితంగా ప్రకృతిలో ఏదో మహోన్నతమైన శక్తి ఉందన్న తలంపు కలిగింది. ఆ అగోచరమైన శక్తి ముందు తన అశక్తతను గుర్తించాడు. ఆ శక్తిని ఊహించుకొని దాని ఉగ్రరూపం నుండి రక్షించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలను చేశాడు. కానీ తన శక్తి, తన యుక్తి ఏదీ పని చేయలేదు. చివరకు ప్రకృతి యొక్క శక్తి ముందు వినయమును, భక్తిని ప్రదర్శించి ప్రసన్నం చేసుకోవాలనుకున్నాడు. బాధలనుండి కడతేర్చమని వినయంగా చేతులు జోడించి మొరపెట్టుకున్నాడు. చేతులు చాచి ఆదుకొమ్మని అర్థించాడు.

అంతేకాకుండా కొంతమంది మానవుల వలన మనుషుల జీవనానికి, కొన్ని జీవుల మనుగడకు విఘాతం కలగడంకూడా గమనించాడు. మనిషి మరణం, స్త్రీ ప్రసవం, స్త్రీలపై సామూహిక అత్యాచారం లాంటి దృశ్యాలతో కొంతమంది ఆవేదన చెందారు. ఆ నేపథ్యంలో దుఃఖ నివారణకు గాను కొందరు దయామయులు తీవ్రాతి తీవ్రంగా చాలా లోతుగా ఆలోచించారు. ఆత్మశోధన చేశారు. ఆ తీవ్రమైన ఆలోచన, పరిశీలన, శోధననే తపస్సు అన్నారు. (అందుకే వేదన నుండి వేదం, శోకం నుండి శ్లోకం వెలువడింది అంటారు)

ఆ 'తపస్సు'యొక్క ఫలితంగా ప్రకృతిననుసరించి సహజంగా జీవించడమే దుఃఖ నివారణకు మార్గమని తెలుసుకున్నారు. సాటి జీవుల సమస్త కష్టాలకు స్వార్థమే కారణమని తెలుసుకున్నారు. స్వార్థానికి మూలం అజ్ఞానమేనని తెలుసుకున్నారు.

అలా తెలుసుకున్న జ్ఞానంతో దేశ-కాల పరిస్థితులను, ఆవశ్యకతలను, అవసరాలను దృష్టిలో ఉంచుకొని మనుషులు జీవించవలసిన పద్ధతులను, సాధించ వలసిన జీవిత లక్ష్యాలను, ఆలోచించవలసిన రీతులను నిర్దేశించారు.

ఇతర జీవులను ఆకలి తీర్చుకొనుటకు చంపడం వేరు, స్వార్థం కొరకు, రుచులకొరకు చంపడం వేరు అని తెలుసుకున్నారు. అహింస యొక్క విశిష్టతను గుర్తించారు. బుద్ధి, మనసు ఆత్మకూడా ఉందని గ్రహించారు. అహింసా మార్గంలో ప్రకృతి నియమం, సృష్టిధర్మం ప్రకారం జీవిస్తూ, విశిష్ట లక్షణాలతో ఉన్నత స్థితిని పొందవచ్చునని గ్రహించారు. మనిషే మహాత్ముడుగా ఉచ్ఛస్థితిని పొందవచ్చని గ్రహించారు. అలా వారు గ్రహించిన ఆలోచనల, ఆచరణల సమగ్ర, సమిష్టి భావధారను 'మతం' అన్నారు. 'మత్' అంటే అభిప్రాయం అని కూడా అర్థం వుంది. అందువలననే దయామయులైన మహనీయులు పొందిన జ్ఞానాన్ననుసరించి, ప్రబోధించిన జావదారను, ఆ మహనీయులు ప్రతిపాదించిన జ్ఞాన మార్గాన్ని 'మతం' అన్నారు.

బుద్ధ భగవానుని భావదారను **'బౌద్ధమతం'**, క్రీస్తు ప్రభువు మార్గాన్ని **'క్రైస్తవం'**, మహ్మద్ ప్రవక్త ప్రబోధించిన మహ్మదీయ మతం **'ఇస్లాం'**, గురుగోవింద్ సింగ్ గురువాణిని **'సిఖ్ మతం'**, మహావీరుని **'జైనమతం'**, స్వామి దయానంద సరస్వతి **'ఆర్యసమాజం'**, రాజా రామమోహన్‌రాయ్, **'బ్రహ్మసమాజం'**, జోరాస్టర్ హజ్రత్ **'జోరాష్ట్రియన్'** మతం, ఇలా ప్రపంచమంతా ఎన్నో మతాలు నెలకొల్పబడ్డాయి.

భారతదేశంలో **'హిందూమతం'** అవలంభింపబడుతున్నది. దీనికి 'వేదం' మూలాధారం. ఎందరో సత్యద్రష్టలైన మహర్షులు అందించిన జ్ఞానమే 'వేదం'. వేద విజ్ఞానంతో ఎందరో మానవులు మహనీయులై ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారు. మరెందరో భక్తులు, మునులు, కవులు, నీతి కోవిదులు, ఆచార్యులు ఎన్నో పురాణేతిహాసాలను నీతిశాస్త్రాలను లోకానికి అందించారు.

ఎన్నో ఆటుపోట్లకు, సవరణలకు లోనౌతూ, మరెన్నో సంస్కరణల అనంతరం సగుణ, నిర్గుణ, ఆస్తిక, నాస్తిక, తాంత్రిక, నానా పూజా విధి-విధానాలు, శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ తత్వాలకనుగుణంగా ఎన్నో ఆచారాలు ఆచరణలోకి వచ్చాయి.

అందరిలోనూ, అన్నింటిలోనూ ప్రకృతి లేక భగవంతుడు, లేక పరమాత్మ ఉన్నదనీ, విశ్వసించి తదనుగుణంగా జీవించడమే జ్ఞానమార్గమనీ, ప్రకృతి చైతన్యాన్ని, లేక పరమాత్మను తెలుసుకోవడమే జీవిత పరమార్థమనీ, అందుకు మనిషి తన మానసిక స్థాయిని బట్టి ఏ మార్గాన్నైనా అనుసరించి జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చుననెడి విశాలభావమే హైందవ ధర్మం. ధర్మానుయాయులైన ఆచార్యులు, యోగులేకాక, సామాన్యులు, పామరులు కూడా ఈ ధర్మాన్ని నరనరాన జీర్ణించుకొని వారికి తగిన విధంగా రూపొందించుకున్న భజనలు, జానపదగేయాలు, కథలు, నాటకాలు, కళలు, మొదలగునవే కాకుండా సమస్త వాఙ్మయమంతా 'భిన్నత్వంలో ఏకత్వం' తొణికిసలాడుతూ, ఎంతో విశాలమైనదిగా భాసిల్లుతూ ఉంది. ఎన్ని పాపాలు చేసినా పశ్చాత్తాపం

చెందితే భగవంతుడు క్షమిస్తాడు. పాశ్చాత్తాపానికి మించిన పాప పరిహారం మరొకటి లేదు. హృదయపూర్వకమైన పశ్చాత్తాపంతో వచ్చిన కన్నీటితో మనోమాలిన్యాన్ని కడిగి వేస్తే ఎవరైనా పవిత్రుడవుతాడు అనేది హిందూధర్మ విశ్వాసం. హిందూ ధర్మంలో సహనానికి తప్ప హింసకు తావులేదు. అహంకారాగ్ని చల్లారితే తప్ప మనిషి తన దోషాన్ని తెలుసుకోలేడు. ఆలోచనా తీరునూ మార్చుకోలేడు. శిక్షించి మనమెందుకు కర్తలం కావాలి? ఆ ఖర్మ మనకెందుకు? ఆ శిక్ష ఏదో కాలమే విధిస్తుంది. 'కాగలకార్యం గంధర్వులే చేస్తారు'' ఎవరి పాపాన వారే పోతారు. అయిందేదో అయింది.. అని ఎవరి పనులలో వారు నిమగ్నమై పోతూ ఉంటారు. సహన భావానికి ఇంతకంటే పరాకాష్ట మరెందులోనూ కనిపించదు.

ఇలా ప్రాచీన కాలం నుండి భారతీయుని ఆదర్శాలు, విలువలూ, ఆశయాలు, శీలం, నిత్య జీవిత పంథా, సామాజిక న్యాయం, నియమాలు, మనుషుల తీరు తెన్నులు ఒకటేమిటి అన్నీ ధర్మంతోనే ముడిపడి పునీతమైనాయి, అవుతూ ఉన్నాయి. ధర్మ భావనతోనే అర్థకామాలను సాధించి మోక్షం పొందాలన్నది హిందూ ధర్మ ప్రబోధం. ఏ భారతీయుడూ ప్రపంచమంతటికీ ఒకే భగవంతుడుండాలని కానీ, ఒకేమతం ఉండాలని కానీ, ఒకేవిధమైన ఆచారాలుండాలనికానీ ఆశించడు, నిర్దేశించడు. విశాల హృదయంతో, ఉన్నతమైన భావాలతో, సహన జీవితం, సహ జీవితం ఫలితంగానే భారతదేశంలో అన్ని మతాలవారూ, అన్ని దేశాలవారూ, తీవ్రవాదులూ, విధివాదులూ వితండ వాదులూ అందరూ స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారు.

విగ్రహం నిగ్రహం కొరకే అన్న సగుణోపాసన,
నామ, రూప, రహితం అన్న నిర్గుణోపాసన
మానవతే మిన్న అనే హేతువాదం,
సుఖలాలసే జీవిత పరమావధి అనే భౌతిక వాదం,
అప్పు చేసైనా పప్పుకూడు తినాలనే నాస్తిక వాదం

ఇలా అన్ని మతాలనూ, వాదాలనూ వివాదాలు లేకుండా ఆమోదిస్తూ, గౌరవిస్తూ, వైవిధ్యమేగానీ వైరుధ్యమే కనిపించని ధర్మమే హిందూ మతం. సర్వమత సహనం, సర్వమత సమభావం హిందూ ధర్మ లక్షణం. ఇందుకు ప్రత్యక్ష నిదర్శనంగా అన్ని మతాల చిహ్నాలను హిందూ ధర్మ ప్రచార ఆశ్రమాలలోనూ, సంస్థలలోనూ చూడవచ్చు. లోకకల్యాణం కోసం మానవులు ఎలా జీవించాలో ప్రతి చిన్న అంశాన్నీ నిశితంగా పరిశీలించి, పరిశోధించి, సంస్కరించి నిర్దేశించింది హిందూ ధర్మం. వ్యక్తియొక్క సంపూర్ణ వికాసం ధార్మిక చింతనతోనే, ధార్మిక జీవనంతోనే సాధ్యం. కనుక ధర్మం వ్యక్తికీ, సమాజానికీ అవసరం. ఆ అవసరం మతం అనే మార్గం తీరుస్తుంది. "లోకాసమస్తా సుఖినోభవంతు" లోక కల్యాణం ధార్మిక జీవనంతోనే, నైతిక విలువలతోనే సుసంపన్నం అవుతుంది.

హిందూ ధర్మం అంటే అదొక శారీరక ఆరోగ్య శాస్త్రం, మానసిక ఆరోగ్యశాస్త్రం, బౌద్ధిక ఆరోగ్య శాస్త్రం, నీతిశాస్త్రం, ధార్మిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, కామ శాస్త్రం, వెరసి మోక్షానికి మార్గం చూపించే మోక్ష శాస్త్రం.

* భౌతికవాదులు, నాస్తికవాదులు, వితండవాదులు ఎవరైనా ఏనాటికైనా "పుట్టినందుకు బతకాలి, బ్రతకాలి కాబట్టి తినాలి. ఇలాగే పుడుతూ, తింటూ మరణిస్తూ ఉండడమేనా? మానవజన్మకు ఇంతకంటే మరేదీ లేదా? జన్మకు సార్థకత ఏమిటి? పరమార్థం ఏమిటి?" అనే ప్రశ్న వేసుకోకతప్పదు. అలా ప్రశ్నించుకున్న వానికి 'మతం' సమాధానం చెబుతుంది. ఆధ్యాత్మికత అనే మార్గాన్ని చూపుతుంది. మోక్షం అనే గమ్యాన్ని తెలియజేస్తుంది.

అన్ని సమస్యలకూ పరిష్కారం ఆధ్యాత్మిక మార్గమే

చాలామంది బ్రతికేదెలాగా? అని ఆలోచిస్తూ ఉంటారు. కొందరు జీవితాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటారు. కొంతమంది మాత్రమే, ఎలా జీవిస్తే జీవితానికి సార్థకత లభిస్తుంది? అని ఆలోచిస్తూ ఉంటారు. వారికి తోచిన రీతిలో ఆచరిస్తూ ఉంటారు.

జీవితమంటే ఏమిటి? జీవితంలో మనసు యొక్క పాత్ర ఏమిటి? శరీరం యొక్క పాత్ర ఏమిటి? వివేకం యొక్క ప్రాధాన్యత ఏమిటి? ఏ పద్ధతిలో జీవిస్తే జీవితమంటారు? జీవిత లక్ష్యాలు ఏమిటి? మనిషి శారీరకంగా, మానసికంగా, బౌద్ధికంగా, ఆరోగ్యంగా జీవించాలంటే ఏమి చేయాలి? దేనిని జీవించే కళ అంటారు? ఆ కళను ఎవరు? ఎక్కడ నేర్పుతారు? ప్రతి మనిషీ తన వ్యక్తిత్వ వికాసానికీ, మానవతా జాగృతికీ, కీర్తి ప్రతిష్టలకు, అమరత్వం సాధించడానికి ఏం చేయాలి ? ఇతరుల వల్ల మనకు హాని జరగకుండా మేలు మాత్రమే జరగాలంటే మనం ఏం చేయాలి? మన ఆలోచనలెలా ఉండాలి? ఆచరణలోకి ఎలా తేవాలి? మొదలగు ప్రశ్నలకు, సందేహాలకు, సమస్యలకు సమాధానాలు ఒక్క ఆధ్యాత్మిక మార్గంలోనే లభిస్తాయి.

జీవితం, ఆరోగ్యం, వ్యక్తిత్వం, విద్య, విలువలు ఒక్క ధార్మిక జీవన మార్గంలోనే సాధ్యం. ఆధ్యాత్మిక జీవనమార్గమే సనాతన ధర్మం. ధార్మిక జీవన మార్గమే మతం. మతం అంటే మానవత్వమే. మానవతను బోధించేది, మరచిపోకుండా ఉంచగలిగేది గుడి, బడి, ఆధ్యాత్మిక ఆశ్రమాలు, సద్గ్రంథాలు మాత్రమే. కాబట్టి ప్రతి ఒక్కరూ వాటితో సత్సంబంధాలు కలిగిఉండాలి.

భగవద్దర్శనం

భగవంతుడు మన చర్మ చక్షువులకు కనిపించడు. కనుక మనం భగవంతుడి ఉనికినే శంకిస్తూ ఉన్నాం. దుమ్ము పేరుకొని పోయిన అద్దంలో ముఖం ఎలా కనిపించదో. మురికి భావాలతో నిండిన మనసుకుకూడా భగవద్దర్శనం కలుగదు.

భగవంతుడి దర్శనం కోసం, ఆయన కృపా కటాక్షం కోసం, ఆశీస్సుల కోసం దేవాలయాలకు వెళుతూవుంటాం. ఆయన ప్రతి రూపాలైన విగ్రహాలకు మంత్ర పూరితంగా పూజలు చేయిస్తాం. మనం చేసే అలంకారాలకూ, పూజలకూ, అర్పించే కానుకలకూ, తలనీలాలకూ సంతోషించి, మన కోరికలు, మొక్కులు తీరుస్తాడని నమ్ముతున్నాం. కోరికలూ, మొక్కులూ తీరనపుడు భగవంతుడిని 'నిర్దయుడనీ, ఒట్టి బండరాయి' అనీ నిందిస్తూ వుంటాం.

స్వార్థం, అహంకారం, పరపీడనం లాంటి భావాలతో కోరుకున్నవాటిని తీర్చడానికేనా భగవంతుడున్నది? అలా తీర్చకపోతే దైవాన్నీ, దైవత్వాన్నీ అనుమానించి, అవమానించడమేనా? అటువంటి అధమాధమ సంస్కారం నుండి బయటపడలేమా?

శ్రీకృష్ణ పరమాత్మ పాండవుల పిలుపునకు చేరువలోనే ఉండినప్పటికీ, ఎన్నో కష్టాలను అనుభవించారేకానీ ఏనాడూ ఆయన భగవతత్వాన్ని సందేహించలేదు. నిందించలేదు. చివరగా వారికి అఖండ విజయం, రాజ్యలక్ష్మి వశమయింది.

'దైవం మంత్రాధీనమ్' అంటారు. అదే నిజమైతే ప్రతిరోజు కొన్ని వేల మార్లు మంత్రాలను ఉచ్చరించే దేవాలయ పూజారులకు ఎన్నిమార్లు కనిపించి వుండాలి? వారంతా ఎపుడో దేవుళ్ళయిపోయి ఉండాలి. కానీ అలా కాలేదే?

భక్త శబరి శ్రీరామచంద్రుని దర్శించడానికి ఏ మంత్రం జపించింది ? ప్రహ్లాదుడు శ్రీహరిని ప్రసన్నం చేసుకోవడానికి ఏ మంత్రం పఠించాడు? ఏ మంత్రం జపించితే శ్రీ మహావిష్ణువు గజేంద్రుడిని మొసలి బారి నుండి రక్షించాడు? "నీవే తప్ప ఇతః పరంబెరుంగ సంరక్షించు భద్రాత్మకా" అని ఆత్మ నివేదన చేయడమే అసలు సిసలైన మహామంత్రంగా పని చేసి పరమాత్మను పరుగున రప్పించింది.

నిండు సభలో ద్రౌపది దేవి వలువలూడదీయునపుడు ఆమె ఏ మంత్రాన్ని జపించిందని వలువల నిచ్చి కాపాడాడు? నీవు తప్ప ఎవరూ నన్ను రక్షించలేరు అన్నా! అని దీనాతిదీనంగా వేడుకున్నది. అందువలన దైవం మంత్రాధీనం కాదు. భక్తికి అధీనం.

ఆత్మనివేదన, భక్తి మేళవించని మంత్రాలు కేవలం పదాలు, శబ్దాలు మాత్రమే. వాటికి ఎలాంటి శక్తి ఉండదు. గ్రామ ఫోన్ రికార్డు లేదా, ఆడియో కేసెట్‌లాగా శబ్దాలను బైటికి వినిపించడమే. భక్తితో, ఆర్తితో పిలిచిన పిలుపే పరమాత్మకు వినిపిస్తుంది. కనుక మంత్రాల మోజుతో, ఆత్మవంచన చేసుకోవడం మాని, పరమాత్మకు ప్రీతికరమైన భక్తి మంత్రాన్నీ, సేవ అనే తంత్రాన్ని ఆశ్రయిస్తే దైవదర్శనం కలుగుతుంది. భగవంతుని తత్వమూ తెలిసివస్తుంది.

జీవితం శాశ్వతం కాదు. కాబట్టి ఉన్నన్నాళ్ళు ఆరోగ్యంగా, ఆనందంగా, స్వేచ్ఛగా, శాంతియుతంగా, నిర్భయంగా జీవించే దానికి నైతిక మార్గం అవసరం. నైతిక మార్గాన్ని చక్కగా వివరించి, ఆచరించమని ఆజ్ఞాపించేదే మతం. అందుకే మతం ఒక సామాజిక అవసరం. అది ఏ మతమైనా కావచ్చు, ఆచరించి తీరవలసిన జీవన మార్గం.

* మానవత్వమే మతం. అదే అందరి సమ్మతం.
* మానవత్వం లేని మనిషికి దైవత్వం చాలాదూరం.

పుణ్యం ఎలా వస్తుంది?

"అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచనద్వయం పరోపకారాయ పుణ్యం పరపీడాయ పాపం". అని వ్యాసభగవానుడు సెలవిచ్చాడు. అంటే పరులకు అపకారం కలిగే పనులను చేసినట్లయితే పాపమనీ, ఉపకారం కలిగే పనులను చేస్తే పుణ్యం అనీ అర్థం. అందరిచేతా ప్రశంసించబడుతూ, కలకాలం వర్ధిల్లాలి అని దీవించబడుతూ, అందరికీ ఆదర్శంగా ఉన్నటువంటి వారిని పుణ్యాత్ములు అంటారు.

సత్కర్మలు చేయడం ద్వారా వచ్చే ఫలితాన్నే పుణ్యం అంటారు. సత్కర్మలంటే, మంచి పనులు. మనోవాక్కాయ కర్మల ద్వారా ఏ ప్రాణికీ కష్టం, నష్టం, బాధ, అభివృద్ధి నిరోధకం కాకుండా జీవించడమే. తన శక్తికి మించకుండా, శక్తియుక్తులను దాచుకోకుండా సర్వప్రాణులకూ చేతనైన సేవ చేయడం, కల్మషరహితంగా, పవిత్రంగా జీవించడం.

కొంతమంది సత్కర్మల ద్వారా పుష్కలంగా పుణ్యం సంపాదించుకోవచ్చు, పుణ్యం పురుషార్థం కలిసొస్తుందన్న స్వార్థంతో దీక్షలు, దానాలు, నోములు, పూజలు, వివాహాలు, వ్రతాలు, తీర్థయాత్రలు, యజ్ఞాలు, విగ్రహ ప్రతిష్టలు చేయిస్తూ ఉంటారు.

ప్రతిఫలాపేక్షతో, స్వార్థచింతనతో చేసే వారందరికీ ఒక్కోసారి సందేహం కూడా కలుగుతూ ఉంటుంది. ఇన్ని చేసినా, ఇంత ఖర్చు పెట్టినా, నా సేవలకు గుర్తింపు లభిస్తుందా? నా దక్షతను, నాయకత్వాన్ని, గుర్తించి గౌరవిస్తారా? నిజంగా పుణ్యం, ప్రయోజనం ఉంటుందా? లేక అనవసర ఖర్చు, వృథా ప్రయాసేనా? అని. మరికొందరికి ఒకవైపు పుణ్యకార్యాలు చేస్తూ ఉండగానే మరోవైపు కష్టాలు-నష్టాలు, అవమానాలు కారుమబ్బుల్లా కమ్ముకొస్తుంటాయి. అపుడు "ఎందుకిలా జరుగుతూవుంది, దేవుడు నిజంగా ఉన్నాడా? ఉంటే ఇన్ని పుణ్యకార్యాలు చేస్తున్నా ఫలితం లేకపోగా, కష్టాలు కలగడం ఏమిటి? అని నిరాశకు లోనవుతూవుంటారు.

ఇలా బాధపడడం, నిరాశకులోనవడం, దైవదూషణ చేయడం, దివ్యశక్తిని అనుమానించడం కేవలం వారి అవగాహనారాహిత్యం, మూర్ఖత్వం. స్వార్థపూరిత ఆలోచనలు మాత్రమే. ప్రతి ఫలాపేక్షతో కీర్తి కోసం, అవసరాలను, కోరికలను తీర్చుకోవడం. నేను చేయించాను. నా వలననే ఇంతమంది వచ్చారు. నేనే గనుక లేకుంటే ఈ కార్యం

ఇలా జయప్రదమయ్యేది కాదు. అని అహంకరించడం, కొంతమందిని నిర్లక్ష్యం చేసి తన ఆధిక్యతను చాటుకోవడం, సేవలను సొమ్ము చేసుకోవడం, బాధలను తొలగించుకోవడం కోసం, పరలోక సుఖాలను దండుకోవచ్చునన్న భావనలతో చేసే ఎలాంటి సత్కర్మలైనా శుష్కకర్మలు మాత్రమేనన్న సత్యాన్ని గ్రహించాలి. కేవలం అర్పణ భావంతో, అణకువతో, నిస్వార్థంతో, ఫలాపేక్ష లేకుండా, సందేహరహితంగా అందించే ఎలాంటి సేవలైనా సత్కార్యాలే అవుతాయని అందరూ తెలుసుకొని ఆచరించాలి.

సేవ చెయ్యగలరేకానీ - సహాయం ఎవ్వరూ చెయ్యలేరు

కొంతమంది కీర్తి కాంక్షాపరులూ, సంఘసేవా పరాయణులూ, రాజకీయ నాయకులూ, ఉదారవాదులూ అపుడపుడూ ఇలా అంటూ ఉంటారు. నా చివరి రక్తపు బొట్టు ప్రజల కొరకే ధారబోస్తా. నా జీవితమంతా జనహితం కొరకే అంకితం చేస్తా. నా శ్రమ వల్ల ఏ కొందరికి మేలు జరిగినా అంత కంటే కావలసినదేముంది? ఈ విధమైన మాటలు వినేదానికి చాలా ఇంపు గానే ఉంటాయి. కానీ ఆ మాటల వెనుక స్వార్థం ఉంటుంది. కానీ ఈ ప్రకృతి ఎవరి చేతకూడా ఇంకొకరు సహాయం పొందడానికి సృష్టింపబడలేదు. అందరికీ సహాయం చేసేది ప్రకృతిమాత మాత్రమే. సకల జీవులకూ ఎప్పుడు, ఏది, ఎంత అవసరమో దాని ప్రకారం ముందుగానే ఇచ్చి ఉంది. కొత్తగా ఎవరూ దేనినీ ఇవ్వడానికి మానవమాత్రుడు ఏపాటివాడు?

బాధలలో, కష్టాలలో ఉన్న వాడికి సేవ చేయడం మంచిదే కానీ, దాని వెనుక గర్వం వుండడమే మంచిది కాదు. ఈ సృష్టిలో ఎవరికైనా మనం సేవ కానీ సహకారం కానీ, ఉపకారం కానీ చేస్తున్నట్లయితే-కాలక్రమంలో అది మరలా మనకే ఉపకరిస్తుందని తెలుసుకుంటాం. అదే "ధర్మోరక్షతి రక్షితః".

రోడ్డు ప్రక్కన నిలబడిన కుంటివాడికి కానీ, గుడ్డి వాడికి కానీ, నీవు ఏదైనా సేవ చేసినట్లయితే అది మన గొప్పతనమని ఏమాత్రం అనుకోకూడదు. ఎందుకంటే ప్రకృతిమాత లేక పరమాత్మే మనలను ఆ సేవ చేసే నిమిత్తం అక్కడికి పంపింది. ఆ సేవ చేసే భాగ్యం కల్పించినందుకు ఆ కుంటివాడికి కానీ, అంధుడికి కానీ మనమే కృతజ్ఞతలను తెలియజేయాలి. అంతేగానీ ఆ భావనకు విరుద్ధంగా అహంకారంతో నేను ఆ సహాయం చేశాను అనుకోవడం పరమాత్మను దూషించినట్లే!

లోకం కోసం పాటుపడ్డామని కానీ, సహాయం, ఉపకారం చేశామని కానీ, భావించడం అహంకారం మాత్రమే. అది తప్పక మనలను శిక్షిస్తుంది. అహంకార భావనతో చేసిన ఏ సత్కార్యమైనా ప్రత్యుపకారాన్నీ, కృతజ్ఞతను ఆశిస్తుంది. కానీ ఆ ఆశ నెరవేరదు. అలాంటపుడు బాధకూ, దుఃఖానికీ గురై, క్రోధానికీ, ఆవేశానికీ వశమై ఆరోగ్యం, ఆనందం దూరమవుతుంది. ఆ విధంగా కాకుండా సేవ, ఉపకారం పొందిన వారిపట్ల మనమే కృతజ్ఞత కలిగి ఉన్నట్లయితే వారి నుండి ప్రతిఫలం ఏరూపంలోనూ

ఆశించక, ఎలాంటి మనోవికారాలకూ గురికాకుండా ఆరోగ్యంగా, ఆనందంగా ఉండవచ్చు. మరెన్నో సేవలు అలుపు లేకుండా చేయవచ్చు. పరమపద సోపానంలో సేవలే నిచ్చెనలు.

"నేను" పోతే పోతాను

ఒక గురువు దగ్గర శిష్యులు విద్యాభ్యాసం చేస్తున్నారు. క్రమంగా వేద విద్యలన్నీ అభ్యసించారు. వారిలో యోగ్యుడైన ఒక శిష్యుణ్ణి పిలిచి, హిమాలయాలలో ఉండే మరో గురువు దగ్గరికెళ్ళి బ్రహ్మ విద్యను అభ్యసించి రావలసిందిగా గురువుగారు ఆదేశించారు. ఆ ప్రకారంగా, శిష్యుడు కొంతకాలం పాటు హిమాలయాల్లో గడిపి బ్రహ్మ విద్యలో శిక్షణ పొంది వచ్చాడు.

తిరిగి వచ్చిన శిష్యుణ్ణి సతీర్థులు (తోటి విద్యార్థులు) చుట్టుముట్టారు. విశేషాలు తెలుసుకుంటున్నారు. వారిలో ఒకనికి సందేహం వచ్చింది. మిత్రమా నేను స్వర్గానికి పోతానా- పోనా? అని అడిగాడు. దానికి ఈ శిష్యుడు పెదవి విరిచి అవకాశం లేదు అన్నాడు.

ఇక వరుసగా మిత్రులంతా నేనో? నేనో? నేనో? అని ప్రశ్నించారు. అందరికీ సమాధానం ఒకటే వచ్చింది. 'అవకాశం లేదు' అని.

ఆఖరికి గురువుగారు కూడా అడిగారు "మరి నాకైనా అవకాశం ఉందా శిష్యా?" అని. విచిత్రంగా ఆయనకీ అదే సమాధానం వచ్చింది. దానితో శిష్యులందరికీ తిక్కరేగింది. పోనీ నువ్వయినా స్వర్గానికి పోతావా? అదీ లేదా? అని ప్రశ్నించారు. దానికి శిష్యుడు "నేను" పోతే పోతాను అన్నాడు.

దాంతో శిష్యులంతా ఒక్కసారిగా విరుచుక పడబోయారు. గురువు గారికి కూడా దక్కని స్వర్గం నీకు లభిస్తుందంటావా? అని మండి పడ్డారు. దానికి శిష్యుడు శాంతంగా చిరునవ్వుతో చెప్పాడు. "నామాటను అపార్థం చేసుకోకండి నేను పోతాననడం లేదు. "నేను" అనేది పోతే స్వర్గం లభిస్తుందని చెపుతున్నాను. ఇది మనందరికీ వర్తిస్తుంది.

"నేను" అనే అహంకారం సమూలంగా తొలగిపోయి ఏ పని చేస్తున్నా బ్రహ్మార్పణ బుద్ధితో చేస్తూ పోతే చివరికి 'నేను'-'నాది' అనే ఆలోచనల నుంచి మనిషి దూరం అవుతాడు. అదే ముక్తి, మోక్షం.

వదలకుండా దొరకకుండా జీవించడం ఎలా?

ఒక ఈగ నిండుగా తేనె ఉన్న పాత్రను చూచింది. ఆనంద పారవశ్యంలో మునిగిపోయింది. తనివితీరా తేనెను ఆరగించాలనుకున్నది. ఆ తాపత్రయంలో, ఆతురతతో తేనె మధ్యలో వ్రాలింది. కానీ తేనె మధ్యలో దిగబడిపోయింది. తేనెను ఆరగించడం అటుంచి, తేనెలోనే తగులుకొని రెక్కలు ఆడక, కాళ్ళు పైకి లేవక.

ఎగిరిపోదామనుకున్నా పోలేక, చనిపోతానేమో అనే భయంతో అందులోనుండి బైటికి వచ్చేటందుకు శక్తినంతా ఉపయోగిస్తూ ప్రయోజనం లేక ప్రాణాలను వదిలింది. వదులుతూ ఈగ "అయ్యో తేనె యొక్క మాధుర్యాన్ని తనివితీరా ఆస్వాదించాలన్న తాపత్రయంతో, తపనతో విచక్షణాజ్ఞానాన్ని కోల్పోయి, తేనె మధ్యలో వ్రాలి దిగబడి పోయాను. అలాకాకుండా పాత్ర అంచుమీద వ్రాలి నింపాదిగా కూర్చొని తేనెలో ఇరుక్కొని పోకుండా, కావలసినంత తేనెను ఆరగించి ఉండవచ్చుకదా అని పశ్చాత్తాప పడింది.

అలాగే మనిషి కూడా సంసారమనే మాయాబంధాలలో చిక్కుకొనకుండా ఏనాటికైనా ఈ బంధాలు మధ్యలోనే తెగిపోయేవే, అనే సత్యాన్ని మననం చేసుకుంటూ ATTACHMENT (అంటిపెట్టుకోవడం)తో కాకుండా DETACHMENT (తెంచుకోవడం) పాలసీతో జీవించాలి. అలా జీవించడాన్నే 'పద్మపత్రామివాంబసా' 'తామరాకుపై నీటిబొట్టులాగా' అంటీ ముట్టనట్లు జీవించడం అని గీతాచార్యుడు చెప్పాడు.

ఋణానుబంధ రూపేణా పశు, పత్నీ సుతాలయా

ఇద్దరు యువకులు ప్రాణ స్నేహితులు. ఒకడు సైనికుడుగా పనిలో కుదిరాడు. మరొకడు ధనికుడైన కారణంగా వడ్డీ వ్యాపారిగా స్థిరపడ్డాడు. సైనికుడు తనకు వచ్చిన జీతంలో ఇంటికి కొంత పంపించి, మరికొంత స్నేహితుని దగ్గర దాచుకునేవాడు. భవిష్యత్తులో పెళ్ళికీ, సంసారానికీ పనికి వస్తుందన్న కోరికతో అలా కూడబెట్టుకునేవాడు. కొంత కాలానికి అలా కూడబెట్టిన ధనం పాతిక వేలుదాకా అయ్యింది. ఒకరోజు అనుకోకుండా అధికారుల అజ్ఞప్రకారం కాశ్మీరులో తలెత్తిన తిరుగుబాటును అణచడానికి సైనికుడికి పిలుపు వచ్చింది. మిత్రునికి తాను అతి జరూరు పనిమీద కాశ్మీరుకు వెళుచున్నాను అని వేరొకరి ద్వారా వార్తను చేరవేసి, తాను కాశ్మీరుకు వెళ్లాడు.

అక్కడ తిరుగుబాటుదారులతో భయంకరమైన యుద్ధం జరిగింది. సైనికుడు కూడా యుద్ధరంగంలోకి దూకాడు. కానీ ఇతను ఎక్కిన గుర్రం చెప్పినట్లు వినక, ఫిరంగుల మోతకు పిచ్చిపట్టిన దానివలె, ఇష్టమొచ్చినట్లు దౌడు తీయడంతో తిరుగుబాటుదారుల చేతిలో హతమయ్యాడు.

అధికారులు మృతదేహాన్ని సైనికుని స్వగృహానికి పంపారు. సైనికుని కర్మక్రియలకు మిత్రుడు కూడా వెళ్ళి తన ప్రగాఢ సానుభూతిని తెలియబరచాడు. తన దగ్గరున్న పాతికవేలు సైనికుని తల్లిదండ్రులకు ఇవ్వవలసివుంది. కానీ ఈ విషయం మిత్రుల మధ్యే ఉండిపోయింది. ఎవ్వరికీ తెలియదు. అందుకని లోలోపల సంతోషిస్తూ ఎవ్వరికీ చెప్పకుండా, ఇవ్వకుండా గుంభనంగా ఇల్లు చేరుకున్నాడు.

కొంత కాలమైన తర్వాత ధనికుడు వివాహం చేసుకున్నాడు. రోజులు అలా అలా గడిచిపోయాయి. ధనికునికి లేకలేక ఒక కుమారుడు కలిగాడు. యుక్తవయసు రాగానే కుమారుడికి ఒక మంచి కుటుంబంలోని అందమైన అమ్మాయితో వివాహం వైభవంగా జరిపించాడు.

ఇలా ఉండగా ఒకరోజు పొరుగూరు నుండి ఒక వ్యాపారస్తుడు ధనికుని ఇంటికి వచ్చి వ్యాపారలావాదేవీల గురించి చర్చించి వెళ్లొస్తానని బయలుదేరాడు. మిత్రమా మా ఇంట విందు ఆరగించకుండా ఎలా వెళతావు? తప్పని సరిగా భోజనం చేసే వెళ్లాలి. మనం మాట్లాడుతూ ఉండగానే పసందైన విందుకు ఏర్పాట్లు చేశాను అన్నాడు ధనికుడు. అందుకు వ్యాపారస్తుడు కూడా సరేనన్నాడు.

తీరా విందుకు ఇలా కూర్చున్నారో లేదో, ఒక గది నుండి హృదయ విదారకమైన రోదన వినబడింది. అది ఏమిటని వ్యాపారస్తుడు అడిగాడు. అందుకు ధనికుడు ఆ రోదన తన కోడలిది. ఈ మధ్యనే నా కుమారుడు మరణించాడు అని నింపాదిగా ఏ విచారమూ లేకుండా చెప్పాడు. విషయం విన్న వ్యాపారస్తుని హృదయం కకావికలమై - మిత్రమా! ఇలాంటి సందర్భంలో మీరు విందు ఏర్పాటు చెయ్యడం సమంజసమేనా? ఆమె హృదయ రోదన విన్న నాకు విందు ఆరగించాలన్న కోరిక చచ్చిపోయింది. నీకు బుద్ధిలేకపోయినా, నాకైనా ఉండాలికదా? అని వ్యాపారస్తుడు కఠినంగా మాట్లాడి పైకి లేవబోయాడు.

ధనికుడు ఎంతో ప్రశాంతంగా, స్థిరచిత్తంతో వ్యాపారస్తుని చెయ్యిపట్టి బలవంతంగా కూర్చోబెట్టి, మిత్రమా! నీవు కోపగించుకోవడంలో అర్థముంది. కానీ నేను చెప్పేవిషయాన్ని శాంతంగా విను. ఆ తర్వాత నీ యిష్టం వచ్చినట్లు చెయ్యి. అని ఈ విధంగా చెప్పాడు.

వివాహమైన కొద్దిరోజులకే నా కుమారునికి జబ్బు చేసింది. ఎంతోమంది వైద్యులతో ఎన్నోరకాల చికిత్సలు చేయించాను. పాతిక వేల రూపాయలకు పైగా ఖర్చయింది. కాస్తంతైనా నయం కాలేదు. నా కుమారుడు మాత్రం మరణ వేదన అనుభవిస్తూనే ఉన్నాడు. ఒకరోజు పేరు పొందిన భూత వైద్యుడొకడు వచ్చి మీ కుమారునికి వచ్చింది మామూలు జబ్బుకాదు. ప్రేతాత్మకు సంబంధించినది. నయం చేస్తానని చెప్పాడు. మంత్రతంత్రాలు ప్రయోగించాడు. ఏదో యంత్రంకూడా కట్టాడు. కొద్దిరోజులకు మరలా వస్తాను. ఈలోగా జబ్బు బాగా తగ్గిపోయి ఉంటుంది, అని చెప్పి పైకం అడిగాడు. అపుడు తనవద్ద ఉండినది కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే! అదే ఇచ్చి పంపాను.

ఈ తతంగమంతా చూస్తున్న నా కుమారుడు అంత వేదనలోనూ, ఫక్కున నవ్వాడు. ఎందుకురా నాన్నా! నవ్వుతున్నావు? అని అడిగాను. అందుకు నాకుమారుడు ఇలా చెప్పాడు.

'నేను నీకు కుమారుడను కాను. నీ స్నేహితుడినైన సైనికుడిని. మరణావస్థలో ఉన్న నాకు గత స్మృతులు తెలుస్తున్నాయి. నేను నీవద్ద దాచమని ఇచ్చిన పైకం పాతికవేలు. మా తల్లిదండ్రులకు ఇచ్చి ఉండవలసింది. కానీ స్వార్థంతో నీవద్దనే ఉంచుకున్నావు. ఆ సొమ్మంతా వడ్డీతోసహా నీవు నా జబ్బు కొరకు ఖర్చు చేశావు. కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే మిగిలి ఉండినది. అది కూడా భూత వైద్యునికి ఇచ్చావు. ఇంతటితో నా బాకీ మొత్తం తీరి పోయింది. ఈ తతంగమంతా చూచి నాకు నవ్వు వచ్చింది. అని చెప్పడం కొనసాగించాడు. ఇపుడు నా భార్యగా వైధవ్యంతో రోదిస్తున్నది ఎవరో కాదు పూర్వజన్మలో నా గుర్రం. అపుడు నా చావునకు కారణమైంది. శిక్షగా ఇపుడు ఈజన్మలో విధవగా దుఃఖిస్తూ ఉంది. ఈ జన్మలో నా కర్మలు తీరిపోయాయి... అంటూ కన్ను మూశాడు.

మిత్రమా! ఇపుడు చెప్పు. సైనికుడి కోసం దుఃఖించమంటావా? లేక నా కుమారుడి కోసమా? గుర్రం కొరకా? లేక నా కోడలి కొరకా? ఎవరికోసం దుః ఖించమంటావో చెప్పు? మిత్రమా! ఇదంతా ఒక మాయ. దయచేసి మనసులో ఏమి పెట్టుకోకుండా భోంచెయ్యి అన్నాడు.

తన కుమారుడు సైనికుడని, కోడలు గుర్రం అనీ తెలుసుకున్నాక సంసార మాయాజాలం బాగా అర్థమైంది. అది తెలియనట్లయితే కొంపకొల్లేరయ్యేటట్లుగా రోదించి ఉండేవాడిని. అంతా అయిపోయింది. వారసులే లేకుండా పోయాక ఎవరికోసం సంపాదించాలి? ఎవరికోసం జీవించాలి? అని హతాశుడనైవుండే వాడిని అన్నాడు. అందరూ అంతే.

*****



విశ్వచైతన్యం - 8

ప్రకృతి - పురుష

బ్రహ్మ - విష్ణు - మహేశ్వర

ప్రకృతి
దేవత
(కోమలత్వం సత్వగుణం)
శాంతం, సహనం, జాలి, దయ,
కరుణ, క్షమాగుణం, అర్పణ, రక్షణ,
ఆకర్షణ, పోషణ

పురుష
దేవుడు
(కఠినత్వం/రజోగుణం)
కోపం, రోషం, ఆవేశం, అహంకారం,
దూకుడు స్వభావం,
శపించడం, శిక్షించడం, ధృఢత్వం

అర్ధనారీశ్వరం

సరస్వతి-బ్రహ్మ
సృష్టి

లక్ష్మి-విష్ణు
స్థితి

ఈశ్వరి - ఈశ్వర
లయ

స్త్రీ
తల్లి
క్షేత్రం

పురుషుడు
తండ్రి
బీజం

సంతానం

సృష్టి - పోషణ

అండ, పిండ, బ్రహ్మాండాదులతో నిండియున్న విశ్వమంతా ఏదో ఒక అదృశ్య శక్తి చేత నడుపబడుతూ ఉన్నదని ఆశ్చర్యపోతూ ఉంటాం.

జడ-చేతన పదార్థాలలోని, ప్రాణులలోని MOVEMENT కదలిక, LIFE ప్రాణం, POWER శక్తి, REACTION ప్రతిస్పందన, ACTIVENESS క్రియాశీలతే ఆ అదృశ్య శక్తి అదే విశ్వచైతన్యం.

ఈ విశ్వచైతన్యంలోనే ప్రకృతి-పురుష తత్త్వం దండలోని దారంలాగా, అంతర్వాహినిగా వ్యాపించి ఉందనీ, ఆ ప్రకృతినే దేవత అనీ, పురుషను దేవుడు అనీ, ఈ రెండింటి ఏకత్వమే భగవతత్త్వం అనీ, అదే పరమాత్మ అనీ, అర్ధనారీశ్వరం అనీ ఋషులు విశదీకరించారు. ఋషులనే 'ద్రష్ట'లని కూడా అంటారు. తమ మనోనేత్రంతో భూత, భవిష్యత్, వర్తమాన కాలాలను వీరు దర్శించగలరు. వీరినే 'త్రికాలజ్ఞులు' అని కూడా అంటారు. విశ్వచైతన్యంలోని ప్రకృతి లేక స్త్రీ - కోమలత్వానికి ప్రతీక. పురుష లేక పురుషుడు పురుషత్వానికి ప్రతీక.

శాంతం, సహనం, జాలి, దయ, కరుణ, క్షమాగుణం లాంటి కోమలమైన గుణాలనూ, మృదువైన శరీరాన్నీ కలిగి ఉంటుంది స్త్రీ. కోపం, రోషం, ఆవేశం, అహంకారం, తొందరపాటు తనం లాంటి గుణాలను, కఠినమైన మనసునూ, దృఢమైన శరీరాన్నీ కలిగి ఉంటాడు పురుషుడు.

విశ్వ చైతన్య స్వరూపులూ, అర్ధనారీశ్వరులూ అయిన స్త్రీ-పురుషులలో ఏ విధమైన తత్త్వం ప్రజ్వరిల్లుతుందో, బాహ్యంగా ఆ స్వరూపంతో కనబడుతూ ఉంటారు. స్త్రీలో పురుష తత్త్వమైన రజోగుణం ప్రజ్వరిల్లితే ప్రచండశక్తి స్వరూపిణిగాను, సంహారిణిగానూ, పురుషునిలో స్త్రీతత్త్వమైన సత్వగుణం ప్రజ్వరిల్లితే వరములనిచ్చే దయామయుడుగానూ, రక్షకుడుగానూ, దర్శనమిస్తూ ఉంటారు. అదృశ్య, అద్భుత, అనంతశక్తి అయిన ఈ చైతన్యం ఆ విధంగా స్త్రీలో పురుషతత్త్వం, పురుషునిలో స్త్రీత్వం, అంతర్వాహినిగా చరించుతూ, సర్వజగత్తులనూ సృష్టి-స్థితి-లయ విన్యాసాలతో అలా..... అలా....నడిపిస్తూనే ఉంటుంది. దీనికి ఆదీ లేదు, అంతమూ లేదు.

పంచభూతాలతో ఏర్పడిన ఈ దేహంలో స్త్రీ హృదయమైతే, పురుషుడు దేహం. హృదయం లేని దేహం నిష్ప్రయోజనం. దేహంలేని హృదయం నిరుపయోగం. ఎవరైనా నిర్దయగా, క్రూరంగా వ్యవహరిస్తూ ఉంటే "వారికి హృదయం లేదు" అని రాక్షసులతో పోలుస్తూ ఉంటారు. అంటే! హృదయం అనగా జాలి, దయ, కరుణ, శాంతం, సహనం, మొదలగు సత్వ గుణాలను కలిగినటు వంటిది.

ప్రకృతి-పురుష సమ్మేళనమైన అర్ధనారీశ్వరంలో స్త్రీ వామభాగంలోఉంటుంది. హృదయం కూడా వామభాగంలోనే ఉంటుంది. వామభాగం ప్రకృతి 'నార్త్‌పోల్'. దక్షిణభాగం పురుష 'సౌత్ పోల్'కు ప్రతీకలు. విజాతి ధృవాలు పరస్పర ఆకర్షకాలు. ఆ విధమైన స్త్రీ-పురుష ఆకర్షణ సంయోగ ఫలితమే సృష్టి

నేటి సమాజంలోని సమస్త అలజడులకు, అల్లకల్లోలములకు, అశాంతికి, అకృత్యాలకు కారణం స్త్రీలో పురుషతత్త్వమైన రజోగుణం పెరిగిపోవడం. పురుషునిలో స్త్రీత్వమైన సత్వగుణం తరిగిపోవడం. సమభాగాలుగా ఉండవలసిన ప్రకృతి-పురుష తత్వాలు సంతులనం (బ్యాలెన్స్) కోల్పోవడమే.

స్త్రీలు-పురుషులు ఇరువురూ ప్రయత్నపూర్వకంగా అర్ధనారీశ్వర తత్వాన్ని సాధించగలిగితే దేవమానవలోకం, లేకుంటే..... దైత్యమానవలోకం.

WOMAN	HAS	MAN	IN IT
FEMALE	HAS	MALE	IN IT
SHE	HAS	HE	IN IT
MADAM	HAS	ADAM	IN IT

THUS

WOMEN ARE INCOMPLETE WITHOUT MEN
MEN ARE INCOMPLETE WITHOUT WOMEN

సృష్టిలో వికసించునదే దైవం
పోషణలో చల్లగా ఉంచునదే దైవం
శోషణలో జ్వలించునదే దైవం
ప్రళయంలో తనలో కలుపుకొనునదే దైవం
సజ్జనులను రక్షించునదే దైవం
దుర్జనులను దునుమాడునదే దైవం
అజ్ఞానాన్ని, తొలగించునదే దైవం
సేవించినచో శాంతించునదే దైవం
తపములతో పొందగలుగునదే దైవం

కనిపించని 'గాలి' ఉంది. అన్నది ఎంతటి నిజమో, 'తల్లి-దండ్రులు'న్నారన్నది ఎంతటి వాస్తవమో 'పరమాత్మ' ఉంది అన్నది కూడా అంతే పరమ సత్యం. కుంటివారు నడచిన సంఘటనలనూ, గ్రుడ్డివారు చక్కగా చూడగలిగిన సందర్భాలనూ, మూగవారు మాట్లాడడమే కాదు పరమాత్ముని మహిమను కీర్తించిన అద్భుతాలనూ, పరమ మూఢులు మహా మేధావులైన సంఘటనలను, కుచేలురు. కుబేరులైన సంఘటనలను చూచిన తర్వాత, సత్యవంతులు చెప్పగా విన్న తర్వాత కూడా, ఆ పరమాత్మనూ, భగవత్ శక్తినీ సందేహించగలమా ?

ప్రకృతిని తల్లిగా ఆరాధించారు మన ఋషులు. మన పుట్టుకకూ, పోషణకూ ఎన్నెన్నో అవకాశాలను ప్రసాదించినందువలననే ప్రకృతిని కరుణామయి 'మాత' అన్నారు.

ప్రేమ, పరోపకారం, శాంతి, సహనం, అహింస, దయాగుణాలున్న స్త్రీని దేవత అనీ, పురుషుణ్ని దేవుడు అనీ అంటూ వుంటారు. మనం వింటూ ఉంటాం కూడా.

ఆ భావనతోనే, చికిత్స చేసి ప్రాణాలను కాపాడిన వైద్యుడిని "వైద్యోనారాయణో హరిః" అంటూ ఉన్నాం. అలాగే జ్ఞానాన్ని బోధించిన వారిని, గురువు, అనీ ఆపదలో మృత్యువాత పడకుండా ఆదుకున్న వాడినీ, అన్నంపెట్టి ఆకలి బాధను తీర్చిన వాడినీ. బలహీనుడిని బాధించే బలవంతుడిని శిక్షించి, బలహీనుడిని రక్షించిన వాడినీ. వస్త్రదానం చేసి చలి బాధను తొలగించిన వాడినీ, కృతజ్ఞతాభావంతో, దేవుడిలాగా

వచ్చి ఆదుకున్నావు, నీవు చేసిన మేలు జన్మజన్మలకూ మరచిపోను! అని చేతులెత్తి నమస్కరిస్తూ అనడం మనం చూస్తూ ఉన్న వాస్తవాలే కదా!

అదేవిధంగా జగత్తులోని సృష్టి, స్థితి, లయ, విన్యాసాలకు బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను ప్రతీకలుగా, విశ్వసిస్తూ ఉన్నాం. ఆరాధిస్తూ ఉన్నాం.

పరమాత్మయొక్క అనంతమైన, అద్భుతశక్తినీ, దివ్యమైన తేజస్సునూ, భౌతిక నేత్రాలతో, చిన్నచిన్న అంశాలుగా ప్రాణులలోనూ, పదార్థాలలోనూ చూడవచ్చు. అందుకే ఆత్మను బిందువుగానూ, పరమాత్మను సింధువుగానూ చూడవచ్చు.

* కటిక చీకటిలోనూ చక్కగా చూడగల శక్తిని కొన్ని ప్రాణులలో (రాత్రులందు సంచరించే ప్రాణులు - గబ్బిలాలు, గుడ్లగూబలు, పిల్లులు)
* గాలిలో ఎగిరే శక్తిని కొన్ని ప్రాణులలో (పక్షులు, కీటకాలు)
* నీటిలోనే జీవించగల శక్తిని కొన్ని ప్రాణులలో (చేపలు, తాబేలు)
* ఆహ్లాదాన్నీ, ఆనందాన్నీ మనోహరమైన అందాలనూ, కోమలత్వాన్ని, పరిమళాన్ని పుష్పాలలోనూ, పత్రములలోనూ, మాధుర్యాన్ని పువ్వులలోని మకరందంలోనూ
* ప్రాణాన్ని హరించే శక్తిని (విషం) కొన్ని ప్రాణుల్లో, పదార్థాలలో (పాములు, తేళ్ళు, ఉమ్మెత్తలాంటి మొక్కలు)
* దహించివేసే శక్తిని (అగ్ని, మెరుపు, పిడుగులలో)
* ప్రళయ విలయ తాండవాన్ని (తుఫాను, భూకంపాలలో)
* క్రూరత్వాన్ని కొన్ని ప్రాణులలో (పులులు, సింహాలు)
* సాధుత్వాన్ని కొన్ని ప్రాణులలో (ఆవు, జింక, మేక, గొర్రె)

ఆనందాశ్చర్యానుభూతులను కలిగించే సూర్య-చంద్రోదయాస్తమయాలు, నక్షత్రాలు, వాగులు, వంకలు, సెలయేర్లు, నదులు, సముద్రాలు, అడవులు-అరణ్యాలలోనూ చూడవచ్చు. సమస్త జీవుల మనుగడకు ఆధారభూతమైన భూమి ఆకాశం, గాలి, నీరు, నిప్పు మొదలగు వాటిని చూచి గ్రహించగలిగే శక్తి, ఆసక్తి ఉన్నట్లయితే సృష్టిలోని అణువణువులోనూ ఈ పరమాత్మను, చైతన్య స్రవంతిని అనుభూతి చెందవచ్చు.

ఈ అద్భుత శక్తి అయిన పరమాత్మను విశ్వసించని కొందరు దానిని చూపించమంటారు. చెఱకులోని తీపినీ, విద్యుత్తులోని శక్తినీ, ఉమ్మెత్తలోని విషాన్నీ, సముద్రపు నీటిలోని ఉప్పదనాన్ని, పుష్పాలలోని పరిమళాన్నీ, మకరందంలోని మాధుర్యాన్నీ - ప్రశ్నించేవారు కానీ, సమాధానం చెప్పేవారుకాని, ఎవరూ చూడనూ లేరు. చూపించనూ లేరు. జిజ్ఞాసతో ఎవరికివారు ప్రయత్నించి అనుభవించాల్సిందే! అనుభూతి చెందాల్సిందే! పరమాత్మ అన్నది ఒక తత్వం దానిని అనుభూతి చెంది ఆనందించాల్సిందే, మనోనేత్రంతో దర్శించవలసిందే.

కొందరు యోగులు, ఋషులు మునులు, మహాత్ములు మాత్రమే తమ యొక్క స్పర్శతో, సంకల్ప బలంతో దివ్యశక్తిని, అర్హులైన వారిలో ప్రసరింపచేయనూ గలరు. ఉపసంహరించనూగలరు.

ప్రకృతి మాత ఒడిలోని గాఢమైన నిశ్శబ్దంలో సంపూర్ణంగా లీనం కాగలిగితే జ్ఞాననేత్రం లేక దివ్య చక్షువు జాగృతమై ప్రకృతిలోని రహస్యాన్నంతటినీ అవగతం చేసుకోగలుగుతుంది. జగత్తులోని ఈ చైతన్యం యొక్క సృష్టి, స్థితి, లయ (పుట్టుట, పెరుగుట, నశించుట) విన్యాసాలను భౌతిక నేత్రాలతో చూడవచ్చు. కాని అంతర్వాహిని అయిన చైతన్య స్రవంతిని మాత్రం మనోనేత్రంతో మాత్రమే దర్శించగలమనీ, అనుభూతి చెందగలమనీ ఋషులు ప్రబోధించారు.

పాలలోని వెన్నను చూడాలంటే, పాలను బాగా కాచి చల్లార్చి, సేమిర (తోడు) వేసి ఉంచితే పెరుగవుతుంది. అప్పుడు ఆ పెరుగులో తగినన్ని నీళ్ళు వేసి కవ్వంతో బాగా చిలికితే వెన్న వస్తుంది. అప్పుడు వెన్ననూ చూడగలం, రుచినీ ఆస్వాదించగలం. పాలలో వెన్న కనిపించనంత మాత్రాన లేదనగలమా? అలాగే కనిపించని ఆ దైవాన్ని దర్శించాలంటే-నీలోకి నీవు ప్రయాణించి, హృదయలోతులలోకి వెళ్ళగలిగితే ప్రణవనాదాన్నీ వినగలవు, దివ్య తేజస్సునూ దర్శించగలవు, దివ్య జ్ఞానాన్నీ, దివ్యానందాన్నీ, దివ్య చైతన్యాన్నీ అనుభవించగలవు.

భగవంతుడిని గురించి మూడు సందేహాలు

పూర్వం ధర్మబుద్ధి కలిగిన ఒక రాజుకు ఆధ్యాత్మికంగా కొన్ని సందేహాలుండేవి. ఆ సందేహాలు తీరక మథనపడుతూ ఉండేవాడు.

చివరికి తమ రాజపురోహితుడినే సందేహాలను గురించి అడగదలచాడు. రాజపురోహితుడు పాండిత్య ప్రకర్షకలవాడే, కానీ అనుభవశూన్యుడు. ఈ విషయం రాజుగారికి తెలియక. తమ సంశయాలను తొలగించగలడని అనుకున్నాడు.

రాజు పురోహితుడిని పిలిపించి పండితోత్తమా! మూడుసందేహాలు నన్ను గత కొంతకాలంగా వేదిస్తున్నాయి. వాటిని మీకు తెలియజేస్తాను. దయచేసి వివరించి సందేహనివృత్తి చేయండి. దానికి మీకు ఒక మాసం గడువుకూడా ఇస్తాను. తొందర పడవలసిన పనిలేదు. గడువులోగా సందేహ నివృత్తి చేయలేకపోతే, మిమ్ములను పౌరోహిత్య పదవి నుండి తొలగిస్తాను అని చెప్పి, తన ధర్మ సందేహాలను ఇలా బయట పెట్టాడు.

1) దేవుడు ఎక్కడున్నాడు? 2) దేవుడు ఏ వైపు చూస్తున్నాడు? 3) దేవుడిపుడు ఏం చేస్తున్నాడు?

అనుభవ శూన్యుడైన పురోహితుడు రాజు గారి సందేహలను విని, భయంతో నోరు వెళ్ళబెట్టాడు. తన పురోహిత పదవికి కాలం చెల్లిపోయినట్లేనని మనసులో అనుకుంటూ, ముప్పై ఒకటవ రోజున తమ దర్శనానికి వస్తానని రాజుగారితో చెప్పి ఇంటి కొచ్చాడు.

పురోహితుని ఇంటిలో సేవలు చేస్తూ ఒక బ్రాహ్మణ బాలిక ఉండేది. పదహైదు సంవత్సరాల ఆ బాలికకు బాల్యము నుండే చక్కగా భక్తి అలవడింది. అదీ గాక పురోహితుని ఇంటిలో ఉన్న కారణంగా భక్తికి తోడు - శాస్త్ర శాస్త్రజ్ఞానం కూడా అబ్బింది.

పురోహితుడు రాజుగారి దగ్గరికి వెళ్ళి వచ్చినప్పటి నుండి దిగులుగా ఉండడం చూచి, కారణం తెలుసుకొంది. తాను రాజుగారి సందేహాలను నివృత్తి చేయగలనని ధీమాగా చెప్పి పురోహితునికి ధైర్యం కలుగచేసింది. కారణాంతరాల వలన ఆస్థానానికి రాలేకపోతున్నాను. నా తరుపున నా ప్రతినిధిగా నా శిష్యురాలు వస్తుందని ఒక పత్రం వ్రాసి ఆస్థానానికి పంపించండి అని వినయంగా చెప్పింది ఆ బాలిక.

ముప్పై రోజులు గడచిపోయాయి. పురోహితుడు హాజరు కావలసిన రోజు వచ్చేసింది. భక్తులు, ఆధ్యాత్మిక వేత్తలు, జిజ్ఞాసులు, పండితులు, కవులతో రాజాస్థానం క్రిక్కిరిసిపోయింది. పురోహితునికి బదులుగా ఆయన శిష్యురాలు వచ్చి రాజు గారి సందేహాలను నివృత్తి చేస్తుందట అనుకుంటూ ఆతృతతో ఎదురు చూడసాగారు.

నిర్దిష్ట సమయానికి సభలోకి ప్రవేశించిన ఆ బాలికను రాజు గారు సంతోషంగా ఆహ్వానించి సమాధానాలు చెప్పవలసిందిగా కోరాడు. ఎత్తైన సింహాసనంలో కూర్చున్న రాజు గారిని ఉద్దేశించి క్రింద నిలబడి ఉన్న ఆ బాలిక మహారాజా జ్ఞానాన్ని బోధించేవారు గురువు స్థానంలో ఉండాలి. కాబట్టి నేను ఉన్నతాసనమైన సింహాసనంపై కూర్చోవాలి. మీరు క్రింద నిలబడాలి అన్నది. రాజు అందుకు అంగీకరించాడు. సభాసదులంతా ఆశ్చర్యంతో కళ్ళప్పగించి చూస్తున్నారు.

ఆ బాలిక మహారాజుతో వినయంగా శుభకార్యం ప్రారంభించే ముందు దీపం వెలిగించి, దేవుడికి అభిషేకం, పూజ చేయాలి. ఒక పాత్రలో పాలు తెప్పించండి అని చెప్పింది. రాజు అలాగే అన్నీ తెప్పించాడు. పూజా విధిని ముగించింది ఆ బాలిక.

దేవుడెక్కడ ఉంటాడు? మొదటి ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిందిగా రాజు కోరాడు.

బాలిక : రాజా పాలలో నుండే వెన్న వస్తుందని మీరు నమ్ముతారా?

రాజు : నమ్ముతాను.

బాలిక : అయితే ఈ పాలలో ఉన్న వెన్నను చూపించగలరా?

రాజు : పాలలో వెన్న అంతటా వ్యాపించి ఉంది.

బాలిక : అలాగే సకల చరాచరాలలో నిగూఢంగా వ్యాపించి ఉన్నాడు దేవుడు. దేవుడు లేని చోటు లేదు.

దేవుడేవైపు చూస్తున్నాడు? రెండవ ప్రశ్నకు సమాధానం చెప్పవలసిందిగా కోరాడు రాజు

బాలిక : మహారాజా వెలుగుతున్న ఆ దీపం ఏవైపు చూస్తున్నదో చెప్పగలరా?

రాజు : దీపం అన్ని వైపులా చూస్తుంది.

బాలిక : దేవుడు సర్వాంతర్యామి. ఆయన చూపు పడని దిక్కు ఉండదు. సమస్తం ఆయన పరిశీలనలోనే నడపబడుతూ ఉంటుంది. కాబట్టి దేవుడన్ని వైపులా చూస్తూ ఉంటాడు.

ఇక మూడవ ప్రశ్న - దేవుడు ఇపుడు ఏం చేస్తున్నాడు? సమాధానం కోరాడు రాజు.

బాలిక : దేవుడు రాజును సింహాసనం నుండి క్రిందికి దించాడు. ఒక అమాయకురాలిని సింహాసనంపై కూర్చుండ బెట్టాడు.

అత్యంత ప్రతిభతో రాజుగారి సందేహాలను చక్కగా నివృత్తిచేసిన ఆ బాలికను సభాసదులంతా మెచ్చుకున్నారు. ఆమెను ఘనంగా సన్మానించదలచాడు రాజు.

అందుకు ఆ బ్రాహ్మణ బాలిక వినయంగా తిరస్కరిస్తూ తాను సభకు ఎందుకు? ఎలా వచ్చిందో వివరించింది. బాల్యంలోనే గొప్ప ప్రతిభను కనబరచి నందులకు ఆ బాలికనూ, ఆ బాలికకు ఆశ్రయమిచ్చి పోషించుచున్నందులకు పురోహితుడినీ మహారాజు ఎంతగానో మెచ్చుకొని బహుమతులిచ్చి పంపాడు.

No God No Life - Know God Know Life
God is No Where - God is Now Here

సృష్టిని విమర్శించే స్థాయి మనిషికి లేదు

ఒక గ్రామంలో ఒక ఉపాధ్యాయుడుండేవాడు. అతడు గణిత శాస్త్రంలో ఎంతో ప్రావీణ్యాన్ని సంపాదించుకున్నాడని అతని బట్టతల చెప్పకనే తెలియ చెబుతుంది.

ఒకరోజు ఏదో ముఖ్యమైన పనిమీద పొరుగూరికి పోదలచి, కాలినడకన పోతూ ఉన్నాడు. మిట్ట మధ్యాహ్న సమయం, ఎండ చాలా తీక్షణంగా ఉంది. వెంట గొడుగునుకూడా తీసుకెళ్ళలేదు. పైగా అతడిది బట్టతలాయే!

ఇక ఎండ వేడిమికి తట్టుకొనలేక కొంచెం సేపైనా ఏ చెట్టుక్రిందనో విశ్రమించకపోతే వడదెబ్బ తగిలే పరిస్థితి రావచ్చునని తలచాడు.

ఈ విపత్కర పరిస్థితిలో అతనికి అల్లంత దూరంలో ఒక పెద్ద చెట్టు కనిపించగా, పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది. దాని నీడలో సేద తీరాలని త్వరత్వరగా నడక సాగించి చెట్టును సమీపించి చూడగా, అదొక బ్రహ్మాండమైన మర్రి వృక్షం. పచ్చగా, చిక్కగా ఉన్న ఆ చెట్టు నీడలో కాసేపు కూర్చొని తర్వాత వెల్లికిలా పడుకున్నాడు.

వెల్లికిలా పడుకొని ఉన్న గణితోపాధ్యాయుడు, శాఖోపశాఖలుగా, దట్టంగా. విశాలంగా విస్తరించిన ఆ మర్రి వృక్షాన్ని తదేకంగా పరిశీలనా దృష్టితో చూస్తూ... విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఇంతలో అతని చూపు అతి చిన్నవిగా ఉన్న మర్రికాయలపైన పడింది. వెంటనే అతడు తనలో ఈవిధంగా తర్కించసాగాడు. ఈ చెట్టును సృష్టించిన దెవరు? దేవుడే కదా? మరి దేవునికి లెక్కల విషయంలోఅనుభవం లేదా? అసలు

దేవునికి గణిత శాస్త్రంలో పరిచయమున్నదా? ఉండకపోవచ్చును! లేకపోతే ఇంత పెద్ద వృక్షానికి అంత చిన్నకాయలా? ఈ విధంగా పెట్టడం ఏ మాత్రమూ సమంజసంగా లేదు. రామరామ! సన్నని గుమ్మడి తీగకే దాదాపు 3, 4 కేజీల బరువుగల పెద్ద గుమ్మడికాయలను ఏర్పాటు చేసిన భగవంతుడు ఇంత పెద్దమర్రి చెట్టుకు ఎంత పెద్ద మర్రికాయలను ఏర్పాటు చేసి ఉండాలి? కనీసం పది పన్నెండు కేజీల తూకం గల మర్రికాయలను తగిలించి ఉండాలి.

భగవంతునికి నిష్పత్తి-అనుపాతం కూడా బొత్తిగా తెలియదు కాబోలు!. తెలిసి ఉండినట్లయితే ఇలాంటి పొంతన లేని పని చేసి ఉండడు. అని తన గణిత శాస్త్ర పాండిత్యానికి తానే మురిసిపోతూ, తను ప్రయాణించవలసిన విషయం గుర్తుకు వచ్చి బయలుదేరుదాము అనుకుంటుండగా.....

గాలి జోరుగా వీచి, ఒక చిన్న మర్రికాయ చెట్టుపై నుండి సరిగా గురి చూచి కొట్టినట్టు ఆ గణితోపాధ్యాయుని నడినెత్తిన సూటిగా ఠపీమని పడింది. వేగంగా పడినందున కాయ చిన్నదైనప్పటికీ దెబ్బ మాత్రం చురుగ్గానే తగిలింది. బుర్ర గింగురుమనడం, ఉపాధ్యాయుడు అబ్బా! అనడం ఒక దాని వెంట మరొకటి జరిగిపోయింది.

భగవంతుని సృష్టి రచనలోని లోపాలను వెదుకుతూ, తన శాస్త్ర ప్రావీణ్యతకు మురిసిపోతూ ఉండిన ఉపాధ్యాయుడు తెప్పరిల్లుకొని బుర్రగోక్కుంటూ, అబ్బ! ఎంతటి ప్రమాదం తప్పింది? చిన్న మర్రికాయకే నా బుర్ర గింగురుమనిందే? నేను ఊహించినట్లుగా, నా గణిత శాస్త్ర పాండిత్యానికి తగినట్లుగా పది కేజీల బరువు గల కాయే గనుక ఈ వృక్షానికి ఉండియుండినచో నా ప్రాణ పక్షి ఎప్పుడో పరలోక ప్రయాణం చేసి ఉండేది కదా? !

ఆహా! భగవంతుడు ఎంతటి చమత్కారుడు? మహా వృక్షము కాబట్టి ఎందరో బాటసారులు నాలాంటివారు దాని క్రింద విశ్రమించుటకు వస్తారని తెలుసు కాబట్టే ఆ భగవంతుడు చిన్న కాయలను ఆ చెట్టుకు ఏర్పాటు చేశాడు. భగవంతునికి గణిత శాస్త్రమునందే కాదు, నీతి శాస్త్రమునందుకూడా చక్కని ప్రావీణ్యత ఉన్నదని గ్రహించి, భగవంతుడిని తప్పు పట్టినందులకు క్షమించమని .ఆ దేవుడిని ప్రార్థించి, లెంపలు వేసుకొని తన దారిన తాను వెళ్ళాడు.

భగవంతుని సృష్టి అర్థవంతమైనది - మనకు మాత్రమే అర్థము కానిది.

ఒక సాధువు బావిలో స్నానం చేసి గట్టుమీదికొచ్చి వస్త్రాలు ఆరవేసుకుంటూ ఉండినాడు. ఇంతలో పల్లె పిల్లలు వచ్చి గబాగబా బావిలోకి దూకి కేరింతలు కొట్టడం మొదలుపెట్టారు. ఒక గ్రుడ్డి పిల్లవాడు గట్టుమీద కూర్చుని ఏమీ చూడలేక పోయినా తన స్నేహితులు వేసే కేకలూ, ఈలలూ విని... వాడుకూడా కేకలు వేస్తూ, ఈలలు వేస్తూ ఆనందిస్తూ ఉన్నాడు.

ఆ దృశ్యాన్ని చూచిన ఒక బాటసారి ఈ పిల్లవాడికి కూడా చూపు ఉండివుంటే ఎంత బాగుండేది? వారితోకూడా కలిసి ఆనందించి ఉండేవాడు కదా? భగవంతుడెంతటి నిర్దయుడో కదా! చూడండి అని-ఆ బాలుడివైపు చూపిస్తూ ఆ సాధువుతో అన్నాడు.

భగవంతుని సృష్టినే తప్పుపట్టిన ఆ బాటసారి మాటలకు నొచ్చుకున్న సాధువు బాటసారితో "దయామయుడైన భగవంతుడు ఎందుకు ఆ బాలునికి చూపు ఇవ్వలేదో తెలిసి ఉంటే ఇలా మాట్లాడేవాడివి కాదు". అలా ఎప్పుడూ మాట్లాడవద్దు అన్నాడు. అదెలా స్వామీ? అని ఆశ్చర్యపోతూ అన్నాడు ఆ బాటసారి. సరే చూడు అని ఆ బాలుని ముఖంపైన అలా స్పృశించాడు ఆ సాధువు. అంతే ఆ బాలునికి చూపు వచ్చేసింది. చూపు వచ్చిన ఆ బాలుడు ఆనందంతో ఈదులాడితే పరవాలేదు. మంచిదే కాని, అందరినీ నీళ్ళలో ముంచుతూ, కాలితో తన్నుతూ, బూతులు తిడుతూ, బావిలోని పిల్లలను సతాయిస్తూ, పైశాచిక ఆనంద తాండవం చేస్తున్నాడు. వాడి ధాటికి తట్టుకోలేక పిల్లలందరూ బైటికి వచ్చేశారు.

ఈ దృశ్యాన్ని చూచిన బాటసారి బాధపడుతూ, పశ్చాత్తాపంతో స్వామీ! మీరు వీడికి ప్రసాదించిన చూపును వెనుకకు తీసుకోండి. వీడొక్కడి వల్ల ఎంతమంది బావి నుండి బైటికి వచ్చేశారో చూడండి! ఇలాగే వీడు సమాజంలోకి వెళితే మరెంతోమంది అశాంతికి లోనయ్యే ప్రమాదముంది అని ప్రార్థించాడు. అలాగే చేశాడు ఆ సాధువు.

భగవంతుని సృష్టి రహస్యాన్ని తన అలౌకిక శక్తి ద్వారా చూపించిన సాధువు యొక్క దివ్యశక్తికి ముగ్ధుడైనాడు బాటసారి. భగవంతుని మహిమను కళ్ళారా చూచినందున భక్తుడై, సాధువుకు శిష్యుడై సాధువునే అనుసరిస్తూ వెళ్ళాడు ఆ బాటసారి.

సద్గురువుల సంకల్ప శక్తి

జగద్గురువు ఆది శంకరాచార్యుల వారి శిష్యులలో గిరి అను పేరుగల శిష్యుడుండేవాడు. గురువుగారి వస్త్రాలను ఉతకడం, ఆరవేయడం, స్నానం, పూజ లాంటి దైనందిన నిత్య కర్మలలో గురువుగారికి కావలసిన సదుపాయాలు సిద్ధం చేయడం, కావలసిన వస్తు సామగ్రిని సమకూర్చడం, ఎళ్ళవేళలా గురువుగారికి నీడలా ఉండి అన్ని జాగ్రత్తలూ చూచుకోవడం, ఇలాగే గురువుగారికి అన్ని విషయాలలో తలలోని నాలుకలాగా ఉంటూ శుశ్రూష చేయడంలోనే అతనికి భక్తిశ్రద్ధలు ఎక్కువగా ఉండేవి. అందుచేత గిరి చదువులో అందరికంటే వెనుకబడి ఉండేవాడు.

ఒకరోజ శిష్యుడు గిరి తప్ప అందరూ ఉపస్థితులై గురు బోధ కోసం వేచి ఉన్నారు. పాఠాలను ప్రారంభించే వేళ అయినప్పటికీ, శిష్యుడు గిరి ఒక్కడు రానందున గురువుగారు మౌనంగా ఉన్నారు. సమయం మించిపోతున్నందున శిష్యులందరూ శాంతి మంత్రం చదవడానికి ఉపక్రమించారు. కాని శంకరాచార్యులవారు, శిష్యులతో మరి కాసేపు ఆగండి, గిరి కూడా వస్తాడు అని వారించారు. అప్పుడు ఒక శిష్యుడు లేచి

నిలబడి, అక్కడ ఉన్న గోడను చూపించి, దానికి చెప్పడమూ, గిరికి చెప్పడమూ ఒక్కటే! అని చెప్పి కూర్చున్నాడు.

చదువులో వెనుకబడిన గిరిపై కరుణ కలిగింది గురువు గారికి. కళ్ళుమూసుకొని గిరి ఎక్కడున్నాడో తెలుసుకున్నాడు. నది ఒడ్డున గురువుగారి బట్టలు ఉతకడంలో నిమగ్నమైపోయి ఉన్నాడు శిష్యుడు. తన సంకల్ప బలంతో గిరికి విద్యలన్నింటినీ ఒక్క క్షణంలోనే అనుగ్రహించాడు గురువు. హఠాత్తుగా దివ్యానుభూతిని పొందిన గిరి ఆదరాబాదరాగా పరిగెత్తుకుంటూ గురువుగారి దగ్గరకు వచ్చాడు. ఆనంద తన్మయత్వంతో గురువుగారి పాదాలకు నమస్కరించి, గురువు యొక్క మహిమను కొనియాడుతూ ఆశువుగా శ్లోకాలు వల్లించాడు. మొద్దబ్బాయిలాగా ఉండిన గిరి ఇలా హఠాత్తుగా ధారాళంగా శ్లోకాలను వల్లించడాన్ని చూచి మిగతా శిష్యులంతా ఆశ్చర్యంతో అవాక్కైపోయారు. సద్గురువులయొక్క సంకల్ప బలం అలా ఉంటుంది.

చైతన్య స్ఫూర్తి

ఆరోగ్యవంతమైన, దృఢమైన శరీరంతో, నిశ్చలమైన మనసును, నిర్మలమైన బుద్ధిని కలిగి, అవసరం వచ్చినా, అవకాశం దొరికినా, అధికార పగ్గాలు చేతికి వచ్చినా, విచక్షణను కోల్పోకుండా, కష్ట సుఖాలలో చలించకుండా, స్పందించవలసిన సమయంలో సరి అయిన రీతిలో స్పందించి దీర్ఘకాలికమైన, శాశ్వతమైన విలువలను, ఆదర్శవంతంగా సాధించడాన్నే చైతన్యం అంటారు.

ఈ చైతన్యం శ్రీకృష్ణునిలోనూ, స్వామి వివేకానందునిలోనూ, భగవాన్ బుద్ధునిలోనూ, మరి కొందరు పురాణ పురుషులలో సంపూర్ణంగానూ, మహాత్మాగాంధీ గారిలో పాక్షికంగా ఉన్నట్లు వారి జీవిత చరిత్రలు చదివితే తెలుస్తాయి. చైతన్య స్ఫూర్తిని రగిలిస్తాయి.

ప్రకృతి మాతకు వందనం

జిజ్ఞాసాపరుడైన ఒక రాజు దేశ సంచారం చేస్తూ, ఏ చీకూ-చింతా లేకుండా ఆనందంగా, స్వేచ్ఛగా, నిర్భయంగా సంచరిస్తూ ప్రత్యేకంగా కనిపిస్తూ ఉండిన ఓ వ్యక్తిని చూచి, బాగా పరిశీలించిన తర్వాత ఆ వ్యక్తి దగ్గరికి వెళ్ళి, మహానుభావా! మీరింత ఆనందంగా, స్వేచ్ఛగా, స్వచ్ఛంగా, నిర్భయంగా ఎలా ఉండ లుగుతున్నారు. ఈలాంటి స్థితిని ఎలా పొందగలిగారు? దయచేసి తెలియజేయండి అని వినయంగా అడిగాడు.

"నేను ఆనందంగా స్వేచ్ఛగా ఉండగలగడానికి కారణం జ్ఞానమే!" అన్నాడు ఆ వ్యక్తి. నేనుకూడా చదువుకొని జ్ఞానం సంపాదించాను. అంతులేని సంపద, భోగ-భాగ్యాలు, దాన-దాసీజనం, రాజ్యం ఉండినాకూడా నేను ఆనందాన్ని అనుభవించలేకున్నాను. మీలాగే ఆనందంగా ఉండగల జ్ఞానాన్ని ఏ గురువు వద్ద నేను పొందగలను? మీరు ఎవరి దగ్గర ఆ జ్ఞానాన్ని పొందారు? ఆయన ఎక్కడ

ఉంటారు? అని ప్రశ్నించాడు.

ఈ ప్రపంచంలో నాకు ఎందరో గురువులు ఉన్నారు. ఒక్కొక్కరి దగ్గర ఒక్కొక్క జ్ఞానాన్ని పొందాను. నింగి-నేల, నీరు-నిప్పు, గాలి చంద్రుడు, పశు పక్ష్యాదులు... ఇలా ఎంతో మంది దగ్గర జ్ఞానాన్ని పొందాను. సహనాన్ని, సహజత్వాన్నీ, స్వార్థరాహిత్యన్నీ త్యాగాన్ని, పరోపకారాన్ని, పంచభూతాలను పరిశీలించి నేర్చుకున్నాను.

చంద్రుని కళలు తరుగుతూ-పెరుగుతూ ఉండడాన్ని చూచి మనిషి జీవితంలో కూడా వృద్ధి క్షయాలు తప్పవని తెలుసుకున్నాను. అంతే కాకుండా పూర్ణ చంద్రుడు ఆత్మ స్వరూపమనీ, అమావాస్య చంద్రుడు మనసుకు ప్రతి రూపమనీ తెలుసుకున్నాను. అమావాస్య చంద్రుడు చీకటిని తొలగించుకుంటూ వృద్ధి చెందునట్లుగా - అసూయ, అహంకారం, ఆవేశం లాంటి గుణాలను నిర్మూలించుకుంటూ పోతే చివరికి మనసు పూర్ణ చంద్రునివలె ఆత్మ స్వరూపంగా అవుతుందని తెలుసుకున్నాను. సముద్ర కెరటాలను చూచి, పడటం-లేవటం సహజమని తెలుసుకున్నాను. పశుపక్ష్యాదులు వల్ల, తరు లతాదులవల్ల ఎంతో జ్ఞానాన్ని పొందాను. కొన్నింటి దగ్గర ఎలా ఉండాలో నేర్చుకున్నాను. కొన్నింటి దగ్గర ఎలా ఉండకూడదో నేర్చుకున్నాను. ప్రకృతిలోని ప్రతి అంశం నుండి నేను గ్రహించిన జ్ఞానం సమదృష్టిని ప్రసాదించింది. ఉదయం సాయం, సంధ్యా సమయాలు అటు చీకటిగానీ, ఇటు వెలుగుకానీ లేకుండా కాషాయ వర్ణంలో అద్భుతంగా ఉంటాయి. అప్పుడు ప్రకృతిలోని సమస్త జీవరాశి చాలా ఆనందంలో ఉంటుంది. దానిని గమనించిన నేనూ అలాంటి చీకటి వెలుగులను సమంగా చూచే దృష్టిని గ్రహించాను. అందువలననే నేను పొంగడం-క్రుంగడం, బాధ-సుఖం అనే భావాలకు అతీతంగా ఉండగలుగుతున్నాను. అదే బ్రహ్మానందం.

నీవుకూడా ప్రకృతిలోని ప్రతి అణువునూ, ప్రతి ప్రాణినీ, గమనించి, ఎలా ఉండవలెనో, ఎలా ఉండకూడదో తెలుసుకోగలిగితే నాలాగే బ్రహ్మానందంలో ఉండగలవు. అందుకు నీవు ఎవరి దగ్గరికీ వెళ్ళనవసరంలేదు. మహర్షులందరూ మొదట ఇలా ప్రకృతి మాతను పరిశీలించే జ్ఞానాన్ని సంపాదించి, లోకానికి అందించారు. ఆ కారణంగానే "ప్రకృతి మాతకు వందనం-వందే జగద్గురుం" అని కృతజ్ఞతా పూర్వకంగా, భక్తి భావంతో జగత్తును గురువుగా భావించి వందనం సమర్పిస్తుంటారు.

కంప్యూటర్‌ను, సెల్‌ఫోన్‌ను, కరెంటును, టి.వి.ని, విమానమును కనుగొన్నవారిని బాగా జ్ఞాపకం పెట్టుకొంటున్నాం. కానీ,- వీరందరినీ, వీరందరూ కనుగొన్న శక్తినీ సృష్టించిన పరమాత్మను మాత్రం విస్మరిస్తున్నాం. ఫలితంగా మానసిక శాంతిని కోల్పోతున్నాం. బాధలకు గురవుతున్నాం.

మృత్యు విలాసం - 9

'జాతస్యహి ధృవోమృత్యుః' పుట్టినవారు గిట్టక తప్పదు. గిట్టినవాడు మరలా జన్మించక తప్పదు. నలిగిపోయిన, అరిగిపోయిన, మలిన వస్త్రాన్ని వదలివేసి, క్రొత్త వస్త్రాన్ని ధరించినట్లే, వడలిపోయి, కృంగిపోయిన దేహాన్ని విడిచి, ఆత్మ క్రొత్త దేహాన్ని వెదుక్కుంటుంది. 'శతమానం భవతి' 'చిరంజీవిగా వంద వసంతాలు వర్ధిల్లాలి! అని పెద్దలు ఆశీర్వదిస్తారు. హఠాన్మరణానికీ, అసహజ మరణానికీ లోనుగాకపోతే, మామూలుగా మనిషి ఆయుర్దాయం వందా ఇరవై సంవత్సరాలు. కానీ మనిషి నవ నాగరిక జీవన విధానంతో తన ఆయువును సగానికి అంటే అరవై సంవత్సరాలకు తగ్గించుకున్నాడు.

ఏదో ఒకరోజు జీవుడు దేహాన్ని విడిచి వెళతాడనే నిజం అందరికీ తెలుసు. ఎవరూ ఆపలేని, ఎవరు నడుపుతున్నారో తెలియని, ఎపుడు ఆగిపోతుందో అంతు చిక్కనిది కాలం. ఈ కాలచక్రంలో చావు-పుట్టుకలు అతి సహజం. ప్రకృతిధర్మం.

మృత్యువు సమీపించిన వ్యక్తికి ప్రాణం వదిలే సమయంలో ఉండిన మనోభావాలు, బలమైన కోరికలననుసరించీ, చేసిన పాప-పుణ్యాలననుసరించీ, ఉత్తమ, మధ్యమ, అధమ గతులు ప్రాప్తిస్తాయని ఆర్యవాణి చెబుతుంది. అందుకోసమే మరణశయ్యపై ఉన్న వ్యక్తిచుట్టూ బంధువులు, భక్తులు గుమికూడి, భజనలు, కీర్తనలు చేస్తే వాటిని వింటూ శాంతంగా మరణించి, ఉత్తమ గతులు పొందుతాడని ఆశిస్తారు. కానీ అదంతా వట్టి భ్రమ మాత్రమే. ప్రాణం వదలడానికి సిద్ధంగా ఉన్న జీవునికి బయటి వ్యక్తులు చేసే ఆర్భాటాలు, చూపించే తాపత్రయాలు ఏమీ పట్టవు. మన మాశించినట్లుగా మరణశయ్యపై నున్నవాడు మన స్పృహలో ఉండడు. అతని పంచప్రాణాలు, పంచేంద్రియాలతో కలసి శరీరాన్ని వదలడానికి సిద్ధంగా వాటి పనిలో అవి నిమగ్నమై ఉంటాయి. భార్యాబిడ్డలు, బంధు-మిత్రాదులు అతని చెవిలో "నారాయణ, నారాయణ" అంటారు. కానీ ఆ జీవునికి వినిపించదు. మరికొందరు ఆ జీవుని చూపు ఎటువైపుందో అక్కడ ఇష్టదైవ చిత్ర పటాన్ని పెట్టినట్లయితే, ఆ చిత్ర పటాన్ని చూస్తూ సద్గతి పొందుతారన్నది ఒక నమ్మకం. కానీ అదంతా వారి అమాయకత్వమే. మరణశయ్యపై ఉన్నవాడికి ఈ ప్రయత్నాలు ఏమీ కనిపించవు, వినిపించవు. ఆ జీవుని మనో ఫలకంపై ఎలాంటి ఆలోచనల ముద్రలు బలంగా ఉండి ఉంటాయో, వాటి ప్రభావం ప్రకారం వాడి చూపు ఉంటుందే కానీ, మరోలా ఉండే అవకాశం ఏమాత్రమూ లేదు.

ఇలాంటి సందర్భాలలోనే అనుభవజ్ఞులు ఉదాహరణగా కొన్ని సంఘటనలను ఇలా చెబుతూ ఉంటారు.

నార కాదు పీచు

మరణశయ్యపై ఉన్న తమ తండ్రి కడచూపు కోసం కొడుకులు, కూతుళ్ళు, బంధువులు వచ్చారు. బ్రతికినంతకాలం పిసినారిగా బ్రతికాడు. ఎలాంటి పుణ్యకార్యాలూ చేయలేదు. ఏనాడూ దైవనామస్మరణ కూడాచేసి ఎరుగడు. కనీసం ఇప్పుడైనా దైవనామాన్ని పలికించాలని ప్రయత్నించారు. కానీ అతను పలకలేకపోయాడు.

అంతలో ఒక కుమారుడు సమయస్ఫూర్తిగా 'నార'ను తెప్పించాడు. దానిని తండ్రికి చూపిస్తూ, ఇదేమిటో చెప్పునాన్నా! అని ప్రేమతో అడిగాడు. తండ్రి 'పీచు' అన్నాడేగానీ కనీసం 'నార' అని కూడా అనలేక ప్రాణం వదిలాడు.

'నారాయణ' అనే నాలుగక్షరాల మాటకూడా అనలేకపోయినా, కనీసం అందులో 'నార' అనే రెండక్షరాలనైనా పలికించాలన్న ఆశ వృధా ప్రయాసే అయ్యింది కదా? అని బాధపడ్డాడు, ఆ పితృభక్త పరాయణుడు.

వ్యామోహం

ఒక శెట్టి తన అంత్యకాలం సమీపించిందని తెలుసుకొని, తన ఆరుగురు కుమారులను పిలిపించమని ఆజ్ఞాపించాడు. భార్య అందరికీ కబురంపింది. అందరికంటే చిన్నవాడు తండ్రి దగ్గరే ఉంటూ అంగడిలో కూర్చొని వ్యాపారం చేస్తూ, చేదోడువాదోడుగా ఉండేవాడు. అందరూ వచ్చారు కానీ, అమెరికాలోఉంటున్న మూడవ కొడుకు మాత్రం రావడానికి వారం రోజులు పట్టింది. ఈలోగా శెట్టి ఆరోగ్యం మరింత క్షీణించింది.

ఎలాగైతేనేం మూడవవాడుకూడా వచ్చాడు. అందరూ విచార వదనంతోతండ్రి చుట్టూ చేరారు. కళ్లు మూసుకొని ఉన్న తండ్రిని నెమ్మదిగా తట్టి, లేపి, నాన్నా! చూడు ఎవరొచ్చారో? అని ప్రేమతో అడిగారు. కళ్ళు తెరచిన తండ్రి అందరివైపు తేరిపారచూస్తూ, "అందరూ ఇక్కడే ఉన్నారా?" అని అడిగాడు. 'ఔను' అని అన్నారు. ఉత్సాహంగా.

అందరూ ఇక్కడే ఉంది ఛస్తే ఎలారా? ఎవడో ఒకడు అంగడి దగ్గర ఉండి చావండి అని అతికష్టం మీద అంటూ ప్రాణం వదిలాడు. చివరి దశలో కూడా తండ్రికి వ్యాపారం మీద వ్యామోహం పోలేదని అందరూ విస్తుపోయారు.

పుట్టిన ప్రతిప్రాణీ గిట్టక తప్పదు. ఈ సత్యం తెలిసినప్పటికీ అదంటే అందరికీ చచ్చేంతభయం. మృత్యువు నిష్పక్షపాతంగా అతి కఠినంగా కాస్త వెనుకా - ముందు కానీ, ఒక్కోసారి మూకుమ్మడిగా గానీ తన చల్లని బాహువులతో కౌగిలించుకొని తనలో లీనం చేసుకుంటుంది.

వీలైతే అందరూ చావునుండి తప్పించుకోవాలనుకుంటారు. ప్రలోభపడినట్లయితే మృత్యు దేవతకైనా లంచం ఇవ్వజూపుతారు ఈ మనుషులు. మరణం అనేది రాకుండా, అమరులుగానే ఉండాలని కోరుకుంటారు. కానీ దానికి వ్యతిరేకంగానే పామరులుగా జీవిస్తూ, చచ్చేదాకా భయపడుతూ చస్తూ ఉంటారు.

చీము - రక్తం కారుతూ, ఈగలు వాలుతూ తన వొళ్లే తనకు అసహ్యంగా ఉన్నప్పటికీ, చావునుండి తప్పించుకోవాలనీ, మరికొంత కాలం బతకాలనీ ఆశపడుతూనే ఉంటాడు కుష్టిరోగి. ఉబ్బసరోగి-దగ్గుతూ, దగ్గలేక యమయాతన అనుభవిస్తూ ఉన్నప్పటికీ, చావంటే భయపడుతూ... "దినదిన గండంగా,అందరికీ భారంగా, అసహ్యంగా, ఈసడింపులతో బతికేకంటే... చస్తేనే నయం" అని ఊరకనే పైపై మాటలు అంటూ ఉంటాడేకానీ, చచ్చేటంత వరకూబతకాలని ఆశే!

మరణం ఒక వాస్తవం. అది ప్రకృతి ధర్మం. దానిని ప్రతిఘటించడం, చిరకాలం జీవించి ఉండాలని ఆశించడం-ప్రకృతి విరుద్ధం, మూర్ఖత్వం. సహజ మరణాన్ని ఆనందంగా ఆహ్వానించడమే మన కర్తవ్యం.

బ్రతికిన బ్రతుకుననుసరించి, జీవించిన విధానాన్ని బట్టి, ఇలా అంటారు...

పాపాత్ముడు :- చచ్చాడు.

పుణ్యాత్ముడు - మరణించాడు, కాలం చేశాడు, కాలధర్మంచెందాడు, పుణ్యలోకాలను చేరుకున్నాడు.

సైనికుడు, దేశభక్తుడు:- వీరమరణం పొందాడు, అమరుడైనాడు.

భక్తుడు, సన్యాసి, యోగి:- నిర్యాణం చెందాడు, జీవసమాధి అయ్యాడు, భగవంతునిలో ఐక్యం చెందాడు, కైవల్యం పొందాడు.

మనిషికి చాలాకాలం బతికుండాలని ఆశ. 'పాపిచిరాయుః' అని అన్నారు కదా? చాలాకాలం బ్రతకాలంటే పాపాలు చేయవలెనేమో! అనుకునే ప్రమాదమూ ఉంది.

* అందరిచేత దూషింపబడుతూ, చుట్టూ ఉన్నవారికి విశ్రాంతి, మనశ్శాంతి లేకుండా చేస్తూ, వాతావరణాన్ని కలుషితం చేస్తూ...చాలాకాలం బ్రతికే కంటే, అందరిచేత 'మంచి' అనిపించుకుంటూ, కొద్దికాలం జీవించినా - అదే మనిషి జన్మకు సార్థకం.
* వృద్ధాప్యంలో వ్యాధులతో, బాధలతో, దుఃఖాలతో మరికొంత కాలం బ్రతకాలని ఆరాటపడుతూ, పోరాటంసాగిస్తూ, అనవసరంగా వైద్యానికి ఖర్చులు చేయిస్తూ కుటుంబ సభ్యులను ఇక్కట్లపాలు చేసేదానికంటే, సహజమైన మరణం వస్తే సంతోషంగా, హృదయపూర్వకంగా అందుకు సిద్ధపడడమే ధర్మం, ఆదర్శం.
* అజేయమైన వరాలు పొందిన అసురులు కూడా అంతిమసత్యమైన మృత్యువుకు ఆహుతి కాక తప్పలేదు.
* దైవనామ స్మరణం, మననం, భజన, పుణ్య కార్యాలు, సదాలోచన, సత్కర్మలవైపు మనసును మళ్లించి అభ్యాసం చేయలగలిగే వారికి మరణం శాపం కాదు. ఉత్తమ గతిని పొందే వరం కాగలదు. అదే 'మృత్యుసిద్ధి'.

శాస్త్రజ్ఞులు కూడా ఎన్నో నూతన విషయాలను కనుగొంటున్నప్పటికీ, ఎన్నో పరిశోధనలు చేస్తున్నప్పటికీ, ప్రాణం పోకడ - రాకడను మాత్రం ఎవరు కనుగొనలేక పోతున్నారు. అది భౌతిక వాదుల మేధకూ, నాస్తికుల తర్కానికీ అంతుచిక్కని అంశం.

ఆధ్యాత్మిక వేత్తలు మాత్రం యోగ విద్య ద్వారా "ప్రాణం" అనే దాన్ని కనుగొన్నారు. అదేమిటో, ఎలా? ఎప్పుడు? ఎక్కడికి? వెళుతుందో కూడా వివరించగలిగారు.

'జీవసమాధి' అయినవారు సాహసోపేతంగా, ముందస్తుగనే ఏర్పాట్లు చేసుకోవడం ఒక ప్రమాణం. ఫలానా సమయానికి ఇచ్ఛా మరణాన్ని పొందుతామని ప్రకటించి, బ్రహ్మరంధ్రం ద్వారా ప్రాణశక్తిని ప్రకృతిలోకి పంపిన పరమయోగీశ్వరులు కూడా ఒక ప్రమాణం.

మృత్యువు ఆనందదాయకమే కానీ, దుఃఖదాయకం కాదు అని ఆధ్యాత్మిక జ్ఞానం నొక్కి చెబుతుంది. దీనికి ప్రత్యక్ష ప్రమాణం ఎందరో ఆధ్యాత్మిక వేత్తల, భక్తుల, సన్యాసుల, యోగుల, ఋషుల జీవన మార్గమే.

భక్త ప్రహ్లాదుడు తనతండ్రి విధించిన మరణ దండనలన్నింటినీ హృదయ పూర్వకంగా చిరునవ్వుతో ఆహ్వానించాడు.

భీష్ముడు తన శరీరాన్ని మరణశయ్యపై ఉంచి, బుద్ధిపూర్వకంగా ఉత్తరాయణ కాలం సమీపించినంతవరకూ, తన ప్రాణాలను నిలిపి ఉంచుకొని, తర్వాత ఇచ్ఛామరణాన్ని పొందాడని మహాభారతం తెల్పుతుంది. అలాగేమహర్షి దయానంద సరస్వతి 1883వ సంవత్సరం దీపావళి పర్వదినాన శిష్యులనందరినీ పిలిపించుకొని. శరీర దహన క్రియలకు కావలసిన ఏర్పాట్లన్నీ చేయించుకొని, స్నాన-సంధ్యాది అనుష్ఠానాలను పూర్తి చేసి భగవంతుని స్మరిస్తూ, పరమానందంతో శరీరము నుండి ప్రాణాలను విడిచిపెట్టాడు.

పరమ భక్తురాలు మీరాబాయి బంధువులిచ్చిన విషాన్ని ఎంతో హాయిగా, ఆనందంగా స్వీకరించింది. పరమయోగి వీరబ్రహ్మంగారు లాంటి ఎందరో యోగులు, ఋషులు జీవసమాధి చెందినట్లు అనేక ప్రమాణాలున్నాయి. ఆధ్యాత్మిక జ్ఞానంతో, సాధు జీవనంతో అమరత్వాన్ని సాధించవచ్చునని యోగ విద్య చెబుతున్నది.

అవసానదశలో మొట్టమొదట-మాట (పలుకు) మనసులో లీనమైపోతుంది. అందుకే మరణశయ్యపై నున్నవాడు మాట్లాడాలనుకొని ప్రయత్నించినా, తన మరణానుభవాన్ని చెప్పలేడు.

తర్వాత చూపు(దృష్టి) మనసులో కలసిపోతుంది. తర్వాత వినికిడి శక్తి మనసులో లయమైపోతుంది. చిట్టచివరగా ప్రాణం పోయేటపుడు, మనసు ప్రాణంతోకలసి నవరంధ్రాలలోని ఏదో ఒక రంధ్రం ద్వారా బైటికి వెళ్లి, విశ్వంలో కలసిపోతుంది.

మనం వదలిన గాలి (శ్వాస), అపానవాయువు (పిత్తు), మన శరీరంనుండి వదలబడిన స్వేదం(చెమట), కన్నీరు-ప్రకృతిలో ఎలా కలసిపోతాయో; వాన చినుకు సముద్రంలోపడి ఎలాగా సముద్రం అయిపోతుందో, అలాగే ప్రాణం (ఊపిరి+మనస్సు)

ప్రకృతిలో కలసిపోతుంది. నాడి కొట్టుకోవడం నిలిచిపోతుంది. శరీరం చల్లబడిపోతుంది. అపుడు అందరూ.. ప్రాణం పోయింది. అని నిర్ధారిస్తారు. బంధువులందరికీ కబురు చేయండి, తదుపరి కార్యక్రమాలు చేసుకోండి. చివరి చూపుకోసం శవాన్ని బయటపెట్టండి అంటారు.

కొంతమంది గుండె ఆగి మరణిస్తారు. దాన్నే హార్ట్ అటాక్ అంటారు. గుండె ఆగిపోయిన మనిషిని వెల్లికిలా పడుకోబెట్టి రొమ్ముపై పిడికిలితో గట్టిగా అదరగొట్టడం ద్వారా, మర్ధించడంద్వారా, ఆగిపోయిన గుండె మరలా కొట్టుకొని బ్రతుకుతాడన్న ఆశతో కొందరు ప్రయత్నిస్తారు.

మరికొందరు ముక్కు రంధ్రాలను మూసి, నోట్లో నోరుపెట్టి గట్టిగా గాలి ఊదుతారు. అలా చేస్తే ఆగిన గుండె మరలా కొట్టుకొని శ్వాస ఆడుతుందని ఆశ. కానీ ఆ ప్రయత్నంకూడా దాదాపుగా విఫలమవుతుంది. ఎందుకంటే... మరణించబోయే ముందుగా, భయంవలన రక్తప్రసరణలో మార్పువచ్చి, మలం, మూత్రం, పిత్తం, శ్లేష్మం మొదలగునవి శరీరం నుండి విడుదలై నవరంధ్రాలను మూసివేస్తాయి. గల్ల-జొల్లు రూపంలో గొంతును, చీము-రక్తం రూపంలో చెవులను, చీమిడి రూపంలో ముక్కు రంధ్రాలను మూసివేసి, ఊపిరి ఆడనివ్వకుండా చేస్తాయి. అందుకే కొంతమందికి ప్రాణం పోయేటప్పుడు 'గురక' వస్తూ ఉంటుంది. మరికొంతమందికి ప్రాణం సునాయాసంగా పోతుంది.

అందుకే చాలా సందర్భాలలో మరణించిన వారి ముక్కు రంధ్రాలలో చెవులలో దూది పెడుతూ ఉంటారు. నోటినుండి జొల్లు కారకుండా ఉండేందుకు నోరు మూతపడి ఉండేటట్లుగా తెల్లని బట్టతో-పట్టీలాగా కడతారు. మరికొందరు తాంబూలం(వక్కాకు) నోటిలో పెడతారు.

'దింపుడు కల్లం' ఆశ అని మరో తంతుకూడా ఉంది. శ్మశానానికీ, ఇంటికీ మధ్యలో ఒకచోట శవాన్ని దింపి, మరణించిన వాడికి ఎవరిపై అధికంగా ప్రేమ ఉంటూ ఉండినదో వానిచేత గట్టిగా "తాతాలెయ్" అనో, "నాన్నా లెయ్" అనో, "అమ్మా లెయ్" అనో గట్టిగా చెవిదగ్గర అనిపిస్తారు, పిలిపిస్తారు, విఫలయత్నం చేస్తూ ఉంటారు.

గాఢమైన నిద్రలో ఉన్నవాడు పిలిచినా పలకడు, కదిలించినా లేవడు. అలాంటి అరుదైన సందర్భాలలో పొరపాటుగా చచ్చాడనుకొని, స్మశానానికి తీసుకొని వచ్చింటే శరీరానికి చురుకు తగిలితేనో, గట్టిగా శబ్దం వినబడితేనో ఉలిక్కిపడి లేచి కూర్చొనే దానికి అవకాశం ఉంటుంది. అంతేగానీ నిజంగా చచ్చినవాడు పిలిచినా పలకడు, ఎత్తికుదేసినా లేవడు.

శ్రాద్ధకర్మలు అవసరమా?

చేరెడు నీళ్లను, కొన్ని నువ్వులను చేతిలోకి తీసుకొని క్రిందికి విడవడాన్ని తర్పణం వదలడం అనీ, మూడు ముద్దల అన్నాన్ని విస్తరిలో పెట్టి మరణించిన వారి

ఆత్మలు శాంతించాలనీ, వారి ఆత్మలకు ఉత్తమ గతులు ప్రాప్తించాలనీ కోరుకుంటూ పరమాత్ముని ప్రార్థించడాన్ని శ్రాద్ధ కర్మలు అంటారు.

చనిపోయిన వారి ఆత్మలు పరలోకంలో ఉంటాయనీ, అవి మరలా జన్మిస్తాయనీ విశ్వసించడంవలననే ఈ శ్రాద్ధకర్మలను ప్రతి సంవత్సరం తద్దినాలు అనీ, వార్షికం, సాంవత్సరీకం అనీ చేస్తూ ఉంటారు.

బ్రతికి ఉన్న వృద్ధులతో, చికిత్సపొందుతూన్న వారితో మీరు మరణించాక మేము ఎంతో ఆర్భాటంగా పిండాలు పెడతాం, తర్పణాలు వదులుతాం, మీ పేరుమీద దాన-ధర్మాలు చేస్తాం, అనాధ శరణాలయాలు, పాఠశాలలు కట్టిస్తాం, మీ ఫోటోలకు దండలు వేసి, దండాలు పెడతాం, మీ విగ్రహాలను స్థాపిస్తాం. మీరు ఎలాంటి దిగులూ పెట్టుకోవద్దండి. ఆవేదన చెందకండి అని చెప్పి చూడండి ! వారి వద్దనుండి ఎలాంటి సమాధానం వస్తుందో !

నాయనా! మేము చచ్చాక, మీరు మాకోసం ఏమి చేస్తే ఏంప్రయోజనం? ఎవరికి లాభం? ఎవరు చూడొచ్చారు! బ్రతికున్న మా అవసరాలను శ్రద్ధగా గమనించి, కాస్తంత ప్రేమ, ఆదరణలతో మా బాగోగులు చూస్తే అదే భాగ్యం అనుకుంటాం. మమ్ములను చిన్నచూపు చూడకుండా, అసహ్యించుకోకుండా మీలో ఒకరుగా చూస్తే చాలు అని ఎంతో ఉద్వేగంతో చెబుతారు.

ఇలా సామాన్య మానవులుగా బ్రతికి ఉన్నపుడే, మరణానంతరం చేసే కర్మకాండలను తిరస్కరించినవారు. పరమాత్మలో కలిసిపోయిన తర్వాత, ఏదో మొక్కుబడిగా, స్వార్ధంతోచేసే కర్మకాండలను చూడాలని వారి ఆత్మలు ఆశిస్తాయా? ఆసక్తి చూపుతాయా?

చేసిన పాప - పుణ్యాలననుసరించి ఉత్తమ, మధ్యమ, అధమ జన్మల దేహాలలోకి ఆత్మలు ప్రవేశించివుంటాయి. అంతేకానీ ఇక్కడ మన ఇంటిలోనో, ఏ నది ఒడ్డునో కూర్చొని పెట్టే ముష్టి మూడు ముద్దల పిండాల కోసం, తర్పణంగా వదిలే చేరెడు నీళ్ళకోసం ఆత్మలు ఎదురు చూస్తూ ఉంటాయా? పై నుంచి తొంగి చూస్తూ ఉంటాయా?

మన అభివృద్ధికోసం పాటుబడి, జీవించి, మరణించిన కుటుంబ పెద్దలను, మన ప్రేమాభిమానాలను చూరగొన్న వారి చిత్రపటాలను, విగ్రహాలను దర్శించు కుంటూ, వారి ఆదర్శాలను, అనుభవాలను, చేసిన సేవలను స్మరించుకుంటూ, భావితరాలవారికి ఆదర్శంగా జీవించడం మంచిదే. కానీ, వారు జీవించి ఉండగా శ్రద్ధ కనబరచకుండా చనిపోయిన తర్వాత శ్రాద్ధ కర్మల పేరుతో విందు భోజనాలారగించేటందుకు - అదొక వేడుకగా, వేదికగా చేసుకోవడం ఎంతమాత్రం ఆమోదయోగ్యమైనది కాదు.

మరి ఈ శ్రాద్ధ-కర్మల తంతు ఎలా వచ్చింది ?

పేదరికం వలననో, మరేవైనా కారణాల వలననో బతికున్న మాతాపితరులపై శ్రద్ధ చూపించలేకపోయినవారు-తర్వాత సంపన్నులైనపుడు, సంపదను ఖర్చు పెట్టించేదానికి, కొందరు తెలివైన వర్గం వారు స్వార్థంతో తమ పబ్బం గడుపుకోవడానికి ఇచ్చిన సలహాగా, అందుకై విందులారగించి ధన, కనక, వస్తు, వాహనాది బహుమతులను పొందేదానికి ప్రవేశపెట్టిన ఒక కార్యక్రమంగా మనకు అర్థమవుతుంది.

మరణించాక భౌతిక బంధాలు పూర్తిగా తెగిపోతాయి. 'ఋణానుబంధ రూపేణా పశు, పత్ని, సుతాలయా', అని కదా ఆర్యవాణి.

ఈ మాయా బంధాలతో 'పద్మపత్రామివాంబసా' తామరాకుమీది నీటి బొట్టులా జీవించమంటుంది 'భగవద్గీత'. అలాంటపుడు మరణించిన వారిని శ్రాద్ధకర్మల పేరుతో ప్రతి సంవత్సరం, జ్ఞాపకం తెచ్చుకొని, ఖర్చు పెట్టి, మరీ బాధపడమంటుందా శాస్త్రం ?

పెద్దలు జీవించి ఉండగా సేవలు చేయనివారు, పశ్చాత్తాపంతో పాపపరిహారం చేసుకోదలచుకుంటే, పిండాలు పెట్టడం, తర్పణాలు వదలటం, తమ పలుకుబడిని పెంచుకోవడం కోసం, పరిచయాలను బలపరచుకోవడం కోసం, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విందులు ఆరగించడం కాదు చేయవలసింది. వారి జ్ఞాపకార్థంకోసం పేదలకు అన్నదానం, వస్త్రదానం, విద్యాదానం చెయ్యడం, అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు కట్టించడం లాంటి పనులు చేస్తే పుణ్యం-పురుషార్థం కలిసొస్తుంది. మరికొంతమంది స్ఫూర్తిని పొంది సేవా కార్యక్రమాలు చేసే అవకాశం ఉంటుంది. మానవత్వం జీవించి ఉంటుంది.

శ్రాద్ధకర్మలు చేస్తేనే పరలోకంలోని ఆత్మలు శాంతించి, ఉత్తమగతులు ప్రాప్తిస్తాయనేది వాస్తవమే అయితే? విధిగా నిర్వహించవలసిన కార్యమే అయితే?... అలాంటి కర్మలు చేయలేని పేదవారి పరిస్థితేంటి ?

జనన-మరణాల మధ్య జీవితం చేసిన కర్మాకర్మలను బట్టి మాత్రమే ఉంటుందంటారు పెద్దలు. అలాంటపుడు శ్రాద్ధకర్మలు ఆచరించినంత మాత్రాన ఉత్తమ గతులు, ఆచరించనంత మాత్రాన అధమ గతులు ప్రాప్తిస్తాయా ?

బ్రాహ్మణులకు బంగారు పండ్లను దానమిస్తే ఆత్మకు శాంతి లభిస్తుందా?

శ్రీకృష్ణదేవరాయలవారి మాతృమూర్తి అయిన నాగమాంబకు తన అవసాన కాలమందు మామిడిపండ్లను తినవలెనని కోరిక కలిగింది. కానీ అది శీతాకాలం అవటంచేత ఎంత ప్రయత్నించినా మామిడిపండ్లు దొరకలేదు. తల్లి కోరికను తీర్చవలెనని రాయలవారు చాలా పట్టుదలతో దేశం నలుమూలలకూ మనుషులను పంపిచాడు. ఎంత ధనాన్నైనా ఖర్చు చేసేదానికి సిద్ధపడ్డాడు. కానీ, ఏ మాత్రమూ ప్రయోజనం కలగలేదు. నాగమాంబగారు 'మామిడి పండ్లు! మామిడిపండ్లు' అని అడుగుతూ,

అడుగుతూనే ప్రాణాలను విడిచింది. తల్లి కోరికను తీర్చలేకపోయినందుకు రాయలవారు చాలా బాధపడ్డాడు. ఆ విషయాన్ని పదేపదే జ్ఞప్తికి తెచ్చుకొని దిగులు పడుతూ ఉండినాడు.

రాజుగారి పరిస్థితిని చూచి వారి కుల గురువైన తాతాచార్యులవారు ఒక రోజు రాయలవారి వద్దకెళ్ళి 'మహారాజా! మీ అమ్మగారి చివరికోరిక తీర్చలేకపోయాను గదా అని, తమరు విచారపడి లాభంలేదు. నేను మీ విచారమును తొలగించు నిమిత్తం శాస్త్రాలను బాగా పరిశీలించి ఒక మార్గాన్ని కనుగొన్నాను. అదేమంటే! "మీరు ప్రతి సంవత్సరమూ జరపబోయే సాంవత్సరీకం సందర్భంగా బ్రాహ్మణులకు బంగారు మామిడి పండ్లను దానం ఇచ్చినట్లయితే, వారి ఆత్మకు శాంతి కలుగుతుంది. కాబట్టి మీరు ఇకపై విచారించకుండా నేను చెప్పినట్లు చేయండి", అని చెప్పాడు. తాతాచార్యులవారి మాటలతో రాయలవారు కొంత సంతృప్తి పడ్డారు.

తల్లిగారి సాంవత్సరీకం జరిగిన ప్రతిసారీ అనేక మంది బ్రాహ్మణులకు బంగారు మామిడి పండ్లను దానం ఇస్తూ, ఉండిన కారణంగా ఈ విషయం దేశం నలుమూలలా వ్యాపించింది. అనేక వేల మంది బ్రాహ్మణులు సాంవత్సరీకం రోజున బారులు తీరి నిలబడసాగారు. కొంత కాలానికి రాజు గారి ధనాగారంలోనున్న ధనమంతా తల్లి గారి సాంవత్సరీకం రోజు పంచిపెట్టే బంగారు మామిడి పండ్లకే సరిపోజొచ్చింది. ఇక ప్రజా సంక్షేమానికి ఖర్చు పెట్టే ధనాన్ని ఎక్కడి నుండి సమకూర్చాలి? అనే విషయాన్ని కోశాధికారి, మంత్రులకు తెలియజేసి రాజుగారి మామిడిపండ్ల దానకార్యక్రమాన్ని మాన్పించుటకు ఏదైనా ఉపాయం ఆలోచించండి, లేనిచో ప్రభుత్వం అప్పులపాలు కావలసి వస్తుంది అని చెప్పాడు.

కానీ, రాజు గారికి "దానం చేయడం మానండని" చెప్పే ధైర్యం ఎవరికుంటుంది? చివరికి కోశాధికారి, మిగతా మంత్రులంతా కలసి రామకృష్ణ కవిని రహస్యంగా కలుసుకొని, ధనాగార పరిస్థితిని వివరించి, రాజుగారు బంగారు మామిడి పళ్ళు దానమిచ్చే పద్ధతిని ఏ విధంగానైనా మాన్పించే మార్గమును ఆలోచించమని కోరారు. రామకృష్ణ కవిగారు సరే, నా శక్త్యానుసారం ప్రయత్నించి చూస్తాను అని వారికి చెప్పాడు. తర్వాత కొన్ని రోజులకు రాజు గారి తల్లి సాంవత్సరీకం రానే వచ్చింది. విజయనగరం అంతా లక్షలాది బ్రాహ్మణులతో నిండి పోయింది. బ్రాహ్మణుల ఇండ్లన్నీ బంధువులతో కిటకిటలాడసాగాయి.

రాయలవారు మరునాడు మామిడి పండ్లు దానం చేస్తారనగా - ఆ ముందు రోజున రాత్రి రామకృష్ణ కవి, బ్రాహ్మణులు బస చేసిన ఇళ్ళకూ, సత్రాలకూ వెళ్ళి బ్రాహ్మణోత్తములారా! "మీరు ఒక బంగారు మామిడి పండును దానంగా తీసుకోదలచినచో ఒక వాతనూ, రెండ్లు పండ్లు కావలసిన వారు రెండు వాతలనూ పెట్టించుకొని లోనికి రావలెనని రాయలవారు ఆజ్ఞాపించారు" అని వారికి చెప్పాడు.

కాబట్టి, "మీకు ఎన్ని మామిడి పండ్లు కావలయునో అన్ని వాతలు పెట్టించుకొని లోనికి వెళ్ళండి. వాతలు పెట్టించుకున్న వారికి మాత్రమే ఈ సంవత్సరం పండ్లు దొరకగలవు, అంతేగాక రాజుగారి దగ్గరకు పోయి పండ్లను తీసుకునేటప్పుడు వాతల వలన బాధపడుతున్నట్లుండ కూడదు, జాగ్రత్త", అని చెప్పాడు.

రామకృష్ణుడు ఆస్థానకవి. కాబట్టి ఆయన చెప్పే మాటలను అందరూ నిజమేనని విశ్వసించారు. మరునాడు రెండు మామిడి పండ్లు తీసుకోదలచిన వారు రెండు వాతలను, ఒక పండు తీసుకోదలచినవారు ఒక వాతను పెట్టించుకొని లోపలికి వెళ్ళుతున్నారు. ఆ విధంగా పోయిన వారిలో రెండు బంగారు మామిడి పండ్లు తీసుకోదలచినవారే అధికంగా ఉన్నారు. పాపం! వాతల వలన కలిగే బాధను బలవంతంగా ఆపుకొంటూ, ఏడ్వలేక లేని నవ్వును తెచ్చిపెట్టుకొని లోపలికి పోతూ ఉన్నారు.

రాయలవారు బ్రాహ్మణులకు బంగారు మామిడిపండ్లు దానమిచ్చుటకు ఉపక్రమించారు. ఒక బ్రాహ్మణుడు రాయలవారి ఎదుటికి వచ్చి నిలబడ్డాడు. ఆ బ్రాహ్మణుడికి రాయలవారు ఒక బంగారు మామిడి పండును ఇచ్చాడు. ఆ బాపడు ఆ పండును తీసుకొని మహాప్రభూ! నేను రెండు వాతలను పెట్టించుకున్నాను. కాబట్టి మరొక పండును దయచేయండి అని కోరాడు. రాయలవారు ఆ బాపడి మాటలను విని ఆశ్చర్యంతో, రెండు వాతలు పెట్టించుకోవడమేమిటి? రెండు పళ్ళను ఇవ్వడ మేమిటి? అని ప్రక్కనున్న అధికారులను ప్రశ్నించాడు.

అప్పుడు అక్కడున్న బ్రాహ్మణులంతా తాము పెట్టించుకున్న వాతలను రాయలవారికి చూపించి, జరిగిన సంగతినంతా వివరించారు. బ్రాహ్మణుల మాటలను విన్న రాయలవారు కోపగించుకొని రామకృష్ణుని పిలిపించి ఎందుకు చేశావీపని? అని నిలదీశాడు. అప్పుడు రామకృష్ణుడు వినయంగా రాజేంద్రా! నేను చెప్పబోయే విషయాన్ని శాంతంగా వినండి. "మా అమ్మగారు తీవ్రమైన వాత రోగానికి గురైనారు. ఎన్ని చికిత్సలు చేసినా జబ్బు నయం కాలేదు. మరణావస్థలోనున్న ఆమె నాతో "నాయనా వాత రోగానికి వాతలే మందు." కాబట్టి నాకు వాతలు వేయించు అని చివరి కోరికగా కోరింది. తల్లి కోరింది కదా అని నేను వాతలు పెట్టే ప్రయత్నంలో ఉండగానే ఆమె ప్రాణాలను వదలి పరలోకానికి పోయింది. ఆమె ఆత్మ శాంతించుట కోసం ఇంత మంది బ్రాహ్మణోత్తములను ఎక్కడి నుండి తేగలను. కాబట్టి ఈ రోజే మంచి సమయమని వీరందరికీ వాతలు పెట్టించితిని. నేను వీరికి వాతలు పెట్టించినందువలన మా అమ్మగారి ఆత్మకూ, మీరు బంగారు పండ్ల నిచ్చుట వలన మీ అమ్మగారి ఆత్మకూ శాంతి కలుగునట్లు చేశాను. ఒకే ప్రయత్నంలో రెండు ఫలితాలు సాధించే ప్రయత్నమే రాజా ఇది. నేను చేసినది తప్పయితే కఠినంగా శిక్షించండి ప్రభూ! అని చెప్పాడు.

రామకృష్ణుని మాటలు విని రాయల వారు సందిగ్ధావస్థలో పడి మంత్రులను సమావేశ పరచి బాగా ఆలోచించారు. తర్వాత తాతాచార్యుల వారి సలహానుసరించి తాము చేసే దానాలు వృధావ్యయంతో కూడుకున్నవని, అర్ధరహితమైనవని తెలుపుటకు, రామకృష్ణుడు ఈ విధమైన వాతల కార్యక్రమం చేపట్టాడని గ్రహించి, రామకృష్ణ కవిని ఉచితరీతిని గౌరవించాడు.

* ప్రక్క ఊరిలోనే మన ఫోటోలకుగానీ, విగ్రహాలకుగానీ పూజలు చేసినా జీవించి ఉన్న మనకెలాంటి అనుభూతి కలగదు. అలాంటిది చనిపోయిన వారి ఆత్మలకు మనం చేసే ఎలాంటి కర్మలూ వారిని చేరవు.

మృత్యువంటే అందరికీ ఎందుకంత భయం?

మృత్యువంటే అందరూ భయపడటానికి కారణం వారి స్వార్థమే. చావంటే " నేను సర్వనాశనం అయిపోవడమే. ఇకనేను అందరినీ, అన్నింటినీ విడిచి వెళ్ళడమే" అని తీవ్రమైన దుఃఖానికి లోనుకావడం.

తన ప్రయోజనం, తన సుఖం, తన శ్రేయస్సు మాత్రమే చూచుకోవడం. ఏదైనాసరే తనకే దక్కాలని కోరుకోవడం, అందుకు ప్రయత్నించడం 'స్వార్థం' అంటారు.

<u>స్వార్థం మూడు విధాలు:</u>

<u>1) ఉత్తమస్వార్థం :</u> సత్కర్మలనాచరిస్తూ, ఆత్మోన్నతికి ప్రయత్నించడం.

<u>2) మధ్యమ స్వార్థం:</u> కీర్తికోసం, ప్రతిష్టకోసం సేవలు చేస్తూ, సొమ్ము చేసుకోవడం.

<u>3) నికృష్ట స్వార్థం:-</u> ఇంద్రియాల సుఖంకోసమే బ్రతకడం, కానుకలకోసం, కాసుల రాశుల కోసం, కాంతల పొందుకోసం, మత్తుకోసం, మత్స్యమాంసాహారాల కోసం, అధికారంకోసం, ఆస్తులకోసం, అందలాలకోసం ఆరాటపడటం. తనకు దక్కకపోయినా పరవాలేదు, ఇతరులకు ఏమాత్రమూ దక్కకూడదు అని ఈర్ష్యా-సూయ, ద్వేషాలతో, అన్నీ నాకే కావాలి, అంతా నాకే దక్కాలి అని ఎంతకైనా దిగజారటం.

లోకంలోని సమస్త పదార్థాలను ప్రకృతిమాత జీవుల కొరకే సృష్టించింది. అందువలన పశుపక్ష్యాదులు, భూమి, గాలి, నీరు, సంపదలు, రాజ్యాలు, బంధువులు, భార్యా బిడ్డలు, అష్టైశ్వర్యాలు అన్నీ ప్రకృతిమాతవే. అని తెలుసుకొని అంగీకరించి జీవించాలి. పశు పక్ష్యాదులు పరిమిత స్వార్థంతో సృష్టి ధర్మాన్ని పాటిస్తూ ఏ విధంగా జీవిస్తున్నాయో, అదేవిధంగా ప్రకృతిలోని వనరులపై ఆశా-మోహాలు పెంచుకోకుండా, పరిమితంగా ఉపయోగించుకుంటూ జీవించేదానికి మాత్రమే మనుషులు అర్హత కలిగి ఉన్నారు.

చెట్టునీడలో కూర్చొని విశ్రాంతి తీసుకొని, సేద తీరిన తర్వాత చెట్టుమీద కానీ, చెట్టునీడ మీద కానీ మమకారం పెంచుకొని, ఆ చెట్టును వదలకుండా ఇదినాది అని అక్కడే దానిని అంటిపెట్టుకొని ఉండము. ఒకవేళ ఆ చెట్టునాదే, దాని నీడ కూడా నాదే, వాటిని వదలి రాను అంటే అది కేవలం మూర్ఖత్వం మాత్రమే.

అలాగే జీవితంలో ఎందరితోనో,ఎన్నింటితోనో బంధాలు, అనుబంధాలు, అనురాగాలు, స్నేహాలు ఏర్పడుతూ ఉంటాయి. అనుభవించినంతకాలం అనుభవించాము, ఇక వదలవలసిన పరిస్థితి వచ్చినపుడు చెట్టును, చెట్టునీడను వదలి వేసిన రీతిగా, ఎలాంటి భావం లేకుండా, బంధువులను, ఆస్తిపాస్తులను, స్నేహితులను, బిడ్డలను, అధికారాలను, శరీరాన్ని వదలివేయగలిగితే మరణ భయం ఏమాత్రమూ ఉండదు.

కానీ ఇలాంటి భయరహిత స్థితికి రావడమన్నది చెప్పినంత సులభంకాదు. ఎందుకంటే ముసలితనం ముంచుకొస్తున్నా, దేహంమీది వ్యామోహంతో యవ్వనవంతులుగా కనిపించాలని తెల్లబడిన జుట్టుకు నల్లనిరంగు అద్దడం, ముడతలు పడిన ముఖం కనిపించకూడదని నానా రకాల ప్రయత్నాలు చేయడం, బట్టతలమీద వెంట్రుకలు మొలిపించుకోవడం లాంటి ప్రయత్నాలు ఒకరిని చూచి మరొకరు పోటీలు పడి చేస్తూ ఉంటే, దేహత్యాగానికి సిద్ధపడతారా? అసాధ్యం,. మనుషులు స్వార్థంతో సహజత్వాన్ని, ప్రకృతి ధర్మాన్నీ, సృష్టి నియమాన్నీ మరచిపోయారు. అందరూ నీచ సుఖలాసలో మునిగిపోయారు. మితిమీరిన స్వార్థంతో అందరితోనూ, అన్నింటితోనూ, మానసికంగా, శారీరకంగా వ్యామోహం పెంచుకొని అవే శాశ్వతంగా ఉండిపోవాలని ఉబలాటపడుతున్నారు. అనుభవిస్తూ ఉండిపోవాలని తపన పడుతున్నారు. ఇలాంటి నికృష్ట స్వార్థపరులనే పాపాత్ములు అంటారు. వారు మరణం అంటే భయపడుతూ చస్తుంటారు.

* ఆధ్యాత్మికత మరణాన్ని జయించే మార్గాన్ని మనిషికి బోధిస్తుంది. నేను చావబోతున్నాను అనే మరణయాతన నుండి నేను ఈ దేహాన్ని వదలి వేస్తున్నాను. అనే త్యాగబద్ధిని కలిగిస్తుంది. మృత్యువు పట్ల భయాన్ని తొలగించి స్వయంగా దాన్ని ఆహ్వానించగల హుందాతనాన్నీ, మానసిక పరిణతినీ, శక్తినీ ఇస్తుంది.
* ఎవరి జనన మరణాలు గుర్తించే విధంగా ఉంటాయో-వారే ధన్యజీవులు. తమ పుట్టుకతోపాటు మృత్యువునుకూడా సార్థకం చేసుకునేవారే మహాపురుషులు, మహానుభావులు, మహాత్ములు.
* ప్రపంచంలోని ఏమతమూ మనిషి మరణాన్నుంచి రక్షించలేదు. సమయం వచ్చినపుడు కాలం దాని పని అది చేసుకుంటూ పోతుంది. మరణమనేది మార్పులు, చేర్పులు, వాయిదాలు లేని ప్రకృతి శాసనం.
* మనిషికి తన పుట్టుకను గురించితెలియదు. కానీ మృత్యువుందనీ, అది తప్పదనీ తెలుసు.
* బాల్య, యవ్వన, కౌమార దశలలో మనుషులకు మృత్యుస్పృహ ఉండదు.
* తల్లి స్తన్యపాన సమయంలో తన బిడ్డను ఒకరొమ్మునుండి మరొక రొమ్ముకు మారుస్తుంది.. ఈ సంగతి బిడ్డకు తెలియనందున-మార్చునపుడు తన నోటికాడిది పోయెనే! అని బిగ్గరగా ఏడుస్తుంది. ఈ మధ్య వ్యవధిలో ఏడ్చుట ఎంత అవివేకమో మరణానికికూడా భయపడి ఏడ్వడం అంతే అవివేకం.

చావంటే నాకు భయంలేదు

ఒక భక్తుడు పెళ్ళి చేసుకొని భార్యతోపాటు ఒక పెద్ద పడవలో ప్రయాణిస్తున్నాడు. పడవంతా పెళ్లివారి సందడితో నిండిపోయింది. అంతలోనే తుఫాను సూచనలు కనిపించాయి. అందరూ భయంతో వణికిపోతున్నారు. కానీ భక్తుడుమాత్రం స్థిరంగా ఎప్పటిలాగే ఆనందంగా ఉన్నాడు. అది చూచిన కొత్త పెళ్ళికూతురు "అదేమిటీ మీకు భయంగా లేదా? అని అడిగింది. అదేం లేదన్నాడతను. భయపడకుండా ఎలా ఉండగలుగుతున్నావు ? అని మళ్లీ అడిగిందామె. అందుకు అతను ఒకక్షణం ఆలోచించి "ఇదిగో కత్తి, దీంతో నిన్ను పొడిచి చంపేస్తాను అని నేనంటే నీవు భయపడతావా? అని భార్యను అడిగాడు. "భయపడను" చెప్పిందామె. ఏం ఎందుకు భయపడవు? అని ప్రశ్నించాడు. నేనంటే మీకు ప్రేమ కాబట్టి నన్ను చంపడమన్నది అసంభవం. అందుకే నాకింత ధైర్యం అంది ఆమె.

బాగా చెప్పావు. ఈ తుఫానులూ, ఉప్పెనలు కూడా భగవంతుడు ఝుళిపించే కత్తులే. నన్ను సృష్టించిన పరమాత్ముడే వాటినీ సృష్టించాడు. కాబట్టే నన్ను నట్టేట ముంచడని నా విశ్వాసం. నా విశ్వాసమే ధైర్యం అంటూ స్థిమితంగా చిరునవ్వునవ్వి... ఒకవేళ చావవలసి వచ్చినా ఈ జన్మను ప్రసాదించిన పరమాత్ముడే తిరిగి తీసుకుంటున్నాడనుకొని ధైర్యంగా మృత్యువు ఒడిలో ఒదిగిపోతాను అని ధీమాగా చెప్పాడు.

* "సుడిలో మునిగి ఎదురీదక, చావే సుఖమనుకోవోయ్' అన్నాడు ఓ సినీకవి.

అవసాన దశలోనే.. కాలం విలువ, ఆధ్యాత్మిక విలువలు తెలిసొస్తాయి

ఒక పట్టణానికి ఒక గొప్ప సాధువు విచ్చేశాడు. ఆయన ఖ్యాతి చాలా వేగంగా చుట్టు ప్రక్కల గ్రామాలకు వ్యాపించింది. ఆ సాధువును సేవిస్తే, కోరిక ఫలిస్తుందనీ, ఏదైనా చెబితే అది తప్పక జరుగుతుందనీ భక్తుల విశ్వాసం. దీంతో భక్తులు తండోప తండాలుగా రావడం, ఆశీస్సులు పొందడం, విలువైన కానుకలు సమర్పించడం మొదలైంది. ఆయన పండ్లు, పూలు మినహా ఖరీదైన కానుకలకేసి కన్నెత్తైనా చూచేవాడుకాదు. కానుకల్ని పేదలకు పంచిపెట్టేవాడు. వచ్చిన భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చెయ్యడం తప్ప ఏనాడూ ఆయన ఒక్క పైసా కూడా వెనకేసుకున్న పాపాన పోలేదు.

మొదటినుంచి గమనిస్తున్న ఒక వ్యాపారి ఆయన దగ్గరికి వచ్చి 'స్వామీ! మీకు లభిస్తున్న అపార కానుకలమీద కానీ, వాటివల్లదక్కే సుఖాలమీద కానీ వ్యామోహం లేదా? అని అడిగాడు. స్వామి-ఏమీ సమాధానం చెప్పలేదు. చాలాసార్లు అడిగాడు వ్యాపారి. అడిగిన ప్రతిసారీ సాధువు నవ్వి ఊరుకునేవాడు. కానీ వ్యాపారి మాత్రం ఊరుకోలేదు. రోజూ రావడం, అదే ప్రశ్నను అడగడం సమాధానం కోసం ఎదురు చూడటం జరిగేది. ఇలా చాలా రోజులు గడిచాయి.

ఒకరోజు సాధువు ఆ వ్యాపారి వైపు జాలిగా చూస్తూ దగ్గరికి పిలిచి "నీవు మరో పదిరోజుల్లో బాల్చీతన్నేస్తావు. ముందు ఆ సంగతి చూడు నీ ప్రశ్నకు సమాధానం తర్వాత చెబుతాను" అన్నాడు. అంతే! ఆ వ్యాపారి ముఖంలో కత్తివేటుపడినా చుక్క రక్తం రానటువంటి పరిస్థితైంది. దిగాలుపడిన ముఖంతో ఇంటికెళ్ళిపోయాడు. మరుక్షణం నుండే గబాగబా వ్యాపార లావాదేవీలు చక్కబెట్టడం, వీలునామా వ్రాయించడం, అప్పులు చెల్లించివేయడం, బాకీలు రాబట్టడం, కుటుంబ సభ్యులకు బాధ్యతలను అప్పగించడం, వారసులకు వ్యాపార రహస్యాలు చెప్పడం, వగైరాలన్నీ చకచకా నిర్వహించడం జరిగిపోయింది. మిగిలినకొద్దిపాటి కాలాన్ని సద్వినియోగం చేసుకొని, కర్మ బంధాలను వదిలించుకోవాలనే తాపత్రయంలో, ఇంట్లో నిత్యమూ పూజలు, భజనలు, అన్నసంతర్పణలూ, భగవన్నామ సంకీర్తనలలో మునిగిపోయాడు.

ఆ సమయంలో సాధువు వ్యాపారి ఇంటికి వచ్చి "నీవు నన్నో ప్రశ్న అడిగావు గుర్తుంది కదా? దానికి వివరంగా సమాధానం చెబుతాను వచ్చి కూర్చో" అన్నాడు. వెంటనే ఆ వ్యాపారి " అయ్యా! నాకు ఆ కథంతా వినే ఓపికా, తీరికా లేదు. నాకు సమయం కొద్దిగానే మిగిలివుంది. దాన్ని జాగ్రత్తగా వాడుకోవాలి, అనవసరమైన చర్చలూ, సమాధానాల పట్ల నాకు ప్రస్తుతం ఆసక్తి బొత్తిగా లేదు. క్షమించండి అన్నాడు.

అప్పుడు ఆ సాధువు చూశావా ? నీకు మరణం ఆసన్నమైందని తెలియగానే కాలం విలువ, ఆధ్యాత్మికత విలువ తెలిసొచ్చింది. చావు గురించి అర్థంకాగానే అనవసరమైన సంగతుల పట్ల, చిన్నచిన్న విషయాలపట్ల ఆసక్తి చచ్చిపోయింది కదా? అంటే మరణం గుర్తొచ్చేంతవరకే ఈ మమకారాలూ, వ్యామోహాలూ, సమయం వృధా చేయడాలూ. చావు అనివార్యమనే విషయాన్ని బాల్యంలోనే తెలుసుకున్నాను గనుకనే నీవు అడిగిన విషయాలపై నాకు ఆసక్తి కలుగలేదు" అని వివరించి చెప్పాడు ఆ సాధువు.

అన్నింటికీ పూర్వజన్మ కర్మ ఫలమే కారణం

పూర్వం గౌతమి అనే ఆమె పుణ్యకార్యాలు చేస్తూ ఎంతో పవిత్రంగా జీవితాన్ని గడుపుతూ ఉండినది. ఆమెకు ఒక కుమారుడున్నాడు. ఓరోజున ఆ పిల్లవాడు ఆడుకుంటూఉండగా విషసర్పం ఒకటి వచ్చి కాటు వేసింది. పసివాడు అక్కడికక్కడే మరణించాడు. అది చూచిన ఒక బోయవాడు గౌతమి దగ్గరికి వచ్చి పసివాడి ప్రాణాలను తీసిన సర్పాన్ని చంపేస్తాను అన్నాడు. అందుకు ఆమె "ఆ పామును చంపినందువల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదుకదా?" అని వారించింది.

కానీ ఎదురుగా ప్రాణాలు కోల్పోయి పడిఉన్న అందాల పసివాడిని చూస్తుంటే బోయవాడికి అమితమైన క్రోధావేశం ముంచుకొచ్చింది. అయినా ఆ తల్లి "ఆ పామును మాత్రం చంపవద్దని బోయవాడిని ప్రాథేయపడింది. ఇలా ఆ ఇద్దరి మధ్యన వాదన నడుస్తుండగా, మెల్లగా పాము నోరు విప్పి చెప్పింది. "ఇందులో నా తప్పేమీ లేదు.

మృత్యుదేవత ఆజ్ఞానుసారం మాత్రమే ఆ పసివాడిని కాటువేయడం జరిగింది. అంతేకాని ఆ పసిబాలుణ్ణి కాటువేసి చంపాలని నాకు మాత్రం ఎందుకుంటుంది"?

వెంటనే పామును చూచి "అవునవును నాకు కూడా నిన్ను చంపాలనే ఉంది. చంపి ఆ మృత్యు దేవత ఆజ్ఞానుసారమే ఇలా చేశాను అంటే సరిపోతుందా"? అన్నాడు ఆ బోయవాడు.

అలా సంవాదం జరుగుతున్నంతలోమృత్యుదేవత ప్రత్యక్షమై "సర్పాన్ని చూస్తు తప్పంతా నాదే అంటూ, నాపై నింద్రారోపణలు చేయడం చాలా అన్యాయం. నీ ద్వారా ఆ పసివాడిని చంపాలని నాకేమైనా ఉబలాటమా? కావాలని నేను నీకు చెప్పానా? నేనూ కాలపురుషునికి లోనై అలా చేశాను అన్నది.

ఆ ఇరువురి మాటలూ విన్న బోయవాడు "మీ ఇద్దరూ పరమ కిరాతకులు! ఇద్దరూ కలిసి చందమామలాంటి పసిబిడ్డను పొట్టన బెట్టుకున్నారు. మిమ్మల్ని వదలి పెట్టే ప్రసక్తే లేదు. ఉండండి మిమ్మల్నిద్దరినీ కలిపే చంపుతాను అని కర్కశంగా అన్నాడు.

ఆ మాటలకు మరోసారి పామూ, మృత్యు దేవత ఇరువురూ మా తప్పేమీ లేదు కాబట్టి మాకు ఇందులో ఏ పాపమూ అంటదు నాయనా! అన్నాయి. ఇంతలో అక్కడ కాలపురుషుడు ప్రత్యక్షమై "సుఖ-దుఃఖాలకు అన్నింటికీ పూర్వజన్మ కర్మఫలమే కారణం. కాబట్టి జరిగిన సంఘటనలో పాము దోషం కానీ, మృత్యువు తప్పుకానీ ఏదీ లేదు అని వివరించాడు.

పూర్వజన్మలో ఎప్పుడో ఏదోతప్పు చేసిన కారణంగానే, ఈ అకాల మరణం సంభవించింది. కనుక ఎవరూ దుఃఖించాల్సిన పనిలేదు. అని గౌతమి చెప్పగా బోయవాడు తన దారిన తాను వెళ్ళిపోయాడు.

పునర్జన్మ ఉందా?

మరలా జన్మించడమే పునర్జన్మ. మరలా మరలా పుడుతూ ఉండకపోతే సృష్టి చక్రం ఆగిపోదా? పంచభూతాలు ఉన్నంతకాలం సృష్టిచక్రం కొనసాగుతూనే ఉంటుంది. వచ్చిన గందరగోళం ఎక్కడంటే? మనిషిగా పుట్టినవాడు మరలా మనిషిగానే పుడతాడా? అని.

మన దేహం నుండి బయట పడిన ప్రాణం ప్రకృతిలో కలిసిపోతుంది. బియ్యపు రాశిలో మన బియ్యం కలసిపోతే ఎలా కనుగొనలేమో! అపారమైన జలరాశి కల సముద్రంలో ఒక చెంబు నీళ్ళు కలసిపోతే ఎలా కనుగొనలేమో! అలాగే ఇదీనూ.

చేసిన కర్మలననుసరించి క్రిమి-కీటకాదులుగానో, పశు-పక్ష్యాదులుగానో, ప్రకృతి-పురుషులుగానో, తరు-లతాదులుగానో పుడుతూ-గిడుతూ ఉంటారు! అదే పునరపి జననం, పునరపి మరణం.

మనసు - 10

* అందరికీ మనసనేది ఉంటుంది. పుట్టినప్పటి నుండే అది ఉంటుంది. కానీ పసి పిల్లల్లో అది నామమాత్రంగా, కేవలం బీజప్రాయంగా మాత్రమే ఉండి, వారు ఆత్మస్వరూపులుగా కేవలం తెల్లకాగితంలా, నిర్మలమైన అద్దంలా, స్వచ్ఛంగా ఉంటారు. కాబట్టి పసిపిల్లలు బ్రహ్మానందంలో ఉంటారు. కనుకనే వారిపట్ల అందరూ ఆకర్షితులవుతూ ఉంటారు. పసిపిల్లలు దేవుళ్ళతో సమానమని అందుకే అంటూ ఉంటారు.
* పిల్లలు ఎదిగేకొద్దీ కళ్ల ద్వారా చూచిన సన్నివేశాలు, చెవుల ద్వారా విన్నమాటలు శబ్దాలు, నాలుక ద్వారా తెలుసుకున్న రుచులు, చర్మం ద్వారా స్పర్శ సుఖం, ముక్కు ద్వారా వాసనలతో వారి మనసు ప్రభావం చెందుతూ బీజప్రాయంగా ఉన్న మనసు పెరుగుతూ మెల్ల మెల్లగా ఆత్మకు దూరమవుతూ పోతుంది.
* అందుకే మనిషి... పుడుతూ భగవంతుడు - పెరుగుతూ మానవుడు
  దిగజారుతూ రాక్షసుడు - సాధనతో మహాత్ముడు
* మనసు పంచ జ్ఞానేంద్రియాల ద్వారా తన కార్యకలాపాలను చేస్తూ పంచ కర్మేంద్రియాల ద్వారా ఆనందిస్తూ ఉంటుంది.
* పంచకర్మేంద్రియాలకు, పంచ జ్ఞానేంద్రియాలకు మనసు అధిపతిగా ఉంటూ జీవితమనే ఆటను ఆడిస్తూ ఉంటుంది. కనిపించని మనసు కనిపించే శరీరాన్ని ఆడిస్తూ, నడిపిస్తూ ఉంటుంది.
* మనిషి మనసు ఊసరవెల్లిలా మారిపోతూ ఉంటుంది. పట్టుకుందామంటే దొరకదు. దానిజోలి మనకెందుకులే అనుకున్నా ఊరక ఉండనీయదు. ఈ క్షణం మన దగ్గరుంటే మరుక్షణం అంతరిక్షంలో ఉంటుంది. మనసంత వేగంగా ప్రయాణించేది సృష్టిలో మరొకటి లేనే లేదు.
* ఎన్నో ఆగడాలనూ, అకృత్యాలనూ, అరాచకాలనూ చేయిస్తూ, సమస్త దురాలోచనలకు మూల కారణంగా నిలుస్తూ, ఆత్మ నుండి దూరమవుతూ, మనుషుల జీవితాలను అత్యంత దుఃఖ దాయకంగానూ, ఒక్కో సారి సుఖమయం గానూ మార్చివేయగల సత్తా ఉన్న ఏకైక అద్భుత, అదృశ్య శక్తే మనసు.
* మనసును స్థూలంగా అంతఃకరణమని అంటారు. సంకల్పిస్తే మనసు, ఆలోచిస్తే చిత్తం, నిశ్చయిస్తే బుద్ధి, 'నేను నాది' అంటే అహంకారం.
* ఇంద్రియాలకంటే మనసు, మనసుకంటే ఆత్మ సూక్ష్మమైనవి.
* కామం, క్రోధం, మోహం, మదం, మాత్సర్యం, లోభం అనే ఆరు శత్రువులు మనసుపై నిరంతరం దాడి చేస్తూనే ఉంటాయి.
* ఇంద్రియాలు తేనెటీగల్లాంటివి. మనసు వాటిమీద పెత్తనం చెలాయించే రాణీ ఈగలాంటిది. రాణీ ఈగ తేనె పట్టును వదలివేస్తే తక్కిన ఈగలన్నీ వానితోబాటే లేచి వెళ్ళిపోతాయి. అలాగే మనసుకూడా శరీరాన్ని వదలివేస్తే. ఇంద్రియాలన్నీ ఎగిరిపోతాయి.

* మనసు ఒక్కోరోజు ఒక్కో విధంగా ఉంటుంది. ఒకేలా ఎప్పుడూ ఉండదు. ఒక రోజు హాయిగా, సంతోషంగా ఉంటుంది, ఉత్సాహంగా ఉరకలు వేస్తూ ఉంటుంది. మరుసటి రోజు ఊసురోమని ఉంటుంది. ఉత్సాహంగా ఉన్నపుడు, అందరూ స్నేహితులుగానే శ్రేయోభిలాషులుగానే కనిపిస్తారు. అపుడు అందరినీ హుషారుగా పలుకరిస్తారు, ఉత్సాహపరుస్తారు. మనస్తాపాన్ని కలిగించే సన్నివేశాలనుకూడా తేలికగా కొట్టిపారేస్తారు. ఎవరైనా అనకూడని మాటను అన్నా, కోపంగాని, అసహ్యం గాని, చూపించకుండా - వారు అన్న మాటలో తప్పేముందీ? ఆ పరిస్థితులలో ఎవరున్నా అలాగే అంటారు. అలాగే చేస్తారు. అని చాలా హుందాగా, ఉదారంగా వ్యవహరిస్తారు. ఏంటి విశేషం? ఈ వేళ చాలా హుషారుగా ఉన్నారు? అని కూడా అంటూంటారు సన్నిహితులు. మనసు ఉల్లాసంగా ఉంటే పాట, కూనిరాగం, ఈల కూడా వస్తుంది. మరుసటి రోజు అదే మనసు ఏదో పోగొట్టుకున్నట్లుగా, అందరూ స్వార్థపరులే అన్నట్లుగా భావిస్తారు. పిలిచినా పలుకకుండా, నిర్లక్ష్యంగా, నిర్లిప్తంగా, ఏదీ పట్టనట్లు, ఏదో పోగొట్టుకున్నట్లుగా, పరధ్యానంగా, చూచీ చూడనట్లు, అదోలా ముభావంగా ఉంటారు. అలాంటపుడు పొగడ్త కూడా చికాకునే కలిగిస్తుంది. పరమాన్నం కూడా సహించదు.
* ఈగ పెంట మీదా వాలుతుంది, పాయసం మీదా వాలుతుంది అన్నట్లు, మనసు కూడా మంచిగానూ ఉంటుంది, చెడుగానూ ఉంటుంది.

నిలకడగా ఉండని మనసు

ఒక బాటసారి చాలా దూరం నుండి ప్రయాణిస్తూ ఒక చెట్టు క్రింద కూర్చొని విశ్రాంతి తీసుకుంటూ ఉంటాడు. కాస్తంత సేద తీరాక "ఆహా! ఈ వాతావరణం ఎంత ఆహ్లాదకరంగా ఉంది? ఈ చెట్టు నీడ ఎంత చల్లగా ఉంది? అటు మాడు పగిలిపోయే ఎండ తాపం, ఇటు హాయిని గొలిపే చల్లని నీడ ఈ చల్లని నీడలో ఒక మెత్తని పరుపు ఉంటే ఎంత బాగుండునో? కాని అతనికి తెలియదు. అతనొక కోరిన కోర్కెలను తీర్చే కల్పవృక్షం క్రింద ఉన్నాడని.

వెంటనే పరువు వచ్చింది. ఆహా! ఎంత బాగుంది! అని దానిపై పడుకుని, ఆ పరువు మెత్తదనాన్ని అనుభవిస్తూ ఈ మనోరంజకమైన వాతావరణంలో నా వెంట నా భార్య కూడా ఉండి ఉంటే ఎంత బాగుండు? అనుకున్నాడు. వెంటనే అతని భార్య కూడా వచ్చి పరుపై కూర్చొని ఏమండీ! అని పలుకరించింది. బాటసారి ఆనందాశ్చర్యాలతో పులకరించిపోయాడు.

ఆహా! ఏమి ఈ విచిత్ర ఆనందం అని అనుకుంటూ, మేమిరువురమూ మైమరచి నిద్రించేటపుడు ఒక వేళపులి ఏదైనా వస్తే ఎలా? అసలే నిర్మానుష్యమైన వాతావరణం. వచ్చి మమ్ములను అమాంతం భోంచేయదు కదా? అనుకున్నాడు. అంతే పులి రావడం వారి మీదపడి ఊరగాయను చప్పరించినట్లు చప్పరించడం జరిగిపోయింది.

ఆశ స్వార్థం

- **ధనం** : అందరికంటే అధికంగా సంపాదించాలి. ధన, కనక, వస్తు, వాహనాలు, స్థలాలు, పొలాలు, తోటలు, భవనాలు ఇంకా ఇంకా సంపాదించాలి, అంతులేకుండా సంపాదించాలి. ఎలాగైనా, ఏంచేసైనా సంపాదిస్తూనే ఉండాలి. అదే హాయి-ఆనందం. జీవిత పరమార్థం.
- **మద్యం**: మద్యం బాగా సేవించాలి. మత్తులో మునిగి తేలుతూ మైమరచి పోవాలి. మత్స్య-మాంసాలను రకరకాల మసాలాలతో, రకరకాల రుచులతో లొట్టలు వేసుకుంటూ విందులారగించాలి, చిందులు తొక్కాలి. జీవితానందమంటే మత్తులో మునిగి తేలడమే!
- **మానం** : నిత్యం యవ్వనంలో ఉండాలి. అందంగా కనిపించాలి. అందరూ తన అందచందాలను మెచ్చుకోవాలి. అందరూ తన అందాన్ని అనుభవించాలని తహతహలాడాలి, పడిచావాలి. రకరకాల భంగిమలతో అందాలను అనుభవించాలి. ఆనందాన్ని జుర్రుకోవాలి. ఆనందపుటంచులను తాకాలి.
- **స్థానం** : అందరికీ పెద్దగా ఉండాలి. అందరిమీదా పెత్తనం చెలాయించాలి. పెద్దరికం కోసం, పదవులకోసం, అధికారం కోసం, వంచన, కుట్ర, కుతంత్రం, అవమానం, నాశనం, ఏమైనా చేయవచ్చు. అందరూ తనకు సలాములు చేస్తూ, గులాములుగా ఉండాలి. అందరూ తనను ప్రశంసలతో, పొగడ్తలతో ముంచెత్తాలి. బిరుదులతో ఘనంగా సత్కరించాలి. పూలదండలు వేసి అడుగులకు మడుగులొత్తాలి. కీర్తి పతాకాన్ని ఆకాశానికి ఎగురవెయ్యాలి, తనంటివారు లేరు, ఉండరు, ఉండబోరని అనుకోవడం. అడ్డదారులూ, దొడ్డిదారులూ ఏవైనా రాచబాటలే, స్థానం మాత్రం పదిలంగా ఉండాలనుకోవడం.

అసూయ : తనకంటే మెరుగైన పరిస్థితులలో ఉన్నవారిని చూచి, తనకంటే అదృష్టవంతులను చూచి, అసూయపడటం, కుళ్ళుకోవడం, అవరోధాలను సృష్టించడం, సూటిపోటి మాటలతో చూపులతో, చేష్టలతో అవమానించడం విమర్శించడం, బాధించడం, కృంగదీయడం, వెక్కిరించడం, చాడీలు చెప్పడం, మాట తప్పడం, మాట మార్చడం, ఎంతకైనా దిగజారడం, సోమరితనం, పనులను వాయిదా వేయడం కంపే ఇంపుగా, మురికే ముచ్చటగా బ్రతకడం.

అహంకారం: నేనే అధికుడను, నా అంతటివాడు లేనేలేడు, నా మాటే వేదం,నా మాటకు తిరుగు లేదు, నాకు ఎదురు లేదు, అన్నీ నేనే, అంతా నేనే, అన్నీ నావే అనుకోవడం, ఆడంబరాలు, అట్టహాసాలు, డాంబికాలకు పోవడం, ఇతరుల గొప్పతనాన్ని, తన పొరపాట్లను, తప్పులను ఒప్పుకోకపోవడం.

ఆగ్రహం : ఆశించినది అందకపోయినా, అనుకున్నది జరగకపోయినా, చెప్పింది వినకపోయినా, చెయ్యకపోయినా వీరావేశంతో ఊగిపోవడం, ఎంతకైనా తెగించడం, పగ-ప్రతీకారాలతో బ్రతకడం.

భగవంతుడికంటే రాజే అధికుడా?

ఓ రాజు తానే సర్వాధికారినని, సర్వస్వతంత్రుడనని, ఏమైనా చెయ్యగలననీ అనుకోసాగాడు. ఒకరోజు భగవంతుడికంటే తానే అధికుడను కదా? అనే ఆలోచన వచ్చింది. ఆ విషయాన్ని నిర్ధారించుకునేదానికి కనపడిన ప్రతి పండితుడినీ "నా కంటే భగవంతుడు ఏ విధంగా? ఎందులో గొప్ప వాడు అని ప్రశ్నించడం మొదలు పెట్టాడు.

మొదట్లో ఆ ప్రశ్న విన్న విద్వాంసులు కాస్త తికమకపడ్డారు. ఆ తర్వాత కొంత మంది "భగవంతుడికంటే మీరే అన్నింటిలోనూ అధికులు" అని చెప్పి రాజుగారి దగ్గర బహుమతులు పొంది వెళ్ళసాగారు. మరికొందరు ఆ ప్రశ్నకు జవాబు చెప్పకుండా తెలివిగా దాటవేస్తూ వచ్చారు.

ఒకరోజు సాధువొకరు వచ్చి రాజుకు వినయంగా నమస్కరించి "భగవంతుడి కన్నా మీరే ఎక్కువ, అందులో సందేహం ఏమి లేదు" అని సభలో విస్పష్టంగా ప్రకటించాడు. రాజుగారు వివరణ అడిగాడు.

మీకు కోపం వచ్చిందనుకోండి ఈ క్షణమే నన్ను మీ రాజ్యం నుంచి వెళ్ళగొట్టగలరు. అది భగవంతుడికి సాధ్యం కాదు కదా? అన్నాడు సాధువు.

రాజు గారికి ఈ తర్కం బాగా నచ్చింది. "అవునవును భగవంతుడు వెళ్ళగొట్టినా నేను తక్షణం ఆయన ఆజ్ఞను రద్దు చేసి, మీకు నగర ప్రవేశం కల్పించగలను అని వెంటనే ఆ సాధువుకు ఘన సన్మానం చేసి పంపాలని ఉబలాటపడ్డాడు రాజు.

అపుడు రాజు గారిని దగ్గరకు పిలిచి సాధువు చెప్పాడు నేను చెప్పింది మీకు సరిగ్గా అర్థం అయినట్లు లేదు. ఈ సృష్టి సమస్తమూ ఆయన రాజ్యమే! అలాంటపుడు భగవంతుడు ఎక్కడికని వెళ్ళ గొట్టగలడు?

ఈ మాటతో రాజు ఆలోచనలో పడ్డాడు. కాసేపటికి రాజుకు జ్ఞానోదయమయింది. ఈ చరాచరజగత్తంతా ఈశ్వరుడిదే అని, చివరికి తన జీవితంపై కూడా తనకు అధికారం ఏమాత్రం లేదనీ జ్ఞానం కలిగింది రాజుకు.

డబ్బుకోసం మూడు నామాలవాడికే నామాలు పెట్టే మనసు

ఒక కోటీశ్వరుడు కారులో వెళుతున్నాడు. ఏదో అర్జంటు పని మీద చాలా వేగంగా నడుపుకుంటూ పోతున్నాడు. ఆకస్మాత్తుగా బ్రేకులు పనిచేయడం మానుకున్నాయి. కారు మంచి వేగం మీద ఉంది. కోటీశ్వరునికి చెమటలు పట్టాయి. ఏదైనా మలుపు వచ్చినా, మరో వాహనం ఎదురుగా వచ్చినా, కారు వేగం తగ్గించలేక ప్రమాదానికి గురికావల్సిందే. ప్రాణ భయంతో వణికి పోతున్నాడు. వెంటనే అతనికి ఆపద మొక్కులవాడైన శ్రీ వేంకటేశ్వరస్వామి గుర్తుకు వచ్చాడు. వెంటనే ఇలా మ్రొక్కుకున్నాడు.

"స్వామీ! ఈ ప్రమాదం నుంచి బయటపడి బతికితే నా భవనం అమ్మగా వచ్చిన పైకమంతా తిరుమలకు కాలి నడకన వచ్చి నీ హుండీలో వేస్తాను"

'అలాగే నీ మ్రొక్కు తప్పక తీర్చు, నీకు ప్రమాదం ఏమిరాదు' అని ఆకాశవాణి వినిపించింది. ఆ మరుక్షణమే ఎదురుగా రోడ్డు మార్గం చాలా ఎక్కుడుగా ఉంది. ఒక గుట్టమీదుగా వేసిన రోడ్డు అది. అంటే - వేగంగా వెళుతున్న కారు గుట్ట ఎక్కలేక నెమ్మదిగా పోసాగింది. కొంత దూరం వెళ్ళాక ఇంజన్ ఆఫ్ చేసి గేర్‌ను న్యూట్రల్ చేసి రోడ్డుకు ప్రక్కగా కారును నిలబెట్టి హమ్మయ్య! బ్రతుకు జీవుడా అని కారు దిగాడు. దేవుని దయవల్ల ఎదురుగా ఘాట్ రోడ్ ఉండడం వలన సరిపోయింది లేకుంటే... ఈ రోజు నా ప్రాణం పోయేది అని అనుకున్నాడు.

ఇంటికి వెళ్ళాక అతనికి తన భవనాన్ని అమ్మి అంత డబ్బునూ తిరుమల హుండీలో వేయడానికి మనసొప్పలేదు. అందువలన అతడు బాగా ఆలోచించి, తన బావమరిదిని పిలిచి జరిగినదంతా చెప్పాడు. తెలివిగా వ్యవహరించాల్సిన సమయమిది అని, ఇద్దరూ తీవ్రంగా ఆలోచించి ఆపద మ్రొక్కులవాడి ఆపద నుండి ఉపాయంగా తప్పించుకునే మార్గం కనుక్కున్నారు.

"భవనం ఖరీదు ఎంతలేదన్నా కోటి రూపాయలు చేస్తుంది కాబట్టి నా భవనాన్ని లక్ష రూపాయలకు అమ్మతాను, నాకు నష్టమొచ్చి కష్టం కలగకూడదు కాబట్టి నా పెంపుడు గుర్రాన్ని తొంభై తొమ్మిది లక్షలకు అమ్ముతాను. నేను అమ్మిన విధంగా నీవు కొను, తొంభై తొమ్మిది లక్షలను బ్యాంకులో వేసుకొని, భవనం అమ్మగా వచ్చిన లక్ష రూపాయలను తీసుకొని కాలినడకన తిరుమలకు వెళ్ళి వడ్డికాసుల వాని హుండీలో వేస్తే సరిపోతుంది" అని తీర్మానించుకున్నారు. కోటీశ్వరుడు అలాగే చేసి..."అబ్బ ఓపనైపోయింది బాబూ" అని నిట్టూర్చాడు దేవాలయం బైటికి వచ్చి. "మూడు నామాల" వానికే పంగనామాలు పెట్టగలిగానని తన తెలివితేటలకు తానే మురిసిపోతూ ఇల్లు చేరాడు.

మూడు రోజుల తర్వాత అతనికి ఉన్నట్లుండి వాంతులు, బేదులతో జ్వరం వచ్చింది. మంచి వైద్యుల దగ్గరికెళ్ళి మందులు, మాత్రలు వాడినాడు. అయినా తగ్గ లేదు. రోజు రోజుకు నీరసించి పోసాగాడు. చివరికి వైద్యుడు "అయ్యా ఇపుడు నేనివ్వబోయే ఈ మందు, మాత్రలే ఆఖరి. దీనికి తగ్గకపోతే ఇంకెవరూ ఏమీ చెయ్యలేరు" అని చెప్పి మందు, మాత్రలు ఇచ్చి వెళ్ళాడు.

ఆ మందు, మాత్రలు వాడినాకూడా ఫలితం కనిపించలేదు. ఇక చావు తప్పదని తెలియగానే మళ్ళీ అతనికి ఏడు కొండలస్వామి వడ్డికాసులవాడు గుర్తుకొచ్చాడు. స్వామీ మీరే నన్ను కాపాడాలి అని ప్రార్థించాడు.

నీవు అమ్మిన పెంపుడు గుర్రాన్ని తెచ్చి నీ మంచానికి ఎదురుగా పది నిమిషాలు నిలబెట్టితే చాలు నీవు బతికిపోతావ్ అని ఆకాశవాణి వినిపించింది.

వెంటనే కోటీశ్వరుడు తన బావమరిదిని పిలిపించాడు. సంగతి వివరించాడు. తాను అమ్మిన గుర్రాన్ని తెచ్చి పది నిమిషాలు నా మంచానికి ఎదురుగా నిలబెట్టు అన్నాడు.

బావమరిది అదోరకమైన జాలి, నవ్వు నవ్వి, ఇప్పుడు ఆ గుర్రం ఖరీదు రెండు కోట్లు. ఇష్టం ఉంటే కొనుక్కో లేదా చచ్చిపో అన్నాడు. నేను దేవుడికి పెడితే! నా బామ్మర్ది నాకే పంగనామాలు పెట్టాడు అనుకుంటూ ప్రాణాలు విడిచాడు.

దేన్ని గుర్తు చేసుకోకూడదో దానినే గుర్తు చేసుకునే మనసు.

పూర్వం ఒక గ్రామంలో కనకయ్య అనే వానికి బంగారు తయారు చేయడం నేర్చుకోవాలనే పిచ్చి ఉండేది. ఏ లోహాన్నైనా బంగారంగా మార్చివేసే విద్య తెలిసిన వాళ్ళు కొందరుంటారని ఎవరో చెప్పగా విన్నాడు. ఆనాటి నుండి కనకయ్య ఎలాగైనా సరే ఆ విద్యను నేర్చుకోవాలనే ఆరాటంలో సాధువులు, సన్యాసులు, బాబా లే కాకుండా గడ్డాలు పెంచిన వారెవరైనా కనపడితే చాలు వాళ్ళ వెంటపడి మీకు పరసువేది విద్య తెలుసా? అని అడిగేవాడు.

కనకయ్య బలహీనతను కనిపెట్టిన ఒక సోమరి కాషాయ వస్త్రధారి, తనను సంవత్సరంపాటు పోషిస్తే పరసువేది విద్యను నేర్పిస్తాను అన్నాడు. ఆశతో అందుకు కనకయ్య ఒప్పుకున్నాడు.

ఆ సాధువు పోషణకు కనకయ్యకున్నదంతా ఖర్చు చేసాడు. కొంత అప్పు కూడా చేయవలసివచ్చింది. సంవత్సరం గడువు ఇకపూర్తి కావస్తుందనగా సాధువు మరో ఊరికి వెళ్ళడానికి మూటాముల్లెను సర్దుకుని సన్నాహాలు చేసుకుంటున్నాడు.

కనకయ్య సాధువును తనకు బంగారంచేసే పరసువేది విద్య నేర్పించే సంగతి ఏం చేశావంటూ నిలదీసేటప్పటికి ఆ సాధువు "అదెంత పనయ్యా? కనకయ్యా! ఎన్ని మామిడాకులు తీసుకుంటావో అన్ని తులసి ఆకులు కూడా తీసుకో. నీ దగ్గరున్న ఏలోహపు వస్తువు పైన అయినాసరే ఆ ఆకుల రసాన్ని పిండుతూ, కళ్లు మూసుకొని స్వర్ణ స్వర్ణ అంటూ పదిసార్లు మనసులో జపించు. కానీ మంత్రం జపించేటపుడు నీ మనసులోకి కోతిని మాత్రం రానీకు. అని జాగ్రత్తకూడా చెప్పి తన దారిన వెళ్ళి పోయాడు సోమరి సాధువు.

కనకయ్య ఎంతో ఆశతో మామిడాకులు వంద, తులసి ఆకులు వంద తెచ్చి తన దగ్గరున్న మర చెంబుమీద వాటి రసాన్ని పిండుతూ కళ్ళు మూసికొని "స్వర్ణ స్వర్ణ" అంటూ పదిసార్లు జపించాడు. అయితే జపించేటపుడు కోతిని తలచుకోకూడదు అనే మాట గుర్తుకు రాగానే, కోతి గురించి తప్పనిసరిగా గుర్తు చేసుకోవలసివచ్చేది. దానితో అతని మంత్రం ఫలించేది కాదు.

కోతిని గుర్తు చేసుకోకుండా ఉండడం ఎలాగో అతనికి అర్థం కాలేదు. తనకు బంగారం చేసే పరసువేది విద్య తెలిసికూడా బంగారం తయారు చేయడం మాత్రం ఎంతకాలానికి అతనికి సాధ్యం కాలేదని బాధపడ్డాడు.

* ఆశ అల్పాహారంలా ఉండాలేగానీ విందు భోజనంలా ఉండకూడదు.
* కొన్ని సమయా సందర్భాలలో, కొందరిచేతుల్లో మూర్ఖులమైపోతూఉంటాము. అలాగే అలవాట్లు, చెడు వ్యసనాలు, చెడు సహవాసాలు, చెడ్డ మనుషులు, చెడు ఆకర్షణలు దురాశలు మనిషిని బలహీన పరుస్తుంటాయి. పతన మార్గానికి మళ్ళించి అశ్లీల వినోదానికి, అవినీతి సంపాదనకూ తలొగ్గేటట్లు చేస్తాయి. వాటికి లొంగకుండా ఉండాలంటే మనలో వాటిపట్ల వ్యతిరేక భావన ఉండాలి.

గయ్యాళి మనసు అదుపు ఆజ్ఞలకు లొంగదు.

ఒక గ్రామంలో సదాచార సంపన్నుడైన ఒక గృహస్తుడుండేవాడు. ఉదయం లేచింది మొదలు స్నానం, సంధ్యావందనం, జపం, తపం మొదలగువాటిని నియమ నిష్టగా పూర్తి చేసిగానీ గంగను కూడా ముట్టడు. ఎన్ని ఆటంకాలు వచ్చినా అతని శిష్టాచారాకి భంగం వాటిల్లనివ్వడు. అతని జీవితంలో అంతా సవ్యంగానే జరుగుతూ ఉండేది. కానీ ఒక సమస్య మాత్రం అతడిని కష్టపెడుతూవుండేది. కారణం కూడా తెలియకుండినది. అదేమంటే అతని దాంపత్య జీవితం.

భార్య పరమ గయ్యాళి. అతని పవిత్ర మనస్తత్వానికి, ఆమె దురుసుతనానికి ఉప్పు-నిప్పులాగా ఏ మాత్రం పొత్తు పొసగకుండా ఉంది. అందువలన ప్రతిరోజూ ఇంటిలో "ఎడ్డెం అంటె తెడ్డెం" అంటూ రచ్చ-రగడ ఉంటూవుండినది. అతని ఓర్పు-సహనం ఏ మాత్రమూ అతని భార్య ముందు పని చేయడం లేదు. ఏమి చెప్పినా, ఎంత వినయంగా, నెమ్మదిగా చెప్పినా "పొగరు బట్టిన పోట్లగిత్తలా" ఎగిరెగిరి పడుతుంది. ఆ విధంగా అతనికి "సంసారం నల్లుల మంచంవలె" తయారైంది. 'దిన దినగండం నూరేళ్ళాయుష్షు" అన్నట్లు ఒక "ముద్దు ముచ్చట" గానీ, ఒక సుఖంగానీ లేకుండా మనశ్శాంతికి దూరమై అతి బాధాకరంగా సంసారాన్ని ఈడ్చుకొస్తున్నాడు. "శివుడు హాలా హలాన్ని మింగినట్లు."

ఇలా ఉండగా కొన్నాళ్ళకు అతని తండ్రి తద్దినం జరుపుకోవలసివచ్చింది. మామూలు రోజులలోనే ఇల్లాలితో నెట్టుకురావడం గగనంగా ఉంటే, తద్దిన మెలాగా జరుపగలడు? ఈ సమస్య అతనిని చాలా తీవ్రంగా బాధించ సాగింది. ఇక రెండు రోజులలో తద్దినం రానున్నది. చేస్తే బోలెడన్ని పనులు. ఇల్లలకడం, ముగ్గులు పెట్టడం, భోజనాలు ఏర్పాటు చేయడం, అతిథులను ఆహ్వానించడం, కావలసిన పదార్థాలను సమకూర్చడం లాంటి పనులెన్నో ఉన్నాయి. కానీ భార్య చేత ఏ ఒక్క పని చేయించడమైనా బ్రహ్మ ప్రళయమే! మామూలు రోజులలోనే సాధారణ పనులు చేయకుండా మొండికేసే ఘటంతో తద్దిన కార్యమెలా చేయించగలడు? తండ్రి తద్దినం చెయ్యడమా లేక మానడమా? ఇలా పరి పరి విధాలా ఆలోచించి, ఎటూ తేల్చుకోలేక చివరకు గ్రామం బయట ఆశ్రమంలో ఉన్న తన గురువుగారి వద్దకు రాత్రికి రాత్రే బయల్దేరి వెళ్ళాడు.

ఆశ్రమం చేరగానే గురువుగారి పాదాలపైబడి మహాత్మా! పాహిమాం, పాహిమాం అంటూ కంట తడిపెట్టి ప్రార్థించాడు. గురువు గారు ఆశ్చర్యపడి వేళకాని వేళ శిష్యుడెందుకు వచ్చెనో? అని కలత పడి "నాయనా శిష్యా ఏదో అతి ముఖ్యమైన పని మీద, అందులోనూ కాస్త కలతచెంది వచ్చినట్లుగా ఉన్నావు" విషయమేమిటి? నిర్భయంగా విన్నవించు. భయపడవద్దు, అధైర్యపడవద్దు. ఆశ్రమంలోకి వచ్చాక కూడా ధైర్యం కోల్పోతే ఎలా? అని వాత్సల్యంగా దగ్గరికి తీసుకొని ధైర్యం చెప్పాడు గురువు.

అందుకు శిష్యుడు "గురుదేవా! ఏమని చెప్పను? నా దీనావస్థ, ఆ భగవంతునికే ఎరుక. నా జీవితంలో అన్నీ అనుకూలంగానే ఉన్నాయి. కానీ ఒక్కటి మాత్రమే ప్రతికూలంగా ఉంది. అదే నా భార్య. నా భార్య అన్నింటికీ వ్యతిరేకంగా మాట్లాడుతుంది. విరుద్ధంగానే చేస్తుంది. ఆమె చేత ఏ ఒక్క పనికూడా సవ్యంగా చేయించలేకున్నాను. మామూలు రోజులలో పని చక్కగా చేసుకుంటున్నాను. ఆమెతో కలసి చేసే పని, ఆమె చేత నేను చేయించేపని మాత్రం నాతరం కావడం లేదు. ఎల్లుండి మా తండ్రి గారి తద్దినం నా భార్య సహకారం లేకుండా చేయడమన్నది అసంభవం. తద్దినం చేయడం మానుకోనూ లేనూ, అలాగని చేయకుండా ఉండనూలేను. సవ్యంగా కార్యం నెరవేరేటట్లు మార్గం చూపించవలసినదిగా ప్రార్థన" అని నిలుచున్నాడు శిష్యుడు దీనంగా ముఖం పెట్టి.

అంటే నీ భార్య గయ్యాళి దన్నమాట! అన్నాడు గురువుగారు. 'గయ్యాళి' అంటే అర్థం ఏమిటి గురుదేవా? అని అమాయకంగా ప్రశ్నించాడు శిష్యుడు. అంటే దేనికైనా వ్యతిరేకంగా "గయ్" మని లేచేదే 'గయ్యాళి' నాయనా బదులిచ్చాడు గురువు.

సరే ఏమీ భయపడొద్దు. ఎల్లవేళలా నా ఆశీస్సులు నీకు ఉంటాయి. ఇలా దగ్గరకు రా అని కూర్చుండబెట్టుకుని ఏవో కొన్ని మాటలు చెప్పాడు గురువు. అలాగా? అయితే సరి. మరలా మిమ్మల్ని ఆహ్వానించేటందుకు రేపు సాయంకాలం వస్తాను. అని సాష్టాంగదండ ప్రణామాలు చేసి శిష్యుడు వెళ్ళిపోయాడు.

భర్త :- సుశీలా! రేపటి దినం మా తండ్రిగారి తద్దినం అని నీకు తెలియదు కదా?

భార్య :- ఏమండీ! ఎందుకు తెలియదు. మరిచిపోయాననుకున్నారా? ఎంత తక్కువగా అంచనా వేశారండీ నన్ను. ఏం? ఎందుకడిగారూ?

భర్త :- ఏం లేదు. తండ్రి తద్దినం కొడుకులు చేస్తారు. కానీ నేను చేయదలచు కోలేదు. అందుకని ఊరకనే అడిగానులే.

భార్య :- ఏం కొడుకండీ మీరు! కొడుకులు గాక బయటి వాళ్ళెవరైనా చేస్తారటండీ? మానెయ్యటానికి వీల్లేదు. తప్పక తద్దినం చెయ్యాల్సిందే.

భర్త :- (హమ్మయ్య ఓ పనైపోయింది అనుకుని లోలోన తన గురువుగారికి ధన్యవాదాలు తెలుపుకొన్నాడు) సరే ఏదో నీ మాట ప్రకారం చేస్తాను కానీ, ఊరకనే తూతూ మంత్రంగా చేశానంటే చేశాను. ఎవరినీ పిలవకుండా నామమాత్రంగా చేస్తానంతే...

భార్య :- భలేవారే. అలా చెయ్యడానికి ససేమిరా ఒప్పుకోను నేను. అందరినీ పిలవాల్సిందే. చాలా చక్కగా చెయ్యాల్సిందే.

భర్త :- (ఆహా! గురువుగారెట్టి చిట్కాను చెప్పారు అనిలోలోన సంతోషిస్తూ) నీవెలా చెబితే అలాగేలే. అని అన్ని సరకులూ తెప్పించి, అందరినీ పిలిచి, ఆ రోజు సాయంకాలం గురువు దగ్గరికెళ్ళి పాదనమస్కారం చేసి, తద్దినానికి ఆహ్వానించాడు. గురువు గారి ఆధ్వర్యంలో అందరికీ భోజనాలు పెట్టి పంపించాడు.

* మనసు ఒక గయ్యాళిది. ఏది చేయాలో దానిని చేయదు. దేనిని చూడవద్దు అంటే దానినే చూస్తుంది. మనసెపుడూ వ్యతిరేకం గానే నడుచుకుంటుంది. దానిని శక్తితో బాటు యుక్తితోకూడా జయిస్తూ ఉండాలి.

గౌరవించడమా? గౌరవింపబడటమా?

మనిషి మనసు నిరంతరం ఇతరుల చేత గౌరవింపబడాలనీ, అవసరాలకు ఆదుకోవాలనీ, సానుభూతి చూపించాలనీ, పరామర్శించి, ధైర్యం చెప్పి, ఓదార్చాలనీ ఉవ్విళ్ళూరుతూ ఉంటుంది.

కానీ ఇతరుల మనసులుకూడా అదేవిధంగా తమవైపు నుండి ఆశిస్తూ ఉంటాయని తెలిసి కూడా, ఆచరించడం అటుంచి మనసు కనీసం ఒప్పుకోదుకూడా.

చాలా మంది తమలో ఏవో కేవలం ఒకటో, రెండో సుగుణాలున్నా, అవే ఘనమైనవిగా భ్రమపడి నేను ఫలానా విధంగా గొప్పవాడిని అని తమకు తామే తృప్తిపడి తమను గుర్తించి, గౌరవించాలని తాపత్రయపడుతూ, అలా జరగకపోయేసరికి ఆవేదన చెందుతూ ఉంటారు. ఆశించిన గౌరవం లభిస్తే సంతోషం, లభించకపోతే అసహనం, బాధ, నిరాశ, విసుగు, కోపం, పగ, ప్రతీకారం లాంటి మనో వికారాలకు లోనౌతూ ఉంటారు.

గౌరవం పొందాలనెడి తపన అనేది వయసు, ప్రతిభ, అనుభవం, పదవి, సంపద, హోదాల వలన కలుగుతూ ఉంటుంది. కానీ అవతలివైపు వారిని కూడా అవే అంశాలపైన మనం గుర్తించి, గౌరవించలేము.

* ఇతరులను గౌరవించలేని నీవు ఎన్నటికీ గౌరవింపబడలేవు. పైవారిని నీవు గౌరవిస్తే నీ క్రింది వారు నిన్ను గౌరవిస్తారు.
* మనలను మెచ్చేవారు, మనలను ప్రశంసించే వారంటేనే మనకు ఇష్టం. కానీ మనం మెచ్చే వారంటేనే, మనం ప్రశంసించవలసిన వారంటేనే మనకు అయిష్టం.

ప్రశంసించడానికి మంచి హృదయం ఉండాలి.

కొంతమందికి నోరారా ప్రశంసించడానికి మాటా పెగలదు, మనసారా అభినందించడానికి మనసూ ఒప్పదు. మరికొంతమందికి ప్రశంసలను హుందాగా స్వీకరించడమూ తెలియదు. చేసిన మంచి పనులనూ మంచి ఆలోచనలనూ మనసారా

ప్రశంసించడం, ప్రోత్సహించడం, తమవంతు సహకారాన్నందించడం విశాల హృదయం ఉన్నవారి విశిష్ట లక్షణం. సరిఅయిన సమయం, సందర్భంలో చేసిన హృదయపూర్వక ప్రశంస అవతలి వ్యక్తుల జీవితాన్ని సమూలంగా మార్చి వేయగలదంటే! ఆశ్చర్యం కలిగించినా, అది సత్యమే.

మనిషి మానసికాభివృద్ధికి ప్రశంసకూడా అవసరమే. అయితే...ప్రశంస హృదయ పూర్వకంగా ఉండాలి, నిజాయితీగా ఉండాలి. "ముఖస్తుతిగానో, మునగచెట్టెక్కించేది గానో" ఉండకూడదు. అటువంటపుడే ప్రశంసించిన వారికీ, స్వీకరించిన వారికీ తృప్తినీ, ఆనందాన్నీ ఇస్తుంది.

నక్కలు బొక్కలు వెదుక్కునన్నట్లు ఇరుకు మనసులూ, మురికి ఆలోచనలూ కలిగిన వారికెపుడూ లోపాలూ, తప్పులూ కనిపిస్తూ ఉంటాయి. అలాంటివారు ఎదుటివారి మంచినికానీ, గొప్పతనాన్నిగానీ గ్రహించలేరు. విమర్శనాస్త్రాలను గురి చూసి సంధించి హృదయాలను ఛిన్నా భిన్నం చేయడంలో వారికి ఎవరూ సాటిరారు. కొంతమందికి ప్రశంసించాలని ఉబలాటం ఉండినా ఎదుటివారు 'ముఖస్తుతి' అనుకుంటారేమోనన్న భయం ఎదో ఒక అవసరం లేనిదే ఎందుకు పొగుడుతారు? అని అనుమానం పది మందిలో ప్రశంసించడం వలన ఎదుటివారికి ఇబ్బంది కలిగిస్తున్నామేమోనన్న మొహమాటం, మరేదో మానసిక వెనుకబాటుతనంతో ప్రశంసించలేకపోవటం, లాంటి అంశాలు అడ్డొస్తుంటాయి.

ప్రశంసలకు పూర్తి స్థాయిలో సార్ధకత లభించాలంటే... ప్రశంసలు శృతి మించకుండా చూచుకోవాలి. సమయం, సందర్భం చూచుకోవాలి. హృదయపూర్వకంగా ప్రశంసించినట్లుగానూ, అందులో నిజాయితీ ఉంది అనిపించేలా ఉండాలి. అలగే ప్రశంసలనందుకునేవారికి కూడా జీర్ణించుకోవడం సరిగా తెలియదంటే అతిశయోక్తి కాదు.

ప్రశంసించినపుడు "ఆ... దాందేముంది" అని త్రోసిపడేయకూడదు. అదంతా "మీ చలువ, మీ దయ" అనే బానిస భావమూ చూపించవద్దు. "అబ్బే! అదేంలేదండీ" అని ఖండించనూ వద్దు. చిరునవ్వుతో హుందాగా "ధన్యవాదాలు" అని చెబితే చాలు.

ప్రశంసలకు లొంగనివారెవరు ?

ఒక రాజు అప్పుడపుడూ "తనకు ప్రశంసలంటే అస్సలు పడదనీ, ప్రశంసించే వారం టేనే అసహ్యమనీ, అందుకే నేను ప్రశంసలకు లొంగను అని చెబుతూవుండేవాడు. విన్నవారంతా రాజు మాటకు ఎదురు చెప్పకుండా మౌనంగా ఉండేవారు.

ఇలా ఉండగా ఒక రోజు ఒక అపరిచిత వ్యక్తి రాజు కొలువుదీరి ఉండగా వచ్చి తనను తాను పరిచయం చేసుకొంటూ, తాను పొరుగుదేశం నుండి దేశాటనంచేస్తూ తమ కీర్తిని విని, తమబోటి ధర్మ ప్రభువులను కూడా దర్శించి వెళదామని వచ్చాను ప్రభూ! అన్నాడు. రాజు ఆశ్చర్యంగా, ఆతురతగా చూస్తూ వింటున్నాడు.

రాజుగారి శ్రద్ధను గమనించి "రాజా మీరు అరివీరభయంకరులని విన్నాను, మీరు కత్తిచేత బట్టితే ఎంతటి వీరుడైనా మీ ముందునిలువలేరట, ధర్మపరిపాలన చేస్తూ తమ దేశంలో పేదవారనే వారే లేకుండా చేశారట, పండితులను, కవులను మీరు బహువిధాల ప్రోత్సహిస్తారట, వారికి తగిన బహుమానాలుకూడా దయచేస్తారట. దొంగతనాలు, దోపిడీలు చేసేవారికి మీరు కఠిన శిక్షలు విధిస్తూ, వారికి సింహ స్వప్నంగా ఉన్నారట. మీ రాజ్యం శత్రుదుర్భేద్యమట. సిరి సంపదలకూ, పాడిపంటలకూ ఆలవాలమట. మిమ్ములను దర్శించి, మీ పరిపాలనను గురించి తెలుసుకోవాలని వచ్చిన పొరుగు రాజ్య పౌరులను మీరు ఆదరిస్తారట, ఘనసన్మానాలతో సాగనంపుతారట" అని అన్నాడు.

అంతే వెంటనే రాజావారు "శహభాష్ మి ఆసక్తికి, మీ పరిశీలనా శక్తికి, మీ యొక్క సమయస్ఫూర్తికి సంతోషిస్తున్నాం" అంటూ అతడిని ఘనంగా సన్మానించి, భారీ బహుమానాలనిచ్చి సాగనంపాడు.

అంతా అయ్యాక మంత్రివర్యులు రాజావారితో "క్షమించాలి మీరు మరోలా అనుకోకుంటే ఒక విషయం విన్నవించుకుంటాను" అన్నాడు. సరే అదేంటో చెప్పమన్నాడు రాజు. ఏం లేదు మహారాజా "మీరు పొగడ్తలకు లొంగరనీ, ప్రశంసలంటే అసహ్యమనీ అంటూ ఉండేవారు కదా?" అని..... నిజమే మహామంత్రీ అవి "ప్రశంసలూ కావు, పొగడ్తలూ కావు, అతిశయోక్తులు అంతకంటే కానే కావు. అవన్నీ పచ్చి వాస్తవాలు, నిప్పులాంటి నిజాలు కాబట్టే అతడిని సన్మానించాను" అన్నాడు రాజు. ఔరా! పొగడ్తలు ఎంత పని చేస్తాయి! అనుకున్నాడు ఆశ్చర్యపోతూ మహామంత్రి.

* ప్రశంసలకు పొంగి, ఉబ్బి-తబ్బిబ్బై పోవడం మనసు యొక్క నైజం.
* ప్రేమించడమంటే హృదయంతో ప్రశంసించడం.ప్రశంసించడమంటే మనసుతో ప్రేమించడం.
* మెచ్చుకునే వారెందరు ఉంటారో, నొచ్చుకొని తూలనాడే వారూ అంతే మంది ఉంటారు. లోకమంతా మెచ్చిన గొప్పవాడు ఇంతవరకూ పుట్టనే లేదు, పుట్టబోడు కూడా. దేవుడే దిగివచ్చినా లోకాన్నంతటినీ మెప్పించలేడు.
* ఈ రోజు ప్రశంసించి దండలువేసి భుజాల మీదికి ఎత్తుకుని, బ్రహ్మరథం పట్టిన వారే కొన్నాళ్ళకు నేలపాలు చేయవచ్చు మనవారు అనుకుని, వారికోసం అన్నీ త్యాగం చేసినా, చివరికి మనమే అనవసరము, పనికి రాని వారమని తూలనాడవచ్చు. బ్రతకడం, చేతకానివారమని నిందించనూ వచ్చు.
* ఎలా ఉన్నా, ఏం చేసినా, ఎంత త్యాగం చేసినా లోకం మెచ్చుకోదు. ఒకవేళ కొంతమంది మెచ్చినా, మరికొంత మంది తూలనాడుతూనే ఉంటారు.
* తిట్టేవారెలాగూ ఉంటారు. ఏంచేసినా, ఎంత చేసినా సార్థకం లేనపుడు, అధర్మాలను,

అన్యాయాలనూ, అక్రమాలనూ ఉపాయంగా, ఎవరికీ దొరకకుండా చేసుకుంటూ పోదాం, లోకంతో పనేముంది? ఎవడు మెచ్చుకుంటే ఏమి ఒరుగుతుంది? తిట్టుకుంటే ఏమి తరుగుతుంది, పోరాదా! అనుకోవడం మంచి వ్యక్తిత్వం అనిపించుకోదు. భగవంతుడనేవాడొకడున్నాడు. ధర్మమనేది ఒకటుంది అనే విషయాన్ని విస్మరించరాదు.

* లోకంలో బ్రతుకుతున్నందుకు లోకహితంకొరకు చేయగలిగింది చేతనైనది, శక్తినిదాచుకోకుండా, శక్తికి మించకుండా చేయవలసింది చేయండి. అంతేకానీ గుర్తింపు కోసం, మెప్పుదలకోసం ప్రశంసలకోసం ఆరాటపడనే కూడదు. లోకం గమనించినా, గమనించకపోయినా పరమాత్ముడు గమనిస్తూనే ఉంటాడు.
* లోకాన్ని మెప్పించడానికీ, లోకంలో గౌరవింపబడేదానికీ విన్యాసాలు చాలానే చేయాల్సి వస్తుంది. లోకులను మెప్పించి, వారి ద్వారా స్వార్థాలు నెరవేర్చుకోవడానికి అసత్యాలు చెప్పడం, వాగ్దానాలు చేయడం, పుకార్లు, వదంతులను పుట్టించడం, మోసాలు చెయ్యడం, నందిని పందిగా చేయడం, బురద చల్లడం, నిందించడం, కించపరచడం, అడ్డంగా దూసుకొనిపోవడం, రంగులు మార్చడం, రంగులు పులమడం, తమ తప్పులను ఒప్పుకోకపోవడం, ఇతరుల తప్పులను ఎత్తిచూపడం లాంటివి ఎన్నో చేయాలి. కానీ భగవంతుని మెప్పుదల కోసం ఇన్ని బాధలు పడనవసరమే లేదు, జాగ్రత్తలు తీసుకోవడం ఏమాత్రం అవసరం లేదు. త్రికరణ శుద్ధిగా మంచిని చెపుతూ, మంచిని చేస్తూ, చెలిమినీ కలిమినీ పంచుతూ, చెడును త్రుంచుతూ జీవిస్తే చాలు లోకమంతా మెచ్చుతుంది. లోకేశ్వరుడూ మెచ్చుతాడు.
* గొప్పవారు వ్యక్తిక్షేమం, లోకహితం కొరకు, సంస్థ, అభివృద్ధి కొరకు వాతావరణాన్ని నిర్మలంగా, ఆహ్లాదకరంగా ఉంచుట కొరకూ చేసే పనులను, ప్రయత్నాలనూ అలా అలా చేస్తూ పోతూనే ఉంటారు.
* అసూయాపరులు, వంచకులు, అభివృద్ధి నిరోధకులు వీధికుక్కలవలె అరుస్తూ, అడ్డుపడుతూ ఉంటారు. పరోక్షంగా గొప్పవారి గొప్పతనానికి వన్నెతెస్తూ ఉంటారు.
* చెడ్డవారు లేనిదే మంచివారి మంచితనం బైటపడదు.
* ఇతరులను మనం గౌరవించినపుడు, అందరూ మనల్ని గౌరవిస్తారు. మనతో స్నేహం చేయాలని చూస్తారు. వారి మాటను మనం వింటే, మన మాటనూ వారు వింటారు.

గుర్తింపుకోసం ఆరాటం

పూవు వికసిస్తూనే పరిమళం తనంతట తాను సహజంగా బైటికి వస్తుంది. గాలి వీచగనే నలుదిక్కులకు వ్యాపిస్తుంది. వసంతం రాగానే కోయిల కూజితాలు వినబడతాయి. పరవశించినవారు కుహూకుహూ అని కూడా ప్రతిధ్వనిస్తారు, ఆనందిస్తారు.

"నిండుకుండ తొణకదు" ప్రతిభావంతులైన సంస్కారవంతులు తమను గుర్తించాలని ఎన్నడూ కోరుకోరు. ప్రతిభ, పరిమళం దాచినా దాగవు. అణగద్రొక్కినా, తాత్కాలికంగా అణగి, కాలం కలసిరాగానే రెట్టింపు వేగంతో బైటికి వచ్చి వ్యాపిస్తాయి.

చాలా మంది తమను గుర్తించాలనీ, గౌరవించాలనీ తపనపడుతూ ఉంటారు. అడుగడు నా గుర్తింపును, ప్రశంసలను, కృతజ్ఞతలను ఆశిస్తూ ఉంటారు. తదనుగుణంగా పలకరించి, మాటకలిపి, సందర్భాన్ని మలుపు తిప్పి, తాము ఇంతకు మునుపు పడిన శ్రమనంతా ప్రశంసాపత్రాన్ని చదివినట్లు చదివేస్తారు. ఎదుటివారికి సమయం, ఉత్సాహం ఉందో లేదో కూడా అసలు పట్టించుకోరు. అవునన్నాకాదన్నా తప్పదన్నట్లు సహనానికి పరీక్ష పెడతారు. సంఘ సేవకులు, ఉపన్యాసకులు, రాగాలు తీసే సంగీత గాయుళ్ళు, తమ ప్రతిభాపాటవాలను చాటుకోవాలని, తెగ ఆరాట పడిపోతూ ఉంటారు. అదే కోవకు చెందిన వారంతా ఒక్కోసారి కలుసుకునే సందర్భాలలో తమనే గుర్తించాలని ఇక పోరాడతారు చూడూ... ఆ తపన, ఆ తాపత్రయం ఇతరులకు ఎబ్బెట్టుగా అనిపించినా వారి ఆరాటం, వారి పోరాటం ఆగదు. మరి కొందరు తమని తాము గౌరవించుకోవడంతో సరిపెట్టుకోక మరెవ్వరినీ తాము గౌరవించ కూడదు అనే నియమం పెట్టుకొని ఉంటారు. తమకంటే గొప్పవారైనప్పటికీ గౌరవించరుగాక గౌరవించరు. ఎందుకంటే తమకు తామే తక్కువైపోయినట్లుగా ఆత్మన్యూనతా భావానికిలోనై బాధపడిపోతూ ఉంటారు. కొందరు తమకు నచ్చని వాళ్ళను ఇతరులు గౌరవించక పోవడమేగాక, తమ ముందు వారిని అగౌరవంగా మాట్లాడితే వినాలని తెగ ఉబలాటపడిపోతూ ఉంటారు. ఆ విధమైన ప్రస్తావనకు తెలివిగా తామే శ్రీకారం చుడతారు కూడా. గౌరవించే సంస్కారం లేనపుడు గౌరవాన్ని ఆశించవచ్చా? గౌరవం పొందుతారా? ప్రతిభను గొప్ప తనాన్ని, శ్రమను సమకాలీనులు ఎన్నడూ గుర్తించి, కీర్తించరు. "వజ్రం విలువ కంసాలికే తెలుసు" ఇతరుల గొప్పదనం గొప్ప వారే గ్రహించగలరు. గౌరవించడం సహజ లక్షణంగా ఉండాలిగానీ, నటనగా ఉండకూడదు.
* విమర్శ సద్బుద్ధి తోనూ, ప్రశంస సహృదయంతోనూ చేయాలి.

ధనికుడినీ, రాజకీయ నాయకుడినీ చూచి అందరూ లేచి నిలబడతారు, గౌరవిస్తారు. ధనం లేనివాడు, పదవి పోయినవాడు గౌరవింపబడరు. కానీ ఒంటినిండా కనీసం బట్టలుకూడా లేని సద్గురువులను, సన్యాసులను చూడగానే సాష్టాంగ నమస్కారాలు చేస్తారు. ఎందుకని? వారిలోని సహజమైన గొప్పదనం అలా చేయిస్తుంది.

ఒక వ్యక్తి గొప్పవాడైనాడు అంటే అతని శ్రమ వెనుక సమయపాలన, క్రమశిక్షణ, కృషి, పట్టుదల, త్యాగం, చివరంటూ పోరాడే తత్వం ఇలా ఎన్నో సుగుణాలుంటాయి. ఇవేవీ లేకుండానే ఆశలు మాత్రమే ఉన్న మనిషి తానాశించిన రీతిలో గౌరవింపబడాలను కోవడం దారుణం చివరికి వారు పొందేది అవమానం మాత్రమే.

కొందరు అద్భుతమైన పథకాలు వేస్తుంటారు. కానీ ఆచరణలో అణుమాత్రమైనా పాటించరు. "మాటలు కోటలు దాటుతాయి. అడుగులు మాత్రం గడప దాటవు".

మరికొందరు నామమాత్రంగా శ్రమిస్తూ అద్భుతంగా కఠోర పరిశ్రమ చేస్తున్నట్లుగా ఫోజులు పెడతారు. దుర్బలమైన అర్భకులకు ఆశలెక్కువ, అర్హతలు తక్కువ.

* గొప్పవారు పోరాడితే ఫలితాలను అందుకొని, అనుభవించడానికి సామాన్యులు అగ్రశ్రేణిలో ఉంటారు.

నరమాంస భక్షకి పులితో పోరాడి చంపి అలసి, సొలసి పడిపోయింది యువరాజైతే, ఇదే అదనుగా తోకనూ, గోర్లనూ కోసుకొని వెళ్ళి, మహరాజుకు చూపించి బహుమతిని, గుర్తింపును పొంది చివరకు నిజంబైటపడి, ఉప్పుపాతరకు గురైనాడు. చాకలి పులిమామగాడు.

"కష్టమొకడిదైతే ఫలితం మరొకడిది" అన్నట్లుగా కొంతమంది దగాకోరులు ఇతరుల కష్టాన్ని దోచుకుంటూవుంటారు.తాత్కాలికంగా గుర్తింపు, గౌరవం పొందినప్పటికీ చిట్టచివరకు మాత్రం ఇలాంటి వారికి ఘోరంగా అవమానం జరగడం ఖాయం.

* కొంతమంది స్వప్రయోజనం పొందటానికి వినయ విధేయతలను చూపిస్తూ ఉంటారు. అడుగడుగునా నమస్కారాలు పెడుతుంటారు "ఉద్దరకూటికి నిద్దుర మేలుకొని ఉంటారు"అవసరంలో అణగిమణిగి ఉంటారు. అవసరం తీరాక అధికులమని ఫోజులు పెడతారు. తమకు తెలుసు తమలో ఏ మంచి గుణమూ లేదని. అయినా తామూ అధికులమేనని, గొప్పవారమేనని వాదిస్తారు. తమకూ అర్హతలున్నాయని, అధికారాలకోసం ఆరాటపడతారు, పోరాటం చేస్తారు. తాము పోటీవడేదీ, ఎదిరించి మాట్లాడేదే వాస్తవంగా అర్హతలు కలిగిన వారితోననీ, గొప్పగుణాలున్న వారితోననీ, ఆత్మాభిమానం కలవారితోననీ తెలుసు. అయినా సర్వశక్తులూ ఒడ్డి పోరాడతారు. పందులు ఎలాగ మలాన్ని తింటూ, మురికిలో పొర్లాడుతూ ఆనందిస్తాయో! అలాగే నీచులు, నీచత్వంలో ఆనందంగా మునిగి తేలుతూ, వాతావరణాన్ని వీలయినంత విజయవంతంగా కలుషితం చేస్తూ ఆనందిస్తూ ఉంటారు. ఆవిధంగానే గుర్తింపబడుతూ ఉంటారు, అదే గొప్పతనమని తలెత్తుకుని బ్రతికేస్తూ ఉంటారు.

నేనే కదా గొప్ప

ఒక నగరంలో ఉత్సవ సందర్భంగా ఒక గుర్రాన్ని బాగా అలంకరించి, దానిపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగిస్తున్నారు. ఆ గుర్రం ఏ ఇంటికి వెళ్ళినా విగ్రహానికి దండంపెట్టి, పూలు, పండ్లు, నైవేద్యం సమర్పించి, టెంకాయలు కొడుతున్నారు. ఏ సందులోకి వెళ్ళినా వేలాది మంది భక్తులు తలలు వంచి నమస్కరిస్తున్నారు. గుర్రం నడచివెళ్ళిన నేలపై నుండి దుమ్ము తీసుకుని నుదట బొట్టులాగా పెట్టుకొంటున్నారు. గుర్రానికి పచ్చగడ్డిని, గుగ్గిళ్ళను అందిస్తున్నారు, నీళ్ళను కూడా తాగిస్తున్నారు. దేవుడిని కీర్తిస్తూ, భజనలు చేస్తున్నారు.

ఈ తతంగమంతా చూచిన గుర్రానికి ఆహా నాలో ఎన్ని గొప్ప గుణాలున్నాయి. అందుకే వీరు నాకు నమస్కారాలు పెడుతున్నారు. అని అహంకారంగా ఆలోచించడం మొదలు పెట్టింది. భక్తులు జయజయ ధ్వానాలు చేసే కొద్దీ, గుర్రం అహంకారంతో చిందులు వేయడం, ఎగిరిదూకడం లాంటి పనులు చేస్తూ దారి ప్రక్కనే ఉన్న బురదకుంట లోకి దూకింది. బురదలో కూరుకు పోయింది. కాసేపు ఎలాగో తంటాలు పడి బయటికి వచ్చి, వీధుల్లో నడవసాగింది. అయితే తనపై ఉన్న దేవుడి ఉత్సవ విగ్రహం బురదకుంటలో పడిపోయిన సంగతి గుర్తించలేదు.

అహంకారంతో ఠీవిగా నడుస్తూ ఉంది. ప్రజలు నమస్కరిస్తారనుకున్నది, కానీ ఎవరూ నమస్కరించడం లేదు, టెంకాయలు కొట్టడం లేదు. అసలు ఎవరూ దానిని గురించి పట్టించుకోవడం లేదు. అక్కడున్న తుంటరి పిల్లలు దానిని పట్టుకుని స్వారీ చేసేదానికి ప్రయత్నం చేశారు. దేవుని విగ్రహం ఉన్నంతవరకే గుర్రాన్ని గౌరవించారు. అది లేనపుడు దాన్ని గౌరవించకపోగా, చులకన చేయసాగారు.

* ఎక్కువమంది ఆలోచించేదీ, శ్రమించేదీ గుర్తింపుకోసమే. గుర్తింపు వల్ల పేరు ప్రతిష్టలు, తద్వారా పదవులు, సంపదలు లభిస్తాయి. గుర్తింపు వల్ల కలిగే ఆనందం, తృప్తి తాత్కాలికమైనవి మాత్రమే.
* మంచి పనులను మంచి ఆలోచనలను మెచ్చుకోవడం, ప్రోత్సహించడం, బహుమతులను, జ్ఞాపికలను ఇవ్వడం, శహభాష్, వేరీగుడ్, కంగ్రాట్స్, కీపిటప్ అనడం, భుజం తట్టడం, ఆశీర్వదించడం లాంటి ప్రశంసలు బాధ్యతను మరింత పెంచుతాయి.
* చిన్న-పెద్ద, ఆడ-మగ, పేద-గొప్ప, తేడా లేకుండా అందరినీ ఆనందపరచేవి ఎదుటి వారిచ్చే గుర్తింపు, మెచ్చుకోలే. కానీ ప్రశంసలు ఉత్త చేతితో తినిపించడంలాంటిదని మరువకూడదు.

చూపంతా ప్రక్కవాడిపైనే, అసూయ - అహంకారం అయిన వాడిపైనే

అసూయ అనేది మానసిక మాలిన్యం. ఈ మాలిన్యం మనిషన్న ప్రతివాడికీ కొద్దో గొప్పో తప్పక ఉంటుంది. ముఖ్యంగా అయినవారిలో, ప్రక్కనున్న ఇరుగు పొరుగు, వెనుక, ముందు ఉన్న వారిలో బంధు, మిత్రాదులలో పరిచయస్తులలో, నిత్యం కలిసి పలుకరించే వారిలోనే ఈ అసూయాహంకారం కనిపిస్తూ ఉంటుంది.

తనకు లేని సుఖం ప్రక్కవారికి ఉందని, తనకు దక్కని అవకాశం ఎదుటి వాడికి దక్కిందని, నిత్యం మనకళ్లెదుట తిరిగే వాళ్ళకు ఆర్థిక లాభమో, మంచి ఉద్యోగమో, వ్యాపారంలో కలసిరావడమో జరిగిందంటే చాలు "కన్నుకుట్టని వారు కడుపు మండనివారు", "కళ్ళలో నిప్పులు పోసుకోని" వారుండరు. అసూయ లేకుండ జీవించడం మహాత్ములకు తప్ప ఇతరులకు సాధ్యం కాదు.

ప్రక్కనున్నవాడు సుఖంగా ఉంటే సహించనూ లేడు, దుఃఖంలో ఉంటే ఓదార్చనూ లేడు. ఏదైనా కష్టం, నష్టం, బాధ కలిగితే "అబ్బ మంచి పనైంది వీడికి. ఇలా జరగాల్సిందే" అనుకుని అదోరకమైన తృప్తి పొందుతూ ఉంటాడు మనిషి.

మన పొరుగు వారికంటే సుఖ సౌకర్యాలను ఎన్నో రెట్లు అధికంగా అనుభవించేవారు ఎందరో ఉంటారు. కానీ చూపువారిమీదికి పోదు. ఎందుకంటే వారు ఎదురుగా ఉండరు కాబట్టి, మనసు వారి మీద ఈర్ష్యాసూయలకు లోనుకాదు. ఇతరులతో పోల్చుకోవడం అనేది తన లోపాలను సరిదిద్దుకొని అభివృద్ధి సాధించడం కోసం దోహదపడాలిగానీ అసూయకు లోనై, ఆత్మన్యూనతాభావంతో మానసికంగా కృంగిపోవడం కోసంకాదు, దిగజారడం కోసం కాదు.

మనిషి సంఘ జీవి. ఇరుగు పొరుగు, బంధు-మిత్రులు, పరిచయస్తులు లేకుండా క్షణమైనా జీవించలేడు. అందరితో కలసి ఆనందంగా జీవించాలిగానీ అసూయతో కుంచించుకొని పోకూడదు. ఎదుటివారి అభివృద్ధి, ఆనందం, ఔన్నత్యం మనలో సంతోషాన్ని నింపాలి. అసూయను అదుపులో ఉంచుకొనకపోతే మనసు బుద్ధిని ఆక్రమించి, నేరప్రవృత్తి దిశగా మనిషిని పతనం చేస్తుంది. ఎదుటివాడికి దక్కిన అవకాశాలను, ఆనందాలను దక్కనివ్వకుండా దూరం చేయ్యాలనే ప్రయత్నంలో మనిషి రాక్షసుడైపోతాడు.

ఇలాంటి స్వార్థపూరిత మానసిక స్థితి నుండి బైటపడాలంటే ఒక్కటే మార్గం. అదే- తాత్విక చింతన, ఆధ్యాత్మిక మార్గం. మనం ఎవరిమీదైతే ఈర్ష్యపడుతున్నామో, వారికంటే అధికంగా సుఖ సౌకర్యాలను అనుభవించేవారున్నారనీ, మనకు ప్రాప్తించిన కొద్దిపాటి అదృష్టానికికూడా నోచుకోని అభాగ్యులు ఎంతో మంది ఉన్నారనే వాస్తవాన్ని తెలుసుకోవాలి. కాలం ఎప్పుడూ ఒకేరీతిగా ఉండదు. ప్రతి ఒక్కరి జీవితంలో ఏదో

ఒక రోజు అవకాశం, సందర్భం తప్పక వస్తుంది. మనం చేయవలసిందల్లా సహనంతో వేచిచూడటమే. తొందరపాటు తనంతో అవకాశం కోసం, ఫలితాల కోసం అర్రులు చాస్తే, అవకాశం కాస్త ఆమడ దూరం పోతుంది. వారం రోజులలో పూర్తి కావలసిన పని వందరోజులైనా కాకపోవచ్చు. కాబట్టి అసూయ, పరనిందను అధిగమించి తను చేయదగినపనేదో దానిమీద దృష్టి పెట్టి ప్రయత్నిస్తూ పోతే కాలం కలిసొచ్చినపుడు ప్రయత్నం సఫలమౌతుంది. లేకుంటే 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా, 'గొర్రెతోక బెత్తెడే' అన్నట్లుగా జీవితం ఎదుగూ బొదుగూ లేకుండా, బ్రతుకంతా దుర్భరమవుతుంది

తప్పించుకునే మార్గం లేనప్పడే తప్పొప్పుకుంటుంది మనసు

కదిరాయ చెరువు అనే గ్రామంలో నాగయ్య అనే మోతుబరి రైతు నివసించేవాడు. అతనికి సుబ్బయ్య, రెడ్డెప్ప అనే ఇద్దరు కొడుకులుండేవారు. కుమారులిద్దరూ తండ్రికి వ్యవసాయపు పనుల్లో చేదోడు వాదోడుగా ఉండేవారు. ఇద్దరికి వివాహలు కూడా అయ్యాయి. కొంత కాలానికి నాగయ్య చనిపోయాడు. తండ్రి మరణించాక సోదరులిద్దరూ వేరు కాపురాలు పెట్టారు. తండ్రి వదలి వెళ్ళిన పాతిక ఎకరాల పొలాన్ని మాత్రం ఉమ్మడిగా సేద్యం చేసి ఖర్చులు పోను మిగిలిన పంట ఫలితాన్ని సమానంగా పంచుకునేవారు.

ఒక సంవత్సరం పంటకోతలయ్యాయి. అన్నదమ్ములిద్దరూ కల్లంలో వడ్లన్నీ బస్తాల కెత్తించి ఒక చోట పెట్టించారు. పొద్దు గ్రుంకింది. ఎన్ని బస్తాలు ఉన్నదీ లెక్కించుకున్నాడు తమ్ముడు. అన్న తన నౌకరునొకడిని రాత్రి కల్లం దగ్గర కాపలా ఉండమని చెప్పాడు. అన్నదమ్ములిద్దరూ ఇళ్లకు చేరుకున్నారు.

మరుసటి రోజు పొద్దున్నే సుబ్బయ్య, రెడ్డెప్ప ఇద్దరూ కల్లం దగ్గరికి వచ్చారు. తమ్ముడు తన బస్తాలను లెక్కపెట్టగా ఇరవై బస్తాలు తక్కువగా ఉన్నాయి. మరొక్కసారి జాగ్రత్తగా లెక్కించాడు. అనుమానమే లేదు. ఇరవై బస్తాలు మాయమయ్యాయి. తమ్ముడు ఆశ్చర్యపడ్డాడు. తన ఇరవై వడ్ల బస్తాలు దొంగలింపబడ్డాయని గ్రహించి బాధపడ్డాడు. ఏమీ తెలియనట్లు ఇంటికెళ్లాడు. ఇల్లు చేరగానే తన భార్యకు విషయమంతా చెప్పాడు. ఇద్దరూ తర్కించుకున్న తర్వాత రెడ్డెప్ప నేరుగా గ్రామ న్యాయాధికారి దగ్గరికెళ్ళి తనకు జరిగిన అన్యాయాలను వివరించాడు. దీనికంతటికీ కారణం దురాశాపరుడైన తన అన్న సుబ్బయ్యే అని వివరించాడు. "నీ అన్నే ఈ పని చేయుస్తున్నాడని ఎలా చెప్పగలవ్?" అని ప్రశ్నించాడు న్యాయాధికారి.

అపుడు రెడ్డెప్ప "అయ్యా! రెండేళ్ళ క్రితం అతను నలభై బస్తాలు నొక్కేశాడు. పోనీలే అన్న కదా అని సరిపుచ్చుకున్నాను. నిరుడు దాదాపు పాతిక బస్తాలు తన ప్రక్కకు వేసుకున్నాడు. అపుడే ఆ విషయాన్ని అడిగాను. "ఏరా? అన్న అనే గౌరవం కూడా లేకుండా మాట్లాడ్డమే కాకుండా దొంగతనంకూడా అంటగడతావా? అని నన్నే

గదమాయించాడు. ఇద్దరి పరువూ పోతుంది కదా! అని బాధను దిగమింగుకున్నాను. ఈ సారికూడా చేతి వాటం చూపించాడు. అవమానాన్ని, అన్యాయాన్ని సహించలేక మీ దగ్గరికి వచ్చి విన్నవించుకున్నాను. ఈ రోజు రాత్రికి కూడా వీలైనన్ని దోచుకుంటాడు. ఈ దోపిడీని, దౌర్జన్యాన్ని అరికట్టి నాకు న్యాయం జరిపించండి అని ప్రార్థించాడు. గ్రామ న్యాయాధికారి బాగా ఆలోచించి నీకు న్యాయం చేస్తాను, దిగులు పడకుండా నిశ్చింతగా వెళ్లు నేను చెప్పినట్లు చెయ్యి అంతే అని రహస్యంగా చెవిలో ఏదో చెప్పి పంపించాడు. రెడ్డెయ్య న్యాయాధికారి చెప్పినట్లు చేసి ఇల్లు చేరుకున్నాడు.

తెల్లవారింది. న్యాయాధికారి సుబ్బయ్యను పిలిపించి కల్లంలో మీ తమ్ముడికి చెందిన వడ్ల బస్తాలలో యాభై బస్తాలు నీవు దొంగిలించావని నీ తమ్ముడు రెడ్డెప్ప ఫిర్యాదు చేశాడు. దీనిపై నీ సంజాయిషీ ఏమిటి? అని ప్రశ్నించాడు. అందుకు సుబ్బయ్య అదంతా అబద్ధం; ఆ విషయమే నాకు తెలియదు అన్నాడు.

న్యాయాధికారి అన్నదమ్ముల నిద్దరినీ వెంట బెట్టుకుని పొలంలోని కల్లం దగ్గరికెళ్ళాడు. అక్కడ ఒక చోట కొన్ని రాగులు వరుసగా పడున్నాయి. న్యాయాధికారి సుబ్బయ్యను "వడ్ల కల్లం దగ్గర ఈ రాగులు ఎలా వచ్చాయి? అని ప్రశ్నించాడు. అందుకు సుబ్బయ్య అదే నాకూ అర్థం కావటం లేదు. అంతా అయోమయంగా ఉంది అన్నాడు.

న్యాయాధికారి రాగులు పడిన వరుస వెంబడి నడవసాగాడు. అన్నదమ్ములు, నౌకర్లు ఆయనను అనుసరించారు. ఆ రాగుల వరస పొలందాటి, దారి వెంబడి ఊళ్లోని అంజయ్య చిల్లర దుకాణం వరకు ఉంది. ఆపైన రాగుల వరుస కనిపించలేదు. అంజయ్య కొట్టు వెనుక గదిలోకి వెళ్ళి చూడగా వడ్ల బస్తాలు కనిపించాయి. న్యాయాధికారి కళ్ళెర్రజేసి గద్దించి అడిగే సరికి అంజయ్య భయంతో మొన్న ఇరవై బస్తాలు నిన్న ముప్పై బస్తాలు సుబ్బయ్య నాకు అమ్మినాడు అని నిజం చెప్పేశాడు. తప్పించుకునేదానికి వీలులేక సుబ్బయ్య తను చేసిన దొంగతనాన్ని ఒప్పేసుకున్నాడు. ఇంతకు మునుపు చేసిన దొంగతనం తాలూకు బస్తాల మొత్తంకూడా అపరాధంతో సహా చెల్లించక తప్పలేదు.

నిన్న రాత్రి కల్లానికి వెళ్ళి పై వరుస వడ్ల మూటల్లో ఒక రాగుల మూట వేసి దానికి ఒక రంధ్రం వేయమని న్యాయాధికారి ఎందుకు చెప్పాడో రెడ్డెప్పకు ఇపుడు అర్థమయింది. తనకు న్యాయం చేసిన న్యాయాధికారికి రెడ్డెప్ప హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకున్నాడు.

* తప్పించుకునే దానికి వీలు లేనపుడే మనసు లొంగిపోతుంది. ఏ మాత్రం చిన్న అవకాశం దొరికినా నేను తప్పు చేయలేదు అని మనసు తప్పించుకోజూస్తుంది.
* తప్పు చేసినందుకు హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడితే తప్పులు పునరావృతం కాకుండా జాగ్రత్త పడవచ్చు.

మనం ఒకటితలిస్తే దైవం మరొకటి తలుస్తుంది.

ఒక వనంలోని మూడు పెద్ద చెట్లు తమలోని కోర్కెలను ఇలా చెప్పుకున్నాయి. నా శరీరం అందమైన నగల పెట్టెగా మారాలి అని మొదటి చెట్టు, నేను చక్రవర్తికి పల్లకిని కావాలి అని రెండో చెట్టు. నేను దేవుని బొమ్మలుగా మారాలి అని మూడో చెట్టు తమ కోరికలను బైటపెట్టుకున్నాయి. కొన్ని రోజుల తర్వాత కొంతమంది గొడ్డళ్ళతో వచ్చి ఈ మూడు చెట్లను నరికారు. నగల పెట్టెగా మారాలనుకున్న చెట్టు పశువులకు దాణా వేసే తొట్టిగా తయారైంది. తనకోరిక నెరవేరనందున ఆ చెట్టు ఆవేదన చెందింది. చక్రవర్తికి పల్లకిగా రూపొందాలని ఆశపడ్డ చెట్టు ఒక నాటుపడవగా తయారై నీళ్ళలో పడింది. ఆ విధంగా తన ఆశ నిరాశ అయినందుకు బాధపడింది. దేవుని బొమ్మలుగా మారాలనుకున్న చెట్టు కొమ్మలన్నీ నరికివేసి మొద్దును మాత్రం ఒక చోట అలాగే పడవేశారు. ఆ పరిస్థితిని మూడో చెట్టు మౌనంగా భరించింది.

రోజులు గడిచాయి. ఓ రాత్రి వేళ పశువుల పాకలో ఒక వ్యక్తి గర్భవతి అయిన భార్యతో వచ్చి తలదాచుకున్నాడు. అక్కడ ఆమె ఒక తేజోమూర్తిని ప్రసవించింది. దాణా తొట్టెలో ఆ శిశువును ఉంచింది. ఈ పసిడి పసివాడిని మించిన బంగారు ఆభరణం ఏముంటుంది? అని తొట్టె సంతోషించి, తృప్తి పడింది.

ఆ తేజోమూర్తి పెరిగి పెద్దవాడయ్యాడు. గొప్ప తపశ్శాలి అయ్యాడు. ఒక సారి ఆయన నాటు పడవలో ప్రయాణిస్తూ ఉండగా నదీ ప్రవాహం ఉధృతమైంది. ఆ పడవను సురక్షితంగా ఒడ్డుకు చేర్చి ప్రయాణీకులనందిరినీ రక్షించాడు. అందుకు ఆ నాటు పడవ ఈ మహానుభావుడిని మించిన చక్రవర్తి ఎవరున్నారు, అంటూ పల్లకి కాలేని నాటుపడవ తృప్తి పడింది. ఆ తేజోమూర్తిని చూచి సహించలేక, ఈర్ష్యపడి కొందరు నీచులు ఆయనకు శిక్ష విధించారు. ఒక మూల పడివున్న పెద్ద మొద్దును బయటకు తీసి శిలువగా మార్చారు. ఆ శిలువ పైనే ఆయనను ఉంచి మేకులను దిగకొట్టి ఆ శిలువను నిలువుగా పాతిపెట్టారు. దేవుని బొమ్మలుగా మారాలనుకున్న ఆ కొయ్య కోరిక ఆ విధంగా ఫలించింది.

ఆ మూడు చెట్ల కోరికలూ తీరాయి. కానీ అవి కోరుకున్న రూపంలో కాదు. ఊహించని రీతిలో, భగవంతుడు నిర్దేశించిన విధంగానే! భగవంతుడు అందరి కోరికలనూ తీరుస్తాడు. కానీ ఆయన అల్లిక ప్రకారమే కథ నడిపిస్తాడు.

మనసును నియంత్రించాలంటే అసలు అదేమిటో తెలుసుకోవాలి. దాని తత్వమేమిటో తెలుసుకోవాలి. శ్వాసే ప్రాణం. ప్రాణమే మనసు. మనసుకు మూలం ప్రాణం. శ్వాస, మనసూ రెండూ ఒకటే. ఇందులో ఏ ఒక్కటి నశించినా రెండవదీ నశించినట్లే. ఊపిరున్నంత వరకూ మనసుంటుంది మెలకువలో అది తెలుస్తూనే ఉంటుంది. శ్వాసతో కలసి మనసు చలిస్తూ ఉంటుంది. సంకల్ప, వికల్పాలతో

నిరంతరం వాయు వేగంతో సంచరిస్తూనే ఉంటుంది. క్షణంలో వందో వంతు కాలం కూడా నిశ్చలంగా ఉండదు. మనసును సాధారణంగా కోతితో పోలుస్తూ ఉంటారు. కోతికూడా నిలకడగా ఒకచోట ఉండదు కాబట్టి.

కోతి మనసు

నైమిషారణ్యంలోని ఒక పెద్ద నీటికుంట దగ్గరున్న మర్రి చెట్టు పైన కోతుల దండు నివసిస్తూ ఉండేది. అవి అడవిలో దొరికే ఆకులు, అలుములు, పూలు, పండ్లు, కాయలు, తింటూ ఎంతో స్వేచ్ఛగా జీవిస్తూ ఉండేవి.

ఒక రోజు ఆ కోతి మూకలోని గండుకోతి - ఈ రోజు మీ కందరికీ ఒక ముఖ్యమైన విషయం చెబుతాను. ఇది మన జీవితానికి, జాతికి సవాలు వంటిది రండి, అని బిగ్గరగా అరచి పిలిచింది. వెంటనే పెద్దా, చిన్నా కోతులన్నీ ఆ గండుకోతి ముందుకు వచ్చి, ఏమి చెబుతుందోనని ఆత్రుతతో, శ్రద్ధగా కూర్చున్నాయి. నా తోటి కోతుల్లారా! - మనం చాలా చపల చిత్తులమని, నిలకడ ఏమాత్రం లేని జాతి మనది అని అంటున్నారు. దీనిని మనమంతా కలసి తప్పు అని నిరూపించాలి. మనముకూడా నిగ్రహంగా ఉండగలమని నిరూపించి మనమీదున్న అపవాదును తొలగించుకోవాలి, మీరేమంటారు? అని ప్రశ్నించింది గండుకోతి. అందుకు కోతులన్నీ - భేష్! మంచి ఆలోచన, మనజాతి గౌరవం నిలుపుకోవాల్సిందే! అందుకు ఏం చెయ్యాలో మీరే చెప్పండి? అని గట్టిగా అరచి చెప్పాయి.

అన్ని కోతులు మంచి ఊపు మీదున్నాయి, అన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నట్లు తెలుసుకొని, గండుకోతి అతిశయించిన ఉత్సాహంతో ఇలా చెప్పింది. మనం ఈ రోజు అడవి తల్లి కరుణ వల్ల ఎలాంటి కష్టం లేకుండా ఆకలిని తీర్చుకుంటున్నాం. అందుకు కృతజ్ఞతగా మనమంతా ఒక రోజు ఉపవాస దీక్షబూని మన మనో నిగ్రహాన్ని చాటుదాం! దానివల్ల ఆరోగ్యం బాగుంటుంది, ఒక రోజు తిండి ఆదా అవుతుంది. మనోనిగ్రహం కూడా నిరూపించబడుతుంది. కోతులన్నీ ఒక్క సారిగా చాలా మంచి ఆలోచన అని సంతోషంగా కిచకిచలాడి తమ ఆమోదాన్ని తెలియజేశాయి. మూకలోంచి ఒక కోడె వయసు కోతి లేచి మంచి పనిచేయడానికి ఎపుడూ ముందుండాలి. ఈ ఆలోచన చాలా బాగుంది. నెలకొకసారి ఈ ఉపవాస దీక్ష ఉండడం చాలా మంచిది. "శుభస్య శీఘ్రం" అన్నారు పెద్దలు. కాబట్టి ఈ రోజే ఉపవాస దీక్ష ప్రారంభించాలనేది నా అభిప్రాయం అంది వీరావేశంతో. సమావేశంలోని కోతులన్నీ పరమోత్సాహంతో తమ తోకలన్నీ పైకెత్తి ఏకాభిప్రాయం తెలిపాయి.

ఇంతలో మూకలోని ఒక ఆడ కోతి లేచి మీరందరూ చెప్పింది బాగుంది. కానీ నాదొక సలహా. సాయంత్రం ఉపవాసం ముగిసే సమయానికి మనందరం ఎంతో ఆకలితో ఉంటాము. ఆకలితో ఉన్న మనం చెట్లు ఎక్కి పండ్లు తెచ్చుకోవడం కష్టం. అందుకని ఇప్పుడే మనందరం అన్ని రకాల పండ్లు తెచ్చి పెట్టుకుంటే మంచిది అని

చెప్పింది. ఈ ఆలోచన కూడా బాగానే ఉంది. అనుకుని కోతి మూక పెద్ద అయిన గండుకోతి అనుమతి కూడా తీసుకోకుండా, తలోదిక్కు ఎగురుకుంటూ వెళ్లాయి. ఒక అరగంటలో రక రకాల పండ్లను తెచ్చి మర్రిచెట్టు క్రింద కుప్పపోశాయి. తర్వాత ఆ పండ్ల కుప్ప చుట్టూ కూర్చొని తల ఎత్తి ఆకాశం వైపు ఎప్పుడు సాయంకాలం అవుతుందా? అని ఎదురు చూడసాగాయి.

కొంత సమయం గడిచాక మరో పండు కోతి లేచి-మిత్రులారా! మీ ఉత్సాహం నన్ను యవ్వనవంతుడిని చేస్తున్నది, ఆనందాన్ని కలిగిస్తున్నది. కానీ నాదొక సూచన అదేమిటంటే! సాయంకాలం అవగానే ఆకలిమీద ఉన్న కారణంగా అందరం ఒక్క సారిగా పండ్లకోసం అవురావురంటూ ఎగబడితే తొక్కిసలాట జరిగే అవకాశం ఉంది. సాయంకాలం ఎపుడవుతుందా అని ఎదురు చూడ్డం కంటే వేరే పని ప్రస్తుతానికి ఏదీ లేదు. కాబట్టి తాపీగా మనం ఇపుడే పండ్లను భాగాలు పట్టి ఎవరివాటా వారు తమ ఎదురుగా పెట్టుకుంటే సబబుగా ఉంటుంది. ఈ సలహా కూడా చాలా బాగా నచ్చింది అన్ని కోతులకు. వెంటనే యువకోతులు లేచి మొత్తం కోతుల్ని లెక్కించి పండ్లనన్నింటినీ సరి భాగాలు పెట్టి, ఎవరి వాటా వారికి అందించాయి. ఇపుడు కోతులన్నీ ఆకాశం వైపు కాకుండా తమ ముందున్న పండ్ల కుప్పలను చూస్తూ ఎపుడెపుడు సాయంకాలం అవుతుందా చటుక్కున మింగుదామా అని ఎదురుచూడసాగాయి.

మరి కొంచెం సేపటికి మరో గడుసు కోతి మనందరం ఒకో పండును చేత్తో పట్టుకుని సిద్దంగా ఉంటే బాగుంటుందనుకుంటా అన్నది. అన్ని కోతులూ గండు కోతి వైపు చూశాయి. గండు కోతి అదోలా హెచ్చరిక చూపుచూస్తూ... అలాగే చేయండి. పరవాలేదు. కానీ తినకూడదు సుమా! అంది. సంతోషంగా కోతులన్నీ ఒక్కోపండును తీసుకున్నాయి. ఇక చేసేదేమీ లేదు కాబట్టి పండును అటూ ఇటూ తిప్పి పరీక్షగా చూడసాగాయి. ఇంతలో అపుడో ఇపుడో చచ్చేటట్లున్న ఒక బక్క కోతి ఉపవాసం పూర్తయ్యేటప్పటికి పండు తొక్క కూడా ఒలుచుకోలేనంత నీరసం రావచ్చు, కాబట్టి పండు తొక్కను ఒలిచి పెట్టుకుంటే నయమనిస్తోంది అంది గండుకోతి వైపు చూస్తూ. బక్క కోతి చెప్పిందాంట్లో తప్పేముంది? సరే అలాగే చేయండి. కానీ తినకూడదు సుమా! అంది గండు కోతి. వెంటనే కోతులన్నీ సంబరపడిపోతూ పండ్లతొక్కలు తీసిపారేశాయి. సాయంకాలం వరకూ మరోపని లేదు కాబట్టి తొక్కతీసిన పండును చేతిలో ఉంచుకుని పరీక్షగా చూడసాగాయి. కొంత సేపు గడవగానే ఓ అల్లరి పిల్లకోతి తొక్క తీసిన పండును నేను పండ్లతో పట్టుకుంటాను అంతే! అంది. సరే కానీ తినకూడదు సుమా! అంది గండుకోతి. అంతే వెంటనే అల్లరి పిల్లకోతి చెప్పినట్లు అన్ని కోతులూ తొక్కతీసిన పండును నోటి పళ్ళతో పట్టుకుని కూర్చున్నాయి. తక్షణమే కోతులన్నింటికీ నోట్లో నీరూరసాగింది. ఇక ఏ మాత్రం తట్టుకోలేక కచకచా పండును కొరికి తినేశాయి.

వెంటనే మరో అతికోతి లేచి ఒక్కపండు తిన్నా ఉపవాసం చెడినట్లే! మిగతా పండ్లను కూడా తినేస్తే సరి అంది. అవును ఇదికూడా నిజమే అంటూ కోతులన్నీ మూ కుమ్మడిగా పండ్లను చక చకా తినేశాయి.

ఆ విధంగా కోతుల ఉపవాస వ్రతం కేవలం కొన్ని నిమిషాలలోనే భ్రష్టు పట్టింది. మనోచంచలానికి ప్రతీకగా చిరస్థాయిగా నిలచి పోయింది కోతి జాతి.

ఓర్వలేనితనాన్ని విడనాడాలి.

పూర్వం ఒక గ్రామంలో ఎదురెదురు ఇళ్లలో ఇద్దరు వ్యక్తులు తమ కుటుంబీకులతో నివసిస్తూ ఉండేవారు. వారికి అదెందుకో కానీ ఒకరిపై మరొకరికి విపరీతమైన ఈర్ష్యా ద్వేషమున్నూ. ఒకరికి ఎదైనా మంచి జరిగితే చాలు మరొకడు కళ్లలో నిప్పులు పోసుకుంటాడు. ఒకరికి నష్టంకానీ కష్టంగానీ కలిగితే మరొకడు ఆనందంతో చంకలెగరేసుకుంటాడు, చిందులు తొక్కుతాడు. ఈ ప్రకారంగా వారు తమ తమ పనులను మానుకొని ఎవరికి ఎపుడు ఏమి జరుగుతుందో తెలుసుకోవాలని తహతహలాడుతూ జీవిస్తూ ఉండేవారు. ఒకవేళ ఒకరికొకరు ఎదురుగా తారసపడి నట్లయితే ఒకరి మీద ఒకరు కారాలు-మిరియాలు నూరుకొనేవారు. "దుమ్మెత్తి పోసుకునేవారు".

ఈ విధంగా కాలం గడచిపోతుండగా ఒకనాడు వారిలో ఒకనికి తపస్సు చేసి సిద్ధులు సంపాదించాలనే కోరిక పుట్టింది. ఊరి బయట నిర్జన ప్రదేశంలోగల ఒక చెట్టు క్రింద కూర్చొని అన్నపానీయాలు మానుకుని తీవ్రంగా తపస్సు చేయనారంభించాడు. ఈ సంగతి పసిగట్టిన అతని శత్రువు వాడికొక్కడికేనా తపస్సు చేసే యోగ్యత ఉందేది? నాకు లేదా? నేను వాడికంటే తక్కువ వాడినా? అని తలచి మొదటివాడు కూర్చొన్న ప్రాంతములోనే మరొక చెట్టు క్రింద కూర్చొని తపస్సు చేయ మొదలుపెట్టాడు. ఈ సంగతి మొదటివాడెట్లో తెలుసుకున్నాడు. ఇరువురూ పోటాపోటీగా తీవ్రమైన తపస్సులో మునిగిపోయారు.

కొంత కాలానికి బ్రహ్మదేవుడు మొదటి వాడికి ప్రత్యక్షమై "ఓ యీ భక్తా! నీ తపస్సుకు మెచ్చాను. ఏదైనా వరాన్ని కోరుకో అని పలుకగా అతడు మహాత్మా! నాకు మల్లే నా శత్రువు ఒకడు తపస్సు చేస్తున్నాడుగదా వాడికి కూడా ప్రత్యక్షమయ్యారా స్వామీ! అని అడిగాడు. బ్రహ్మ దేవుడు అవునయ్యా! ముందుగా అతని వద్దకే వెళ్ళాను, అన్నాడు. అయితే స్వామీ వాడు ఏం వరం కోరుకున్నాడు? అని అడుగగా బ్రహ్మదేవుడు ఓయీ అతను ఏవరమునూ కోరక ముందుగా నీ వద్ద కెళ్ళి నీవు కోరిన దానికి రెట్టింపు ఇస్తే చాలు అని అన్నాడు. అలాగైతే స్వామీ! నాకు ఒక కన్నును పొగొట్టి నేను సగం గుడ్డి వాడిని అయ్యేటట్లు అనుగ్రహించండి చాలు అని వేడుకున్నాడు. బ్రహ్మదేవుడు

'తథాస్తు' అని దీవించి అంతర్థానమయ్యాడు. వెంటనే వీడికి ఒక కన్ను గ్రుడ్డిదైపోయింది. మొదటి వాడు తాను కోరినట్లుగా రెట్టింపు ఫలితము పొంది పూర్తి గుడ్డివాడయ్యాడు.

* ఇరుగు పొరుగు వారంతా క్షేమంగా ఉంటేనే నీవు కూడా క్షేమంగా ఉండగలుగుతావు. లేకుంటే నీవు "క్షామం" లో ఉన్నట్లే.
* కోరికలేని ఆలోచన ఉంటుంది. కానీ ఆలోచనలేని కోరిక ఉండదు.
* మనస్సుంటే కోరికల మూటే! ఒక్కొక్క దారాన్నీ తీస్తూపోతే చివరకు ఎంతటి విశాలమైన గుడ్డ అయినా కనిపించకుండా ఎలా పోతుందో అలాగే ఒక్కొక్క కోరికా తగ్గించుకుంటూ, తొలగించుకుంటూపోతే మూట ఖాళీ అవుతుంది. మనసూ శూన్య మవుతుంది. శూన్యమైన మనసు ఆత్మలో కలిసిపోతుంది. ఆత్మోన్నతి అంటే అదే!

కోరికలు లేని స్థితి

ఒక పరమ భక్తురాలుండేది. తెల్లారింది మొదలు రాత్రి పడుకునే వరకు వివిధ రూపాలలో భగవదారాధనలో మునిగి ఉండేది. ఆమె భక్తి తత్పరతకు మెచ్చి ఒకనాడు భగవంతుడు ప్రత్యక్షమయ్యాడు. ఏం వరం కావాలో అడుగు అన్నాడు. ఏమి కోరినా ఇవ్వగలనన్నాడు. ఆకస్మికంగా ప్రత్యక్షమైన భగవంతుని చూచి ఉబ్బి తబ్బిబ్బైంది ఆ భక్తురాలు. ఏమికోరుకోవాలో తెలియక మాటలు రాలేదు. కొంత సేపటికి తేరుకుని స్వామీ! ఒక వారం తర్వాత రా! నాకు కావలసిన వాటి పట్టీ సిద్ధపరుస్తాను. తప్పక మరలా రా స్వామీ! అంటూ బ్రతిమలాడింది స్వామి సరేనన్నాడు.

కావలసినంత ధనం, బంగారు, కోరుకోమన్నారు కొందరు. ఆరోగ్యం కోరుకొమ్మని, సంతోషం కోరుకొమ్మని, రాజభోగాలు కోరుకొమ్మని కొందరుపెద్దలు, పిల్లలు తండోపతండాలుగా వచ్చి తమకోసం కూడాకొన్ని కోరికలు కోరమని ప్రాధేయ పడినారు. చివరిగా ఆ దేశ రాజు కూడా ఆమె వద్దకు వచ్చి తన కోరికలు చెప్పాడు.

వారం పూర్తయింది. తాను ఎదురు చూచిన రోజు రానే వచ్చింది. భగవంతుడు సాయంకాలం రానున్నాడు. ఉదయం నుంచే ఆలోచన చేయసాగింది. తనలో ఉన్న దేమి? తాను కోల్పోయిన దేమి? భగవంతుని ఆరాధనలో మానసిక సుఖ శాంతులు ఉండేవి. లోభ-మోహాలేవీ ఉండేవికావు. జీవితం ప్రశాంతంగా సాగుతూ ఉండేది. కానీ ఈ వారంలో ఒక్క మారైనా భగవంతుడిని స్మరించుకోలేదు. కోరికల పట్టీ తయారు చేయడంలోనే కాలం హరించుకుపోయింది. అయ్యో! అని బాధపడింది. తుదకు ఒక నిర్ణయానికి వచ్చింది. ఎదురు చూస్తూ ఉండిన భగవంతుడు వచ్చాడు. నీవేమి కోరుకున్నా ఇస్తానన్నాడు. అందుకు భక్తురాలు వినయంగా "స్వామీ! ఒక వారం రోజుల కాలాన్ని వెనక్కు మళ్ళించు. నేను నిన్నుచూసిన విషయం. నీవు అనుగ్రహించిన వరం రెండింటినీ దయచేసి మరచిపోయేటట్లు చేయి... ఇక ముందు నిన్ను ఏమి కోరకుండా ఉండేటట్లు అనుగ్రహించు. నిరంతరం నిన్ను భక్తితో కొలిచేటట్లు దీవించు. అంతమాత్రంచాలు అంటూ ప్రార్థించింది.

కోరికలు కోరేవాడు భక్తుడేకాదు.

ఓ అడవిలో నలుగురు భక్తులు తీవ్రంగా తపస్సు చేస్తున్నారు లక్ష్మీదేవి ప్రసన్నం కావాలని. కొంత కాలానికి వారి తపస్సుకు ప్రసన్నురాలై ప్రత్యక్షమైంది. శ్రీ మహాలక్ష్మి.

మొదటివాడి దగ్గరికి వచ్చి నాయనా ఏం కావాలి? అన్నది. వాడన్నాడు నాకు మంచి పెసరట్టంటే చాలా ఇష్టం. అదంటే 'చెవుకోసుకుంటాను'. కాబట్టి ప్రతి రోజు నా డైనింగ్ టేబుల్ మీద నేను తినగలిగినన్ని పెసరట్లు ఉండేటట్లు అనుగ్రహించు తల్లీ అన్నాడు. తథాస్తు అని దీవించి, రెండవ భక్తుని దగ్గరికి వెళ్ళింది శ్రీ మహాలక్ష్మి.

మొదటి భక్తుడు ఏమి కోరుకున్నాడో ఆ మహాలక్ష్మి దగ్గరే ఆరా తీసాడు వీడు తనకు నెలకు ఓ పచ్చి పెసల బస్తా కటాక్షించమన్నాడు. తథాస్తు అని ఆశీర్వదించింది శ్రీమహాలక్ష్మి.

మూడవవాడు అలాగే మొదటివాడిని గురించీ రెండవ వాడిని గురించీ ఆ తల్లినడిగి తెలుసుకొని, తనకు పచ్చిపెసలు పండే భూమిని ఒక ఎకరం ప్రసాదించమన్నాడు. ఆ దేవి తథాస్తు అని దీవించి నాల్గవవాడి దగ్గరికెళ్ళింది.

నాల్గవవాడు అమ్మవారి రాకను గమనించనే లేదు. తన్మయుడై ఆనందానుభూతిలో ఉన్నాడు. అమ్మ వాడిని తట్టి అడిగింది నాయనా! ఆ ముగ్గురి పని అయిపోయింది. ఇక నీవే మిగిలావు నీకు ఏం కావాలి? అని అడిగింది. వాడు నమస్కరించి ఎవరు తల్లీ నీవు? అని ప్రశ్నించాడు. నాయనా! నేను శ్రీమహాలక్ష్మిని. అయితే ఏమిటి? తపస్సు చేశావు కదా సంతోషపడి వరమేదైనా ఇద్దామని. అమ్మా జగదేక మాతా! నీవు ప్రత్యక్షమైనావు. ఇంతకంటే ఏం కావాలి తల్లీ? నీవు కనిపించాక కూడా నా మనసులో వరం కోరుకునే దారిద్ర్యం ఉంటే నేను భక్తుడినే కాను. అని మళ్ళీ కళ్ళు మూసుకొని ధ్యానంలో నిమగ్నుడైనాడు. మహాలక్ష్మి అనుగ్రహ దృష్టితో చూచి అదృశ్యమైంది.

* మనిషి మంచిని ఆశిస్తున్నాడు. మంచి కాలం కోసం ఎదురు చూస్తున్నాడు. మంచి పదవులు రావాలనీ ఆశిస్తున్నాడు. మంచి జీవితాన్ని గడపాలనికూడా తపన పడుతున్నాడు. కానీ మంచి మనసును కలిగి ఉండాలనీ, మంచి బుద్ధులు రావాలనీ, మంచి జన్మ కలగాలనీ ఆశించడం లేదు. చెడ్డ బుద్ధులను లోపల ఉంచుకొని, మంచి మంచి ఫలితాలు రావాలనీ ఆశిస్తే సాధ్యపడుతుందా? మెదడు నిండా దుర్బుద్ధులను, మనసు నిండా దురాలోచనలను నింపుకుని మంచినీ, సత్కీర్తినీ పొందాలంటే సాధ్యమవుతుందా? అది అసంభవం.

అసూయకు లోనైతే అభివృద్ధి ఉండదు.

ఒక ఊరిలో ఇద్దరు వ్యాపారస్తులు చిల్లర దుకాణాలు నడుపుకొంటూ ఉండేవారు. ఇరువురి దుకాణాలు ఎదురెదురుగా ఉండేవి. ఆ వ్యాపారస్థులకు ఒకరంటే, ఒకరికి సరిపోదు. "సజాతివైరం" అన్నమాట. ఎదుటివాడి వ్యాపారం చాలా బాగా దివ్యంగా జరుగుతోందనీ, తనకసలు బేరాలే సరిగా రావడం లేదనీ ఇద్దరూ అనుకుంటూ ఉండేవారు. వాళ్ల అంగళ్ల వద్ద నిలబడిన కొనుగోలుదారులను బట్టి ఎవరికి వారు అలా అంచనాలు వేసుకునేవారు.

ఇలా ఉండగా ఒకరోజు స్వామీజీ ఒకరు ఆ ఊరికి వచ్చారు. ఆ స్వామీజీ దర్శనానికి వీళ్ళిద్దరూ వెళ్లారు. వీడి వ్యాపారం బాగా జరుగుతోందని వాడు, వాడి వ్యాపారం జోరుగా సాగుతోందని వీడు ఆ స్వామీజీతో చెప్పుకున్నారు. వారి ఫిర్యాదులను శాంతంగా విని, ఆ ఇద్దరు వ్యాపారస్థులు అసూయకు లోనై సజాతి వైరంతో కుళ్లు కుంటున్నారని గ్రహించారు. ఆ స్వామీజీ ఇద్దరినీ తన కెదురుగా కూర్చుండబెట్టుకుని, కొన్ని మంచి మాటలను చెప్పి మీరిద్దరూ ఒకరి దుకాణంలో మరొకరు కూర్చొని ఓ పది రోజులపాటు వ్యాపారం చేసి పదకొండవ రోజున వచ్చినన్ను కలవండి అని సెలవిచ్చారు.

ఇద్దరూ స్వామీజీ సెలవిచ్చిన ప్రకారం వీడి దుకాణంలో వాడు - వాడి దుకాణంలో వీడు కూర్చొని వ్యాపారం మొదలుపెట్టారు. మొదటివాడు రెండవ వాని దుకాణంలో కూర్చొని కొనుగోలుదారులను చూసి శెహభాష్! నా దుకాణంలో వ్యాపారం బాగానే సాగుతోంది, అనుకున్నాడు. రెండోవాడుకూడా మొదటివాడి దుకాణంలో కూర్చొని అలాగే అనుకున్నాడు. పదకొండవ రోజున స్వామీజీని ఇద్దరూ కలిశారు. ఎలా ఉందయ్యా మీ వ్యాపారం? అని స్వామీజీ అడిగారు. మీ దయవల్ల "చాలా బాగుంది స్వామీ" మీ ఆశీస్సుల వల్ల మా ఇద్దరి వ్యాపారాలు బాగానే ఉన్నాయి. అన్నారు. సరే! ఇపుడు ఎవరి దుకాణంలో వారు కూర్చొని వ్యాపారాలు శ్రద్ధగా చేసుకొండి. ధన సంపాదనలో ఇతరులతో పోటీ పెట్టుకుంటే మనశ్శాంతిని పోగొట్టుకుంటారు. జీవితాలు సజావుగా కొనసాగవు. సుఖ-శాంతులకు దూరమౌతారు. కాబట్టి ఎవరి బ్రతుకు దెరువు వారిది. ఎవరి నైపుణ్యం వారిది. "ఎవరికి ఎంత ప్రాప్తమో అంత" ఉన్నదానితో తృప్తిగా జీవించడం మంచిది. ఇకపై అసూయలకు లోను కాకుండా జీవించండి అని హితవచనాలు పలికి ఆశీర్వదించి పంపారు స్వామీజీ.

బంధానికి గానీ మోక్షానికి గానీ మనసే కారణం.

జడభరతుడు గొప్ప చక్రవర్తి, వైరాగ్య సంపన్నుడు. రాజ్యభోగాలను, పరివార బంధాలను గడ్డిపోచగా తలచి త్యజించి, అరణ్యానికి వెళ్లి ఏకాంతవాసంలో,

ఆత్మసాక్షాత్కారానికై సాధన చేయసాగాడు. ఒక రోజు ఒక జింక పిల్ల అనాథగా దిక్కులేని స్థితిలో పడి ఉండటం చూసి జాలితో దగ్గరకు తీసుకొని దానిని లాలించి, మేత పెట్టి తనకుటీరానికి తెచ్చుకున్నాడు.

కరుణతో దానిమీద ప్రత్యేక దృష్టి పెట్టి, ఏలోటూ రాకుండా శ్రద్ధగా కాపాడుతూవచ్చాడు. అదికూడా జడభరతుని ఆలనకు, పాలనకు బాగా మచ్చికై నిరంతరం అతని వద్దే కృతజ్ఞతా పూర్వకంగా ఉండసాగింది. ఇలా జడభరతునికి ఆజింక పిల్లపై అనురాగం ఏర్పడింది. ఎప్పుడైనా జింకపిల్ల కనిపించకపోతే జడభరతుని మనసు విలవిలలాడేది.

జడభరతుని ధ్యాస అంతా అమాయకపు జింకపిల్ల మీదే ఉండిపోయింది. పరమాత్ముని ధ్యానంకోసం రాజభోగాలనే వదలిన చక్రవర్తి మనసునంతా ఒక జింక పిల్ల ఆవరించింది. ఒక సారి మేతకై వెళ్ళిన జింకపిల్ల మరలా తన కుటీరానికి రానే లేదు. అయ్యో పాపం జింక పిల్ల ఎటుబోయెనో ఏమో! ఏదైనా క్రూరమృగం బారిన పడినదా ఏమి? అని జింక పిల్లపై బెంగపెట్టుకొని క్షీణించి, అదే ధ్యాసతో ప్రాణాలు విడిచాడు.

జింక పిల్లపై వ్యామోహ కారణంగా మరుజన్మలో జింకపిల్లగా పుట్టాడు. మోక్షప్రాప్తి కోసం అరణ్యానికి వచ్చి కూడా తన జన్మను నిష్ప్రయోజనం గావించుకున్నాడు. పరమపద సోపానంలో చివరి సోపానం వరకు వచ్చి పాము నోట్లోపడి అధోగతి పాలైనట్లు అయ్యింది అతని సాధన.

మనసు ఒక దానిపై దృష్టి పెట్టి నిరంతరం దానినే తలచుకొంటూ ఉంటే దానిపై అనురాగం ఏర్పడుతుంది. ఈ అనురాగమే ఉత్తరోత్తరా బలమైన కోరికగా మారుతుంది. ఈ కామం అనుకూలంగా ఉన్నంత వరకు ప్రేమగానూ, ప్రతికూలంలో ద్వేషం గానూ మనసులో అలజడులు సృష్టించి పతనానికి కారణమౌతుంది. అన్ని పతనాలకు ఇదే క్రమపద్ధతి.

* మనిషి మనసు బాధలకు గురికాకూడదు, అనుకుంటే బంధాలను పెంచుకోకూడదు. వివేకవంతులు తమ జీవితంలో **DETACHMENT POLICY** ని అవలంభిస్తుంటారు. అంటే బంధాలన్నీ తెగిపోయేవే అని తెలుసుకొని జీవించడం. ఒకరితో కలయిక, స్నేహం ఏర్పడింది అంటే అతనితో ఏదో ఒక రోజు విడిపోక తప్పదు అని తెలివిగలిగి ఉండడం. మనం పుట్టాము అంటే ఏదో ఒకనాడు చస్తాము అని ఎరుక గలిగి జీవించడం. ఏదైనా ఒక ప్రయత్నం చేస్తున్నాము అంటే అది విఫలమూ కావచ్చు, సఫలము కావచ్చు కాబట్టి వైఫల్యంలో బాధ, సాఫల్యంలో సంతోషం చెందకుండా మనో నిబ్బరంతో సమతుల్యంగా మనసును నిగ్రహించుకొని జాగ్రత్తగా జీవించడం.

* ప్రేమ, మమకారం, అసూయ, ఆనందం, పగ, ప్రతీకారం, పరోపకారం, సేవ చెయ్యడం, చావుకోరడం ఇలా అన్ని భావాలకు అనుభవాలకు మనసు యొక్క స్పందనే కారణం.
* ప్రపంచమంతా దుఃఖమయం అంటారు. ఎందుకని? మనం ఎంతకాలం సుఖసంతోషాలను అనుభవించినా! ఆ అనుభవమంతా క్షణంలో అయిపోయినట్లుగా ఉంటుంది. బాధలను కొంతకాలమే అనుభవించినా, ఎంతో కాలం బాధపడినట్లుగా, భరించలేనిదిగా ఉంటుంది.
* మనిషి మనసు చాలా బలహీనం. ఆకర్షణలకు, అందాలకు, ఆనందాలకు, వ్యామోహాలకు, ఉద్రేకాలకు లోను కావడం. నిలకడగా ఉండలేక పోవడం, ఆశపడడం, భంగపడడం, ఆరాటపడడం, దిగజారడం, పాపాలకు ఒడిగట్టడం, అసూయలకు లోను కావడం, అన్యాయాలకు, అక్రమాలకు పాలుపడడం...... ఇవన్నీ మనిషి యొక్క అతి సామాన్యమైన బలహీనతలు.
* నిన్ను నీవు మోసం చేసుకున్నంతగా మరెవ్వరూ మోసం చెయ్యలేరు.
* మనసు పాపచింతన నుండి మరల్చుటకు ఎల్లపుడూ ప్రయత్నిస్తూనే ఉండాలి. ఏ కారణం చేతనైనా ఆత్మ పరిశీలన, అభ్యాసం ఒక్క రోజు కుంటుపడినా చాలు. మరునటి రోజు నుండి నియమాన్ని తప్పుకునే కారణాన్ని మనసు అతి సులువుగా వెదకి పట్టుకుని సుఖం కోసం పరిగెడుతుంది.

మనో నిగ్రహం

ఒక రాజు తాను ఎంతో మనో నిగ్రహం కలవాడినని ప్రగల్బాలు పలుకుతూ ఉంటాడు. అందరూ విని రాజుతో మనకెందుకులే అని ఎదురు చెప్పకుండా వెళ్ళిపోయేవారు. ఒక రోజు రాజు వద్దకు ఒక సాధువు వచ్చాడు. రాజు-మాటల సందర్భంలో అలవాటు ప్రకారం తాను ఎంతో మనో నిగ్రహం కలవాడిననీ, తనకు ఉపదేశం ఇమ్మని కోరాడు. చాలా మంచిది రాజా మనోనిగ్రహం అంత సులభమైంది మాత్రం కాదు. అయినా మీకు నిగ్రహం ఉంది అంటున్నారు కాబట్టి అది చాలా గొప్ప విషయం, కానీ ఉపదేశం మాత్రం మరొకసారి మీ వద్దకు వచ్చినపుడు తప్పక ఇస్తాను. ఈ లోగా మీకొక పరీక్ష పెడతాను. అందులో మీరు నెగ్గాలి. అది కూడా మనో నిగ్రహ పరీక్షే....సరేనా? అని ప్రశ్నించాడు సాధువు. మనో నిగ్రహంలో దిట్ట అయిన రాజు సరేనన్నాడు.

ఓ రాజా! కొన్ని రోజుల తర్వాత ఒక వర్తకుడు ఒక నల్లని గుర్రాన్ని తెస్తాడు. కానీ దానిని కొనవద్దు. ఒకవేళ కొన్నా, దాన్ని ఎక్క వద్దు. ఒకవేళ ఎక్కినా, తూర్పు దిక్కుగా వెళ్లకు. ఒకవేళ వెళ్ళినా, నీకు కనబడిన అందమైన స్త్రీని పలుకరించవద్దు. ఒకవేళ పలుకరించినా, అంతఃపురానికి తీసుకొని రావద్దు. ఒకవేళ తీసుకొచ్చినా పెళ్ళి

చేసుకోకు. ఒకవేళ పెళ్ళి చేసుకున్నా సంతానాన్ని పొందవద్దు అన్నాడు. ఓస్ ఇంతేగదా!? అని మనోనిగ్రహంపై ఉన్న ఆత్మవిశ్వాసంతో ఒప్పుకుంటాడు.

కొన్ని రోజుల తర్వాత సాధువు చెప్పిన విధంగానే ఒక వర్తకుడు వచ్చి గుర్రాన్ని అమ్మకానికి పెడతాడు. అపుడు ఆ రాజు గుర్రము యొక్క రూపలావణ్యాలను, అంగసౌష్టవాలను చూచి మురిసిపోయి, ఆహా! తమ బోటి రాజుల వద్ద కదా ఇలాంటి మేలు జాతి గుర్రం ఉండవలె అనుకుంటూ గుర్రాన్ని కొనదలచాడు. వెంటనే సాధువు చెప్పిన మాట గుర్తుకు వచ్చింది రాజుకు. సాధువు ఏం చెప్పాడు? ఒకవేళ గుర్రాన్ని కొన్నప్పటికీ దానిపై ఎక్కకూడదనికదా చెప్పాడు. కొని, దానిపై ఎక్కకుండా గుర్రపుశాలలో ఉంచితే సరి అనుకుని అలాగే చేసాడు.

కొన్ని రోజులైన తర్వాత, ఒక సారి అలా అంతఃపుర పర్యవేక్షణ చేస్తూ అశ్వశాలలోని మేలుజాతి నల్ల గుర్రాన్ని చూచి వ్యాహ్యాళికి తీసుకొని వెళ్ళాలనుకుంటాడు. కానీ సాధువు చెప్పిన మాట జ్ఞాపకానికి వస్తుంది. సాధువు ఏం చెప్పాడు? ఒక వేళ ఎక్కినా తూరుపు దిక్కుకు మాత్రం వెళ్ళవద్దన్నాడు. అంతే కదా? తూరుపు దిక్కుకు వెళ్ళకపోతే సరి. అనుకుని వ్యాహ్యాళికి గుర్రాన్ని తీసుకుని బయలుదేరాడు రాజు.

కోట బయటికి వచ్చాక తూర్పు దిక్కుకే వెళ్ళవలసిన పని పడుతుంది రాజుకు. అపుడు కూడా సాధువు చెప్పిన మాట గుర్తుకు వస్తుంది. ఒక అందమైన స్త్రీ కనిపిస్తుంది. ఆమెతో మాట్లాడవద్దు అని. సరే కనబడిన ఆ స్త్రీతో మాట్లాడకపోతే సరి అని తూర్పు దిక్కుకే బయల్దేరిపోతాడు రాజు.

రాచకార్యం ముగించుకొని వస్తుండగా అతి రూపవతి అయిన ఒక యువతి ఎదురుగా రావడం రాజు చూచాడు. రాజును చూచిన ఆ యువతి రాజు దగ్గరికి వచ్చి వినయంగా నమస్కరించి తన బాధను ఒక దీనగాధగా చెప్పుకున్నది. రాజు ఆమె దీన గాధను ఆసాంతం విని అయ్యో పాపం అని ఓదార్చాడు. తనకెవ్వరూ లేని కారణంగా అంతఃపురానికి వస్తానంటుంది ఆమె. రాజు కనికరించి సరే నంటాడు.

వెంటనే రాజుకు సాధువు మాట జ్ఞాపకానికి వస్తుంది. ఆ.. ఏమౌతుంది? అంతఃపురానికి తీసుకెళ్ళినా వివాహం చేసుకోకుంటే సరి. అనుకుని ఆమెను అంతఃపురానికి తీసుకొని రావలిసిందిగా భటులను ఆజ్ఞాపించాడు.

ఆ యువతి అంతఃపురంలో ఉంటుంది. ఒక రోజు అంతఃపుర పర్యవేక్షణకు వచ్చిన రాజుకు స్నానం చేసి కురులార బెట్టుకుంటున్న రూపవతి కనిపించింది. ఆమె సౌందర్యానికి ముగ్ధుడై ఆమెను తన రాణిని చేసుకోవాలనుకున్నాడు. వెంటనే సాధువు మాట రాజుకు గుర్తుకు వచ్చింది. ఆ.. ఏముంది? సంతానాన్ని పొందకపోతే సరి అనుకుని వివాహం చేసుకున్నాడు. కొన్ని రోజుల కామె గర్భందాల్చింది.

ఇచ్చిన మాట ప్రకారం రాజు వద్దకు సాధువు వచ్చాడు. రాజు మీరు కోరినట్లు ఉపదేశ మిస్తాను. మీరు మనో నిగ్రహంతోనే ఉన్నారు కదా? అని ప్రశ్నించాడు. ఇంకెక్కడి ఉపదేశం స్వామీ! నా మనో నిగ్రహం ఏనాడో కొండెక్కింది. నా బ్రతుకు తెల్లారిపోయింది అన్నాడు.

* దుఃఖానికి కానీ, సుఖానికి కానీ ప్రపంచంలో ఏదీ కారణం కాదు. ఒక్క నీ మనసు తప్ప.
* కళ్ళు వెళ్ళిన ప్రతి చోటుకీ మనసు వెళ్ళకూడదు. మనసు వెళ్ళిన ప్రతి చోటుకీ మనిషి వెళ్ళకూడదు.
* తమంత తాముగా ప్రకటితమయ్యే రూపలావణ్యాలను, ఆకర్షించే అంగసౌష్టవాలను నిర్లక్ష్యం చేసి, నిద్రాహారాలు మాని, పరిశోధించి, సాధించినగానీ సాధ్యపడని, కనబడని సద్గతుల కొరకు ప్రాకులాడుట ప్రయాసకాదా? వెర్రితనము కాదా? అని బలహీనులు ఆశలకు బానిసలై అతి తెలివితేటలతో పతనమైపోతూ ఉంటారు.
* ముల్లును ముల్లుతోనే తీయాలి. మనసును మనసుతోనే జయించాలి.

అతి చిన్న ఆశ అనంతమైన బంధానికి గురిచేస్తుంది.

పూర్వం ఒక సాధువు పూర్తి వైరాగ్యాన్ని అవలంబించి సర్వస్వాన్నీ త్యజించి పవిత్రుడైనాడు. అతనికి ఉన్నది లంగోటీ అనబడే రెండు గోచీలు మాత్రమే. అడవిలో ఎంతో పట్టుదలతో జపతపాలు ఆచరించుకుంటూ ఆనందంగా ఉన్నాడు.

ఇలా ఉండగా అతని గోచీలకు ఎలుకల బెడద ముంచుకొచ్చింది. అందుకని తన గోచీలను సంరక్షించుకునే దానికి పిల్లి ఒకటి ఉంటే బాగుండునని అనుకుని ఒక దానిని తెచ్చుకున్నాడు. ఎలుకలు దొరకనపుడు పిల్లికి ఆహారం ఎలా? అందుకని ఒక ఆవును తెచ్చుకున్నాడు. కానీ ఆవు ఆలనా పాలనా ఎవరు చూస్తారు? అందుకని ఒక స్త్రీని భార్యగా తెచ్చుకున్నాడు.

ఇక ఏముందీ భార్యా, పిల్లలూ, సంసారంలో తలమునకలై పోయాడు. తర్వాత ఒక రోజు తను అడవికి ఎందుకు వచ్చింది? అనే విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకుని, ఔరా! గోచీ మీది ఆశ ఎంత తంటా తెచ్చింది? "సంసారం నల్లుల మంచం" అనిగదా వదలి వేసింది! మరలా మాయలో పడిపోయానే! అని వాపోయాడు .

* చిన్నకోరికే కదా! అని చిన్న చూపుతో, పోనీలే అనుకొని మమకారం అనే విత్తనం మనసులో నాటితే, అదే మొలకెత్తి ఆశాలతగా మారి హృదయమంతా అల్లుకుని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది.

పశ్చాత్తాపం

ఒక సాహసికుడు ఓ ప్రభుత్వాధికారి వద్ద ఉద్యోగిగా చేరాడు. ఆ అధికారి భార్య చాలా అందమైనది. కానీ ఆమెకు భర్తంటే ఇష్టం లేదు. అందుకని అతడిని ఎలా వదిలించు కోవాలి? అని నిత్యమూ ఆలోచిస్తూ ఉండేది. ఈ విషయం

తెలియకుండానే భర్త దగ్గర పనిచేసే ఉద్యోగి ఆమెను ప్రేమించ సాగాడు. ఇది గమనించిన ఆ అధికారి ఆ ఉద్యోగిని చంపబోయాడు. కానీ ఆ ఉద్యోగి, అధికారిపై తిరగబడి చంపేశాడు. పీడ విరగడైపోయిందని సంతోషించి, ఆ సాహసికుడితో తన ఆరు నెలల పసిబిడ్డతో సహా ఆమె లేచిపోయింది.

దూర ప్రాంతానికి వెళ్ళిపోయిన ఆ జంట కొన్ని నెలలు హాయిగానే గడిపారు. కానీ విలాసాలకు అలవాటుపడ్డ ఆమె కోరికలను తీర్చలేక విరక్తి చెంది సన్యాసం తీసుకున్నాడు. అతను ఎన్ని పుణ్యక్షేత్రాలు తిరిగినా చేసిన తప్పులు పదే పదే జ్ఞాపకం వచ్చి మనోభారాన్ని పెంచసాగాయి. తన మనోమాలిన్యాన్ని తొలగించుకునేటందుకు ఏదైనా ఒక మంచి పని చేయాలని సంకల్పించుకున్నాడు ఆ సాహసికుడు.

పర్వత ప్రాంతంలో ఉన్న ఒక ప్రసిద్ధ దేవాలయానికి భక్తులు వెళ్లేటందుకు చాలా కష్టాలు పడుతుండేవారు. ఒక్కోసారి కాలు జారిపడి ప్రాణాలుకూడా పోగొట్టుకునేవారు. అందుకని ఒక సొరంగ మార్గం కనుక ఏర్పాటు చేసినట్లయితే మార్గం సులభమూ అవుతుంది. దూరం కూడా చాలా తగ్గుతుంది. అనుకొని ఒక ప్రణాళిక ప్రకారం సొరంగ మార్గం తవ్వను ప్రారంభించాడు. పగటివేళ భిక్షాటన చేసి, ప్రతిరోజూ రాత్రి వేళల్లో కొంచెం కొంచెం తవ్వసాగాడు. ఆ విధంగా 18 సంవత్సరాలపాటు కఠోరంగా శ్రమించి మూడొంతుల సొరంగాన్ని పూర్తి చేశాడు. ఇక పాతిక భాగం తవ్వగలిగితే సొరంగం పూర్తవుతుందనగా, తాను చంపిన అధికారి కుమారుడు నవయువకుడై తన తండ్రిని చంపినవాడిని, తల్లిని మోసం చేసిన వాడిని చంపి ప్రతీకారం తీర్చుకోవాలనుకున్నాడు. వెదుక్కుంటూ, వెదుక్కుంటూ వచ్చి చివరకు హంతకుడైన సన్యాసిని పట్టుకున్నాడు.

అప్పటికే పశ్చాత్తాపంతో పాప పరిహారం చేసుకుంటున్న ఆ సన్యాసి తన తప్పులను ఒప్పుకొని, సంతోషంగా చావటానికి సిద్ధంగా తాను ఉన్నానని అన్నాడు. కానీ తాను పదిమంది కోసం తలపెట్టిన పుణ్య కార్యం కాస్త ఆగిపోతుందనీ, అది పూర్తయిన తర్వాత తనను చంపవచ్చునని హృదయపూర్వకంగా చెప్పాడు. శత్రువే అయినా అతనిలోని నిజాయితీని గౌరవించి, ఆ యువకుడు ఒప్పుకొని అక్కడే కాచుకొని కూర్చున్నాడు.

సన్యాసి మాత్రం తాను తలపెట్టిన మంచి కార్యాన్ని ఎపుడెపుడు పూర్తి చేద్దామా అని నిరంతరమూ చాలా శ్రద్ధగా కష్టపడి సొరంగాన్ని తవ్వుతున్నాడు. సొరంగం తవ్వడంలో సన్యాసి చూపించే శ్రద్ధ, తపనను గమనించిన యువకుడు చాలా ఆశ్చర్యపోయాడు. 'ఇటువంటి వాడినా నేను చంపాలనుకుంటున్నది'? అని ఆలోచనలో పడ్డాడు. సన్యాసి కష్టపడుతూ ఉంటే ఆ యువకుడు చూస్తూ ఊరకనే కూర్చోలేకపోయాడు. కొన్ని రోజులు గడిచాక సొరంగం తవ్వడంలో తానుకూడా సహాయపడసాగాడు. ఆ విధంగా కలసి పనిచేసేటపుడు అయిష్టంగానే, అనాలోచితంగానే సన్యాసి చెప్పే మంచి మాటలను

వింటూ, వింటూ సన్యాసితో కలసి ఎలాగైతేనేం సొరంగం పూర్తి చేశారు. ఎంతో మంది భక్తులు, ప్రజలు తండోపతండాలుగా వచ్చి చూచి, ఆశ్చర్యంతో ఆనందించారు. సన్యాసి చేసిన కృషిని అందరూ ప్రశంసించారు. అపుడా సన్యాసి "ఓ యువకుడా! ఈనాటితో నా జన్మ ధన్యమైంది. ఇక ఈ శరీరం ఏమైపోయినా పరవాలేదు, నీ కోరిక ప్రకారం నా తలను మొండెం నుంచి వేరుచేసేయవచ్చు". అని యువకుని ఉద్దేశించి స్పష్టంగా చెప్పి తలవంచి నిలబడ్డాడు.

కొన్ని నెలలుగా సన్యాసితో కలసి ఉండిన కారణంగా, అతనితో కలసి పనిచేసిన కారణంగా, సన్యాసిలోని త్యాగనిరతిని, నిజాయితీని బాగా తెలుసుకున్నాడు. తనను సంహరించమని సన్యాసి తలవంచగానే యువకుడు చలించిపోయాడు. తన ఆలోచనను ఉపసంహరించుకొని, సన్యాసి పాదాలపై పడి క్షమించమని ప్రార్థించాడు.

* పశ్చాత్తాపం అనేది తప్పులు చేయకుండా కాపాడుతుంది.యవ్వనంలో చేసిన తప్పులు వృద్ధాప్యంలో బాధిస్తాయి.నవ్వుతూ చేసిన తప్పులు ఏడుస్తూఅనుభవించ వలసి వస్తుంది. ఆలోచన లోపిస్తే అర్థాలకన్నా అపార్థాలు త్వరగా చోటుచేసుకుంటాయి. అర్థాలు తెలిసొచ్చేలోగా అనర్థాలు ఎన్నో జరిగిపోతాయి.
* యవ్వనంలో మనమే సమస్యలలోకి దూకుతాము - వృద్ధాప్యంలో సమస్యలే మనమీదికి దూకుతాయి.
* 'నాది, నా కోసం' అనుకున్నపుడు ఎంతటి ఘాతుకానికైనా పాలుపడేదానికి అవకాశముంది. పదిమంది కోసం చేసే పని పుణ్యానికి, పాప పరిహారానికి దారి తీస్తుంది.
* రాజభోగాలనే తృణప్రాయంగా భావించిన సీతాదేవి, వనవాసంలో బంగారు జింకను చూచి ఆనందించాల్సింది పోయి-స్వేచ్ఛగా విహరించవలసిన ఆ పసిడి వన్నెల జింకను తన దగ్గరనే ఉంచుకోవాలనుకున్నది. అతిసామాన్యమైన ఆ ఆశ ఆమె జీవితాన్నే మలుపు తిప్పి రామ-రావణ యుద్ధం దాకా తీసుకెళ్ళింది కదా?!

తప్పొప్పుకుంటేనే మనసు శుభ్రపడుతుంది

ధర్మగిరి రాజ్యాన్ని శూరసేన మహారాజు పరిపాలిస్తున్న రోజులవి. ప్రజలను కన్న బిడ్డలవలె కాపాడుతూ ధర్మబద్ధంగా రాజ్యపాలన గావించేవాడు. శూర సేన మహారాజు పరిపాలనలో రాజ్యం సుభిక్షంగా ఉండేది. ఇలాంటి తరుణంలో మహారాజు ఎందుచేతనో మానసికంగా బలహీనతలకులోనై, తనమందిరాన్నుంచి బైటికి రాకుండా త్రాగుడుకు బానిసై పరిపాలనను పూర్తిగా మరచిపోయాడు. అందువలన రాజ్యంలో అవినీతి, అరాచకం పెద్ద ఎత్తున చోటుచేసుకున్నాయి. రాజ్యంలో సామాన్య ప్రజలు జీవించడం కష్టమైపోయింది. మంత్రి ధర్మపాలుడు మహారాజుకు ఎన్నో విధాలుగా, ఎన్నో మార్లు హితబోధ చేశాడు. అయినా మహారాజులో ఏ మాత్రం చలనం కలుగలేదు.

రోజులు గడుస్తున్నాయి. రాజ్యంలో అధికారులు అవినీతికి పాల్పడుతున్నారు. కానీ మంత్రి సమయం కోసం ఎదురుచూడడం తప్ప ఏమీ చేయలేక పోయాడు. కొన్ని రోజులకు శూరసేన మహారాజు గారి జన్మదినం రాబోతుంది. బాగా ఆలోచించి మంత్రి మహారాజు గారితో జన్మదిన వేడుకలు ఎలా చేయాలి అనే విషయం మీద చర్చించడానికి రాజ మందిరానికి వెళ్ళాడు. విషయం తెలుసుకున్న మహారాజు ప్రతి సంవత్సరం ఏవిధంగా నిర్వహిస్తున్నారో అలాగే ఈ సంవత్సరంకూడా చెయ్యండి అని సెలవిచ్చాడు.

అనుకున్న విధంగానే జన్మదిన వేడుకలు చాలా ఘనంగా జరిగాయి. మరునాడు మంత్రి రాజుతో "మహాప్రభూ! మీ జన్మదిన సందర్భంగా రాజులు, పుర ప్రముఖులతో పాటు సామాన్యప్రజలు కూడా మీ మీద భక్తితో బహుమానాలను సమర్పించుకున్నారు. వాటిని ఒకసారి చూస్తే బాగుంటుందనుకుంటాను". అన్నాడు. అందుకు రాజు సమ్మతించాడు.

మహారాజు తనకు వచ్చిన బహుమానాలను చూస్తూ ఆనందించసాగాడు. కానీ ఒక చిత్రపటాన్ని చూచిన మహారాజుకు భృకుటి ముడిపడింది. అందులో రాజుగారి రూపం అద్భుతంగా ఉంది. అయితే రాజు గారు చెరసాలలో బందీగా ఉన్నట్లు చిత్రీకరించడం జరిగింది. ఎంత ఆలోచించినా రాజు గారికి చిత్రకారుని ఆంతర్యం అంతుబట్టక, చివరకు ఆ చిత్రకారుడిని తన ఎదుట ప్రవేశపెట్టమని ఆజ్ఞాపించాడు. ఆ రోజు రాత్రి తను చెరసాలలో బందీగా చూపించిన దృశ్యాన్ని తలచుకొంటూ రాజు నిద్రపోనేలేదు. ఆ విషయాన్ని గురించే ఆలోచిస్తూ ఉండినాడు.

మరునాడు రాజు సభలో కొలువుతీరి ఉండగా, చిత్రకారుడు రాజుగారి ముందు నిలబడి అభివాదం చేశాడు. వెంటనే మహారాజు "నీవు చిత్రించిన ఆ చిత్రపటంలో నన్ను ఎందుకు చెరసాలలో బందీగా ఉన్నట్లు చిత్రించావు? అని కోపంతో ప్రశ్నించాడు. ప్రభూ! నన్ను మన్నించండి. ప్రజలను కన్న బిడ్డలవలె చూస్తూ రాజ్యపాలన చేస్తూ ఉండిన మీరు ఒక్కసారిగా వ్యసనాలకు బానిసై ప్రజలకు దూరమై పోయినందున మాకు ఊపిరాడలేదు. చాలా అరాచకాలకు గురవుతున్నాము. కనీసం మీ దర్శనం చేసుకొని మా బాధలను విన్నవించుకుందామనుకున్నా సాధ్యపడలేదు. అందుకే మీరు రాజుగా ఉండి మీ మందిరానికే పరిమితమైపోయారు. కనుకనే నేను ఈ విధంగా చిత్రించాను. అని వినయంగా చెప్పాడు. ఆ మాటలు విన్న మహారాజు ఆశ్చర్యంతో, చిత్రకారుడిని ఎంతగానో ప్రశంసించి నీ మాటలతో, నీ చేతలతో నాకు కనువిప్పు కలిగించావు. ఇక నుంచి మరలా మునుపటి మహారాజులా రాజ్యాన్ని పరిపాలిస్తాను అని సభాముఖంగా చెప్పి చిత్రకారుడిని సముచితంగా సత్కరించి పంపాడు.

మహారాజుకు కనువిప్పు కలిగేటందుకు చేసిన ప్రయత్నంలో సహకరించి నందుకు మంత్రి ధర్మపాలుడుకూడా చిత్రకారునికి ధన్యవాదాలు తెలిపి, బహుమాన మిచ్చి పంపాడు.

జపమాచరించే జడధారికంటే ధర్మాన్నాచరించే సంసారేమిన్న

ఒకసారి నారదులవారు శ్రీ మహావిష్ణువు దగ్గరికెళ్ళి ప్రతిక్షణం నారాయణ స్మరణం చేసే నేనే కదా నీ పరమ భక్తుణ్ణి? నీ భక్తులలో మొదటి స్థానం నాదే కదా? ముల్లోకాలలో నన్ను మించిన భక్తుడు లేడు కదా? అన్నాడు.

నారదుల మాటలు విన్న శ్రీమహావిష్ణువు నారదునిలో కలిగిన అహంకారాన్ని గుర్తించి గుణపాఠం నేర్పించాలని సంకల్పించి, "లేదు నారదా! నీవు పొరబడుతున్నావు. నీ కంటే పరమ భక్తుడు ఒక సామాన్య రైతు భూమి మీద ఉన్నాడు". అని అన్నాడు. ఔనా! అని ఆశ్చర్యపోతూ.. ఐతే తప్పక ఆ భక్తుడిని దర్శించి తెలుసుకోవాల్సిందే అని శ్రీ మహావిష్ణువు దగ్గర అనుమతిపొంది, భూమి మీదికి దిగివచ్చి, ఆ రైతు దినచర్యను గమనించసాగాడు. ఆ రైతు ఉదయం నిద్ర లేచినపుడు, పనిచేసేటపుడు, తినేటపుడు, చివరగా పడుకునేటపుడు మాత్రమే "నారాయణ" అంటాడు. అదే విషయాన్ని శ్రీ మహావిష్ణువు దగ్గరికెళ్ళి రోజుకు నాలుగు సార్లు మాత్రమే 'నారాయణ' అనే రైతు నాకంటే పరమ భక్తుడెలా అవుతాడని నారదుడు ప్రశ్నించాడు. అందుకు శ్రీ మహావిష్ణువు నీటితో నిండిన ఒక కుండను ఇచ్చి, తలమీద పెట్టుకొని ఒక్క నీటిచుక్క కూడా క్రిందపడకుండా తన శేషతల్పం చుట్టూ మూడు ప్రదక్షిణలు చేయమంటాడు. సరేనని నారదుడు మూడు ప్రదక్షిణలు పూర్తి చేసి శ్రీ మహావిష్ణువు ఎదుట నిలబడ్డాడు.

నారదుని చూచి "నారదా ప్రదక్షిణలు చేస్తుండగా ఎన్ని మార్లు నా నామాన్ని స్మరించావో చెప్పు? అని అడిగాడు. దానికి నారదుడు "ప్రభూ! ఒక్క నీటి చుక్క కూడా క్రింద పడకూడదని షరతు విధించావు కదా? అందుకని ఎప్పుడు నీరు ఒలుకుతుందో, నీటి చుక్క ఎప్పుడు క్రింద పడుతుందోనని, దానిమీదే దృష్టి పెట్టి, జాగ్రత్తగా నడవడంతోనే సరిపోయింది. ఇక నీ నామస్మరణకు అవకాశం ఎక్కడుంది? అన్నాడు.

అపుడు లక్ష్మీపతి "చూశావా నారదా? ఏ బాదరబందీ లేని సన్యాసంలో ఉంటూ కూడా ఒక కుండ నీళ్ళు మోయ మంటేనే నన్ను మరచిపోయావు, కేవలం మూడు ప్రదక్షిణలుకూడా చేయలేకపోయావు. ఒక సామాన్య రైతు సంసారమనే కుండను రోజూ మోస్తూకూడా నాల్గుమార్లు నన్ను స్మరించుకుంటున్నాడు. అందుకే అతడు నాకు పరమ భక్తుడు" అన్నాడు.

అహంకారం ప్రాణాంతకం

ఒక వాగుకు అడ్డంగా ఒక తాటి చెట్టు విరిగిపడి ఉండినది. వాగులో నీటి ప్రవాహం ఉధృతంగా ఉంది. ఒక చిన్న మేకపోతు మేతమేస్తూ అవతలి గట్టుకు

పోవాలనుకొని అడ్డంగా పడివున్న తాటి మొద్దుపై కాలు పెట్టింది. ఇదే విధంగా మరొక పెద్ద మేకపోతుకూడా ఇవతలి గట్టుకు రావాలని తాటి మొద్దుపై కాలుమోపింది. మొదట కాలుపెట్టిన చిన్న పోతును చూచి పెద్దపోతు "దారి విడువోయ్ కాస్తా" అన్నది. అందుకు జవాబుగా చిన్నది "మొదట కాలు పెట్టింది నేను, నా తర్వాత కాలు మోపింది నీవు. వెనుకాముందు ఆలోచించకుండా పెద్ద దానివై యుండీ ముందుగా కాలు పెట్టిన నన్నే ప్రక్కకు తొలగి పొమ్మనడం న్యాయమేనా?" కాబట్టి నీవే దారి వదలాలి అని ముందుకు వెళ్ళింది.

ఏమిటే! పెద్దంతరం, చిన్నంతరం లేకుండా? వయసులో నీకంటే పెద్దనైన నేను నీకంటికి కనపడడం లేదా? నా మాటను ఖాతరు చేయవలసిన పని లేదా? అన్నది పెద్ద పోతు. గట్టున ఉన్న కప్పలలో కొన్ని... చిన్నపోతు వైపు చూస్తూ "పెద్ద వారికి గౌరవం ఇవ్వాలి, నీవే ప్రక్కకు తప్పుకోవడం మర్యాద" అన్నాయి. మరికొన్ని కప్పలు... "చిన్న పోతుకు తెలివి, ఓర్పు లేదు కాబట్టి పెద్దదానివి నీవైనా సర్దుకొని పోకూడదా?" అని పెద్దపోతుకు చెప్పాయి.

కానీ రెండు పోతులూ ఏమాత్రం వెనుకకు తగ్గకుండా, ఆలోచించకుండా అహంకారంతో ఒకే సారి వాగు దాటాలని ప్రయత్నించి, మధ్యలో ఢీకొని వాటం తప్పి వాగులో పడిపోయి వేగంగా కొట్టుకొని పోసాగాయి.

నీటిలో మునిగిపోతూ ఇలా అనుకున్నాయి. దారి ఇవ్వక వాగులో పడి చచ్చుట కంటే ప్రక్కకు తొలగి ఉంటే ఇలా అర్ధాంతర చావు వచ్చేది కాదు కదా?

* పశ్చాత్తాపం నిదానంగా వస్తుంది. దుడుకుతనపు ఫలితం వెంటనే వస్తుంది.
* ఇద్దరు మూర్ఖులు ఎదురు పడితే ఒకటేదారి.
  ఇద్దరిలో ఒకడు తెలివిగలవాడుంటే రెండు దారులు.
  ఇద్దరూ తెలివైనవారైతే మూడు దారులు.

శాంతిని పొందే మార్గం

అనేక సమస్యలతో తల్లడిల్లుతున్న ఒక అభాగ్యుడికి, తమ గ్రామానికి ఒక సన్యాసి వచ్చాడని తెలిసి, ఆయన వద్ద కెళ్ళి తన ఆవేదనంతా వెళ్ళగక్కి స్వామీ! నాకు మన శ్శాంతి కావాలి. దానిని పొందే మార్గం చెప్పండి" అని ప్రాధేయపడ్డాడు.

ఆ సన్యాసి అనుగ్రహ దృష్టితో చూస్తూ చిరునవ్వుతో నీవడిగిన దానిలోంచి "నాకు కావాలి" అనే ఆలోచనను తీసేస్తే నీవు పొందేదంతా "శాంతే" కదా నాయనా! నీకు - అని ఆశీర్వదించాడు.

* శాంత గుణంతో విచక్షణ అలవడుతుంది. విచక్షణతో అకృత్యాలను నిరోధించవచ్చు. అకృత్యాలు చేయకపోవడం వల్ల పాపరహితుడై ఉండవచ్చు. పాపరాహిత్యం వల్ల మనసు నిర్మలమవుతుంది. దానివల్ల దైవానుగ్రహానికి పాత్రుడౌతాడు.

క్రుంగకుండా, పొంగకుండా ఉంటే మనశ్శాంతే

ఒక పట్టణంలో ఒక శ్రీమంతుడు ఉండేవాడు. అతనికి కోట్ల రూపాయలు విలువ చేసే ఆస్తి పాస్తులున్నాయి. ధన, కనక, వస్తు, వాహనాలతో, మందీ మార్బలంతో, దాస-దాసీ జనంతో అతని నివాసం ఒక పెద్ద సంస్థానంలా ఉంది. సమస్త విందు, వినోదాలు, విలాసాలన్నీ అతనికి అందుబాటులో ఉన్నాయి. ఇంట్లో అన్నీ ఉన్నాయి. ఒంట్లో శక్తీ ఉంది. అతనికి ఏ విషయంలోనూ లోటులేదు. విచిత్రం ఏమిటంటే అన్నీ ఉన్నా, ఎందరున్నా మనశ్శాంతి మాత్రం లేదు.

కాలం గడుస్తున్న కొద్దీ అతడిలో అశాంతి పెరుగుతూనే ఉంది. కానీ కొంచెమైనా తగ్గడం లేదు. జీవితం దుర్భరమనిపించసాగింది. ఇలా ఉండగా పట్టణానికి ప్రసిద్ధి చెందిన ఒక సాధువు వచ్చాడని తెలిసి, ఆయనను దర్శించి, తన ఆవేదనను వెళ్ళగ్రక్కి, మనోవేదనను తొలగించి శాంతి దక్కే ఉపాయం తెలియజేయమని ప్రార్థించాడు. అంతా విన్న సాధువు చిరునవ్వుతో "ఈమాత్రానికే ఇంత హైరానాపడాలా? ప్రక్క పట్టణంలో సుందరయ్య అనే శ్రీమంతుడున్నాడు. అతని దగ్గరికెళ్ళు. అతడే నీకు దారి చూపిస్తాడు అన్నాడు.

సాధువు మాటలు విన్న ఆ సంపన్నుడు ఆశ్చర్యపోతూ, భోగభాగ్యాలతో జీవిస్తున్న తనకు, తనలాంటి శ్రీమంతుడే మరొకడు ఎలా మార్గం చూపిస్తాడు? ఈ సాధువు తనతో పరిహాసం ఆడడం లేదుకదా? అని అనుకొని "మీరే నాకు మార్గం చూపాలి స్వామీ! మీ మీద కొండంత విశ్వాసంతో వచ్చాను. నన్ను నాలాంటి వాడి దగ్గరికే పొమ్మనడం ఎందుకో నచ్చడం లేదు. దయచేసి నన్ను మీరే ఉద్ధరించండి". అని ప్రాధేయపడ్డాడు.

బాధపడే వారి దగ్గర సాధువులు, సన్యాసులు పరిహాసమాడరు నాయనా! నీ మంచి కోసమే చెబుతున్నాను. నేను చెప్పినట్లు చెయ్యి. అన్నాడు సాధువు.

ఇక చేసేది లేక అయిష్టంగానే ఆ ధనికుడు సుందరయ్య దగ్గరికి వెళ్ళాడు. సుందరయ్య నివసించే భవనంలోకి అడుగు పెట్టాడో లేదో తనకంటే సుందరయ్యే ఐశ్వర్యవంతుడని అర్థమైపోయింది. సుందరయ్య గారి వ్యాపారాలు దూరదేశాలకు కూడా విస్తరించినట్లు తెలుసుకున్నాడు. సుందరయ్య కార్యాలయం ఎక్కడుందో తెలుసుకొని శ్రీమంతుడు అక్కడికెళ్ళి కలుసుకున్నాడు. పనిచేసే నౌకర్లతో, పరిచారకులతో దాస దాసీ జనంతో ఆ ప్రాంగణమంతా కోలాహలంగా ఉంది. అంత హడావుడి ఉండికూడా ఎంతో నిబ్బరంగా, హుందాగా ఉన్న సుందరయ్యను చూచి ఆశ్చర్యపోయాడు శ్రీమంతుడు.

శ్రీమంతుడు సుందరయ్యకు నమస్కరించి వచ్చిన విషయం చెబుతుండగా, ఒక ఉద్యోగి పరుగు పరుగునా వచ్చాడు. ఆందోళనతో "అయ్యా మన ఓడ సముద్రంలో

మునిగిపోయిందట, సరుకంతా నీటి పాలయిందట. లక్షలాది రూపాయలు నష్టమట అన్నాడు. సుందరయ్యగారు అంతావిని ఏమీ జరగనట్లే, పెదవులపై చిరునవ్వు చెదరనీకుండా వచ్చిన నౌకరుతో "ముందుగా నీవు కాసిన్ని మంచినీళ్ళు తాగవయ్యా! అని చెప్పి, దానికంత ఆందోళన ఎందుకయ్యా? వ్యాపారం అన్నాక ఒడిదుడుకులు తప్పవు, అవన్నీ మామూలే". అని అంటూ మీరొచ్చిన పని ఏమిటో చెప్పండని ఆ శ్రీమంతుని వైపు చూశాడు సుందరయ్య ఏమీ జరగనట్లు తాపీగా. నిశ్చేష్టుడై చూస్తున్న ఆ శ్రీమంతుడు మాటాడదామనుకుంటుండగానే, మరో ఉద్యోగి వచ్చి సుందరయ్యగారిని సమీపించాడు. అతడు పట్టరానంత సంతోషంతో అయ్యా! "విదేశాలకు పంపిన మన ధాన్యం ధర హఠాత్తుగా పెరిగిపోయి దాదాపు రెండు కోట్ల రూపాయలు అధికంగా లాభం వచ్చిందట" అన్నాడు.

సుందరయ్య అంతా విన్నాడు. కానీ అతని ముఖంలో మునుపటి చిరునవ్వు, మునుపటి ప్రశాంతతే తప్ప ఏ మార్పు లేదు. బాబూ! నీవు ముందు కాసిన్ని మంచి నీళ్లుతాగు. అని చెప్పి, దానికే అంత సంబరపడిపోవాలటయ్యా? వ్యాపారం అన్నాక అలాంటివి సహజమే కదా! అన్నాడు. ఆ క్షణంలో శ్రీమంతుడికి తన సమస్యకు పరిష్కారం దొరికింది. మనశ్శాంతి అనేది సంపదల వల్లా, మందీ మార్బలం వల్లా, లభించదు. కష్టసుఖాలను సమానంగా భావించగల్గినపుడు మాత్రమే మనసు శాంతంగా ఉండగలుగుతుందని అర్థమైపోయింది. మనసులోని ఆవేదన, ఆలోచన దూదిపింజలా ఎగిరిపోయింది. మార్గం చూపిన సాధువుకు శ్రీమంతుడు హృదయంలోనే కృతజ్ఞతలు తెలియజేశాడు. తృప్తిగా హాయిగా ఇంటికెళ్ళాడు.

* పని మీద మనసు లేకపోయినా, ఇష్టం లేకపోయినా పని జరగడం కష్టం.
* మనసు కాలభేదం లేకుండా పనిచేస్తూనే ఉంటుంది. శరీరం ఆరోగ్యంగా ఉంటే మనసుకూడా ఆరోగ్యంగా ఉంటుంది. శరీరానికి ఎక్కడ బాధకలిగినా మనసు కూడా బాధపడుతుంది.
* వాతావరణం, పరిసరాలు, సామాజిక పరిస్థితులు మనసుపై ప్రభావం చూపిస్తాయి. వయసునుబట్టి మనసుకూడా మారుతూవుంటుంది.
* కన్నులు చూస్తున్నా ఒక్కోసారి వస్తువులు కనబడవు. మాటలు, శబ్దాలు చెవులకు వినబడవు. అలాగే మిగతా యింద్రియాలుకూడా ఒక్కోసారి పని చేయవు. దీనికి కారణం మనసు ఎక్కడో ఉండడమే.
* కోరికలకు పుట్టినిల్లు పంచేంద్రియాలే. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాల సమ్మిళిత స్వరూపాన్నిగానీ, విడివిడిగాగానీ అనుభవించాలని పుట్టిన కోరికల బహిర్గత స్వరూపమే మనసు.

* సాధ్యమైనా, అసాధ్యమైనా, మంచివైనా, చెడ్డవైనా, మృదువైనవైనా, కఠినమైనవైనా, క్రూరమైనవైనా, సాత్వికమైనవైనా కోరికలను కోరడమే మనసు పని. కోరికలతోనే ఆవేదనలను కానీ, ఆనందాలనుగానీ మనసు పొందుతూ ఉంటుంది.
* మనశ్శక్తిని బుద్ధి ద్వారా, మానసిక శక్తి ద్వారా పూర్తిగా తెలుసుకోవచ్చు. మనసు కనిపించదు. కానీ దానికికూడా బాధ ఉంటుంది, భాష కూడా ఉంటుంది. మౌనమే దాని భాష, మాటల చేత, చేతల చేత, చూపుల చేత, భావాల చేత మనసు ప్రభావితమవుతూ ఉంటుంది. గొడ్డలి వేటు పడిన చెట్టు చిగురిస్తుందేమో కానీ మాటలచేత గాయపడిన మనసు కుదుటపడటం చాలా కష్టం.
* మనసుకూడా జబ్బు పడుతుంది. దానినే మనోవ్యాధి అంటారు. దానికి మందు లేదని అంటారు. కానీ దానికి ఆధ్యాత్మిక మార్గమేమందు. ఆశ్రమమే ఆసుపత్రి.
* మనసే మందిరం, ఆ మనోమందిరం తలుపులు తెరుచుకునే మార్గాలను మహనీయులైన సద్గురువులే చూపించగలరు.

మనసే మందిరం

ఒకమారు దేవతలలో కోరిన దానిని ప్రసాదించే అద్భుత రహస్యశక్తిని ఎక్కడ దాచాలి? అన్న విషయాన్ని గూర్చి చర్చ జరిగింది. ఆ అద్భుత రహస్యాన్ని సముద్ర గర్భంలో దాచాలని ఒకరు సూచించారు. మరొకరు ఏత్తైన పర్వత శిఖరంపై దాచాలని సూచించారు. ఇంకొకరు దట్టమైన అరణ్యంలోని గుహలో దాచడం శ్రేయస్కరం అని సూచించారు.

దేవగణంలో అతి సామాన్యంగా కనిపించే ఒకరు ఇలా సూచించారు. "ఆ శక్తిని మానవుని మనసులో దాచడం శ్రేష్ఠం". ఎందుకంటే మనిషి తనలో తప్ప అంతటా ఆ రహస్య శక్తి కొరకు వెదుకుతూ ఉంటాడు, అని వినయంగా సెలవిచ్చాడు. అతని ఆలోచనకు దేవతాగణమంతా సమ్మతించారు.

మనిషి ఆంతర్యంలో అపారమైన శక్తి ఉంది. ఇది పరమసత్యం. అతడు నిండు మనసుతో, నిలకడ కలిగిన మనసుతో ఏదైనా సాధించగలడు. కానీ, తనలో దాగి ఉన్న శక్తి అతనికే తెలియదు. చేతితో కళ్ళను మూసికొని అంతా చీకటి అన్నట్లుగా ఉంది అతని పరిస్థితి. దీనికి అజ్ఞానం, అహంకారమే కారణం.

* సాగర గర్భంలో అమూల్యమైన రత్నాలున్నట్లే, మనసు లోతులలో అద్భుతమైన శక్తి ఉంది. ఇది సామాన్యమైన ఇంద్రియాల గ్రహణ శక్తికి అతీతంగా ఉంటుంది. నీలోకి నీవు ప్రయాణిస్తే ఆ అద్భుత శక్తి దొరుకుతుంది.

సాధారణంగా అందరిలోనూ సాత్విక, రాజసిక, తామసిక గుణాలుంటాయి. సాత్విక గుణాలు శ్రేష్ఠమైనవి. రాజసిక, మానసిక గుణాలు నీచమైనవి.

సత్వగుణాలు : నిర్మలమైన మనసు, నిగ్రహం, శాంతం, సహనం, సత్యం ధర్మం, స్నేహం, దయ, దానం, ప్రేమ, అనురాగం, ఆప్యాయత, విశాల భావం, సమానత్వం, పరోపకారం, నిర్భయం, తృప్తి-సంతోషం, త్యాగం.

రాజసగుణాలు : మంచివి : సత్యం, సాహసం, ధైర్యం, నిర్భయం.
చెడ్డవి : అహంకారం, ఆవేశం, అసహనం, ఆత్మస్తుతి, అసూయ, అధికార దాహం, ద్వేషం, దురాశ, దౌర్జన్యం, దోపిడి, దురాక్రమణ, పగ, ప్రతీకారం, వంచన, వ్యామోహం.

తామస గుణాలు: పరధ్యానం, మందబుద్ధి, మూర్ఖత్వం, బానిసతనం, చురుకుదనం లేకుండుట, మురికిగానుండుట.

"జైసా అన్న్ వైసామన్" అన్నారు. "ఎట్టి ఆహారమో అట్టి భావాలు" "ఎలాంటి భావాలో అలాంటి మనసు" మనసనేది పుట్టుకతో వచ్చేదే అయినా ఆహారంతో అది మరింత ప్రభావితమవుతుంది. కోపిష్టివానికి ఉప్పు-కారం అధికంగా ఉన్న కూరలు, పదార్థాలు తినిపించినట్లయితే "కోతికి కల్లు తాగించినట్లవుతుంది" కదా? కాబట్టి అందరూ సాత్విక ఆహారాన్నే దేహానికి అందివ్వడం మంచిది. సాత్వికాహారం అంటే నోటి ద్వారా కడుపులోకి పంపించే పాలు, పండ్లు, పెరుగు, కాయగూరలు, ఆకులు మాత్రమే కాదు. పంచేంద్రియాలైన కళ్లు, ముక్కు, చర్మం, చెవులు, నాలుక ద్వారా కూడా శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలను ఆహారంగా మన శరీరానికి అందిస్తూ ఉంటాము.

రాజసిక, తామసిక ఆహారం అంటే? ఉప్పు, కారం, మసాలాలు అధికంగా ఉండే ఊరగాయలు, మత్స్య, మాంసాలు, సద్దికూరలు, చద్దిఅన్నం, పెరుగు, కల్లు, సారాయి, బీడీలు, సిగరెట్లు లాంటి మత్తును కలిగించేవి, బేకరీలో తయారయ్యే పదార్థాలు.

* ఒక సారి ఆలోచనవస్తే అదే ఆలోచన మళ్ళీ మళ్ళీ మనసులోకి వచ్చే అవకాశముంది. ఒక ఆలోచనను పదే పదే మననం చేసుకున్నా, లేక జ్ఞాపకం పెట్టుకున్నా అది మనసులో ఒక భాగమై కూర్చుంటుంది. ప్రయత్నపూర్వకంగా ఆలోచించనప్పటికీ అది మనసుయొక్క అంతరాళాలలో తిష్టవేసుకుని స్థిరంగా నిలిచిపోతుంది. ఏ చిన్న అవకాశం వచ్చినా, ఎంత చిన్న అవసరం వచ్చినా పైకి పెల్లుబికి వస్తుంది.
* ఏనుగు తొండం ఒక్క క్షణం కూడా కదలకుండా ఉండలేదు. కాబట్టి మావటివాడు దానికి ఒక కర్రముక్కను ఇస్తాడు. అది దానిని పట్టుకొని బుద్ధిగా ఉంటుంది. అలాగే నిరంతరం చలించే మనసుకు భగవన్నామస్మరణ అనే దానిని ఇవ్వాలి. బలహీనపరచే సన్నివేశాల నుండి అది మనలను రక్షించగలదు.
* ఆలోచనలుగానీ, భావనలుగానీ, కోరికలుగానీ మాయమైనట్లుగా అనిపించినా మనస్సులోపలి పొరలలో సంస్కారరూపంగా ముద్రపడి, బలవంతపు బంధువుగా నిలచిపోతాయి.

ప్రవచనాలకంటే ప్రవర్తనే ముఖ్యం

ఒక భాగవతార్ ఒక రాజు వద్దకు వెళ్ళి మహారాజా నేను సమస్త పురాణాలను పుక్కిట పట్టిన మహాపండితుడను. భాగవతమును బోధించుటలో మిక్కిలి కీర్తిగడించాను. మీకుకూడా చక్కని శైలిలో భాగవత సారాన్ని బోధించి, మెప్పించుటకు వచ్చాను అని వినయంగా వేడుకున్నాడు.

ఆ రాజుకూడా వేదాంతసారాన్ని చక్కగా ఒంటబట్టించుకున్న జ్ఞానే. భాగవతమును ఇంతలోతుగా పరిశీలించిన భాగవతారు గారు ఆత్మజ్ఞానాన్ని సంపాదించి, నిత్యసంతోషిగా ఉండక, ఇలా రాజా స్థానాలకు వచ్చి ధనం కోసం, గౌరవం కోసం దేవులాడడమేమిటి? అని రాజు తన మనసులో అనుకొని, ఆ భాగవతారుతో "మీరు భాగవతమును ఆమూలాగ్రముగ పఠించినట్లు నాకు తోచడము లేదు. కాబట్టి మీరు ఆ గ్రంథమును బాగుగా చదివి సారాన్ని గ్రహించిన తర్వాత, నావద్దకు రండి. అపుడు మీ బోధనలను చక్కగా వింటాను" అని చెప్పి పంపాడు.

భాగవాతారు రాజు దగ్గర సెలవు తీసుకొని ఇంటికి వెళుతూ తనలో "నేను భాగవతమును అనేక పర్యాయములు చదివాను. ఎన్నో సంవత్సరాలుగా ఎంతో మందికి చెబుతూ వస్తున్నాను. అయినా ఈ రాజు దృష్టిలో తాను ఒక మూఢునిగానే మిగిలిపోయానే"! అనుకున్నాడు. ఇల్లు చేరిన పండితుడు రాజుల వారితో పని, ఎందుకైనా మంచిది మరొక సారి భాగవతమును ఆమూలాగ్రంగా చదివిన తర్వాతనే, రాజు గారి వద్దకెళ్లాలి అని తీర్మానించుకున్నాడు.

కొన్ని రోజుల తర్వాత భాగవతారు మరలా రాజుగారి వద్దకెళ్లాడు. రాజు మరలా అదే విధంగా చెప్పి పంపాడు. ఈసారి భాగవతారుకు పట్టరాని కోపం వచ్చింది. కానీ మహారాజుల వారిని, పేద భాగవతారు ఏమైనా అనగలడా? "పేదవాని కోపం పెదవికి చేటు" కదా? ఇంటి ముఖం పట్టిన భాగవతారుకు దారిపొడవునా రాజు ఎందుకు నన్నిలా త్రిప్పి పంపుచున్నాడు? ఇందులో ఏదో రహస్యముందని గ్రహించాడు.

భాగవతారు ఈ సారి భాగవతమును శ్రద్ధతో ప్రతి సన్నివేశమును అతి సూక్ష్మముగా పరిశీలిస్తూ చదువుతుండగా అందలి నిగూఢార్థములు అతనికి గోచరించాయి "క్షణ భంగురమైన ఈ జీవితంలో తనకెంతో తెలుసుననెడి అహంకారంతో ఒకరి మెప్పుకోసం వెంపర్లాడటం మూర్ఖత్వం. ఈ ప్రయత్నమేదో పరమాత్ముని సేవించి, ఆయన మెప్పు కొరకు ఆరాటపడినచో తనకేది అవసరమో అది అంతయునూ లభించును కదా" అనేసత్యం బోధపడింది. అంతే! దృఢ విశ్వాసంతో బాగవతారు ఇంటి నుండి బైటకు రాకనే భగవంతుని ఆరాధించుతూ ఉండెను. కొన్ని రోజులకు స్వయంగా మహారాజే భాగవతారు ఇంటికి వచ్చి చూడగా భాగవతారు ముఖము బ్రహ్మతేజస్సుతో

ప్రకాశిస్తూ ఉండినది. బ్రాహ్మణోత్తమా ఇప్పుడు మీరు భాగవతార్థమును సంపూర్ణముగా గ్రహించినారని నాకు తెలిసినది అని సాష్టాంగ దండ ప్రణామములర్పించాడు.

మనసులోని భావమే ముఖ్యం

దేవదాసు, కాంతాదాసు ఇరువురూ బాల్యమిత్రులు పెరిగి పెద్దవారై పేరుకు తగ్గట్టు జీవితాలలో స్థిరపడ్డారు. దేవదాసు ఒక గుడిలో పూజారిగానూ, కాంతాదాసు స్త్రీలోలుడై తండ్రి సంపాదించిన ధనాన్ని దర్జాగా ఖర్చు పెడుతూ జల్సాగా కాలం గడుపుతూ ఉన్నారు.

దేవదాసు గుడిలో పూజాదికాలు చేస్తూ వున్నా, అతని మనసు దేవునిపై నిలుపక నిత్యమూ మిత్రుడు కాంతాదాసు గురించే ఇలా ఆలోచిస్తూ ఉంటాడు. "ఆహా! నిజంగా అదృష్టమంటే కాంతాదాసుదేగదా? లోకంలో సుఖమంటే స్త్రీలతో పొందే కామసుఖమే కదా మిక్కిలి సుఖదాయకం! మరి నేనో! ఎంత దురదృష్టవంతుడను?, నా బతుకూ ఒక బతుకేనా? వాడి జీవితంతో పోల్చుకుంటే. ఊహ తెలిసినది మొదలు ఈ రాళ్ళను, రప్పలను రక రకాలుగా కడగడమూ, పూలు పెట్టడమూ, మంత్రాలు, శ్లోకాలు చదవడమూ ఇంతే కదా? చెప్పుకోవలసిందింకేముంది? ఏ సుఖం ఎలాంటిదో తెలియని నేనూ ఒక బండరాయినే కదా? అని విలపిస్తూ లోలోన కుమిలిపోతూ ఉండేవాడు.

కాంతాదాసు నిత్యమూ తనలో అయ్యో! "నా జీవితము వ్యర్థమైనది. నేనెంత దురదృష్టవంతుడను, వేశ్యాలోలుడనై, స్త్రీల పొందుకోసం పరితపిస్తూ, పెద్దల సంపాదనంతా ఇలా రండల పాలు చేస్తున్నానేకానీ, మనసారా ఆ దైవాన్ని స్మరించ లేకపోతున్నానుకదా? మిత్రుడు దేవదాసు జన్మధన్యము గదా? ఎప్పుడూ గుడిలో ఆ దేవుని సన్నిధిలో కాలం గడుపుతూ ఉంటాడు. ఏమి భాగ్యము? ఎన్ని జన్మల పుణ్యము! ఆహా! జన్మ అంటే అదేగదా?!" అని చింతిస్తూ ఉంటాడు.

కొంతకాలానికి మిత్రులిద్దరూ మరణించారు. ఇరువురి ప్రాణాలను తీసుకొని అంతరిక్షంలో ప్రయాణిస్తుంటారు యమభటులు. కొంతదూరం వెళ్లాక దేవదాసు యమభటులు నరకం వైపుకు, కాంతాదాసు భటులు స్వర్గం వైపుకు తిరుగుతారు. యమభటులతో ఇదేమి న్యాయం? నిత్యమూ గుడిలో పూజాదికాలు చేసిన నన్ను నరకం వైపుకా తీసుకెళ్ళేది? వేశ్యాలోలుడైన కాంతాదాసును స్వర్గంవైపుకా తీసుకెళ్లేది? ఇది చాలా అన్యాయం, అక్రమం అని ఆక్రోశిస్తూ నేను రాను అని మొరాయిస్తుంది దేవదాసు ఆత్మ.

ఇంతలో అటుగా వస్తున్న నారద మహర్షిని దేవదాసు ఆత్మచూచి, నీవైనా ఈ యమభటులకు తెలియజెప్పు స్వామీ! అని వేడుకున్నది. విషయమంతా తెలుసుకొన్న నారద మహర్షి "ఓ దేవదాసూ నీవు గుడిలో ఉంటూ నిత్యమూ నీ మిత్రుడు కాంతా

దాసు అదృష్టాన్నీ, స్త్రీల పొందులోని సుఖాన్నే తలచుకుంటూ ఉండేవాడివి. గుర్తుందా? అందుకే నీవు నరకానికి. ఇక నీ మిత్రుడంటావా? స్త్రీల చెంత ఉండికూడా, తన వ్యర్థ జీవితానికి నిత్యమూ బాధపడుతూ గుడిలో ఉన్న నీ అదృష్టానికి సంతోషిస్తూ ఉండినాడు. కాబట్టి స్వర్గానికి" అన్నాడు.

* బాహ్యాడంబరాలు ముఖ్యం కాదు. మనసులోని భావమే ముఖ్యం. అంతఃకరణ పవిత్రంగా ఉండడమే ముఖ్యం.
* వాహన వేగం వలన ప్రమాదాలు ఎలా జరుగుతాయో, అలాగే మనోవేగం వలన జీవితంలో ఎన్నో అనర్థాలు, ఆపదలు కలుగుతాయి. అందుకే మనోవేగాన్ని అదుపులో ఉంచుకుంటే నడిపే వాహన వేగాన్నేకాదు, జీవన వేగాన్నికూడా అదుపులో ఉంచుకోవచ్చు, ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చు.
* శ్వాసను అదుపులో ఉంచుకుంటూపోతే మనసు అదుపులోకి వస్తూ ఉంటుంది.
* సూక్ష్మమైన మర్రి విత్తనంలో ఎంతో గొప్ప మర్రి వృక్షం అణిగి ఉంటుంది. అలాగే సూక్ష్మాతి సూక్ష్మమైన ఈ మనసులో కోటాను కోట్ల ఆలోచనలు అణిగివుంటాయి. మనసు నీటి చెలిమలాంటిది. తోడే కొద్దీ చెలిమలో నీళ్ళు ఎలా ఊరుతూనే ఉంటాయో అలాగే ఆలోచించే కొద్దీ, వద్దన్న కొద్దీ ఆలోచనల దొంతరలు మనసులో వస్తూనే ఉంటాయి. ఆలోచనలు రాకూడదని ప్రయత్నించని మనిషంటూవుండడు. కానీ ఆలోచనలకు అంతూ ఉండదు, అదుపూ చెయ్యలేము. అక్కర్లేనివి, అనవసరమైనవే అధికంగా వస్తూనే ఉంటాయి. మనసు నిరంతరం గతించిన దానిని గురించి, జరగబోయే దానిని గురించి అంటే భూత, భవిష్యత్ కాలాలలో మాత్రమే ఎక్కువగా విహరిస్తూ ఉంటుంది. మనసుకు ఆలోచనల విహారమే ఆహారం.

పగటికలలు

ఒక అమ్మాయి ఆవుపాలను సంతలో అమ్ముతూ జీవిస్తూ ఉండేది. ఆమెకు విలాసవంతంగా జీవించాలనే కోరిక ఉండేది. వాటి గురించి ఊహించుకుంటూ ఎప్పుడూ ఊహలలో విహరిస్తూ, పగటికలలు కంటూవుండేది.

ఎందుకనో ఆ రోజు ఆ అమ్మాయి మనసు చాలా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉరకలు వేస్తూ ఉండినది. రోజులాగే ఉదయమే పాలకుండను నెత్తిన పెట్టుకుని సంతకు బయల్దేరింది. దారిపొడవునా తన అందమైన జీవితాన్ని గురించి కలలు కనసాగింది. తాను ఈ పాలను అమ్మగా కొంత డబ్బు వస్తుంది. ఆ డబ్బుతో ఒక కోడిపెట్టను కొంటాను. ఆ కోడిపెట్ట దండిగా గుడ్లు పెడుతుంది. ఆ గుడ్లనన్నింటిని పొదగేస్తాను. ఆ కోడి పిల్లలు అన్నీ పెద్దవై అవికూడా గుడ్లు పెడతాయి. అలా వచ్చిన కోడి పిల్లలు పెద్దవై మళ్ళీ మళ్ళీ గుడ్లు పెట్టి పొదిగి చాలానే కోళ్ళు అభివృద్ధి చెందుతాయి.

ఆ కోళ్ళను అమ్మగా వచ్చిన బోలెడంత డబ్బుతో మంచి ఇల్లు కట్టుకుంటాను. ఖరీదైన బట్టలు వేసుకొని సంతకెళతాను. తన అందచందాలకు మురిసిపోయి ఒక అందమైన యువకుడు తనను పెళ్ళి చేసుకుంటానంటాడు. నేనూ ఒప్పుకుని పెళ్ళి చేసుకుంటాను. అపుడు ఆనందగా ఇద్దరమూ ఇదిగో ఇలాగా ఎంతో మనోహరంగా నాట్యం చేస్తాము. అని ఆ యువతి నాట్యమాడింది.

అలా ఆమె పగటికలలో తేలియాడుతూ నాట్యం చేస్తూ ముందుకు సాగింది. దారిన వెళ్ళే వాళ్ళంతా ఈ దృశ్యాన్ని వింతగా చూడసాగారు. చేతులూపుతూ, తల తిప్పుతూ, శరీరాన్ని కదిలిస్తూ ఉండడంతో తలమీదనున్న పాల కుండ కాస్తా అదుపు తప్పి క్రిందపడి పగిలిపోయింది. పాలన్నీ నేలపాలయ్యాయి. అప్పుడు ఆ యువతికి తాను నడిబజారులో ఉన్నాననే స్పృహ కలిగి సిగ్గుతో తలదించుకుని ఇంటికి ఉత్త చేతులతో వెళ్ళింది. "పగటి కలలు పనికి చేటు" అని తెలుసుకుంది.

బంగారు కలలు కనవలసిందే, ఊహల ఉయ్యాల ఊగవలసిందే. చక్కని, చుక్కల ఆశల పల్లకీలో ఊరేగవలసిందే, తప్పు కాదు. కానీ ఆ ఊహల విహారంలో అంతులేని ఆకాశంలోకి వెళ్ళి దిక్కుతోచక క్రిందికి దూసుకొని వచ్చి సముద్రంలో పడి, అలల సుడులలలో చిక్కి మునిగి పోయే ప్రమాదం ఉంది. కాబట్టి వర్తమానంలోని వాస్తవ పరిస్థితులను మరచిపోకుండా, భవిష్యత్ ప్రణాళికలను వదలిపెట్టకుండా, కాలదోషం, సహవాస దోషం పట్టకుండా, పట్టు సడలించకుండా లక్ష్యంలో నిర్లక్ష్యం చోటు చేసుకోనివ్వకుండా జాగ్రత్తగా గమ్యం చేరేవరకూ నిరంతరం శ్రమిస్తూ ఉండాలి.

* శ్రమించడమే జీవన సూత్రం. ఇపుడు ఈ క్షణంలో ఏమి జరుగుచున్నది? మనం ఏమి చేస్తున్నాం? చేస్తున్నది సరిగానే ఉన్నదా? మన తక్షణ కర్తవ్యమేమి? ఎటువంటి స్థానంలో ఉన్నాము? స్థాన ధర్మమేమి? అని ప్రతి ఒక్కరూ ఆలోచించుకుంటూ వర్తమానంలో జీవిస్తూ ఉండాలి.

మానసిక బలహీనులు వ్యసనాలకు లోబడిపోతారు. వ్యసనాలనుండి బైటపడాలంటే మనిషి తన "అహంశక్తిని" మానసిక శక్తి కంటే బలోపేతం చేసుకోవాలి.

కొందరు సిగరెట్లు కాల్చడం, మద్యం సేవించడం, జూదమాడడం, వ్యభిచరించడం, లొడలొడా వాగడం, లాంటి దురలవాట్లకు లోనై ఉంటారు. వ్యసనపరులు ప్రతిరోజు ఎప్పటికప్పుడు తమ దురలవాట్లపై బాధపడుతూ "ఛీ పాడలవాటు...మానెయ్యాలి" అనుకొంటూ ఉంటారు. ఒకడిలా అన్నాడు "సిగరెట్లు మానడం ఏమంతకష్టం కాదు. నేను ఎన్నిసార్లో మానేశాను" అని.

దొండపండులాంటి పెదవులు కాస్తా మసిపెంకుల్లా అయినా. చేతి వ్రేళ్ళకొనలు సిగరెట్టు పట్టిన కారణంగా రంగు మారినా! శరీరమంతా చండాలమైన కంపు కొట్టినా,

"ఎవడికంపు వాడికింపు" అన్నట్లు ఖళ్ ఖళ్ మని దగ్గుతూ, ఎప్పటికప్పుడు రాజీపడుతూ "టీ త్రాగినపుడు ఇదే చివరి సిగరెట్" అనీ టాయ్‌లెట్ కెళ్ళినపుడు ఇలాంటి సమయంలో ఒక్కటి కాలిస్తే ఎంతో హాయి, మరెంతో రిలీఫ్‌గా ఉంటుంది" అనీ, పదిమందీ కలుసుకున్నపుడు, ఇంతటి రసవత్తరమైన వాతావరణంలో సిగరెట్ కాల్చకపోతే ఎలా? అని సమర్ధించుకుంటూ, రేపు మానేద్దాం, మరునాడు మానేద్దాం, ఫలానా మంచి రోజు నుండి మానేద్దాం అని వాయిదాల మీద వాయిదాలు వేసుకుంటూ పోతూ వుంటారు.

ఒకడిని సిగరెట్టు కాల్చడం ఎలా మానుకున్నావు? అంటే "వేలెడంత సిగరెట్టు చెట్టంత మనిషిని లోబరచుకొని కాలుస్తున్నదే! ఛఛ ఎంతవమానం! "అని ఎక్కడలేని అహంశక్తిని పెంచుకుని మనసుకు వ్యతిరేకంగా ఆలోచించి "ఆరోగ్యానికి హానికరం" అని ఆత్మ చేసే హెచ్చరికను అమలుపరచి పొగత్రాగే అలవాటును శాశ్వతంగా మానుకున్నాను" అన్నాడు.

"అపాయకరమైన పరిస్థితులలో క్రమశిక్షణ దానంతట అదే అబ్బుతుంది" అనారోగ్యపు అలవాట్లతో ఇల్లు, ఒళ్ళుగుల్ల అవబోతుందన్నపుడు, దురలవాట్లను మానుకోవాలన్న ఆలోచన దృఢంగా కలుగుతుంది.

మరణ భయంతో మనో నిగ్రహం అలవడుతుంది.

ఒక రాజు బాగా స్థూలకాయుడుగా ఉండేవాడు. ఎంత స్థూలకాయుడు అంటే పట్టాభిషేకం తర్వాత తరతరాలనుండి ఉన్న రత్న ఖచిత సింహాసనం సరిపోక కొత్త సింహాసనం చేయించవలసివచ్చింది. "భారీ శరీరం ఆరోగ్యానికీ, ఆనందానికి అవరోధం"గా నిలుస్తుందని ఎందరో వైద్యులు, శ్రేయోభిలాషులు చెప్పారు. ఎంత మంది ఎన్ని విధాలుగా చెప్పినా తిండియావ ఎక్కువైనందున ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది.

రాజుకు జ్యోతిష్యం మీద ఎంతోగురి. దేశదేశాలనుండి ఎందరో జ్యోతిష్యులు వచ్చి రాజుకు నచ్చే విధంగా చెప్పి బహుమతులను తీసుకొని వెళ్ళేవాళ్లు. ఒకసారి ఒక సాహసవంతుడైన యువకుడు రాజదర్బారులోకి ప్రవేశించి "జ్యోతిష్య శాస్త్రంలో నన్ను మించిన వారు లేరు. దేశ దేశాలలో సత్కారాలు పొందుతూ ఇక్కడికి వచ్చాను". అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు. రాజు చాలా సంతోషించి ఆ యువకుడికి చక్కటి విడిది ఏర్పాటు చేసి తగిన మర్యాదలు చేయవలసిందిగా అధికారులను ఆజ్ఞాపించాడు.

రెండు రోజుల తర్వాత రాజుకు కొంత తీరుబాటు దొరకగానే అంతఃపురానికి పిలిపించుకొని తన జాతకాన్ని చూడమని చెప్పాడు. ఆ యువ జ్యోతిష్యుడు గంభీరంగా

రాజుగారి జాతకాన్ని పరిశీలించి, విచారంగా ముఖంపెట్టి రాజుగారు మన్నించాలి. "మీరు మూడు నెలల్లోనే తనువు చాలించబోతున్నారు. అలాగా జ్యోతిష్య శాస్త్రం చెబుతోంది" అని వినయంగా, దుఃఖంతో చెప్పాడు.

రాజు గారికి ఎక్కడలేని కోపం, ఆవేశం వచ్చింది. "వీడిని బంధించి చెరసాలలో పెట్టండి. ఒక వేళ మూడు మాసాలలో నేను మరణిస్తే ఇతడిని ఘనంగా సత్కరించి, పది వేల బంగారు నాణాలను ఇచ్చి సాగనంపండి. లేకుంటే నేనే దగ్గరుండి నగరంనడి బొడ్డున ఉరితీయిస్తా" అంటూ హూంకరించి వెళ్ళాడు. భటులు ఆ యువజ్యోతిష్యుడిని కారాగారంలో బంధించారు.

ఆ రోజు రాత్రి నుండి రాజుకు కంటి మీద కనుకు లేదు. ఆ యువజ్యోతిష్యుడు చెప్పింది ఒకవేళ నిజమవుతుందేమోనన్న బెంగ పట్టుకుంది. తిండిమీద ఎంతో యావ ఉండిన రాజుకు తిండి సహించడం లేదు. రాజ్యం, రాజ భోగాలు, సిరిసంపదలు, ఎన్ని ఉన్నా, ఎంతమంది బంధు మిత్రాదులు ఉండినా, ఏం ప్రయోజనం? అనుభవించడానికి ఆయుష్షు లేకపోతే, ఏమి ఉన్నా, ఎంత ఉన్నా ఏమీ లేనట్లే కదా? అనుకుంటూ ఒక పక్క దిగులు పడిపోతూ, ఎలాగూ చనిపోతున్నాం, చనిపోయే ముందు ఈ మూడు మాసాలలో రాజ్యాన్ని చక్కదిద్దాలని నిర్ణయించుకున్నాడు. కఠినమైన నిర్ణయాలు తీసుకుంటూ ఎన్నో సమస్యలను పరిష్కరించాడు.

ప్రతిరోజూ తెల్లవారగానే తన ఆయుష్షులో ఒక రోజు తరిగిపోయింది. ఇక మిగిలింది ఎన్నాళ్లు? అని లెక్క పెట్టుకునేవాడు. అలా చూస్తూ ఉండగానే ఎనభై తొమ్మిది రోజులు గడిచి పోయాయి. "ఇక మిగిలింది ఒక్కరోజే" ఈ రోజు కూడా గడచినరోజుల్లాగా, నేను చూస్తూ ఉండగానే గడచిపోయి నేను బ్రతికితే ఎంత బాగుండు? అయినా నమ్మకమేముంది అనుకుని ముఖ్యమైన రాజోద్యోగులను, మంత్రిని, బంధువులను, అందరినీ పిలిపించుకుని తన తదనంతర బాధ్యతలను అప్పగించాడు. మహారాణినీ, సంతానాన్ని తన దగ్గరే ఉంచుకుని కాలక్షేపం చేయసాగాడు.

ఇలా తొంబయ్యో రోజు కూడా గడచి సూర్యోదయమయింది. ఆశ్చర్యం.. రాజు గారికి ఏమీ కాలేదు. రాజు భార్య, బిడ్డలు అందరూ దుఃఖాన్ని దూరంగా నెట్టేసి గది నుండి బైటికి వచ్చారు. జోస్యం ఫలించనందుకు నగరమంతా పండగ వాతావరణం నెలకొంది. అందరిలోనూ ఆశ్చర్యానందాలే! అందరూ ఇక యువ జ్యోతిష్యుని పరిస్థితే దారుణంగా ఉంటుంది అనుకోసాగారు.

జ్యోతిషం తప్పయినందుకు రాజుకు ఆనందగా ఉండినా, మూన్నెళ్ళపాటు అన్న పానీయాలకు దూరం చేసి, మానసిక క్షోభకు గురి చేసిన ఆ బూటకపు జ్యోతిష్యుడిని తక్షణమే కసిదీరా ఉరి తీయించాలని నిర్ణయించుకున్నాడు. ఆ బూటకపు జ్యోతిష్యుడిని

భటులు ఈడ్చుకుంటూ తీసుకువచ్చి రాజు గారి ముందు హాజరు పరచారు. "ఓరీ మూర్ఖుడా! అసలు నీ జాతకం నీకు తెలుసా? మరి కొద్ది సేపట్లో నిన్ను ఉరి తీయిస్తాను. ఈ విధంగా నీకు చావు మూడుతుందని తెలుసా"? అని గద్దించాడు. ఆ యువకుడు ఎంతో నిబ్బరంగా "క్షమించండి మహారాజా నేనసలు జ్యోతిష్యుడినే కాను". అన్నాడు. ఆ మాటలు విన్న రాజు కోపంతో మరింత రెచ్చిపోయి "మరెందుకు నా దగ్గర అబద్ధం చెప్పావ్?" అని గద్దించాడు.

యువకుడు వినయంగా "రాజా! వాస్తవానికి నేనొక మంచి వైద్యుడిని. కొన్ని నెలల క్రిందట తమరు స్థూలకాయాన్ని తగ్గించగలిగిన వారికి తగిన బహుమతినిస్తామని చాటింపు వేయించినారు. దాని ప్రకారం ఎందరో వైద్యులు, మరెందరో శ్రేయోభిలాషులు స్థూలకాయం మంచిదికాదని ఎన్నో సలహాలనిచ్చారు. కానీ తిండి మీది యావతో మీరు ఆరోగ్యాన్ని లెక్క చేయలేదు. ఫలితంగా స్థూలకాయులుగానే ఉండిపోయారు. నేను సాహసించి ఈ పనికి పూనుకున్నాను. ఒక్కసారి అద్దంలో మిమ్మలను మీరు చూసుకోండి" అన్నాడు.

రాజు ఆశ్చర్యపోయాడు. అరె, నిజమేనే! ఈ మూడు మాసాలలో సగం తగ్గాను. ఎంతో మంది వైద్యులు ఎన్నో ఏండ్లుగా తగ్గించలేని ఊబకాయాన్ని, ఈ సాహసికుడు మూన్నెళ్ళల్లో తగ్గించేశాడు. ఈ మూడు నెలల కాలంలో తిండి మీద ధ్యాస తగ్గడంతో పాటు, జీవితం అంటే ఏమిటో, పరిపాలన ఎలా చేయాలో తెలిసొచ్చింది. ఇప్పుడెంతో హాయిగా ఉంది". అని అతడిని ఘనంగా సత్కరించి, ప్రశంసించి, ఇలాంటి సాహసికుడు, శ్రేయోభిలాషి రాజ్యానికీ, రాజుకూ అవసరం అని చెబుతూ, అతడిని ఆస్థాన వైద్యుడిగా నియమించుకున్నాడు.

* సత్యమునే పలుకువానికి మాలిన్యం అంటదు.
* ఏ కారణం చేతనైనా అహంశక్తి బలహీనపడిందో, మరుక్షణమే మానసిక బలహీనత విజృంభించి దురలవాటుకు మనిషిని బానిసగా మార్చివేస్తుంది.
* మనిషి తన ఇష్టాఇష్టాలను చక్కగా గుర్తించగలగాలి. ఇష్టమును అయిష్టంగానూ, అయిష్టమును ఇష్టంగానూ మార్చుకొనగల అహం శక్తిని పెంపొందించుకోవాలి.
* అవసరాలను బట్టి, వాతావరణమును బట్టి, అవకాశమును బట్టి కోరికలు పుట్టుకొస్తుంటాయి. పదే పదే తలచుకున్నది కోరికగా బలపడుతుంది. ఆ వెంటనే విచక్షణ మేల్కొంటుంది. ఆత్మ మంచి చెడుల మథనం చేస్తుంది. విచక్షణది పై చేయి అయ్యినా చెడు నిరోధించబడుతుంది. మనసుదే పైచేయి అయ్యినా చెడు నిరాటంకంగా అమలు పరచబడుతుంది. ఇలాంటి స్థితిలోనే మనిషి మనసు యొక్క ఇష్టానికి వ్యతిరేకంగా ఆలోచించి వివేకంతో ఆత్మశక్తిని ఆచరణలో పెట్టాలి. ఆచరణ

అలవాటు కావాలి.

* మనసుతో నిండినవాడు మనిషి. ఆత్మతో నిండినవాడు మహాత్ముడు.
* కోరికలను తీర్చుకోవాలనెడి తపనతో అనుభవించడం గొప్పకానే కాదు. కోరికలను అదుపులో ఉంచుకుంటూ, అభ్యాసం ద్వారా త్యాగం చెయ్యడమే గొప్పతనం.
* కొత్తతరం ఏమంటుందంటే? వారికేమయ్యా బాగా అనుభవించిన కాడికి అనుభవించారు. ఇపుడు నీతులు చెబుతున్నారు. మేము కూడా బాగా అనుభవించి వయసు ముదిరాక మేము కూడా మీలాగే నీతులు చెబుతాం అని. ఈ విధంగా ఆలోచించడం, మాట్లాడడం తగదు. "అన్ని తప్పులూ మనమే చేసి జీవితం అంటే ఏమిటో? దాని ఆనందం ఎలా ఉంటుందో తెలుసుకోవాలంటే జీవితకాలం సరిపోదు". కాబట్టి పెద్దలు నిర్మించిన బాటలో నడిస్తే ప్రయాణం సాఫీగా సాగి గమ్యం చేరుకుంటాం. అలాకాక బాటలను మేమే వేసుకుంటాం! అంటే అది వారి ఖర్మ, మూర్ఖులు చేసే పని.
* తెలివైన వారు మొదట చేసే పనిని మూర్ఖులు చివరలో చేస్తారు.
* మానవులు బుద్ధిజీవులు కావున అనుభవజ్ఞులు చూపిన ఆదర్శాలతో జీవిస్తే సుఖం, శాంతి, లభిస్తుంది. ఆదర్శాలు లేనివారు అభాగ్య జీవులు.

బలమైన చెడుకోరికలను దృఢమైన మంచి ఆశయాలతోనే జయించాలి.

ఒకసారి బుద్ధ భగవానుని అందానికీ, వ్యక్తిత్వానికీ ఆకర్షితురాలైన ఒక వేశ్య-దురుద్దేశ్యంతో ఒకనాటి అర్ధరాత్రి బుద్ధుని నివాసానికి వెళ్ళింది. బుద్ధ భగవానుని మోహపరచి, ఆనంద పారవశ్యంలో మునిగిపోవాలనుకుంది. తలుపు తట్టింది. తలుపు తెరచి సాదరంగా, ప్రేమగా..."వచ్చిన కారణమేమని" అడిగాడు బుద్ధభగవానుడు. ఆమె "నేను కొన్ని ఫలములు, ఫలహారాలు తీసుకొచ్చాను" అంది. ఆ స్త్రీని చూడగానే ఆమెలోని దురాలోచన బుద్ధునికి తెలిసిపోయింది.

ఆయన చాలా సౌమ్యంగా, ఆప్యాయంగా, వాత్సల్యాన్ని కురిపిస్తూ" తల్లీ! ఈ నీ కుమారుడు ఎలాంటి సేవ చేయవలెనో సెలవివ్వండి" అన్నాడు. మోహావేశ ఉధృతిలో దహించుకుపోతూఉండిన ఆ వేశ్య, బుద్ధుని పలుకులు విని నిలువునా నీరుగారిపోయి అవమానంతో తలదించుకుని వెళ్ళిపోయింది.

* నీవు మనసు నుండి రాలేదు. మనసే నీ నుండి వచ్చింది. కాబట్టి మనసుకు నీవే అధికారిగా ఉండాలి. కానీ మనసు నీకు అధికారిగా ఉండకూడదు. మనసు నీకు నౌకరుగా ఉండాలి. నీవు మనసుకు నౌకరుగా ఉండకూడదు. మనకు మనసు బానిసలా పడిఉండాలి అంతే.

కోరికలు తీరడం అసాధ్యం

యయాతి మహారాజు శుక్రాచార్యుని కుమార్తె దేవయానిని వివాహమాడాడు. అల్లుడు యయాతికి శుక్రాచార్యుడు ఓ షరతు విధించాడు. దేవయాని చెలికత్తె అయిన శర్మిష్ఠని కన్నెత్తిచూడరాదన్నాడు. యయాతి ఓస్ అంతే కదా! అని షరతుకు ఒప్పుకున్నాడు.

కొంత కాలం గడిచాక శర్మిష్ఠ అందచందాలకు వశుడై యయాతి మామకిచ్చిన మాటను తప్పాడు. శర్మిష్ఠలోని మానసిక, శారీరక మార్పులను గమనించిన శుక్రాచార్యుడు అల్లుడు మాట తప్పాడని తెలుసుకున్నాడు. అల్లుని అధర్మ ప్రవర్తనను తెలుసుకున్న శుక్రాచార్యుడు కోపోద్రిక్తుడై తక్షణమే "వృద్ధాప్యం సంక్రమించుగాక" అని శపించాడు. యయాతి మహారాజు వెంటనే మామగారి కాళ్లపైబడి "నాకు మీ కూతురు దేవయానితో ఇంకా సాంసారిక సౌఖ్యాలను అనుభవించాలని ఉంది. కావున దయచేసి మరికొంత కాలం యౌవ్వనం ఉండేటట్లు అనుగ్రహించండి" అని వేడుకున్నాడు. అల్లుని కోరికను మన్నించి, శాంతించి, దయతో "నీ వృద్ధాప్యాన్ని ఎవరైనా తీసుకొని వారి యవ్వనాన్ని నీకు ఇవ్వగలిగితే నీ కోరిక నెరవేరుతుంది" అని శుక్రాచార్యుడన్నాడు.

ఇహలోక సౌఖ్యాలను అనుభవించాలన్న తపనతో, యయాతి తన కుమారులనందరినీ పేరు పేరునా బ్రతిమలాడాడు. కానీ యవ్వనాన్ని దారబోయుటకు ఎవరూ ముందుకు రాలేదు. కామాంధుడైన యయాతి తన కుమారులనందరినీ దూషించాడు. చిట్ట చివరకు పురూరవుడు అనే కుమారుడు తన యవ్వనాన్ని తండ్రికిచ్చి, తండ్రి ముసలితనాన్ని తాను తీసుకున్నాడు.

యవ్వనాన్ని తిరిగి సంపాదించుకున్న యయాతి నవయవ్వనుడై తాననుకున్న సుఖాలను, తాననుకున్న తీరులో ఎంతో కాలం అనుభవించాడు. కానీ తన కామం రోజు రోజుకూ అగ్నిలో పోసిన ఆజ్యంలాగా ఎగిసిపడుతున్నదే కానీ ఉపశమించలేదు. చివరికి తానే విసిగిపోయి ఒకసారి గతాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇంత కాలం తానేం అనుభవించాడు? అని ప్రశ్నించుకున్నాడు. సమాధానంగా అతని కోరికలు, అతని చేతలు కళ్ల ముందు కనిపించాయి. తప్పుని తెలుసుకున్నాడు. వెంటనే కుమారుని దగ్గరికెళ్లి "నాయనా ఏదో తెలియని ఆరాటంతో సర్వ సౌఖ్యాలను అనుభవించాలని తపన పడ్డాను. "కోరికలకు కళ్లెం వేయకపోతే గుర్రాలై పరిగెడతాయి". కోరికలను తీర్చుకుంటూ పోతే ఎన్నటికీ తరగవు. ప్రపంచంలోని సమస్త ధన, కనక, కాంతా, వస్తు వాహనాలు ఎన్ని ఉన్నా మనిషిని సంపూర్ణంగా తృప్తి పరచలేవు. కాబట్టి నేనే కోరికలను విడిచిపెట్టి వానప్రస్థానికి వెళ్లాలనుకుంటున్నాను" అన్నాడు. మనసు అనే కొలిమిలో కోరిక అనే ఇంధనాన్ని వేసే కొలదీ, అగ్నికి ఆజ్యం పోసినట్లుగా పెరుగుతుందేగానీ తరగదు. కోరికలు తీరడం అసాధ్యం.

ప్రయత్నిస్తే చెడు అలవాట్లకు దూరం కాగలరు.

మద్యం సేవించడం, ధూమపానం చేయడం, జూదమాడటం, వ్యభిచరించడం, అసూయపడటం, అహంకరించడం, ఆగ్రహించడం లాంటి మానసిక దురలవాట్లున్న గుణశేఖర్‌ను అనుకోకుండా రైలు ప్రయాణంలో ఒక బాబా గారు తారసపడ్డారు. ఆయన ముఖంలోని తేజస్సును, ప్రశాంతతను చూచి ఆనందాశ్చర్యాలకు లోనై, తన ముఖం కూడా అలాగా ఉంటే ఎంత బాగుంటుంది అనుకున్నాడు.

ప్రయాణంలో వారి మధ్య మాటలు కలిశాయి. గుణశేఖర్ ఆ బాబా గారి ముందు మనసు విప్పి తనకున్న అన్ని దురలవాట్లనూ ఏకరువు పెట్టి "ఇవన్నీ చెడ్డవని నాకు బాగా తెలుసు. వీటిని వదలించుకోవాలన్న బలమైన కోరికకూడా నాలో ఉంది. కానీ వదలలేకున్నాను" అన్నాడు. చెడ్డ అలవాటు ఉన్న ఏ మనిషికైనా అవి చెడ్డవని తెలుస్తుంది. వాటిని వదలించుకోవాలన్న కోరిక, తపనకూడా బలహీనంగానో, బలంగానో అంతర్లీనంగా ఉంటుంది. ఒక్క అలవాటు వదలితే చాలు మిగిలినవన్నీ ఒకటొకటిగా వదలిపోతాయి. ముందు ఒక దానిని వదలించుకుంటే చాలు" చెప్పారు బాబా గారు.

అదెలా సాధ్యం బాబాగారూ?! ఎంతో ప్రయత్నం చేస్తే ఒక దురలవాటును వదలించుకో వచ్చునేమోగానీ అన్నింటినీ వదలించుకోవచ్చుననడం సమంజసం కాదని నా ఉద్దేశ్యం" అన్నాడు గుణశేఖర్. అందుకు బాబా గారు చిరునవ్వుతో ఇలా చెప్పాడు. "ఓ గది మురికిగా ఉందనుకో. అపుడు దాన్ని నీవు శుభ్రం చేయాలనుకుంటావు. ఆ ప్రయత్నం మొదలుపెడితే ఏమౌతుంది? ముందు బూజు దులుపుతావు. క్రింద నేలను శుభ్రంగా ఊడుస్తావు. అపుడు కిటికీ కర్టన్లు మాసిపోయాయన్న విషయాన్ని గమనిస్తావు. వాటిని శుభ్రపరుస్తావు. ఇంత శుభ్రంగా ఉన్న గదిలో కిటికీ చువ్వలు మురికిగా ఉన్నట్లు గమనిస్తావు. వాటిని శుభ్రం చేయకుండా ఉండలేవు. ఇలా గదిని శుభ్రం చేసేకొద్దీ అపరిశుభ్రంగా ఉన్నవి ఒక్కొక్కటే మనకంట పడడమూ వాటిని శుభ్రం చేయడమూ జరుగుతుంది. అలాగే ఓ చెడ్డ అలవాటును మనం వదలించుకుంటే మిగిలిన వాటి మీదకూడా మనం ఆధిక్యతను సంపాదిస్తాం.

ప్రయత్నిస్తే ఎవరైనాసరే ఎంత చెడ్డ అలవాట్లనుంచైనా బయటపడగలరు. కాబట్టి నీవుకూడా మనసును శుభపరిచే దిశలో ఏదైనా ఒక అలవాటును మానుకునే ప్రయత్నం చేయిమరి. అని ప్రోత్సాహ పూర్వకంగా చెప్పారు ఆ బాబా గారు.

* ఏ కోరికల వల్ల మన ఆరోగ్యం దెబ్బ తింటున్నది? ఏ కోరికల వల్ల మన మర్యాద, గౌరవం మంట గలుస్తున్నది? ఏ కోరికల వల్ల మన సంసారంలో చిచ్చుపుడుతున్నది? అని బాగా ఆలోచించి తగిన విధంగా చర్యలు తీసుకుంటే అంతా సుఖమే!
* ముసలితనం రూపాన్నీ, ఆశ ధైర్యాన్నీ,మృత్యువు ప్రాణాన్నీ, అసూయ ధర్మాచరణనూ, క్రోధం వ్యక్తిత్వాన్నీ, కామం భయాన్నీ, సిగ్గునూ, అహంకారం సమస్తాన్నీ నాశనం చేస్తుంది. కాబట్టి అహంకారాన్ని వదులుకోవాలి.

మనలోని మనసు చెప్పినట్లు విని, ఆత్మ చెప్పినట్లు వినకపోతే మనసు దగ్గరవుతుంది, ఆత్మ దూరమవుతుంది. మనసు పెరిగే కొలది పాపపు ఆలోచనలు, పాపపు పనులు పెరుగుతాయి. మనసుకు విరోధి ఆత్మ, మనసు దెయ్యం, ఆత్మ దేవత, ఆత్మ చెప్పినట్లు వినాలి, చెయ్యాలి. అపుడే ఆత్మోన్నతి కలుగుతుంది.

* ఆత్మకు దగ్గరైతే పరమాత్ముడవుతాడు-మనసుకు దగ్గరైతే సైతాను అవుతాడు.

అసూయను తొలగించుకోవడం ఎలా?

అసూయను అదుపులో ఉంచుకుంటూ నెమ్మదిగా ప్రయత్నిస్తూ ఉంటే ఒక రోజుకు అసూయలేని విశాలమైన, నిర్మలమైన మానసిక స్థితికి చేరుకోవచ్చు.

ఎవరికైనా ఏదైనా మంచి జరిగినపుడు వారి దగ్గరికెళ్ళి మనసారా అభినందించాలి. మంచి జరిగినందుకు తనకు చాలా సంతోషంగా ఉందని చేతిలో చేయి వేసి సంతోషాన్ని వెలిబుచ్చాలి. ఎదుటివాడికి ఏదైనా లాభం వచ్చినా, ప్రమోషన్ పొందినా, సంతానం కలిగినా, సంతోషించాలి. ఆ ఆనందాన్ని చక్కగా నలుగురితో పంచుకోవాలి. ఎవరైనా మంచి పని చేసినపుడు, వారి దగ్గరికెళ్ళి మనసారా అభినందించాలి.

"చాల మంచి పని చేశావ్, ఎవరూ చేయలేని పని నీవు చేశావ్! శహభాష్", అని మనసారా ప్రశంసించాలి. పాలుపంచుకునేదానికి, ప్రశంసించేదానికి ప్రక్కన ఎవరూ లేకపోతే నీలో నీవే ఆ ఆనందాన్ని హృదయపూర్వకంగా, మనసారా అనుభవించాలి.

అలాగే ఇతరులకు ఏదైనా ఇబ్బంది, కష్టం, నష్టం, బాధ, దఃఖం కలిగినపుడు మనసారా, నిజాయితీగా బాధను వ్యక్తం చేయాలి. ఇలా జరిగినందుకు నాకు చాలా దుఃఖం, బాధ కలిగిందని చెప్పాలి. ఇలా జరగకుంటే బాగుండేది, అని పశ్చాత్తాపపడాలి. వీలైతే చేతనయినంత సహాయం, సేవ-సహకారం అందించాలి. ఒకవేళ ఎక్కడో దూరాన జరిగిన బాధాకరమైన సంఘటన అయితే మనసులోనే ఇలా జరగకుండా ఉంటే బాగుండేది అని మనసారా మనసులోనే బాధపడి, సానుభూతిని ప్రకటించాలి.

లేనిదాని కొరకు ఆశ ఎక్కువ ఉన్నదానిపై శ్రద్ధ తక్కువ.

ఒక ఇల్లాలు ఎంతో దీనంగా స్వామీజీతో "స్వామీ! నా భర్త ఇల్లు విడిచి అయిదు సంవత్సరాలైంది". అని చెప్పి వాపోయింది.

స్వామీజీ కాసేపు కళ్లు మూసుకొని, ఆ యిల్లాలితో "అమ్మా నీ భర్త కొద్ది రోజులలో తప్పక నీవద్దకు వస్తాడు". అని ఆశీర్వదిస్తూ చెప్పాడు.

స్వామిజీ చెప్పినట్లుగా కొన్ని రోజుల తర్వాత ఆమె భర్త ఇంటికి వచ్చాడు. భర్త రాక ఆమెకు ఎంతో సంతోషాన్నిచ్చింది. భర్త వచ్చాడన్న మాటేగానీ, ఆమెతో మాట్లాడ్డం లేదు. కనీసం తలెత్తి ఆమెవైపుకూడా చూడడం లేదు. పెడితే అన్నం తింటాడు.

నిద్రొస్తే పడుకుంటాడు అంతే. అందుకని ఆమె ఇలా ఉండడం కంటే ఇంట్లో లేకుంటేనే నయం కదా? ఇల్లు విడిచిన రోజులేనయం కదా? అని వాపోయింది.

క్రమంగా అతను మాట్లాడను మొదలు పెట్టాడు. ప్రతి విషయంలోనూ తప్పులు వెదికేవాడు. మారు మాట్లాడితే తిడుతూ, కొడుతూ ఉండేవాడు. అపుడా ఇల్లాలు మాట్లాడకుండా మౌనంగా ఉన్న రోజులే నయం కదా? అని వాపోయింది.

మరలా స్వామీజీ వద్దకు వెళ్ళింది. స్వామీజీని ఏదో అడగాలని ప్రయత్నించగా, "అమ్మా నీవు ఇంటికి వెళ్ళేటప్పటికి నీ భర్త ఇల్లు విడిచి వెళ్ళి ఉంటాడు". అని చెప్పి మౌనంగా ఉండిపోయాడు స్వామిజీ.

- - - - -

ఒకావిడ తన పాపను తీసుకుని బీచ్‌కు వెళ్ళింది. ఇసుకలో ఆడుకుంటున్న ఆ పాపని విసురుగా వచ్చిన ఒక పెద్ద కెరటం సముద్రంలోకి లాక్కొని పోయింది.

అయ్యో నా బిడ్డ, నా బిడ్డ అని కేకలు వేసింది, గట్టిగా ఏడ్చింది. ఆ మాతృమూర్తి ఆర్తనాదం విన్న సముద్రునికి జాలికలిగిందా! అన్నట్లు ఆ పాపను ప్రాణాలతో ఒడ్డుమీదికి విసిరేశాడు సముద్రుడు. ప్రాణాలతో బయటపడ్డ ఆ పాపను చూచి సంతోషంతో ముద్దుల వర్షం కురిపించింది. దేవుని దయకు ఎన్నోదండాలు పెట్టిందికూడా.

అలా సంతోషంతో ముద్దాడుతూ పాప పాదాలను చూచి ఒక చెప్పుకనిపించక పోయేసరికి ఆవిడ సంతోషం అంతా పటాపంచలై పోయింది. "అయ్యో నా పాప చెప్పు ఒకటి కనిపించకుండా పోయిందే' పాడు సముద్రం బంగారంలాటి కొత్త చెప్పును పొట్టన పెట్టుకుందే దిక్కుమాలిన సముద్రం అని బావురుమని ఏడవసాగింది.

చుట్టూ చేరినవారు పాప బతికి బైటపడిందానికి సంతోషించక, పనికిమాలిన చెప్పుకోసం ఏడుస్తున్నావా?! ఏం మనిషివమ్మా నీవు? అని అసహ్యంచుకుంటూ వెళ్ళారు. "పాడుమనిషికి పెంట మనసు ఉంటుందట" అంటే ఇలాంటిదే!

* ఇపుడున్న స్థితిలో సంతృప్తి చెందకపోవడం, లేనిదానికొరకు అర్రులు చాచడం మనసు యొక్క ప్రధాన లక్షణం.

నిదానమే ప్రధానం

సామాన్యంగా మనకెదురయ్యే సంఘటనలలో ఏవో కొన్ని తప్ప, కొంపలంటు కొని పోయేటంతటి అర్జంటు పనులు ఏమీ ఉండవు. చూచిన వెంటనే, విన్నవెంటనే తొందరపడి మాట్లాడటం, తొందరపడి చెయ్యడం, అనర్థాలకు దారితీస్తుందని అందరి అనుభవం చెబుతుంది.

'నిదానమే ప్రధానం' అన్న మాటను విస్మరించి, అన్నింటినీ 'ఆలస్యం అమృతం విషం' అన్నట్లుగా త్వరపడి నిర్ణయాలు తీసుకోవడం, మాట్లాడటం చెయ్యకూడదు. ఒక్క క్షణం ముందు-వెనుకలు ఆలోచించినట్లయితే మనపనులను, చక్కగా సకాలంలో, శుభ్రంగా చేయవచ్చు. కుటుంబానికి, సమాజానికి ఎంతో మెరుగైన సేవలనందించవచ్చు. ఎన్నో అనర్థాలు జరగకుండా చూడవచ్చు. మనసుకు తొందరపాటుతనం ఎక్కువ. ప్రయత్నపూర్వకంగా తొందరపాటుతనాన్ని అణచివేయాలి.

ఒక ఇల్లాలు ఒక ముంగీసను ముద్దుగా పెంచుకుంటూ ఉండినది. ఆమెకు ఒక పసిబిడ్డ కూడా ఉండినది. ఆ ఇల్లాలు ఎపుడైనా బయటికి పనిమీద వెళ్ళవలసి వస్తే ఆ ముంగీసను తన బిడ్డకు కాపలాగా ఉంచిపోతూ ఉండడం అలవాటు.

ఒకనాడు ఆమె మంచినీళ్ళ కోసం బిందె తీసుకునిపోతూ, తన బిడ్డను ఊయలలో పడుకోబెట్టి, ముంగీసను కాపలా పెట్టి వెళ్ళింది. ఒక పాము ఊయల తాడు వెంబడి నిద్రిస్తున్న పసిబిడ్డ వైపుకు దిగి వస్తూ ఉండినది. ముంగీస ఆ పామును గమనించింది. వాటం చూచుకొని ఒకే ఒక్క ఎగురు ఎగిరి పామును నోటితో పట్టుకుని ముక్కలు ముక్కలుగా కొరికేసింది.

పసిబిడ్డను రక్షించానన్న సంతోషంతో ముంగీస తన యజమానురాలి రాకకోసం ఎదురుచూస్తూ వాకిటిలో నిలుచున్నది. ఆమె నీళ్ళబిందెతో వాకిట్లోకి వచ్చి రాగానే నోటికి రక్తపు మరకలతో ముంగీస కనిపించే సరికి అయ్యో! నా పసిబిడ్డను ఈ పాడు ముంగీస చంపేసిందేమోనని భావించి, కోపావేశంతో తొందరపడి ఆ నిండు నీళ్ళబిందెను ముంగీస మీద పడవేసి ఆదుర్దాగా ఇంట్లోకి వెళ్ళి చూడగా ఊయలలో పసిబిడ్డ హాయిగా నిద్రపోతూ కనిపించింది. ఊయల క్రింద ముక్కలుగా పడివున్న పాము కనిపించగా అయ్యో పాపం ముంగీస ఏమాయెనో కదా అని వచ్చి చూడగా ఏముందీ? పాపం ముంగీస చచ్చిపడి ఉంది.

* అనాలోచితంగా, ఆవేశంలో తొందరపాటుతో చేసిన ఏ పనైనా గొప్ప అనర్థానికే దారితీస్తుంది.
* ఆలోచించి నిదానంగా మాట్లాడడం, నెమ్మదిగా పనులు చేయడం అనేది చాలా విశిష్టమైన గొప్ప లక్షణం.
* పశ్చాత్తాపం చాలా నిదానంగా కలుగుతుంది. Repentence comes too late.
* తొందరపడి నిర్ణయాలు తీసుకుంటే! అంతే తొందరగా నిర్ణయాలను వెనక్కు తీసుకోవలసివస్తుంది.
* మనసులోని ఒక బలమైన ఆలోచన వారి మీదే కాకుండా సమీపంలోని

ఇతరులపైన, చుట్టూ ఉన్న వాతావరణంపైనా తన ప్రభావాన్ని తప్పక చూపుతుంది. ఎలాగంటే? చేతిలో పరిమళం వెదజల్లే పుష్పం ఉంటే పుష్పాన్ని ఉంచుకున్న వారికే కాక, కొంతమేర ఆ చుట్టు ప్రక్కల ఉన్నవారి దాకా కూడా ఈ పరిమళం వ్యాపిస్తుంది. ఒకవేళ పుష్పం దుర్గంధమైనదిగా ఉంటే? వాతావరణమంతా దుర్గంధంగా మారి భరించలేనిదిగా తయారవుతుంది. కాబట్టి చెడ్డ మనసు కలిగి ఉంటే, వారికే కాక చుట్టూవున్న వారికికూడా చెడు కలుగుతుంది. చుట్టూవున్న వాతావరణంకూడా కలుషితమవుతుంది. మనసులో కలిగే ఆలోచనలననుసరించి, చెలరేగే బలమైన కోరికలననుసరించి మనిషిలోని భావశక్తి తరంగాలు (విద్యుదయస్కాంత తరంగాల్లాగా) వెలువడతాయి.

కపట బుద్ధులు

చేతికి అంది వచ్చిన కుమారుడు అకాలమరణం చెందడంతో అతని తల్లి-దండ్రులు, బంధువులు రోదిస్తూ శవాన్ని శ్మశానానికి తీసుకుని వెళ్ళారు. శవాన్ని నేలకు దించారో లేదో అక్కడికి ఒక గద్ద వచ్చి వాలింది. శవం వెంట వచ్చిన వారితో గద్ద ఇలా అన్నది. "ఎందుకు ఏడుస్తున్నారు? చావు పుట్టుకలు సహజం కదా? పోయిన వారివెంట మీరు కూడా పోవాలనుకుంటున్నారా? చీకటి పడిందంటే ఇక్కడికి పిశాచాలు, భూతాలు, దయ్యాలు వచ్చి మిమ్ములనుకూడా పీక్కుతింటాయి. శవాన్ని ఇక్కడేవదిలేసి చీకటి పడకముందే మీరంతా వెళ్ళిపోండి". అని అనునయంగా సలహా ఇచ్చింది. గద్ద మాటలు విని అక్కడివాళ్ళంతా కంగారు పడ్డారు. నిజమేననుకుని శవాన్ని స్మశానంలో వదిలేసి వెళ్లేందుకు సిద్ధపడ్డారు.

ఇంతలో ఒక నక్క వారి దారికి అడ్డొచ్చి ఇలా చెప్పింది "ఇన్నాళ్ళూ పెంచి పోషించిన బిడ్డను ఇలా దిక్కులేని శవంలా వదిలేసిపోవడానికి మీకు మనసెలా ఒప్పింది. అసలు చనిపోయింది మీ బిడ్డేనా? అంత నిర్దాక్షిణ్యంగా శవాన్ని వదిలేస్తారా? వద్దు అలా చేయకండి. మీ వేదన అంతా తీరేదాకా బాగా ఏడవండి. చీకటి పడే దానికి ఇంకా సమయం ఉంది".

నక్క మాటలు విన్న బంధువులంతా శవంచుట్టూ చేరి ఏడవసాగారు. వారిని చూచి గద్ద "శవం బాగా ఉబ్బింది. కంపుకొట్టేటట్టుగా ఉంది. నక్క మాటలు విని మోసపోవద్దు. దయ్యాలు రాక ముందే శవాన్ని వదలి వెళ్ళండి. ఇంటికెళ్ళి జరపవలసిన క్రియాకర్మలను గురించి ఆలోచించుకోండి" అని చెప్పింది.

ఈలోగా చీకటి అలముకుంది. గద్ద, నక్క మాట్లాడ్డం మానుకున్నాయి. ఇంతసేపూ శవం తాలూకు బంధువులపై ప్రేమతోకాదు, వారి హితవుకోరి కాదు అవి సలహాలు

ఇచ్చింది. ఆ శవాన్ని పీక్కు తినడానికి ఆ రెండూ పోటీపడ్డాయి. చీకటి పడినట్లయితే గద్దకు చూపు ఆనదు. కాబట్టి పొద్దుండగానే, చీకటి పడక ముందుగానే శవాన్ని వదలి వెళ్ళండని భయపెట్టింది గద్ద. వాళ్ళు వెళ్ళగానే శవాన్ని పీక్కుతినవచ్చని. రాత్రి అయినంతవరకూ శవాన్ని పాతిపెట్టనివ్వకుండా చూడగలిగితే గద్ద వెళ్ళిపోతుంది. తను శవాన్ని పీక్కు తినవచ్చు, ఆకలి తీర్చుకోవచ్చు అనుకున్నది నక్క.

ఇలాగా సమాజంలో స్వార్థపరులు తమ పబ్బం గడుపుకోడానికి మాయ మాటలతో మభ్యపెట్టాలని ప్రయత్నిస్తుంటారు. కానీ వివేకంతో ఎవరు హితులో, ఎవరు కాదో తెలుసుకుని జీవిస్తూ ఉండాలి. ఎవరో చెప్పారని గుడ్డిగా నమ్మకుండా ఏదిమంచో, ఏది చెడో గుర్తించి పనులను చేసుకుంటూపోవాలి.

* నిజాయితీపరులను చూచి చాలా మంది సహించలేరు. ఎందుకంటే ఎక్కువ శాతం అలా ఉండలేని వారే. అందుచేత ఏదో ఒక వంకతో వారు, వీరిని కలుపుకుని "మనమంతా ఒకటేనోయ్" అని నిరూపించచూస్తారు.
* కొంతమంది వారేమనుకుంటారో, వీరేమనుకుంటారోనని ఊగిసలాడుతూ, తటపటాయిస్తూ అధికారాన్ని కాపాడుకోవటానికో, అవకాశం జారిపోతుందనో, ఎవరివల్ల ఎటువంటి హాని జరుగుతుందోనని, మంచి మాటనూ చెప్పలేరు, మంచి పనినీ చేయలేరు. వీరినే మానసిక బలహీనులనీ, పిరికివారనీ అంటారు.
* సంప్రదాయాలనూ, విలువలనూ, గౌరవమర్యాదలనూ పాటిద్దామనుకుంటే... మన చుట్టూ ఉన్న నలుగురూ విలువల్ని వెక్కిరించే వాళ్ళే అయితే, అడ్డుపడే వాళ్లే అయితే... వారికోసం విలువల్నీ మర్యాద, మన్ననలనూ, పని చెద్దాం అన్న స్ఫూర్తిని వదలి, వారు మెచ్చేలా మురికి ఆలోచనలనే సమర్థిస్తూ, అవలక్షణాలే ఆభరణాలుగా, విచ్చలవిడితనమే విలువైనదిగా ప్రవర్తిస్తూ ఉంటారు కొందరు.
* నలుగురి కోసం మన విలువల్ని విడిచి పెట్టినా, మనముందు మెచ్చుకునేవారే మన వెనుక వెక్కిరించి, వెకిలిచేష్టలు చేస్తారు. ప్రశంసల కోసం, కీర్తి కోసం, గుర్తింపు కోసం, గౌరవం కోసం మన వ్యక్తిత్వాన్ని ఫణంగా పెడితే..... కష్టం వచ్చినపుడు ఆ నలుగురూ ఆదుకోరు సరికదా సమయం దొరికింది కదాని రాళ్ళు విసురుతారు, అవమానిస్తారు.

కొంత మందికి అందరినీ చిన్న చూపు చూడటం అలవాటు. ఇతరులు చేసిన పొరపాట్లను, తప్పులను, వెతికి వెతికి పట్టుకోవడం, నిందారోపణలు చేయడం, అతి చిన్న విషయాన్ని భూతద్దంలో చూపి, గోరంతలను కొండంతలు చేయడం వీరి అలవాటు. వీరు పరులపై నిందారోపణలు చేసి- వారు బాధపడుతూ, నిందలను అవాస్తవాలని నిరూపించుకోలేక సతమతమవుతూ ఉంటే చూచి పైశాచికానందాన్ని పొందుతూ

ఉంటారు. "నరంలేని నాలుక ఏమాటైనా మాట్లాడుతుంది"

పరోపకారబుద్ధి కలవారు. సత్ప్రవర్తనులు, సజ్జనులు, సత్యవంతులు, నిందలను, చెడుమాటలను, అపుడపుడు వినవలసివస్తుంది. శ్రీ కృష్ణుని అంతటివాడిని శిశుపాలుడు నోటికి వచ్చినట్లు నిందించాడు. గొప్పవారు, ఘనకీర్తి కలవారుకూడా అపుడపుడు ఇలాంటి కష్టాలను ఎదుర్కొనవలసివస్తుంది. ఇక సామాన్యుల సంగతి చెప్పనక్కర్లేదు. అలాగని దుష్ప్రచారాన్ని, నీలాపనిందలను, చేతకానివారిలాగా, అమాయకంగా ఆమోదించమనీ గాదు, దిగమింగాలనీ కాదు. సహనానికైనా ఒక హద్దనేది ఉంటుంది. ఎవరికైనా అలుసు దొరికితే "తేలుకు పెత్తనం ఇస్తే రాత్రంతా కుట్టి చంపినట్లు"గా వ్యవహరిస్తారు. మితి మీరినసహనాన్ని చేతగానితనంగా భావించి, దుర్మార్గానికి ఒడిగడతారు. అందుకే శ్రీ కృష్ణుడు శిశుపాలుణ్ణి వంద తప్పుల వరకూ క్షమించి, చివరికి సుదర్శన చక్రంతో తలను నరికేశాడు. అందరూ శ్రీ కృష్ణుడిని ఆదర్శంగా తీసుకోవాలి.

సమయాసమయాలనుబట్టి తగినదా? తగనిదా? అని గమనిస్తూ ప్రతిక్రియకు పూనుకోవాలి. "లోకానికి మూకటి ముయ్యలేము, గుంపుకు మంచాలెయ్యలేము'. 'సింహానికైనా ఈగలబాధ తప్పదు'. కొన్ని విషయాలలో జరిగిన అవమానానికి ఏమీ చెయ్యలేని పరిస్థితి దాపురించవచ్చు. నిరాశ, నిస్పృహకులోను కావలసిరావచ్చు. అలాంటపుడు సమస్యను కాలానికే వదలివెయ్యాలి. కాలం అన్ని సమస్యలకూ సమాధానం చెబుతుంది. 'సహనమే శ్రీరామ రక్ష'. నిందలు మోపేవారు, నిందించేవారు తమకు తాముగా నోరు మూసుకునేటట్లుగా ఓర్పుగా, నేర్పుగా వ్యవహరించాలి.

'ఎండ ఉన్నపుడే నీడ విలువ తెలుస్తుంది'. అన్నట్లు సమాజంలో ఇలాంటి వారుండటంకూడా అవసరమే. నీచులున్నపుడే ఉన్నతమైన వారి సహనం, గొప్పతనం బైటపడుతుంది. ఇలాంటివారి బారిన పడకుండా ఉండేటందుకు ఉత్తములు జాగ్రత్త పడతారు. ఎక్కడ రంధ్రాన్వేషణ చేస్తారోనని, తప్పులు జరగకుండా చూచుకుంటారు. తప్పులు బట్టేవారు, విమర్శించేవారు, నిందారోపణలు చేసేవారున్నందువలననే పొరపాట్లు, తప్పులు దొర్లకుండా చూచుకుంటారు. కాస్త నిదానింబులేరు దానించుతారు, లేదా మానుకుంటారు.

మేధావిని వివేకం
మధ్యముడిని అనుభవం
అధముడిని అవసరం
నీచుడిని స్వభావం నడిపిస్తుంది.

* అసత్యారోపణలు, నిందలుమోపే నీచులకు సూక్తులు చెప్పి, నీతిమార్గానికి మళ్ళించడం బొగ్గును పాలతో కడిగి రంగు మార్చే ప్రయత్నమే.

అందరికి ఆత్మపరిశీలనే ముఖ్యం

ఒకఊరి చివర్లోని సత్రంలో పేరుగాంచిన సాధువు ఉండేవాడు. సమస్యలను పరిష్కరించడంలో ఆయనకు గొప్ప పేరు ప్రఖ్యాతులుండేవి. ఎటువంటి సమస్యకైనా తనదైన శైలిలో పరిష్కారం చెప్పి, వచ్చినవారి హృదయాలను తేలికపరచి పంపించేవాడు. అతని సలహాల కోసం నిత్యం ఎంతోమంది వచ్చి-పోతూ ఉండేవారు.

ఒకరోజు ఆ సాధువు దగ్గరికి ఒక వ్యక్తి వచ్చాడు. అందరికీ ఉపాయాలూ, సలహాలూ చెప్పే సన్యాసికి ఆత్మ సంతృప్తిలో కొరతేముంటుందిలే అని సందేహిస్తూనే, తన అనుమానాన్ని సాధువుకు విన్నవించుకున్నాడు. దీనికి ఆ సన్యాసి చిన్నగా నవ్వుతూ నెమ్మదిగా బదులిచ్చాడు.

ఆ సమాధానం విన్న వ్యక్తి ఆశ్చర్యపడ్డాడు. అవునా?! అని కొద్ది సేపు నమ్మలేక మౌనంగా ఉండిపోయాడు. తర్వాత వచ్చిన దారే వెళ్ళిపోయాడు.

ఇంతకూ ఆ సాధువు ఇచ్చిన సమాధానం ఏమిటి? "పరిష్కారం తెలియని అమాయకులు నా వద్దకు వచ్చి అడుగుతుంటారు. అన్ని పరిష్కారాలూ చెప్పే నేను కూడా నాకు తెలియని సందేహాలతో సతమతమవుతూ ఉంటాను. కానీ ఆత్మపరిశీలనలో ఉంటాను". అని.

* అద్దంలో అందాన్ని చూచుకొని సవరించుకున్నట్లుగా, ఆత్మవిమర్శవల్ల లోపాలను, తప్పులను సవరించుకోవచ్చు, దుర్గుణాలను వదలించుకోవచ్చు, సమస్యలకు పరిష్కారాలూ కనుగొనవచ్చు.
* సుఖ- దుఃఖాలకూ, మంచి- చెడులకూ, పాప-పుణ్యాలకూ, నిర్మాణ- విధ్వంసాలకూ, భావాలకూ, అనుభవాలకూ, భక్తికీ, భుక్తికీ, శక్తికీ, యుక్తికీ, రక్తికీ-విరక్తికీ ముక్తికీ, బంధాలకూ, అనుబంధాలకూ అన్నింటికీ మూలమైన అదృశ్య శక్తే మనసు.
* మనసుకు అహం లోబడిపోవడమే బానిసతనం. పదే పదే మనసుకు లోబడి కోరికల వెంట పరిగెడుతూ పోవడమే బానిస బ్రతుకు. దీనినే ఇంద్రియలోలత్వం అంటారు. మనసుకు లోబడిన వారెపుడూ నీచులుగానే ముద్రపడి ఉంటారు. వారినే "నీచ్ - కమీనే" "దుష్ట దుర్మార్గ, నీచ నికృష్ట, పరమచండాల, పిశాచ, రాక్షసు"లనీ అంటుంటారు.
* మనసు ఒక సూక్ష్మాతి సూక్ష్మమైన శక్తి. రూపలావణ్యాలు లేకపోయినా, అవధులూ, అంచులూ, పరిమితులూ లేకపోయినా, కనిపించక - వినిపించక పోయినా, ఉన్నది అనిపించే శక్తి, కొందరు మంచిదని ఇష్టపడే శక్తి, మరికొందరు కాదని అసహ్యించుకునే కల్మషమే 'మనసు'

ఎక్కడ వెదకవలెనో అక్కడే వెదకాలి

ఓ అవ్వ....వీధి దీపం వెలుగులో దేనికోసమో వెదుకుతోంది. దారిలో వెళ్ళేవాళ్ళు కూడా అవ్వ దేనికోసం వెదుకుతున్నదో కారణం తెలుసుకోకుండానే తామూ వెదకడం మొదలుపెట్టారు. కాసేపటికి ఆ వీధి దీపం వెలుగు విస్తరించినంత వరకూ వెదుకులాడే వారితో నిండిపోయింది.

ఏమీ అర్థంకాని యువకుడొకడు. "దేని కోసం మీ వెదుకులాట"? అని అందరినీ ఉద్దేశించి అడిగాడు. "ప్రక్క మనిషి వెదుకుతున్నాడు కదా, అతనికి సాయం చేద్దామని నేనూ వెదుకుతున్నాను". అన్నాడు. అదే విధంగా అందరూ అన్నారే కానీ, ఆ వెదుకులాట దేనికోసమో ఎవరికీ తెలియదు.

ఆ యువకుడు చివరికి అవ్వనే అడిగాడు. "చేజారిన నాణెం కోసం వెతుకుతున్నాను". అంది అవ్వ. "ఎక్కడ పోగొట్టుకున్నావు? మళ్ళీ అడిగాడు యువకుడు. "గుడిసెలో" చెప్పిందవ్వ. అయితే వీధిలో ఎందుకు వెతుకుతున్నావు"? అని ప్రశ్నించాడు యువకుడు "గుడిసెలో దీపంలేదు... ఇక్కడ దీపం ఉంది కదా?" అవ్వ సమాధానం ఇచ్చింది. "ఓరీనీ యంకమ్మా" అని ఎవరికి వారు గొణుక్కుంటూ వెళ్ళారు.

మనంకూడా అంతే, మనలోనే ఉన్న "సత్, చిత్, ఆనందాన్ని" మరెక్కడో బైటి ప్రపంచంలో వెదుకుతున్నాం మూర్ఖంగా.

- - - - -

నారదులవారు భగవన్నామ గానం చేస్తూ, భగవంతునియొక్క విశ్వవ్యాప్తిని దర్శిస్తూ, సంచరిస్తూ ఉంటారు. ఒక పర్యాయం భగవంతుడు నారదుల వారితో "నారదా భక్తుల పిలుపులతో వారికి ప్రత్యక్షమౌతూ, వారి కోరికలు తీరుస్తూ, యుగయుగాలుగా వారి సంకటములను తొలగిస్తూ, బాగా అలసిపోయాను. చివరకు ఏకాస్త విశ్రాంతి దొరికినా నీ గానామృతంతో నన్ను నీవెంటే త్రిప్పుకుంటున్నావు. ఇక నావల్ల గాదు. నేను చాల అలసిపోయాను. నేను విశ్రాంతి తీసుకోవాలనుకుంటున్నాను. కాబట్టి ఏ పిలుపుగానీ, ఏ ఆర్తనాదంగానీ వినిపించని సుదూర ప్రాంతం ఏదైనా ఉంటే చెప్పు అక్కడికి వెళతాను". అని విన్నవించుకున్నాడు.

అందుకు నారదుల వారు కొన్ని సుదూర గ్రహాలకు వెళ్ళమన్నారు. ఎన్ని యుగాలు ప్రయాణించినా ఎన్ని గాడాంధకార గ్రహాలకు వెళ్లినా, భక్తుల ఆర్తనాదాలు, కోరికలు, మ్రొక్కులు వినబడుతూనే ఉన్నాయి. ఎలా ఈ అవిశ్రాంత పరిస్థితి నుంచి నన్ను నేను కాపాడుకోవాలి? చివరగా ఏదైనా ఒక మంచి ఉపాయం చెప్పమన్నాడు భగవంతుడు. తీవ్రంగా ఆలోచించి ఇదిగో చిట్టచివరగా ఒక ప్రదేశం ఆచూకీ

తెలుపుతున్నాను. బహుశా ఈ ప్రయత్నంలో మీ కోరిక నెరవేరవచ్చు, అన్నారు నారదుల వారు. ఈ ప్రయత్నంలో యుగాలు గడచిపోతున్నాయి, అదేదో.. వెంటనే తెలుపవయ్యా నారదా! అని భగవంతుడు వేడుకున్నాడు ఆలస్యాన్ని భరించలేక.

మీరు వెంటనే మనిషి హృదయంలోకి వెళ్ళండి అని విన్నవించుకున్నాడు నారదుడు. ఈలోగా కలియుగం రానే వచ్చేసింది. అదిగో అనాటి నుండే భగవంతుడు మనిషి హృదయంలోనే తిష్ట వేసుకొనివున్నాడు. తట్టి లేపగలిగితే భగవంతుడు తప్పక మేలుకుంటాడు. కానీ మనిషికి ఆ తీరుబాటేదీ?

* దయగల హృదయమే దేవుని నిలయం.
* గాఢమైన నిశ్శబ్దము నందే భగవద్వాణి వినిపించును.
* మానవ సేవయే మాధవ సేవ.
* నరుడే నారాయణుడు.
* మానవత్వానికి మించిన మతం లేదు. మంచితనానికి మించిన పూజ లేదు. మంచి స్వభ వనికి మించిన ఆభరణం లేదు.
* హృదయంతో ఆలోచించు మెదడుతో కాదు.

దృష్టి

"పుర్రెకోబుద్ధి, జిహ్వకోరుచి" అన్నట్లు గానే "మనసుకోభావం, కంటికో (చూపు) దృష్టి ఉంటుంది.

మనిషి మనసులో ఎన్ని భావాలున్నాయో అన్ని రకాల చూపులున్నాయి. దయ, కరుణతో చూచే చూపును 'కరుణ దృష్టి, అనుగ్రహ దృష్టి'. కామ భావంతో చూచే దానిని 'మదనదృష్టి - కామదృష్టి'. ప్రేమ వాత్సల్యంతో చూచే దానిని 'ప్రేమ - వాత్సల్య దృష్టి'. పగ, ప్రతీకార దృష్టితో చూచేదానిని 'క్రూరదృష్టి', ప్రతీకార దృష్టి'. వశం చేసుకోవాలని చూచేదానిని 'వశీకరణ దృష్టి'. కలుపుగోలు తనంగా చూచేదానిని' స్నేహ దృష్టి'. ఆశగా, ఆబగా, స్వార్ధంతో చూచేదానిని 'పిశాచదృష్టి'. ప్రాణాలను తీసే చూపును 'రాక్షస దృష్టి'. దోషాలను మాత్రమే చూచేదానిని 'వక్రదృష్టి'. సందు దొరికితే చాలు దేనినైనా ఎత్తుకెళ్ళాలని చూచే దానిని 'చోర దృష్టి'. ఆకలితో తిండివైపు చూచే దానిని 'ఆకలి చూపు' అనీ, అన్ని రకాల చెడు భావాలతో నాశనం కావాలని చూచేదానిని 'పాపిష్టి దిష్టి' అని అంటారు. నీచులకు, రాక్షసులకు మాత్రమే క్రూర, పిశాచ, రాక్షస, కామ, వక్ర, చోర దృష్టి ఉంటుంది. మనషులకు మాత్రమే స్నేహ, దయ, ప్రేమ, వాత్సల్య, దృష్టి ఉంటుంది.

* దృష్టిమారితే సృష్టిమారుతుంది".

* కళ్లు లేకుంటే 'కలియుగం లేదు.
* బాహ్యదృష్టి కంటే అంతర దృష్టిని కలిగి ఉండాలి.

మంచి విద్యను అభ్యసించడం వలన, మంచి స్నేహం చేయడం వలన, మంచి వాతావరణంలో ఉండడం వలన, మంచి అలవాట్ల వలన మనిషి తనలోని చెడు దృష్టిని ప్రయత్నపూర్వకంగా తొలగించుకోవాలి. 'మానవతావాది' అనిపించుకోవాలి.

* మంచి బుద్ధులచేత, మంచి నడకల చేత, మంచి మాటలచేత మాత్రమే మంచిని పొందటానికి అధికారముంటుంది.
* అందరికీ మంచీ-చెడు తెలుసు. అయినా మంచి చేయడానికి మనసొప్పదు. చెడును విడిచిపెట్టేంత నిగ్రహం, ఉదారస్వభావం ఉండదు. ఒక సందర్భంలో దుర్యోధనుడు. ధర్మం ఏమిటో నాకు తెలుసు. కానీ నా మనస్సు ధర్మ మార్గంలోకి వెళ్ళడం లేదు. అధర్మం అంటే ఏమిటో తెలుసు. అది నన్ను విడిచి పెట్టడంలేదు". అన్నాడు. చాలా మంది పరిస్థితి ఇదే!
* ఒక రాతిలో మేకును దిగగొట్టుట ఎంత కష్టమో, ప్రాపంచిక విషయాలలో నిమగ్నమైన వారి మనసులోకి మంచి సలహాలను ప్రవేశపెట్టడం అంత కష్టం.
* దేనిని అనుభవించిన తర్వాత మరొకదానిని ఆశించమో, దేనిని చూచిన తర్వాత మరొకదానిని చూడగోరమో, దేనిని భుజించిన తర్వాత మరొక దానిని మనము భుజించగోరమో, దేనిని ఆనందించిన తర్వాత మరొక ఆనందమును ఆశించమో అట్టి దానినే శాశ్వతానందం, "ముక్తి" అంటారు.
* దేహమనే రథానికి ఇంద్రియాలనే గుర్రాలనుకట్టి మనస్సనే పగ్గము పట్టి, బుద్ధి అనే సారధి చేత ఆత్మచూపించిన వైపు సంచాలనం చేస్తే చక్కగా మోక్షమనే గమ్యానికి చేరగలం.
* చంచలమైన మనసును సక్రమమైన మార్గమునందు నడిపించేదే ఆధ్యాత్మిక మార్గము.

అందరూ సుఖంగా ఆనందంగా ఉండాలి.

* నీవలెనే పొరుగువానిని ప్రేమించు. నీకు ఎలాంటి పరిస్థితులు ఉండాలని కోరుకుంటావో, అలాంటి పరిస్థితులనే ఇతరులకుకూడా ఉండాలని కోరుకో.
* నీకు దక్కిన సుఖశాంతులు, ప్రయోజనాలు మెరుగైన పరిస్థితులు ఇతరులకు కూడా దక్కవలెనని కోరుకోవాలి. నీకు కలిగిన కష్టనష్టాలు ఇంకెవరికీ కలగరాదని కోరుకోవాలి.
* నీవలన ఇతరులకు మనసుతో, మాటలు, చేతలు, చూపులతో గానీ ఏవిధమైన ఇబ్బందులు అశాంతి కలుగని విధంగా నడచుకో. మనిషికి ఉండి తీరవలసిన రీతి, నీతి అదే.

సంఘమును వదలి మనిషి ఎట్టి పరిస్థితులలోనూ జీవించలేడు. ఇతరులపై ఆధారపడుతూ, ఇతరుల కొరకు మాత్రమే జీవిస్తాడు. మనిషికి కావలసిన కూడు, గూడు, గుడ్డ మొదలగు ప్రాథమిక అవసరాల కొరకు ఎన్ని పనులు ఎన్ని సేవలు చేసినా, ఎన్ని వస్తువులను తయారు చేసినా, ఇతరులకు నచ్చితేనే, ఇతరులు మెచ్చితేనే కదా ప్రతిఫలం, తృప్తి గౌరవం దక్కుతుంది.

సుగంధ పరిమళాలతో, స్వర్ణా భరణాలతో, పట్టు వస్త్రాలతో శరీరాన్ని ఎంత అలంకరించుకున్నా, ఇతరులు చూచి, మనసుకు ఆహ్లాదంకలిగి, సంతోషించి, ఆహో, ఓహో, వారెవ్వా, చాలా బాగుంది అనే మెచ్చుకోలు మాటలు నీచెవిని పడకపోతే, అసూయతో ముఖం చాటేసిపోతే, నీ అలంకరణ, నీవు పడ్డ శ్రమ అంతా వృధా ప్రయాస కాదా? నీకు తృప్తి అనేది ఉంటుందా? నీ ప్రయత్నం అంతా "అడవి గాచిన వెన్నెల" కాదా? "బూడిదలో పోసిన పన్నీరు" కాదా?! వాస్తవం ఇలా ఉండగా నీవు మాత్రమే అందంగా, ఆనందంగా ఉండాలి అనుకోవడంలో ఏ మాత్రం అర్థం లేదు. ఎందుకంటే నీవు అందంగా ఉంటే అందమైన వారితోనే జతకట్టాలని ఆశిస్తావేకానీ, కురూపులతో కాదు కదా? నీవు శుభ్రంగా, ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలనుకొని మురికి వాతావరణంలో ఉండలేవు కదా? కాబట్టి మనిషి తనేకాకుండా బైటి ప్రపంచం కూడా శుభ్రంగా, ఆరోగ్యంగా, ఆనందంగా, అందంగా ఉండాలని కోరుకోవాలి. అందుకు తనవంతు కృషి తప్పక చెయ్యాలి.

తను ఎంత మేధావి అయినా, రాగయుక్తంగా ఆ పాడే గాయకుడైనా, ఆ మేధస్సును, రాగంలోని మాధుర్యాన్ని ఆలకించి, తలలాడిస్తేనే, సంతోషంతో చప్పట్లు చరిస్తేనే ఎంతటి వారికైనా తృప్తి, ప్రోత్సాహం కలుగుతుంది. ఏమీ తెలియని వారి ముందు ఎంతటి ప్రతిభావంతమైన ప్రదర్శన అయినా "చెవిటివాని ముందు శంఖం ఊదినట్లు కాదా?" "కప్పలకు సంగీతం వినిపించినట్లు" కాదా?!

అందరూ జీవించాలి. అందరూ చదవాలి, ఆరోగ్యంగా ఉండాలి. అందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తూ అందుకు తగ్గ కృషి చెయ్యాలి. లేకుంటే ఎవరికి వారే గౌరవించుకోవాల్సి వస్తుంది. ఎవరికాళ్ళకు వారే దండం పెట్టుకోవాల్సి వస్తుంది. స్వార్థంతో సమాజాన్ని కలుషితం చేయకుండా ఉండడానికే ప్రాచీన మహర్షులు మానవులకు కర్తవ్యధర్మాలు ఉపదేశించారు. ఆచరించినట్లయితే లోక కళ్యాణం జరుగుతుంది. బ్రహ్మయజ్ఞం, దేవయజ్ఞం, భూతయజ్ఞం, అతిథి యజ్ఞం, పితృయజ్ఞం అనే పంచ యజ్ఞాలను చేయడం వలన లోకహితం జరుగుతుంది.

ఇష్ట ఫల సిద్ధి కొరకు, నోములు, వ్రతాలు, పూజలు, యజ్ఞాలు, క్రతువులు ఎన్ని చేసినా, చివరలో మాత్రం "లోకా సమస్తా సుఖినోభవంతు" "సర్వే జనా సుఖినోభవంతు"

అనో ముగిస్తూ ఉంటారు. అంటే మన కోరికలు నెరవేరాలి, అన్యులుకూడా సుఖ శాంతులతో వర్ధిల్లాలని హృదయపూర్వకంగా ఆకాంక్షించడం. అదే లోక కళ్యాణం.

మనసా సతతం స్మరణీయం
వచసా సతతం వదనీయం
లోక హితం మమ కరణీయం

మనసులో నిత్యం మంచినే స్మరిస్తూ ఉండాలి. ఎల్లప్పుడూ మంచినే పలుకుతూ ఉండాలి. నిరంతరం లోకహితమైన పనులనే చేయాలి.

మనోమాలిన్యం (అశ్లీల వినోదం, అనారోగ్యపు అలవాట్లు, దురాలోచనలు)		మనో నిర్మలం (ఆధ్యాత్మిక మార్గం, మానవతా వాదం
అశ్లీల చిత్రాలు, దృశ్యాలు,	కళ్ళు -1 (దృష్టి దోషం)	చెడు చూడకు
మసాలా ఘుమ ఘుమలు కైపెక్కించే సుగంధ, పరిమళ ద్రవ్యాలు, లాహిరి పదార్థాలు	ముక్కులు -2 (ఘ్రాణ దోషం)	
ఊరగాయలు, చట్నీలు, మసాలాలు, మధు, మత్స్య, మాంసాలు, కాఫీ, టీలు, బూతు మాటలు, చీకడం, చప్పరించడం నాకడం, లొట్టలు వేయడం, చాడీలు చెప్పడం	నాలుక -3 (జిహ్వాదోషం వాక్‌దోషం)	చెడు తినకు, చెడు మాటాడకు
స్త్రీ-పురుష స్పర్శ, సంపర్కం, ముద్దులు	చర్మం, పెదవులు-4 (స్పర్శ దోషం)	చెడు తాకకు
బూతు మాటలు, రతిక్రీడ శబ్దాలు, ద్వంద్వార్థాలు, శాపనార్థాలు, చెప్పుడు మాటలు వినడం	చెవులు - 5 (శ్రవణ దోషం)	చెడు వినకు

సంస్కృతి - నాగరికత - సమాజం - 11

ఒక ప్రాంతంలో నివసించే ప్రజాసమూహం ఎలాంటి ఆచార-వ్యవహారాలు, అలవాట్లు, విశ్వాసాలు, ప్రమాణాలు, రీతి-నీతి, సంప్రదాయాలతో జీవిస్తూ ఉంటుందో.. ఆ జీవన పంథాను సంస్కృతి అంటారు.

ఏ దేశంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా ఎలాంటి సంస్కృతీ-సంప్రదాయాలు ఉన్నప్పటికీ, అవన్నీ వ్యక్తులయొక్క, సమాజంయొక్క అనుకూలత, ఆరోగ్యం, ఆనందం, అభివృద్ధి, స్వేచ్ఛ, భద్రత అనే ప్రాథమిక అంశాలపై నిర్మితమై ఉంటాయి.

అనాదిగా.... అనగా ఆలోచనలకు, అంచనాలకు అందనంతకాలం నుండి ఒకరినుండి మరొకరికి సంక్రమిస్తూ, సంస్కరింపబడుతూ, కాపాడబడుతూ, పరంపరానుగతంగా కొనసాగుతూ వస్తున్న సంస్కృతి-సంప్రదాయాల సమగ్ర స్వరూపాన్ని వారసత్వ సంపద అంటారు. ప్రకృతిననుసరించి జీవించే సహజమైన విధానమే సంస్కృతి. సంస్కృతిని ఒక తరం నుండి మరొక తరానికి నిరంతరాయంగా ప్రవహించే జీవన గంగ అనికూడా అంటారు.

<u>వలస సంస్కృతి :</u> సాంస్కృతిక వారసత్వ సంపద కొన్ని దేశాల ప్రజలకుగానీ, కొన్ని మానవ సమూహాలకుగానీ, సమాజాలకుగానీ ఉండదు. కారణం-వివిధ రకాలైన స్వభావాలతో భూగోళం నలుమూలల నుండీ వలసలు వచ్చి ఒక ప్రాంతంలో ఉదర పోషణే ధ్యేయంగా నివసించడమే. అటువంటివారికి కేవలం వ్యక్తిగత సుఖ, సౌకర్యాలతో బ్రతకడమే ముఖ్యం. ఇతర మానవ సమూహాలను, సమాజాలను గురించి వారు ఆలోచించరు. అవసరమైతే వారిని అణగద్రొక్కి, వారి సంపదను కొల్లగొట్టి, దోచుకుంటారు. వారి ప్రాంతాలను ఆక్రమించుకుంటారు. దోచుకోవడం, దాచుకోవడం, ఆధిపత్యంకోసం అణచివేయడం లేదా సామూహిక హత్యాకాండకు ఒడిగట్టడం అనే దమననీతే వారి సంస్కృతి. దీనినే వలస సంస్కృతి అంటారు. వలస సంస్కృతి ఆరోగ్యకరమైనదీ, ఆమోదయోగ్యమైనదీ, ఆచరణీయమైనదీ కాదు. భావితరాల వారిని ఆందోళనకూ, అయోమయానికీ గురి చేసి అంధకారంలో పడవేస్తుంది.

ఒక విదేశీయుడు ఒక భారతీయునితో ఇలా అన్నాడట... 'మీ దుస్తులు ఆత్మరక్షణకు అనుకూలమైనవి కావు. యుద్ధానికి అసలే పనికిరావు. మా దుస్తులైతే ఆత్మరక్షణకు, యుద్ధానికికూడా అనుకూలమైనవి. అందుకే మాకు అవి చాలా సౌకర్యవంతమైనవి.

భారతీయుడు... " ఆహా ! మీరు నిజమే చెప్పారు. మీ దుస్తులు ఆత్మరక్షణ కోసమే కాదు పారిపోవడానికీ, దోచుకోవడానికీ, ఆక్రమించుకోవడానికి కూడా అనుకూలమైనవే. మీ నాగరికతకు తగినట్లుగానే ఉన్నాయి. అన్నాడట.

* అనుభవించాలనుకొని, అనుభవిస్తూ చావడమే నాగరికత.

<u>వేద సంస్కృతి :</u> ముందు తరాలవారు ఎదుర్కొన్న ప్రాకృతిక ఉపద్రవాలనూ, జీవితాలలో అనుభవించిన కష్టాలనూ, తరువాత తరాల వారు అనుభవించకూడదని, సంస్కరింపబడిన ఆలోచనలనూ, జీవన పద్ధతులనూ, కొందరు మేధావులు వేదాల రూపంలో మనకందించారు.

ప్రకృతిలో అంతర్భాగమైన మానవులు ప్రకృతి చేతనే పోషింపబడుతున్నారు. కాబట్టి ప్రకృతిని సంరక్షించుకుంటూ, ప్రకృతి పట్ల కృతజ్ఞతతో ఉంటూ ప్రకృతిని తల్లిగా ఆరాధిస్తూ, ప్రకృతితోబాటు ఎలా జీవించాలి? అనే జ్ఞానాన్ని వేదాలలో నిక్షిప్తం చేసి మనకందించారు. వారినే ఋషులు అంటారు. వారందించిన నైతిక జీవన మార్గమే భారతదేశ సంస్కృతి. అదే 'వైదిక సంస్కృతి'. దీనినే 'సనాతన ధర్మం' అని కూడా అన్నారు. ఇది ఏ ఒక్క ప్రాంతానికో, ఏ ఒక్క జన సమూహానికో పరిమితమైనది కాదు. విశ్వజనీనమైనది.

భారతదేశ సంస్కృతి జీవిస్తూ, జీవించనిచ్చేది. సృష్టిలో సకల చరాచర, జీవ కోటి సుఖ-శాంతులతో వర్ధిల్లాలన్నది భారతదేశ సంస్కృతి లక్ష్యం. అందుకే భారతీయులు అనాదిగా వ్యవసాయదారులు. ఆహారాన్ని పండించి, తాము తింటూ, సాటి మానవులకు, సాటి జీవులైన తరు-లతాదులకూ, క్రిమి-కీటకాదులకూ పశు-పక్ష్యాదులకూ ఆహారాన్ని పంచిపెట్టే సంస్కృతి గలవారు.

దీనికి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస, సహనం, సౌభ్రాతృత్వం, సమానత్వం, త్యాగం, విశ్వశ్రేయస్సు వంటి విలువలే పునాది. ఇందులో స్వార్థానికీ, హింసకూ, దోపిడీకి, దురాక్రమణకూ తావు లేనేలేదు.

<u>నాగరికత :</u> సహజమైన సంస్కృతిని మరచిపోతూ, తిరస్కరిస్తూ, "అనుభవించడమే అభివృద్ధికి కొలమానం" అనే భ్రమలో... సాధించిన మానవ భౌతిక సుఖ, సౌకర్యాల, కృత్రిమమైన ఆహార పద్ధతుల, వేష-భాషల సమగ్ర స్వరూపాన్నే నాగరికత అంటున్నారు.

సంస్కృతి-సంప్రదాయాలు పలుచబడిపోతూ అంగసౌష్టవాలకూ, అలంకరణలకూ ప్రాధాన్యతనిస్తూ అంగాంగ ప్రదర్శనలతో, అతి తెలివి తేటలతో, భోగలాలసతతో, ఆధునీకరణ వైపు సాగించే జీవన మార్గాన్ని నాగరికత-నవనాగరికత అంటున్నారు.

కాలానుగుణంగా ప్రజల అభిరుచులనుబట్టి, సామాజిక అవసరాలనుబట్టి నాగరికత తన ఉనికిని కోల్పోతూ, రంగులు మార్చుకుంటూ, భావితరాల బంధాలనూ, ఆత్మీయతలను దూరం చేస్తూ, అంతరాలను పెంచుతూ, వ్యక్తిగత, శిశ్నోదర సుఖానికే ప్రాధాన్యతనిస్తూ మానవ మనుగడకే ముప్పు తెస్తుంది.

<u>జాతి - జాతీయత :</u> ప్రాచీన సంతతికి చెందిన వ్యక్తుల సముదాయాన్నే 'జాతి' అంటారు. జాతి వికాసాన్ని, భద్రతను కాపాడుకొనుటకు చేసే ప్రయత్నాన్ని, త్యాగాన్ని ప్రదర్శించే అంకిత భావాన్ని జాతీయత అంటారు. జాతీయత ఒక సామూహిక శ్రేయో మనోభావం.

దేశభక్తి: దేశమంటే సరిహద్దులుగల ఒక విశాలమైన ప్రాంతమే కాదు. "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అన్నారు. దేశ పౌరులంతా ఆరోగ్యంగా, ఆనందంగా, సుఖ-సంతోషాలతో, నిశ్చింతగా, భద్రతా భావంతో, నిర్భయంగా జీవిస్తూ ఉండాలని పడే ఆరాటమే ! ఆ- తపనే "దేశభక్తి."

అన్ని దేశాలకంటే మనదేశం మెరుగైన స్థితిలో ఆదర్శంగా ఉండాలని కోరుకోవడమే "దేశభక్తి" అందుకోసం చేసే కఠోర పరిశ్రమే "దేశభక్తి".

మన దేశాన్ని ఆక్రమించాలని, మన దేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నిస్తూ, దెబ్బతీయాలని, దేశంలో అశాంతి, అరాచకం సృష్టించాలని ప్రయత్నించేవారికి సింహస్వప్నం కావాలని కోరుకోవడం అందుకు తగ్గ నైతిక, శారీరక, సైనిక బలం సమృద్ధిగా కలిగి ఉండడమే "దేశభక్తి". అవసరమైతే ధన, ప్రాణ త్యాగాలకైనా సిద్ధపడటమే "దేశభక్తి".

దేశభక్తి మనోనిష్ఠకు సంబంధించిన అంశం. అంతర్జాతీయ క్రీడలు జరిగేటపుడు మన దేశ జట్టు ప్రతిభావంతంగా, శక్తివంతంగా ఆడి గెలవాలని మనసా-వాచా ప్రబలంగా కోరుకుంటాం. గెలిస్తే మన ఆనందానికి అవధులే ఉండవు. మన చుట్టూ ఉన్న వారికి పండ్లు, బిస్కట్లు, మిఠాయిలు పంచి ఆనందాన్ని పంచుకుంటాం. ఆ ఆనందపు అనుభూతులతో ప్రశాంతంగా నిద్రపోతాం. ఆ గెలుపు వెనుక పడిన శ్రమ అంతా-ఇంతా కాదు. అది కఠోర పరిశ్రమ. ఆ విధమైన శ్రద్ధ, నిబద్ధత, అంకిత భావమే "దేశభక్తి".

ఒకవేళ మన దేశ జట్టు ఆటలో ఓడిపోతే బాధపడతాం. ఆ రోజంతా ఏమిటి? కొన్ని రోజుల వరకు బాధా పోదు, నిద్రాపట్టదు. ఆ విధంగా బాధపడడమే "దేశభక్తి".

అంతర్గత కలహాలతో, ఉదాసీన వైఖరిని చూపించే అధికారులతో, బంధు ప్రీతి, పక్షపాతం, అధికారదాహంతో, మితిమీరిన స్వార్థంతో వ్యవహరించే పాలకులతో, వ్యక్తిగత సుఖ-సౌకర్యాల, ధన సంపత్తుల వ్యామోహంలో పడిన ప్రజలతో దేశం నిండి ఉంటే, నేరాలు ఘోరాలు, ఆక్రమణలు, అరాచకాలు యథేచ్ఛగా జరగడమేకాక, శృంగార కేళీ విలాసాల విహార కేంద్రంగాకూడా మారడం ఖాయం.

* జాతీయ చైతన్యం, క్షాత్రగుణం, సామాజిక స్పృహ, శిక్షాస్మృతి పట్ల విశ్వాసం లేని వారికి అధికారాలు, పదవులు, స్వాతంత్ర్యం "కాకి ముక్కుకు దొండపండు"లాగా "నపుంసకునికి మీసం" లాగా నిరర్థకం.
* శాంతి సమయంలో చెమటను చిందిస్తే, యుద్ధ సమయంలో తక్కువ రక్తపాతంతో విజయాన్ని సాధించవచ్చు.

* యుద్ధానికి సన్నద్ధంగా ఉండడమే శాంతిని భద్రంగా కాపాడేందుకు కావలసిన అతి ఉత్తమ మార్గం.

అల్ప సంఖ్యాకులు - అభద్రతా భావన : సముద్రంలో అలలులేని స్థితి ఉండదు. అలాగే దేశంకూడా ప్రశాంతంగా ఏనాడూ ఉండదు. ఉండనివ్వరుకూడా. సహజమైన సమస్యలు, సృష్టించబడ్డ సమస్యలతో దేశం సతమతమవుతూ ఉంటుంది. అంతర్గత శత్రువులు దేశంలో సమస్యలను సృష్టిస్తూనే ఉంటారు. అలాంటి వారిలో అక్రమంగా దేశంలో నివసిస్తూఉన్న విదేశీయులూ ఉండవచ్చు. దేశంలోనే నివసిస్తున్న నేర ప్రవృత్తిగల వాళ్లూ, దేశద్రోహులూ ఉండవచ్చు.

ఏ దేశమైనా రాజ్యాంగ పరిధిలో సమస్యలకు శాశ్వత పరిష్కారాల దిశగా ఆలోచించకుండా అధికసంఖ్యాకులనీ, అల్పసంఖ్యాకులనీ, అణగద్రొక్కబడ్డవారనీ, అభద్రతకు లోనవుతున్నవారనీ, శరణార్థులనీ, కాందిశీకులనీ ఆదరించి, అక్కున చేర్చుకోవాలనీ, వారి వాదనలకూ, జీవన విధానాలకూ, మనోభావాలకూ గౌరవం ఇస్తూ తాత్కాలికంగా తృప్తి పరుస్తూ.... నేరస్తులని న్యాయస్థానాలు తీర్పునిచ్చినా! సర్వసత్తాక ప్రజాస్వామ్య సార్వభౌమాధికార ప్రభుత్వమే భయపడి శిక్షలను అమలు చేయలేక చేతులెత్తేసి, మెతక వైఖరినీ, వాయిదాల పద్ధతినీ అవలంభిస్తూ... భవిష్యత్తులో ఓటు బ్యాంకుగా ఉపయోగపడతారనీ, తమ పార్టీకే ఓటు వేసి అధికారంలో కూర్చోబెడుతూ ఉంటారని, కంటితుడుపు పనులను ఎప్పటికప్పుడు జాప్యం లేకుండా అమలు చేస్తూ పోతే... చివరకు "ఒంటె దూరిన గుడారం" లాగా ఆ దేశ జాతిజీవనం, దేశస్వాతంత్ర్యం ప్రమాదంలో పడబోతున్నదనీ, సమీప భవిష్యత్తులో ఆ దేశం మరొకమారు పరాధీనం కాబోతున్నదనీ గ్రహించాలి.

* శత్రుదుర్భేద్యంగా ఒక దేశంగానీ, ఒక జాతిగానీ, ఉండాలంటే... ఆ దేశ పౌరుల చైతన్యం, పరాక్రమం, అధునాతన ఆయుధ సంపత్తి, పుష్కలంగా కలిగిన సైనిక బలంపైన, కఠినంగా అమలు పరచబడే శిక్షాస్మృతిపైన మాత్రమే సాధ్యమవుతుంది.

అధిక సంఖ్యాకులమని కొందరు, అధికారం మన చేతుల్లోనే ఉందని కొందరు, మన దేశంలోనే మనలను ఎవరేం చేయగలరనే అహంకారంతో కొందరు, సుఖ భోగాల మత్తులో కొందరు, అధికారమత్తులో కొందరు, అనైక్యతతో కొందరు, అసూయలతో కొందరు, ప్రలోభాలకు లోనై దేశాన్నే అమ్ముకునేదానికి సిద్ధపడేవారు కొందరు. ఇలా ఎవరికి తోచిన విధంగా "ఎవరికి వారే యమునా తీరు"గా నిర్లక్ష్యంగా, దేశ భవిష్యత్తును గురించి పట్టించుకోకుండా అజాగ్రత్తగా, ఏమరుపాటుతో, స్వతంత్ర్యమంటే స్వేచ్ఛా విహారమని, విచ్చలవిడితనమనే సరికొత్త వింతవాదనతో జీవిస్తూ ఉంటారు.

* కొన్ని వర్గాలవారు తాము అభద్రతా భావనకు లోనవుతున్నామనీ, అణగద్రొక్కబడు తున్నామనీ నటిస్తూ, హక్కులను నెరవేర్చుకుంటూ, బాధ్యతలను విస్మరిస్తూ, లోలోన రహస్యంగా ఐకమత్యాన్ని కూడగట్టుకుంటూ, దేశీయ శక్తుల సహకారాన్ని అంది పుచ్చుకుంటూ, రాజకీయ అధికార పదవులను దక్కించుకుంటూ-సమయం ఆసన్నం కాగానే, అదను చూచుకొని అధిక సంఖ్యాకుల అధికారాన్ని హస్తగతం చేసుకుంటారు. అధిక సంఖ్యాకులను బానిసలుగా చేసుకుంటారు. చరిత్ర చెప్పిన సత్యమిది. దేశభక్తుల ఆవేదన ఇది.

అర్హతలున్నవారే అధికారంలో ఉండాలి

పూర్వం కళింగ రాజ్యాన్ని మహేంద్ర భూపాలుడు పరిపాలిస్తూ ఉండేవాడు. ఒకరోజు ఏకాంత మందిరంలో మహారాణి రాజేశ్వరీదేవితో కాలక్షేపం చేస్తూ ఉండగా చాలా రోజులుగా మిమ్మల్ని ఓ మాట అడగాలనుకుంటున్నాను. అంది రాజుతో.

అడగండి మహారాణి అన్నాడు రాజు. మా సోదరుడు శూరసేనుడు గత కొన్నేళ్లుగా ఆయుధాగారంలో పని చేస్తున్నాడు. వాడు మహా మంత్రి పదవిని నిర్వహించాలని ఉబలాటపడుతున్నాడని అన్నది. ఆ పదవి ఎంతటి బాధ్యతాయుతమైనదో మీకు తెలియంది కాదు కదా మహారాణీ! అన్నాడు రాజు. తెలియకేం? నాకు అన్నీ తెలుసు. మా తమ్ముడికేం తక్కువ? ఒకసారి అవకాశం ఇచ్చి చూడండి, వాడి సామర్థ్యం ఏపాటిదో తెలిసి వస్తుంది కదా? అంది మహారాణి.

సరే! శూరసేనుడిని ఒకసారి వచ్చి కలవమనండి, మాట్లాడతాను అని చెప్పి వెళ్ళిపోయాడు మహారాజు. మరునాడు శూరసేనుడు మహారాజు దగ్గరికి వచ్చాడు. ఆ సమయంలో కోట బయట కొన్ని ఎద్దుల బండ్లు వరుసగా వెళ్ళుతూ ఉన్నాయి. వాటిని చూపిస్తూ బావమరిదితో శూరసేనా... ఒక్కసారిగా ఇన్ని బండ్లు ఎటువెళ్తున్నాయో సవివరంగా విచారించుకొని రా అన్నాడు.

మన ప్రక్క నగరానికి వెళ్తున్నాయట మహారాజా, అని తాను తెలుసుకొని వచ్చిన సంగతిని చెప్పాడు శూరసేనుడు.

అది సరే- ఏఊరినుండి వస్తున్నాయో విచారించావా? మహారాజు మరలా అడిగాడు. మళ్ళీ కనుక్కొని వచ్చి అవంతీపురం నుండి వస్తున్నాయట, అని చెప్పాడు.

అలాగా! ఆ బండ్లలో ఉన్న బస్తాల్లో ఏముందో కనుక్కున్నావా? అని ప్రశ్నించాడు. అన్ని విషయాలూ ఒకేసారి కనుక్కొని రమ్మన వచ్చుగదా? ఇలా ఎన్నిసార్లు తిరగాలి? తనలో తాను విసుక్కుంటూ, గొణుక్కుంటూ వెళ్లాడు శూరసేనుడు. ఇసుక బస్తాలట మహారాజా, వెనుదిరిగి వచ్చి చెప్పాడు శూరసేనుడు. ఇంతలో మహామంత్రి అక్కడికి వచ్చాడు. మంత్రివర్యా! నీవు వచ్చేటపుడు కోట బయట వెళుతున్న ఎద్దుల బండ్లను చూశావా? అడిగాడు మహారాజు. చూశాను మహారాజా, ఆ విషయమే మీకు

విన్నవించు కుందామని వచ్చాను . ఇన్ని ఎద్దుల బండ్లు ఒక్కసారిగా పోవడం ఏమిటి? అని అనుమానం వచ్చి తనిఖీ చేయించాను. ఆ బస్తాలలో కత్తులు, శిరస్త్రాణాలు, తదితర యుద్ధ సామగ్రి ఉంది. శత్రువులు మన రాజ్యంపై దాడి చేయడానికి కుట్రపన్ని, సన్నాహాలు చేసుకుంటున్నారు . ఆ బండ్లనన్నింటినీ ఆధీనంలోనికి తీసుకొని, వారందరినీ బంధించి ఖారాగారంలో ఉంచి, విషయం మీకు తెలియబరచడానికే ఇలా మీవద్దకు వచ్చాను అన్నాడు మహామంత్రి. శహబాష్ మంత్రివర్యా ! అంటూ శూరసేనుడి వైపు అదోలా చూశాడు మహారాజు.

గ్రహించావా? శూరసేనా? మహామంత్రి పదవికి ఉండవలసిన అర్హత ఏమిటో? ప్రతి విషయాన్ని ఎంత కూలంకషంగా పరిశీలించి, బాధ్యతగా వ్యవహరించవలెనో?

కీలకమైన పదవులలో బంధు ప్రీతి, సిఫారసులతో నియమించినట్లయితే ఎంతటి ప్రమాదం జరుగుతుందో తెలుసుకున్నావా? అర్హతల ఆధారంగానే బాధ్యతలను అప్పజెప్పాలి. పదవులలో అర్హులైన వారినే నియమించాలి అని మహారాజు చెప్పాడు.

క్షమించండి మహారాజా! మహారాణి సోదరుడననే అహంకారంతో అత్యాశకు పోయి పదవిని ఆశించి తప్పుచేశాను, మన్నించండి అని తలదించుకొని వెళ్ళిపోయాడు శూరసేనుడు.

స్వేచ్ఛ-స్వాతంత్ర్యం-విచ్చలవిడితనం

స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజుల్లో ఒక మీసాల ఆసామి, హుందాగా దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందన్న ఆనందంలో, గర్వంగా మీసాలను మెలేసుకుంటూ, తన చేతి కర్రను సరదాగా-సంతోషంగా త్రిప్పుకుంటూ, కూనిరాగాలు తీసుకుంటూ వెళ్తున్నాడు. వెనుకనే వస్తున్న మరొక ఆసామి ముక్కుకు ఆ కర్ర తగిలింది.

బాధతో "ఏమయ్యా నీకు బుద్ధుందా, దారిలో అలా కర్ర ఊపుకుంటూ పోతే ఇతరులకు ఇబ్బంది కాదా ? చూడు నాముక్కు ఎలా బద్దలై రక్తం కారుతోందో అన్నాడు.

అయ్యో! ఎంతపని జరిగింది ? ఏదో స్వతంత్రం వచ్చిన సంతోషంలో హుషారుగా వెళుతున్నాను. ఈ పొరపాటు జరిగింది. "ఐయామ్ వెరీ సారీ" తనవల్లే అలా జరిగిందని చాలా బాధపడ్డాడు. తన చేతి గుడ్డతో ముక్కును శుభ్రం చేశాడు.

దెబ్బతిన్న ఆసామి కాస్త తేరుకున్న తర్వాత, మెల్లగా "నిజమేనయ్యా! నీలాగే నేనూ స్వాతంత్ర్యం వచ్చిన సంతోషంలో స్వేచ్ఛగా వస్తున్నాను. కానీ, నీ స్వాతంత్ర్యం నా ముక్కు తాకనంత వరకే అన్నాడు.

ఆనాటి సంఘటనే కనుక ఇప్పుడు జరిగితే ఎలా ఉంటుందంటే?!

ఏం? అవునయ్యా! నా సంతోషం నాది. నా ఆనందం నాది. ఇపుడేంటంట? నా కర్ర నీ ముక్కును బద్దలు కొట్టింది. సరే ఇపుడేంటి నీ కత? నీకు చేతనైంది చేసుకోపో, ఏం పీక్కుంటావో పీక్కో. అదికాదురా! నేను ముందు పోయేవాడిని. నాకు

ఎలా తెలుస్తుంది? నీవు నా వెనుకనే వస్తున్నావని? నేను కర్ర తిప్పుకుంటూ పోతున్నానని వెనుక వచ్చేవాడివి నీవు గమనించుకోవద్దా? అసలు నీకు కళ్ళున్నాయా? చూచుకోకుండా నడిచి తప్పు చేసింది కాక నన్నే దబాయిస్తావా? అంటాడు.

ఈనాడు స్వేచ్ఛా-స్వాతంత్ర్యాలు మితి మీరి, విచ్చలవిడితనంగా మారింది. విచ్చలవిడితనం అంటే ఎవరూ, దేనికీ జవాబుదారుగా బాధ్యత వహించక పోవడం. భయమూ-భక్తీ లేకుండా ప్రవర్తించడం ఏమైనా, ఎలాగైనా మాట్లాడ్డం. ఇదేమిటని ప్రశ్నిస్తే ఎదురు తిరగడం.

ఈనాడు ప్రతి ఒక్కరూ రోడ్డుమీద నడిచేటపుడు ఎలా నడవాలో కూడా తెలియనంతటి విచ్చలవిడితనంతో నడుస్తూ ఉన్నారు. పది మందీ నడిచే రద్దీగా ఉండే ప్రదేశమనే స్పృహే లేకుండాపోయింది. తానొక్కడే కాదు నడిచేది, తను మాత్రమే కాదు పని తొందరలో ఉండేది. తనలాగే ఎందరో, ఎన్ని పనులమీదనో వస్తూ-పోతూ ఉంటారు. కాస్త చూచి నడుస్తాము అన్న ధ్యాసే లేకుండాపోయింది. రోడ్డుమీదికి వెళ్లామంటే మరలా తిరిగి ఇంటికి చేరతామన్న భరోసానే లేకుండా పోయింది. దారికి అడ్డంగా వచ్చిన వాడిని "ఏమయ్యా ఇలాగేనే దారిలో నడిచేది" అని పొరపాటున అన్నామనుకో, ఇక శివమెత్తిన శివుడే అయిపోయి, రెచ్చిపోయి ఎలా ఎదురు దాడికి దిగుతాడో ఊహకే అందదు. అందుకని ఎవరిపాటికి వారు మౌనంగా ఎందుకొచ్చిన గొడవ అని తప్పించుకుంటూ, తమ ప్రయాణాన్ని సాగించేదానికి అలవాటు పడిపోయారు.

* సత్వరమే శిక్షలు అమలు పరచడం ద్వారా ఎవరికి వారు నియమాలు పాటించడం ద్వారా మాత్రమే విచ్చలవిడితనాన్ని అరికట్టగలం.

ఒక విదేశీయుడు మనదేశంలో పర్యటించి తిరిగి స్వదేశం వెళ్తున్నపుడు ఒక విలేఖరి ఆయనను ఇంటర్వ్యూ చేశాడు. ఆ సందర్భంగా విదేశీయుడన్నాడు. నేను నాస్తికుడిని. దేవుడు లేడని అంటూ ఉండే వాడిని. కానీ ఇండియాకు వచ్చాక దేవుడు ఖచ్చితంగా ఉన్నాడని నమ్ముతున్నాను అన్నాడు. అదెలాగో మీ అనుభవాన్ని కాస్త వివరంగా చెప్పండి అని విలేఖరి అడిగాడు. మా దేశంలో ఎంతో క్రమశిక్షణతో ట్రాఫిక్ రూల్స్‌ను పాటిస్తూ ప్రయాణిస్తుంటాము. అయినా ఆక్సిడెంట్లు చాలానే జరుగుతుంటాయి. కానీ మీ దేశంలో అలాకాదు. రోడ్డుమీద ఎవరిష్టమొచ్చినట్లు వారు ఎలాగంటే అలాగ అడ్డదిడ్డంగా ప్రయాణిస్తున్నా ఆక్సిడెంట్లు చాలా తక్కువగానే జరుగుతున్నాయి. ఇదంతా భగవంతుని దయవల్ల మాత్రమే సాధ్యమవుతున్నదని నాకు నమ్మకం కలిగింది అన్నాడు.

<u>అవినీతి :</u> లౌక్యంగా అందరినీ ఉపయోగించుకొని, ఉపయోగపడకుండా తప్పించుకోవడం, మాట ఇచ్చి నిలుపుకోకపోవడం, తాను చెయ్యవలసిన పని వదలి దురాశతో, దురాలోచనతో వేరొకరి పనులలో జోక్యం చేసుకోవడం, హక్కుల కొరకు, ఆధిపత్యం కొరకు మాత్రమే అరవడం, బాధ్యతలను మరవడం, తప్పులను సమర్థించడం, తప్పు చేసినవారికి వత్తాసు పలకడం, అర్హతలు లేని వారికి సిఫారసు చేయడం, అవసరం లేకపోయినా నాకింత పలుకుబడి ఉంది అనే అహంకారంతో సిఫారసు చేయడం మొదలగునవన్నీ నీతిబాహ్యమైన పనులు.

పుచ్చుకొంటున్న జీతానికి గానీ, కూలికి గానీ తగినంత పని చెయ్యకపోవడం, చేసిన పనికి అదనంగా డబ్బు వసూలు చెయ్యడం, చేయవలసిన పని చెయ్యవలసిన రీతిలో, చెయ్యవలసిన సమయంలో చెయ్యకపోవడం, అవినీతి, నేరం.

శక్తి-యుక్తులు ఉండికూడా సేవ, సహాయం, సహకారం, ఉపకారం చెయ్యకపోవడం, సకాలంలో న్యాయం చేయకపోవడం, మోతాదుకు మించి శిక్షించడం, నేరానికి తగ్గట్టు శిక్షించకపోవడం, అనవసరంగా వాయిదాలు వేసి నేరాన్ని నిర్వీర్యం చేసి, ప్రక్కదారి పట్టించడం, అమాయకులను శిక్షించడం ఘోరం.

* చట్టాలపై నమ్మకం, శిక్షలంటే భయం, పెద్దలపై గౌరవం, భగవంతునిపై విశ్వాసం లేకపోవడం అవినీతికి, నేరాలకు, ఘోరాలకు కారణం.
* తప్పు చేసేటపుడు పెద్దలు చూస్తారేమోనని భయపడాలి. పెద్దలకు తెలిస్తే దండిస్తారనే భయం ఉండాలి.
* అవినీతి ద్వారా సఫలతను పొందినవారినీ, ఆస్తులను సంపాదించినవారినీ ప్రశంసించనేకూడదు.
* లోక కంటకుడిని శిక్షించడానికి ఎలాంటి ధర్మసూత్రాలను పాటించనవసరం లేదు. వాయిదాలు అసలే వేయకూడదు.
* వడ్లను దంచకుండా బియ్యం రావు .శిక్షించకుండా నేరాలు అరికట్టబడవు.
* శిక్ష అనేది వ్యక్తిలోని నేర ప్రవృత్తిని రూపుమాపేలా ఉండాలి.
* సహించడం, చూసీచూడనట్లు ఉండడం, ఉదాసీన వైఖరిని అవలంభించడం. క్షమిస్తూపోవడం కూడా అవినీతికి ఒక అవకాశం.
* నేరాలు-ఘోరాలు జరిగినపుడు అందరూ ముక్తకంఠంతో నేరస్తులను కఠినాతి కఠినంగా శిక్షించాలి అంటారు. మరుక్షణం నుండే మరచిపోతూవుంటారు.
* నేరస్తుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని విద్యాలయాలకు, న్యాయ స్థానాలకు ఖర్చు పెట్టాలి.

* సమాజంలో అవినీతి పెరగడానికీ, అసమర్థులు అందలమెక్కడానికీ కారణం చెడ్డవాళ్ళు చెలరేగిపోవడం కాదు. మంచివారు ఉదాసీన వైఖరిని అవలంబించడమే ప్రముఖ కారణం.
* కఠినమైన శిక్షలకు వ్యతిరేకంగా ఉదార స్వభావులు మానవత్వాన్ని కురిపిస్తుంటారు. కానీ బాధితుల ఘోషను, వారి త్యాగాలనూ విస్మరిస్తూ ఉంటారు.
* ప్రభుత్వాన్ని నడిపేవారు, ప్రభుత్వాధికారులు, బడిలోని ఉపాధ్యాయులు, గుడిలోని పూజారులు చాలా నీతివంతంగా జీవించాలి. వీరు సమాజానికి ఆదర్శంగా ఉండాలి. ఎందుకంటే వీరు చదువుకున్న వారు కాబట్టి. వీరు తప్పు చేస్తే శిక్షలు చాలా కఠినంగా ఉండాలి.
* మఠాధిపతులు, పీఠాధిపతులు, బాబాలు, ఋషులు, సాధువులు, పూజారులు, గురువులు వీరందరికీ విశేష ప్రజాదరణ ఉంటుంది. వీవరందరూ ఒక్కవేదికపైకి రావాలి. చక్కని ప్రణాళికతో - ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వాధికారులకు జ్ఞానాన్ని బోధించి, వారి స్వాధీనంలో మ్రగ్గుతున్న నల్లధనాన్ని వెలికి తీయించాలి. విద్యాలయాలకు, న్యాయస్థానాలకు, చికిత్సా కేంద్రాలకు, అధిక మొత్తంలో వెచ్చించి నాణ్యమైన ఉచిత సేవలనందించాలి. వస్తువుల, సేవల నాణ్యతను పెంచాలి.
* దేవాలయాలలో పని చేసే ప్రతి ఒక్కరికీ తెల్లటి యూనిఫాం లేదా కాషాయరంగు బట్టలను ధరింపచేసి పవిత్రతకు, త్యాగానికి మారు పేరుగా నిలిచేటట్లు చేయాలి. దేవాలయాలలో పవిత్రతను, పరిశుభ్రతనూ కాపాడాలి, పేద-ధనిక భేదాలు లేకుండా అందరికీ ఒకే రీతిలో భగవద్దర్శనం చేయించాలి. వ్యాపార దృష్టిని పూర్తిగా అరికట్టాలి. నిరాడంబరతకు ఆదర్శంగా నిలవాలి.

పాపాన్న భుక్త పరిణామం

ఒక ఆశ్రమంలోని కుటీరంలో ఒక సాధువు తపస్సు చేస్తూ ఉండేవాడు. ఆ కుటీరం దగ్గరే మరొక కుటీరంలో వానప్రస్థి ఒకడుండేవాడు. ఒకరోజు రాత్రి అతనికి ఒక విచిత్రమైన పరిస్థితి ఎదురైంది. దిక్కుతోచక సాధువు దగ్గరికి వచ్చి తనకు ధ్యాన సమయంలో కలుగుతున్న అంతరాయమును గురించి దుఃఖించసాగాడు. సాధువు వానప్రస్థి మీద జాలి కలిగి కారణమేమి అని అడిగాడు. దానికి సమాధానంగా ధ్యాన సమయంలో రక్తవర్ణ వస్త్రధారిణియైన ఒక యువతి ఏడుస్తూ కనిపిస్తున్నది. కన్నులు తెరచి చూస్తే అదృశ్యమౌతున్నది. నాకు ధ్యానం కుదరడంలేదు. ఎంత వద్దనుకున్నా ఇదే దృశ్యం కనిపిస్తున్నది. ధ్యానభంగం కలుగుతున్నది. నాకు చాలా బాధగా ఉంది. దీనికి కారణం ఏమి? నివారణోపాయం చెప్పండి అని వేడుకున్నాడు.

సాధువు వానప్రస్థిని ఊరడిస్తూ, ఆశ్రమ నియమాలకు భంగం వాటిల్లే పని ఏదైనా చేశావా? చెడు దృశ్యాలను చూచావా? అశ్లీల గ్రంథాలేమైనా చదివావా? లేక ఆశ్రమ వాతావారణాన్ని విడిచి ఎక్కడికైనా వెళ్లావా? అని ప్రశ్నించాడు.

వానప్రస్థి ఆ సాధువుతో అవునండీ, నిన్నటి రాత్రి అన్న సంతర్పణ చేస్తూ ఉంటే ఆహ్వానం మీద వెళ్ళి భోజనం చేసి వచ్చాను అన్నాడు. ఆ సాధువు వానప్రస్థితో ఆ అన్నదాత సంతర్పణ ఎందుకు చేశాడో తెలుసుకున్నావా? అంటే లేదు అన్నాడు. కారణం తెలుసుకొని రాపో అన్నాడు సాధువు.

వివరాలు తెలుసుకొని వచ్చిన వానప్రస్థి సాధువుతో అన్నదాత ఒక పట్టణవాసి. అతడు సౌందర్యరాశి అయిన తన కుమార్తెను ధనాశతో వయసుడిగిన వాడికి పాతికవేలు తీసుకొని అమ్మివేశాడు. పాప పరిహార నిమిత్తం ఐదువేలు వెచ్చించి అన్న సంతర్పణ చేశాడు అని చెప్పాడు.

అది విన్న సాధువు నీకు ధ్యానసమయంలో ఎర్రని వస్త్రాలతో దుఃఖిస్తూ కనిపించేది ఆ స్త్రీ రూపమే. పాపపు సంపాదనతో పెట్టిన అన్నం తిన్న కారణంగానే నీకు ధ్యానభంగం కలుగుతున్నది. దీనినే పాపాన్నభుక్త పరిణామం అని అంటారు అని వివరించాడు సాధువు.

ధనమే జీవితాన్ని నడిపిస్తుంది, శాసిస్తుంది. ధనం అనే ఇరుసు ఆధారంగానే అన్ని బంధాలు పెనవేసుకొని ఉన్నాయి. అంతమాత్రాన ఇష్టమొచ్చిన రీతిలో సంపాదనకు ఒడిగడితే మూటగట్టుకొనేది పాపమే. కాబట్టి ధర్మయుక్తంగా కష్టానికి తగ్గ ఫలితాన్ని పొందినపుడు కలిగే తృప్తి, ఆనందం వర్ణనాతీతం.

వాడింత సంపాదించాడు, నేనింత సంపాదించాలి, వాడు అమెరికా వెళ్లాడు, నేను లండన్‌కెళ్లాలి. వాడు చదువుకొని ఉద్యోగం చేసి సంపాదిస్తే, మనం గల్ఫ్‌కెళ్లి ఊడిగం చేసైనా సంపాదించాలి. ఆడవాళ్ళకైతే వీసా ఉచితం కాబట్టి ఇంటి ఆడదాన్ని పంపించాలి. పెళ్లి కాకుంటే పెళ్ళి చేసుకొని పంపించాలి. ఎలాగైనా సంపాదించాలి. ఒకనాడు ఇంటి ఇల్లాలిని వీధిలోకి పంపాలన్నా రోషం పొడుచుకొచ్చేది. ఈనాడు ఏదేశమేగినా ఇబ్బంది లేదు. ఎవరితో వెళ్ళినా ఇబ్బందిలేదు. కావల్సిందల్లా డబ్బు, డబ్బు. ఒకవేళ కాలం కల్సిరాక ఉత్త చేతులతో వస్తే అడ్డదార్లు ఉండనే ఉన్నాయి. అక్రమ సంబంధాలు, హత్యలు-ఆత్మహత్యలు.

ఎంత సంపాదించాం అని కూడా కాదు, వాడికంటే మనం ఎంత సంపాదించాం? అన్నది ముఖ్యం. మనకున్నదేదో ఉంది. అది కాదు ముఖ్యం, వాడికి లేనిది ఏదీ? మన కున్నది ఏది? అనేది ముఖ్యం. ఇలాంటి గొంతెమ్మ కోరికలతో, పరుగులు తీసే

అవసరాల వేటలో మనం ఏం పోగొట్టుకుంటున్నాం? ఎందరికి దూరమవుతున్నామని ఆలోచించే సమయం ఏది? అడిగే వాడెవడు? అడిగినా చెప్పేవాడెవడు? ఎవడిగోల వాడిది.

సమాజం: లోకంలో రకరకాల మనుషులు, రంగురంగుల మనుషులు, మనము మెచ్చేవారు, మనకు నచ్చేవారు, మనకు గిట్టనివారు, రకరకాల సంస్కారాలు, రకరకాల మాట తీరులు, రకరకాల నడకలు-నడతలు-- అబ్బో! చూడాలేగానీ ఎన్ని వింతలు, ఎన్నెన్ని పోకడలు?!

అందరూ తినేది అన్నమే, ఎవరూ గడ్డీ గాదమూ తినరు. రుచిగానూ, శుచిగానూ లేకపోయినా! వడ్డించే తీరు బాగోలేకపోయినా, ఒంటికాలు మీద లేచి రణరంగం చేస్తారు. భాగానే ఉంది. రుచిగానూ, శుచిగానూ తిన్నవారు తమ మాటలు, చేతలు కూడా ఇతరులకు రుచించేవిగానూ, మంచి చేసేవిగానూ ఉండేటట్లు చూచుకోవద్దా? కానీ అలా చూచుకోవడం లేదే! అదిగో చిక్కల్లా ఇక్కడే వస్తుంది. ఎందుకిలా జరుగుతుంది?

తెల్లవారి లేచింది మొదలు సాయంకాలం గూడు చేరుకునేదాకా ఒకరిమొగం ఒకరు చూసుకొనవలసినవారు, ఒకరికష్టాలు మరొకరు పంచుకొని ఆప్యాయంగా పలుకరించుకొని మనసులోని బరువును దించుకొనవలసినవారు, కలసిమెలసి అన్యోన్యంగా జీవించవలసినవారు, ఎందుకనో శత్రువులుగా మారిపోతున్నారు. పోనీ శత్రువులుగానే ఉండిపోతారా అంటే అదీలేదు. ఒక శుభోదయాన... మిత్రమా అనో, అన్నయ్యా అనో, అక్కయ్యా అనో, చెల్లీ అనో ఏదో ఒక బంధం, మరేదో అవసరం కొద్దీ ఒక సాకుతో తియ్యని పిలుపు, పలకరింపూ, కలుపుగోలుతనమూ, తేనె పూసిన మాటలు, గుండె లోతులను తాకే పుల్లవిరుపు మాటలు, ఎత్తి పొడుపు మాటలు... "కడుపులో కత్తులుంచుకొని కౌగిలింతలూ"నూ.

అన్నీ మరచిపోయి మనకెందుకులే ఏదో ప్రశాంతంగా మన బ్రతుకేదో మనం బ్రతుకుదాం అని అనుకుంటూ ఉండగనే ఎక్కడినుంచో ఏ మూలనుంచో ఏదో ఒక పేచీ, మరేదో మనసును కలచివేసే రాద్ధాంతం, గొడవనూ! ఎప్పుడో మంచితనంతో, మానవత్వంతో చేసిన ఉపకారానికి తగ్గట్టు ఒక ద్రోహం, మరొక మోసం, ఇదండీ ఇప్పటి సామాజిక జీవనం.

మనుషులతోనే మోసపోయినా, మరలా మనుషులనే నమ్మవలసి వస్తుంది. నమ్ముతూవుంటాం. ఎంత విచిత్రం?

ఇవాల్టి ఈ పరిస్థితులకు కారణాలేమిటి?

అసూయ, అనవసరపు లౌక్యం, చేసిన మేలు మరచిపోవడం, కక్కుర్తితనం, కపట ప్రేమ, ప్రయోజన స్నేహం, తొందరగా ప్రయోజనం పొందడం, ముందుగానే తప్పించుకోవడం, డబ్బులేదనీ, డబ్బుతో చాలా అవసరముందనీ ఎల్లవేళలా బీద అరుపులు అరుస్తూ ఉండడం, అందరికీ అతి తెలివితేటలు మితిమీరిపోవడం,

ఏం చెయ్యాలి ? ఎలా జీవించాలి ? నిజమే కష్టాలు మనిషికే వస్తాయి. అందులోనూ మనసున్న మనిషికే మరీ ఎక్కువగా వస్తాయి.

విచిత్రం ఏమిటంటే తనకు మంచి మాత్రమే జరగాలని కోరుకుంటుంటారు మనషులందరూ. కానీ మనుషులనే బాధపెట్టి, ప్రయోజనాలను పొందాలనీ అనుకుంటుంటారు. ఇదెలా సాధ్యమో అర్థమేకాదు మనుషులకు. మనుషులకూ, పశువులకూ, పక్షులకూ, చెట్లకూ, చేమలకూ అన్నింటికీ మనుషులవల్లే కష్టాలు.

మృగాలకు మృగ విలువలూ అక్కర్లేదు, పక్షులకూ పక్షి విలువలు అవసరమే రాలేదు. ఒక్క మనిషికి మాత్రమే మానవతా విలువలు అవసరమయ్యాయి. ఎంత ఆశ్చర్యం. పశుదశ నుండి నాగరికునిగా ఎదిగి సాధించిన నిర్వాకమా ఇది? మనిషి ఎదిగినట్లా? దిగజారినట్లా? సాధించినది ప్రగతా? లేక దుర్గతా?

పుట్టించేదీ మనుషులే - చంపేదీ మనుషులే.
పెంచేది మనుషులే - తుంచేదీ మనుషులే.
సేవలు చేసేదీ మనుషులే - సమాధి కట్టేదీ మనుషులే
కీర్తించేదీ మనుషులే - గాయపరిచేది మనుషులే

* కష్ట - సుఖాలూ, మంచి - చెడు, ముళ్ళు-పువ్వులు, దుర్మార్గుల-సన్మార్గుల రంగుల పూల బుట్ట ఈ సమాజం.
* సమాజంలో ఇమడలేని వానికి సమాజం సంతోషాన్నివ్వజాలదు.

<u>సామాజిక స్పృహ :</u> సమాజం శాంతి, భద్రతలతో నడవాలంటే ఉమ్మడి ప్రవర్తనపై యంత్రణ ఉండాలి. జనజీవనం అస్తవ్యస్తం, అతలాకుతలం కాకుండా, ఒడిదుడుకులకు లోనుగాకుండా, సజావుగా, సాఫీగా సాగేలా పౌరులు తమకు తాముగా ధ్యాస కలిగి, జాగ్రత్తతో జీవించడాన్ని సామాజిక స్పృహ లేదా సామజిక కట్టుబాటు అంటారు.

ప్రతి సమాజానికీ కొన్ని ప్రమాణాలూ, పద్ధతులూ, సాంప్రదాయాలూ, విలువలూ, విధి విధానాలూ,నిషేధాలు, నియంత్రణలూ ఉంటాయి.

కట్టుబాట్లు, ఆచారాలు, సామాజిక జీవితంలో, వ్యక్తులయొక్క ప్రవర్తనలను నియంత్రించేదే కాకుండా, వ్యక్తుల మధ్య సంబంధాలను కూడా పటిష్ఠపరుస్తాయి. వాతావరణం కాలుష్యానికి గురికాకుండా దోహదపడతాయి.

కట్టుబాట్లు, విధివిధానాలూ, సామాజిక, నైతిక, ధార్మిక విలువలే అసలైన జీవన విధానం. ఇవి లేని వ్యక్తి జీవితం, సామాజిక జనజీవనం దుర్భరం . వివాహ నియమాలు, కుటుంబ నియమాలు, సామాజిక నియమాలు, వ్యక్తి నియమాలు... ఉల్లంఘించబడినపుడు సమాజంలో అశాంతి, అల్లకల్లోలం చెలరేగుతుంది.

ఆచారాలు: ఆచరించదగ్గ కార్యాలను ఆచారాలు అంటారు. మనిషి జీవితంలోని ముఖ్యమైన జననం, బారసాల, అన్నప్రాసన, అక్షరాభ్యాసం, వివాహం, గృహ ప్రవేశం, ఉత్సవాలు, జాతరలు, తిరునాళలు, పండుగలు, వ్రతాలు, పూజలు, యజ్ఞాలు, ఊరేగింపులూ, చావులూ వంటి సందర్భాలలో వ్యక్తులు ఎలా ప్రవర్తించాలి? ఏఏ అంశాలు ఎలా పాటించాలి? అనే విషయాలను సవివరంగా తెలియజేస్తాయి.

ఈ ఆచారాలు మనుషుల జీవితాలలోని అయోమయాన్ని, గందరగోళాన్ని తొలగించి, ఆనందాలను, సంతోషాలను, ఉత్సాహాన్ని కలిగించి, గౌరవప్రదమైన రీతిలో సంబంధాలను పటిష్టపరిచేటందుకు దోహదపడతాయి. అంతే కానీ అనవసరం ఏ మాత్రమూ కాదు. ఈనాడు క్రొత్తతరం అనబడే యువవర్గం... చాదస్తమనీ, పాతచింతకాయపచ్చడనీ, శుద్ధదండగనీ, తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. ఇలా తృణీకరించడం చాలా తేలికైన పనే. కానీ జీవితాలలో శాంతినీ, సుఖాన్నీ, ఆనందాన్నీ పోగొట్టుకొని విలవిలలాడే పరిస్థితులొచ్చాయి. ఇప్పటికే మానసిక వత్తిడితో పిచ్చివాళ్ళవుతున్నారు. అల్పాయుష్షులూ అవుతున్నారు. ఇంకా జీవితాలు నరకం కాకముందే తెలివిగా జాగ్రత్తపడి మన ఆనందంకోసం, ఆరోగ్యంకోసం, వాతావరణాన్ని ఆహ్లాదంగా ఉంచడం కోసం, ఆచారాలను పాటించాలి.

<u>భ్రష్టసమాజం అంటే? :</u> నీతి తప్పినవారే విజయం సాధించగలిగే అవకాశాలున్న సమాజం. అనర్హులులే అధికారం చెలాయించే సమాజం. నేరస్తులనే నాయకులుగా చిత్రీకరించి, దండలు వేసి, ఊరేగించి విగ్రహాలు ప్రతిష్టించి, ఆరాధించే సమాజం. రక్షకులే భక్షకులైన సమాజం, పరిపాలకులే పాపాత్ములైన సమాజం. ధనంకోసం దేశాన్నే తాకట్టు పెట్టే పరిపాలకులున్న సమాజం. అవకాశవాదం, ఆశ్రిత పక్షపాతం రాజ్యమేలే సమాజం. అవినీతి, అక్రమాలు కరాళనృత్యం చేస్తున్నా సహించే ప్రజలతో నిండిన సమాజం. మోసపోతూ, మోసం చేస్తూ బ్రతుకుతున్న ప్రజలతో నిండిన సమాజం. బడిలోనూ, గుడిలోనూ మద్యం, జూదం, వ్యభిచారం, దొంగతనం, మల-మూత్ర విసర్జన మామూలైపోయిన సమాజమే బ్రష్ట సమాజం.

"ప్రాణంకంటే మానం గొప్పదని, మానం పోయాక బ్రతికీ సార్థకం లేదన్న" రీతి, నీతి, నిబద్ధత కలిగిన దేశం మనది. కానీ సంపాదనముందు, నీచ సుఖలాలస ముందు, ఏదీ ముఖ్యం కాదు, "మానం అనేది తరిగేదీ కాదు, అరిగిపోయేదీ కాదు",

దానిని గురించి అసలు పట్టించుకోనక్కర్లేదు, ఖాతరు చేయనవసరమే లేదు, అని ధైర్యం చెప్పుకుంటూ ఒకరిని చూచి ఒకరు పోటీ పడుతూ పరాయి దేశాలకు తమ కుమార్తెలను సాగనంపే తల్లిదండ్రులు, భార్యలనుకూడా పంపించే మగాళ్ళు ఎక్కువైపోయారు.

కడుపులో ఉంచుకొని కాపాడలవలసిన తండ్రి, అండగా ఉంటూ, అండదండలనందించవలసిన అన్న, కన్న వారిని, అయిన వారందరినీ వదలి వచ్చిన కోడలిని అక్కున చేర్చుకొని ఆదరించవలసిన మామ, నడత-నడక నేర్పించవలసిన గురువులే కామాందులైతే... ఇంతకంటే నీచం. నికృష్టం. దుర్మార్గం, అమానుషం, రాక్షసత్వం ఉంటుందా?

లావాదేవీలు, ఇచ్చిపుచ్చుకోవడాలు, ఒకరినొకరు చిరునవ్వుతో పలకరించి, పరామర్శించుకోవడాలు, ఆదుకోవడాలు ఇలాంటివేవీ ఉండవలసిన రీతిలో, ఉండవలసిన మోతాదులో కనిపించడం లేదు. మానవీయ భావాలు, బంధాలు విచ్ఛిన్నమైపోయాయి.

చూపుల్లో కల్తీ, చేతల్లో కల్తీ, మనసుల్లో కల్తీ, మాటల్లో కల్తీ, మందుల్లో కల్తీ, మద్యంలో కల్తీ, బియ్యంలో కల్తీ, భావంలో కల్తీ, భక్తిలో కల్తీ, ప్రేమలో కల్తీ, ఆహారంలో కల్తీ, అధికారంలో కల్తీ, సేవలలో కల్తీ, సహకారంలో కల్తీ, డబ్బులో కల్తీ, చివరికి త్రాగే నీళ్ళలోకూడా కల్తీ. దీపం పెట్టి వెదికినా కల్తీలేని మనిషి కానీ, వస్తువులుగాని శ్యాంపిలుకైనా కనిపించని పరిస్థితులు.

స్నేహం-ద్రోహం, నీతి-అవినీతి, న్యాయం-అన్యాయం అధికారం-దౌర్జన్యం అసలు-నకిలీ వీటిని విడివిడిగా గుర్తుపట్టలేనంతగా ఒక దానితో ఒకటి పెనవేసుకొని పోయి అయోమయ, అంధకార పరిస్థితులు కారుమబ్బుల్లా నలువైపులా కమ్ముకొని ఉంటే జనజీవనం అస్తవ్యస్తం కాకుండా ఉంటుందా?

అందరికీ సమన్యాయం అందిస్తామని ప్రమాణం చేసిన పాలకులే పాపాలకు ఒడిగడుతున్నారు. తప్పులు చెయ్యడం, కప్పిపుచ్చుకోవడానికి మరికొన్ని తప్పులు చెయ్యడం, మాటలు జారడం, అనలేదని బుకాయించడం, సవాళ్ళు ప్రతి సవాళ్లు విసురుకోవడం, ప్రతిజ్ఞలు చెయ్యడం, క్షమాపణలతో వదిలేయడం, కబ్జాలు చెయ్యడం. కోట్ల కొలది డబ్బును బొక్కడం, అలవికాని హామీలను గుప్పించడం, అయిన వారికి అందలం, కాని వారిని కాలదన్ని దిగజార్చడం, కటకటాల వెనక్కి పంపడం, హతమార్చడం.

శాసన, న్యాయ, రక్షణ వ్యవస్థల పతనానికి విలువల శైథిల్యానికి ఇంతకంటే పరాకాష్ట ఉంటుందా? ఇంత కంటే దిగజారవలసిన లోతులు ఉంటాయా?

తప్పు చేస్తున్నామన్న భయంలేదు
శిక్షలు పడతాయన్న భయంలేదు
ఎవరైనా చూస్తారన్న భయంలేదు
సిగ్గులేదు, శరం ఏమాత్రమూ లేదు
ఇరుకు మనసులు - మురికి ఆలోచనలు
దొంగచూపులు - దుర్మార్గపు చేష్టలు
కష్టపడకూడదు విలాసవంతంగా బతకాలి.
అధికంగా సంపాదించాలి అందరికంటే ముందుండాలి.
అందనంత ఎత్తులకు ఎదిగిపోవాలి.

పాలకుల, పాలితుల స్వభావమంతా స్వార్థమే. అన్నింటా వేగమే. సర్వమూ భ్రష్టుపట్టింది. ఇక చెడిపోవడానికి ఏమీ మిగల్లేదు. అంతా భోం చేశారు. ఇక బొక్కడానికి ఏమీ లేదు. అడ్డదారులే రాజమార్గాలు, రాజ్యాంగాన్నీ, చట్టాలనూ ఉల్లంగించారు. ఇక అతిక్రమించడానికి ఏమీ లేదు.

రక్త సంబంధం, పేగు బంధం, పెంచిన బంధం, సోదర బంధం, భార్యాభర్తల బంధం, తల్లీబిడ్డల బంధం, స్నేహ బంధం, గురుశిష్య బంధం, ఇరుగు పొరుగు బంధం, స్త్రీ పురుష సంబంధం, చెట్లు - చేమలతో, పశు పక్ష్యాదులతో పెంపుడు బంధం, పుట్టిన గడ్డ, పెరిగిన ఊరు, ఉన్న ఇంటితో అవినాభావ సంబంధం, ఇలాంటి అనేకానేక బంధాలు, కొనసాగాలన్నా, పదికాలాలపాటు పదిలంగా ఉండాలన్నా... స్నేహం, సహనం, సేవ - సహకారం, శాంతం, త్యాగం, దయ, నిరాడంబరత్వం, పరోపకారం మాటకు కట్టుబడి ఉండడం లాంటి మానవతా విలువలతోనే సాధ్యం. మానవ జాతికి, ఒక మార్గం, ఒక గమ్యం, ఒక గమనం ఉండాలి.

మన కళ్ళముందే పతనమవుతున్న మానవీయ విలువలను చూస్తూ ఎవరికి వారు కళ్ళున్న కబోదుల్లాగా! చెవులున్న చెవిటి వారిలాగా! నోరుండీ మాట్లాడలేని మూగల్లాగా! మనసున్న మొద్దుల్లాగా, చేవ చచ్చిన చేతగాని వాళ్ళలాగా ఉండి పోతున్నారు. పునరుద్ధరించవలసిన తక్షణ కర్తవ్యం మనముందుంది.

అమాయకులైన మన బిడ్డలనే కళ్ళలో వత్తులేసుకుని పెంచుతూ, మంచి పిల్లలుగా వంశానికీ, దేశానికీ పేరు తెస్తారని ఆశిస్తూ, సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరుకుంటూ.. సంస్కారాలు ఏ మాత్రమూ లేని దుష్టులుగా తయారు చేస్తున్న మనస్వార్థపూరిత, అర్థరహిత, అనారోగ్య ఆలోచనలను, అలవాట్లను ఒకసారి పరిశీలించుకుంటే దిగజారిన మానవతా విలువలకు బాధ్యులెవరో తెలుస్తుంది.

తల్లి-దండ్రులు, అధికారులు, పాలకులు ప్రతినిధులు ఇలా ప్రతి ఒక్కరూ మానవతా విలువలను ఎవరికి వారు పాటిస్తూ, మన భావితరాల వారికి సమాజంపట్ల ఎలా వ్యవహరించాలో నేర్పించాలి. మానవత్వం కలిగిన మనుషుల్లాగా ఎలా నడచుకోవాలో నేర్పించాలి.

ఓర్పుకు మించిన కవచం లేదు
కోపానికి మించిన శత్రువు లేదు
దాయాదికి మించిన నిప్పు లేదు
మంచి మిత్రునికి మించిన ఔషధం లేదు
కపట మిత్రునికి మించిన యముడు లేదు
దుర్మార్గునికి మించిన విష సర్పం లేదు
ఇంటి పోరుకు మించిన అశాంతి లేదు

జాతికి సంస్కృతే సంపద - నాగరికతే విషం. కళ్లెదుట ఎవరైనా దీన, హీన పరిస్థితులలో ఉంటే అయ్యో! వీరు పూర్వ జన్మలో ఎలాంటి దుష్కర్మలు చేశారో కదా? ఈనాడిట్టి దుస్థితిలో ఉన్నారు అని వాపోతారు. కానీ తాము ఈ జన్మలో ఇపుడు ఎటువంటి పనులు చేస్తున్నారో, ఎటువంటి ఆలోచనలు కలిగి ఉన్నారో అస్సలు దృష్టి పెట్టరు.

తామే అధికులుగా గుర్తింపబడాలనీ, తామే కీర్తింపబడాలనీ, తామే సత్కారాలు పొందాలనీ, అర్హతలు లేకున్నా, సర్వశక్తులూ ఒడ్డిపోరాడుతూ ఉంటారు. ఒక్కోసారి అన్ని అర్హతలూ ఉన్నవారే వెనుకబడటం, ఓడిపోవడంకూడా జరిగిపోతూ ఉంటుంది. వెనుకబడినా బాధపడవద్దు. ఓటమిపాలైనా పరవాలేదు. కుట్రలు, కుతంత్రాలు ఎత్తుకు పై ఎత్తులు వేసి హీనాతి హీనమైన భావాలతో దిగజారిపోయే దానికంటే.... అలాంటి ప్రయత్నమే చేయకపోవడం, ఆ విధమైన పోటీలో లేకుండడమే ఉత్తమం.

పాపపు పనులతో ఒకరిని కష్టపెట్టి, మోసగించి, దక్కించుకున్న ప్రయోజనం విషంతో సమానం. ఏనాటికైనా అవమానాలతో కృంగిపోవడం ఖాయం.

జీవితంలో గెలుపోటములు ముఖ్యం కానేకాదు. ఎంచుకున్న మార్గం ఎలాంటిది? అన్నదే ముఖ్యం. ఆదర్శాల కోసం, ధర్మస్థాపన కోసం, పరోపకారం కోసం చేసే నిస్వార్థ సేవ, ప్రయత్నంలోనే నిజమైన తృప్తి, ఆనందం ఉంది.

* ఓటమి ఎరుగని వ్యక్తిని అనిపించుకోవడం కంటే విలువలను వదులుకోని వ్యక్తిని అనిపించుకోవడం నాకు చాలా ఇష్టం అన్నాడు ఓ భారతీయ శాస్త్రవేత్త.
* సిద్ధికంటే సాధన ముఖ్యం. ఏమి సాధించావు అనే దానికంటే ఎలా సాధించావు అనేదే ముఖ్యం. అన్నారు గాంధీజీ.

గమ్యం కంటే గమనం ముఖ్యం

ఒకరాజు గారు తన అంత్యకాలంలో తన వారసుడొకడిని రాజ్యానికి ఉత్తరాధికారిగా చేయాలని తలచాడు. కానీ ఆ రాజుకు సంతానం లేదు. కాబట్టి ఒక వారసుణ్ణి ఎంపిక చేసి, తగిన విధంగా తీర్చిదిద్దాలనుకున్నాడు.

దేశం నలుమూలలా చాటింపు వేయించాడు. రకరకాల పోటీలు, ఎన్నో పరీక్షలు పెట్టిన తర్వాత నలుగురు యువకులను ఎంపిక చేశారు. చివరిసారిగా ఈ నలుగురిలో ఒకరిని తీసుకోవాలి. బాగా ఆలోచించిన మీదట ఆ నలుగురికి చిట్టచివరి పరీక్షను ప్రకటించాడు రాజు.

బాగా పుష్టిగా కనిపించే నాలుగు వేప విత్తనాలను ఆ నలుగురికీ ఇచ్చి వీటిని తీసుకెళ్ళి కుండీలలో పాతి మొలకెత్తాక శ్రద్ధగా సంవత్సరంపాటు పెంచి, ఏపుగా పెరిగాక తీసుకురండి, వాటిని పరిశీలించాక మీలో ఎవరు ఈ రాజ్యానికి తగిన వారసుడో నిర్ణయిస్తాను. అని చెప్పి పంపేశాడు రాజు.

అందులో ఆదిత్యవర్మ అనే వాడికిచ్చిన విత్తనం ఎందుకో చాలా రోజులైనా మొలకెత్తనే లేదు. కుండీని మార్చాడు. పాత మన్నును తీసేసి కొత్త మన్నును, ఎరువును వేసాడు. శ్రద్ధగా నీరుకూడా పోశాడు. కానీ మొలకెత్తనేలేదు. మిగిలిన ముగ్గురి విత్తనాలు మొలకెత్తాయనీ, చక్కగా పెరుగుతున్నాయని ప్రజలు అనుకుంటున్న మాటలు ఆదిత్యవర్మ చెవిన పడ్డాయి.

సంవత్సరం గడువు పూర్తి కావచ్చింది. తన విత్తనం ఇక చచ్చిపోయినట్టేనని నిర్ణయించుకుని రాజుగారి ఎదుటికి వెళ్ళటానికి మొహం చెల్లక, ఈ పరీక్షలో పూర్తిగా తాను ఓడిపోయినట్లేనని బాధపడుతూ ఇంటివద్దనే ఉండిపోయాడు. కానీ ఆదిత్యవర్మ తల్లి రాజుగారి ఆనతి ప్రకారం నీవుకూడా వెళ్ళునాయనా, పోకపోతే రాజధిక్కారం క్రింద నేరమవుతుంది. అది మంచి లక్షణం కాదు. ఏమైతే అదవుతుంది. ధైర్యంగా, నిస్సంకోచంగా వెళ్ళు అని ప్రోత్సహించి పంపించింది.

అక్కడ రాజసభలో మిగిలిన ముగ్గురూ, ఒకదానిని మించినదొకటి అన్నట్లుగా నవనవ లాడుతున్న మొక్కలను కుండీలతో సహా తెచ్చి హాజరైనారు. పాపం ఆదిత్యవర్మ కుండీ మాత్రం వెలితిగా బోసిపోయి దిష్టికుండలాగా ఉంది. అందరూ ఆదిత్యవర్మను గేలి చేశారు. ఒక విత్తనాన్నికూడా మొలకెత్తించలేకపోయావని, అంత అశ్రద్ధ నిర్లక్ష్యం పనికి రాదని విమర్శించారు. మొక్కలను తిలకించేదానికి వచ్చిన రాజుగారి ఎదుట నిలువలేక చాటుగా వెళ్ళాడు ఆదిత్యవర్మ.

రాజుగారు వస్తూనే ఆ ఖాళీ కుండీ ఎవరిది? అని అడిగి తెలుసుకున్నాడు. ఆదిత్యవర్మను అందరి ముందుకు వచ్చి నిలబడమని ఆజ్ఞాపించాడు. సభనంతా ఒక్కక్షణం కలయజూశాడు రాజు. ఆదిత్యవర్మ భయపడిపోయి నిర్లక్ష్యం చేసినందుకు రాజు తనను శిక్షిస్తాడు కాబోలు అనుకుని వణుకుతూ నిలబడ్డాడు.

'ఇదిగో ఇతడే మన రాజ్యానికి నాతదనంతరం రాజు... అందరూ జేజేలు పలకండి అన్నాడు. సభంతా హర్షధ్వానాలతో చప్పట్లతో మారుమ్రోగిపోయింది. విమర్శించినవాళ్ళుకూడా చప్పట్లు, జేజేలు కొట్టక తప్పలేదు.

ఈ నలుగురికీ ఏడాది క్రితం నేనిచ్చిన నాలుగు వేప గింజలూ వేయించిన విత్తనాలు. అవి మొలకెత్తడానికి పనికిరావు. గెలుపు కోసం మిగిలిన ముగ్గురూ నేనిచ్చిన విత్తనాలను మార్చివేసి వేరే విత్తనాలు వేసి మొలిపించి, పెంచి ఇక్కడికి తెచ్చారు.

ఆదిత్యవర్మ ఒక్కడే తన ఓటమిని ధైర్యంగా అంగీకరిస్తూ నిజాయితీకి కట్టుబడ్డాడు. మిగిలిన ముగ్గురూ "మసిబూసి మారేడు కాయను" చేద్దామన్న కుతంత్రం చేశారు.

చేసే ప్రయత్నంలో ఫలితం రాకనూ పోవచ్చు. ఆశించినంత ఫలితం దక్కకుండా పోనూవచ్చు. పోరాటంలో ఘోరంగా ఓడిపోనూవచ్చు. కానీ గెలుపుకోసం అడ్డదారులు త్రొక్కరాదు. వ్యక్తిత్వం అంటే అదే. అని చెబుతూ ఓ యువకుడా! ఆదిత్యవర్మా! నీకు వారిలాగా ఆలోచన రాలేదా? వచ్చినా ఎందుకు అనుకున్నావా! వివరించు అన్నాడు.

అందుకు ఆదిత్యవర్మ రాజా మా తల్లిదండ్రులు చిన్నప్పటి నుండి ఏ విషయంలోనైనా నిజాయితీగానే ఉండాలని నేర్పించారు.

"ఓటమి ఎరుగని వ్యక్తికంటే విలువలను వదలని వ్యక్తిగా ఉండడమే మంచిదనీ" "గమ్యం కంటే గమనం ముఖ్యమనీ"" సిద్ధికంటే సాధన ముఖ్యమని" నేను విశ్వసిస్తాను అని వినయంగా సమాధానం చెప్పాడు ఆదిత్యవర్మ.

మరొక్క మారు సభంతా హర్షధ్వానాలతో మారుమ్రోగింది.

-- -- --



కాలం - పని సంస్కృతి - 12

భూగోళంపై భూమధ్య రేఖకు ఎగువ-దిగువ నున్న మనకు సమానమైన వ్యవధితో ఏర్పడుతున్న సూర్యోదయాస్తమయాలను, గ్రహాల దిశా గమనాలను బట్టి ఒక రేయి, ఒక పగలు కలసి 24 గంటల కాలాన్ని ఒక రోజుగా లెక్కించుకొనుచున్నాం.

అలాగే పదార్థ గమనాన్ని, పదార్థ పరివర్తననూ, కొన్ని సంఘటనల మధ్య గడచిన, వ్యవధినీ, ఆమోదించిన ఆలోచనల వ్యవధినీ, ఆచరణలో ఉంచిన వ్యవధినీ ఒక కాలంగా, ఒక యుగంగా, ఒక శకంగా అనుకుంటున్నాం.

ఆదిమకాలం, ప్రాచీన శిలాయుగం, లోహయుగం, స్వర్ణయుగం, కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం, శాలివాహనశకం, మధ్యయుగం, ఆధునిక యుగం, క్రీస్తుశకం, అణుయుగం, రాకెట్‌యుగం, కంప్యూటర్ యుగం అని మన సౌలభ్యం కోసం కాల నిర్ణయం చేసుకుంటున్నాం, పేర్లను పెట్టుకున్నాం.

అంతరిక్షంలో స్వర్గలోకం, బ్రహ్మలోకం, మొదలగు సూక్ష్మలోకాలు ఉన్నాయనీ, వాటి కాలాలు మన కాలం కంటే చాలా భిన్నంగా ఉంటాయనీ, భూలోకంలో కొన్ని నెలలు గడిస్తే సూక్ష్మలోక వాసులకు ఒక్కక్షణం గడచినట్లు, కొన్ని సంవత్సరాలు గడిస్తే వారికి ఒక రోజు గడిచినట్లు అనీ తపస్సంపన్నులు చెప్పారు.

కాలానికి ఆది కానీ, అంతంకానీ లేదు. ఆద్యంతాలు లేనిది కాబట్టే కాలం భగవత్ స్వరూపం. కనుక దానికి మంచి అని కానీ చెడు అని కానీ ఏ విభాగమూ లేదు.

మంచిగానీ, చెడుగానీ, ఏ విషయమైనా, ఏ సన్నివేశమైనా స్వతంత్రంగా ఏవీ ఉండవు. అండపిండ బ్రహ్మాండమంతా ఒకదానితో ఒకటి ముడిపడి ఉంది. ఈ బంధం చక్కగా, శాస్త్రీయంగా, సహేతుకంగా అర్థమైతే ఏ గందరగోళమూ ఉండదు.

కాలానికి ఒకరు ఇష్టులు మరొకరు అయిష్టులూ ఉండరు. కాలచక్రం అలా సాగిపోతూనే ఉంటుంది. కాల గమనంలో మనకు కలిగిన సుఖ-దుఃఖాలకు కాలదోషమని కాలానికి కల్మషం అంటగడుతూ ఉంటాం. కానీ, కాలం అనే దానికి కల్మషమూ, నిర్మలమూ అనేది ఏదీ ఉండదు.

మనం చేసిన కర్మల యొక్క, ఆలోచనల యొక్క ఫలం మనకు అనుకూలంగా ఉంటే మంచి కాలమనీ, అదృష్టమనీ, ప్రతికూలంగా ఉంటే చెడు కాలమనీ, దురదృష్టమనీ అంటూ ఉంటాం. ఇదంతా మనుషులయొక్క అవగాహనారాహిత్యమే.

వర్షాలు సకాలంలో కురిసి పాడి-పంటలు సమృద్ధిగా ఉంటే ఆ కాలాన్ని మంచికాలం GOOD YEAR గా చెబుతారు. వర్షాలు సకాలంలో పడక పంటలు పండకపోతే, నీరు సరిగా దొరకకపోతే ఆ కాలాన్ని కరువు కాలంగా BAD YEAR గా చెబుతారు. అందువల్ల వాతావరణానుకూలమే మంచికాలం GOOD TIME అననుకూల వాతావరణమే చెడుకాలం BAD TIME.

మనకున్న ఆరు ఋతువులలో వసంత ఋతువును ఋతురాజుగా వర్ణిస్తారు. ఎందుకంటే ఆ కాలంలో ప్రకృతి శోభాయమానంగా, పచ్చగా ఉండి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అందరి శారీరక, మానసికారోగ్యం చక్కగా ఉంటుంది. కాబట్టి ఏ విధంగా ఆలోచించినా వాతావరణానుకూలమే మనకు మంచికాలం.

వివాహాలు, గృహప్రవేశాలు, నామకరణ, జన్మదినోత్సవాలూ, ప్రయాణాలూ చల్లని వాతావరణం గల ఉదయ, సాయంకాలాలలో నిర్వహిస్తూ బంధుమిత్రాదులు అందరూ కలసి పనులను చక్కగా పూర్తి చేసి ఆనందంతో వెళ్లగలరు. అలా చేయకపోతే అయోమయానికి గురౌతారు. అందుకనే ఫలానా సమయంలో, ఫలానా ప్రదేశంలో అందరూ కలుసుకోవాలని నిర్ణయించుకున్న నిర్దిష్ట సమయాన్నే, కాలాన్నే సుముహూర్తం అన్నారు. అంతేకానీ సుముహూర్తం అనగానే దానికి ఏదో దివ్యమైన, బలమైన శక్తి ఉంటుందని అనుకోవడం అవివేకం.

వెనుకటి దినాలలో, ఆనాటి పరిస్థితులలో తీవ్రమైన ఎండ, గాలి, వాన చీకటి లాంటి అననుకూల పరిస్థితులలో ప్రయాణాలను, శుభా-శుభ కార్యాలను నిర్వహించే దానికి వీలుకాక వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని చెడుకాలం, మంచికాలం అని నిర్ణయించుకుంటూ ఉండేవారు. అది ఆ రోజులకు సరిపోతుంది. కానీ ఈనాడు శాస్త్ర-సాంకేతిక రంగాలు విపరీతంగా అభివృద్ధి చెందిన కారణంగా కరెంటు వెలుగులలో రాత్రివేళల్లో, చల్లని వాతావరణంలో అన్ని రకాల కార్యకలాపాలనూ చక్కగా నిర్వహించుకోగలుగుతున్నారు. ప్రయాణాలూ నిరాటంకంగా సాగుతున్నాయి. ఆ విధంగా కాలాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

ప్రేమికులు, స్నేహితులు, ఇష్టమైనవారు కలుసుకున్నప్పుడు ఆ క్షణాలు ఆనందదాయకంగా ఉంటాయి. యుగాలైనా క్షణాలుగా కరిగిపోతాయి. కానీ విషాద, విరహ-వేదనా భరిత పరిస్థితులు, అననుకూల వాతావరణపరిస్థితులు, ఇద్దరు శత్రువులు ఒకచోట కలసి ఉండవలసిన పరిస్థితులు కొన్ని క్షణాలే అయినా నిప్పులమీద ఉన్నట్లు, కొన్ని యుగాలుగా ఉన్నట్లు, భరింపరానివిగా అనిపిస్తాయి. కాబట్టి మనిషి అనుభవించే అనుభవాలను బట్టి, అనుభూతులనుబట్టి, మంచి లేదా చెడు కాలం అని చెప్పుకుంటూ వుంటారు.

కాలానికి మంచీ-చెడు అనునది, పవిత్రం - అపవిత్రం అనునది లేనపుడు, యమగండం, రాహుకాలం, దుర్ముహూర్తం అనేవి ఎక్కడ నుండి వచ్చాయి? మంచి ముహూర్తం అనిగానీ, చెడు ముహూర్తం అనిగానీ ఎవరు చెప్పగలరు? ఎలా చెప్పగలరు.?

కొందరు స్వార్థపరులైన మేధావులు తాము జ్ఞానులమనుకుంటూ, సోమరులై, పరులపై ఆధారపడి జీవించే దానికి అవలాటు పడ్డారు. పలానా సమయంలో పని చేస్తే కాల ప్రభావంవల్ల దోషం కలుగుతుంది, కీడు జరుగుతుంది, నష్టం-కష్టం కలుగుతుంది అని చెబితే భయపడని వారెవరుంటారు? జనులలో కలిగే భయాన్ని సొమ్ము చేసుకొనే దానికి ఆ స్వార్థ మేధావులు సృష్టించినటువంటిదే ఈ మంచి-చెడు, పవిత్రం-అపవిత్రం, అతి ప్రశస్తమైన కాలం.

* ప్రతి క్షణం విలువైనదే. కాబట్టి వృధా చేసుకోకుండా సద్వినియోగ పరచుకోవాలి.
* There is never a wrong time to do the Right Thing.

ఈ రోజు నిద్ర లేచిన వేళ మంచిది కాబట్టి పనులన్నీ సక్రమంగా జరిగాయనీ, ఈ రోజు ప్రొద్దున్నే ఎవరి మొగం చూచానో ఏమో? లేచిన వేళా విశేషం ఏంటోగానీ ఏ పనీ సక్రమంగా జరగలేదనీ అంటుంటారు.

దైనందిన జీవితంలో ఒక్కోరోజూ ఒక్కలాగా గడిచిపోతూవుంటుంది. ఒక్కోరోజు సంతోషంగానూ, ఒక్కో రోజు మధ్యరకంగానూ, ఒక్కో రోజు బాధకరంగానూ గడుస్తూ ఉంటుంది.

బాధపడినా, సంతోషించినా మనుషులు ఏదో ఒకటి చర్చించుకోకుండా ఉండలేరు. కాబట్టి అలా అంటూనే ఉంటారు. అంతేకానీ ఏ సమయంలో లేచినా, ఎవరిమొగం చూచినా, ఎటువైపు నుండి లేచినా, ఏది ఎలా ఎప్పుడు జరగవలెనో అలా జరిగి తీరుతుంది. జరుగుతూనే ఉంటుంది. కాలం యొక్క తిరుగులేని శక్తి అది.

* జీవితంలో వ్యర్థపరచే ఒక్కో క్షణం, భావి జీవితంలో ఒక్కో సమ్మెట దెబ్బ.
* కాలగమనంలో ఉన్నది కనుమరుగైపోతూ ఉంటుంది. కనుమరుగై పోయినది మరలా వస్తూనే ఉంటుంది. దానినే కాలచక్ర భ్రమణం అంటారు. మన దగ్గరికి వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని సద్వినియోగం చేసుకోవాలి. ఆలస్యం చేశావా?! "అమృతం విషమవుతుంది". అని మేధావులూ, అనుభవజ్ఞులూ నొక్కి చెబుతూ ఉంటే ఈ దుర్ముహూర్తాలు, ఈ యమ గండాలు, ఎక్కడి నుండి ఊడిపడ్డాయి?

అయితే ఈ మంచి - చెడు కాలం అనే దానివల్ల ఒక లాభం ఉంది అదేమిటంటే? చెడుకాలం సమీపిస్తుంది కాబట్టి తలపెట్టిన మంచి పనిని 'శుభస్యశీఘ్రం' అని మొదలు పెట్టే దానికీ, ఇపుడు టైం బాగోలేదు అని చెడుకార్యాన్ని, పాపపు ఆలోచనలను వాయిదా వేసేదానికి దోహదపడుతుంది.

రెండింటి కలయికను సంధి అంటారు. రాత్రి - పగలు కలిసే సమయాన్ని ప్రాతః సంధ్య అంటారు. సూర్యుడు ఆకాశ మధ్య బిందువు దగ్గరికి వస్తే ఆ సమయాన్ని మధ్యాహ్న సంధ్య అంటారు. పగలు-రాత్రి కలిస్తే దానిని సాయం సంధ్య అనీ, గోధూళీ వేళ అనీ అంటారు ఇలాగా మనకు మూడు సంధ్య వేళలు ఉన్నాయి.

సూర్యోదయం అవడానికి ముందు, నలభై ఎనిమిది నిమిషాల కాలాన్ని 'బ్రహ్మ ముహూర్తం' అంటారు. ఈ సమయం ధ్యానం, జపం, తపం చేసుకోవడానికి అత్యుత్తమ కాలం. అందుకే ఈ సమయాన్ని విద్యాస్వరూపిణి అయిన సరస్వతీదేవి పేరు మీద బ్రాహ్మీ ముహూర్తం అని కూడా అంటారు.

ప్రకృతి సిద్ధంగా సృష్టిలో పశువులు, పక్షులు, మనుషులు ఇలా సర్వప్రాణులు తెల్లవారుజామున నిద్రలేస్తాయి. బాగా విశ్రాంతి పొందినందువలన ఆ సమయంలో దేహం ఎలాంటి అలజడులు లేకుండా ఉంటుంది. మనసుకూడా ప్రశాంతంగా ఉంటుంది. అందుకే ఆ సమయంలో చదువు కోవడం, ఆరోగ్యం కోసం ఆసనాలు వేయడం, మంత్రాలను వల్లెవేయడం, ధ్యానం చేయడం, పొరుగూరికి ప్రయాణం కావడం, పొలం పనులు, పెళ్ళిళ్లులాంటి ఏ పని చేయడానికైనా ప్రశస్తమైన వాతావరణం గానూ, మంచి సమయంగానూ భావిస్తారు. అందుకే సాధకులు, కార్యదీక్షాపరులు త్వరగా అనగా రాత్రి 9 గం॥ పడుకొని తెల్లవారుజామున నాలుగు- నాలుగున్నర గంటల ప్రాంతంలో లేచి కాలకృత్యాలు తీర్చుకొని నిత్యకృత్యాలను ప్రారంభిస్తారు. మంచి ఫలితాలను పొందుతారు.

మధ్యాహ్న సంధికాలం పండ్రెండు-పండ్రెండున్నర గంటల మధ్య ఆకలి మొదలౌతుంది. అపుడు ఒకగ్లాసు మంచినీళ్ళు త్రాగితే ఆకలి కాస్తంత ఉపశమించి, చిరు ఆకలిగా ఉంటుంది. అపుడు కాసేపు మౌనంగా ఉండడం, ఇరవై నిమిషాలు ధ్యానం చేయడంలాంటివి చేస్తే ఆరోగ్యం, ఆనందం, మన స్వంతమవుతాయి.

సాయం సంధ్య 'గోధూళీవేళ' ప్రకృతిలో పశువులు, పక్షులు విశ్రాంతి కొరకు తమ తమ స్థావరాలకు చేరుకుంటూవుంటాయి. పక్షుల కిలికిలరావాలతో, సూర్యుని లేత ప్రకాశంతో ప్రకృతి ఆనందదాయకమైన వాతావరణంతో నిండి ఉంటుంది. ఆ సమయంలో చక్కగా స్నానం చేసి, ఒక చిన్న పండుముక్కను తిని, ఒక గ్లాసు మంచినీళ్లు త్రాగి, ఒక అరగంట ధ్యానం చేస్తే ఆత్మోన్నతి కలుగుతుంది. ప్రాతఃసంధ్యలో ఎలాంటి కార్యక్రమాలు చేస్తామో. అవన్నీ ఎవరికి వారు చక్కగా చేసుకొని 9 గంటలకు నిద్రపోవచ్చు.

* త్వరగా నిద్రపోయి, త్వరగా లేచి పనులు చేసుకోవడం గొప్పవారి లక్షణం.

సమయం విలువ

ఒకరోజుకు 86,400 సెకన్ల కాలాన్ని ప్రకృతి మనకు ప్రసాదించింది. కళ్లు మూసి తెరిచేలోగా క్షణకాలం గడచిపోతుంది. ఆ ఒక్కక్షణం అంత విలువైనదిగా మనకు స్ఫురించకపోవచ్చు. మహావేగంగా గడచిపోతున్న ఈ కాలాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతే మనం ఎంతో వెనక్కి నెట్టివేయబడతాం.

* ఘోరప్రమాదం నుండి వెంట్రుక వాసిలో తప్పించుకున్న వ్యక్తి - ఆ ఒక్క క్షణం విలువ చెప్పగలడు.

* అంతకుముందే వెళ్లిపోయిన బస్సును మిస్సయిపోయిన ప్రయాణికుడు - ఆ ఒక్క నిమిషం విలువ చెప్పగలడు.
* పబ్లిక్ పరీక్ష వ్రాసేదానికి అరగంట ఆలస్యంగా వెళ్లిన విద్యార్థి చెప్పగలడు ఆ అర్ధగంట విలువ ఏంటో?
* పేషెంట్‌ను ఒక గంటముందు తెచ్చిఉంటే బాగుండునని డాక్టర్ చెప్పినప్పుడు ఆ గంట విలువ ఎంతటిదో తెలిసివస్తుంది.
* మొదటి వారంలో వస్తేనే డబ్బుంటుంది. అపుడు రావయ్యా అంటే సరేనని చెప్పి, రెండవ వారంలో వస్తే ఎలా? ఇక వచ్చేనెల మొదటివారంలోనే అన్నపుడు ఆ వారం విలువ తెలిసొస్తుంది.
* ఏప్రిల్ నెలలో జరగాల్సిన పరీక్షలు, మార్చినెలలోనే జరుగుతాయన్నపుడు విద్యార్థులకు ఆ నెల రోజుల విలువ తెలిసొస్తుంది.
* ఒక సంవత్సరం విలువ ఫెయిల్ అయిన విద్యార్థి చెప్పగలడు.
* కాలం విలువ అపారమైనది. దానిని కొలవడానికి జీవితం తప్ప మన దగ్గర వేరే ఎలాంటి కొలమానాలూ లేవు.
* మనిషికి గల వందేండ్ల ఆయుర్ధాయంలో 50 సంత్సరాలు రాత్రి నిద్రలోనూ, టి.వి. చూడ్డం లోనూ, 12 1/2 సంవత్సరాల కాలం బాల్యచేష్టలతోనూ, ఆటపాటలతోనూ, 12 1/2 సంవత్సరాల కాలం వృద్ధాప్యంతో, అశక్తతతోనూ గడచిపోతూ ఉంటుంది. మిగతా 25 సంవత్సరాల కాలం వ్యాధులతోనూ, వియోగ బాధలతోనూ, ధన సంపాదనతోనూ, అనవసర చర్చలతోనూ గడచిపోతుంది. ఇక కాలాన్ని సద్వినియోగ పరచుకునేదెప్పుడు? ఎలా?
* బాల్యం నుండే సమయాన్ని సద్వినియోగపరచుకోవాలి.
* చెడు అలవాట్లకు లోనుకాకూడదు.
* సోమరితనానికి, బద్ధకానికీ లోనుకాకూడదు.
* నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం చేయకూడదు.
* Postponement is the thief of time.
* అవసరం ఏదో, అత్యవసరం ఏదో, అనవసరం ఏదో ఎరుక కలిగి, ఏ విషయానికి ఎంత ప్రాధాన్యతనివ్వాలో తెలుసుకొని చెయ్యాలి.
* దేనిని పోగుట్టుకున్నా తిరిగి సంపాదించుకోవచ్చు. కానీ కాలాన్నీ పోగొట్టుకుంటే తిరిగి సంపాదించలేమన్న సంగతి గుర్తుపెట్టుకోవాలి.
* సమయాన్ని ప్రణాళికాబద్ధం చేసుకోవాలి.
* తక్కువ సమయంలో ఎక్కువ అంశాలను నేర్చుకోవాలి.
* కాలాన్నీ, ఖర్చునీ అనుభవం ద్వారా ముందస్తు అంచనా వేసుకోవాలి.

* మధ్యలో ఎదురయ్యే అవాంతరాలను అధిగమించాలి.
* అనవసరమైన బాతాఖానీ కొడితే ఇద్దరి సమయం వృధా అవుతుందని గ్రహించాలి.
* ఎవరైనా ఎక్కువ ధనాన్ని సంపాదించవచ్చు. కానీ ఎక్కువ కాలాన్ని సంపాదించలేరు. కాబట్టి ధనంకంటే కాలమే విలువైనది.

కాలమే ఉత్తమోత్తమ అధ్యాపకుడు
ప్రకృతే ఉత్తమ పుస్తకం
దేవుడే ఉత్తమోత్తమ స్నేహితుడు
హృదయమే ఉత్తమోత్తమ ఉపదేశకుడు.
మరలా రాదు నిన్నటి దినం
రేపన్నది మనదోకాదో చెప్పలేం
నేడే నీదన్నది నిజం
వర్తమానం మాత్రమే వాస్తవం

గడియారం ఆభరణం కాదు

నియమబద్ధమైన జీవనశైలిని అనుసరించే వారికే చేతిగడియారం అవసరం. గడియారాన్ని దగ్గర ఉంచుకొనికూడా దానిని ఉపయోగించుకొనకపోతే, ఆ వ్యక్తికి జీవించే విధానం తెలియదనే చెప్పాలి.

గడియారాన్ని కేవలం ఒక హస్తాభరణంగానూ, అహంకార చిహ్నంగానూ ఉంచుకునే వారు మానసికంగా, బౌద్ధికంగా ఎదగలేదనీ, ఎంతో వెనుకబడినవారనీ అర్థం చేసుకోవాలి.

సమయనిష్ఠకూ, కార్యనిరతకూ చిహ్నమైన గడియారాన్ని ధరించికూడా దానిని ఉపయోగించక పోవడం ఒక పెద్ద అపరాధం.

పనిని వాయిదా వేయరాదు- "ఆలస్యం అమృతం విషం".

ఒక తుమ్మెద తామరపూవులతో నిండిన చెరువుకు వెళ్లింది. తామరపూవులంటే తుమ్మెదలకు మహా ఇష్టం. ఇంకేముంది. అన్ని తామర పూవులను చూచేసరికి తుమ్మెద తనువు పులకించింది. తనివితీరా మధువును గ్రోలవచ్చుననుకున్నది.

ప్రతి పూవు మీదవ్రాలుతూ పరిమళమును ఆఘ్రాణిస్తూ, మధువును గ్రోలుతూ తనను తానే మైమరచి కాలాన్నే విస్మరించింది. సూర్యుడస్తమిస్తున్నాడు. బయటకు రావలనుకుని ఉంటే బయటికి వచ్చి వుండేది. కానీ అలా చేయక పరిమళపుమైకంలో కాసేపు ఆగితే ఎలాగూ తెల్లవారుతుంది. కమలబాంధవుడు సూర్యుడు ఉదయించగానే తామరలు వికసిస్తాయి. అపుడు తాపీగా బయటకు రావచ్చు. ఇపుడు తొందరేముంది? అని సరిపుచ్చుకొని పూవులోనే ఉండిపోయింది.

మరుసటి రోజు తెల్లవారుతుండగా ఏనుగులమంద వచ్చి చెరువులో దిగి త్రాగినకాడికి నీళ్లు త్రాగి, కాళ్లతో త్రొక్కి నీటిని మట్టిని ఏకం చేశాయి. ఈ త్రొక్కిడిలో తామరపూలుకూడా బురదపాలైపోయాయి. తుమ్మెద అలా తన శ్వాసను విడిచింది.

చెయ్యవలసిన పనిని చెయ్యవలసిన సమయంలో చెయ్యకుండా రేపు చేయవచ్చులే మరునాడు చెయ్యవచ్చులే అని వాయిదా వేసుకున్నవాడు తుమ్మెదలాగానే నష్టపోతాడు.

పని సంస్కృతి

ఓ పెద్దాయన ఒక అనాధశరణాలయాన్ని కట్టించదలచుకున్నాడు. తన పర్యవేక్షణలోనే ఆ పనిని చక్కగా చేయించాలనుకున్నాడు. అందుకు సంబంధించిన సరంజామానంతటినీ ఆ స్థలానికి తెప్పించాడు. ఇక రెండు రోజులలో పని ప్రారంభింపబడుతుందనగా తుఫాను వచ్చే సూచనలు కనిపించాయి. వర్షానికి తడిస్తే పనికిరాకుండా పోయే సామాగ్రినంతటినీ వెంటనే సురక్షిత స్థలానికి చేరవేయాలి. లేకుంటే అవి పనికిరాకుండాపోతాయి. అందుకని సహాయం కోసం చుట్టుప్రక్కలా చూచాడు ఎవరైనా కనిపిస్తారా అని, సమీపంలోనే ఊరకనే కూర్చొని ఉన్న ఒక వ్యక్తి కనిపించాడు. వెంటనే అతని దగ్గరికి వెళ్ళి పరిస్థితిని వివరించి సహాయం కోరాడు వినయంగా ఆ పెద్దాయన.

పిలిచిన ఆ వ్యక్తిని ఎగాదిగా చూచి, నేను యమ్.ఎ. చదివాను తెలుసా? కూలివాడిని కాదు. బరువులు మోయడం నా వల్లకాదు అంటూ గర్వంగా సమాధానం చెప్పాడు. ఇక లాభం లేదు అనుకుని ఆ పెద్దాయనే నడుం బిగించాడు. చకాచకా సామానునంతా సురక్షిత స్థలానికి తానొక్కడే చేర్చేశాడు.

నెమ్మదిగా ఆ చదువుకున్న వ్యక్తి దగ్గరికి వచ్చి శాంతంగా చిరునవ్వుతో ఏమీ తెలియనివానివలె నాయనా! నీవు గొప్ప చదువు చదివావు: చాలా సంతోషం. మరి వర్క్ కల్చర్ అంటే ఏమిటర్థం? దయచేసి చెప్పవా? అన్నాడు. చదువుకున్న వ్యక్తి వర్క్ కల్చర్ అంటే పని సంస్కృతి అన్నాడు

పెద్దాయన :- అంటే?

చదువుకున్న వ్యక్తి :- పనిచేసే తత్వం లేదా స్వభావం.

పెద్దాయన :- అంటే ఏమిటి? అది ఎవరికి ఉండాలి? ఎందుకు ఉండాలి?

చదువుకున్న వ్యక్తి :- శ్రమించడమే జీవన సూత్రం. మనుషులకుండాలి. అది సహజం కాబట్టి మనుషులలో ఉంటుంది. ఉండాలి కూడా. కానీ మనిషి కృత్రిమంగా తానుగా కోరుకుని బద్ధకంగా, సోమరిపోతుగా, నిర్లక్ష్యంగా ఉంటున్నాడు.

పెద్దాయన :- ఈ వర్క్‌కల్చర్ పదానికి అర్థం చదువుకున్న వారికి తెలుస్తుందా? చదువుకోనివారికి తెలుస్తుందా?

చదువుకున్న వ్యక్తి :- చదువుకున్న వారికే బాగా తెలిసి ఉండాలి.

పెద్దాయన :- చాలా బాగా చెప్పావు నాయనా! హృదయపూర్వక ధన్యవాదాలు. అంటూ చిరునవ్వుతో నెమ్మదిగా, శాంతంగా నాయనా! "మూడు ఎమ్.ఎలు ఒక పి.హెచ్.డి. చేశాను. కానీ చదువుకున్నానన్న గర్వం నాకెపుడూ విజయాన్ని చేకూర్చలేదు మరి" అంటూ వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు ఉదయమే ఆ చదువుకున్న వ్యక్తి పెద్దాయన దగ్గరికి వచ్చి, "అయ్యా! మీరు నాతో మాట్లాడి వెళ్లిన తర్వాత నాలో అంతర్మథనం చెలరేగింది. నేను మీతో అలా మాట్లాడి ఉండకూడదు. చదువుకున్నప్పటికీ మూర్ఖుడిలాగా వ్యవహరించాను. క్షమించండి" అని పశ్చాత్తాపంతో అన్నాడు.

పెద్దాయన శాంతంగా, చిరునవ్వుతో నాయనా నీ మాటలకు నేనేమైనా అనుకుని బాధపడి ఉంటే కదా? క్షమించడానికి? ఆ విషయం నేనపుడే మర్చిపోయాను. అయినా నీవు ఇలా రావడం నాకు చాలా సంతోషం. సరే నీలో అంతర్మథనం చెలరేగింది అని అన్నావు కదా? మరి ఏం తెలుసుకున్నావో చెప్పు నాయనా? అని అడిగాడు వాత్సల్యాన్ని కురిపిస్తూ! ఆ పెద్దాయన.

"ఎంతటి వారికైనా గర్వం పనికిరాదని, దానివల్ల ఎవరికైనా, ఎపుడైనా, ఎక్కడైనా అవమానం జరగవచ్చుననీ, అవసరంలోనూ, ఆపదలోనూ, తోటివారికి సాయం చేయడంలోనూ వెనుకంజ వేయరాదనీ తెలుసుకున్నాను. ఈ క్షణం నుంచి మీ దగ్గరే ఉంటూ, సేవలు అందిస్తూ జీవించాలని నిర్ణయించుకున్నాను" అన్నాడు చదువుకున్న వ్యక్తి.

మొదటి ప్రయత్నమెంత ముఖ్యమైనదో - చివరి ప్రయత్నం కూడా అంతే ముఖ్యమైనది

పొలంలో ఒక పెద్దబండరాయి అడ్డంగా ఉన్నదని పగులగొట్టించదలచాడు రైతు. ఒక కూలి వాడిని పిలిపించి దానిని మధ్యాహ్నంలోగా పగలగొట్టి పూర్తిగా తొలగించమని చెప్పివెళ్ళాడు. మధ్యాహ్నం కావస్తున్నది కానీ బండరాయి ఇంకా మిగిలివుంది. అలసిన కూలివాడు చెట్టు క్రింద కూర్చున్నాడు. నీళ్ళు త్రాగి సేదతీర్చుకుంటూ, బండరాయిని చూస్తూ "మిగిలిన ఆ బండరాయిని వంద సమ్మెట పోట్లతో పగలకొట్టాలి" అని మనసులో నిర్ణయించుకున్నాడు.

సమ్మెటను బలంగా పట్టుకొని, కసిదీరా బలంగా ఒకటి, రెండు ....తొంభై తొమ్మిది, పగలలేదు. శక్తినంతా కూడగట్టుకొని ఒక్క దెబ్బవేసి వంద అన్నాడు. బండ తునాతునకలైంది. అబ్బ నూరో దెబ్బ బలంగా పడేసరికి పగిలింది. లేకుంటే పగిలేదికాదు" అని గర్వంగా తన శక్తికి తానే మురిసిపోయాడు.

నిజంగా కూలివాడు గర్వపడినట్లు నూరోదెబ్బకే పగిలినదా? అలాగా అనుకొని తృప్తి చెందాడు అంతే. వాస్తవానికి మొదటి సమ్మెట పోటు పడకుండానే, దాని ప్రభావం ఏమీ లేకుండానే నూరవపోటుకు మాత్రమే పగిలిందా అది. కానేకాదు. నూరవ సమ్మెట పోటు కెంత ప్రాధాన్యతుందో, మొదటి దెబ్బకూ అంతే ప్రాధాన్యముంది. అన్ని దెబ్బలకూ కొంత కొంత బలహీనపడిన రాయి నూరవపోటుకు పగిలింది, అంతే కానీ బలమైన నూరవదెబ్బకు మాత్రమే పగిలింది అనుకోవడం కూలివాని మూర్ఖత్వం.

కొంతమంది తాము ఘనమైన పనులను మాత్రమే చేస్తాం, చిన్న పనులెవరు చేస్తారు? మేం చెయ్యం, చిన్న పనులు చేస్తే మా పరువేంకాను? చూచేవారేమను కుంటారు? అని పెద్ద పనుల కోసం వేచి చూస్తుంటారు.

* చిన్నపనులు చేయలేని వాడు పెద్దపనులు చేయనేలేడు.
* చిన్న పనులు చేస్తూపోతే పెద్దపనులు వాటంతటవే దగ్గరికి వస్తాయి.
* ఈ రోజులలో తెలివి తేటలున్న వాడికి శీలం లేదు. శీలం ఉన్నవాడికి తెలివితేటలు లేవు. నాలెడ్జి అలర్జీగా పనిచేస్తున్నది.

గొప్ప కార్యాలన్నీ చిన్న ఆలోచనలతోనే సాధింపబడతాయి.

ఒక రాజు తనమంత్రి అపరాధం చేసాడని శిక్షగా, ఎత్తైన ఒక గోపుర శిఖరాగ్రంపైన మంత్రిని వదలి రండని భటులను ఆజ్ఞాపించాడు. భటులు అలాగే చేశారు. గోపురశిఖరాగ్రం నుంచి క్రిందికి దిగిరావాలని శత విధాలా ప్రయత్నించి విఫలమై, నిరుత్సాహపడి ఇక మరణమే శరణ్యమని తీర్మానించుకున్నాడు మంత్రి.

విషయం తెలుసుకొన్న మంత్రి భార్య అన్యాయాన్ని సహించలేక తన భర్తను ఎలాగైనా రక్షించుకోవాలని సాహసించింది. నిర్మానుష్యమైన ఆ గోపురం వద్దకు వెళ్లి ఏ విధంగా నిన్ను రక్షించగలనో ఉపాయం చెప్పగలవా? అని బిగ్గరగా అరచి అడిగింది.

భర్త చెప్పినట్లుగా పొడవైన ఒక పగ్గమును, దృఢమైన ఒక తాడును, సన్నని గట్టి దారమును, ఒక పెద్ద పేడ పురుగును, రవ్వంత తేనెను తీసుకొని గోపురం వద్దకు వచ్చి నిలబడింది. భర్త చెప్పిన విధంగా మంత్రి భార్య పేడ పురుగుకు దారం కట్టి, కొమ్ములకు తేనెను పూసి, గోపురం వైపుకు ముఖం ఉండునట్లుగా పేడ పురుగును వదిలింది. ఆ పురుగు తేనెవాసనను చూసుకుంటూ గోపుర శిఖరాన్ని చేరింది. మంత్రి దారాన్ని చుట్టుకొని, పేడ పురుగును పెరికి పారవేసి, ఆ దారముతో తాడును అందుకొని, ఆ తాడుతో పగ్గమును అందుకొని, పగ్గమును శిఖరానికి గట్టిగా కట్టి, దానిని పట్టుకొని క్రమంగా క్రిందికి దిగి ప్రాణాలను కాపాడుకోగలిగాడు. భార్య సాహసానికి భర్త గర్వపడినాడు.

చిన్న పనులు, పెద్ద పనులు అని రెండు రకాల పనులు లేవు. చూసే దానిని బట్టి పెద్దవిగాను చిన్నవిగానూ కనిపిస్తాయి.

* ప్రతి ఘనమైనపని చిన్న ప్రారంభంతోనే మొదలవుతుందని అందరూ తెలుసుకోవాలి.

చిన్న పనుల మహాత్యం

ఒక రాజు ఒక దేవతా విగ్రహాన్ని తయారు చేయించాలని తలచాడు. వెంటనే ఒక శిల్పిని రప్పించి తన మనోభావాలకనుగుణంగా శిల్పాన్ని తయారు చేయమని నెలరోజుల గడువును ఇచ్చాడు.

ఒక వారం రోజులు గడిచాక, ఆ దేవతామూర్తి నిర్మాణ కార్యాన్ని చూచేటందుకు రాజు వచ్చాడు. పనులు చక్కగా జరుగుతున్నాయా? వసతి బాగావుందా? అని విచారించాడు. ఇక మూడు వారాలే గడువుంది. అని జ్ఞాపకం చేసి వెళ్ళాడు.

మరొక వారం రోజులు గడిచాక ఆ దేవతామూర్తి ఎంతవరకు తయారయ్యిందో? ఎలా ఉందో? చూచేటందుకు వచ్చాడు రాజు. మొదట వచ్చి చూచి వెళ్ళిన తరువాత జరిగిన పనుల వైనం ఇలా వివరించాడు శిల్పి. "ఆ భాగాన్ని కొంత సవరించాను. చేతివ్రేళ్ళను ఇలా త్రిప్పాను, చేతులను కాస్త బలంగా చూపాను. కనులలో తేజస్సును నింపాను, ఉదర భాగం కాస్త సన్నగా కనబడుటకు కొంత చెక్కటం జరిగింది". ప్రభూ అని చెప్పాడు.

కానీ ఇంకా పనిలో అనుకున్నంత అభివృద్ధి జరగలేదన్న భావంతో, సగం రోజులలో అతి సామాన్యమైన ఇంత చిన్న పనులను మాత్రమే చేశారా? అని ప్రశ్నించాడు రాజు. శిల్పి రాజు వేసిన ప్రశ్నలకు చిరునవ్వుతో మహారాజా సామాన్యమైన ఈ చిన్న పనుల వలననే విగ్రహానికి పూర్ణత్వం లభిస్తుంది. పరిపూర్ణతరావటం అనేది ఒక్కసారిగా రాదు. అంత సులభం కాదు అని వినయంగా చెప్పాడు శిల్పి.

మొదట మానవ ప్రయత్నం - అటుపైనే దైవ సహకారం

గురుశిష్యులు ఇద్దరూ తీర్థయాత్రలకై బయలుదేరారు. ఊరిలోని సత్రాలలో బసచేస్తూ ప్రయాణిస్తున్నారు. ఒక రోజు ప్రయాణమై బయలుదేరుతుండగా ఒక తీతువు పక్షి అరుస్తూ వీరి దారికి అడ్డంగా వెళ్లింది. గురువుగారు దానిని అపశకునంగా భావించి శిష్యునితో "నేటికి ప్రయాణమును నిలిపివేసి మరునాడు ఉదయమే బయలు దేరదాము" అన్నాడు.

శిష్యునికి మాత్రం శకునాల మీద ఏమాత్రం నమ్మకంలేదు. కాబట్టి ప్రయాణము సాగించుటే కర్తవ్యమని తన అభిప్రాయమును విన్నవించుకున్నాడు. గురువుగారు వినలేదు. సమీప పట్టణములోని సత్రములో కలుసుకోవాలనే ఒడంబడికతో, శిష్యుడు ప్రయాణమై పోయాడు. గురువుగారు మాత్రం అక్కడ ఆగిపోయాడు. శిష్యుడు సాయంకాలానికి పట్టణం చేరుకున్నాడు.

పట్టణంలో అతనినెవరూ ఆదరించలేదు. మరుసటి రోజు వరకు నిరాహారిగానే ఉన్నాడు. ఏమైనా లభించగలదని పట్టణమంతా కలియదిరిగాడు. లాభంలేకపోయింది. చీకటి పడేవేళకు ఆకలి బాధకు తాళలేక సమీపంలోని భవనంలోకి వెళ్లాడు. ఆ సమయంలో ఎవరూ అతనిని అడ్డగించుటకు మనుషులు లేకపోయ్యారు. దైవ నిర్ణయం

ఎలా ఉంటే అలాకాక తప్పదని లోనికి వెళ్లి అక్కడున్న మధుర పదార్థములను ఆవురావురుమని ఆరగించసాగాడు. అదే సమయంలో రాకుమారి ప్రవేశించి అతడిని చూచి ఎవరో రాజకుమారుడే అయిఉంటాడని భ్రమించి మిక్కిలి గౌరవించింది. శిష్యుడు కూడా తన పాండిత్యముతో, సరససల్లాపములతో, మధుర భాషణములతో రాజకుమారిని ఆ రేయంతా మురిపించి, కరిగించి, మైమరపించి, పరవశింపజేశాడు. తెల్లవారితే గుట్టురట్టవుతుంది, తన బ్రతుకు తెల్లవారిపోతుందని భయపడి తెల్లవారకముందే బయటకు జారుకున్నాడు.

తెల్లవారాకగానీ తెలియరాలేదు. తను రాత్రి గడిపినది రాజకుమారితోనని, సరే ఎల్లాగైతే అలాకానీ అని సత్రం వద్దకు చేరుకొని గురువును కలుసుకోవాలనుకున్నాడు. కానీ సత్రం వద్దకు గురువుగారు ఎందుకనో ఇంకా రాలేదు. రాజకుమారి ద్వారా విషయాన్ని తెలుసుకొని, క్రిందటి రాత్రి నగరమునకు వచ్చిన క్రొత్త వారినందరినీ తన సమక్షమున హాజరు పరచవలసిందిగా రాజుగారు ఆజ్ఞాపించారు. ఎంచక్కా భటులకు శిష్యుడు దొరికిపోయాడు.

సభలో శిష్యుణ్ణి చూచి రాకుమారి పులకించి తండ్రి చెవిలో గుసగుసలాడింది. రాజు శిష్యుణ్ణి అల్లునిగా స్వీకరించాడు. రాజు, అల్లుడు సింహాసనా రూఢులై ఉండగా... గురువు శిష్యుని జాడ తెలియలేదని ఫిర్యాదు చేయుటకు వచ్చాడు. వెంటనే "నేనేస్వామి మీ శిష్యుడను" అని గురువు పాదాలకు నమస్కరించాడు. శకున ప్రభావం శిష్యునిపై పడనందుకు సంతోషించాడు గురువు.

సమయం మంచిదికాదని, శకునం మంచిదికాదని అంటుంటారు. భూమిపై మనమొక్కరమేకాదు నివసిస్తున్నది. ఎందరో మనుషులు, ఎన్నో జీవజంతువులు మనలాగే జీవిస్తూ ఉంటాయి. అవి మనకు ఎదురుపడినట్లే మనమూ వాటికి ఎదురు పడుతూ ఉంటాము. తప్పదు. నీవెంతో అదీ అంతే.. నీవు కనబడగానే మంచి శకునం కాదని వెనక్కి తిరిగి వెళితే ఎలా ఉంటుంది? నీ శకునం మంచిది కాదంటే నీవు సమ్మతించెదవా?

గొప్పవారెపుడూ కర్తవ్య పరాయణులుగా ముందుకు దూసుకెళతారే గానీ సాటి మనుషులను, ప్రాణులను చిన్న చూపు చూడరు. అవమానించరు. అలా బజారుకెళ్లి చూడు. చెడుకాలమని నీవనుకున్న సమయంలో ఎంతో మంది తమతమ పనులలో ఎలా నిమగ్నమైపోయి ఉంటారో. చెడుకాల ప్రభావమే ఉంటే, దుర్ముహూర్తంలో ఎవరూ బైట తిరగకుండా ఎవరిళ్లలో వారు అలా ఉండి పోవాలి. అంతే, మరి అలా జరగడం లేదు కదా? కాబట్టి దైవనిర్ణయం ఎలా ఉంటుందో అలా జరిగి తీరుతుంది. అంతే కాని మరోలా ఎన్నడూ జరగదు. ఫలానా సమయం దుర్ముహూర్తమనీ, యమగండమనీ అంటూ ఉంటారు. అలాగంటే కాలపురుషుడిని అవమానించినట్లే, జీవితంలో ప్రతి నిమిషం అత్యంత విలువైనదే. భూమ్మీద ప్రతి నిమిషం కొన్ని వేల జీవరాశులు పుడుతూ ఉంటాయి. గతిస్తూ ఉంటాయి.

కాలము, సర్వావస్థలయందూ కాలంగానే ఉంటుంది. నీ అనుకూలమును బట్టి మంచిగా కానీ, చెడుగా కానీ స్వీకరిస్తావు. ఉదాహరణకు మిట్ట మధ్యాహ్నం, ప్రొద్దుగ్రుంకిన తర్వాత పెళ్లిముహూర్తాలు తదితర శుభకార్యాలు జరపబడవు. కారణం వాతావరణం అనుకూలించదు కనుక, ఆ సమయంలో జరుగవలసిన కార్యక్రమాలు కొన్ని జరుగుతూనే ఉంటాయి. అలాగే వర్షం పడే సమయాలు కార్యాలకు అనుకూలించవు కాబట్టే అనువుకాని సమయాలు అంటారు. అంతే తప్ప చెడు సమయం అని కాలమును తప్పుపట్టనేకూడదు. తప్పని పరిస్థితులు ఎదురైతే మంచి, చెడు, కాలాలను గమనిస్తామా? విద్యకు, వైద్యానికి ముహూర్తాలు చూడరాదని అంటారు. ఎందువలన? అవి అతి ముఖ్యమైన పనులు కాబట్టి, వాటికే పాటింపు అవసరం లేనపుడు మిగిలిన విషయాలలో ఎందుకు ఈ పట్టింపు? కొన్ని కోట్ల జీవరాశులున్న ఈ భూమి మీద ఎన్నో వింతలు, చిత్ర, విచిత్ర సంఘటనలు జరుగుతూనే ఉంటాయి. మనిషి ఊరక ఉండలేక ఏదో ఒకటి వాగుతూ ఉండాలికాబట్టి, చెడుకాలంలో చేశాడనో, చెడుశకునం ఎదురైందనో అంటూనే ఉంటాడు. తను ఎదురుగా వెళ్లినపుడు ఏదైనా జరగరానిది జరిగితే శకునం వల్లే జరిగింది అంటే దానికి సమ్మతిస్తాడా? సమ్మతించదు. అలాగే కాలం కూడా ప్రతిక్షణం విలువైనపుడు, చెడు క్షణాలను వేరు చెయ్యగలరా? ప్రతిక్షణం నిత్యనూతనం అయినపుడు దుర్ముహూర్తమును నిర్ణయించగలరా? ప్రతిక్షణం నీ కొరకే, నీ ప్రయోజనం కొరకే ఎన్నో పుడుతూ ఉంటాయి. అలాగే నీవు కూడా పుట్టావు. నీవు ఎలా చెడ్డ వాడివి కాదో అన్నీ అంతే, అందరూ అంతే. కాబట్టి ఓ మనిషీ! ప్రతిక్షణం కర్తవ్య నిష్ఠ, కర్మ నిష్ఠలోనే ఉండు. మన ముందున్న పనిని చేయబూనడం మన ప్రధాన కర్తవ్యం. అంతేగానీ ఎక్కడో దూరంగా కనిపించని వాటికై ప్రాకులాడటం అవివేకం. ఏదో జరగాలని ఎదురుచూస్తూ కూర్చుంటే జీవితం నిరర్థకమవుతుంది. ఏది చేయాలో నిర్ణయించుకొని ముందుకు సాగితే జీవితం సార్థకమౌతుంది.

పనిని అనుసరించే ఫలితం ఉంటుంది.

మామిడి పండ్లు కావాలనుకుంటే మామిడిచెట్టునే నాటాలి. మల్లెపూలు కావాలనుకుంటే మల్లెచెట్టునే నాటాలి. విషం కావాలనుకుంటే ఉమ్మెత్తనే నాటాలి. పరిమళం కావాలనుకుంటే గంధం చెట్టునే నాటాలి. నీకు సుఖం కావాలనుకుంటే ఇతరుల సుఖమునే కోరుకోవాలి. నీకు శ్రేయస్సు కావాలనుకుంటే ఇతరుల శ్రేయస్సునే కోరాలి. నీకు మంచి జరగాలని కోరుకుంటే ఇతరులకుకూడా మంచిని మాత్రమే చేయాలి. నీకు గౌవరం కావాలనుకుంటే ఎదుటి వారిని గౌరవించే తీరాలి. నీకు చెడు జరగాలనుకుంటే ఇతరులకుకూడా చెడును మాత్రమే చేస్తావు.

* పువ్వులను కలిపే దారంలాగా ఉండాలి. గుచ్చే సూదిలాగా ఉండకూడదు.

సృష్టిలోని సమస్త జీవుల గమనా-గమనాలు ఆది నుంచీ సాగివస్తున్న సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మల ప్రభావాన్నిబట్టి సాగుతున్నాయి. ఎవరు చేసుకున్న కర్మలను బట్టి వారి జననమరణాలు, మంచి- చెడులు, జ్ఞాన - అజ్ఞానాలు సంభవిస్తూఉంటాయి. కాబట్టి ఎవరి జీవితాలకు వారి ఆలోచనలూ, కర్మలే కారణాలు. చేసిన కర్మలకు తగిన ఫలితాలు తప్పక అనుభవించి తీరవలసిందే.

* ఒక్కో జన్మలో చేసిన కర్మలకు సంబంధించిన ఫలితాలను అనుభవించడానికి అనేక జన్మలు ఎత్తవలసివస్తుంది. చేసిన కర్మల ఫలితాలను అనుభవించి పరిసమాప్తం చేసుకోకపోతే కర్మలు క్షయంగాక, కర్మల రాశి పెరుగుతూపోతూనే ఉంటుంది.

సరైన సమయంలో స్పందిస్తేనే తృప్తి, సంతోషం, సార్థకత లభిస్తుంది.

కొన్ని పనులను వెంటనే చేసేయాలి. అందుకు కాస్తంత హృదయ స్పందన, సమయస్ఫూర్తి, చొరవ ఉండాలి.

శుభాకాంక్షలు, అభినందనలు చెప్పవలసిన సందర్భాలు కొన్ని ఉన్నాయి. పరీక్షలో ఉత్తీర్ణత సాధించినపుడు, ఉద్యోగం సంపాదించినపుడు, పదోన్నతి పొందినపుడు, మరేదైనా విజయం సాధించినపుడు, ఆటలో గెలిచినపుడు వారి ఆత్మీయులుగా, స్నేహితులుగా, శ్రేయోభిలాషులుగా, పరిచయస్తులుగా వారికి శుభాకాంక్షలను, అభినందలను తెలియజేయడం మన కనీస బాధ్యత, ధర్మం.

ఇలాంటి బాధ్యతను వెంటనే ఆలస్యం లేకుండా చేసేయాలి. అలా చేసినపుడు శుభాకాంక్షలను అందుకునే వ్యక్తికీ ఆనందంగా ఉంటుంది. అభినందనలు అందించిన వ్యక్తికీ ప్రతిస్పందన తృప్తికరంగా ఉంటుంది. ఒకవేళ అందుబాటులో లేకుండా దూరంగా ఉంటే ఫోన్ ద్వారా మాట్లాడ్డం కానీ, ఎస్.ఎం.ఎస్ ద్వారా గానీ గ్రీటింగ్స్ చెప్పి, అటుపై వీలున్నంత త్వరలో వ్యక్తిగతంగా కలుసుకుని మన శ్రేయోతత్వాన్ని తెలియజేయవచ్చు. కానీ అలా చేయకుండా ఆలస్యంగా ఏ వారానికో, పది రోజులకో, తీరుబాటుగా తెలియజేస్తే, అవి స్వీకరించే వ్యక్తికి సందర్భోచిత ఆనందాన్నివ్వదు. ఏదో మొక్కుబడిగా చెప్పాలి గనుక చెప్పినట్లుగా ఉంటుంది.

అందుకే ఓ పని చేయాలన్నా, ఓమాట చెప్పాలన్నా, ఆనందం పంచుకోవాలన్నా కాలహరణం చెయ్యకుండా, కాలదోషం పట్టనివ్వకుండా స్పందిస్తే అందంగానూ ఉంటుంది. ఆనందంగానూ ఉంటుంది.'ఆలస్యం అమృతం విషం' అనే సూక్తి ఇలాంటి సందర్భాలకే వర్తిస్తుంది. అలాగే బంధువులు, ఆత్మీయులు రక్తసంబంధీకులు కాలం చేసినపుడు కష్టనష్టాలకు, బాధలకు గురైనపుడు కూడా సరైన సమయంలో వెంటనే స్పందించి, ఓదార్చడం, ధైర్యం చెప్పడం, సహాయ సహకారాలందించడం లాంటి

పనులు చేసినట్లయితే మానవ సంబంధాలు నిలకడగా ఉంటాయి. అలా చేయకపోతే 'చేసి ఉంటే బాగుండేది' అనే బాధకు గురికావలసివస్తుంది. మానసికంగా నలిగి పోవలసివస్తుంది.

పనిమీద గౌరవం ఉండాలి

పేరంపల్లిలోని గ్రామస్తులంతా చందాలు వేసుకొని క్రొత్తగా సాయిబాబా దేవాలయాన్ని కట్టుకున్నారు. గుడిలో పూజాదికాలు చేయడానికి విశ్వసనీయుడైన పూజారి కావాలి. అందుకు ఆలయ నిర్వహణ కార్యకర్తలు పూజారి కోసం వెదకడం ప్రారంభించారు. తెలిసిన గ్రామాలన్నీ తిరగ్గా చివరకు నడిమికంద్రిక అనే గ్రామంలో సీతారామశాస్త్రి, విశ్వనాధశర్మ అనే పూజారులు దొరికారు. అయితే ఆలయంలోకి ఒక పూజారి మాత్రమే అవసరం. అందులోనూ నమ్మకస్తుడైన పూజారి కావాలి. ఇరువురిలో ఎవరు నమ్మకస్తుడో తెలుసుకోవాలి. ఎలా? సరే ఇద్దరినీ తమతోపాటు పేరంపల్లికి తీసుకెళ్ళి అక్కడ అందరూ కూర్చొని చర్చించుకొని, ఒక నిర్ణయానికి వస్తే బాగుంటుంది అనుకొని బయల్దేరారు. పేరంపల్లి గ్రామం చేరే సరికి బాగా పొద్దుపోయింది. ఆ రాత్రి వారికి బస ఏర్పాటు చేసి, తెల్లవారాక ఆలయ కమిటీ అధ్యక్షులైన రామచంద్రయ్య గారిని కులుసు కుందామని చెప్పారు.

అనుకున్నట్లుగా మరుసటి రోజు కాలకృత్యాలను తీర్చుకొని రామచంద్రయ్య గారింటికి ఇద్దరు పూజారులనూ వెంట బెట్టుకొని వెళ్లారు. అధ్యక్షులు రామచంద్రయ్య గారు పూజారులను లోనికి ఆహ్వానించి తగు మర్యాదలు చేసారు.

మొదట సీతారామశాస్త్రిని రామచంద్రయ్యగారు ప్రత్యేకంగా ఒక గదిలోకి తీసుకెళ్ళి వివరాలన్నీ అడిగాక అసలు విషయం ప్రస్తావిస్తూ - రాత్రి తనకు కలలో సాయిబాబా కనిపించి, "నాకు సేవలు చేయడానికి ఇద్దరు పూజారులు వస్తున్నారు. అందులో నాకు నచ్చిన పూజారి విశ్వనాధశర్మ కాబట్టి ఆయననే ఆలయపూజారిగా నియమించండి" అని చెప్పాడు. కానీ నాకు అతడిలో అలాంటి లక్షణాలు ఒక్కటి కూడా కనిపించడం లేదు. నేను కోరుకున్న లక్షణాలన్నీ నీలోనే కనబడుతున్నాయి. ఏంచేస్తే బాగుంటుంది? అంటూ సలహా అడిగాడు రామచంద్రయ్య.

"ఆ సాయిబాబావారు చెప్పిందే నిజం. అలా నడచుకోవడమే మన కర్తవ్యం. ఆయన కోరిక ప్రకారమే విశ్వనాధశర్మనే నియమించండి. నేను వేరే పని చూచుకుంటాను". అని వినయంగా అక్కడినుంచి బయటకు వచ్చేశాడు సీతారామశాస్త్రి.

తర్వాత విశ్వనాధశర్మకు పిలుపు వచ్చింది. గదిలోకి వెళ్ళిన విశ్వనాధశర్మకు కూడా తన కల గురించి వివరిస్తూ "సాయిబాబావారు తనకు పూజలు చేయడానికి వచ్చే ఇరువురిలో సీతారామశాస్త్రి నాకు పూజలు చేయడానికి తగినవాడు" అని చెప్పారు. కానీ అతడిలో ఒక్క మంచి లక్షణంకూడా నాకు కనిపించలేదు. ఏం చేద్దాం? అని

ప్రశ్నించాడు. దానికి విశ్వనాథ శర్మ పకపకా నవ్వుతూ "సాయిబాబావారు కలలో కనిపించడమేమిటీ? మీతో మాట్లాడటమేమిటీ? ఈ రోజుల్లోకూడా మీరు ఇంకా ఇలాంటివి నమ్ముతున్నారా? అసలు దేవుడెక్కడున్నాడండీ మాట్లాడ్డానికి? ఏదో బ్రతుకుదెరువు కోసం గుడిలో పూజలు చేస్తాం. అంతేకానీ నిజంగా దేవుడు లేడండీ". అవన్నీ వదిలేయండి, సీతారామశాస్త్రిగారిలో మీకు నమ్మకం లేదు. నామీద ఉందికదా? ఇక ఆ ప్రస్తావన వదిలేసి నన్ను పూజారిగా నియమించుకోండి సరిపోతుంది" అన్నాడు.

రామచంద్రయ్య విశ్వనాథశర్మ మాటలకు ఆశ్చర్యపడుతూ... "అవును నీవన్నది నిజం. దేవుడూ లేడు, నీ దృష్టిలో పూజలూ లేవు. బ్రతుకుదెరువు తప్ప". అని దెప్పి పొడుస్తూ.... నీవు చేసే పనిమీదే నీకు నమ్మకం లేనపుడు, గౌరవం లేనపుడు ఆ పనిని ఎలా చేయగలవ్? నీవు ఈ పూజారి పనికే కాదు, ఏ పనికైనా అనర్హుడివే! నీలోని సమర్థతను తెలుసుకోవడానికే ఈ కథను చెప్పాను. ఇక నీవు వెళ్లవచ్చు అన్నాడు. ఆ తర్వాత వెంటనే సీతారామశాస్త్రిని పిలిపించి దేవాలయ పూజారిగా నియమించుకున్నారు.

పట్టు పట్టరాదు, పట్టి విడువరాదు

అవంతీ రాజ్యాన్నేలే శూరసేనుడి ఒక్కగానొక్క కుమార్తె చంద్రముఖి అద్భుత సౌందర్యరాశి. ఆమెను వివాహమాడినవాడే రాజ్యాధికారి. కాబట్టి అన్ని విధాలా యోగ్యుడైన రాకుమారుడిని ఎంపిక చేసుకోవాలని శూరసేన మహారాజు నిర్ణయించాడు.

స్వయంవరాన్ని ఏర్పాటు చేసి దేశదేశాల రాకుమారులకు ఆహ్వానాన్ని పంపించాడు. బుద్ధికుశలత, భుజబలం, తేటతెల్లమయ్యేలా పెట్టిన రకరకాల పోటీ పరీక్షలలో చివరికి ముగ్గురు రాకుమారులు సమవుజ్జీలుగా నిలిచారు. ముగ్గురూ అవంతి రాజ్యమిత్రదేశాలకు చెందివారే. సరైన కారణం లేకుండా వారిలో ఏ ఒక్కరిని ఎంపిక చేసుకున్నా-మిగతా రెండు రాజ్యాలతోనూ వైరం తెచ్చుకున్నట్లే. శూరసేన మహారాజుకు ఏంచేయాలో దిక్కుతోచలేదు.

"మహారాజా తెలివితేటలూ, భుజబలం, కత్తిసాములతోపాటు వ్యక్తిత్వంకూడా అతి ముఖ్యమైనది. కాబట్టి అది ఎవరికుందో తెలుసుకునేలా ఒక పరీక్షను ఏర్పాటు చేస్తాం" అన్నాడు మహామంత్రి. అందుకు సమ్మతించాడు మహారాజు.

సమవుజ్జీలుగా నిలిచిన రాజకుమారులు శ్రీనాథవర్మ, విష్ణువర్ధనుడు, ఇంద్రసేనుడు ముగ్గురినీ పిలిపించి, మా పూర్వీకులకు వారసత్వంగా లభించిన స్వర్ణకమలం మూడుతరాలనాడు అదృశ్యమైంది. నల్లమలారణ్యంలోని ఓ గుహలో అది ఉన్నట్లు సమాచారం అందింది. కానీ ఎవరూ దానిని తేలేకపోయారు. మీలో ఎవరు దాన్ని సాధించి తేగలరో వారే స్వయంవరంలో గెలిచినట్లు అని అన్నాడు శూరసేన మహారాజు.

ముగ్గురు రాజకుమారులూ అందుకు సమ్మతించి వెంటనే బయల్దేరి వెళ్లారు. వారిలో శ్రీనాధవర్మ మూడు రోజులు ప్రయాణించి అలసిపోయిన కారణంగా ఓ చెట్టునీడలో తన గుర్రాన్ని కట్టేసి, తానూ ఒక ప్రక్కన నిద్రకుపక్రమించాడు. అంతలో ఏదో శబ్దం వినపడగా కళ్లుతెరచి చూచాడు. అతనికి ఓ అతిలోక సౌందర్యవతి కనిపించింది. ఆమెను ఆశ్చర్యంగా చూస్తూ 'ఎవరు నువ్వు'? అని ప్రశ్నించాడు.

"నేనొక గంధర్వ కన్యను. వనవిహారానికి ఇలా వచ్చాను" అని. శ్రీనాధవర్మ వివరాలను అడిగి తెలుసుకున్నాక, ఆమె "ఓ సామాన్య రాకుమారి కోసం, ఇంత సాహసం చేయాలా? అంటూ పకపకా నవ్వింది. "నిద్రలో ఉన్న నిన్ను గమనించాను. నీ అందచందాలు నాకు నచ్చాయి. నిన్ను ఇష్టపడుతున్నాను. నన్ను వివాహం చేసుకుంటే నీవు ఊహించనంత సిరిసంపదలకు వారసుణ్ణి చేస్తాను. అంగీకారమైతే వచ్చే పౌర్ణమినాడు ఇక్కడికే వచ్చి నన్ను కలుసుకో" అని చెప్పి క్షణంలో చెట్లచాటుకు వెళ్లిపోయింది. ఆ రూపవతి చెప్పిన మాటలలో అర్థం ఉంది కదా? ఎన్నో ప్రయాసలకు లోనై కూడా ఒక అందమైన రాకుమారినే కదా దక్కించుకోబోయేది. కాబట్టి అనాయాసంగా, అందాల రాశితో పాటు అంతులేని సిరిసంపదలు కూడా వచ్చి ఒడిలో వాలేటపుడు ఎందుకు కాదనాలి? అని ఆలోచించుకొని వెంటనే గుర్రాన్ని వెనక్కి మళ్లించి తన రాజ్యానికి వెళ్లిపోయాడు. మరలా వచ్చే పున్నమి నాటికి ఆ అందాల రాశిని కలుసుకునేటందుకు.

రెండో రాకుమారుడైన విష్ణువర్ధనుడు నాలుగు రోజులపాటు ప్రయాణించి గుహను కనుగొన్నాడు. అడ్డంగా ఉన్న బండలను, ముళ్లపొదలను తొలగించాడు. మార్గాన్ని సుగమం చేసుకున్నాడు. ఇంతలో పొడవాటి గడ్డం ఉన్న ఓ వ్యక్తి చేతిలో దివిటీని ఒకదానిని పట్టుకొని అటువైపుగా వచ్చి విష్ణువర్ధనుడి వివరాలు అడిగి తెలుసుకొని పెద్దగా నవ్వుతూ "చూస్తే నీకు మతిపోయినట్లుగా ఉంది. లేకపోతే ఒక రాకుమారి కోసం ఇంత దూరం వచ్చి ప్రాణాలు పోగొట్టుకుంటావా? ఇదిగో ఇటువైపు చూడు" అన్నాడు. ఎముకలు, పుర్రెలు, గుట్టలుగా పడి వుండడం విష్ణువర్ధనుడికి కనిపించింది. ఇక్కడికి వచ్చిన వారెవరూ ప్రాణాలతో తిరిగి వెళ్లలేదు. అందుకు ఈ ఎముకల గుట్టలే సాక్ష్యం అంటూ కనుమరుగైపోయాడు. విష్ణువర్ధనుడు ఒకచోట ప్రశాంతంగా కూర్చొని ఆలోచించి, గుహలో ఎవరో బలమైన రాక్షసుడే ఉండవచ్చు. వాడితో ఒంటరిపోరు చేసి గెలవడం కష్టం. గుహలో వానిదగ్గర ఏమేమి ఆయుధాలున్నాయో తెలియదు. మూర్ఖంగా పోరాడి తన ఎముకలు కూడా ఆ ఎముకల గుట్టలో కలిసిపోకుండా వెనుదిరిగి వెళ్ళి ప్రాణాలను కాపాడుకోవడమే మంచిది అనుకుంటూ తిరుగు ప్రయాణం సాగించాడు.

మూడో రాకుమారుడైన ఇంద్రసేనుడు దారిలో ఉండగా గంధర్వకన్య కనిపించింది. శ్రీనాధవర్మకు చెప్పినట్లుగానే ఆమె "తనను పెళ్లి చేసుకొని అంతులేని భోగభాగ్యాలకూ, రాజ్యానికి రాజువి కమ్మని కోరింది"."అందానికి అంతం లేదు. ఆశకు హద్దులేదు" ఒక లక్ష్యం కోసం కంకణ బద్ధుడనైన నేను, ప్రయత్నం సఫలమో విఫలమో కాకముందే వ్యామోహాలకు లోనై ప్రక్కదారి పట్టలేను" అంటూ వినయంగా చెప్పి ముందుగా సాగిపోయాడు.

గుహవద్దకు వెళ్లేసరికి గడ్డం మనిషి ఎదురుగా వచ్చి, ఇంతకు ముందు మాదిరిగానే హెచ్చరించాడు. అందుకు ఇంద్రసేనుడు "ఏదైనా ఒక పనిని ప్రారంభించే ముందు అన్నివిధాలా ఆలోచించాలి. మధ్యలో వచ్చే కష్టాలకు భయపడి వెనుదిరిగి వెళ్లడం నాబోటి వీరులకు శోభించదు. "పట్టుపట్టరాదు, పట్టి విడువరాదు" అన్న పెద్దలమాటలను మీరు వినలేదా? నా శక్తి-యుక్తులపై నాకు విశ్వాసం ఉంది. ఇక మీదారిన మీరు వెళితే నా ప్రయత్నంలో నేనుంటాను" అంటూ వెనుదిరిగి చూడకుండా గుహలోకి వెళ్లాడు. గుహలోనికి వెళ్లాక అక్కడ ఒక వ్యక్తి "రాకుమారా! విజయం నీదే" అంటూ స్వర్ణకమలాన్ని అందించాడు.

స్వర్ణకమలంతో తిరిగి వచ్చాక ఇంద్రసేనుడి మెడలో చంద్రముఖి పూలమాలను వేసి వరునిగా స్వీకరించింది. ఆమెను చూడగానే ఇంద్రసేనుడు ఆశ్చర్యపోయాడు. అడవిలో తనకు కనిపించిన గంధర్వకన్య ఎవరో కాదు చంద్రముఖి! అలాగే గుహ దగ్గర కనిపించిన గడ్డం వ్యక్తి ఎవరో కాదు. మంత్రిగారే!

'ఇదంతా స్వయంవరంలో భాగమే' అంటూ శూరసేన మహారాజు చెప్పాడు. 'ఏ ప్రలోభాలకు, ఎలాంటి ఆకర్షణలకు, ఎలాంటి భయాలకు లోనుకాకుండా లక్ష్యసిద్ధి కోసం చివరిదాకా పోరాడే యోధుడు నా కుమార్తెకు భర్తగా లభించడం మా అదృష్టం', అంటూ ఇంద్రసేనుడిని ప్రశంసించాడు.

కార్యోత్సాహమే జీవితం

మనిషికి సోమరితనమే శత్రువు. చైతన్యమే మిత్రుడు. మృణాళిని అనే ఒక సామాన్య గృహిణి ఉండేది. ఆమె ఇంటి పనులు పాలంపనులు ఎంతో నైపుణ్యంగా చేసుకుంటుంది. ఇంటికి వచ్చిన అతిథులకు చక్కగా అతిథ్యం ఇస్తుంది. పిల్లలను చక్కగా ముస్తాబు చేసి బడికి పంపుతుంది. భర్తకు చేదోడువాదోడుగా ఉంటుంది. ఇలా ఏకకాలంలో ఎన్నో పనులు చేస్తుంది.

అందరికీ అందుబాటులో, అన్నీతానై, అంతా తానై ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా చూచుకునేది. అందరూ ఆమెను శ్రమజీవి అనేవారు. ఆమె ఔదార్యాన్ని చూచి దానశీలి అనేవారు. పశువులకు, పక్షులకు దానా వేసేది. మాంసాహారం ముట్టదు. అందరినీ ఎంతో దయతో చూచేది.

అందరూ ఆమెను పొగుడుతూ ఉండడం విని, ఆమె గొప్పతనాన్ని తెలుసుకొని దేవతలు ఆమెను భౌందితోనే కైలాసం తీసుకెళ్ళాలని విమానం తీసుకొచ్చారు. విమానాన్ని ఎక్కి కూర్చోమన్నారు దేవతలు. మృణాళిని దేవతలతో "అక్కడ ఏమేమి ఉంటాయి?" అని ప్రశ్నించింది. "సర్వసౌఖ్యాలూ ఉంటాయి" అన్నారు దేవతలు. అక్కడ నేను ఆదరించడానికి ఎవరైనా ఉంటారా? అని అడిగింది. స్వర్గంలో దీనులు, దుఃఖితులంటూ ఎవరూ ఉండరు అన్నారు. "నేను అక్కడ చేయడానికి ఏమైనా పనులుంటాయా? అని ప్రశ్నించింది మృణాళిని. నీవేమీ చేసేదానికి అవకాశమే ఉండదక్కడ. ఎందుకంటే అక్కడ చేసేటందుకు పనులేమీ ఉండవు అన్నారు దేవతలు.

సోమరిగా స్వర్గంలో విహరించేకంటే, శ్రమ జీవిగా ఇక్కడే ఉంటాను. ఇక్కడి జీవితమే నాకు తృప్తినీ, ఆనందాన్నీ ఇస్తుంది. నా వలన ఒకరికి ఉపయోగపడని జీవితం నాకు వద్దు ఇతరలకు సేవ చేస్తూ, ఉపయోగపడుతూ ఉండే జీవతమే నాకు కావాలి. ఇలాంటి జీవితాన్నే భగవంతుడుగనుకు ప్రసాదిస్తే, ప్రతి జన్మలోనూ మనిషిగా పుట్టించమని భగవంతుడుని వేడుకుంటాను. అని మృణాళిని స్వర్గాన్ని తిరస్కరించింది.

* స్తబ్దత, సోమరితనమే మరణం. కార్యోత్సాహమే జీవితం.

సదుద్దేశ్యమే కాదు ముందస్తు ప్రణాళిక కూడా అవసరమే

వారసులే లేని ఒక ముసలి బామ్మ అవసాన కాలంలో తన ఆస్తిని గ్రామానికే దానం చేయాలని సంకల్పించింది. ఒక మంచి రోజు చూచుకొని గ్రామ పెద్దలను తన ఇంటికి పిలిచి, ఊరి మధ్యలో తన పేరనున్న విశాలమైన ఖాళీ జాగాను గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడేటట్లు చేయవలసిందిగా కోరింది. దానికి తగ్గ ఏర్పాట్లు చేసుకోండి అని చెప్పింది. ముసలావిడ దానగుణాన్ని ప్రశంసిస్తూ అందరూ ఆమె చెప్పినట్లే చేసేదానికి సంకల్పించారు. గ్రామంలో దండోరా వేయించి సమావేశం ఎప్పుడైందీ ప్రజలందరికీ తెలియజేశారు.

నిర్ణయించిన తారీఖున ప్రజలందరూ సమావేశానికి హాజరైనారు. గ్రామ పెద్దలు ముసలావిడ సంకల్పాన్ని చెప్పి, ఆ విలువైన జాగాను గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడేటట్లుగా ఏమి చేస్తే బాగుంటుందో సూచించవలసిందిగా కోరారు.

ఒకడు లేచి దేవాలయం కట్టించండి అందరికీ బాగుంటుంది అన్నాడు. వెంటనే మరొకడు లేచి ఏ దేవాలయం కట్టిస్తారు? ఒక వర్గానికి కట్టిస్తే, మరో వర్గం వారికి కోపం, కాబట్టి దేవాలయం వద్దు అన్నాడు. గ్రామ పెద్దలు "నిజమే కదా దేవాలయం వద్దు" అన్నారు.

ఒకడు లేచి గ్రంథాలయం కట్టించండి, అందరూ చదువుకుంటారు అన్నాడు. వెంటనే ఇంకొకడు లేచాడు. "అయ్యా చదువుకున్న వాళ్లకు గ్రంథాలయం పనికొస్తుంది. కానీ చదువురాని నాబోటి వాండ్ల సంగతేంటి? కాబట్టి గ్రంథాలయం వద్దు" అన్నాడు. అందరూ "అవును నిజమే కదా?" అన్నారు. ఐతే గ్రంథాలయం వద్దులే అన్నారు గ్రామ పెద్దలు.

ఒకడు లేచి పార్కుకట్టించండి. పిల్లలకు బాగుంటుంది అన్నాడు. వెంటనే మరొకడు లేచి పార్కు కొందరికే ఉపయోగపడుతుంది. కాబట్టి వద్దనేవద్దు అన్నాడు. దానికి కూడా కొంతమంది వంతపాడారు. గ్రామ పెద్దలు సరే అన్నారు.

ఇలా సాయంకాలం వరకూ ఇదే తంతు. ఒకడు ప్రతిపాదించను, మరొకడు తిరస్కరించను. అందరికీ విసుగెత్తింది.

చివర్లో ఒకడు లేచి అయ్యా పెద్ద, చిన్న, ఆడ, మగ, ముసలి-ముతక అందరికీ పనికొచ్చేది. అత్యవసరమయ్యేది "మరుగుదొడ్డి" కాబట్టి దాన్ని కట్టిద్దాం అన్నాడు. అందరూ సరే అన్నారు. లేచి ఎవరిదారిన వారు వెళ్లిపోయారు. తర్వాత అందరూ తమలో తాము "ఊరిమధ్యలో మరుగుదొడ్డి" అసహ్యంగా ఉంటుంది. ఎంత అత్యవసరమైనా అక్కడ కట్టడం ఏం బాగోదు అనుకున్నారు.

ఒక కార్యం నెరవేర్చాలని ఉద్దేశ్యమున్నపుడు అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవలసివస్తుంది. అందులో భాగంగానే సమావేశాలు జరుపుతారు. ఏ కార్యం నెరవేర్చడానికైనా అందరి బాధ్యత సమిష్టిగా ఉన్నప్పటికీ, విశిష్ట బాధ్యత కొందరికి మాత్రమే ఉంటుంది. విశిష్ట బాధ్యతనే "జవాబు దారితనం" అంటారు. ఈ జవాబుదారీతనం ఉన్నవారినే "పెద్దలు, కార్యనిర్వాహకులు, కార్యనిర్దేశకులు, కార్యకర్తలు, బాధ్యులు, సూత్రధారులు" అంటారు. వీరు తీసుకున్న నిర్ణయం వీలైనంత ఎక్కువమందికి, వీలైనంత సౌకర్యవంతంగా ఉపయోగకరంగా, ఎక్కువకాలం ఉపయోగపడేదిగా ఉండాలి. ఆ దిశగా ఆలోచించి ఆ కార్యాన్ని అధికులచేత ఎలా ఆమోదింపచేయాలో ఆలోచించాలి. వారి అభిప్రాయాలను, ఆలోచనలను గౌరవించే వారిని తను, మన, ధనంతో సహకరించేవారిని ముందుగా సంప్రదించి, వారి ఆమోదాన్ని పొంది ఒక నిర్దిష్ట ప్రణాళికను సిద్ధం చేసుకొని ఉంచుకోవాలి.

కార్యకర్తలు కార్యనిర్వహణలో భాగంగా అందరినీ సమాయత్త పరచాలి. ఎవరినీ విస్మరించినట్లుగా కనిపించకూడదు. అందరి అభిప్రాయాలను పేరు పేరునా అడిగి తెలుసుకోవాలి. ముందస్తు ప్రణాళిక ప్రకారం అత్యధికులకు ఉపయోగపడే అంశాన్ని సభాముఖంగా వచ్చేటట్లుగా చేసి అందరిచేత "సరే" "ఓకే" అనిపించాలి. ఇలాంటి కార్యక్రమాలలో కొందరు పరిమితబుద్ధితో, మురికి ఆలోచనలతో, అనుభవ శూన్యంతో, స్వార్థంతో, అసూయతో మాట్లాడతారు. వారి మాటలు అసలు కార్యంపై ప్రభావం

ఏమాత్రం పడకుండా వీగిపోయేటట్లుగా చెయ్యాలి. అపుడే తలపెట్టిన కార్యం ఆచరణలోకి వస్తుంది. అందుకే 'కాగల కార్యం గంధర్వులే నెరవేర్చుతారు" అంటారు. గంధర్వులంటే ఎవరో కాదు. కార్యశూరులే! "శుభకార్యానికి ఆటంకాలు మెండు" అంటారు. కార్యశూరులకు అంకితభావం, ముందస్తు ప్రణాళిక, అందరినీ కలుపుకొని పోయే తత్వం, సహనం, పట్టుదల, వేచి ఉండడం, మధుర భాషణం, పారదర్శకత, ఓర్పు- నేర్పు, నైపుణ్యం, వినయం, విధేయత మొదలగు లక్షణాలు కలిగి ఉండాలి. తొందరపాటు తనం ఏమాత్రం పనికిరాదు.

* ఎవరినీ శత్రువులుగా చేసుకోకుండా తమ ఉద్దేశ్యాన్ని ఆమోదింపజేసుకునే కళనే చాతుర్యం, నేర్పు అంటారు.

` కష్టాలకు ఓర్చుకొని చివరి వరకూ నిలబడగలిగిన వారే ఉన్నత స్థానాన్ని అలంకరించగలరు.

ఒక ఉత్సవంలో ఊరేగింపుగా విగ్రహాన్ని బయటికి తెస్తున్నారు. అపుడు పడికెట్లకు ఉపయోగింపబడిన రాయి ఒకటి విగ్రహాన్ని అడిగింది. "నీవూ రాయివే! నేనూ రాయినే, మరి నీకెందుకు పూజలు? నాకెందుకు తన్నులు? అని.

విగ్రహం ఇలా జవాబిచ్చింది. "సుత్తి దెబ్బలు ఎన్నో తిని, ఓర్చుకొని చివరి వరకూ నిలిచినందుకే నాకీ పూజలు. సుత్తి దెబ్బలకు తట్టుకోలేక పడిపోయినందుకే నీకీ తిప్పలు".

"పనికిరాకుండా వీధిలో పడి ఉండట్ం కంటే కనీసం పడికెట్లుగానైనా ఉపయోగపడి నందుకు నీ జీవితం ధన్యమైందని తృప్తిపడు" అని పడికెట్టురాయిని ఓదార్చింది విగ్రహం.

* కష్టాలకు తట్టుకొని నిలబడగలిగినవారే గౌరవింపబడతారు.
* పనికిరాకుండా తప్పుపట్టి నాశనమైపోయేదానికంటే ఉపయోగపడి అరిగిపోవడమే మంచిది.
* ఉన్నత స్థితిలోని వారిని చూచి, అసూయ, అసంతృప్తి, ఆందోళన చెందడం కంటే ఉన్నదానితో తృప్తి చెందడం ఉత్తమం.

పనులను చేయించుకోవడమూ ఒక కళే

రామాపురంలో పాపారావు పెద్ద భూస్వామే కానీ పిల్లికి బిచ్చంపెట్టని పిసినారి. అతని దగ్గర పొలం పనికి చేరినవారెవరూ పట్టుమని పదిరోజులైనా ఉండేవారు కాదు. పాపారావు చేయించుకునే పనికీ పెట్టే తిండికీ, ఇచ్చే జీతానికీ ఎక్కడా పొంతనే ఉండేది కాదు.

పంట కోతకు వచ్చే సమయానికి పాపారావు దగ్గర పనిచేసేవాడు చాలించుకుని వెళ్లిపోయాడు. ఊళ్లో ఎవరిని పిలిచినా పిసినారి పాపారావు దగ్గర పనిచేయడానికి ఒప్పుకోరు.

ఒకనాడు పాపారావు దగ్గరికి ఎత్తుగా బలంగా ఉన్న వ్యక్తి ఒకడు వచ్చాడు. "దండం బాబయ్యా! నా పేరు భీముడు. మా ప్రాంతంలో వర్షాలు లేక కరువొచ్చింది. పనులు లేక ఇలా పొట్టచేత పట్టుకొని వచ్చానయ్యా, మీ దగ్గర పనేదైనా ఇప్పిస్తే, ఇక్కడే ఉంటానయ్యా" అన్నాడు.

"వెదక బోయిన తీగ కాలికి తగలడం" అంటే ఇదేగదా! అనుకుంటూ పాపారావు లోలోపల సంతోషించాడు. పొలంపనీ, ఇంటిపని చేసిపెట్టాలి. ఏడాదికి ఎంతోకొంత ఇస్తాలే సరేనా? అన్నాడు. పాపారావు. "నేను ఒంటరిగాణ్ణండీ. జీతం ఎంతైనా పర్వాలేదు. కానీ తిండి మాత్రం మూడుపూటలా కడుపునిండా పెట్టాలండీ" అన్నాడు. పాపారావు ఆనందానికి అంతేలేదు. వీడెవడో వెర్రివెంగళాయిలా ఉన్నాడు. జీతం కోసం కాక అన్నం కోసం ఆశ పడుతున్నాడు. అనుకొని భీముడిని వెంటనే పనిలోకి తీసుకున్నాడు.

ఆ రోజు ఉదయం నుంచీ ఇంటిపనంతా చకచకా చేసి మధ్యాహ్నం భోజనానికి కూర్చున్నాడు భీముడు. పాపారావు ఇంట్లో ఇంటిల్లిపాదికీ వండినదంతా భీముడొక్కడే తినేశాడు. వాడి తిండి చూసి పాపారావుకి గుండె గుభేల్మంది. భోంచేశాక మళ్లీ పనంతా చక్కగా చేశాడు. రాత్రి భోజనంకూడా అలాగే సుష్టుగా భోంచేశాడు. పాపారావుకి ఏంచేయాలో తోచలేదు. పోనీ పనిలోంచి తీసేద్దామా అంటే పొలం పని చేసేదెవరు? అందుకని ఒక ఉపాయం ఆలోచించాడు. మరునాడుదయమే భార్యను లేపి ఏం చెయ్యాలో చెప్పాడు.

తెల్లవారగానే పనంతా చకచకా చేసి చద్దన్నం తినడానికి కూర్చున్నాడు భీముడు. పాపారావు వాడితో "ఒరేయ్! ఇవాళ నువ్వు పొలం పనికి వెళ్ళాలి. అందుకని మూడుపూటలా తినేదంతా ఇపుడే మూడిగిన్నెల్లో వండించేశా. త్వరగా తిని బయల్దేరిపో" అన్నాడు.

పాపారావు భార్య ఒక గిన్నె నిండా అన్నం తెచ్చింది. ఇదిగో భీముడూ ఇది పొద్దున తినే అన్నం అని వడ్డించింది. అయితే అది చిన్న గిన్నె, అందులోని అన్నం భీముడి పచ్చడి కలపడానికికూడా సరిపోలేదు. కడుపు నిండలేదమ్మా! అన్నాడు భీముడు జాలిగా. సరేలేరా, మధ్యాహ్నం వండింది కూడా ఇప్పుడే తినేసెయ్, మధ్యాహ్నం భోజనం మానేద్దువుగానీలే, అంటూ పాపారావు భార్య రెండో గిన్నె అన్నం తెచ్చి వడ్డించింది. ఈ అన్నం పప్పులోకి సరిపోయింది భీముడికి. అబ్బే ఇంకా కొంచెం వెలితే ఉందమ్మా అన్నాడు భీముడు. భలేవాడివి భీమన్నా! సరేలే, రాత్రికి నీకోసం వండిన గిన్నెలోది కూడా ఇపుడే తినేసెయ్, కావాలంటే రాత్రికి మానేద్దువులే అంటూ పాపారావు భార్య మూడో గిన్నె అన్నం కూడా తెచ్చి వడ్డించింది. అది కూడా పూర్తిగా తినేశాక భీముడు పొలం పనికి బయల్దేరాడు.

వరండాలో కూర్చొని ఇదంతా గమనిస్తూ ఉన్న పాపారావు, భీముడా, "పొలం పనంతా చేసేయ్. ఏమీ మిగలకుండా చూడు. సాయంకాలం నేను వచ్చి చూస్తా". అని హెచ్చరించాడు. వాడు వెళ్లాక పాపారావు దంపతులు తమ అతి తెలివితేటలకు భీముడు బోల్తాపడిన వైనాన్ని తలచుకొని పగలబడి నవ్వుకున్నారు.

పాపారావు సాయంకాలం పొలం దగ్గరికి వెళ్లేసరికి భీముడు ఒక చెట్టు క్రింద పడుకొని హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతూ కనిపించాడు. పొలంలో పని ఎక్కడి దక్కడే ఉంది. పాపారావుకి పట్టరాని కోపం వచ్చింది.

ఏరా? హాయిగా నిద్రపోతున్నావా? పొలం పని నీ తాత చేస్తాడనుకున్నావా? రాత్రి భోజనం కూడా పొద్దున్నే మెక్కేశావు కదరా? పని చేయకపోవడానికి ఏం మాయరోగమొచ్చిందిరా, అంటూ కేకలు పెట్టాడు పాపారావు.

భీముడు ఆవలిస్తూ లేచి "ఊరుకోండయ్యా, మీరు మరీనూ, ఏమీ తెలియనోడిమాదిరిగా మాట్లాడతావుండారు. నేను ఆ మాత్రం తెలియని వెర్రివెంగళప్పనా ఏమి? రాత్రి భోజనం చేశాక ఎవడైనా పనిచేస్తాడా? హాయిగా నిద్రపోవాలిగానీ! మీరు కూడా వెళ్లి హాయిగా నిద్రపోండి. పని సంగతి రేపు చూద్దాం అంటూ మళ్ళీ నిద్రకు ఉపక్రమించాడు భీముడు. పాపారావుకు నోటమాట పెగల్లేదు.

* పనులను చేయించుకోవడం కూడా ఒక కళే. అది కొందరికే ఉంటుంది. కానీ చేసే పనిని చెడగొట్టడం చాలా మందికి చేతనవుతుంది.

కసురుతూ మాట్లడకు, విసుగుతో పనిచెయ్యకు

ఓసారి నవ దంపతులిరువురూ ఒక గురువును కలసి తమ ఇంటికి దయచేయమని ప్రార్థించారు. ఆ కారణంగా గురువు ఆ దంపతుల ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో ఇల్లాలు మాత్రమే ఇంటి వద్ద ఉండినది. భర్త ఇంకా ఆఫీసు నుండి రాలేదు.

కొద్ది సేపటికి భర్త వచ్చాడు. వచ్చీరాగానే పాదరక్షలను విసురుగా వదిలాడు. తలుపులను ధభీమని బార్లా తెరచి ఇంటిలోకి కస్సుబుస్సుమని వచ్చాడు. ఇంట్లో గురువుగారు ప్రశాంతంగా కూర్చొని ఇల్లాలితో మాట్లాడుతూవున్నాడు. గురువుగారిని చూచి ఏమి నా భాగ్యము? మా మొర ఆలకించి ఈ నాటికి దయచేశారా! అంటూ వచ్చి నమస్కరించాడు.

గురువుగారు మౌనంగా ఉన్నారు. ఏమీ పలకలేదు. యజమానికి కాస్త అపరాధభావన కలిగి, ఏమీ స్వామీ! మౌనంగా ఉన్నారు! అని వినయంగా అడిగాడు. గురువుగారు ఆయనతో ఏమీ మాట్లాడకుండా ఆయన భార్యను అడిగారు. 'ఎందుకు అంత హడావిడిగా మీ ఆయన వచ్చాడు' అని. అందు కామె వినయంగా స్వామీ!

ఆయన ఎప్పుడూ అంతే! అన్నింటిలోనూ తొందరే! హడావిడిగా రావడం, భోజనం చేయడం, వెంటనే ఆఫీసుకెళ్ళిపోవడం..అన్నీ అలాగే చేస్తారాయన అని విన్నవించుకున్నది.

విషయం తెలుసుకున్న గురువుగారు యజమానితో.. ఏమీలేదు. "నేను నీతో మాట్లాడాలంటే ముందుగా నీవు విసురుగా విదలించి వచ్చిన నీ పాదరక్షలకు, ధభాలున తెరచిన తలుపులకు క్షమాపణ చెప్పిరా, తర్వాత ప్రశాంతంగా మాట్లాడుకుందాం" అన్నాడు.

గృహస్తుడు అదేమి స్వామీ? వాటికేమన్నా ప్రాణం ఉందా? క్షమాపణ అడగటానికి అని ప్రశ్నించాడు. నిజమే ప్రాణం లేని వాటిపై నీవు కోపం, ప్రతాపం ప్రదర్శించడం సబబేనా? వాటికి ప్రాణం లేదు. మనసు లేదు. అయినా ఆ పని ఎందుకుచేశావు? పాదరక్షలను విసురుగా విదిలించినపుడు, తలుపులను దురుసుగా తోసినపుడు వాటికి ప్రాణం లేదని గుర్తించలేదు కదా? కాబట్టి క్షమాపణ అడిగిరా, అన్నాడు.

గృహస్తు గురువుగారు చెప్పినట్లు "ఓ స్నేహితులారా! నా దురుసు ప్రవర్తనను క్షమించండి. ఇకపై అలా దురుసుగా ప్రవర్తించను. నా నమస్కారాలు స్వీకరించండి" అని వేడుకున్నాడు. ఆ తర్వాత గురువుగారు ఆ దంపతులకు కొన్ని హితోక్తులు చెప్పి ఆ పూట ఆతిధ్యం స్వీకరించి వెళ్లాడు.

* కొందరికి తొందర ఎక్కువ. కానిదానికీ, అయినదానికీ హైరానాపడిపోతూ ఉంటారు. అన్ని పనులూ ఒకేసారి అయిపోవాలని అన్నింటిలోనూ వేలుపెట్టేవారు, అన్నింటిలోనూ తలదూర్చేవారు ఏ పనినీ పూర్తి చేయలేరు. వెంటవెంటనే, త్వరత్వరగా ఇలా చిటికేస్తే అలా అయిపోవాలి "ఇలా స్విచ్ నొక్కితే అలా లైటు వెలిగినట్లు" అనుకునేవారు ఏదీ సాధించలేరు.
* విసుగు, పరమబోర్, సుత్తి అనే పదాలు తొందరపడే వారి ఊతపదాలు.
* వేగంగా జరగవలసిన పనులన్నీ నెమ్మది, నెమ్మదిగా ప్రారంభించవలసినవే. వాహనాలను నడపడం తెలుసుకోవాలంటే, నెమ్మదిగా నిదానంగా నేర్చుకోవాలి. ఆ తర్వాతే వేగంగా నడపగలరు. వేటాడే పులికూడా మొదట నెమ్మదిగానే అడుగులు వేస్తుంది.
* సహనంతో, సక్రమంగా శ్రద్ధగా ఒకదాని తర్వాత ఒకటి నిదానంగా చేస్తూ పోతే అభ్యాసం మీద అనుకున్న రీతిలో, సకాలంలో, సజావుగా, శుభంగా, వేగంగా పనులను చేసే యోగ్యతను పొందవచ్చు.
* మనం ఏ లక్ష్యాన్నైతే ఎంచుకొని ఉంటామో, ఆ లక్ష్యాన్ని సాధించడం కొరకు చేసే నిరంతర ప్రయత్నమే 'అభ్యాసం'.

* 'అన్నప్రాసననాడే ఆవకాయ' అన్నట్లుగా ఆరంభంలోనే మోయరాని భారం నెత్తికెత్తుకొని చతికిలబడటం తెలివైన పనికాదు. ఆరంభంలో సరళమైన, చేతనైన పనిచేసి, పొందిన విజయం, సంపాదించిన అనుభవం ఆత్మవిశ్వాసానికి నాంది కాగలదు. ఆపై క్రమంగా సాహసోపేతమైన పనులను అవలీలగా చేయవచ్చు.
* కాలం విలువను తెలుసుకొని జీవించాలంటే తప్పనిసరిగా పెద్దల అనుభవసారాలైన సూక్తులను పాటించితీరాలి.
* అమ్మ అన్నం వండకుండా కబుర్లు చెబుతూ కూర్చొని ఉంటే! ఏమవుతుంది? తండ్రి వృత్తినో, ఉద్యోగాన్నో చేయకుండా ఊసులాడుతూ కూర్చుంటే! ఏమవుతుంది? ఎవ్వరికీ తినేదానికి తిండి ఉండదు.
* ఏ పనీ చేయకుండా అన్నం తినేవాడు దొంగ.
* నిద్రను వదలుకోవద్దు, నిద్దురకు దొరికిపోవద్దు.
* అసాధ్యాన్ని సుసాధ్యం చేసుకోగలగడమే యువతకు అసలైన పరీక్ష. ఏదైతే కష్టమనుకుంటారో ఆ పనినే చేయగలగాలి. సులువుగా చేయగలిగే పనినే మీరు చేస్తే అందులో గొప్పేముందీ? ఎవరూ చెయ్యలేని పనిని చేయాలి. సవాళ్లను స్వీకరించాలి. శెహభాష్ అనిపించుకోవాలి.
* చేసిన తర్వాత బాధకు లోను చేయనిదే మంచి పని. తృప్తి, సంతోషం కలిగించేవే మంచి పనులు.
* కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ తాను బతుకుతూ, ఎదుటి వారిని బతికించాలి.
* మృత్యువు నిన్ను కబళించి వేయడానికి సిద్ధంగా ఉందని గ్రహించి అనుక్షణం మంచి పనుల్ని చేస్తూ ఉండాలి.
* ఇతరులకోసం తన సమయాన్ని ధారపోయకపోయినా, ఆత్మోన్నతికోసం అరక్షణం కూడా వ్యర్థం చేయక, కాలాన్ని ఉపయోగించుకోవడాన్ని మనిషన్న ప్రతి వారు నేర్చుకోవాలి. లేకుంటే కాలవాహినిలో మనిషి పుట్టుకకు ఏ అర్థమూ ఉండదు.
* గోళ్లు గిల్లుకుంటూనో, తలగోక్కుంటూనో ఇతరుల సుద్దులు వింటూనో, ఇతరులు చేసే మంచి పనులకు అడ్డు తగులుతూనో కాలాన్ని వృథాచేయడం చాలా మందికి అలవాటే. అలాంటి వారిలో నీవు లేకుండా నిన్ను నీవు జాగ్రత్తగా చూచుకో.
* కాలాన్ని సద్వినియోగపరచుకోలేకపోతే అవకాశాలను హరించివేసుకున్నట్లే.
* పని సంస్కృతిని పెంచుకుంటే అవినీతి సాంద్రత తగ్గుతుంది.
* స్వార్థంకోసం కన్నీరు కార్చేవాడు సామాన్యుడు. పరులకోసం కన్నీరు కార్చేవాడు మాన్యుడు.
* చిరునవ్వు ఎంతటి కష్టమైన పనినైనా సుసాధ్యం చేస్తుంది.

* ప్రతి మనిషి జీవితానికి ఒక కర్తవ్యం ఉంటుంది. కర్తవ్య నిర్వహణకు ఒక ప్రణాళిక తయారు చేసుకొని పనులను చేసుకుంటూ పోవాలి. ఒక్కోసారి ఎంత పకడ్బందీ ప్రణాళికతో పనులను చేసుకుంటూపోతున్నా పనులు కావు సరికదా ఎదురు దెబ్బలు, ఓటమి, అవమానాలు ఎదురౌతాయి. మనవైపు నుండి ఏమైనా తప్పులు, పొరపాట్లు ఉన్నాయా? అని సరిదిద్దుకొని ఒకటికి రెండుసార్లు పరీక్షించుకొని ప్రణాళిక ప్రకారమే చేసినాకూడా ఫలితం దక్కదు. ఇలా ఎందుకు జరిగింది? అని ప్రశ్నించుకుంటే! సమాధానం దొరకదు. కొన్ని మన ఊహకు అందేవి, అందనివి. అలా జరిగిపోతూనే వుంటాయి."అనుకున్నామని జరగవు, అనుకోలేదని ఆగవు".
* మనిషి ఎంత మేధావి అయినప్పటికీ మరోగంటలో ఏమి జరుగుతుందో చెప్పలేడు. దుర్ఘటనలు, హత్యలు, జయాపజయాలు హఠాత్తుగా అలా జరిగిపోతూనేవుంటాయి.
* ఇతరులపై ఆధారపడిన లేదా ఇతరులను ఆశ్రయించిన మరుక్షణం నుండే వారికి లోబడిపోయినట్లు.
* **SELF HELP IS THE BEST HELP**
* చిన్న తప్పులే కదా అని ఉదాసీనత తగదు. చిన్న రంధ్రమే పెద్ద నావను ముంచుతుంది. చిన్న తప్పులే జీవితాన్ని నాశనం చేస్తాయి.

ఆరంభ శూరత్వం పనికిరాదు.

చిత్రావతీ నదీతీరంలో విష్ణుశర్మ అనే గురువు ఒక ఆశ్రమాన్ని నిర్వహిస్తూ ఉండేవాడు. అతడు సకల విద్యలూ తెలిసినవాడు. అతడి వద్ద రవివర్మ, ఆనందవర్మ రాజవర్మ, గుణవర్మ అనే నలుగురు రాజకుమారులు శిష్యులుగా చేరి విద్యనభ్యసిస్తూ ఉండేవారు. వారంతా బుద్ధికుశలతలో సమవుజ్జీలే. కానీ ఒకలోపం ఉండేది. ఏ పనినైనా సమరోత్సాహంగా మొదలు పెడతారు. కానీ అంతలోనే నిరుత్సాహపడిపోతారు. పని పూర్తి చేయవలసిందిపోయి విసుగు, చిరాకు, అలసట, నిర్లక్ష్యంతో క్రుంగిపోయేవారు. మరలా వెంటనే మరోపనికి సిద్ధమయ్యేవారు. ఆ పనికూడా పూర్తి చెయ్యకుండా మరోపని మొదలెట్టేవారు. దీనిని గమనించిన గురువు విష్ణుశర్మ వారిలో మార్పు తీసుకొని రావాలనుకున్నాడు.

ఓరోజు ఆ నలుగురు శిష్యులనూ పిలిచి 'మన ఆశ్రమంలో ఒకే మంచినీళ్ల బావి ఉంది. వచ్చేది ఎండాకాలం. ఇంకొక బావినికూడా త్రవ్వి ఉంచుకోవడం మంచిది. అందుకని ఇప్పటి నుండే ఆపని చెయ్యాలి. అంటూ వారిని ఆశ్రమానికి దక్షిణ దిక్కుకు పిలుచుకొనివెళ్లి ఒకచోటు చూపించాడు. 'ఇక్కడ త్రవ్వితే తప్పక నీళ్ళు పడతాయి. ఈపని గ్రామస్తులతో చేయిద్దామనుకున్నాను. కానీ మీరు ప్రారంభిస్తే పని వేగంగా

పూర్తవుతుందని మొదట మీకు చెబుతున్నాను. మీరు తవ్వుతూ ఉండండి. నేను వెళ్ళి మరో పదిమందిని తీసుకొని వస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు గురువు. గురువు మాటలు విన్న వెంటనే నలుగురు శిష్యులూ పలుగు-పార, గోళాలు పట్టుకొని ఉత్సాహంగా పరుగుతీశారు. ఒకరు తవ్వుతూ ఉంటే మరొకడు పారతో మట్టిని ఎత్తివేస్తున్నాడు. మిగిలిన వారు చెట్లు అడ్డం లేకుండా తొలగిస్తున్నారు. ఇలా పని జోరుగా జరుగుతూవుండగా, కొంతసేపటికి గురువు అక్కడికి వచ్చాడు.

గొయ్యి తవ్వుతున్న శిష్యులను పిలిచి ఇక్కడ తవ్వడం ఆపేసి నాతోపాటు రండి అంటూ ఇంకొక చోటు చూపించి, ఇక్కడ తవ్వండి అని చెప్పాడు. గురువుగారు ఎందుకలా చెప్పారో అర్థం కాలేదు వాళ్ళకి, బహుశా అక్కడ నీళ్లు పడవేమోరా! అని వాళ్లలో వాళ్లు తర్కించుకుంటూ గురువుగారు చెప్పినచోట త్రవ్వను మొదలుపెట్టారు.

మరికొంత సేపటికి గురువు మరలావచ్చి మరొకచోటు చూపించాడు. దాంతో శిష్యులు అక్కడ తవ్వకం ప్రారంభించారు. మరికొంచెం సేపయ్యాక మరొకచోటు చూపించాడు గురువు.

అంతవరకూ సహనంతో పనిచేస్తూ వచ్చిన శిష్యులకు ఒక్కసారిగా చిరాకెత్తింది. "ఇలా అక్కడింత, ఇక్కడింత తవ్వుతూపోతే బావి ఎప్పటికి పూర్తవుతుంది?" అని ప్రశ్నించారు.

దాంతో విష్ణుశర్మ 'ఎందుకు పూర్తవదూ?... తప్పకుండా పూర్తవుతుంది. మీరు కూడా అదింతా - ఇదింతా, అప్పుడింతా- ఇప్పుడింతా చదువుతూపోతూ ఉంటే మీ చదువూ ఎలా పూర్తిచేస్తారో అలాగే ఈ బావి కూడా పూర్తవుతుంది" అన్నాడు.

అపుడు వాళ్లకు అసలు విషయం అర్థమయింది. సిగ్గుతో తలలుదించుకున్నారు. 'ఇక మీదట అలాంటి తప్పులు చేయము' అని గురువుకు మాటిచ్చారు. ఆ తర్వాత వాళ్లు ఏ పనినీ అసంపూర్తిగా వదలిపెట్టలేదు.

ముందుచూపే శ్రీరామరక్ష

ప్రతి మనిషికి ముందు చూపు అవసరం. ఒక విషయాన్ని గురించి మంచి-చెడులను, లాభనష్టాలను ముందుగానే బేరీజు వేసుకొని దాని ప్రకారం నడచుకొనే విధానాన్నే ముందుచూపు అంటారు. మాటకంటే, చేతలకంటే ఆలోచనను ముందుకు పరిగెత్తించాలి. మాట్లాడిన తరువాత, చేసిన తరువాత ఆలోచించేవాడిని మూర్ఖుడంటారు.

ఒక చెరువులో దీర్ఘదర్శి, ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు అను మూడు చేపలు స్నేహంగా ఉండేవి. పేరుకు తగినట్లుగానే దీర్ఘదర్శి ముందు చూపుగలవాడు. ప్రాప్త కాలజ్ఞుడు మాత్రం. చూద్దాంలే! చేద్దాంలే ఏమంత తొందర? అని నిర్లక్ష్యం చేసేవాడు.

వేసవి కాలం రాగానే చెరువులోని నీరు ఇంకి పోవచ్చింది. కొందరు బోయవాళ్ళు వచ్చి "త్వరలోనే మనము ఈ చెరువులో చేపలు పట్టవచ్చు" అనుకొని వెళ్లారు. ఇది గమనించిన దీర్ఘదర్శి తన మిత్రులతో తాను విన్న సంగతి పూస గ్రుచ్చినట్లు వివరించింది. మనంకూడా మరొక చోటికి వెళ్లడం మంచిది అన్నది. ఆ మాటలకు ప్రాప్తకాలజ్ఞుడు, దీర్ఘసూత్రుడు ఏమంతగా ప్రాధాన్యత నివ్వలేదు. ఎప్పుడో రానున్న ఆపదకు ఇప్పటి నుండే వగచనేల? "ఎచ్చటనో ఉన్న కాశీకి ఇక్కడి నుండే వంగి నడవాలా?" ఏం పరవాలేదు ఆపద వచ్చినప్పుడు చూచుకోవచ్చులే అనుకొన్నవి.

వారి మాటలను విన్న దీర్ఘదర్శి తనదారి తాను చూచుకోవడం మేలని తలచి అపాయము లేని మరోచోటుకు వెళ్ళింది. కాలక్రమేణా ఎండవేడిమికి చెరువు ఎండి పోసాగింది. జాలరులు అనేక రకాలైన సాధనాలతో చెరువును చుట్టుముట్టారు. ప్రాప్తకాలజ్ఞుడు ప్రాణాలపైన ఆశవీడి, వల తాళ్ళను తానే పట్టుకొని వలలో తగులుకొన్న వానివలె నటించి, మంచినీటిలో చేరి ప్రాణాలను కాపాడుకొన్నది.

ఇక దీర్ఘసూత్రుడు దీర్ఘదర్శివలె ముందుగా మేల్కొనక, ప్రాప్తకాలజ్ఞునివలె సమయానికి తగిన ఆలోచన చేయలేక..... వలలో తగుల్కొని ప్రాణాలను కోల్పోయాడు. ప్రతి ఒక్కరూ ముందుచూపు కలవారై ఆపదల నుండి బయటపడి ఆనందంగా జీవించాలి. ప్రాప్తకాలజ్ఞునివలె అనుమానాస్పదమైన బ్రతుకును బ్రతుకరాదని. దీర్ఘసూత్రునివలె బుద్ధిహీనులై ప్రాణాల మీదికి తెచ్చుకోరాదని, దీర్ఘదర్శివలే ముందు చూపు గలిగి ఉండాలని గ్రహించాలి.

బద్ధకమే బద్ధ శత్రువు

చేయవలసిన పనిని తర్వాత చేద్దాం, ఇంకాసేపయ్యాక చేద్దాం, ఇంకా సమయం బోలెడంత ఉందికదా? ఇపుడు ఏం కొంపలంటుకున్నాయి గనక! అనక చేద్దాం! ఏమంత తొందర "నిదానమే ప్రధానం" అని ఎందుకన్నారు. తర్వాత చూద్దాంలే! అని అనుకుంటూ పనులను వాయిదా వేసుకుంటూపోతారు కొందరు. మందకొడిగా ఉంటారు కొందరు. అనవసరపు నిద్రతోనూ, నిరుపయోగమైన పనులతోనూ కాలంగడిపేస్తూ ఉంటారు మరి కొందరు.

మనిషి ఉన్నతినీ, అభివృద్ధినీ, ఆరోగ్యాన్నీ, ఆనందాన్నీ ఆలస్యంగా కానీ. రానివ్వకుండాగానీ, చేసే బలమైన లక్షణమే బద్ధకం. సోమరితనంలోని ఆనందమే బద్ధకం. ఇది ఉంటే అన్నింటికీ ప్రతిబంధకం.

ఇవాళ ఉన్న అవకాశం, ఓపిక రేపు లేకపోవచ్చు. ఇవాల్టి విశ్రాంతి, వెసులుబాటు. తీరిక సమయం రేపు ఉండకపోవచ్చు, ఒకవేళ ఉన్నా మరో పని పడవచ్చు. కాబట్టి "ఆలస్యం అమృతం విషం" "శుభస్య శీఘ్రం" అని కార్యోన్ముఖులు కావాలి. కానీ ఈ మాటలు యవ్వనంలో ఉన్నవారికీ, ఆనంద సోమరిబాబులకు అసలు నచ్చవు.

* ఇల్లు తగలపడిపోతుంటే బావి త్రవ్వడం మూర్ఖత్వం.
* దప్పికగొన్నపుడు నూతి త్రవ్వడం హాస్యాస్పదం.
* కాలంతోపాటు పరుగులుతీస్తే తప్ప అది ఎప్పుడూ నీ సొంతం కాదు.
* రేపటి పని ఈ వేళ, ఈవేళ పనిని ఇప్పుడే చేసేయాలి.
* పని చేసే ముందు ఐదింటిని దృష్టిలో వుంచుకోవాలి. **INTIME** సకాలంలో, **CORRECT** ఖచ్చితంగా, **NEAT** శుభ్రంగా, **SPEED** వేగంగా, **PLAN** ప్రణాళిక ప్రకారం చేయాలి.
* తక్షణం పనిచేయగలిగే మానసికస్థితి మిమ్మల్ని ఎంతో ఎత్తుకు ఎదిగేలా చేస్తుంది.

కష్టేఫలి

ఒక శిష్యుడుండేవాడు. లోకంలో ఉన్న సోమరితనమంతా వాడిలోనే ఉండేది. ఏకాస్త అయినా మార్పు వస్తుందన్న ఆశతో వాడి తండ్రి ఒక ఆశ్రమంలోని గురువు దగ్గర వదిలాడు. గురువు ఏ పని చెప్పినా, ఎంత చిన్నపని అయినాసరే! ఎందుకైనా మంచిది అమ్మో! అంతపనే?! నావల్ల అవుతుందా? అని గుడ్లు తేలేసేవాడు. తప్పించుకో జూసేవాడు. వర్షాకాలం దగ్గర పడుతుండటంతో గురువుగారు ఆశ్రమానికి దగ్గరలోనే ఉన్న ఎండిపోయిన ఒక పెద్దమానును కొట్టించి, చిన్న చిన్న కట్టెలుగా చేయించి ఒక రాశిగా ప్రోగు చేయించి ఉంచాడు.

ఒకరోజు శిష్యునితో "నాయనా వర్షాకాలం వచ్చేస్తూ ఉంది. మనం వంట చెరుకును జాగ్రత్త చేసుకోవాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా తడిసిన కట్టెలతో అవస్థలుపడాలి. అందుకే ఎండిన చెట్టును కొట్టించి, చిన్న చిన్న కట్టెలుగా నరికించి ఉంచాను. నీవు వెళ్ళి వాటిని తీసుకొచ్చి ఆశ్రమంలో జాగ్రత్తచెయ్యి" అన్నాడు. గురువుగారి ఆజ్ఞను విని, శిష్యునికి పైప్రాణాలుపైనే పోయాయి. అయ్యబాబోయ్! అన్ని కట్టెల్నీ నేనొక్కడినే ఎలా మోయగలను? అని బాధపడి తన అశక్తతను గురువుగారికి విన్నవించుకున్నాడు.

నిరుత్సాహపడిన శిష్యుణ్ణి చూచి గురువుగారు నాయనా! శిష్యా! నీకిది కష్టమైన పనేంకాదు. ఆ కట్టెలను ఆశ్రమానికి చేర్చేటందుకు మహా అయితే ఒక రోజు కష్టపడితే చాలు, ఇపుడు కష్టపడితే భవిష్యత్తులో సుఖపడగలవు. సోమరితనమే సుఖమను కున్నట్లయితే భవిష్యత్తు అంతా కష్టమయమే "కష్టేఫలి" అన్నాడు గురువు. అమ్మో కష్టం, వారధిని నిర్మించగలిగేంత వారమా?! అని అనుకొని ఉంటే లంకా నగరానికి వారధిని కట్టి ఉండగలిగేవారా వానరులు?

వానరుడనైన నేనెక్కడ? మహాసముద్రమెక్కడ? నేను దాటగలవా? అని నిరుత్సాహపడి ఉంటే హనుమంతుడు సముద్రాన్ని లంఘించి ఉండగలిగేవాడా? సీతమ్మ దగ్గరికి వెళ్ళగలిగి ఉండేవాడా? "మేము ఐదు మంది మాత్రమే ఉన్నాం.

కౌరవులు నూరుగురు. దోమకు ఏనుగుకు ఉన్నంత తేడా, ఏమీ చేసుకోలేం. వారిని జయించడం అసాధ్యం" అని పాండవులు భయపడి ఉంటే కౌరవులను జయించి ఉండేవారా? రాజ్యాన్ని తిరిగి పొందగలిగివుండేవారా?

"ఎంత పెద్దపని అయినా చిన్న ప్రారంభంతోనే మొదలౌతుంది. కొన్ని వేల మైళ్ల ప్రయాణమైనా ముందు వేసే చిన్న అడుగుతోనే ప్రారంభమౌతుంది." కాబట్టి నిరుత్సాహాన్నీ, నిర్లక్ష్యాన్ని దగ్గరకు రానివ్వకుండా, శక్తివంచన లేకుండా పూర్తిగా ప్రయత్నించు, ఫలితం భగవంతునికి వదిలేయ్. నేను చేయగలను అనే ఆత్మ విశ్వాసంతో అంకితభావంతో పని చెయ్యడం మనవిధి" అని హితబోధచేశాడు గురువు.

గురువుగారి హితవచనాలతో శిష్యునిలో ఎక్కడలేని శక్తి, ఉత్సాహం వచ్చాయి. బద్ధకం పటాపంచలైపోయింది. అంతే. కట్టెల రాశి దగ్గరికి వెళ్ళాడు. ఎత్తుకోగలిగినన్ని కట్టెలను మోపులుగా కట్టి, ఒక్కొక్క మోపును మోసుకొని వచ్చి ఆశ్రమంలో భద్రపరచసాగాడు. మొత్తం కట్టెలన్నింటినీ మోసేశాడు. తన పట్టుదలకు తన కృషికి తానే ఆశ్చర్యపడ్డాడు. ఎంతో కష్టమనుకున్న పని, చెయ్యలేనేమో అనుకున్న పని ఎంత సునాయాసంగా అయిపోయింది? అని సంతోషపడ్డాడు. కష్టపడడంలోని ఆనందం, తృప్తి అనుభవంలోకి వచ్చింది. ఆ సాయంకాలమే ఆకాశం మబ్బులతో నిండిపోయింది. ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా, మరుసటి రోజు సాయంకాలం వరకూ వర్షం కురుస్తూనే ఉండినది. శిష్యుడు తనలో తాను "ఒకవేళ తన గురువుగారి మాటలు పెడచెవిని పెట్టి, బద్ధకించి ఉంటే, నేనూ, గురువుగారు తిండిలేక పస్తులు ఉండవలసి వచ్చేది, తలచుకుంటేనే భయం వేస్తుంది అనుకున్నాడు.

అందుకే ఈ క్షణం నుంచి, రేపటి పని ఈరోజు, ఈ రోజు పని ఇప్పుడే చేస్తాను. అని తన మనసులోనే శపథం చేసుకొన్నాడు. ఏదో తెలియని నూతనోత్సాహంతో గురువు దగ్గరికెళ్ళాడు. కొన్నాళ్ళకి గురువును మించిన శిష్యుడయ్యాడు.

బాధ్యత

ఈనాడు సమాజంలో జీతం పుచ్చుకుంటూ, జీవించే వారిలో అధికశాతం తాము చేస్తున్న పనికి సరైన న్యాయం చేయడం లేదు. ఏ ఉద్యోగం చేస్తుంటే ఆ ఉద్యోగానికి తగిన విధంగా నడచుకోవడం లేదు. ఎందుకంటే తానేదో అంతకుముందు ధనవంతుడిగా ఉండినవాడిననో, తమ వెనుక జనబలం పుష్కలంగా ఉన్నదనో, భుజబలం ఉన్నావాడిననో, పలుకుబడి ఉన్నవాడిననో, ఎన్నో అనుభవాలున్న వాడిననో కాలరు ఎగురవేస్తూ... మా జీవితంలో ఇటువంటివెన్ని చూడలేదు! మేము నిక్కర్లు వేసుకున్న కాలంలోనే ఇలాంటి అనుభవాలెన్నో సంపాదించాము. ఇదో లెక్కా? అని విర్రవీగుతూ, పై అధికారులను లెక్క చేయకుండా, ధిక్కరిస్తూ, క్రింది వారిని అణగద్రొక్కుతూ చేయవలసిన పనులను చేయకుండా, ఉద్యోగ ధర్మానికి వ్యతిరేకంగా నడచుకుంటూవున్నారు.

అనవసరంగా తమ అధికారాన్ని ఎవరూ ఎక్కడా ప్రదర్శించుకునే ప్రయత్నం చేయకూడదు. నలుగురితో పాటు కలసిమెలసి ఉంటూ తాము ఆచరించవలసిన బాధ్యతలేవైతే ఉన్నాయో వాటిని నిర్వర్తిస్తూ ఉండాలి. దురదృష్టవశాత్తు ఈనాడు సమాజంలో బాధ్యత అంటే ఏమిటో తెలియనివారే అధికారులుగాను, పరిపాలకులు గాను, పెద్దలుగాను చలామణి అవుతున్నారు. సమాజాన్ని భ్రష్టుపట్టిస్తున్నారు.

బాధ్యత అనేది హృదయ స్పందన. కర్తవ్య నిర్వహణే బాధ్యత. తనకు తానుగా ఆయా పరిస్థితులలో హృదయపూర్వకంగా చేసే పని. తనకు చేతనైన, తను చేయగలిగినంత పనిని శక్తివంచన లేకుండా ఎలాంటి దాపరికం లేకుండా, ఫలితాన్ని ఆశించకుండా, పొగడ్తలకు పొంగకుండా, విమర్శలకు క్రుంగకుండా తన పని తాను చేసుకుంటూ పోవడమే బాధ్యత.

బాధ్యత అనేది ఒక విలక్షణమైన లక్షణం. నగ్నసత్యాలను విన్నపుడు, భగవంతుని సృష్టి వైభవాన్ని తిలకించినపుడు, హృదయాన్ని స్పృశించే సంగీతం విన్నపుడు, హృదయం పులకించిపోతుంది, రోమాంచితమవుతుంది, భక్తిభావంతో నిండిపోతుంది. అలాగే ఆకలి బాధతో అలమటించే వారిని చూచినపుడు, చలిబాధతో వణికిపోతున్న వారిని చూచినపుడు, హీనస్థితిలోనున్న దీనులను, బలవంతుల దాష్టికాలకు బలైపోతున్న బాధితులను చూచిపుడు, అసహాయ స్థితిలోని ప్రాణుల ఆర్తనాదాలు విన్నపుడు హృదయం స్పందించి, అయ్యో! వీరికి ఎంతటి దీన స్థితి వచ్చింది? వీరికి మనమేమైనా ఇవ్వగలమా? వీరికి ఏమైనా మనం చెయ్యగలమా? ఏం చేస్తే వీరి బాధలు తొలగుతాయి? అని వ్యక్తపరచే సానుభూతి, పెల్లుబికి వచ్చే జాలి, దయ, కరుణే హృదయస్పందన. అదే బుద్ధి జీవిగా ఎదిగిన మనిషి యొక్క మనిషితనం. హృదయాన్ని కలచివేసే దుర్ఘటనలు ఎంతదూరంలో జరిగినా ఏమీ చెయ్యలేని స్థితిలో ఉన్నప్పటికీ, ఎంత దారుణం జరిగింది? అలా జరిగి ఉండవలసింది కాదు అని హృదయ పూర్వకంగా బాధను, విచారాన్ని వ్యక్తపరచితే చాలు, అదికూడా హృదయస్పందనే. మానవత్వమే బాధ్యత.

బాధ్యత తెలిసిన వారు, బాధ్యతతో జీవించేవారిలో క్రమశిక్షణ, త్యాగం, స్నేహభావం, సేవాభావం, శీలం, సహనం, సాహసం, కరుణ, నిండుగా ఉంటుంది. వారు నిత్యమూ ఇతరులకు ఏమి చెయ్యగలం? ఏమి ఇవ్వగలం? అని ఆలోచిస్తూ ఉంటారు. ఇతరులు వేలెత్తి చూపించే పని ఏనాడూ చెయ్యరు. అంతేకాకుండా ఇతరులను తప్పులు చేయడానికికూడా అనుమతించరు.

బాధ్యతగా జీవించడమంటే ధర్మబద్ధంగా జీవించడమే. కానీ దురదృష్టవశాత్తు. సమాజంలో మహనీయులుగా, బాబాలుగా, గురువులుగా పూజలందుకుంటున్నవారు, తల్లి-దండ్రులు, పెద్దలు అందరూ దీవించేటపుడుగానీ, ఆశీర్వదించేటపుడుగానీ

బాధ్యతగా జీవించండి అనే మాటలను చెప్పడం లేదు. "ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖంగా నిండు నూరేళ్లు జీవించండని ఆశీర్వదిస్తున్నారు. ఆశీస్సులందుకున్నవారు కూడా సుఖంగా జీవించడమే జీవిత పరమార్థంగా భావిస్తున్నారు. బాధ్యత అనేదేంటో పూర్తిగా మరచిపోయారు.

* బాధ్యతగా జీవించే వ్యక్తికి మొదట బాధలుంటాయి. తర్వాత బహుమానాలుంటాయి. బాధలను వద్దనుకుంటే బాధ్యతలూ ఉండవు. బాధ్యతలు లేనివారు, బాధ్యతలను నిర్వర్తించే వారిపై విమర్శలనే రాళ్లను రువ్వే బాధ్యతను స్వీకరించి ఉంటారు.
* బాధ్యత ఉండాలి. బంధం, ఆశ ఉండకూడదు.

ఒక వ్యక్తి అభివృద్ధి చెందితే ఒక కుటుంబం, కుటుంబాలు అభివృద్ధి చెందితే ఒక సమాజం, సమాజాలు అభివృద్ధి చెందితే రాష్ట్రం, రాష్ట్రాలు అభివృద్ధి చెందితే ఒక దేశం అభివృద్ధి చెందినట్లు.

అందరి వ్యక్తుల అభివృద్ధికూడా దేశం అభివృద్ధే. అభివృద్ధి అంటే కేవలం ఆర్థికాభివృది మాత్రమే కాదు ఆరోగ్యం,సంస్కారాల అభివృద్ధి కూడా అందులో భాగమే.

మనదేశ జనాభా వంద కోట్లకు పై మాటే. అంటే మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయన్న మాట. మన ఉత్పాదకత మాత్రం అధ్వాన్నం. పని సంస్కృతి లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం.

సంవత్సరానికి 365 రోజులైతే, అందులో 52 ఆదివారాలు, రెండో శనివారాలు 12, జాతీయ పండుగలు 2, జాతీయ నాయకుల జయంతి సెలవులు 5. పండుగ సెలవులు 16. ఐచ్ఛిక సెలవులు 5. ఇలాగా సెలవులన్నీ మొత్తం కలిపితే 92. అంటే సంవత్సరానికి మూడు మాసాలు సెలవులేనన్నమాట. ఇవిగాక ఉద్యోగులకు సంపాదిత సెలవులనీ, మెడికల్ లీవులనీ ఉండనే ఉన్నాయి.

ఉద్యోగం దొరక్కముందు ఉద్యోగస్తులు సరిగా పని చేయరు. పని చేయించు కోవాలంటే లంచం తప్పనిసరి అని శాపాలు పెట్టిన నిరుద్యోగులే, ఉద్యోగం దొరికాక వాడికంటే ఘనుడు వీడు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.

INDIAN CULTURE; INDIAN PUNCTUALITY అంటే ఆఫీసులకు ఆలస్యంగా రావడం, తొందరగా వెళ్ళిపోవడం. చదువుకున్న తెల్లచొక్కాల వారంతా కలిసి సాధించుకున్న కీర్తి ఇది.

ఇలాగైతే ప్రభుత్వ పథకాల, ప్రణాళికల ఫలితాలు సామాన్యులకు అందుతాయా? దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందా ?

'పని సంస్కృతి' మాట అటుంచితే, కోర్కెల సాధనలో కనీస విచక్షణ లేకుండా, అదుపనేది లేకుండా, ఏమాత్రం భయమనేది లేకుండా, చట్టంమీద గౌరవం ఏమాత్రం

లేకుండా చేసే నిరసనలు, రోడ్డుపై బైఠాయింపులు, ధర్నాలు, బంద్‌లు, రైల్‌రోకోలు, రాస్తారోకోలు, తగులబెట్టడాలు ఇలాంటి ధ్వంస రచనలతో, అంతంత మాత్రంగా. కొన్ని దశాబ్దాలుగా సాధించిన ప్రగతినికూడా ధ్వంసం చేస్తూ పోతే.... అభివృద్ధి సాధ్యమా?

చైనా, జపాన్, రష్యా, ఇజ్రాయెల్, అమెరికాలాంటి దేశాలలోని సెలవుల విధానాన్ని, పని విధానాన్ని, తెలుసుకొని మనందరమూ ఒక జాతీయ విధానాన్ని ఆచరణలో పెట్టాలి. వీలైనన్ని సెలవు దినాలను కుదించేయాలి. పని దినాలు పెరిగితే 'పని సంస్కృతి' పెరుగుతుంది. దానివలన ఉత్పాదకత పెరుగుతుంది, అవినీతి కూడా తగ్గుతుంది. దేశం ప్రగతి పథంలో పరిగెడుతుంది.

* అడిగేవాడు సహాయం చేయమని అర్థించాలి. చేసేవాడు సేవ చేసేదానికి అవకాశం వచ్చిందని ఆనందంగా చేయాలి.
* ఇతరుల కొరకు నిరీక్షించడం అలవాటైతే నీవు వెనుకబడిపోతావు.
* స్వాతంత్ర్యాన్ని కోల్పోయి బానిసతనంలో మగ్గిన మనం-దశాబ్దాలుగా స్వాతంత్ర్యాన్ని అనుభవిస్తూ, విచ్చలవిడితనానికి అలవాటుపడి అన్ని సంస్కారాలనూ వదలివేశాము. ఈ స్థితి నుండి బయట పడకపోతే దేశంలో దానవులు తప్ప మానవులుండరు.

మంచి పనిని వాయిదా వేయకూడదు.
చెడ్డ పనిని ఎప్పుడూ తలపెట్టనే కూడదు

ఓమారు గౌతమమహర్షి తన భార్య పాతివ్రత్యాన్ని శంకించి, భగ్గున మండిపడి, ఆమెను వెంటనే వధించేయమని ఓ ఆయుధాన్ని తన కుమారుడైన చిరకారి చేతికిచ్చి, తాను స్నానాదికాలకు వెళ్ళాడు. అయితే చిరకారి తన సహజ ధోరణితో తాను చేయబోతున్న పనిలోని తప్పొప్పులను సమీక్షించుకుంటూ కూర్చున్నాడు.

ఇంతలో కోపం కాస్త చల్లారి, కుమారుడు తన తల్లిని వధించివుంటాడని బాధపడుతూ గౌతముడు అక్కడికి వచ్చాడు. కానీ చిరకారి మాతృహత్యకు పూనుకోక, ఆలోచిస్తూ కూర్చొని ఉండటం కనిపించి గౌతముడికి ఎంతో ఆనందం కలిగి అతడిని మెచ్చుకున్నాడు.

అంతకుముందు "కుమారుడు ఏపని చెప్పినా సమయానికి చెయ్యడు" అని కోపగించుకునే గౌతముడు, ఆ రోజున తన కుమారుడు చేసిన ఆలస్యం ఓ నిండు ప్రాణాన్ని కాపాడినందుకు ఎంతగానో ఆనందించి, ప్రశంసించాడు.

* ప్రేమించడం, ద్వేషించడం, గర్వించడం, అభిమానించడం, దొంగతనం చేయడం, ప్రాణం తీయడం, స్నేహం చేయడం లాంటి విషయాలలో ఆలస్యంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వారు ప్రశంసనీయులు.
* నిదానంగా చేయవలసిన పనిని తొందరగా, తొందరగా చేయవలసిన పనిని నిదానంగా చేసే ఇద్దరూ బాధలకు గురవుతారు

* కాలమే మహాజ్ఞాన భాండాగారం
* కాలమే అంతులేని ధనరాశి - కాలమే జగదా ధారం
* కాలం విలువ తెలుసుకొని నడచుకొనువారే ఘనులు
* చేయవలసిన పనిని వాయిదా వేయడం అనాయకత్వం. చేయకూడని పనిని తొందరిపడి చేయడం మూర్ఖత్వం.
* నిన్నటి గురించి మథనపడకుండా, రేపటి గురించి భయపడకుండా, నేడు చేయవలసిన పనిని సమగ్రంగా చేయగలవారే విజయం సాధిస్తారు.
* పగటి నిద్ర పనికి చేటు - రాత్రి పని నిద్రకు చేటు
* ఎవరు చేయవలసిన పని వారు చేయకపోవడం వలననే, వ్యక్తి అయినా, కుటుంబమైనా, ఏదేశమైనా వెనుకబడుతుంది.
* మనం చేసే అన్ని వృథాలలోకి అత్యంత ఖరీదైనది కాలహరణం.
* కర్తవ్యం గోచరించినపుడు ఆలస్యం చేయడం ఎందుకూ? కార్యరంగంలోకి దూకు!
* మనిషి కొంత కాలాన్ని వృథా చేస్తే-ఆ తర్వాత వృథా అయిన కాలమే అతన్ని అన్ని విధాలా నష్టపరుస్తుంది.

ప్రయత్నించేవారు ఓటమిని చవి చూడరు

ఇక్కడికి మనం ఎందుకు వచ్చాం?
మన లక్ష్యం ఏమిటి?
మనం ఏం చేస్తున్నాం?
ఇప్పుడున్న పరిస్థితులలో మన లక్ష్యం ఎపుడు నెరవేరుతుంది.
మన లక్ష్యం నెరవేరాలంటే ఏం చేయాలి?

ప్రయత్నించేవారు ఓటమిని చవిచూడరు

చిన్న చిన్న చీమలు నలుసుల్ని మోసుకుపోతూ ఉంటాయి.
పైకి ఎక్కుతూ అనేకసార్లు క్రిందికి జారిపడుతూ ఉంటాయి.
అసఫలత అనేది మదిలో ఆత్మవిశ్వాసాన్ని, సాహసాన్ని నింపాలి.
ఎక్కుతూ పడటం, పడి ఎక్కడం అనేది తుది ప్రయత్నం కాదు.
పడిన ప్రయాస చివరికి సఫలం కాకపోదు.

ప్రయత్నించేవారు ఓటమిని చవిచూడరు.

జాలరులు సముద్రంలో ఎన్నోసార్లు మునుగుతూ ఉంటారు.
ఎన్నోసార్లు వట్టి చేతులతో తిరిగి వచ్చేస్తుంటారు.
ఎంతెంత లోతుల కెళ్లినా ముత్యాలు దొరకవు.
అందుకు ఉండాలి మనకు రెట్టింపు ఉత్సాహం, సాహసం.

ప్రయత్నించేవారు ఓటమిని చవిచూడరు.

అసఫలత ఒక పరీక్ష. స్వీకరించండి.
ప్రయత్నంలో లోపం ఏముందో చూసి సరిదిద్దుకోండి.
సఫలత పొందేవరకు సుఖ నిద్రను త్యాగం చేయండి.
జీవిత పోరాటాన్ని వదలి పారిపోవద్దు.
ఏమి చేయకుండానే లక్ష్యాన్ని ఛేదించలేరు.

ప్రయత్నించేవారు ఓటమిని చవిచూడరు.

* ఎగరాలని ప్రయత్నించకపోతే గద్ద అయినా ఒక అడుగు ఎత్తుకూడా ఎగరలేదు.
* సముద్రంలోకి దూకకుండా గట్టున కూర్చుంటే ముత్యాలు కాదుకదా కనీసం చేపైనా దొరకదు.
* అడుగు ముందుకు వెయ్యనిదే గమ్యాన్ని ఎలా చేరగలం?
* కొద్దిపాటి శ్రమకే అలసిపోయే వ్యక్తీ, ఒక ముద్ద ఎక్కువ తినలేని వాడూ ఏదీ సాధించలేడు.
* ఎంత శ్రమ పడినా అలసిపోక, మరింత ఉత్సాహంతో పని చేసే వ్యక్తి అద్భుతాలు సృష్టించగలడు. కూటిలోని రాయే తీయలేని వాడు - యేటిలోని రాయి తీయగలడా?
* ఓటమి లేనివాడికి అనుభవం రాదు - అనుభవం లేని వాడికి జ్ఞానం రాదు. గెలిచినప్పుడు గెలుపుని స్వీకరించాలి. - ఓడినప్పుడు అనుభవాన్ని స్వీకరించాలి.
* మనలను మనం నియంత్రించుకోగలిగితే నిర్వహణ అనేది తనకు తానుగా మన దగ్గరికి వస్తుంది.
* చేస్తున్న పనిలో ఆనందాన్ని పొందగలిగిన నాడు మానసిక వత్తిడి రానేరాదు. అందుకే 'ఇష్టపడి చేయాలి, కష్టపడి చేయరాదు'.

ప్రయత్నించేవారు ఓటమిని చవిచూడరు

కళింగ దేశంలో ప్రతి ఏటా క్రొత్త సైనికులను ఎంపిక చేయడం ఆనవాయితీ. ఇందుకోసం రాజధానిలో పోటీలు జరుగుతాయి. పోటీలల్లో గెలిచిన వారికి రాజు స్వయంగా తుది పరీక్ష ఏర్పాటు చేసేవాడు. అందులోకూడా ఎంపికైన వారికే ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చి, సైన్యంలో చేర్చుకునేవాడు. ప్రతీసారి రాజు ఎంపిక చేసే విధానం మాత్రం చాలా చిత్రంగా ఉండేది. ఒకో సంవత్సరం ఒక్కో విధంగా రాజు యువకులను పరీక్షించేవాడు.

ఈసారి కూడా సైన్యంలో చేర్చుకోవడం కోసం పోటీల గురించి రాజ్యమంతటా చాటింపు వేశారు. ఉత్సాహవంతులైన యువకులు వేలాదిగా తరలి వచ్చి రకరకాల పోటీలను ఎదుర్కొన్నారు. వారిలోంచి మెరికల్లాంటి వారు తుది పరీక్షకు సిద్ధపడ్డారు.

ఈసారి రాజుగారు ఎలాంటి పద్ధతిలో ఎంపిక చేస్తారోనని ఆసక్తితో ప్రజలు కూడా తండోపతండాలుగా తిలకించేదానికి వచ్చారు.

రాజు ఎంపిక స్థలానికి రాగానే పదిమంది దృఢకాయులు ఒక పెద్ద బండను మోసుకుంటూ తెచ్చి మైదానంలో పడవేశారు. రాజు యువకులనుద్దేశించి మీలో ఎవరు ఈ బండను ఎత్తగలుగుతారో వారే విజేతలు అని ప్రకటించాడు.

ప్రజలంతా ఆశ్చర్యపోయారు. కళ్ళముందరే ఎంతో మంది మోసుకొచ్చిన బండను ఎవరు మాత్రం ఒంటరిగా ఎత్తగలరు? ఇదేం పరీక్ష? అనుకున్నారు. కొందరు యువకులు అసలు ముందుకే రాలేదు. మరికొందరు మాత్రం వచ్చి ఆ బండను ఎత్తడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. వారిని చూచి అందరూ నవ్వారు. ఎవ్వరు కూడా ఆ బండను కనీసం కదల్చలేకపోయారు. ఎవ్వరూ ఆ పోటీలో గెలవకపోవడంతో ఈసారి సైనికుల ఎంపిక రద్దవుతుందని అధికారులంతా భావించారు. రాజు నిర్ణయం ఏమిటోనని అందరూ ఎదురు చూడసాగారు.

రాజు లేచి నిలబడి ఆ బండను ఎత్తడానికి ప్రయత్నించిన యువకులందర్నీ సైన్యంలోకి చేర్చుకుంటున్నాను అని ప్రకటించాడు.

ప్రజల్లో కలకలం రేగింది. ఎవరికీ సాధ్యం కాని పరీక్ష పెట్టి, చివరికి ఓడిన వారినే ఎంపిక చేసుకోవడం విచిత్రమని గుసగుసలాడసాగారు.

ఎంపిక కాని యువకులలో ఒకడు సాహసంతో ముందుకు వచ్చి మహారాజా! ఇలా అడుగుతున్నందుకు మన్నించండి. మీరు పెట్టిన పోటీ ప్రకారం ఆ బండను ఎత్తలేని వారిని సైన్యంలో చేర్చుకోవడం ఎంత వరకు సమంజసం? అన్నాడు.

రాజు చిరునవ్వుతో బండను ఎత్తలేరన్నది అందరికీ తెలిసిందే. అందుకే కొందరు అసలు ముందుకే రాలేకపోయారు. ఇంతమంది ప్రజల సమక్షంలో అపజయాన్ని ఎదుర్కోవడానికి వారు జంకారు. కొందరు యువకులు మాత్రంపోటీ నియమం ప్రకారం తమ వంతు ప్రయత్నం చేశారు. వారు కూడా పరీక్షలో ఓడిపోవచ్చు. కానీ ఓటమి పట్ల భయాన్ని కానీ, బిడియాన్నిగానీ లక్ష్యపెట్టని గుణమే వారిని విజేతలను చేసింది. రాజాజ్ఞ ప్రకారం అవసరమైనపుడు, ఆపద సమయాలలో, దేశరక్షణ కోసం ముందుకు దూకగల్గే ఇలాంటి యువకులే కదా సైన్యానికి కావలసింది? అన్నాడు.

ఒక కర్తవ్యపరాయణుడు ఇలా ప్రార్థిస్తున్నాడు

నేను దేవతలకు మ్రొక్కుదును కానీ వారు కూడా సృష్టికర్తయగు బ్రహ్మదేవునకు లోబడినవారే. కావున ఆ బ్రహ్మకే మ్రొక్కెదను. కానీ ఆ దేవుడుకూడా కర్మాను సారముగనే ఫలితములనిచ్చుచున్నాడు. కావున కర్మకే మ్రొక్కెదను. ఫలితములు కర్మల యొక్క పాప పుణ్యముల ననుసరించి ప్రాప్తిస్తున్నాయి. కావున దేవతలతో నాకు పనేమున్నది? దైవమున కంటే అధికమైన విద్యుక్త ధర్మ నిర్వహణకే మ్రొక్కెదను.

* శ్రమించడమే జీవన సూత్రం.
* పనులను చేయకుండా ఉండడం అనేది కేవలం నిర్జీవమైన శవానికే సాధ్యం.
* కర్మసన్యాసం కాదు, చేయవలసింది - కర్మ ఫల త్యాగం
* ఒక గొప్ప సంస్థను నిర్వహించేవాడు 'ఇవన్నీ శాశ్వతమా? వీటికోసం ఎందుకు శ్రమపడాలి? వృధాశ్రమ అని తన కర్తవ్యాన్ని వదిలిసేస్తే, ఆ వైరాగ్యం అతన్ని ఒక అధర్మపరుడిగా మార్చుతుంది.
* మన కర్తవ్యాన్ని సమర్థవంతంగా, ఉపయోగకరంగా నెరవేర్చనీయని వైరాగ్యం కంటే, కర్తవ్యోన్ముఖునిగా ఉత్తేజ పరచే వ్యామోహం మిన్న. అయితే అది ఆత్మోన్నతినీ, సమాజ గతినీ, దెబ్బతీసే అక్రమానికి దారితీసేదిగా ఉండకూడదు.
* సంసారికి నిజంగా వైరాగ్యం వస్తే, సంసారాన్ని బాధ్యతగా నిర్వహిస్తూనే, గృహస్తయోగిగా కూడా జీవించవచ్చు. ధార్మిక జీవనం కొనసాగించవచ్చు.
* ఈ జన్మలో మంచి చేస్తే మరుజన్మలో ఉత్తమ గతులు ప్రాప్తిస్తాయి అనడంలోని ఆంతర్యం ఏమిటంటే? మనిషి బతికున్నంత కాలం మంచిగా మసలుకుంటూ ఉండాలనే.
* స్థిరమైన మనసు లేని వానికి బుద్ధి ఉండదు. బుద్ధిలేని వానికి భావన ఉండదు. కావున వానికి శాంతి, సుఖం ఉండదు.

సాత్విక యజ్ఞం : ఫలాపేక్ష లేకుండా కర్తవ్యంగా భావించి మనస్ఫూర్తిగా చేసే కార్యం.
రాజస యజ్ఞం : స్వార్థం కొరకు, ప్రతిఫలాపేక్షతో చేసే కార్యం.
తామస యజ్ఞం : వాతావరణాన్ని కలుషితం చేసే పని.

తపస్సు మూడు విధాలు : పెద్దలను గౌరవించడం, పరిశుభ్రంగా ఉండడం, నిర్మలమైన ప్రవర్తన, బ్రహ్మచర్యం, అహింస అనునవి "శారీరక తపస్సు". పరుల హితమును కోరుతూ పలికే పలుకులు, సత్యమును మధురంగా మాటలాడుటను "వాక్ తపస్సు" అంటారు. మౌనం, శాంతం, నిదానం, చిత్త నైర్మల్యంతో ఉండటాన్ని "మానసిక తపస్సు" అంటారు.

కర్మభూమి

కర్మభూమి అని భారతదేశానికి పేరు. అంటే కర్మలనాచరించడమన్నది భూమండలంపై ఉన్న దేశాలన్నింటిలో ఒక్క భారతదేశంలో మాత్రమే జరుగుతున్నదా? మిగతా దేశాలవారు కర్మలను ఆచరించకుండా (పనులను చేయకుండా) ఉన్నారా? ఎలాంటి కర్మలూ చేయకుండా ఏ దేశంలోని మనిషైనా, ఒక్కక్షణం ఉండగలడా ? అలాంటపుడు కర్మల విషయంగా భారతదేశపు ప్రత్యేకత ఏంటి?

భూమండలంపై నున్న మొత్తం ప్రాణికోటికేగాక, విశ్వానికంతటికీ మేలు జరగాలన్న భావనలతో కర్మలను ఆచరించవలెనని ప్రబోధించడమూ, ఆచరించడమూ అనే సంస్కృతి ఒక్క భారతదేశంలోనే ఉంటున్నది. కాబట్టి భారతదేశానికి కర్మభూమి అనే ప్రాశస్త్యాన్ని కల్పించారు మన పూర్వీకులు. భోగ భూమి కాదు మనది యోగభూమి. ఏ పనినైనా చేస్తున్నది 'నేనే' అయినా చేయించేది మాత్రం విశ్వచైతన్యమే, భగవంతుడే. నేను నిమిత్తమాత్రుడను. కర్మ ఫలితంకూడా భగవంతుని ప్రసాదమే. ఫలితంపై నాకెలాంటి అధికారం లేదు. అనే భావనతో త్రికరణ శుద్ధిగా పనులను చేసుకుంటూ పోవడమే భారతీయుల కర్మ సిద్ధాంతం. ఈ భావమే భారతదేశాన్ని కర్మభూమిగా నిలబెట్టింది.

కర్మను చేపట్టినపుడు ఫలితంపై ఒక ఆశ, ఒక అవగాహన ఏర్పడడం సహజం. కానీ సాధారణంగా ఫలితం మాత్రం ఎప్పుడూ అంచనా ప్రకారం దక్కుతుందన్న భరోసా లేదు. అనుకూలమూ కావచ్చు. ప్రతికూలమూ కావచ్చు. ఫలితం భగవదనుగ్రహం అనుకున్నపుడు ఏ బాధా ఉండదు. సుఖదుఃఖాలకు లోనుకాకుండా మనసు సమస్థితిలో ఉంచుకోవడమే ఈ కర్మ సిద్ధాంతం లోని పరమార్థం.

ఒకవేళ ఫలితం మీద మాత్రమే ఆశ ఉన్నట్లయితే, ప్రయత్నాన్ని చేయవలసిన రీతిలో సంపూర్ణంగా చేయాలనే దృష్టి దృక్పథం లోపించి, అనుచితమైన, ఆమోదయోగ్యంకాని మరొక మార్గంలో వీలైనంత తొందరగా, అందరికంటే ముందుగా ఫలితాన్ని పొందలేమా? అన్న ఆలోచనతో ఆ మరో మార్గాన్వేషణలో స్వార్థం పెరిగి, ఈర్ష్య, అసూయ, అహంకారం, ఆగ్రహం, మోసం, ద్రోహం, ప్రతీకారం లాంటి భావనలకు లోనయ్యే ప్రమాదం ఉంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణగా మన రాజకీయ పార్టీలనే తీసుకోవచ్చు. గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాం అని పార్టీ అధినేతలే బాహాటంగా అంటున్నారు. ఆ కారణంగానే ఎన్నికల సమయాలలో క్రింది స్థాయి కార్యకర్త మొదలు ఒక మోస్తరు నాయకుడివరకు ఎలాగైనా గెలిచి తీరాలని ఎలాంటి నేరాలకైనా సిద్ధపడుతున్నాడు. అధినాయకుల మెప్పు పొందాలని, తహతహలాడుతున్నాడు.

ధనం, మద్యం, మగువ, పదవులను ఎరగా చూపించి ఛోటా నాయకులు ఓటర్లను ప్రలోభాలకు లోను చేస్తున్నారు. ప్రలోభాలకు లొంగకపోతే ప్రాణాలను తీయడానికైనా వెనుకాడడంలేదు. మనుషులను అపహరించుకొనిపోవడం, (కిడ్నాపింగ్), వేధింపులకు గురి చేయడం, ఎవరో ఒకరిని అడ్డం పెట్టుకొని ఆడించడం (బ్లాక్ మెయిలింగ్) ఓట్లను గుద్దుకోవడం (రిగ్గింగ్) లాంటి అనుచిత, అవినీతి, అరాచకాలకు పాల్పడటం లాంటి నేరాలన్నీ... ఫలితంపై పెట్టుకున్న దురాశ కారణంగానే జరుగుతున్నాయి.

గెలుపు కోసమే "లోపాయికారి పొత్తు", "స్నేహపూర్వక పోటీ" లాంటి సుతిమెత్తని, అందమైన మాటలు వినపడుతున్నాయి. ఈ మాటలు వినడానికి ఎంతో వినసొంపుగా ఉన్నప్పటికీ వీటి వెనుక "స్నేహంలో ద్రోహం", "పొత్తులలో కత్తులు" మాత్రమే ఉన్నాయి. ఇది కనిపించని లోతైన దిగజారుడుతనం మాత్రమే. కాబట్టి ఫలితంపై ఆశ పెట్టుకోకుండా, ప్రయత్నం మన కర్తవ్యంగా భావించాలి, ఆచరించాలి. అదే ఆదర్శం లేకుంటే అనర్థం.

* అధికారం కోసం ఆరాటపడేవాడు రాజకీయ నాయకుడు.
  భావితరాల కోసం ఆరాటపడేవాడు రాజనీతిజ్ఞుడు.

కీడెంచి మేలెంచాలి

జీవన పోరాటంలో మనిషి ఎన్నో కోరికలతో ప్రయత్నాలు చేస్తూ ఉంటాడు. ఏ పనినైనా చేసే ముందు చెడు లేదా కీడు జరిగితే అపుడేం చేయాలి? అని ఆలోచించి, ఆ తర్వాతే మంచిని గురించి ఆలోచించాలి అంటారు.

ఎలాంటి ఎదురు దెబ్బలు తగిలినా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నదే ఇందులోని పరమార్థం. ఫలితంపై అధికారాన్ని ఆశించకూడదు. కీడెంచాలి, అనేమాటలు వినబడగానే. మరలాగైతే ఏపనైనా ఎందుకు చెయ్యాలి? అనే భావన కలిగి, అసంతృప్తికి, అసహనానికి, నిష్క్రియాపరత్వానికి లోనైనా! అది కేవలం తాత్కాలికమే.

మనిషి ఎంత నిష్క్రియా పరత్వంగా (ఏపనీ చేయకుండా నిర్లిప్తంగా, నిరాశగా, అలసత్వానికిలోనై ఊరకనే, ఉదాసీనంగా ఉండడం) ఉండాలనుకున్నా అదృశ్య, అద్భుత శక్తి అయిన విశ్వచైతన్యం ఏ ప్రాణినీ నిస్తేజంగా ఉండనివ్వదు. తన స్వభావానికి తగ్గ పనివైపు, కర్తవ్యం వైపు ముందుకు నడిపిస్తూనే ఉంటుంది. ముఖ్యంగా మనిషి కర్తవ్యం భిన్నంగా ఉంటుంది. స్వభావం అతడిని ఊరకనే కూర్చోనివ్వదు. కర్తవ్యోన్ముఖునిగా ముందుకు నడిపిస్తూనే వుంటుంది. చైతన్యం అంటే అదే.

బ్రతుకు పోరాటంలో గీతాచార్యుడు బోధించిన కర్మసిద్ధాంతాన్నీ, పెద్దల అనుభవ సారాన్నీ గుర్తుంచుకొని, అనుసరిస్తే, ఆచరిస్తే ఆరోగ్యంగా, ఆనందంగా, పూర్ణాయుష్కులుగా జీవిస్తారు. లేకుంటే ఉద్రేకాలకు, భావోద్వేగాలకూ లోనై అల్పాయుష్కులుగానే జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకోవలసి వస్తుంది.

ప్రతి ఒక్కరికీ కార్య సాఫల్యం మీదనే ఎక్కువ మక్కువ. చేసినపని విజయవంతం అయితే చాలు ఎన్నో విధాల తమ శక్తి-యుక్తులు, సామర్థ్యం, మేధాసంపత్తిని తామే పొగుడుకుని మురిసిపోతూవుంటారు. జయాపజయాలకు అనేక కారణాలుంటాయి. వేటికవే ప్రత్యేకం. ఎదుటివారిని ప్రశంసల ద్వారా, మాటల ద్వారా, సత్కరించడం ద్వారా, మాయోపాయాల ద్వారా, స్వయంకృషితో, కార్యసాఫల్యం పొందుతూ ఉంటారు.

అపజయానికి గురైన వారి ప్రయత్నాలను సునిశితంగా పరిశీలించినట్లయితే అనేక లోపాలు కనిపిస్తాయి. అందులో ముఖ్యంగా వ్యక్తిగతమైన ఆత్మవిశ్వాసలోపం, పట్టుదల లేకపోవడం, నిర్లక్ష్యం, నిరుత్సాహం, వాయిదా వేయడం, మరొకరిపై ఆధారపడడం, కాలం కలసిరాకపోవడం లాంటివి, ఒక్కో వ్యక్తిలో ఒక్కో విధంగా ఉంటాయి.

ఎవరి కృషి వారిది, ఎవరి అదృష్టం వారిది. కావలసిందల్లా పనిపట్ల అవగాహన, నిర్దష్టమైన లక్ష్యం, వనరుల లభ్యత, వ్యక్తికిగల నైపుణ్యం, చివరిదాకా పోరాడగల పట్టుదల, ఆత్మవిశ్వాసం, సామాజికస్పృహ మొదలగునవి కార్యసాఫల్యతకు కావలసిన, కార్యసాధకునికి ఉండవలసిన లక్షణాలు.

* పరిష్కార దిశగా ఒక ప్రయత్నాన్ని చేస్తున్నపుడు, వ్యతిరేక దిశగా మరొక వ్యక్తిగానీ, సంస్థగానీ కృషి చేస్తుంటే దానిని రెండు పొట్టేళ్ళ పోట్లాటతో పోల్చవచ్చు. ఇలాంటి పరిస్థితులలో ఎవరి కృషి ఎక్కువగా ఉంటే వారే విజయాన్ని పొందగలరు.
* ధర్మానికి అధర్మం వలన, సత్యానికి అసత్యం వలన, బలహీనుడికి బలవంతుల వలన హాని కలుగుతున్నపుడు దానిని అణచివేయగల శక్తి-సామర్థ్యం కలవారు చూస్తూ ఊరుకోలేరు, ఊరుకోకూడదుకూడా. ఒకవేళ ఉపేక్షించి ఊరకనే ఉన్నట్లయితే, ఉపేక్షించిన వారికే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో, కష్టం-నష్టం తప్పక వాటిల్లుతుంది. కనుక సమర్థులు జరుగుతున్న హానిని, అధర్మాన్ని ఆపాలి. అదే కర్తవ్య నిర్వహణ, బాధ్యత. ఒక్కో సందర్భంలో సామర్థ్యం-శక్తి సరిపోకపోవచ్చు. అలాంటపుడు అక్కడి నుండి తప్పుకొని మౌనంగా వెళ్ళిపోవాలి. అంతేగానీ ఆ దుర్మార్గాన్ని ఏ విధంగానూ ప్రోత్సహించకూడదు. ఆ విధంగా తప్పుకున్నట్లయితే "ఈ దుర్మార్గంలో, ఈ పాపంలో నాకు భాగం లేదు" అనే తృప్తి ఉంటుంది.
* స్పందించడం, నిర్ణయం తీసుకోవడం, ఆచరణలో పెట్టడమన్నది వ్యక్తిగతం కావచ్చు. సమాజ పరమైనదికావచ్చు, సంస్థాపరమైనదీ కావచ్చు. సరైన సమయంలో సానుకూలంగా స్పందించడమన్నది సమస్యకు చక్కని పరిష్కారమవుతుంది. అదే విజయానికి మూలం.

SOW A THOUGHT AND REAP AN ACT.
ఆలోచన అను విత్తనమును చల్లుట వలన ఒక పని
SOW A ACT, REAP A HABIT
పనియను విత్తనమును చల్లుట వలన ఒక అలవాటు
SOW A HABIT REAP A CHARACTER
ఒక అలవాటు వలన నడవడిక

SOW A CHARACTER, REAP A DESTINY

నడవడిక వలన గమ్యం చేరవచ్చును.

ALL THE GOOD YOU CAN

నీవు చేయగలిగినంత మంచిని

BY ALL THE MEANS YOU CAN

ఎన్ని పద్ధతులలో చెయ్యగలవో

IN ALL THE WAYS YOU CAN

ఎన్ని మార్గాలలో చెయ్యగలవో

ALL THE TIMES YOU CAN


ఏ సమయాలలో చెయ్యగలవో

TO ALL THE PEOPLE YOU CAN

ఎంత మందికి చెయ్యగలవో

AS LONGS AS YOU CAN DO ALL THE GOOD YOU CAN

ఎంత కాలం చెయ్యగలవో అంతకాలమూ మంచిని చెయ్యవలెను.







మన కర్తవ్యం

పౌరులు పౌరుషాగ్నిని రగిలించుకోవాలి

చైతన్య సమర శంఖారావాన్ని పూరించాలి

కార్యోన్ముఖులూ, కర్తవ్య పరాయణులూ కావాలి.

దేశం కోసం మనం ఏం చేశాం? అని ప్రశ్నించుకోవాలి

సమాజంలోని భ్రష్టత్వాన్ని తరిమి కొట్టాలి.

పిడికిలి బిగించి, ముందుకు అడుగెయ్యాలి.

జన్మభూమి ఋణం తీర్చుకోవాలి

జన్మను సార్థకం చేసుకోవాలి

అందరికీ ఆదర్శంగా నిలవాలి.

ఈక్షణమే ఇలా ప్రతినబూనుదాం

మంచి ఆరోగ్యవంతులుగా

మంచి గుణవంతులుగా

మంచి ఆదర్శవంతులుగా

తల్లి-దండ్రులకు మంచి బిడ్డలుగా

బిడ్డలకు మంచి తల్లి-దండ్రులుగా

భార్యకు మంచి భర్తగా, భర్తకు మంచి భార్యగా

దేశానికి మంచి పౌరులుగా, మంచి నాయకులుగా

మనకోసం మనం మంచి మనుషులుగా జీవిస్తామని,

ఆశయాలను సాధించి తీరుతామని

ఈ క్షణమే ప్రతినబూనుదాం.



భాస్కర పంతులు

విలువలు

కాలానుగుణంగా శారీరకంగా, మానసికంగా, బౌద్ధికంగా పరిణితి చెందుతూ, నూతనత్వం వైపు పరిగెడుతూ... ఏదో సాధించాలనే తపనతో, ఏదో అనుభవించాలనే ఆరాటంతో సౌకర్యాల కోసం, సుఖాల కోసం, వ్యక్తుల ఊహలు, ఆలోచనలు, కృషి, కర్మలు, కొనసాగుతూనే ఉంటాయి. ఆ ఒరవడిలో అత్యధిక శాతం ప్రజల చేత అంగీకరింపబడి, గౌరవింపబడి, చెలామణి అయ్యే భావాలను, వేష-భాషలను, విశ్వాసాలను, ఆచార - వ్యవహారాలను, ఆహారపుటలవాట్లను, జీవన పద్ధతులను **'సామాజిక విలువలు'** SOCIAL VALUES అంటారు.

ఇలా విలువనిచ్చి, గౌరవించిన ఆలోచనలను, ఆచరణలను ప్రజలు ఎంతకాలం ఆమోదిస్తారో, వాటి ప్రభావం ఎంతకాలం ఉంటుందో ఆ సుదీర్ఘ కాలాన్ని 'యుగధర్మం' అంటారు. యుగానికి తగినట్లు సామాజిక విలువలు మారుతూ ఉంటాయి.

కాలం నిత్య నూతనం. అలాగే సమాజం కూడా నిత్య నూతనమే. "పాత ఒక రోత! క్రొత్త ఒక వింత" కాలచక్ర భ్రమణంలో ఇది సర్వసాధారణం. పాతవన్నీ క్రొత్తవే! క్రొత్తవన్నీ పాతవే!

ఏ యుగంలోనైనా, ఏ సమాజంలోనైనా, మనిషికి సంబంధించినంత వరకు ధర్మాచరణ అనునది అత్యంతావశ్యకం. ధర్మం అనేది హృదయానికి సంబంధించినది, నైతికతకు సంబంధించినది. మనిషి యొక్క మానసిక, బౌద్ధికస్థితిని ధార్మిక విలువలైన MORALVALUES **సత్యం, సేవ, స్నేహం, సహకారం, సమానత్వం, సోదరభావం, సాహసం, ప్రేమ, త్యాగం, కర్తవ్యనిష్ఠ, నెమ్మదితనం** లాంటి భావనలతో నియంత్రించడం వలన ఆరోగ్యకరమైన, శాంతియుతమైన జీవితాన్ని సాధించే విధానం ఏర్పడుతుంది.

వ్యక్తి యొక్క నడవడికలో ఉండే నైతికతను బట్టి మాత్రమే విలువలను పాటిస్తున్నాడో లేదో చెప్పవచ్చు, మాటలకంటే చేతలను బట్టి మాత్రమే విలువలను పరిగణలోకి తీసుకోవాలి.

ధార్మిక విలువలు లోపించిన ఏ సమాజమైనా అశాంతికి అనారోగ్యానికి, అభద్రతకు లోనుకాక తప్పదు. అందుకే **విలువలు విలువైన వాటి కంటే అత్యంత విలువైనవని అంటారు.** VALUES ARE MORE VALUE THAN THE VALUABLES.

(భాస్కర పంతులు)

శ్రీసత్యనారాయణ పబ్లికేషన్స్
9/287, లింగాలవీధి, మన్నూరు-516 126, రాజంపేట మండలం,
కడప జిల్లా. సెల్ : 9440129320, 9705405915.

SWAMY,Vja 99128882